బి. వసీల్యేవ్

ప్రశాంత ప్రత్యూషాలు

★

అజేయ సైనికుడు

నవలలు

"ప్రగతి" ప్రచురణాలయం

బి. వసీల్యేవ్

ప్రశాంత ప్రత్యూషాలు

★

అజేయ సైనికుడు

నవలలు

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

VISALANDHRA BOOK HOUSE
VIZAG
530 002

అనువాదం: నిడమర్తి ఉమారాజేశ్వరరావు

Борис Васильев

А ЗОРИ ЗДЕСЬ ТИХИЕ...
В СПИСКАХ НЕ ЗНАЧИЛСЯ

На языке телугу

Boris Vassilyev

THE DAWNS ARE QUIET HERE...
HIS NAME WAS NOT LISTED

పాఠకులకు మనవి

ఈ పుస్తకాన్ని గురించీ, దీని అనువాదాన్ని గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను దయచేసి ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard, Moscow, U S S R

వెల: [illegible] 0

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1981
సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

B 70302—876 / 014(01)—81 738—81 4702010200

ИБ № 8350

ఈ సంపుటంలో ద్వితీయ ప్రపంచ యుద్ధకాలపు నవలలు రెండు ఉన్నాయి. వీటిలో మొదటిదైన "ప్రశాంత ప్రత్యూషాలు" అత్యంత ఆధునిక ఆయుధ సజ్జితులైన పదహారుమంది నాజీ సైనికులతో ఆరే ఆరుగురు రష్యన్ సైనికులు జరిపిన వీరోచిత పోరాట కథనం. ఆ ఆరుగురిలోనూ అయిదుమంది విమాన విధ్వంసక శతఘ్ని దళానికి చెందిన యువతులు. ఆరోవాడు సార్జెంట్ మేజరు వస్కోవ్. వాళ్లలో ప్రతి ఒక్కరికీ నాజీలపట్ల ఒక్కొక్క రకమైన కక్ష వుంది. అగ్రశేణి పోరాట రంగానికి వెనుక విధ్వంస కార్యక్రమం కోసం పారాషూట్లలో ఒక నాజీ దళం దిగింది. వస్కోవూ, అతని రెడార్మీ యువతీ సైనికులూ నాజీలను మధ్యలోనే అడ్డగించి మట్టుబెట్టేందుకు వాళ్ల జాడలు వెతుక్కుంటూ బయల్దేరారు. పర్యవసానం ఏమైందో మీరీ నవలలో చదువుతారు.

రెండవ నవల "అజేయ సైనికుడు" సోవియట్ యూనియన్‌తో చేసుకున్న నిరాక్రమణ సంధిని తుంగలో తొక్కి హిట్లర్ తన నాజీ సైనిక మూకలను 1941 జూన్ 22వ తేదీన సోవియట్ యూనియన్‌పైకి మళ్లించాడు. యుద్ధపు తొలి గంటల్లోనే శిథిలాల గుట్టగా మార్చబడిన బ్రెస్ట్ దుర్గం శత్రు ఆక్రమిత ప్రాంతంలో వుండిపోయింది. అయినా దుర్గ రక్షక సైనికులు లొంగిపోక అపూర్వమైన ధైర్యసాహసాలతో ప్రతిఘటనను సాగించారు. నాజీలు ఫిరంగిగుళ్లను గుప్పించారు, బాంబులు వర్షించారు, మందు పాతరలు పెట్టి దుర్గ భాగాలను పేల్చారు. నేలమాళిగల్లోకి అగ్నిబరాటాలు విసిరారు.

దుర్గరక్షకులు ఆకలినీ, దప్పికనూ ఓర్చుకుంటూ నాజీలను సైతం నతశిరస్కులను చేశారు.

పంథొమ్మిదేళ్ల అజ్ఞాత లెఫ్టినెంట్ ఒకడు 1941లో యుద్ధం ఆరంభమైన రాత్రే బ్రెస్ట్ దుర్గానికి చేరుకున్నాడు. అతని పేరు యింకా సైనిక దళ జాబితాలోకి ఎక్కలేదు. అయినా అతను దుర్గరక్షకులతో కలిసి కొన ఊపిరి దాకా పోరాడిన తీరు అపూర్వమైనది. ఈ అత్యంత అమానుషమైన పరిస్థితుల్లో, అతని జీవితపు చివరి నెలల్లో అతనికి ప్రేమ ఒక బహుమతిగా లభించి, ఒక పరీక్షగా పరిణమించింది. ఆ అమ్మాయి అవిటిది. ఆ అమ్మాయి ధరించిన బ్రేసు యీనాటికీ బ్రెస్ట్ దుర్గపు వస్తు ప్రదర్శనశాలలో వుంది.

యుద్ధం మొదలై పది నెలలు గడిచాక 1942 ఏప్రిల్లో మాత్రమే అతన్ని జర్మన్లు సజీవంగా పట్టుకోగలిగారు. అయినా అతను శత్రువు చేతుల్లోకాక స్వచ్ఛంద మరణమే పొంది, అమరుడయ్యాడు. ప్రజల స్మృతిలో గాఢంగా నాటుకొని జనశ్రుతిగా వచ్చిన యీ అజేయ సైనికుని కథకు బొరీస్ వసీల్యెవ్ కల్పించిన కళాత్మక నవలా రూపమే "అజేయ సైనికుడు."

ద్వితీయ ప్రపంచ యుద్ధంలో రెండు కోట్లమంది సోవియట్ పౌరులను బలిపెట్టి ఫాసిజంనుండి ప్రపంచాన్ని కాపాడిన సోవియట్ యూనియన్ అపూర్వ త్యాగాలకు ఆసక్తికరమైన యీ రెండు నవలలూ రెండు సాహిత్య ప్రతీకలు.

— అనువాదకుడు.

ప్రశాంత ప్రత్యూషాలు

★

నవల

1

171వ నంబరు రైలు స్టేషను సమీపంలో ఓ డజను యిళ్ళూ, ఓ ఫైరింజను షెడ్డూ, యీ శతాబ్దారంభంలో చక్కగా మలిచిన గోడరాళ్లతో నేలబారుగా పొడుగ్గా కట్టిన ఓ గిడ్డంగీ యింకా కూలిపోకుండా నిలిచివున్నాయి. గత విమానదాడిలో మంచినీళ్ల టవర్ టాంకు కాస్తా కూలిపోయింది. రైలు బళ్లిక యిక్కడ ఆగడం లేదు. జర్మన్లిప్పుడు బాంబుదాడులు జరపనిమాట నిజమే అయినా, వాళ్ల విమానాలు ఏ రోజూ స్టేషను పైగా ఎగురుతూనే వున్నాయి, కాగా సోవియట్ సైనిక అధికారులు ముందు జాగ్రత్త కోసం నాలుగు బారుల విమాన విధ్వంసక శతఘ్నులు రెండింటిని సర్వ సంసిద్ధంగా అమర్చివుంచారు.

అది 1942 మే మాసం. పడమటి దిక్కున (అక్కడినుండి ఫిరంగి గర్జల ఘోష తేమగా వున్న రాత్రి వేళల్లో స్పష్టంగా వినవస్తోంది) యిరు పక్షాలూ కందకాలలో గట్టి రక్షణ స్థావరాలు ఏర్పాటుచేసుకొని నిలకడగా యుద్ధం సాగిస్తున్నాయి; తూర్పున జర్మన్లు కాలువ పైనా, మూర్మన్స్క్ రైలుదారి పైనా రాత్రింబగళ్ళు ఎడతెరిపిలేకుండా బాంబులు కురిపిస్తున్నారు; ఉత్తరాన సముద్ర మార్గాల కోసం ఘోరమైన పోరు సాగుతోంది; దక్షిణాన జర్మన్ల ముట్టడిలో వున్న లెనిన్‌గ్రాడ్ తీవ్రమైన ప్రతిఘటనను నిబ్బరంగా సాగిస్తోంది.

కాని యిక్కడంటారా యిదొక విశ్రాంతి కేంద్రంలా వుంది. ప్రశాంత పరిసరాలకు సోమరితనం తోడై ఆవిరిస్నానం మాదిరిగా సైనికులను మెత్తబరచి అలసులనుచేసింది. బాంబుదాడులకు నాశనం కాగా మిగిలిన ఆ డజను యిళ్లలోనూ దేనితోనైనా సరే, చివరకు శూన్యంలోంచి సైతం నాటు సారాను వాటంగా తయారుచెయ్యగల బోలెడు మంది యువతులూ, వితంతువులూ యింకా వున్నారు. మొదటి మూడు రోజులూ కొత్త శతఘ్ని సిబ్బంది కంటినిండా కరువుదీర నిద్రపోతారు, పరిసర పరిస్థితులను చక్కగా ఆకళించుకుంటారు. నాలుగో రోజున వాళ్లలో ఎవరో ఒకరి నామకరణోత్సవం ప్రారంభమవుతుంది, దానితో యిక చూసుకోండి నాటుసారా ఘాటు కంపు స్టేషనంతటినీ కమ్మేసి, యిక ఓ పట్టాన వదలదు.

దిగాలు ముఖంతో వుండే స్టేషను కమాండెంటు సార్జెంటు మేజరు ఫెదోత్ వస్కోవ్ క్యాంపులో జరిగిన ప్రతి వ్యతిక్రమాన్ని గురించీ ఉన్నతాధికారులకు రిపోర్టులు రాస్తూ వుంటాడు. ఆ రిపోర్టుల సంఖ్య పదికి చేరుకోగానే అతని పై ఆఫీసరు వాడుక ప్రకారం వస్కోవ్‌ను చీవాట్లుపెట్టి, విశృంఖల జీవిత ఫలితంగా కనుపొట్టలుబ్బిన సైనికుల అర్ధ ప్లెటూను స్థానంలో మరో దళాన్ని పంపుతూండేవాడు. ఓ వారం పది రోజులు అన్నీ సజావుగా జరిగిపోవడంతో కమాండెంటు వస్కోవ్‌కి సహాయాన్ని అర్థించవలసిన అవసరం వుండేది కాదు, అటు తర్వాత యథాప్రకారంగా అన్నీ పునరావృతమయ్యేవి. ఆ పునరావృత్తి కూడా ఎంత మక్కీకి మక్కీగా జరిగేదంటే చివరకు వస్కోవ్ తేదీలనూ, పేర్లనూ మార్చి తన పాత రిపోర్టులనే కాపీచేస్తే సరిపోయేది.

సరికొత్త ఫిర్యాదులపై దర్యాప్తు జరిపేందుకొచ్చిన మేజరు "టైము దండుగమారి పని! టైము దండుగా, కాగితం దండుగాను! ఏమిటయ్యా నువ్వు, కమాండరువా, లేకపోతే గుమాస్తావా?" అంటూ కంయిమన్నాడు.

"నాకు తాగనివాళ్లని పంపండి!" వస్కోవ్ మొండిగా రెట్టించాడు. కంయ్‌మంటూ విరుచుకుపడే ఆఫీసర్నెవరన్నా అతనికి బెదురే అయినా, తన వాదానికే అతను గట్టిగా కట్టుబడ్డాడు. "తాగుబోతులు కానివాళ్లూ... యింకా ఏమిటంటే... ఆడదాని గౌను అంచు తగిలితేనే చాలు వాళ్ల వెంట అలంగం తిరిగేవాళ్లూ కాకుండా చూసి పంపండి."

"అంటే కొజ్జావాళ్లనా?"

"ఆ సంగతి మీకే బాగా తెలుసు" జాగ్రత్తగా జవాబిచ్చాడు సార్జెంట్ మేజరు.

"సర్లే సరే, వస్కోవ్" మేజరు తన స్వరంలోని కాఠిన్యంలో తనే కొట్టుకుపోతూ ప్రమాదసూచక స్వరంలో అన్నాడు. "సర్లే నీకు తాగని వాళ్లనే కాకుండా ఆడపిల్లల వెంట పడని వాళ్లని కూడా చూసి పంపుతాను. కాని ఒక్క విషయం గుర్తులో పెట్టుకో సార్జెంట్ మేజర్, వాళ్లతో కూడా నువ్వు వేగలేకపోతే...."

"అలాగే పంపండి కామ్రేడ్" అని నిబ్బరంగా జవాబిచ్చాడు కమాండెంటు.

ఆడపిల్లలన్నా, నాటు సారా అన్నా సాక్షాత్తూ సార్జెంటు మేజరుకన్న మరింత ఎక్కువ పరాంఙ్ముఖులుగా వుండే కొత్త బృందాన్నొకదాన్ని పంపుతానని వస్కోవ్‌కి మరోసారి వాగ్దానం చేసి, విమాన విధ్వంసక శతఘ్ని దళానికి చెందిన సైనికులను మేజరు తనతో తీసుకుపోయాడు. కాని ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం అంత తేలిక పనేమీ కాదనడం స్పష్టం, బహుశా అందుకనే అయ్యుంటుంది మూడు రోజులు గడిచిపోయినా ఒక్క పిట్ట జాడ కూడా లేకపోయింది.

"అదేమంత అల్లాటప్పా పనేమీ కాదు తెలుసా" సార్జెంట్ మేజరు తన గృహ యజమానురాలు మరీయా నికీఫొరొవ్నాతో అన్నాడు. "రెండు సెక్షన్లంటే దాదాపు యిరవై

మంది తాగని వాళ్లన్న మాట. మొత్తం యుద్ధరంగమంతా వలవేసి గాలించినా కూడా వాళ్లకి అంత మంది దొరకరనుకుంటాను....''

కాని ఆ మరుసటి రోజు ఉదయమే అతని గృహ యజమానురాలు శతఘ్ని సైనికుల రాకను గురించి ప్రకటించడంతో, అతని అనుమానాలు ఆధారరహితమైనవని తేలిపోయింది. ఆమె స్వరంలో అప్రియమైనదేదో ఉన్నట్లు స్ఫురించింది గాని, అయితే సార్జెంటు మేజరు యింకా సగం నిద్రలోనే ఉండటంతో, అదేమిటో అతను సరిగా గ్రహించలేకపోయాడు. తన మనస్సును అత్యధికంగా వేధించే ప్రశ్నను మాత్రమే అడిగాడు: ''వాళ్లతో ఆఫీసరెవరైనా వున్నాడా?''

''ఉన్నట్టు లేదు.''

''బతికాన్రా భగవంతుడా!'' కమాండెంటుగా తన హోదా విషయంలో సార్జెంటు మేజరుకి ప్రగాఢానురక్తి వుంది. ''ఒక ఒరలో రెండు కత్తులు యిమడవు. అధికారాన్ని పంచుకోవడమంత దౌర్భాగ్యం మరోటి లేదు.''

''ఇల్లలకగానే పండుగ కాలేదు. ముందుంది ముసుళ్ల పండగ'' అంటూ అతని గృహ యజమానురాలు గూఢార్థంగా నవ్వింది.

''మనం యిప్పుడు కాదు, యుద్ధం అయిపోయాక పండుగ జరుపుకుందాం'' అని సాలోచనగా చెప్పి, వస్కోవ్ తన టోపీ పెట్టుకొని బయటకు వెళ్లిపోయాడు.

ముందు ఆవరణ దాటనారంభించాడో లేదో అంతలోనే స్తంభించిపోయాడు. నిద్ర ముఖాలతో వున్న యువతులు అతని ముందు రెండు బారులు తీరి వున్నారు. సార్జెంటు మేజరు తనింకా కలకంటున్నానని నిశ్చయించుకొని తన దృష్టిని సరిచేసుకునేందుకని తన కనురెప్పలు టపటపలాడించాడు. కాని శతఘ్ని సైనికులు ధరించిన దుస్తులు సైనిక నిబంధనల్లో నిర్దేశింపబడని తావుల్లో నిర్లక్ష్యంగా ముందుకు ఉబికి వస్తూనేవున్నాయి. వన్నె వన్నెల రకరకాల జులపాల జుట్టుపాయలు వాళ్ల టోపీల కిందనుంచి వ్రేలాడుతున్నాయి.

''క్వార్టర్‌మేడ్ సార్జెంట్ మేజర్, విమాన విధ్వంసక బెటాలియన్, ఐదవ కంపెనీ, మూడవ ప్లెటూన్‌కి చెందిన ఒకటవ, రెండవ సెక్షన్లు — మీ నాయకత్వాన స్థావరాన్ని కాపాడేందుకు సంసిద్ధంగా వున్నాయి'' సీనియర్ సైనికయువతి మంద్ర స్వరంలో రిపోర్టు చేసింది. ''అసిస్టెంటు ప్లెటూను కమాండరు సార్జెంట్ కిర్యానొవా రిపోర్ట్ చేస్తోంది.''

''సరే'' అన్నాడు కమాండెంటు, నిబంధనల్లో నిర్దేశింపబడని పద్ధతిలో ''భేషుగ్గా వుంది, బొత్తిగా తాగనివాళ్లు చివరకు దొరికారన్న మాట....''

స్థానికుల యిళ్లలో పడుకోడానికి వాళ్లు యిష్టపడకపోయిన కారణంగా, ఆ రోజంతా అతను గొడ్డలితో కర్రలు నరికి, ఫైరింజను షెడ్డులో మంచె మంచాలు తయారుచేస్తూనే వున్నాడు. వాళ్లు చెక్కలు అటూ యిటూ మోసుకొచ్చారు, అతను చెప్పిన పనల్లా చేశారు,

అంతసేపూ వాళ్ళు మాటలొచ్చిన మైనా గోరింకల్లాగ లొడలొడ మాట్లాడుతూనే వున్నారు. సార్జెంట్ మేజరు మాత్రం తన అధికారానికి భంగమెక్కడ కలుగుతుందోనన్న భయంతో దిగాలుగా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అన్నీ తయారుకాగానే అతను "నా అనుమతి లేనిదే మీలో ఎవ్వరూ శిబిరంలోంచి బయటకు అడుగుపెట్టేందుకు వీల్లేదు" అని ఆదేశించాడు.

"బెర్రీ పళ్ళు ఏరుకునేందుక్కూడానా?" చురుగ్గా అడిగిందొక ఎర్రజుట్టు పిల్ల. వస్కొవ్ ఆ యువతిని అంతకు ముందే గమనించాడు.

"ఇప్పుడింకా బెర్రీలు లేవు" అన్నాడతను.

"పుల్లకూర సంగతేమిటి? అది కూడా ఏరుకోకూడదా?" కిర్యానొవా అడిగింది. "మాకు కాస్త అదనపు తిండి వుండటం మంచిది క్రామేడ్ సార్జెంట్ మేజర్, లేకపోతే మేము చిక్కిపోతాం."

సార్జెంట్ మేజర్ వస్కొవ్ బిగుతు దుస్తుల కేసి అనుమానంగా తన దృష్టిని సారించాడు, కాని మళ్ళీ అంతలోనే మెత్తబడి అన్నాడు: "వెళ్ళినా నది దాకా మాత్రమే గాని, అది దాటి వెళ్ళకూడదు. లోయలో పుల్లకూర కొల్లలుగా వుంది."

స్టేషన్లో అయితే పూర్తి ప్రశాంతి ఏర్పడింది గాని, కమాండెంటుకి మాత్రం శాంతి లేకపోయింది. శతఘ్ని దళ యువతులు వాగుడు పిట్టలనీ, తంటాలమారి మేళమనీ తేలడంతో సార్జెంట్ మేజర్ త్వరలోనే తన యింట్లో తనే అతిథి మాదిరిగా మెసలాల్సిన పరిస్థితిలో పడ్డాడు. ఏ పొరపాటు మాట మాట్లాడుతానో అనీ, ఏ పొరపాటు పని చేస్తానో అనీ చచ్చేటంత భయపడేవాడు, ఇక ఏ గదిలోకైనా వెళ్ళేందుకు ముందు తలుపు తట్టే సంగతంటారా — కర్మకాలి ఎప్పుడైనా ఒకసారి మరచిపోయాడో యిక చూసుకోండి కెవ్వుమంటూ భయంకరమైన అరుపులు అతన్ని వెనక్కి తరిమేసేవి. అన్నింట్లోకీ అధ్వానమైనదేమిటంటే తను వాళ్ళలో ఏ ఒకరి పట్లనో ప్రత్యేకాభిమానం చూపానని సూచించే ఏ పరిహాసమో, కొంటెమాటో వినవలసి వస్తుందేమోనన్న భయం, దానితో అతనెప్పుడూ, నెలసరి జీతం డబ్బులు పోగొట్టుకున్న వాడి మాదిరిగా నేలచూపులు చూస్తూ నడుస్తూండేవాడు.

తన కింద పనిచేసే శతఘ్ని సైనికులతో అతను ప్రవర్తిస్తున్న తీరును గమనించిన అతని గృహ యజమానురాలు "మరీ అంత దిగాలుపడిపోతున్నావేమిటి, హుషారుగా ఉండు. నీ వెనక నిన్ను గురించి వాళ్ళు ముసిలాడు అంటున్నారు, అందుకని వాళ్ళతో అలాగే వ్యవహరించు" అని సలహా యిచ్చింది.

సార్జెంట్ మేజరు ఆ వసంత కాలంలోనే తన ముప్ఫయ్ రెండవ జన్మదినం జరుపుకున్నాడేమో తనని తాను ముసలివానిగా పరిగణించుకునేందుకు సంసిద్ధుడుగా లేడు. విషయాలన్నీ ఆలోచించిన మీదట, యిప్పుడు తను విన్నది గృహ యజమానురాలు తన సొంత స్థానాన్ని

పటిష్ఠంచేసుకొనేందుకు చేసే ప్రయత్నం తప్ప మరేమీ కాదన్న నిశ్చయానికొచ్చాడు. ముందువెనుకలు ఆలోచించుకుంటే, సార్జెంట్ మేజరు హృదయాన్ని కరిగించడంలో సఫలీకృతురాలైన ఆమె, సహజంగానే యిప్పుడు అతని హృదయంలో సుస్థిర స్థానాన్ని కల్పించుకోవాలని ప్రయత్నిస్తోంది.

రాత్రి పూట ఎనిమిది శతఘ్ని బారులనుంచీ జర్మన్ విమానాలపై నిప్పులు కురిపించిన శతఘ్ని దళ యువతులు పగటిపూట విధివిరామం లేకుండా తమ డ్రాయర్లనూ బాడీలనూ ఉతికి ఫైరింజను షెడ్డు నిండా జండాల్లా ఆరేసూ ండేవారు.

ఇటువంటి అలంకరణలు సార్జెంట్ మేజరుకు బొత్తిగా నచ్చకపోవడంతో, అతనీ విషయాన్ని సార్జెంట్ కిర్యానొవాతో క్లుప్తంగా చెప్పాడు, యిది మరుగునీ మాటునీ నాశనం చేస్తోందని వివరించాడు.

ఆమె కన్ను మలపకుండా "కాని యీ విషయంలో ఆర్డరొకటుంది" అని జవాబిచ్చింది.

"ఏం ఆర్డరు?"

"ఈ అంశం పైనే. మహిళా సిబ్బంది అందరూ అన్ని రంగాల్లోనూ కూడా తమ లోదుస్తులను ఆరవేసుకోవచ్చు." కమాండెంటు ఆ పిల్లలతో యింక వాదాన్ని పొడిగించలేదు. వాళ్లతో వాదానికి దిగావో యిక చూసుకో, దాన్ని అనంతంగా సాగదీస్తారు.... వాతావరణం గాలి బిగబట్టి వెచ్చగా ఉంటోంది. దోమలు జుమ్మని రొదచేస్తూ ముఖాలపై ముసురుతున్నాయేమో రెమ్మలతో వాటిని చెదరగొట్టకుండా ముందడుగెయ్యడమే దుస్సాధ్యంగా ఉంది. అయినా, సైనిక వ్యక్తి చేతిలో రెమ్మ వుండటం అభ్యంతరకర దృశ్యమేమీ కాదు, కాని త్వరలోనే కమాండెంటు వస్కోవ్ ఏ మూలకెళ్లినా తను నిజంగానే ముసిలాడన్నట్లు దగ్గడం, గొంతు సరిచేసుకోవడం వినిపించేది – యిది మాత్రం విడ్డూరమైన విషయమనే చెప్పాలి.

వేడిగా వున్న ఒక రోజున గిడ్డంగి మలుపు తిరిగి విద్యుద్ఘాతం తగిలినట్లు అతను మ్రాన్పడి పోయినప్పుడు ఇదంతా ప్రారంభమైంది. తన కళ్ళెదుట కనిపించిన ఎనిమిది నగ్న స్త్రీ శరీరాల దృశ్యంతో అతని కళ్ల చిమ్మ చీకట్లు కమ్మినట్లై ఒళ్ళు వేడెక్కింది. మొదటి సెక్షను యావత్తూ, ఆ సెక్షను కమాండరు జూనియర్ సార్జెంటు ఒస్యానినాతోబాటు సూర్యాతపస్నానం చేస్తోంది, అప్పుడే పుట్టిన బిడ్డలంత నగ్నంగా, సైనిక టార్పాలిన్ పైన బొక్కబోర్లా పడుకొనివున్నారు. బాగుండదనైనా వాళ్ళు కెవ్వున అరిచియుండవచ్చు, కాని అందుకు బదులుగా వాళ్లు తమ ముఖాలను టార్పాలిన్‌కి ఆన్చి కదలమెదలకుండా అక్కడే పడుకొని వుండిపోయారు. దానితో దొంగచాటుగా తొంగిచూస్తూ పట్టుబడిన కుర్రాడి మాదిరిగా సార్జెంట్ మేజరు తిరోగమించాల్సిన పరిస్థితిలో పడ్డాడు. చూసుకోండి యిక ఆ రోజు

మొదలుకొని అతను ప్రతిమూలా కోరింత దగ్గు వచ్చినవాడి మాదిరిగా దగ్గనారంభించాడు.

కరుకైన చూపు కలిగిన ఆ ఒస్యానినాని అతనింతకు ముందే గమనించాడు. ఆమె ఎన్నడూ నవ్వలేదు. నవ్వు వచ్చినప్పుడు ఆమె పెదవుల్ని కొంచెం విరిచేదంతే, కాని ఆమె కళ్ళు ఎప్పటి మాదిరిగానే గంభీరంగా చూసేవి. ఆ ఒస్యానినా ఉందే, ఆమె కొంచెం విలక్షణమైన యువతి. అందుకనే వస్కోవ్ తన గృహ యజమానురాలి ద్వారా ఆమెను గురించి మరి కొన్ని విశేషాలు తెలుసుకోవాలని — తన గృహ యజమానురాలు యీ పని విషయంలో సంతోషంతో ఎగిరిగంతెయ్యదని తెలిసినా కూడా — జాగ్రత్తగా ప్రయత్నించాడు.

ఆ మరుసటి రోజున మరీయా నికీఫొరొవ్నా అనుత్సాహంగా "ఆమె వితంతువు. ఆవిడగారు ఏమీ ఎరగని మనిషేం కాదు" అని చెప్పి మూతి ముప్ఫయ్ వంకర్లు తిప్పింది.

వస్కోవ్ బదులేమీ చెప్పలేదు — కేవలం స్త్రీమూత్రురాలి ముందు మాటలతో సమస్యలు పరిష్కారం కావు. అతను తన గొడ్డలిని తీసుకుని బయటికెళ్ళిపోయాడు. ఆలోచించుకోవాలనుకున్నప్పుడు వంటచెరుకు నరకడంకన్న మెరుగైన పని మరొకటి లేదు, మరి అతనికి ఆలోచించుకోవలసింది బోలెడంత వుంది. అతను తన ఆలోచనలను వింగడించుకోవాలనుకున్నాడు.

సరే, మొట్టమొదటి సంగతి, క్రమశిక్షణ అమలు జరగాలి. తాగుడూ, స్థానిక పడుచులతో కామకలాపాలూ లేకపోవడం బాగానే వుందనుకో — పైకి అంతా సజావుగా సలక్షణంగానే వుంది. కాని లోతుకుపోయి చూస్తే క్రమవిరుద్ధమైనది బోలెడంత వుంది.

"ల్యూదా, వేరా, కాత్యా — కాపలా డ్యూటీకి టైమయింది! అమ్మడూ కాత్యా నువ్వు బాధ్యత తీసుకో."

ఏమిటిదీ, కాపలా డ్యూటీకి పంపే సరైన పద్ధతి యిదేనా? సైనిక నిబంధనలకు పూర్తి అనుగుణంగా జరగాల్సిన పని యిది. సైనిక నిబంధనలను యిలా ఎద్దేవా చెయ్యడం బాగా లేదు. ఈ విషయంలో ఏదో ఒకటి చెయ్యాలి, కాని ఏం చెయ్యాలబ్బా? వాళ్ల నాయకురాలితో యీ విషయాన్ని ప్రస్తావించేందుకు అతను ప్రయత్నించాడు. కాని కిర్యానొవా నుంచి అతనికి లభించిన జవాబల్లా:

"మాకిందుకు.... నేరుగా జనరల్ దగ్గర్నుంచి, అనుమతి వుంది." ఈ బుల్లి దయ్యాలు తనని చూసి నవ్వుకుంటున్నారు.

"పాపం, ఇనపగుగ్గిళ్లలా కొరుకుడు పడటం లేదా సార్జెంట్ మేజర్?"

అతను ఆ మాటలు వినవచ్చిన దిక్కుకి తిరిగాడు. పొలీనా ఎగోరొవా అనే పక్కింటామె, పక్కా వ్యభిచారి, అంతకు ముందు నెలే ఆమె తన నామకరణోత్సవాన్ని నాలుగు సార్లు జరుపుకుంది. "ఏమయ్యోయ్, చిక్కిపోకుండా చూసుకో! అచ్చోసిన ఆబోతులా, ఉన్న మగాడి వల్లా నువ్వొక్కడివే అన్న సంగతి కాస్త గుర్తుంచుకోసుమా."

తన రొమ్ములు అప్పుడే పొయ్యిలోంచి తీసిన డబుల్ రొట్టెల మాదిరిగా తొంగి చూస్తూండగా దడిమీదకి వంగి ఆమె ధణుతెగిరిపోయేలా పగలబడి నవ్వింది.

"నువ్విప్పుడిక గోపాలుడి లాగా వ్యవహరించాలి; ఒక వారం ఒకరింట్లో, మరో వారం మరొకరితో, ఈ విషయంలో నిన్ను గురించి మా ఆడాళ్లం ఒక ఒప్పందానికొచ్చాంలే."

"పొలీనా ఎగోరొవా, అమ్మా తల్లీ నీకు పుణ్యముంటుంది గాని సరిగా మాట్లాడు. నువ్వేమైనా సైనికుడి భార్యవా లేకుంటే సానిదానివా? సరిగా మసులుకో."

"దానిదేముందిలే సార్జెంట్ మేజర్. సైనికులేమిటి, వాళ్ల పెళ్లాలేమిటి, ఏం చేసినా ఆ పాప పుణ్యాలన్నీ యుద్ధానివే."

అలాంటి ఆడదాన్ని తను ఏమనగలడు, ఏం చెయ్యగలడు? దీన్నిక్కడినుంచి గెంటె య్యాలి. కాని ఎలాగ? పౌర అధికారులంటూ యిక్కడ ఎవరూ లేరే? ఈమె తన అధికార పరిధిలోకి రాదు — రంకెలేసే ఆ మేజరునుంచి తను అంతమాత్రం తెలుసుకోగలిగాడు.

ఔను మరి, తను ఆలోచించుకోవలసిన విషయాలు చాలానే వున్నాయి — రెండు మోపుల కట్టెలు కొట్టేందుకు పట్టేటంత టైము పడుతుంది. ప్రతి ఒక్క అంశాన్నీ ప్రత్యేక పరిగణనలోకి తీసుకోవాలి, నిజానికి పరమ ప్రత్యేకమైన పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ రకమైన వ్యవహారాల్లో తన విద్యాలోపం ఓ పెద్ద అవరోధం. చదవడం, రాయడం, గణితం తను నేర్చుకున్న మాట నిజమే, కాని తన చదువు సాగినది నాలుగేళ్లు మాత్రమే. నాలుగో ఏడాది చివర తన తండ్రి ఎలుగుబంటి వాతబడి చనిపోవడమే యిందుక్కారణం. తనీ విషయం చెప్తే యీ అమ్మాయిలు ఆ ఎలుగుబంటిని తలుచుకొని ఎంత విరగబడి నవ్వుతారో! తన తండ్రి మొదటి ప్రపంచ యుద్ధంలో విషవాయువు వల్లనో, అంతర్యు ద్ధంలో కత్తిపోటు వల్లనో, ఏ కులాక్ తుపాకి గుండుకో బలై చనిపోలేదు సరి కదా, కనీసం తన పక్కమీద పడుకొని సహజంగానైనా చనిపోలేదని తలుచుకోవడం చిత్రం కాక మరేమిటి. ఒక ఎలుగుబంటి ఆయన పైకి దూకి గాయపరచి చంపింది! ఈ మేళం ఎలుగు బంటిని జంతుప్రదర్శనశాలలో తప్ప విడిగా చూసివుండరు....

ఔనోయ్ ఫెదోత్ వస్కొవ్, నువ్వీ రోజున కమాండెంటువి కావచ్చు, కాని నువ్వెక్కడో మారుమూల అనామక ప్రాంతంనుంచి ఎగబాకుతూ యీ దశకు చేరుకున్నావు, కాని మరి వాళ్లో, వాళ్లు సాదా సైనికులే అయినా, వాళ్లకి క్వాడ్రంటులు, వక్రీభవన కోణాల వంటి సవాలక్ష విషయాలతో కూడిన విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానం వుంది. వాళ్లు మాట్లాడుతున్న ధోరణిని బట్టి వాళ్లు ఏడేళ్లో, తొమ్మిదేళ్లో కూడా చదివివుంటారు. తొమ్మిదినుంచి నాలుగు తీసేస్తే అయిదు మిగుల్తుంది. అంటే, తను స్కూలు కెళ్లిన దానికన్న ఎక్కువ సంవత్సరాలు తను వాళ్లకు వెనకబడ్డాడన్న మాట.

ఈ విషాద భావాలు మనస్సును ముసురుకోవడంతో అతను మరింత ఉన్మత్తావేశంతో

కళ్ళెలు కొట్టనారంభించాడు. కాని యిందుకు ఎవరిని నిందించాలి? వికారమైన ఆ ఎలుగు బంటినేననడం నిశ్చయం.

అది చిత్రమైన విషయమే, కాని జీవితంలో యింత వరకు తనను తాను అదృష్ట వంతుడిగానే అతను పరిగణించుకున్నాడు. బహుశా ప్రత్యేకించి అదృష్టవంతుడు కాకపోవచ్చు నేమో గాని, తను ఫిర్యాదు చేసేందుకు కూడా ప్రత్యేకించి ఏమీ లేదు. అన్నీ బేరీజువేసి చూసుకుంటే, పట్టుమని తను చదివిన నాలుగేళ్ళలో రెజిమెంటల్ స్కూలు శిక్షణ ముగించు కొని, పదేళ్ల సర్వీసు తర్వాత సార్జెంట్ మేజరు హోదాకి చేరుకున్నాడు. అక్కడ అన్నీ సజావు గానే సాగిపోయాయి, కాని యితర రంగాల్లో అతనికి అడపాదడపా అనుకోని ఆఘాతాలు తగులుతూవచ్చాయి, రెండు సందర్భాల్లో మాత్రం విధి అతన్ని నేరుగానే దెబ్బతీసింది. అయితేనేం, ఫెదోత్ వస్కోవ్ ఆ దెబ్బలనూ తట్టుకున్నాడు.

ఫిన్నిష్ యుద్ధానికి కొంచెం ముందుగా అతను మిలిటరీ ఆస్పత్రికి చెందిన ఒక నర్సును పెళ్లిచేసుకున్నాడు. ఆమె చురుకుగా, నవ్వుతూ కేరింతలుకొడుతూ హుషారుగా ఉండేది, సంగీతమన్నా, నాట్యమన్నా, కొంచెం ద్రాక్షసారా సేవించడమన్నా విశేషాసక్తి కలిగియుండేది. ఆమె అతనికి ఈగొర్ అనే ఒక బిడ్డను కూడా ప్రసాదించింది, ఈగొర్ వస్కోవ్. అటు తర్వాత ఫిన్నిష్ యుద్ధం ప్రారంభమైంది. వస్కోవ్ యుద్ధరంగానికి వెళ్లాడు. అతను యుద్ధ రంగంనుంచి రెండు పతకాలతో యింటికి తిరిగివచ్చినప్పుడే విధి అతనిపై తన మొదటి దెబ్బను తీసింది. ఒక మూల మంచు ప్రాంతంలో అతను తన ప్రాణానికి తెగించి పోరాడుతూంటే, యిక్కడ అతని భార్య ఒక పశువుల డాక్టరుతో సుదూర దక్షిణ ప్రాంతానికి లేచిపోయింది. వస్కోవ్ వెన్వెంటనే ఆమెకు విడాకులిచ్చి, కోర్టు ద్వారా తన కొడుకును డిమాండుచేసి తెప్పించుకొని, వాడిని పల్లెటూళ్లో వున్న తన తల్లి దగ్గరకు పంపించాడు. మరో ఏడాదిలో ఆ కుర్రాడు చనిపోయాడు. అప్పటినుంచి వస్కోవ్ మూడే మూడు సందర్భాల్లో చిరునవ్వు నవ్వినట్లు వినికిడి: తన కోటుకు పతకాన్ని గుచ్చుతున్నప్పుడు జనరల్ వంక, తన భుజంలో యిరుక్కున్న తూటా పెంకును ఆపరేట్ చేసి తీసివేసిన సర్జన్ వంక, ఇంగితజ్ఞానం ప్రద ర్శించినందుకు తన ప్రస్తుత గృహ యజమానురాలు మరీయా నికీఫొరొవ్నా వంక చూసినప్పుడూ.

అదుగో ఆ తూటా పెంకు కారణంగానే అతనికీ ప్రస్తుత ఉద్యోగమొచ్చింది. గిడ్డంగిలో యింకా కొంత సామగ్రి వుంది, కాని దాన్ని కాపలాకాసేందుకు కాపలా సైనికు ల్లేరు. అందుకనే ఒక కమాండంటుని నియమించి, ఆ గిడ్డంగికి అతన్ని బాధ్యుణ్ణి చేశారు. రోజులో మూడు పూటలూ వస్కోవ్ ఆ గిడ్డంగికి వెళ్లి, తాళాలను తనిఖీచేసి ''స్థావరాన్ని తనిఖీ చెయ్యడమైనది, సర్వం సజావుగా వుంది'' అని తను అందుకోసం పెట్టిన రిజిస్టరులో నమోదుచేసేవాడు. ఆ తరువాత దానికింద తనిఖీచేసిన టైము వేసేవాడు.

తనది శాంతియుతంగా గడిచిన జీవితం; ఈ నాటివరకు, శాంతియుతంగా. కాని యిప్పుడో.... సార్జెంట్ మేజరు నిట్టూర్చాడు.

2

యుద్ధ పూర్వపు ఘటనల్లో మర్గరీతా ముస్తకోవా (క్లుప్తంగా చెప్పుకోవాలంటే రీతా)కి బాగా గుర్తున్న ఘటనల్లో తన స్కూల్లో సరిహద్దు గస్తీ సైనిక బృందానికి చేసిన పార్టీ ఒకటి. ఆ పార్టీ అప్పుడే ముగిసి, సిగ్గరి అయిన లెఫ్టినెంటు ఒస్యానిన్ సరిహద్దు సమీపాన గల ఆ చిన్న పట్టణపు కొయ్య పేవ్‌మెంటుపై తమ బూటు కాళ్ల చప్పుళ్లు ప్రతిధ్వనిస్తూండగా తన సరసనే యింకా నడుస్తున్నాడా అన్నంత బాగా ఆమెకు గుర్తుంది. ఆ లెఫ్టినెంటు సరిహద్దు గస్తీవీరుల్లో ఒకడు కాడు. ఆ ప్రతినిధి వర్గంలో అతను యాదృచ్ఛికంగా కలవడం తటస్థించిందేమో, దానితో అతను తెగ సిగ్గుపడిపోతున్నాడు.

రీతా కూడా మహా సిగ్గరిగా వుండేది. ఆధికారిక స్వాగత కార్యక్రమంలో గాని, ఔత్సాహిక కళాకారుల బృందగానంలో గాని ఆమె పాల్గొనకుండా కూర్చుంది. అతిథుల్లో ముప్పదేళ్లకు మించని వాళ్లెవరితోనైనా తనకు తాను ముందుగా సంభాషణ ప్రారంభించడం కన్న పై అంతస్తునుంచి ఎలకలు స్వైరవిహారం చేసే నేలమాళిగలోకి దూకడమే ఆమెకు తేలికగా వుండేది. లెఫ్టినెంట్ ఒస్యానినూ, తనూ పక్కపక్కల కూర్చోవడం తటస్థించింది. కదిలేందుకూ మెదిలేందుకూ సాహసించక, ఎట్టఎదురుగా వేదిక వంక చూస్తూ వాళ్లక్కడ కూర్చున్నారు. తర్వాత నలుగురూ సరదాగా ఆట ప్రారంభించినప్పుడు, వాళ్లు మళ్లీ పక్కపక్కనే ఉండటం తటస్థించింది. ఆ ఆటలో ఓడిపోయినప్పుడు పందెం ప్రకారం వాళ్లిద్దరూ వాల్ట్జ్ నాట్యం (అదే పందెం) చెయ్యాల్సివచ్చింది, అలాగే వాళ్లిద్దరూ జంటగా నాట్యం చేశారు. అటు తర్వాత వాళ్లిద్దరూ కిటికీ దగ్గర నిలబడ్డారు. ఆ తర్వాత.... సరే, ఏముంది, ఆతరువాత అతను ఆమెను యింటివరకు సాగనంపాడు.

సరిగా అప్పుడే రీతా గొప్ప నక్కజిత్తొకటి పన్నింది. అతన్ని ఆమె చుట్టుదోవగుండా యింటికి తీసుకెళ్లింది. అప్పటికీ అతను బహు సకృతుగా తప్ప మాట్లాడనే లేదు. అందుకు బదులు అతను సిగరెట్లు కాల్చాడు. సిగరెట్టు ముట్టించేందుకు ముందు ప్రతి సారీ ఆమె అనుమతిని కోరుతూ వుండేవాడు. అతనలా అనుమతి కోరిన ప్రతి సారీ అతని బెరుకుతనాన్ని చూసి రీతా గుండె మరింత వేగంగా కొట్టుకునేది.

వీడ్కోలు సమయంలో కూడా వాళ్ళు కరచాలనం చేసుకోలేదు — కేవలం తలలు ఊపుకున్నారు, అంతమాత్రమే. ఆ లెఫ్టినెంటు సరిహద్దులో వున్న తన గస్తీ స్థావరానికి వెళ్లిపోయాడు. ప్రతి శనివారమూ అతను ఆమెకొక క్లుప్తమైన జాబు రాసేవాడు. ప్రతి ఆదివారమూ ఆమె అతనికొక సుదీర్ఘమైన జవాబిచ్చేది. వేసవి దాకా యీ ఉత్తర ప్రత్యుత్తరాలు యిలా సాగాయి. జూన్‌లో అతను మూడు రోజులపాటు ఆ చిన్న పట్టణానికి వచ్చాడు. సరిహద్దులో పరిస్థితి యిక నెంతమాత్రమూ శాంతియుతంగా లేదన్న వార్త

తెచ్చాడు. ఇప్పుడిక ఎవరికీ సెలవు దొరకదనీ, అందుకని వాళ్ళు పెళ్లి చేసుకునేందుకు గాను నేరుగా రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్లాలనీ ప్రతిపాదించాడు. రీతా యీ ప్రతిపాదనకు ఎంత మాత్రం ఆశ్చర్యం చెందలేదు. కాని ఆ రిజిస్ట్రారు ఒక బ్యూరాక్రట్ కావడం సంభ వించింది. ఆమెకు పద్ధెనిమిదేళ్లు నిండటానికి ఇంకా అయిదున్నర మాసాల వ్యవధి వుందన్న అభ్యంతరం చెప్పి, వాళ్ల పెళ్లిని నమోదుచెయ్యడానికి అతను తిరస్కరించాడు. అయినా వాళ్లు వెనక్కి తగ్గక, పట్టణ కమాండెంటు దగ్గరకీ, అటు తర్వాత తమ తల్లితండ్రుల దగ్గరకీ వెళ్లి, చివరికెలాగైతేనేం తమ పంతం నెగ్గించుకున్నారు.

తన క్లాసు ఆడపిల్లల్లో పెళ్లి చేసుకున్న వాళ్లలో రీతాయే మొట్టమొదటిది. ఎవరో లాకాయ లూకాయతో కాదు, ఒక రెడార్మీ కమాండరుతో – అందులోనూ ఒక సరిహద్దు గస్తీ సైనికునితో. ఈ భూలోకంలో తనకన్న ఎక్కువ సంతోషంగా వున్న యువతి మరొకతె ఉండి ఉండదు.

సరిహద్దు గస్తీ స్థావరంలో ఆమెను వెన్వెంటనే మహిళా సమితికి ఎన్నుకొని, అన్ని శిక్షణ తరగతుల్లోనూ ఆమెను చేర్చుకున్నారు. రీతా గాయాలకు కట్లు కట్టడం నేర్చు కుంది, తుపాకి కాల్చడం, గుర్రపు స్వారీ, గ్రెనేడ్లు విసరడం, విషవాయుదాడులనుండి ఆత్మ రక్షణ చేసుకోవడం నేర్చుకుంది. మరో ఏడాదికి ఆమె ఒక మగపిల్లవాణ్ణి కంది (వాళ్ల తనికి అల్బేర్ట్ అని పేరు పెట్టారు – ముద్దుగా అలిక్ అని పిలిచేవారు), మరో సంవత్సరం తర్వాత యుద్ధం మొదలైంది.

ఆ యుద్ధారంభ దినాన బెంబేలుపడని కొద్ది మందిలో ఆమె ఒకతె. మామూలు గానే ఆమె నిబ్బరమైనదీ, నిదానస్తురాలూను. అయితే యీమారామె నిబ్బరంగా ఉండటానికి మరో కారణం కూడా వుంది; గత మే మాసంలో అలిక్‌ను తన తలిదండ్రుల దగ్గరకు పంపెయ్యడమే ఆ కారణం. దానితో ఆమె యితరుల బిడ్డలను కాపాడటంలో నిమగ్నం కాగలిగింది.

ఆ సరిహద్దు గస్తీ స్థావరం శత్రుదాడిని తట్టుకొని పదిహేడు రోజులు నిలబడగలి గింది. రీతా రాత్రింబగళ్లు దూరాన జరిగే కాల్పుల శబ్దం వింటూ వుండేది. స్థావరం యింకా పదిలంగానే ఉందన్న మాట అనీ, దానితో బాటే తన భర్త బతికివున్నాడనీ, సైనిక పటాలాలు వచ్చేదాకా గస్తీ సైనికులు తట్టుకు నిలబడి పోరాడుతారనీ, వాళ్లతో కలిసి శత్రువు పైన దెబ్బకి దెబ్బ తీస్తారనీ ఆమె ఆశించింది. కాని రోజులు గడిచాయి, సహాయ దళాలు రాలేదు, చివరకు పదిహేడవ రోజున ఆ స్థావరాన్ని నిశ్శబ్దం ఆవరించింది.

ఇతర కుటుంబాలతో బాటు రీతాని కూడా యుద్ధరంగంనుంచి దూరంగా పంపి వేయాలని ప్రయత్నించారు. కాని పోరాట శ్రేణుల్లోకి వెళ్లేందుకు తనను అనుమతించా ల్సిందిగా ఆమె అర్థించింది. వాళ్లామెనొక గుడ్సు బండిలోకి బలవంతాన నెట్టారు. కాని

సరిహద్దు గస్తీ స్థావరపు డిప్యూటీ ప్రధానాధికారి అయిన సీనియర్ లెఫ్టినెంట్ ఒస్యానిన్ యొక్క మొండి పట్టుదల గల భార్య మళ్లీ రెండు రోజుల్లో దుర్గ ప్రాంత ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. చివరకు వాళ్లామెను నర్సుగా తీసుకున్నారు, మరో ఆరు నెలల్లో విమాన విధ్వంసక శతఘ్ని ప్రయోగ రెజిమెంటల్ తరగతులకు శిక్షణ కోసం పంపారు.

సీనియర్ లెఫ్టినెంట్ ఒస్యానిన్ యుద్ధపు రెండవ రోజున, ఉదయం పూట జరిగిన ఎదురుదాడిలో చంపబడ్డాడు. ఆశ్చర్యకరంగా ఇప్పుడు శత్రువశమైన స్థావరంనుంచి ఎలాగో తప్పించుకొచ్చిన సరిహద్దు గస్తీ సైన్యానికి చెందిన ఒక సార్జెంటు ద్వారా జూలైలో రీతాకు యీ విషయం తెలిసింది.

ఇప్పటికి నవ్వునే మరచిపోయిన, వీరుడైన సరిహద్దు గస్తీ సైనికుడు ఒస్యానిన్ వితంతువైన రీతా పట్ల సేనా నాయకులకు గొప్ప గౌరవ భావం ఏర్పడింది. వార్తల్లో ఆమె పేరు ఉదహరింపబడింది, ఆమె ఆదర్శప్రాయురాలుగా పరిగణింపబడింది — ఆమె వ్యక్తిగత కోర్కె మంజూరుచెయ్యబడింది. తన శతఘ్ని ప్రయోగ శిక్షణను ముగించుకోగానే, ఏ సరిహద్దు గస్తీ స్థావరంలోనైతే తన భర్త సంకులమైన బయనెట్ పోరాటంలో చంపబడ్డాడో, ఆ యుద్ధ రంగానికి తనను పంపాల్సిందిగా ఆమె అర్థించింది. ఇక్కడ యుద్ధ శ్రేణి కొంచెం వెనక్కి తగ్గింది, అది సరస్సులకు కరుచుకొని, అడవుల్లో పూటుపొందింది, కందకాలు తవ్వుకుంది, చివరకు అది వెనకటి సరిహద్దు గస్తీ స్థావరానికీ, లెఫ్టినెంట్ ఒస్యానిసూ తొమ్మిదో తరగతి 'బి' సెక్షన్ విద్యార్థినీ కలుసుకున్న ఆ చిన్న పట్టణానికీ మధ్య స్థిరపడింది.

ఇప్పుడిక రీతా సంతృప్తి చెందింది — ఆమెకు తను కోరుకున్నది లభ్యమైంది. చివరకు ఆమె భర్త మరణస్మృతి సైతం యిప్పుడు విస్మృతి అగాధపు మూలలలో కూరుకుపోయింది. ఆమెకు చేతినిండా పని వుంది, మొయ్యాల్సిన బాధ్యతలున్నాయి, ఆమె మనసారా ద్వేషించడానికి కొన్ని నిర్దిష్ట లక్ష్యాలున్నాయి. నిశ్శబ్దంగా, నిర్దాక్షిణ్యంగా ద్వేషించడాన్ని ఆమె నేర్చుకుంది. తమ విమాన విధ్వంసక శతఘ్ని దళం యిప్పటికింకా శత్రు విమానాన్నొక్కదాన్నీ నేలకూల్చకపోయినా, జర్మన్ పరిశీలక బెలూనునొకదాన్ని కాల్చడంలో ఆమె సఫలురాలైంది. ఆ బెలూను అంటుకుని మండనారంభించింది, ఆకాశమధ్యంలోనే ముడుచుకుపోసాగింది, బెలూను తొట్టెలోంచి జర్మన్ వైమానికుడు బయటకు ఉరికాడు, ఓ పెద్ద బండరాయిలా నేల కూలసాగాడు.

"కాల్చు, రీతా! కాల్చు!" అంటూ శతఘ్ని దళానికి చెందిన మిగిలిన యువతులు అరిచారు.

కాని రీతా కిందకుపడుతున్న ఆ చుక్క వంకనే తదేకంగా చూస్తూ కాల్చకుండా ఆగింది. సరిగా నేలను చేరుకొనేందుకు ముందు ఆ జర్మన్ తన పేరషూట్‌ను — తన జర్మన్ భగవంతుని తలుచుకుంటూనే అనడంలో సందేహం లేదు — గుంజగలిగాడు, సరిగా ఆ క్షణంలో రీతా తన ట్రిగ్గరు నొక్కింది.

నాలుగు శతఘ్ని గొట్టాలనుంచీ మంటలతో బాటు దూసుకుపోయిన గుళ్ళు నల్లని ఆ ఆకారాన్ని తూట్లు పొడిచాయి. ఆ యువతులు జయధ్వానాలు చేస్తూ ముద్దులతో ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశారు. రీతా కేవలం నిర్జీవమైన ఒక నవ్వు నవ్వి ఊరుకుంది. ఆ రాత్రంతా ఆమె వణికిపోతూనే వుంది. అసిస్టెంట్ ప్లెటూన్ కమాండరు కిర్యానొవా ఆమెకు టీ యిచ్చి సముదాయించింది: "రీతా, యిది పాతబడిపోతుంది. జీవితంలో మొట్టమొదటిసారి నేను ఒక మనిషిని చంపినప్పుడు నిజంగానే నాకు దాదాపు చచ్చిపోయినంత పనైంది. ఓ నెలనెలంతా నన్ను కలలు సతమతం చేశాయి, రోజూ ఆ మురికి వెధవ, ఆ జర్మన్ కలలో కనిపిస్తూనే వుండేవాడు...."

కిర్యానొవా పోరాటపు రికార్డు కలిగిన యువతి. ఆమెకు ఫిన్నిష్ యుద్ధంలో పరిగణనీయమైన అనుభవం వుంది. అగ్రశ్రేణి ప్రాంతంలో తన ఫస్ట్ ఎయిడ్ సంచితో పాక్కుంటూ వెళ్ళి చేసిన సేవకు గాను ఆమెకు పతకం బహూకరింపబడింది. ఆమె సుదృఢ స్వభావం పట్ల రీతాకు గౌరవ భావముంది, అంతే గాని ప్రత్యేకించి ఆమె పట్ల రీతా ఆకర్షితురాలు కాలేదు.

మొత్తంమీద రీతా ఎప్పుడూ ఎవరితోనూ కలిసిమెలిసి వుండేదికాదు. సెక్షన్‌లోని యువతులందరూ కమ్సొమోల్ సభ్యురాండ్రే, అయితే వచ్చిన చిక్కు వాళ్ళామె కంటె చిన్న వాళ్ళు కావడం కాదు — వాళ్ళు కేవలం చిన్నారి పాపలు. వాళ్ళకి ప్రేమా తెలియదు, మాతృత్వమూ తెలియదు, దుఃఖమూ తెలియదు, సుఖమూ తెలియదు. వాళ్ళూరికే లెఫ్టినెంటులను గురించీ, ముద్దులను గురించీ చిలకపలుకులు పలుకుతారు, ఆ మాటలు వింటూంటే రీతాకిప్పుడు ఒళ్ళు మండుతోంది.

అటువంటి మరో కథనం విన్నాక రీతా "పడుకోండి!" అంటూ కటువుగా కసిరింది. "ఇంక ఆ పిచ్చివాగుడు కట్టిపెట్టకపోతే విరామం లేకుండా గార్డు డ్యూటీ వేస్తాను దానితో తిక్క కుదురుతుంది."

"ఎందుకు రీతా అంత చిరాకు" కిర్యానొవా బద్ధకంగా దీర్ఘాలుతీస్తూ అంది. "ఏదో వాగ్గోనియ్యి. వాళ్ళకి కాస్తంత కులాసా కాలక్షేపం."

"వాళ్ళు ప్రేమకలాపంలోకి దిగితే నాకు అభ్యంతరం లేదు. అంతే గాని ఆ మూలా యీ మూలా యీ చిలక్కొట్టుళ్ళంటేనే నాకు గిట్టదు."

"ఆ ప్రేమకలాపమేదో నువ్వే సాగించి వాళ్ళకి దారి చూపకూడదూ" కిర్యానొవా నవ్వుతూ అంటించింది.

అంతే, రీతా నోరు అకస్మాత్తుగా బంద్ అయింది. అసలలాంటిదెలా సంభవమో ఆమె ఊహించను కూడా ఊహించలేకపోయింది. ఆమెకు సంబంధించినంత వరకు మగాళ్ళు యిక నెంతమాత్రమూ అస్తిత్వంలో లేరు. ఒకే ఒక్క మగాడు ఒకప్పుడున్నాడు — యుద్ధపు

రెండో రోజు ఉదయం సరిహద్దు గస్తీ స్థావరం కోసం జరిగిన బాహాబాహీ యుద్ధంలో పోరాడినవాడు. ఆమె శిరమెత్తుకొని బెల్టును బిగించుకోగల్గినంత బిగువుగా బిగించుకుని బతికింది.

సరిగా మేడేకి ముందు శతఘ్ని దళం గడ్డు సమయం గడపాల్సివచ్చింది. రెండు గంటల సేపు అది జర్మన్ల చురుకైన మెస్సర్‌ష్మిడ్ట్ విమానాలతో పోరాటం జరిపింది. జర్మన్లు విమాన విధ్వంసక శతఘ్ని కేంద్రంమీద కిందుగా వచ్చి కాల్పుల వర్షం కురిపించారు. మందుగుండు మోసుకెళ్లే అమ్మాయిని — లావాటి, సాదా, చప్పిడి ముక్కు యువతిని వాళ్లు చంపారు. మరో యిద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఆ యూనిట్ కమిస్సారు వారి అంత్య క్రియలకు హాజరయ్యాడు. శతఘ్ని దళ యువతులు శోకన్నాలు పెట్టారు, సమాధి దగ్గర గౌరవ సూచకంగా తుపాకులు కాల్చబడ్డాయి. అటు తర్వాత కమిస్సారు రీతాని పక్కకి పిలిచాడు.

''సెక్షన్లో ఖాళీని మనం భర్తీచెయ్యాలి.''

రీతా బదులు చెప్పలేదు.

''నీది చక్కని బృందం. నీకూ తెలిసిందే కదా, యుద్ధ రంగంలో ఆడాళ్లంటే అందరి నిశిత దృష్టి వాళ్ల మీదే వుంటుంది. కొన్ని సందర్భాల్లో మగాళ్ళ ఆకర్షణను తట్టుకోలేని సమయాలుంటాయి.''

అప్పుడూ రీతా బదులు చెప్పలేదు. కమిస్సారు తన బరువును ఒక పాదం మీదనుంచి మరో పాదం మీదకి మార్చుకుని, సిగరెట్టు ముట్టించి, లోగొంతులో చెప్పాడు: ''స్టాఫ్ ఆఫీసర్లలో ఒకడు — అన్నట్టు అతనొక కలనలూ, వివాహితుడూ కూడా — ఓ స్నేహితురాల్ని పట్టాడు. నా పై ఆఫీసరుకి యీ విషయం తెలియడంతో ఆ కలనల్‌ని ముఖం వాచేలా చివాట్లు పెట్టి, యీ తిరుగుబోతు పిల్లని మరో మంచి బృందంలో పనిలో పెట్టమని నన్ను ఆజ్ఞాపించాడు.''

''అలాగే కానీండి'' అని జవాబిచ్చింది రీతా.

మరుసటి రోజు ఆ యువతిని చూసినప్పుడు రీతా హృదయం మెచ్చికోలు భావంతో నిండిపోయింది — ఆమె పొడగరి, రాగి జుట్టు, పాలనురగ వంటి తెల్లని దేహచాయ. ఆమెవి — ఆకు పచ్చగా, చక్రాలలాగ గుండ్రంగా వున్న బాల్యస్నిగ్ధమైన కళ్ళు.

''ప్రైవేట్ ఎవ్‌గేనియా కొమెల్‌కోవానండి, పనిలో చేరడానికొచ్చాను....''

ఆ రోజు స్నానాలరోజు, స్నానాల కోసం యువతులు దుస్తులు విప్పినప్పుడు వాళ్ళ నూత్న ఆగంతకురాలి వంక ఏదో అద్భుత మూర్తిని చూసినట్టు చూశారు.

''జేన్యా, నువ్వు అచ్చంగా సముద్రకన్యలా వున్నావు!''

''అబ్బ, జేన్యా, నీ చర్మం ఎంత స్వచ్ఛంగా వుందో!''

''జేన్యా, నీ మూర్తిని శిల్పంగా మలుచుకోవచ్చు!''

"జేన్యా, బ్రాజియర్సూ గట్రాతో నీకు పని లేదు!"

"ఓహ్ జేన్యా, మ్యూజియంలో నిన్నొక దివ్యసుందర శిల్పంలా నల్ల ముఖమల్ వస్త్రం పైన గాజుపెట్టెలో నిలబెట్టవచ్చు!"

"పాపం!" కిర్యానొవా నిట్టూర్చి అంది. "చిత్రం, ఇలాంటి సుందర మూర్తిని ముతక సైనిక యూనిఫారంలో చుట్టబెట్టడం విడ్డూరం కాక మరేమిటి – నేనైతేనా, యింతకంటె చచ్చిపోయేందుకే ఒప్పుకొందును."

"ఈవిడ అందంగానే వుంది" రీతా జాగ్రత్తగా వ్యాఖ్యానించింది. "అందమైన ఆడాళ్ళు అదృష్టవంతులు కావడం అరుదు."

కిర్యానొవా వక్రంగా నవ్వుతూ "నీకు ఈర్ష్య మొదలైందీ?" అని ప్రశ్నించింది.

రీతా బదులు పలకలేదు. అబ్బే, అసిస్టెంట్ ప్లెటూన్ కమాండరు కిర్యానొవాతో స్నేహంగా మెలగడం తనకు చచ్చినా సాధ్యం కాదు.

కాని జేన్యాతో తను స్నేహంగా ఉండగలదు. ఏ విధమైన సన్నాహమూ లేకుండా, ఏ సాధకబాధకాలూ ఆలోచించుకోకుండా, సహజంగానే అది ప్రారంభమైంది. రీతా వెన్వెంటనే తన జీవిత కథను ఆమెకు చెప్పింది. జేన్యాను చివాట్లు పెట్టినట్లూ వుంటుంది, తన ఆదర్శాన్ని ఆమె ముందుంచినట్లూ వుంటుంది, తన ఘనతను కొంత చాటుకున్నట్లూ ఉంటుందని ఆమె ఉద్దేశించింది. అందుకు బదులుగా జేన్యా జాలీ వ్యక్తం చెయ్యలేదు, సానుభూతీ ప్రకటించలేదు. ఆమె ముక్తసరిగా అంది: "అయితే, జర్మన్లతో తేల్చుకోవలసిన సొంత వ్యవహారం నీకూ వుందన్నమాట."

ఆ మాటని జేన్యా ఎలాంటి స్వరంలో అడిగిందంటే, కలనల్ సంగతి తనకు పూర్తిగా తెలిసినా కూడా రీతా, "అయితే నీకూ వుందా?" అని ప్రశ్నించింది.

"నేనిప్పుడు పూర్తిగా ఒంటరిదాన్ని. మా అమ్మా, నా చెల్లెలు, నా తమ్ముడూ అందరూ కూడా మరతుపాకితో కాల్చెయ్యబడ్డారు."

"కాల్పుల్లో వాళ్ళు చిక్కుకున్నారా?"

"లేదు. వాళ్ళని పట్టుకుని కాల్చేశారు. జర్మన్లు ఆఫీసర్ల కుటుంబసభ్యుల్ని పట్టుకుని మరతుపాకి ఎదుట నిలబెట్టి కాల్చేశారు. ఒక ఎస్తోనియన్ స్త్రీ, ఎదురుగా వున్న యింట్లో నన్ను దాచింది, నేనక్కడనుంచి యీ మారణకాండ అంతా ప్రత్యక్షంగా చూశాను. యావత్తూ సవివరంగా చూశాను! నా చిన్నారి చెల్లెలు ఆఖర్న పడిపోయింది – దాన్ని వాళ్ళు రెండో సారి కాల్చాల్సివచ్చింది...."

"ఔను గాని జేన్యా, నాకో విషయం చెప్పు, ఆ కలనల్ వ్యవహారమేమిటి?" గుసగుసగా అడిగింది రీతా. "నువ్వెలాగ.... జేన్యా?"

"దాని దేముంది, వెళ్ళగలిగాను!" జేన్యా సవాలు చేస్తున్నట్లు చూస్తూ, తన రాగి

జుట్టు జాడించింది. "నువ్వు నన్నిప్పుడో, లేకపోతే నిద్రగంట కొట్టాకో సంస్కరించాలని చూస్తున్నావా?"

జేన్యా అనుభవం విన్నాక తనేదో అసాధారణురాలినన్న అహంభావం కాస్తా రీతాను వదిలిపోయింది. మరో చిత్రమేమిటంటే, రీతా కాఠిన్యం కరిగిపోయినట్టూ, ఆమె మనస్సులో శిలీభూతమైనదేదో మెత్తబడినట్టూ కనిపించింది. ఇప్పుడామె మధ్యమధ్య నవ్వుతోంది, ఇతర యువతులతో కలిసి పాటలు పాడుతోంది కూడా. కాని ఆమె జేన్యాతో ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే పూర్తి సహజంగా ప్రవర్తిస్తోంది.

రాగిజుట్టు జేన్యా, తన జీవితం ఎంత విషాదభూయిష్టమైనదైనా కూడా, అందరితోనూ ఎంతో కలిసిమెలిసి వుండటమే కాకుండా ఎంతో కొంటెగా కూడా వుండేది. ఒక్కో సారి ఏ లెఫ్టినెంటునో ప్రేమాన్వడజేసి మొత్తం సెక్షన్ అంతనీ వినోదపరిచేది, మరో సారి వృత్తినాట్యకత్తె మాదిరిగా, ఇతర యువతులు ల—ల—లా అంటూ వంతపాడగా, ఎంతో నిపుణంగా జిప్సీ నాట్యం చేసేది, ఇంకో సారి ఆకస్మికంగా ఏ నవల కథనో ఏకరువు పెట్టేది — వాళ్లు సమ్మోహితులై వినేవారు.

"నువ్వు నిజానికి రంగస్థల నటివి కావలసింది జేన్యా!" కిర్యానోవా దీర్ఘనిశ్వాసం విడిచి అంది. "నీ ప్రతిభాసామర్థ్యాలను నువ్వు వృథాచేస్తున్నావు!"

రీతా జాగ్రత్తగా పదిలపరచుకొంటూ వచ్చిన ఒంటరిపాటుతనం యీ విధంగా భగ్నమైంది. జేన్యా అన్నింటినీ కదిపి కుదిపి వదిలిపెట్టింది. వాళ్ల యూనిట్‌లో దుర్బలంగా, వుసూరుమంటూ కనిపించే గాల్యా చెత్‌వెర్తాక్ అనే అమ్మాయి ఒకత్తె వుండేది. ఎముకలు పైకి పొడుచుకొచ్చి, కొనదేలిన దీర్ఘనాసికతో, పీచుతో అల్లిన జడల్లాంటి జుట్టుపాయలతో, మగపిల్లాడి రొమ్ములాగ అంటుకుపోయిన రొమ్ములతో వుండేది ఆ అమ్మాయి. జేన్యా ఆ అమ్మాయికి ఒళ్లంతా కందిపోయేలా పడతోమి నీళ్లు పోసింది, ఆమె జుట్టు దువ్వి చక్కగా అమర్చింది, ఆమెకి నప్పేలాగ దుస్తులకి మార్పులు చేసింది, దానితో గాల్యా వికసిత పుష్పంలా కనిపించింది. ఆకస్మికంగా ఆమె కళ్లు మెరవసాగాయి, ఆమె పెదవులపై చిరునవ్వు విరిసింది, ఇంతకీ ఆమెకు రొమ్ములున్నట్టు మిగిలిన యువతులు ఆకస్మికంగా గమనించారు. జేన్యా లేనిదే గాల్యా ఒక్క అడుగు కూడా ఎక్కడికీ వెళ్లడం లేదేమో, యిప్పుడిక వాళ్లు ముగ్గురయ్యారు: రీతా, జేన్యా, గాల్యా.

విమాన విధ్వంసక శతఘ్నిదళ సైనికులు యుద్ధరంగంనుంచి, ఎక్కడో వున్న రైల్వే స్టేషనుకు బదిలీచెయ్యబడుతారన్న వార్త తెలియడంతో వాళ్లలో అందుకు తీవ్రమైన అభ్యంతరాలు తలెత్తాయి. ఒక్క రీతా మాత్రమే కిమన్నాస్తిగా ఊరుకుంది. ఆమె కేంద్ర కార్యాలయానికి పరుగెత్తుకెళ్లి, మ్యాప్‌ను పరిశీలించి: "నా సెక్షన్‌ని పంపండి" అంది.

ఆ యువతులు విభ్రాంతులయ్యారు, జేన్యా తిరుగుబాటు జెండా ఎగరేసింది, కాని

ఆ మరుసటి ఉదయానికల్లా చల్లబడింది — ఇప్పుడిక ఆమె ఆ బదిలీ కోసం గొడవచెయ్యు నారంభించింది. ఎందుకు, కారణమేమిటన్నది ఏ ఒక్కరికీ అంతు చిక్కలేదు, అయినా కూడా వాళ్ళు తమ అభ్యంతరాలకు స్వస్తిచెప్పారు. వాళ్ళకి జేన్యాలో పూర్తి విశ్వాసముంది కనుక వాళ్ళు వెళ్ళాలి, అంతే. వాళ్ళు మాట్లాడటం మానేసి బదిలీకి సన్నాహాలు చేసుకోనారంభించారు. కొత్త స్థావరానికి చేరుకోగానే రీతా, జేన్యా, గాల్యాలు అకస్మాత్తుగా చక్కెరలేని టీ తాగ నారంభించారు.

ఓ మూడు రాత్రుల తర్వాత రీతా క్యాంపునుంచి మాయమైంది. ఆమె ఫ్లైరింజను షెడ్డులోంచి పాక్కుంటూ బయటకెళ్ళి, ఒక ఛాయలాగ నిద్రాముద్రితమైన స్టేషన్‌ని దాటి, మంచు నీటి బొట్లతో తడిసిన ఆల్డర్ తుప్పలలో అంతర్థానమైపోయింది. చెట్ల కొమ్మలతో జీబురుగా వున్న అటవీ మార్గం గుండా ముందుకెళ్ళి, మెయిన్ రోడ్డును చేరుకొని, అక్కడ తటస్థపడిన మొట్టమొదటి లారీని ఆపుచేసింది.

దుబ్బుమీసాల సైనికుడు "దూరం పోతున్నావా, చుక్కా?" అని ప్రశ్నించాడు. రాత్రి పూటల్లో లారీలు మందుగుండు సామగ్రి తెచ్చేందుకని యుద్ధ రంగపు వెనక భాగానికి పోతూవుంటాయి. వాటిని నడిపేవాళ్ళు నియమ నిబంధనలను అంతగా లెక్కచెయ్యరు.

"నన్ను కాస్త పట్నానికి తీసుకుపోతారా?"

లారీ వెనకబాడీలోంచి ఆమెకు ఆసరా యిచ్చేందుకని చేతులు ముందుకు సాగాయి. అనుమతి కోసం వేచియుండకుండానే రీతా చక్రంపైకెక్కి ఆ మరుసటి క్షణానికల్లా లారీలోకి చేరుకుంది. లారీలో వున్నవాళ్ళు ఆమెను కాన్వాసు గుడ్డపై కూర్చోబెట్టి, వెచ్చని కోటొకటి ఆమె భుజంపైన కప్పారు.

"ఓ గంట సేపు కునుకు తియ్యి బుల్లీ...."

మరుసటి ఉదయం ఆమె తిరిగి తన స్థానంలో వుంది.

"లీదా, రాయా — డ్యూటీ కెళ్ళండి!"

ఎవరూ ఆమెను గమనించనే లేదేమోననే అనిపించింది, కాని కిర్యానొవా కనిపెట్టేసింది — ఎవరో ఆమెకు ఉప్పందించారు. కిర్యానొవా ఏమీ అనలేదు, కాని తనలో తానే నవ్వుకుని ఊరుకుంది.

"అయితే ఎవరితోనూ కలవని యీ అహంకారి రీతాకి ఎవరో ప్రియుడున్నాడన్న మాట. సరే, బహుశా దీనితో యీవిడగారు మెత్తబడుతుందేమోలే...."

ఈ వ్యవహారాన్ని గురించి ఆమె వస్కోవ్‌కి తెలియజెయ్యలేదు. మనలో మన మాట, వస్కోవంటే ఆ యువతుల్లో ఏ ఒక్కరికీ — రీతాకైతే బొత్తిగా — భయం లేదు. అతను స్టేషన్లో బలాదూరు తిరిగే పాతకాలపు విద్యార్థపు మనిషి, అంతమాత్రమే. అతనికి వచ్చిన మాటలన్నీ కలిపితే ఓ ఇరవై వుంటాయి. అవైనా సైనిక నిబంధనలకు సంబంధిం

చినవి. అలాంటి ముసలితొక్కుని ఈ ప్రపంచంలో సీరియస్‌గా ఎవళ్లు పట్టించుకోగలరు?

కాని పద్ధతి పద్ధతే, అందునా ముఖ్యంగా సైన్యంలో మరీను. ఆ పద్ధతి మేరకు, ఒక్క జేన్యా, గాల్యా చెత్‌వెర్తాక్‌లను మినహాయించి రీతా రాత్రి యాత్రలను గురించి మరెవ్వరికీ తెలియకుండా ఉండటం అవసరం.

పట్టణానికి ఆమె చక్కెరే కాదు, బిస్కట్లే కాదు, రెడీ మిక్స్ జొన్న జావే కాదు, ఒక్కొక్క సారి ఉడకబెట్టిన మాంసం సైతం తీసుకెళ్తూండేది. విజయోన్మాదం తలకెక్కిన రీతా వారంలో రెండు మూడు రాత్రులు పట్టణానికి వెళ్లడం మొదలుపెట్టింది. కళ్లు గుంటలు పట్టి ఆమె నీరసంగా కనిపించ నారంభించింది. జేన్యా ఆమె చెవిలో చివాట్లు పెడుతున్నట్లు అంది: "ఏయ్ అమ్మాయ్, నువ్వు అతిగా పోతున్నావనుకుంటా. ఏ కాపలా సైనికుడో పట్టుకుంటాడు, లేకపోతే ఏ ఆఫీసరో పసిగట్టాడంటే నీ పని అవుతుంది."

"నువ్వు వాగబోకు జేన్యా, నన్ను పట్టుకోవడానికి వీళ్ల తాతలు దిగిరావాలి!"

ఆనందాతిరేకంతో ఆమె కళ్ళు మెరిసిపోతున్నాయి. అటువంటి స్థితిలో వున్నవాళ్లతో ఎవరైనా గంభీరంగా ఏం మాట్లాడగలరు? కాని జేన్యా ఆదుర్దా తగ్గలేదు.

"జాగ్రత్త రీతా!"

కిర్యానోవా ఓర చూపులను బట్టీ, ముసిముసి నవ్వులను బట్టీ ఆమెకు తన రాత్రి యాత్రలను గురించి తెలుసునన్న సంగతిని రీతా త్వరలోనే గ్రహించింది. ఈ ముసిముసి నవ్వుల్ని చూస్తూంటే, చనిపోయిన తన భర్తకు తనేదో నిజంగానే ద్రోహంచేసిందన్నట్లు, గుండెల్లో గునపాలు దింపినట్లున్నాయి. ఆమె ముఖం జేవురించింది, కిర్యానోవాకి తన తడాఖా కొంచెం చవి చూపిద్దామనుకుంది, కాని జేన్యా ఆమెను నివారించి, చెయ్యి పట్టుకొని పక్కకి లాక్కుపోయింది.

"రీతా, ఆవిడగార్ని తన యిష్టం వచ్చినట్లనుకోనియ్, నువ్వేం పట్టించుకోకు!"

రీతా తన మనస్సును కూడదీసుకుంది, జేన్యా చెప్పింది సరైనదే కదా. ఆవిడగారు తనను ఏమీ అనకుండా, తన వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోకుండా, వస్కోవ్‌కి ఫిర్యాదు చెయ్యకుండా ఉన్నంత కాలం తనని గురించి ఎంత ఘోరంగానైనా అనుకోనీ. వ్యవహారం ఆ వస్కోవ్ దాకా వెళ్తే అతను అదే పనిగా సాగదీస్తాడు — దానికి అంతంటూ ఉండదు. ఇంతకు ముందే ఇలాంటి వ్యవహారమొకటి జరిగింది: మొదటి సెక్షనుకి చెందిన యిద్దరు యువతులు నదికి అవతలి పక్కన సార్జెంటు మేజరుకి పట్టుబడ్డారు. వాళ్లకి అతను నీతి సూత్రాలపైన ఓ పెద్ద ఉపన్యాసమిచ్చాడు, అది నాలుగు గంటలు, మధ్యాహ్న భోజనం తర్వాతనుంచి సాయంత్రపు భోజన సమయం దాకా సాగింది. అప్పుడే అతను తన సొంత సలహాలూ, ఆదేశాలతో బాటు, నియమ నిబంధనల పుస్తకాన్ని వాళ్ల ముఖాన కొట్టాడు. ఈలోగా కనీసం మూడు సార్లు గుడ్ల నీళ్లు కుక్కుకొని, ఆ యువతులు తామిక మళ్లీ

ఎన్నడూ నది దాటి వెళ్లకూడదనీ, అసలు క్యాంపునుంచే బయటకు వెళ్లకూడదనీ నిర్ణయించుకున్నారు.

తర్వాత కూడా కిర్యానొవా తన మౌనాన్నే కొనసాగించింది.

వాయు రహితము, ప్రశాంతమైన శ్వేత రాత్రులు మొదలయ్యాయి. సూర్యాస్తమయానికీ సూర్యోదయానికీ మధ్య సుదీర్ఘ కాలముండే స్పష్టాస్పష్ట కాంతిలో, గడ్డి పూలు మత్తెక్కించే సువాసనలు గుబాళిస్తూండగా శతఘ్ని దళ యువతులు ఫైరింజను షెడ్డు బయట కూర్చొని తెల్లవారు జాము దాకా పాటలు పాడుతూండేవారు. రీతా యిప్పు డొక్క వస్కోవ్ కంటపడకుండా తప్పించుకునేందుకు మాత్రమే ప్రయత్నిస్తోంది, మూడు రోజులకు ఒక్క రాత్రి చొప్పున రాత్రి భోజనం ముగియగానే బయల్దేరి, ఉదయం మేలుకొలుపు వాయిద్యం మ్రైముకి ముందు క్యాంపుకి తిరిగి వచ్చేస్తోంది.

అన్నింట్లోకీ ప్రత్యూష సమయంలో తిరిగి రావడమంటే రీతా చాలా యిష్టపడేది. కాపలా సైనికులకు చిక్కడమనే ప్రమాదం యిప్పుడు బాగా వెనకపట్టింది. ఇప్పుడామె తన రెండు బూట్లనీ కలిపి ముడేసి భుజాన వేలాడేసుకొని, మంచు బిందువులతో నాని పాదాలు జివ్వుమని తీపులెడుతూండగా గడ్డిని సరసర తొక్కుకుంటూ దిసపాదాలతో రాగలుగుతోంది. అలా నడుస్తూ ఆమె తన యాత్రను గురించీ, తన తల్లి చేసే అభియోగాలను గురించీ, యీసారి మళ్లీ తను చెప్పకుండా తీసుకునే దొంగసెలవు గురించీ ఆలోచిస్తూ గడ్డిపైన చకచక నడుస్తూ పోతూండేది. దాదాపుగా యితరు లెవ్వరి అభీష్టాన్ని గురించీ పట్టించుకోకుండా, తన తదుపరి యాత్రను గురించి తనే పథకం వేసుకోగలగడం రీతాను మహదానంద పరవశురాలిని చేసింది.

కాని యుద్ధం, మానవ జీవితాలతో — విచిత్రంగానూ, దుర్గ్రాహ్యమైన పద్ధతిలోనూ ఒకటి మరొక దానితో ముడివడిన జీవితాలతో — తన చిత్తం వచ్చినట్టు చెలగాటమాడుతూ సాగుతూనే వుంది. జూనియర్ సార్జెంట్ మర్గరీతా ఒస్యానినా ప్రశాంతమైన 171వ స్టేషన్ కమాండెంటును బురిడీకొట్టించడంలో ఒక వంక హడావిడిగా నిమగ్నురాలై యుండగా, మరో వంక "సైనిక అధికార్లకు మాత్రమే" అన్న గమనికతో కూడిన C 219/702 నంబరు గల ప్రభుత్వ ఆదేశం పైన అప్పటికే సంతకాలు జరిగాయనీ, అది అమలుజరపబడబోతున్నదనీ ఆమెకు చూచాయగా కూడా తెలియదు.

3

ప్రత్యూషాలిక్కడ ప్రశాంతంగా, చాలా ప్రశాంతంగా ఉన్నాయి.

తన బూట్లు భుజంపైన అటూ యిటూ ఊగిసలాడుతూండగా రీతా దిసపాదాలతో గడ్డిపై సరసర నడిచి వస్తోంది. ఇటూ అటూ దట్టంగా లేస్తున్న పొగమంచు ఆమె పాదాలను

చల్లబారజేసి, ఆమె దుస్తులకంతా పట్టేసింది. స్టేషనువారనున్న పరిచితమైన ఒక చెట్టు మొద్దు పైన కూర్చొని పొడి మేజోళ్లనూ బూట్లనూ ఎప్పుడు తొడుక్కుందామా అని ఎదురుచూస్తోంది రీతా. ఈ రోజు లారీ దొరకడం ఆలస్యమైందేమో ఇప్పుడామె హడావిడి పడుతోంది. వస్కోవ్ రోజూ చాలా పెందరాళే లేచి గిడ్డంగి తాళాలు తనిఖీచెయ్యడానికి వెళ్తాంటాడు. రీతా అడవిలోంచి సరిగా అక్కడికే చేరుకోవాలి — ఆమె కూర్చునే చెట్టుమొద్దు పొదల వెనకనున్న కొయ్యదుంగల గోడకి రెండంగల దూరంలో వుంది.

మరో రెండు మలుపులు తిరగడం, అటు తర్వాత ఆల్డర్ పొదగుండా నేరుగా ముందుకెళ్లడం, అంతే ఆమె మొద్దును చేరుకుంటుంది. రీతా మొదటి మలుపు తిరిగి అంతలోనే నేలకి కరుచుకుపోయింది. రోడ్డుపైన ఎవరో నిలబడివున్నారు.

అతనక్కడ నిలబడి వెనక్కి చూస్తున్నాడు. అతను పొడుగ్గా వున్నాడు, వాటర్ ప్రూఫ్ కేమోఫ్లేజ్ కేప్*ను ధరించాడు, అది మడత పెట్టబడి అతని నడుం పైన ఉబ్బెత్తుగా వుంది. అతని కుడిచేతిలో పట్టీలతో బిగింపబడిన పొడవాటి ప్యాకేజి వుంది. అతని రొమ్ముపైన సబ్‌మెషీన్ గన్ వుంది.

రీతా పొదల్లోకి తప్పుకుంది. అవి ఆమెను మంచు బిందువులతో నాన్చివేశాయి, కాని ఆ విషయం ఆమెకి స్పృహ లేదు దాదాపుగా ఊపిరి బిగబట్టి, తన మార్గానికి అడ్డంగా, ఏదో పీడకలలోంచి వచ్చి, స్థాణువులా నిలబడ్డ ఆ ప్రాణి వంక నిశ్చలంగా, అంత దట్టంగా లేని ఆకుల సందుగుండా ఆమె చూడసాగింది.

అడవిలోంచి మరొకడు కనిపించాడు. అతను ముందువాడి కంటె కొంచెం పొట్టిగా వున్నాడు. అతను కూడా ఒక సబ్‌మెషీన్ గన్నుని రొమ్ము మీదకి వచ్చేలా వేలాడదీసుకున్నాడు, అతని చేతిలో కూడా సరిగా ముందువాడి చేతిలో వున్న మాదిరి ప్యాకేజీయే వుంది. వాళ్ళు, తిన్నగా ఆమె వంకకే, లేసులు బిగించిన పొడుగు బూట్లు ధరించిన కాళ్లను మంచుతో నానిన గడ్డిపై నిశ్శబ్దంగా వేస్తూ, మౌనంగా నడుస్తున్నారు.

రీతా తన పిడికిలిని నోట్లో కుక్కుకొని, పళ్లతో దాన్ని నొప్పి పుట్టేటంత గట్టిగా గిట్టకరిచి పట్టింది. ఏం జరిగినాసరే తను కదలమెదలకూడదు, అరవకూడదు, పొదల గుండా పరిగెత్తకూడదు. వాళ్ళు సరిగా ఆమె పక్కనుంచే దాటి వెళ్లారు, ఆమె పక్కనుంచి వెళ్లినవాడి భుజం, ఆమె దాగున్న పొదల రెమ్మలకు రాసుకునేటంత దగ్గరగా వెళ్లారు. వాళ్లు మౌనంగా, నిశ్శబ్దంగా, నీడల మాదిరిగా నడుస్తూ ముందుకెళ్లి కనుమరుగయ్యారు.

---

* శత్రువుల దృష్టినుండి తనను తాను మరుగు పరచుకోవడానికి గాను భుజాల పైన కప్పుకొనే తొడుగు. — అను.

రీతా కొంత సేపు నిరీక్షించింది, కాని మరెవ్వరూ రాలేదు. ఆమె జాగ్రత్తగా పొద లోంచి బయటకొచ్చి, రోడ్డుకి అడ్డంగా దూసుకెళ్లి, ఒక పొదలో దూరి, వింటూ నిలబడింది.

అంతా ప్రశాంతంగా వుంది.

ఎగరొప్పుతూ, బూట్లు తన వీపును తాటిస్తూండగా ఆమె ఉన్మత్తావేశంతో ముందుకు పరుగెత్తింది. మరుగు కోసం తాపత్రయపడకుండా, నిద్రాముద్రితమై యున్న గ్రామ వీధుల గుండా దూసుకెళ్లి "కామ్రేడ్ కమాండెంట్! సార్జెంట్ మేజర్!" అని అరుస్తూ, లోపల గడియ పెట్టి వున్న తలుపును దబదబా బాదింది.

చివరకు కొంత సేపటికి తలుపు తెరుచుకుంది. సైనిక ఇజారూ, క్యాలికో కంటి మెడ షర్టూ ధరించి, స్లిప్పర్లలో దూర్చిన దిసపాదాలతో వస్కోవ్ ఎదురుగా నిలబడ్డాడు. నిద్రమత్తులో అతను తన కళ్లు మిటకరిస్తున్నాడు.

"ఏమిటి సంగతి?"

"అడవిలో జర్మన్లున్నారు!"

"హుఁ...." అంటూ వస్కోవ్ అనుమానంగా తన కళ్లను చికిలించాడు. బహుశా ఆమె తనను ఎగతాళికోసం తమాషాచేస్తూ వుండచ్చు.

"నీకెలా తెలుసు?"

"నేను వాళ్లని కళ్లారా చూశాను. ఇద్దరున్నారు వాళ్లు. సబ్‌మెషీన్ గన్నులతోనూ, కేమఫ్లేజ్ కేప్‌లతోనూ...."

ఆమె నిజం చెప్తున్నట్లే వుంది. ఆమె కళ్లు భయభీతంగా కనిపించాయి.

"ఇక్కడే వుండు" అంటూ సార్జెంట్ మేజరు యింట్లోకి దూసుకెళ్లాడు, బూట్లు తొడుక్కున్నాడు, కోటు తొడుక్కున్నాడు. రాత్రి దుస్తుల్లో మంచంమీద కూర్చొని వున్న మరీయా నికీఫొరొవ్నా నిర్ఘాంతపోయి చూస్తోంది.

"ఏం జరిగింది?"

"ఏం లేదు. నీకు సంబంధించిందేం కాదులే."

తన రివాల్వరు బెల్టు బకిల్సు బిగించుకుంటూ అతను వీధిలోకి దూసుకుపోయాడు. రీతా అంతకు ముందు ఏ స్థానంలో నిలబడిందో యిప్పుడు కూడా సరిగా అదే చోట నిలబడివుంది, బూట్లింకా ఆమె భుజంపైనే వేలాడుతున్నాయి. సార్జెంట్ మేజరు అప్రయత్నంగానే ఆమె పాదాల వంక చూశాడు. అవి ఎర్రగా, తడితడిగా వున్నాయి, ఆమె బొటన వేలొకదానికి ఒక ఆకు తగులుకొని వుంది. అదీ సంగతి, యీావిడగారు బూట్లు భుజానికి వేలాడేసుకొని, అడవిలో దిసపాదాలతో, విహరిస్తోందన్న మాట. భేష్ భేష్, యిటీవల వీళ్లు పోరాడుతున్న పద్ధతి యిదన్నమాట!

''అందరూ! వెంటనే మీమీ రైఫిళ్ళు తీసుకుని బారుతీరి నిలవండి. కిర్యానోవాని తీసుకురండి! అర్జెంటుగా!''

వాళ్ళు తలో పక్కకీ పరుగెత్తారు: ఆ యువతి ఫైరింజను షెడ్డు కేసీ, అతను టెలిఫోను వున్న సిగ్నల్ బాక్సు దగ్గరకీ పరుగెత్తారు. తను హెడ్ క్వార్టర్సుతో సంప్రదించగలిగితే బాగుండునని అతను ఆశించాడు!

'' 'పైన్,' 'పైన్....' ఓరి భగవంతుడా! వీళ్ళు నిద్రపోతున్నారా, లేకపోతే సంబంధం తెగిపోయిందా.... 'పైన్....' 'పైన్....' ''

''ఆఁ, యిక్కడా 'పైనే.' ''

''పదిహేడు మాట్లాడుతున్నాను. లైను కలుపు. అర్జెంటుగా, అత్యవసర పరిస్థితి!''

''కలుపుతున్నాను, అరవబోకు.... అత్యవసర పరిస్థితిలాగే వుంది!''

కొంత సేపు అతనికి యీలలూ, గురగుర శబ్దాలూ వినవచ్చాయి, తర్వాత సుదూర స్వరమొకటి ప్రశ్నించింది:

''వస్కోవ్, నువ్వేనా? ఏం జరిగింది?''

''నేనే, వస్కోవ్‌ని మాట్లాడుతున్నాను, కామ్రేడ్ మూడూ. మా స్థావరానికి దగ్గర అడవిలో జర్మన్లున్నారు. మేమీ రోజున యిద్దర్ని కనుక్కున్నాం....''

''ఎవరు కనుక్కున్నారు వాళ్ళని?''

''జూనియర్ సార్జెంట్ ఒస్యానినా....''

కిర్యానోవా లోపలికొచ్చింది. — అన్నట్టు, ఆమె తన సైనిక టోపీ పెట్టుకోలేదు. ఏదో పార్టీకి అప్పుడే వచ్చినట్లు ఆమె అతని వంక తన తలను ఊపింది.

''ప్రమాద హెచ్చరిక చేశాను, కామ్రేడ్ మూడూ. అడవి గాలించాలనుకుంటున్నాను....''

''కొంచెమాగు వస్కోవ్. ఈ విషయంలో కొంచెం ఆలోచించడం అవసరం. మనం స్థావరాన్ని అరక్షితంగా వదిలివెళ్తే శభాషంటూ మనల్ని ఎవరూ అభినందించరు. అన్నట్లు చూపులకు మీ ఆ జర్మన్లెలా ఉన్నారు?''

''కేమఫ్లేజి కేప్‌లూ, సబ్‌మెషీన్ గన్నులతో ఉన్నారని చెప్తోందామె. రికన్నాయిటర్* చేస్తున్నారు....''

''రికన్నాయిటర్ చేస్తున్నారా? వాళ్ళకి అంత ఆసక్తిదాయకమైనది మీ దగ్గర అక్కడే ముందబ్బా? నువ్వు మీ గృహ యజమానురాలితో ఎలా పడుకుంటావనా?''

---

* శత్రువుల ఆనుపానులనూ, శత్రు బలగాలనూ తెలుసుకునేందుకు జరిపే పూర్వ పర్యవేక్షణ (రికానిజాన్స్). — సం.

ఎప్పుడూ యిదే వరస, వస్కోవ్ ఎప్పుడూ తప్పు అంచనాయే వేస్తాడు. అన్ని సంద ర్భాల్లోనూ తప్పు అతని నెత్తినే పడుతూవుంటుంది.

"చెప్పు చెప్పు, వస్కోవ్! ఇంతకీ నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్?"

"వాళ్లు మరీ దూరం వెళ్లిపోకముందే మనం వాళ్లని పట్టుకోవాలనుకుంటున్నాను, కామ్రేడ్ మూడూ."

"కరెక్ట్. నీ నాయకత్వంలో ఉన్న వాళ్లలో అయిదుగుర్ని తీసుకుని, జాడలు మాసి పోకముందే వేగంగా వెంబడించు. కిర్యానొవా అక్కడుందా?"

"ఇక్కడే వుంది కామ్రేడ్...."

"ఆమెకి ఫోనియ్యి."

కిర్యానొవా క్లుప్తంగా మాట్లాడింది. రెండు సార్లు ఆమె "బోధపడింది" అంది, అయిదు సార్లో ఏమో "అలాగే"నంటూ తన ఆమోదం తెలిపింది. ఆమె ఫోను పెట్టేసి, "ఆజ్ఞ ఏమిటంటే, మీకు ఐదుగురు సైనికుల్ని యివ్వాలని...."

"వాళ్లని చూసినామెని నాతో పంపు."

"ఒస్యానినాయే బాధ్యత వహిస్తుంది."

"సరే. నీ సైనికుల్ని సంసిద్ధంచెయ్యి."

"వాళ్లు సంసిద్ధంగానే వున్నారు."

వాళ్లని చూసిన వాళ్లెవళ్లూ వాళ్లని సైనికులనలేరు. ఒకామె జుట్టు వీపు మీదుగా నడుందాకా జూలులా వేలాడుతోంది. మరొకామె జుట్టులో కాగితం ముక్కలు కనిపిస్తున్నాయి. ఓహ్, బలే పోరాటయోధులు! ఈ మేళంతో అడవిని గాలించడం, సబ్‌మెషీన్ గన్నులున్న జర్మన్లను పట్టుకోవడం – కొంచెం ఊహించుకోండి! వాళ్ళకున్నవల్లా 1930 దశకంలో ఆధునికంచెయ్యబడిన 1891 నమూనా కొన్ని పాత రష్యన్ రైఫిళ్లు మాత్రమే....

"ఎట్ ఈజ్!"

"జేన్యా, గాల్యా, లీజా...."

సార్జెంట్ మేజర్ రుసరుసలాడాడు.

"ఒక్క నిమిషం ఆగు, ఒస్యానినా! మనం వెళ్తున్నది జర్మన్లని పట్టుకోడానికి, చేపలు పట్టడానికి కాదు. కనీసం, తుపాకి కాల్చగల పిల్లలు కావాలి...."

"వాళ్లు కాల్చగలరు."

వస్కోవ్ తన భుజాలెగరెయ్యబోయాడు, కాని అంతలోనే ఆగి, యిలా అన్నాడు: "అన్నట్టు మరో విషయం. మీలో ఎవరికైనా జర్మన్ భాష వచ్చా?"

"నా కొచ్చు."

కీచు గొంతుకొకటి వినిపించింది, మాట్లాడిందెవరో గాని ముందుకైనా రాలేదు. దానితో సార్జెంట్ మేజరు తికమకపడ్డాడు.

"మాట్లాడిందెవరు? సరిగా ముందుకొచ్చి నిలబడు."

"ప్రైవేట్ గూర్విచ్."

"నువ్వా, సరే.... 'చేతులెత్తు' అనడానికి జర్మన్లో ఏం చెప్తావ్?"

"హేండె హోఫ్!"

"కరెక్ట్!" సార్జెంట్ మేజర్ యీ సారి నిస్సంకోచంగా భుజాలెగరేశాడు. "సరే, నువ్వు రా గూర్విచ్...."

ఆ ఐదుగురూ బారుతీరారు. వాళ్ల ముఖాలు బాల్యసహజమైన గాంభీర్యంతో నిండి వున్నాయి, కాని వాటిలో యింకా భయం చిన్నెలు లేవు.

"మనం రెండు రోజులపాటు బయటకు వెళ్తున్నాం అనుకుని తయారుకావాలి. మనం భోజన పదార్థాలూ, ఒక్కొక్కళ్ళు ఐదేసి బార్ల చొప్పున తూటాలూ తీసుకోవాలి. ఇప్పుడు మీరు దిట్టంగా దాణా వేసుకోండి. మీ కడుపులు బాగా నిండేటట్టు చూసుకోండి. కాళ్లకు పట్టీలు బాగా చుట్టుకోండి. మిగతా అన్ని జాగ్రత్తలూ తీసుకోండి. అంటే, సిద్ధంకండి. మొత్తం అన్నింటికీ నలభై నిమిషాల టైమిస్తున్నాను. డి-స్మి-స్! కిర్యానొవా, ఒస్యానినా మీ యిద్దరూ నాతో వుండండి."

ప్రైవేట్లు నాస్తా చేసి ప్రయాణానికి సన్నద్ధులవుతూండగా, సార్జెంట్ మేజరు నాన్ కమిషన్డ్ ఆఫీసర్లిద్దర్నీ సమావేశం కోసం తన మకాముకి తీసుకుపోయాడు. అదృష్టవశాత్తూ గృహ యజమానురాలు కనుమరుగైంది, కాని పక్కని మటుకు చుట్టకుండా యథాతథంగానే ఉంచేసింది, రెండు తలగడాలూ మహా ప్రేమగా ఒకదాని సరసన మరొకటి ఉన్నాయి. సార్జెంట్ మేజరు నాన్ కమిషన్డ్ ఆఫీసర్లకు పల్చటి సూపు తాగడానికిచ్చి అంచులు మణిగిపోయిన పెద్ద సైజు మ్యాపును చూడనారంభించాడు.

"నీకు వాళ్ళు ఎదురుపడినది యీ రోడ్డు మీదేనా?"

ఒస్యానినా మెల్లగా మ్యాపును ముట్టుకొని "సరిగ్గా యిక్కడే" అని చెప్పింది. "మెయిన్ రోడ్డు వంకకి వెళ్తూ వాళ్లిక్కడ నన్ను దాటారు."

"మెయిన్ రోడ్డు వంకకా? అయినా నాలుగు గంటల వేళప్పుడు నువ్వు అడవిలో ఏం చేస్తున్నట్టు?"

ఒస్యానినా బదులు చెప్పలేదు.

కిర్యానొవా పైకి చూడకుండా "ఆమె తన అవసరాలు తీర్చుకోడానికెళ్లింది" అని చెప్పింది.

"అవసరాలా?" అంటూ వస్కోవ్ మండిపడ్డాడు. అది అబద్ధమనడం స్పష్టం,

సరే. "నేను మీ అవసరాల కోసం స్వయంగా మరుగు దొడ్డి తయారుచేశాను కదా? లేకపోతే మీకు అందులో చోటు సరిపోవడం లేదా?"

వాళ్లిద్దరూ కూడా కోపంతో కనుబొమలు ముడేశారు.

"మీకు తెలుసా, కామ్రేడ్ సార్జెంట్ మేజర్, కొన్ని ప్రశ్నలకి ఆడాళ్లు జవాబివ్వాల్సిన అవసరం లేదు" ఈ సారి కూడా కిర్యానొవాయే మాట్లాడింది.

సార్జెంట్ మేజరు "ఇక్కడ ఆడాళ్లెవరూ లేరు!" అంటూ గర్జించి, అరచేత్తో బల్లపై గట్టిగా చరిచాడు. "ఒక్కళ్లు కూడా లేరు! ఇక్కడున్నదల్లా సైనికులూ, ఆఫీసర్లూ, అంత మాత్రమే. బోధపడిందా? జరుగుతోన్నది యుద్ధం, అది ముగిసే దాకా, మనమంతా కూడా తృతీయా ప్రకృతులం, అంతే."

"ఓహో, అందుకేనా ఏమిటి మీ పక్క యిలా చుట్టకుండా ఉన్నది, తృతీయా ప్రకృతి కామ్రేడ్ సార్జెంట్ మేజర్‌గారూ...."

ఈ కిర్యానొవా ఎలాంటి విషప్పురుగు! విషకుంభం!

"అయితే వాళ్లు మెయిన్ రోడ్డు కేసి వెళ్తున్నారంటావ్, అంతేనా?"

"ఔను, ఆ వేపుకే...."

"వాళ్ల బొందలాగుంది, మెయిన్ రోడ్డు వాళ్లకి తగిన స్థలం కాదు. మెయిన్ రోడ్డుకి రెండు పక్కలా వున్న అడవి ఎనకెప్పుడో ఫిన్నిష్ యుద్ధంలోనే నరికెయ్యబడింది, అటు వెళ్తే వాళ్లని త్వరలోనే మెళ్లకు తాళ్లేసి గుంజుకెళ్తారు. అది కాదు కామ్రేడ్స్, మెయిన్ రోడ్డు కాదు వాళ్లని ఆకర్షించేది.... సరే, కానియ్యండి, నాస్తా కానియ్యండి."

"అక్కడ పొదలున్నాయి, పొగమంచూను. నేను చూశాననుకున్నాను...." అంది ఒస్యానినా.

"ఏవో కనిపించాయనుకున్నప్పుడు నువ్వు స్వయంగా దాటి వెళ్లి చూసివుండాల్సింది" అంటూ గొణిగాడు కమాండెంటు. "వాళ్ల చేతుల్లో ప్యాకేజీలున్నాయని కదూ, నువ్వన్నది?"

"ఔను. అవి బరువుగా ఉన్నట్లు కనిపించాయి. వాళ్లు వాటిని తమ కుడిచేతుల్తో మోసుకు తీసుకెళ్తున్నారు. ఆ ప్యాకేజీలు చాలా నీటుగా ప్యాక్ చేసి వున్నాయి."

సార్జెంట్ మేజరు ఓ పెద్ద సిగరెట్టు చుట్టుకుని, అంటించి, కాస్త అటూ యిటూ పచార్లు చేశాడు. మెరుపులా అతనికొక ఆలోచన తట్టడంతో అతను చాలా గాభరాపడ్డాడు.

"వాళ్లు ప్రేలుడు సామగ్రి తీసుకెళ్తున్నారనిపిస్తోంది నాకు. నా ఊహ సరిఅయినదే అయితే వాళ్లు మెయిన్ రోడ్డుకి కాక, రైల్వే లైనుకి వెళ్తారు. కీరొవ్ లైనుకే అవుతుంది.

"కీరొవ్ లైను యిక్కడికి చాలా దూరం కదా" కిర్యానొవా సంశయం వెలిబుచ్చింది."

"అయితేనేం మొత్తం అడవి మార్గమే కదా. అందులోనూ ఎలాంటి అడవి యిదీ! ఇద్దరు మనుషుల్నే కాదు మొత్తం ఒక సైన్యాన్నే మరుగుపరచగలిగినంత అడవి."

''అదే నిజమయ్యే మాటైతే'' అంటూ ఎంతో ఆదుర్దా వ్యక్తంచేసింది ఒస్యానినా, ''రైల్వే కావలి సైనికులను మనం హెచ్చరించడం అవసరం.

''ఆ పని కిర్యానొవా చేస్తుంది'' అన్నాడు వస్కొవ్. ''నేను రోజూ రాత్రి 8.30కి, 17 సంకేతంతో పంపే నివేదికలో ఆమె యీ సమాచారాన్ని పంపవచ్చు. కానియ్, ముందు నాస్తా కానియ్యి ఒస్యానినా. మనం రోజంతా నడవాల్సివుంటుంది....''

గస్తీబృందం నలభై నిమిషల్లో సిద్ధమైంది, కాని సార్జెంట్ మేజరు చాదస్తం మూలంగా గంటన్నర దాటిన తర్వాత గాని అది బయల్దేరలేదు.

''అందరూ బూట్లు విప్పండి!''

సరిగ్గా అతను ఊహించినట్లే అయింది: వాళ్లలో సగం మంది పల్చటి మేజోళ్ల పైన బూట్లు వేసుకున్నారు. మిగిలిన సగం మందీ పాదాలకు చుట్టుకునే పట్టీలు అస్తవ్యస్తంగా చుట్టబెట్టుకున్నారు. అటువంటి పాదరక్షలతో వాళ్ళు పెద్దగా పోరాటం జరిపేదేమీ ఉండదు. మూడు కిలోమీటర్లు నడిచే సరికల్లా వాళ్ల పాదాలు బొబ్బలెక్కి రక్తపు కొల్లు లవుతాయి. వాళ్లకి ఆధిపత్యం వహిస్తున్న జూనియర్ సార్జెంటు ఒస్యానినా అయినా కనీసం సరిగా చుట్టుకొంది, విశేషమే. కాని యీమె మిగిలిన వాళ్లకి ఎందుకు నేర్పలేదు.

వాళ్లకి ఆ పట్టీలు సరిగా చుట్టుకోవడం ఎలాగో నేర్పడానికి నలభై నిమిషాలూ, వాళ్ల చేత రైఫిళ్లు శుభ్రంచేయించడానికి మరో ముప్పై నిమిషాలూ పట్టిందతనికి. రైఫిల్ లోపల చెదలు పట్టనంత కాలం రైఫిల్ విషయం వాళ్లకేం పట్టింది! కాని, వాళ్లు కాల్చా లనుకోండి, మరి అప్పుడు?

సార్జెంట్ మేజరు మిగిలిన సమయాన్ని — ఆ యువతులకు సమాచారమంతా అందచెయ్యాలన్న తాపత్రయంతో — ఓ చిన్న ఉపన్యాసం ఇవ్వడంలో గడిపాడు.

''శత్రువులంటే భయపడకండి. వాళ్లు మనకి వెనకతట్టున వున్నారని గుర్తుంచు కోండి, అంటే ఏమిటన్న మాట, వాళ్లే భయపడుతున్నారన్న మాట. అయినా కూడా వాళ్లని మన సమీపంలోకి రానివ్వకండి. వాళ్లు గట్టిపిండాలు, ప్రత్యేకించి దగ్గరనుంచి పోరాడటానికి తగిన ఆయుధాలతో వున్నారు. వాళ్లొకవేళ అకస్మాత్తుగా మీ పక్కకొచ్చారను కోండి, అప్పుడు కదలమెదలకుండా నిలబడండి. సబ్‌మెషీన్ గన్నుతో పరిగెత్తే లక్ష్యాన్ని కొట్టడమంత తేలికైన పని మరొకటి లేదు. జంటలుగా నిలబడండి. వెనక పడకండి, మాట్లాడబోకండి. సరే, యీ ప్రశ్నకు జవాబు చెప్పండి, ఏ రోడ్డు దగ్గరకైనా వచ్చి నప్పుడు మీరేం చెయ్యాలి?''

''మాకు తెలుసు'' అంది ఎర్రజుట్టు యువతి. ''ఒకళ్లు కుడికీ, మరొకళ్లు ఎడ మకీ వెళ్లాలి.''

''రహస్యంగా'' జోడించాడు సార్జెంట్ మేజర్. ''మన ప్రయాణ క్రమం యిలా

వుంటుంది: జూనియర్ సార్జెంటూ, ఒక సైనికుడూ పురోగామి స్కౌట్ల మాదిరిగా ముందు వెళ్లాలి. వాళ్లకి ఒక వంద మీటర్ల వెనుక ప్రధాన బలగం వస్తుంది: నేను...." అంటూ అతను యితరుల వంక చూశాడు, "దుబాసీతో కలిసి వస్తాను. మరో వంద మీటర్ల వెనక చివరి జంట వస్తుంది. అయితే వాళ్లు ఒకరి పక్కగా మరొకరు కాక ఒకరి వెనక కనుచూపు దూరంలో మరొకరు వస్తారు. శత్రువు గాని, మరేదైనా అనుమానాస్పదమైనదిగాని కంట బడే పక్షంలో.... ఏదైనా జంతువు లాగో, పక్షి లాగో ఎవరు కుయ్యగలరు?"

ఆ పిచ్చి పిల్లలు కిసుక్కున నవ్వారు.

"నేను మిమ్మల్ని అడిగినది సీరియస్ ప్రశ్న! అడవుల్లో మీరు మీ సొంత స్వరాల్లో సంకేతాలు చేసుకోరు. జర్మన్లకి కూడా చెవులుంటాయన్న సంగతి మీకు తెలిసిందే కదా."

దీనికి ఆ యువతుల దగ్గర జవాబు లేకపోయింది.

"నేను కుయ్యగలను" చివరకు గూర్విచ్ బెదురుబెదురుగా అంది. "నేను గాడిదలా అరవగలను: హీహా, హీహా!"

"ఈ ప్రాంతంలో గాడిదల్లేవు" సార్జెంట్ మేజరు అనుత్సాహంగా వ్యాఖ్యానించాడు. "సరే, బాతుల్లాగ క్వాక్, క్వాక్ అనడం నేర్చుకుందాం."

అతను ఎలా అనాలో ప్రదర్శించాడు, దానితో వాళ్లు పగలబడి నవ్వారు. వాళ్లకి అంత అకస్మాత్తుగా అంత ఉల్లాసం కలిగించినదేమిటో అతను ఊహించలేకపోయాడు, కాని తను కూడా నవ్వుతున్నట్లు అతను గమనించాడు.

"మగబాతు ఆడబాతుని యిలాగే పిలుస్తుంది" అతను వివరించాడు. "ఏదీ, మీరు ప్రయత్నించండి, చూద్దాం."

వాళ్లు హుషారుగా క్వాక్, క్వాక్ అంటూ అరిచారు. అందర్లోకీ బాగా ప్రయత్నించి చక్కగా అన్నది ఎర్రజుట్టు అమ్మాయి జేన్యా (ఓహ్, ఎంత అద్భుతమైన పిల్ల, యీామెతో ప్రేమలో పడకుండా భగవంతుడు నన్ను కాపాడుగాక, పరమాద్భుతమైన పిల్ల!) కాని అందర్లోకీ ఆ కూతని బాగా అనుకరించినది ఒస్యానినా — ఆమె నిజంగానే సమర్థురాలు. ఆ రెండో అమ్మాయి, లీజా కూడా ఫరవాలేదేమో కదూ? బొద్దుగా దృఢంగా వున్న యీ పిల్ల భుజాల దగ్గర ఎక్కువ వెడల్పుగా ఉంటుందో, తుంటి దగ్గరే ఎక్కువ వెడల్పుగా ఉంటుందో చెప్పడం కష్టమే. ఈమె కూడా చక్కగానే అనుకరించింది. ఆఁ, యీామె కొంచెం ఫరవా లేదు — ఎక్కడైనా యీామె బాగానే కొట్టుకెడుతుంది; పైగా మాంచి ఆరోగ్యంగా, పంచకల్యాణి గుర్రంలా దిట్టంగా వుంది. ఆ పట్నవాసపు నాదారి బక్క పిల్లలు — గాల్యా చెత్‌వెర్తాక్, దుబాసీ సోన్యా గూర్విచ్‌ల మాదిరిగా కాదు.

"మనం వోప్ సరస్సుకి వెళ్దాం. ఇదుగో యిలా చూడండి." వాళ్లంతా అతని మెడపైనా, చెవుల్లోనూ ఊపిరి విడుస్తూ — మ్యాప్ చుట్టూ మూగారు. తమాషా మేళం.

‘‘ఒక వేళ జర్మన్లు రైల్వే లైనుకే కనుక వెళ్తాంటే వాళ్లు యీ సరస్సును దాటి వెళ్లాలి. వాళ్లకి దగ్గర దారి తెలియదు. అంటే, మనం వాళ్లకన్న ముందే అక్కడికి చేరుకుంటా మన్న మాట. అది యిక్కడికి సుమారు యిరవై కిలోమీటర్లుంటుంది — మనం రాత్రి భోజనం వేళకల్లా అక్కడికి చేరుకోవచ్చు. వాళ్లతో పోరాటానికి సన్నద్ధమయేటందుకు కూడా మనకి వ్యవధి వుంటుంది. వాళ్లకి చుట్టుదారిలో — అందులోనూ చాటుమాటుగా రావలసి వుంటుందేమో — సుమారు యాభై కిలోమీటర్లుంటుంది. ఏం అంతా స్పష్టంగా బోధ పడిందా కామ్రేడ్స్?’’

‘‘చాలా స్పష్టంగా....’’ వాళ్లన్నారు గంభీరంగా.

ఎండలో ఒళ్లు కాచుకోవడం, మధ్యమధ్య విమానాలను గురిచూసి కాల్చడం — వీళ్లకి తగిన యుద్ధం అంతే....

‘‘జూనియర్ సార్జెంట్ ఒస్యానినా, నువ్వు సామగ్రీ, సైనికుల సంసిద్ధతా సరిచూడు. ఇంకో పావుగంటలో మనం బయల్దేరాలి.’’

తన మటుకు తను కూడా, వాళ్లనిక్కడ విడిచిపెట్టి కొంచెం సేపు తన మకాంకి వెళ్లాలి. తన నాప్‌శాక్*ను సర్దిపెట్టాల్సిందిగా అంతకు ముందే మరీయా నికీఫొరొవ్నాకు అతను చెప్పివుంచాడు. వాటికితోడు తను తీసుకోవలసిన వస్తువులు మరి కొన్ని కూడా ఉన్నాయి. జర్మన్లు పోరాటంలో ఓ పట్టాన లొంగే బాపతు కాదు. వాళ్లని డజన్ల సంఖ్యలో చంపిపారెయ్యడం ఒక్క వ్యంగ్య చిత్రాలలో మాత్రమే సాధ్యం. ఆచరణలో దానికెంతో సన్నాహం అవసరం.

మరీయా నికీఫొరొవ్నా అతనికి కావలసిన వస్తువులన్నీ సర్దడంతో బాటు పంది మాంసపు కొవ్వూ, కొన్ని ఎండు చేపలూ కూడా పెట్టింది. అతను ఆమెను మందలిద్దామనుకున్నాడు, కాని తనతో పెళ్లి బృందంలా ఓ గుంపు వస్తున్నందున మనసు మార్చుకున్నాడు. రైఫిలుకీ, రివాల్వరుకీ అవసరమైన తూటాలను దండిగా సంచిలో పెట్టుకున్నాడు. ఓ రెండు హాండ్ గ్రెనేడ్లు కూడా వేసుకున్నాడు. ఏమో ఏం జరుగనుందో ఎవరికి తెలుసు!

మరీయా నికీఫొరొవ్నా అతని వంక దీనమైన భీతదృక్కులు బరపింది; ఆమె దాదాపు ఏడుపు పర్యంతమైంది. ఆమె శరీరంలోని అణువణువూ అతన్ని స్పృశించాలని తపించింది, కాని ఆమె తను కూర్చున్నచోటునుంచి కదల్లేదు. వస్కోవ్ దాన్ని భరించలేక పోయాడు. అతను ఆమె తలపై చెయ్యి వేసి అన్నాడు: ‘‘నేను ఎల్లుండికల్లా తిరిగి వచ్చేస్తా కదా. ఎటువంటి పరిస్థితుల్లోనూ బుధవారంకన్న ఆలస్యం కాదు.’’

---

* ఆహార పదార్థాలూ, తదితర సరుకులూ పెట్టుకొని మూపుమీద తగిలించుకు తీసుకెళ్లే సంచి. — సం.

ఆమె గుడ్డ నీళ్ల కుక్కుకుంది. ఈ ఆడాళ్ల బతుకుల్లో సంతోషమంటూ ఎప్పుడూ వుండదు! యుద్ధం మగాడికైనా వినోదమేమీ కాదు, కాని ఆడాళ్లకో....

అతను బయటి కెళ్లి తన "నిపుణమైన సైన్యాన్ని" పర్యవేక్షించాడు; వాళ్లు తమ రైఫిళ్లను చేతి క్రలను పట్టుకున్నట్టు పట్టుకున్నారు.

వస్కోవ్ నిట్టూర్చాడు.

"సిద్ధమేనా?"

"సిద్ధమే" రీతా జవాబిచ్చింది.

"ఈ మొత్తం సైనిక చర్య అంతట్లోనూ జూనియర్ సార్జెంట్ ఒస్యానినాను నాకు డిప్యూటీగా నియమిస్తున్నాను. సంకేతాలు మీకు మరోసారి గుర్తుచేస్తున్నాను: రెండు క్వాక్‌లైతే – అటెన్షన్, శత్రువు కనిపించాడని, మూడు క్వాక్‌లైతే – అందరూ నా దగ్గరకు రండని."

యువతులు పకపక నవ్వారు. కాని యీ సారి అతనీ సంగతి కావాలనే చెప్పాడు: రెండు క్వాక్‌లు, మూడు క్వాక్‌లు. వాళ్లని నవ్వించేందుకూ, వాళ్ల ధైర్యాన్ని పురిగొల్పేం దుకే అతనలా చేశాడు.

"అడ్వాన్స్ పార్టీ, ఫార్వర్డ్ మార్చ్!"

వాళ్లు ముందుకు సాగిపోయారు.

మున్ముందు ఒస్యానినా, బొద్దు అమ్మాయీ వున్నారు. వాళ్లు పొదల్లో కనుమరుగయ్యే దాకా వస్కోవ్ వేచియున్నాడు, అటు తర్వాత లోలోపల ఒకటి, రెండు, మూడు.... అంటూ వంద దాకా లెక్కపెట్టాడు, తర్వాత, తన రైఫిలు, తూటాల సంచీ, చుట్ట చుట్టిన ఓవర్‌కోటూ, నాప్‌శాక్‌లు వగైరాల బరువుకి రివటలా వంగిన దుబాసీతో బాటు తను బయల్దేరాడు. అందరికీ వెనుక తట్టున జేన్యా కొమెల్కోవా, గాల్యా చెత్‌వెర్తాక్ ఉన్నారు.

4

వోప్ సరస్సుకు చెయ్యాల్సివచ్చిన ప్రయాణం గురించి వస్కోవ్ ఆదుర్దా చెందలేదు. వోప్ సరస్సుకి నేరుగా వున్న దోవ కనుక్కోవడం జర్మన్లకు సాధ్యం కాదు, ఎందుకంటే తనైనా ఫిన్నిష్ యుద్ధకాలంలోనే యీ దోవను కనుగొన్నాడు. మ్యాపులన్నింట్లోనూ కూడా యిక్కడ ప్రమాదకరమైన ఊబిగుంటలు సూచితమయ్యాయి, అందుకనే జర్మన్లకు – గమన సాధ్యమైన ఏకైక మార్గం – అడవి గుండా చుట్టు తిరిగి, అటు తర్వాత సరస్సుకి చేరుకోవడం, అక్కడినుంచి సిన్యూహినా కొండలబారుకు చేరుకోవడం, ఇక ఆ కొండల

చుట్టూ దారి లేదు. తన సైనికులు ఎలా నడిచినా, ఎంతగా యీడ్చుకుంటూ నడిచినా కూడా జర్మన్లు చాలా దూరం నడవాలి. సాయంత్రంలోగా వాళ్లక్కడకి చేరుకోలేరు, అప్పటికి తను వాళ్లు తప్పించుకుపోగల దారులన్నింటినీ బంద్ చెయ్యగలుగుతాడు. సాధ్యమైనంత మంచి మాటు వున్న స్థానాలలో, రాతి బండల వెనుక తను తన యువతులను మోహరిస్తాడు. జర్మన్లు కనిపించగానే దగ్గర్నుంచి రెండు కాల్పులు వినిపించగానే దేవుడా అంటూ వాళ్లే కాళ్లబేరానికి వస్తారు. కర్మకాలి పరిస్థితి విషమిస్తే తను ఒకడిని ఖతం చేస్తాడు, ఎంత పెద్ద వస్తాదు జర్మనుతోనైనా సరే బాహాబాహీ కలబడటానికి తను సిద్ధం.

తన సైనికులు చకచకా నడుస్తున్నారు, సరిగానే వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నారు. వాళ్లలో ఏ ఒక్కరూ నవ్వుతున్నట్టు గాని, మాట్లాడుతున్నట్టు గాని వినిపించడం లేదు. అయితే వాళ్లు పరిసరాలను ఎంత నిశితంగా పరిశీలిస్తున్నారన్న సంగతి తెలుసుకునేందుకు అతనికి సాధనం లేదు, కాని అతను మాత్రం ఎలుగుబంటి అడుగు జాడలు చూస్తున్నట్లు తన దృష్టిని నేలపైనే కేంద్రీకరించాడు, అతనికి అపరిచితమైన నమూనా బూట్లయొక్క అస్పష్టమైన గుర్తులు కానవచ్చాయి. ఆ ముద్రలు తొమ్మిది సైజువి, దాన్ని బట్టి సుమారు ఆరడుగుల బారూ, రెండు వందల పౌన్లకి పైగా బరువూ వున్న శాల్తీ చేసిన గుర్తులని సార్జెంట్ మేజరు అంచనావేసుకున్నాడు. తన సైనిక యువతులు సాయుధులే అయినా అటువంటి ప్రత్యర్థిని ఎదుర్కోలేరన్న విషయం స్పష్టం; కాని త్వరలోనే మరో జోడు పాదచిహ్నాలు అతనికి కానవచ్చాయి. ఈ జోడు జోళ్ల పాదచిహ్నాలను బట్టి జర్మన్లు ఊబి చుట్టూ వున్న దారి పడతారన్న అతని ఊహ రూఢి అయింది. మొత్తంమీద అంతా తను అనుకున్నట్లే జరుగుతోంది.

"జర్మన్లు కొంచెం చుట్టు దోవ పట్టాల్సివుంటుంది" అతను తన సహచరితో చెప్పాడు. "కాస్తాకూస్తా చుట్టు కాదు చాలానే—సుమారు నలభై కిలోమీటర్ల దాకా."

దుబాసీ బదులు పలకలేదు. ఆమె తన రైఫిలు మడమ నేలకు తాకకుండా చూసుకోవడమే గగనంగా వుంది, అంతగా అలసిపోయిందామె. సార్జెంట్ మేజరు ఆమె వంక చాల సార్లు పరిశీలనగా చూశాడు. సాదాగా, కొనదేరిన కనుముక్కు తీరుతో, అత్యంత గంభీరమైన ముఖభంగిమతో వుండే ఆమెను చూసినప్పుడు, యిప్పట్లో వున్న పురుషుల కొరతతో యీామెకు జీవితంలో సంసార సుఖం అనుభవించే యోగ్యతే ఉండబోదని సార్జెంట్ మేజరు జాలిపడ్డాడు. అతను ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడిగాడు: "మీ అమ్మా, నాన్నా బతికున్నారా? లేకపోతే నువ్వు అనాథవా?"

"నేను అనాథనా?" అంటూ ఆమె నవ్వింది. "బహుశా అంతేనేమో లెండి."

"అంటే, కచ్చితంగా చెప్పలేవనా నీ ఉద్దేశం?"

"ఈ రోజుల్లో ఆ సంగతి కచ్చితంగా ఎవరు మాత్రం చెప్పగలరు, కామ్రేడ్ సార్జెంట్ మేజర్?"

"ఔను, నువ్వు చెప్పిందీ నిజమే...."

"మా అమ్మా, నాన్నా మీన్స్క్‌లో వున్నారు." రైఫిలు జారిపోకుండా కుదురుగా ఉండేందుకని ఆమె తన భుజం ఎగరేసింది. "నేను మాస్కోలో ఉన్నాను. పరీక్షల కోసం తయారవుతూండగా అంతలో యీ...."

"మరి నీకేమైనా వార్త తెలిసిందా?"

"ఎలా తెలుస్తుంది!"

"నిజమేలే...."

తన తదుపరి ప్రశ్న ఆమెకు కష్టం కలిగిస్తుందేమోనని అనుమానిస్తూ సార్జెంట్ మేజరు ఆమె వంకకు పక్కచూపు బరిపాడు. "నీ తలిదండ్రులు యూదులా?"

"స్పష్టమే కదా."

వస్కోవ్ కోపంగా బుసకొట్టాడు. "అంత స్పష్టమైతే, నేను అడిగివుండేవాణ్ణి కాదు కదా."

దుబాసీ మౌనంగా ఉండిపోయింది. వికారంగా వున్న తన పాదరక్షలతో తడి గడ్డిపై భారంగా యీడ్చుకుంటూ నడుస్తూ ఆమె కనుబొమలు ముడిచింది. ఆకస్మికంగా "ఏమో, బహుశా వాళ్లు తప్పించుకోగలిగారేమో" అని ఆమె చిన్నగా నిట్టూర్చింది.

ఆ నిట్టూర్పు వస్కోవ్ గుండెను చీల్చింది. ఓహ్ చిట్టితల్లీ, యీ కష్టాలన్నీ నువ్వెలా భరించగలుగుతున్నావు? బూతులు తిట్టడానికి వీలుండివుంటే, అతనీ యుద్ధాన్ని దారి పొడుగునా తిడుతూ ఉండి వుండేవాడు. దానితోబాటు ఈ యువతుల్ని జర్మన్ల వేటకు పంపిన మేజర్ని కూడా బండబూతులు తిట్టేవాడు. అలా చేసియుంటే అతని మనస్సు కొంత తేలికపడివుండేది, కాని అందుకు బదులుగా బలవంతాన అతను చిరునవ్వు నవ్వాడు.

"సరే, కామ్రేడ్ గూర్విచ్, మూడు సార్లు క్వాక్ అను!"

"ఎందుకు?"

"యుద్ధ సన్నద్ధతను పరీక్షించడానికి. లేక, నేను నేర్పినది నువ్వు మరచిపోయావా?"

ఆమె ముఖంలో వెంటనే చిరునవ్వు విరిసింది, కొత్త కాంతి మెరిసింది.

"అబ్బే, నేను మరచిపోలేదు."

కానైతే అదేదో హాస్యానికి తమాషాగా ఉన్నట్లున్నాయే గాని, ఆమె "క్వాక్"లు బొత్తిగా సహజంగా లేవు. ఏ నాటక రంగస్థలం పైనో అయితే అవి రక్తి కట్టించేవి. అయినా కూడా ముందు జంటా, వెనక జంటా సంకేతాన్ని అందుకున్నారు. వాళ్లు సమీపానికి

వచ్చారు. జూనియర్ సార్జెంటు ఒస్యానినా తన రైఫిలును సిద్ధంగా పట్టుకుని దూసుకుని వచ్చింది. "ఏం జరిగింది?"

"ఏమన్నా జరిగివుంటే నువ్వీపాటికి నీ పెద్దలతో కలిసి పరలోకంలో ఉండేదానివి" వస్కోవ్ ఆమెను చివాట్లు పెట్టాడు. "ఓ పెద్ద ఆవు పెయ్యలా లగెత్తుకుంటూ వచ్చావు, మళ్లీ బంగారక్క మాదిరిగా నిన్ను చూసుకుని నువ్వే మురిసిపోతున్నావు."

నిస్సందేహంగా అతని మాటలు ఆమెను చాలా గాయపరచాయి. ఆమె ముఖం వేసవి ప్రభాత వేళ సూర్య బింబంలా ఎర్రవారింది. కాని ఆమె అంతకంటె ఇంకేం ఆశించ గలదు? ఆమె ఇంకా నేర్చుకోవాలి.

"అలిసిపోయారా?"

"అలిసీ పోలేదు, గిలిసీ పోలేదు!" ఒస్యానినా పక్షం వహించి అలా కంయ్‌మన్నది ఎర్ర జుట్టమ్మాయి. సార్జెంట్ మేజరు పెట్టిన చీవాట్లు ఒస్యానినా తరఫున ఆమెను కలవర పరచాయి.

"సరే, సరే" సర్దుబాటు ధోరణిలో అన్నాడు వస్కోవ్, "దోవలో మీరేమేం చూశారు? ఒకరి తర్వాత మరొకరు చెప్పండి. ముందు నువ్వు మొదలెట్టు జూనియర్ సార్జెంట్ ఒస్యానినా."

"అంత ఎక్కువేం లేదు..." అంటూ ఆమె తడబడింది. "ఆఁ, అన్నట్టు, తోవలో ఒక మలుపు తిరిగేటప్పుడు విరిగిపడిన కొమ్మ ఒకటి కనిపించింది."

"శభాష్. కరెక్ట్. సరే, యిప్పుడిక వెనక జంట. ప్రైవేట్ కొమెల్కోవా, నువ్వు!"

"నాకేం కనిపించలేదు. అన్నీ మామూలుగానే వున్నాయి."

"పొదలపై వున్న మంచు బిందువులు రాల్చెయ్యబడ్డాయి" హడావిడిగా జోక్యంచేసుకొని లీజా బ్రీచ్కినా చెప్పింది. "రోడ్డుకి కుడిపక్కనున్న పొదలు యిప్పటికీ మంచు బిందువులతో నిండియుండగా, ఎడమ పక్క వాటిపైన మంచు బిందువులు రాల్చెయ్యబడ్డాయి."

"అదుగో, కళ్లంటే అలా నిశితంగా వుండాలి!" సార్జెంట్ మేజరు ఆమోదపూర్వకంగా అన్నాడు. "శభాష్, రెడార్మీమాన్ బ్రీచ్కినా! అటు తర్వాత, రోడ్డుమీద రెండు జతల అడుగుల గుర్తులున్నాయి. జర్మన్ బూట్ల గుర్తులివి, వాళ్ల పారాట్రూపర్లు వాడుతారే రబ్బరు బూట్లు, అటువంటి బూట్ల గుర్తులు. వాళ్ల నిజంగానే ఊబి చుట్టుతిరిగి వెళ్తున్నట్లు కనిపిస్తోంది. వాళ్లు అలాగే వెళ్తారని ఆశిద్దాం, ఎందుకంటే, మనం ఊబి నేరుగా దాటి వెళ్లబోతున్నాం. ఇప్పుడు, సిగరెట్లు కాల్చుకోడానికీ, మీ అవసరాలు తీర్చుకోడానికీ ఓ పావుగంట విరామం యిస్తున్నాను."

అతనేదో అసందర్భమైన మాట అన్నట్లు వాళ్లు కిసుక్కున నవ్వారు. కాని అది సరైన ఆజ్ఞయే. అది సైనిక నిబంధనల్లో వుంది. వస్కోవ్ రుసరుసలాడాడు.

"అలాంటి వేషాలేం కుదరవు! అంతా కలిసివుండండి. ఆఁ అంతే!"

వాళ్ల మూటలూ, ఓవర్‌కోట్లూ ఎక్కడ పెట్టాలో చూపించి, రైఫిళ్ల దేనికి ఆనించాలో చెప్పి, అతను వాళ్లని ఆటవిడుపుకి వదిలాడు. మరు క్షణంలో వాళ్లందరూ ఎలుకలు కలుగుల్లో దూరినట్లు పొదల్లోకి అదృశ్యమయారు.

అతను గొడ్డలి పైకి తీసి ఎండిన కొమ్మలను చెలిగి ఆరు దిట్టమైన బారుకర్రలు తయారుచేశాడు. ఆటు తర్వాతనే అతను సామాన్ల దగ్గర చతికిలబడి సిగరెట్టు ముట్టించాడు. చాల త్వరలోనే వాళ్ళు గుమిగూడి లోగొంతులో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ, ఒకరి వంక మరొకళ్లు పక్క చూపులు చూసుకోనారంభించారు.

"ఇప్పుడు మనం చాల జాగ్రత్తగా ఉండాలి" అంటూ వస్కొవ్ మొదలెట్టాడు. "నేను ముందు వెళ్తా, మీరు ఒంటి వరుసలో దగ్గర దగ్గరగా, నా అడుగుల్లో అడుగు వేసుకొంటూ మరీ నా వెంట రావాలి. కుడి పక్కా, ఎడమ పక్కా కూడా లోతైన ఊబి వుంది. అటూ యిటూ బెసికారా, 'అమ్మోయ్ బాబోయ్!' అనేందుక్కూడా టైముండదు. ఒక్కొక్కళ్లు ఒక్కొక్క పెర్చి తీసుకోండి, ఒక్కొక్క అడుగే వేసేందుకు ముందు మీ పెర్చితో తడిమి చూసుకోండి. ఇంకేమన్నా సందేహాలున్నాయా?"

ఈ మారు వాళ్లందరూ మౌనంగా ఉండిపోయారు. ఎర్రజుట్టమ్మాయి ఏదో చెప్పడానికన్నట్టు తల ఎగరేసింది గాని, మళ్లీ ఆలోచించిన మీదట గవ్‌చివ్‌గా ఊరుకుంది. సార్జెంట్ మేజరు లేచి సిగరెట్టు పీకను నాచులోకి విసిరేశాడు.

"సరే, మీలో ఎవరికి మంచి బలముంది?"

"ఎందుకు?" లీజా బ్రీచ్కినా ఆశ్చర్యంగా అడిగింది.

"ప్రైవేట్ బ్రీచ్కినా దుబాసీ మూట తీసుకెళ్లాలి."

"ఎందుకు?" అంటూ గూర్విచ్ కీచున అరిచింది.

"ప్రశ్నలెయ్యకు! కొమెల్కొవా!"

"ఆఁ."

"ప్రైవేట్ చెత్‌వెర్తాక్ మూట నువ్వు తీసుకో."

"ఇలా యిచ్చెయ్యి గాల్యా తల్లీ, నీ రైఫిలు కూడా యిచ్చెయ్యకూడదూ?"

"బదులు చెప్పకుండా చెప్పిన పని చెయ్యి! ప్రతి ఒకళ్లూ ఎవరి రైఫిలును వాళ్లే తీసుకెళ్తారు...."

తను అరుస్తున్నాడు, కంగారు పడుతున్నాడు. అది సరైన పద్ధతి కాదు. అరవడం ద్వారా వాళ్ళు అర్థం చేసుకునేలా చెయ్యగలగడం దుస్సాధ్యం, లేక తను అలా చెయ్యగలడా? శివమెత్తిన వాడిలా తను అరవవచ్చు, కాని దానివల్ల ప్రయోజనమేమీ ఉండబోదు. ఇలా చనువు తీసుకోవడం, లొడలొడ మాట్లాడటం — యీ విషయంలో ఏదో ఒకటి చెయ్యాలి.

పైనికుదు లొడలొడ వాగడమన్నది ఆత్మహత్యతో సమానమైనది. అందులో యీషణ్మాత్రం కూడా సందేహం లేదు.

"పొరపాటేమీ జరగకుండా ఉండేందుకని, నేనింతకు ముందు చెప్పినవన్నీ మరోసారి రెట్టిస్తున్నాను. మీరు నా వెనకే రావాలి. నా అడుగుల్లో అడుగులేస్తూ రావాలి. మీ పెర్చిలతో ఊబిని పొడిచి చూసుకోవాలి...."

"నేనో ప్రశ్న అడగొచ్చా?"

ఓరి భగవంతుడా, ఏం ఆడపిల్లలా బాబూ. వీళ్లు నోరు మూసుకుని ఒక్క క్షణం ఉండలేరు కదా.

"ఏమిటది, ప్రైవేట్ కొమెల్కోవా?"

"పెర్చి అంటే ఏమిటండి? మనం కూర్చునేదేదైనానా?"

అదిగో ఆ ఎర్రజుట్టమ్మాయి తమాషా చేస్తోంది, ఆ సంగతి ఆమె కళ్లు చూస్తేనే తెలుస్తుంది, ప్రమాదకరమైన, అగాధమైన కళ్లు.

"నీ చేత్తో నువ్వు పట్టుకున్నదేమిటి?"

"ఏదో ఒక రకమైన బారు కర్ర...."

"ఔనా, అదే పెర్చి అంటే, బోధపడిందా?"

"ఇప్పుడు స్పష్టంగా బోధపడింది. 'దాల్.' "

"ఈ 'దాల్' ఏమిటి?"

"అదో నిఘంటువులెండి, కామ్రేడ్ సార్జెంట్ మేజర్. మన భాష మెరుగుపరుచుకొనేందుకు పనికొచ్చే ఒక పుస్తకం."

"జేన్యా, యిక చాల్లే కట్టిపెట్టు" ఒస్యానినా అరిచింది.

"నేనింతకు ముందు చెప్పినట్టు, యిది ప్రమాదకరమైన దోవ, యిక్కడ పరాచికాలకి వ్యవధి లేదు. మనం ముందుకెళ్లాల్సిన వరుస యిదీ: నేను ముందు వెళ్తాను, నా తర్వాత వరుసగా గూర్విచ్, బ్రీచ్కినా, కొమెల్కోవా, చెత్వెర్తాక్‌లు వస్తారు. చిట్టచివర జూనియర్ సార్జెంట్ ఒస్యానినా వస్తుంది. ఎవరికైనా ఏమైనా సందేహాలున్నాయా?"

"అక్కడ లోతుగా ఉంటుందా?"

ఈ విషయంలో ఆసక్తి చూపినది చెత్వెర్తాక్. ఆమె అలా అడగడం సహజమే కదా. ఆమె వంటి వామనాకారానికి ఓ బకెట్టు నీళ్లే ఓ పెద్ద ఊబి.

"ఒక్కొక్క చోట అది.... అదే, అదే... మరి.... నీ రొమ్ము దాకా వుంటుంది. మీ రైఫిళ్లు జాగ్రత్తగా చూసుకోండి."

తన మొట్టమొదటి అడుగులోనే అతను మోకాళ్ల దాకా బురదలోకి దిగబడ్డాడు – ఎలా బురబుర పొంగుతోందో అది! స్ప్రింగు పరుపుమీద నడుస్తున్నట్టు అటూ యిటూ

ఊగుతూ కష్టంమీద ముందుకు సాగాడు. వెనక్కి తిరిగి చూడకుండానే వాళ్ల ఎగశ్వాసలను బట్టీ, భయంతో కూడిన గుసగుసలను బట్టీ తన దళం ఎలా వ్యవహరిస్తున్నదీ అతను చెప్పగలడు.

బురదగుంట మీద తేమగా తేలియాడే నిల్వగాలి మూలంగా ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరవుతోంది. వేసవి కాలపు మొండి దోమలు చెమటతో తడిసిన వాళ్ల శరీరాలపైన తెరలుతెరలుగా ముసురుతున్నాయి. పసరుపట్టిన గడ్డి, కుళ్లుతున్న నాచు, బురద – వీటి కంపుతో బుర్ర దిమ్మెక్కుతోంది.

తమ పెర్చిల మీద బరువుగా ఆని, చల్లగా జివ్వుమంటూ కాళ్లకి అంటుకుంటూన్న బురదలోంచి తమ కాళ్లని ముందుకు యీడ్వడానికి వాళ్ల తాతలు దిగివస్తున్నారు. వాళ్ల తడి స్కర్టులు వాళ్ల పిర్రలకు అంటుకుపోయాయి. వాళ్ల రైఫిలు మడమలు బురదలో జీరాడుతున్నాయి. ప్రతి ఒక్క అడుగు వెయ్యడానికీ బ్రహ్మ ప్రళయమవుతోంది. తన అడుగులను చిన్నారి గాల్యా చెత్వెర్తాక్ నడకకి అనుగుణంగా సర్దుకొని వస్కోవ్ మెల్లగా ముందుకెళ్తున్నాడు.

తేమ మూలంగా వంకర్లు తిరిగిపోయిన రెండు పొట్టి పైన్ చెట్లున్న ఒక లంక వేపు అతను తిన్నగా ముందుకుపోతున్నాడు. ఒక వేపు ఆ రెండు వంకర పైన్ చెట్లకూ మధ్యనుంచి దూరాన పొడినేలపై వున్న ఒక బర్చి చెట్టు వంక చూస్తూనే, మరో వేపు వాళ్లమీంచి తన దృష్టిని ఒక్క క్షణం కూడా అతను మళ్లించలేదు.

"కామ్రేడ్ సార్జెంట్ మేజర్!"

"ఏం ముంచుకొచ్చింది" వస్కోవ్ తన పెర్చిని మరింత గట్టిగా బురదలో గుచ్చి, కష్టంమీద వెనక్కి తిరిగాడు. వాళ్లందరూ దూరదూరంగా స్థాణువు మాదిరిగా నిలబడి వున్నారు.

"కదలకుండా ఒకే చోట అలా నిలబడకండి! నిలబడితే కూరుకుపోతారు."

"కామ్రేడ్ సార్జెంట్ మేజర్, నా బూటు ఊడి వచ్చేసింది!"

అందరికన్న వెనుకనుంచి అలా తన కోసం అరుస్తున్నది చెత్వెర్తాక్. గుండెల దాకా బురదలో దిగబడి వున్న ఆమె ఓ చిన్న మంచు గుట్టలా కనిపిస్తోంది. ఒస్యానినా తంటాలు పడి వెళ్లి ఆమెను పట్టుకుంది. వాళ్లిప్పుడొక పెర్చితో బురదలో పొడుస్తున్నారు. బూటు కోసం వెతుకుతున్నట్టుంది కదూ?

"కనిపించిందా?"

"లేదు!"

కొమెల్కోవా తన పెర్చిని పక్కకి విసిరి, ఓ పక్కకి వంగబోతోంది. సరిగా సమయానికి తను చూడటం మంచిదైంది. "నీ పాపం గూల ఎక్కడికెడుతున్నావ్? ఉన్న చోటే

వుండు!'' అతను ఎంత గట్టిగా బొబ్బవేశాడంటే, అతని నుదుటిమీది రక్తనాళాలు ఉబ్బాయి.

''నేను సాయం చెయ్యడానికెళ్తున్నాను....''

''అక్కడే వుండు, వెనక్కెళ్ళేందుకు తోవలేదు!''

ఓరి భగవంతుడా, వీళ్లతో తన పని అయోమయంగా తయారైంది. మొదటేమో తను వాళ్లకి ముందుకి సాగుతూనే ఉండమన్నాడు, ఇప్పుడేమో కదలమెదలకుండా ఉన్న చోటే ఉండమంటున్నాడు. వాళ్ళు కంగారుపడి బెంబేలెత్తిపోతే ఏం కాను? ఊబిలో బెంబేలెత్తడమంటే మృత్యువాత పడటమే.

''కంగారుపడకండి, ఏ మాత్రం కంగారుపడకండి! అదిగో ఆ లంక దగ్గరకి యింకెంతో దూరం లేదు, అక్కడ మనం ఆయాసం తీర్చుకుందాం. నీకు బాటు కనిపించిందా?''

''లేదు! ఊబి మమ్మల్ని కిందకి లాగేస్తోంది క్రామేడ్ సార్జెంట్ మేజర్!''

''మీరు ముందుకి కదులుతూనే ఉండాలి! ఇక్కడ నేల గట్టిగా లేదు, మీరిక్కడ ఎక్కువ సేపు దృఢంగా నిలబడలేరు.''

''మరైతే బాటు మాటేమిటి?''

''మీకిప్పుడింక అది దొరకదు. ముందుకి రండి! నా వెంటే రండి!''

అతను గిరున తిరిగి, వెనక్కి చూడకుండా ముందుకు నడిచిపోసాగాడు.

''నా అడుగుల్లో అడుగు లేసుకుంటూ రండి. ఏ మాత్రం వెనకపడకండి.''

వాళ్లకి కొంత ధైర్యం కలిగించేందుకని ఉద్దేశపూర్వకంగానే అతను బిగ్గరగా అరిచాడు. ఆజ్ఞాపదం వినగానే సైనికులు తటాలున ధైర్యంగా ముందడుగేస్తారన్న సంగతి అతనికి తెలుసు. ఈ సంగతి అతనికి కచ్చితంగా తెలుసు.

చిట్టచివరకు వాళ్ళు లంకని చేరుకున్నారు. చివరి కొద్ది మీటర్ల దూరం విషయంలో, అక్కడ మరింత లోతుగా ఉన్న కారణంగా, అతను ప్రత్యేకించి మరింత భయపడ్డాడు. వాళ్లక్కడ బురదలోంచి కాళ్ళు పైకి లాక్కోలేకపోయారు. ఎలాగో ఒక లాగ ముందుకి యీడ్చుకుంటూ రావడం తప్ప గత్యంతరం లేదు, దానికి బలమూ, నేర్పూ కావాలి, అయితేనేం, వాళ్ళు మొత్తంమీద నెట్టుకొచ్చారు.

ఆ లంకకి ముందున్న గట్టి నేలపైన వస్కోవ్ కాసేపు ఆగాడు. తన దళ సభ్యులందరూ తనని దాటి వెళ్లనిచ్చాడు, వారిలో ఒక్కొక్కరికే చేయూతనిచ్చి పొడినేలపైకి లాగాడు.

''అద్గదీ తొందర పడకండి. తాపీగా వస్తే తేలిక. మనమిక్కడ కొంచెం ఊపిరి పీల్చుకుందాం.''

సైనిక యువతులు లంకపైన చేరుకుని, ఎండి, కరుకుగా వున్న గడ్డిపై దభేలున చదికిలబడ్డారు. వాళ్ళందరూ నాని ముద్ద అయి, బురద కొట్టుకొని, ఎగరొప్పుతున్నారు. చెత్‌వెర్తాక్ తన బూటునే కాకుండా, పాదానికి చుట్టుకొనే పట్టీని కూడా ఊబిగుంటకి సమర్పించింది. ఇప్పుడామె పాదానికి కేవలం ఒక్క మేజోడు మాత్రమే వుంది. చిల్లులోంచి బయటకు తొంగి చూస్తున్న ఆమె బొటనవ్రేలు చలికి నల్లబారిపోయింది.

"సరే సైనిక కామ్రేడ్స్, అలిసిపోయారా?"

వాళ్ళంతా మౌనంగా ఉండిపోయారు, ఒక్క లీజా మాత్రం "ఔను బాగా అలిసిపోయాం...." అంది.

"అయితే సరే, కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి. తరువాతి ప్రయాణం సులువుగానే వుంటుంది. నేలమీద ఆ బర్చి చెట్టుంది చూశారా — అదిగో అక్కడికెళ్దాం."

"ఒళ్ళు ఒక్క సారి శుభ్రంగా కడుక్కుంటే బాగుండును" రీతా అంది.

"అదిగో ఆ పక్క శుభ్రమైన యిసుక గట్టున్న ఓ చిన్న వాగుంది. స్నానానికి సైతం వీలైనది. అయితే, తర్వాత దారిలో నడుస్తూ బట్టలు ఆరబెట్టుకోవలసిందే సుమా."

చెత్‌వెర్తాక్ నిట్టూర్చి బిడియంగా అడిగింది: "నేను బూటు లేకుండా ఎలా నడవడం?"

"నీకు మేమొక బూటు అల్లుతాం కదా" వస్కోవ్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "కాని ఊబి దాటాక మాత్రమే యిక్కడ కాదు. మరి అంత దాకా నెట్టుకు రాగలవా?"

"రాగలను."

"నువ్వెంత మూర్ఖురాలివి, గాల్యా" జేన్యా కొమెల్కోవా చిరాకు ప్రదర్శించింది. "నీ కాళ్ళు కిందకి కూరుకుపోతున్నా యనుకున్నప్పుడు నువ్వు నీ మునిపాదాలు పైకెత్తి వుండాల్సింది."

"నేను పైకే వంచాను, అయినా ఊడిపోయింది."

"చలిగా వుంది, అమ్మాయిలూ."

"నేను పీకల దాకా తడిసిపోయాను."

"నేను మాత్రం పొడిగా ఉన్నాననుకున్నావేమిటి? ఓ సారి నేను జర్రున జారి వెనక్కి దబ్బున పడ్డాను!"

వాళ్ళందరూ పకపక నవ్వారు. అంటే వాళ్ళందరూ సలక్షణంగా ఉన్నారన్నమాటే, ఫరవా లేదు, వీళ్ళు ఆడాళ్ళే అయినా యౌవన దశలో వున్నారు. వాళ్ళకెంతో కొంత బలముంది. మంచులా చల్లగా వున్న నీళ్ళ మూలంగా వాళ్ళకి జబ్బు చెయ్యనంత కాలం ఫరవా లేదు....

వస్కోవ్ మరో దమ్ము లాగి, సిగరెట్టు పీకను బురదగుంటలోకి విసిరి లేచాడు. అతను గబగబా చెప్పాడు: "ఇప్పుడింక మీ పెర్చిలు తీసుకోండి కామ్రేడ్స్. తర్వాత యిందా

కటి వరుసలోనే నా వెనక రండి. అవతలి గట్టున మనం ఒళ్లు కడుక్కుని ఆరబెట్టుకుందాం.''

అతను అడ్డదిడ్డంగా చటుక్కున యిటుకి రంగు బురదలో దిగాడు.

ఈ చివరి కాస్త దూరం దాటడం దారుణమైన వ్యవహారమే అయింది. బురద అంబలి లాగ చిక్కగా ఉంది, అయితే అది కాలూనుకొనేందుకు వీలైనంత గట్టిగానూ లేదు, ఈదడానికి వీలైనంత పలచగానూ లేదు. దానిలో తపతప కొట్టుకుంటూ ముందుకు సాగేసరికి ఒళ్లంతా చెమటతో తడిసి ముద్దవుతుంది.

''ఏం, సరిగా వస్తున్నారా కామ్రేడ్స్?''

అతను వెనక్కి తిరగకుండా, కేవలం వాళ్లని హుషారు చేద్దామనే అలా అరిచాడు.

''ఇక్కడేమన్నా జలగలున్నాయా?'' గూర్విచ్ రొప్పుతూ ప్రశ్నించింది.

అతని ప్రయత్నాల వల్ల కలిగే ప్రయోజనాలన్నీ పొందుతూ ఆమె అతన్ని వెన్నంటే వుంది. అది ఆమెకు మరి కాస్త తేలికగా వుంది.

''ఇక్కడ ప్రాణి జాడ కూడా లేదు. ఇది మృత ప్రాంతం, శ్మశానంతో సమానమైన ప్రాంతం.''

ఎడమ ప్రక్క ఓ పెద్ద బుడగ లేచింది. అది పగలగానే ఊబిలోంచి బిగ్గరగా మొయ్యోమన్న శబ్దమైంది. అతని వెనక ఎవరో గాని తటాలున భయంతో అరిచారు. వస్కోవ్ వాళ్లకిలా వివరించాడు: ''ఏం కంగారుపడకండి, అది ఊబిలోంచి పైకి లేస్తున్న గ్యాసు, మనం దాన్ని కదిపాం కదా.'' కొంచెం ఆలోచించి అతను జోడించాడు: ''ఇదిగో యిక్కడే వనదేవత వుంటుందని మన పెద్దవాళ్లు చెప్తూవుంటారు, అంటే, దయ్యం అని. వట్టి కట్టు కథలేననుకోండి....''

అతని సైనికులు మౌనంగా ఉండిపోయారు. అస్సు ఉస్సురంటూ, ఎగరొప్పుతూ, అరుస్తూనే అయినా వాళ్లు ముమ్ముందుకి సాగుతూనే వున్నారు – పట్టుదలగా పళ్ల బిగువుతో నిబ్బరంగా.

నడక కొంచెం తేలికైంది. అంబలి పలచపడింది. కాళ్ల అడుగున నేల మరి కొంత గట్టిగా వుంది. అక్కడక్కడ చిన్నచిన్న గుట్టలు కూడా కాళ్లకి తగులుతున్నాయి. సార్జెంట్ మేజరు కావాలనే నడకను జోరుచెయ్యకుండా మందగింపజేశాడు, అతని సైనికులు అతన్ని సమీపించారు. ఇప్పుడు వాళ్లు ఒంటి బారున చురుకుగా ముందుకెళ్తున్నారు, దానితో బర్చి చెట్టు దగ్గరకు వాళ్లంతా దాదాపు ఒకే సమయానికి చేరుకున్నారు. అటు తర్వాత మరిన్ని చెట్లూ, గుట్టలూ, నాచుతో కప్పబడిన నేలా వచ్చాయి. అంతకంతకు నేల ఎత్తు పెరుగుతున్నందున చాలా బాగుంది. వాళ్లింకా గమనించేలోగానే వాళ్లు పొడి పైన్ అడవిలో వున్నారు, నేలమీద మాత్రం నాచు వుంది. దానితో వాళ్లందరూ కబుర్లలోకీ, తమ పెర్చిలను

కింద పారేసి తమాషాల్లోకి దిగారు. కాని వస్కోవ్ వాళ్లచేత పెర్చిలను పైకి తీయించి, తేలికగా గుర్తుండే ఒక పైన్ చెట్టుకి ఆనింపజేశాడు.

"అవి ఎవరికో ఒకరికి ఉపయోగించవచ్చు."

అతను వాళ్లకి, చివరకు దిసపాదపు గాల్యా చెత్‌వెర్తాక్‌కి సైతం, ఒక్క నిమిషం విశ్రాంతి కూడా యివ్వలేదు:

"ఇంకొంచెం శ్రమ పడాలి కామ్రేడ్స్, ఇంకొంచెం శ్రమ. మనం వాగు ఒడ్డున విశ్రాంతి తీసుకుందాం."

వాళ్లు ఎత్తు ప్రాంతానికి వచ్చారు, అక్కడినుంచి పైన్ చెట్ల గుండా వాగు కనిపిస్తోంది. అది బంగరు వన్నె యిసుక ఒడ్డుల మధ్య స్ఫటికస్వచ్ఛంగా కానవస్తోంది.

"హుర్రా!" ఎర్రజుట్టు జేన్యా అరిచింది. "బీచ్!"

సంతోషంగా అరుస్తూ యువతులు నీటి వంక పరుగెత్తారు, అలా పరుగెత్తుతూనే తమ ఓవర్‌కోట్లనూ, మూటలనూ కింద జారవిడిచారు.

"ఆగండి!" కంయ్‌మన్నాడు సార్జెంట్ మేజరు. "అటెన్షన్!"

వాళ్లు ఆశ్చర్యంగా తోవలో చటుక్కున ఆగిపోయారు, వాళ్ల మనస్సులు చివుక్కుమని కూడా అన్నాయి.

"ఇసుక!" వస్కోవ్ కోపంగా అరిచాడు. "మీరేమో రైఫిళ్లని యిసుకలో గుచ్చుతున్నారు. మీ రైఫిళ్లని ఒక చెట్టుకి ఆన్చండి, బోధపడిందా? మూటలూ, ఓవర్‌కోట్లూ అన్నీ ఒక చోట వెయ్యండి. మీకు ఒళ్లు కడుక్కోడానికీ, శుభ్రం చేసుకోడానికీ నలభై నిమిషాల టైమిస్తున్నాను. కూతవేటు దూరంలో నేను పొదల్లో వుంటాను. జూనియర్ సార్జెంట్ ఒస్యానినా, అన్నీ సజావుగా వుండేలా చూసే బాధ్యత నీదీ."

"అలాగే, కామ్రేడ్ సార్జెంట్ మేజర్."

"సరే, యింతే. నలభై నిమిషాల్లో సిద్ధంకండి. పూర్తిగా దుస్తులేసుకొని, బూట్లు తొడుక్కొని – అన్నీ శుభ్రం చేసుకుని."

అతను వాగు వెంట మరికొంచెం ముందుకెళ్లి, ఇసుక వుండి, నీళ్లు లోతుగా ఉండి, చుట్టూ పొదలున్న చోటును ఎంచుకున్నాడు, సామానును, బూట్లను, దుస్తులను విప్పాడు. దూరాన్నుండి యువతుల స్వరాలు అస్పష్టంగా వినపిస్తున్నాయి. నవ్వులూ, ఉండీ ఉడిగీ ఒక్కొక్క మాటా మాత్రమే అతనికి వినవస్తున్నాయి. బహుశా అందుకేనేమో అతను అంత సేపూ అంత శ్రద్ధగా వింటున్నది.

అతను చేసిన మొట్టమొదటి పని తన ఇజారును, పాదాలకు చుట్టుకొనే పట్టీలనూ, అండర్‌వేరునూ, పాంటునూ ఉతుక్కోవడం. సాధ్యమైనంత గట్టిగా పిండి, పొదల పైన వాటిని ఆరేశాడు. తర్వాత సబ్బు పెట్టి బాగా నురగవచ్చేలా రుద్దుకొని, గుండెనిండా

గాలి పీల్చుకొని, తనని తాను కూడదీసుకునేందు కోసం ఒడ్డు వెంట వేగంగా ఒక పరుగు దీసి, అప్పుడిక ఒడ్డు మీంచి లోతు నీట్లోకి దూకాడు. అతను పైకి వచ్చే సరికి మంచు వంటి నీటి మూలంగా ఊపిరికి కొంచెం కష్టమై ఆయాసం వచ్చినట్లయినా, అప్పుడిక సంతోషంగా గొంతుకొద్దీ అరవాలనుకున్నాడు గాని తన "సైనికులను" తను ఎక్కడ గాభరాపెట్టేస్తానో అన్న సంకోచంతో తన ఆ వాంఛను అణుచుకున్నాడు. అతను తన గొంతును నిరానందంగా సవరించుకుని, ఒంటినంటిన సబ్బునురగ చివరి అవశేషాలను సైతం తొలిచేసుకుని ఒడ్డుపైకెక్కాడు. తన ముతక సైనిక తువ్వాలుతో ఒంటిని కంది పోయేలా తుడుచుకొని, ఊపిరి అందిన తర్వాతనే మళ్లీ అతను వినసాగాడు.

అదొక రకమైన పల్లెటూరి నీలాటి రేవులో మాదిరిగా శబ్దాలు వినవస్తున్నాయి – వాళ్లంతా ఒక్కుమ్మడిగా, ఎవరి ధోరణిలో వాళ్లు, మాట్లాడుతున్నారు. నవ్వడం మాత్రం ఒక్కుమ్మడిగా బిళ్లపెట్టున నవ్వుతున్నారు. అంతలో అకస్మాత్తుగా చెత్‌వెర్తాక్ "ఓహ్, జేన్యా!" అంటూ సంతోషంగా అరిచింది.

"చస్తే వెనక్కి తగ్గకు!" జేన్యా అరిచింది. పొదల వెనక నీళ్లల్లోకి దూకిన చప్పుడు సార్జెంట్ మేజరుకి వినవచ్చింది.

ఓ, అయితే వీళ్లు జలకాలాడుతున్నారన్న మాట, తృప్తిగా అనుకున్నాడతను.

అకస్మాత్తుగా అన్ని యితర శబ్దాలనూ ముంచివేస్తూ కీచుమన్న దీర్ఘ సంతోష స్వరం వినవచ్చింది. జర్మన్లు దూరంగా ఉండటం మంచిదైంది. మొదట ఆ కీచు శబ్దం అతన్ని తికమకపెట్టింది, అంతలో ఒస్యానినా గైంయ్‌న అరిచింది:

"జేన్యా, వెంటనే పైకొచ్చెయ్!"

చిరునవ్వు నవ్వుతూ వస్కోవ్ లావుపాటి సిగరెట్టు చుట్టుకుని, చెకుముకితో అంటించుకుని, తాపీగా తన్మయత్వంతో కాలుస్తూ, ఆచ్ఛాదన లేని తన వీపుని వెచ్చని మే మాసపు ఎండకు ఎదురుచేసి కూర్చున్నాడు.

నలభై నిమిషాల్లో అతని దుస్తులేవీ ఆరని మాట నిజమే, కాని ఆగేందుకు వ్యవధి లేదు. వస్కోవ్ తడీపొడీగా వున్న డ్రాయరునూ, యిజారునూ, పాంటునూ వేసుకున్నాడు. అదృష్టవశాత్తూ పాదాలకు చుట్టుకునే మరో జత పట్టీలున్నందున అతను తన పాదాలను వెచ్చగా బూట్లలోకి జొనుపగలిగాడు. తన కోటు బెల్టును గట్టిగా బిగించుకొని, మిగిలిన తన సామానులన్నీ చేతుల్లోకి తీసుకొని గట్టిగా బొబ్బరించాడు: "సైనిక కామ్రేడ్స్, సిద్ధమేనా?"

"ఒక్క నిమిషం ఆగండి!"

తను అనుకున్నదే! ఈ మారు ఫెదోత్ వస్కోవ్ యికిలించి, తల ఊపి, వాళ్లనిక

వెంటనే బయటికి రమ్మని చెప్పేందుకు నోరు తెరవబోతున్నాడు, అంతలోనే ఒస్యానినా మళ్ళీ అరిచింది: ''మీరిప్పుడింక రావచ్చు!''

ఓహో, భేషుగ్గా వుంది! సార్జెంట్ మేజర్ని ''మీరు రావచ్చు'' అనడం గొప్పగా వుంది! కొంచెం పస్తాయించి ఆలోచిస్తే, సైనిక నిబంధనల్ని వెక్కిరించడం తప్ప యిది మరేం కాదు. అరాజకత్వం!

తన స్నానవిశ్రాంతుల అనంతరం మేడే పండుగ నాటి మనస్స్థితిలో వున్నాడేమో ఈ ఆలోచన అతని మనస్సులో క్షణకాలం మాత్రమే మెదిలి అదృశ్యమైంది. పైగా తన ''శ్రేష్ఠమైన సైనికులు'' చక్కగా నీటుగా, శుభ్రంగా, చిరునవ్వులు చిందిస్తున్నారేమో అతనికి అసలే నోరు పెగల్లేదు.

''సరే, కామ్రేడ్స్ రెడార్మీ సైనికులారా, అన్నీ సలక్షణంగా ఉన్నాయా?''

''అన్నీ సరిగా ఉన్నాయి కామ్రేడ్ సార్జెంట్ మేజర్. జేన్యా యీత కూడా కొట్టింది.''

''మంచి పని చేశావు కొమెల్కోవా. నువ్వు చలితో బిగిసిపోలేదు కదా?''

''ఒక వేళ బిగిసిపోయినా, నన్ను వెచ్చచేసేందుకెవరూ లేరుకదా.''

''చమత్కారం బాగుంది! రండి కామ్రేడ్స్ సైనికులారా, మనం కాస్త తిండి తిని మళ్ళీ బయల్దేరుదాం. ఎక్కువ సేపు కూర్చోకూడదు.''

వాళ్ళు కొంత బ్రెడ్డూ, హెర్రింగ్ చేపలూ తిన్నారు. మరింత పుష్టికరమైన ఆహారాన్ని తర్వాతకి అట్టేపెట్టాలని అతను నిర్ణయించుకున్నాడు. తర్వాత అతను దిగాలుగా వున్న చెత్వెర్తాక్ కోసం పాదరక్షలు తయారుచేశాడు. అతను ఆమె పాదానికి ఒక అదనపు కాలిపట్టీని చుట్టి, దాని పైన రెండు ఊలు మేజోళ్ళను ఒకదానిమీద ఒకటి — అతని గృహ యజమానురాలు అతని కోసం అల్లిపెట్టినవి — వేశాడు. తర్వాత అతను బర్చి చెట్టునుంచి పచ్చి బెరడును తీసి దానితో ఆమె పాదానికి సరిపడ తొట్టెలాంటి తొడుగును తయారుచేశాడు. అతను దాన్ని ఆమె పాదానికి సరిపడ చెక్కి, దాన్ని బాండేజి గుడ్డతో గట్టిగా బిగించాడు.

''బాగుందా?''

''చాలా బాగుంది, థాంక్ యూ, కామ్రేడ్ సార్జెంట్ మేజర్.''

''సరే, యిక మనం బయల్దేరుదాం. ఇప్పుడు మనం మరో గంటన్నర సేపు నడవాలి, అటు తర్వాత చుట్టూ పరిశీలించి, మన అతిథులకు ఎక్కడ, యెలా స్వాగతసత్కారం జరపాలో నిర్ణయించుకోవాలి....''

యువతులచేత అతను చిన్నగా పరిగెత్తించినట్లు చకచక నడిపించాడు. వాళ్ల స్కర్టులూ, యితర లోదుస్తులూ అలా చేస్తే ఆరుతాయనే అతనలా చెయ్యాల్సి వచ్చింది. అయినా యువతులెక్కడా జంక లేదు, లక్షణంగా ఉన్నారు, వాళ్ల బుగ్గలు ఎరుపెక్కడం తప్ప పెద్ద మార్పేమీ లేదు.

''సరే, పరిగెత్తండి కా(మేడ్స్ సైనికులారా! నావెంట పరిగెత్తండి!''

తనకి దమ్ముిన్నంత సేపూ అతను పరిగెత్తాడు. తర్వాత వాళ్లని అతను నడక వేగంలో పోనిచ్చాడు, ఆయాసం తీర్చుకోడానికి వ్యవధినిచ్చి, మళ్లీ ఆజ్ఞాపించాడు: ''నావెంట — పరుగెత్తండి!''

వాళ్లు వోప్ సరుస్సును సమీపించే సరికి సూర్యుడు అస్తమిస్తున్నాడు. బండల సందున నీళ్లు తాపీగా కొట్టుకుంటున్నాయి. పైన్ చెట్లు సాయంకాల మర్మరధ్వనులు వినవస్తున్నాయి. కళ్లు పొడుచుకు చూచినా సార్జెంట్ మేజరుకెక్కడా ఒక్క పడవ వున్న జాడ కూడా కనిపించలేదు. గుసగుసలాడే మందపవనాలను ఎంత ఎగపీల్చినా కూడా అతనికెక్కడా పొగ వాసన తగల్లేదు. యుద్ధానికి ముందైనా యిదేమంత జనసాంద్రత వున్న ప్రాంతం కాదు. కాగా యిప్పుడిది, అందరూ — కట్టెలు కొట్టేవాళ్లు, వేటగాళ్లు, బెస్తవాళ్లు, కీలు తయారు చేసేవాళ్లు — యుద్ధ రంగానికెళ్లిపోయారేమోనన్నట్లు, పూర్తి నిర్జనంగా వుంది.

''ప్రశాంతంగా వుంది కదూ?''

సామాన్యంగా గింగురుమనే జేన్యా స్వరం గుసగుసగా మారింది. ''ఏదో స్వప్నంలో మాదిరిగా.''

''అదిగో ఎడమ పక్క నేల సన్న పీలికలా వుంది చూశారా అక్కడ ప్రారంభమవుతుంది సిన్యూహినా కొండఅబారు'' అంటూ వస్కోవ్ వివరించాడు. ''మరో సరస్సు యీ కనుమకి అవతలి పక్కను ఒరుసుకొని వుంది. దాన్ని లెగోంతొవ్ అంటారు. పూర్వకాలం ఎప్పుడో అక్కడ ఒక సన్యాసి ఉండేవాడట — అతగాడి పేరు లెగోంత్‌ట. ఆయన శాంతి కోసం ధ్యానిస్తూండేవాడట.''

''ఇది నిస్సందేహంగా శాంతి లభ్యమయ్యే చోటు'' అంటూ నిట్టూర్చింది గూర్విచ్.

''జర్మన్లు వెళ్లగలిగే దారి ఒకే ఒక్కటుంది: రెండు సరస్సులకీ నడుమ, కొండల బారు మీదుగా. అదిగో మీరక్కడ చూస్తున్నారుకదా ఎంతెంత పెద్ద బండలున్నాయో— ఒక్కొక్కటి ఒక యిల్లంత ఎత్తున వుంది. అక్కడ మనం మన స్థావరాలు తీసుకుందాం — సైనిక నిబంధనల్లో చెప్పినట్లు — ప్రధాన స్థావరం, వెనుక స్థావరమూ మనం స్థానాలను ఎన్నుకుని, ఏదో కాస్త తిని, కొంచెం విశ్రాంతి తీసుకుని, పొంచి వుందాం. అదీ పద్ధతి కా(మేడ్ ఎ(ర సైనికులారా, ఏమంటారు?''

దీర్ఘాలోచనలో మునిగారేమో ఆ కా(మేడ్ ఎ(ర సైనికులు మౌనంగా ఉండిపోయారు.

5

వస్కోవెప్పుడూ తనకు నిజంగా ఉన్న దానికన్న ఎక్కువ వయసున్న వాని లాగే భావించుకునేవాడు. పధ్నాలుగేళ్ల వయస్సులోనే అతను వివాహితుడు చేసినంతగా కష్టం చేసేవాడు —

లేకుంటే అతని కుటుంబం బిచ్చమెత్తు కోవలసివచ్చేది. ఆ రోజుల్లో తినడానికి సరిపడినంత వుండేది కాదు, అంతా అస్థిరంగా వుండేది. కుటుంబంలో అతనొక్కడే మగాడు — తిండితీర్థాలకీ, మిగతా అన్నింటికీ కూడా యింట్లోవాళ్లంతా అతని పైననే ఆధారపడేవారు. వేసవిలో అతను వ్యవసాయపు పనులు చేసేవాడు, శీతకాలంలో వేటాడేవాడు. మనుషులకు సెలవు దినాలంటూ ఉంటాయన్న సంగతి ఇరవై యేళ్లొచ్చాక మాత్రమే అతను తెలుసుకున్నాడు. అటు తర్వాత సైనిక జీవితం. సైన్యమంటే శిశు శిక్షణాలయం వంటిదేమీ కాదు.... నిబ్బరంగా, విశ్వసనీయులుగా ఉండే వాళ్లని సైన్యం గౌరవిస్తుంది, మరి సైన్యాన్ని అతనూ గౌరవభావంతో చూసేవాడు. కాగా, యీ దశలో కూడా, తనకు నిజంగా ఉన్న దానికన్న ఎక్కువ వయసున్నవాని లాగే భావించుకునే వాడు, సీనియర్ సార్జెంట్ మేజర్ హోదాకు పెరిగాడు. సార్జెంట్ మేజరు తన సైనికులకెప్పుడూ ముసలివాడిలాగే కనిపిస్తాడు. ఉన్న విషయం అది.

ఫెదోత్ వస్కోవ్ తన వయస్సును గురించి మరచిపోయాడు. అతనికి తెలిసిందల్లా ఒక్కటే: సామాన్య సైనికులకన్న లెఫ్టినెంట్లకన్న తను వయస్సులో పెద్దవాడు, తనది కూడా అందరి మేజర్ల వయస్సే. ఏ ఒక్క కలనల్ కంటె తన వయస్సెప్పుడూ తక్కువ. ఇది సీనియారిటీకి గాని, మర్యాదమన్ననలకు గాని సంబంధించిన సమస్య కాదు. అతను లోకాన్ని చూసే తీరు అది.

అందుకని, యిప్పుడు ఆజ్ఞాపించి నడిపించాల్సివచ్చిన ఈ యువతుల విషయంలో కూడా అతను ముందు తరానికి చెందిన ఉన్నతస్థానంనుంచి అన్నట్లు చూస్తున్నాడు. తనేదో అంతర్యుద్ధంలో పాల్గొన్న యోధుని మాదిరిగా, స్వయంగా ల్పిష్చేన్స్కీ దగ్గర చపాయెవ్‌తో కలిసి టీ తాగినవాని మాదిరిగా వుంది తన యీ ప్రవర్తన. ఇందులో కార్యకారణ సంబంధం గాని, ఉద్దేశం గాని ఏమీ లేదు, అది అతని స్వభావం, అంతే.

ఒక వేళ తను, తన వయస్సుకు మించి వ్యవహరిస్తున్నానేమోనన్న ఊహ వస్కోవ్ బుర్రలోకెన్నడూ రాలేదు. ప్రశాంతంగా, వెల్తురుగా వున్న యీ రాత్రిపూట మాత్రమే యీ విషయంలో అనుమానలేశం అతని బుర్రలో మెదిలింది.

కాని మునిమాపువేళ, తామింకా తమ స్థావరాలను ఎంచుకోవలసి వుండినప్పుడు ప్రారంభమైనట్లుంది. అతని సైనికులు ఒక బండపైనుంచి మరో బండపైకి మేకల మాదిరిగా దూకుతున్నప్పుడు అకస్మాత్తుగా తనూ వారితో బాటు దూకనారంభించి, తన లాఘవం పట్ల తనే ఆబ్బుర పడ్డాడు. అతనా విషయాన్ని గమనించగానే చిరాకుపడి, మరింత గంభీరంగా తాపీగా వెళ్ల నారంభించాడు, దానితో ఒక పెద్ద బండపైకి ఎక్కడానికి అతనికి మూడు సార్లు ప్రయత్నించాల్సి వచ్చింది.

అయితేనేం, అది కాదు అసలు విషయం. అసలు విషయం తనొక అద్భుతమైన

స్థావరాన్ని కనుగొన్నాడు. బండల మధ్య, బాగా మరుగుగా వున్న ప్రవేశమార్గాలు కలిగిన చోటు అది. తామిక్కడినుంచి చూస్తే అడవి దగ్గర్నుంచి సరస్సు దాకా మొత్తం కనిపించే స్థావరం అది. కింద సరస్సు వారదాకా సాగిన పెనుబండల బారులో — సరస్సు ఒడ్డు వెంబడి ఒక సన్నని పీలిక వంటి ఖాళీ జాగా అది. జర్మన్లు యీ దారి వెంట వస్తే కొండల అంచు వెంట చుట్టి రావడానికి వాళ్లకి సుమారు మూడు గంటలు పడుతుంది. ఒక వేళ ప్రమాదమేదైనా ముంచుకొస్తే తనూ, తన సైనికులూ బండల మధ్యనుంచి తిరోగమించి, శత్రువు అక్కడికి చేరుకునేందుకు చాలా ముందుగానే యింకా వెనుకనున్న స్థావరాన్ని చేరుకోవచ్చు. అయితే యీ ఆలోచన ముందుజాగ్రత్త కోసమేననుకోండి. ఇక్కడే ప్రధాన స్థావరం దగ్గరే తను ఆ యిద్దరు పారాట్రూపర్ల పని పట్టగలనని అతను అంచనా వేసుకున్నాడు.

స్థావరాన్ని ఎంపికచేసిన మీదట, సార్జెంట్ మేజరు, నియమానుసారంగా, వాళ్లిక్కడకు చేరుకోగల కాల వ్యవధులను అంచనావేశాడు. జర్మన్ల కోసం అక్కడ తామింకా నాలుగు గంటలో ఏమో కాసుకొని ఉండాలని తేల్చుకొని, తన సైనికులకు వేడివేడి భోజనం — యిద్దరిద్దరికి ఒక్కొక్క భోజనం డబ్బా చొప్పున — తయారుచేసుకునేందుకు అనుమతించాడు. లీజా బ్రీచ్కినా వంట తను చేస్తానని ముందుకు రావడంతో, పట్నవాసపు బక్కమ్మాయిలిద్దర్నీ ఆమెకు సాయం చెయ్యడానికి కేటాయించి, ఎటువంటి పరిస్థితుల్లో కూడా పొగ ఏమాత్రం రాకూడదని కచ్చితమైన ఆదేశాలిచ్చాడు.

"ఏ మాత్రం పొగ కనిపించినా సరే, గిన్నెలో వున్న సరుకంతా పొయ్యిలో వంచేస్తాను. ఏం, బోధపడిందా?"

"బోధపడింది" విన్నబోయిన స్వరంతో లీజా జవాబిచ్చింది.

"లేదు, నీకింకా బోధపడలేదు కామ్రేడ్ ప్రైవేట్. నువ్వు నన్ను గొడ్డలి అడిగి, నీ సహాయకులను ఎండు కట్టెలు కొట్టేందుకు పంపితే, అప్పుడు మాత్రమే నీకు సరిగా బోధపడినట్టు. పాకుడు లేని కొమ్మలను, మెత్తమెత్తగా కాకుండా పెళుక్కున విరిగే కొమ్మలను మాత్రమే కోసుకొచ్చేలా చూడు. అప్పుడు మంట మాత్రమే గాని పొగ వుండదు."

ఆజ్ఞ అంటే ఆజ్ఞే, కాని ఉదాహరణ కోసం, అతను బాగా ఎండిన కట్టెపుల్లలు కొన్ని ఏరి మంట చేశాడు. ఒస్యానినాతో కలిసి అతనొక వంక ప్రదేశాన్ని పరిశీలిస్తూనే మరో వంక మంటకేసి చూస్తున్నాడు, కానైతే పొగ యేమీ లేదు: బండల పైన గాలి అస్పష్టమైన చంచల కాంతి బరపుతోంది, కాని దాన్ని పసిగట్టడం అనుభవజ్ఞుడైన వేటగానికి మాత్రమే సాధ్యం, జర్మన్లకు అటువంటి నిశిత దృష్టి వుండటం సాధ్యం కాదు.

ఒక పక్క ఆ ముగ్గురూ వంటలో నిమగ్నులై యుండగా, వస్కోవ్, జూనియర్ సార్జెంట్ ఒస్యానినా, ప్రైవేట్ కొమెల్కోవాలు కనుమను అధిరోహించి, స్థావరాలూ,

కాల్పులు సాగించేందుకు అనువైన ప్రాంతాలూ, పరిశీలక స్థావరాలూ ఎంచుకున్నారు. పరిశీలక స్థావరాల మధ్య దూరాలను స్వయంగా పెద్ద పెద్ద అంగలేసి కొలిచి, నిబంధనల్లో పేర్కొనబడినట్టు వస్కోవ్ వాటిని మ్యాపులో గుర్తులు పెట్టాడు.

భోజనానికి రావలసిందిగా పిలుపొచ్చింది. వచ్చిన వాళ్లు వచ్చినట్లు వాళ్లు జంటలు జంటలుగా కూర్చున్నారు. కమాండెంటు ప్రైవేట్ గూర్విచ్‌తో కలిసి ఒక డబ్బాలోని పదార్థం తింటున్నాడు. ఆమె బిడియం బిడియంగా చెమ్చాను డబ్బాలో ముంచి ఖాళీ చెమ్చాను పైకి తీస్తూ, పదార్థంలో ఎక్కువ భాగం అతనికి వదిలేస్తోంది. సార్జెంట్ మేజరు అనంగీకారంగా అన్నాడు: "అలా చెయ్యాల్సిన అవసరం లేదు కామ్రేడ్ దుబాసీ. నేను నీ ప్రియుడినేమీ కాను, అందుచేత అలా గట్టి ముక్కలు నాకు వదిలెయ్యాల్సిన అగత్యమేమీ లేదు. సరైన సైనికుడి లాగ బాగా లాగించు."

"నేను లాగిస్తూనే వున్నాను" నవ్వుతూ అందామె.

"చూస్తూనే వున్నానుగా ఎంత లాగిస్తున్నావో! వేసవిలో కాకిలాగ ఎండిపోయి వున్నావు."

"నా శరీరతత్వం అలాంటిది."

"శరీరతత్వమా? బ్రీచ్కినాదైనా నీ శరీరతత్వం లాంటిదే, మిగతా వాళ్ల తత్వం లాంటిదే, కాని ఆమె ఆకారం చూడు కాస్త కంటికి నిండుగా కనిపిస్తుంది."

భోజనానంతరం వాళ్లు బిల్బెర్రీ ఆకుల టీ తాగారు. ప్రయాణ క్రమంలో వస్కోవ్ ఆ ఆకుల్ని పోగుచేశాడు. ఆటుతర్వాత వాళ్లొక అర్ధగంట విశ్రాంతి తీసుకున్నారు, అప్పుడిక సార్జెంట్ మేజరు క్రమంలో నిలబడాల్సిందిగా వాళ్లను ఆజ్ఞాపించాడు.

"ఈ పోరాట ఉత్తరువును వినండి." తన హృదయాంతరాళంలో తను సరైన పనే చేస్తున్నానా అని ఒక మూల సంకోచిస్తూనే అతను గంభీరంగా మొదలుపెట్టాడు. "శత్రువు – నఖశిఖ పర్యంతం ఆయుధాలు ధరించిన యిద్దరు జర్మన్లు – కీరొవ్ రైలు మార్గానికీ, కామ్రేడ్ స్టాలిన్ పేరు గలిగిన తెల్ల సముద్రం-బాల్టిక్ కాల్వకీ చేరుకునే లక్ష్యంతో రహస్యంగా చొరుచుకు వస్తున్నాడు. ఆరుగురితో కూడిన మన దళం సిన్యూహినా కొండల బారును పరిరక్షించడమే కాకుండా, అది శత్రువును బందీనికూడా చెయ్యాల్సివుంది. మనకి ఎడమ పక్కన వోప్ సరస్సూ, కుడి పక్కన లెగోంతొవ్ సరస్సూ వున్నాయి." సార్జెంట్ మేజరు ఆగి, దగ్గి, ఈ ఆజ్ఞని తను ముందొక కాగితం పైన రాయనందుకు విచారిస్తూ తిరిగి కొనసాగించాడు: "నా పథకం యిదీ: శత్రువుకి ప్రధాన స్థావరంలోనే ఎదురెళ్లి, కాల్చకుండా, వాళ్లని లొంగిపొమ్మని హెచ్చరించడం. ఒక వేళ వాళ్లు లొంగిపోకుండా ప్రతిఘటించినట్లయితే వాళ్లలో ఒకడిని కాల్చెయ్యడం, ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే రెండో వాడిని ప్రాణాలతో పట్టుకోవడం. మన సామగ్రినంతటినీ వెనక స్థావరంలో అట్టేపెట్టాలి, దానికి ప్రైవేట్ చెత్‌వెర్తాక్ కాపలా వుండాలి. నేను ఆజ్ఞ యిచ్చిన తర్వాతనే యుద్ధచర్య

మొదలు కావాలి. జూనియర్ సార్జెంట్ ఒస్యానినాను నాకు డిప్యూటీగా నియమిస్తున్నాను, ఒక వేళ ఆమె పోరాటంలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడినట్లయితే ప్రైవేట్ గూర్విచ్ నా డిప్యూటీగా పనిచెయ్యాలి. ప్రశ్నలేమైనా ఉన్నాయా?''

''నేను వెనక స్థావరంలో ఎందుకుండిపోవాలి?'' చిన్నబోయిన స్వరంలో చెత్వెర్తాక్ ప్రశ్నించింది.

''కామ్రేడ్ ప్రైవేట్, నువ్వడిగిన ప్రశ్నకు అర్థం లేదు. నీకు ఆజ్ఞ యివ్వబడింది, దాన్ని నువ్వు పాటించాలి, అంతే.''

''గాల్యా, నువ్వే మా రిజర్వు'' ఒస్యానినా అంది.

''ప్రశ్నలలో పని లేదు, అంతా చక్కగా, స్పష్టంగా వుంది'' కొమెల్కోవా హుషారుగా జవాబిచ్చింది.

''చక్కగా స్పష్టంగా ఉంది ఔనా, మరి మీరంతా ఎవరి స్థానానికి వాళ్ళు చేరుకోండి.''

ఒస్యానినాతో తను అంతకు ముందే చర్చించి ఏర్పాటు చేసిన స్థానాల్లో అతను సైనికులను ఉంచాడు, వాళ్ళలో ఒక్కొక్కరికే కొండగుర్తులు చూపించాడు, గుట్టు చప్పుడు కాకుండా నిశ్శబ్దంగా ఉండాలని తను ఒక్కొక్కరినే స్వయంగా హెచ్చరించాడు.

''ఎవళ్ళూ ఒక్క వేలు కూడా కదపకూడదు. ముమ్మందు నేను వాళ్ళతో మాట్లాడుతాను.''

''జర్మన్‌లోనేనా?'' గూర్విచ్ వ్యంగ్యంగా ప్రశ్నించింది.

''రష్యన్లో!'' సార్జెంట్ మేజరు కటువుగా అన్నాడు. ''వాళ్ళకి అర్థం కాకపోతే, నువ్వు అనువదిస్తావు. బోధపడిందా?''

నిశ్శబ్దం ఆవరించింది.

''పోరాటం జరిగేటప్పుడు మీరు గుడ్లగూబల్లా తలలు పైకెత్తకండి, యిక్కడ ప్రథమ చికిత్స చేసే వాళ్ళు గాని, మీ అమ్మలు గాని అందుబాటులో లేరని గుర్తుపెట్టుకోండి.''

వాళ్ళ తల్లుల సంగతి తను ప్రస్తావించడం తప్పు, తప్పే కాదు శుద్ధ తప్పు, లోలోపల అతను తన పట్ల తనే మండిపడ్డాడు. ఏమైనా, యిది తుపాకి కాల్పుల శిక్షణ వ్యవహారం కాదు, నిజమైన యుద్ధ చర్య కాబోతోంది.

''జర్మన్లతో దూరంనుంచి యుద్ధం చెయ్యడం బాగానే ఉండచ్చు, వాళ్ళు సమీపంలో ఉన్నప్పుడు మీరు రైఫిలు బోల్టులను చప్పుడు చెయ్యడం మొదలెట్టారో వాళ్ళు మీ శరీరాలను జల్లెళ్ళ లాగా తూట్లు పొడిచేస్తారు. అందుకని నేను మిమ్మల్ని నిశ్శబ్దంగా పడుకోవలసిందిగా నిర్ద్వంద్వంగా ఆజ్ఞాపిస్తున్నాను. కాల్చవలసిందిగా నేను స్వయంగా ఆజ్ఞాపించే దాకా మీరు నిశ్శబ్దంగా పడుకునే వుండండి. అలా చెయ్యకపోయారో మీరు ఆడపిల్లలనే విచక్షణ నేనేమీ చూపించబోను.''

ఈ ఘట్టంలో వస్కోవ్ ఆగి, చెయ్యి జాడించాడు. "అంతే వివరణ పూర్తయింది."

ఒక్కొక్క జంటకి అతను ఒక్కొక్క పరిశీలన ప్రాంతాన్ని అప్పగించాడు. అంటే ఒక్కొక్క కేంద్రంనుంచి రెండు జతల కళ్లు పరిశీలిస్తూ వుంటాయన్న మాట. అతను స్వయంగా యింకా ఎత్తు ప్రాంతానికెళ్లి బైనాక్యులర్సతో తన కళ్లలో నీళ్లు తిరిగే దాకా తీక్ష్ణంగా చుట్టూ పరిశీలించాడు.

సూర్యుడిప్పుడు చెట్ల చిటారు కొమ్మల్లో చిక్కుకున్నట్లున్నాడు, కాని అతను పడుకున్న బండ యింకా ఎండ వేడిని కోల్పోలేదు. అతను తన బైనాక్యులర్లను పక్కన పెట్టి తన కళ్లకు విశ్రాంతి నిచ్చేందుకుగాను వాటిని మూసుకున్నాడు. తనకు కునుకు పడుతోందన్న సంగతిని అతను గుర్తించేందుకు ముందే బండలోని వెచ్చదనం అతన్నెక్కడికో ప్రశాంత లోకాలకు తీసుకుపోయింది. మందంగా వీచే చల్లగాలి తన ఒంటిని తాకుతున్నట్లూ, చుట్టూ శబ్దాలన్నీ తనకు వినిపిస్తున్నట్లే వస్కోవుకి అనిపిస్తోంది. అయినా తను తన యింట్లో పొయ్యి గూడు మీద పడుకున్నట్లూ, కాని తను దానిపైన దుప్పటి కప్పడం మరచిపోయినట్లూ, అయినా తనీ విషయం తన తల్లితో చెప్పాలన్నట్లూ అతనికి అనిపించింది. చకచక నడుస్తూ, కుదిమట్టంగా, తన రైతాంగ జీవితంనుంచి స్వల్ప విరామాన్ని అంకించుకుంటున్నట్లు, ఏళ్ల తరబడిగా కోడికునుకు మాత్రమే తీస్తున్న తన తల్లి సైతం అతనికి కనిపించింది. ఊహకి అందనంత సన్నగా వున్న ఆమె చేతులను, కీళ్ల నొప్పుల మూలంగానూ, అతి చాకిరీ మూలంగానూ బిగిసిపోయిన ఆమె వేళ్లనూ అతను చూశాడు. ఒడిలిపోయిన ఆపిలు పండు మాదిరిగా ముడుతలు పడిపోయిన ఆమె ముఖాన్నీ, పాలిన బుగ్గలపై జాలువారిన కన్నీటి చారికలనూ చూసి, చనిపోయిన ఇగోర్ కోసం ఆమె యింకా విలపిస్తూనే వున్నదనీ, తనను తానింకా నిందించుకొంటూనే ఉందనీ, వాడి మృతికింకా కుమిలిపోతూనే ఉందనీ గ్రహించాడు. అతను ఆమెను సముదాయించాలనుకున్నాడు, కాని అంతలో అకస్మాత్తుగా ఒక చెయ్యి అతని కాలిని స్పృశించింది. ఎందుకో తెలియదు గాని అది తన తండ్రి చెయ్యి అని అతను నిర్ణయించుకుని విపరీతంగా గాభరాపడిపోయాడు. కళ్లు తెరిచాడు. ఒస్యానినా బండపైకెక్కి, అతని కాలిని తట్టుతోంది.

"జర్మన్లా?"

"ఎక్కడ!?" ఆమె గాభరాగా ఎదురు ప్రశ్నించింది.

"నీ పాపం గూల.... నేనేమనుకున్నానంటే...."

ఆమె అతని వంక చాల సేపు తదేకంగా చూసి చిరునవ్వు నవ్వింది.

"ఓ కునుకు తియ్యండి, కామ్రేడ్ సార్జెంట్ మేజర్. నేను మీ ఓవర్‌కోటు తెచ్చి పెడతాను."

‘‘అది అసంభవం ఒస్యానినా నాకేదో కాస్త పొగన్ను పడిందంతే. ఓ సిగరెట్టు కాల్చుకోవాలి.’’

అతను క్రిందకి వెళ్లాడు. కొమెల్కోవా బండ మాటున కూర్చుని తల దువ్వు కుంటోంది. జుట్టు దుబ్బులా ఒత్తుగా వుందేమో ఆమె వీపే కనిపించడం లేదు. ఆమె జుట్టును దువ్వడం మొదలుపెట్టి, చేతికి అందినంతవరకు దువ్వెనను పోనిచ్చి, ఆటు తర్వాత క్రింది తలకట్టును చేత్తో పైకెత్తి దువ్వెనతో కొసలకంటా దువ్వుతోంది. ఆమె జుట్టు ఒత్తుగా, మెత్తగా, మెరుగుపెట్టిన రాగి వన్నెలా వుంది. ఆమె కదలికలు సుతారంగా, తాపీగా వున్నాయి.

‘‘రంగేశావేమో, కదూ?’’ సార్జెంట్ మేజరు అడిగాడు. కాని అంతలోనే, ఆమె కోపం తెచ్చుకుని ఎక్కడ పెళసరంగా జవాబిస్తుందో, దానితో రంగమెక్కడ చెడుతుందోనని భయపడ్డాడు.

‘‘లేదు, సహజమైనదే. చీదరగా వున్నానేమో కదూ?’’

‘‘దానిదేముందిలే, బాధపడకు.’’

‘‘మీరు కూడా బాధపడకండి. లీజా బ్రీచ్కినా అదుగో, కళ్లు బార్లా తెరుచుకు చూస్తోంది. ఆవిడగారు అన్నీ బాగా పరకాయించి చూస్తూ వుంటుంది.’’

‘‘సరే, సరే. నీ అవసరాలు తీర్చుకో, దీన్ని తొందరగా ముగించు....’’

ఓరి భగవంతుడా మళ్లీ అదే మాటా! అసలింతకీ అది సైనిక నియమాల్లో ఉండట మొచ్చింది తంటా. అంతే, ఆయనగారి మనస్సులో ముద్రితమై పోయింది. నువ్వు శుద్ధ అడవి ఎలుగుబంటివి వస్కోవ్!

అతను కనుబొమ్మలు ముడిచి, ఓ సిగరెట్టు ముట్టించుకుని, ఆ పొగలో మునిగి పోయాడు.

‘‘కామ్రేడ్ సార్జెంట్ మేజర్, మీకు పెళ్లైందా?’’

అతను ఆమె వంక చూశాడు. ఎర్రని మంటల్లోంచి అన్నట్లు ఆకుపచ్చని ఒక కనుగుడ్డు అతని వంక తేరిపారజూస్తోంది. ఏం కన్నురా బాబూ! 152 ఎమ్. ఎమ్. పొట్టి ఫిరంగి అంత మారకశక్తి కలిగినది.

‘‘అయింది, కామ్రేడ్ ప్రైవేట్ కొమెల్కోవా.’’

సహజంగానే అతను అబద్ధం చెప్పాడు. ఆటువంటి సాహచర్యంలో చెయ్యగలిగినది మరొకటేముంది గనుక. దానితో తన స్థానం నిర్దేశితమై, ఎవరుండాల్సిన హద్దులేమిటో నిర్ణయింపబడ్డాయి.

‘‘మరి మీ భార్య ఎక్కడుంది?’’

‘‘ఇంకెక్కడుంటుంది, యింటి దగ్గరుంది.’’

''ఏమన్నా పిల్లలా?''

''పిల్లలా?'' ఫెదోత్ వస్కోవ్ నిట్టూర్చాడు. ''ఓ చిన్న కుర్రాడుండేవాడు. సరిగా యుద్ధానికి ముందు వాడు చచ్చిపోయాడు.''

''చచ్చిపోయాడా?''

ఆమె తన జుట్టును వెనక్కి విదిలించి, అతని వంక, అతని హృదయపు లోతుల్లోకి, చూసింది. ఔను, అతని హృదయాంతరాళంలోకి. ఇంకేమీ మాట్లాడలేదు. ఆమె సానుభూతి వాక్యాలు పలకలేదు, వేళాకోళాలు ఆడలేదు, వ్యర్థ వ్యాఖ్యానాలు చెయ్యలేదు. ఎందుకో తెలియదు గాని వస్కోవే యిక ఉండబట్టలేక నిట్టూరుస్తూ అన్నాడు: ''కొంత మేరకు దీని బాధ్యత అమ్మదేననుకో....''

అలా అన్నందుకు అతను వెంటనే పశ్చాత్తాప పడ్డాడు. ఎంత విపరీతంగా పశ్చాత్తప్తుడయ్యాడంటే అతను తటాలున ఎగిరి గంతేసి, ఇన్‌స్పెక్షనుకేమోనన్నట్లు తన దుస్తుల్ని సరిచేసుకున్నాడు.

''ఇక్కడ పరిస్థితి ఎలాగుంది ఒస్యానినా?''

''కనుచూపులో ఎవరూ లేరు, కామ్రేడ్ సార్జెంట్ మేజర్.''

''పరిశీలన కొనసాగించు!''

అతను ఒకరి తర్వాత మరొకరి దగ్గర కెళ్ళాడు.

సూర్యుడు అస్తమించి చాల సేపే అయింది, సూర్యోదయానికి సరిగా ముందున్నట్లే యింకా వెల్తురుంది, ప్రైవేట్ గూర్విచ్ తన బండ వెనుక ఏదో పుస్తకం చదువుకుంటోంది. ఏదో ప్రార్థన చేస్తున్నట్టు, పాటలా సాగదీస్తూ చదువుతోంది. వస్కోవ్ ఆమెను పలకరించేందుకు ముందు కొంచెం ఆగి విన్నాడు.

దేశపు హీన దశలో పుట్టిన వారికి
తమవంటూ ఉజ్జ్వల స్మృతులుండవు.
రష్యా ఉచ్ఛ దశలో ఉదయించిన మేమో
విస్మరించలేకపోతున్నాం ఆ గతవైభవాన్ని.

పెనుమంటల, బూడిదరాసుల యీవత్సరాలు
ఆకటినీ వేదననే తెస్తాయో, ఆశలనే మోసులెత్తిస్తాయో
యుద్ధదినాలూ, స్వాతంత్ర్యపు రోజులూ
మన ముఖాలపై వదుల్తాయి రక్త పంకిల స్మృతిబింబాలు....

''ఎవరికి చదివి వినిపిస్తున్నావ్?'' ఆమె దగ్గరకు వెళ్లి అతను ప్రశ్నించాడు.

దుబాసీ గాభరా పడిపోయింది (ఏదేమైనా, తనకు యివ్వబడిన ఆజ్ఞ కాపలా కాయ

మని కదా). ఆమె పుస్తకాన్ని కింద పెట్టేసి లేచి నిలబడబోయింది. కాని సార్జెంట్ మేజరు ఆమెను కూర్చోమని సంజ్ఞ చేశాడు.

"నేను అడిగినది, నువ్వెవరికోసం పైకి చదువుతున్నావని."

"అబ్బే ఎవరికోసమూ కాదు. నా కోసమే నేను చదువుకుంటున్నాను."

"మరైతే పైకెందుకు చదువుతున్నావ్?"

"అదా, కవిత్వం కదా?"

"సరే, ఊఁ...." అందులోని తర్కం వస్కోవ్‌కి బోధపడలేదు. అతనా పుస్తకాన్ని పైకి తీశాడు — హాండ్ గ్రెనేడ్ ప్రయోగ శిక్షణకు సంబంధించిన పుస్తకం లాగ అది పల్చటి పుస్తకం. — దాన్ని తిరగేశాడు. "నీ కళ్లు పాడవుతాయి."

"వెల్తురుంది, కామ్రేడ్ సార్జెంట్ మేజర్."

"సరే, నేను చెప్పాను, తర్వాత నీ యిష్టం.... వింటున్నావా, నువ్వీ రాళ్లమీద కూర్చోకూడదు. ఇవి త్వరలోనే చల్లారిపోతాయి, నువ్వు గమనించే లోగానే నీ ఒంట్లోని వేడిని పీల్చేస్తాయి. నీ ఓవర్‌కోటు వేసుకుని కూర్చో."

"అలాగే, కామ్రేడ్ సార్జెంట్ మేజర్, థాంక్యూ."

"కాని బిగ్గరగా చదవబోకు. సాయంత్రపు గాలి తేమగా వుంది, అది శబ్దాన్ని మోసుకెడుతుంది. ఇక్కడ ప్రత్యూష కాలం ఎంత ప్రశాంతంగా వుంటుందంటే, నీ స్వరం అయిదు కిలోమీటర్ల దూరం వినిపిస్తుంది. జాగ్రత్తగా వుండు, బహు జాగ్రత్తగా వుండు ప్రైవేట్ గూర్విచ్."

బ్రీచ్కినా యితరులకన్న సరస్సుకి మరింత దగ్గరగా వుంది, అతనింకా ఆమెను సమీపించకముందే, వస్కోవ్ తృప్తిగా మందహాసం చేశాడు. నిజంగా తెలివైన పిల్లంటే యిలా వుండాలి! ఆమె కొన్ని ఫర్ కొమ్మలు విరుచుకొని, రెండు బండల సందున తన కోసం వెచ్చని సుఖమైన గూడొకటి తయారుచేసుకుంది, దాని పైన తన ఓవర్‌కోటు కప్పింది. తన సత్తా తనకి తెలిసిన మనిషి. "నీది ఏ ప్రాంతం బ్రీచ్కినా?" వస్కోవ్ ఆసక్తిగా ప్రశ్నించాడు.

"మాది బ్ర్యాన్స్క్ ప్రాంతం, కామ్రేడ్ సార్జెంట్ మేజర్."

"నువ్వు సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో పనిచేశావా?"

"ఔననుకోండి. కాని, నేను ఎక్కువభాగం మా నాన్నకి సాయం చేస్తూండేదాన్ని. ఆయన ఫారెస్టరు, మేం ఆయన అడవి యిలాకాలో వుండే వాళ్లం."

"అలా చెప్పు, అందుకనే నువ్వు బాతుల అరుపుల్ని అంత చక్కగా అనుకరించావు."

ఆమె పకపక నవ్వింది. ఈ ఆడపిల్లలు నవ్వడమంటే పడి చస్తారు, ఆ అలవాటింకా పోలేదు వీళ్లకి.

"నువ్వేమైనా గమనించావా?"

"లేదు, యింతవరకు ప్రశాంతంగానే వుంది."

"హెచ్చరికగా వుండు బ్రిచ్కినా. సొదలేమన్నా కదిలినా, లేకుంటే పక్షులు భయసంకేతాలు ప్రదర్శించినా జాగ్రత్తగా చూడు. నువ్వు అడవులనుంచి వచ్చావు కదా. నీకు నేను చెప్పనక్కర్లేదు, నీకా సంగతులు తెలుసు."

"ఔను."

"అద్గదీ సంగతి, అలాగుండాలి."

అతను తన బరువును మరో పాదం పైకి మార్చుకున్నాడు. అతను తను చెప్పాల్సిందంతా చెప్పినట్టున్నాడు, ఆదేశాలు కూడా యిచ్చినట్లున్నాడు, కాని అతని కాళ్ళు అక్కడినుంచి ససేమిరా కదలడం లేదు. ఈమె తనకు నచ్చిన అమ్మాయి. అడవులకు చెందిన అమ్మాయి. ఈమె తనకు తాను వెచ్చని సౌకర్యమైన గూడును కల్పించుకుంది, ఈమెనుండి ఎంతో వెచ్చదనం ప్రసరిస్తోంది – యిప్పుడే తను కన్న కలలోని రష్యన్ గూడుపొయ్యి మాదిరిగా.

"లీజా, లీజా, లీజావేతా, ప్రేమా లేఖా పంపావేలా, ప్రియునికి పాటా పాడావేలా, అతనంటే నీకిష్టం లేదా?" అంటూ సార్జెంట్ మేజరు ఏకబిగిన గడగడ పాడేశాడు. అటు తర్వాత అనుత్సాహపూరిత స్వరంలో వివరించాడు: "ఇది మా ప్రాంతంలో పదిమందీ పాడుకునే పదం."

"మా ప్రాంతంలో... కూడాను."

"తర్వాత మనమిద్దరం జంటగా పాడుదాం, లీజావేతా. మన కర్తవ్యం ముగించి, తర్వాత పాడుదాం."

"మీరు నిజంగానే అంటున్నారా?" లీజా నవ్వింది.

"నేను చెప్పానుకదా?"

సార్జెంట్ మేజరు ఆమె వంక కొంటెగా కన్నుకొట్టాడు (అది ఆమెనుకన్న అతన్నే ఎక్కువ ఆశ్చర్యపరచింది), టోపీ సర్దుకుని, దోవపట్టాడు. అతని వెనక బ్రిచ్కినా అరిచింది: "అయితే మీ వాగ్దానం గుర్తుంచుకోండి కామ్రేడ్ సార్జెంట్ మేజర్! మీరు మాట యిచ్చారు!"

అతను బదులు పలకలేదు, కాని రిజర్వు స్థావరానికి వెళ్ళేలోగా తోవలో అంతటా ముసిముసి నవ్వులు నవ్వుతూనే వున్నాడు. అక్కడ తన చిరునవ్వుకి స్వస్తి చెప్పి, ప్రైవేట్ చెత్వెర్తాక్ ఏకాంత స్థావరాన్ని వెతకనారంభించాడు.

ప్రైవేట్ చెత్వెర్తాక్ ఒక కొండకొమ్ము మాటున గాలి తగలని చోట తన ఓవర్ కోటును బిగువుగా కప్పుకొని, తన చేతులను జేబుల్లో జొనుపుకొని వాళ్ళ మూటల పైన

కూర్చునివుంది. ఓవర్‌కోటు కాలరు పైకి లేపబడిన కారణంగా ఆమె తలా, సైనిక టోపీ కూడా కప్పబడిపోయి, ముందుకు దిగాలుగా, ఎర్రగా పొడుచుకొచ్చిన ఆమె ముక్కు ఒక్కటి మాత్రమే కనిపిస్తోంది.

"అలా ముడుచుకు కూర్చున్నావేమిటి, కామ్రేడ్ ప్రైవేట్?"

"చలేస్తోంది."

అతను తన చేతిని ముందుకు చాపాడు, ఆమె వెనక్కి తగ్గింది. ఆ పిచ్చిపిల్ల అతను తనమీద చెయ్యి చేసుకుంటాడనే అనుకుందో, మరేం చేస్తాడనుకుందో....

"కదలకు! నీ నుదుటిని తాకనియ్యి. ఇలారా!"

ఆమె తన మెడను ముందుకు చాచింది, సార్జెంట్ మేజరు తన అరచేతిని ఆమె నుదుటికి ఒత్తాడు. ఔను, అది వేడిగా వుండటమే కాదు, మండుతోంది. వీళ్ల దుంపతెగ, యీ ఆడపిల్లలతో ఒక తంటా కాదు.

"నీకు జ్వరం తగిలింది, తెలుసా."

ఆమె బదులు పలకలేదు. ఆమె కళ్ళు విచారంగా — ఆవుపెయ్య కళ్లంత దీనంగా — వున్నాయి; ఆ చూపులు చూసిన ఎవరికైనా సరే తనేదో పొరపాటు చేశానని అనిపించక మానదు. ఆ ఊబి కారణమనుకుంటాను సార్జెంట్ మేజర్, అనుకున్నాడతను. నీ సైనికుడు బూటును కోల్పోవడం, నీ తొందరా, మే మాసపు చల్లని గాలీ యివన్నీ కారణాలైయుంటాయి. ఏమైతేనేం, యిప్పుడు నీ సైనికుడొకడు మూలపడ్డాడు, అనుకున్నాడతను. దళానికి భారం, తన అంతరాత్మకి భారం.

ఫెదోత్ వస్కోవ్ తన నాప్‌శాక్ బయటకు తీసి, బెల్టులు విప్పి, లోపల గాలించాడు. అత్యంత ముఖ్యమైన అతని సొంత పరిమిత రేషన్లు దానిలో ఓ మూల భద్రంగా దాచబడి వున్నాయి — 750 గ్రాముల ఒక సారా ఫ్లాస్కు. అతను దానిలోంచి కొంచెం ఓ మగ్గులోకి వంచాడు.

"నువ్వు దీన్ని యిలాగే పుచ్చుకుంటావా నీళ్లు కలపమన్నావా?"

"ఏమిటది?"

"మందు.... ఓ, సరేలే, యిది సారా. ఏం?"

ఆమె గట్టిగా అభ్యంతరం చెప్పింది: "అబ్బెబ్బే, వద్దు, వద్దు!"

"ఇది ఆజ్ఞ."

కొంచెం ఆలోచించిన మీదట, సార్జెంట్ మేజరు దానికి కొంచెం నీళ్లు కలిపాడు. "ఇది తాగేసి, తర్వాత మరి కొంచెం నీళ్లు తాగు."

"ఊహుఁ."

"మాట్లాడకుండా తాగెయ్యి."

''ఏమిటండీ మీరు మరీని! మా అమ్మ డాక్టరు....''

''ఇక్కడ అమ్మల్లేరు. ఇక్కడున్నదల్లా యుద్ధం, జర్మన్లూ, సార్జెంట్ మేజరూ — అంతే గాని అమ్మలుండరు. బతికులన్న వాళ్లకే అమ్మలుంటారు. ఏం, బుర్రకెక్కిందా?''

ఆమె ఉక్కిరిబిక్కిరవుతూ, దాన్ని ఎత్తి గొంతులో పోసేసుకుంది. కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి, ఆమె ఏదేదో గొణిగింది. వస్కోవ్ ఆమెను వీపుపై తట్టాడు, ఆమె తేరుకుని, తన కన్నీళ్లను తుడిచేసుకునేందుకు విఫల ప్రయత్నాలు చేసింది. ఆమె చిరునవ్వు నవ్వి, ''ఓరి దేముడోయ్, నా తల యిలా ఎక్కడికో తేలిపోతోందేమిటి....'' అంటూ కేకేసింది.

''రేపటికి నువ్వు తేరుకుంటావు.'' అతను ఓ సందెడు ఫర్ రెమ్మలు తీసుకొచ్చి ఓ మాదిరి పక్కలాగ సర్ది ఆమెను పడుకోబెట్టి తన ఓవర్‌కోటును ఆమెకు కప్పి: ''విశ్రాంతి తీసుకునేందుకు ప్రయత్నించు కామ్రేడ్ ప్రైవేట్'' అన్నాడు.

''కాని ఓవర్‌కోటు లేకుండా మీరెలా గడుపుతారు?''

''నేను ఆరోగ్యంగా దుక్కలా ఉన్నాను, అందుకని నన్ను గురించి నువ్వేమీ ఆదుర్దా పడకు. రేపటికల్లా నువ్వు తేరుకో, అదొక్కటే నిన్ను నేను ప్రత్యేకించి కోరేది.''

అంతటా గాఢమైన నిశ్శబ్దం ఆవరించింది. అడవి, సరస్సులు, చివరకు గాలి సైతం రాత్రికిక విశ్రాంతి తీసుకున్నట్టు స్తబ్ధతలో మునిగాయి. అర్ధరాత్రి దాటింది, కొత్త రోజు ఆరంభమవుతోంది, కాని అప్పటికీ జర్మన్ల ఐపూ జాడా లేదు. రీతా ప్రతి కొద్ది నిమిషాలకీ సార్జెంట్ మేజరు వంక చూస్తోంది. అతనితో తను ఒంటరిగా వున్నప్పుడల్లా అడుగుతూ వచ్చింది: ''మనం యిక్కడ కూర్చోడం, టైము దండగేమో?''

''దండగేనేమో'' అంటూ సార్జెంట్ మేజరు దీర్ఘ నిశ్వాసం విడిచాడు. ''కాని నేనలా అనుకోడం లేదు. అంటే అదే, నువ్వు ఏ చెట్టు మొదళ్లనో చూసి జర్మన్లని అనుకొని ఉండకపోతే.''

అప్పటికి అతను కాపలా పనిని విరమింపజేసి, ఫర్ రెమ్మలు తెచ్చుకుని పడకలు తయారు చేసుకుని, తను వాళ్లను లేపే దాకా నిద్రపొమ్మని చెప్పి, వాళ్లని వెనక స్థావరానికి పంపేశాడు. పోతే తను, ప్రధాన స్థావరంలో ఉండేందుకు నిశ్చయించుకున్నాడు. తను కూడా అతనితో బాటు మేల్కొని వుంటానని ఒస్యానినా పట్టుబట్టింది.

జర్మన్లు రాకపోవడం అతనికొక పెద్ద చిక్కుప్రశ్నలా తయారైంది. అసలింతకీ, రైలు మార్గానికెళ్లడానికి వాళ్లు మరో మార్గాన్ని ఎంచుకున్నారేమో; ఆ మాటకొస్తే వాళ్ల కర్తవ్యం తను ఊహించినది కాక, అందుకు పూర్తిగా భిన్నమైన మరేదైనా ఏమో? ఆ లెక్కన వాళ్లు యిప్పటికే బోలెడంత నష్టం కలిగించియుండచ్చు, ఏ గొప్ప వ్యక్తినైనా వాళ్లు కాల్చిచంపారో ఏమో, ముఖ్యమైన దేన్నైనా పేల్చేశారేమో? అదే నిజమైతే, అడవిని గాలించి జర్మన్లను సఫాచేసేందుకు బదులు, తన సైనిక యువతుల బృందాన్ని ఎవరికీ

తెలియని చోటు కెక్కడికో తీసుకెళ్లినందుకు తను సైనిక కోర్టుకి సంజాయిషీ చెప్పు కోవాల్సిందే. తను ఈ యువతుల్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాడా? వాళ్లని ప్రత్యక్ష పోరాటంలోకి దింపేందుకు తను భయపడ్డాడా? ఆజ్ఞాపాలనం చెయ్యకపోవడానికి అది సాకేమీ కాదు, ఎంతమాత్రమూ కాదు.

"మీరు కొంచెం సేపు నిద్ర పోవాలి సార్జెంట్ మేజర్. నేను మిమ్మల్ని తెల్లవారు జామున లేపుతాను...."

నిద్రా? నిద్ర దుంప తెగిరిలే! ఓవరుకోటు లేకపోయినా కూడా, తనకి చలే అనిపించడం లేదు....

"నన్ను నిద్రపొమ్మని వేధించకు, ఒస్యానినా. జర్మన్లను పట్టుకోడంలో పప్పులో కాలేస్తే, నేనెలాగా నిద్ర పోతానులే స్వర్గంలో లాగ."

"కాని వాళ్లైనా యిప్పుడు నిద్ర పోరంటారా?"

"నిద్ర పోవడమా?"

"ఎందుకు పోరు? వాళ్లు కూడా మానవ మాత్రులే కదా? రైలు మార్గాన్ని చేరుకోడానికి సిన్యూహినా కొండలబారు ఒక్కటి మాత్రమే అనువైన దోవ అని స్వయంగా మీరే చెప్పారు కదా. మరి దూరం సంగతి ఆలోచించండి...."

"ఉండు, ఒస్యానినా, ఉండు! అంటే 50 కిలోమీటర్లో అంతకంటె కొంచెం ఎక్కువేమో కూడా. అందులోనూ అపరిచిత ప్రాంతంలో, ప్రతి ఒక్క పొదను చూసీ బెదురుతూనే రావాలి.... అంతేనా? నేను చెప్పింది సరైనదేనా?"

"ఔను, కామ్రేడ్ సార్జెంట్ మేజర్."

"సరే, అలా అయ్యేటూటైతే, దట్టమైన అడవిలో ఆగి సూర్యోదయం దాకా నిద్రపోవడానికే వాళ్లు తప్పక నిర్ణయించుకొనివుంటారు. మరి సూర్యోదయమైనప్పుడు.... ఏమంటావ్?..."

రీతా మందహాసం చేసింది, దయామయులైన స్త్రీలు బిడ్డలవంక చూసే మాదిరిగా దీర్ఘవీక్షణం బరపి అంది: "ఏమంటానా, ఆ లెక్కన తెల్లవారే దాకా మీరు కూడా విశ్రాంతి తీసుకోవచ్చునంటాను. నేను మిమ్మల్ని లేపుతాను."

"నాకు నిద్ర ప్రాప్తం లేదు కామ్రేడ్ ఒస్యానినా.... మర్గరీతా – అన్నట్టు మీ తండ్రిపేరేమిటి?"

"నన్ను రీతా అని పిలవండి చాలు."

"సిగరెట్టు కాలుస్తావా, కామ్రేడ్ రీతా?"

"నేను సిగరెట్టు కాల్చను."

"వాళ్లు కూడా మానవ మాత్రులేనన్న సంగతి వుంది చూడు – నేను దాన్ని

మరచిపోయాను. ఔనుసుమా, వాళ్ళు కూడా విశ్రాంతి తీసుకోవలసి వుంటుందన్న సంగతిని నువ్వు సరిగా గుర్తుచేశావు. నువ్వు కూడా విశ్రాంతితీసుకోవాలి రీతా. పోయి కాసేపు పడుకో.''

''నాకు నిద్ర రావడం లేదు.''

''సరే అయితే ఊరికే కాళ్ళు జాపుకుని పడుకో. నీ కాళ్ళు లాగుతూ ఉండి వుంటాయి — నీకు అలవాటు లేదు కదా.''

''అలాంటి దేమీ లేదు — నాకు బాగా అలవాటే'' రీతా చిరునవ్వు నవ్వుతూ అంది. అయినాకూడా, సార్జెంట్ మేజరు పడుకోమని ఆమెను బలవంతం చేశాడు. రీతా అక్కడి కక్కడే — వాళ్లకు యుద్ధరంగం కాబోతున్న చోట, లీజా బ్రీచ్కినా తన కోసం ఫర్ రెమ్మలతో తయారుచేసుకున్న పడక పైన — ఒళ్ళు వాల్చింది. ప్రత్యూషానికి ముందు ఓ కునుకు తీద్దామనే ఉద్దేశంతో ఆమె తన ఓవర్‌కోటును భుజాల పైకి లాక్కుని — నిద్ర లోకి కూరుకుపోయింది, గాఢంగా, కలలూ గ్రటా ఏమీ లేకుండా.

సార్జెంట్ మేజరు ఆమె కోటు పట్టుకుని లాగినప్పుడే ఆమె మళ్ళీ లేచింది.

''ఏమిటి?'' అంది బిగ్గరగా.

''నిశ్శబ్దం! నీకు వినిపిస్తోందా?''

రీతా ఓవరుకోటును పక్కకి తోసేసి, తన స్కర్టును సర్దుకుని చటుక్కున లేచి నిలబడింది. సూర్యుడు దిజ్మండలం పైకి అప్పుడే తొంగిచూస్తున్నాడు. కొండలు ఎర్ర వారుతున్నాయి. ఆమె తల పైకి చాచి చూసింది: అడవిలో దూరాన పక్షులు ఎగురుతూ కోలాహలంగా అరుస్తున్నాయి.

''పక్షులు అరుస్తున్నాయి....''

''అవి వనపిట్టలు!...'' వస్కోవ్ సన్నగా నవ్వాడు. ''ఆ రొద చేస్తున్నది వనపిట్టలు రీతా. అంటే అటెవరో వెళ్తున్నారన్న మాట, ఎవరో వాటిని చెదరగొట్టారన్న మాట. ఇంకెవరుంటారు మన ఆగంతుకులు తప్ప. సరే ఒస్యానినా, నువ్వు వెంటనే పోయి మన సైనికులను యిక్కడికి తీసుకురా! కాని నిశ్శబ్దంగా, అతి నిశ్శబ్దంగా సుమా?...''

రీతా దూసుకుపోయింది.

సార్జెంట్ మేజరు — మిగిలిన వారికన్న ముందు, ఎత్తైన ప్రాంతంలో — తన స్థానం తీసుకుని సర్దుకు కూర్చున్నాడు. అతను తన పిస్తోలును తనిఖీచేశాడు, రైఫిలును తూటాలతో నింపాడు, తన బైనాక్యులర్సతో ఉదయభానుని ఉజ్వల కిరణాలలో అప్పటికే మునిగివున్న అడవి అంచులను పరిశీలనగా చూశాడు. వనపిట్టలు పొదల పైన — ఒక దాన్ని మరొకటి గట్టిగా కీచుమని పిలుచుకుంటూ, అరుచుకుంటూ — గిరుగిరున పరిభ్రమిస్తున్నాయి.

ఒకరి తర్వాత మరొకరుగా అతని సైనికులందరూ వచ్చి, ఎవరికి వారు తమకు కేటాయించిన స్థానాలు తీసుకున్నారు.

గూర్విచ్ వస్కొవ్ దగ్గర కెళ్లి పలకరించింది: "గుడ్ మార్నింగ్, కామ్రేడ్ సార్జెంట్ మేజర్."

"హల్లో. అక్కడ చెత్వెర్తాక్ ఎలా వుంది?"

"ఆమె నిద్రపోతోంది, మేం ఆమెని లేపలేదు."

"మంచి పని చేశారు. వార్తాహరుడిగా నువ్వు నా దగ్గరే వుండు, కాని నువ్వు పైకి కనిపించకూడదు సుమా."

"కనిపించను" గూర్విచ్ మాట యిచ్చింది.

ఈలోగా వసపిట్టలు అంతకంతకు దగ్గర దగ్గరకొస్తున్నాయి, అక్కడక్కడ స్పష్టాస్పష్టంగా పొద చివళ్లు ఊగడాన్ని వస్కొవ్ గమనించాడు; బరువైన బూటుకాలి కింద ఒక ఎండుకొమ్మ పళుక్కుమన్నట్టు కూడా అతనికి అనిపించింది. అయితే తర్వాత కొంచెం సేపు మళ్లీ అంతా నిశ్శబ్దమైపోయింది. వసపిట్టలు సైతం సర్దుకున్నట్టున్నాయి, కాని అడవి అంచున పొదల్లో ఎవరో ఉన్నట్టు సార్జెంట్ మేజరు గ్రహించాడు. వాళ్లిప్పుడు అక్కడ కూర్చుని, సరస్సు ఒడ్డు వంకా, అవతలి ఒడ్డున వున్న అడవి వంకా, తమ దోవ వున్న కొండల వంకా — సార్జెంట్ మేజరూ, నిద్ర మూలంగా ఎరుపెక్కిన బుగ్గలతో అతని సైనిక యువతులూ వున్న కొండల వంకా — కళ్లు పొడుచుకొని చూస్తూ వుండివుండాలి.

ఒక ఘటన తదుపరి మరో ఘటనతో మనకి తెలియకుండానే విలీనమైపోయి, కారణం పరిణామానికి తావిచ్చి, యాదృచ్ఛికత ఉత్పన్నమయ్యే క్షణమంటూ ఒకటుంటుంది. సరిగా యిప్పుడు అటువంటి నిగూఢ క్షణం. అటువంటి క్షణం శాంతికాలంలో అయితే గమనింపబడకుండానే గడిచిపోతుంది, కాని ఉద్రిక్తత పారమందుకున్నప్పుడు, అస్తిత్వానికి సంబంధించిన ఆదిమ అవగాహన — చావును తప్పించుకొని బ్రతికియుండాలన్న గాఢ కాంక్ష — మున్ముందుకొచ్చిన తరుణాలలో, అటువంటి క్షణాలు గడ్డు నిజంగా, భౌతికంగా స్పర్శనీయమైనవిగా యుగాలుగా అనుభూతమవుతాయి.

"రండి. తొందరగా" ఫెదోత్ గుసగుసగా ఆజ్ఞాపించాడు.

దూరాన వున్న పొదలు కదిలాయి, యిద్దరు వ్యక్తులు భద్రంగా అడవి అంచునుంచి ముందుకొచ్చారు. వాళ్లు గచ్చ కాయ, ఆకుపచ్చ రంగుల కేమఫ్లేజి కేప్లు ధరించారు, కాని సూర్య కిరణాలు నేరుగా వాళ్ల ముఖాలమీద పడుతున్నాయి. సార్జెంట్ మేజరు వాళ్ల ప్రతి కదలికనూ చూడగలుగుతున్నాడు. తమ చేతి వేళ్లను తమ సబ్ మెషీన్ గన్నులపైన పెట్టుకొని, వంగి, పిల్లుల్లాగ తేలిక అడుగులు వేసుకుంటూ వాళ్లు సరస్సువంకకు బయల్దేరారు.

కాని వస్కోవ్ యిప్పుడిక వాళ్లిద్దర్నీ చూడటం లేదు. ఎంతమాత్రం చూడటం లేదు, ఎందుకంటే, వాళ్ల వెనక పొదలు యింకా కదులుతూనేవున్నాయి, గచ్చకాయ — ఆకుపచ్చ రంగు కేప్‌లు ధరించి, సబ్‌మెషీన్ గన్నులను సంసిద్ధంగా పట్టుకొని పొదల్లోంచి యింకా యింకా ఆకారాలు బయటికొస్తూనే ఉన్నాయి.

"మూడు.... ఐదు.... ఎనిమిది.... పది...." గూర్విచ్ లోగొంతులో లెక్క పెట్టింది. "పన్నెండు.... పధ్నాలుగు.... పదిహేను.... పదహారు.... కామ్రేడ్ సార్జెంట్ మేజర్, పదహారుమంది."

పొదలు తిరిగి నిశ్చలమయ్యాయి. వసపిట్టలు దూరానికి ఎగిరిపోతున్నాయి, వాటి అరుపులు అంతకంతకు అస్పష్టమవుతున్నాయి.

ఆ పదహారుగురు జర్మన్లూ జాగ్రత్తగా, నెమ్మదిగా సరస్సు వారగా సిన్యూహినా కనుమ దిశగా ముందుకి రాసాగారు....

6

ఫెదోత్ వస్కోవ్ తన జీవితకాలమంతా ఆజ్ఞలను పాలించడానికే అలవాటుపడ్డాడు. వాటిని అతను అక్షరాలా, హుటాహుటిన, సంతోషంగా పాలిస్తూవచ్చాడు. మరెవరి యిచ్చినో తు.చ తప్పకుండా నెరవేర్చడంలో తన బ్రతుకు పరమార్థం యిమిడివుందని అతను భావించడమే యిందుకు కారణం. అతని పై అధికార్లు అతని కర్తవ్య నిర్వహణకుగాను అతన్ని మన్నించేవారు, కాగా అతన్నుంచి వారు మరి దేన్నీ ఆశించేవారు కారు. ఒక మహా యంత్రపు చక్రానికి గల ఒక పన్నులా, బాగా అమరిన పన్నులా వుండే వాడతను. తన కదలికకు మూలమేమిటి, దాని దిశయేమిటి, దాని పరిణామమేమిటి అని ఏమాత్రం ఆలోచించకుండా తను తిరుగుతూ, తనతో బాటు యితరులను తిప్పతూ వుండేవాడు.

ఈలోగా జర్మన్లు వోప్ సరస్తీరం వెంట, నేరుగా తన వంక, తన సైనికుల వంక — తమ దృఢమైన చిరు బుగ్గలను, తను నేర్పిన పద్ధతిలో తమ రైఫిళ్ల చల్లని మడమలకు ఆన్చి బండల మాటున పడుకున్న సైనికుల వంక — నెమ్మదిగా, నిబ్బరంగా వస్తున్నారు.

"పదహారు మంది, కామ్రేడ్ సార్జెంట్ మేజర్" గూర్విచ్ వినిపించీ వినిపించకుండా రెట్టించింది.

అతను వెనక్కి తిరక్కుండా "నాకూ కనిపిస్తోంది" అన్నాడు. "గూర్విచ్, నువ్వు స్థావరానికెళ్లి, ఒస్యానినాను తన దళాన్ని రిజర్వు స్థావరానికి తీసికెళ్లమని చెప్పు. ఆ పనిని నిశ్శబ్దంగా, వింటున్నావా, నిశ్శబ్దంగా చెయ్యమని చెప్పు.... ఉండు, ఒక్క నిమిషం ఆగు.

బ్రీచ్కినాను నా దగ్గరికి పంపు. పాకి వెళ్ళు, కామ్రేడ్ దుబాసీ. ఇప్పటినుంచి, పరిస్థితి మెరుగయ్యే దాకా, చేతులపైనా మోకాళ్ళపైనే మనం ఉండాలి.

బండకీ బండకీ మధ్య జాగ్రత్తగా జారుతూ, గూర్విచ్ మెల్లగా వెనక్కి పాక్కుంటూ పోయింది. వస్కోవ్ తను కొంచెం ఆలోచించాలనీ, ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలనీ అనుకున్నాడు, కాని అతని బుర్ర శుద్ధ శూన్యమైపోయింది. ఏళ్ళతరబడి తన శిక్షణకాలమంతటా తనలోకి చొప్పించబడిన బలవంతమైన ఒకే ఒక కోర్కె, తన పై అధికారులకు పరిస్థితిని రిపోర్టు చెయ్యాలని తనను అదేపనిగా వేధించే కోర్కె ఒక్కటి మాత్రమే అతనికి అనుభూతమవుతోంది. పరిస్థితి మారిపోయిందనీ, తన నాయకత్వాన వున్న బలగంతో కీరొవ్ రైల్వేని గాని, కామ్రేడ్ స్టాలిన్ పేరు పెట్టబడిన కాల్వను గాని రక్షించగలగడం తనకిక ఎంత మాత్రమూ సాధ్యంకాదనీ, తన పై అధికారికొకరికి యిప్పుడే, యీ క్షణమే తెలియజెయ్యాలన్నదే ఆ కోర్కె.

తన దళం వెనక్కి తగ్గుతోంది, ఒక రైఫిలు దేనికో తగులుకోవడం, ఒక రాయి పడటం అతను వినగలుగుతున్నాడు. ఈ శబ్దాలు అతని శరీరంలో భౌతికంగా ప్రతిధ్వనించాయి, జర్మన్లు తమకిదంతా ఏమీ వినిపించనంత దూరంలో ఉన్నప్పటికీ ఫెదోత్ నిజమైన భయాతిరేకంలో మునిగిపోయాడు. ఓ నిండు తూటాల డ్రమ్ముతో బాటు యిప్పుడొక మెషీన్ గన్ వుంటేనా నా సామిరంగా, సహాయకుడుంటే యింక చెప్పనే అక్కర్లేదనుకో! మెషీన్ గన్నా? అంతదాకా ఎందుకు, తనకి మూడేమూడు సబ్‌మెషీన్ గన్నుండి, కాస్త బుర్ర వున్న ముగ్గురు మగ సైనికులుంటేనా తన తడాఖా చూపించును, కాని తనకి మెషీన్ గన్నూ లేవు, మగ సైనికులూ లేరు, తనకున్నదల్లా ముసిముసి నవ్వులు నవ్వే అయిదుగురు ఆడపిల్లలూ, రైఫిలుకి అయిదేసి చొప్పున తూటాదండలూను. మరి అలాంటప్పుడు జల శీకరార్ద్రమైన ఆ మే మాసపు ఉదయం పూట సార్జెంట్ మేజరు వస్కోవ్ ఒళ్ళంతా చెమటతో నాని ముద్దయిందంటే, అందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు....

"కామ్రేడ్ సార్జెంట్ మేజర్.... కామ్రేడ్ సార్జెంట్ మేజర్...."

వస్కోవ్ కోటు చేత్తో జాగ్రత్తగా చెమటను తుడుచుకున్నాకనే తన తల వెనక్కి తిప్పాడు. బాగా విప్పారిన రెండు కళ్ళు అతనికి అతి సమీపంలో అతని కళ్ళలోకి చూస్తున్నాయి. అతను కనుసైగ చేసి అన్నాడు: "ధైర్యంగా వుండు ఉద్రేక పడకు బ్రీచ్కినా. నిజానికి యిద్దరి కంటె పదహారు మంది నయం. బోధ పడిందా?"

కాని యిద్దరు జర్మన్లకంటె పదహారు మంది ఎందుకు నయమో — దీన్ని మాత్రం సార్జెంట్ మేజరు వివరించలేదు, కాని లీజా ఆమోదపూర్వకంగా తలూపింది, ఆమె పెదవులపై నవ్వు కనిపించి మాయమైంది.

"నీకు తిరుగుదారి గుర్తుందా?"

"గుర్తుంది కా(మేడ్ సార్జెంట్ మేజర్."

"జర్మిగాళ్లకి ఎడమ పక్కగా వున్న పైన్ అడవి కనిపిస్తోందా నీకు? అడవి లోంచి, సరస్సు ఒడ్డు అంచున అటుపక్కగా వెళ్ళు."

"అంటే, మీరు ఎండు కొమ్మలు కొట్టారే అక్కడికే కదూ?"

"ఔనమ్మాయ్, సరిగా అదే! దాని తర్వాత వాగు వేపు తిరుగు, అది తిన్నని దోవ. అక్కడ దారి తప్పడమంటూ వుండదు."

"నాకు తెలుసది, మీరు చెప్పక్కర్లేదు కా(మేడ్...."

"ఆగు లీజావేతా, కాస్త గుర్రం కట్టెయ్యి. ఊబి విషయం గుర్తుందా — నువ్వక్కడ చాలా జా(గత్తగా వుండాలి, తెలిసిందా? రేవు చాలా సన్నంగా ఉంది; ఎడమ పక్కకి గాని, కుడి పక్కకి గాని అడుగేశావో, అంతే యిక నీ పని ఆఖరు. బర్చిచెట్టే నీకు కొండ గుర్తు. బర్చి చెట్టునుంచి నేరుగా లంక పైనున్న రెండు పైన్ చెట్ల దిక్కుకి వెళ్ళు."

"ఆహా!"

"ఏకబిగిన వెళ్లిపోక అక్కడ కాస్త సేద దీర్చుకో. లంక దాటాక నువ్వు కాలిన చెట్టు మొదలు కేసి — నేను ఊబిలోకి దిగాను చూడు? దాని కేసి — వెళ్లాలి. అది స్పష్టంగా కనిపిస్తూనే వుంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని దానికేసే నేరుగా వెళ్ళు."

"ఆహా!"

"ఇక్కడి పరిస్థితిని కిర్యానొవాకి రిపోర్టుచెయ్యి. ఈలోగా మేము జర్మన్లని కొంత సేపు చక్కర్లు కొట్టిస్తాం, కాని మేం ఎక్కువ సేపు నిలవరించలేం. ఆ విషయం నీకు వేరే చెప్పనక్కర్లేదుకదా."

"ఆహా!"

"నువ్వు అన్నీ యిక్కడ దిగవిడిచెయ్యి: నీ రైఫిలూ, సంచీ, ఓవర్‌కోటూ కూడా. నీకు స్వేచ్ఛగా పరిగెత్తేందుకు వీలుండాలి."

"సరే యిప్పుడింక నేను బయల్దేరవచ్చా?"

"ఊబిలో దిగేందుకు ముందు ఆ పెర్చి తీసుకోవడం మరచిపోకు."

"ఆహా! సరే యిప్పుడింక నే పోతున్నాను."

"సరే వెళ్లు లీజావేతా — మీ తండ్రిపేరేమిటో ఏమో."

లీజా మౌనంగా తలూపి, పక్కకు జరిగింది. ఆమె తన రైఫిల్ని ఒక బండకి ఆన్చింది, తన తోలుబెల్టుకి తగిలించి వున్న తూటాల పెట్టెను — అంతసేపూ అతను తనకేసి చూస్తాడేమోనని ఎదురుచూస్తూ — విప్పసాగింది. కాని వస్కోవ్ జర్మన్ల కేసే పరిశీలనగా చూస్తున్నాడేమో, లీజా వ్యాకుల దృష్టిని అతను గమనించనే లేదు. లీజా సన్నగా నిట్టూర్చి, తన బెల్టును గట్టిగా బిగించుకొని, ముందుకు వంగి, యీ లోకంలో స్త్రీలందరూ చేసే మాదిరిగానే తన పాదాలను యీడ్చుకొంటూ, పైన్ అడవి దిశగా పరిగెత్తింది.

జర్మన్లిప్పుడు చాలా దగ్గర్లో వున్నారు — వాళ్ల ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి — వస్కోవ్ రాళ్లకు కరుచుకుపోయి పడుకున్నాడు. జర్మన్లను ఓ కంటితో చూస్తూనే అతను మరో వంక కనుమ దగ్గర ప్రారంభమై అడవి దాకా వ్యాపించిన పైన్ తోపును శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు. సుతిమెత్తని కదలికా, చెట్ల చిటారు కొమ్మలు ఊగిసలాడిన రుసరుసా రెండు మార్లు అతనికి అస్పష్టంగా వినవచ్చాయి, కాని ఆ కదలిక ఎంత తేలికగా అలవోకగా ఉందంటే, ఏ పక్షో దూసుకు పోతున్నట్లనిపించింది. ఈ పనికి తను లీజా బ్రీచ్కినాను ఎంపికచేసి సరైన పని చేశానని అతను తనలో తను అనుకున్నాడు.

వార్తాహరుణ్ణి జర్మన్లు గమనించలేదని రూఢిచేసుకుని, అతను తన రైఫిలుకి సేఫ్టీకాచ్ పెట్టి, బండపైనుంచి కిందకి దిగాడు. అతను రీజా రైఫిలును చేతిలోకి తీసుకుని — తన కదలిక నిశ్శబ్దంగా సాగేందుకు అతీంద్రియ జ్ఞానమేదో తోడ్పడగా — వెనుతిరిగి నేరుగా పరుగుతీశాడు.

"కామ్రేడ్ సార్జెంట్ మేజర్...." అంటూ వాళ్లు జొన్నకంకి చుట్టూ పిచికల గుంపు చేరినట్లు అతని చుట్టూ చేరారు. చివరకు చెత్వెర్తాక్ సైతం ఓవర్కోటు కిందనుంచి తల పైకెత్తి చూసింది.

సైనికులు వ్యవహరించాల్సిన తీరు యిది కాదు, తను వాళ్లని ఒక క్రమంలో పెట్టి యుండాల్సింది; సెంట్రీలను పెట్టనందుకు తను ఒస్యానినాను చివాట్లు పెట్టియుండాల్సింది. అతను తన కనుబొమ్మల్ని గంభీరంగా ముడేశాడు. ఆజ్ఞను, ఆ పూటకొస్తే కఠినమైన ఆజ్ఞను జారీచేసేందుకు నోరు తెరిచాడు, కాని ఆ ఘట్టంలో వాళ్ల కళ్లలోని ఉద్రిక్తతను అతను చూశాడు. దానిలో అతను తన మనసు మార్చుకుని ఒక సమష్టి వ్యవసాయ క్షేత్ర బృంద నాయకుడు తన బృంద సభ్యులతో మాట్లాడినట్లు అన్నాడు: "అమ్మాయిలూ పరిస్థితి బాగా లేదు."

అతనొక బండపైన కూర్చోబోతూండగా సరిగా ఆ క్షణంలో గూర్విచ్ అడ్డం వచ్చి, తన ఓవర్కోటును బండ పైన పరిచింది. అతను ఆమె వంక కృతజ్ఞతా సూచకంగా తల ఊపి, కూర్చుని తన పొగాకు సంచిని పైకి తీశాడు.

యువతులు అతనికెదురుగా గుండ్రంగా కూర్చొని అతను సిగరెట్టు చుట్టుకొంటూంటే మౌనంగా పరీక్షగా చూడ నారంభించారు. వస్కోవ్ చెత్వెర్తాక్ వంక తిరిగి ప్రశ్నించాడు: "ఏం, నీ ఒంట్లో ఎలా వుందిప్పుడు?"

"ఫరవా లేదు." ఆమె నవ్వుదామని అనుకుంది గాని నవ్వు బయటకు రాలేదు: ఆమె పెదవులు ఆమె ఆదేశాన్ని పాలించలేదు. "నాకు నిద్ర బాగా పట్టింది."

"సరే, వాళ్లు పదహారు మంది వున్నారు," శాంతంగా మాట్లాడేందుకు తను చేసే ప్రయత్నంలో సార్జెంట్ మేజరు ప్రతి ఒక్క మాటా ఆచితూచి అన్నాడు. "పదహారు

సబ్‌మెషీన్ గన్నులు — అంటే సామాన్య విషయం కాదు. ఢీ అంటే ఢీ మని ముఖా ముఖీ ఎదుర్కొని వాటిని మనం నిలవరించలేం. వాటిని ఆపకుండా వుండేందుకూ వీల్లేదు. వాళ్లిక్కడికి మరో మూడు గంటల్లో చేరుకుంటారు — నా అంచనా ప్రకారం."

ఒస్యానినా కొమెల్కోవాలు ఒకరివంక మరొకరు చూసుకున్నారు. గూర్విచ్ మోకాళ్లపై తన స్కర్టును సవరించుకుంది. చెత్‌వెర్తాక్ కనురెప్ప వాల్చకుండా అతని వంకకే చూస్తోంది. ఫెదోత్ సిగరెట్టు కాల్చుకుంటూనే కూర్చున్నప్పటికీ, సిగరెట్టు కాల్చడంలోనే తల్లీనుడై వున్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ తన చుట్టూ జరుగుతున్నదేదీ అతని దృష్టిని తప్పించుకోలేదు, అతను వాటన్నింటినీ గమనించాడు, విన్నాడు.

కొంచెం ఆగిన తర్వాత అతను కొనసాగించాడు: "నేను బ్రీచ్కినాని మన ప్రధాన స్థావరానికి పంపించాను. రాత్రి దాకా మనకి సహాయం అందే అవకాశం లేదు. మరి పోరాటంలోకి దిగితే, మనం రాత్రి దాకా తట్టుకుని నిలబడటం సాధ్యం కాదు. మనం ఏ పద్ధతిని అనుసరించి ఏ స్థానాన్ని తీసుకున్నా కూడా మనం నిలబడటం దుస్సాధ్యమే, ఎందుకంటే, వాళ్లకి ఒకటీ రెండూ కాదు, పదహారు సబ్‌మెషీన్ గన్నులున్నాయి."

"మరైతే ఏమిటి? వాళ్లు దాటి వెళ్తాంటే మనం గుడ్లప్పగించి చేతులు ముడుచుకుని కూర్చోవాలా?" ఒస్యానినా ప్రశాంతంగా ప్రశ్నించింది.

"అబ్బే, మనం వాళ్లని కొండలబారు దాటి వెళ్లనిచ్చేందుకు వీల్లేదు" అతను జవాబిచ్చాడు. మనం వాళ్లని దారి మళ్లించాలి. మనం వాళ్లని లెగోంతొవ్ సరస్సు చుట్టూ మళ్లించాలి. కాని అదెలా సాధ్యమన్నదే యిప్పుడు మనముందున్న సమస్య. వాళ్లతో పోరాటం ద్వారానా? అది నిరర్థకం. అందుకని మీరు మీమీ ఉపాయాలు చెప్పండి."

మానసికంగా తానున్న కలవర స్థితిని వాళ్లెక్కడ కనిపెడతారో, తన భావాలను వాళ్లెక్కడ గ్రహిస్తారో అనే అతను అన్నిటికన్న ఎక్కువగా భయపడుతున్నాడు — అదే జరిగితే యిక దానితో ఆఖరు. తన అధికృతకు స్వస్తి, కమాండరుగా తన యిచ్ఛకు స్వస్తి, తనలో వాళ్లకున్న నమ్మకానికి స్వస్తి జరుగుతుంది. అందుకనే అతను, గ్రామంలో తన పొరుగు వాళ్లతో కాలక్షేపం కోసం వచ్చినవాని మాదిరిగా తాపీగా సిగరెట్టు కాలుస్తూ, అనుద్రిక్త స్వరంలో, సాయిలాపాయిలా పద్ధతిలో, తన స్వరాన్ని హెచ్చించకుండా మాట్లాడుతున్నాడు. కాని అంత సేపూ దిట్టమైన అతని బుర్రలో సాధ్యాసాధ్యతలన్నింటినీ బేరీజువేస్తూ ఆలోచనలు కొట్టుమిట్టాడుతూనే వున్నాయి.

బయలుదేరడానికి ముందు యువతులను నాస్తా చెయ్యాల్సిందిగా అతను ఆజ్ఞాపించాడు. వాళ్లు వద్దువద్దంటూ అభ్యంతరం చెప్పసాగారు, కాని వాళ్లని అతను గదమాయించి, తన నాప్‌శాక్‌లోంచి ఉప్పులో ఊరవేసిన పందిమాంసాన్ని పైకి తీశాడు. పందిమాంసం, అతని గదమాయింపూ — యీ రెండింటిలో వాళ్లని ఎక్కువగా వశీభూతం చేసుకున్న దేమిటో

ఎవరు చెప్పగలరు, కాని వాళ్ళు అతిత్వరలోనే కసకస నమలడం మొదలుపెట్టారు. సరిగా ఆ ఘట్టంలో, అయ్యో పాపం లీజా బిచ్చికానాని ఖాళీ కడుపున దీర్ఘ ప్రయాణానికి పంపానే అని ఫెదోత్ మనస్సు చివుక్కుమంది.

నాస్తా అయినతర్వాత సార్జెంట్ మేజరు చన్నీటితో జాగ్రత్తగా గడ్డం గీసుకున్నాడు. తన తండ్రి రేజరు యిప్పటికీ తన దగ్గరుంది — రేజరంటే తీరదు, భలే రేజరది — అయినా కూడా రెండు చోట్ల గాట్లు పడ్డాయి. అతను ఆ రెండు గాట్లకీ వార్తాపత్రికనుంచి చింపి, చిన్నచిన్న కాగితం ముక్కలు అంటించాడు, కొమెల్కోవా తన నాప్‌శాక్‌లోంచి ఉడికిలోన్ సీసా బయటకు తీసి గాయాలు సెప్టిక్ కాకుండా తన చేతుల్తో స్వయంగా తనే ఆ గాట్లకు ఉడికిలోన్ రుద్దింది.

అతను తను చేసిన ప్రతి పనీ నిబ్బరంగా, తాపీగా చేస్తున్నాడు, కాని కాలం వేగంగా పరిగెత్తుతోంది, అతని ఆలోచనలు లోతులేని నీళ్ల గుంటలో చేపపిల్లల మాదిరిగా కొట్టు మిట్టాడుతున్నాయి. అతను వాటిని కూడగట్టలేకపోతున్నాడు. తను గొడ్డలి తీసుకుని కట్టెలు కొట్టగలిగితే ఎంత బాగుండును! తను అలా చేయలేకపోతున్నందుకు అతను విచారించాడు — అలా చేస్తే తన ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చివుండును, అనవసరమైన ఆలోచనలన్నింటినీ తన మనస్సునుంచి తొలగించి, యీ గడ్డు పరిస్థితిలోంచి బయట పడగలిగే మార్గాన్ని తనకు చూపించివుండును.

జర్మన్లు పోరాటాన్ని కోరుకోడం లేదన్న సంగతి అతనికి సుస్పష్టమే. అడవిలో మరింత దట్టంగావున్న ప్రాంతాలకే వాళ్ళు పరిమితమవుతున్నారు, చాలా జాగ్రత్తలు తీసు కుంటున్నారు, తమకంటె చాలా ముందు స్కౌట్లను పంపుతున్నారు. వేగులను ఎందుకు పంపుతున్నట్లు? ఎవరూ తమను కనుక్కోకుండా వుండేందుకు, అదే గుప్త పద్ధతిలో, ఊహించ దగిన ప్రతి అవరోధం గుండా యితరుల కంటబడకుండా దాటిపోయి, తమ ప్రధాన గమ్యాన్ని చేరుకోవడానికేననడంలో సందేహం లేదు. అటువంటి సందర్భంలో తను వాళ్లని గమనించ నట్లు నటిస్తూ వాళ్ళు తనని చూసేలా చెయ్యాలి.... అలా చేస్తే వాళ్ళు తమ మార్గాన్ని మార్చుకుని మరో దోవ పట్టేలా చెయ్యవచ్చు. అయినా, లెగోంతొవ్ సరస్సును చుట్టి వెళ్లేది తప్ప మరే మార్గముంది? — అలా వెళ్లడమంటే అర్థం వాళ్ల ప్రయాణంలో మరో 24 గంటలు ఆలస్యం కావడమే.

కాని తను జర్మన్లకి ఎవళ్లని చూపగలడు? ఈ నలుగురు ఆడపిల్లల్నీ, తననే కదా? సరేనయ్యా, వాళ్ళు ఆగి, స్కౌట్లని పరిస్థితి తెలుసుకునేందుకు పంపించారనే అను కుందాం; అదైనా ఎంత సేపు, అందరూ కలిసి ఉడ్డా మొత్తం అయిదుగురు మాత్రమే ఉన్నారని వాళ్ళు కనుక్కునే దాకానే కదా. మరి ఆ తర్వాత సంగతేమిటి?... ఆ తర్వాత ఏమిటంటావా, కామ్రేడ్ సార్జెంట్ మేజర్ వస్కోవ్, వాళ్ళు ఎక్కడి వాళ్ళు అక్కడే

వుంటారు. ఒక్క కాల్పు కూడా కాల్చకుండా వాళ్లు తనను చుట్టుముడతారు. తన దళాన్ని వాళ్లు కేవలం అయిదే అయిదు బాకులతో సఫా చేస్తారు. నలుగురు ఆడపిల్లల్నీ, చేతిలో పిస్తోలు మాత్రమే వున్న ఒక సార్జెంట్ మేజరునీ చూసి బెదిరిపోయేందుకు వాళ్ళు మూర్ఖులేమీ కారు, ఈ మాత్రం దానికి వాళ్లు పారిపోయి అడవిలో దాక్కోరు.

ఫెదోత్ తన భావాలను ఒస్యానినా, కొమెల్కోవా, గూర్విచ్‌లకు తెలియజెప్పాడు. చెత్‌వెర్తాక్, తన నిద్ర తర్వాత, గస్తీ బాధ్యతను ఎంచుకుంది. అతను ఏ మాత్రం దాపరికం లేకుండా వాళ్ళకి సమస్తం విడమరచి చెప్పాడు. ఇంకా యిలా జోడించాడు: "మనం యింకో గంటా, గంటన్నరలోగా ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించకపోతే అంతా సరిగా నేను మీకు చెప్పినట్లే జరుగుతుంది. అందుకని మీరు సన్నద్ధంకండి."

సన్నద్ధం కావాలిట.... అయినా చేసుకునేందుకు సన్నాహాలు ఏం వున్నాయిట? పరలోక ప్రయాణానికా? దానికైతే, తమకి ఎంత తక్కువ వ్యవధి వుంటే అంత మంచిది....

తనకు సంబంధించినంత వరకు అతను సన్నాహాలు చేసుకునే వున్నాడు. తన నాప్‌శాక్‌లోంచి రెండు హాండ్ గ్రెనేడ్‌లు తీసుకున్నాడు, తన పిస్తోలును శుభ్రంచేసుకున్నాడు, తన బాకును రాతిమీద పదును పెట్టాడు. తను చేసుకోవలసిన సన్నాహాలన్నీ అంతే, కాని తన సైనిక యువతులకు అదీ లేదు. వాళ్లు తనకి కొంచెం దూరంలో, లోగొంతులో చర్చిస్తూ కూర్చున్నారు. చివరకు వాళ్ళంతా ఒక్కుమ్మడిగా వచ్చి అతనితో చెప్పారు: "వాళ్ళకి కొందరు కట్టెలు కొట్టే వాళ్లు తటస్థపడ్డారనుకోండి, ఎలా వుంటుంది కామ్రేడ్ సార్జెంట్ మేజర్?"

వస్కోవ్ నిర్ఘాంతపోయాడు — ఏ కట్టెలు కొట్టే వాళ్లు మహా తల్లుల్లారా? ఎక్కడ?... ఇది యుద్ధకాలం, అడవులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి, ఈ సంగతి స్వయంగా వాళ్ళూ గమనించారు. వాళ్లు వివరించనారంభించారు, వస్కోవ్‌కి తటాలున ఒక ఆలోచన తట్టింది. చాలా సరళమైన ఆలోచన. ఏ సైనిక డిటాచ్‌మెంటుకైనా — అది ఏద్దైనా కూడా — దానికి కచ్చితమైన నిర్దిష్టమైన సరిహద్దులంటూ వుంటాయి; వాళ్ళకి తమ పొరుగు వాళ్లెవరో తెలిసివుంటుంది, సరిహద్దులు కలిసే ప్రతి చోటా చౌకీ స్థానాలుంటాయి. కాని కట్టెలు కొట్టేవాళ్ల విషయంలో పరిస్థితి వేరు. కట్టెలు కొట్టేవాళ్ళు అడవిలో ఎక్కడైనా వుండచ్చు. ఒక్కొక్క బంటూ ఎక్కడెక్కడో చెదిరి వుంటుంది — వాటన్నింటినీ కనుక్కోవడం దాదాపు అసాధ్యమే. అలాంటిది జర్మన్లు వాళ్లని వెతుకుతారా? అలా ఎంతమాత్రం చెయ్యరు — అది ప్రమాదకరం. జర్మన్లు జాగ్రత్తగా ఉండకపోయినట్లయితే వాళ్ల జాడ తెలిసిపోవచ్చు, ఎవరో ఒకరు అధికారులకు ఉప్పందించవచ్చు. పరిసరాల్లో కట్టెలు కొట్టేవాళ్ళు ఎంత మంది వున్నారో, ఎక్కడున్నారో, వాళ్లకి ఎవళ్లతో ఎలాంటి సంబంధాలున్నాయో నిర్దిష్టంగా ఎవరూ చెప్పలేరు....

"భేష్ అమ్మాయిలూ, మీరు భలే సూక్ష్మదృష్టి గలవాళ్ళు, అద్భుతమైన ఆలోచన!"

వాళ్ల రిజర్వు స్థావరానికి వెనుక ఒక వాగు — ఎక్కువ లోతు లేకపోయినా శబ్దం చేస్తూ — ప్రవహిస్తోంది. వాగుకి అవతలి పక్క ఒడ్డునుంచి, సరిగా నీటి అంచునుంచి దట్టమైన ఆస్పెన్ కీకారణ్యం, గాలికి పడిపోయిన చెట్లతో కూడిన ఒత్తైన పైన్ అడవి ప్రారంభమవుతుంది. అక్కడ క్రింది మొక్కలు ఎంత గుబురుగా ఉంటాయంటే పట్టుమని రెండడుగుల అవతల వున్నది కూడా కనిపించదు. ఈ గుబురు పొదల్లోకి చూడటానికి గాని, వాటి వెనుక అనుక్షణం మారిపోయే దృశ్యాన్ని కనిపెట్టడం గాని, దాని విస్తృతిని అంచనావెయ్యడం గాని శక్తివంతమైన జైస్ బైనాక్యులర్ల సాయంతో సైతం సాధ్యం కాదు. ఆ యువతుల పథకాన్ని ఆమోదించినప్పుడు ఫెదోత్ మనస్సులో వున్నది, సరిగా యిదే తావు.

అతను చెత్వెర్తాక్‌నీ, గూర్విచ్‌నీ సరిగా మధ్యలో — జర్మన్లు వాళ్లని చూడకుండా ఉండటం అసంభవమైన చోట — నియమించాడు. చలిమంటలు వెయ్యాల్సింది గానూ, బోలెడంత పొగవచ్చేలా చూడాల్సింది గానూ, తమ గొంతులతో అడవి అంతా దద్దరిల్లేటట్లుగా ఒకరినొకరు బిగ్గరగా అరుచుకోవలసిందిగానూ, పిలుచుకోవలసిందిగానూ వాళ్ళకి అతను చెప్పాడు. కాని వాళ్ళు పొదలగుండా జర్మన్లకు కనిపించకూడదనీ, ఉన్న చోట వుండకుండా అటూ యిటూ చకచక కలదిరగాలనీ, అయితే మళ్ళీ అందులో అతి పనికిరాదనీ చెప్పాడు. పొడుగుబూట్లు తీసెయ్యమనీ, నిజానికి సైనిక సంబంధమైనదిగా వెంటనే తెలిసిపోయే ప్రతి దాన్నీ — బూట్లు, సైనిక టోపీలు, బెల్టులు అన్నీ — తీసెయ్యాల్సిందిగా వాళ్లకి అతను చెప్పాడు.

ప్రత్యేకించి యీ స్థానాన్ని ఎంపిక చెయ్యడంలో చలిమంటలకు పక్కగా తప్పుకోడానికి జర్మన్లకి అప్పుడిక ఒకే ఒక మార్గం — ఎడమ పక్కకు — మిగులుతుంది. ఎందుకంటే కుడిపక్కన కొండ శిఖరాలు నీటి అంచునుంచి పైకి లేచాయి, ఈ పక్క సరైన తోవ లేదు. కానైతే, ఎందుకైనా మంచిదని వస్కోవ్ అక్కడ ఒస్యానినాని నియమించాడు. ఆమెకు కూడా కనిపించినట్లే కనిపించి పక్కకి తప్పుకోమనీ, దండిగా శబ్దం చెయ్యమనీ, చలిమంటలు వెయ్యమనే ఆజ్ఞను యిచ్చాడు. ఇక తను, కొమెల్కోవాతో కలిసి, ఎడమ పార్శ్వపు రక్షణకు పూనుకున్నాడు. వాగు వంపు యిక్కడికి బాగా కనిపిస్తుంది, కనుక యిది చాలా కీలకమైంది. ఎవళ్ళు చెప్పగలరు — జర్మన్లు అప్పటికీ తమ మనసులు మార్చుకుని వాగుని దాట పూనుకోవచ్చు, అటువంటి సందర్భంలో, యిద్దరు ముగ్గురు జర్మన్లను నేల గూల్చడానికీ, తన సైనిక యువతులు చెల్లాచెదరై పారిపోవడానికీ తనకీ స్థావరం అవకాశం కల్పించవచ్చు.

సమయం సన్నగిలుతోంది, వస్కోవ్ మరో యువతిని జర్మన్ల రాకను కనిపెట్టి చూడటానికి నియమించి, తను ఒస్యానినా, కొమెల్కోవాలతో కలిసి హడావిడిగా సన్నాహాలు ప్రారంభించాడు. ఆ యువతులిద్దరూ చిదుగులూ, విరిగిన కొమ్మలూ పోగు చేస్తుండగా అతను తన గొడ్డలితో చెట్లను — విననియ్యి వాళ్లని, ముందే హెచ్చరింపబడనీ! — అనుకుంటూ బహిరంగంగా నరక నారంభించాడు. చాలా ఎక్కువ శబ్దం చేసే పొడవాటి చెట్లను అతను ఎంచుకున్నాడు, తర్వాత ఒకటి రెండు దెబ్బ లేస్తే కూలిపోయేలాగ నరికి అట్టేపెట్టి, మరో చెట్టును కొడుతూ పోయాడు. నుదుటి పైనుంచి చెమట ధారలు కళ్లలో పడుతున్నాయి, దోమలు నిర్దాక్షిణ్యంగా అతన్ని కుట్టాయి, కాని అతను అలా, తన గొడ్డలిని ఊపుతూ, ఆయాసంతో రొప్పుతూ, చెట్లను — గూర్విచ్ తన చౌకీనుంచి పరిగెత్తుకొచ్చేదాకా — కొడుతూనే వున్నాడు. వాగుకి అవతలి పక్కనుంచి ఆమె: "వాళ్లు వస్తున్నారు!" అంటూ సంజ్ఞ చేసింది.

"ఎవళ్ల స్థానానికి వాళ్లు వెళ్లండి" చెప్పాడు వస్కోవ్. "అమ్మాయిలూ మీమీ నిర్దిష్ట స్థానాల్లోకి వెళ్లండి — బహు జాగ్రత్తగా ఉండాలి సుమా. వాళ్లకి మీరు కనిపించండి — అయితే చెట్ల మధ్యనుంచే గాని పొదల్లో మాత్రం కాదు. పోతే మీకు చేతనైనంత గట్టిగా అరవండి...."

అతని సైనికులు ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోయారు, గూర్విచ్, చెత్వెర్తాక్‌లు మాత్రమే అవతలి గట్టున తచ్చాడుతున్నారు: చేతి తయారీ పాదరక్షను తన పాదానికి గట్టిగా బంధించిన పట్టీని విప్పడం చెత్వెర్తాక్‌కి సాధ్యం కాక తంటాలుపడుతోంది. వస్కోవ్ ఆమె దగ్గరకు వెళ్లి అన్నాడు: "కదలకు, నేను నిన్ను అవతలి ఒడ్డుకి దాటిస్తాను."

"అబ్బెబ్బే, ఒద్దు కామ్రేడ్...."

"కదలొద్దని చెప్పానా. నీళ్లు మంచుయుగాల్లాగున్నాయి, నీ ఆరోగ్యమింకా బాగా కుదుటపడలేదు కూడాను." ఆమెను ఏగాదిగా చూసి, అతను తన సైనికుని తన చేతుల్లోకి ఎత్తుకున్నాడు (ఆమె వంద పౌనులకు మించి బరువు లేదు). తన చేతులను అతని మెడకి వాలేసి పట్టుకొని ఆ యువతి ఎందుకో తెలియకుండానే ఆకస్మికంగా సిగ్గుపడిపోయింది. సిగ్గుతో ఆమె ముఖమంతా ఎర్రబడగా ఆమె అంది: "మీరు నన్ను చిన్న పిల్లలా చూస్తున్నారు...."

వస్కోవ్ జోకు ఒకటి విసురుదామనుకున్నాడు — ఏమైనా తను మోసుకెళ్తున్నది మనిషి గాని దుంగ కాదుకదా — కాని అతను అందుకు భిన్నంగా అన్నాడు: "తేమగా వున్న చోట్నుకి నువ్వు పరుగెత్తకు."

దాదాపు మోకాలిబంటిగా వున్న నీళ్లు మంచుయుగాల్లా వున్నాయి. గూర్విచ్ తన స్కర్టును పైకెత్తుకొని నీళ్లను నెట్టుకుంటూ ముందుకెళ్లింది: ఆమె సన్నటి కాళ్లు

మిలమిల తెల్లగా మెరుస్తున్నాయి, ఆమె బ్యాలన్సు నిలుపుకోడానికి తన బూట్లను అటూ యిటూ ఊపుతోంది. "నీళ్లు కాళ్లని గడ్డకట్టించేస్తున్నాయి" అని అరుస్తూ ఆమె వెనక్కి తిరిగింది, ఆ వెంటనే తన స్కర్టును కిందకి వదిలేసింది, దానితో స్కర్టు అంచు నీళ్లలో నాన సాగింది. వస్కోవ్ ఆమె వంక కోపంగా అరిచాడు: "నీ స్కర్టుని పైకి పట్టుకో!"

దానితో ఆమె అక్కడ ఆగి చిరునవ్వు నవ్వుతూ అంది: "సైనిక నిబంధనల్లో అలాంటిదేమీ లేదుకదా, సార్జెంట్ మేజర్...."

భేష్, వీళ్లింకా జోకులు విసరగలుగుతున్నారంటే పరిస్థితి అంత మరీ అధ్వానంగా లేదన్న మాట! వస్కోవ్ ఆ జోక్‌ని హార్దికంగా ఆహ్వానించాడు. అతను తన స్థానానికి చేరుకునే సరికి — అప్పటికి కొమెల్కోవా హడావిడిగా చలిమంటలు వేస్తోంది — అతను మంచి హుషారుగా ఉన్నాడు.

అతను సాధ్యమైనంత బిగ్గరగా బొబ్బరించాడు: "హేయ్, అమ్మాయిలూ, తొందరగా కానియ్యండి!"

ఒస్యానినా దూరంనించి అరిచింది: "ఓయ్, నిన్నే ఇవాన్, గుర్రాన్నీ, బండినీ యిలా తీసుకురా!..."

వాళ్లు అలాగ బిగ్గరగా అరిచారు, వాళ్లు సగం కొట్టిన చెట్లు పడగొట్టారు, ఏయ్ నిన్నే, నిన్నే అంటూ వాళ్లు అరిచారు, చలిమంటలు ఆరిపోకుండా వాళ్లు చూశారు. జర్మన్లకి మగస్వరం కూడా వినిపించాలని వస్కోవ్ కూడా ఉండి ఉండి అరిచాడు, కాని ఎక్కువ కాలం అతను విల్లో పొదలోనే వుండి, అక్కడినుంచి వాగుకి అవతలి పక్కనున్న పొదలనే నిశితంగా పరిశీలిస్తున్నాడు.

చాల సేపటిదాకా అతనికేమీ కనిపించలేదు. అప్పటికి తన సైనిక యువతులు అరిచి అరిచి అలిసిపోయారు, చెట్లన్నింటినీ — తను సగంసగం కొట్టి వుంచిన చెట్లన్నింటినీ ఒస్యానినా కొమెల్కోవాలు కూల్చేశారు. సూర్యుడు ఎత్తున అడవిపైగా ప్రకాశిస్తున్నాడు, వాగులో నీళ్లు మిలమిల మెరుస్తున్నాయి, కాని అవతలి పక్క పొదలు మాత్రం నిశ్శబ్దంగా, నిశ్చలంగానే ఉన్నాయి.

"బహుశా వాళ్లు వెళ్లిపోయారేమో?..." కొమెల్కోవా అతని చెవిలో ఊదింది.

వెళ్లారేమో, సైతానుకే తెలియాలి. తనేమీ స్టీరియోస్కోప్ దూరదర్శిని కాదు, వాళ్లు అతని కన్ను కప్పి యీపాటికి పాకి ఒడ్డును చేరుకొనివుండచ్చు. వాళ్లు ఆరితేరిన వాళ్లు — యిలాంటి కర్తవ్య నిర్వహణకు ఆషామాషీ వాళ్లని ఎన్నుకోరు.

ఇదీ వస్కోవ్ తనలో తను అనుకున్నది, కాని అతను పైకి అన్నదల్లా: "ఆగి చూడు."

ఇప్పటికి చిట్టచివరి రెమ్మ దాకా సుపరిచితమైన దృశ్యాన్ని పరీక్షిస్తూ అతని కళ్ళు మరోసారి పొదల మీదుగా పయనించాయి. నొప్పిపుట్టేటంతగా అతను కళ్ళు పొడుచుకు చూశాడు. అతను కళ్ళు చికిలించి, కళ్ళు నులుముకొని, మళ్ళీ చూశాడు. అతనికి తిన్నగా ఎదుట నదికి అవతలి ఒడ్డున ఆల్డర్ ఆకులు కదిలాయి, పాయలయ్యాయి, వాటి మధ్యగా ఎర్రని ముళ్ళలా వున్న గడ్డంతో ఒక యువకుని ముఖం కనిపించింది.

వస్కోవ్ వెనక్కి తిరక్కుండా చెయ్యి జాపి, చేతికి తగిలిన కొమెల్కోవా గుండ్రని మోకాలిని గట్టిగా నొక్కాడు.

కొమెల్కోవా గుసగుసగా చెప్పింది: ''నాకూ కనిపిస్తున్నాడు వాడు.''

వాగుకి దిగువన అతనికి మరో జర్మన్ కనిపించాడు. ఆ యిద్దరూ తమ ప్యాకేజీలను విప్పేసి, సబ్‌మెషీన్ గన్నులను తమ ముందు సంసిద్ధంగా పట్టుకొని ఒడ్డు వంకకే వస్తున్నారు. మనుషుల స్వరాలతో యింకా మార్మోగుతూనే వున్న ఎదుటి ఒడ్డుకేసి వాళ్ళు తమ చూపులు ప్రసరిస్తున్నారు.

వస్కోవ్ మనస్సు క్రుంగిపోయింది. ఇది స్కౌట్ల బృందం! అంటే దీని అర్థం ఒక్కటే, వాళ్ళు అడవిని గాలించి కట్టెలు కొట్టేవాళ్ళ సంఖ్యను అంచనా వేసుకుని, వాళ్ళని దాటి ముందుకు నెట్టుకెళ్ళిపోవాలనే నిర్ణయించుకున్నారన్నమాట. అంటే అన్నీ — సవివరమైన యావత్తు పథకం, వాళ్ళ అరుపులు, పొగలెగజిమ్మే మంటలు, కూల్చిన చెట్లు అన్నీ కూడా — బూడిదలో పోసిన పన్నీరే అయ్యాయన్న మాట — జర్మన్లు బెదరలేదు. అమ్మాయిల గొంతులను, మంటలను, శబ్దాలనే తమకు మార్గదర్శకాలుగా చేసుకొని వాళ్ళు వాగును దాటి, పొదల్లో దూరి, పాముల్లా చల్లగా ఆగి ఆగి ముందుకు చొరుచుకు రాబోతున్నారు. అప్పుడిక వాళ్ళు తమ అందర్నీ ఒక్క చేతి వేళ్ళతో లెక్కపెట్టి, అన్ని విషయాలనూ బేరీజువేసుకుంటారు.... మరి అప్పుడు.... తమ ఉనికి తెలిసిపోయిందని తెలుసుకుంటారు....

ఒక్క కొమ్మ కూడా కదలనంత మెల్లగా, వస్కోవ్ తన రివాల్వరును బయటకు తీశాడు. వీళ్ళిద్దరూ ఎక్కువ ముందుకు రాకముందే, వాగును దాటుతూండగానే, వీళ్ళిద్దర్నీ ఖతంచేసేసే విషయంలో అతనికి సందేహమేమీ లేదు. అయితే మిగిలిన వాళ్ళు, మిగిలిన తమ సబ్‌మెషీన్ గన్నులన్నింటితోనూ తన ఒళ్ళంతటినీ జల్లెడలా తూట్లుపడేలా చేస్తారనడంలో కూడా అతనికి సందేహం లేదు, కాని అతను ఆశించినదల్లా ఒక్కటే, తన యువతులు యీలోగా పారిపోవడమో, లేక దాక్కోడమో చెయ్యగలుగుతారని. ఈ కొమెల్కోవాను తనకి అడ్డంలేకుండా చేసుకోగలిగితేనా....

అతను వెనక్కి తిరిగేసరికి కొమెల్కోవా తనకు సరిగా వెనక వంగుని, హడావిడిగా తన సైనిక కోటును ఊడదీస్తూ కనిపించింది. ఆమె దాన్ని నేలమీద పారేసి, దాక్కునే ప్రయత్నమేమీ చెయ్యకుండా తటాలున లేచి నిలబడింది.

''ఆగు!...'' సార్జెంట్ మేజరు లోగొంతులో ఆజ్ఞాపించాడు.

''రాయా, వేరా, రండి యీతకొడదాం!...'' గింగురుమనే కంఠస్వరంతో కేకేసి, కొమెల్కోవా పొదల్లోంచి చొరుచుకుని వాగు వంక పరుగుతీసింది. తనేం చేస్తున్నానన్న స్పృహ లేకుండా వస్కోవ్ ఆమె కోటును చేతిలోకి తీసుకొని తన రొమ్ముకు అదుముకున్నాడు. ఈలోగా పాలరాతి శిల్పం వంటి అందమైన ఆ అమ్మాయి ఎండకు మిలమిలలాడుతున్న, గులకరాళ్లతో నిండిన నది ఒడ్డును చేరుకుంది.

గచ్చకాయ — ఆకుపచ్చ రంగు కోట్లు ధరించిన ఆకారాలు అదృశ్యమైన పొదలు ఎట్టఎదుట ఊగిసలాడుతున్నాయి. జేన్యా తాపీగా తన స్కర్టునూ, లోపలి గౌనునూ విప్పేసింది, తన నల్ల డ్రాయరును చేతులతో సవరజేస్తూ, అకస్మాత్తుగా మార్మోగే స్వరంలో — పాడటం కన్న అరుస్తూ — మొదలెట్టింది:

ఇటు పూత పిందెల మీదున్నాయి
ఆపిల్ చెట్లూ, పియర్ చెట్లూ
అటు నది పైగా కమ్ముకొస్తున్నాయి
పొగమంచు మేఘాలు....

ఆ క్షణంలో ఆమె ఎంత అందంగా వుందని! పొడుగ్గా రివటలా, తన అందమైన, పాలనురగవంటి తెల్లని శరీరంతో, సబ్‌మెషీన్ గన్నులకు ఆమె కేవలం పది మీటర్ల దూరంలో నిలబడింది. తన పాటను మధ్యలో నిలిపేసి, ఆమె నదిలోకి దిగి, ఆనందాతిరేకంతో అరుస్తూ, గంతులేస్తూ నీటిని తపతప కొట్టనారంభించింది. నీటి బిందువులు బిగువైన ఆమె వెచ్చని శరీరంపై జారుతూ, సూర్యకాంతిలో మిలమిల మెరుస్తున్నాయి. ఈలోగా సార్జెంట్ మేజరు భయంతో స్తంభించిపోయి, ఊపిరితీసుకోవడం కూడా కష్టం కాగా, సబ్‌మెషీన్ గన్ కాల్పు ఏ క్షణంలో వినిపిస్తుందోనని ఆదుర్దాగా ఎదురుచూడసాగాడు. అదిగో గుండు రాబోతోంది, అమెకు తగలబోతోంది, ఆమె ఒరిగిపోబోతోంది, చేతులు వేలాడెయ్యబోతోంది, మరి తర్వాత....

పొదలు నిశ్శబ్దంగా వున్నాయి.

''ఏయ్ నేస్తాలూ, రండర్రా రండి, హాయిగా యీతాలు కొట్టండి!...'' నీళ్లలో నాట్యం చేస్తూ కొమెల్కోవా సంతోష స్వరంలో బిగ్గరగా అరిచింది. ''ఇవాన్‌ని కూడా పిలవండి!... ఏయ్, ఇవాన్, ఎక్కడున్నావ్?...''

వస్కోవ్ ఆమె కోటును కింద పడేసి, తన పిస్తోలును ఒరలో దోపి, నేలబారుగా వంగి, చెట్ల గుంపులోకి దూసుకుపోయాడు. అతను తన గొడ్డలిని సాచి ఒక పైన్ చెట్టును తపతపా కొట్టాడు. ''ఓహో, యిదిగో యిప్పుడే వస్తున్నా!'' అంటూ అతను గట్టిగా

అరిచి, పైన్ చెట్టును మళ్లీ కొట్టాడు. "ఏయ్, కాస్త ఆగు, మేమిప్పుడే వస్తున్నాం!"

అతని జీవితంలోనే అతనెన్నడూ చెట్లను అంత వేగంగా నరకలేదు – అంత శక్తి అతని కెక్కడినుంచి వచ్చిందో మరి ఆశ్చర్యమే. తన భుజాన్ని మోపుచేసి అతనొక పెద్ద పైన్ చెట్టుని ఎండిన కొన్ని ఫర్ చెట్ల మీదకి నెట్టాడు – అది ఫెళఫెళామంటూ కూలి పెద్ద చప్పుడు చేసింది. రొప్పుతూ అతను తన స్థానానికి దూసుకెళ్లి మళ్లీ ఎదుటికి తొంగి చూశాడు.

కొమెల్కోవా యిప్పుడు తనకీ జర్మన్లకీ నడుమ ఒక పక్కకి తిరిగి గట్టుపైన నిలబడివుంది. ఆమె తన పల్చని లోగౌనును తలమీదుగా ఒంటిమీదకు లాక్కుంది. ఆ సిల్కు లోగౌను నాని ఆమె ఒంటికి అంటుకుపోయి, ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాలలో దాదాపు పారదర్శకంగా కనిపిస్తోంది. తను ఎంత అందంగా కనిపిస్తుందో ఆమెకు బాగా తెలుసు. అందుకనే ఆమె తాపీగా కదులుతూ, చలాకీగా తన జుట్టును తన భుజాలపైకి జార్చుకుంది. ఆ క్షణంలో అత్యంత దారుణమైన భయం మళ్లీ వస్కోవ్‌ను ఆవహించింది. మిలమిల మెరిసిపోయే యౌవనం తొణికిసలాడే యీ శరీరాన్ని ఏ క్షణాన పొదల మాటునుంచి గుళ్ల వర్షం దూసుకువచ్చి తాకి, తూట్లు పొడిచి, వికలం చేస్తుందోనని అతను చచ్చేటంత భయపడిపోయాడు.

క్షణంలో సగకాలం మాత్రమే తన తెల్లని చర్మం కనిపించే లాగా కొమెల్కోవా తన లోగౌను కిందనుంచి తన తడి డ్రాయరును ఊడదీసి, నీళ్లను పిండేసి, దాన్ని రాళ్లమీద ఆరబెట్టింది. ఆమె కూర్చుని, తన కాళ్లను జాపి, తన జుట్టును – నేలకు తాకుతూ వ్రేలాడుతున్న జుట్టును – ఎండకు ఆరవిప్పింది.

ఎదుటి గట్టు నిశ్శబ్దంగా వుంది, నిశ్శబ్దంగానే ఉండిపోయింది. ఒక్క పొద కూడా కదలడం లేదు. వస్కోవ్ కళ్లు పొడుచుకుని చూశాడు, కాని జర్మన్లింకా అక్కడున్నదీ, వెళ్లిపోయినదీ తేల్చుకోలేకపోయాడు. ఈ చిక్కు ప్రశ్నను పరిష్కరించడానికి వ్యవధి లేదు, అందుకని హడావిడిగా తన సైనిక కోటును విప్పేసి, పిస్తోలును తన పాంటు జేబులోకి జారవిడిచి, "ఏయ్, ఎక్కడున్నావ్!" అంటూ బిగ్గరగా అరుచుకుంటూ అతను ఒడ్డు వైపు బయల్దేరాడు.

తన గొంతు సాయిలాపాయిలాగా, సరదాగా వినిపించాలని అతను ఉద్దేశించాడు, కానైతే అతని గొంతును ఏదో పట్టుకున్నట్లయింది. పొదలు యిప్పుడతనికి వెనకగా ఉన్నాయి, అతనిప్పుడు బహిరంగ ప్రదేశంలో వున్నాడు – అతని గుండె భయంతో బద్దలై పక్కటెముకల గుండా బైటికొచ్చేస్తుందా అనిపించింది. అతను కొమెల్కోవా దగ్గరకు నడచివెళ్లి అన్నాడు: "పట్నంనుంచి వాళ్లిప్పుడే ఫోనుచేశారు, ఏ నిమిషాన అయినా లారీ రావచ్చు, అందుకని యిప్పటికింక చాల్లే నీ ఎండకాగడం. బట్టలేసుకో."

అతనీ మాటలు కావాలని నటన కోసమే అరిచాడు, ఆమె జవాబు అతని చెవిన చొరనే లేదు. అతను చాలా ఉద్రిక్తంగా ఉన్నాడు, అక్కడ ఆ పొదల్లో వున్న జర్మన్ల ఉని కికి సంబంధించిన చైతన్యం అతన్ని అనుక్షణం వెన్నాడుతోంది. అతను వాళ్ల విషయంలో ఎంత మెలకువతో ఉన్నాడంటే, మెల్లగా ఒక్క ఆకు కదిలినా కూడా తను వినగలనన్న సంగతి అతనికి తెలుసు, అటువంటి శబ్దమే వినవస్తే, యీ బండ వెనక్కి తప్పుకోగలననీ, తన పిస్తోలును చర్రున పైకి తియ్యగలననీ అతనికి తెలుసు. కాని ఏమీ కదల్లేదు.

కొమెల్కోవా అతన్ని చెయ్యి పుచ్చుకొని కిందకి గుంజింది, అతనామె పక్కనే చది కిలబడ్డాడు. ఆమె చిరునవ్వు నవ్వుతూన్నా ఆమె కళ్లు భయాతిరేకంతో ఉబ్బుతూండ టాన్ని అతను ఆకస్మికంగా చూశాడు. సజీవమైన భయం అది, పాదరసంలా భారమైన భయం అది.

''ఇక్కడనుంచి పద కొమెల్కోవా'' సాధ్యమైనంత బిగ్గరగా నవ్వుతూ వస్కోవ్ అన్నాడు.

ఆమె మాట్లాడుతూ, నవ్వుతూ కూడా వుంది, కాని అప్పటికీ వస్కోవ్‌కి శబ్ద మేమీ వినరాలేదు. అనుక్షణం వాళ్ళామెను ఎక్కడ చంపుతారో అన్న ఆదుర్దాతో తనక్కడ యింక ఎంతమాత్రం ఉండలేకపోతున్నాడు. పొదలగుండా తను ఆమెను తీసుకుపోవాలి, అందులోనూ తక్షణం తీసుకుపోవాలి. కాని దీన్నంతనీ ఒక సరదా తమాషాలా కనిపింపజేసి జర్మన్లను మస్కా కొట్టించేందుకు గాను తనిప్పుడు ఏదైనా ఒక పన్నాగాన్ని తటాలున ఆలోచించాలి.

''సరే రావు కదూ, నేను మంచిగా చెప్తూంటే వినకపోతే, ఉండు నీ నగ్నావతారాన్ని కుర్రాళ్ళకి చూపిస్తానుండు, నీ తిక్క కుదురుతుంది!'' అంటూ అతను ఉన్నట్టుండి బిగ్గ రగా అరిచి, బండమీద వున్న ఆమె దుస్తుల్ని దొరకబుచ్చుకుని ''నన్ను పట్టుకో చూద్దాం!'' అంటూ దౌడుతీశాడు.

అతను ఉద్దేశించినట్లుగానే కొమెల్కోవా కెవ్వున అరిచి, చటుక్కున లేచి, అతని వెన్నంటి పరిగెత్త నారంభించింది. మొదట వస్కోవ్ ఆమెకు దొరక్కుండా గట్టు వెంట లాఘవంగా పరిగెత్తి, తర్వాత పొదల్లోకి తప్పుకుని, చెట్ల తోపు ఆరంభమైన చోట ఆగాడు.

''సరే సరే, ఇంక చాల్లే బట్టలేసుకో, మరీ యింత నిప్పుతో చెలగాటాలు పనికిరాదు!''

ఆమెవంక తిరక్కుండా అతనామెకు స్కర్టును అందించాడు; కొమెల్కోవా దాన్ని అందుకోలేదు, అతని చెయ్యి అలా గాలిలోనే నిలిచిపోయింది. అతనికి గట్టిగా తిట్టాలని పించింది, కాని అతను వెనక్కి తిరిగి చూసేసరికి ప్రైవేట్ కొమెల్కోవా చేతుల్తో ముఖం కప్పుకుని, నేల మీదకు వంగి వుండటం కనిపించింది, గుండ్రని ఆమె భుజాలు ఆమె బ్లౌజుకి గల సన్నని పట్టీల కింద ఎగిరెగిరి పడుతున్నాయి....

తర్వాత — జర్మన్లు నిజంగానే వెనక్కి తగ్గారని తెలిసిన తర్వాత — వాళ్ళు పగలబడి నవ్వుకున్నారు. గొంతు బొంగురుపోయేదాకా అరిచిన ఒస్యానినాని చూసి, తన స్కర్టును కాల్చుకున్న గూర్విచ్‌ని చూసి, ముఖమంతా మసిచేసుకున్న చెత్‌వెర్తాక్‌ని చూసి, జర్మన్లని మస్కా కొట్టించిన కొమెల్కోవాని చూసి, చివరకు సార్జెంట్ మేజరు వస్కోవ్‌ను చూసి అంతా పగలబడి నవ్వుకున్నారు. కళ్ల వెంబడి నీళ్ళు గిర్రున తిరిగేదాకా వాళ్లు పడిపడి నవ్వుకున్నారు, ప్రాణం చాలి వచ్చేదాకా వాళ్ళు నవ్వుకున్నారు, తను కూడా — ఎంతైనా తను సార్జెంట్ మేజరునన్న సంగతిని ఆకస్మికంగా మరచిపోయి నవ్వాడు, తాము జర్మన్లను బురిడీ మాత్రమే కొట్టించామనీ, అది కూడా మహా సాహసికంగా చేశామనీ, యిప్పుడిక జర్మన్లు భయంతో బిగిసిపోయి బిత్తరపోయారనీ, యిప్పుడిక వాళ్లు లెగోంతొవ్ సరస్సు చుట్టూ యిరవై నాలుగు గంటలు ప్రదక్షిణం చెయ్యాలనీ తలుచుకు తలుచుకు మరీ నవ్వాడు.

“ఇక్కడికీ అధ్యాయం ముగిసింది!” నవ్వుల మధ్య వస్కోవ్ అన్నాడు. “ఇక్కడికీ అధ్యాయం పూర్తయింది అమ్మాయిలూ, ఇప్పుడింక వాళ్ళు తప్పించుకుపోలేరు — అంటే అదేననుకోండి, బ్రీచ్కినా సకాలంలో అక్కడికి చేరుకుంటే.”

“తప్పకుండా చేరుకుంటుంది, మీరు దిగులుపడకండి” ఒస్యానినా బొంగురు స్వరంలో అంది. ఆమె స్వరం తమాషాగా వుండటంతో అందరూ మళ్ళీ నవ్వనారంభించారు. “ఆమె లేడిలా పరిగెత్తుతుంది.”

“ఆ పక్షంలో, ఓ చిన్న పార్టీ చేసుకోవడం సముచితంగా వుంటుంది” తన సారా ఫ్లాస్కును పైకి తీస్తూ వస్కోవ్ అన్నాడు. “ఇదిగో అమ్మాయిలూ, యీ పార్టీ బ్రీచ్కినా లేడిపాదాలకూ, మీ తెలివైన బుర్రలకూ!”

అందరూ హడావిడిగా భోజన సన్నాహాలు ప్రారంభించారు. బండపైన వాళ్లొక తువ్వాలు పరిచారు, బ్రెడ్డూ, పంది మాంసపు కొవ్వూ పల్చని ముక్కల కింద కోశారు, చేపల్ని శుభ్రం చేశారు. వాళ్ళ హడావిడిగా స్త్రీలకు సహజమైన యీ విధులు నిర్వర్తిస్తూంటే సార్జెంట్ మేజరు, అలసటగా యిప్పటికీ అతిక్లిష్టమైన ఘట్టం ముగిసింది అనుకొంటూ, పురుష పుంగవునికి తగినట్లుగా, అల్లంత దూరంలో, సిగరెట్టు దమ్ములాగుతూ, భోజనానికి పిలుపు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు....

7

లీజా బ్రీచ్కినా తన పంథొమ్మిదేళ్ల జీవితాన్నీ సుఖప్రదమైన రేపటి కోసం నిరీక్షిస్తూనే గడిపింది. ప్రతి ఉదయమూ ఆమె రాబోయే అపారమైన సుఖం కోసం ఆతృతగా

ఎదురుచూసేది. కాని అంతలోనే ఆమె తల్లి దగ్గు — ప్రాణం చాలువచ్చే దగ్గు, అనుక్షణం మనిషిని పీడించి పిప్పిచేసే దగ్గు — అడ్డం వచ్చి సుఖంతోడి ఆమె సమావేశాన్ని మరుసటి రోజుదాకా వాయిదావేసేది. ఆమె ఆకాంక్షలనూ, ఆమె నిరీక్షణనూ అది చంపేది కాదూ, రద్దూ చేసేది కాదు — అది కేవలం వాయిదావేసేది.

''మీ అమ్మ యింక ఎక్కువ రోజులు బతకదు'' నాన్న లీజాను ఖండితంగా హెచ్చరిస్తూండేవాడు.

ఐదేళ్ల పాటు, అనుదినం, ఆయన ఆమెను యీ మాటలతోనే పలకరించేవాడు. లీజా పెరట్లోకి వెళ్లి పందికీ, గొర్రెలకీ, తన తండ్రి ఉద్యోగ నిర్వహణ నిమిత్తం సప్లయ్ చెయ్యబడిన ముసలి గుర్రానికీ మేత వేసేది. తర్వాత ఆమె తన తల్లి ఒళ్లు తుడిచి, దుస్తులు మార్చి, చెమ్చాతో తిండి తినిపించేది. వంట వండేది, ఇల్లు శుభ్రంచేసేది, గ్రామంలోని దగ్గర షాపుకెళ్లి బ్రెడ్డు కొనుక్కొచ్చేది; చివరకామె తన తండ్రి యిలాకాలో వున్న అటవీ విభాగాలను కూడా పర్యవేక్షించేది. ఇతర బాలికలు, ఆమె స్నేహితురాండ్రు, అందరూ తమ స్కూలు చదువులు ముగించుకున్నారు; వారిలో కొందరు వేరే చోట్ల తమ చదువులు కొనసాగిస్తున్నారు, కొందరు పెళ్లిళ్లు చేసుకున్నారు, కాని లీజా మాత్రం వంటలూ, వడ్డనలూ, కడుగుళ్లూ, తిరిగి వంటవార్పులతోనే సతమతమవుతోంది — ఉజ్వలమైన రేపటి కోసం ఆశాభావంతో నిరీక్షిస్తూనే గడుపుతోంది.

అయితే ఉజ్వలమైన ఆ రేపటి దినం ఆమె మనస్సులో ఎన్నడూ కూడా తన తల్లి మరణంతో ముడిపెట్టబడలేదు. తన తల్లి ఆరోగ్యంగా ఉన్నప్పటి సంగతి అప్పటికి దాదాపు ఆమె స్మృతిపథంలోనే లేకుండా పోయింది. పైగా లీజాలో జీవం పెల్లుబుకుతూన్నదేమో, ఆమె మనస్సులో మృత్యువును గురించిన ఆలోచనకు తావే లేకపోయింది.

ఆమె తండ్రి మనోవ్యాకులంతో కూడిన మహా పట్టుదలతో ఆమెకు గుర్తుచేస్తూవచ్చిన మృత్యువుకి భిన్నంగా, జీవితం ఆమెకు వాస్తవమూ, ఆచరణసాధ్యమూ అయిన ఒక మహత్తర భావం. ఆ జీవితం ఎక్కడో మహత్తరమైన రేపులో వుంది, మరి అది యింత వరకూ యీ అడవి యిలాకాను తప్పించుకు దూరంగా పోతున్నా, దీనికి కొన్ని మైళ్ళ పరిధి లోపల దాని ఐపూ పత్తా కూడా లేకపోయినా, జీవనార్హమైన జీవితమంటూ ఒకటి అస్తిత్వంలో ఉన్నదనీ, దానిలో తనకూ వాటా వున్నదనీ, తన మరుసటి రోజును తను అందుకోకపోవడం ఎలా అసంభవమో తన ఆ జీవితాన్ని తను అందుకోకపోవడం కూడా అలాగే అసంభవమనీ లీజాకు తెలుసు.

స్త్రీజనసహజమైన నిరీక్షణ అనే యీ కళను ఆమె తన పధ్నాలుగవ ఏటినుంచీ అభ్యసిస్తూనే వుంది. తన తల్లి అస్వస్థత కారణంగా గత్యంతరం లేక తన స్కూలును విడిచిపెట్టాల్సివచ్చిన లీజా, మొదట తను తన స్కూలుకు తిరిగి వెళ్లగల రోజు కోసం

నిరీక్షించింది, తర్వాత తన స్నేహితులను కలుసుకోగల అవకాశం కోసం నిరీక్షించింది, ఆటు తర్వాత క్లబ్బు ముందు పచ్చికలో తను స్వేచ్ఛగా గడపగల సాయంత్రాల కోసం నిరీక్షించింది. మరి ఆ తర్వాత....

తర్వాత అకస్మాత్తుగా ఎదరచూసేందుకు ఏమీ లేదనీ, నిరీక్షార్హమైనదేదీ లేదనీ తేలింది. ఆమె స్నేహితులలో కొందరింకా చదువుతూండగా, మరికొందరు అప్పుడే ఉద్యోగాలు చేస్తున్నారు. వారిప్పుడు ఆమెకు చాలా దూరాన నివసిస్తున్నారు. వాళ్లంతా తమతమ వ్యవహారాల్లో తలమునకలై వున్నారు, వాటిలో తనకిప్పుడు భాగస్వామ్యభావం లేదు. మగ కుర్రాళ్లతో క్లబ్బులో కాలం గడపడం, సినిమా ప్రదర్శనలకు ముందు జోకులు విసురుకోవడమూ ఒకప్పుడు ఆమెకు అతి సరళంగానూ, సులభంగానూ కనిపించింది, మరి అదే కుర్రాళ్లు యిప్పుడు భిన్నంగా కనిపిస్తున్నారు, వాళ్లు తన పట్ల విముఖ భావంతో, హేళన భావంతో వున్నట్లు కనిపిస్తున్నారు. లీజా యిప్పుడు వాళ్ల సావాసాన్ని తప్పించుకుంటోంది, వాళ్ల సమక్షంలో మౌనంగా వుంటోంది, సరదాగా వుండే ఆ బృందానికి దూరంగా వుండేందుకు ప్రయత్నిస్తోంది, తర్వాత కొన్నాళ్లకు క్లబ్బుకెళ్లడమే పూర్తిగా మానుకుంది.

ఆమె బాల్యం ముగిసింది, దానితో పాటే ఆమె పాత స్నేహాలు కూడా అంతరించాయి. ఇప్పుడిక ఆమెకు స్నేహితులెవరూ లేరు. మోడువారిన ముసలి ఫారెస్టర్లు తప్ప యిప్పుడు ఆమె ఇంటిలోని ప్రమిద దీపపు కాంతికి ఆకర్షితులయ్యే వాళ్లు మరెవ్వరూ లేకపోవడమే యిందుకు కారణం. తన బాల్యం స్థానాన్ని ఏమి ఆక్రమించబోతున్నదో తెలియక, లీజా నిర్వేదం పొందింది, బెంబేలెత్తింది. లీజా కలవరపడుతూ, తనకే సరిగా వ్యక్తంకాని దేని కోసమో గాఢంగా వాంఛిస్తూండగా శీతకాలం గడిచిపోయింది, వసంత కాలంలో లీజా తండ్రి తనతో ఒక వేటగాడిని వెంటబెట్టుకొచ్చాడు.

"ఈయన మనతోబాటు కొన్ని రోజులు ఉండాలనుకుంటున్నాడు" ఆయన తన కూతురితో చెప్పాడు, "కాని ఈయనకి బస ఎక్కడ యివ్వాలబ్బా? ఓ మూల మీ అమ్మ చావుబతుకుల్లో వుంది."

"గడ్డి వుండే మిద్దెగది అయితే బాగుంటుందేమో?" అతిథి సూచించాడు.

"అక్కడింకా చాలా చలిగా వుంటుందేమో?" లీజా సంకోచిస్తూ అంది.

"నాకో గొర్రెతోలు కోటు యివ్వగలరా?"

నాన్నా, అతిథీ వోడ్కా తాగుతూ చాలా సేపు వంటింట్లో కూర్చున్నారు. చెక్కలతో కూర్చిన అడ్డుగోడకి అవతల అమ్మ బాధగా దగ్గుతోంది. లీజా నేలమాళిగలోకి వెళ్లి ఉప్పులో ఊరవేసిన క్యాబేజి ముక్కలు తెచ్చింది. కోడిగుడ్లు వేయించింది, మగాళ్లు మాట్లాడుకొంటూంటే వింటూ కూర్చుంది.

ఎక్కువగా మాట్లాడినది నాన్న. ఆయన గ్లాసు తర్వాత గ్లాసు వోడ్కా గొంతులో

పోసుకొని, ఊరబెట్టిన క్యాబేజి ముక్కల్ని వేళ్లతో తీసి జీబురు గడ్డం మధ్య వున్న తన నోట్లో కుక్కుకుంటూ మాట్లాడాడు. నోరు అలా నిండుగా వుండగా ఆయన అదే పనిగా మాట్లాడుతూనే "ఓ నిమిషం ఆగు, అబ్బాయ్ మరీ అంత తొందర పనికి రాదు. జీవితం అడవి లాంటిది, దాన్ని పలచన చెయ్యడం, శుభ్రంచెయ్యడం, కలుపును ఏరెయ్యడం అవసరం. ఔనంటావా కాదా? అంత మరీ తొందర పనికిరాదు, బోలెడన్ని ఎండు కొమ్మ లున్నాయి, తెగులు తగిలిన చెట్లున్నాయి, అడుగున గుబురుగా పెరిగిన కలుపు మొక్కలు న్నాయి. ఔనా?"

"నిజమే, దాన్ని శుభ్రంచెయ్యాల్సిందే" అతిథి ఆమోదించాడు. "అయితే దాన్ని ఒత్తు తగ్గిస్తే చాలదు, దాన్ని మొదలంటా పీకెయ్యాలి — కలుపు విషయంలో నిర్దాక్షిణ్యంగా ఉండాలి."

"సరే" లీజా తండ్రి అన్నాడు. "ఒప్పుకున్నాను. కాని అంత తొందర పనికిరాదు. అడవుల విషయంలో ఏం చెయ్యాలో మన ఫారెస్టర్లకి తెలుసు. ఇది అడవి సంగతే అయితే ప్రతిదీ మనకి కరతలామలకమే. మరి అది జీవితానికి — వెచ్చగా ఊపిరి పీలుస్తూ, కదులుతూ, అరుస్తూవుండే జీవితానికి సంబంధించిన వ్యవహారమైనప్పుడో?"

"సరే, ఉదాహరణకి అదొక తోడేలనుకోండి" అతిథి హేళనగా అన్నాడు.

"తోడేలా?" నాన్నకి చిర్రెత్తుకొచ్చింది. "తోడేలు నీకేం హానిచేసింది? తోడేళ్లకు వ్యతిరేకంగా నీకున్న పితూరీలేమిటి? కాస్త చెప్పు బాబూ, చూద్దాం!"

"తోడేలుకి కోర పళ్లున్నాయి" వేటగాడు మందహాసం చేశాడు.

"తను తోడేలుగా పుట్టడం దాని నేరమా? దాని నేరమేంటి? కాదబ్బాయ్ కాదు, తోడేళ్లపైన నేరం మోపినది మనం. వాటితో సంప్రదించనైనా సంప్రదించకుండా మనం ఆ పని చేశాం. అది న్యాయమంటావా?"

"అదిగో అక్కడే వస్తుంది పేచీ, ప్రెతోవిచ్, తోడేలు వేరు, న్యాయం వేరు, అవి రెండూ రెండు వేర్వేరు విషయాలు. అవి పొసగని విషయాలు."

"పొసగని విషయాలా?... మరైతే తోడేలూ, కుందేలూ — వీటి సంగతేమిటి? వీటి మధ్య పొసుగుతుందా? ఇకిలింపు కట్టిపెట్టు. సరేనయ్యా, తోడేళ్లను జనానికి వ్యతిరేకమైన విగా పరిగణించాలని మనకి చెప్పారు — అదొక ఆజ్ఞ. అంతే, పాలోమంటూ లేచి రష్యా అంతటా వున్న తోడేళ్లను మనం కాల్చిపారేస్తాం, వాటిలో ప్రతి ఒక్కదాన్నీ. మరి పరి ణామం ఏమవుతుంది?"

"పరిణామమా?" వేటగాడు చిరునవ్వు నవ్వాడు. "మనకి కొల్లలుగా వేటజంతు వులు దొరుకుతాయి."

"సరిగా అందుకు వ్యతిరేకంగా జరుగుతుంది!" నాన్న కంయ్‌మన్నాడు, జుట్టుతో

నిండివున్న గుప్పెటతో బల్ల ధన్మున గుద్దాడు. "నేను కావాలంటే రాసి యిస్తాను, మన కింక వేటజంతువులే మిగలవు! మనం వేటాడేవన్నీ జంతువులన్నీ, ఆరోగ్యంగా ఉండాలన్నప్పుడు, అవి అటూ యిటూ పరిగెడుతూవుండాలి. పరిగెడుతూవుండాలి, అబ్బాయ్ విన్నావా? అవి పరి గెత్తుతూ వుండేలా చెయ్యాలంటే వాటిని బెదరగొట్టాలి, ఏ నిమిషాన అయినా తాము గుటకాయస్వాహా చెయ్యబడతామని అవి భయపడాలి. సరే, నువ్వు జీవితానికి ఏ రంగైనా పుయ్యొచ్చు, అది సాధ్యమే. కాని మనం ఆ పని చెయ్యాలా అని? ఎందుకు — సంఘర్షణ తీవ్రతను తగ్గించేందుకా? అప్పుడిక మనకేం మిగులుతాయి? — కొవ్వెక్కి బద్ధకం బలిసి, తోడేళ్లు లేకపోవడంతో తమ విధులను నిర్లక్ష్యంచేసే కుందేళ్లు. అప్పుడు మనం మళ్లీ ఓ కొత్త తోడేలుమందని పెంచుతామా? లేకపోతే, జంతువుల్ని సక్రమంగా ఉంచేందుకు గాను విదేశాలనుంచి కొన్నింటిని దిగుమతి చేసుకుంటామా?"

"ఔనుగాని, నాకు మీరో విషయం చెప్పండి, కొంపదీసి మీరు కులాక్కులుగా వర్గీక రింపబడలేదు కదా?" ఇవాన్ పెత్రోవిచ్‌ని అతిథి ప్రశాంతంగా ప్రశ్నించాడు.

"నేను కులాక్కా?!" ఫారెస్టరు దీర్ఘనిశ్వాసం విడిచాడు. "నాకేం ఆస్తి వుందనిట? — నా రెండు చేతులూ, నా భార్యా కూతుళ్లే. నాకు కులాక్ అని పేరెట్టినందువల్ల వాళ్లకి కలిసొచ్చేదేమీ లేదు."

"వాళ్లకా?"

"సర్లే, మనకి!..." నాన్న గ్లాసుల్లో కొంచెం వోడ్కా పోసి, అతిథి గ్లాసుని తన గ్లాసుతో టంగుమనిపించాడు. "బాబూ, నేను తోడేల్ని కాను, నేను కుందేల్ని." నాన్న గ్లాసులో మిగిలిన దాన్నంతనీ ఒక్క గుటకలో తాగేసి, ఎలుగుబంటి మాదిరిగా వికృతంగా — బల్లని ముందుకు నెట్టి — లేచి నిలబడ్డాడు. ఆయన గుమ్మంలో నిలబడి అన్నాడు: "నేనిక పోయి పడుకుంటాను, మా అమ్మాయి మీకు దోవ చూపెడుతుంది."

లీజా అంతసేపూ మూల మౌనంగా కూర్చుని వుంది. వేటగాడు నగరవాసి, తెల్లని గట్టి పలువరుస గలిగిన యువకుడు, యిదంతా ఆమె కలవరపాటుకు దారితీసింది. సమ్మో హితురాలై ఆమె అతని వంక చూసింది, అయితే అతను తన వంక చూసినప్పుడల్లా కళ్లు తిప్పేసుకొనే జాగ్రత్త మాత్రం తీసుకుంటోంది. అతని చూపుతో తన చూపును కలపడానికి ఆమె భయపడింది, అతనేదైనా తనను అడగొచ్చు, దానికి జవాబు చెప్పడం తనకి కష్టం కావచ్చు, లేక తనేదైనా అసందర్భంగా అవకతవకగా మాట్లాడవచ్చునని బెదిరింది.

"మీ నాన్న చాలా అజాగ్రత్తగా మాట్లాడుతున్నారు."

"ఆయన కమ్యూనిస్టు గెరిల్లా" ఆమె హడావిడిగా జవాబిచ్చింది.

"ఆ సంగతి మాకు తెలుసు" అతను చిరునవ్వు నవ్వి లేచాడు. "సరే, నేనెక్కడ పడుకోవాలో చూపించు లీజా."

గడ్డి వుండే మిద్దెగదిలో చీకటిగా — నేల మాళిగలో ఉన్నంత చీకటిగా — వుంది. లీజా గుమ్మం దగ్గర కొంచెం సంకోచించింది, తర్వాత అతిథి చేతుల్లోంచి బరువుగా వున్న గొర్రెతోలు కోటూ, బొండాంలా వున్న దిండూ తీసుకుని "ఇక్కడ ఆగండి" అని చెప్పింది.

ఆమె ఊగిసలాడుతున్న నిచ్చెన ఎక్కి, గడ్డిని అటూ యిటూ కదిపి, దిండుని దాని మీద వేసింది. ఇప్పుడిక ఆమె కిందకి దిగి అతిథిని పిలవచ్చు, కాని ఆమె అలా చెయ్యకుండా, ఆ కటిక చీకట్లో నిరుటి ఆ మెత్తటి గడ్డిమీద తన మోకాళ్ళ ఆన్చి అటూ యిటూ తిరిగి, గడ్డిని మరింత సౌకర్యంగా సర్దుతూ — అంత సేపూ చెవులు దోరబెట్టుకుని వింటూ — తాత్సారం చేసింది. అతని అడుగుల భారానికి నిచ్చెన మెట్లు కిర్రుమనే శబ్దం చెయ్యాలని తను వాంఛిస్తున్నానని గాని, చీకట్లో హడావిడి తత్తరబిత్తర సాన్నిహిత్యాన్ని, అతని ఊర్పులను, అతని గుసగుసలను, చివరకు అతని మోటు స్పర్శను తను కోరుకుంటున్నానని గాని, తనలో తను ఆమె ఒప్పుకోవడం అసంభవమే. అబ్బే, ఆమె బుర్రలో అటువంటి పాపిష్టి ఆలోచనలేమీ లేవు; ఆమె వాంఛించినదల్లా అస్పష్టమైనదాన్ని దేన్నో, వేడిగా చుర్రుమనేలా వుండే దేన్నో, ఒకే ఒక్క క్షణాన్ని ఆవాహన చేసి ఆ మరుసటి క్షణమే తరలిపోయే దాన్ని దేన్నో తనకు లభింపజేస్తానని వాగ్దానం చేస్తూ తన గుండె ఆకస్మికంగా సాధ్యమైనంత గట్టిగా స్పందించాలని మాత్రమే.

కాని ఏ కిర్రుచప్పుడూ కాకపోవడంతో లీజా కిందకి దిగివెళ్ళింది. అతిథి గుమ్మంలో సిగరెట్టు కాలుస్తున్నాడు, "గడ్డి కొట్లో సిగరెట్టు కాల్చేరు సుమా" అంటూ పరుషంగా హెచ్చరించింది.

"నాకు తెలుసు" అని అతను సిగరెట్టు కొసను కాలితో నలిపి ఆర్పేశాడు. "గుడ్ నైట్."

నిద్రించేందుకు అతను పైకెళ్ళాడు, ఆమె పాత్రలు కడిగేందుకు యింట్లోకి పరిగెత్తింది. ఆమె అతిభద్రంగా మామూలుగా కడిగే దానికన్న ఎంతో తాపీగా అలా కడుగుతూ, ప్రతి ప్లేటునూ తుడుస్తూ అతను మళ్లీ వచ్చి కిటికీ తడతాడని ఒకవంక బెదురుగా మరోవంక ఆశగా నిరీక్షించింది. అప్పుడూ అటువంటి పిలుపేమీ లేకపోయింది. లీజా దీపం ఆర్పేసి తన పడకను చేరుకుని — తల్లియొక్క పరిచితమైన దగ్గునూ, మామూలుకు మించి మరింత పానీయం పుచ్చుకున్న తండ్రి గుర్రుసూ వింటూ నిద్రపోయింది.

అతిథి ప్రతి రోజూ ఉదయం వెళ్ళి రాత్రి ఎప్పుడో ఆలస్యంగా ఆకలితో, అలసిపోయి తిరిగివచ్చేవాడు. లీజా అతనికి భోజనం పెట్టేది. అతను హడావిడిగా తినేవాడు, ఆబగా మాత్రం కాదు. అది ఆమెకు ముచ్చట వేసేది. భోజనం పూర్తి అయీకాగానే అతిథి గడ్డి కొట్టుకి వెళ్ళిపోయేవాడు, యిప్పుడిక అతని పడకను సరిచెయ్యాల్సిన అవసరం లేదు కనుక లీజా యింట్లోనే ఉండిపోయేది.

ఒక రోజున ఆమె ధైర్యం కూడదీసుకుని "ఔనుగానీ, మీరు వేటనుంచి ఎప్పుడూ ఏమీ తీసుకురారేం?" అని అడిగింది.

"అదృష్టం కలిసిరావడంలేదు."

"మీరు చిక్కిపోయారు" అతని వంక చూడకుండా ఆమె కొనసాగించింది. "సెలవలు విశ్రాంతిగా గడపడమంటే యిలాగేనా?"

"నేను చాలా హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాను" దీర్ఘ శ్వాస విడుస్తూ అన్నాడతను. "దురదృష్టవశాత్తూ అది పూర్తయిపోయింది: నేను రేపు వెళ్లిపోతున్నాను."

"రేపే?!.." లీజా చిన్నబోయినట్లు రెట్టించింది.

"ఔను, రేప్పొద్దున్నే. నేను దేన్నీ వేటాడకుండానే వెళ్లిపోతున్నాను. చిత్రంగా లేదూ?"

"ఔను చిత్రమే" ఆమె విచారంగా అంది.

వాళ్లు మాట్లాడుకున్నదంతా అంతే. కాని అతను యింట్లోంచి బయటకు వెళ్లిపోగానే లీజా తొందరతొందరగా వంటిల్లు శుభ్రంచేసి పెరట్లోకి వెళ్లింది. అతని దీర్ఘ నిశ్వాసాలనూ, గొంతు సవరించుకోడాన్నీ వింటూ చాల సేపు ఆమె గడ్డి కొట్టు చుట్టూ అలంగం తిరిగింది, గోళ్లు కొరుక్కుంది, అటు తర్వాత కొట్టు తలుపును — మధ్యలో తన మనస్సునెక్కడ మార్చుకుంటానో అని భయపడుతున్నట్లు — చటుక్కున నిశ్శబ్దంగా తీసి నిచ్చెన మెట్లెక్కింది.

"ఎవరది?" అతను తాపీగా కేకేశాడు.

"నేనే" జవాబిచ్చింది లీజా. "మీ పక్క సర్దమంటారా?..."

"అక్కర్లేదు, పక్క బాగానే వుంది" అతను ఆమెకు మధ్యలోనే అడ్డు తగిలాడు. "నువ్వింకా పడుకోలేదేం?"

గడ్డి కొట్టులోని ఉక్కిరిబిక్కిరి చేసే కారుచీకటిలో, అతని సరసనే కూర్చున్న లీజా మౌనంగా ఉండిపోయింది. అతను ఆమె ఉఛ్వాసనిశ్వాసాలను — వాటిని బిగపట్టేందుకు ఆమె శాయశక్తులా తంటాలుపడుతోంది — వింటున్నాడు.

"ఏం, యిక్కడ జీవితం ఏమంత సరదాగా లేదు కదూ?"

"బొత్తిగానూ" ఆమె జవాబు వినిపించీ వినిపించనట్లుంది.

"అయినాకూడా ఎవరూ మూర్ఖంగా ప్రవర్తించకూడదు."

లీజాకు అతను నవ్వుతున్నట్టు అనిపించింది. ఆమె తనను తనే అసహ్యించుకుంది, తన పైన తనే కోపగించుకుంది, అతనిపైన కూడ కోపగించుకుంది — అయినా అక్కడే ఆగింది. అసలు తనిక్కడికి ఎందుకొచ్చిందో చెప్పలేని మాదిరిగానే, తానిక్కడ ఎందుకు ఆగిందోకూడా ఆమె చెప్పలేదు. తన జీవితమంతా ఆమె ఒంటరిగానే వుంది, ఆమె ఎన్నడో బహు అరుదుగా గాని ఏడ్చియుండదు, ఆమె ఒంటరితనానికి అలవాటుపడిపోయింది, కాని

యిప్పుడు మరి దేనికన్న ఎక్కువగా సానుభూతిని కోరుకుంటోంది. ఆమె జాలితో నిండిన మాటలు వినాలని కోరుకుంది, తన జుట్టు నిమురబడాలని కోరుకుంది, సముదాయింపును కాంక్షించింది, అంతేకాదు — తనలో తనైనా ఒప్పుకొనివుండేది కాదు గాని — తనని అతను ముద్దుపెట్టుకోవాలని కోరుకుంది. కాని, తన తల్లి తనను ఆఖరిసారి ముద్దు పెట్టుకొన్నది అయిదేళ్ళ క్రితమని, మహత్తరమైన ఏ రేపటి రోజు కోసమైతే తను జీవిస్తూనే వుందో ఆ రేపటి దినానికి హామీగా తనకిప్పుడు, యీ క్షణాన ఒక ముద్దు కావాలని ఆమె ఎలా చెప్పగలదు?

''ఇంక పోయి పడుకో'' అతనన్నాడు. ''నేను చాలా అలిసిపోయాను, నేను బాగా పెందరాళే లేచి వెళ్ళిపోవాలి.''

అతను ఆవులించాడు. యిది బిగ్గరగా ఔదాసీన్యంతో కూడిన సుదీర్ఘమైన ఆవులింత. తన పెదవులు కొరుక్కుంటూ లీజా బిరబిరా నిచ్చెనమెట్లు దిగిపోయింది; ఆమె మోకాలును బాధకలిగేలాగ దబడబా బాదుకుంది. కాని అంతలోనే పెరట్లోకి పరిగెత్తి తలుపు దభాలున మూసింది.

తెల్లవారకట్ల తన తండ్రి దిమోక్‌కి కళ్ళెం బిగించడం, అతిథి తన తల్లి దగ్గర సెలవుతీసుకోవడం, తలుపులు కిర్రుకిర్రుమనడం ఆమె వింది. కాని ఆమె నిద్రపోతున్నట్టు నటిస్తూ తన పక్కపైన పడుకునేవుంది, మూసిన కనురెప్పల క్రిందనుంచి కన్నీళ్ళు మెల్లగా జాలువారాయి.

నాన్న భోజనంవేళకి తిరిగివచ్చాడు, కొంచెం తాగి వున్నాడు. ఆయన తన టోపీ లోంచి నీలంగా వున్న పంచదార బిళ్లలను దిమ్మరించాడు. అవి దడదడ శబ్దంచేస్తూ టేబిలు పైన చెదిరిపడ్డాయి, ''వింటున్నావా అమ్మాయ్'' అంటూ అతను ప్రకటించాడు: ''మన అతిథి వున్నాడే ఆయన గొప్పవాడు. మనకి పంచదార యివ్వమని ఉత్తరువు జారీచేశాడు. నీకు గుర్తుందా, మన షాపులో మనం పంచదార ముఖం చూసి యిప్పటికప్పుడే దాదాపు ఏడాదైపోయింది. ఇవిగో చూసుకో — మూడు కిలోల పంచదార!''

తర్వాత అతను గమ్మున ఉండిపోయాడు, తన జేబులు తట్టి, పొగాకు సంచి పైకి తీసి, అందులోంచి ఒక చీటీ తీసి ''ఇదిగో, యిది నీకు!'' అని చెప్పి ఇచ్చాడు.

> ''నువ్వు చదువుకోవాలి లీజా. ఇక్కడిలా అడవిలోనే ఉండిపోతే నువ్వు ఆటవికురాలివిగా తయారవుతావు. ఆగస్టులో నువ్విక్కడికి రా, టెక్నికల్ స్కూల్లో చేరేందుకు నీకు నేను సాయంచేస్తాను, నువ్విక్కడ హాస్టల్లో ఉండచ్చు.''

సంతకం, చిరునామా మాత్రమే ఉన్నాయి. మరేమీ లేదు, చివరకు అభినందనలు కూడా లేవు.

అటు తర్వాత ఒక నెలకు ఆమె తల్లి చనిపోయింది. మౌనంగా, దిగాలుగా వుంటూ వచ్చిన ఆమె తండ్రి నిజంగానే చిరుబుర్రులాడుతూ, ఎడతెగకుండా తాగనారంభించాడు. లీజా మాత్రం ముందుమాదిరిగానే అద్భుతమైన రేపటి కోసం తన చిర నిరీక్షణను కొనసాగించింది. కాని రాత్రిపూట త్రాగుబోతులైన తన తండ్రి సహచరులనుంచి మాత్రం తన తలుపు గడియ వేసుకుంటూవుండేది. అప్పటినుంచీ ఆమె ఆశించే మహోజ్వలమైన రేపు ఆగస్టు నెలతో గట్టిగా ముడివడింది. గోడకి అవతలి పక్కనుంచి వినిపించే త్రాగుబోతు స్వరాలను వింటూ లీజా యిప్పటికే బాగా నలిగి చిరిగిపోయిన ఆ చిన్న చీటీని మరలమరల చదువుకొంటూ వుండేది.

తర్వాత యుద్ధం ప్రారంభమైంది, దానితో లీజా పట్టణానికెళ్లేందుకు బదులు రక్షణ స్థావరాల నిర్మాణంలో పాల్గొనడం సంభవించింది. ఆ వేసవికాలమంతా ఆమె కందకాలు తవ్వడంలోనూ, టాంకు విధ్వంసక రక్షణ శ్రేణుల నిర్మాణంలోనూ గడిపింది. జర్మన్లు వీటిని తప్పించుకొని పక్క తోవన పోయే విషయంలో శ్రద్ధ తీసుకునేవారు. తర్వాత జర్మన్ల చేతిలో చిక్కకుండా తప్పించుకున్నవారి మధ్య తను కూడా వుంది. వారితో బాటు కందకాలు తవ్వుతూ తవ్వుతూ తూర్పు దిశగా మరింత ముందుకెళ్లింది. ఆకురాలు కాలం చివర నాటికి ఆమె వల్దాయ్ పీఠభూమికి అవతలి కెక్కడికో చేరుకుంది. అటుతర్వాత ఆమె విమాన విధ్వంసక శతఘ్ని దళంలో కుదురుకుంది, అదిగో అందుకనే తానిప్పుడు 171వ స్టేషనుకి పరిగెత్తుతోంది....

వస్కోవ్‌ను లీజా మొట్టమొదట సారి చూసినది అతను తమ దళం ముందు, యింకా నిద్రమత్తుగా వున్న కళ్లను చికిలిస్తూ, తెలివి కూడదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పుడే — ఆ మొదటి చూపులోనే వస్కోవ్ పట్ల లీజాకు యిష్టం ఏర్పడింది. అతను మితభాషి, హడావిడికీ అతనికీ చుక్కెదురు — అతనికి పుట్టుకతో అబ్బిన గుణమది. అతను రైతు కుటుంబానికి చెందినవాడు, అంతే కాదు, అతనిలో మగసిరీ, ఆధారపడ దగిన లక్షణమూ — సాధారణంగా ఏ లక్షణాలనైతే స్త్రీలు సదా యిష్టపడతారో, వేటినైతే సంసార సుఖానికి హామీగా భావిస్తారో అవి — మూర్తీభవించి వున్నాయి. కాని ఏ కారణంగా నైతేనేం యువతులంతా కమాండెంటుని ఆటపట్టిస్తూండేవారు — అదొక పరిపాటి అయిపోయింది. లీజా ఎన్నడూ దానిలో పాల్గొనేది కాదు. సర్వజ్ఞురాలైన కిర్యానొవా, ఫకఫక నవ్వుతూ తమ కమాండెంటు తన గృహ యజమానురాలి నడియౌవన సౌందర్యానికి దాసుడ య్యాడని అన్నప్పుడు, "అదంతా శుద్ధ అబద్ధం!" అంటూ — ఆకస్మికంగా ముఖం ఎర్ర బారగా — లీజా బిగ్గరగా అరిచింది.

"ఓహో! యీవిడ ప్రేమలో పడిందర్రోయ్!" అంటూ కిర్యానోవా విజయసూచకంగా

కేకపెట్టింది. ''అమ్మాయిలూ, యీవిడ – మన బ్రీచ్కినా – తలక్రిందులుగా ప్రేమలో పడిపోయింది! ఈవిడ కమాండెంటుతో తలమునకలుగా ప్రేమలో పడింది!''

''పాపం లీజా!'' గుర్విచ్ నాటకీయంగా నిట్టూర్చి అంది.

దానితో పెద్ద కోలాహలం ప్రారంభమైంది, వాళ్లంతా గలగలా మాట్లాడుతూ, పకపకలూ వికవికలూ సాగించగా లీజా గుడ్ల నీళ్ల కుక్కుకొని అడవిలోకి పరిగెత్తింది. అడవిలో ఆమె ఒక చెట్టు మొదలుపై కూర్చొని ఏడుస్తూ చివరకు రీతా ఒస్యానినా కంట బడింది.

''ఎందుకలా ఏడుస్తావు పిచ్చిపిల్లలా. నువ్వింత తలకిందులై పోకూడదు ప్రతిదానికీ. జీవితాన్ని ఉన్నదున్నట్టు తీసుకోవాలి, తెలిసిందా?''

కాని లీజా ఆ పని చెయ్యలేకపోయింది, ఆమె తన అతి బిడియంతో లోలోపల దాదాపు ఉక్కిరిబిక్కిరైపోయింది. కాని సార్జెంట్ మేజరు, కమాండెంట్ వస్కోవ్ తన విధి నిర్వహణలో సదా తలమునకలై వుండేవాడు. ఈ అవకాశమే కనుక లభించి యుండక పోయినట్లయితే, వాళ్లెన్నడూ ఒకళ్లనొకళ్లు సరిగా చూసుకొని వుండేవారే కారు. అందుకనే లీజా యిప్పుడు రెక్కలు కట్టుకున్నట్లు అడవి గుండా పరుగెత్తుతోంది.

''తర్వాత మనమిద్దరం జంటగా పాడుదాం, లీజా'' అన్నాడు సార్జెంట్ మేజరు. ''మన కర్తవ్యం ముగించి తర్వాత పాటలు పాడుకుందాం....''

అతని మాటలు నెమరేసుకొంటూ – తనలో తరచుగా కదులుతూ, తన బుగ్గలపై సిగ్గుల మొగ్గల రూపంలో విరుస్తూవుండే శక్తివంతమైన నిగూఢ భావంతో తబ్బిబ్బు చెందుతూ – లీజా తనలో తనే చిరునవ్వు నవ్వుకుంది. ఈ భావాలలో మునిగిపోయి ఆమె తన కొండ గుర్తు అయిన పైన్ చెట్లను దాటిపోయింది. చిత్తడి నేలకు చేరుకున్నాకనే పెర్చిలకి సంబంధించిన ఆలోచన ఆమె మనస్సులో మెదిలింది. కాని వెనక్కి వెళ్లరాదని ఆమె నిశ్చయించుకుంది. కూలిన చెట్లూ కొమ్మలూ బోలెడున్నాయి. దీనితో పని జరుగు తుందిలే అనుకుని ఓ కొమ్మను చటుక్కున ఎంచుకుంది.

చిత్తడినేలను దాటే ముందు ఆమె ఆగి చుట్టుపక్కల పరకాయించి చూసింది. తర్వాత చటుక్కున తన స్కర్టును విప్పేసింది. దాన్నామె కర్ర కొసకి కట్టింది, బెల్టునూ చొక్కానూ సర్దుకుంది, నీలం సైనిక అండర్‌వేరును పైకి మడిచి ఊబిలోకి దిగింది.

ఇప్పుడామెకు బురదగుండా దారి చూపే వాళ్లెవరూ లేరు. తడిగా బంకగా వున్న బురద ఆమె పిక్కలకు అంటుకొని, ఆమె వెంట యీడుస్తున్నట్టు వస్తోంది. లీజా అటూ యిటూ ఊగుతూ, భారంగా ఊపిరిపీలుస్తూ ఒక్కొక్క అంగుళమే ముందుకు హిమశీతల జలంలో కొరడువారుతూ, చిన్న లంకపై నున్న రెండు పొట్టి పైన్ చెట్లపైనే దృష్టిని మగ్నంచేసి ముందుకుసాగింది.

అయితే, కారునల్లని అసహ్యకరమైన ఊబి నేలపై పరివ్యాపించియుండే మరణాంతకమైన పాతాళలోకపు నిశ్శబ్దంతో సరిపోల్చినప్పుడు చలి గాని, పాదాల క్రింద సజీవంగా ఊపిరివిడుస్తున్న ఊబి గాని ఏమంత భయంకరమైనవి కావు. లీజాకి దాదాపుగా జంతు సహజమైన భీతి పట్టుకుంది — అది వదలిపెట్టేందుకు బదులు, అడుగడుగుకీ తనను పైకొంటున్నట్లు ఆమెకు అనిపించ సాగింది, దానితో ఆమె — తన భుజాల పైగా చూడటానికి గాని, అనవసరంగా కదలడానికి గాని, చివరకు గట్టిగా ఊపిరి పీల్చుకోడానికి గాని బెదిరిపోయి, నిస్సహాయంగా, దయనీయంగా కంపించసాగింది.

తను లంకను ఎలా చేరుకుందో దాదాపుగా ఆమెకు గుర్తే లేదు. ఆమె గట్టి నేలపైన గల కుళ్లు గడ్డిపై బోర్లాపడి బావురుమంది. తన ఎత్తు బుగ్గలపై జాలువారుతున్న కన్నీటి ధారలను తుడుచుకొంటూ చలితో, ఒంటరిపాటుతనంతో, దుస్సహమైన భయంతో కంపిస్తూ ఆమె వెక్కివెక్కి రోదించింది.

ఆమె లేచి నిలబడినప్పటికింకా కన్నీళ్లు ఆమె చెక్కిళ్లపై జాలువారుతూనే వున్నాయి. ముక్కు ఎగపీలుస్తూ, తన దారినెలా కొనసాగించాలో అంచనావేసుకొంటూ, తన శరీరానికి విశ్రాంతి నివ్వకుండా, తన శక్తినైనా కూడదీసుకోకుండా ఆమె ఆ చిన్న లంకను దాటి, ఊబిలోకి దిగింది.

ముందది మరీ ఎక్కువ లోతు లేదు. దానితో లీజా స్థాయి చిక్కించుకోడానికీ, చివరకు ఆశాభావాన్ని పెంపొందించుకోడానికీ వ్యవధి లభించింది. ఇప్పుడామె తన ప్రయాణపు తుది ఘట్టంలో వుంది, ఇది ఎంత క్లిష్టంగానైనా వుండు గాక, దీని చివర తను గట్టి పొడినేలపైన, గడ్డితో చెట్లతో నిండిన పరిచితమైన నేలపైన నడుస్తుంది. లీజా ఆలోచనలు ఒళ్లంతా శుభ్రంగా కడుక్కోవలసిన అవసరంపైకి మళ్లాయి, తనకు గుర్తున్న నీటి గుంటలన్నింటినీ ఆమె తన మనస్సులో తిరగేసుకుంది. తన బట్టలన్నింటినీ ఒకే మారు జాడించుకోవడమా, లేకపోతే స్టేషను కెళ్లేదాకా ఆగడమా అని గుంజాటనపడింది. ఏమైనా స్టేషను యిప్పుడింక ఎక్కువ దూరం లేదు. దాని వంకరటింకరలన్నింటితో బాటు ఆ రోడ్డు ఆమెకు చాలా బాగా గుర్తుంది. మరో గంటాగంటన్నరలో తను తన సొంత మనుషుల మధ్య వుంటానని ఆమె ధీమాగా వుంది.

నడక మరింత కష్టసాధ్యంగా తయారైంది. ఆమె యింకా మోకాలిబంటి అడుసులో యీడ్చుకుంటూ వెళ్తోంది, కాని ప్రతి ఒక్క అడుగూ ఆమెను అవతలి ఒడ్డు దగ్గరకి తీసుకెళ్తోంది. పోయినసారి సార్జెంట్ మేజరు ఏ చెట్టు మొద్దు దగ్గరనుంచి ఊబిగుంటలోకి దూకాడో ఆ చెట్టు మొద్దును లీజా యిప్పుడు అతి స్పష్టంగా, చివరి నెర్ర దాకా చూడగలుగుతోంది. ఎంత తమాషాగా, ఎంత అస్తవ్యస్తంగా దూకాడాయన — దాదాపుగా ఆయన పడేటంత పనైంది.

లీజా ఆలోచనలు మరోసారి వస్కోవ్‌పైకి మళ్లాయి. ఇప్పుడామె ముసిముసిగా నవ్వు తోంది. కమాండెంటు తన సైనిక చర్యను నిర్వహించాక, మళ్లీ తాము స్టేషనుకు తిరిగి వచ్చాక తామిద్దరూ కలిసి పాడుకోవడం ఖాయమని ఆమెకు అనిపించింది. కావలసిందల్లా తను కొంచెం జాణతనం ప్రదర్శించాలంతే, తను ఆయన్ని సాయంత్రం పూట తనతో అడవిలోకి తీసుకుపోయే మార్గం చూడాలి. అప్పుడు... చూసుకో సామిరంగా ఎవళ్ళు గెలిచేదీ తేలుతుంది — తనో, ఆయన గృహ యజమానురాలో — ఆవిడగారి ఆకర్షణల్లా ఆయనతో బాటు ఒకే కొంపలో ఉండటం తప్ప యింకే ముంది...

సరిగా ఆమె ఎట్టఎదుట బ్రహ్మాండమైన తుప్పురంగు బుడగ ఒకటి భళుక్కున పగిలింది. అదెంత అకస్మాత్తుగా, ఆమెకు ఎంత సమీపంలో, ఎంత త్వరగా పైకి లేచి పగి లిందంటే, తనింకా బిగ్గరగా అరవగలిగేందుకు ముందే లీజా సహజ ప్రేరణ ఫలితంగా పక్కకి అడుగేసింది. ఆమె పక్కకేసిందల్లా ఒకే ఒక్క అడుగు, కాని ఆమె పాదాలు వెన్వెంటనే పట్టు తప్పిపోయాయి, బురబురలాడే ఊబి ఆమె తొడలను తన మెత్తని పట్టులో యిరికించు కోగా, ఆమె పాదాలు అస్థిరంగా వున్న శూన్యంలో తేలియాడుతున్నాయి. ఆమె మనసు లోలోతుల్లో ఎక్కడో పెంపొందుతున్న భీతావహం ఆమె హృదయాన్ని తన పంజాలో యిరి కించుకొని, యిప్పుడామె సమస్త శరీరాన్నీ ఆవహించింది. తిరిగి కాలూనుకోవాలనీ, తోవను కనుక్కోవాలనీ చేసే ప్రయత్న క్రమంలో ఆమె తన పెర్చి పైన బరువుగా ఆనింది. ఆ ఎండుకట్టె ఫళుక్కున విరిగింది, అంతే లీజా చల్లని పచ్చని బురదలోకి బొక్కబోర్లా పడిపోయింది.

క్రింద గట్టినేల లేదు. ఆమె పాదాలు నెమ్మదిగా, అతి నెమ్మదిగా క్రిందకి లాగి వేయబడ్డాయి, ఆమె చేతులు నిస్సహాయంగా బురదలో గిర్రున తిరిగాయి. ఆమె అడుసులో గిర్రున మెలితిరుగుతూ ఉక్కిరిబిక్కిరైంది. అయితేనేం దారి ఇక్కడే ఎక్కడో దగ్గరే వుంది; ఒక్క అంగలో, బహుశా సగం అంగలో ఉంది, అయితేనేం యిప్పుడా అర్ధ అంగ వెయ్యడమే ఆమె వశం కాదు.

"కాపాడండి!... నన్ను కాపాడండి!... కా — పా — డం — డి!..."

ఆ భయభీత ఏకాంత స్వరం ఆ దౌర్భాగ్యపు దుర్గంధభూయిష్ఠమైన ఊబిపైన గింగురుమని ధ్వనించి, ఎంతో సేపు ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఆ ధ్వని రెపరెపమంటూ పైన్ వృక్షాగ్రాలపైకి ఆరోహించింది, లేత ఆల్డర్ తోపుల గుండా కష్టంగా పైన దూసుకు వెళ్లి బొంగురు గుసగుసగా దిగజారింది, మరోసారి అతి ప్రయాసపైన కూడదీసుకొని మే మాసపుటాకాశంలోకి ఎగసిపోయింది.

చాల సేపు లీజా అందమైన ఆ నీలాకాశంలోకి చూసింది. ఉక్కిరిబిక్కిరవుతూ,

బురదను ఉమ్మేస్తూ ఆమె ఆ నీలాకాశం వైపు పైకొచ్చేందుకు తంటాలుపడింది, ఆశ వదులుకోడానికి నిరాకరించి పైకొచ్చేందుకు గింజుకొంటూనే వుంది.

సూర్యుడు మెల్లిగా వృక్షాగ్రాల పైకి లేచాడు, సూర్య కిరణాలు ఊబిగుంటను చేరుకున్నాయి, చిట్టచివరి సారిగా లీజా సూర్యకాంతిని — కళ్లకు భరించరానంతటి జాజ్వల్యమైన, రేపటికి సంబంధించిన ఉజ్వలమైన ఆశారేఖ వంటి వెచ్చని సూర్యకాంతిని — అనుభూతిచెందింది. తన జీవితపు చిట్టచివరి ఘడియదాకా ఆ రేపు తనక్కూడా అందుబాటులోకి వస్తుందనే లీజా నమ్మింది.

8

వాళ్ళు సరదాగా నవ్వుకుంటూ అల్పాహారం (సహజంగానే, వాటిలో ఏ ఒక్కటీ వండినది కాదు) చేస్తున్న సమయంలో శత్రువులు చాల దూరం వెనక్కి తగ్గారు. లేక, మరింత సరళంగా చెప్పాలంటే శత్రు సైనికులు, సరభసంగా వున్న సరస్సు ఒడ్డునుండీ, అదేపనిగా వాగే స్త్రీలనుండీ, అదృశ్య పురుషులనుండీ తమ ప్రాణ రక్షణార్థం దూరంగా పారిపోయి, తమ అస్తిత్వమే ఎన్నడూ లేదన్నట్లు కలుగుల్లోకి దూరి అదృశ్యమయ్యారు.

వస్కోవ్‌కి యిదేమీ బొత్తిగా నచ్చలేదు. అతనికి అనుభవం — యుద్ధానుభవమే కాకుండా వేటగాడుగా కూడా అనుభవం — వుంది. శత్రువు విషయంలోనూ ఎలుగుబంటి విషయంలోనూ కనుగలిగి వుండాలన్న సంగతి అతనికి తెలుసు. జర్మన్ల ఎత్తుగడ ఏమిటో, వాళ్ళు అకస్మాత్తుగా ఎక్కడ దర్శన మిస్తారో, లేక ఎక్కడ తమ పరిశీలక కేంద్రాలు ఏర్పాటు చేస్తారో ఎవరికి తెలుసు? ఈ పరిస్థితి అదృష్టం కలిసిరాని వేటలాంటిది — అంటే ఎవరు ఎవరిని వెంటాడుతున్నారు, ఎలుగు నిన్ను వెంటాడుతోందా, లేక నువ్వే ఎలుగుని వెంటాడుతున్నావా అన్నది తెలియని అయోమయ స్థితి. అటువంటి అవ్యక్త స్థితినుంచి బయట పడేందుకు గాను సార్జెంట్ మేజరు సైనిక యువతులను ఒడ్డుపైన వదిలి, ఒస్యానినాతో కలిసి స్కౌటింగు పనికి పూనుకున్నాడు.

"నన్ను అంటిపెట్టుకుని రా, రీతా. నేను ఆగినప్పుడు — నువ్వూ ఆగు, నేను బోర్లపడుకుంటే నువ్వూ అలాగే చెయ్యి. జర్మన్లతో దాగుడుమూతలు ఆడటమంటే మృత్యుదేవతతో దాగుడుమూతలాడటం లాంటిది, అందుకని నువ్వు ఒళ్లంతా చెవులు చేసుకుని — చెవులే కాదు కళ్ళు కూడా చేసుకుని — కనిపెట్టాలి."

పొదనుంచి పొదకీ, బండనుంచి బండకీ అతను ముందు దోవతీశాడు. అతను తన కళ్ళు నొప్పిపుట్టేటంతగా పొడుచుకు చూశాడు; అతను తన చెవులు నేలకు ఆనించి విన్నాడు; అతను గాలిని మూర్కొన్నాడు; అతను ఏ క్షణాన అయినా పేలేందుకు సిద్ధంగా వున్న

టైమ్ బాంబులాగ వున్నాడు. అన్నీ నిశితంగా పరిశీలించి, చెవులు గుంయ్‌మనే దాకా విన్న మీదట, అతను కనిపించీ కనిపించనట్లుగా చేత్తో సంజ్ఞచేశాడు — ఒస్యానినా వెంటనే అతన్ని కలుసుకుంది. మౌనంగా వాళ్లిద్దరూ రెమ్మలు పెళుక్కున విరిగే శబ్దం కోసం, వసపిట్ట చేసే సంకేతాల కోసం చెవులు దోరబెట్టుకుని విన్నారు. అటు తర్వాత రీతా తను ఉన్న చోటనే నిలబడి హెచ్చరికగా తమ యిద్దరి తరఫునా వింటూండగా అతను ముందుకి వంగి పిల్లిలా పాకుతూ కొత్త మరుగులోకి చేరుకున్నాడు.

ఈ విధంగా వాళ్లిద్దరూ కనుమను దాటి, తమ ప్రధాన స్థావరానికీ, అటు తర్వాత పైన్ తోపు — బ్రిచ్కినా జర్మన్ల కన్నుకప్పి ఆ ఉదయం అడవికి పోయే తన మార్గంలో దాటిన స్థలం — దగ్గరకు వెళ్లారు. శత్రువు అసలీ ప్రపంచంలోనే లేడన్నట్లు, అప్పటిదాకా అంతా నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుంది. కాని తను గాని, జూనియర్ సార్జెంటు ఒస్యానినా గాని యీ ఆలోచనకు లొంగిపోకుండా ఫెదోత్ శ్రద్ధవహించాడు.

ఈ చిన్న పైన్‌తోపు దాటగానే లెగోంతొవ్ సరస్సు ఒడ్డు — పాకుడు పట్టి వాలుగా, చెదురుబదురుగా పడివున్న రాళ్లతో కూడి వుంది. ప్రధానమైన అడవి మరికొంచెం ముందు, ఎత్తైన ప్రాంతంలో వుంది. ఒడ్డుకీ దానికీ మధ్య దారిలో మెలికలుదిరిగివున్న బర్చి పొదలూ, చెదురుబదురుగా అంతగా ఎత్తెదగని ఫర్ చెట్లూ వున్నాయి.

అక్కడ సార్జెంట్ మేజరు ఆగాడు; పొదలను తన బైనాక్యులర్లతో అతను గాలించాడు, కొంత సేపు శబ్దాల కోసం విన్నాడు, అటు తర్వాత పైకి లేచి నిలబడి కొండవాలు మీదుగా అద్దం మాదిరిగా నున్నగావున్న సరస్సు పైకి వీస్తున్న మందపవనాన్ని ముక్కుఎగ పీలుస్తూ వాసన చూశాడు. రీతా తేమగా వున్న పాకుడు మూలంగా తన దుస్తులు మెల్లగా నానిపోతున్నందుకు చిరాకుపడుతూ — నమ్రంగా అతని వెనకనే నేలబారుగా పడుకొని ఉండి పోయింది.

"నువ్వు పసిగట్టావా?" సార్జెంట్ మేజరు తనలో తను నవ్వుకుంటూ మెల్లగా ఆమెను ప్రశ్నించాడు. "వాళ్ల నాగరికం వాళ్లని పట్టిస్తోంది: వాళ్ళు కాఫీ కాచుకుంటున్నారు."

"మీకెలా తెలుసు?"

"నాకు వాసన తగులుతోంది — వాళ్లు నాస్తా చేస్తున్నారు. తేలాల్సిన విషయం ఒక్కటే, వాళ్ళు పదహారుగురూ అక్కడ వున్నారా లేరా అని?"

ఓ క్షణం ఆలోచించిన మీదట అతను తన రైఫిలును ఓ పైన్ చెట్టు మొదలుకి ఆన్చి నిలబెట్టి, తన బెల్టును మరి ఒకటి రెండు కన్నాలు బిగదీసుకుని రీతా పక్కన చదికిల బడ్డాడు.

"మనం వాళ్లని లెక్కపెట్టి అందరూ అక్కడ వున్నారో లేరో చూడాలి. విను, కాల్పులు వినిపించాయంటే నువ్వు వెంటనే — నేను చెప్పింది బోధపడిందా వెన్వెంటనే,

యిక్కడినుంచి వెళ్లిపో మిగతా పిల్లల్ని తీసుకుని నేరుగా తూర్పు దిశగా కాలవ దగ్గర కెళ్లు. అక్కడ మన వాళ్లకి జర్మన్లను గురించి — లీజా (బీచ్కినా యీ క్షణానికో మరు క్షణానికో స్టేషనుకి చేరుకుంటుంది కనుక వాళ్లకీ విషయం ముందే తెలియవచ్చుననుకో అయినాకూడా — రిపోర్టు చెయ్యి. అన్నీ స్పష్టంగా బోధపడ్డాయా?''

''మరి మీ సంగతేమిటి?'' రీతా అడిగింది.

''పిచ్చిగా మాట్లాడకు ఒస్యానినా'' సార్జెంట్ మేజరు ఆమె మాటను తుం చేశాడు. ''మనం యిక్కడికి వచ్చినది పుట్టగొడుగులో, బెర్రీలో ఏరుకోడానికి కాదు. వాళ్లు నన్ను కనిపెట్టారో నన్ను వాళ్లు సజీవంగా వదలరన్న విషయం ఖాయం. అందుకని నువ్వు తక్షణం వెనక్కి బయల్దేరాలి. నా ఆజ్ఞ నీకు బోధపడిందా?''

రీతా మౌనం దాల్చింది.

''నువ్వేం చెప్పాల్సివుంది, ఒస్యానినా?''

''బోధపడింది అని చెప్పాలి.''

సార్జెంట్ మేజరు పళ్లికిలించి, ముందుకు బాగా వంగి అన్నింట్లోకీ దగ్గరగా వున్న బండదగ్గరకు బయల్దేరాడు.

రీతా అతన్ని శ్రద్ధగా పరిశీలిస్తూనే వుంది, కాని సరిగా అతనెప్పుడు కనుమరుగ య్యాడో గమనించలేకపోయింది — పాకుడు పెరిగిన బూడిదవన్నె బండల్లో అతను కలిసి పోయాడు. ఆమె స్కర్టూ, కోటుచేతులూ నీళ్లోడేలా నానిపోతున్నాయి; ఆమె వెనక్కి పాక్కుంటూ వెళ్లి, అడవి చేసే ప్రశాంత మర్మరధ్వనిని చెవులొగ్గి వింటూ, ఓ చెట్టు మొదలుపై కూర్చుంది.

దురదృష్టకరమైనదేదీ జరగనే జరగదన్న దృఢ విశ్వాసంతో ఆమె దాదాపు శాంతంగా వేచి చూస్తోంది.

ఆమె శిక్షణ యావత్తూ సంతోషప్రదమైన పరిణామాల కోసం ఎదురుచూడ టాన్ని మాత్రమే ఆమెకు నేర్పింది. ఆమె తరం వాళ్లకి, ఏ పనిలోనైనా విజయానికి సం బంధించి సందేహాలు కలిగివుండటమన్నది దాదాపుగా విద్రోహంతో సమానమే. భయ సంది గ్ధాలంటే ఏమిటో ఆమెకు తెలియకపోలేదు, కాని యదార్థ పరిస్థితులకన్న విజయం పట్ల ఆమె ఆంతరిక విశ్వాసమెప్పుడూ బలవత్తరమైనది.

ఆమె తన చెవులు దోరపెట్టుకుని అతి శ్రద్ధగానే వింటున్నాకూడా సార్జెంట్ మేజరు నిశ్శబ్దంగా, కేవలం ఫర్ రెమ్మలను మాత్రమే ఎడం చేసుకుని తటాలున అక్కడ ప్రత్య క్షమయ్యాడు. మౌనంగా అతను తన రైఫిల్ని చేతిలోకి తీసుకుని, ఆమె వంక తలూపి, మొక్కల బారుల్లోకి దూసుకెళ్లాడు.

''నువ్వు సరైన సైనికురాలివి కాదు, కామ్రేడ్ ఒస్యానినా. పనికిమాలిన సైనికు రాలివి.''

అతనా మాటను కోపంగా కాక ఆందోళనగా అనడంతో రీతాకి నవ్వు వచ్చింది.

ఆమె అతన్ని అడిగింది: ''ఏం, ఎందుకని?''

''నీకేసి నువ్వు చూసుకో ఎలా వున్నావో, చెట్టు మొద్దుమీద చుట్టూ పిల్లలతో ఖడేరావులా నిలబడ్డ అడవి కోడిపెట్టలా వున్నావు, నీకిచ్చిన ఆజ్ఞ ఏమని? పడుకొని వుండమని.''

''కాని అక్కడ తడిగా వుంది.''

''తడిట తడి...'' సార్జెంట్ మేజరు కంయ్‌మన్నాడు. ''వాళ్ళు కాఫీ తాగుతున్నారు కనుక నీ పుణ్యం పుచ్చింది, లేకపోతే అన్ని సబ్‌మెషీన్ గన్నులనుంచీ కురిసిన గుళ్ల వర్షంతో నీ ఒళ్లు జల్లెడై వుండేది.''

''అయితే, మీరు ఊహించినదే నిజమైందన్న మాట.''

''నేనేం జోస్యుడ్ని కాను, అదేమీ నేను ఊహించి చెప్పినదీ కాదు. పదిమంది భోం చేస్తున్నారు — అంతవరకు నేను చూశాను. ఇద్దరు కాపలావున్నారు — అదీ నేను చూశాను. మిగిలిన వాళ్లు అవతలి పక్క కాపలా వుండివుండాలి. వాళ్లంతా తాపీగా కూర్చున్నారు, చలిమంట చుట్టూ కూర్చుని మేజోళ్లు ఆరబెట్టుకుంటున్నారు. మన స్థావరం మార్చుకో డానికి సరిగా యిదే అదును. నేనీ చుట్టుపక్కల చూస్తూ వుంటానుగాని, నువ్వు పోయి మిగిలిన వాళ్లని తీసుకురా. వెళ్లేటప్పుడు భద్రంగా వెళ్లు, మళ్లీ తిరిగి వచ్చేటప్పుడు — మీలో ఏ ఒక్కళ్లనించీ వికవికలూ పకపకలూ ఏ మాత్రం వినిపించడానికి వీల్లేదు తెలిసిందా!''

''బోధపడింది.''

''మరో సంగతి: నా పొగాకునేం, అక్కడ బండమీద ఆరబెట్టాను గాని, వచ్చేట ప్పుడు అది తెచ్చిపెట్టేం, మంచిదానివి. నా మిగతా సామాను సంగతి చెప్పనక్కర్లేదు కదా.''

''అలాగే, సార్జెంట్ మేజర్.''

ఒస్యానినా మిగతా యువతులను తీసుకొచ్చేలోగా, సార్జెంట్ మేజరు బండలన్నింటినీ — దగ్గరున్న వాటినీ, దూరంగా వున్నవాటినీ — వాటి మధ్య దేకుంటూ వెళ్లి, క్షుణ్ణంగా పరిశీలించాడు. అతను తన దృష్టినీ, శ్రవణ శక్తినీ, ఘ్రాణ శక్తినీ పురికొల్పి మరీ చుట్టూ పరికించాడు. కాని అతని కెక్కడా జర్మన్ల జాడ కానరాలేదు, దానితో అతనికి కొంచెం స్థిమితం చిక్కింది. అతని అంచనా మేరకు లీజా బ్రిచ్కినా యీ పాటికి స్టేషనుని సమీ పిస్తూ ఉండివుండాలి. ఇంక ఏ క్షణాన అయినా ఆమె స్టేషన్లో రిపోర్టుచెయ్యడం, దానితో జర్మన్ చొరబాటుదారుల చుట్టూ ఒక అదృశ్య వలయాన్ని పన్నడం జరిగిపోతుంది. సాయం త్రానికల్లా — ఎంత ఆలస్యమైనా కూడా మరుసటి ఉదయానికల్లా — తమకు సహాయం అందుతుంది. తను ఆ సైనికులను సరైన దారిలో పంపి, తన సైనిక యువతులను కొండ

శిఖరాలలో సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తాడు. అసహ్యకరమైన పచ్చిబూతులను వినాల్సిన అవసరం వాళ్ళకి లేకుండా – బాహాబాహీ యుద్ధంలో ఎప్పుడూ యీ బూతులు కొల్లలుగా దండిగా ప్రయుక్తమవుతూ వుంటాయి – చూస్తాడు.

మరోసారి అతనికి దూరంనుంచి తన సైనిక యువతులు వస్తున్న సవ్వడి వినవచ్చింది. అబ్బే, అది సవ్వడి గాని, గుసగుసలు గాని, లోహ వస్తువుల కిణకిణ శబ్దం గాని కాదు, కాని వాళ్లింకా అల్లంత దూరంలో వుండగానే వాళ్ళు వస్తున్న సంగతి అతనికి తెలిసి పోయింది. అది వాళ్ల రొప్పు ద్వారా కావచ్చు, లేక వాళ్లు వాడిన ఉడికిలోన్ మూలంగా కావచ్చు, కాని ఏదైతేనేం, జర్మన్లలో గడితేరిన వేటగాడు లేనందుకు సార్జెంట్ మేజరు తన అదృష్టాన్ని పొగుడుకున్నాడు.

సిగరెట్టు కాల్చాలని అతనికి మహాకుతిగా వుంది. ఇప్పటికప్పుడే రెండు గంటలుగా పొగాకు లేకుండా అతను యీ ప్రాంతంలో మోకాళ్లపై పాకుతున్నాడు. తను పొగపీల్చాలన్న ప్రలోభానికి గురికాకుండా వుండేందుకు గాను తన పొగాకు సంచిని అతను అమ్మాయిల దగ్గరగా వున్న ఒక బండపైన వుంచాడు. ఇప్పుడతను వాళ్లు వచ్చీరాగానే నిశ్శబ్దంగా ఉండ మని వాళ్లని హెచ్చరించి తన పొగాకు సంచి కోసం అడిగాడు. ఒస్యానినా విభ్రాంతురాలై చేతులు వెళ్లబెట్టి "అయ్యో నా మతిమండ, నేను మరచేపోయాను సుమా!" అంది.

సార్జెంట్ మేజరు గుర్రుమన్నాడు – యీ ఆడాళ్లన్నారే వీళ్లని తగలెయ్య, వీళ్ల కొక్కటీ గుర్తుండి చావదు! తన సైనికులు మగాళ్లై వుంటే బాగుండేది! నోటికి అడ్డం లేకుండా ధారాళంగా ఢమాఢా తిట్టివుండును, పొగాకు సంచి తీసుకురమ్మని వెనక్కి తోలివుండును, అందుకు ప్రతిగా యిప్పుడతను తెచ్చికోలు బలవంతపు నవ్వొకటి నవ్వి అన్నాడు: "సరే సరే, పరవా లేదులే. నా నాప్‌శాక్‌లో కొంత నాటుసరుకుంది, దానితో పని జరుపుకుంటానులే.... మీరు అదైనా పట్టుకొచ్చారనుకుంటానేం?"

నాప్‌శాక్‌ను అతనికి అందించారు. నిజానికి అతని బాధ పొగాకు పోయిందని కాదు, పొగాకు సంచి పోయిందని. అది ఒక బహూకరణ కావడం, దానిపైన "మన మాతృదేశ పరిరక్షణలో పాల్గొన్న ఒక మంచి వీరునికి" అన్న మాటలు ఎంబ్రాయిడర్ చేయబడి వుండటమే అందుకు కారణం. అతను తన ఆశాభంగాన్ని పూర్తిగా కప్పగలిగేందుకు ముందే గూర్విచ్ వెనుతిరిగి దూసుకెళ్లింది.

"నేను తీసుకొస్తాను! అదెక్కడుందో నాకు తెలుసు!"

"ఎక్కడి కెళ్తున్నావ్ గూర్విచ్? వెనక్కొచ్చెయ్యి, కామ్రేడ్ దుబాసీ!..."

అతని కేక వృధాయే అయింది. వాళ్లకి వినబడిందంతా తొందర తొందరగా, బరువుగా పడుతున్న అడుగుల చప్పుడు మాత్రమే.

సోన్యా గూర్విచ్ యింతకు ముందెప్పుడూ టాప్ బూట్లు వేసుకోలేదేమో – దీనికి

తోడు ఆమె, తన అనుభవరాహిత్యం కారణంగా తన సైజు నంబరుకి రెండు నంబర్లు ఎక్కువ సైజు బూట్లు తీసుకుంది – అవి చాలా బరువుగా వున్నాయి. బూట్లు మరీ ఒదులుగా వుంటే అవి భయంకరమైన శబ్దం చేస్తాయన్న సంగతి ప్రతి రెగ్యులర్ సైనికునికీ తెలిసిన విషయమే. సోన్యా కుటుంబానికి బొత్తిగా సైన్యపు వాసన లేదు, వాళ్ల యింట్లోవాళ్లకెన్నడూ టాప్ బూట్లు లేవు, ఆమె తండ్రికి సైతం వాటినెలా తొడుక్కోవాలో దాదాపు తెలియదనే చెప్పాలి....

నెమీగానదికి అవతలి ఒడ్డున గల వాళ్ల చిన్న యింటిముందు ఒక రాగి ప్లేటుంది, దానిపై యిలా చెక్కబడివుంది: "సోలమన్ అరోనొవిచ్ గూర్విచ్, డాక్టర్ ఆఫ్ మెడిసిన్." ఆమె తండ్రి సామాన్య వైద్యుడే అయినప్పటికీ, ఆయనకి వైద్యశాస్త్రంలో పట్టా లేక పోయినప్పటికీ ఆ రాగి ప్లేటు తలుపుమీద అలాగే ఉండిపోయింది. అది ఆయన తాతనుండి ఆయనకి సంక్రమించిన బహుమతి కావడమూ, ఆయన తాత దాన్ని తన స్వహస్తాలతో తలుపుకి తాపడంచెయ్యడమే అందుకు కారణం. ఆయనీ పని ఎందుకు చేశాడయ్యా అంటే, తన కొడుకు విద్యావంతుడన్న సంగతి మీన్స్క్ నగర వాసులు యావన్మందీ తెలుసుకోవాలనే.

వీధి తలుపుకి పక్కనే డోర్ బెల్లు హేండిలు వుండేది, గంటను మోగించాలంటే ఆ హేండిల్ని చాలా గట్టిగా లాగాల్సివచ్చేది. సోన్యా బాల్యజీవితం యావత్తూ ఆదుర్దాగా మోగించబడే ఆ గంటతో జమిలిగా – అది రాత్రి అయినా లేక పగలైనా, శీతువైనా లేక వేసవైనా – గడిచింది. గంట మోగగానే ఆమె తండ్రి తన మందుల సంచీ పట్టుకొని, అది ఏ రుతువైనా కూడా – గుర్రబ్బండి చేయించుకోడానికి తన దగ్గర డబ్బు లేనందున – కాలి నడకన బయల్దేరుతూండేవాడు. ఇంటికి తిరిగి వచ్చాక ఆయన తన సన్నని స్వరంలో క్షయని గురించో, టాన్సిలైటిస్‌ను గురించో, లేక మలేరియాను గురించో – బామ్మ యింట్లో కాచిన చెర్రీ కార్డియల్ పానీయాన్ని ఆయన గ్లాసులోకి ఒంపుతూండగా – వర్ణించి చెప్తూండేవాడు.

వాళ్లది ఓ పెద్ద సమిష్టి కుటుంబం: పిల్లలు, తోడబుట్టినవారి పిల్లలు, బామ్మ, అవివాహితురాలైన పిన్ని, ఎవరో దూరపు బంధువురాలు యింటి నిండా బిలబిలలాడుతూ వుండేవారు. ఒక్కడు పడుకున్న మంచం యింట్లో ఏ ఒక్కటీ ఉండేది కాదు, వాటిలో ఒక దానిపైన ముగ్గురు కూడా పడుకునేవారు.

విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లో కూడా సోన్యా తన అక్కలు వాడిన దుస్తుల్నే వాడేది. అవి తరచుగా బూడిదరంగువి, మెడ పట్టీలు ఎత్తుగా లోహ కవచాల మాదిరిగా బిగిసిపోయి వుండేవి. చాలాకాలం ఆమె యీ దుస్తుల బరువు విషయం మనస్సుకి పట్టించుకోనే లేదు. ఎందుకంటే ఆమె ఆ దుస్తులతో డాన్సులకి కాకుండా లైబ్రరీకో, లేక మాస్కో అర్టు థియేటరుకో – అదృష్టం కలిసొచ్చి టిక్కెట్టు దొరికితేనే అనుకోండి – తరచుగా వెళ్తూండేది. తను ఎవరితోనైతే కలిసి లెక్చర్లకు హాజరయ్యేదో ఆ కళ్లజోడు

అబ్బాయి లైబ్రరీకి తన వెంట రావడం కేవలం యాదృచ్ఛికంగా జరుగుతున్న విషయం కాదని గ్రహించడంతో ఆమె మనస్సులో కలవరం ప్రారంభమైంది. కాని యిది జరిగినది తను విశ్వ విద్యాలయంలో చేరి ఒక సంవత్సరం గడచిపోయిన తర్వాత, వేసవిలో సంగతి. దానికి అయిదు రోజుల అనంతరం గోర్కీ పార్కులో అతనితో మరపురాని సాయంత్రం ఒకే ఒక్కటి గడి పిన తర్వాత ఆమెకు అతను బ్లోక్ కవితాసంపుటిని బహూకరించాడు. అటు తర్వాత అతన్ని గురించి ఆమెకు తెలిసిన మరుసటి విషయం అతను యుద్ధ రంగానికి వలంటీరుగా వెళ్లా డన్నదే.

ఔను, విశ్వవిద్యాలయంలో సైతం సోన్యా తన అక్కలు వాడిన దుస్తులే వేసుకుం టూండేది. ఆమె దుస్తులు పొడుగ్గా, కవచాల్లా బరువుగా వుండేవి....

కాని వాటిని ఆమె ఒక సంవత్సరం కన్న ఎక్కువ కాలం ధరించలేదు. అటు తర్వాత ఆమె సైనిక యూనిఫారమూ, టాప్ బూట్లూ, తన సైజుకి రెండు నంబర్లు ఎక్కువ సైజు బూట్లూ ధరించనారంభించింది.

తన డిటాచ్‌మెంటులోనే చాలమందికి ఆమె పెద్దగా పరిచితురాలు కాదు. ఆమె ముందుకి చొరుచుకెళ్లే బాపతు కాదు, తన పనేదో తను చల్లగా చేసుకునే బాపతు, ఆమెను విమాన విధ్వంసక దళానికి ఎంపికచెయ్యడమన్నది కేవలం యాదృచ్ఛికంగా జరిగింది. యుద్ధ రంగంలో వాళ్లన్న ప్రాంతంలో పోరాటం లేదు, వాళ్లక్కడ రక్షణ కార్యకలాపాల్లో మాత్రమే నిమగ్నులైయున్నారు. దుబాసీలు కూడా కొల్లలుగానే వున్నారు, కాని విమాన విధ్వంసక దళాల వారు కొరతగా వున్నారు. అదిగో సరిగా అందుకనే — జర్మన్లతో జరిగిన ఆ పోరాటానంతరం — గూర్విచ్‌నీ, జేన్యా కొమెల్కోవానీ విమాన విధ్వంసక దళానికి పంపడమన్నది తటస్థపడింది. బహుశా, యితరులకు ఆమె అంత బాగా పరిచితురాలు కాని కారణంగానే సార్జెంట్ మేజరు మాత్రమే ఆమె గొంతుని గుర్తుపట్టగలిగాడు.

‘‘గూర్విచ్ గొంతులాగుందే?’’

వాళ్లంతా చెవులు రిక్కించి విన్నారు — కాని కొండ బారుమీద అంతా నిశ్శబ్దంగా ఉంది — గాలి మాత్రమే సుఁయ్ మంటూ మందంగా వీస్తోంది.

‘‘అబ్బే అదేం లేదు’’ రీతా అంది. ‘‘మీరేదో భ్రమ పడినట్టున్నారు.’’

నిట్టూర్పుకి మించని ఆ సుదూర మంద్రస్వరం మళ్లీ వినిపించలేదు, కాని సార్జెంట్ మేజరు ఆ శబ్దాన్ని పట్టుకునేందుకు తన సర్వ చైతన్య శక్తులనూ కూడగట్టుకొని ప్రయ త్నించాడు, క్రమంగా అతని ముఖం శిలాసదృశమైంది. ఆ విలక్షణ రవం అతని మనస్సులో యిరుక్కుపోయినట్టు కనిపించింది, అతని చెవుల్లో అదే పనిగా రొదచేస్తున్నట్టు కని పించింది, దాని అర్థమేమిటో గ్రహించగానే అతను పిడచగట్టుకుపోయాడు. అతను అమ్మా యిల కేసి చైతన్యరహితమైన చూపు చూసి, విలక్షణమైన స్వరంలో ‘‘కొమెల్కోవా,

నువ్వు నాతో రా. మిగతా వాళ్లందరూ మేం తిరిగి వచ్చే దాకా యిక్కడే వుండండి'' అన్నాడు.

అతను ఛాయలా అవలీలగా అల్కాగా కదులుతూ ముందు దోవ తీశాడు. జేన్యా అతన్ని అనుసరించలేక రొప్పుతోంది. సార్జెంట్ మేజరు మొయ్యాల్సిన బరువేమీ లేకపోగా ఆమె రైఫిలు మొయ్యాల్సిన మాటా, ఆమె స్కర్టు ఆమె చలనానికి ప్రతిబంధకమవుతున్న మాటా, ముఖ్యంగా పరుగెత్తుతున్నప్పుడు అది మరీ యిరుగ్గావుండి కాళ్లకి అడ్డుపడుతున్న మాటా నిజమేననుకోండి. కాని అసలు విషయమేమిటంటే, జేన్యా శక్తి అంతా నిశ్శబ్దంగా నడిచేందుకు చేసే ప్రయత్నక్రమంలోనే వ్యయమైపోతూ మరి దేనికీ మిగలడంలేదు.

వస్కోవ్ జీవశక్తి యావత్తూ అతను విన్న ఆ అరుపు పైనే, దాదాపు శబ్దరహిత మైన, తను కష్టంపైన వినగలిగి, గుర్తించి, అవగతం చేసుకోగలిగిన ఆ ఒకే ఒక అరుపు పైననే కేంద్రీకృతమైంది. అటువంటి అరుపులను — తదితర సమస్తాన్నీ తుడిచిపెట్టేసే అరుపులను, సమస్తాన్నీ శూన్యం చేసివేసి, నీలో మ్రోగే, నీ లోలోపల, నీ బుర్రలో రొదచేసే అరుపులను, నువ్వొకసారి విన్నాక జన్మలో మరి మరచిపోజాలని శబ్దాన్ని, నిన్ను పిడచ గట్టింపజేసి, తన పిడికిట్లో చిక్కించుకొని నీ గుండెను పిండే శబ్దాన్ని అతను అంతకు ముందు కూడా విన్నాడు. అందుకనే అతని యీ తొందర.

సరిగా ఆ కారణంగానే ఎదర ఏదో గోడ అడ్డం వచ్చినట్లు అతను తటాలున ఆగి పోయాడు. దానితో అతని వెనుక పరుగున వస్తున్న జేన్యా రైఫిలు అతని భుజానికి తాకింది. కాని అతను అక్కడ చతికిలబడి తన చేతిని నేల పైన — ఒక పాదపు గుర్తున్న నేల పైన ఆన్చాడు.

అదొక విశాలమైన పాదముద్ర, దాని చుట్టూ అంచున్నట్లు స్పష్టంగా కనిపి స్తోంది.

''జర్మన్లా?...'' జేన్యా ఊపిరి వెచ్చగా శబ్దరహితంగా బయటికొచ్చింది.

సార్జెంట్ మేజరు జవాబివ్వలేదు. అతను చుట్టూ పరకాయించి చూస్తున్నాడు, అతను చెవులు రిక్కించి వింటున్నాడు, అతను వాసనపడుతున్నాడు. వ్రేలికణుపులు తెల్ల బారేటంత గట్టిగా అతను తన పిడికిలిని బిగించాడు. జేన్యా ముందుకు చూసింది, చెదిరిన నేలపైన ఆమెకు నల్లగా చిందిన చినుకులు కనిపించాయి. సార్జెంట్ మేజరు జాగ్రత్తగా ఒక గులక రాతిని పైకి తీశాడు. దానిపైన చిక్కని నల్లటి బిందువొకటి — ఏదో సజీవ పదా ర్థం మాదిరిగా — వుంది. జేన్యా భయంతో వెనక్కు తగ్గింది, అరవబోయింది, కాని అంత లోనే తన అరుపును దిగమింగేసింది.

''జుగుప్సాకరం'' సార్జెంట్ మేజర్ అన్నాడు. ''జుగుప్సాకరం....'' అంటూ రెట్టించాడు.

అతనా గులకరాతిని భద్రంగా కిందపెట్టి చుట్టూ కలియజూశాడు, అంతకు ముందు ఘటన ఏ విధంగా జరిగిందో ఆ దృశ్యాన్ని ఊహించుకున్నాడు. తరవాత అతను నాలుగు అడుగులేసి, గట్టుకి అవతలి పక్కకి వెళ్లాడు.

అతను అనుమానించినట్టుగానే సోన్యా గూర్విచ్ అక్కడ వికృత రూపంలో కొండ పగులులో పడివుంది, ఆమె మోటు టాప్ బూట్ల్ను కాలిన ఆమె స్కర్టు కిందనుంచి వికారంగా పక్కకి పొడుచుకొచ్చాయి. సార్జెంట్ మేజరు ఆమెను బెల్టు పట్టుకొని ఎత్తుకునేందుకు వీలుగా పైకి లేపాడు, కొన్ని అడుగులు మోసుకెళ్లి ఆమెను వెల్లకిల పడుకోబెట్టాడు.

సోన్యా అరమోద్పు కళ్లు జీవరహితంగా ఆకాశం వంక చూస్తున్నాయి, ఆమె కోటు ముందుభాగం రక్తంతో నానిపోయింది. సార్జెంట్ మేజరు ఆమె కోటు గుండీలు విప్పి గుండె కొట్టుకుంటున్నదేమో విన్నాడు. అతను తాపీగా అలా చేస్తూండగా జేన్యా మౌనంగా తన శరీరం కంపిస్తూండగా రోదిస్తూ పొంగివస్తున్న కన్నీళ్లను ఆపుకోడానికి బిగించిన పిడికిలిని కరుచుకొంటూ అతని వెనుక నిలబడింది. కొంత సేపు తర్వాత సార్జెంట్ మేజరు నిటారుగా లేచి నిలబడ్డాడు, సోన్యా రొమ్ములపై రక్తంతో నాని బంకగా వున్న జాకెట్టును సర్దాడు. సన్నని రంధ్రాలు రెండున్నాయి. ఒకటి ఆమె రొమ్ములోకి, ఎడమ రొమ్ములోకి దూసుకుపోయింది, అంతకంటె కిందుగా వున్న రెండవ రంధ్రం ఆమె గుండెలోకి చొరుచుకు పోయింది.

"అందుకనే నువ్వు అరిచావు" సార్జెంట్ మేజరు గొణుక్కున్నాడు. "నువ్వు అలా అరవగలిగావన్నమాట — మగాడిని చంపేందుకని వాడు కొట్టాడు. మొదటి ప్రయత్నంలో వాడు నీ గుండెను అందుకోలేకపోయాడు — నీ రొమ్ము అడ్డం వచ్చింది...."

అతను ఆమె కోటు గుండీలు — ప్రతి ఒక్క గుండీ — పెట్టాడు, ఆమె కాలరు సరిచేశాడు. ఆమె చేతులను రొమ్ముపైకి ముడిచాడు, ఆమె కళ్లు మూసేందుకు ప్రయత్నించాడు కాని సాధ్యం కాకపోయింది; ఆమె కంటి రెప్పలకు రక్తం పూశాడంతే. అతను లేచాడు: "ఇప్పటికి యిక్కడే విశ్రాంతి తీసుకో ప్రియతమ సోన్యా."

అతని వెనక నిలబడ్డ జేన్యా ఒళ్లు జలదరించేలాగ వెక్కివెక్కి ఏడ్చింది. సార్జెంట్ మేజరు తన కనురెప్పల కిందనుంచి ఆమె వంక కఠినమైన చూపు బరపాడు: "శోకన్నాలకిది సమయం కాదు కొమెల్కోవా."

ముందుకి బాగా వంగి, కనిపించీ కనిపించకుండావున్న బూటు గుర్తులను అనుసరించి, అతను చకచకా ముందుకుసాగాడు.

9

జర్మన్లు సోన్యా కోసం మాటేసుకుని కూర్చున్నారా, లేక యాదృచ్ఛికంగా ఆమే వాళ్ల మధ్యకి వెళ్లిందా? అంతకు ముందు రెండుసార్లు నడిచిన బాట వెంట, అనాలోచితంగా ఆమె, తన కోసం ఆ దరిద్రపుగొట్టు పొగాకు సంచిని తీసుకొచ్చేందుకుగాను, పరుగెత్తు

తోంది. మంచి హుషారుగా పరిగెత్తుతోందేమో, బలహీనమైన తన భుజాలపైన ఆనిన చెమటకంపుకొట్టే బరువైన ఆ మూట ఏమిటో, లేక తన గుండెలోకి దూసుకెళ్లి కళ్లు చీకట్లు కమ్మించే ఆ దారుణమైన బాధ ఏమిటో ఆమె గ్రహించలేకపోయి వుంటుంది.... అబ్బే అది కాదు, గ్రహించేందుకు ఆమెకు వ్యవధి చిక్కింది, కాని మొదటి దెబ్బలో చాకు ఆమె గుండెలో దిగబడివుండదు. ఆమె రొమ్ము, బిగువుగా వున్న ఆమె చిన్నారి రొమ్ము అడ్డం వచ్చివుంటుంది. తర్వాత ఆమె జరిగిన సంగతిని గ్రహించుకుని అరిచివుంటుంది.

లేక అసలు జరిగినది అది కానేకాదేమో? బహుశా వాళ్లు ఆమె కోసం పొంచి కూర్చున్నారేమో? ఒక వేళ జర్మన్లు తమనందర్నీ అనుభవరహితులైన ఆ యువతులనూ, తననూ — వృత్తిరీత్యా సైనికుడూ, స్కాటింగులో శౌర్య ప్రదర్శనకు గాను పతకాలు పొందిన వాడూ అయిన తననుకూడా బురిడీ కొట్టించారేమో? బహుశా వాళ్లని తనుకాక, వాళ్లే తనను వెంటాడుతున్నారేమో? బహుశా వాళ్లు తమ దోవను కనుక్కొని, అన్నీ గుణించుకొని, ఇప్పుడు ఎవరిది పైచెయ్యో తెలుసుకున్నారేమో?

ఏది ఏమైనప్పటికీ సార్జెంట్ మేజరును యిప్పుడు ముందుకు నడుపుతున్నది భయం కాదు, తీవ్రమైన కోపం. విపరీతమైన క్రోధాతిరేకంతో అతను పళ్లు పటపట నూరాడు, అతనిప్పుడు ఒకే ఒక్కటి కోరుకుంటున్నాడు — వాళ్లని అందుకోడం. వాళ్లని అందుకోడం, అటు తర్వాత....

"రేయ్, నా చేతుల్లో పడ్డాక మీకింక అరిచే అవకాశం దొరకదురా.... కిక్కురుమనే అవకాశం కూడా దొరకదురా...."

ఆ బండలమీద అక్కడక్కడ అస్పష్టమైన పాద ముద్రలు యింకా కానవస్తున్నాయి, జర్మన్లు యిద్దరున్నారని తెలుసుకోడానికి సరిపోయేటంత స్పష్టంగా వున్నాయవి. అతను మరోమారు తనను నిందించుకున్నాడు, తనను తను క్షమించుకోలేకపోతున్నాడు, శత్రువు లందరినీ తను గమనించలేకపోయినందుకూ, లెక్కకురాని జర్మన్ సైనికులు తన సైనిక యువతులున్న పక్కన కాకుండా చలిమంటకు అవతలి పక్కన ఉన్నారని అంచనా వేసినందుకూ యిప్పుడతను క్షోభచెందుతున్నాడు. తను అంతక్రితం రాత్రే తన దుబాసీతో కలిసి భోజనం చేశాడు. అలాంటేది యిప్పుడామెను తను కోల్పోయాడు. అందుకు తనే బాధ్యుడు. ఆ గ్రహింపు అతనికి చిత్తశాంతి లేకుండా చేసింది, అది అతని మనస్సులో మార్మోగుతోంది, అతని మనస్సును అల్లకల్లోలం చేస్తోంది, అది అణగిపోవడానికి ఒకే ఒక్క మార్గం వుంది — తను జర్మన్లను చేరుకోడం. అతను మరేమీ ఆలోచించ దల్చుకోలేదు. కొమెల్కోవా తన వెంట వస్తోందా లేదా అని వెనక్కి తిరిగి చూడనుకూడా చూడలేదు.

తామెందుకు ఎక్కడికి పరిగెత్తుకు వెళ్తున్నదీ జేన్యాకి తెలుసు. సార్జెంట్ మేజరు ఆమెకేమీ చెప్పకపోయినా కూడా ఆమెకీ విషయం తెలుసు, అయినా ఆమె ఏమాత్రం

భయపడలేదు. అకస్మాత్తుగా సమస్తం గడ్డకట్టిపోయింది. అందుచేత, యిప్పుడు బాధగాని, రక్తస్రావంగాని లేదు. ఆమె ఎదలోపలి గాయం ఆమెను బాధించడానికి అనుమతికోసం వేచి యుందా అన్నట్లుంది, కాని ఆమె అందుకు అనుమతించలేదు, అందుచేత యిప్పుడామె దృష్టిని మళ్లించేదేమీ లేదు. ఇటువంటి భావం ఆమెకు యింతకు ముందొకసారి అనుభూతమైంది. అది 1941 వేసవి, యిప్పటికి దాదాపు ఒక ఏడాది క్రితం నాటి సంగతి, అప్పుడొక ఎస్తోనియన్ మహిళ తనను దాచింది....

సార్జెంట్ మేజరు తన చేతినెత్తాడు, తన రొప్పును అణచుకోడం కోసం తంటాలు పడుతూ ఆమె వెంటనే ఆగింది.

"కాసేపు ఆగి ఆయాసం తీర్చుకో" అతను వినిపించీ వినిపించనట్లుగా అన్నాడు. "వాళ్లిక్కడే ఎక్కడో వున్నారు. ఎక్కడోగాని చాలా దగ్గర్లో వున్నారు."

జేన్యా బరువుగా తన రైఫిలుపైన ఆని, తన కాలర్ని ఒదులుచేసుకుంది. ఆమె కరవుదీర ఊపిరి పీల్చుకొని తన ఊపిరితిత్తులను నింపుకోవాలనుకుంది. ఇప్పుడు అందుకు బదులుగా ఆమె తన ఊపిరిని మెల్లగా, నిశ్శబ్దంగా బయటకు వదిలింది, అందుకు నిరసనగా ఆమె గుండె గట్టిగా కొట్టుకుంది.

"అదుగో వాళ్లక్కడున్నారు" సార్జెంట్ మేజరు చెప్పాడు.

అతను బండలసందున గల ఒక సన్నని కన్నంగుండా చూస్తున్నాడు. జేన్యా పైకి చూసింది, అంతగా ఎత్తైదగని బర్చితోపు కొసలు కదలడాన్ని చూసింది.

"వాళ్లు మనల్ని దాటి వెళ్లబోతున్నారు" సార్జెంట్ మేజరు వెనక్కి తిరగకుండా కొనసాగించాడు. "నువ్విక్కడే వుండు. నేను బాతు సంజ్ఞ చెయ్యగానే నువ్వేదో ఒక శబ్దం చెయ్యి. ఓ రాయి విసురు, లేకపోతే నీ రైఫిలు మడమతో ధన్నున కొట్టు — వాళ్లు నీ దిశగా చూసేలా చెయ్యి, కాని ఆటు తర్వాత ఏ చప్పుడూ చెయ్యకు, పూర్తి నిశ్శబ్దంగా వుండు, తెలిసిందా?"

"బోధపడింది" జేన్యా అంది.

"గుర్తుంచుకో, బాతు అరుపు — విన్న తర్వాతనే గాని ముందు కాదుసుమా."

అతను గట్టిగా దమ్ము తీసుకుని, ఓ బండపైకి ఉరికి, అక్కడినుంచి బర్చి తోపులోకి — జర్మన్లు రాబోయే దోవదాటి — వెళ్లాడు.

సూర్య కిరణాలకు వాలుగా వాళ్లపైకి దాడిచెయ్యడం అతని కర్తవ్యం — అలా చేసినట్లయితే కదిలిపోయే వెలుగునీడల్లో వాళ్లు తనను చూడలేరు; అప్పుడిక వాళ్లలో ఒకని వీపుపైకి ఉరకడం — అణిచెయ్యడం, కింద పడదొయ్యడం, పొడిచి నోరెత్తకుండా చెయ్యడం. గప్‌చిప్‌గా వాణ్ణి కడతేర్చడం....

అతను మంచి అనువైన చోటు ఎంచుకున్నాడు. జర్మన్లు యీ దారి వెంట వెళ్లి తీరాల్సిందే. తాము అతన్ని చూడకుండా వాళ్లు వెల్లడి స్థలంలోకి వస్తారు — బర్చి చెట్ల మధ్య, సరిగా తనకి ముందు, వెల్లడి సల్టం ఉండటమే యిందుకు కారణం. నిస్సందేహంగా తానున్న చోటునుంచి అతను వాళ్లని గురి తప్పకుండా తేలికగా కాల్చేసి వుందును. కాని అతని కాల్పులు జర్మన్ల ప్రధాన బృందానికి వినిపిస్తాయి — అలా జరగడానికి అతను యిష్టపడలేదు. అందుకని అతను వెంటనే తన పిస్తోల్ని తోలు ఒరలో పెట్టి, దానికి గుండీ కూడా పెట్టేశాడు.

విజయ జ్ఞాపకచిహ్నమైన ఫిన్నిష్ వేటబాకు తన ఒరలో సాఫీగా కదుల్తోందా లేదా అని అతను పరీక్షించుకున్నాడు.

సరిగా ఆ క్షణంలో జర్మన్లు, ఇంకా వసంతరుతు తెలివలిపెంలోనే వున్న బర్చి చెట్ల కాండాల మధ్యగా మొదటి సారిగా కనిపించారు. వస్కోవ్ అనుకున్నట్లుగానే వాళ్లు యిద్దరున్నారు: మొదటివాడు, తన కుడి భుజంపైన సబ్‌మెషీన్ గన్నుని వేలాడదీసుకుని, బోరాంబోతులా వున్నాడు. తన పిస్తోలుతో ఎంత సునాయాసంగా అతను వాళ్లిద్దర్నీ తుదముట్టించివుందును! కాని ఆ ఆలోచనను అతను మళ్లీ త్రోసిపుచ్చాడు. కాని ఈ మారు తన కాల్పులు జర్మన్లకు వినిపిస్తాయన్న భయంకొద్దీ కాదు, అతను సోన్యాను జ్ఞాపకం చేసుకున్నాడు, కేవలం వాళ్లని అంత తేలిగ్గా చావనివ్వడం అతనికి మనస్కరించలేదు. కంటికి కన్ను, కత్తికి కత్తి — అదొక్కటే మార్గం.

ఆ జర్మన్లు, అంత ఎక్కువ జాగ్రత్త తీసుకోకుండా, తాపీగా నడుస్తున్నారు; రెండోవాడు బిస్కట్ నములుతూ, తన నాలుక నాక్కుంటున్నాడు కూడా. సార్జెంట్ మేజరు వాళ్లు ఎంతెంత అంగలేస్తున్నారో, తనకీ వాళ్లకీ మధ్య ఎంత దూరముందో, వాళ్లు తన ముందుకు ఏ క్షణాన వస్తారో అంచనా వేసుకున్నాడు, తన బాకును పైకి లాగాడు, మొదటి జర్మన్ తనను దాటి కొంచెం ముందుకెళ్లగానే రెండు బాతుకూతలు కూశాడు. ఆ జర్మన్లిద్దరూ పైకి చూశారు, కాని వెన్వెంటనే కొమెల్కోవా తన రైఫిలు మడమతో ఒక రాతిని గట్టిగా కొట్టింది. దానితో వాళ్లిద్దరూ ఆ శబ్దం వచ్చిన దిశగా తిరిగారు — సరిగా ఆ క్షణంలో వస్కోవ్ వాళ్లమీదికి ఉరికాడు.

అతను కచ్చితంగా అంచనా వేసుకుని సరైన క్షణంలో, దూరాన్ని నిర్దుష్టంగా అంచనావేసుకుని మరీ దూకాడు. అతను సరిగా జర్మన్ వీపుమీద పడి, వాడి మోచేతులను తన మోకాళ్లతో నొక్కిపట్టి, వాడింక ఊపిరి పీల్చుకోడానికీ, కనీసం ఉలిక్కిపడటానికీ కూడా వ్యవధి నివ్వకుండా వాడి తలను వెనక్కి వంచి, బిర్రుగా వున్న మెడను వాడిగావున్న బాకుతో కస్సున పొడిచి నిట్టనిలువుగా చీల్చాడు.

ఆ వ్యవహారమంతా సరిగా సార్జెంట్ మేజరు పథకం వేసుకున్నట్లే జరిగిపోయింది.

కిక్కురుకెక్కురు మనకుండా గొర్రె మాదిరిగా ఆ జర్మన్ విధింపబడ్డాడు. పిచ్చికారీ కొట్టినట్లు రక్తం చిమ్ముతూంటే వాడు కష్టంపైన గుర్రు పెట్టినట్లు శ్వాస విడువ గలిగాడు, అంత మాత్రమే. ఆ జర్మన్ పడిపోనారంభించగానే సార్జెంట్ మేజరు పక్కకి దూకి, రెండో జర్మన్ మీదకి లంఘించాడు.

దానంతకీ ఒక్క క్షణం, ఒకే ఒక్క క్షణం మాత్రమే పట్టింది. రెండో జర్మన్ వీపు అప్పటికీ యీ ఘటన జరిగిన వంకకే తిరిగివుంది. కానైతే సార్జెంట్ మేజరుకి మరో సూరు లంఘించేందుకు శక్తే మరి సరిపోలేదో, లేక అతను విలువైన ఓ క్షణం వృథాయే చేశాడో తెలియదు. ఏదేమైతేనేం, అతను తన బాకును విజయవంతంగా ప్రయోగించలేక పోయాడు. అతను రెండవ జర్మన్ చేతిలోంచి సబ్‌మెషీన్ గన్నుని ఊడగొట్టగలిగాడు గాని, అలా చేసే క్రమంలో రక్త పంకిలమై తడిసిన సబ్బు ముక్క లాగా జారిపోతున్న తన బాకుని చేజార్చుకున్నాడు.

అదంతా ఓ యిరకతరకల వ్యవహారంగా తయారైంది. పోరాటానికి బదులుగా కుస్తీపట్టుగా తయారైంది. ఈ రెండో జర్మను అంత మరీ పొడగరి కాకపోయినా, నరాల బిగువు కలిగినవాడు కావడంతో అతన్ని ఓడించడం కష్టసాధ్యమై సార్జెంట్ మేజరు అతని మీద పైచెయ్యి సంపాదించలేకపోయాడు. బండలకీ బర్చ్ చెట్లకీ మధ్యగల పాకుడుపైన వాళ్లిద్దరూ దొర్లుతూ కుస్తీపట్టసాగారు. కాని ఆ జర్మన్ యింతవరకు తన నోటివెంట ఒక్క శబ్దాన్ని కూడా వెలువరచలేదు: సార్జెంట్ మేజర్ని తను ఓడించగలనని ఆశించైనా వుండాలి, లేక అరవడం ద్వారా తన శక్తిని వృథాచేసుకోరాదనైనా అనుకొనివుండాలి.

వస్కోవ్ మరో పొరపాటు చేశాడు. ఆ జర్మన్‌ని మరింత గట్టి పట్టులో యిరికించు కోవాలనే ప్రయత్నంలో తన చేతుల్లోంచి వదలడంతో వాడు తన బాకును పైకి తీసుకో గలిగాడు. సార్జెంట్ మేజరు ఆ బాకును చూడటంతో బిత్తరపోయి తన విలువైన శక్తినీ, ఏకాగ్రతనూ కొంత కోల్పోయాడు, ఆ జర్మన్ చివరకు అతన్ని క్రింద పడదోసి, బరువైన తన పాదాలతో నేలకు తొక్కిపట్టగలిగాడు. ఇప్పుడతని చేతిలోని ఉక్కు బాకు సార్జెంట్ మేజరు మెడలో దిగబడేందుకు సిద్ధంగా చాపబడివుంది. ఇంతవరకు సార్జెంట్ మేజరు ఆ జర్మన్ పిడికిలిని పట్టుకుని, దాన్ని ఆపగలుగుతున్నాడు, కాని ఆ జర్మన్ బరువూ, ఒత్తిడీ అతనికి ఆధిక్యతనూ ఆనుకూల్యతనూ కల్పించాయి. వస్కోవ్ యిక చావు తప్పదనీ, కాని ఎన్ని క్షణాల్లో, ఎన్ని నిమిషాల్లో, అన్నదే సమస్య అనీ గ్రహించాడు. ఆ జర్మన్ కూడా యీ విషయం గ్రహించాడు; దానితో వాడు తన కళ్లు చికిలించి పళ్లు బయటపెట్టి యికిలించాడు.

మరుక్షణమే వాడి శరీరమంతా ఖాళీ సంచి మాదిరిగా పట్టుదప్పి కుప్పకూలి పోయింది. సార్జెంట్ మేజరు యిలా ఎందుకు జరిగిందో మొదట్లో గ్రహించలేకపోయాడు, ఆ జర్మన్‌కి మొదటి దెబ్బ తగలడం అతను వినలేదు. కాని అతను రెండో దాన్ని విన్నాడు:

బులిగిపోయిన చెట్టు మొదలుపై కొట్టిన దెబ్బ మాదిరిగా థడ్ మంది. తన ముఖంపైకి వెచ్చని రక్తం చిమ్మడాన్ని అతను అనుభూతి చెందాడు, ఆవులించిన తన వంకర నోటితో ఊపిరి పీల్చుకొనేందుకు తంటాలుపడుతూ ఆ జర్మన్ క్రిందకు పడిపోసాగాడు. సార్జెంట్ మేజరు చివరకు వాడిని పక్కకు నెట్టేసి, బాకును దొరకపుచ్చుకొని వాడి గుండెలో ఒకే ఒక్క పోటు పొడిచాడు.

అప్పుడు మాత్రమే అతను వెనుతిరిగి చూశాడు: ప్రైవేట్ కొమెల్కోవా, తన రైఫిల్ని దుడ్డు కర్ర మాదిరిగా బ్యారెల్ దగ్గర పట్టుకొని, తన ముందు నిలబడివుంది. రైఫిల్ మడమ రక్తంలో తడిసివుంది.

''శభాష్ కొమెల్కోవా — నువ్వు ప్రశంసాపత్రానికి — అర్హత సంపాదించుకున్నావు....'' సార్జెంట్ మేజరు రొప్పు మధ్య మూడు గుక్కల్లో యీ మాటలు అనగలిగాడు.

అతను లేచి నిలబడేందుకు ప్రయత్నించాడు, కాని లేవలేకపోయాడు. అతను ఊపిరి కోసం తన నోటిని కప్ప మాదిరిగా తెరుస్తూ మూస్తూ, అక్కడే చదికిలబడి వుండిపోయాడు. ఆబోతులాగ బలిష్ఠుడైన మొదటి జర్మన్ కోసం అతను పక్కకి తిరిగి చూశాడు. వాడి శరీరం మధ్యమధ్య యింకా మెలితిరుగుతూనే వుంది, వాడి గొంతులో యింకా గుడగుడ శబ్దం వస్తూనే వుంది. రక్తమింకా చిమ్మనగొట్టంలో మాదిరిగా చిమ్ముతూనే వుంది. రెండో వాడు నిశ్చలంగా, అసహజమైన భంగిమలో చచ్చిపడి వున్నాడు. ఆ వ్యవహారం అంతటితో ముగిసింది.

''ఏమంటావ్, జేన్యా'' సార్జెంట్ మేజరు తాపీగా అన్నాడు. ''వాళ్లల్లో యిప్పుడు యిద్దరు తగ్గారు....''

జేన్యా అకస్మాత్తుగా తన రైఫిల్ను కింద పారేసి, ఒంగిపోయి, తాగినదాని లాగ అటూయిటూ ఊగిపోతూ, పొదల్లోకి పోయి, అక్కడ మోకాళ్లపైన చదికిలపడి, భళుక్కున కక్కుకుంది, వెక్కివెక్కి ఏడ్చింది, ఎవరినో పిలిచింది, బహుశా తన తల్లినే అయ్యుంటుంది....

సార్జెంట్ మేజరు తన చేతుల సాయంతో లేచినిలబడ్డాడు. అతని మోకాళ్లింకా వణుకుతూనేవున్నాయి, అతని కడుపులో దేవుతోంది, కాని యిప్పుడు సమయం ఏ మాత్రం వృథా అయినా చాలా ప్రమాదం. అతను కొమెల్కోవాను పిలవలేదు, ఆమె మానాన ఆమెను వదిలిపెట్టాడు. బాహాబాహీ పోరాటంలో మొట్టమొదటి అనుభవం ఎవరినైనా ఎంతగా దిగ్భ్రాంతునిచేస్తుందో, జీవితమంత సహజమైనదైన నిందు ప్రాణం తియ్యరాదన్న నియమాన్ని తొలిసారిగా అతిక్రమించినప్పటి అనుభవం ఎవరినైనా ఎంతగా కలచివేస్తుందో అతనికి బాగా తెలుసు. ఎవరైనా దానికి అలవాటు పడాలి, గుండెను రాయిచేసుకోవాలి. ఇంత కన్న బలమైన మగవాళ్లూ, సైనికులూ, జేన్యా కన్న యెన్నో రెట్లు బలమైన వాళ్లకి సైతం యీ అనుభవంతో సరిపుచ్చుకోవడం కష్టసాధ్యమైంది, తమ అంతరాత్మతో రాజీ

పడేదాకా వాళ్ళు వేదన చెందుతూనేవుండేవారు. కాని యిక్కడ వున్నదొక స్త్రీ, బహుశా భవిష్యత్తులో ఆమె ఒక మాత, ఆమె తన స్వభావరీత్యా ఏ రకమైన మారణకాండకీ కూడా బద్ధవ్యతిరేకి — అయితేనేం ఆమె యిప్పుడే తన రైఫిలు మడమతో ఒక మానవుడి కపాలాన్ని బద్దలుగొట్టి, చితకబాది చంపింది. ఈ పని కూడా, మానవతా నియమాలను ఉల్లంఘించి, తద్వారా మానవతా నియమ పరిధినుండి వైదొలగిన జర్మన్లకు వ్యతిరేకంగా ఆమె చేసిందన్న సంగతిని కూడా సార్జెంట్ మేజరు గమనించాడు. అందుకనే యింకా వెచ్చగావున్న వాళ్ల శరీరాలను వెదికేటప్పుడు, తను పీనుగు మాంసాన్ని ముట్టుకుంటున్నట్లు వాళ్లంటే అతనికి వున్నదల్లా పరమ రోత మాత్రమే.

తను దేని కోసం వెతుకుతున్నాడో అది — పొగాకు సంచి — అతనికి కనిపించింది. అది అతనికి యిప్పుడే చనిపోయి, నిశ్చేతనుడైన లావుపాటి జర్మన్ జేబుల్లో దొరికింది. "మన మాతృదేశ పరిరక్షణలో పాల్గొన్న ఒక మంచి వీరునికి" అన్న అక్షరాలు ఎంబ్రాయిడర్ చెయ్యబడిన అతని పొగాకు సంచే అది — ఏ సంచి కోసమైతే సోన్యా వెళ్లిందో, ఏది ఆమె ప్రాణాన్ని బలిగొన్నదో ఆ సంచే అది.... తన త్రోవకు అడ్డంగా పడివున్న ఆ జర్మను రోమశహస్తాన్ని పక్కకు తన్నేసి అతను జేన్యా ఉన్న చోటుకెళ్లాడు. ఆ పొదలలో తన మోకాళ్లపై వంగి ఆమె యింకా వెక్కివెక్కి ఏడుస్తూ, హైరానపడుతోంది. "ఫో అవతలకి" అందామె.

అతను ఆ పొగాకు సంచిని తన అరచేతిలో పట్టుకొని, దాన్ని ఆమె ముఖం దగ్గరకు తెచ్చి, ఆమెకు చూపించాడు. జేన్యా దాన్ని గుర్తుపట్టి, తలెత్తి అతని వంక చూసింది.

"లే, జేన్యా."

ఆమె లేచి నిలబడేందుకు అతను తోడ్పడ్డాడు. వెల్లడి ప్రదేశంలోకి ఆమెను నడిపించుకు వెళ్లబోయాడు. కాని జేన్యా ఒకే ఒక్క అడుగు ముందుకేసి, నిలబడిపోయి, తల అడ్డంగా ఊపింది.

"చూశావా మరి, అదే పనికిరాదు" అన్నాడతను, "ఇంతదాకా ఏడ్చావు, మరింక చాలు. నువ్వొక విషయం గ్రహించాలి. వాళ్ళు మనుషులు కారుకదా, కనీసం పశువులు కూడా కారు. వాళ్ళు పట్టి ఫాసిస్టులు కామ్రేడ్ కొమెల్కోవా, నువ్వు వాళ్లని యీ దృష్టితోనే చూడాలి."

జేన్యా వాళ్లవంక చూసేందుకు నిరాకరించింది. సార్జెంట్ మేజరు కూడా అందుకు పట్టుపట్టలేదు. అతను వంగి క్లిప్పులతోబాటు సబ్‌మెషీన్ గన్నులను చేతిలోకి తీసుకున్నాడు. ఫ్లాస్కులను కూడా అందుకోబోయాడు. కాని కొమెల్కోవా వంక చూపుబరపిన మీదట ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. వాటిని తగలేసిరిలే — అయినా తమకి ఆ రెండు ఫ్లాస్కులతోనూ పెద్దగా ఒరిగిపోయేదేమీ లేదు. ఈ ఘటనను గుర్తుకు తెచ్చే వస్తువులు తగ్గిన కొద్దీ కొమెల్కోవా వేదన తగ్గేందుకు ఎక్కువ అవకాశముంటుంది.

అతను ఆ కళేబరాలను దాచరాదని నిర్ణయించుకున్నాడు. చెట్లమధ్యగల ఆ ఖాళీ ప్రాంతాన్ని రక్తపు మరకలు పోయేలా శుభ్రంచెయ్యడం ఎటుతిరిగీ సాధ్యంకాదు. మరి అలాం టప్పుడు, ఆ కళేబరాలను దాచిమాత్రం ప్రయోజనమేమిటి? సాయంత్రం దగ్గరపడుతోంది, త్వరలోనే తమకు సహాయం అందవచ్చు. జర్మన్లకు యిప్పుడిక ఎక్కువ వ్యవధి మిగిలిలేదు. ఆ మిగిలిన కాస్త కాలమైనా జర్మన్లకు సాఫీగా గడవనివ్వరాదని సార్జెంట్ మేజరు తీర్మానించు కున్నాడు. వాళ్లని ఆదుర్దాపడి చావనియ్, తమ గస్తీ సైనికుల గతి ఏమైందో, వాళ్లని ఎవరు హతమార్చారో తెలియక జర్మన్లను తలలు బద్దలుకొట్టుకోనియ్; ఏ శబ్దం విన్నా, ఏ నీడను చూసినా వాళ్లని హడలి చావనియ్ అనుకున్నాడు సార్జెంట్ మేజరు.

చిత్తడి నేలలో ఒక నీటిగుంట దగ్గరకు తాము చేరుకోగానే (అటువంటి నీళ్ల గుంటలు అక్కడ సవాలక్ష వున్నాయి), సార్జెంట్ మేజరు తన ఒళ్లు కడుక్కుని, చిరిగిన తన బుష్‌కోటు కాలరును సర్దుకున్నాడు. అప్పుడిక జేన్యా వంక తిరిగి, ''మరి నీ సంగతేమిటి? నువ్వు చేతులూ, ముఖం కడుక్కోవా?'' అన్నాడు.

ఆమె తల అడ్డంగా ఊపింది. ఆమె యింకా తన వేదననుంచి తేరుకోలేదనడం స్పష్టం, ఎంత ప్రయత్నించినా కూడా ఆమెను అతను ఆ దిగ్భ్రమనుంచి బయటపడెయ్యలేక పోయాడు.... సార్జెంట్ మేజరు నిట్టూర్చి అడిగాడు: ''నువ్వు మిగతా అమ్మాయిలను కనుక్కోగలవా? లేకపోతే నన్ను కూడా నీతో రమ్మంటావా?''

''నేను కనుక్కుంటాను.''

''మరైతే యింక బయల్దేరు. వాళ్లని సోన్యా వున్న చోటుకి తీసుకురా. నీకు తెలుసు కదా ఎక్కడో... లేకపోతే ఒంటరిగా వెళ్లేందుకు భయంగా వుందా?''

''లేదు.''

''కాని జాగ్రత్తసుమా, నాలుగుపక్కలా చూసుకొంటూ మరీ వెళ్ళు, బోధపడిందా?''

''బోధపడింది.''

''అయితే సరే, యిక వెళ్లు. తొందరగా వెళ్లు. టైము వృథా చెయ్యకు. మనం సంతాపం సంగతి తర్వాత చూద్దాం.''

అతన్ని విడిచి ఆమె బయల్దేరింది. తనకిక ఆమె కనిపించనంత వరకూ సార్జెంట్ మేజరు జేన్యా వంక కళ్లు పొడుచుకు చూశాడు. ఆమె పోతున్న తీరు అతనికి నచ్చలేదు. ఆమె శత్రువు సంగతి మరచిపోయి, తన లోలోపలి నాదాలను మాత్రమే వింటోంది. తన సైనికులు బలే మేళం. ఈ అచ్చోడీ రకం సైనికులతో కలిసి తను పోరాటం జరపాలి...

సోన్యా కళేబరం వెల్లకిల పడివుంది. ఆమె అర్ధ నిమీలిత నేత్రాలు ఆకాశానికి గుచ్చుకుపోయినట్లు నిలిచిపోయాయి. సార్జెంట్ మేజరు వాటిని మూసేందుకు మరోసారి విఫల ప్రయత్నం చేశాడు. అతను సోన్యా బుష్‌కోటు రొమ్ము జేబుల గుండీలు ఊడదీసి,

ఆమె కమ్సొమోల్ కార్డూ, అనువాదకుల శిక్షణాలయంవారి సర్టిఫికేట్ ఒకటీ రెండు ఉత్తరాలూ, ఒక ఫొటో బయటకు తీశాడు. అది పౌర దుస్తుల్లో ఉన్నవాళ్ల గ్రూపు ఫొటో. కాని దాని మధ్యలో వున్నదెవరో సార్జెంట్ మేజరు గుర్తించలేకపోయాడు. సోన్యాను పొట్టనుబెట్టుకున్న బాకు గ్రూపు ఫొటో మధ్యలో దిగబడటమే అందుకు కారణం. కాని అతను సోన్యాను గుర్తించగలిగాడు. గ్రూపులో ఆమె ఒక చివర వుంది. పొడుగు చేతులూ, వెడల్పు కాలరూ వున్న దుస్తులు వేసుకుంది. ఆ కాలరు మధ్యనుంచి ఆమె సన్నని మెడ గుర్రపు మెడ పట్టీలోంచి పొడుచుకొచ్చినట్లుంది. రెండు రోజుల్రకితం తమ మధ్య జరిగిన సంభాషణనూ, సోన్యా దుఃఖాన్నీ అతను గుర్తుచేసుకున్నాడు. సోన్యా — సామాన్య సైనికురాలు సోఫ్యా సాలొమోనొవ్నా గూర్విచ్ — వీరమరణం గురించి రాసేందుకు ఎవరూ లేని సంగతిని గుర్తుతెచ్చుకొని అతను కటకటపడ్డాడు. అతను సోన్యా జేబులోని చిన్న జేబురుమాలును తీసుకొని, దాన్ని తన పెదవులతో తడిపి ఆమె మృత నయనాలపైన గల రక్తపు చారికలను తుడిచి, దానితో ఆమె ముఖాన్ని కప్పాడు. ఆ పత్రాలను అతను తన బుష్కోటు ఎడమ రొమ్ము జేబులో, తన పార్టీ కార్డు పక్కనే పదిలంగా పెట్టుకున్నాడు. అతను సోన్యా పక్కన చతికిలబడి, ఆ దర్రిదపు గొట్టు సంచిలోంచి పొగాకు తీసుకొని, సిగరెట్టు చుట్టుకున్నాడు.

అతని కోపాతిరేకం చప్పబడింది, అతని గుండెలోని నొప్పి కూడా తగ్గింది. ఇప్పుడిక అతనిలో మిగిలినదంతా విచారం, దుఃఖం. దుఃఖోద్వేగంతో అతను ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. కాని యిప్పుడతనికి ఆలోచించేందుకూ, మంచి చెడ్డలు బేరీజు వేసుకొని యికమీదట చెయ్యాల్సిందేమిటో తేల్చుకునేందుకూ వ్యవధి చిక్కింది.

తను జర్మన్ గస్తీసైనికులను చంపినందుకూ, తద్వారా తన ఉనికిని బయటపెట్టుకున్నందుకూ అతను బాధపడటంలేదు. కాలం తన పక్షాన వుంది. హెడ్క్వార్టర్సుకు వార్త వెళ్లింది గనుక యిప్పుడిక తను చెయ్యవలసివున్నదల్లా తనకు రాబోయే సహాయంకోసం ఆశతో ఎదురుచూడటమే. ఓ సైనిక డిటాచ్మెంటుకి యీ పరిస్థితిని చక్కదిద్దేందుకు త్వరలోనే ఆజ్ఞలు జారీయవుతాయి. ఓ మూడు గంటలు, మహా అయితే ఓ ఐదు గంటలు తాము నలుగురూ పధ్నాలుగుమంది జర్మన్లను నిలవరించాలి, తాము ఆ పని చెయ్యగలమనే అతను అంచనా వేసుకున్నాడు. తాము ఆ జర్మన్లను తిన్నని మార్గంనుంచి మళ్లించి, లెగొంతొవ్ సరస్సు చుట్టివెళ్లేలా దారి మళ్లించగలిగారు గనుక యిది ప్రత్యేకించి మరింతగా సాధ్యమనుకున్నాడు. వాళ్లు 24 గంటలకు తక్కువ కాకుండా ఆ చుట్టు దోవలో కాళ్లు నలగ దొక్కుకుంటూ వుంటారు.

అప్పటికే అతని సైనిక యువతులు తమ మూటాముల్లెలతో అక్కడికి చేరుకున్నారు. వాళ్లలో యిద్దరు — యిద్దరూ రెండు భిన్నమైన పద్ధతుల్లో అన్నమాట నిజమేననుకోండి — గైరుహాజరయ్యారు, కాని వాళ్ల సామాన్లు బృందంతోనే ఉండిపోయాయి. ఆ బృందం,

చిల్లర వ్యాపారస్తుల కుటుంబం మాదిరిగా, బోలెడంత సామాను సమకూర్చుకుంది. సోన్యా కళేబరాన్ని చూడగానే గాల్యా చెత్‌వెర్తాక్ కంపించనారంభించి, దాదాపుగా అరిచేటంత పని చేసింది. కాని ఒస్యానినా కటు స్వరంలో "ఆ పూనకపు వేషాలు యింక కట్టిపెట్టు!" అంటూ మందలించింది.

గాల్యా నోరు మూతపడింది. ఆమె సోన్యా శిరస్సుదగ్గర మోకరిల్లి సన్నగా రోదించింది. కళ్లు పొడారిపోయి, కణకణమండే బొగ్గుల్లా మెరుస్తూన్నా రీతా ఉఛ్వాసనిశ్వాసాలు బిగ్గరగా వినవస్తున్నాయి.

"సరే, యింక జరగాల్సిందేమిటో చూడండి" సార్జెంట్ మేజరు అన్నాడు.

ఇటువంటి అవాంతర పరిస్థితి కోసం తన దగ్గర పార లేనందుకు విచారిస్తూ, అతను తన గొడ్డలిని తీసుకుని, బండల మధ్య సమాధికి అనువైన స్థలంకోసం వెతక నారంభించాడు. తన చుట్టూ ఎక్కడ చూసినా తవ్వేందుకు మట్టి వున్న స్థలమే అతనికి దొరకలేదు. చివరకు అతనికి నేలలో ఒక బొరియ కనిపించింది. అతను కొన్ని రెమ్మలు కొట్టుకొచ్చి, ఆ బొరియలో పరిచి వెనక్కి వెళ్లాడు.

"ఆమె అత్యధిక మార్కులు తెచ్చుకునే విద్యార్థిని" ఒస్యానినా అంది. "ఆమెకు స్కూల్లోనూ, విశ్వవిద్యాలయంలోనూ కూడా అత్యధిక మార్కులే వచ్చాయి."

"ఔనౌను" సార్జెంట్ మేజరు అన్నాడు, "ఆమెకు కవిత్వమంటే ప్రాణం."

అతను తనలో తను, ప్రధాన విషయం అది కాదు, అనుకున్నాడు. ప్రధాన విషయం ఏమిటంటే సోన్యా బిడ్డల్ని కనివుండును, వాళ్లు కూడా తిరిగి బిడ్డల్ని కని, వంశాన్ని కొనసాగించి వుందురు. మరి యిప్పుడీ వంశం, యీ దారం, పుటుక్కున తెంపెయ్యబడింది. మానవ జాతి అనే అనంతమైన వస్త్రంలో ఓ చిన్న దారం ఒక బాకు పోటుతో తెంచివెయ్యబడింది.

"ఆమెను పట్టుకొని పైకి లేపండి" అతనన్నాడు.

కొమెల్కోవా ఒస్యానినాలు భుజాలూ, చెత్‌వెర్తాక్ పాదాలూ పట్టుకున్నారు. వాళ్లు జారిపడుతూ లేస్తూ ఊగిసలాడిపోతూ ఆమెను మోసుకెళ్లారు. తన కాలికున్న చేతి తయారీ నాటు పాదరక్ష కారణంగా ప్రత్యేకించి చెత్‌వెర్తాక్ నడక మరీ అధ్వానంగా వుంది. సోన్యా ఓవర్‌కోటును తీసుకుని సార్జెంట్ మేజరు వాళ్ల వెనుక నడిచాడు. వాళ్లు ఆ బొరియను చేరుకోగానే "అక్కడ ఆగండి" అతనన్నాడు. "ఓ క్షణం ఆమెనిక్కడ వుంచండి."

వాళ్లు సోన్యాను సమాధి అంచున పడుకోబెట్టారు. నేల ఎగుడుదిగుడుగా వుందేమో ఆమె తల పక్కలకి ఒరిగిపోతూ వచ్చింది, చివరకు కొమెల్కోవా ఆమె చెంపకింద ఒక సైనిక టోపీ పెట్టింది. సార్జెంట్ మేజరు కొంచెం ఆలోచించి, తర్వాత – ఒస్యానినా వంక చూడకుండా, తను చెయ్యబోతున్న పని తనకే యిష్టం లేనట్లు కనిపిస్తున్నా కూడా – ఒస్యానినాను ఉద్దేశించి బొంగురుగా అన్నాడు: "ఆమె కాళ్లు గట్టిగా పట్టుకో."

"ఎందుకు?"

"మారు మాట్లాడకుండా చెప్పినట్టు చెయ్యి! అక్కడ కాదు — మోకాళ్ల దగ్గర పట్టుకో!"

అతను ఒక బూటును ఊడలాగాడు. "మీరు చేస్తున్న పనేమిటి?" ఒస్యానినా అరిచింది. "మీకెంత సాహసం!"

"అవి మరింత అవసరమైన వాళ్లు మనలో ఒకళ్లు వున్నారన్న సంగతి నీకు కనిపించడం లేదూ?"

"ఏయ్, ఒద్దు గాక ఒద్దు!...." పూనకం వచ్చిన దానిలా వెనక్కి తగ్గుతూ చెత్వెర్తాక్ అరిచింది.

సార్జెంట్ మేజరు దీర్ఘనిశ్వాస విడిచాడు. "అమ్మాయిలూ మనమిక్కడేమీ ఆటలాడుకోవడం లేదు. మనం బ్రతికివున్నవాళ్ల సంగతి ఆలోచించాలి — అదీ యుద్ధనియమం. పట్టుకో, ఒస్యానినా. ఇది నా ఆజ్ఞ."

అతను రెండో బూటును కూడ ఊడపీకి, గాల్యా చెత్వెర్తాక్ వైపు తిరిగాడు.

"కిక్కురుమనకుండా వీటిని తొడుక్కో. నీ భావాలూ అనుభూతులూ తెలుసుకోవాలని నేను కోరుకోడం లేదు — జర్మన్లు మన కోసమేమీ ఆగబోరు."

అతను సమాధిలోకి దూకి, సోన్యాను పట్టి, ఓవర్కోటు తొడిగి, కింద పడుకోబెట్టాడు. అమ్మాయిలు అందించిన రాళ్లతో అతను సమాధిని పూడ్చాడు. వాళ్లు సమయాన్ని వృథాచెయ్యకుండా మౌనంగా పనిచేశారు. త్వరలోనే అక్కడొక రాళ్ల గుట్ట తయారైంది. దానిపైన సార్జెంట్ మేజరు సోన్యా సైనిక టోపీని వుంచి, దానిపైన బరువుకి ఒక రాయి పెట్టాడు. కొమెల్కోవా అక్కడొక పచ్చని మొక్కనుంచింది.

"మనం దీన్ని మాప్మీద గుర్తు పెడదాం" అతను అన్నాడు. "యుద్ధం ముగిశాక ఆమెకిక్కడ స్మారకస్తూపం నిర్మించబడుతుంది."

అతనా స్థలాన్ని మాప్లో కనుక్కొని, అక్కడొక గుర్తు పెట్టాడు. అతను తన తల పైకెత్తి చూసినప్పుడు చెత్వెర్తాక్ కాళ్లలో ఒకటింకా పట్టీలో చుట్టబడివుండటం చూశాడు.

"ప్రైవేట్ చెత్వెర్తాక్, ఏమిటి సంగతి? నీ పాదరక్షలింకా మార్చుకోలేదేం?"

చెత్వెర్తాక్ ఆవేశంతో ఊగిపోనారంభించింది: "నేను వేసుకోను! నేనీ పని చచ్చినా చెయ్యను, నేనీ పని చెయ్యలేను! అది ఆరోగ్యానికి మంచిది కాదు. నాకు తెలుసు, మా అమ్మ నర్సు...."

"ఇంక కట్టిపెట్టు నీ అబద్ధాలు" ఒస్యానినా గర్జించింది. "కట్టుకథలు కట్టిపెట్టు! నీకు అమ్మ లేదు. నీకు అమ్మ అంటూ యింతకు ముందెన్నడూ లేదు. నువ్వొక అనాథవి, కట్టుకథలు కల్పించబోకు."

గాల్యా కళ్ళు కన్నీళ్లతో — ఆటవస్తువు పగిలిపోతే బిడ్డ కార్చే దుఃఖోద్విగ్నమైన కన్నీళ్లతో — నిండాయి.

10

"ఏయ్ ఏమిటది! అలాంటి పాడుమాటలనడానికి నీ నోరెలా వచ్చింది?" జేన్యా ఒస్యానినాను కూకలేసి, వెక్కివెక్కి ఏడుస్తున్న గాల్యాను కౌగలించుకుని, "మనమిలా ద్వేషం పెంచుకోకూడదు, లేకపోతే జర్మన్ల మాదిరిగానే మనం కూడా పశుప్రాయులమవుతాం...."

ఒస్యానినా మారుపలకలేదు.

గాల్యా నిజంగానే ఒక అనాథ బాలిక. చివరకు "చెత్వెర్తాక్" (నాలుగోవంతు) అనే ఆమె ఇంటిపేరు సైతం — బిడ్డలందరిలోనూ పొట్టిగా వున్నందున — అనాథ శరణాలయంలోనే ఆమెకు వచ్చింది.

అనాథ శిశుశరణాలయం ఒక పాత క్రిస్టియన్ మఠంలో ఏర్పాటుచెయ్యబడింది. ఆ భవనంలో ప్రతిధ్వనించే పైకప్పునుంచి బూడిదెవన్నెలో వుండే పాతకల్లాంటి గోమార్లు రాలుతూండేవి. హడావిడిగా పులిమిన వెల్ల కారణంగా పూర్తిగా మరుగుకాని జేబురు గడ్డాల క్రైస్తవ స్వాముల చిత్రాలు, ప్రస్తుతం అనాథ శిశుశరణాలయంగా వాడబడుతున్న వేర్వేరు చిన్న చర్చీల గోడలనుండి పిల్లలవంక తొంగిచూస్తూ వుంటాయి. దానికి తోడు యీ మఠం గదులు నేల మాళిగలంత జిల్లుమంటూ ఉంటాయి.

పదేళ్ల వయస్సప్పుడు గాల్యా — ఆ మఠం స్థాపింపబడినప్పటినుండి దాని చరిత్రలో ఎన్నడూ ఎవరూ కనివిని ఎరుగని ఒక ఘటన ద్వారా — తనకు కీర్తిని సంపాదించుకుంది. ఓ రోజు రాత్రి ఆమె తన పడక వదిలి మరుగుదొడ్డికి వెళ్లినప్పుడు తన అరుపులూ బొబ్బలతో మొత్తం శరణాలయంలో అందర్నీ లేపేసింది. నిద్ర లేచిన ఉద్యోగులకు ఆమె కను చీకటిగా వున్న ఒక వసారా నేలపైన పడివుండటం కనిపించింది. తనను పొడవాటి గడ్డం వున్న ఒక ముసిలాడు తన నేలమాళిగలోకి లాక్కుపోవాలని ప్రయత్నించినట్లు గాల్యా సుబోధకంగా వాళ్లకి వివరించి చెప్పింది.

ఈ "మానభంగ ప్రయత్నపు కేసు"పై దర్యాప్తు చర్యలు ప్రారంభమయ్యాయి. ఆ జిల్లా అంతట్లోనూ పొడవాటి గడ్డమున్న ఒక్క ముసిలాడూ లేకపోవడంతో ఆ దర్యాప్తు చర్యలు క్లిష్టతరమయ్యాయి. పైనుంచి వచ్చిన అపరాధ పరిశోధకులూ, నాటు షెర్లాక్ హోమ్స్*లూ ఆమెను గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేశారు. ఆమె ప్రశ్నింపబడినప్పుడల్లా కేసుకి

---

* కోనన్ డాయిల్ (1859–1930) నవలల్లోని సుప్రసిద్ధ అపరాధ పరిశోధకుడు — షెర్లాక్ హోమ్స్. — సం.

ఎప్పటికప్పుడు ఎన్నెన్నో కొత్తకొత్త వివరాలు సమకూరుతూ వచ్చాయి. చిట్టచివరకు గాల్యాకు సన్నిహిత స్నేహితుడూ — ఆమెకు అంత చక్కని యింటిపేరును కల్పించిన — వయస్కుడూ అయిన స్టోర్‌కీపరు యీ మొత్తం కేసంతా గాల్యా చిన్నారి బుర్రలోంచి వచ్చిన అభూత కల్పన అని కనిపెట్టాడు.

ఇతర పిల్లలు తనని అదే పనిగా పరియాచకాలు చేసి ఏడిపిస్తూంటే చిట్టచివరకు గాల్యా తన ఆత్మరక్షణార్థం తనే కథానాయకురాలైన కథను కల్పించింది. ఆమె కథ సరిగా టామ్ థంబ్ కథను పోలివుంది. కాని మొట్టమొదటి సంగతి ఈ కథలో ప్రధాన పాత్ర బాలుడు కాక బాలిక అవడం. రెండో సంగతి బారుగడ్డం ముసిలాళ్ళూ, చీకటి కొట్లూ యిందులో ప్రముఖ పాత్ర వహించాయి.

ఈ కథ గాల్యాకి కీర్తిని తెచ్చిపెట్టడమైతే తెచ్చిపెట్టింది, కానైతే, జనానికి దానితో విసుగెత్తిపోవడంతో గాల్యా కీర్తి కూడా కరిగిపోయింది. మరో కొత్త కథను కల్పించ రాదని గాల్యా నిర్ణయించుకుంది, కాని సన్యాసులు గుప్తంగా పూడ్చిపెట్టిన వెండిబంగారాల లంకెబిందెలను గూర్చిన పుకార్లు ఎలాగో అనాథ శరణాలయమంతటా గుప్పుమన్నాయి. ఈ పుకార్లు పిల్లలందరిలోనూ అంటుజాడ్యంలాగ వ్యాపించాయి. ఇంకేముంది, దానితో మఠం పెరడంతా ఎక్కడ చూసిన గోతులతో నిండిపోయింది. అధికారులు యీ గొడవని అణి చెయ్యగలిగారో లేదో అంతలోనే మరో ఘటన సంభవించింది: అలలు అలలుగా కదిలే అతి తెల్లని వస్త్రాలలో దయ్యాలు నేలమాళిగలలో కనిపించ సాగాయి. అవి చాల మందికి కని పించాయి, దానితో చిన్న పిల్లలు రాత్రి పూట తను పక్కలమీంచి కదలడానికి — దాని పర్య వసానాలన్నింటితో బాటు — ససేమిరా ఒప్పుకోలేదు. ఈ తంటా చిలికిచిలికి గాలివాన అయి, నిజంగానే ఓ పెద్ద ముప్పు దశకు చేరుకుంది. దానితో టీచర్లకు ఆ దయ్యాల వేటకు పూను కోక తప్పలేదు. కన్నంలో దొంగ మాదిరిగా వాళ్ళకు పట్టుబడిన మొట్టమొదటి దయ్యమే — తెల్లని దుప్పటిలో ఒళ్ళంతా కప్పుకున్న — గాల్యా చెత్‌వెర్తాక్.

ఈ గొడవ తర్వాత గాల్యా కొంత స్థిమితపడినట్లు కనిపించింది. ఆమె శ్రద్ధగా చదివింది, తనకన్న చిన్న పిల్లల సంరక్షణలో తోడ్పడింది, తన జీవితకాలమంతా తను ఒంటరిగా ఈవెనింగ్ గౌనులు ధరించి పాట కచ్చేరీలు చెయ్యాలనీ, సార్వజనిక మెచ్చికోలును చూరగొనాలనే కలలు గన్నప్పటికీ గాయకబృందంలో చేరడానికి సైతం ఒడబడింది. దాదాపు అదే కాలంలో మొట్టమొదటి సారిగా ఆమె ప్రేమలో పడింది, మరి తన పనులన్నింటినీ నిగూఢత్వంతో మేళవించడం ఆమెకు అలవాటేమో, త్వరలోనే చిన్నచిన్న చీటీలూ, ప్రేమ లేఖలూ, కన్నీళ్ళూ, గుప్త సమావేశస్థల సంకేతాలూ శరణాలయమంతటా ప్రత్యక్షం కాసా గాయి. మరో మారు ఆమె తను కష్టించి తన అభీష్టాన్ని సాధించుకున్నది. శరణాలయం

అధికారులు ఆమెను వదిలించుకోవాలని తీర్మానించుకుని, ఉదారమైన ధనసహాయం కూడా చేసి, ఆమెను లైబ్రేరియన్ల శిక్షణాలయానికి రవాణా చేశారు.

యుద్ధం ప్రారంభమయ్యేనాటికి గాల్యా మూడో తరగతి విద్యార్థిని, యుద్ధారంభానంతరం మొట్టమొదటి సోమవారం నాడే ఆమె తరగతి బృందం యావత్తూ స్థానిక సైన్య సమీకరణ కేంద్రానికి హాజరైంది. ఆ బృందమంతా సైన్యంలోకి తీసుకోబడింది — ఒక్క గాల్యా తప్ప. ఆమె ఎత్తూ, వయస్సూ కూడా సైనిక నిబంధనలకు సరిపోలేదు. గాల్యా తన యీ ఓటమికి తలొగ్గ దలుచుకోలేదు; సైనిక అధికారులపై ఆమె తన దాడులు కొనసాగించింది. ఆమె సిగ్గు విడిచి ఎన్ని అబద్ధాలాడిందంటే, వరుసగా అనేక రాత్రులు నిద్ర లేకుండా గడపడంతో అతని బుర్ర అంతకు ముందే అంత మరీ తేటగా లేదేమో, చివరకు ఆమె అబద్ధాలతో కలనల్ బుర్ర సైతం గజిబిజి అయిపోయింది. గాల్యా విషయంలో అతను మినహాయింపు ఇచ్చి, ఆమెను విమాన విధ్వంసక దళంలోకి పంపాడు.

వాస్తవ రూపం దాల్చిన స్వప్నం, ఆ క్రమంలో తన కాంతిపరివేషాన్ని కోల్పోతుంది. వాస్తవం కఠోరమైనదిగాను, క్రూరమైనదిగాను తేలింది, వీరోచిత కృషిని గాక సైనిక నిబంధనలకు ఖచ్చితమైన విధేయతను అది డిమాండుచేసింది. ఉన్నతిని సాధించానన్న భావం, కొత్తదనం అతి త్వరలోనే అదృశ్యమయ్యాయి, రోజువారీ చాకిరీకీ, యుద్ధ రంగాన్ని గూర్చిన గాల్యా భావనకూ మధ్య బొత్తిగా పొంతనలేకపోయింది. గాల్యా కలవరపడింది, తన ఉల్లాస స్వభావాన్ని కోల్పోయింది, తరచుగా రాత్రి పూట — తన కన్నీళ్లు యితరులకు కనిపించకుండా మరుగుపరుస్తూ — రోదిస్తూండేది. కాని తర్వాత జేన్యా రాకతో జీవితం మళ్లీ వేగాన్ని పుంజుకుంది.

ఏదో ఒకటి కల్పించకుండా స్తబ్ధుగా ఉండిపోవడం గాల్యాకి దాదాపు చేతగాని పని. నిజానికి అదేమీ అబద్ధాలు చెప్పడం కాదు, అది ఆమె అభీష్ట పరికల్పన మాత్రమే. సరిగా అలాగే ఆమె తనకొక తల్లిని — ఒక నర్సుని — మనస్సులో కల్పించుకుంది, ఆ తల్లి అస్తిత్వాన్ని స్వయంగా తనే దాదాపు నమ్మగలిగే మానసిక స్థితికి గాల్యా చేరుకుంది ...

వాళ్లకి ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. సార్జెంట్ మేజరు గాభరా పడసాగాడు. సాధ్యమైనంత త్వరగా తామిక్కడినుంచి వెళ్లిపోవాలి, జర్మన్ల ఆనుపానులు తెలుసుకోవాలి, అవిరామంగా వెంటాడాలి, అటుతర్వాత వాళ్లని తమ స్కౌట్ల కోసం వెతుక్కోనివ్వాలి. ఈ పనులన్నీ తాము చేయగలిగితే తనది పైచెయ్యి అవుతుంది. అప్పుడు జర్మన్లని తను కీలుబొమ్మల్లా ఆడించగలుగుతాడు, తను వేచిచూస్తూ, వాళ్లచేత తను కోరుకున్నదల్లా చేయించగలుగుతాడు, అప్పుడు తను తనకి సహాయ బలగం వచ్చి, జర్మన్లను చుట్టుముట్టే దాకా వేచియుండగలుగుతాడు.

నిస్సందేహంగా తమకి చాలా ఆలస్యం అయింది. సోన్యాను ఖననం చెయ్యడంలోనైతేనేమి, చెత్‌వెర్తాక్‌కి బుజ్జగించి నచ్చచెప్పడంలోనైతేనేమి — చాలా కాలం గడిచిపోయింది. ఈలోగా సార్జెంట్ మేజరు సబ్‌మెషీన్ గన్నును తనిఖీచేసి చూసుకున్నాడు, అదనపు రైఫిళ్ళు రెండింటినీ దాచిపెట్టాడు, తూటాలను పంచాడు. అతను ఒస్యానినాను అడిగాడు: "నువ్వెప్పుడైనా సబ్‌మెషీన్ గన్నుని వాడావా?"

"సోవియట్ సబ్‌మెషీన్ గన్నుని మాత్రమే వాడాను."

"ఇప్పుడీ జర్మన్‌దాన్ని వాడి చూడు. నువ్వు దీన్ని వాడగలుగుతావనుకుంటాను." అతనామెకు దాన్ని ఎలా పట్టుకోవాలో, ఎలా ప్రయోగించాలో నేర్పి, హెచ్చరించాడు: "ఎప్పుడూకూడా వరుసగా ఒకే సారి ఎక్కువ సేపు కాల్చకు — అలా చేస్తే గొట్టం పైకి లేచిపోతుంది. కొద్ది కొద్దిగానే కాల్చు."

చిట్టచివరకు, ఎలాగైతేనేం, వాళ్ళు బయల్దేరారు.... ముందు సార్జెంట్ మేజరూ, చెత్‌వెర్తాక్, కొమెల్కోవాలు ప్రధాన బలగంగా మధ్యనా, ఒస్యానినా వెనుకతట్టునా నిలబడి ముందుకు సాగారు. వాళ్ళు నిశ్శబ్దంగానూ, సావధానంగానే నడుస్తున్నారు, అయినా కూడా వాళ్ళలో ఎవరికి వారు మళ్లీ తమతమ భావానుభూతుల్లో మగ్నులైపోయివుండాలి, ఎందుకంటే వాళ్ళు దాదాపుగా జర్మన్లతో ఢీకొనే పరిస్థితి ఏర్పడింది. అలా జరగలేదంటే నిజానికి అదొక అద్భుతమే.

అదృష్టవశాత్తూ సార్జెంట్ మేజరు మొదట వాళ్ళని కనిపెట్టాడు. ఇద్దరు జర్మన్లు నేరుగా — మిగిలిన వాళ్ళు వాళ్ళని అనుసరిస్తూండగా — అతని వైపుకే వస్తున్నారు. సార్జెంట్ మేజరు ఏడంటే ఏడే అడుగులు వేసేటంత సేపు ఆలస్యం చేసివుంటే, వాళ్ల సైనిక జీవితం అంతటితో పరిసమాప్తి చెందియుండేది — రెండే రెండు బారుల కాల్పులు సరిపోయి వుండేవి.

అయితే ఆ ఏడడుగులూ అతనే వేసిన కారణంగా అన్నీ యిప్పుడు అతనికే అనుకూలంగా మారాయి: ఇప్పుడతనికి వెనక్కి తగ్గి తన సైనిక యువతులకు చెదరిపొమ్మని సంజ్ఞ చేసేందుకు వ్యవధిచిక్కింది, అతనికి తన జేబులోంచి ఒక హాండ్ గ్రెనేడ్‌ను బయటికి లాగేందుకు సమయం దొరికింది. అదృష్టవశాత్తూ ఆ గ్రెనేడ్ ప్రయోగానికి సిద్ధంగా వుంది. ఓ బండ వెనకనుంచి అతను దాన్ని విసిరాడు. అది పేలీ పేలడంతోనే అతను తన సబ్‌మెషీన్ గన్నుతో జర్మన్లపై గుళ్లవర్షం కురిపించాడు.

సైనిక నిబంధనలు అటువంటి పోరాటాన్ని "ఆకస్మిక ముఖాముఖీ సంఘర్షణలు" అని పేర్కొంటాయి. అటువంటి సంఘర్షణల ప్రత్యేక లక్షణమేమిటంటే శత్రువుకి మన బలమేమిటో, మనం సైనిక గస్తీ కోసం వచ్చిన వాళ్లమో, లేక మనది పురోగామి దళమో — తేల్చుకోడానికి వాళ్ల తల ప్రాణం తోకకి వస్తుంది. అటువంటప్పుడు చెయ్యాల్సిన

ముఖ్యమైన పనేమిటంటే వాళ్ళనలా సందిగ్ధ స్థితిలో అట్టేపెట్టడం, తేరుకొనేందుకు వాళ్ళకి వ్యవధి నివ్వకపోవడం.

సార్జెంట్ మేజరు, సహజంగానే, యీ అంశాలను గురించి చైతన్యయుతంగా ఆలోచించలేదు — అవి అతని స్మృతిలో, ఆజీవితపర్యంతం, గాఢంగా అంకితమైపోయాయి. ఒక్క క్షణకాలం అతను ఆలోచించినదల్లా తను కాల్పులు సాగించి తీరాలని మాత్రమే. అటు తర్వాత అతని మనస్సులో తన సైనిక యువతులను గురించి ఆలోచన మెదిలింది: వాళ్ళు దాడిచెయ్యడానికి వీలైన రక్షణ స్థావరాలు చూసుకోగలిగారా, లేక వట్టినే పారిపోయారా?

జర్మన్లు అతని బండపైకి, పనిచేస్తున్న అన్ని సబ్‌మెషీన్ గన్నులతోనూ కాల్పులు సాగిస్తున్నారేమో, ఆ శబ్దంతో చెవులు గళ్ళు పడుతున్నాయి. రాతి పెచ్చులతో అతని ముఖాన గాట్లు పడ్డాయి, అతని కళ్ళనిండా రాతి ధూళి పడింది, కళ్ళ వెంబడి కారుతున్న నీళ్లను తుడుచుకొనే వ్యవధి లేదేమో అతనికి దాదాపు ఏమీ కనిపించడం లేదు.

అతని సబ్‌మెషీన్ గన్ బోల్టు క్లిక్కుమని వెనక్కి కొట్టుకుంది; తూటాలు ఖాళీ అయ్యాయి. అందుకతను చాలా భయపడ్డాడు, మళ్ళీ తూటాలు నింపడానికి పట్టే క్షణాలు చాలా విలువైనవి, మరి యిప్పుడు ఆ క్షణాలు చావు బ్రతుకులను తేల్చే శక్తి గలవి. మూగవోయిన గన్నుదిశగా జర్మన్లు లంఘించి రావచ్చు, పది మీటర్లో ఏమో వున్న ఆ దూరాన్ని వాళ్ళు తేలికగా దాటి రాగలిగి వుండేవారు, అప్పుడు తన పని ముగిసియుండేది.

కాని జర్మన్లు ఆ పని చెయ్యలేదు. రెండవ సబ్‌మెషీన్ గన్ను — ఒస్యానినాది — వాళ్ళని అణచి వుంచిందేమో — వాళ్ళు తమ తలలను సైతం పైకెత్తలేదు. దగ్గర్నుంచి జాగ్రత్తగా గురిచూసి ఆమె మధ్యమధ్య కొద్ది కొద్ది క్షణాలు కాలుస్తూ, తద్వారా వస్కోవ్‌కి అత్యవసరమైన విలువైన క్షణాలను సమకూర్చింది. అవెంతటి విలువైన క్షణాలంటే, వాటి దాతకు గ్రహీత యావజ్జీవితమూ రుణపడి వుండే క్షణాలవి.

ఆ పోరాటం ఎంత కాలం సాగిందన్నది తర్వాత ఎవరూ చెప్పలేకపోయిన విషయం. సెకండ్లలోనూ, నిమిషాల్లోనూ కనుక లెక్కపెట్టినట్లయితే అది అతి తక్కువ కాలం జరిగిన సంఘర్షణ. సైనిక నిబంధనల ప్రకారం ఏ ఆకస్మిక ముఖాముఖీ పోరాటమైనా అలాగే వుండాలి. అందుకు భిన్నంగా శారీరక బలాన్ని, మానసికోద్రేకాన్ని, ఎదుర్కోడంలో యిమిడి వున్న ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే అది మనుషుల జీవితంలో పెద్ద భాగాన్ని, కొందరి విషయంలో మొత్తం ప్రాణాన్నే హరిస్తుంది.

గాల్యా చెత్‌వెర్తాక్ ఎంతగా బెదిరిపోయిందంటే, ఒక బండ మాటున ముఖం పెట్టుకొని, తన చేతులతో చెవులు కప్పుకొని, ఆమె బోర్లా పడుకుంది; రైఫిలు ఆమె చేతికి దూరంగా పడివుంది. జేన్యా త్వరలోనే కోలుకుని ఓ క్రమమంటూ ఏమీ లేకుండా చెల్లా

చెదరుగా కాల్పులు సాగించింది. తుపాకి శిక్షణ కేంద్రంలో మాదిరిగా తాపీగా గురిచూసేందుకు యిక్కడ వ్యవధి లేదు. ఎవరికో ఒకరికి తగిలే వుంటుందిలే అని ఆశించింది.

రెండు సబ్‌మెషీన్ గన్నులూ, ఒక రైఫిలూ — ప్రయోగింపబడిన ఆయుధాలన్నీ యివి మాత్రమే, అయినా కూడా జర్మన్లు వెన్నుచూపారు. దీని అర్థం వాళ్లు భయపడ్డారని కాదు, వాళ్లు భయపడలేదు. అయితే పరిస్థితి వాళ్లకి అగమ్యగోచరంగా వుంది. అందుకని కొంచెం సేపు బదులుకాల్పులు కాల్చి, వాళ్లు — రక్షణ కాల్పులు లేకుండా, రక్షణ దళం అంటూ ఏదీ లేకుండా — వట్టినే వెనక్కి అడవిలోకి తిరోగమించారు.

కాల్పులు ఆకస్మికంగా నిలిచిపోయాయి: ఒక్క కొమెల్కోవా మాత్రమే — కాల్చిన ప్రతిసారీ తన శరీరం కంపిస్తూ వెనక్కి జరుగుతూండగా — కాల్పులు సాగిస్తోంది. తూటాల దండ పూర్తి కాగానే ఆమె కూడా నిలిపేసింది. సార్జెంట్ మేజరు వంక తను అప్పుడే గాలి కోసం వచ్చినట్లు చూసిందామె.

"సరే, ఇప్పటికి ఘట్టం ముగిసింది" అంటూ సార్జెంట్ మేజరు నిట్టూర్చాడు.

ఎంత సంపూర్ణంగా నిశ్శబ్దం ఆవరించిందంటే అది వాళ్ల చెవుల్లో గింగురుమన సాగింది. తుపాకి మందు, రాతి ధూళీ, పొగా — వీటి కలగాపులగపు వాసన కొడుతోంది. సార్జెంట్ మేజరు తన ముఖాన్ని చేతులతో తుడుచుకున్నాడు, తన చేతులకు రక్తం అంటుకోవడం చూశాడు — రాతి పెచ్చులు అతని ముఖానికి కొట్టుకున్నాయి.

"మీకు దెబ్బలు తగిలాయా?" ఒస్యానినా లోగొంతులో అడిగింది.

"లేదు" సార్జెంట్ మేజరు చెప్పాడు. "నువ్వు పరిశీలనగా చూస్తూ వుండు."

బండపైగా చూడటానికి అతను లేచి నిలబడ్డాడు — కాల్పులేమీ కొనసాగలేదు. అతను చుట్టూ కలియజూశాడు, కొంత దూరాన అడవికి చేరివున్న బర్చిచెట్ల మొదళ్లనుంచి ఎదిగిన కొమ్మల చివళ్లు ఊగిసలాడటం అతనికి కనిపించింది. అతను చేతిలోకి పిస్తోలు తీసుకుని ముందుకి దేకి, అక్కడినుంచి పరుగున దూసుకెళ్లి మరో బండవెనక దాక్కున్నాడు. అతను మళ్లీ చుట్టూ పరిశీలించి చూశాడు, హాండ్ గ్రెనేడ్ దెబ్బకు చీలివున్న పాకుడు పైన నల్లని రక్తపు మరకలు కానవచ్చాయి. అక్కడ దండిగా రక్తం కానవస్తోంది గాని, శరీరాలేమీ కనిపించలేదు — వాళ్లు వాటిని మోసుకపోయి వుండాలి.

సార్జెంట్ మేజరు ముందుగా పోయి బండల మధ్యా, పొదల మధ్యా పరిశీలించిన మీదట జర్మన్లు అక్కడ కాపలాదళం దేన్నీ వదిలిపెట్టలేదని తీర్మానించుకున్నాడు. అతను లేచి నిటారుగా నిలబడ్డాడు, ముఖమింకా బాధగా ముకుళించుకుంటూనే వున్నా, బాగా అలసిపోయినా కూడా, అతను తన సైనిక యువతుల దగ్గరకు మనస్సు తేలికపడినవాడి మాదిరిగా వచ్చాడు. అతనికి సిగరెట్టు కాల్చుకోవాలన్న వాంఛ కూడా మిగల్లేదు, అతనికి పడుకోవాలని, ఒక్క పది నిమిషాలు పడుకోవాలని కుతిగా వుంది. కాని అతనింకా తమ

దగ్గరకు వచ్చీ రాక ముందే ఒస్యానినా ఆకస్మికంగా అడిగింది: "మీరు కమ్యూనిస్టేనా, సార్జెంట్ మేజర్?"

"నేను బోల్షెవిక్ పార్టీ సభ్యుణ్ణి...."

"మా కమ్సొమోల్ సమావేశానికి అధ్యక్షత వహించాల్సిందిగా మేము మిమ్మల్ని కోరు తున్నాం."

సార్జెంట్ మేజరు తన చెవులను తనే నమ్మలేకపోయాడు.

"ఏమిటి! సమావేశమా?"

అతను అకస్మాత్తుగా, చెత్వెర్తాక్ కంటికి కడివెడుగా ఏడుస్తూండటం చూశాడు, మరో వంక ముఖానికి తుపాకి మందుమసి కొట్టుకొని జిప్సీలా కనిపిస్తున్న కొమెల్కోవా, "పిరికిది!" అని అరుస్తూ, కోపంతో బుసలుకొడుతోంది.

ఆ రభసంతా దేన్ని గురించో అతను గ్రహించాడు.

"సమావేశమే కదూ? దానికేం, భేషుగ్గా అలాగే జరుపుదాం!" తన లోలోపల కోపం పొంగులువారుతూండగా సార్జెంట్ మేజరు మొదలుపెట్టాడు. "ఓ, బ్రహ్మాండంగా వుంటుంది — సమావేశం. అయితే మనం సమావేశం జరపబోతున్నామన్న మాట, జరిపి అందులో కామ్రేడ్ చెత్వెర్తాక్ ప్రవర్తనపైన చర్చ జరిపి, గాభరా పడినందుకుగాను ఆమెను నిరసించి, యీ వ్యవహారమంతటినీ సక్రమంగా మినిట్స్ పుస్తకంలో నమోదుచెయ్యడం — ఇదేనా మీరు కోరుకునేది?"

అతనికి ఏ ఒక్కరూ జవాబు చెప్పలేదు, గాల్యా చెత్వెర్తాక్ సైతం ఏడుపు ఆపి, అతను చెప్పేది వింటోంది.

"అప్పుడు మన తీర్మానానికి జర్మన్లు తమ సవరణలు ప్రతిపాదిస్తారు. అంతే కదా మనకి కావలసింది? అందుకని అలాంటిదేం చెయ్యం, ఔనా? అందుకని, మీ సార్జెంట్ మేజర్నీ, కమ్యూనిస్టునీ అయిన నేను ప్రస్తుతానికి సమావేశాలన్నింటినీ నిషేధిస్తున్నాను. పరిస్థితిని గురించి రిపోర్టిస్తాను: జర్మన్లు అడవిలోకి తిరోగమించారు. గ్రెనేడ్ పేలిన చోట బోలెడంత రక్తం వుంది, అంటే ఎవరో చచ్చారన్న మాట. మొట్టమొదటి సంగతి యిప్పుడిక వాళ్లు పదముగ్గురున్నారని మనం అనుకోవచ్చు. రెండో సంగతేమిటంటే, నా దగ్గర పూర్తి తూటాలదండ ఒకటుంది. మరి నీ దగ్గరేం మిగిలింది ఒస్యానినా?"

"ఒకటిన్నర."

"సరే యిప్పటికి యీ ఘట్టం ముగిసింది. ఇక పోతే, పిరికితనం సంగతి — పిరికి తనమంటూ ఏమీ లేదు. అమ్మాయిలూ, పిరికితనమన్నది రెండో పోరాటంలో మాత్రమే ఉండటం సాధ్యం — మరి మొదటి పోరాటంలో దాన్ని గాభరా అంటారు. కారణం — అనుభవ లోపం. నువ్వు ఒప్పుకుంటావా కామ్రేడ్ చెత్వెర్తాక్?"

"ఊఁ...."

"సరే అలాగైతే, నీ కళ్ళూ, ఓడుతున్న నీ ముక్కూ తుడుచుకొమ్మని నా ఆజ్ఞ. ఒస్యానినా ముందుకెళ్లి అడవిపైన కన్నేసి వుంచాలి. మీలో మిగిలిన వాళ్లంతా తిండి తిని సాధ్యమైనంత విశ్రాంతి తీసుకోవాలి. ఏమన్నా ప్రశ్నలున్నాయా?... ఊఁ త్వరగా కానివ్వండి."

వాళ్ళు మౌనంగా భోజనం చేశారు. సార్జెంట్ మేజరుకి తిండి తినాలని లేదు, అతను కోరుకున్నదల్లా చదికిలబడి, కాళ్ళు పారజాపుకుని విశ్రాంతి తీసుకోవాలని మాత్రమే, అయినా కూడా తనకి శక్తి అవసరం కనుక అతను తదేకంగా నమలసాగాడు. అతని సైనికులు ఒకరి వంక మరొకరు చూసుకోకుండా ఆకలిగా, తమ గట్టి పడుచు పళ్లతో కరకర నమిలి తింటున్నారు. అది కూడా అతనికి సంతోషదాయకమే అయింది — వాళ్ళు కుంగిపోలేదు, ఇంకా గట్టిగానే వున్నారు.

అప్పటికి సూర్యుడు క్షితిజంపైన కిందకు వాలాడు, అడవి అంచు అంతకంతకు నల్లపడసాగిన కొద్దీ సార్జెంట్ మేజరు ఆందోళన అధికమైంది. సహాయం రావడం ఆలస్యమైంది, తెలి సంధ్య వెలుగును జర్మన్లు తనపైన లంఘించి, రెండు సరస్సులకూ మధ్యనున్న పీలిక లాంటి స్థలం గుండా ముందు దూసుకు పోవడానికైనా వినియోగించుకోవచ్చు, లేకుంటే అడవిలోకి అదృశ్యమైపోయేందుకైనా ఉపయోగించుకోవచ్చు: అప్పుడిక చూసుకో వాళ్లని కనిపెట్టడానికి తాతలు దిగిరావలసిందే! వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలంటే తను వెంటనే అన్వేషణ ప్రారంభించాలి, వాళ్ల జాడ తియ్యాలి. తను చెయ్యాల్సిన పని అది, కాని తనలో అందుకు శక్తి మిగిలిలేదు.

వ్యవహారాలు తను కోరుకున్నట్టుగా సాగడం లేదు. తనొక సైనికుని పోగొట్టుకున్నాడు, తనెక్కడున్నదీ జర్మన్లకు వెల్లడిచేసుకున్నాడు. తన బృందానికి విశ్రాంతి అవసరం. మరి తనకు రావలసిన ఆ సహాయం ఏమైనట్టు?

కానైతే, సార్జెంట్ మేజరు తీసుకొన పూనుకొన్న విశ్రాంతి అల్లా ఒస్యానినా భోజనం చేసిన కాసేపు మాత్రమే. తర్వాత అతను లేచాడు, బెల్టు మరింత బిగించుకున్నాడు, దృఢంగా చెప్పాడు: "ప్రైవేట్ చెత్వెర్తాక్ రికన్నాయిటర్ చెయ్యడానికి నాతో బాటు వస్తుంది. ఒస్యానినా నాయకత్వం వహిస్తుంది. మీ కర్తవ్యం తగినంత దూరంలో మా వెంట రావడం. కాల్పులు వినిపించినప్పుడు మీరు దాక్కోండి — అది ఆజ్ఞ. దాక్కుని, మేం వచ్చేదాకా వేచియుండండి. ఒక వేళ మేము రాకపోయినట్లయితే, నిశ్శబ్దంగా, అతి నిశ్శబ్దంగా, మన పాత స్థావరాల గుండా పడమటి దిశగా మన వాళ్లనెవళ్లనేనా కలుసుకునే దాకా వెనక్కి వెళ్లండి — అప్పుడు వాళ్లకి యిక్కడ విషయాలు రిపోర్టుచెయ్యండి."

ఈ మాదిరి సైనిక చర్యకు వెళ్లేటప్పుడు చెత్వెర్తాక్‌ను తనతో తీసుకెళ్లకూడదన్న ఆలోచన అతని మనసులో చూచాయగా మెదిలింది. కొమెల్కోవా యిందుకు సరైన పిల్ల —

ఆమె ఆధారపడదగిన క్రామేడు, ఒక్క రోజులోనే రెండు పరీక్షల్లో ఆమె నెగ్గింది. తాము అటువంటి పరీక్షల్లో నెగ్గామని అరుదైన మగవాళ్లు మాత్రమే చెప్పుకోగల పరీక్షలవి. కాని వాళ్ల సీనియరుగా తను వాళ్లకి కేవలం మిలిటరీ కమాండరుగా వుంటేనే సరిపోదు, వాళ్లకి శిక్షకుడుగా ఉండటం కూడా తన విధి. ఇది కూడా సైనిక నిబంధనలకు అనుగుణమైనదే.

సైనిక నిబంధనలంటే సార్జెంట్ మేజరుకి ఎనలేని గౌరవం. అవన్నీ ఆయనకు కంఠతా వచ్చు. వాటిని అతను తు.చ. తప్పకుండా పాటించాడు. అందుకనే యిప్పుడతను గాల్యాతో చెప్పాడు: ''నువ్వు నీ నాప్‌శాక్‌నూ, ఓవర్‌కోటునూ యిక్కడ వదిలెయ్యాలి. నువ్వు నా అడుగు జాడల్లో వస్తూ నేనేం చేస్తున్నానో వెయ్యి కళ్లతో శ్రద్ధగా పరిశీలించాలి. మరో విషయం. ఏమి జరిగినా సరే నీ నోటమ్మట ఎటువంటి మాట గాని, అరుపు గాని బయటకి రాకూడదు, కన్నీళ్ల సంగతంటావా, వాటిని గురించి నువ్వు పూర్తిగా మరచిపోవాలి.''

చెత్‌వెర్తాక్ బెదురు చూపులతో హడావిడిగా తలూపింది.

11

జర్మన్లు పోరాటాన్నెందుకు తప్పించుకొంటున్నట్లు? సుశిక్షితమైన వాళ్ల చెవులు తమ ప్రత్యర్థుల బలమేమిటో (లేక బలహీనత ఏమిటో) కనిపెట్టి వాళ్లకి చెప్పేవుండాలి, అయినా మరి వాళ్లెందుకు పోరాటాన్ని తప్పించుకొంటున్నట్లు?

ఇవేమీ ఉబుసుపోని ప్రశ్నలు కావు, సార్జెంట్ మేజరు ఈ ప్రశ్నలను పరిష్కరించ పూనుకొనడానికి కేవలం జిజ్ఞాసే కారణం కాదు. పోరాటంలో ఎప్పుడూ నువ్వు నీ శత్రువును అర్థంచేసుకోవాలి. అతని ప్రతి చర్యా, అతని ప్రతి కదలికా నీకు తేటతెల్లంగా తెలియాలి. అతని మనస్సు ఏ విధంగా పనిచేస్తోందో నీకు సుస్పష్టంగా తెలిసినప్పుడే అతని ఆలోచనలను నువ్వు సరిగా అంచనావెయ్యగలుగుతావు. ఎన్ని చెప్పినా చివరకు, యుద్ధమన్నది, ఎవరు ఎవరికన్న ఎక్కువ కాలుస్తారన్న దానిమీద కన్న, వివేచనా శక్తిలో ఎవరు ఎవరిని అధిగమిస్తారన్న దానిమీద ఎక్కువగా ఆధారపడుతుంది. సైనిక నిబంధనలు తయారుచెయ్యబడింది ఎందుకంటే, నిన్ను స్వేచ్ఛగా, ఎంతో ముందుకు, అవతలి పక్షం దాకా — శత్రువు ఆలోచనలను కూడా — ఆలోచించగలిగేలా చేసేందుకు.

కానైతే సార్జెంట్ మేజరు ఘటనలను తన బుర్రలో ఎంత తిరగేసి బోర్లేసి చూసినా కూడా ఒక విషయం మటుకు స్పష్టంగా కనిపిస్తోంది. జర్మన్లకు తన బృందం సంగతి తెలియలేదన్న విషయమే అది. అంటే దీని అర్థం, తను చంపిన ఆ యిద్దరు జర్మన్లూ

అగ్రదళం కాక, స్కౌట్లన్న మాట, ప్రధాన బలగం, తమ స్కౌట్లకు పట్టిన గతి తెలియక వాళ్లని అనుసరించి ఆ దారిలోనే వస్తున్నారన్న మాట. అతను చేరుకున్న నిర్ణయం అదీ, కాని దాన్నుంచి తనకు చేకూరే ప్రత్యేక ప్రయోజనమేమిటో అతనికింకా సుస్పష్టం కాలేదు.

ఆలోచనలతో అతనలా బుర్ర బద్దలుకొట్టుకుంటూనే వున్నాడు. పేకముక్కలు కలిపినట్లు వాస్తవాలను కిందా మీదా కలుపుతూనే వున్నాడు, అయినా కూడా తన మనస్సును ప్రధానాంశం పైనే మగ్నంచేసి వుంచాడు. చుట్టూ సమస్తం కనిపెడుతూ — అక్షరాలా తన చెవులను వెనక్కి విరుచుకోగలిగితే విరుచుకొని వుండేవాడే — అతను దాదాపు నిశ్శబ్దంగా ముందుకు జారుతున్నట్టు సాగిపోయాడు. కాని మందంగా వీస్తున్న గాలి ద్వారా అతనికి శబ్దం గాని, వాసన గాని ఏమీ అందలేదు. సార్జెంట్ మేజరు ఎక్కడా ఆగకుండా ముందుకు పోతూనే వున్నాడు. దుఃఖార్తురాలైన ఆ యువతి అతని వెంట కాళ్లు యీడ్చుకొంటూ వెళ్తోంది. సార్జెంట్ మేజరు తరచుగా వెనక్కి తిరిగి ఆమెవంక చూస్తూనే వున్నాడు, అయితే యిప్పటివరకు అభ్యంతరకరమైనదేమీ అతనికి కనిపించలేదు. ఆమె అతని ఆజ్ఞల్ని పాలిస్తోంది, అతన్ని అనుసరిస్తోంది — కాని అనాసక్తంగా నడుస్తోంది, అనాయాసంగా కాక భారంగా నడుస్తోంది — బహుశా ఆమె తన తలపైగా రివ్వురివ్వున దూసుకుపోయిన గుళ్లను గురించే యింకా ఆలోచిస్తూందేమో.

వాస్తవానికి గాల్యా ఆ కాల్పులను గురించి అప్పుడే మరచిపోయింది. ఇప్పుడామె మనస్సును పట్టి పీడిస్తున్నది — బూడిదవన్నె తిరిగిన సోన్యా ముఖం, కోసువారిన ఆమె కనుముక్కు తీరు, ఆమె మృత, అర్ధనిమీలిత నయనాలు, రక్తంతో అట్టకట్టిన సైనిక కోటు. వీటికి తోడు.... రొమ్ముమీపైన గల — రేజరు బ్లేడుతో గాట్లు పెట్టినట్లున్న సన్నని ఆ రెండు గాయాలు. ఆమె సోన్యాని గురించి గాని మృత్యువుని గురించి గాని ఆలోచించడం లేదు — బాకు స్నాయువుల్లోకి దిగబడి, మనిషి కండను చీలుస్తున్నట్లు ఆమె అనుభూతి చెందుతోంది, గాఢమైన రక్తపు వాసనను పీలుస్తున్నట్లు ఆమె ముక్కుపుటాలు అదురుతున్నాయి. గాల్యా ఎప్పుడూ వాస్తవ ప్రపంచంలోకన్న కల్పిత ప్రపంచంలోనే ఎక్కువగా బతుకుతూవచ్చింది, కాని యిప్పుడామె దీన్నంతనీ మరచిపోవాలనీ, తుడిచిపెట్టెయ్యాలనీ కోరుకుంది, కాని అలా చెయ్యలేకపోయిందామె. ఇది మనస్సును కొరడువారజేసే భీతికి దారి తీసింది, భయంకరమైన యీ మనోభారంతో యిప్పుడిక ఆమె వివేచనా శక్తిని కోల్పోయింది.

సహజంగానే సార్జెంట్ మేజరుకి యిదేమీ తెలియదు. ఏ సైనికురాలితోనైతే తన చావుబ్రదుకులు అత్యంత సన్నిహితంగా ముడివడివున్నాయో ఆమె అప్పటికే చచ్చిపోయిందన్న సంగతిని — జర్మన్లను చేరుకోక ముందే, వాళ్లపైన ఒక్కగానొక్క కాల్పును సైతం కాల్చకముందే చనిపోయిందన్న సంగతిని — అతను గ్రహించలేదు.

సార్జెంట్ మేజరు చెయ్యెత్తాడు: కాలి గుర్తుల జాడలు కుడివేపుకి వున్నాయి. రాతి ప్రదేశాల్లో కనిపించీ కనిపించనట్లు అతి తేలికగా వున్న అడుగుల గుర్తులు, యిక్కడ తడిగా వున్న యీ నాచుపైన నీటితో నిండివున్న కాలిగుర్తులు నల్లగా కనిపిస్తున్నాయి. పెద్ద బరువును దేన్నో మోసుకెళ్తూ, అకస్మాత్తుగా జర్మన్లు యిక్కడ తమ కాళ్ల పట్టును కోల్పోయినట్లుగా, వాళ్ల పాదాల గుర్తులు పెద్దవిగా కనిపిస్తున్నాయి.

"నువ్విక్కడే వుండు" సార్జెంట్ మేజరు గుసగుసగా చెప్పాడు. అతను కుడి పక్కకు, కాలిజాడలకు సమాంతరంగా వెళ్లాడు. అతను పొదల మధ్య వెతికాడు, ఓ చిన్న గోతిలో రెండు శవాలు కనిపించాయి, అవి విరిగిన కొమ్మలతోను, రెమ్మలతోను ఆదరా బాదరా కప్పబడివున్నాయి. అతనా కొమ్మలను జాగ్రత్తగా పక్కకు తొలగించి చూశాడు. అక్కడ రెండు శవాలు బోర్లబొక్కలా పడుకోబెట్టి వున్నాయి. అతను మోకాళ్లపై వంగి, వాటిని పరీక్షగా చూశాడు. పైన వున్న శవానికి మెడవెనక భాగంలో ఓ చిన్న రంధ్రముంది. దాదాపుగా రక్తపుమరకలేమీ లేకుండా అది శుభ్రంగా వుంది, పొట్టిగా కత్తిరింపబడిన అతని జుట్టు కొంచెం మేర కాలి వుంది.

"వీడిని వాళ్ల కాల్చేశారు" అని నిశ్చయించుకున్నాడు సార్జెంట్ మేజరు. "వీడి మనుషులే వీణ్ణి, తల వెనక కాల్చారు. గాయపడ్డాడు కదా, అందుకని వీణ్ణి ఖతంచేశారు — అదీ వాళ్ల నియమం...."

అతను కాండ్రించి, ఎక్కడో కాదు, మృతులమీద — ఘోరమైన పాపమే అయినా కూడా — ఉమ్మేశాడు. కాని వాళ్ల పట్ల అతనికి పరమ రోత తప్ప మరేమీ లేకపోయింది — అతని దృష్టిలో, వాళ్లు నియమబాహ్యులు, మానవత్వపు హద్దులకు వెలియైన వాళ్లు.

ఏదేమైనా చివరకు, తను మానవ మాత్రుడినన్న గ్రహింపు ద్వారానే మానవుడు పశువులనుండి భిన్నంగా పరిగణింపబడుతాడు. ఈ గ్రహింపు పోయిననాడు అతనొక పశువే అవుతాడు; రెండు కాళ్లూ రెండు చేతులూ వున్న పశువు, భయంకరమైన పశువు, క్షుద్రాతి క్షుద్రమైన జంతువే అవుతాడు. అటువంటి ప్రాణి పట్ల మానవానుభూతులు — దయగాని, జాలిగాని — కలిగియుండటం, మనకి సాధ్యం కాదు. అటువంటి వాడిని, తన కలుగులోకి దూరేదాకా తరిమి తరిమి కొట్టాలి; అక్కడ కూడా వాడిని — తను ఒకప్పుడు మానవుడినన్న సంగతిని గుర్తుచేసుకునే దాకా, వాడు ఆ విషయాన్ని అర్థంచేసుకునే దాకా — చావచితక కొట్టాలి.

ఇంతకు కొద్ది గంటల ముందు, పగటిపూట, వస్కొవ్ కోపాతిరేకంతో — రక్తానికి రక్తంతో పగతీర్చుకోవాలన్న తపన వంటి సరళమైన కోపావేశంతో — ఘూర్ణిల్లాడు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ఆవేశమంతా సర్దుకుంది, అంతే కాదు అది పరిణతం కూడా అయింది.

ద్వేషంగా — ఆరని ద్వేషంగా, కానైతే ఉన్మత్తావేశరహితమైన, బుద్ధిపూర్వకమైన ద్వేషంగా అది పరిణతి చెందింది.

"అయితే యిదన్న మాట మీ నియమం?... సరే నేనీ సంగతి గుర్తుంచుకుంటాలే."

అతి ప్రశాంతంగా అతను లెక్కచూశాడు: మరో రెండు తగ్గిస్తే వాళ్ల సంఖ్య పన్నెండుకి తగ్గుతుంది. ఒక్క డజనుమంది వున్నారన్నమాట.

చెత్వెర్తాక్ వేచియున్న చోటుకి అతను తిరిగివచ్చాడు. అతను ఆమె చూపును చూశాడు — అతనిలో అకస్మాత్తుగా ఏదో పగిలినట్లనిపించింది. ఆమె భయభీతురాలైంది. అంతరాంతరాళాల్లో అతి దారుణంగా భయభీతురాలైంది — ఆ బాపతు భీతి జీవితాంతం దాకా కొనసాగినా సాగవచ్చు, అటువంటిదది. ఒక్క త్రుటికాలంలో తను కూడగట్టుకోగలిగిన ఉల్లాసాన్నంతనీ అతను కూడదీసుకున్నాడు; ఆమె సాక్షాత్తూ ప్రేమాస్పదురాలైన తన సొంత ప్రియురాలే అయినట్టు కన్నుకొట్టి అన్నాడు: "మనం వాళ్లలో యిద్దర్ని హత మార్చాం గాల్యా! 14 లోంచి 2 తీసేస్తే యిక కేవలం 12 మిగుల్తుంది. ఏమంత ఫరవా లేదు, ఔనా కామ్రేడ్ ప్రైవేట్. వీళ్లు మనకొక లెఖ్ఖామిటి, ఏమంటావ్!"

ఆమెనుంచి బదులుగా ఒక్క మాట గాని, చివరకు ఒక్క చిరునవ్వు గాని రాలేదు. ఆమె అతని వంక గుడ్లప్పగించి చూసిందంతే. ఆ కళ్లు చూస్తేనే చాలు అతనికి సమస్తం స్పష్టమైపోయింది. అటువంటి సందర్భాల్లో ఎదుట వున్నది మగాడే అయితే, అతను — నోరారా తిట్టడం ద్వారానో, చెవి మెలిపెట్టడం ద్వారానో — తన కోపాన్ని వ్యక్తంచేసేవాడు. వస్కోవ్కి యీ విషయం అనుభవరీత్యా తెలుసు. కాని యీ ఆడపిల్లనేం చెయ్యాలో అతనికి అంతుపట్టలేదు. ఈ మాదిరి అనుభవం అతనికి యింతకు ముందెన్నడూ లేదు, ఈ విషయం పైన అన్ని సైనిక నిబంధనలూ మౌనమే దాల్చాయి.

"నువ్వెప్పుడైనా పావెల్ కొర్చాగిన్ని* గురించి చదివావా?"

చెత్వెర్తాక్ అతని వంక ఎవడో పిచ్చివాడిని చూసినట్లు చూసింది, అయినా తలూపింది, దానితో వస్కోవ్లో కొంత ఆశాభావం రేకెత్తింది.

"అయితే నువ్వాయన్ని గురించి చదివావన్న మాట, భేష్ బాగుంది, కానైతే నేను, నిన్నిప్పుడు నా కళ్ల ముందు చూస్తున్న మాదిరిగానే, ప్రత్యక్షంగా ఆయన్ని చూశాను — తెలుసా. వింటున్నావా, ఒక సారి ఏం జరిగిందంటే, మమ్మల్ని — అదే, సైనిక రాజకీయ శిక్షణలో మంచి మార్కులొచ్చిన మా నాన్ కమిషన్డ్ ఆఫీసర్ల బృందాన్ని, మాస్కోకి తీసుకెళ్లారు. సరే మేమక్కడ లెనిన్ సమాధి మందిరమూ, రకరకాల మహా ప్రాసాదాలూ

---

*నికొలాయ్ ఒస్త్రోవ్స్కీ రచించిన "కాకలుతీరిన యోధులు" అన్న స్వీయకథాత్మకమైన నవలలో నాయకుడు పావెల్ కొర్చాగిన్కి యిది ప్రస్తావన. — సం.

మ్యూజియంలూ చూశాము, పావెల్ కొర్చాగిన్‌ని కూడా కలుసుకున్నాం. పెద్ద పదవిలోనే వున్నాకూడా ఆయన చాలా నిరాడంబరమైన వాడు, సద్హృదయుడు. ఆయన మమ్మల్ని ఆదరంగా ఆహ్వానించి, మాకు టీ యిచ్చి, సైన్యంలో మా పని ఎలాగుందని అడిగాడు....''

''మీరెందుకిలా నన్ను బోల్తా కొట్టించాలని చూస్తున్నారు? ఎందుకో చెప్పండి?'' చెత్‌వెర్తాక్ తాపీగా ప్రశ్నించింది. ''కొర్చాగిన్‌కి పక్షవాతం వచ్చింది. ఆఁ అన్నట్టు, ఆయన కొర్చాగిన్ కూడా కాదు — ఆయన పేరు ఒస్త్రోవ్‌స్కీ. ఆయనకి కళ్లు కూడా కనిపించవు, ఒక్క వేలు కూడా కదపలేడు, మా స్కూల్లో అబ్బాయిలూ, అమ్మాయిలూ ఆయనకి ఉత్తరాలు రాస్తూండేవారు.''

''బహుశా ఆయన ఇంకో కొర్చాగినేమో?...''

వస్కోవ్ ఎంత సిగ్గుపడ్డాడంటే — అతని ముఖంలో రంగులు మారాయి. దోమలు కూడా — సాయంత్రం పూట స్వైరవిహారానికి బయల్దేరే ఒక ప్రత్యేక తరహా దోమలు కూడా — తెలివిమీరిపోతున్నాయి. ''సరే సరే, బహుశా నాదే పొరపాటేమో — నాకు తెలియదు. వాళ్లలా అనేవారు మరి....''

వాళ్ల ముందెక్కడో గాని ఓ పుల్ల విరిగింది. అది బరువైన బూటు కాలికింద స్పష్టంగా ఠపుక్కున విరిగింది. ఆ శబ్దం వినిపించడం వస్కోవ్‌కి దాదాపు సంతోష కారణమైంది. తన చొరవతో తను అబద్ధమాడాల్సివచ్చే పరిస్థితిలో — అతను తననెన్నడూ పెట్టుకోలేదు. తన జూనియర్ల దగ్గర అతను తననెన్నడూ హాస్యాస్పదుణ్ణి చేసుకోలేదు. దానితో యిప్పుడతనికి యీ చీమిడిముక్కు అమ్మాయి ఎత్తిపొడుపులు పడేదానికన్న ఓ డజను జర్మన్లను ఒంటరిగా ముఖాముఖీన ఎదుర్కోవడం నయమనిపించింది. ''పొదల్లోకి పో!...'' అతను గుసగుసగా చెప్పాడు. ''కిక్కురుమనకు!''

ఆమెను ఓ పొదలోకి నెట్టి, కొమ్మలను సర్ది, దగ్గర్లో వున్న ఓ బండ వెనక దాక్కోడానికి అతనికి కటాకటీగా వ్యవధి సరిపోయింది — ఒక్క క్షణం ఆలస్యమైనా పరిస్థితి విషమించేదే. అతను తలెత్తి చూసే సరికి యీ సారి కూడా యిద్దరు జర్మన్లు అతనికి కనిపించారు. కాని వీళ్లు అతి జాగ్రత్తగా నిప్పులమీద నడిచినట్లు, సబ్‌మెషీన్ గన్లను సిద్ధంగా పట్టుకొని, నడుస్తున్నారు. జర్మన్లింకా యిలా ఒంటరి జంటలుగా ఎందుకెళ్తున్నా రబ్బా అని సార్జెంట్ మేజరు ఆశ్చర్యపడ నారంభించాడో లేదో, యింతలోనే వీళ్లిద్దరికీ వెనక తట్టున ఎడమ పక్క పొదలు కదిలాయి. దానితో, జర్మన్లు రెండు పక్కలా పరిశీలక బృందాలను పెట్టారన్న సంగతీ, ఆ ఆకస్మిక ముఖాముఖీ పోరాటంతోనూ, తను స్కౌట్లు ఐపూ పత్తా లేకుండా పోవడంతోనూ వాళ్లు కంగుతిని గందరగోళంలో పడ్డారన్న సంగతీ అతనికి అర్థమైపోయింది.

అయితే తను వాళ్లని చూశాడు గాని, వాళ్లు తనని చూడలేదు — మరి అదే అతని తురుపు ముక్క అయింది. అతనికి ఉన్న తురుపు ముక్క అదొక్కటేనన్న విషయం నిజమే, కానైతే తను దెబ్బతియ్యాలని నిర్ణయించుకున్నప్పుడు, అది దాన్ని మరింత ఫలవంతం చేస్తుంది. కాని యిటువంటి క్షణంలో తొందరపడాల్సిన అవసరం లేదు, అందుకని వస్కోవ్, చెమట పట్టిన తన నుదుటిపై ముసురుతున్న దోమలను అదిలించడానికి సైతం భయ పడుతూ, తనను తాను మరింతగా నాచులోకి అణుచుకున్నాడు. వాళ్లని తమ వీపుల్ని తన వైపుకి తిప్పనీ, వాళ్లు ఏ దిశలో వెతుకుతున్నదీ వాళ్లని చూపనీ, అప్పుడు తను తన ఆట ప్రారంభించి తన తురుపు ముక్కని — ఆసుని — ప్రయోగిస్తాడు.

ప్రమాదంలో ఉన్న మనిషి అసలు బొత్తిగా ఆలోచించకుండానైనా వుంటాడు, లేక ఏకకాలంలో యిద్దరు మనుషులు ఆలోచించినట్లయినా ఆలోచిస్తాడు. అందులో ఒకడు తదు పరి ఎత్తును గురించి పథకం వేస్తూండగా, రెండో వాడు ఆ వాస్తవిక క్షణం గురించి — అతను అన్నీ చూస్తూవుంటాడు కనుకా, అతని దృష్టినుంచి ఏ ఒక్కటీ తప్పుకుపోలేదు కనుకా — జాగ్రత్త తీసుకుంటాడు. వస్కోవ్ ఒకవంక తన పేక ముక్కలను గురించీ, ఆసును గురించీ ఆలోచిస్తూనే, జర్మన్లనుంచి ఒక్క క్షణం కూడా తన దృష్టిని మళ్లించలేదు, ఒక్క క్షణం కూడా చెత్వెర్తాక్‌ని మరచిపోనూ లేదు. ఆఁ, ఆమెను తను కనిపించకుండా బాగానే దాచాడు, ఆ విషయంలో అతనికి ఆందోళనేమీ లేదు, జర్మన్లు కూడా ఆమెకు బాగా దూరంనుంచే పోతున్నట్టున్నారు, కాగా అటు పక్కనుంచి అననుకూలమైనదేదీ సంభవించ జాలదు. జర్మన్లు ఆ ప్రాంతాన్ని విభాగాలుగా విడదీసి, స్థల పరిశీలన జరుపుతున్నట్టుంది, వస్కోవూ, చెత్వెర్తాకూ — రెండు వేర్వేరు విభాగాల్లోనే అయినా — ఒక్కొక్క విభాగానికి మధ్య ఉన్నట్టున్నారు — అంటే, నిశ్శబ్దంగా, చివరకు ఊపిరి సైతం తీసుకోకుండా, నాచు లోనూ, పొదల్లోనూ కలిసిపోయి తాము అదును కోసం వేచియుండాలన్న మాట — అటు తర్వాత చర్యకు దిగాలి. తామిద్దరూ ఒక చోటకి చేరుకోవాలి, లక్ష్యాలను నిర్ణయించుకోవాలి, అప్పుడిక చూసుకో తమ ఒక్క సోవియట్ రైఫిలుతోనూ, జర్మన్ సబ్‌మెషీన్ గన్నుతోనూ నిప్పులు కురిపించాలి.

జర్మన్లు మళ్లీ అదే త్రోవవెంట వెళ్తున్నట్టుంది. కొంచెం ముందువెనుకల్లో వాళ్లకు ఒస్యానినా కొమెల్కోవాలు తటస్థపడక తప్పదు. అది సార్జెంట్ మేజరు ఆదుర్దాకి కారణ మైంది, కాని ఆ విషయంలో అతను మరీ ఎక్కువ ఆదుర్దా చెందలేదు. ఆ యువతులిద్దరూ అంతకు ముందే శత్రు కాల్పుల అగ్నిపరీక్షకు తబ్బిబ్బుపడకుండా తట్టుకున్నారు, వాళ్లు దాక్కొని నిశ్శబ్దంగానైనా ఉండగలరు, లేకుంటే ఎక్కడికైనా తిరోగమించనైనా తిరోగమించ గలరు. దీనికి తోడు, జర్మన్లు తనను దాటి వెళ్లి, రెండు కాల్పుల మధ్య యిరుక్కునే పద్ధతిలో కాల్పులు ప్రారంభిద్దామని అతను పథకం వేసుకుంటున్నాడు.

జర్మన్లు చెత్‌వెర్తాక్ దాక్కున్న పొదను దాటి, దానికి కుడి పక్కగా యిరవై మీటర్ల ముందున్న తిన్నని ఖాళీ జాగాలోకి వచ్చారు. వాళ్ల పరిశీలక సైనికులు, వాళ్లకి యిరు పార్శ్వాల్లోనూ, కొంత దూరాన, — తమ ఉనికిని తెలియరానీకుండా — వాళ్ల వెంట వస్తున్నారు. కాని, వాళ్లు ఏ పక్కగా వెళ్లేదీ వస్కోవ్‌కి తెలుసు. వాళ్లలో ఎవరూ తన దగ్గరకు గాని, గాల్యా దగ్గరకు గాని వస్తారని అతను అనుకోలేదు; కాని ఎందుకైనా మంచిదని సేఫ్టీ కాచ్‌ని తీసి, తన సబ్‌మెషీన్ గన్నును సిద్ధంగా ఉంచుకున్నాడు.

జర్మన్లు సబ్‌మెషీన్ గన్నులను సిద్ధంగా పట్టుకొని నిశ్శబ్దంగా, వంగుని, నడుస్తున్నారు. ఇరు పార్శ్వాల్లోనూ తమ పరిశీలక బృందాల రక్షణలో, కుడికి గాని ఎడమకి గాని దాదాపు చూడకుండా వాళ్లు ముందుకి వస్తున్నారు. ఇబ్బంది అంటూ వస్తే, అది ముందు నుంచి వస్తుంది. అయితే మరి కొద్ది అడుగుల్లో వాళ్లు చెత్‌వెర్తాక్, వస్కోవ్‌ల కాల్పుల పరిధిలోకి చేరుకుంటారు. అదిగో అప్పటినుంచి యిక వాళ్లు సార్జెంట్ మేజరు వేట గురికి అనువుగా వస్తారు.

పొద కొమ్మలను విసవిసా కదుపుతూ గాల్యా చెత్‌వెర్తాక్ పొదలోంచి ఆకస్మికంగా దూసుకొచ్చింది. నిటూరుగా నిలబడి, తన చేతులను నిరాశగా పైకెత్తి, జర్మన్ల ముందుకు బయలు స్థలంలోకి పరిగెత్తింది. తనేం చేస్తున్నదీ తనకే తెలియకుండా "ఆ–ఆ–ఆ–ఆ–ఆ!" అని అరిచిందామె.

సరిగా పదే పది అడుగుల అవతల వున్న సబ్‌మెషీన్ గన్నునుంచి క్లుప్తంగా నిప్పులు కురిశాయి. గుళ్లు, పరుగు మూలంగా బిగువెక్కిన రివటలాంటి ఆమె నడుముకి తాకాయి, గాల్యా బొక్కబోర్లా నేలమీద పడిపోయింది. కేవలం భీతాహం మూలంగా ఆమె చేతులింకా నెత్తి పైకి లేచే వున్నాయి. ఆమె తుది అరుపు చావుగురకలో ముగిసింది. ఇంకా పరిగెత్తుతూనే వున్న ఆమె కాళ్లు, చనిపోయిన సోన్యా బూట్ల కొసలతో నాచుని తన్నుతూ, పొడుస్తూనే వున్నాయి.

బయలు స్థలంలో అంతా నిస్తబ్ధమైపోయింది. క్షణకాలం ఎక్కడా ఏ కదిలికా లేదు. చివరకు గాల్యా కాళ్లు సైతం అంతకంతకు నెమ్మది నెమ్మదిగా, కలలో మాదిరిగా కదులుతున్నాయి. వస్కోవ్ కూడా తన బండ వెనక పడుకునే ఉండిపోయాడు. అతను కదల్లేదు, మెదల్లేదు. తన సమస్త పథకాలూ మట్టికొట్టుకుపోయినట్లూ, తన తురుపు ముక్కను కాస్తా పోగొట్టుకున్నట్లూ గ్రహించడానికి అతనికింకా తగిన వ్యవధి చిక్కలేదు. అతను అదే భంగిమలో ఎంత సేపుండునో, లేక అతను తర్వాత ఏమి చేసియుండునో చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు; కాని అకస్మాత్తుగా అతని వెనక పక్కనుంచి, దోవలో అన్నింటినీ విరగదొక్కుకుంటూ పరిగెత్తుకొస్తున్న పాదాల భయంకర శబ్దం వినరావడంతో, కుడితట్టున వున్న జర్మన్ పరిశీలక బృందం కాల్పులను విని అక్కడికి వస్తున్నదనీ, నేరుగా తనవంకకే వస్తున్నదనీ అతను గ్రహించాడు.

ఇప్పుడిక పథకం వేసుకుంటూ కూర్చునేందుకు వ్యవధి లేదు, జర్మన్లను దారి మళ్లించడమే తన ప్రధాన కర్తవ్యమని వస్కోవ్‌కు తెలుసు. తను వాళ్లని మరో చోటికి మళ్లించాలి, మిగిలిన తన సైనిక యువతులనుంచి వాళ్లని మరో పక్కకి ఆకర్షించాలి. ఈ నిర్ణయానికి రాగానే అతను తటాలున లేచినిలబడి గాల్యా శరీరంపై వంగివున్న యిద్దరు జర్మన్ల పైనా బహిరంగంగా కాల్చాడు. పొదల వెనక పరిగెత్తుకొస్తున్న వ్యక్తిపైన వరుసగా కొన్ని కాల్పులు కాల్చాడు, తర్వాత నేలబారుగా వంగి, సిన్యూహినా కొండలబారునుంచి అడవి దిశగా పరుగెత్తాడు.

తన కాల్పులు ఎవరికైనా తగిలాయా అని అతను వేచి చూడలేదు; అతని మనస్సును యితర విషయాలు వేధిస్తున్నాయి. జర్మన్ల శ్రేణిని తను చీల్చుకుని సురక్షితంగా అడవిని చేరుకోవాలి, తన సైనిక యువతులను కాపాడాలి. తన సైనిక యువతుల్లో చిట్టచివరి యిద్దర్నీ కాపాడటం — పురుషునిగానూ, వాళ్ల కమాండరుగానూ — తన విధి. మిగిలిన వాళ్లు చచ్చిపోయారు, అది చాలు, చాలడమేమిటి కొల్లలు, ఒక జీవిత కాలానికి కోకొల్లలు.

సార్జెంట్ మేజరు ఆ సాయంత్రం పరిగెత్తినంతగా పరిగెత్తి చాలా కాలమైపోయింది. అతను పొదల మధ్యగా దూసుకుపోయాడు, మధ్యమధ్య బండల వెనకకు తప్పుకుంటూ వచ్చాడు, అతను పడుతూ, లేస్తూ మళ్లీ పరిగెత్తాడు, తన తలపైగా ఆకుల్ని చీల్చుకుంటూ వస్తున్న గుళ్లనుంచి తప్పుకునేందుకు బోర్లాపడుకున్నాడు. తన వంతుకి తాను కదులుతున్న జర్మన్ ఆకృతులపైన తన సబ్‌మెషీన్ గన్‌తో ఉండిఉండి కొద్దిసేపు కాలుస్తున్నాడు, ఇతరత్రా అతను బోలెడంత శబ్దం చేస్తున్నాడు. జర్మన్లను తన వైపుకి ఆకర్షించకుండా తిరోగమించే హక్కు తనకు లేదు కనుక అతను ఎండు కొమ్మలను తొక్కుకుంటూ దబదబ అంగలేస్తూ, గొంతు బొంగురుపోయేదాకా అరిచాడు. మరి తనీ ఆట ఆడాలి — నిప్పుతో చెలగాటమాడాలి.

కానైతే అతను ఒక విషయంలో మాత్రం ప్రశాంతంగా ఉన్నాడు, జర్మన్లు తనను చుట్టుముట్టి పట్టుకోలేరు — అన్నంతవరకు అతనికి ధీమా వుంది. వాళ్లకీ ప్రాంతం పరిచితమైనది కాదు, ఇప్పుడిక వాళ్లు చాలా తక్కువ మంది వున్నారు, పైగా వాళ్లకి ఆ ఆకస్మిక ఘర్షణ — ముఖాముఖీ పోరాటం — విషయమింకా బాగా గుర్తుంది. అందుకనే ఒక వంక తనని తరుముతున్నా వాళ్లు చుట్టూ పరకాయించి చూడటం మరచిపోలేదు. వాళ్లే కనుక అలా దిక్కులు చూడకుండా వుంటే, జర్మన్లను తను అలా వేధించుతున్నందుకు, వాళ్లు అలా ఉన్మత్తమూ, ప్రయోజన రహితమూ అయిన వేటాడవలసివచ్చేలా చేసి వాళ్లను తను క్రుద్ధులను చేస్తున్నందుకు, వాళ్లని ఆగి ఆలోచించుకోవడానికి, కచ్చితంగా చెప్పాలంటే తాము వ్యవహరిస్తున్నది ఒక్క ప్రత్యర్థితోనే అని.... కేవలం ఒకే ఒక్క ప్రత్యర్థి

తోనేనని.... గ్రహించే వ్యవధిని వాళ్ళకివ్వని తను వాళ్లనుండి ఎన్నడూ తప్పించుకోగలిగియుండే వాడు కాదు.

పొగమంచు కూడా అతనికి సహాయపడింది; ఆ ఏడాది వసంతకాలంలో పొగమంచు మేఘాలు దండిగా వున్నాయి. సూర్యుడటు క్షితిజం వెనుక మరుగయ్యాడో లేదో యిటు పల్లపు ప్రాంతాలన్నీ పొగమంచుతో నిండిపోయాయి; అది తెరలుతెరలుగా లేస్తోంది, పొదలను పట్టుకుని వుంది. దట్టమైన తెల్లని మంచు మేఘాల వెనక కేవలం ఒక్క మనిషే కాదు ఓ పెద్ద సైన్యం సైన్యమే దాక్కోవచ్చు. వస్కోవ్ ఏ క్షణాన అయినా పొగమేఘంలోకి దూసుకు పోగలడు — అప్పుడిక తనని పట్టుకోడానికి వాళ్ల తాతలు దిగిరావలసిందే! కానైతే వచ్చిన చిక్కేమిటంటే, తను జర్మన్లను అడవి దిశగా ఆకర్షిస్తూంటే, అందుకు భిన్నంగా నాలుకల్లా సాగిన ఆ పొగమంచు మేఘాలు బిరబిరా సరస్సు వేపు సాగిపోతున్నాయి; అందుకని ప్రమాదం మరీ పీకల మీదకి ముంచుకొచ్చినప్పుడు మాత్రమే అతను వాటి శరణు పొందుతున్నాడు. అటు తర్వాత, జర్మన్లను "ఏమ్రోయ్, మీరెలా వున్నారు? నా మటుకు నేనిక్కడ సజీవంగా సలక్షణంగా వున్నాను...." అని పలకరించడానికన్నట్లు, అతను మళ్లీ వాటిలోంచి పైకొస్తున్నాడు.

అతను అదృష్టవంతుడని వేరే చెప్పనక్కర్లేదు. అనేక సందర్భాల్లో యింతకన్న తక్కువ కాల్పుల్లోనే మనిషి ఒళ్ళు జల్లెడలా తూట్లు పడుతుంది. అతను నిస్సంశయంగా అదృష్టవంతుడే. మొత్తం జర్మన్ల గుంపు గుంపొకటి తనను వెంట తరుముకువస్తూం డగా, చాల సేపు తన సొంత మృత్యువుతో తను దాగుడుమూత లాడుతూ చిట్టచివరకు అతను అడవిని చేరుకునే సరికి, అక్కడ ఆతని సబ్ మెషీన్ గన్ చిట్టచివరి సారిగా క్లిక్కుమని మౌనం వహించింది. దాన్ని తిరిగి నింపేందుకు అతని దగ్గర ఏమీ లేదు, కాగా యిప్పుడదొక వృథా బరువు కింద తయారైంది, అందుకని దాన్ని అతను గాలికి కూలిన ఎండు కొమ్మల గుట్ట క్రిందకి నెట్టి నిరాయుధంగా తన తిరోగమనాన్ని కొనసాగించాడు.

ఇక్కడ పొగమంచు లేదు. గుళ్ళు చెట్ల మొదళ్లకు తాకి జల్లుల్లా చెట్ల పేళ్లను రాలగొడుతున్నాయి. జర్మన్లకు దూరంగా వెళ్లడానికి తనకు యిదే అదను. ఇప్పుడిక తన స్వీయరక్షణ విషయం ఆలోచించుకోవలసిన సమయం వచ్చింది. కాని జర్మన్లు ఉన్మత్తావేశంలో చిక్కుకొని, చివరకు అతన్నో అర్ధ వలయంలో యిరికించుకోవడంలో, సఫలుర య్యారు. అతడిని సజీవుడుగా పట్టుకోవాలన్న ఆశతో, ఊబి వంకకు తరుముతున్నారనడం స్పష్టం — అతనికి ఊపిరితీసుకోడానికి ఎడమియ్యకుండా కమ్ముకొంటూ వస్తున్నారు. సార్జెంట్ మేజర్ కనుక వాళ్ల కమాండరు అయివుంటే, యిటువంటి ఖైదీని సజీవంగా పట్టుకొని అప్పగిస్తే పిడికిళ్ల కొద్దీ మెడల్సు యిస్తానని వాళ్ళకి వాగ్దానం చేసియుండేవాడు — చివరకు వాళ్ళు అటువంటి స్థితికి చేరుకున్నారు.

ఆ ఆలోచన అతని మనసులోకి రాగానే, వాళ్ళు నూటికి తొంభై వంతులు తనను కాల్చరని అతను అనుకొనగానే అతని మనస్సుకి ఒక రకమైన ఊరట కలిగింది, కాని అదే క్షణంలో అతని చేతికి, మోచేతికిందనున్న మెత్తని కండ భాగానికి ఏదో తగిలింది, ఏమిటబ్బా యిది అని అబ్బురపడుతూ, బహుశా తన చెయ్యి వాడిగా వున్న ఏ కొమ్మకో తాకి వుంటుందని అతను తీర్మానించుకున్నాడు. అప్పుడు అకస్మాత్తుగా వెచ్చనిదేదో తన మణికట్టు మీదుగా క్రిందకి కారుతున్నట్లు అతను అనుభూతి చెందాడు. అది మరీ ఏమంత ఎక్కువ రక్తం కాదు: గుండు కేవలం రక్తనాళాన్ని తాకింది, కాని యిప్పుడిక తన చేతిమీద తగిలిన యీ గాయంతో తను పోరాటమేం చెయ్యగలడు? ఇప్పుడు తనకి అవసరమైనదేమిటంటే చుట్టూ కలియజూసి పరిస్థితిని అంచనావేసుకోవడం, గాయానికి కట్టు కట్టుకోవడం, కాస్త విశ్రాంతి తీసుకోవడం. తను జర్మన్ వలయాన్ని చీల్చుకొని పోవడం గాని, వాళ్లకి చిక్కకుండా దూరంగా పారిపోవడం గాని సాధ్యం కాదు. ఇక మిగిలిన మార్గమల్లా నేరుగా ఊబి వేపుకి వెళ్లడమే.

అప్పుడిక తనలో వున్న యావచ్ఛక్తినీ అతను ఆ పలాయనానికి ఉన్ముఖంచేశాడు. అతను ఆకస్మికంగా ఊబికి కొండ గుర్తు అయిన పైన్ చెట్టును జేరుకునే సరికి అతని గుండె గొంతుకలో ధన్‌ధన్‌మని కొట్టుకుంటోంది. అతనొక పెర్చిని తీసుకున్నాడు – అదే క్షణంలో యింకా అక్కడ అయిదున్నాయని – దాని ప్రాముఖ్యాన్ని గుర్తించకపోయినా – గమనించాడు. జర్మన్ల పద ఘట్టనలతో అడవి దద్దరిల్లుతోంది, జర్మన్ల స్వరాలతో ఖంగున మోగుతోంది, జర్మన్ గుళ్లతో సంయ్‌సంయ్‌న రాగాలు తీస్తోంది.

అటు తర్వాత తనెలా ఊబిని దాటి లంకను చేరుకున్నదీ అతనికి గుర్తు లేదు. మెలి తిరిగిన పైన్ చెట్ల కింద మాత్రమే అతనికి స్పృహ వచ్చింది. అతన్ని స్పృహలోకి తెచ్చినది దారుణమైన చలి: అతను గజగజ వణికిపోతున్నాడు, అతని పళ్లు కటకట లాడుతున్నాయి. నెమ్మదిగా అతనికి తన చెయ్యి సన్నగా బాధపెడుతున్నట్లు అనుభూతమైంది. ఏమిటిది, తడే?

తనక్కడ అలాగ ఎంత సేపు పడివున్నదీ ఫెదోత్ వస్కోవ్ తర్వాత గుర్తుచేసుకోలేకపోయాడు. కానైతే, చాల సేపే తను అక్కడ వుండివుంటానని అతను లెక్కవేసుకున్నాడు: ఎందుకంటే యిప్పుడు తన చుట్టూ ప్రగాఢ నిశ్శబ్దం ఆవరించివుంది: జర్మన్లు తమ తరుములాటను విరమించుకొని వుండాలి. ప్రత్యూష సమయం దగ్గరపడే కొద్దీ పొగమంచు నేలకు మరింత సన్నిహితంగా సర్దుకుంది. దాని తేమ వస్కోవ్ ఎముకల్ని కొరికేస్తోంది.

అతని గాయంనుండి యిప్పుడిక రక్తం కారడం లేదు. అతని చెయ్యి భుజం దాకా బురదతో నిండివుంది. గాయంలో బురద గడ్డకట్టి వుంటుందనడం స్పష్టం. సార్జెంట్

మేజరు ఆ బురదను తియ్యాలనుకోలేదు. అదృష్టవశాత్తూ జేబులో బ్యాండేజి గుడ్డ దొర కడంతో, ఆ బురదపైన అలాగే కట్టు కట్టేశాడు, అప్పుడిక చుట్టూ కలియజూశాడు.

అడవికి వెనుక తెలతెలవారుతోంది. ఊబికి పైన ఆకాశం వేడిగా ఎర్రబారుతూ పొగ మంచును నేలకు మరింత దగ్గరగా అణుస్తోంది. కాని యిక్కడ, గుంటగా వున్న యీ ప్రాంతం అడుగున హిమశీతలమైన తెల్లని పొగమంచుచేత ఆవరింపబడియున్న ఫెదోత్ వస్కోవ్ చలితో గజగజలాడుతూ, అస్తారపదంగా దాచుకున్న తన సారాఫ్లాస్కు కోసం తపిస్తు న్నాడు. కదలిక మాత్రమే ఇప్పుడతన్ని కాపాడగలిగేది, అందుకని అతను ఒళ్లంతా చెమ టలు పట్టేదాకా అటూయిటూ గంతులేశాడు. అప్పటికి పొగమంచు పలచబడింది, ఇప్పుడ తను చుట్టూ పరీక్షగా చూడగలడు.

జర్మన్లనుండి ప్రమాద సూచనేమీ లేదు. వాళ్లు తన కోసం మాటేసి వేచిచూస్తూ వుండవచ్చు కాని అందుకు అంత ఎక్కువ అవకాశం లేదు. వాళ్లు ఊబిని అధిగమింపరాని దిగా పరిగణించియుంటారు, అందుకని సార్జెంట్ మేజరు వస్కోవ్ చనిపోయివుంటాడని వదిలేసివుంటారు.

ఇక పోతే రెండవది స్టేషనుకి తీసుకెళ్లే దిశ, నేరుగా మరీయా నికీఫొరొవ్నా దగ్గరకు తీసు కెళ్లే త్రోవ. ఫెదోత్ దీని పట్ల అంత ఎక్కువ శ్రద్ధ చూపలేదు. ఆ దిశ ప్రమాద రహితమైనది; ఆ దిశ జీవితానికి హామీ కల్పించేది; ఓ అరలోటాడు సారా, పంది మాంసపు ముక్కలతో బాటు కోడిగుడ్ల వేపుడూ, అభ్యంతరం చెప్పని గృహయజమానురాలూ ఉండే దిశ, అబ్బే, తను అటు పక్కకి చూడకూడదు, తను ఆకర్షణకి లొంగిపోకూడదు. కాని, సహాయం, అక్కడనుంచి తను వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న సహాయం యింతదాకా రాలేదు, అందుకనే అతను మధ్యమధ్య ఒక చూపు అటు సారిస్తున్నాడు.

అక్కడేమిటో గాని నల్లగా వుంది, ఆ నల్లని మచ్చ సార్జెంట్ మేజర్ మనస్సును మధనపరుస్తోంది. అక్కడికి వెళ్లి, అదేమిటో చూడాలని, కేవలం అదేమిటో చూడాలని మాత్రమే, అతనికి గాఢంగా అనిపించిన క్షణం ఒకటుంది. కాని చలిబారినుంచి తప్పించుకు నేందుకు గంతులు వేసిన కారణంగా అతను బాగా డస్సిపోయాడేమో విశ్రాంతి తీసుకోవా లని నిర్ణయించుకున్నాడు. అతను విశ్రాంతి తీసుకొని లేచేసరికి వెలుతురు తగినంతగా ఉండటంతో ఊబిలో ఆ నల్లని మచ్చ ఏమిటో అతనికి బోధపడింది. అదే క్షణంలో పైన్ చెట్టు దగ్గర అయిదు పెర్చిలూ అట్టే ఉండటానికి గల ప్రాముఖ్యం అతని మనస్సులో చటుక్కున మెరిసింది. అక్కడ అయిదున్నాయి, అంటే ప్రైవేట్ బ్రీచ్కినా యీ దరిద్రపు ఊబి గుంటలోకి పెర్చి ఊతం లేకుండా దిగిందన్నమాట.

ఇప్పుడిక ఆమె పైనిక స్కర్టు మాత్రమే మిగిలింది. మరేమీ — సహాయం రావచ్చు నన్న తన ఆశ సైతం — యిప్పుడిక మిగల్లేదు.

12

... దానితో, అప్పుడే అడవినుంచి బయటికొస్తున్న జర్మన్లను తను లెక్కపెట్టిన ఉదయం అతనికి జ్ఞాపకం వచ్చింది. తన ఎడమ చెవిలో సోన్యా గూర్విచ్ గుసగుసగా మాట్లాడటం, లీజా బ్రీచ్కినా కళ్లు చక్రాల్లా విప్పార్చుకు చూడటం, ఒక పాదానికి బర్చి బెరడు పాదరక్ష వున్న గాల్యా చెత్‌వెర్తాక్‌లు అతనికి గుర్తువచ్చాయి. అతను వాటన్నింటినీ గుర్తుచేసుకుని పైకి బిగ్గరగా అనుకున్నాడు: "అయితే బ్రీచ్కినా స్టేషనుకి చేరుకోనే లేదన్న మాట...."

చలిదెబ్బ తిని బొంగురువారిన అతని స్వరం ఊబి పైగా మందంగా ప్రసరించి క్రమంగా గాలిలో కలిసిపోవడంతో మళ్లీ యథాప్రకారంగా నిశ్శబ్దం ఆవరించింది. ఈ దౌర్భాగ్యపు ప్రాంతంలో దోమలు సైతం కూనిరాగాలు తియ్యకుండా నిశ్శబ్దంగానే కుడుతున్నాయి. సార్జెంట్ మేజరు దీర్ఘంగా నిట్టూర్చి బురద గుంటలోకి నిబ్బరంగా అడుగేశాడు. అతను తన పెర్చిపైన ఆనుకొని, కొమెల్కోవా, ఒస్యానినాలను గురించే ఆలోచిస్తూ, వాళ్లు బ్రతికివుండాలని ప్రార్థించుకుంటూనే ఎదటి గట్టు దిశగా బురద నెట్టుకుంటూ వెళ్లాడు. ఇప్పుడిక తనకున్న ఏకైక ఆయుధమైన తన బెల్టులోని పిస్తోలును గురించి కూడా అతను ఆలోచించాడు.

జర్మన్లే కనుక యిక్కడ ఒక్కగానొక్క సైనికుణ్ణి వదిలినా కూడా సార్జెంట్ మేజరు శాశ్వతంగా — తన శరీరం కుళ్లిపోయే దాకా తన ముఖం బురదలో కూరుకుపోయి — యిక్కడే ఉండిపోయేవాడు. తను రొమ్ము విరుచుకుని ఒడ్డు వంకకి నేరుగా వచ్చాడు, తను ముందుకి బోర్లా పడుకునేందుకిక్కడ గట్టి నేల లేదు, అందుకని వాళ్లు ఎంత దూరాన్నుంచి అయినా కూడా తనని అవలీలగా కాల్చెయ్యగలిగేవారు. కాని జర్మన్లు అక్కడ ఎవరినీ అట్టేపెట్టలేదు, దానితో, ఫెదోత్ వస్కోవ్ పరిచితమైన నది దగ్గరకు ఎటువంటి యిబ్బందీ లేకుండా చేరుకున్నాడు. అతను మొత్తంమీద ఎలాగో ఒకలాగ తంటాలుపడి తన ఒళ్లు కడుక్కుని, తృప్తిదీర మంచినీళ్లు తాగాడు. తర్వాత అతను గాలించి, తన లోపలి జేబులో ఒక కాగితపు ముక్క దొరికితే దానిలో ఎండు నాచు వేసుకుని సిగరెట్టు చుట్టుకొని, తన సిగరెట్ లైటరుతో దాన్ని అంటించుకొని కాల్చనారంభించాడు. అప్పుడిక అతను కొంచెం ఆలోచించడానికి పూనుకున్నాడు.

తను శత్రు బలగంలో నాలుగో వంతుని మట్టుబెట్టినా కూడా, తన యీ సొంత యుద్ధంలో తను అంత క్రితం రోజుననే ఓటమి పాలైనట్లు కనిపిస్తోంది. తను జర్మన్లను నిలవరించడంలో విఫలుడయ్యాడు, తన బలగంలో సరిగా సగానికి సగం కోల్పోయాడు, తనకున్న మందుగుండు సామగ్రినంతనీ వృథాచేశాడు, ఇప్పుడిక తనకున్నదల్లా ఒక్క పిస్తోలు

మాత్రమే. ఈ కారణాలన్నింటి మూలంగా పరిస్థితిని ఎటు తిరగేసి చూసినా, దాన్ని ఏ దృష్ట్యా చూసినా కూడా తనీ యుద్ధంలో పైచెయ్యి పోగొట్టుకున్నాడు. అన్నిటికన్న దౌర్భాగ్య కరమైన విషయమేమిటంటే, తనిప్పుడు జర్మన్ల కోసం ఏ దిశలో వెతకాలో తనకి తెలి యకపోవడం.

ఆకలి మూలంగానో, లేక కంపుకొట్టే సిగరెట్టు మూలంగానో, లేక బహుశా తన ఒంటరితనం, దిగులుతో కూడిన, తన బుర్రలో కందిరీగల్లా ముసురుకొంటున్న ఆలో చనల మూలంగానో వస్కోవ్‌లో అసహ్యభావం చోటుచేసుకుంది. ఔను, ఆ ఆలోచనలు కందిరీగల్లాగే ముసురుకొంటున్నాయి, అవి కాటేస్తున్నాయే గాని తేనెను తెచ్చిందేమీ లేదు....

తన దళంలో మిగిలివున్న సైనికులను తను కలుసుకునేందుకు ప్రయత్నించాలని వేరే చెప్పనక్కర్లేదు. మిగిలిందల్లా కేవలం ఇద్దరే యువతులు, అయితేనేం వాళ్ళిద్దరూ మెరికల్లాంటి వాళ్ళు. తాము ముగ్గురూ కలిస్తే దిట్టమైన బలగమే — కాని, నిరాయుధ బలగం — అవుతారు. అంటే, కమాండరుగా తను రెండు సమస్యలకు సమాధానాలు సమ కూర్చాలన్న మాట: ఏం చెయ్యాలి? ఏ ఆయుధాలతో పోరాటం జరపాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు పొందాలంటే తనకు ఒక్కటే మార్గం వుంది: మొట్టమొదట తనకు తను పరిస్థితిని అంచనావేసుకోవడం, జర్మన్లను కనుక్కోవడం, వాళ్ల దగ్గరనుంచి ఏవో కొన్ని ఆయుధాలు సమకూర్చుకోవడం.

గడిచిన రాత్రి జరిగిన తరుములాటలో, జర్మన్లు తామేదో తమ దేశంలోనే ఉన్నట్టు, నిర్లక్ష్యంగా దబదబ పరిగెత్తారేమో యిప్పుడక్కడ ఆ అడవిలో బోలెడు కాలిగుర్తులున్నాయి. వస్కోవ్ వాటినొక మ్యాప్‌ను పరిశీలించినట్టు — లభ్యమైన వాస్తవాలనుంచి ఒక నిర్ణయా నికొచ్చేందుకు ప్రయత్నిస్తూ — పరిశీలించాడు. అతని లెక్క ప్రకారం, తనను తరిమిన జర్మన్లు పదిమందికి మించి వుండరు; అందుచేత వాళ్లలో కొంతమందిని తమ సామాన్ల కాపలా కోసం వెనక దిగవిడిచైనా వుండాలి, లేక వాళ్లలో మరొకడిని తుదముట్టించడంలో తను సఫలీకృతుడేనా అయ్యుండాలి. అలా అయినాకూడా — తను గురీగ్గటా ఏమీ చూడ కుండా కాల్పులు సాగించాడు, అందుకు వ్యవధి లేనూ లేదుకనుక — వాళ్లలో ఓ డజను మంది మిగిలి ఉన్నారని తను అనుకోవలసివుంటుంది.

ఆ పాదచిహ్నాలను అనుసరించి అతను అడవి అంచుకు చేరుకున్నాడు. అక్కడినుంచి వోప్ సరస్సూ, సిన్యూహినా కొండలబారూ తనకు కుడితట్టున పరచుకొని వున్న పొదలూ, పైన్ తోపులూ అతనికి చక్కగా కనిపిస్తున్నాయి.

ఫెదోత్ వస్కోవ్ అక్కడ తను ఏ దిశగా వెళ్లాలో నిర్ణయించుకోడానికి కొంచెం సేపు ఆగి చుట్టూ పరకాయించి చూశాడు. కాని అతనికి తన సైనికయువతులు గాని, జర్మన్ దురాక్రమణదారులు గాని కానరాలేదు. అంతా ప్రశాంతంగా ఉంది. ఆ ప్రత్యూషం

ఉజ్వలంగా, ప్రశాంతంగా ఉంది, ఉజ్వలమైన ఆ ప్రశాంతి మధ్య జర్మన్ సబ్‌మెషీన్ గన్నర్స్సూ, పాత మోడలు రైఫిళ్ళు పట్టుకొని వున్న రష్యన్ యువతులూ దాగొనివున్నారు.

బండల మధ్య వెతికి తన సైనిక యువతులను కనుగొనాలన్న భావం ఓ మూల తన మనస్సుని పీకుతున్నా అడవిలో తన మాటుని వదిలి బయటకు రాకూడదనే అతను నిర్ణయించుకున్నాడు. తన ప్రాణాన్ని అపాయానికి గురిచేసే హక్కు తనకి లేదు, బొత్తిగా లేదు — ఎందుకంటే, తనకి ఎంత అసహ్యంగానూ, నిస్పృహగానూ వున్నాకూడా, తనను తాను అపజయం పొందినవానిగా పరిగణించుకోడానికి — తన ఆలోచనల్లో కూడా — అతను సమ్మతించలేదు. తనకి సంబంధించినంత వరకు యుద్ధం ఆ విధంగా పరిసమాప్తి చెందజాలదు. అందుకని తన దృష్టిని ఆ ప్రశాంత ప్రాంతంపై ప్రసరించిన తర్వాత, వస్కోవ్ వెనక్కి చెట్లగుబురులోకి మళ్లి, కనుమను చుట్టి, లెగోంతొవ్ సరస్సు దిశగా చుట్టు మార్గంలో బయల్దేరాడు.

అతని అంచనాలు సరళమైనవి. అతనిలా ఆలోచించాడు: రాత్రి బాగా పొద్దు పోయే దాకా తనని తరిమిన జర్మన్లు — ఉత్తరాది శ్వేత రాత్రుల్లో సైతం — యింకా ముందు కొచ్చేందుకు సంకోచిస్తారు. నూటికి తొంభై వంతులు సూర్యోదయమయ్యేదాకా వాళ్ళు వేచియుంటారు, మరి అలాంటప్పుడు, అవసరమైతే ఊబిలోకి కాక బాగా వెనక్కి తిరోగమించడానికి తమకు అవకాశం కల్పించే లెగోంతొవ్ సరస్సు ఒడ్డున గల అడవిలో వేచియుండటం కంటె అనువైనది వాళ్లకి మరొకటేముంటుంది? అందుకని సరస్సులు రెండింటినీ కలిపే పీలికవంటి భూప్రాంతంలోని పరిచితమైన బండల దిశగా వెళ్లరాదనీ, మరో అపరిచిత మార్గాన వెళ్లాలనీ వస్కోవ్ నిర్ణయించుకున్నాడు.

అక్కడ అకస్మాత్తుగా కాలిగుర్తులు అదృశ్యం కావడంతో, అక్కడ అతను ఒక చెట్టుమాటునుంచి మరో చెట్టుమాటుకి మారుతూ అతి జాగ్రత్తగా ముందుకెళ్ల నారంభించాడు. కాని అడవి ప్రశాంతంగా వుంది, పక్షులు మాత్రమే కూస్తున్నాయి, వాటి స్వరాలను బట్టి దరిదాపుల్లో ఎక్కడా నరసంచారం లేదని ఫెదోత్ గ్రహించాడు.

ఆ దోవ ఎంతసేపటికీ తరగనట్లు, తన అంచనాలు తప్పన్నట్లు అతనికి అనిపించసాగింది, జర్మన్లు ఉండేందుకు బొత్తిగా అవకాశమే లేనిచోట తను జర్మన్ల కోసం దండుగ మారి వెదకులాట సాగిస్తున్నానేమోనని అతనికి అనిపించసాగింది. ఇప్పుడతనికి సహజేంగిత జ్ఞానమే తప్ప కొండ గుర్తులంటూ ఏమీ లేవు, అయినా కూడా తను సరైన త్రోవ వెంటనే పోతున్నానని అతని సహజజ్ఞానం తెలియజేస్తోంది. తనలోని వేటగాని సహజ జ్ఞానాన్ని పరీక్షకు పెట్టాలని అతనింకా అనుకొంటూండగానే, సరిగా అతని ముందు కుందేలొకటి గెంతుకుంటూ వెళ్లింది. అదొక వెల్లడి ప్రాంతంలోకి పరిగెత్తి, వస్కోవ్ ఉనికి తెలియక, అక్కడ తన వెనుక కాళ్లపైన లేచి, వెనక్కి తొంగిచూసింది. అది భయ

భీతమైన కుందేలు, అది మనుషులను — తనకి బొత్తిగా పరిచయంలేని ప్రాణులను — చూసి భీతిచెందిందనడం స్పష్టం, అందుకనే అది ఆశ్చర్యంతో కూడిన ఆసక్తిని కనపరుస్తోంది.

ఆ కుందేలు మాదిరిగానే సార్జెంట్ మేజరు తన చెవులు రిక్కించాడు, అది చూస్తున్న వైపుకే తన దృష్టిని సారించాడు.

అతనెంతగా కళ్ళు పొడుచుకు చూసినా, చెవులు రిక్కించి విన్నా అసాధారణమైనదేమీ అతనికి కానరాలేదు. కుందేలు ఆస్పెన్ చెట్ల తోపులో అదృశ్యమైన చాలా సేపటిదాకా అతను అక్కడే వుండిపోయాడు; కళ్ళు చించుకు చూస్తున్న కారణంగా అతని కళ్ల వెంట నీళ్లు కారుతున్నాయి, అయినా కూడా అతను తను ఉన్న చోటనే వుండిపోయాడు. అతను తన కళ్లను కంటె కూడా ఆ కుందేలునే ఎక్కువ విశ్వసించాడు. ఆ కుందేలు చూసిన దిశగా తను బయల్దేరినప్పుడు, అతను నీడ మాదిరిగా, మిక్కిలి నిశ్శబ్దంగా ముందుకు సాగాడు.

మొట్టమొదట అతని కేమీ కనిపించలేదు, కాని ఆటు తర్వాత పొదల సందుల్లోంచి ఎట్ట ఎదుట నల్లరంగులో అస్పష్టంగా ఏదో కానవచ్చింది. దాని ఆకారం చాలా చిత్రంగా వుంది. అది అక్కడక్కడ పాకుడు పట్టివుంది. వస్కోవ్ ఊపిరి బిగపట్టి మరో అడుగు ముందు కేశాడు. అతను చేతుల్తో కొమ్మల్ని పక్కకి తప్పించాడు, అతనికి పురాతనమైన, పాకుడు పట్టిన గుడిసె గోడ దాదాపు చేతికి తగిలినంత పనైంది, ఆ గుడిసె బాగా లోతుగా నేలలోకి దిగబడివుంది. బహుశా లెగోంత్ ముని యిక్కడే నివసించాడని సార్జెంట్ మేజరు అనుకున్నాడు.

అతను గుడిసె మూలమలుపు తిరిగేసరికి అక్కడ బులిగిపోయిన కొయ్యదుంగలతో ఆవరింపబడిన — ఒక నుయ్యీ, మొక్కలు జీబురుగా పెరిగిన బాటా కానవచ్చాయి. ఆ గుడిసె తలుపు యిప్పుడు ఒకే గుడిదెపై ఆధారపడి ఒక పక్కకు వాలివుంది. తన బుర్రలో రొద పుట్టేదాకా తన చెవులను రిక్కించి వింటూ, అతను తన పిస్తోలును చేతిలోకి తీసుకుని, పిల్లిలా మెల్లిగా అడుగులేసుకొంటూ ఆ తలుపు దగ్గరకు వెళ్లాడు, తలుపు పైఅంచునూ, తుప్పు పట్టిన గుడిదెనూ జాగ్రత్తగా పరిశీలించాడు, బాటలో గడ్డి త్రొక్కబడి వుండటం, మెట్టుపైన యింకా తడిగా వున్న కాలిగుర్తూ గమనించాడు, సరిగా అంతకొక గంట క్రితమే ఆ తలుపు ఊడపీకబడి వుంటుందన్న నిర్ణయానికొచ్చాడు. ఈ తలుపు ఎందుకు ఊడబీకబడిందన్నదే ప్రశ్న. పరిత్యజింపబడిన ఒక సన్యాసాశ్రమ ద్వారాన్ని జర్మన్లు పని గట్టుకొని ఊడపీకారంటే అందులో ఏముందో చూడాలన్న కుతూహలమే అందుకు కారణమనుకునేందుకు వీల్లేదు, వాళ్లకిది మరెందుకో అవసరమైయుండాలి. వాళ్లు బహుశా దాక్కునే చోవు కోసం వెతుకుతున్నారేమో, బహుశా వాళ్లలో ఎవరైనా క్షతగాత్రులున్నారేమో, లేకుంటే వాళ్లేమైనా అక్కడ దాచాలనుకున్నారేమో. సార్జెంట్ మేజరుకి అంతకు మించిన కారణాలేమీ తట్టలేదు. అందుకని అతను వెనక్కి పొదల్లోకి — తన జాడలేమీ కనిపించకుండా

విశేషమైన శ్రద్ధ తీసుకుని — తగ్గాడు. అతను వెనకనున్న చెట్లతోపులోకి పాక్కుంటూ వెళ్ళి, కదలమెదలకుండా అక్కడ ఆగాడు.

దోమలు అతని ఒంటిపైన తాపీగా బైఠాయించాయో లేదో అంతలోనే అతనికి గాభరా పడిన ఒక వసపిట్ట అరుపు వినవచ్చింది. అటు తర్వాత ఒక పుల్లముక్క పెళుక్కున విరిగింది, ఏదో కంగుమని చప్పుడైంది, అటు తర్వాత ఒకరి తర్వాత ఒకరుగా, లెగోంతొవ్ సన్యాసాశ్రమానికి వస్తూ, వాళ్ళు మొత్తం పన్నెండుమందీ కనిపించారు. వాళ్లలో పదకొండు మంది బరువులు మోసుకొస్తున్నారు (అవి ప్రేలుడు పదార్థాలని సార్జెంట్ మేజరు తీర్మానించుకున్నాడు), పన్నెండోవాడు కర్ర ఊతంతో నడుస్తూ బాగా కుంటుతున్నాడు. వాళ్లు గుడిసెను సమీపించారు, తమ బరువులు దింపుకున్నారు, క్షతగాత్రుడు వెంటనే మెట్టుపైన కూలబడ్డాడు. వాళ్లలో ఒకడు ప్రేలుడు పదార్థాలను గుడిసె లోపలకి చేర్చనారంభించాడు, ఈలోగా మిగిలిన వాళ్ళు సిగరెట్లు ముట్టించి దమ్ములాగుతూ, ఒకరి తర్వాత మరొకరు మ్యాపు వంక చూస్తూ, ఏదో చర్చిస్తున్నారు.

దోమలు వస్కోవ్‌ని తెగ కరుస్తున్నాయి, అతని రక్తం పీలుస్తున్నాయి, కాని కన్నార్పడానికి సైతం అతను సాహసించలేదు. అతను జర్మన్లకి బాగా దగ్గరగా, కేవలం రెండం గల అవతల తన పిస్తోలు గట్టిగా పట్టుకొని వున్నాడు. ప్రతి ఒక్క మాటా వింటూ కూడా అందులో ఏ ఒక్కటీ అర్థం చేసుకోలేకపోతున్నాడు. సంభాషణ పుస్తకంనుంచి నేర్చుకున్న జర్మన్ పదబంధాలు కేవలం ఎనిమిదే ఎనిమిది — అవైనా సాగదీసే రష్యన్ ఉచ్చారణలో మాత్రమే — అతనికి తెలుసు.

కాని అతను సందిగ్ధ స్థితిలో ఎక్కువ సేపు ఉండాల్సిన అవసరం లేకపోయింది. మధ్యలో నిలబడ్డ సీనియర్ వ్యక్తి — అతని చేతిలోని మ్యాపు వంకే అందరూ తొంగిచూస్తున్నారు — తన చేత్తో సైగ చెయ్యడంతో, పదిమంది జర్మన్లూ సబ్‌మెషీన్ గన్నులను సర్వసిద్ధంగా పట్టుకొని అడవిలోకి బయల్దేరారు. వాళ్ళు కనుమరగవగానే, ప్యాకేజీలను లోపల పెడుతున్న వ్యక్తి క్షతగాత్రుణ్ణి లేపి నిలబెట్టి, వాడిని గుడిసెలోకి యీడ్చుకెళ్ళాడు.

చివరకి అప్పుడు వస్కోవ్ ఊపిరి పీల్చుకొని, దోమల్ని శిక్షించగలిగాడు. ఇప్పుడంతా స్పష్టమైంది, ఇప్పుడిక మిక్కిలి ముఖ్యమైనది వ్యవధి: జర్మన్లు సిన్యూహినా కొండల బారుకి వెళ్లినది బ్రెరీలు ఏరుకోడానికి కాదన్న సంగతి స్పష్టం — వాళ్ళు లెగోంతొవ్ సరస్సును చుట్టి వెళ్లబోవడం లేదు, పీలికలా వున్న భూసంధి ద్వారా వెళ్లడానికే వాళ్ళు నిర్ధారణ చేసుకున్నారు. వాళ్లక్కడకి తమ ప్యాకేజీలు లేకుండా బయల్దేరారు — అంటే, దోవని కనుక్కొని సులభతరం చేసుకునేందుకన్న మాట.

తను వాళ్లకన్న ముందుగా పోయి తన సైనిక యువతులను కనుక్కొని తన పాత

ఆటని మళ్లీ మొదలెట్టగలడు. అయితే ఉన్న ఆటంకమల్లా ఒక్కటే, ఆయుధాల లోపం. అవి లేనిదే జర్మన్లను అడ్డగించబూనడం నిరుపయోగం.

అదే క్షణంలో — సరిగా విరిగిన ఆ తలుపు వెనుక — గుడిసెలో రెండు సబ్ మెషీన్ గన్నులున్నాయి. రెండు సబ్ మెషీన్ గన్నులు — నా సామిరంగ, చేతికి చిక్కితే ఎలాంటి సంపద! కాని వాటిని ఎలా చేతికి చిక్కించుకోవడం అన్న విషయంలో వస్కోవ్‌కి అప్పటికింకా ఎటు వంటి ఆలోచనా లేదు. వాటిని బహిరంగంగా, మొండిగా సంపాదించేందుకు ప్రయత్నిం చడమన్నది కొరివితో తలగోక్కోవడమే. అందులోనూ నిద్రలేని రాత్రి గడిపినమీదట, గాయ పడిన చేతితో! అందుకని, జర్మన్లు గుడిసెనుంచి బయటి కొచ్చేదాకా గడియలు లెక్కిస్తూ ఫెదోత్ వేచియున్నాడు.

సరిగా అతను ఎదురుచూస్తున్నట్లుగానే వాళ్లలో ఒకడు, బహుశా తన కోసం, తన సహచరుని కోసమూ మంచినీళ్లకని బయటకు రానేవచ్చాడు. అతను జాగ్రత్తగా, తన సబ్ మెషీన్ గన్నును చేతిలో పట్టుకొని, రెండు ఫ్లాస్కులను తన బెల్టుకి తగిలించుకొని, తను నేరుగా మృత్యుదేవత కౌగిట్లోకి వెళ్తున్నానని బొత్తిగా తెలుసుకోలేక, బయటికొచ్చాడు. అతను కొద్దిసేపు వింటూ, చుట్టూ పరకాయించి చూస్తూ నిలబడి, చివరకు గోడను వదిలి ముందుకొచ్చి, నేరుగా బావి దగ్గరకు బయల్దేరాడు. వస్కోవ్ నెమ్మదిగా తన పిస్తోలును పైకెత్తాడు, తనేదో కాల్పుల పోటీలో ఉన్నట్టు ఊపిరి బిగపట్టాడు, మెల్లగా ట్రిగ్గరు నొక్కాడు. హ్రస్వమైన ఒకేఒక్క కాల్పుతో జర్మన్ బొక్కబోర్లాపడ్డాడు. వర్తినే నిర్ధారణ చేసుకొనేందుకు గాను సార్జెంట్ మేజరు మరో గుండు కాల్చి, తన మరుగునుంచి బయటకు రాబోయాడు, కాని అద్భుతమైన అదృష్టం కలిసివచ్చి విరిగిన గుడిసెతలుపు సందులోంచి తుపాకీ ఉక్కు గొట్టం మిలమిల మెరవడం అతనికి కనిపించి, తనున్న చోటనే అతను ఆగి పోయాడు. క్షతగాత్రుడైన రెండవ జర్మన్ మొదటివానికి కాపలాకాస్తున్నాడు, వాడు జరి గినదంతా చూశాడు. వస్కోవ్ నూతి దగ్గరకి పరిగెత్తాడా, అతను తుపాకి గుండుకి బలికావడం నిశ్చయం.

వస్కోవ్ బిగిసిపోయాడు. ఆ జర్మన్ తప్పక కాల్చితీరుతాడు. ప్రమాద సూచకంగా ఒకే ఒక్క కాల్పు — అది ధనాలున పేలి, మార్మోగుతుంది. అది చాలు, దానితో జర్మన్ల ప్రధానబలగం పరుగున వెనక్కి వస్తుంది, అడవి అంతా గాలించేస్తుంది, అంతే, దానితో సార్జెంట్ మేజరు కథ పరిసమాప్తి చెందుతుంది. రెండోమారు తను తప్పించుకోవడం అసాధ్యం.

కాని అతను భయపడినట్లుగా ఆ జర్మన్ కాల్చలేదు. వాడు తన సబ్ మెషీన్ గన్ గొట్టాన్ని మెల్లగా అటునుంచి యిటూ యిటునుంచి అటూ తిప్పతూ, సంకేతమివ్వకుండా నిరీక్షిస్తున్నాడు. తన సహచరుడు నూతి కంచెపైన బొక్కబోర్లా పడటాన్ని వాడు చూశాడు —

ఆ శరీరం యింకా గిలగిల కొట్టుకుంటూనే వుంది — కాని వాడు ప్రమాదసూచకంగా కాల్చలేదు. వాడు నిరీక్షిస్తున్నాడు. కాని ఎందుకైయుంటుంది?

అకస్మాత్తుగా వస్కోవ్‌కి అర్థమైంది. వాడు — ఆ నాజీ నరపశువు — తన సొంత ప్రాణం సంగతి చూసుకుంటున్నాడు. చనిపోతున్న తన సహచరుని విషయం గాని, సైనిక ఆజ్ఞలను గాని, సరస్సు దిశగా వెళ్లిన తన బృందంలోని యితర సభ్యులను గురించి గాని వాడికి సుతరామూ పట్టలేదు. వాడిప్పుడు ఆలోచిస్తున్నదల్లా, వస్కోవ్ దృష్టిని తన మీదకు మరల్చుకోకుండా ఉండటం ఎలాగా అని మాత్రమే. తన అదృశ్య శత్రువును తలుచుకున్నంత మాత్రాన వాడు హడిలి చస్తున్నాడు, ఆ గుడిసెకున్న మొద్దు దూలాల వెనక తానిప్ప డున్నట్లే ఉండిపోనివ్వడం ద్వారా తనను బ్రతికించు దేవా అని వాడు ప్రార్థించు కుంటున్నాడు.

అదీ సంగతి, చావును చూసి హడిలిచచ్చే జర్మన్‌గాడొకడు వున్నాడిక్కడ. సార్జెంట్ మేజర్ యీ సంగతి గ్రహించుకొని తేలిగ్గా నిట్టూర్చాడు.

తన పిస్తోలును ఒరలో పెట్టేసి, వస్కోవ్ నిశ్శబ్దంగా వెనక్కి తగ్గి, వేగంగా గుడిసెను చుట్టి, పాక్కుంటూ నూతి అవతలి పక్కకు చేరుకున్నాడు. అతను అనుకున్నట్లే ఆ జర్మన్ చచ్చిన వాడి వైపు చూడటం లేదు. దానితో సార్జెంట్ మేజరు యింకేమీ యిబ్బంది లేకుండా ఆ శరీరాన్ని చేరుకొని, సబ్‌మెషీన్ గన్నునూ, కార్ట్రిడ్జ్ డమ్ములున్న పెట్టెనూ తీసుకొని ఎవరికంటా పడకుండా అడవిలోకి తిరిగి పోగలిగాడు.

తను చుట్టుదారిని ఎంచుకున్నాడు గనుక అప్పుడిక అంతా వేగంపైన ఆధారపడి వుంది. తను అపాయాలకు వెనుకంజ వెయ్యకుండా సాహసించాలి, సాహసే లక్ష్మి అన్నట్లు అతనికి అదృష్టం కలిసివచ్చింది. కనుమకు దారితీసే పైన్ తోపుల్లోకి పరిగెత్తే దాకా అతను విశ్రాంతి సంగతి తలబెట్టనే లేదు.

ఇది అతనికి పరిచిత ప్రాంతం, ఇక్కడ తను పాకి వెళ్లిన గుర్తు కూడా అతనికి వుంది. తన సైనిక యువతులు యీ ప్రాంతాన్ని విడిచి తూర్పు దిశగా వెళ్లి పోకుండా వుండివుంటే యిక్కడే ఎక్కడో ఉండాలి. ఏదైనా జరిగితే అక్కడినుంచి వెళ్లిపొమ్మని స్వయంగా తనే వాళ్లకి చెప్పివున్నప్పటికీ, వాళ్లు తన ఆజ్ఞను అక్షరాలా పాటించారని నమ్మ డానికి యిప్పుడు వస్కోవ్ మనస్సు నిరాకరించింది. అతనా విషయం నమ్మడానికి నిరాకరిం చాడు, దాన్ని నమ్మడానికి అతనికి మనస్కరించలేదు.

అతను అక్కడ కొంచెం విశ్రాంతి తీసుకున్నాడు, జర్మన్ల సవ్వడి ఏమైనా విన వస్తుందేమోనని అతను తన చెవులు రిక్కించి విన్నాడు. తర్వాత సిన్యూహినా కొండలబారు కేసి — అంతకు యిరవై నాలుగు గంటల ముందు తనూ, ఒస్యానినా వెళ్లిన దారి వెంట —

జాగ్రత్తగా బయల్దేరాడు. అప్పటికి అందరూ బ్రతికి వున్నారు, అందరూ, అంటే అదే, ఒక్క లీజా బ్రీచ్కినా తప్ప.

ఏదేమైతేనేం, వాళ్ళు తిరోగమించారు. నిజమే, కాని ఎక్కువ దూరం కాదు — అంతకు ముందురోజున జర్మన్ల వినోదార్థం తాము నాటకమాడిన స్థలం — వాగు అవతలి ప్రక్క — వరకు మాత్రమే. ఫెదోత్ వస్కోవ్ వాళ్ళు మరో చోట వుండటం సంభావ్య మనుకోలేదు, బండల మధ్య గాని, వాళ్ల పాత స్థావరాల్లో గాని లేకపోయే సరికి అతను చివరకి తిన్నగా వాగు ఒడ్డుకి — యిప్పుడిక అతనింక వాళ్ల కోసం వెతకడం లేదు, అక్క డికేదో యథాలాపంగా మాత్రమే — వెళ్లాడు. ఇప్పుడిక తను ఒంటరిగాడు, ఒక చేతికి గాయంతో పూర్తిగా ఒంటరిగాడన్న గ్రహింపు అతనికి కలిగింది. అతను బాగా దిగులులో మునిగిపోయాడు, అతని మనస్సంతా పూర్తిగా వికలమైపోయింది, గజిబిజి అయిపోయింది, పూర్తి నిరాశా నిస్పృహల్లో అతను వాగును చేరుకున్నాడు. కాని, దప్పిక తీర్చుకుందామని నీటి అంచున వంగాడో లేదో, అతనికి లోగొంతులో "కామ్రేడ్ సార్జెంట్ మేజర్...." అన్నట్లు వినవచ్చింది.

తర్వాత ఆ మాట "కామ్రేడ్ సార్జెంట్ మేజర్!" అంటూ బిగ్గరగా రెట్టించ బడింది.

అతను తటాలున లేచి నిలబడ్డాడు — అరుగో వాళ్ళు తన ఎట్ట ఎదుట పరుగె త్తుకుంటూ, నీళ్లను చెదరగొడుతూ, తమ స్కర్టులను పైకైనా ఎత్తి పట్టుకోకుండా, వాగు దాటి వస్తున్నారు. అతను పరుగున ఎదురెళ్లాడు, వాళ్ళు ముగ్గురూ ఒకరినొకరు వాగు మధ్య కౌగలించుకున్నారు. వాళ్లిద్దరూ అతనికి కరుచుకుపోయారు, అతని భుజాలు పట్టుకు వేలాడారు, — మురికోడుతూ, చెమటకంపు కొడుతూ, ఆకురాతి వంటి గడ్డంతో — ఉన్నవాణ్ణి ఉన్నట్లుగా అతన్ని ముద్దులు పెట్టుకున్నారు....

"ఏయ్ అమ్మాయిలూ, ఏమిటిది!...."

ఏడుపును ఆపుకోవడం అతనికి గగనమైపోయింది. అతని కనుకొలుకుల్లో కన్నీటి బొట్లు కంపించాయి, అతను బాగా నీరసపడిపోయివుండాలి. ఆ ఇద్దరు యువతుల భుజాల చుట్టూ తన చేతులేసి, దగ్గరగా పొదువుకొని అతను వాగు అవతలి పక్కకి దాటాడు. అతనికి తనను గట్టిగా ఒత్తుకోవడానికీ, అతని గరుకు బుగ్గని తడమడానికీ కొమెల్కోవా పదేపదే ప్రయత్నించింది.

"ఓ నా ప్రియమైన, చిన్నారి పిచ్చి పాపాయిలూ! మీరేమైనా కాస్త తిండి తిన్నారా, కాసేపైనా నిద్రపోయేందుకు మీకు అవకాశం దొరికిందా?"

"మాకు తిండి తినాలనీ, నిద్ర పోవాలనీ అనిపించలేదు కామ్రేడ్ సార్జెంట్ మేజర్...."

"సార్జెంట్ మేజరుగిరీ తగలేసిరిలే. మీకు నేనిక సార్జెంట్ మేజర్ని కాను. మనం

గడిచిన గండాలన్నింటి తర్వాత అసలే కాను! మీరు నా చిన్నారి చెల్లాయిలు, మీకు నేను అన్న య్యాను. అందుకని మీరు నన్ను ఫెదోత్ అని పిలవండి, లేకపోతే అమ్మ పిలుస్తూ వుండి నట్లు వట్టినే ఫెద్యా అని పిలవండి.''

వాళ్ళ ఓవర్‌కోట్లూ, నాప్‌శాక్‌లూ, రైఫిళ్లూ పొదల మరుగున దాచబడివున్నాయి. వస్కోవ్ నేరుగా తన నాప్‌శాక్ దగ్గరకు బయల్దేరాడు, కాని అతను ముందుకెళ్ళ గలిగే లోపునే జేన్యా అడిగింది: ''గాల్యా ఏమైంది?''

ఆ ప్రశ్నను ఆమె సంకోచిస్తూ సంకోచిస్తూ మెల్లని స్వరంలో అడిగింది. వాళ్లంతా అర్థంచేసుకున్నారు, రూఢిచేసుకోడానికి మాత్రమే అడిగారు.

సార్జెంట్ మేజరు బదులుచెప్పలేదు. మౌనంగా అతను తన నాప్‌శాక్‌ను తెరిచాడు, అందులోంచి ఎండిన రొట్టెను, ఉప్పులో ఊరవేసిన పందిమాంసపు కొవ్వునూ, సారా ఫ్లాస్కునూ బయటకు తీశాడు. అతను సారాను మూడు మగ్గుల్లో కొంచెం కొంచెం పోశాడు, బ్రెడ్డును ముక్కలుచేశాడు, కొంచెం కొవ్వును కోశాడు. అతను మగ్గులను యువతులకు అందించి తన మగ్గును కూడా పైకెత్తి యిలా చెప్పాడు. ''మన కామ్రేడ్సు వీరమరణం పొందారు. గాల్యా చెత్‌వెర్తాక్ పరస్పర కాల్పుల్లోనూ, లీజా బ్రీచ్కినా ఊబిలోనూ మరణిం చారు. అంటే, సోన్యాతోబాటు మనం ముగ్గుర్ని కోల్పోయామన్న మాట. అదీ పరిస్థితి. కానైతే మన శత్రువుల్ని మనం ప్రదక్షిణాలు చేయించడం మొదలుపెట్టి యిప్పటికి యిరవై నాలుగు గంటలైంది. ఒకటీ రెండూ కాదు, ఇరవై నాలుగు గంటలు!... ఇప్పుడిక మనం మరో ఇరవై నాలుగు గంటలు వాళ్లనిక్కడ నిలవరించాలి. మనకి సహాయం వచ్చే ఆశ లేదు, జర్మన్లు నేరుగా యిటే వస్తున్నారు. అందుకని మన చెల్లెళ్ల స్మృతి గౌరవార్థం పానీయం సేవించి, ముందు చర్యకు సన్నద్ధులమవుదాం. బహుశా యిది మన చివరి పోరాటం కావచ్చు....''

13

ఒక్కొకరకం కష్టం వుంటుంది, అది నీపైన ఓ పెద్ద ఆడ ఎలుగుబంటిలా విరు చుకుపడుతుంది, నిన్ను చరుస్తుంది, పీకుతుంది, నిన్ను నిరాశోపహతుణ్ణి చేస్తుంది. కాని, ఆ తర్వాత అది నిన్ను వదిలిపెట్టేసి పోతుంది. నువ్వింకా బ్రతికే వున్నావనీ, ఉఛ్వాస నిశ్వా సాలు సలక్షణంగా జరుగుతున్నాయనీ, ఏమీ జరగనే లేదన్నట్లు నువ్వు నీ జీవితాన్ని కొన సాగించవచ్చుననీ నువ్వు గ్రహిస్తావు.

కాని ఒక్కొక్క సారి యిందుకు పూర్తి భిన్నంగా ఓ చిన్న పొరపాటు — అత్యల్పాంశం, పరాకువల్ల జరిగిన చిన్న తప్పు — జరుగుతుంది. కాని అది, ఎవరూ అనుభవించాల్సిన అవ సరం లేని పర్యవసానాలను నెత్తిమీదకు తెస్తుంది.

అదిగో సరిగా అలాంటి స్వల్పాంశమే – నాస్తా అయిన తర్వాత వాళ్ళు పోరాటానికి సన్నాహాలు మొదలుపెట్టినప్పుడు – వస్కోవ్‌కి ఎదురైంది. అతను తన నాప్‌శాక్‌ను గాలించాడు, దాన్ని బోర్లించి దులిపాడు, లోపల చెయ్యి పెట్టి తడిమాడు కూడా – ఒక సారి కాదు మూడు సార్లు – అయినాకూడా అతనికి కావలసిన వస్తువులు – రెండో గ్రెనేడ్ ప్రైమరూ, తన పిస్తోలు గుళ్ళూ – దొరకలేదు. ఇవి అతి చిన్న వస్తువులే, అయితేనేం, ప్రైమరు లేని గ్రెనేడంటే కేవలం ఒక యినుపముద్ద తప్ప మరేమీ కాదు. బొమ్మరాయి లాంటి మూగ వస్తువు తప్ప వేరేం కాదు.

"మనకిప్పుడిక బాంబులేం లేవు చెల్లాయిలూ."

అతనీ మాటను – వాళ్లను కంగారు పెట్టకూడదన్న ఉద్దేశంతో – చిరునవ్వు నవ్వుతూ చెప్పాడు. వాళ్లెంత అమాయకులంటే, వాళ్ళందుకు జవాబుగా చిరునవ్వులే కాదు, ఆనందంగా నవ్వులు చిందించారు.

"ఫరవాలేదులే ఫెదోత్, అవి లేకపోయినా మనం ఎలాగో ఒక లాగ గడిపేద్దాం."

అతని పేరు కొంచెం నత్తుతూ, అలా అన్నది కొమెల్కోవా. ఆమె కూడా సిగ్గుపడిపోయింది – సహజమే కదా, తన కమాండర్ని మొదటి పేరుతో పిలవడం ఆమెకు మరి అలవాటు లేదాయిరి.

జర్మన్ల కాల్పుల్ని ఎదుర్కోడానికి వాళ్లకి ఉన్నవల్లా మూడు రైఫిళ్ళు, రెండు సబ్‌మెషీన్ గన్నులూ, ఒక్క రివాల్వరూ. ఓ పద్దెనా సబ్‌మెషీన్ గన్లతో జర్మన్లు తమపైన గుళ్లవర్షం కురిపించగల పరిస్థితిలో యివి ఎక్కువేం కావు, కాని అడవి తమకు పెద్ద అండగా వుంటుందనుకున్నాడతను – అడవీ, వాగూ.

"ఇదిగో రీతా, నీ సబ్‌మెషీన్ గన్నుకి యింకో తూటాల దండ. గుర్తుంచుకో, చాలా దూరంనుంచి కాల్చకు. వాగు అవతలి పక్కకి కాల్చేటప్పుడు రైఫిలుతో కాల్చి, వాళ్ళు వాగును దాటడం మొదలుపెట్టినప్పుడు వాడేందుకు నీ సబ్‌మెషీన్ గన్నుని అట్టే పెట్టుకో – అప్పుడది మంచి బాగా ఉపయోగిస్తుంది. చాలా బాగా."

"బోధపడింది, ఫెదోత్...."

ఈమె కూడా పేరుదగ్గర తడబడింది. వస్కోవ్ యికిలిస్తూ అన్నాడు: "మీకు ఫెద్యా అని పిలవడం తేలికగా ఉంటుందనుకుంటాను. ఫెదోత్ అన్నదేమంత తేలిగ్గా నోరు తిరిగే సొగసైన పేరు కాదనుకోండి, కాని ఏం చేస్తాం పెద్దాళ్లు నాకు పెట్టిన పేరది...."

గత యిరవై నాలుగు గంటలూ జర్మన్లపైన గట్టి ప్రభావాన్నే కలిగించాయి. వాళ్లిప్పుడు మామూలుకన్న నాలుగు రెట్లెక్కువ జాగ్రత్తగా వున్నారు, ప్రతి బండ వెనకా వెదుకుతూ వాళ్ళు నెమ్మదిగా ముందుకొస్తున్నారు. వాళ్లా ప్రాంతాన్ని సాధ్యమైనంత సమగ్రంగా గాలించారు, సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి వాళ్లు వాగు ఒడ్డుని చేరుకున్నారు.

అన్నీ దాదాపు మళ్లీ అదే మాదిరిగా జరుగుతున్నాయి, తేడా అల్లా యీసారి వాగుకి అవతల వున్న అడవి అమ్మాయిల స్వరాలతో మార్మోగడం లేదు. దాని నిశ్శబ్దం ఆశ్చర్యజనకంగానూ, విపత్సూచకంగానూ కనిపిస్తోంది. ఆ ప్రమాదం విషయంలో జర్మన్లు చాలా మెలకువతో వున్నారు. వాళ్ళ పాదలగుండా కనిపిస్తూన్నప్పటికీ నీటి అంచును చేరుకోడానికి వాళ్ళు చాలా వ్యవధి తీసుకున్నారు.

వాగు పెద్ద మలుపు తిరిగిన చోట ఫెదోత్ ఆ యిద్దరు యువతుల్నీ వదిలాడు. అతను వాళ్ళ కోసం స్థావరాలను ఎంచాడు, తనను కలుసుకోవలసిన సంకేత స్థానాలు చూపెట్టాడు. క్రితం రోజున జేన్యా కొమెల్కోవా ఒక విధంగా తన శరీరంతో జర్మన్లను అటకాయించిన చోటును — ముందుకు పొడుచుకెళ్లిన భూప్రాంతాన్ని — అతను తన కోసం ఎంచుకున్నాడు. అక్కడ వాగు ఒడ్డు రెండూ దాదాపు కలుసుకున్నంత సన్నిహితంగా వున్నాయి. ఇరు వంకలా నీటి అంచులనుంచి అడవి ప్రారంభమవుతుంది. శత్రువుచేత వాగును దాటించేలా చేసేందుకు యింతకన్న అనువైన స్థలం మరొకటి లేదు. నిబ్బరం కోల్పోయిన శత్రువును కాల్పులు సాగించేలా ఆకర్షించవచ్చునన్న ఆశతో, జర్మన్లు తరచుగా కనపడేలా తిరిగిన చోటు కూడా యిదే. ఇప్పటి దాకా తన బృందంలో నిబ్బరంలేని వాళ్ళు ఎవరూ లేరు, జర్మన్లు వాగులో దిగేదాకా కాల్పవద్దని వస్కోవ్ తన సైనికులకు ఖచ్చితమైన ఆజ్ఞలు జారీచేశాడు. పక్షులు పాడటం మాని చెదిరిపోకుండా వుండేందుకుగాను ఆ క్షణం దాకా ఊపిరి సైతం గట్టిగా తీసుకోరాదని, అతను ఆజ్ఞాపించాడు.

అతను అన్నీ అందుబాటులో సర్వసంసిద్ధంగా సజావుగా ఉండేలా చూశాడు: సబ్ మెషీన్ గన్నులు లోడ్ చెయ్యబడ్డాయి, రైఫిళ్ల సేఫ్టీకాచ్‌లు — నిర్దిష్ట క్షణంలోగా ఏ వస పిట్టైనా హెచ్చరిక చెయ్యకుండా — పైకెత్తి వుంచాడు. సార్జెంట్ మేజరు యిప్పుడిక దాదాపు ప్రశాంతంగా ఎదుటి ఒడ్డుని పరిశీలిస్తున్నాడు, తన దరిద్రపు చెయ్యి మాత్రమే — పుప్పి పన్ను మాదిరిగా — పోటు పెడుతోంది.

అవతలి ఒడ్డున అన్నీ యిందుకు భిన్నంగా వున్నాయి: పాడే పక్షులు మౌనం దాల్చాయి, వసపిట్టలు నిరంతరాయంగా రొదచేస్తున్నాయి. వీటిలో ఏ ఒక్క అంశమూ కూడా వస్కోవ్ దృష్టిని తప్పించుకోలేదు; అతను పరిశీలనగా చూస్తూ నిరీక్షిస్తున్నాడు, ఈ నిరీక్షణా క్రీడతో జర్మన్లు విసుగుచెందే ఖచ్చితమైన క్షణాన్ని అతను అంచనావేస్తున్నాడు.

అయితేనేం, మొట్టమొదటి కాల్పు కాల్చినది అతను కాదు. అతనీ కాల్పుకోసం ఎదురుచూస్తూనే వున్నాకూడా అది అతన్ని చకితుణ్ణి చేసింది: అసలు ఏ కాల్పు అయినా అంతే, అదెప్పుడూ ఆకస్మికమైనదిగా, అనుకోనిదిగానే వుంటుంది. అది అతనికి ఎడమ ప్రక్క, వాగుకి దిగువ తట్టున ప్రేలింది. దాని తర్వాత మరి రెండు కాల్పులు వినిపించాయి. వస్కోవ్ వాగు వంపు కేసి చూశాడు, ఒక జర్మన్ బాగా వంగి నీళ్లలోంచి తన ఒడ్డు దిశగా

వెళ్లడం, అతనికి తగలకుండా గుళ్ళు అతని చుట్టూ పేలడం కనిపించింది. ఆ జర్మన్ తన కాళ్లలో ఒక దాన్ని కరకర చప్పుడు చేసే గులకరాళ్లపైన యీడ్చుకుంటూ బాగా వంగే పరిగెత్తుతున్నాడు.

క్షతగాత్రుడైన జర్మన్‌కి రక్షణ కల్పిస్తూ అప్పుడు సబ్‌మెషీన్ గన్నులు పేలాయి. సార్జెంట్ మేజరు తన సైనిక యువతుల దగ్గరకు పరిగెత్తుదామని లేవబోయాడు, కాని అతను సరిగా చివరి క్షణాన తనను తాను నిగ్రహించుకుని అక్కడే వుండిపోయాడు. వాగు అవతలి ఒడ్డున పొదల్లోంచి నలుగురు జర్మన్లు ఏక కాలంలో ముందుకు దూసుకొచ్చారు, బహుశా తమ వాళ్ల కాల్పుల రక్షణలో వాగును దాటి అడవిలోకి అదృశ్యం కావడమే వాళ్ల లక్ష్యమై యుంటుంది. ఇటువంటి పరిస్థితిలో రైఫిలు వల్ల ప్రయోజనం లేదు, ప్రతి ఒక్క కాల్పు తర్వాతా బోల్టును సరిచేసుకోడానికి వ్యవధి చిక్కదు, అందుకని ఫెదోత్ వస్కోవ్ తన సబ్‌మెషీన్ గన్నును చేతిలోకి తీసుకున్నాడు. అతను ట్రిగ్గరు నొక్కాడో లేదో అవతలి పక్క పొదలు రెండు చోట్ల తెరుచుకుని, గుళ్ళు మిరుమిట్లు గొలుపుతూ అతని తల పైగా దూసుకువచ్చాయి.

ఈ పోరాటంలో వస్కోవ్‌కి తెలిసినదల్లా తను తిరోగమించరాదన్న దొక్కటే. తన పక్క పిడికెడు మట్టిని సైతం శత్రువు చేతికి చిక్కనీరాదు. ఎంత కష్టసాధ్యమైనా, ఎంత దుస్సాధ్యమైనా కూడా, తను తన యీ స్థావరాన్ని కాపాడాలి. తను తట్టుకుని నిల బడాలి, లేకపోతే శత్రువు తనను నలిపిపారేస్తాడు — అంతే దానితో అంతా ముగిసిపోతుంది. తన వెనక యావత్తు రష్యా ఉన్నదన్న భావం అతనికి కలిగింది. ఫెదోత్ వస్కోవ్ అనబడే తను, మరెవ్వరూ కాదు తను మాత్రమే రష్యా దేశమాతకు మిగిలిన చిట్టచివరి పరిరక్షకు డన్న భావం అతనికి కలిగింది. తనూ, శత్రువూ, రష్యా — వినా యావత్ప్రపంచంలోనూ మరెవ్వరూ లేరని అతనికి అనిపించింది.

కాని ఆ యువతుల రైఫిళ్లింకా మోగుతున్నాయో లేదో వినేందుకని అతను తన అంతశ్శ్రవణేంద్రియం వంటి దాన్ని తెరిచే వుంచాడు. కాలుస్తున్నారంటే వాళ్లింకా బతికి వున్నారన్న మాట. అంటే వాళ్ళు తమ శ్రేణిని, తమ యుద్ధరంగాన్ని, తమ రష్యాను నిల బెట్టారన్న మాట. వాళ్లింకా నిలబెట్టి ఉంచుతూనే ఉన్నారన్న మాట!

ఆ దిశగా గ్రెనేడ్లు పేలుతున్నా కూడా అతను భయపడలేదు. అప్పటికే ఓ చిన్న విరామానికీ, కొంచెం విశ్రాంతికీ తరుణం ఆసన్నమైందని అతనికి అనిపించసాగింది, ఎందు కంటే, తమ శత్రువు బలాబలాలేమిటో తెలియని జర్మన్లు అతనితో సుదీర్ఘ పోరాటం మొదలు పెట్టగలగడం సాధ్యం కాదన్న సంగతి అతనికి తెలుసు. వాళ్లైనా, చుట్టూ నాలుగూ చూసుకోవాలి, తమ అవకాశాలను అంచనా వేసుకోవాలి, వీలూ చాలూ చూసు కోవాలి, అప్పుడే మళ్లీ ముందెత్తువెయ్యాలి. వాగు దాటి తన దిశకు వస్తున్న నలుగురు

జర్మన్లూ ఎంత లాఘవంగా వెనక్కి తప్పుకున్నారంటే వాళ్లలో ఏ ఒక్కడికైనా తన గుండు తగిలిందో లేదో అతను తేల్చుకోలేకపోయాడు. పొదల్లోంచి వాళ్లు తనని బెదరగొట్టేందుకని తన పైకి కాల్చారు, అటు తర్వాత కాల్పులు నిలిపేశారు, నీటిపైన పొగ మాత్రమే తేలియాడసాగింది.

తను కొన్ని నిమిషాల విరామాన్ని సంపాదించుకున్నాడు. అయితే యిది సమయాన్ని నిమిషాల్లో లెక్కించుకునే రోజు కాదనడం స్పష్టం, ఎందుకంటే ఎక్కణ్ణుంచీ కూడా తనకీ రోజున సహాయం వచ్చే ఆశ లేదు. అయినా కూడా తాము శత్రువును కాటేశారు, తమ తడాఖా చూపారు. కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకోకుండా ఈ సారి యిదే స్థానంలో మళ్లీ శత్రువు ముందుకు రావడానికి ప్రయత్నించడం అసంభావ్యం. శత్రువు మరో చోట, నూటికి తొంభై వంతులు బహుశా వాగుకి ఎగువన ముందుకు వస్తాడని వస్కోవ్‌కి గట్టి నమ్మకం వుంది, ఎందుకంటే, వాగు వంపు దిగువన వాగు ఒడ్డు రాళ్లతో నున్నగా వున్నాయి. అందుకని ఎటు పోయి ఎటొచ్చినా పనికొస్తుందని తన సైనిక యువతుల్లో ఒకరిని యిక్కడ అట్టేపెట్టి, తను కుడి తట్టున బాగా ముందుకెళ్లాలి.

వస్కోవింకా తన సైన్యవ్యూహాన్ని గురించి తేల్చుకోక ముందే తన వెనుక పాదాల చప్పుడు అతనికి వినవచ్చింది. అతను తల వెనక్కి తిప్పి చూసేసరికి కొమెల్కోవా పొదల్లోగుండా నేరుగా తన వంక పరిగెత్తుకుంటూ రావడం అతనికి కనిపించింది.

"తల వంచు!"

"తొందరగా రా!... అక్కడ రీతా!..."

రీతాకు ఏమైందని ఫెదోత్ ప్రశ్నించలేదు, కొమెల్కోవా చూపులను బట్టే అతనికి అర్థమైపోయింది. అతను తన ఆయుధాలు దొరకబుచ్చుకొని కొమెల్కోవా కంటె ముందుగా ఆ స్థలానికి పరుగున వెళ్లాడు. రీతా ఒక పైన్ చెట్టు మొదట్లో ముందుకి బాగా ఒంగిపోయి కూర్చుంది. బూడిదవన్నె తిరిగిన తన పెదవులపైకి బలవంతాన చిరునవ్వు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. ఒక మూల పొట్టపైన అదిమిపట్టుకొన్న చేతుల పైనుంచి రక్తం ధారాపాతంగా కారుతోంది. ఆమె తన పెదవులను నాలుకతో తడుపుకుంటోంది.

"ఏం జరిగింది?"

"గ్రెనేడ్...."

అతను రీతాను వెల్లకిల పడుకోబెట్టాడు, అతనామెను చేతులతో పట్టుకున్నాడు. అతను తనను ముట్టుకోవడం ఆమెకు యిష్టం లేకపోయింది, బాధకి ఆమె అంతగా భయపడిపోయింది. అతను మెల్లగా ఆమె చేతిని పక్కకి తీశాడు, ఇప్పుడిక చరమదశేనన్న సంగతి అతనికి అవగతమైపోయింది. అదంతా నానా బీభత్సంగా వుంది — రక్తం, చీలికలు

వాలికలైన దుస్తులు, తోలు బెల్టు సజీవమైన మాంసంలోకి నెట్టబడింది. దానితో అసలు అదేమిటో చూడటం కూడా అసాధ్యమైపోయింది.

"గుడ్డ పీలికలు కావాలి!" అని కేకేశాడతను. "నీకున్న అండర్ గార్మెంట్లన్నీ!"

అప్పటికే వణుకుతున్న చేతులతో తన నాప్‌శాక్‌ను ఊడపీకుతున్న జేన్యా, సన్నగా నున్నగా వున్నదేదో అతనికి అందించింది.

"నీకు పుణ్యముంటుందిగాని, సిల్కు కాదు. నూలుగుడ్డ కావాలి!..."

"ఏమీ లేదు!..."

"తగులడ్డట్లే వుంది!" అతను తన నాప్‌శాక్ దగ్గరకు పరిగెత్తి గట్టిగా బిగిసిన ముళ్ళు విప్పేందుకు తంటాలుపడసాగాడు....

"జర్మన్లు...." రీతా కష్టంమీద అంది. "జర్మన్లెక్కడ?"

జేన్యా క్షణకాలం రీతా వంక శూన్య దృక్కులు బరపి, ఆ మరుసటి క్షణమే సబ్‌మెషీన్ గన్నుని చేతిలోకి తీసుకుని, మరి వెనుతిరిగి చూడకుండా వాగు ఒడ్డుకి దౌడు తీసింది.

సార్జెంట్ మేజరు తన నాప్‌శాక్‌లోంచి ఒక అండర్‌వేరూ, రెండు బ్యాండేజి చుట్టలూ తీసుకుని వెనక్కి వచ్చాడు. రీతా ఏదో నచ్చచెప్పాలని ప్రయత్నించింది — కాని అతను విని పించుకోలేదు. అతను ఆమె కోటును, స్కర్టును, పూర్తిగా తడిసిపోయిన బాడీనీ — పళ్ళు గిట్ట కరిచి — బాకుతో కోసి ఊడదీశాడు. గ్రెనేడ్ తునక వాలుగా ఆమె శరీరంలోకి దిగి, ఆమె పొట్టను చీల్చింది. ముదురు గచ్చకాయరంగు పేగులు నల్లబారిన రక్తం మధ్యనుంచి కనిపిస్తున్నాయి. అతను మడత పెట్టిన తన బనీనును గాయంపైన పెట్టి కట్టుకట్టసాగాడు.

"ఫరవా లేదు రీతా, ఏం ఫరవా లేదు.... గాయం పైపైనే తగిలిందంతే, లోపల అన్నీ బాగానే వున్నాయి, నయమైపోతుంది...."

ఇవతలి ఒడ్డుపైకి ఒక్క సారిగా గుళ్ళవర్షం కురిసింది. మళ్ళీ బీభత్సకాండ ప్రారం భమైంది, చెట్ల ఆకులు రాలి చెల్లాచెదరుగా పడుతున్నాయి, వస్కోవ్ బ్యాండేజి కడు తూనే వున్నాడు, కాని కట్టిన ప్రతిసారీ అది వెంటనే రక్తంతో తడిసిపోతోంది.

"వెళ్ళు.... వెళ్ళక్కడకి...." రీతా కష్టంమీద అంది. "జేన్యా అక్కడుంది...."

ఈ సారి గుండు వాళ్ళ దాదాపులకి వచ్చింది, ఈ మారది వాళ్ళ పైనుంచి పోలేదు, వాళ్ళ వేపే గురిచూడబడింది కాని, అది వాళ్ళకి తగల్లేదు. సార్జెంట్ మేజరు గిర్రున వెనక్కితిరిగి తటాలున తన రివాల్వరును పైకి తీసి, క్షణ కాలం కనిపించిన ఒక ఆకృతి వంక రెండు సార్లు కాల్చాడు. జర్మన్లు వాగును దాటారు.

జేన్యా సబ్‌మెషీన్ గన్‌నుండి కాల్పులు వెలువడుతూనే వున్నాయి, ఆమె అంత కంతకు దూరంగా అడవిలోకి తిరోగమిస్తున్న కొద్దీ ఆమె గన్ను వెనకనున్న జర్మన్లపైకి గర్జి

స్తూనే వుంది. ఆమె జర్మన్లను తమనుండి దూరంగా ఆకర్షిస్తూ తన వెంట లాక్కుపోతున్నదని వస్కోవ్ గ్రహించాడు.

కాని వాళ్లలో అందరూ ఆమెను వెంటాడటం లేదన్న విషయం స్పష్టం. ఇక్కడే దగ్గర్లో ఎక్కడో మరో జర్మన్ వున్నాడు, సార్జెంట్ మేజర్ మరో గుండు పేల్చాడు. జర్మన్లు చాలా దగ్గర్లో వున్నారు, ఏ ఒక్క క్షణమైనా తమ తుది క్షణం కావచ్చు, అందు కని యిక జాగుచేసేందుకు వీల్లేదు, యిక్కడినుంచి వెళ్లిపోవాలి, ఒస్యానినాను తీసుకుపోవాలి.

రీతా తన బూడిదవన్నె పెదవులను మధ్యమధ్య బాధగా పళ్లతో నొక్కిపడుతూ క్షీణ స్వరంలో గుసగుసగా చెప్పిన మాటలను పెడచెవిని పెడుతూ సార్జెంట్ మేజరు ఆమెను చేతుల్లోకి ఎత్తుకున్నాడు. అతను రైఫిల్ను కూడా తీసుకోవాలనుకున్నాడు గాని సాధ్యం కాలేదు. అతను పొదల్లోకి — తన ఎడమ చెయ్యి యమబాధ పెడుతూండగా, అడుగడుక్కీ శక్తిని కోల్పోతున్నట్లు అనుభూతిచెందుతూ — పరుగుతీశాడు.

నాప్‌శాక్‌లూ, రైఫిళ్లూ, ఓవర్‌కోట్లూ, జేన్యా అండర్‌వేరూ — నాజూకుగా మెత్తగానే వున్నా సార్జెంట్ మేజరుకి ప్రస్తుతం ఎందుకూ కొరగాని అండర్‌వేరూ — పైన్ చెట్టు మొదట్లో కిందనే ఉండిపోయాయి.

అందమైన అండర్‌వేర్లంటే జేన్యా పడిచస్తుంది. సరదాగా తుళ్లుతూ గెంతుతూ నలుగురితోనూ కలుపుగోలుగా వుండే జేన్యా మరేవి లేకపోయినా సర్దుకుపోగలదు, అందులోనూ తేలికగా సర్దుకుపోగలదు. కాని, తన తల్లి యుద్ధారంభానికి సరిగా ముందు తనకిచ్చిన యీ నాజూకు సిల్కు అండర్‌వేర్లను మాత్రం ఆమె వదలకుండా తన నాప్‌శాక్‌లో వేసుకునే తిరుగుతూవుంటుంది. ఎన్ని సార్లు చివాట్లుతిన్నా, అలుపు ఆయాసాలు వచ్చినా, సైనికులకు సాధారణంగా కలిగే రకరకాల అసౌకర్యాలు కలిగినా కూడా ఆమె వాటిని వదల్లేదు.

వాటిలో ప్రత్యేకించి ఒకటి ఎలాంటివాళ్లకైనా మతి పోగొట్టేటంత అందమైనది — అలాంటిదాని కోసం వెంపర్లాడటం ఎవరికైనా సహజమే. చివరకు జేన్యా తండ్రి కూడా ఉండబట్టలేక ఒక సారి వ్యాఖ్యానించాడు: "జేన్యా, యిది మరీ అతిగా వుంది. అయినా నువ్వు వెళ్లేది పెళ్లికి పేరంటానికా, విందుకీ విలాసానికా?"

"నేను పార్టీకే వెళ్తున్నాను!" — తన తండ్రి ఉద్దేశం పూర్తిగా భిన్నమైనదని తనకు పూర్తిగా తెలిసినా కూడా — జేన్యా సగర్వంగా చెప్పింది. తండ్రీ కూతుళ్ల మధ్య మంచి అవగాహనా ఆత్మీయతా ఉండేవి.

"అడవిపంది వేటకొస్తావా?" అనే వాడాయన.

"నేను చచ్చినా దాన్ని తీసుకెళ్లనివ్వను!" ఆమె తల్లి ఆదుర్దాగా అరిచేది. "నీకేం మతి లేదేమిటి, యీ పసిపిల్లకి వేట అంటూ రేప్పెడుతున్నావు."

"దాన్ని వేటకి అలవాటు పడనియ్యవే! ఎందుకలా గాభరా పడిపోతావ్!" అంటూ

జేన్యా తండ్రి పకపక నవ్వేవాడు. "రెడార్మీ కమాండరు కూతురంటే ప్రపంచంలో దేనికీ భయపడకూడదు."

జేన్యాకి నిజంగానే ఏదన్నా భయం లేదు. ఆమె గుర్రపుస్వారీ చేసింది, రైఫిలు కాల్చడం ప్రాక్టీసు చేసింది, తన తండ్రితో బాటు అడవి పందుల్ని నూ టేసి వేటాడేది. రక్షణసేన వున్న పట్టణంలో తన తండ్రి మోటారు సైకిలుపైన బర్రుబర్రున చక్కర్లు కొడుతూండేది. క్లబ్బుల్లో జరిగే పార్టీలలో ఆమె జిప్సీ, స్పానిష్ డాన్సులు కూడా చేసేది, గిటారు వాయిద్యానికి లయగా పాడేది, రివటల్లా వుండే లెఫ్టినెంట్లతో సరసాలాడుతూ కలిసి తిరిగేది. ఆమె యిదంతా, ప్రేమలో పడకుండా, తేలికగా, సరదాకోసం చేసేది.

"నువ్వు లెఫ్టినెంట్ సెర్గేయ్‌చుక్ బుర్ర పూర్తిగా చెడగొట్టేశావు జేన్యా. అతనీ రోజున నా దగ్గర తన రిపోర్టెలా మొదలెట్టాడో తెలుసా: 'కామ్రేడ్ జేన్యా, అబ్బే అదే, కామ్రేడ్ జనరల్....' "

"నన్ను ఆటలు పట్టించకు నాన్నా!"

అది మంచి సంతోషంగా సరదాగా గడచిన కాలం, కాని ఆమె తల్లి మాత్రం రుస రుసలాడుతూ, నిట్టూర్పుస్తూ వుండేది. జేన్యా, వయస్సొచ్చిన పిల్ల, పిల్ల ఏమిటి – వాళ్ళ అంటూ వుండినట్లు – ఆరిందా ఆడది యిలా ప్రవర్తించడం.... ఆమె తల్లికి అటువంటి ప్రవర్తన అంతుపట్టేది కాదు. తుపాకి కాల్పులు ప్రాక్టీసుచేసే చోట్లకే కాదు, గుర్రపు స్వారీలకే కాదు, మోటారు సైకిలు షికార్లకే కాదు తెగ తిరుగుతూండేది, మరొకప్పుడు తెల్లవార్లూ డాన్సులు చేస్తూండేది, లెఫ్టినెంట్లు ఆమెకు పెద్దపెద్ద పుష్పగుచ్ఛాలు బహూ కరిస్తూండేవారు, ఆమె కిటికీకి ఎదురుగా వీధిలో నిలబడి విరహ గీతాలు పాడుతూండేవారు, కవితాధోరణిలో ప్రేమలేఖలు రాస్తూండేవారు.

"నువ్విలా ప్రవర్తించకూడదు జేన్యా తల్లీ. నలుగురూ ఏమనుకుంటున్నారో తెలుసా నిన్ను గురించి?"

"వాళ్ళని వాళ్ళ యిష్టం వచ్చినట్లు వాక్కోనియ్యమ్మా, మనకేం!"

"నువ్వు కలనల్ లూజిన్‌తో తరుచు కలిసి తిరుగుతున్నావంటున్నారు. అతను కుటుంబీకుడు. నువ్విలాంటి పని ఎలా చెయ్యగలుగుతున్నావ్ జేన్యా!"

"నువ్వు మరీనీ, నేనేదో లూజిన్ అంటే పడిచచ్చిపోతున్నానన్నట్లు!" అంటూ జేన్యా భుజాలెగరేసి అక్కడి నుంచి తుర్రున పారిపోతూండేది.

లూజిన్ మంచి అందగాడు, నిగూఢతా శౌర్యాలు అతనికి ఒక రకమైన ప్రత్యేకాక ర్షణను కల్పించేవి. ఖల్ఖిన్‌గోల్‌లో అతని వీరోచిత కృత్యాలకుగాను ఆర్డర్ ఆఫ్ రెడ్ బ్యానరూ, ఫిన్నిష్ యుద్ధంలో ఎర్ర నక్షత్ర పతకమూ అతనికి బహూకరింపబడ్డాయి. ఈ

సంభాషణను జేన్యా దాటవెయ్యడంలో నిగూఢ కారణమేదో ఉండివుంటుందని ఆమె తల్లి అనుకుంటూండేది, ఈ అభిప్రాయం ఆమె మనస్సును సతమతం చేస్తూండేది.

జేన్యా కుటుంబం చంపబడ్డాక ఆమె తంటాలుపడి సోవియట్ యుద్ధశ్రేణులకు చేరుకోగలిగినప్పుడు ఆమెను సంరక్షణలోకి తీసుకున్నది లూజినే. అతను ఆమెకు తోడ్పడ్డాడు, ఆమెకు రక్షణ కల్పించాడు, ఆమెను సముదాయించాడు. ఆమె నిరాశ్రయ స్థితిని అతను తన కోసం వినియోగించుకున్నాడని ఎవరూ అనలేరు, అయితే అతను ఆమె ఆప్యాయతను చూరగొన్నాడు. ఆమెకి ఒక ఆసరా అవసరం. తను తన తలను ఆన్చి కరువుదీర ఏడ్వడానికి ఒక భుజం అవసరం. తనకు బాసటగా ఉండి, తనను సానుభూతితో చూసి, తనను బుజ్జగించి, తనను గురించిన ప్రతి చిన్న అంశం పైనా హడావిడి చేసే వ్యక్తి కావాలి. భయానకమైన ఈ యుద్ధకాల ప్రపంచంలో తను మళ్లీ కాళ్లూనుకోగలగాలని ఆమె కోరుకుంది.

ఇప్పుడంటారా ప్రతీదీ జరగాల్సినట్లే జరుగుతోంది — జేన్యా యిదివరకెన్నడూ మతి పోగొట్టుకోలేదు, యిప్పుడూ పోగొట్టుకోబోవడంలేదు. ఆమెకు తనపైన తనకు విశ్వాసముంది. మరి యిప్పుడు, జర్మన్లను ఒస్యానినానుండి దూరంగా తను ఆకర్షించి లాక్కుపోతున్నప్పుడు కూడా, అన్నీ సలక్షణంగా ముగుస్తాయన్న విషయంలో ఆమెకు క్షణకాలం కూడా ఎటువంటి సందేహం లేదు.

తనకు పక్కవాటున మొదటి గుండు తగిలినప్పుడు సైతం ఆశ్చర్యపడడం కంటే ఏ అనుభూతులూ ఆమెకు లేవు. పంథొమ్మిదేళ్ల లేత వయస్సులోనే చచ్చిపోవడమన్న భావం మరీ అసంగతమైనది, మరీ అవివేకమైనది, పరమ అసంభావ్యమైనది.

జర్మన్లు ఆమెను కాల్చడమన్నది గుబురాకుల గుండా గుడ్డిగా కాలుస్తూంటే — యాదృచ్ఛికంగానే జరిగింది. కదలమెదలకుండా వుండి, అవకాశం కోసం వేచియుంటే ఆమెకు దెబ్బ తప్పుకొనేందుకు అవకాశం చిక్కియుండేదే. కాని ఆమె అలా వేచియుండలేదు, తన దగ్గర వున్న మందుగుండంతా అయిపోయేదాకా కాలుస్తూనే వుంది. ఆమె బోర్లా పడుకొని కాలుస్తోంది. తన జీవరక్తంతో బాటు తన శక్తి కూడా హరించి పోతున్న కారణంగా యిప్పుడిక ఆమె పక్కకు తప్పుకొనేందుకు ఏ మాత్రమూ ప్రయత్నించకుండా కాలుస్తోంది. జర్మన్లు దగ్గరనుంచి సూటిగా ఆమెపై కాల్చి ఆమెను తుదముట్టించారు, అటుతర్వాత — మృత్యుదేవత కౌగిట్లో సైతం సగర్వంగా సుందరంగా కనిపించే ఆమె ముఖం కేసి చాలా సేపు చూస్తూ నిలబడిపోయారు.

14

తన గాయం ప్రాణాంతకమైనదన్న సంగతీ, తన మరణం బాధాకరమూ, సుదీర్ఘమూ అన్న సంగతీ రీతాకి తెలుసు. ఇప్పటివరకు, ఆమె కడుపులో సన్నగా మంట — అది అంత

కంతకు తీవ్రతరమవుతోంది — దారుణమైన దాహమే గాని ఏమంత ఎక్కువ బాధ లేదు. కాని తను నీరు తాగకూడదని ఆమెకు తెలుసు. అందుకని ఆమె ఓ చిన్న గుడ్డ పేలికను నీటి గుంటలో ముంచి తన పెదవులు తడుపుకుంది.

వస్కోవ్ ఆమెను కూలిన ఒక ఫర్ చెట్టు వేళ్ల మరుగున పడుకోబెట్టి, చెట్టు రెమ్మలతో కప్పివెళ్లాడు. కాల్పులింకా వినవస్తున్నాయి, కాని త్వరలోనే అంతటా నిశ్శబ్దం ఆవరించింది, అప్పుడిక రీతా ఏడవ నారంభించింది. ఆమె వెక్కివెక్కి రాకుండా, కన్నీళ్లు తన బుగ్గల వెంట ధారాపాతంగా జాలువారుతూండగా మౌనంగా ఏడ్చింది. ఇప్పుడిక జేన్యా మరిలేదని ఆమెకు తెలుసు.

తర్వాత — యిప్పుడామెపై ముంచుకొస్తున్న ఘోర విపత్తు ముందు — దేనితోనైతే తను రాజీ పడి, దేనికైతే తను సన్నద్ధం కావాలో ఆ ఘోర విపత్తు ముందు — ఆమె కన్నీళ్లు వెనక్కి తగ్గినట్లుగా నిలిచిపోయాయి. ఆమె పాదాల ముందు అత్యంత శీతలమూ, అంధకార బంధురమూ అయిన మహా అగాధమొకటి నోరావలించుకొని చూస్తోంది, రీతా దాన్ని గురించి, ఎటువంటి రాగద్వేషాలూ లేకుండా ధైర్యంగా సమాలోచించింది.

ఆమె యిప్పుడు తన కోసం గాని, తన ప్రాణం కోసం గాని, తన యౌవనం కోసం గాని నిట్టూర్చడం లేదు, ఎందుకంటే, యిప్పుడామె మనస్సు తనకన్న ఎంతో ముఖ్యమైన దాని పైన సంలగ్నమైయుంది. తను తన కొడుకును అనాథునిగా విడిచిపోబోతోంది, వాడిప్పుడు, తన రోగిష్టి తల్లి సంరక్షణలో, పూర్తి ఏకాకిగా వున్నాడు. రీతా యిప్పుడు వాడు యుద్ధాన్ని గడిచి బ్రతికి బయటపడినట్లు ఊహించుకుంది, భవిష్యత్తులో వాడి జీవితం ఎలా వుండ బోతుందో మనస్సులో చిత్రించుకుంది.

త్వరలోనే వస్కోవ్ వెనక్కి తిరిగివచ్చాడు. అతను రెమ్మల్ని పక్కకి తొలగించి, గాయపడిన తన చేతిని ఊపుకుంటూ, మౌనంగా ఆమె పక్క చదికిలబడ్డాడు.

''జేన్యా చచ్చిపోయిందా?''

అతను తలూపాడు. ఓ క్షణం ఆగి అతనన్నాడు. ''మన నావ్‌శాక్‌లు పోయాయి. నావ్‌శాక్‌లూ, రైఫిళ్లూ కూడా. వాళ్లు వాటిని తీసుకుపోయారో, లేకపోతే ఎక్కడైనా దాచేశారో మరి.''

''మరి జేన్యా.... బాధపడకుండా వెంటనే చచ్చిపోయిందా?''

''వెంటనే'' అన్నాడతను, కాని అతను నిజం చెప్పడం లేదని ఆమెకు తెలుసు. ''వాళ్లు వెళ్లిపోయారు. బహుశా ప్రేలుడు పదార్థాలు తీసుకురావడానికై యుంటుంది....'' అతను కాంతి తరిగిన, సర్వం గ్రహించే ఆమె చూపును చూశాడు, ఆ వెంటనే బిగ్గరగా అరిచి చెప్పాడు: ''వాళ్లు మనని ఓడించలేదు, బోధపడిందా? నేనింకా బతికే వున్నాను, నన్ను లొంగదియ్యడానికి వాళ్ల తలలో జేజెమ్మలు దిగిరావాల్సిందే!''

అతను పళ్ళు గిట్ట కరుస్తూ అకస్మాత్తుగా ఆగి, తన చేతిని మళ్ళీ ఊపనారం భించాడు.

"చెయ్యి నొప్పి పెడుతోందా?"

"చెయ్యి కాదు, ఇదిగో యిక్కడ నొప్పి పెడుతోంది" అతను తన రొమ్ము బాదుకున్నాడు. "ఇదిగో నన్నది యిక్కడ ఎలక లాగా — కొరుక్కుతింటోంది! నేను మిమ్మల్ని — మీ అయిదుగుర్నీ — బలి యిచ్చాను — అదైనా ఎందుకు? ఓ పిడికెడు జర్మిగాళ్ల కోసమే కదా?"

"నిన్ను నువ్వు నిందించుకోకు.... కారణం యుద్ధం...."

"యుద్ధం జరుగుతున్నప్పుడు సరేననుకో, కాని శాంతి సమయంలో కూడా యిలాగే అనుకుంటారా? మీరంతా ఎందుకు చచ్చిపోవలసివచ్చిందో వాళ్లు ఆలోచిస్తారా? మరి జర్మన్లను వాళ్ల దోవన వాళ్లని పోనీకుండా నేను తీసుకున్న నిర్ణయాన్ని నేనెందుకు తీసుకున్నానో వాళ్లు అర్థంచేసుకుంటారా అని? 'మీ మగాళ్లు మా తల్లుల్ని గుళ్లనుండి ఎందుకు కాపాడలేకపోయారు? మీరు వాళ్ళని యమధర్మరాజుకి కట్టబెట్టి మీ మటుక్కి మీరు బ్రతికి ఎలా ఉండగలిగారు? మీరు కీరొవ్ రైల్వేని గురించీ, తెల్ల సముద్రపు కాలవని గురించే ఎక్కువ ఆలోచిస్తూ ఉండినారా? కేవలం అయిదుగురు యువతులూ, ఒక్క రివాల్వరుతో ఒక సార్జెంట్ మేజరూ కన్న ఎక్కువ సేనలే వాటి రక్షణలో పాల్గొంటూ వుండివుండాలే!' అని వాళ్లు నిలదీసి అడిగితే నేనేం జవాబుచెప్పాలి?"

"ఊరుకో" ఆమె మృదువుగా అంది. "ఏ దేశానికైనా ఆద్యంతాలు కాలవలే కాదు, అవి కానే కాదు. మనం కాపాడుతున్నది మన దేశాన్ని. ప్రప్రథమంగా, ప్రధానంగా మన దేశాన్ని, అటు తర్వాతనే కాలవ."

"హుం..." వస్కోవ్ భారంగా నిట్టూర్చి, కొంత సేపు మౌనం దాల్చాడు. "సరే, నువ్విక్కడుండు, నేనలా పోయి చుట్టూ చూసివస్తాను. లేకపోతే వాళ్లు యిటు రావచ్చు, దానితో మన పని ఆఖరవుతుంది." అతను తన రివాల్వరు పైకి తీశాడు, ఏ కారణంగానో దాన్ని అతను తన కోటు చేతులపైన జాగ్రత్తగా మెరుగు పెట్టాడు. "ఇదిగో, దీంట్లో యింక రెండు గుళ్ళే మిగిలివున్నాయి, అయితేనేం అసల్లేని దాని కన్న అది నయమే కదా."

"ఆగు!" రీతా అతని ముఖాన్ని దాటి ఎక్కడో — కొమ్మలతో సగం మరుగుపరచబడిన ఆకాశంవంక తేరిపారచూస్తోంది. "మన స్టేషను సమీపంలో నేను జర్మన్లను చూసినప్పటి సంగతి నీకు గుర్తుందా? అప్పుడు నేను పట్నంలో వున్న మా అమ్మని కలుసుకునేందుకు వెళ్లాను. అక్కడ నాకో చిన్న కొడుకున్నాడు, మూడేళ్ల పసివాడు. అలిక్ అని పిలుస్తాం వాణ్ణి, కాని అసలు పేరు అల్బేర్త్. అమ్మ చాలా జబ్బుగా ఉంది, ఆవిడిక ఎక్కువ కాలం బతకదు, మా నాన్న యుద్ధరంగంలో జాడతెలియకుండా పోయాడు."

"ఆ విషయంలో నువ్వు దిగులుపడకు, రీతా, నాకు అర్థమైంది."

"థాంక్యూ." వివర్ణమైన ఆమె పెదవులపై చిరునవ్వు రూపుదాల్చింది. "సరే, యిప్పుడిక నా తుట్టతుది కోర్కె తీరుస్తావా?"

"ఊంహూఁ" అన్నాడతను.

"కాదనడంలో అర్థమేముంది? నేనెలాగా చచ్చిపోయేదే. ఉన్నకొద్దీ మరింత బాధ తప్ప ప్రయోజనం లేదు."

"నేనిప్పుడు కొంచెం స్కౌటింగు చేసి వెనక్కి తిరిగి వస్తాను. రాత్రిపూట మనం మన వాళ్ల దగ్గరకి చేరుకుందాం."

"నన్ను ముద్దుపెట్టుకో" ఆమె అకస్మాత్తుగా అంది.

అతను ఆమె పైకి అస్తవ్యస్తంగా వంగి, బిడియంగా ఆమె నుదుటిపైన ముద్దు పెట్టుకున్నాడు.

"నీ గడ్డం గుచ్చుకుంటోంది...." దాదాపుగా వినపడనట్లు ఆమె అంది, ఆమె కళ్లు మూతలుపడ్డాయి. "సరే యిక వెళ్లు. కొమ్మలు నామీద వేసి వెళ్లు."

బూడిదవన్నె తిరిగిన ఆమె చెప్పి దవడలపైగా కన్నీళ్లు మెల్లగా జాలువారాయి. ఫెదోత్ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు, రీతాను రెమ్మలతో కప్పాడు, పెద్దపెద్ద అంగలేసుకుంటూ వాగు దగ్గరకు, జర్మన్ల దిశగా, వెళ్లాడు.

కొరగాని గ్రెనేడు — అతని ఏకైక ఆయుధం — అతని జేబులో బరువుగా వ్రేలాడుతోంది.

అస్పష్టమైన కాల్పు శబ్దం అయినట్లూ, అది వెంటనే రెమ్మల కింద అణిగిపోయినట్లూ — అతనికి వినిపించడంకన్న — అనుభూతమైంది. అటవీ నిశ్శబ్దాన్ని వినడానికి చెవులు రిక్కించి వింటూ అతను కొరడుబారిపోయాడు. ఆటు తర్వాత, తన చెవులను నమ్మడానికింకా అనిష్టంగానే, అతను ఫర్ చెట్టు దగ్గరకు పరిగెత్తాడు.

రీతా తన కణతకి కాల్చుకుంది, అక్కడ దాదాపు రక్తమే లేదు. గాయం చుట్టూ నల్లని తుపాకిమందు గుర్తులున్నాయి. ఎందుకో తెలియకుండా, వస్కోవ్ ఆ గాయం వంక చాలా సేపు అలా చూస్తూ వుండిపోయాడు. ఆటుతర్వాత రీతాను అతను కొంచెం పక్కకు తీసుకెళ్లి పడుకోబెట్టాడు, సరిగా ఆమె పడుకున్న చోటనే తవ్వనారంభించాడు. నేల అక్కడ మెత్తగా తవ్వడానికి వీలుగా ఒదుగుతోంది. అతనక్కడ ఒక కర్రతో పొడిచి — అడ్డం వచ్చిన చెట్టు వేళ్లను తన బాకుతో కోస్తూ — దోసిళ్లతో మట్టి పైకెత్తి పోశాడు. తను చెయ్యాల్సిన పనిని తొందరగా పూర్తిచేసి, విశ్రాంతి కోసం ఆగకుండా అతను జేన్యా కళేబరం పడివున్న చోటుకి వెళ్లాడు. అతని చేతిలో భరించరాని బాధ — గునపాలతో పొడుస్తున్నట్లు భయంకరమైన బాధ, తరగలుతరగలుగా అతని శరీరమంతటా పాకుతున్న బాధ —

మూలంగా అతను జేన్యాకు సరైన సమాధి తవ్వలేకపోయాడు. దానికి సంబంధించిన ఆలోచన అతని మనస్సును పీకసాగింది, అతను వ్యసనం చెందాడు, ఆరిపోయిన తన పెదవులతో గొణగసాగాడు: ''నన్ను క్షమించు జేన్యా క్షమించు....''

ఊగిసలాడుతూ, పడుతూ లేస్తూ, సిన్యూహినా కొండబారు మీదుగా అతను జర్మన్లున్న వేపు సాగివెళ్ళాడు. అతను చిట్టచివరి గుండుతో వున్న తన రివాల్వరును బిగిసిన పిడికిట్లో పట్టుకున్నాడు, ఇప్పుడిక అతను కోరుకుంటున్నదల్లా వాళ్లలో మరొక్కడిని చంపగలిగేందుకు, సాధ్యమైనంత తొందరగా జర్మన్లను కలుసుకోవడం మాత్రమే. ఇప్పుడిక అతని ఒంట్లో — సర్వత్రా పరివ్యాపించిన బాధే తప్ప — శక్తి అన్నదే లేదు.

తెల్లని మునిచీకటి వెచ్చని నిశ్చలమైన శిలలను మెలమెల్లగా కమ్ముకుంటోంది. పొగమంచు గుంటల్లో, సందుల్లో చేరుకుంటోంది. మందపవనం సద్దుమణిగింది — దోమలు గుంపులు గుంపులుగా అతనిమీద ముసురుతున్నాయి. ఆ తెల్లని పొగమబ్బులో అతనికి తన సైనిక యువతుల — మొత్తం అయిదుగురి — అస్పష్టాకృతులూ కనిపించసాగాయి, అతను తీవ్రమైన మనోవేదనతో తన తలను అటూ యిటూ ఊపుతూ లోలోపల గొణుక్కోసాగాడు.

అప్పటికీ జర్మన్లు తటస్థపడలేదు. వాళ్లని కలుసుకోవాలని ఆతృతగా బహిరంగంగా తను దబదబా భారంగా నడుస్తున్నా వాళ్ళు ఎదురు కాలేదు, వాళ్ళు కాల్పులు సాగించలేదు. ఈ యుద్ధాన్ని ముగించే తరుణం వచ్చేసింది, ఇక దాన్ని ముగించెయ్యడం అవసరం, ఆ ముగింపు యిప్పుడు తన రివాల్వరుయొక్క ఉక్కు గొట్టంలో ఉంది.

తన దగ్గర ప్రైమరులేని హాండ్ గ్రెనేడు — ఓ యినప ముద్ద — కూడా ఉన్నమాట నిజమే, ఎక్కడికి వెళ్తే అక్కడికి తను దాన్నెందుకు మోసుకుపోతున్నాడో తనకే తెలియదు. అతను దాన్ని అలవాటు చొప్పున, సార్జెంట్ మేజరుగా సైనిక ఆస్తిని భద్రంగా కాపాడే తన అలవాటు కొద్దీ మోసుకు వెళ్తున్నాడు.

ఇప్పుడతనికి ఒకేఒక గాఢమైన కోర్కెతప్ప, మరి ఏ లక్ష్యమూ లేదు. ఇప్పుడతను వలయాలలో తిరగడం లేదు, అడుగుల జాడలు కూపీతియ్యడం లేదు — అతను నేరుగా, మరమనిషి మాదిరిగా నడుస్తున్నాడు. అప్పటికీ జర్మన్లు ఎదురుపడలేదు....

అతను లేత పైన్ తోపును దాటాడు, ఇప్పుడతను అడవి గుండా నడుస్తున్నాడు, క్షణక్షణానికీ అతను లెగోంతొవ్ ఆశ్రమానికి — ఆ ఉదయమే తను అత్యంత అనాయాసంగా సబ్ మెషీన్ గన్నుని సంపాదించుకున్న ఆశ్రమానికి — దగ్గరపడుతున్నాడు. ఇన్ని స్థలాలుండగా తను సరిగా అక్కడికే ఎందుకు వెళ్తున్నానని ఆలోచించడానికి అతనొక్క క్షణం కూడా ఆగలేదు. కాని, ఎన్నడూ పొరపడని అతని వేటగాని సహజేంగితజ్ఞానం అతన్ని నిస్సంకోచంగా అక్కడికే లాక్కుపోతోంది. అతను కేవలం దాన్ని పాలిస్తున్నాడంతే. సరిగా తన ఆ సహజేంగితజ్ఞాన పాలనా క్రమంలోనే యిప్పుడతను వేగం తగ్గించి, విని, పొదల్లోకి జారుకున్నాడు.

నుయ్యా, ఆశ్రమం వున్న ఆ వెల్లడి ప్రాంతం నూరు మీటర్ల దూరంనుంచే కానవస్తోంది. ఈ నూరు మీటర్ల దూరాన్నీ వస్కోవ్, తను అసలు బరువే ఏమీ లేడన్నట్లు, అతి నిశ్శబ్దంగా అతిక్రమించాడు. శత్రువు అక్కడున్నట్లు అతనికి తెలుసు, నిశ్చితంగా తెలుసు, తన త్రోవలో కుందేలు అడ్డంగా ఎప్పుడు ఉరుకుతుందో తోడేలుకి తెలిసినంత సహజేంగితజ్ఞానంతో తెలుసు.

ఆ వెల్లడి ప్రాంతపుటంచున గల పొదల్లో అతను శిలా విగ్రహంలా నిస్తబ్దంగా నిలబడి బావి చుట్టూగల ప్రాంతాన్ని — తన చేతిలో హతుడైన జర్మన్ కళేబరం యిప్పుడక్కడ లేదు — గుడిసెనూ, దాని దగ్గరవున్న నల్లని పొదలనూ నిశితంగా పరిశీలించాడు. అక్కడ అనుమానాస్పదమైనదేమీ లేదు, బొత్తిగా ఏమీ లేదు, అయినాకూడా సార్జెంట్ మేజరు ఓపికగా నిరీక్షించాడు.

గుడిసె మూలనుంచి అస్పష్టమైన ఒక మచ్చ నెమ్మదిగా కదలడం అతని కంట పడింది, అతను ఆశ్చర్యం చెందలేదు. సెంట్రీ సరిగా అక్కడే వుంటాడన్న సంగతి అతనికి తెలుసు.

సెంట్రీ దిశగా అతను నెమ్మదిగా — అడుగొక యుగమన్నట్లు — నడిచాడు. కలలో మాదిరిగా అతనొక పాదం పైకెత్తుతూ, దాన్ని అతి తేలికగా నేలపై మోపుతూ నడిచాడు; అతను అడుగులు వెయ్యకుండా, ఏ చిన్న పుల్ల ముక్కా పుటుక్కుమని కూడా అనకుండా వుండేందుకు గాను, బొట్టు తర్వాత బొట్టుగా తన బరువును జారుస్తున్నాడేమో నన్నంత మెల్లగా నడిచాడు. ఈ రకంగా, యీ రకమైన విహంగనాట్యంతో, అతను ఆ వెల్లడి ప్రాంతాన్ని చుట్టి నిశ్చలంగా వున్న సెంట్రీ వెనుక ఆగాడు. ఇప్పుడిక, మరింత నెమ్మదిగా, మరింత సుతారంగా అతను ఆ వెడల్పాటి ఛాయాకృతి వేపు కదిలాడు. అతను నడిచాడనే దానికంటె జారాడనుకుంటేనే సముచితంగా వుంటుంది.

అతనొక్క అంగదూరంలో ఆగాడు. చాల సేపుగా అతను తన ఊపిరి బిగపట్టి వున్నాడు, మరి యిప్పుడతను తన గుండె తేరుకువేందుకు వ్యవధి యిచ్చాడు. అతనంతకు చాలా సేపటి క్రితమే తన రివాల్వరును ఒరలోకి జార్చాడు. ఆ వ్యక్తి శరీరపు వాసన గుప్పుమంటూ తగులుతోంది. ఇప్పుడతను తన బాకును తన కుడి చేతిలో పట్టుకున్నాడు. మెల్లగా, మిల్లీమీటరు తర్వాత మిల్లీమీటరుగా, నిర్ణయాత్మకమైన ఆ ఒకే ఒక్క పోటు కోసం అతను తన బాకును సిద్ధంగా పట్టుకున్నాడు.

కాని యీలోగా అతను తన శక్తిని మరింతగా కూడదీసుకునేందుకు వ్యవధి తీసుకున్నాడు. అతనిలో యిప్పుడిక మిగిలివున్న శక్తి స్వల్పం, అతి స్వల్పం, అతని ఎడమ చెయ్యి యిప్పుడిక ఎందుకూ పనికి వచ్చే స్థితిలో ఏ మాత్రం లేదు.

అతను తన ఆ పోటులో తన శరీరంలో వున్న సమస్త శక్తినీ, చిట్టచివరి బిందువు

దాకా కేంద్రీకరించాడు. కేవలం విలక్షణమైన, దీర్ఘమైన, సుదీర్ఘమైన నిశ్వాసమే తప్ప అరుపు కూడా లేకుండా పని కడతేరింది, ఆ వెంటనే ఆ ఫాసిస్టు తన మోకాళ్లపైకి ఒరిగిపోయాడు. సార్జెంట్ మేజరు బర్రున తలుపును వెనక్కునెట్టి గుడిసెలో ప్రవేశించాడు.

"హేండె హోఖ్!"*

జర్మన్లు నిద్రపోతున్నారు. కీరొవ్ రైల్వే దిశగా చివరి ప్రయత్నంగా నెట్టుకుపోయేందుకు ముందు వాళ్లు ఆద మరచి విశ్రాంతి తీసుకుంటున్నారు. వాళ్లలో ఒక్కడు మాత్రమే మేల్కొనివున్నాడు, యిప్పుడతను మూలనున్న గన్ను కోసం ఉరికాడు, కాని వస్కొవ్ ఆ కదలికను కనిపెట్టి ఒక్క గుండుతో దాన్ని నిలిపేశాడు. ఆ శబ్దం క్రిందుగా వున్న గుడిసె పై కప్పుకి తగిలి ప్రతిధ్వనించింది, ఆ జర్మన్ దబ్బున గోడకి కొట్టుకున్నాడు. సార్జెంట్ మేజరు మస్తిష్కంలో వున్న జర్మన్ మాటలన్నీ పైకి దూసుకొచ్చాయి. "పడుకో, పడుకో!" అంటూ కలగాపులగపు రష్యన్లో అతను అరిచాడు.

అతను పచ్చి బూతులు తిట్టాడు, తనకి తెలిసిన బండ బూతులన్నీ ప్రయోగించాడు....

అయితే వాళ్లు భయపడుతున్నది అతని ఆజ్ఞను వినిగాని, సార్జెంట్ మేజరు ఊపుతున్న హేండ్ గ్రెనేడ్ను చూసిగాని కాదు. అతను ఒంటరిగాడని, అనేక కిలోమీటర్లలోగా మరొకరెవ్వరూ లేరన్న సంగతిని వాళ్లు కేవలం ఊహించుకోలేకపోయారు, కలగనలేకపోయారు. వాళ్ల ఫాసిస్టు మస్తిష్కాలు యీ విషయాన్ని నమ్మేందుకు నిరాకరించాయి, అదుగో అందుకనే, అతను ఆజ్ఞాపించినట్లుగా వాళ్లందరూ ముఖాలు నేలకాన్చి సాష్టాంగపడ్డారు. వాళ్లు నలుగురూ బోర్లాపడుకున్నారు, అయిదోవాడు — కాస్త చలాకీ అయినవాడు — యిప్పటికే పరలోకగతుడయ్యాడు.

అప్పుడు వాళ్లు ఒకళ్లని మరొకళ్లు బెల్టులతో బిగించుకున్నారు — దిట్టంగా బిగించుకున్నారు, చిట్టచివరి వాడిని ఫెదోత్ వస్కొవ్ స్వయంగా కట్టేశాడు. ఆ పని ముగిశాక అతను ఏడ్చేశాడు, మురికిగా, గడ్డం మాసివున్న అతని ముఖంపైగా కన్నీళ్లు కాల్వలు గట్టాయి, అతను ఏడుస్తూ, నవ్వుతూ, అంతసేపూ అరిచేస్తూ మహోద్రేకంతో కంపించాడు.

"రేయ్, మీరు సాధించలేకపోయార్రా, ఔనా? మా వాళ్లున్నది అయిదుగురే అయిదుగుర్రా. కేవలం అయిదుగురు ఆడపిల్లల్రా. అయినా మీవల్ల కాలేదురా. మీరు ఏమాత్రం సాధించలేకపోయార్రా. మీ అంతు — మీలో ప్రతి ఒక్కడి అంతూ — తేలుస్తాంరా. నా పై ఆఫీసర్లొక వేళ మిమ్మల్ని మీ ప్రాణాలతో వదిలినా కూడా, నేను స్వయంగా, నా సొంత

---

* చేతులెత్తు — జర్మన్. — సం.

చేతుల్తో మీ ప్రాణాలు తీస్తా్రనా ఒరేయ్! తర్వాత వాళ్ళు నన్ను కోర్టు మార్షల్ చేస్తే చేసుకోనియ్ – చేసుకుంటే చేసుకోనియ్యండెహె!''

అతని చెయ్యి నమిలేస్తోంది, దానితో అతని శరీరంలోని అణువణువూ భగ్గున మండుతోంది, అతని తల తిరగనారంభించింది. తను స్పృహ ఎక్కడ కోల్పోతానో అని అతను విపరీతంగా భయపడిపోయాడు, అందుకనే అతను చిట్టచివరి బిందువు దాకా తన శక్తిని కూడదీసుకొని స్పృహలో వుండేందుకు ప్రయత్నించాడు.

తిరుగుప్రయాణంలో అతని బుర్ర శూన్యమే అయిపోయింది. వస్కోవ్ తను తెగ తాగేసినట్టుగా తూలిపోతూ నడుస్తున్నాడేమో ఆ నలుగురు జర్మన్ల వీపులూ కదులుతున్నాయి, అటూయిటూ ఊగిపోతున్నాయి. ఆ నాలుగు వీపులూ తప్ప అతనికి లోకంలో మరేమీ కనిపించడం లేదు, అతని బుర్రలో ఒకే ఒక ఆలోచన మెదులుతోంది – తను తన స్పృహను కోల్పోనారంభిస్తే ముందు వాళ్ళని కాల్చెయ్యాలన్నదే అది. అతని స్పృహ యిప్పుడిక సాలెగూటిదారం వంటి అతిసన్నని చిట్టచివరి పోచపై ఆధారపడి వేలాడుతోంది. అతని శరీరం ఎంత బాధతో నిండివుందంటే, దానితో అతను గట్టిగా బొబ్బలుపెడుతున్నాడు, బొబ్బలు పెడుతూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు; అతను కుప్పకూలిపోయే పరిస్థితిలో వున్నాడు.

వాళ్ళని ''ఎవరది?'' అంటూ ఎవరో బిగ్గరగా ప్రశ్నించిన తర్వాతనే, వాళ్ళు మిత్రులే – రష్యన్లే గాని శత్రువులు కారని తను గ్రహించిన తర్వాతనే అతను తన స్పృహను జారిపోనిచ్చాడు.

ముగింపు మాటలు

ఏయ్ మిత్రమా!

నువ్వక్కడ అదే పనిగా పనిచేసి బుర్ర పోగొట్టుకుంటూ వుంటే, మేమిక్కడ, దుమ్మూధూళీ లేని యీ మూల చేపలు పడుతూ సరదాగా గడుపుతున్నాం. వీటిని తగలెయ్య, నిలువునా మనుషుల రక్తం పీల్చే యీ దోమలు యిక్కడో పెద్ద బెడదే అనుకో, అయినా కూడా యిక్కడ జీవితం స్వర్గప్రాయంగా వుంది. ఓయ్ బడుద్ధాయ్, నువ్వు కూడా కొద్ది రోజులు సెలవు తీసుకుని యిక్కడికిరా. ఇక్కడ బర్రుబుర్రుమంటూ కార్లు లేవు, బిలబిలలాడుతూ జనం లేరు వారానికోసారి ఓ మోటారు బోటు బ్రెడ్డు తీసుకుని యిక్కడికొస్తుంది. లేకపోతేనా రోజుల తరబడి నగ్నంగా తిరిగినా యిక్కడ అడిగేవాడెవడూ లేడు. యాత్రికుల సౌకర్యార్థం యిక్కడ రెండు బ్రహ్మాండమైన సరస్సులున్నాయి, వాటి నిండా పెర్చి చేపలే. ఓ నది వుంది, దాని కరకట్ట దగ్గర గ్రేలింగ్ చేపలు తెళ్ళుతూ వుంటాయి.

ఇక పుట్టగొడుగులు కోకొల్లలు!

ఈరోజున ఏమైందో తెలుసా. మోటారు బోటులో ఓ చిత్రమైన ముసలాడొచ్చాడు, ముగ్గు బుట్టలాంటి తల, ఒంటి చెయ్యి, కుదిమట్టంగా తనాబీలా వున్నాడు. అతనితో బాటు రాకెట్ బలగాలకు చెందిన ఒక యువ కెప్టెన్ వచ్చాడు. ఆ కెప్టెన్ పేరు ఎంత తమాషాగా వుందనుకున్నావ్ — అల్బేర్ట్ ఫెదోతొవిచ్! నువ్విలాంటి పేరెప్పుడైనా విన్నావూ? ఆ ముసలాణ్ణి ఆ కుర్రాడు ఏమని? పిలుస్తున్నాడో తెలుసా: "నాన్నా!" అని. ఇంతకీ నే చెప్పొచ్చేదేమిటంటే, వాళ్లిక్కడ దేనికోసమో గాని — అదేమిటో నాకైతే తెలియదు — వెతు కుతున్నారు....

...నిన్న నేను పూర్తిచెయ్యలేకపోయాను, ఇది తరువాయి కథ. ఇక్కడ కూడా యుద్ధం జరిగినట్లు కనిపిస్తోంది.... నువ్వూ నేనూ యింకా పుట్టక ముందే మనవాళ్లిక్కడ పోరాటం జరిపారు.

అల్బేర్ట్ ఫెదోతొవిచ్, అతని తండ్రీ తమతో ఓ పాలరాతి ఫలకం తీసుకొచ్చారు. మేమక్కడ ఒక సమాధి కోసం గాలించాం — అదొక వాగుకి అవతలి పక్కన, అడవిలో వుంది. ఆ కెప్టెన్ తండ్రి — తనకి మాత్రమే తెలిసిన గుర్తుల సాయంతో — ఆ సమాధిని కనుక్కున్నాడు. నేనా పాలరాతి ఫలకాన్ని మోసుకెళ్లేందుకు వాళ్లకి సాయం చేద్దా మనుకున్నాను — కాని తర్వాత ఆలోచించి ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

ఇక్కడ ప్రత్యూషాలు ఎంత నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటాయో నేను యీ రోజే గుర్తించాను.

అజేయ సైనికుడు

★

నవల

ఒకటో భాగం

1

గత మూడు వారాల్లో సంభవించివన్ని సంతోషప్రదమూ, సంభ్రమజనకమూ అయిన సంఘటనలు కోల్యా ప్లూజ్నికొవ్ మొత్తం జీవితంలోనే మరెన్నడూ జరగలేదు. నికొలాయ్ పెత్రోవిచ్ ప్లూజ్నికొవ్ అనబడే తనకు, లెఫ్టినెంటు హోదానిస్తూ ఆజ్ఞ జారీకావడం వాటిలో మొదటిది.

ఈ ఆజ్ఞ చదవబడిన ఉదయపు పెరేడ్ అనంతరం వాళ్ళందర్నీ నేరుగా స్టోర్సుకి తీసుకుపోయారు. అది మామూలు కాడెట్ స్టోర్సు కాదు, ప్రత్యేక స్టోర్సు. అతి నాజూకైన క్రోమ్ చర్మపు టాప్ బూట్లూ, వాటితో బాటు కిర్రు కిర్రుమనే షోల్డరు బెల్టూ, బిర్రుగా వున్న రివాల్వరు హోల్‌స్టరూ, నున్నగా వున్న మ్యాప్‌కేసులతో కూడిన కమాండర్ల చేతిసంచీ, ఒక ఓవర్‌కోటూ, చక్కని గుడ్డతో కుట్టిన సైనిక కోటూ జారీచేసిన ప్రత్యేక స్టోర్సు అది. అప్పుడిక మొత్తం బృందమంతా యూనిఫారాలు తమ ఎత్తుకీ, నడుములకీ సరిపడే లాగా, ఒంటినంటి వుండే కవచాల్లాగా సరిచేయించుకునేందుకని స్కూలు దర్జీ దగ్గరకి దౌడుతీశారు. ఒకళ్ళనొకళ్ళు నెట్టుకుంటూ, తోసుకొంటూ, పైకప్పుకి వ్రేలాడే ఎనామెల్ లాంపుషేడ్లు ఊగిసలాడ నారంభించేటంత బిగ్గరగా నవ్వారు.

ఆ సాయంత్రం మిలిటరీ స్కూలు కమాండరు తనను అభినందించి, రెడార్మీ కమాండర్ అనే గుర్తింపు కార్డునూ, బరువైన పిస్తోలునూ తనకు అందజేశాడు. నూనూగు గడ్డాలూ, మీసాలూ కలిగిన నవ యువకులైన లెఫ్టినెంటులు తమతమ పిస్తోళ్ల నంబర్లను అరిచి చెప్పి, పొడిగా వున్న జనరల్ చేతిని తమ చేతులతో ఉద్రేకంగా నొక్కారు. విందు భోజనం దగ్గర కాడెట్ ప్లటూన్ల కమాండర్లను తమ చేతులపైన పైకెగరేశారు, సార్జెంట్ మేజర్‌ని ఓ దరువు వెయ్యాలని కూడా పథకాలు వేసుకున్నారు. కాని అన్నీ సజావుగా ముగిశాయి. ఆ సాయంత్రం, అన్ని సాయంత్రాల్లోకీ అత్యద్భుతమైన ఆ సాయంత్రం, సముచితమైన చక్కని తతంగంతో ఆరంభమైన ఆ సాయంత్రం చక్కని తతంగంతో ముగిసింది.

ఆ విందు తదుపరి రాత్రే లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్ తను పైనుంచి కిందిదాకా — తన తోలు షోల్డరు బెల్టూ, ముడతల్లేని తన యూనిఫారమూ, మిలమిల మెరిసే తన టాప్

బూట్లో — క్రుక్రుమంటున్నట్లు కనుగొన్నాడు. క్రుమనడమే కాదు, కొత్త రూబులు నోటులాగ — అప్పట్లో కుర్రాళ్ల వాటిని "పెళపెళలు" అంటూండేవారు — పెళపెళలాడాడు.

వాస్తవానికి అదంతా కొంచెం ముందే ప్రారంభమైంది. నిన్నటి కాడెట్లందరూ, విందు తదుపరి జరిగిన డాన్సుకి అమ్మాయిల్ని తెచ్చుకున్నారు. కోల్యాకి స్నేహితురాలు లేదేమో తడబడుతూ తడబడుతూ లైబ్రేరియన్ జోయాని ఆహ్వానించాడు. జోయా నేర్పుగా తన పెదవులను బిగించి, "అయ్యో, నాకు చేత కాదు, నాకు నిజంగానే చేతకాదండీ — " అంటూ ననుగుతూనే డాన్సు హాల్లోకి వచ్చింది. వాళ్ళు డాన్సు చేసినప్పుడు సిగ్గుతో కోల్యా ముఖం ఎర్రబారింది, దానితో అతను అదే పనిగా మాట్లాడనారంభించాడు. జోయా లైబ్రేరియన్ అయిన కారణంగా అతను రష్యన్ సాహిత్యాన్ని గురించి మాట్లాడాడు. మొదట ఆమె అతని మాటలకు ఊకొట్టింది, కాని కొంత సేపైన తర్వాత ఆమె చిరాకుగా బుంగ ముఖం పెట్టింది.

"మీరు క్రుక్రుమంటున్నారు, కామ్రేడ్ లెఫ్టినెంట్."

మిలిటరీ స్కూలు కుర్రాళ్ల పరిభాషలో క్రుక్రుమనడమంటే డాబు సరిగా పోజులు కొట్టడమన్న అర్థం రూఢి అయింది. ఆ క్షణంలో ఆ మాటను కోల్యా అదేవిధంగా అర్థం చేసుకున్నాడు. కాని అతను బ్యారక్సుకు తిరిగి వచ్చేటప్పుడు అత్యంత సహజమూ, సంతోష కరమూ అయిన కారణంగా తను నిజంగానే క్రుక్రుమంటున్నట్లు కనుగొన్నాడు.

"నేను పైనుంచి కిందదాకా క్రుక్రుమంటున్నానోయ్" అతను తన స్నేహితునికి, ఏ కొంచెమో గర్వంగానే చెప్పాడు.

వాళ్ళు రెండో అంతస్తులో కిటికీ పలకమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. అది జూన్ మాసారంభం. రాత్రిపూట స్కూలంతా లైలక్ పూల సువాసనలతో గుబాళిస్తోంది. ఎవర్నీ వాటిని కొయ్యనిచ్చేవారు కారు.

"నీ యిష్టమొచ్చినంత క్రుక్రుమను" అతని స్నేహితుడన్నాడు. "అయితే జోయా విషయంలో మాత్రం ప్రయోజనం శూన్యం. కోల్యా, నీకు తెలుసో తెలియదో గాని ఆమె వట్టి పోకిరిదనుకో. ఆమె భర్త మందుగుండు సామగ్రి సప్లయ్ ప్లటూను సార్జెంట్ మేజరు."

కోల్యా ఆ సలహాను వినడమైతే విన్నాడు గాని దాన్ని పూర్తిగా చెవిని పెట్టలేదు, అందుకు అతను తన సొంత క్రుక్రును వింటూ వుండటం, దానితో తన్మయుడవుతూ ఉండటమే కారణం.

ఆ మరుసటి రోజున యిళ్లకు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఒక్క కుర్రాడికీ సెలవు వుంది. వాళ్ళు కోలాహలంగా వీడ్కోళ్లు చెప్పుకున్నారు. ఒకరి చిరునామా మరొకరు తీసుకున్నారు, ఒకరికి మరొకరు జాబులు రాస్తామని వాగ్దానాలు చేసుకున్నారు. అటుతర్వాత ఒకళ్ల తర్వాత మరొకళ్లు స్కూలు యినుప గేటుగుండా అదృశ్యులయ్యారు.

ఏ కారణంగానో గాని కోల్యాకి ప్రయాణ పత్రాలు చేతికి రాలేదు — అతనైనా ఎక్కువ దూరం ప్రయాణం చెయ్యనక్కర్లేదు, మాస్కోకే వెళ్లాల్సివుంది. అతను రెండు రోజులు వేచిచూసి, యింక పోయి సంగతేమిటో కనుక్కుందామని నిర్ణయించుకున్నాడు. కాని అంతలోనే డ్యూటీ సార్జెంటు దూరాన్నుంచి పిలిచాడు: ''లెఫ్టినెంట్ ప్లూజ్నికోవ్! కమిస్సారు మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నారు!''

అకస్మాత్తుగా ముసలివాడైపోతే నటుడు చిర్కోవ్ ఎలా వుంటాడో సరిగా అలా కనిపించే కమిస్సారు, ప్లూజ్నికోవ్ తన రాకను నివేదించి, కరచాలనం చేసేదాకా వేచియుండి, కుర్చీ చూపించి, మౌనంగా సిగరెట్లు పెట్టెను ముందుకుచాపాడు.

''నేను సిగరెట్లు కాల్చనండి'' అని చెప్పినప్పుడు కోల్యా ముఖం ఎర్రబారిపోయింది. అలా అతని ముఖం ఎర్రబడటానికి ఏ చిన్న కారణమైనా సరిపోయేది, ఒక్కొక్క సారి అదీ అవసరం లేకపోయేది.

''భేష్!'' కమిస్సారు అన్నాడు. ''నేనీ పాడు అలవాటు వదులుకోలేకుండా వున్నాను, నాకు అంత దృఢసంకల్పం లేదు.''

కమిస్సారు సిగరెట్టు ముట్టించాడు. సంకల్పాన్ని పటిష్ఠపరచుకొనే విషయంలో కోల్యా ఆయనకి ఓ చిన్న సలహా యివ్వబోయేలోగానే కమిస్సారు మళ్లీ మాట్లాడనారంభించాడు.

''లెఫ్టినెంట్, మీరు చిత్తశుద్ధితో, కష్టించి పాటుపడేవారన్న సంగతి మాకు తెలుసు. మాస్కోలో మీకు తల్లీ, చెల్లెలూ ఉన్న సంగతీ, వాళ్లని మీరు రెండేళ్లుగా చూడలేదన్న సంగతీ, చూడాలని కోరుకుంటున్న సంగతీ కూడా మాకు తెలుసు. మరి మీకు సెలవు కూడా వుంది.'' కమిస్సారు ఆగి, కుర్చీలోంచి లేచి, తన టేబిలు వెనకనుంచి బయటికొచ్చి, తన దృష్టిని పాదాలపై కేంద్రీకరించి అటూయిటూ నడయాడాడు. ''మాకు అదంతా తెలుసు, అయినాకూడా మేము కోరాలనుకున్న దానికి మిమ్మల్నే ఎంచుకున్నాం. ఇది ఆజ్ఞ కాదు, యిదొక అభ్యర్థన మాత్రమే అన్న సంగతి గుర్తుంచుకోండి ప్లూజ్నికోవ్. మీకు ఆజ్ఞలిచ్చే అధికారం యిప్పుడిక మాకెంత మాత్రం లేదు.''

''అలాగేనండి, కామ్రేడ్ రెజిమెంటల్ కమిస్సార్.'' తనను రికాన్నిజెన్సుకు* వెళ్లాల్సిందని అడగబోతున్నారన్న సంగతి కోల్యా మనస్సులో ఆకస్మికంగా రూఢి అవడంతో, అతను చెవులు గళ్లడేలా బిగ్గరగా అరిచి ''అలాగేనండి!'' అని చెప్పేందుకు సన్నద్ధుడయ్యాడు.

''మన స్కూలుని పెద్దది చేస్తున్నాం'' కమిస్సారు చెప్పాడు. ''పరిస్థితి తీవ్రంగా

---

* శత్రువుల స్థావరాలనూ, బలాన్నీ పూర్వపర్యవేక్షణ జరిపి సమాచారాన్ని సేకరించే వేగు పని. దీన్నే రికన్నాయిటర్ చెయ్యడమంటారు. — సం.

ఉంది, యూరప్‌లో యుద్ధం జరుగుతోంది. సాధారణ శిక్షణపొందిన కమాండర్లు మరింత మంది మనకి అవసరం. దీనికోసం మేము మరో రెండు శిక్షణ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నాం. అందుకవసరమైన పూర్తి సిబ్బంది మనకింకా రాలేదు, కాని సరంజామా అప్పుడే వచ్చేస్తోంది. అందుకని, కామ్రేడ్ ఫ్యూజ్నికోవ్, వాటిని అందుకొని, జమ రాసుకొమ్మని మిమ్మల్ని మేం కోరుతున్నాం."

ఆ విధంగా, "మూకుమ్మడి పనికోసం" ఫ్యూజ్నికోవ్ స్కూల్లోనే ఉండిపోయాడు. మిగిలిన కాడెట్లు ఎన్నడో యిళ్లకు వెళ్లిపోయి పడుచు పిల్లలను వేటాడుతూ, సరదాగా యీతాలు కొడుతూ, ఎండకాగుతూ, డాన్సులు చేస్తూండగా, కోల్యా యిక్కడ యీవిధంగా ఓపికగా పడకలెన్ని వచ్చాయో, ఎన్ని మీటర్ల కాలిపట్టీ గుడ్డ వచ్చిందో, ముతక టాప్ బూట్లు ఎన్ని జతలొచ్చాయో జమ రాసుకుంటూ, ఎడతెగని రిపోర్టులు రాస్తూవుండిపోయాడు.

అలాగ ఒక పక్షంరోజులు గడిచిపోయాయి. రెండు వారాలపాటు, ఒక్క రోజు కూడా సెలవు లేకుండా, తనింకా కాడెట్టేనన్నట్లూ, తను కదలాలంటే కస్సుబుస్సుమంటూండే తన సార్జెంట్ మేజరు దగ్గర్నుంచి తనకు పాస్ కావాలన్నట్లూ, ఉదయంనుంచి సాయంత్రం దాకా ఓపికగా కోల్యా వస్తున్న వస్తువులను అందుకుని, లెక్కపెట్టి, జమరాసుకున్నాడు.

జూన్‌లో స్కూల్లో బహు కొద్దిమంది మాత్రమే మిగిలారు. దాదాపు అందరూ క్యాంపుకి వెళ్లిపోయారు. అంతులేని లెక్కలూ, జాబితాలూ, రిపోర్టులతో సర్వసాధారణంగా తలమునకలుగా ఉంటూవచ్చిన కోల్యా, దాదాపు ఎవ్వరినీ కలుసుకోవడం తటస్థపడేది కాదు. అలాంటిది ఒక రోజున, తనకెవరో శాల్యూట్ చెయ్యడాన్ని సంతోష సంభ్రమాలతో కోల్యా గమనించాడు. ఆ శాల్యూట్ కూడా సైనిక నిబంధనల మేరకు, ఒక చెయ్యి చురుకుగా టోపీ దగ్గరకు లేచి, గడ్డం ముందుకు పొడుచుకొచ్చి, పూర్తి కాడెట్ బడాయితో చేసిన శాల్యూటది. కోల్యా దాన్ని అలసటతో కూడిన అలవోకతనంతో అందుకుంటున్నట్లు నటించడానికి నానా తంటాలూ పడ్డాడు, కాని అతని హృదయం యువజన సహజమైన అతిశయంతో ఎగిరి గంతేసింది.

దాని తర్వాత అతను సాయంకాలపు షికార్లు మొదలుపెట్టాడు. చేతులు వెనక్కి పెట్టుకొని, బారక్సు గేటు ముందు చివరి సిగరెట్టు దమ్ము లాగుతున్న కాడెట్ బృందం దిశగా — ఒక రకమైన విసుగుదలతో కూడిన చూపుతో ఎట్టఎదుటికి చూస్తూ, కాని "ఆఫీసరు..." అన్న శ్రద్ధాభక్తులతో కూడిన వాళ్ల గుసగుస స్వరాలు వినేందుకు తన చెవులు ఆతృత చెందుతూండగా — అతను వెళ్లాడు.

మరుక్షణంలో వాళ్ల చేతులు నుదుళ్లపైకి లేస్తాయన్న సంగతి అతనికి తెలుసు, బాల్యస్నిగ్ధమైన తన గుండ్రని ముఖానికి గంభీరాలోచనా ముద్రను కల్పించే ప్రయత్నంలో అతను తన కనుబొమలు ముడేశాడు.

"గుడీవెనింగ్, కామ్రేడ్ లెఫ్టినెంట్!"

మూడో సాయంత్రం అతనికి జోయా కలిసింది. వెచ్చని సంజ వెలుగులో ఆమె పళ్లు తెల్లగా మెరిశాయి. ఆమె దుస్తులకు దట్టంగా వున్న కుచ్చెళ్లు — వాటిని రెపరెపలాడించేందుకు గాలి ఏమాత్రం లేనందున — వాటంతట అవే రెపరెపలాడుతున్నట్టు కనిపించాయి. అప్రయత్నపూర్వకమైన యీ రెపరెప అతని కలవరపాటుకి కారణమైంది.

"కామ్రేడ్ లెఫ్టినెంట్, చిత్రంగా వుందే, ఈమధ్య ఎక్కడా మీ దర్శనాలే లేవే. మీరీ మధ్య లైబ్రరీకి బొత్తిగా రావడం మానేశారేమిటి?"

"పని తలమునకలుగా వుంది."

"వాళ్ళు మిమ్మల్ని యిక్కడే వుంచేశారా?"

"ప్రత్యేకమైన డ్యూటీ" కోల్యా గూఢార్థంగా అన్నాడు.

తన దోవకు బొత్తిగా సంబంధం లేకపోయినా, ఏ కారణంగానో అతను వెనక్కి తిరిగి ఆమెతో నడవనారంభించాడు. జోయా అవిరామంగా మాట్లాడుతూ నవ్వుతూనే వుంది. ఆమె మాట్లాడుతున్నదంతా దేన్ని గురించో పూర్తిగా అర్థంచేసుకోలేకపోయినా, తను తప్పుదారిలో ఆమె వెంట అణకువగా నడుస్తూవుండటం అతనికి ఆశ్చర్యమే గొలిపింది. అటు తర్వాత అతను, తన యూనిఫారానికి గల అద్భుతావహమైన కిర్రుశబ్దం అప్పుడే పోయిందా అని ఆశ్చర్యపోయాడు. పరీక్షార్థం అతను తన భుజాలను కదిపి చూసుకున్నాడు, అతని షోల్డరు బెల్టు గట్టిగా, ఉదాత్తంగా కిర్రుమని శబ్దం చేసింది...

"...నిజంగానే చిత్రం! మేము పొట్ట చెక్కలయ్యేలా నవ్వాం — అరే, మీరు వింటున్నట్టు లేదే, కామ్రేడ్ లెఫ్టినెంట్."

"అబ్బే, వింటున్నా. మీరు నవ్వారు."

ఆమె ఆగింది. మునిచీకటిలో ఆమె పళ్లు మరోసారి మెరిశాయి, ఇప్పుడిక అతను ఆమె చిరునవ్వును తప్ప మరిదేన్నీ చూడటంలేదు.

"మీరింతకు ముందు నేనంటే యిష్టపడ్డారు, ఔనా? ఔను కదండీ కోల్యా? కాని యిప్పుడో? నన్ను గురించి మీకెవరైనా ఏమైనా నూరిపోస్తున్నారా?"

"అబ్బే, అలాంటిదేం లేదు" అతను గుసగుసగా చెప్పాడు. "సంగతేమిటంటే — నాకు తెలియదు. మీకు పెళ్లయిందిట కదా?"

"పెళ్ళా?" ఆమె బిగ్గరగా నవ్వింది. "పెళ్లైందా నాకు? వాళ్లు చెప్పారన్న మాట, ఔనా? సరేనయ్యా, నాకు పెళ్లైతే ఏమిటిట? అది ఊరికే అలా జరిగిందంతే. అదొక యాదృచ్ఛిక సంఘటన. ఓ పొరపాటు."

అదెలా జరిగిందో గాని, తను ఆమె భుజాలను పట్టుకున్నట్లు అతను కనుగొన్నాడు.

లేక అతను తనకుతానుగా ఏమీ చెయ్యనే లేదేమో, ఆమే అతని చేత తెలివిగా అలా చేయించిందేమో, దాని పర్యవసానంగానే ఆకస్మికంగా అతని చేతులు ఆమె భుజాలపై వున్నాయేమో.

"ఏమైనా, ఆయనిక్కడ లేడు" ఆమె గడుసుగా చెప్పింది. "మనమీ తోవ వెంట ఆ కంచెదాకా వెళ్లి, ఆ కంచెవెంట మా యింటి దాకా వెళ్తే మనల్ని చూసేవాళ్లెవరూ వుండరు. ఏం, మీరలా మా యింటికి వచ్చి నాతో టీ తీసుకుంటారు కదూ, కోల్యా?"

ఓ గ్లాసు టీ పుచ్చుకుంటే బాగుంటుందనే అతనికి అనిపించింది. కాని సరిగా అదే క్షణంలో చీకటిగా వున్న ఆ దోవలోంచి మరింత నల్లగా వున్న ఒక మూర్తి వాళ్ల వంక ముందుకొచ్చి "క్షమించండి" అని పక్కకు వెళ్లిపోయాడు.

"కామ్రేడ్ రెజిమెంటల్ కమిస్సార్!" కోల్యా గాభరాగా అరిచి, చెంగున గెంతి, ఆ మూర్తి సరసకు చేరుకొని "కామ్రేడ్ రెజిమెంటల్ కమిస్సార్, నేను —" అన్నాడు.

"కామ్రేడ్ ప్లూజ్నికొవ్! అదేమిటి, ఆవిణ్ణి అక్కడే నిలబెట్టి యిలా వచ్చేశారేమిటి?"

"ఔనౌను — అంతేకదూ." కోల్యా వెనక్కి పరుగున వెళ్లి "జోయా, నన్ను క్షమించండి. పని. సైన్యానికి సంబంధించిన వ్యవహారం" అన్నాడు తొందరతొందరగా.

వాళ్లిద్దరూ లైలక్ త్రోవ విడిచి ప్రశాంతంగా వున్న బ్యారక్స్ చౌకును చేరుకునే లోగా కోల్యా కమిస్సార్‌తో నత్తులుకొడుతూ ఏమి చెప్పాడో మరో గంట పోయాక అతను పూర్తిగా మరచిపోయాడు. మామూలు వెడల్పుకి తక్కువ వెడల్పున్న కాలిపట్టీ గుడ్డని గురించో, లేక, మామూలు వెడల్పు కలిగినా తప్పరకం గుడ్డని గురించో అతనేమేమో చెప్పాడు... కమిస్సార్ వినివిని అకస్మాత్తుగా అడిగాడు.

"ఎవరావిడ? మీ స్నేహితురాలా?"

"అబ్బెబ్బే, అదేం కాదండి" కోల్యా గాభరాగా చెప్పాడు. "కామ్రేడ్ కమిస్సార్, ఆవిడ మన జోయాయేనండి, లైబ్రేరియన్. నేనో పుస్తకం తిరిగి తీసుకురాలేదండి, అందుకని —"

ముఖం ఎర్రబారుతూండగా అతను ఆగాడు. సత్ స్వభావం కలిగిన, వయస్కుడైన ఆ కమిస్సార్ పట్ల అతనికి విశేషమైన గౌరవభావముంది. తను అబద్ధం ఆడినందుకు అతను సిగ్గుపడిపోయాడు. కాని కమిస్సార్ మరి దేన్ని గురించో మాట్లాడనారంభించడంతో, కోల్యా కొంతసేపటికి తేరుకున్నాడు.

"ప్రతి చిన్న విషయాన్నీ రిజిస్టర్లలోకి ఎక్కించే విషయంలో నిర్లక్ష్యం చూపక మీరు సరిగా వ్యవహరించారు. సైనిక జీవితంలో అత్యల్ప విషయాలకు కూడా క్రమశిక్షణకు సంబంధించిన అసాధారణమైన ప్రాముఖ్యం వుంటుంది. మామూలు పౌరుడు నిరభ్యంతరంగా చెయ్యగల పనులు, రెగ్యులర్ ఆఫీసర్లమైన మనం చెయ్యలేం. ఉదాహరణకు, వివాహిత స్త్రీలతో మనం తిరగలేం, మనం నలుగురి దృష్టిలోనూ ఉండటమే యిందుకు

కారణం. మన కంటె క్రింది వాళ్ళకి ఆదర్శప్రాయులంగా ఉండటమన్నది, అనుక్షణం మన విధి. మీరీ విషయం బాగా అర్థంచేసుకున్నందుకు సంతోషం. కామ్రేడ్ ఫ్యూల్జిన్కొవ్, రేపు పదకొండున్నరకి నన్ను కలుసుకోండి. మీ భవిష్యత్తుని గురించి మనం మాట్లాడాల్సి వుంది. బహుశా మనం జనరల్‌గారి దగ్గరకి వెళ్ళాల్సిరావచ్చు."

"అలాగే, కామ్రేడ్ కమిస్సార్!"

"సరే, రేపటి దాకా సెలవ్." కమిస్సార్ తన చెయ్యి చాపి, కోల్యా చేతిని పట్టుకొని అన్నాడు: "ఆ పుస్తకాన్ని లైబ్రరీలో యిచ్చెయ్యడం మరచిపోకండి కోల్యా. మరచిపోకండేం!"

కమిస్సార్‌ని మోసగించవలసిరావడం చెడ్డదే, చాలా చెడ్డదేననడంలో సందేహంలేదు, కానైతే మొత్తంమీద ఏ కారణంగానైతేనేం, కోల్యా అందుకు మరీ ఎక్కువ బాధపడ లేదు. మిలిటరీ స్కూలు అత్యున్నతాధికారిని కలుసుకొనే అవకాశం తనకి కలుగబోతోంది. నిన్నటి దాకా కాడెట్ అయిన అతను ఆ క్షణం కోసం ఆతృతగా, భయంతో కూడిన కలవర పాటుతో, తన ప్రియునితో తొలి సమాగమం కోసం నవయువతి ఎదురుతెన్నులు చూసినట్లు ఎదురుచూశాడు. మేలుకొలుపు వాయిద్యానికి చాలా ముందే అతను లేచాడు, కిర్రుకిర్రుమనే తన టాప్‌బూట్లను అద్దంలాగా పాలిష్ చేసుకున్నాడు, కొత్త కాలర్‌లైనింగు కుట్టుకున్నాడు. తన గుండీలన్నీ శుభ్రంగా తుడుచుకున్నాడు. ఆఫీసర్ల మెస్సులో (తను అక్కడికి వెళ్ళగలిగినందుకూ, తన సొంత జేబులోంచి డబ్బులు తీసి చెల్లించగలిగినందుకూ అతను మహా గర్వించాడు) పట్టుమని అతనేమీ తినలేకపోయాడు; మూడు గ్లాసుల పళ్ళరసం మాత్రమే తీసుకున్నాడు. సరిగా పదకొండు గంటలకల్లా అతను కమిస్సార్ గదిగుమ్మం దగ్గరున్నాడు.

"హెయ్, ఫ్యూల్జిన్కొవ్ కులాసానా?" ఆ తలుపు దగ్గరే గొరొబ్‌త్సోవ్ కూడా వున్నాడు. కోల్యా కాడెట్ ప్లటూన్‌కి ఆయన పూర్వపు కమాండరు. ఆయన కూడా కోల్యా మాదిరిగానే బూట్లూ గీట్లూ పాలిష్‌చేసుకుని నీటుగా వున్నాడు. "నీ పనెలా సాగుతోంది? కాలిపట్టీల పని పూర్తయినట్లేనా?"

ఫ్యూల్జిన్కొవ్ ఆ ప్రశ్నను అక్షరాలా తీసుకుని తన పనిని గురించి సమగ్రంగా జవాబిచ్చాడు. తను — కోల్యా — యిక్కడేం చేస్తున్నాడని లెఫ్టినెంట్ గొరొబ్‌త్సోవ్ అడగలేదేమిటా అని లోలోపల కోల్యా అబ్బురపడ్డాడు. చివర అతను సూచనప్రాయంగా ఓ మాట జార విడిచాడు కూడా.

"నిన్న రెజిమెంటల్ కమిస్సారు అవీయివీ అడిగారు. తర్వాతేమో నన్నిక్కడికి —"

"నే చెప్పే మాట విను ఫ్యూల్జిన్కొవ్" గొరొబ్‌త్సోవ్ అతని మాట మధ్యలో అడ్డువచ్చి, గొంతు తగ్గించి అన్నాడు. "వాళ్ళొక వేళ నిన్ను వెలిచ్కొ దగ్గరకి పంపిస్తా

మంటే వెళ్లబోకు కోల్యా. నువ్వు నా దగ్గరకే వస్తానని చెప్పు, ఏం? మనం ముందునుంచీ కలిసి వున్నామనీ, ఒకళ్లకొకళ్లం బాగా అలవాటయ్యామనీ, ఏదో ఒకటి చెప్పు."

లెఫ్టినెంట్ వెలిచ్కొ కూడా ఒక కాడెట్ ప్లటూన్ — రెండో ప్లటూన్ — కమాండరే. గొరొబ్‌త్సోవ్‌కీ ఆయనకీ మధ్య నిత్యం ఏదో ఒక అంశంమీద రగడ జరుగుతూనే ఉండేది. గొరొబ్‌త్సోవ్ ఆంతర్యమేమిటో కోల్యాకి అర్థంకాకపోయినా, అతను మర్యాదగా తలూపాడు. అతను అడగబోతూండగా, యింతలోనే లోపలి కమిస్సార్ ఆఫీసు తలుపు తెరుచుకుని వెలిచ్కొ చిరునవ్వు నవ్వుతూ బయటికొచ్చాడు. అతను కూడా మిగిలినవాళ్ల మాదిరిగా చాలా నీటుగా వున్నాడు.

"నాకో కంపెనీ యిచ్చారు" అతను గొరొబ్‌త్సోవ్‌కి చెప్పాడు. "నీకు కూడా యివ్వాలని ఆకాంక్షిస్తున్నాను."

గొరొబ్‌త్సోవ్ చంగున లేచి నిలబడ్డాడు, అలవాటుప్రకారం తన సైనిక కోటును, ముడతను వెనక పక్కకు వచ్చే మాదిరిగా ముందు సాపు చేసుకుని, లోపలికెళ్లాడు.

"హెయ్, ప్లూజ్నికొవ్" అంటూ పలకరించి వెలిచ్కొ అతని పక్కనే చదికిలబడ్డాడు. "విశేషాలేమిటి? సంగతి సందర్భాలేమిటి? సామాన్లన్నీ అందుకోవడం, అప్పగించడం పూర్తయిందా?"

"మొత్తంమీద అయిపోయినట్లేనండి." కోల్యా తన పనికి సంబంధించిన విషయాలన్నింటినీ సవివరంగా వర్ణించనారంభించాడు. కాని కమిస్సారుని గురించి సూచనప్రాయంగా అతను చెప్పగలిగేందుకు ముందే, వెలిచ్కొ ఓర్పు లేకుండా అతనికి అడ్డు తగిలాడు.

"కోల్యా, నీకే కనుక అవకాశమొస్తే నాతో ఉంటానని అడుగు. నేనీ విషయం పరోక్షంగా సూచించాననుకో, కాని నువ్వు కోరితే బాగుంటుంది."

"ఏం కోరిక?"

సరిగా ఆ క్షణంలో కమిస్సార్ లెఫ్టినెంట్ గొరొబ్‌త్సోవ్‌లు నడవలో అడుగుపెట్టారు, దానితో వెలిచ్కొ కోల్యాలు తటాలున లేచి నిటారుగా నిలబడ్డారు. "మీ ఆజ్ఞ ప్రకారం..." కోల్యా లాంఛనప్రాయంగా మొదలుపెట్టాడు, కాని కమిస్సార్ అతన్ని పూర్తిచెయ్యనివ్వలేదు.

"రండి, కామ్రేడ్ ప్లూజ్నికొవ్, జనరల్ ఎదురుచూస్తున్నారు. కామ్రేడ్స్ కమాండర్స్, మీరిక వెళ్లొచ్చు."

డ్యూటీ ఆఫీసరు కూర్చునే ముందుగది గుండా కాకుండా, మరో ఖాళీగది గుండా వాళ్ళు లోపలికెళ్లారు. ఆ గదికి వెనక పక్క రెండో తలుపుంది; తడబడుతున్న కోల్యాను అక్కడ వదిలి కమిస్సారు లోపలికెళ్లాడు.

కోల్యా యింతదాకా జనరల్‌ను ముఖాముఖీ కలుసుకున్నది తనకు ఆయన రివాల్వరును అందజేసినప్పుడు మాత్రమే. అదిప్పుడు తన నడుముకి పక్కన సొగసుగా వేలాడుతోంది.

నిజమే, వాళ్లిద్దరూ తారసిల్లిన సందర్భం మరొకటి కూడా లేకపోలేదు. జనరల్ యీ విషయాన్ని పూర్తిగా మరచిపోయే వుంటాడు, కానైతే, ఆ సంఘటనను తలుచుకుంటేనే కోల్యాకి తత్తరపాటు కలిగింది.

అది రెండేళ్ల క్రితంనాటి మాట. అప్పటికింకా పౌర దుస్తుల్లోనే వున్న, అప్పటికే తల అంటకత్తెర వెయ్యబడిన కోల్యా, అదే మాదిరిగా అంటకత్తెర వెయ్యబడిన యితరులతో కలిసి అప్పుడే స్టేషనునుంచి వచ్చాడు. సూట్‌కేసులు బ్యారక్స్ చౌకులో దింపబడ్డాయి. బొద్దుమీసాల సార్జెంట్ మేజరు (విందు రోజున కుర్రాళ్లు ఓ దరువు వెయ్యాలనుకున్నది ఈయననే) వాళ్లందర్నీ స్నానగృహానికి వెళ్లమని ఆజ్ఞాపించాడు. వాళ్లు బారులుతీరి వెళ్లకుండా, పోలోపోలోమంటూ గుంపుగా మాట్లాడుకుంటూ, నవ్వుతూ వెళ్లారు. కాని పాదం బొబ్బెక్కిన కోల్యా తన బూటు విప్పదీశాడు. తిరిగి దాన్ని అతను తొడుక్కునేసరికి మిగిలిన వాళ్లందరూ మలుపుతిరిగి మాయమయ్యారు. కోల్యా చంగున లేచి నిలబడ్డాడు. తను కూడా వాళ్ల వేపు దూసుకుపోబోతుండగా అతనికొక అరుపు వినిపించింది.

''ఏయ్ అబ్బాయ్, ఎక్కడికెళ్తున్నావ్?''

పొట్టిగా ఒడిలిపోయి వున్న ఒక జనరల్ అతనివంక తేరిపారజూస్తున్నాడు.

''ఇది సైన్యం, యిక్కడ ఆజ్ఞలు తు.చ తప్పకుండా పాటింపబడాలి. సామానును కాపలాకాయమని నీకు ఆజ్ఞ జారీ అయితే నిన్ను మరొకళ్లు వచ్చి విడుదలచేసేదాకానో, లేక ఆ ఆజ్ఞ మార్చబడేదాకానో నువ్విక్కడుండి కాపలాకాయాల్సిందే.''

కోల్యాకి ఎవరూ ఏ ఆజ్ఞా జారీచెయ్యలేదు, కాని అది వుండే వుంటుందనడంలో అతనికి సందేహమేమీ లేకపోయింది. అందుకని అతను అస్తవ్యస్తంగా నిటారుగా నిలబడి బొంగురుగా అన్నాడు: ''అలాగే, కామ్రేడ్ జనరల్!''

అతని దురదృష్టమేమిటోగాని, మిగిలినవాళ్లు అంతలోనే మాయమైపోయారు. స్నానాల తర్వాత వాళ్లకి కాడెట్ యూనిఫారాలిచ్చారనీ, అటుతర్వాత సార్జెంట్ మేజరు వాళ్లని యూనిఫారాల్లో మార్పులేమైనా అవసరమైతే చేయించడానికని దర్జీ షాపుకి తీసుకెళ్లాడనీ తర్వాత తెలియవచ్చింది. దీనంతకీ చాలా సేపే పట్టింది, కోల్యా అంతసేపూ అణకువగా — ఎవరికీ అవసరంలేని ఆ సామాన్లగుట్ట దగ్గరే నిలబడ్డాడు. తనేదో మందుగుండు గిడ్డంగిని కాపాడుతున్నంత మితిమీరిన గర్వంతో అతనక్కడ నిలబడ్డాడు. అంత క్రితం సాయంత్రం హద్దులు మీరినందుకు గాను శ్రమ శిక్షలు విధింపబడిన యిద్దరు కాడెట్లు దిగాలు ముఖాలతో అక్కడికొచ్చేదాకా అతన్ని పట్టించుకున్నవాళ్లే లేకపోయారు.

''ఆగండి!'' కోల్యా అరిచాడు. ''దగ్గరకొస్తే మాటదక్కదు!''

''ఏమిటేమిటి?'' ఆ కాడెట్లిద్దరిలో ఒకడు దురుసుగా అన్నాడు. ''వాగావంటే మూతిపళ్లు రాలుతాయి!''

"ఏయ్ వెనక్కెళ్ళు!" ఫ్రూల్జిన్కోవ్ ఆవేశంతో గర్జించాడు. "నేనిక్కడ కాపలా డ్యూటీలో వున్నాను! నేను ఆజ్ఞాపిస్తున్నాను – వెనక్కి వెళ్ళు!"

అతను నిరాయుధుడుగా ఉన్న మాట నిజమే అయినా, అతనెంత గట్టిగా అరిచాడంటే, దానితో కాడెట్లు, ఎందుకైనా మంచిదన్నట్లు, పట్టుపట్టకుండా వెనక్కి తగ్గారు. వాళ్ళు డ్యూటీ కాడెట్ దగ్గర కెళ్ళారు, కాని కోల్యా అతని మాట మన్నించడానికి కూడా నిరాకరించి, తనకి బదులు మరొకర్ని అక్కడ కాపలా పెట్టమనీ, లేకపోతే తనను అక్కడి నుంచి వెళ్ళాల్సిందిగా అధికారపూర్వకమైన ఆజ్ఞ తీసుకురమ్మనీ డిమాండ్ చేశాడు. అతని స్థానంలో మరొకడు రానూ లేదు, రావడం సాధ్యమూ కాదేమో, అతను ఎవరి ఆజ్ఞలు పాలిస్తున్నాడన్న ప్రశ్న తలెత్తింది. కాని కోల్యా వాళ్ళకి సంజాయిషీలు చెప్పేందుకు తిరస్కరించి, అదే పనిగా అరుపులు సాగించడంతో స్కూలు డ్యూటీ ఆఫీసరు అక్కడికొచ్చాడు. అతని కోటు చేతిపైన గల ఎర్ర పట్టీ ప్రభావం అమోఘంగా పనిచేసింది; కానైతే డ్యూటీనుండి విడుదల చెయ్యబడిన తర్వాత తనెక్కడికెళ్ళాలో, ఏం చెయ్యాలో కోల్యాకి బోధపడలేదు. ఈ సంగతి డ్యూటీ ఆఫీసరుకీ అంతుచిక్కలేదు, సంగతిసందర్భాలు తేలేసరికి స్నానగృహం మూతపడింది. దానితో కోల్యా మరోరోజు మామూలు పౌరుడుగా గడపాల్సివచ్చింది. అదిగో ఆ విధంగా సార్జెంటు మేజరుగారి తీవ్రాగ్రహాన్ని తన నెత్తిమీదకు తెచ్చుకున్నాడు కోల్యా.

ఈరోజు తను జనరల్‌గారిని మూడోసారి కలుసుకోబోతున్నాడు. అతనీ సమావేశం కోసం ఒక వంక ఆతృతగానే నిరీక్షిస్తున్నా మరో వంక అతని ధైర్యం జావకారిపోతూనే వుంది. జనరల్‌గారు స్పానిష్ ఘటనల్లో పాల్గొన్నారన్న నిగూఢమైన పుకార్లను అక్షరాలా అతను నమ్మాడు. అతనా పుకార్లని బాగా విశ్వసించాడేమో, యిటీవలే నిజమైన ఫాసిస్టులనూ, నిజమైన యుద్ధాలనూ చూసిన జనరల్‌గారి కళ్ళంటే అతను భయపడకుండా ఉండలేకపోయాడు.

చిట్టచివరకు తలుపు తెరుచుకుంది, కమిస్సారు అతన్ని లోపలకి పిలిచాడు. కోల్యా హడావిడిగా తన కోటును కిందకి లాక్కున్నాడు, పొడారిన తన పెదవులు తడుపుకున్నాడు, మందంగా వున్న కర్టెను దాటి లోపలకి వెళ్ళాడు.

ఈ ద్వారం మామూలు సింహద్వారానికి ఎదురుగా వుంది, ఆ కారణంగా కోల్యా జనరల్‌గారి వంగిన వీపు వెనక ఉన్నాడు. దానితో అతను తబ్బిబ్బుపడ్డాడు, తను కోరుకున్నంత చురుకుగా రిపోర్టు చెయ్యలేకపోయాడు. రిపోర్టు విని జనరల్ తన డెస్కు ముందున్న ఓ కుర్చీవంక సంజ్ఞ చేశాడు. కోల్యా మోకాళ్ళపై చేతులాన్చి అసహజంగా నిటారుగా కూర్చున్నాడు. జనరల్ అతని వంక నిశితంగా చూశాడు, తర్వాత కళ్ళజోడు పెట్టుకున్నాడు (వాటిని చూస్తేనే కోల్యాకు ఉలికిపాటు కలిగింది), ఎర్రటి ఫోల్డరులో క్లిప్ చెయ్యబడిన కాగితాల

బొత్తిని పరిశీలనగా చూడనారంభించాడు. అయితే, ఆ కాగితాలు తనకి సంబంధించినవేనని కోల్యాకు అప్పటికింకా తెలియదు.

"ఒక్క సబ్జెక్టులో తప్ప అన్నింట్లోనూ ఫస్టు గ్రేడులే" జనరల్ అబ్బురపడ్డాడు. "మరి ఈ మామూలు ప్యాసుమార్కు దేంట్లో?"

"ఆ మామూలు ప్యాసుమార్కు సైనిక వస్తు సరఫరాలోనండి" కోల్యా ఆడపిల్లలా సిగ్గుపడిపోతూ జవాబిచ్చాడు. "నేనందులో మళ్లీ పరీక్ష యిస్తానండి, కామ్రేడ్ జనరల్."

"అది జరిగేది కాదులే, కామ్రేడ్ లెఫ్టినెంట్, యిప్పటికే చాలా లేటైపోయింది" జనరల్ నవ్వాడు.

"కమ్సొమోల్‌నుంచీ, అతని కామ్రేడ్సునుంచీ చాలా మంచి అభిప్రాయాలున్నాయి" కమిస్సారు తాపీగా అందించాడు.

"ఆహా" జనరల్ ఆ పత్రాలు చదవడంలో మునిగిపోయి గుర్రుమన్నాడు.

కమిస్సారు తెరిచిన కిటికీ దగ్గరకు వెళ్లి, సిగరెట్టు ముట్టించి, కోల్యా వంక పాత మిత్రుని మాదిరిగా మందహాసం చేశాడు. కోల్యా తన పెదవులను మర్యాదపూర్వకంగా మెదిపి, తిరిగి జనరల్ కళ్ల మధ్య ఎక్కడో వున్న ఒక చుక్క వంక తదేకంగా చూస్తూ కూర్చున్నాడు.

"నువ్వు మంచి గురికాడివిటగదా?" జనరల్ ప్రశ్నించాడు. "తుపాకి గురిలో నీకు బహుమతులొచ్చినట్లున్నాయే, ఔనా?"

"ఇతను తన స్కూలు ప్రతినిధిగా పోటీల్లో పాల్గొన్నాడు."

"శభాష్" జనరల్ ఎర్ర ఫోల్డర్ని మూసేసి, పక్కకి నెట్టి, తన కళ్లద్దాలు తీసేశాడు. "నీ విషయంలో మాదొక ప్రతిపాదన వుంది కామ్రేడ్ లెఫ్టినెంట్."

కోల్యా ఏమీ అనకుండా ఆతృతగా ముందుకు వంగాడు. కాలిపట్టీల రికార్డరుగా తన పని తర్వాత, రికాన్నిజెన్సు విషయంలో యిప్పుడిక అతనికేవిధమైన ఆశా లేదు.

"ఒక ట్రెయినింగ్ ప్లటూన్ కమాండరుగా నువ్విక్కడే ఉండిపోవాలని మా ప్రతిపాదన" జనరల్ అన్నాడు. "ఇది బాధ్యతాయుతమైన స్థానం. అన్నట్టు నీ పుట్టిన తేదీ ఏమిటి?"

"నా పుట్టిన తేదీ 1922 ఏప్రిల్ పన్నెండండి" కోల్యా అప్పగించినట్టు చెప్పాడు.

తను ఏం చెయ్యాలా అని ఉద్రిక్తంగా ఆలోచించుకుంటున్నాడేమో అతనీ జవాబును యాంత్రికంగా చెప్పాడు. నిన్నటిదాకా కాడెట్‌గా ఉన్నవాడికి, నిజానికి యిదో పెద్ద గౌరవమే. అయినా కూడా, కోల్యా చురుకుగా ఎగిరిగంతేసి: "కృతజ్ఞుణ్ణి కామ్రేడ్ జనరల్!" అంటూ అరిచి చెప్పలేకపోయాడు. యుద్ధరంగంలో పనిచేస్తూ, తన సైనికులతో తింటూ తిరుగుతూ, వాళ్లని కమాండ్‌చెయ్యడం నేర్చుకోవడం ద్వారా మాత్రమే ఎవరైనా సిసలైన

కమాండరు కాగలడన్న దృఢమైన విశ్వాసం కారణంగానే అతనలా తన అంగీకారాన్ని తెలియ జెయ్యలేకపోయాడు. అటువంటి కమాండరు అవాలనే తనెప్పుడూ కోరుకుంటూ వచ్చాడు. ఇతరులు వైమానికులో లేక కనీసం టాంకుచోదకులో కావాలని కలలుగనగా, అతనిలా యీ సాధారణ కాడెట్ స్కూలుకి వచ్చినది సరిగా యిలాంటి కమాండరు అవాలనే.

"మూడేళ్లలో నువ్వు అకాడెమీలో చేరడానికి అర్హత సంపాదించుకుంటావు" అంటూ జనరల్ కొనసాగించాడు. "ఏవిధంగా చూసినా, నువ్వు నీ చదువు కొనసాగించాలి."

"నువ్వు ఏ కంపెనీలో ఉండదలుచుకున్నావు — గొరొబ్త్సోవ్ కంపెనీయా, లేక వెలీచ్కొ కంపెనీయా? ఈ విషయంలో ఎంచుకొనే అవకాశం కూడా నీకే యిస్తున్నాం" కమిస్సార్ నవ్వుతూ చెప్పాడు.

"బహుశా అతనికి గొరొబ్త్సోవ్ అంటే విసుగెత్తిందేమో" అంటూ జనరల్ నవ్వాడు.

గొరొబ్త్సోవ్ పట్ల తన కెంత మాత్రం విసుగు కలగలేదనీ, గొరొబ్త్సోవ్ చాల చక్కని కమాండరనీ అతను చెప్పాలనుకున్నాడు. కాని నికొలాయ్ ప్లూజ్నికొవ్ అనబడే తను, స్కూల్లో ఉండిపోవాలని ఎలాగూ అనుకోడం లేదు కాబట్టి, ఆ విషయం తను చెప్పినా చెప్పకపోయినా పెద్ద తేడా లేదనుకున్నాడు. తనకు కావలసింది: ఒక యూనిట్టూ, సైని కులూ, ప్లటూన్ కమాండరు మొయ్యవలసిన బరువుబాధ్యతలూ — "యాక్టివ్ డ్యూటీ" అన్న పదంలో యిమిడివున్న సమస్తం. ఇదంతా అతను చెప్పాలనుకున్నాడు, కాని అతని మన స్సులో యీ మాటలు చిందరవందరగా గజిబిజి అయిపోయాయి, దానితో అతను మరోసారి సిగ్గుపడిపోయాడు.

"కావాలంటే ఓ సిగరెట్టు కాల్చుకో, కామ్రేడ్ లెఫ్టినెంట్" మందహాసం మరుగు పరుస్తూ జనరల్ అన్నాడు. "సిగరెట్టు అంటించుకుని ఆలోచించు."

"అదేం లాభం లేదు" కమిస్సారు నిట్టూర్చాడు. "ఇతను సిగరెట్టు కాల్చడు."

"నేను సిగరెట్టు కాల్చను" కోల్యా ధృవీకరించి, జాగ్రత్తగా దగ్గాడు. "నేను మాట్లాడొచ్చా, కామ్రేడ్ జనరల్?"

"చెప్పు, నేను వింటున్నాను."

"కామ్రేడ్ జనరల్, కృతజ్ఞతలు. మీరు నాపై వుంచిన విశ్వాసానికి మీకు అనేక కృత జ్ఞతలు. మీ సూచన చాలా గౌరవప్రదమైనదన్న సంగతి నాకు తెలుసు. అయినాకూడా, ఈ సూచనను తిరస్కరించేందుకు నాకు అనుమతి యిప్పించండి, కామ్రేడ్ జనరల్."

"ఏం, ఎందుకనిట?!" కమిస్సారు కిటికీ దగ్గర్నుంచి పక్కకు జరిగాడు. అతని కనుబొమలు ముడివడ్డాయి. "నీ గొప్ప ఆలోచనేమిటో మేము కూడా వినొచ్చా కామ్రేడ్ ప్లూజ్నికొవ్?"

జనరల్ మౌనంగా అతని వంక — ఆసక్తితోనే అన్న విషయం స్పష్టం — చూస్తూ వుండటంతో, కోల్యా ధైర్యం పుంజుకున్నాడు.

"ప్రతి కమాండరూ మొదట రంగంలో పనిచెయ్యడం అవసరమని నేను గట్టిగా నమ్ముతున్నాను, కామ్రేడ్ జనరల్. మాకు స్కూల్లో నేర్పినది అదే, అంతెందుకు విందు నాటి సాయంత్రం మాట్లాడుతూ పోరాట బలగాలతో కలిసి పనిచేసినప్పుడే ఎవరైనా నిజమైన కమాండరు కాగలరని, కామ్రేడ్ కమిస్సారే స్వయంగా చెప్పారు."

కమిస్సారు తత్తరపాటుగా దగ్గి, మళ్లీ కిటికీ దగ్గరకు వెళ్లిపోయాడు. జనరల్ యింకా కోల్యా వంకకే చూస్తున్నాడు.

"అందుకని — మీకు కృతుజ్ఞుడినేననుకోండి, కామ్రేడ్ జనరల్ — అందుకని, దయచేసి, రంగంలో పనికి నన్ను పంపాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాను. ఏ యూనిట్టయినా, ఏ ఉద్యోగమైనా సరే నాకు అభ్యంతరం లేదు."

కోల్యా ఆపుచేశాడు, మధ్య విరామం ఏర్పడింది. ఆ విరామాన్ని గురించి జనరల్‌గాని, కమిస్సార్‌గాని గమనించనేలేదు, కాని కోల్యాకి మాత్రం క్షణమొక యుగంగా కనిపించింది. అతని తత్తరపాటు క్షణక్షణం పెరిగింది.

"నేను అర్థం చేసుకున్నాననుకోండి కామ్రేడ్ జనరల్ — "

"కాని, ఇతను భలే మనిషోయ్, కమిస్సార్" జనరల్ అకస్మాత్తుగా హుషారుగా అన్నాడు. "భలే వాడివోయ్, లెఫ్టినెంట్, భలేవాడివి!"

కమిస్సార్ అకస్మాత్తుగా నవ్వి కోల్యా భుజంపైన గట్టిగా చరిచాడు.

"నువ్వు యీ విషయం గుర్తుచేసినందుకు థాంక్స్, ప్ల్యూజ్నికొవ్!"

ఒక రకమైన యిబ్బందికరమైన పరిస్థితినుంచి బయటపడే మార్గం దొరికినట్లు ఆ ముగ్గురూ కూడా మందహాసాలు చేశారు.

"అయితే నీకు రంగంలో పని కావాలన్నమాట, అంతేనా?"

"ఔను, కామ్రేడ్ జనరల్."

"మళ్లీ మనసు మార్చుకో వన్న మాటేనా?"

"లేదు."

"అయితే నిన్నెక్కడికి పంపించినా అభ్యంతరం లేదా?" కమిస్సార్ అడిగాడు. "మరి మీ అమ్మ సంగతీ, చెల్లి సంగతీ ఏమిటి? ఇతని తండ్రి లేడు కామ్రేడ్ జనరల్."

"నాకు తెలుసు." జనరల్ చిరునవ్వు నవ్వడం మానేశాడు. కోల్యావంక గంభీరంగా చూశాడు. ఎర్ర ఫోల్డరుమీద వేళ్లతో దరువువేశాడు. "ప్రత్యేక పశ్చిమ మండలం నీకు యిష్టమేనా లెఫ్టినెంట్?"

కోల్యా ముఖం ఎర్రబారింది; ప్రత్యేక మండలంలో పని చెయ్యడమన్నదాన్ని వాళ్లంతా

ఏదో విభ్రాంతిజనకమైన మహాభాగ్యం అన్నట్లు, దాన్ని గురించి కలలుగంటూండేవారు. ''ప్లటూన్ కమాండరుగా?''

''కామ్రేడ్ జనరల్!'' కోల్యా దిగ్గున లేచి నిలబడి, క్రమశిక్షణ సంగతి గుర్తుకురాగా, మళ్లీ కూర్చున్నాడు. ''థాంక్ యూ, థాంక్ యూ, కామ్రేడ్ జనరల్!''

''కాని ఒక్క షరతుమీద'' జనరల్ అతి గంభీరంగా అన్నాడు. ''రంగంలో పని చేసేందుకు నీకు నేనొక్క ఏడాదే యిస్తున్నాను, లెఫ్టినెంట్. సరిగా ఒక్క ఏడాది తర్వాత నిన్ను నేనిక్కడికి ట్రెయినింగ్ ప్లటూన్ కమాండరుగా రప్పిస్తాను. అందుకు నీకు ఒప్పదలేనా?''

''ఒప్పదలే, కామ్రేడ్ జనరల్. మీ ఆజ్ఞలకు బద్ధుణ్ణి...''

''అవే మా ఆజ్ఞలు'' కమిస్సార్ నవ్వాడు. ''సరిగా నీలాంటి పొగతాగని వాళ్లే మాకు కావాలి!''

''అయితే ఒక్కటే యిబ్బంది వుంది, లెఫ్టినెంట్: నీకు నీ సెలవుండదు. ఆదివారం దాటకుండా నువ్వు నీ యూనిట్‌తో వుండాలి.''

''ఔనౌను, మాస్కోలో మీ అమ్మగారితో కలిసివుండేందుకు నీకు ఎక్కువ వ్యవధి వుండదు'' కమిస్సార్ నవ్వుతూ అన్నాడు. ''మాస్కోలో ఆవిడ ఎక్కడుంటున్నారు?''

''అస్టొజెంక వీధిలో... అదే – ఇప్పుడు దాన్ని మెట్రొస్ట్రోయెవ్‌స్కయా వీధి అంటారు.''

''అస్టొజెంక'' అంటూ జనరల్ నిట్టూర్చి, లేచి నిలబడి కోల్యాకి తన చేతిని అందించాడు. ''సరే, నీ ఉద్యోగంలో బాగా పనిచెయ్యి లెఫ్టినెంట్. మరి జ్ఞాపకముంచుకుంటావు కదా, ఓ ఏడాదిలో నువ్విక్కడికి తిరిగివస్తావు!''

''థాంక్ యూ, కామ్రేడ్ జనరల్. గుడ్‌బై'' కోల్యా బిగ్గరగా అని, పెరేడ్‌లో మాదిరిగా నడుచుకుంటూ బయటకి వెళ్లిపోయాడు.

అప్పట్లో రైలు టిక్కెట్లు దొరకడం బహుకష్టంగా ఉండేది. కాని కమిస్సారు, కోల్యాను నిగూఢమైన ఆ గదిలోంచి బయటకు నడిపించుకెళ్లి, అతనికి టిక్కెట్టు దొరికేలా చూస్తానని వాగ్దానంచేశాడు. ఆ రోజంతా కోల్యా సరంజామాలు చేసుకోడంలోను, సంతకాలకోసం అటూయిటూ పరుగెత్తడంలోనూ, ఆఫీసులో కాగితాలు తీసుకోడంలోనూ గడిపాడు. ఆ రోజున సంతోషకరమూ సంభ్రమజనకమూ అయిన మరో ఘటన అతనికి తటస్థపడింది; ప్రత్యేక డ్యూటీలు నిర్వహించినందుకుగాను అతన్ని ఆధికారికంగా అభినందిస్తూ జనరల్ ఒక ఆర్డరు జారీచేశాడు. ఆ సాయంత్రం డ్యూటీ ఆఫీసరు అతనికి రైల్వే టికెట్‌ను అందజేశాడు, నాలుగు పక్కలా అందరికీ గుడ్‌బై చెప్పాక, కోల్యా ప్లూజ్నికొవ్ తన కొత్త ఉద్యోగానికి – మాస్కోగుండా, తన ప్రయాణానికి కేవలం మూడే రోజులు, ఆదివారం దాకానే తనకు వ్యవధి ఉండగా – బయల్దేరాడు.

2

రైలు మాస్కోకి ఉదయంపూట చేరుకుంది. కోల్యా క్రొపోత్కిన్స్కయ వీధి దాకా మెట్రోలో వెళ్ళాడు — ఎస్కలేటరు మీదుగా దిగుతూ, ప్రపంచం మొత్తంమీదనే మిక్కిలి సుందరమైన భూగర్భ రైలుమార్గమని సగర్వంగా, ఒళ్ళు పులకరిస్తూండగా తనకుతనే చెప్పుకున్నాడు. అతను ప్యాలెస్ ఆఫ్ సోవియట్స్ స్టేషన్ దగ్గర మెట్రోనుంచి మళ్ళీ పైకొచ్చాడు. అతనికి ఎదురుగా ఎత్తైన దిట్టమైన దడి వుంది. దాని వెనుక ఏదో ధనధన కొడుతున్న శబ్దాలు, బుస్సుబుస్సు మంటున్న శబ్దాలు, గడగడ పడుతున్న శబ్దాలు అవుతున్నాయి. ఈ దడి వెనకే, ప్రపంచం మొత్తం మీదనే అత్యున్నత భవనం కాబోతున్న, నడినెత్తిన బ్రహ్మాండమైన లెనిన్ విగ్రహం కలిగిన ప్యాలెస్ ఆఫ్ సోవియట్స్‌కు — పునాదులు వెయ్యబడుతూండటాన్ని అతను మహా సంతోషంగా చూశాడు.

మిలిటరీ స్కూల్లో చేరడానికి రెండేళ్ల క్రితం తను విడిచివెళ్ళిన యింటిముందు కోల్యా ఆగాడు. మాస్కోలో వుండే అనేకవాటాల మామూలు యిళ్లలో ఈ యిల్లు ఒకటి. మూసిన ఆవరణ లోపలకి ప్రవేశించడానికి కమానుద్వారం కలిగి, పిల్లలు విశేషంగా కలిగిన ఈ యిల్లు అంటే అతనికి చాలా యిష్టం. అతనికి ఈ యింట్లోని ప్రతి తలుపూ, ప్రతి మెట్లవరుసా, ప్రతి మూలా, ప్రతి మూలలోని ప్రతి యిటుకా క్షుణ్ణంగా తెలుసు. అది అతని యిల్లు, "జన్మ భూమి" అన్న భావన ఒకింత ఆడంబరమైనదనుకుంటే, ఈ యిల్లు సాక్షాత్తూ స్వగృహం, ప్రపంచంలో కెల్ల అత్యంత ప్రీతిపాత్రమైన స్థానం.

కోల్యా ఆ యింటిముందు నిలబడి, చిరునవ్వులు చిందిస్తూ, ఆవరణ లోపల ఎండ బాగా పడే పక్క, నిర్విరామంగా మేజోళ్ల అల్లుతూ అటూ యిటూ వెళ్లే ప్రతివాళ్ళతోనూ మాట్లాడుతూ మత్వేయెవ్నా కూర్చుని వుంటుందని గుర్తుచేసుకున్నాడు. ఆమె తనని ఎలా ఆపుచేస్తుందో, తనెక్కడికి పోతున్నాడు, ఎక్కడ్నుంచి వచ్చాడు, తనెవరు అంటూ ఎలా ఆరాలు తీస్తుందో మనస్సులో చిత్రించుకున్నాడు. కారణమేమైనా గానీ, మత్వేయెవ్నా తనను ఎటువంటి పరిస్థితిలోనూ గుర్తుపట్టలేదని అతనికి దృఢమైన నమ్మకం ఏర్పడింది; అలా జరుగుతుందని అతను సంతోషంగా ఎదురుచూశాడు.

అంతలోనే యిద్దరు అమ్మాయిలు గేటులోంచి బయటికొచ్చారు. వాళ్ళిద్దరిలో ఒకామె కొంచెం పొడుగ్గా వుంది, పొట్టిచేతుల ఫ్రాక్ తొడుక్కుంది, అదే వాళ్ళిద్దరి మధ్యా వున్న తేడా అల్లా. వాళ్ళిద్దరి కట్టూబొట్టూ ఒక్క లాగున్నాయి, ఇద్దరూ తెల్ల మేజోళ్ళూ, ఓపెన్ బూట్లే తొడిగారు. వాళ్లలో పొట్టి అమ్మాయి చేతిలో సూట్‌కేసుతో అసహజంగా నిటారుగా నిలబడ్డ లెఫ్టినెంటు కేసి చటుక్కున కన్నెత్తి చూసి, తన స్నేహితురాలి దిశగా కొంచెం ముందుకెళ్ళి, అంతలోనే నడకను మందగింపచేసి, వెనక్కి తిరిగి చూసింది.

“వేరా?” కోల్యా లోగొంతులో అన్నాడు. “వేరా, నువ్వేనా బుల్లిదయ్యం, నువ్వేనా?”

వేరా అరుపు మనేజ్నయా మైదానం దాకా వినిపించి వుంటుంది. ఉరుకులూ పరుగులతో వచ్చి ఆమె చిన్నతనంలో మాదిరిగా మోకాళ్లను వెనక్కు వంచి అమాంతం అతని మెడకి వాలేసుకుంది. ఆమె తాకిడికి అతను దాదాపు కిందపడబోయి నిలదొక్కుకున్నాడు. అతని బుల్లి చెల్లాయి ఇదివరకటి కంటె బాగా బరువెక్కింది.

“కోల్యా! కోలెచ్కా! కోల్యా!”

“ఓసినీ, ఎంతెదిగి పోయావే!”

“నాకు పదహారేళ్లొచ్చాయి తెలుసా!” ఆమె సగర్వంగా అరిచి చెప్పింది. “ఏం మహా నువ్వేనా ఏమిటమ్మా పెరిగేది? ఓహో – నువ్విప్పుడు లెఫ్టినెంటువన్న మాట! వాల్యా, లెఫ్టినెంటుగారిని అభినందించు.”

మందహాసం చేస్తూ పొడుగమ్మాయి దగ్గరకొచ్చింది.

“నమస్తే, కోల్యా.”

అతని కళ్లు, రంగుపట్టీల నూలు ఫ్రాక్ లోపలినుంచి ఉబ్బెత్తుగా పొడుచుకొచ్చిన ఆమె రొమ్ములపై వాలాయి. రెండేళ్ల క్రితం అవి అక్కడ లేవు. రివటల్లా, పొడవాటి కాళ్లతో గొల్లభామల్లా ఉండే యిద్దరమ్మాయిలు అతనికి బాగా గుర్తున్నారు. అతను తన కళ్లను హడావిడిగా మళ్లించుకున్నాడు.

“అమ్మాయిలూ, మిమ్మల్ని నేను గుర్తేపట్టలేకపోయాను సుమా.”

“బాప్‌రే, మేమింక స్కూలుకి పరిగెత్తాలి” వేరా నిట్టూర్చింది. ఈ రోజే ఆఖరి కమ్సొమోల్ మీటింగు. ఎగ్గొట్టేందుకు ఎంత మాత్రం వీల్లేదు.”

“మేం సాయంత్రం కలుస్తాం నిన్ను” వాల్యా అంది.

ఆమె కళ్లు ఆశ్చర్యం గొలిపేటంత ప్రశాంతంగా వున్నాయి. ఆమె అతనివంక చూసిన చూపులో సిగ్గు లేశంకూడా లేదు. అది కోల్యాకు తత్తరపాటునూ, కొద్ది చిరాకును కూడా కలిగించింది. తను ఆమె కంటె పెద్దవాడు, కనుక ఏ లెక్కన చూసినా కూడా సిగ్గుపడాల్సింది ఆమె.

“నేను సాయంత్రం వెళ్లిపోతున్నాను.”

“ఎక్కడికి?” వేరా చకితురాలై అడిగింది.

“నా కొత్త ఉద్యోగంలోకి” అతను హుందాగా జవాబిచ్చాడు. “నేనూరికే యిటు వెళ్తూ దోవలో దిగానంతే.”

“అయితే సరే, భోజనం వేళ కలుస్తా.” వాల్యా అతని కళ్లలోకి మరోమారు చూసి చిరునవ్వు నవ్వింది. “నేను గ్రామఫోను తీసుకొస్తాను.”

“వాల్యా దగ్గర ఎంత మంచి రికార్డులున్నాయో తెలుసా! ఆ పోలిష్ రికార్డులు

వింటే నా సామిరంగా ఊగిపోవాల్సిందే. 'విన్‌స్టన్‌కా విస్ల్ ఏడ్వా, విన్‌స్టన్‌కా విస్ల్ ఏడ్వా'" వేరా పాడింది. "ఇప్పుడింక మేం పరుగెత్తాలి."

"అమ్మ యింట్లో వుందా?"

"ఆఁ!"

వాళ్ళు ఎడమ పక్కగా, స్కూలుకి, తను పదేళ్ళపాటు పరుగెత్తిన పక్కకి — పరుగెత్తారు. కోల్యా చూపులు వాళ్ళని అనుసరించాయి. వాళ్ళ జుట్టు ఎలా ఎగురుతున్నాయో, ఎండకాగిన వాళ్ళ పిక్కల చుట్టూ ఫ్రాకులు ఎలా రెపరెపకొట్టుకుంటున్నాయో కోల్యా చూశాడు. వాళ్ళు వెనక్కి తిరిగి చూడాలని కాంక్షించాడు. "అలా తిరిగితే, అప్పుడు..." అనుకున్నాడు. కానైతే అప్పుడేం జరుగుతుందో ఆలోచించడానికి అతనికి టైము లేకపోయింది. అంతలో పొడుగమ్మాయి వెనక్కు తిరగనే తిరిగింది. అతను చెయ్యి ఊపి, సూట్‌కేసు తీసుకునేందుకని తటాలున — తన ముఖం ఎర్రబారుతున్నట్టు అనుభూతి చెందుతూ ముందుకు వంగాడు.

"ఇది దారుణంగా ఉందే" — యిప్పుడిక తృప్తిగా అనుకున్నాడతను. "అయినా నేనెందుకు సిగ్గుపడాలి?"

అతను చీకటిగా వున్న కమాను ద్వారం దగ్గర కెళ్ళాడు, ఎండపడే ఎడమ పక్కకి చూశాడు, కాని అక్కడ మళ్ళేవెవ్వా కానరాలేదు. ఇది అతనికి కొంత ఆశాభంగమే కలిగించింది, కాని మరుక్షణంలోనే అతను తన వాటా మెట్ల దగ్గరకు చేరుకున్నాడు, ఊపిరి పీల్చుకునేందుక్కూడా ఆగకుండా చకచకా మెట్లెక్కి అయిదో అంతస్తు చేరుకున్నాడు.

అమ్మలో బొత్తిగా మార్పే లేదు, ఆమె యింకా అదే చుక్కల సాదా గౌను వేసుకుంది. అతన్ని చూడగానే ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఓరి నీ యిల్లు బంగారం కాను, సరిగా మీ నాన్నగారి నోట్లోంచి ఊడిపడినట్లున్నావు కదరా!"

కోల్యాకి తన తండ్రి అస్పష్టంగా మాత్రమే గుర్తున్నాడు. 1926లో ఆయన మధ్యాసియాకి వెళ్ళిపోయాడు — మరి తిరిగి రాలేదు. అమ్మని రాజకీయ శాఖవాళ్ళు పిలిపించి, కమిస్సార్ ప్ల్యాజ్నికొవ్ కొజ్-కుదూక్ గ్రామంలో బస్మచ్ బందిపోట్లతో జరిగిన పోరాటంలో చనిపోయాడని చెప్పారు.

అమ్మ కోల్యాకి నాస్తా పెట్టి ఎడతెరిపి లేకుండా మాట్లాడసాగింది. కోల్యా అవసరమైన చోట్ల "ఔను," "కాదు" అంటూవచ్చాడు, అతని మనసు వేరే ఎక్కడో పరిభ్రమిస్తోంది. సలభై తొమ్మిదో వాటాకు చెందిన కొత్తగా ఎదిగిన వాల్యాని గురించి అతను ఆలోచిస్తున్నాడు, అమ్మ ఆమెను గురించి మాట్లాడాలని కోరుకుంటున్నాడు. కాని అమ్మ ఆసక్తులూ, ఆలోచనలూ, అభిరుచులూ వేరు కదా.

"...అప్పుడు వాళ్లకి నేనేం చెప్పానో తెలుసా అబ్బాయ్: 'ఓరి భగవంతుడా, రోజు రోజంతా చిన్న పిల్లలు హోరుమంటూ యీ రేడియో గోల వినాల్సిందేనా? వాళ్లవేమో బుల్లి చెవులు, బోధనశాస్త్ర రీత్యా కూడా యిది తప్పు.' వాళ్లు నా మాట ఎలాగూ వినలేద నుకో, ఎందుకంటే, ఆర్డరుమీద సంతకమైంది, అంతే, వాళ్లు లౌడ్‌స్పీకరు పైకి కట్టారు. అంతమాత్రాన నేనూరుకున్నా ననుకున్నావేమిటి, జిల్లా కమిటీ ఆఫీసుకెళ్లి వాళ్లతో ఫిర్యాదు చేశాను..."

అమ్మ ఒక నర్సరీ స్కూలు నడుపుతోంది. ఆవిడ నిత్యం ఏవేవో కార్యకలాపాల్లో మునిగి తేలుతూ వుంటుంది. అతని బుర్ర అంతా వాల్యాతో నిండివుండకపోతే — అతను రెండేళ్లు వీటన్నిటికీ దూరంగా ఉన్నాడేమో — యివన్నీ సరదాగా విని వుండేవాడే.

మంచి రసవత్తరమైన క్షణంలో అతను అడ్డువచ్చి "ఔనమ్మా, మరేం, గేటు దగ్గర వేరా నాకు ఎదురుపడింది" అన్నాడు. "దానితో బాటు యింకో అమ్మాయి — అన్నట్లు ఆ అమ్మాయి పేరేమిటి? — వాల్యా కూడా వుంది."

"ఔను, వాళ్లు స్కూలుకి పోతున్నారు. ఏరా యింకొంచెం కాఫీ తీసుకుంటావా?"

"అక్కర్లేదు, థాంక్సమ్మా." కోల్యా అటూయిటూ మంచి హుషారుగా కిర్రుకిర్రు శబ్దం చేసుకుంటూ తిరిగాడు. అమ్మ నర్సరీ స్కూలుకి సంబంధించిన మరేవేవో ఘటనలు ఎత్తుకోబోయింది, కాని మళ్లీ అతను అడ్డుతగిలాడు: "అయితే, వాల్యా యింకా స్కూల్లోనే చదువుతోందా?"

"ఏమిట్రా కోల్యా, అంత మరీను, వాల్యాయే గుర్తులేనట్లు మాట్లాడతావేమిటి? అదెప్పుడూ మనింటికి వస్తూపోతూవుండేది కదా?" అకస్మాత్తుగా అమ్మ పకాలున నవ్వింది. "వాల్యా నిన్ను ప్రేమిస్తోందని కూడా అంటూండేది మన వేరా."

"మతిలేని మాట!" కోల్యా కోపంగా అరిచాడు. "శుద్ధ మతిలేని మాట!"

"మతిలేని మాటే అనుకో" అమ్మ అనుకోకుండా ఆమోదించింది. "అప్పట్లో అది కసుగాయ, కాని యిప్పుడంటావా అది చూడముచ్చటైన అందమైన పిల్లగా పెరిగింది. మన వేరా కూడా అందమైనదే అనుకో, కాని వాల్యా వుందే — అది సిసలైన అందగత్తె!"

"ఔనుకదూ, గొప్ప అందగత్తె" తనలో పెల్లుబుకుతున్న ఆనందాన్ని అణుచుకుంటూ అతను గుర్రుమన్నాడు. "దేశమంతటా ఎక్కడ చూసినా కనిపించే వేలాదిమంది సాదా అమ్మాయిల్లో యిదొకత్తె. ఇంతకంటె మత్వేయెవ్నా ఎలాగుందో చెప్పు. నేను ఆవరణలో కొచ్చే సరికి — "

"మన మత్వేయెవ్నా చచ్చిపోయిందిరా" అమ్మ నిట్టూర్చింది.

"చచ్చిపోయిందా! — నిజంగానా?"

"కోల్యా, చావు మానవ సహజంరా." ఆమె మరోసారి నిట్టూర్చింది. "నువ్వు

అదృష్టవంతుడివిరా, చాలా కాలం తర్వాత గాని నీకు చావును గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు.''

కోల్యా లోలోపల సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నాడు, అలాంటి అద్భుతమైన పిల్లను తను గేటు దగ్గరే కలుసుకోగలగడం నిజంగా తన అదృష్టమే. పైగా ఆమె తనను ప్రేమించిందని కూడా తెలుసుకోగలిగాడు.

నాస్తా అయ్యాక కోల్యా బెలోరష్యన్ స్టేషనుకి వెళ్లాడు. అతని రైలు ఏడు గంటలకే, అంత మరీ అవ్యవధిగా వెళ్లడం సాధ్యం కదనిపించింది అతనికి. కోల్యా స్టేషన్లో అటూయిటూ పచార్లుచేశాడు, నిట్టూర్చాడు, తర్వాత – సంకోచిస్తూ – అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసరు గది తలుపు తట్టాడు.

''తర్వాత ట్రెయినా?'' ఆ ఆఫీసరు కూడా యువకుడేనేమో చులకనగా కన్ను గిలుపుతూ అన్నాడు. ''ఏమిటి సంగతి లెఫ్టినెంట్ – ప్రియురాలా?''

''అబ్బే కాదు'' కోల్యా తల వేలాడేసుకుని జవాబిచ్చాడు. ''మా అమ్మకి ఒంట్లో బాగాలేనట్లు కనిపిస్తోంది. చాలా – '' ఆ ఘట్టంలో అతనికి తన యీ మాట విన్న తథాస్తు దేవతలు నిజంగానే తన తల్లికి అనారోగ్యం తెచ్చిపెడతారేమోనని – బెదురుపట్టుకుంది. అందుకని అతను తనను తాను సరిచేసుకున్నాడు. ''మరీ అంత, అదే, చాలా ఎక్కువ కాదను కోండి....''

''నాకు బోధపడింది.'' ఆఫీసరు మళ్లీ కన్నుగిలిపాడు. ''అలాగే లెండి, అమ్మగారి విషయంలో ఏం చెయ్యడానికి వీలుంటుందో చూద్దాం.''

అతనో లావు బైండు పుస్తకం పేజీలు తిరగేసి, తర్వాత టెలిఫోన్ చేశాడు – మరేదో విషయాన్ని గురించి అనడం స్పష్టం. కోల్యా రవాణాను గూర్చిన పోస్టర్లు చూస్తూ ఓపికగా నిరీక్షించాడు. చివరకు ఆఫీసరు రిసీవరు కిందపెట్టాడు.

''మీరు మార్చుకోవలసిందేనన్నమాట, అంతే కదా? అయితే సరే. మీరు రాత్రి పన్నెండు గంటల మూడు నిమిషాలకు మాస్కో – మీన్స్క్ రైలెక్కాలి. మీరు మీన్స్క్‌లో మారాల్సివుంటుంది.''

''మంచిది'' కోల్యా అన్నాడు. ''థాంక్యూ వెరీ మచ్, కామ్రేడ్ సీనియర్ లెఫ్టినెంట్.''

తన టికెట్టు జేబులో పెట్టుకొని అతను గోర్కీరోడ్డు వెంట పానీయాలమ్మే షాపుకి వెళ్లాడు. కనుబొమలు ముడేసి అక్కడి పానీయాలను చాలా సేపు పరిశీలనగా చూశాడు. చివరకు అతను తన పరీక్షలు ముగిసిన సందర్భంగా విందులో తాగిన కారణంగా షాంపేనూ, తన తల్లి తయారుచేస్తూవుండిన మాదిరిదైన కారణంగా చెర్రీ కార్డియలూ, ప్రభువర్గాల వాళ్లు తాగుతారని తను నవలల్లో చదివిన కారణంగా మదీరా కొన్నాడు.

"నీకు మతి పూర్తిగా పోయిందా ఏమిట్రా?" అతని తల్లి కోపంగా కూకలేసింది. "ఒక్కొక్క రకం ఒక్కొక్క సీసా కొనుక్కొచ్చావు — ఏమిటి దీని అర్థం?"

"ఓ, అదా!" అతను భుజాలెగరేశాడు. "మనం ఏదైనా పండగ జరుపుకునేటప్పుడు, సలక్షణంగా జరుపుకోవాలి!"

వాళ్ళు నిజంగానే ఆ రోజు సలక్షణంగా పార్టీ జరుపుకున్నారు. పార్టీ ప్రత్యేకమైన డిన్నరుతో ప్రారంభమైంది — దాన్ని తయారుచేసేందుకు అమ్మ పొరుగువాళ్ళ దగ్గర్నుంచి మరో కిరసిన్ స్టౌ అరువు తెచ్చింది. వేరా వంటింట్లో చకచకా పనిచేసింది — అంత సేపూ సవాలక్ష ప్రశ్నలు వేస్తూ, ప్రశ్న వేసినప్పుడల్లా వంటింట్లోంచి బయటకు దూసుకొస్తూ వుంది.

"అన్నయ్యా నువ్వెప్పుడైనా మెషీన్‌గన్ కాల్చావా?"

"ఆహా."

"మరి మాక్సిమ్?"

"ఆ, మాక్సిమూ కాల్చా. ఇంకా యితర రకాల గన్నులు కూడా కాల్చా."

"భలే, ఎంత అద్భుతమో!" వేరా ఆగింది.

కోల్యా పరధ్యానంగా గదిలో అటూయిటూ పచార్లు చేశాడు. అతను కొత్త కాలర్ లైనింగు కుట్టుకున్నాడు, తన బూట్లు పాలిష్ చేసుకున్నాడు, ఇప్పుడు ప్రతి తోలు పట్టీలోనూ కిరకిరలాడుతున్నాడు. ఉద్రేకం భోజనాపేక్షను తరిమేసింది. అప్పటికీ వాల్యా యింకా రాలేదు.

"నీకక్కడ గది యిస్తారా అన్నయ్యా?"

"ఆహా."

"వేరే గది, నీకు ప్రత్యేకంగా?"

"తప్పకుండాను" అతను వేరా వైపు ఆధిక్యతా ప్రదర్శనపూర్వకమైన చూపు బరపాడు. "నేను రెగ్యులర్ సైనికాధికారిని తెలుసా?"

"మేమక్కడికొచ్చి నిన్ను కలుసుకుంటాం," ఆమె నిగూఢంగా గుసగుసలాడింది. "అమ్మని వేసవికాలంలో నర్సరీ స్కూలుతో బాటు పల్లెకు పంపేసి, అప్పుడొస్తాం మేము."

"'మేము' అంటే ఎవరుట?" అతనికి అర్థమైంది, అతని హృదయం మధురానుభూతితో పొంగింది. కానైతే అర్థంచేసుకోవడం వేరు, దాన్నే తేటతెల్లమైన మాటల్లో వినడం వేరు. "ఎవరట ఆ 'మేం?'"

"నువ్వు ఆమాత్రం అర్థంచేసుకోలేవూ? మేము అంటే మేమూ. వాల్యా, నేనూను."

కోల్యా అనాహూత మందహాసాన్ని కప్పిపుచ్చేందుకుగాను దగ్గి, హుందా ధోరణిలో చెప్పాడు.

"బహుశా మీకు స్పెషల్ పాస్ అవసరంకావచ్చు. మీరెప్పుడు వచ్చేదీ ముందు రాసి తెలియజేస్తే, నేను పై అధికార్లకు చెప్పి పాస్‌కి ఏర్పాటుచెయ్యడానికి వీలవుతుంది."

"ఓ – యిక్కడ కబుర్లు చెబుతూ కూర్చుంటే అక్కడ నా బంగాళదుంపలు చిమిడి ముద్దవుతాయి!"

ఆమె తన బూటు మడమపై గిర్రున తిరిగే సరికి ఆమె ఫ్రాక్ గొడుగులా విచ్చుకుంది, తర్వాత ఆమె వెనక తలుపు దఢాలున మూసుకుంది. ఎప్పుడైతే తలుపు గట్టిగా మూతపడిందో అప్పుడిక అతను ఒక్క సారిగా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయాడు. తన తోలుపటకాలన్నింటినీ క్రిరుకిర్రుమనిపించాడు. అంటే వాళ్లీ ప్రయాణం గురించి ముందే ఆలోచించారన్నమాట, అంటే వాళ్లిందుకు పథకం వేసుకుంటున్నారన్నమాట, అంటే వాళ్ళు తనని కలుసుకోవాలనుకుంటున్నారన్నమాట, అంటే – ! కాని ఆ చివరి "అంటే" తర్వాత ఏమి జరగాలో దానికి అక్షరరూపమివ్వడానికి, చివరకు అనుచ్చరితమైన మాటల రూపం యివ్వడానికి సైతం కోల్యా సాహసించలేదు.

అప్పుడొచ్చింది వాల్యా. దురదృష్టవశాత్తూ అమ్మా, వేరా యింకా వంటపనిలోనే మునిగివున్నారు. సంభాషణ కొనసాగేలా చూసేందుకెవరూ లేకపోయారు. వాల్యా వేసవి ప్రయాణాన్ని తిరస్కరించవచ్చునన్న ఆలోచనతో కోల్యా బెదిరిపోయాడు.

"నువ్వు మాస్కోలోనే ఉండిపోయే అవకాశం లేదా?"

కోల్యా తల అడ్డంగా ఊపాడు.

"అది నిజంగా అంత అర్జంటు పనా?"

కోల్యా భుజాలెగరేశాడు.

ఆమె తన స్వరం తగ్గించి అడిగింది: "సరిహద్దులో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందా?" రహస్య గోపనాన్ని గూర్చిన హఠాదాలోచన మనస్సులో మెదలడంతో కోల్యా సంకోచంగా తలూపాడు.

"హిట్లరు మనల్ని అన్ని పక్కల్నుంచీ చుట్టుముట్టడానికి ప్రయత్నిస్తున్నాడని నాన్న అంటున్నాడు."

"జర్మనీతో మనకి నిరాక్రమణ సంధి వుంది" కోల్యా బొంగురుగా అన్నాడు – దీనికి తలని నిలువుగానో, అడ్డంగానో ఊపి జవాబు చెప్పడం సాధ్యం కాదుకదా మరి. "మన సరిహద్దు వెంట జర్మన్ సేనల కేంద్రీకరణకు సంబంధించిన పుకార్లున్నాయి చూడు, అవి బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులనుంచి వస్తున్నాయి."

"నేనిదంతా పత్రికల్లో చదివాను" వాల్యా కొంచెం నిరుత్సాహంగా అంది. "కాని పరిస్థితి చాలా చాలా తీవ్రంగా ఉందంటున్నాడు నాన్న."

వాల్యా తండ్రి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నాడు, కాని ఆయన కొంచెం ఖంగారుగొడ్డేమోనని కోల్యా అనుమానపడ్డాడు.

"కవ్వింపు చర్యలపట్ల మనం జాగ్రత్తగా వుండాలి" కోల్యా చెప్పాడు.

"కాని అవతల ఫాసిజం – మహా ఘాతుకమైనది. నువ్వు ఆ సినిమా – 'ప్రొఫెసర్ మామ్లోక్' – చూశావా?"

"ఆఁ చూశాను. అందులో అలేగ్ జాకొవ్ నటించాడు. నిస్సందేహంగా ఫాసిజం భయానకమైనదే, కాని సామ్రాజ్యవాదం మాటేమిటి? – అదేమైనా మెరుగైనదా?"

"యుద్ధం జరగబోతోందనుకుంటున్నావా నువ్వు?"

"తప్పకుండాను. మనవాళ్లు ఇన్ని మిలిటరీ స్కూళ్లు పెట్టి, అత్యవసర పథకాలు అమలు జరుపుతున్నారంటే ఊరికే అలా చేస్తున్నారనుకోను. కాని ఈ యుద్ధం చకాచికీగా అటోయిటో తేలిపోయేదిగా వుంటుంది."

"అంతేనంటావా?"

"తప్పకుండాను. మొదటి సంగతి, సామ్రాజ్యవాద, ఫాసిజాల బానిసత్వంలో వున్న దేశాలకు చెందిన శ్రామికవర్గాన్ని గురించి మనం మరచిపోకూడదు. రెండో సంగతి, హిట్లర్, యినుప పాదాల క్రింద నలిగి నవసిపోతున్న జర్మన్ శ్రామికవర్గం వుంది. మూడవ సంగతి, ప్రపంచ శ్రామికవర్గపు అంతర్జాతీయ సౌభ్రాతృత్వం వుంది. అయితే అన్నింటికన్న ముఖ్యమైనది మన రెడార్మీయొక్క నిర్ణయాత్మకమైన శక్తి. శత్రువుపైన, వాడి భూభాగంమీదే మనం చావుదెబ్బ తీస్తాం."

"మరి ఫిన్లాండు సంగతేమిటి?" ఆమె మెల్లిగా అడిగింది.

"ఫిన్లాండు సంగతేమిటి?" అతను కష్టంమీద తన అయిష్టాన్ని కప్పిపుచ్చుకున్నాడు. ఇదంతా ఖంగారుగొడ్డులాంటి ఆమె తండ్రి ప్రభావం. "ఫిన్లాండుకి యీ చివరనుండి ఆ చివర దాకా రక్షణశ్రేణులుండేవి. మన బలగాలు వాటిని శీఘ్రంగా తిరుగులేకుండా ఛేదించాయి. ఈ విషయంలో నీకు ఏ అనుమానమైనా ఉండటం ఎలా సాధ్యమో నాకు బోధపడకుండా వుంది."

"ఏవిధమైన అనుమానమూ ఉండజాలదని నువ్వనుకుంటే ఉండజాలదన్న మాటే" వాల్యా మందహాసం చేసింది. "బెలొస్టోక్ పట్నంనుంచి నాన్న తెచ్చిన రికార్డులు చూస్తావా?"

వాల్యా రికార్డులు చక్కగా వున్నాయి. వాటిలో పోలిష్ ఫాక్స్ట్రాట్లున్నాయి: "నీలి కళ్లు," "నల్ల కళ్లు," సాషాత్కా ఫ్రాన్సెస్కా గాల్ పాడిన "పీటర్" టాంగో కూడా వుంది.

"ఆవిడకు యీమధ్య కళ్లు పోయాయిట కదా!" వేరా కళ్లు గుండ్రంగా తిప్పుతూ అంది. "ఆవిడ షూటింగుకని వచ్చిందట, అన్నింట్లోకీ పెద్ద లైటు వంక చూడటం తటస్థించిందట, అంతే ఆ మరుక్షణమే ఆమె కళ్లు పోయాయిట."

వాల్యా సంశయాత్మకంగా మందహాసం చేసింది. కోల్యాకి కూడా యీ కథపట్ల కొన్ని సందేహాలున్నాయి, కాని ఏకారణంగానో అతను దాన్ని నమ్మాలని కోరుకున్నాడు.

అప్పటికి వాళ్ళు షాంపేనూ, కార్డియలూ తాగేశారు, మదీరా కొంచెంరుచి మాత్రమే చూశారు, కాని అది వాళ్ళకి నచ్చలేదు. దానిలో తీపి ఏమాత్రం లేదు. మరి వైకౌంట్ డి ప్రెస్సీ దానిలో బిస్కట్లు ముంచుకుని నాస్తా ఎలా చేసేవాడో ఎవరికీ అర్థం కాదు.

"సినిమాల్లో నటించడం ప్రమాదం, దారుణమైన ప్రమాదం" వేరా కొనసాగించింది. "పొగరుబోతు గుర్రాలపైన స్వారీలే కాదు, రైళ్లలోంచి దూకడాలే కాదు, లైట్లు కూడా ప్రమాదకరమే. భయంకరం!"

వేరా సినిమా నటీనటుల ఫొటోలు పోగుచేసింది. కోల్యాకి యీసారి కూడా సంశయమే కలిగింది, కాని యీమారు కూడా వాటన్నింటినీ నమ్మాలని కోరుకున్నాడు. అతని తల కొంచెం తిరుగుతోంది, వాల్యా అతని పక్కనే కూర్చుంది. అది మూర్ఖంగా ఉందేమోనన్న అనుమానం ఒక వంక అతని మనస్సును వేధిస్తున్నా తన ముఖం పైన చిరునవ్వు చిందులాడించకుండా ఉండలేకపోతున్నాడు.

వాల్యా కూడా – సిసలైన వయస్కురాలి మాదిరిగా, ఉదాత్తతతో కూడిన దయతో – చిరునవ్వు నవ్వుతోంది. ఇంతాచేసి ఆమె వేరాకన్న ఆరునెలలు మాత్రమే పెద్ద. కానైతే నిన్నటి అమాయిక బాలికకీ యీనాటి ప్రశాంత నిగూఢ యువతికీ మధ్యగల రేఖను, ఆమె అప్పుడే అధిగమించింది.

"వేరా సినిమానటి కావాలనుకుంటోంది" అమ్మ అంది.

"ఔను, ఏం, ఎందుక్కూడదు?" వేరా తిరుగుబాటు స్వరంలో అరవడమేకాకుండా బొద్దుగా వున్న తన చిన్ని పిడికిటితో బల్లపైన గుద్దింది. "అందులో తప్పేముంది? అది అద్భుతంగా వుంటుంది, వ్యవసాయ ప్రదర్శన పక్కన దానికొక ప్రత్యేక స్కూలు కూడా వుంది...."

"సర్లేవే, సరే సరే" అమ్మ సమాధానపూర్వకంగా ఆమోదించింది. "ముందు పదో క్లాసు అన్నింట్లోనూ ఫస్టు మార్కులతో పూర్తిచెయ్యి, ఆతర్వాత నీ యిష్టమొచ్చిన చోటికెళ్ళు. నీక్కావలసిందల్లా సంకల్పం."

"అంతే కాదు ప్రతిభ కూడా వుండాలి" వాల్యా అంది. "నీకు తెలుసా వాళ్ళు పెట్టే పరీక్షలెలా వుంటాయో? అప్పుడే రంగంమీద అడుగుపెడుతున్న ఏ పదో క్లాసు కుర్రాణ్ణో ఏరి, నీచేత వాడికి ముద్దుపెట్టిస్తారు."

"సరే! పెట్టించుకోనియ్!" వేరా – ఒక వంక పానీయం మరో వంక వాదం తలకెక్కగా – హుషారుగా అరిచింది. "నాచేత అలా పెట్టించుకోనియ్! నేనది నటిస్తాను, నేను నిజంగానే ప్రేమలో ఉన్నానని వాళ్లకి పూర్తి నమ్మకం కలిగేలా నటిస్తాను! తెలిసిందా, అదీ సంగతి!"

"నేనైతే, నేను ప్రేమించని వాడిని నాకు కోటి రూబుళ్లిచ్చినా కూడా ముద్దు పెట్టుకోను" వాల్యా ప్రశాంతంగా చెప్పింది, కాని ఆమె స్వరం అందరి దృష్టినీ ఆకట్టు కుంది. "ప్రేమలేనిదే ముద్దుపెట్టుకోవడం అనేది నా దృష్టిలో చాలా హీనమైన పని."

"చెర్నిషేవ్‌స్కీ రాసిన 'ఏం చెయ్యాలి?'లో..." కోల్యా మొదలెట్టాడు.

"నువ్వు తేడా తెలుసుకోవాలి!" వేరా అకస్మాత్తుగా అరిచింది. "జీవితాన్నీ కళనీ కలగాపులగం చెయ్యకూడదు. వాటిని నువ్వు వేరుచేసి చూడాలి!"

"నేను మాట్లాడుతున్నది కళని గురించి కాదు, పరీక్షని గురించి. అందులో ఏం వుందిట?"

"మరి ధైర్యం మాటేమిటి?" వేరా సవాలుచేస్తున్నట్లు ప్రశ్నించింది. "కళాకారుడికి ధైర్యం అక్కర్లేదా?"

"నీ యిల్లు బంగారం కాను, యిందులో ధైర్యం ప్రసక్తి ఏముందే?" అమ్మ నిట్టూర్చి, టేబిలు శుభ్రంచెయ్యడం మొదలుపెట్టింది. "అమ్మాయిలూ నాక్కాస్త సాయం చెయ్యండి, తర్వాత మీరు డాన్సుచేసుకోవచ్చు."

అందరూ అటూయిటూ పరిగెడుతూ టేబిలు సర్దడానికి తోడ్పడ్డారు, కోల్యా మాత్రం ఒంటరిగా కూర్చుండిపోయాడు. అతను కిటికీ దగ్గరకెళ్లి సోఫామీద ఒంటరిగా కూర్చు న్నాడు. స్కూల్లో చదివినన్నేళ్లూ తను పడుకున్న కిరకిరలాడే సోఫాయే అది. తను కూడా మిగతా వాళ్లతో కలిసి, ఒకళ్లనొకళ్లు నెట్టుకుంటూ, నవ్వుకుంటూ, అందరూ కలిసి ఒకే ఫోర్కును లాగుతూ పనిచెయ్యాలని అతనికి అనిపించక పోలేదు, కాని యిలా నిశ్చితంగా కూర్చోవడం మరింత హుందాతనంలా కనిపించడంతో అతను తన కోర్కెను అణిచేసు కున్నాడు. పైగా, తన యీ మూలనుంచి యితరుల దృష్టిని ఆకర్షించకుండా అతను వాల్యాను పరిశీలించగలడు, ఆమె మందహాసాన్నీ, ఆమె కనురెప్పల కదలికలనూ, అడపాదడపా ఆమె విసిరే క్రీగంటిచూపులనూ అతను అందుకోగలుగుతాడు. అతను నిజంగానే వాటిని అందుకున్నాడు. అతని గుండె ప్యాలెస్ ఆఫ్ సోవియట్స్ మెట్రో స్టేషన్ ప్రక్క తను విన్న ఆవిరి సమ్మెటలా కొట్టుకుంది.

కోల్యాకు అప్పటికి పంథొమ్మిదేళ్లొచ్చాయి, అయితే అతనింతవరకు ఏ అమ్మాయినీ ముద్దుపెట్టుకోలేదు. అతను బయిట షికారుకెళ్లిందుకెప్పుడూ పాస్ తీసుకుంటూనే ఉండే వాడు, సినిమాలకెళ్లేవాడు, థియేటరుకెళ్లేవాడు, తన దగ్గర యింకా తగినంత డబ్బు మిగిలితే ఐస్‌క్రీము కొనుక్కుని తింటూండేవాడు. కానైతే అతనికి డాన్సు బాగా వచ్చేదికాదు, దానితో అతనెప్పుడూ డాన్సు హాళ్ల కెళ్లేవాడుకాదు, పర్యవసానంగా రెండేళ్ల శిక్షణ కాలంలోనూ అతను అమ్మాయిలెవ్వరితో పరిచయం చేసుకోలేదు — ఒక్క లైబ్రేరియన్ జోయాతో తప్ప.

కానైతే యీ రోజున తనకెవరూ స్నేహితురాండ్రు లేనందుకు కోల్యా సంతో

షించాడు. ఒక నాడు ఏదైతే అతని మనస్సు లోలోపల క్షోభకు కారణమైందో సరిగా అదే యీ నాడు అతనికి తల్లక్రిందులుగా కనిపించసాగింది. ఇలా సోఫాలో కూర్చున్న కోల్యాకు, యీ లోకంలో వాల్యా అస్తిత్వమే దీనంతటికీ వెనకవున్న కారణం అన్న సంగతి రూఢిగా అవగతమైంది. అలాంటి అమ్మాయికోసం ఎంతటి క్లేశం అనుభవించినా దండగ లేదు. అటువంటి క్లేశం, తటపటాయింపుతో కూడిన ఆమె చూపులను నేరుగా సగర్వంగా చూసే హక్కును తనకు సంక్రమింపచేస్తుంది. కోల్యాకు తనపట్ల తనకు ఎంతో సంతృప్తి కలిగింది.

గ్రామఫోనుకు మరోసారి — ఈ సారి కేవలం వినడానికే కాకుండా డాన్సు చెయ్యడానికి — కీ యిచ్చారు. కోల్యా బిడియంబిడియంగా, తడబడుతూ వాల్యాతో, వేరాతో, మళ్లీ తిరిగి వాల్యాతో డాన్సుచేశాడు.

"ష్విస్త్కా మ్ని ఏద్నొ, ష్విస్త్కా మ్ని ఏద్నొ" అంటూ వేరా కుర్చీ పట్టుకుని తాపీగా డాన్సుచేస్తూ కూనిరాగం తీసింది.

కోల్యా — దేన్ని గురించి మాట్లాడాలో ఏమీ తోచక — మౌనంగా డాన్సుచేశాడు. వాల్యా సంభాషణ కావాలని కోరుకోలేదు, అయితే అతనికి యీ సంగతి తెలియక గుంపితెం పీలు పడ్డాడనే చెప్పాలి.

"నాకో గది యిస్తామని వాళ్లు వాగ్దానం చేశారు" అని చెప్పి, అతను పురుషోచితంగా దగ్గాడు. "ఒకవేళ వాళ్లు అలా యివ్వకపోతే నేనే ఓ గది అద్దెకు తీసుకుంటా."

వాల్యా మౌనంగా ఉండిపోయింది. కోల్యా ఆమెను తనకు సాధ్యమైనంత ఎడంగా పట్టుకోవాలని ప్రయత్నించాడు. ముని చీకటిగా వున్న సందులో జోయా తన వంక మెరిపించిన చిరునవ్వుకి వాల్యా చిరునవ్వు పూర్తిగా భిన్నమైనదని అతనికి అనిపించింది. దానితో అతను సిగ్గుపడి, మాట్లాడేటప్పుడు తన స్వరాన్ని తగ్గించాడు.

"నేను పాస్ సంపాదిస్తాను. ముందు రాయి."

వాల్యా అప్పటికీ ఏమీ మాట్లాడలేదు, కాని యిప్పుడిక అతనేమీ కంగారుపడటం లేదు. ఆమె విన్నదన్న సంగతీ, అర్థంచేసుకుందన్న సంగతీ అతనికి తెలుసు, అందుకనే ఆమె మౌనంగా ఉన్నందుకు అతను సంతోషించాడు.

కోల్యాకిప్పుడు — ఇది ప్రేమ అన్న సంగతి తెలుసు. ఈ ప్రేమని గురించి అతనెంతో చదివాడు, కాని యింతవరకు అదెన్నడూ అతనికి అనుభూతం కాలేదు. జోయా — జోయాని గురించి అతను దాదాపు భయకంపరంతో జ్ఞాపకంచేసుకున్నాడు, తననింత బాగా అర్థంచేసుకున్న వాల్యా ఏ అద్భుతమో జరిగి తన భావాలను చదవగలిగి, తనను జోయాతో జతచేసి గుర్తుపెట్టుకుంటే, తనను తాను కాల్చుకు చావడం తప్ప — యిక కోల్యాకి మిగిలేదేమీ ఉండబోదు, ఆ కారణంగానే అతనికి అంత కంపరం కలిగింది. అందుకనే అతను

జోయాని గురించిన ఆలోచనలన్నింటినీ పట్టుదలగా తన మనస్సులోంచి తరిమేసేందుకు ప్రయత్నించాడు, కాని జోయా నిస్సిగ్గుగా తన కుచ్చెళ్లను కదుపుతూ అతని మనస్సును విడిచిపోలేదు, దానితో కోల్యా, తనకు అంతకు ముందెన్నడూ తెలియని నిస్సహాయమైన సిగ్గులో మునిగిపోయాడు.

కాని వాల్యా చిరునవ్వు నవ్వి, యితరులకు కానరాని దేన్నో తను చూడగలిగినట్లు, అతన్ని దాటి ఎక్కడికో చూసింది. తన ఆనందాతిరేకంలో కోల్యా అంతకుముందెప్పటి కన్న మరింతగా బిగిసిపోయాడు.

అటుతర్వాత వాళ్లిద్దరూ చాల సేపు కిటికీదగ్గర నిలబడ్డారు, అమ్మా, వేరా ఎక్కడికో మాయమయ్యారు. నిజానికి వాళ్లు గిన్నెలూ ప్లేట్లూ కడుగుతూ వంటింట్లో వున్నారు, కాని ఆ క్షణంలో వాళ్లు మరో గ్రహంపైన ఉన్నంత ప్రయోజనం లభించింది.

"నువ్వు వెళ్తున్నచోట బోలెడు కొంగలున్నాయని నాన్న అంటున్నాడు. నువ్వెప్పుడైనా కొంగలు చూశావా?"

"లేదు."

"అవి శ్వాలో పక్షుల మాదిరిగానే యిళ్ల పైకప్పులపైన గూళ్లు కట్టుకుని ఉంటాయిట. అవి అదృష్టం తెస్తాయన్న నమ్మకంతో వాటికెవళ్లూ హాని చెయ్యరట. తెల్లటి కొంగలు, పాలతెలుపు కొంగలు. నువ్వు మరిచిపోకుండా వాటిని చూడు."

"తప్పకుండా చూస్తాను" అతను మాట యిచ్చాడు.

"అవెలా వుంటాయో వర్ణిస్తూ జాబు రాయి. ఏం, రాస్తావా?"

"తప్పకుండా రాస్తాను."

"తెల్లటి కొంగలు, పాలతెలుపు కొంగలు...."

అతను తన చెయ్యి జాపి ఆమె చేతిని పట్టుకున్నాడు, తన సాహసానికి తనే భయపడ్డాడు, దాన్ని విడిచిపెట్టెయ్యాలనుకున్నాడు, కాని విడవలేకపోయాడు. ఆమె తన చేతిని వెనక్కి లాగేసుకుంటుందేమో, లేక తనని ఏమైనా అంటుందేమో అని అతను భయపడ్డాడు. కాని వాల్యా మౌనంగా ఉండిపోయింది. మరి ఆమె మాట్లాడినప్పుడు తన చేతిని ఉన్న చోటనే ఉంచేసింది.

"నువ్వే కనక దక్షిణాదికి గాని, ఉత్తరాదికి గాని వెళ్లినా, చివరకి తూర్పుకి వెళ్లినా కూడా ఎంతో బాగుండేది."

"నేను అదృష్టవంతుణ్ణి. నాకు ప్రత్యేక మండలంలో పని దొరికింది. దాని అర్థమేమిటో తెలుసా నీకు?"

ఆమె జవాబివ్వలేదు, నిట్టూర్చి ఊరుకుంది.

''నేను నీ రాక కోసం నిరీక్షిస్తూ వుంటాను'' అతనన్నాడు. ''నిరీక్షిస్తూ, ఆశిస్తూ వుంటాను.''

అతను ఆమె చేతిని మెల్లగా సవరించాడు, తర్వాత అకస్మాత్తుగా దాన్ని తన బుగ్గకి అద్దుకున్నాడు. ఆమె అరచెయ్యి చల్లగా తగిలింది. నువ్వు నన్ను గురించి తలుచుకుంటావా అని అతను ఆమెను అడగాలని మహా తహతహలాడాడు, కాని సాహసించలేకపోయాడు. ఆ ఘట్టంలో వేరా చెంగున లోపలికొచ్చింది — తలుపు దగ్గర్నుంచే బడబడమాట్లాడుతూ, ఎవరో జోయా ఫ్యోదొరొవాని గురించి ఏమేమిటో చెప్తూ — అంతే, కోల్యా చాటుగా వాల్యా చేతిని జారవిడిచాడు.

పదకొండు గంటలకి అమ్మ ఒత్తిడిచేసి అతన్ని స్టేషనుకి బయల్దేరదీసింది. ఆడపిల్లలిద్దరూ అప్పటికే అతని సూట్‌కేసును మెట్లమీదుగా కిందకి లాక్కుపోతూవున్న కారణంగా అతను తన తల్లికి హడావిడిగా దాదాపు లాంఛనప్రాయమైన వీడ్కోలు చెప్పాడు. అమ్మ ఎందుకో తెలియకుండానే కన్నీళ్ల — మెల్లగా, కన్నీళ్లగుండా బలవంతాన చిరునవ్వు తెచ్చుకుంటూ — పెట్టుకుంది. దానితో అతనా కన్నీళ్లను గమనించక వెళ్లిపోయేందుకు హడావిడిపడసాగాడు.

''ఉత్తరాలు రాస్తూవుండు నాయనా. నా బంగారు తండ్రివి కదూ, ఎప్పటికప్పుడు రాస్తూవుండేం.''

''అలాగేలే, అమ్మా. నేనక్కడికెళ్లగానే రాస్తాను కదా, సరేనా?''

''మరిచిపోకేం....''

చిట్టచివరి సారిగా ఆమె కణతల దగ్గర నెరుస్తున్న జుట్టుపైన అతను ముద్దుపెట్టుకొని, ద్వారంగుండా పరుగెత్తి, పట్టుకి మూడేసి మెట్ల చొప్పున కిందకి దిగాడు....

రైలు పన్నెండున్నరకి స్టేషన్‌నుంచి బయల్దేరింది. ఆడపిల్లలిద్దరూ చిట్టచివరి మెట్రో రైలును ఎక్కడ తప్పిపోతారో అని కోల్యా భయపడ్డాడు, కాని వాళ్లెక్కడ వెళ్లిపోతారో అని అతను అంతకన్న భయపడ్డాడు. అందుకని అతనీమాట పదేపదే రెట్టిస్తూవచ్చాడు:

''ఇంక మీరు వెళ్లండర్రా, మీకు మరీ ఆలస్యమైపోతోంది.''

కాని వాళ్లు వెళ్లిపోయేందుకు నిరాకరించారు. అంతలో గార్డు ఈల వేశాడు, రైలు బండి నెమ్మదిగా బయల్దేరింది. మొదట వాల్యా అతని దిశగా అడుగులేసింది. అయితే అతను దీనికోసం చాలా సేపుగా ఎంతగానో తహతహలాడుతున్నాడేమో ఆమె వైపుకు దూసుకెళ్లాడు, దానితో వాళ్లిద్దరూ డీడిక్కికొట్టుకొని తడబడి వెనక్కి తగ్గారు. వేరా ''కోల్యా, నీకు రైలు దాటిపోతుంది!'' అంటూ అరిచి, అమ్మ కట్టియిచ్చిన సమోసాల మూట అతని చేతిలో పెట్టింది. అతనామె మెడపైన చటుక్కున ముద్దుపెట్టుకుని, మూటని అందుకొని, ఎగిరి ఫుట్‌బోర్డుమీదకి ఎక్కాడు. తేలిక ఫ్రాకులు ధరించిన ఆ అమ్మాయిలిద్దరూ నెమ్మదినెమ్మదిగా దూరమైపోవడం చూస్తూ అతనక్కడ నిలబడ్డాడు.

3

కోల్యా యింతవరకు చేసిన తొలి సుదీర్ఘ ప్రయాణం నిజానికి యిదే. ఇంతవరకు అతని ప్రయాణాలు మిలిటరీ స్కూలు వున్న పట్టణందాకా మాత్రమే సాగాయి. కానైతే ఆ పన్నెండు గంటల ప్రయాణం సైతం వేడిగా వున్న యీ జూన్ మాసపు రాత్రి ప్రయాణంతో ఏమాత్రం సరిపోలదు. ఈ అతిముఖ్యమైన ప్రయాణం ఎంత ఆసక్తిదాయకంగా వుందంటే, కోల్యా కిటికీనే వదల్లేదు; చివరకు శక్తి సైతం మందగించి, అతను కూర్చున్నాక, ఎవరో అరిచారు: ''కొంగలు! చూడండి, చూడండి కొంగలు!''

దానితో అందరూ బిలబిలా కిటికీల దగ్గరకి ఎగబడ్డారు, కోల్యా లేచేసరికే సమయం మించిపోయింది. అయినా, దీనికింత వ్యాకులం దేనికి? కొంగలంటూ వుంటే కొంచెం ముందువెనకల్లో తను వాటినెలాగూ చూస్తాడు. అవి, ఆ తెల్లని, పాలతెలుపు కొంగలు ఎలాగున్నాయో తను మాస్కోకి ఎలాగూ రాస్తాడు.

ఇది వాళ్ల పాత సరిహద్దు పట్టణమైన నెగొరేలొయె దాటిన తర్వాత సంగతి. ఇప్పుడు వాళ్లు పడమటి బెలోరష్యాలో వున్నారు. రైలు తరచుగా చిన్న చిన్న స్టేషన్లలో ఆగుతోంది. వాటిలో జనసమ్మర్దం విశేషంగా వుంది. తెల్ల షర్టులూ నల్ల ఫ్రాక్‌కోట్లూ, స్ట్రా హాట్లూ గుండ్రని అంచుగలిగిన ఫెల్టు హాట్లూ, నల్లని రుమాళ్లూ తేలిక ఫ్రాకులూ ధరించిన స్త్రీలూ, పురుషులూ కలగాపులగంగా కనిపిస్తున్నారు. కోల్యా స్టేషన్లలో దిగేవాడు గాని, తన పెట్టెనుంచి దూరంగా ఎన్నడూ వెళ్లేవాడు కాడు. బెలోరష్యన్, రష్యన్, ఉక్రేనియన్, పోలిష్, లిథువేనియన్, ఇద్దిష్ భాషలూ, ఆ దేవుడికి తెలియాలి ఇంకేయే భాషలో, స్థానిక భాషలో — వీటన్నింటి కలగాపులగపు రణగొణ ధ్వని వింటూంటే కోల్యాకి దిగ్భ్రమ కలిగేది.

''ఓరి భగవంతుడా, ఏం రొదరా నాయనా!'' పక్క బెర్తుపైనున్న నిత్యసంతోషి అయిన ఒక సీనియర్ లెఫ్టినెంటు ఆశ్చర్యాన్ని ప్రకటించాడు: ''ఇదిగో కోల్యా, నువ్వు రిస్టువాచీ ఏదైనా కొనుక్కోదలుచుకుంటే యిది సరైన చోటు. ఇక్కడ ఏకంగా లారీలకొద్దీ వాచీలు, అందులోనూ కారుచౌకగా దొరుకుతాయని కుర్రాళ్లు చెప్పారు నాకు.''

అప్పటికీ అతను దూరం వెళ్లేవాడు కాడు: అతను ఏ గుంపులోనో దూరేవాడు, అక్కడేదో కనిపించేది, భుజాలెగరేసి వెనక్కి తిరిగొచ్చేవాడు.

''ఇక్కడున్న బాపతు యూరపియన్ వాతావరణంలో, వెనక్కి తిరిగేలోగానే నువ్వు నజ్జునజ్జైపోతావు!''

''దానికితోడు వేగులు'' కోల్యా జోడించాడు.

''దేవుడికే తెలియాలి,'' సీనియర్ లెఫ్టినెంటు రాజకీయాలు పట్టనివాడి మాదిరిగా

అన్నాడు, ఓ నిమిషం ఊపిరి పీల్చుకుని మళ్లీ గుంపు మధ్యకి చొరబడ్డాడు. "వాచీలు! టిక్-టాక్ వాచీలు! స్విస్ వాచీలు!"

అమ్మ యిచ్చిన సమోసాలన్నింటినీ అతను సీనియర్ లెఫ్టినెంటుతో కలిసి భక్షించేశాడు, సీనియర్ లెఫ్టినెంటు తెచ్చిన ఉక్రేనియన్ సాసేజిని కోల్యాకి మెక్కపెట్టాడు. కానైతే వాళ్ల మధ్య హార్దికమైన సంభాషణ సాగలేదు — సీనియర్ లెఫ్టినెంటుకి ఒకేఒక్క సంభాషణాంశ ముండటమే అందుకు కారణం.

"నా సామిరంగా, కోల్యా, ఆమె నడుముండేదీ, పిడికిట్లో యిమిడేదనుకో!"

కోల్యా యిబ్బందిగా అటూయిటూ కదలనారంభించాడు. సీనియర్ లెఫ్టినెంటు తన కళ్లు చక్రాల్లా తిప్పుతూ, తన స్మృతులలో గాఢంగా మునిగిపోయాడు. అదృష్టవశాత్తూ అతను బరానొవిచీ పట్టణంలో దిగిపోయాడు.

"వాచీలు మరచిపోకు లెఫ్టినెంట్!" అంటూ అతను వీడ్కోలు తీసుకున్నాడు. "వాచీలెప్పుడూ విలువైనవే!"

ఇంట తయారుచేసిన సాసేజి సీనియర్ లెఫ్టినెంటుతోనే వెళ్లిపోయింది. అమ్మ కట్టి యిచ్చిన సమోసాలు అయిపోయాయి. పనికట్టుకుని నిలబడిందా అన్నట్లు రైలు బరానొవిచీలో అంతూదరీ లేకుండా నిలబడిపోయింది. కోల్యా ఆలోచనలు కొంగల్ని వదిలి తిండిపైకి మళ్లాయి. చిట్టచివరకి ఓ పొడవాటి గుడ్సురైలు నిండుచూలాలి లాగ భారంగా యీడ్చుకుంటూ దాటి వెళ్లిపోయింది.

"జర్మనీకి పోతోంది" పెద్దతరం కెప్టెను అన్నాడు. "బంగారంలాంటి మన తిండిగింజల్ని వాళ్ల ఒళ్లో పోస్తున్నాం. దీన్ని, ఎవరైనా ఎలా అర్థంచేసుకోవాలి?"

"ఏమో" ఏమీ పాలుపోక కోల్యా అన్నాడు. "ఇంతకీ, జర్మనీతో మనకి ఒప్పందం ఉంది కదా."

"ఔనౌను" కెప్టెను వెంటనే తన ఆమోదం తెలిపాడు. "మీ అభిప్రాయం అక్షరాలా సరైనది, క్రామేడ్ లెఫ్టినెంట్."

గుడ్సు రైలు వెళ్లిపోయాక వాళ్ల రైలు కూడా కదిలింది, యీమారు మరింత వేగంగా సాగింది. కొద్దిసేపే ఆగుతున్నందున కిందకి దిగొద్దని కండక్టర్లు సలహా యిచ్చారు, ఆ కారణంగా అంతపొడవునా కోల్యా గుర్తుపెట్టుకోగలిగిందల్లా ఒక జాబింకా స్టేషను మాత్రమే. ఇక ఆ తర్వాతి స్టేషను బ్రెస్ట్.

బ్రెస్టు స్టేషను కొయ్య భవనం. అక్కడున్న విపరీతమైన జనసమ్మర్దంలో కోల్యాకి దిక్కు తోచలేదు. అతి సరళమైన పరిష్కార మార్గం, తన యూనిట్‌ను గురించి వాకబు చేసివుంటే సరిపోయేది, కాని సైనిక రహస్యగోపనానికి సంబంధించిన ఆలోచనలు అడ్డు రావడంతో అతను అధికారిక వ్యక్తులను మాత్రమే విశ్వసించాలని నిర్ణయించుకున్నాడు.

అందుకని అతను డ్యూటీలో వున్న అసిస్టెంటు కమాండెంటును కలుసుకునేందుకు గాను పూర్తిగా ఓ గంట సేపు క్యూలో నిలబడ్డాడు.

"దుర్గమే" అసిస్టెంటు కమాండెంటు కోల్యా ఆజ్ఞా పత్రాలను చూస్తూ అన్నాడు. "చెస్ట్‌నట్ వీధమ్మట నేరుగా వెళ్ళు, కొట్టొచ్చినట్టు కనిపిస్తూవుంటుంది."

కోల్యా క్యూలోంచి యివతలికొచ్చాడు, అకస్మాత్తుగా దారుణమైన ఆకలి వేస్తున్నట్లు గుర్తించడంతో చెస్ట్‌నట్ వీధి కోసం కాక కాంటీన్ కోసం వెదకనారంభించాడు. అక్కడేమీ ఉన్నట్టు కనిపించలేదు, అందుకని కొంచెం తటపటాయించిన మీదట అతను స్టేషను రెస్టారెంటులోకి వెళ్ళాడు. అతను లోపలకి పోబోతూండగా అంతలోనే ఓ లావుపాటి లెఫ్టినెంటు తలుపు నెట్టుకొని బయటికొచ్చాడు.

"వీడి దుంపతెగ యీ సైనిక పోలీసు చింబోతు! మొత్తం టేబులు టేబులంతా ఆక్రమించుకొని కూర్చున్నాడు. విదేశస్తుడు — ఏమనేందుకూ వీల్లేదు."

"ఎవరది?"

"ఇంకెవరు! జర్మన్ గస్తీ సైనిక పోలీసు! బిడ్డలున్న స్త్రీలు కింద కూర్చున్నారు, టేబిలంతటికీ సరిపడ కూర్చున్నాడు బీరు పట్టిస్తూ. ఎంతో ముఖ్యమైన వ్యక్తిలాగ!"

"నిజమైన సైనిక పోలీసే?" కోల్యా ఆశ్చర్యంగా అడిగాడు. "నేనోసారి చూడొచ్చా?"

లెఫ్టినెంటు సంకోచంగా భుజాలెగరేశాడు.

"ప్రయత్నించు. ఆఁ అన్నట్టు ఆగు, సూట్‌కేసు నీతో తీసుకెళ్ళకు."

కోల్యా సూట్‌కేసును కింద పెట్టాడు, జనరల్‌గారి ఆఫీసులోకి వెళ్తున్నట్టు తన కోటును కిందకి బిర్రుగా లాక్కున్నాడు. గగుర్పాటుతో తలుపు తీసుకుని లోపలికెళ్ళాడు.

అతని దృష్టి వెంటనే జర్మన్‌మీద పడింది. అచ్చమైన, సజీవుడైన జర్మన్ — యూనిఫారంతో, లోహపు బ్యాడ్జితో, లోహంతో చేసినవా అన్నట్లు చాలా ఎత్తుగా ఉన్న టాప్ బూట్లతో వున్న జర్మన్ — అతని కట్టెదుట వున్నాడు. అతను కుర్చీలో వెనక్కు వాలి, తన పాదాలు తాటిస్తూ ఆత్మసంతృప్తి తొణికిసలాడుతున్నట్లున్నాడు. టేబిలుమీద నాలుగు బీరు సీసాలున్నాయి, కాని ఆ సైనికుడు గ్లాసులో పోసుకు తాగడం లేదు, తన దగ్గరున్న అర్ధ లీటరు మగ్గులోకి బీరు సీసా సీసా అంతా ఒకే సారి వంచుకుంటున్నాడు. గరుకుగా వున్న అతని ఎర్రని ముఖంపైన పందివెంట్రుకల్లాంటి అతని మీసాలు బీరుతో తడిసి వున్నాయి.

కోల్యా ఒళ్ళంతా కళ్ళుచేసుకొని చూస్తూ అతని పక్కగా అటూయిటూ నాలుగు సార్లు తిరిగాడు. ఇది విభ్రాంతికరమైన, అసాధారణమైన సంఘటన: తనకి కేవలం ఒక్క అంగ దూరంలో ఆ ప్రపంచానికి — హిట్లరు బానిసత్వంలో మగ్గుతున్న జర్మనీకి — చెందిన మనిషి కూర్చుని వున్నాడు. ఈ మనిషి, నాజీ సామ్రాజ్యంనుంచి సోషలిస్టు దేశానికొచ్చిన యీ మనిషి ఏమి ఆలోచిస్తున్నాడో తెలుసుకోవాలని కోల్యా మహా తపన పడ్డాడు, కాని

దళితమానవాళికి ప్రతినిధియైన యీ వ్యక్తి ముఖంలో జడీభూతమైన ఆత్మసంతృప్తి తప్ప మరేమీ కానరావడం లేదు.

''ఏం, బాగా చూశావా?'' కోల్యా సూట్‌కేసుకు కాపలాకాస్తున్న లెఫ్టినెంట్ అడిగాడు.

''అతను తన పాదాలు తాటిస్తున్నాడు'' కోల్యా — ఏ కారణంగానో లోగొంతులో — చెప్పాడు. ''అతని రొమ్ముమీద నంబరున్న బ్యాడ్జి వుంది.''

''వాడో ఫాసిస్టు'' లెఫ్టినెంటు అన్నాడు. ''ఇదుగో భాయ్, నీకు నిజంగా మంచి భోజనం చెయ్యాలని వుందా? 'బెలరూస్' అంటూ యిక్కడేదో ఒక రెస్టారెంటుందని మన కుర్రాళ్లు చెప్పారు. అక్కడికి పోయి సుష్టుగా భోంచేద్దామా? అన్నట్టింతకీ నీ పేరేమిటి?''

''కోల్యా.''

''అయితే మనిద్దరిదీ ఒకటే పేరన్నమాట. నీ సూట్‌కేసు యిక్కడ వుంచి రా. అక్కడొక ఫిడేలు వాద్యగాడున్నాడట దిట్టమైనవాడు — 'నీలి కళ్లు' పాటను గంధర్వుడి మాదిరిగా వాయిస్తాడట.''

లగ్గేజి వుంచే క్లోక్‌రూములో మరో పెద్ద క్యూ వుండటంతో కోల్యా తన సూట్‌కేసును — రెస్టారెంటునుంచి నేరుగా దుర్గానికెళ్లవచ్చునన్న ఆలోచనతో — తనతోనే మోసుకెళ్లాడు. లెఫ్టినెంట్ నికొలాయ్‌కి ఆ దుర్గం ఆనుపానులు బొత్తిగా తెలియవు, అతను బ్రెస్టులో కేవలం రైళ్లు మారుతున్నాడంతే, అయితేనేం అతను కోల్యాకు దిలాసా చెప్పాడు.

''రెస్టారెంటుకి చెందినవాళ్లు ఎవళ్లో ఒకళ్లు కనిపించకపోరు, శనివారం కదా తప్పకుండా కనిపిస్తారు, మనం వాళ్లని అడిగి తెలుసుకోవచ్చు.''

ఇరుకుగా వున్న కాలిబాట వంతెన మీదుగా వెళ్లి, వాళ్లు అనేక రైల్వేలైన్లు — రైలు బళ్లు నిలిచివున్న లైన్లు — దాటి పట్టణంలో ప్రవేశించారు. ఆ వంతెన దగ్గర్నుంచి పట్నంలోకి మూడు దోవలున్నాయి. ఏ దోవ వెంబడి వెళ్లాలా అని ఆ లెఫ్టినెంటులు తటపటాయించారు.

'' 'బెలరూస్' రెస్టారెంటనేదేదీ నాకు తెలియదే'' వాళ్లు అడిగిన మొట్టమొదటి వ్యక్తి, గట్టి యాసతో ఒక విధమైన చిరాకుతో, జవాబిచ్చాడు. కోల్యా సంకోచిస్తూ ఉండిపోవడంతో, లెఫ్టినెంటు నికొలాయే ఆరాలు తీశాడు.

''మీకు తెలిసే వుంటుంది, గొప్ప ఫిడేలు వాద్యగాడొకాయన అక్కడ వాయిస్తూ వుంటాడే, అది.''

''ఓ ఆయనా, పాన్ స్విత్‌స్కీ!'' అని ఆ వ్యక్తి మందహాసం చేశాడు. ''ఆయన అద్భుతమైన ఫిడేలు వాద్యగాడు! ఆ రెస్టారెంటుకైతే నేరుగా వెళ్లాలి. స్టిచ్కెవిచ్ రోడ్డు.''

స్టిచ్కెవిచ్ రోడ్డల్లా కమ్సొమోల్‌స్కయగా తేలింది. పెద్దపెద్ద చెట్లమధ్య చిన్నచిన్న యిళ్లతో కూడిన రోడ్డది.

“నేను విమాన విధ్వంసక శతఘ్ని శిక్షణాలయంలో శిక్షణ పొందాను” కోల్యా తన కథ చెప్పిన మీదట నికొలాయ్ చెప్పాడు: “బలే తమాషాగా వుందే, మనిద్దరం యిప్పుడే పొసయ్యాం, యిద్దరి పేరూ నికొలాయే!”

అతను చటుక్కున మాటలు నిలిపేశాడు. రాత్రి ప్రశాంతిలో దూరాన్నుంచి ఫిడేలు నాదం వినవస్తోంది. లెఫ్టినెంట్లు ఆగి విన్నారు.

“భలే! కోల్యా, మనం సరైన దోవనే వున్నాం.”

ఆ ఫిడేలు వాద్యం, ఒక రెండంతస్తుల భవనపు తెరిచిన కిటికీనుంచి వినవస్తోంది. ఆ భవనంపైన “బెలరూస్” రెస్టారెంట్ అన్న బోర్డు కనిపిస్తోంది. వాళ్లు పై అంతస్తు కెక్కారు, తమ టోపీలనూ, సూట్‌కేసునూ ఓ చిన్న క్లోక్‌రూములో వదిలారు, ఓ చిన్న హాలులోకి వెళ్లారు. ద్వారానికి ఎదురుగా ఒక బుఫే వుంది, ఎడమ పక్క మూల ఓ చిన్న ఆర్కెస్ట్రా వుంది. పొడవాటి చేతులూ, విచిత్రంగా కళ్లు గిలికే అలవాటూ కలిగిన ఆ ఫిడేలు వాద్యగాడు అప్పుడే తన పాటను ఆపాడు, రెస్టారెంటులో బిలబిలలాడు తున్న శ్రోతలు బిగ్గరగా హర్షధ్వానాలు చేస్తున్నారు.

“ఇక్కడ మనవాళ్లు ఎక్కువమంది కనిపిస్తున్నట్టు లేదే” నికొలాయ్ లోగొంతులో అన్నాడు.

కరతాళధ్వనులతోనూ, హర్షధ్వానాలతోనూ చెవులు బద్దలవుతూండగా, వాళ్ళు గుమ్మంలో నిలబడ్డారు. పాతగిలిన నల్లటి కోటు తొడుక్కున్న ఓ లావుపాటి వ్యక్తి వెనక పక్కనుంచి వాళ్లదగ్గరకొచ్చాడు.

“పాన్ ఆఫీసర్లు దయచేసి లోపలికి వస్తారా. ఈ పక్కకి రండయ్యా.”

వాళ్లని అతను నిండుగా వున్న టేబిళ్లనూ, ఉద్రిక్తులై వున్న జనాన్నీ తప్పించి నేర్పుగా లోపలకి తీసుకెళ్లాడు. పింగాణీ పెంకులు కరిపించిన స్టౌకి సరిగా వెనకే ఖాళీ టేబి లొకటి వుంది. లెఫ్టినెంట్లు అక్కడ కూర్చొని, యువకులకు సహజమైన అపరిమితాసక్తితో తమ అసాధారణ పరిసరాలను పరికించారు.

“మనల్ని ఎందుకతను అలా ఆఫీసర్లనీ, పైగా పాన్లనీ పిలుస్తాడు?” కోల్యా అయిష్టంగా బుసకొట్టాడు. “వెధవ బూర్జువా అలవాట్లు!”

“మనకి నష్టం జరగనంత కాలం వాడు మనల్ని బానలని పిలిచినా ఫరవాలేదు” లెఫ్టినెంట్ నికొలాయ్ నవ్వుతూ అన్నాడు. “ఇక్కడ జనమింకా వెనకబడివున్నారు కోల్యా.”

నల్ల దుస్తుల్లో వున్న వ్యక్తి తమకేమి కావాలో తెలుసుకొంటూండగా, కోల్యా ఆశ్చర్యంగా, తన చుట్టూ వినవస్తున్న మాటలు వింటూ, వాటిలో ఒక్క వాక్యాన్నైనా అర్థం చేసుకోవాలని తంటాలు పడుతున్నాడు. కాని ఆ భాషల కలగాపులగం అతని మనస్సును గజిబిజిచేసింది, గందరగోళపరిచింది. అతను తన కొత్త స్నేహితునితో యీ విషయాన్ని

గురించే ఏదో చెప్దామనుకొన్నాడు, కాని సరిగా యింతలోనే అతని వెనుక రష్యన్ మాట — చిత్రమైన యాసలోనే అయినా రష్యనే — వినవచ్చింది.

"క్షమించండి, క్షమించండయ్యా, కాని అటువంటి పాంట్లలో వీధుల్లో కెళ్ళడాన్ని నేను ఊహించుకోలేకపోతున్నాను."

"ఏమైతేనేం వాళ్ళు ఆ పాంటుల ఉత్పత్తి కోటా మాట యాభై శాతం పూర్తిచేసి 'బ్యానర్ ఆఫ్ ఆనర్' సంపాదించుకున్నారు."

కోల్యా అటు తిరిగాడు. పక్క టేబిలు దగ్గర ముగ్గురు పెద్దవాళ్ళు కూర్చున్నారు. వారిలో ఒకడు కోల్యాను చూసి మందహాసం చేశాడు.

"గుడీవెనింగ్ కామ్రేడ్ కమాండర్! మేమూరికే ఉత్పత్తి ప్రణాళిక గురించి చర్చించుకుంటున్నాం, అంతే."

"గుడీవెనింగ్" కోల్యా తడబాటుగా అన్నాడు.

"మీరు రష్యానుండి వచ్చారా?" కలుపుగోలుగా మాట్లాడే అతని పక్క వ్యక్తి అడిగి, జవాబు కోసం ఆగకుండా కొనసాగించాడు. "ఔనండీ, ఫేషన్ విషయం నాకూ తెలుసు. ఫేషన్ అనేదొక మహమ్మారే, ఫెను భూతమే, యింకా చెప్పాలంటే, అది ఓ భూకంపం లాంటిదే, అయితేనేం, ఎన్ని చెప్పినా చివరకి అది సహజమైనది. కాని, యాభై మంచి పాంట్లు తయారుచేసేందుకు బదులు నూరు నాసిరకం పాంట్లు తయారుచెయ్యడం, దానికి 'బ్యానర్ ఆఫ్ ఆనర్' సంపాదించుకోవడం — చూశారూ అది, క్షమించండి. నన్ను క్షమించండయ్యా. మీరు ఒప్పుకుంటారా, యువ కామ్రేడ్ కమాండర్?"

"నిజమే" కోల్యా అన్నాడు. "నిజానికి అది, కేవలం...."

"సరేగాని, దయచేసి నాకీ విషయం చెప్పండి" రెండో అతను అన్నాడు, "మీరొచ్చిన చోట జర్మన్లను గురించి ఏమనుకుంటున్నారు?"

"జర్మన్లను గురించా? ఏమీ లేదే, అంటే, మనకీ జర్మన్లకీ మధ్య శాంతి ఒడంబడిక వుంది కదా —"

"ఔను" పక్క టేబిలు దగ్గర్నుంచి వినవచ్చింది. "జర్మన్లు వార్సాదాకా రాగలగడమన్నది, శుద్ధ మూర్ఖుడికి తప్ప మెడమీద తల వున్న వాడికెవడికైనా అర్థమవుతుంది. కాని వాళ్ళు మాస్కోకి రారు."

"ముమ్మాటికీ రారు!"

వాళ్ళంతా మరేదో భాషలో మాట్లాడ నారంభించారు. కోల్యా మర్యాదగా విన్నాడు, ఏమీ అర్థంకాక పక్కకి తిరిగాడు.

"వీళ్ళకి రష్యనొచ్చు" లోగొంతులో చెప్పాడు.

"ఇదిగో నాదగ్గర కొంచెం వోడ్కా వుంది" లెఫ్టినెంట్ నికొలాయ్ అన్నాడు. "మన సమావేశ సందర్భంగా పుచ్చుకుందాం."

కోల్యా తను తాగనని చెప్దామనుకున్నాడు, కాని ఎందుకనో మరో సమావేశం సంగతి గుర్తుచేసుకొని, లెఫ్టినెంట్ నికొలాయ్‌కి వాల్యా వేరాలను గురించి — ముఖ్యంగా వాల్యాని గురించే — చెప్పనారంభించాడు.

"ఔను, నువ్వే మనుకుంటున్నావ్ కోల్యా — ఏమో ఆమె వస్తుందేమో" నికొలాయ్ అన్నాడు. "వాళ్లకి పాస్ ఉంటే సరిపోతుంది."

"నేను పాస్ తీసుకుంటాను."

"నేను కూర్చోవచ్చా యిక్కడ?"

టాంకు దళానికి చెందిన ఒక పొడుగాటి లెఫ్టినెంటు వాళ్ల పక్కన నిలబడ్డాడు. అతను వాళ్లతో కరచాలనం చేసి, తనని తను పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు అంద్రేయ్. నేను ఒక రిక్రూట్ల దళం కోసం రిక్రూటింగ్ ఆఫీసుకెళ్తా దోవలో యిక్కడ చిక్కుబడ్డాను. నేనిప్పుడిక సోమవారందాకా యిక్కడే వుండాలి."

అతనింకేదో చెప్పబోయాడు, కాని యింతలో పొడవు చేతుల ఫిడేలు వాద్యగాడు తన ఫిడేలును పైకెత్తాడు, హాలంతటా నిశ్శబ్దం ఆవరించింది.

చిత్రంగా కళ్లు చికిలించే ఆ వికృతపు, పొడవు చేతుల వ్యక్తి ఏమి వాయిస్తున్నదీ కోల్యాకు తెలియదు. అతను బాగా వాయిస్తున్నాడో, చెడ్డగా వాయిస్తున్నాడో కూడా కోల్యాకి తెలియదు. అతను వట్టినే విన్నాడంతే, తన గొంతులో ఏదో ఉండ మాదిరిగా పైకి లేస్తున్నట్టు అనుభూతిచెందాడు. ఆ క్షణాన కన్నీళ్లు కారినా అతను సిగ్గుపడి వుండేవాడు కాడు, కాని కన్నీళ్లు సరిగా పైకి ఉబుకుతున్న క్షణాననే వాద్యగాడు తన వాయిద్యాన్ని ఆపుచేశాడు, దానితో కోల్యా కేవలం జాగ్రత్తగా ఒక నిట్టూర్పు విడిచి మందహాసం చేశాడు.

"మీకు నచ్చిందా?" పక్క టేబిలు దగ్గరున్న పెద్దాయన అతన్ని మెల్లగా వాకబు చేశాడు. "అతను మా రువీమ్ స్వీత్‌స్కీ, బ్రెస్ట్ పట్టణమంతట్లోకీ ఫిడేలు వాద్యంలో అందెవేసిన చెయ్యి. వెనకేమిటి, యిప్పుడేమిటి అతన్ని మించినవాడు లేడు. ఏ వివాహంలోనైనా రువీమ్ వాయించాడో, వధువెప్పుడూ సుఖంగా సంతోషంగా వుంటుంది. కాని అతను ఏ అంత్యక్రియల దగ్గరైనా వాయిస్తే..."

స్వీత్‌స్కీ అంత్యక్రియల దగ్గర వాయిస్తే ఏమి జరిగేదీ — చుట్టూ వున్నవాళ్ళ ఉష్షుష్షనడంతో — కోల్యా తెలుసుకోనే లేకపోయాడు. పెద్దాయన తలూపాడు, విన్నాడు, తర్వాత కోల్యా చెవిదగ్గర గుసగుసగా చెప్పాడు:

"ఆయన పేరు జాగ్రత్తగా జ్ఞాపకం పెట్టుకోండి: రువీమ్ స్వీత్‌స్కీ. ఆయన

స్వయంగా నేర్చుకున్నాడు, ఆయనవి బంగారు చేతులు, బంగారు చెవులు, ఆయనది బంగారు హృదయం.''

కోల్యా చాల సేపు చప్పట్లు కొట్టాడు. ఈలోగా ఆకలివర్ధక పదార్థాలు వచ్చాయి. లెఫ్టినెంట్ నికొలాయ్ గ్లాసులు నింపి, లోగొంతులో అన్నాడు.

''సంగీతానికేం అది బాగానే వుంది. కాని యీ సంగతి జాగ్రత్తగా విను!''

కొత్తగా తమతో చేరిన లెఫ్టినెంటు వంక కోల్యా ప్రశ్నార్థకంగా చూశాడు.

''నిన్నటి రోజున వైమానికులందరి సెలవలూ రద్దుచెయ్యబడ్డాయి'' అంద్రేయ్ మెల్లగా చెప్పాడు. ''గస్తీ సైనికులు ప్రతి రాత్రీ తమకు బుగ్ నది అవతల ఇంజన్ల — టాంకుల, ట్రాక్టర్ల — శబ్దం వినవస్తున్నట్లు చెప్తున్నారు.''

''బలే వార్తే'' అంటూ నికొలాయ్ తన గ్లాసు పైకెత్తాడు. ''మన కలయికకి.''

వాళ్ళు ముగ్గురూ తాగారు. కోల్యా తొందరగా తినుబండారాన్ని నోటి నిండా కొరికి, అలా నిండు నోటితోనే అన్నాడు:

''ఒక వేళ యిది రెచ్చగొట్టే ప్రయత్నమేమో?''

''ఓ నెల్రకితం ఒక ఆర్చిబిషప్పు అటునుంచి వచ్చాడు'' అంద్రేయ్ మెల్లగా కొనసాగించాడు. ''జర్మన్లు యుద్ధానికి తయారవుతున్నారని ఆయన చెప్పాడు.''

''కాని మన టాస్ వార్తా సంస్థ అధికారికంగా ప్రకటించింది కదా...''

''ఇదిగో ఊరుకో కోల్యా'' నికొలాయ్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. ''టాస్ వార్తా సంస్థ ఉన్నది మాస్కోలో. ఇది బ్రెస్ట్.''

ఈలోగా భోజనం వచ్చింది. జర్మన్లను గురించీ, టాస్ వార్తా సంస్థను గురించీ, సరిహద్దును గురించీ, ఆర్చిబిషప్‌ను గురించీ మర్చిపోయి — ఆర్చిబిషప్‌ను కోల్యా ఎలాగా నమ్మలేదనుకోండి, ఏమైనా అతను చర్చికి చెందిన మనిషి కదా! — వాళ్ళు భోజనంపైన పడ్డారు.

ఫిడేలు వాద్యగాడు తర్వాత మళ్ళీ వాయించాడు. కోల్యా తినడం ఆపి, తన్మయుడై విని, ఒళ్ళు మరచిపోయి కరతాళ ధ్వనులు చేశాడు. మిగిలిన వాళ్ళూ విన్నారు, కాని పుకార్లను గురించీ, రాత్రిపూట వినవచ్చే విచిత్రమైన ధ్వనులను గురించీ, జర్మన్ విమానాలు తరచుగా చేసే సరిహద్దు ఉల్లంఘనలను గురించీ గుసగుసగా మాట్లాడుకుంటూనే వున్నారు.

''వాటిని మనం కూల్చకూడదు. అవీ ఆజ్ఞలు. అందుకని ఏం చెయ్యడం, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటాం, అంతే.''

''ఓహ్, ఆయన ఎంత అద్భుతంగా వాయిస్తాడో!'' కోల్యా ఆనందాతిరేకంలో అరిచాడు.

''ఔను, ఆయన బాగానే వాయిస్తున్నాడు. లోలోపల కుంభకోణం ఏదో జరుగుతోంది నేస్తాలూ. కాని ఏమిటది, అన్నదే ప్రశ్న.''

“పోన్లే, జవాబు అదే దొరుకుతుంది” నికొలాయ్ మందహాసం చేస్తూ అని, తన గ్లాసు పైకెత్తాడు. “ఏ ప్రశ్నకైనా సమాధానానికి తాగండి, కామ్రేడ్స్ లెఫ్టినెంట్స్!”

చీకటి పడుతోంది, రెస్టారెంటులో దీపాలు వెలిగాయి. కరెంటు సాఫీగా లేదేమో బల్బులు మందంగా ఆరుతూ వెలుగుతూ వున్నాయి, నీడలు గోడలపైన నాట్యం చేస్తు న్నాయి. లెఫ్టినెంట్లు ఆర్డరుచేసిన ఆహారపదార్థాలన్నీ పూర్తిగా తినేశారు, నికొలాయ్ బిల్లు కోసం అడిగాడు. “ఓ, యీసారి బిల్లు నాది నేస్తాలూ!”

“నువ్వు దుర్గానికెళ్తున్నావా?” అంద్రేయ్ ప్రశ్నించాడు. “నువ్విప్పుడెళ్లడం మంచిది కాదని నా ఉద్దేశం, కోల్యా. చాలా దూరం, పైగా చీకటి. నాతో వచ్చేసి, యీ రాత్రి నాతోబాటు రిక్రూటింగ్ ఆఫీసులో గడిపితే మంచిది.”

“అక్కడెందుకు?” లెఫ్టినెంట్ నికొలాయ్ అడ్డువచ్చాడు. “నాతో స్టేషను కొచ్చెయ్, కోల్యా.”

“అబ్బే లాభం లేదు, నేనీ రోజునే ఉద్యోగంలో జేరాలి.”

“నీకు మతిపోయింది, లెఫ్టినెంట్” అంద్రేయ్ నిట్టూర్చాడు. “రాత్రిపూట, పట్న మంతా సూట్‌కేసు మోసుకెళ్ళడమంటే మతిమాలిన పని కాక మరేమిటి.”

“నా దగ్గర రివాల్వరు వుంది” కోల్యా అన్నాడు.

బహుశా వాళ్లు అతడ్ని ఒప్పించేవారే, కోల్యా — తన దగ్గర రివాల్వరు వున్నా కూడా — తటపటాయించ నారంభించాడు. అప్పుడిక అతను స్టేషన్లోనో, రిక్రూటింగ్ ఆఫీసులోనో గడిపివుండేవాడే. కాని ఆ క్షణంలో పక్క టేబిలు దగ్గరున్న పెద్దాయన అక్కడికొచ్చాడు.

“కామ్రేడ్ రెడార్మీ కమాండర్స్, నన్ను మన్నించండి. దయచేసి నన్ను మన్నించండి. మా రువీమ్ స్వీత్‌స్కీ వాద్యం ఈ యువకుడికి చాలా నచ్చింది. రువీమ్ యిప్పుడు భోజనం చేస్తున్నాడు, అయినా నేనాయనతో మాట్లాడాను. యువ కామ్రేడ్ కమాండర్, ఆయన ప్రత్యేకించి నీకోసం వాయించడానికి ఒప్పుకున్నాడు.”

పర్యవసానంగా కోల్యా వెళ్లిపోలేదు. ఫిడేలు వాద్యగాడు ప్రత్యేకించి తన కోసం వాయించేందుకుగాను, అతను అక్కడే ఉండిపోయాడు. తాము పడుకొనేందుకు చోటు వెతుక్కోవాలి కనుక, మిగిలిన యిద్దరూ వెళ్లిపోయారు. వాళ్ళు అతని చేతిని గట్టిగా ఒత్తి ఊపి, మందహాసం చేసి, రాత్రి చీకట్లోకి — జెర్జిన్‌స్కీ వీధిలోని రిక్రూటింగ్ ఆఫీసుకు అంద్రేయ్, జనంతో కిటకిటలాడే బ్రెస్ట్ స్టేషనుకు నికొలాయ్ — నిష్క్రమించారు. వాళ్ళు ఆ రాత్రిలోకి, ఏడాదిలోని మిక్కిలి హ్రస్వమైన రాత్రిలోకి — అనంత కాలంలోకి అన్నట్లు — నడిచివెళ్లారు.

రెస్టారెంటు క్రమంగా ఖాళీకాసాగింది, వాయురహితమైన చిక్కని ఆ రాత్రి తెరిచి వున్న కిటికీలగుండా లోనికి పాకింది. ఏక అంతస్తు బ్రెస్ట్ పట్నం నిద్రలో కూరుకు

పోయింది. తిన్నని వీధులు క్రమంగా నిర్మానుష్యమయ్యాయి. జాజి, లైలక్ తీగలచే ఆవరింప బడిన కిటికీలలో లైట్లు ఆరిపోయాయి. మధ్యమధ్య ఏ గుర్రబ్బండీయో శబ్దాన్ని ప్రతి ధ్వనించే వీధుల్లో టకటక శబ్దంచేసుకుంటూ పోతోంది. ప్రశాంతమైన ఆ పట్నం, ఏడాదిలో మిక్కిలి హ్రస్వమైన రాత్రి ప్రశాంతతలో క్రమంగా మునిగిపోయింది.

కోల్యా తల కొంచెం తిరుగుతోంది. తన చుట్టూ వున్న సమస్తం — ఆ చిన్న రెస్టా రెంటులో క్రమంగా కరిగిపోతున్న శబ్దం, కిటికీలగుండా లోనికి జారివస్తున్న నునువెచ్చని చీకటీ, బయట నిగూఢమైన అద్భుతత్వంలో మునిగివున్న పట్టణం, లెఫ్టినెంట్ ఫ్యూజ్నికొవ్ అనబడే తన కోసం ప్రత్యేకించి వాయించబోతున్న వికారాకారుడైన ఫిడేలు వాద్యగాని కోసం తన యీ నిరీక్షణా — అతనికి అద్భుతంగా కనిపించింది. ఒకేఒక్క చిక్కున్నట్లు కనిపించిందతనికి — వాద్యగానికి తను డబ్బు చెల్లించాలా అక్కర్లేదా? ఈ విషయం అతను ఆలోచించాడు, మర్యాదపురస్సరంగా ఆయన చెయ్యబూనుకున్న యింపైన పనికి తను డబ్బు చెల్లించ ప్రయత్నించడం ఔచిత్యంలేని పనే అవుతుందన్న నిర్ధారణకు వచ్చాడు.

"గుడీవెనింగ్, కామ్రేడ్ కమాండర్." ఫిడేలు వాద్యగాడు ఎంత మెల్లగా వచ్చాడంటే, ఆ మాటలు విన్న కోల్యా తటాలున లేచి నిలబడి, తడబాటుతో ఏదో గొణిగాడు. "మీరు రష్యానుంచి వచ్చారనీ, మీకు నా వాద్యమంటే యిష్టమనీ ఇసాక్ చెప్పాడు."

కమానూ, ఫిడేలూ అతని పొడవాటి చేతిలో వున్నాయి, అతను ఎప్పటి మాదిరిగానే విలక్షణంగా కళ్ళార్పుతున్నాడు. మరింత సన్నిహితంగా చూసిన మీదట స్వీత్స్కీ ఎడమ కంటిగ్రుడ్డుపైన తెల్లని పొర వున్నట్లు కోల్యా గమనించాడు.

"ఏ రష్యన్ కమాండరుకైనా ఏం నచ్చుతుందో నాకు తెలుసు." ఫిడేలు వాద్యగాడు తన సంగీతసాధనాన్ని పైకెత్తి, దాన్ని తన చుబుకం కింద నొక్కిపట్టి, తన కమానును పైకెత్తాడు.

అప్పుడిక ఆ ఫిడేలు పాడింది, విలపించింది, అప్పుడు తిరిగి అందరూ — తమ అజాగరూకత కారణంగా ఎక్కడ ఏ మాత్రమైనా శబ్దం చేసి వికారాకారుడైన, కంట్లో పొర గల ఆ వాద్యగానికి ఎక్కడ కోపం తెప్పిస్తామోనన్న భయంతో — నిస్తబ్ధులయ్యారు. కోల్యా, ఫిడేలు తీగలపై కంపిస్తూ నాట్యమాడుతున్న రుపీమ్ సన్నని చేతివేళ్లను పరికిస్తూ లేచి నిలబడ్డాడు, అతను మళ్లీ విలపించాలని కోరుకున్నాడు, — స్వీత్స్కీ అతని కన్నీళ్లను పైకి రానివ్వకపోవడంతో — మరోమారు అతను విలపించలేకపోయాడు. దానితో కోల్యా కేవలం దీర్ఘంగా నిట్టూర్చి, మందహాసం చేశాడు.

స్వీత్స్కీ "నీలి కళ్ళు" "నల్ల కళ్ళు" అనే పాటలను వాయించాడు. కోల్యా అంతకు ముందెన్నడూ వినని మరో రెండు పాటలు వాయించాడు. చిట్టచివరి పాట ఉద్రేకంగానూ, గంభీరంగానూ వుంది.

''మెండెల్‌సోన్‌ది'' స్విత్‌స్కీ చెప్పాడు. ''మీరు మంచి శ్రోత. థాంక్ యూ.''

''నాకు మాటలు చాలడం లేదు.''

''మీకు నా స్వాగతం. అన్నట్లు, మీరొక వేళ దుర్గానికి వెళ్లడం లేదుకదా?''

''ఔను అక్కడికే'' కోల్యా గుటకేశాడు. ''చెస్ట్‌నట్ రోడ్డు.''

''మీరు జట్కా చేయించుకోవాలి'' స్విత్‌స్కీ మందహాసం చేశాడు. ''మీకు కావాలంటే నేనొక జట్కా కుదిర్చిపెట్టగలను. నా మేనకోడలు కూడా అక్కడికే వెళ్తోంది.''

అతను తన ఫిడేలును పెట్టెలో పెట్టేశాడు, కోల్యా ఖాళీ క్లోక్‌రూమునుంచి తన సూట్‌కేసును తీసుకున్నాడు, వాళ్లిద్దరూ బయటకు వెళ్లారు. వీధి నిర్మానుష్యంగా వుంది.

''ఇక్కడ మనం ఎడమ పక్కకి తిరగాలి'' మూలకి వచ్చాక స్విత్‌స్కీ అన్నాడు. ''మీర్చా — ఆమే నా మేనకోడలు — ఆమె యిప్పటికి ఒక ఏడాదిగా ఆఫీసర్ల మెస్సులో వంటకత్తెగా పనిచేస్తోంది. ఆమెకి నేర్పుంది, నిజమైన నేర్పు. మా మీర్చా ఉంది చూడండి, అది మంచి గృహిణి అవుతుంది.''

అకస్మాత్తుగా లైట్లన్నీ — వీధి లైట్లు, కిటికీల్లోని లైట్లు, స్టేషనునుంచి కనిపించే వెలుతురూ అన్నీ — ఆరిపోయాయి. పట్టణమంతా గాఢాంధకారంలో మునిగిపోయింది.

''విడ్డూరంగా వుందే'' స్విత్‌స్కీ అన్నాడు. ''టైమెంతైందిప్పుడు? ఇంకా పన్నెండే, కదూ?''

''బహుశా కరెంటు ఫెయిలైందేమో?''

''ఔను, చాలా విడ్డూరంగానే వుంది'' స్విత్‌స్కీ రెట్టించాడు. ''మీకు తెలుసా, తూర్పునాటివాళ్లు వచ్చినప్పటినుంచీ — అదే, నా ఉద్దేశం మీ సోవియట్ జనం అని — ఔను, అప్పటినుంచి మేము చీకట్లోంచి బయటపడ్డాం. చీకటినుంచీ, నిరుద్యోగంనుంచీని. మా పట్టణంలో నిరుద్యోగులంటూ ఎవరూ లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే, కాని నిజంగానే లేరు! జనం పెద్దపెద్ద వివాహోత్సవ వేడుకలు చేసుకోవడం మొదలుపెట్టారు, అంతే, దానితో అకస్మాత్తుగా ఒక్కసారి రువీమ్ స్విత్‌స్కీకి గిరాకీ పెరిగిపోయింది!'' అతను మెల్లగా నవ్వాడు. ''గాయకులకు చేతినిండా పనివుండటం అద్భుతమైన విషయం — అంటే అదే, అంత్యక్రియల దగ్గర వాయించాల్సిరాకపోతేనే అనుకోండి. ఇప్పుడిక — ఇక్కడొక సంగీత పాఠశాలా, సంగీత కళాశాలా ప్రారంభించబడ్డాయి కనుక — యిక్కడ మాకు కొల్లలుగా గాయకులూ, వాద్యగాళ్లూ తయారవుతారు. అది సరైనదీ, భేషైనదీ. మా యూదులం జన్మతః గాయకులం అంటూ వుంటారు. ఔను నిజమే, శతాబ్దాల తరబడిగా మీరు సైనికుల పదఘట్టనలే వింటూ వుండి, వాళ్లు ఏ వీధిలో ఉన్నారా అనీ, సమీపంలోని ఏ గొందులోనుంచో కెవ్వున అరుస్తున్నది మీ కూతురే ఏమోననీ దిగ్భ్రాంతి చెందుతూవున్న మీరు సంగీతం పట్ల ఆకర్షితులవుతారు. అబ్బే, నేను భగవంతుని క్రోధాన్ని రెచ్చగొట్టా

కోరుకోవడం లేదు. మేము నిజంగా అదృష్టవంతులమే, చిట్టచివరకు యిన్నాళ్లకు మాకు మంచి రోజులొచ్చాయి, యిప్పుడు మానవుల మాదిరిగా తలెత్తుకు తిరగగలరు. నేనూ మానవుడినేనని అనుభూతి చెందగలగడం — ఎంత అద్భుత విషయం! కాని మా వెన్నులు నిటారుగా నిలవడం, మా కళ్లు చిరునవ్వులు చిందించడం యింకా నేర్చుకోలేదు — అది భయంకరమైన విషయం! — చిన్నారి పిల్లలు దిగులుకళ్లతో జనించడం ఎంత భయంకర విషయం! మీకోసం నేను మెండెల్‌సోన్ వాయించాను మీకు గుర్తుందా? ఆయన సరిగా అదే చెప్తాడు — విచారంతో నిండిన బాలబాలికల కళ్లను గురించి. దాన్ని మనం వివరించడం — ఫిడేలుతోనేగాని, మాటల్లో — సాధ్యంకాదు.''

వీధి దీపాలు ఉజ్వలంగా వెలిగాయి, స్టేషన్‌నుంచి కాంతి తిరిగి ప్రసరించింది, కిటికీలు ప్రకాశించాయి.

''కరెంట్ ఫెయిల్యూరే అయ్యుంటుంది'' కోల్యా అన్నాడు. ''ఇప్పుడు మరమ్మతు చేసివుంటారు.''

''ఆ, యిదుగో పాన్ గ్లుజ్మ్యాక్. గుడీవెనింగ్, పాన్ గ్లుజ్మ్యాక్. మీ పని ఎలా సాగుతోంది యీమధ్య? సంపాదన బాగావుందా?''

''బెస్ట్‌లో నేనేం సంపాదించగలను, పాన్ స్వీత్‌స్కీ? ప్రతివాడూ తన ఆరోగ్యం సంగతి ఆలోచించుకొని, కాలినడకనపోయే యీ పట్నంలో సంపాదనేముంటుంది?''

వాళ్లొక జట్కా పక్కన ఆగారు. లోపల ఎవరో వున్నారు. దూరాన్నుంచి కనిపిస్తున్న లైటు కాంతిలో లోపలి వ్యక్తి ఆకృతి అస్పష్టంగా వుంది, కోల్యా ఆ ఆకారపు ముక్కూ ముఖం గుర్తించలేకపోయాడు.

''అమ్మాయ్ మీర్రచ్కా, కామ్రేడ్ లెఫ్టినెంటుని పరిచయం చెయ్యనియ్యి.''

ఆ అస్పష్టాకృతి అస్తవ్యస్తంగా కదిలింది, కోల్యా తనను తాను పరిచయంచేసుకునేందుకు ముందుకెళ్లాడు.

''లెఫ్టినెంట్ నికొలాయ్ ప్లూజ్నికొవ్.''

''ఈ కామ్రేడ్ కమాండరు మన పట్నానికి కొత్తవాడు. అమ్మాయ్ ఆయనకి చక్కని ఆతిథ్యమిచ్చి, పట్నం చుట్టూ తిప్పి చూపించు.''

''అలాగే చూపిస్తాం'' బండివాడు అన్నాడు. ''ఈ రాత్రి చక్కని రాత్రి, తొందరేమీ లేదు. మీకు సుఖస్వప్నాలు కలుగు గాక, పాన్ స్వీత్‌స్కీ.''

''సుఖ ప్రయాణాలు సాగుగాక, పాన్ గ్లుజ్మ్యాక్.'' స్వీత్‌స్కీ కోల్యా చేతిని బలిష్ఠమైన తన పొడవు వేళ్ల పిడికిట్లోకి తీసుకున్నాడు. ''ప్రస్తుతానికి గుడ్‌బై, కామ్రేడ్ కమాండర్. మనం మళ్లీ కలుసుకుంటాం, కదా?''

''తప్పకుండాను, కామ్రేడ్ స్వీత్‌స్కీ. థాంక్ యూ.''

‘‘మీకు స్వాగతం. అమ్మాయ్ మీ(రచ్కా, రేపు యింటికి రా.’’

‘‘అలాగే.’’ ఆమె స్వరం బిడియంగా, కంగారుగా ఉంది.

బండివాడు సూట్‌కేసును ఎత్తి గు(రబ్బగ్గీలో పెట్టి, తను ముందు పలకమీద కూర్చున్నాడు. కోల్యా స్వేత్‌స్కీవంక మరోసారి తలూపి, మెట్టుమీద కాలు పెట్టాడు. ఆ అమ్మాయి ఒక మూలకు ఒదిగి కూర్చుంది. తన బరువుకు (స్ప్రింగులు కి(రుమం టూండగా అతను సీట్లో కూర్చున్నాడు. గు(రబ్బగ్గీ అటూ యిటూ ఊగిసలాడుతూ బయల్దేరింది. కోల్యా ఫిడేలు వాద్యగానివంక చేతులూపి సెలవు తీసుకుందామనుకున్నాడు; కాని సీటు పల్లంగానూ, (పక్క ఎత్తుగానూ వుండటం మూలంగానూ, బండివాని వెడల్పాటి వీపు అతని దృష్టిపథానికి ఆటంకంగా ఉన్నకారణంగానూ అతనలా చెయ్యలేక పోయాడు.

‘‘మనం ఎక్కడికెళ్తున్నాం?’’ ఆ అమ్మాయి తను కూర్చున్న మూలనుంచి మెల్లగా (ప్రశ్నించింది.

‘‘మీ మామ మన అతిథికి పట్నంలో ఏమైనా చూపించమన్నాడు కదా?’’ బండి వాడు వెనక్కి తిరగకుండా జవాబిచ్చాడు. ‘‘సరేగాని, (బెస్ట్-లితోవ్‌స్క్ అనబడే మన యీ పట్నంలో ఎవరికైనా చూపించడానికి ఏముందబ్బా? దుర్గమా? ఎలాగా ఆయన వెళ్ళేది అక్కడికే కదా. కాలవా? రేపు వెల్తురొచ్చాక ఆయన చూస్తాడు. ఈ (బెస్ట్-లితోవ్‌స్క్ పట్నంలో యింకేముంది చూడాల్సింది పాన్ ఆఫీసర్?’’

తను పానూ కాదు, ఆఫీసరూ కాడనీ, రెడార్మీ కమాండరు మా(తమేననీ చెప్పాల నుకున్నాడు కోల్యా, కాని అతనా మాటలు పైకి అనేలోగా గు(రబ్బగ్గీ ఆగింది.

‘‘పట్నంలో చూపించడానికంటూ అసలేమీలేనప్పుడు, నువ్వు జనానికేం చూపిస్తావు?’’ అని (ప్రశ్నించి బండివాడు దిగాడు. ‘‘ఏదో ఒక స్తంభాన్ని ఏరడం, యిదెంతో పేరు పొందిం దని చెప్పడం, అంతేకదా చెయ్యాల్సిన పని. అందుకని మన అతిథికి ఆ స్తంభాన్ని చూపించు, మీ(రచ్కా.’’

‘‘ఓహ్!’’ మూలనుంచి సన్నని ఊపిరివంటి ఓ స్వరం వినవచ్చింది. ‘‘నేనా? మీరే చూపిద్దురూ మిహాస్ బాబాయ్!’’

‘‘నాకు వేరే పనులున్నాయమ్మా.’’ అతను గు(రపు తలదగ్గర కెళ్ళాడు. ‘‘ఏం బేటా, మనం ఈ రా(త్రి పనిచేసి రేపు వి(శాంతి తీసుకుందాం, ఏం, సరేనా?’’ అన్నాడు గు(రంతో.

ఆ అమ్మాయి లేచి, అస్తవ్యస్తంగా మెట్టు దగ్గరకి అడుగులేసింది. బండి అటూ యిటూ ఊగింది, కాని కోల్యా మీ(రా చేతిని పట్టుకొని ఆమెకు ఊతం యివ్వగలిగాడు.

‘‘థాంక్ యూ.’’ మీ(రా తన తల వంచింది. ‘‘వెళ్దాం రండి.’’

అతని కేమీ అర్థంకాకపోయినా అతను ఆమెను అనుసరించాడు. చౌరస్తా ఖాళీగా

వుంది. ఎందుకైనా మంచిదని అతను తన చేతిని పిస్తోలు ఒరపైన వుంచి, ఆ అమ్మాయి వంక చూశాడు. గమనీయంగా కుంటుతూ ఆమె పేవ్‌మెంటు పక్కగా వున్న గోడ దగ్గరకు వెళ్లింది. "ఇదిగో యిక్కడుందది."

కోల్యా ఆమె దగ్గరకు వెళ్లాడు. ఆ గోడ పక్కనే మందంగా పొట్టిగా వున్న ఒక రాతి స్తంభం వుంది.

"ఏమిటిది?"

"నాకు తెలియదు" ఆమె సిగ్గుగా, యాసతో అంది. "దుర్గపు సరిహద్దును గురించి దానిమీద ఏదో రాసివుంది. కాని యిప్పుడది కనిపించదు, చీకటిగా వుంది."

"ఔను, చీకటిగా వుంది."

తమ తడబాటును మరుగుపరచుకోవడం కోసం వాళ్లా మామూలు రాతి స్తంభాన్ని శ్రద్ధగా చూశారు. కోల్యా దాన్ని తడిమిచూశాడు.

"ఇది పాతది" అతను గౌరవపురస్సరంగా అన్నాడు.

తిరిగి నిశ్శబ్దం ఆవరించింది. బండివాడు పిలిచినప్పుడు వాళ్లిద్దరూ తేలికగా ఊపిరి పీల్చుకున్నారు. "దయచేసి రండి, పాన్ ఆఫీసర్!"

ఆ అమ్మాయి బండి దగ్గరకు కుంటుకుంటూ చేరుకుంది. కోల్యా కొంత వెనక బడ్డాడు, కాని ఆమెకు చేయి ఊతం యిచ్చి ఎక్కించడానికి సకాలంలో చేరుకున్నాడు. బండి వాడు అప్పటికే పైకెక్కి కూర్చున్నాడు.

"ఇంక దుర్గానికి పోదామా, పాన్ ఆఫీసర్?"

"నేను పాన్‌నేమీ కాను!" కోల్యా కోపంతో భగ్గుమని, బరువుకి కుంగుతున్న సీట్లో దభాలున కూర్చున్నాడు. "నేను కామ్రేడ్‌ని, అర్థమైందా? కామ్రేడ్ లెఫ్టినెంట్‌ని, అంతే గాని ఏ రకం పాన్‌నీ కాను. బోధపడిందా?"

"పాన్ కాదా?" బండివాడు కళ్లాలను జాడించాడు, నాలుకతో క్క్య, క్క్య అన్నాడు, గుర్రం తాపీగా కంకర రాళ్లపై లగువుతీసింది. "మీరు నావెనక కూర్చుని, ఏక్షణాన అయినా నా వీపుపైన చాచి తన్నగలిగితే మీరొక పానే. చూడండి నేనిక్కడ యీ గుర్రం వెనక కూర్చున్నాను కదా, దాన్ని నేను వీపు మీద బాదకలను గనుక, దానికి సంబంధించినంత వరకు, నేనూ ఒక పాన్‌నే. ప్రపంచపు నడకతీరే అంత — ఒక పాన్ మరో పాన్ వెనక కూర్చోడం."

ఇప్పుడు బగ్గీ పెద్దపెద్ద కంకరరాళ్లపైన పోతున్నదేమో ఆ కుదుపు మూలంగా వాదం కొనసాగించడం అసంభవమే అయింది. కోల్యా తన సూట్‌కేసును కాళ్లసందున అణచిపెట్టి, తన శక్తినంతనీ తన మూల తను కూర్చోడానికే వెచ్చిస్తూ, కుంగుతున్న తన సీట్లో ఎగిరెగిరి పడుతున్నాడు.

"చెస్ట్‌నట్ వీధి" ఆ అమ్మాయి అంది. ఆమె కూడా బండి కుదుపులకు బాగా కదిలిపోతోంది. రైల్వే క్రాసింగ్ దాటాక వీధి వెడల్పైంది. ఇళ్ళు చెదురుమదురుగా యిక్కడొకటీ అక్కడొకటీ వున్నాయి, దీపాలే లేవు. కానైతే రాత్రి మరీ చీకటిగా కాక, మసక వెల్తురుగా వుందేమో, పరిచితమైన రోడ్డుపైన ఆ గుర్రం సునాయాసంగా దౌడుతీసింది.

క్రెమ్లిన్‌ని పోలిన కట్టడమేదో కనిపిస్తుందని కోల్యా ఆతృతగా ఎదురుచూశాడు. కాని తీరా చేసి అక్కడ బండివాడు బండిని ఆపినప్పుడు, అతని ఎట్టఎదుట అంత ఎత్తు లేని నిరాకారమైన దిబ్బ మాదిరిదేదో మాత్రమే అతనికి కనిపించింది.

"మనం వచ్చేశాం, పాన్ ఆఫీసర్."

ఆ అమ్మాయి బండిలోంచి కిందకి దిగుతూండగా కోల్యా అస్తవ్యస్తంగా బండివాని చేతిలో అయిదు రూబుళ్ళ నోటొకటి పెట్టాడు.

"పాన్ ఆఫీసర్, మీరు చాలా ధనవంతుల్లా వున్నారే. మీకేమైనా ఓ ఎస్టేటో, లేకపోతే నోట్లు అచ్చుగుద్దే యంత్రమో లేదు కదా?"

"ఏం?"

"పగటిపూట అయితే యిక్కడికి రావడానికి నేను నలభై కోపెక్కులు తీసుకుంటాను. కాని రాత్రిపూట, అందులోనూ మీ దగ్గర్నుంచి నేను ఒక రూబులు అడుగుతాను. అందుకని ఓ రూబులిలా పడెయ్యండి. మీరు ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రార్థిస్తాను."

అతను బండివానికి డబ్బు చెల్లిస్తూండగా మీర్రా ఓ పక్క నిరీక్షిస్తూ నిలబడింది. కోల్యా అడ్డదిడ్డంగా అయిదు రూబుళ్ల నోటు జేబులో కుక్కి, చిల్లర రూబులు నోటు కోసం — "ఒక్క క్షణం, యిదిగో యిప్పుడే యిస్తున్నాను, క్షమించండి, యిప్పుడే" — అని గొణుగుతూ జేబులు గాలించాడు.

చిట్టచివరకు ఒక రూబులు నోటు కనిపించింది. కోల్యా బండివానికి మరోమారు కృతజ్ఞతలు చెప్పి, తన సూట్‌కేసు తీసుకొని ఆ అమ్మాయి దగ్గర కెళ్ళాడు.

"ఇప్పుడు మనం ఎక్కడికెళ్ళాలి?"

"చెక్ పోస్టు దగ్గరకి." ఆమె రోడ్డు పక్కనున్న ఒక పాకని చూపించింది. "మీరక్కడ మీ గుర్తింపు పత్రాలు చూపించాలి."

"ఏమిటి, అయితే దుర్గం యిదేనా!?"

"ఔను. గుండ్రంగా ఉండే కాల్వమీద వంతెన దాటితే మనం ఉత్తరపు సింహద్వారం దగ్గరకు చేరుకుంటాం."

"ఇదా దుర్గం!" కోల్యా మెల్లగా నవ్వుకున్నాడు. "నేనింకా కోటగోడలూ, బురుజులూ ఉంటాయనుకుంటున్నాను. అయితే యిదేనన్నమాట, యిలా వుంటుందన్నమాట బ్రెస్ట్ దుర్గం!"

4

చెక్ పోస్టు దగ్గర సెంట్రీ కోల్యా పత్రాల ఆధారంతో అతన్ని లోపలకు రానిచ్చేందుకు సిద్ధపడక, అతన్ని నిలిపేశాడు. కానైతే సెంట్రీ ఆ అమ్మాయిని లోపలకు పోనిచ్చాడు, దానితో కోల్యా లోపలకు వెళ్లాలని మరింతగా పట్టుపట్టాడు.

"గస్తీ కార్పొరల్‌ని పిలవండి."

"ఆయన నిద్రపోతున్నారు, కామ్రేడ్ లెఫ్టినెంట్."

"పిలవండి. ఇది నా ఆజ్ఞ."

చివరకు నిద్రమత్తుగా వున్న ఒక సార్జెంటు అక్కడికొచ్చాడు. అతను కోల్యా ఉద్యోగ పత్రాలను — దవడ ఎక్కడ పగిలిపోతుందో అన్నంత పెద్దగా ఆవులిస్తూ — పరిశీలించాడు.

"మీరు చాలా లేటుగా వచ్చారు, కామ్రేడ్ లెఫ్టినెంట్."

"నన్ను ఆపుచేశారు" కోల్యా సందిగ్ధంగా చెప్పాడు.

"మీరు దీనికి వెళ్లాల్సివుంటుంది."

"నేను ఆయన్ని తీసుకెళ్తాను" మీర్రా అంది.

"ఎవరా 'నేను'?" తనెంత సమర్థుడో చూపేందుకుగాను సార్జెంటు తన టార్చి లైటును ఆ అమ్మాయి ముఖంపైకి తిప్పాడు. "నువ్వా, మీర్రచ్కా? డ్యూటీకి వస్తున్నావా?"

"ఔను."

"అలాగే, నువ్వు మాలో ఒకదానివి. నువ్వీయన్ని 333వ రెజిమెంట్ బ్యారక్సుకి తీసుకెళ్లు, కొత్తవాళ్ల కోసం అక్కడో గది వుంది."

"నా సొంత రెజిమెంటుకే వెళ్లాలి నేను" కోల్యా హుందాగా చెప్పాడు.

"మీరు పొద్దున్న చూసుకోవచ్చు అవన్నీ." ఆ సార్జెంటు మళ్లీ ఆవులించాడు. "రాత్రికంటె ఉదయం నయం."

విలువంపు కప్పు కలిగిన దీర్ఘమైన, ఎత్తు తక్కువ సింహద్వారంగుండా వాళ్ళు దుర్గంలో ప్రవేశించి, కందకాలతోను, తుప్పలు మొలిచిన నిటారు గోడలతోను కూడిన దుర్గపు మొదటి రక్షణవలయాన్ని దాటారు. భూగర్భంలోంచి వస్తున్నదా అన్నట్లు బోలుగా పలుకుతున్న నిద్రబోతు స్వరమూ ప్రశాంతంగా వినవచ్చే గుర్రాల బుసలూ మినహాయిస్తే అంతా ప్రశాంతంగా ఉంది. ఉంది. అర్ధాంధకారంలో బళ్లూ, గుడారాలూ, లారీలూ, ప్రెస్‌చెయ్యబడిన గడ్డిబేళ్లూ అస్పష్టంగా ముందుకు పొడుచుకొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కుడితట్టున ఫిరంగుల బారు ఆకాశంపైన ఉబ్బెత్తుగా చెక్కినట్లు కనిపిస్తున్నాయి.

‘‘ఇక్కడెంత ప్రశాంతంగా ఉందో’’ కోల్యా లోగొంతులో అన్నాడు. ‘‘ఒక్క పిట్ట కూడా కనిపించడం లేదు.’’

‘‘రాత్రిపూటే యిలా వుండేది’’ నవ్వుతున్నట్టున్న స్వరంతో ఆమె చెప్పింది. ‘‘దానికితోడు అందరూ క్యాంపుకి చేరుకున్నారు. మీకు అక్కడి లైట్లు కనిపిస్తున్నాయికదా? అవే కమాండర్ల నివాసాలు. పట్టణానికి నడిచివెళ్ళి రావాలంటే చాలా దూరం, అందుకని నాకిక్కడ ఓ గది యిస్తామని వాగ్దానంచేశారు.’’

ఆమె ఒక కాలు యీడ్చుకుంటూ నడుస్తోంది, కాని తేలికగా నడిచేందుకూ, వెనకపడకుండా వుండేందుకూ ప్రయత్నిస్తోంది. నిద్రాముద్రితమైన యీ దుర్గాన్ని చూడటంలో మనస్సు మగ్నం కాగా కోల్యా తరచు వేగంగా నడుస్తున్నాడు, అతని నడకను అందుకోడానికి ఆమె విపరీతంగా ఆయాసపడుతోంది. ఇప్పుడతను తన ఆతృతను అణుచుకున్నాడు. ఇబ్బందికరమైన ఈ విషయాన్ని తప్పించేందుకు అనువుగా నిరావేశంగా అతనామెను ప్రశ్నించనారంభించాడు.

‘‘ఇక్కడ యిళ్ళ పరిస్థితి ఎలా వుంది? కమాండర్లందరికీ క్వార్టర్లున్నాయా — ఆ సంగతేమన్నా మీకు తెలుసా?’’

‘‘చాలామంది గదులు అద్దెకుతీసుకుంటారు.’’

‘‘గదులు దొరకడం కష్టమా?’’

‘‘కష్టమేం కాదు.’’ ఆమె అతని ముఖంలోకి చూసింది. ‘‘మీకు కుటుంబముందా?’’

‘‘అబ్బే, లేదు.’’ అతను కొంచెం సేపు ఆగాడు. ‘‘మీకు తెలుసు కదా, ఊరికే — పనిచేసుకోడానికి.’’

‘‘పట్నంలో నేను మీకో గది చూసిపెట్టగలను.’’

‘‘థాంక్స్. అంత అర్జెంటేం లేదనుకోండి.’’

ఆమె అకస్మాత్తుగా ఆగి ఒక పొదనుంచి ఓ కొమ్మను పీకింది.

‘‘లైలక్. పూత ఉడిగిపోయింది, కాని సువాసన యింకా పోలేదు.’’

కోల్యా తన సూట్‌కేసును కిందపెట్టి అది తన కర్తవ్యమన్నట్లు ధూళి అంటిన ఆకులను వాసన చూశాడు. వాటికెక్కడా సువాసనాలేశం కూడా లేదు.

‘‘ఇక్కడ మొక్కామొటికా దండిగానే ఉన్నాయే’’ అతను లౌక్యంగా అన్నాడు.

‘‘ఓ, — లైలక్, జాజి, అకాషియాలు — బోలెడున్నాయి.’’

ఆమె తొందరపడుతున్నట్లు లేదు, ఆమెకు నడక కష్టంగా ఉన్నట్లు కోల్యా గ్రహించాడు; ఆమె బాగా అలిసిపోయి వుంటుంది, కొంచెం విశ్రాంతి తీసుకోడానికి యిష్టపడుతున్నట్లుంది. అతి ప్రశాంతంగా, వెచ్చగా ఉంది. అతని తల కొంచెం తిరుగుతోంది,

తన పేరింకా జాబితా కెక్కలేదు కనుక ప్రస్తుతానికి తను హడావిడిపడక్కర్లేదన్న సంగతిని అతను తృప్తిగా గుర్తుచేసుకున్నాడు.

''యుద్ధాన్ని గురించి మాస్కోలో ఏమనుకుంటున్నారు?'' ఆమె గొంతు తగ్గించి అడిగింది.

''యుద్ధమా? ఏం యుద్ధం?''

''ఇక్కడ ప్రతివాళ్ళూ యుద్ధం త్వరలోనే, ఏ క్షణాన అయినా, మొదలవుతుందంటున్నారు'' ఆమె చాలా గంభీరంగా చెప్పింది. ''జనం ఉప్పూ, అగ్గిపెట్టెలూ, అన్ని రకాల వస్తువులూ కొనేస్తున్నారు. కొట్లు దాదాపు ఖాళీ అయిపోయాయి. పడమటి వాళ్ళు, అంటే అదే, మీకు తెలుసు కదా, జర్మన్లనుంచి తప్పించుకుని యిక్కడికొచ్చిన పడమటివాళ్ళు — పంథొమ్మిది వందల ముప్పై తొమ్మిదిలో కూడా సరిగా యిలాగే జరిగిందంటున్నారు.''

''ఎలాగ జరిగిందట?''

''ఉప్పూ, అగ్గిపెట్టెలూ మాయమయ్యాయి.''

''చెత్త మాటలు!'' కోల్యా తుంచేశాడు. ''ఉప్పుకీ యుద్ధానికీ సంబంధమేమిటి — ?''

''ఏమో, నాకేం తెలుసు? అది లేనిదే వంట చెయ్యలేమని మాత్రమే నాకు తెలుసు.''

''వండటమా?'' అతను అసహ్యం మిళితమైన స్వరంలో అన్నాడు. ''జర్మన్లని తమ వంటల కోసం బస్తాలకొద్దీ ఉప్పు నిలవచేసుకోనియ్. కాని మనం — శత్రువుని, వాడి భూభాగం మీదే చావగొట్టి చెవులు మూస్తాం.''

''కాని శత్రువుకి యీ సంగతి తెలుసా అని?''

''వాడు తెలుసుకుంటాడు, వాడి బాబు కూడా తెలుసుకుంటాడు!'' ఆమె యీ వ్యంగ్యధోరణి కోల్యాకి నచ్చలేదు. ఇక్కడ కొంచెం అనుమానించదగ్గ బాపతు మనుషులున్నట్లున్నారు. ''మీరన్నమాట నాకెలావుందో చెప్పమన్నారా? అది విద్రోహకరమైన మాట, తెలిసిందా!''

''ఓరి దేవుడోయ్!'' ఆమె నిట్టూర్చింది. ''యుద్ధం జరగనంత కాలం — మీరేమన్నా అనుకోండి బాబూ.''

''మీరేం గాభరాపడకండి. మొదటి సంగతి, మనం జర్మనీతో నిరాక్రమణ సంధి చేసుకున్నాం. రెండో సంగతి, మన శక్తిని మీరు తక్కువ అంచనావేస్తున్నారని నేననుకుంటున్నాను. మనకున్న ఆయుధశక్తి సంగతి మీకు తెలుసా? అయితే సైనిక రహస్యాలు నేను వెల్లడించకూడదనుకోండి, కాని మీరు రహస్యమైన పనిలో చేర్చుకోబడినట్లు కనిపిస్తోంది.''

''నేను వంటపనిలో చేర్చుకోబడ్డాను.''

''అదేం ఫరవాలేదు'' అతను గంభీరంగా చెప్పాడు. ''సంగతేమిటంటే, మీకు సైనిక హెడ్‌క్వార్టర్సులోకి ప్రవేశానుమతి వుంది. మీరు మన టాంకులు చూసేవుండొచ్చు.''

''కాని యిక్కడ టాంకులేమీ లేవు. కాసిని కవచశకటాలున్నాయంతే.''

''నాకీ సంగతి చెప్పే హక్కు మీకు లేదు.'' కోల్యా కనుబొమలు ముడేశాడు. ''మీకు నన్ను గురించి ఏమీ తెలియనే తెలియదు, అయినాకూడా మీరిక్కడ ఉన్నవాటిని గూర్చిన రహస్య సమాచారం నాకు చెప్పేస్తున్నారు — ''

''కాని పట్నంలో ప్రతివాడికీ యీ విషయం తెలుసు.''

''శుద్ధ అవాంఛనీయం.''

''జర్మన్లకి కూడా.''

''వాళ్ళకి తెలుసునని మీరెందుకు అనుకుంటున్నారు?''

''ఎందుకా!'' ఆమె తన చేతిని ఊపింది. ''మీరు జనం మూర్ఖులనుకుంటున్నట్లుంది. సరే, మీరు కావాలనుకుంటే అలాగే అనుకుంటూవుండండి. సరిహద్దుకి అవతలిపక్కవాళ్ళు మూర్ఖులేమీ కారని ఒక్కసారి తట్టితే, అప్పుడిక మీరు పరిగెత్తుకెళ్ళి జీతం డబ్బులన్నీ పెట్టి అగ్గిపెట్టెలు కొనుక్కుంటారు.''

''ఇదిగో, తమాషాగా వుందా — !''

ఈ ప్రమాదకరమైన సంభాషణ కొనసాగించడం కోల్యాకి యిష్టంలేకపోయింది. అతను కలవరంగా తన చుట్టూ చూశాడు, ఆవులించేందుకు ప్రయత్నించి యథాలాపంగా అడిగాడు: ''ఆ చిన్న యిల్లేమిటి?''

''ప్రథమ చికిత్సా కేంద్రం. మీకు అలసట తీరితే — ''

''నాకా?!'' అతను కోపంతో బుసకొట్టాడు.

''మీరు మీ పెట్టెని కష్టంమీద యీడ్వడం చూశాను.''

''ఇదిగో, తమాషాగా వుందా — !'' కోల్యా మళ్ళీ కంయ్‌మని, తన సూట్‌కేసుని చేతిలోకి తీసుకున్నాడు. ''మనం ఎక్కడికెళ్ళాలి?''

''మీ పత్రాలు సిద్ధంగా పెట్టుకోండి. వంతెనకు ముందు మరో చెక్ పోస్టుంది.''

వాళ్ళు మౌనంగా నడక సాగించారు. తుప్పలు మరింత దట్టమయ్యాయి. ఇటుకలు పరిచిన పేవ్‌మెంటుకి గల తెల్ల పెయింటుతో వేసిన అంచు చీకట్లో స్పష్టంగా మెరుస్తూ కనిపిస్తోంది. గాలిలో తేటుదనం తెలియరావడంతో నదిని సమీపిస్తున్నట్లు అతను గ్రహించాడు. అది అలా స్ఫురించి యిలా పోయిన ఆలోచన మాత్రమే — ఎందుకంటే అతని మనస్సు మరి దేనిలోనో మగ్నమైయుంది.

ఈ అవిటి పిల్లకి చాలా చాలా విషయాలు తెలిసినట్లున్నాయి, అది అతనికి నచ్చ లేదు. ఆమె పరిశీలనా దృష్టి గలది, మూర్ఖురాలేం కాదు, పైగా మాటతీరులో చురుకుపాలె

క్కువ — అదేమంత ఫరవా లేదు. కాని, దుర్గంలో వున్న కవచశకటాలను గురించీ, కాంపులో సైనిక దళాల వికేంద్రీకరణ గురించీ, చివరకు ఆ అగ్గిపెట్టెల గురించీ, ఉప్పు గురించీ యీమెకు తెలియడం యాదృచ్ఛిక విషయం అయ్యుండకపోవచ్చు. అతనికి, ఆ విషయం మరింతగా ఆలోచించిన కొద్దీ, ఆమెతో తన కలయిక, పట్నంలో తమ ప్రయాణం, సుదీర్ఘంగా లక్ష్యశూన్యంగా సాగిన తమ సంభాషణ — యిది కూడా యాదృచ్ఛిక విషయమై యుండదనుకున్నాడు. రెస్టారెంటులో తను ఎలా ప్రవేశించాడో, పక్క టేబిలు దగ్గర పాంట్లను గురించి సాగిన చిత్రమైన సంభాషణ, స్వీత్‌స్కీ ప్రత్యేకించి తన కోసం ఫిడేలు వాయించడం — అతను గుర్తుచేసుకున్నాడు, వాళ్ళు తనను ఓ కంట కనిపెడుతున్నారనీ, లెఫ్టినెంటు భ్రతయంలోంచి బుద్ధిపూర్వకంగానే తనను విడదీశారనీ గ్రహించి అతను స్తంభించి పోయాడు. తనని విడదీసి, కబుర్లతోనూ, ఫిడేలుతోనూ తన సావధానచిత్తాన్ని జోకొట్టి, యీ పిల్లను తనపైకి నెట్టారు — అంతే యింకేముంది, ఎక్కడికెళ్తున్నదీ తనకే తెలియకుండా, యిప్పుడు తనీ పిల్లను గొర్రెలా అనుసరించి వెళ్తున్నాడు. ఈ ప్రశాంతి, ఈ చీకటి, యీ పొదలు, అసలింతకీ — ప్రత్యేకించి దీనికి గోడలూ, బురుజులూ కనిపించడం లేదు — అసలు యిది బ్రెస్ట్ దుర్గమే కాకపోతే?

ఈ నిర్ధారణకు చేరుకున్నమీదట కోల్యా భుజాలు అదరసాగాయి, అయితే తను మాత్రమే వినగలిగిన అతని షోల్డరు బెల్టు కిర్రు సన్నగా వినరావడంతో అతని మనస్సు కొంత తశ్శాంతి చెందింది. అయినాకూడా, ఎందుకైనా మంచిదని అతను తన సూట్‌కేసును ఎడమ చేతిలోకి మార్చుకుని, కుడిచేత్తో జాగ్రత్తగా తన హోల్‌స్టరును ఊడదీశాడు.

"సరే, వాళ్ల యిష్టమొచ్చిన చోటుకి నన్ను లాక్కెళ్లనీ" గంభీరంగా అనుకున్నాడతను. "నేను నా ప్రాణాన్ని చౌకగా అమ్మకూడదు. అదీ అసలు సంగతి."

"ఏయ్ ఆగు! నీ పాసేది?"

ఆఁ యిదన్నమాట సంగతి అనుకుని, కోల్యా తన సూట్‌కేసును దభేలున కింద పడేశాడు.

"గుడీవెనింగ్. నేను మీర్రాని. నేనో లెఫ్టినెంటుని తీసుకొచ్చాను. ఈయన యిప్పుడే వచ్చారు. సింహద్వారం దగ్గర్నుంచి వాళ్ళు మీకు ఫోనుచెయ్యలేదా?"

"మీ పత్రాలేవి, కామ్రేడ్ లెఫ్టినెంట్."

కోల్యాపైన క్షీణకాంతి పడింది. తన ఎడం చేతిని కళ్లకు అడ్డంపెట్టుకుని క్రిందకు వంగాడు, అతని కుడి చెయ్యి దానంతటదే తన హోల్‌స్టరుపైకి జారింది.

"బోర్లపడుకో!" అంటూ చెక్‌పోస్టునుంచి అరుపు వినవచ్చింది. "బోర్ల పడుకున్నావా సరేసరి లేకపోతే కాల్చేస్తాను! డ్యూటీ సార్జెంట్, యిలా రండి! జాగ్రత్త!"

సెంట్రీ అరిచాడు, తన ఈల ఊదాడు, తన పిస్తోలు బోల్టు వెనక్కిలాగాడు.

వంతెనపైన ఎవరి పదఘట్టనలో దబదబ వినిపించాయి, ఎందుకైనా మంచిదని, కోల్యా తన ముక్కు నేలకి తగిలేలా బోర్లా పడుకున్నాడు.

"కాని ఆయన మనవాడే!" మీరా అరిచింది.

"ఈయన తన పిస్తోలును అందుకోబోయాడు, కామ్రేడ్ సార్జెంట్! నేను ఎవరని ప్రశ్నించానో లేదో ఈయన తన పిస్తోలును అందుకోబోయాడండీ!"

"లైటిలా వెయ్యి!" కాంతి బోర్లా పడుకుని వున్న కోల్యాపైన పడింది. కొత్త స్వరం ఆజ్ఞాపించింది, "లేచి నిలబడు! నీ ఆయుధాలు కిందపెట్టు!"

కోల్యా పైకిలేస్తూ "నేను మీలో వాడినే" అంటూ అభ్యంతరం చెప్పాడు. "నేనో లెఫ్టినెంటుని, తెలిసిందా? నన్నిక్కడ పనిలో వేశారు. ఇవిగో నా పత్రాలు, యివిగో నా పోస్టింగు ఆర్డర్లు."

"మరైతే, నువ్వు నీ పిస్తోలునెందుకు అందుకోబోయావు?"

"నేను గోక్కుంటున్నాను!" కోల్యా అరిచాడు. "నేనూరికే గోక్కున్నాను, అంతే! అంతలోనే ఈయనగారు 'బోర్లా పడుకో!' అని అరిచేస్తున్నాడు."

"ఇతను చేసినది అక్షరాలా సరైన పని కామ్రేడ్ లెఫ్టినెంట్" కోల్యా పత్రాలు పరిశీలిస్తూ అన్నాడు సార్జెంటు. "ఓ వారం క్రితం గోరీలదొడ్డి దగ్గర ఒక సెంట్రీ పొడిచిచంపబడ్డాడు. ఇక్కడ ఆ బాపతు పనులు జరుగుతున్నాయి మరి."

"నాకూ తెలుసు అదంతా" కోల్యా కోపంగా అన్నాడు. "కాని ఎందుకంత తొందరా అని? నేను దురదపెడితే గోక్కోకూడదా?"

మొదట మీరాయే ప్రారంభించింది. ఆమె వంగి, ఒక చేత్తో మరో చెయ్యి పట్టుకొని నవ్వింది, పగలబడి నవ్వింది, కళ్లమ్మట నీళ్లు తిరిగేదాకా నవ్వింది. సార్జెంటు బొంగురు గొంతు ఆమెతో లయ కలిసింది, సెంట్రీ నవ్వుతో ఉక్కిరిబిక్కిరయ్యాడు, యిదంతా ఓ పెద్ద తమాషా ప్రహసనంలా, కప్పల తక్కెడ వ్యవహారం కావడంతో — అప్పుడిక కోల్యా కూడా నవ్వేశాడు.

"నేను గోక్కుంటున్నాను! ఊరికే గోక్కుంటున్నానంతే!"

అద్దంలా మిలమిల మెరిసేలా పాలిష్ చెయ్యబడిన అతని టాప్‌బూట్లూ, బిర్రుగా వున్న పాంటూ, చక్కగా యిస్త్రీచెయ్యబడిన కోటూ — అన్నీ దుమ్ము కొట్టుకుని వున్నాయి. చివరకు అతని ముక్కుకూ, గుండ్రని బుగ్గలకూ కూడా — ముఖం యిటూ అటూ పొర్లించిన కారణంగా దుమ్ము అంటుకుంది.

కోల్యా కొంచెం తేరుకుని, చేతులతో కొంత దుమ్ము దులిపేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు ఆ అమ్మాయి అరిచింది: "దానివల్ల ప్రయోజనమేం లేదు! దాన్ని మీరు మరింత పులుముకుంటారంతే. మీకు బ్రష్షు కావాలి."

"అర్ధరాత్రి వేళ నాకు బ్రస్సెక్కడ దొరుకుతుంది?"

"మేం చూస్తాం లెండి" మీర్రా హుషారుగా అంది. "సరే, మేమింక ముందుకె ళ్లొచ్చా?"

"మీరు వెళ్లొచ్చు" సార్జెంటు అన్నాడు. "నువ్వు చెప్పింది రైటే, మీర్రా, ఈయ నకి కాస్త దుమ్ము దులుపు, లేకపోతే మన కుర్రాళ్లు పొట్టలుపగిలి చస్తారు."

"నేను చూసుకుంటాను కదా ఆయన విషయం" ఆమె మాట యిచ్చింది. "ఈ సాయంత్రం ఏం సినిమాలు చూపించారు?"

"సరిహద్దు గస్తీ సైనికులకి 'చివరి రాత్రి,' రెజిమెంటుకేమో 'వలెరియ్ చ్కాలొవ్.' "

"అది గొప్ప సినిమా" సెంట్రీ అన్నాడు. "చ్కాలొవ్ వంతెన కింద ఎగురుతాడు చూడు, ఓహ్, ఆ ఘట్టం గొప్పగా వుంటుంది!"

"నేను సాయంత్రం యిక్కడ లేకపోయానని విచారంగా వుంది. సరే, మీకింక యీ రాత్రికి ఏ హడావిడీ లేకుండా వుండాలని ఆశిద్దాం."

కోల్యా తన సూట్‌కేసును చేతిలోకి తీసుకొని, హుషారుగా వున్న సెంట్రీల వంక తలూపి, మీర్రా వెంట వంతెన దిశగా బయల్దేరాడు.

"ఏమిటిది, బుగ్ నదా?"

"కాదు, ముహవేత్స్ నది."

"ఆహా!"

వాళ్లు వంతెన దాటి, మూడు కమానుల గేటు గడిచి, ఎత్తు తక్కువగా వున్న రెండంతస్తుల బిల్డింగు గుండా కుడిపక్కకి వెళ్లారు.

"ఇది వలయాకారపు బ్యారక్కు" మీర్రా చెప్పింది.

బార్లా తెరిచి వున్న కిటికీల్లోంచి వందలాదిమంది సైనికుల గుర్రులు వినవస్తున్నాయి. వెడల్పాటి యిటుక గోడల వెనక రాత్రిదీపాలు మినుకుమినుకుమంటున్నాయి. రెండు అరలుగా బారుతీరివున్న పడకబల్లలు, నిద్రిస్తున్న సైనికులు, నీటుగా మడతపెట్టబడిన దుస్తులు, సరళ రేఖలోవున్న మోటు టాప్ బూట్లూ కోల్యాకు కానవచ్చాయి.

నా ప్లటూను కూడా యిక్కడే ఎక్కడో వుంటుంది, త్వరలోనే నేనిక్కడ రాత్రిపూట తనిఖీ రౌండ్లు తిరుగుతూ వుంటాను, అనుకున్నాడతను.

అదృశ్య దీపాల ముందు పుస్తకాలపై వంగి, కాపాలాడ్యూటీలో వున్న సైనికుల అంట కత్తెరవేసిన తలలూ, గుట్టవెయ్యబడిన ఆయుధాలూ కానవస్తున్నాయి. "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్కులు) సంక్షిప్త పాఠం"లోని క్లిష్టమైన నాల్గవ ప్రకరణంపై బుర్ర బద్దలుకొట్టుకుంటున్న నున్నటి బుగ్గల లెఫ్టినెంట్ ఒకడు

కనిపించాడు. త్వరలోనే ఏ పాఠాలో చదువుతూనో, లేకపోతే ఉత్తరాలు రాస్తూనో నేను కూడా అలాగే కూర్చుంటాను, అనుకున్నాడు కోల్యా.

"ఏ రెజిమెంటిది?" అతను అడిగాడు.

"ఓరి దేవుడోయ్, యిదేమిటి నేను మిమ్మల్నెక్కడికి తీసుకెళ్తున్నాను?" ఆ పిల్ల మెల్లిగా నవ్వింది. "వెనక్కి నడవండి! నా వెంట రండి కామ్రేడ్ లెఫ్టినెంట్."

ఆమె వేళాకోళం చేస్తోందో, లేక సీరియస్‌గానే చెప్తోందో తేల్చుకోలేక కోల్యా సంకోచించాడు.

"ఎందుకు?"

"ముందు దుమ్ము దులిపి, మిమ్మల్ని శుభ్రంచెయ్యాలి."

వంతెన దగ్గరి చెక్‌పోస్ట్ దగ్గర ఆ అపభ్రంశపు వ్యవహారం జరిగాక ఆమె సిగ్గు మటుమాయమైంది, యిప్పుడతన్ని ఆమె నిస్సంకోచంగా ఆజ్ఞాపిస్తోంది. కోల్యా అందుకు బాధపడలేదు. ఏదైనా తమాషా జరిగితే నవ్వితే నష్టమేమిటి?

"నా దుమ్ము ఎక్కడ దులపబోతున్నారు?"

"నా వెంట రండి, కామ్రేడ్ లెఫ్టినెంట్."

వలయాకారపు బ్యారక్సుని ఆనివున్న బాటను వాళ్ళు దాటారు. కుడివంక ఒక చర్చీ, దాని వెనక మరికొన్ని బిల్డింగులూ చీకట్లో పొడుచుకొచ్చినట్లు కనిపిస్తున్నాయి; ఎక్కడో గాని, మనుషులు మెల్లగా మాట్లాడుతున్నారు; దగ్గర్లోనే గుర్రాలు ఊపిరితీస్తూ బుసకొడుతున్నాయి. పెట్రోలూ, గడ్డీ, గుర్రాల చెమటా కలిసి ఘాటుగా వాసనకొడుతోంది, దానితో కోల్యా ఉత్సాహం రెట్టించింది — చిట్టచివరకు నిజమైన సైన్యపు వాసన!

"ఏమిటి, మనం వెళ్తున్నది కాంటీనుకా?" ఆ పిల్ల వంటకత్తె అన్న సంగతిని గుర్తుచేసుకొని, అతను తను అడగగలిగినంత యథాలాపంగా అడిగాడు.

"మీ అంత గలీజుగా ఉన్న వాళ్లనెవళ్లనైనా మేం గడపదాటి కాంటీను లోపలకి రానిస్తామనుకున్నారేమిటి?" ఆమె సరదాగా అంది. "అక్కడకి కాదు, ముందు మనం స్టోర్సుకి వెళ్తున్నాం. అక్కడ క్రిస్తా అత్తయ్య మీ దుమ్ము దులుపుతుంది. బహుశా తర్వాత ఆవిడ మనకి కాసిని టీనీళ్లు పొయ్యొచ్చు."

"థాంక్ యూ — ఒద్దు" కోల్యా గంభీరంగా అన్నాడు. "నేను డ్యూటీలో వున్న కమాండరు దగ్గర — యీ రోజే — హాజరు వేసుకోవాలి."

"అది యీ రోజే అవుతుందనుకోండి, కాని ఒకే యీ రోజు కాదు — శనివారం రెండు గంటల క్రితమే ముగిసిపోయింది."

"అదేం ఫరవా లేదులే. ఉదయానికి ముందు జరిగితే చాలు. ప్రతి ఒక్క రోజూ ఉదయంతో ఆరంభమవుతుంది."

"సర్వత్రా అది నిజం కాదు, ఉదాహరణకు నా విషయంలో అది వేరుగా వుంటుంది. జాగ్రత్త, యిక్కడ మెట్లున్నాయి. మీరు వంగాలి."

ఎక్కడికో భూమి లోపలకి తీసుకెళ్తున్న మెట్ల వెంట అతనామెను అనుసరించి వెళ్లాడు. దిగువ మెట్టు దగ్గర మీరా బరువైన పెద్ద తలుపు తెరిచింది. అవతలి పక్కనున్న ఒక దీపం మెట్లపైకి క్షీణకాంతిని ప్రసరించింది. విలువంపుగా అంత ఎత్తుగాలేని పైకప్పునూ, యిటుక గోడలనూ, రాతి మెట్లనూ చూసి కోల్యా ఆశ్చర్యం చెందాడు.

"భూగర్భ మార్గమా?"

"స్టోర్సు." మీరా మరో తలుపు తెరిచి, కేకవేసింది, "గుడీవెనింగ్ క్రిస్తా అత్తయ్యా! నేనో అతిథిని తీసుకొచ్చాను!"

కోల్యా ముందుకెళ్లేందుకు ఆమె పక్కకు వైదొలగింది, కాని అతను సంకోచించాడు.

"అదిక్కడేనా?" అతను సందిగ్ధంగా అడిగాడు.

"ఇక్కడే, సరిగా యిక్కడే. మీరు భయపడనక్కర్లేదు."

"నేనేం భయపడటంలేదు" అతను సీరియస్‌గా జవాబిచ్చాడు. విశాలమైన, క్షీణకాంతితో వున్న, అణచివేస్తున్నట్లున్న, తక్కువ ఎత్తు విలువంపు పైకప్పుతో వున్న ప్రాంతంలో తను వున్నట్లు కోల్యా గమనించాడు. నీరసంగా వెలుగుతున్న మూడు దీపాలు చీకటిని అందినంతమేర పొడుచుకు తింటున్నట్లున్నాయి. కోల్యా చూడగలిగినదల్లా, సరిగా పైకప్పు కింద వున్న ఫిరంగి కంతల మాదిరి సన్నని కన్నాలున్న గోడ మాత్రమే. నేలమాళిగ చల్లగా, పొడిగా వుంది. ఇటుకలు పరిచిన నేలపైన నదియిసుక చల్లబడి వుంది.

"ఇదిగో మేమిక్కడున్నాం క్రిస్తా అత్తయ్యా" మీరా తలుపు మూస్తూ అరిచి చెప్పింది. "గుడీవెనింగ్ అన్నా పెత్రోవ్నా! గుడీవెనింగ్ స్తెపాన్ మత్వేయెవిచ్! అందరికీ నమస్తే!"

విలువంపు కప్పుకింద ఆమె స్వరం ప్రతిధ్వనించి, అక్కడ ఆగకుండా కరిగిపోయింది.

"గుడీవెనింగ్" కోల్యా అన్నాడు.

ఆ క్షీణ కాంతికి అతని కళ్లు అలవాటుపడిన తర్వాత అతనికి అక్కడ యిద్దరు స్త్రీలు – ఒకామె బొద్దుగాను, మరొకామె అంతకన్న తక్కువ బొద్దుగానూ వున్న స్త్రీలు, ఇనుప పొయ్యి ముందు చదికిలబడి కూర్చుని వున్న కోరమీసాల సార్జెంట్ మేజరొకడు కనిపించారు.

"ఓహో, మన కిలకిలపిట్టా!" అంటూ సార్జెంట్ మేజరు మందహాసంచేశాడు.

ఆ స్త్రీలు గోనెసంచులు, సంచులు, డబ్బాలు, టీ ప్యాకెట్లు పరచివున్న ఓ పెద్ద టేబిలు ముందు కూర్చున్నారు. వాళ్లు ఒక పట్టీ ముందుపెట్టుకొని సరుకులు సరి చూసుకుంటూ, కొత్తగా వచ్చినవాళ్ల అజే పట్టించుకోలేదు. మరి సార్జెంట్ మేజరు కూడా

ఒక కమాండరు ముందు అటెన్షనులో లేచి నిలబడాల్సినట్లు నిలబడలేదు, అందుకు భిన్నంగా ప్యాకేజి పెట్టెల ముక్కలను తాపీగా పొయ్యిలో వేస్తున్నాడు. దానిమీద ఓ పెద్ద కెటిల్ వుంది.

"గుడీవెనింగ్, గుడీవెనింగ్" ఆ స్త్రీలను కౌగలించుకుంటూ, ముద్దులు పెట్టుకుంటూ మీరా మళ్ళీ అంది. "అయితే అన్నీ వచ్చేసినట్లేనా?"

"నిన్ను ఎప్పుడు రమ్మని చెప్పానేను?" లావుపాటి స్త్రీ కటువుగా అడిగింది. "నేను ఎనిమిదింటికి రమ్మంటే నువ్వేమో, అసలేమీ నిద్రపోకుండా, తెల్లవారకట్లే తయారయ్యావు."

"కోపగించుకోకు క్రిస్తా అత్తయ్యా! నేనెప్పుడో వీలుచూసుకుని నిద్రపోతాను కదా."

"పైగా ఓ యువ కమాండర్ని కూడా పట్టింది" ఆ యిద్దర్లో చిన్నావిడ అన్నా పెత్రోవ్నా — కొంచెం సంతృప్తిగా — అంది. "మీది ఏ రెజిమెంటు, కామ్రేడ్ లెఫ్టినెంట్?"

"నా పేరింకా జాబితాకెక్క లేదు" కోల్యా తాపీగా చెప్పాడు.

"అయితేనేం అప్పుడే ఒళ్ళంతా దుమ్ము కొట్టుకున్నారు" మీరా తమాషాగా అంది. "ఉత్తిపుణ్యానికే కాలు జారి బొక్కబోర్లా పడ్డారు."

"ఔను ఒక్కొక్క సారి అలాగే జరుగుతుంది" సార్జెంట్ మేజరు ప్రశాంతంగా అన్నాడు. అతను అగ్గి పుల్ల గీసి పొయ్యి అంటించాడు, దానితో పొయ్యిలో మంటలు భగ్గుమన్నాయి.

"ఓ బ్రష్షు వుంటే —" కోల్యా నిట్టూర్చాడు.

"ఓ, బాగా ఒళ్ళంతా దుమ్ము కొట్టుకున్నారే" క్రిస్తా అత్తయ్య గొణిగింది. "మన దుమ్ము వస్తువులకి కూడా పట్టేస్తుంది."

"ఆయనకి సాయంచెయ్యి మీరా" అన్నా పెత్రోవ్నా చిరునవ్వు చిందిస్తూ అంది. "బహుశా నీ కోసమే ఆయన కాలుజారి వుంటాడు. మరింకెందుకూ అయివుండదు."

వీళ్ళంతా బాగా పరిచితుల్లా వున్నారు, సాయిలాపాయిలాగా, ఎదటి వాళ్ళకి కోపమొస్తుందన్న భయం లేకుండా పరియాచకాలాడుకుంటున్నారు. కోల్యా యీ విషయం వెంటనే గ్రహించాడు, కాని తనింకా అపరిచితుడైన కారణంగా, సిగ్గుగా మౌనంగా ఉండి పోయాడు.

కానైతే మీరా ఓ బ్రష్షు వెతికి తెచ్చింది, గోడకి వున్న కుళాయి తిప్పి దాన్ని తడిపింది, అల్లరి పిల్లాడితో తల్లి మాట్లాడే మాదిరిగా అంది.

"ఇలారండి, మిమ్మల్ని శుభ్రంచేస్తాను."

"ఎందుకు నేనే చేసుకుంటాను" అతను హడావిడిగా అన్నాడు. "ఇదుగో." కాని ఆమె అతని మాట లక్ష్యపెట్టకుండా, తన ఎడమ కాలు ఎత్తెత్తి వేస్తూ తలుపు దగ్గర కెళ్ళింది, కోల్యా కోపంగా నిట్టూర్చి ఆమె వెంట వెళ్లాల్సివచ్చింది.

''ఈయన్ని లొంగదీసి తన కొంగుకి ముడేసుకుంది'' సార్జెంట్ మేజరు స్తెపాన్ మత్వేయెవిచ్ అంగీకారపూర్వకంగా అన్నాడు. ''భేష్ పిట్టా, మన బోటివాళ్లకి యిదొక్కటే పద్ధతి.''

కోల్యా అభ్యంతరాలను బొత్తిగా లక్ష్యపెట్టకుండా మీరా మధ్యమధ్య ''చేతులు చాపండి!'' ''వెనక్కి తిరగండి!'' ''కదలకండి!'' అంటూ ఆజ్ఞాపిస్తూ అతని దుస్తుల్ని బ్రష్షుతో గట్టిగా దులిపింది. ముందు అతను వాదించాలని చూశాడు, కాని ప్రతిఘటన నిష్ప్రయోజనమని ఎప్పుడైతే గ్రహించాడో, అప్పుడిక ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. అందుకని అతను, తన చిరాకును యింకా అణచుకుంటూనే, వినయంగా తన చేతులెత్తాడు, తిరిగాడు, కదలమెదలకుండా నిలబడ్డాడు. అతని చిరాకు ఆమె తనను తన యిష్టం వచ్చిన వైపుకు తిప్పుకుంటోందని కాదు, ఆషామాషీగా తిప్పుకుంటోందని. మధ్యమధ్య తన పట్ల జాలిప్రదర్శిస్తున్నట్లున్న ఆమె స్వరమే అతనికి గుచ్చుకుంటున్నట్లుంది. తను ఆమెకన్న కనీసం మూడేళ్లైనా పెద్ద కావడమే కాదు, తనొక కమాండరు — ఓ ప్లటూను ప్లటూను మొత్తం జీవిత భవితవ్యం తన మాటమీద ఆధారపడివుంటుంది. కాని యీ అవిటి పిల్ల తనే కమాండరన్నట్లు ప్రవర్తిస్తోంది, మరి అదే అతనికి ఒళ్లుమండుతోంది.

''మీరేం నిట్టూర్చనక్కర్లేదు. నేనేమో కష్టపడి మీ దుమ్ము దులుపుతూంటే మీరేమో నిట్టూరుస్తున్నారు. అది మీకేమీ మంచిది కాదు.''

''మంచిది కానిమాట నిజమే'' గూఢార్థంగా అతను అంగీకరించాడు. ''నేను పూర్తిగా ఒప్పుకుంటాను!''

అవే నిటారు మెట్లు దిగి వాళ్లు తిరిగి స్టోర్సుకి వెళ్లేసరికి తెలతెలవారుతోంది. బ్రెడ్డూ, పంచదారా, మగ్గులూ మినహాయించి ఇప్పుడు టేబిలు ఖాళీగా వుంది. కెటిల్‌లో నీళ్లెప్పుడు మరుగుతాయా అని ఎదురుచూస్తూ మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ అందరూ టేబిలు చుట్టూ కూర్చున్నారు. వాళ్లతో మరో యిద్దరు — దిగాలుగా వున్న ఒక సీనియర్ సార్జెంటూ, పరమ అవకరంగా క్రాప్ చెయ్యబడిన ఒక యువసైనికుడూ — చేరారు. సార్జెంటు గొణుగుతూండగా ఆ సైనికుడు బిగ్గరగా ఆవులించాడు.

''కుర్రాళ్లందరూ సినిమాలకు పోయారు, దానితో నేనొక్కణ్ణే తేరగా దొరికాను ఆ మందుగుండు సార్జెంటుకి, ఆగు ఫెదొర్చుక్, నీకో చిన్న పని వుంది అంటూ నన్ను పట్టు కున్నాడు. ఆ పని ఏమిటో తెలుసాండి, అన్ని బెల్టులనుంచీ గుళ్ళు ఊడతియ్యడం, వాటిని శుభ్రం చెయ్యడం, వాటికి గ్రీజు పూసి, మళ్లీ ఏ బెల్టులోని ఆ బెల్టులో పెట్టడం. ఓహ్! మొత్తం కంపెనీ అంతా వంచిన నడుమెత్తకుండా చేస్తే మూడు రోజులకు సరిపడే పని, నేనొక్కణ్ణే చెయ్యాలిట. ఒక్క తలా, రెండు చేతులూ. నాకెవర్నైనా సాయం యివ్వండి అని అడిగాను. అంతే ఆయనగారు యీ కుర్రాణ్ణి, యీ అంటకత్తెర రిక్రూటుని, వాస్యా

వోల్కొవ్‌ని నాకిచ్చాడు. వీడికేం తెలుసు? నిద్రపొమ్మంటే ఫస్టుగా నిద్రపోతాడు, అంతే. అంతేనా వోల్కొవ్?''

వాస్యా వోల్కొవ్ జవాబుగా దవుడ ఎముకలు విడిపోయేలా మరోసారి ఆవులించి, తన బండ పెదవులు చప్పరించి, అకస్మాత్తుగా చిరునవ్వు నవ్వాడు.

''నాకు నిద్రొస్తోంది.''

''నిద్రొస్తోందిట!'' ఫెదొర్చుక్ చిరాకుగా అన్నాడు. ''నువ్వు యింటికెళ్ళాక మీ అమ్మ దగ్గర బబ్బుందువుగానిలే. కాని నా దగ్గర ఆ పప్పులుడకవ్, అబ్బాయ్. తెల్లారే దాకా మెషీన్ గన్ బెల్టుల్లోంచి గుళ్ళు ఊడపీకాలి తెలిసిందా? మనం యిక్కడ ఓ మగ్గు టీ లాగించి, మళ్ళీ మొదలెడదాం. క్రిస్తీనా యానవ్నా, టీ మంచి స్ట్రాంగుగా బాగా తయారు చెయ్యి.''

''చిక్కగా తయారుచేస్తాను'' అంటూ క్రిస్తా అత్త ఓ ప్యాకెట్టు ప్యాకెట్టు టీ పొడి నీళ్లలో దిమ్మరించింది. ''కొంచెం మరగనియ్యి, టీతో బాటు కాస్త ఏదైనా నముల్దాం. కామ్రేడ్ లెఫ్టినెంట్, మీరెక్కడి కెళ్తున్నారు?''

''నేను నా రెజిమెంటుకెళ్ళి హాజరు వేయించుకోవాలి.''

''ఓ దానికైతే బోలెడంత టైముంది'' ఆన్నా పెత్రోవ్నా చెప్పింది. ''డ్యూటీ ఎక్కడికీ పారిపోదులెండి.''

''అబ్బెబ్బే, అలా కుదరదు'' కోల్యా పట్టుదలగా తలూపాడు. ''ఇప్పటికే ఆలస్యమైంది. నేను శనివారమే పనిచెయ్యాలి, ఇప్పటికప్పుడే ఆదివారం వచ్చేసింది.''

''ఇది శనివారమూ కాదు, ఆదివారమూ కాదు, యిది రాత్రి'' స్తెపాన్ మత్వేయెవిచ్ అన్నాడు. ''రాత్రిపూట డ్యూటీలో వున్న మనిషి కూడా కునుకుతీస్తాడు.''

''టేబిలు దగ్గరకి రండి కామ్రేడ్ లెఫ్టినెంట్'' ఆన్నా పెత్రోవ్నా చిరునవ్వు నవ్వుతూ అంది. ''మనం టీ తీసుకొంటూ పరిచయంచేసుకుందాం. మీరెక్కణ్ణుంచి వచ్చారు?''

''మాస్కోనుంచి.'' కోల్యా సంకోచించి, తర్వాత కూర్చున్నాడు.

''మాస్కోనుంచా, ఆఁ?'' ఫెదొర్చుక్ గౌరవపురస్సరంగా సాగదీశాడు. ''అక్కడ వ్యవహారాలెలా వున్నాయ్?''

''అంటే, మీ ఉద్దేశం?''

''అదే, మొత్తంమీద.''

''మాస్కో రోజురోజుకీ మెరుగవుతోంది'' కోల్యా గంభీరంగా జవాబిచ్చాడు.

''కాని అంగళ్ల సంగతెలా వుంది — పదార్థాలూ మొదలైనవి?'' ఈ ప్రశ్న వేసింది ఆన్నా పెత్రోవ్నా. ''ఇక్కడ, వాటికేమీ యిబ్బంది లేదు. ఈ విషయం గుర్తుపెట్టుకోండి కామ్రేడ్ లెఫ్టినెంట్.''

"వాటితో ఆయనకేం అవసరం?" టేబిలు దగ్గర కూర్చుంటూ, చిరునవ్వు నవ్వుతూ మీర్రా అంది. "ఆయనకి మనమాదిరి వస్తువులు అవసరం లేదు."

"ఆ మాట ఎలా చెప్పగలం" స్తెపాన్ మత్వేయెవిచ్ తన తలూపాడు. "మంచి సూటు కుట్టించుకోగలగడం గొప్ప విషయమే కదా. అది ముఖ్యమే."

"నాకు పౌర దుస్తులు నచ్చవు" కోల్యా అన్నాడు. "ప్రభుత్వమే నాకు కావలసిన వన్నీ సమకూరుస్తుంది."

"అన్నీ సమకూరుస్తుంది." ఏ కారణంగానో క్రిస్తా అత్త నిట్టూర్చింది. "మీ అందరికీ గుర్రాలకు మాదిరిగా, తోలు పటకాలు సమకూరుస్తుంది – మీరు ముస్తీబు తగిలించుకుని వెళ్తూవుంటారు."

నిద్రబోతు వాస్యా పొయ్యి దగ్గర్నుంచి టేబిలు దగ్గరకు వచ్చాడు. అతను కోల్యాకు ఎదురుగా కూర్చొని, అతని వంక కళ్లు చిట్లిస్తూ తేరిపార చూశాడు. కోల్యా చూపులు అతని చూపులను కలుసుకుంటూ వుండేవి, కోల్యా కనుబొమలు ముడేసి తన కళ్లు పక్కకి తిప్పేశాడు. కాని ఆ యువకుడు, ఏ మాత్రం తడబడకుండా, బాలుని మాదిరిగా కోల్యాను పైకీ కిందకీ ఎగాదిగా చూస్తూ కూర్చున్నాడు.

తాపీగా పొడుస్తున్న పొద్దు సన్నని ఫిరంగి కంతల ద్వారా అయిష్టంగా అన్నట్లు నేలమాళిగలోకి జారుతోంది. అది విలువంపు పైకప్పు దగ్గర చేరి నెమ్మదిగా అక్కడి చీకటిని వెనక్కి నెంటసాగింది; కాని చీకటి యింకా మూలల్లో పొంచివుంది. తెలతెలవారుతున్న మునిచీకటిలో పసుపు పచ్చని దీపాలు వెలవెలబోతున్నాయి. సార్జెంటు మేజరు వాటిని ఆర్పేశాడు, కాని స్త్రీలు అందుకు అభ్యంతరం చెప్పారు.

"చీకటిగా వుంది!"

"మనం విద్యుచ్ఛక్తిని పొదుపు చెయ్యాలి." స్తెపాన్ మత్వేయెవిచ్ గొణిగాడు, కాని మళ్లీ స్విచ్‌లు వేశాడు.

"నిన్న రాత్రి పట్నంలో అన్ని లైట్లూ ఆరిపోయాయి" కోల్యా చెప్పాడు. "బహుశా కరెంటు ఫెయిలై వుంటుంది."

"అయ్యుండొచ్చు" సార్జెంట్ మేజరు తాపీగా ఒప్పుకున్నాడు. "మనకిక్కడ మన సొంత సబ్‌స్టేషనుంది."

"నాకు చీకటి యిష్టం" మీర్రా తన మనసులో మాట చెప్పింది. "చీకటిగా ఉన్నప్పుడు భయం కలిగించేదేమీ ఉండదు."

"సరిగా యిది తలకిందులు ఆలోచన" అని కోల్యా అంతలోనే సర్దుకున్నాడు. "అదేమిటంటే, చీకటి నిజంగానే భయంకరంగా ఉంటుందని కాదు నా అభిప్రాయం. చీకటిని గురించి వ్యాప్తిలో వున్న పురాతన నిగూఢ భావాలే అలాంటి భయానికి కారణం."

వాస్యా వోల్కొవ్ మరో సారి అవులించాడు – దవుడలు పటపటలాడించడంలో ఆనందం పొందుతూ. కాని ఫెదొర్చుక్ మరో అసంతృప్త భృకుటివిక్షేపంతో అన్నాడు: ''చీకటి, దొంగలకు వరప్రసాదం. దొంగతనాలూ దోపిడీలూ – వీటి కోసమే రాత్రి వున్నది.''

''అంతేనా, మరో దానికోసమేమో కూడా'' అన్నా పెత్రోవ్నా ముసిముసి నవ్వులు నవ్వింది.

''హాఁ!'' మీర్రా వంక పక్క చూపు విసిరి, ఫెదొర్చుక్ తన మందహాసాన్ని కప్పిపుచ్చుకున్నాడు. ''నువ్వు చెప్పింది పూర్తిగా రైటు, అన్నా పెత్రోవ్నా. ఔను, అది కూడా దోచుకోబడేదే కదా – అదేనా నీ ఉద్దేశం?''

''మనం దాన్ని దొంగిలించం'' సార్జెంట్ మేజర్ గంభీరంగా అన్నాడు. ''మనం దాన్ని మరుగుపరుస్తాం.''

''మంచి వాటిని మరుగుపరచాల్సిన అవసరం లేదు'' ఫెదొర్చుక్ లొంగకుండా అన్నాడు.

''మనం మంచివాటిని కూడా చెడు దృష్టినుంచి మరుగుపరుస్తాం'' క్రిస్తా అత్త కెటిల్లోకి చూస్తూ భారంగా అంది. ''అది సరైనదే. మన టీ తయారైంది, కొంచెం పంచదార తీసుకోండి.''

అన్నా పెత్రోవ్నా లేతనీలి రంగు గడ్డపంచదార అందించింది. కోల్యా ఓ గడ్డ తీసి తన మగ్గులో వేసుకున్నాడు. మిగతావాళ్లు తమ గడ్డల్ని చిన్నచిన్న ముక్కలుగా చితక్కొట్టుకున్నారు. స్తెపాన్ మత్వేయెవిచ్ కెటిల్ తీసుకొచ్చి అందరికీ టీ పోశాడు.

''కొంచెం బ్రెడ్డు తీసుకోండి'' క్రిస్తా అత్త ఆహ్వానించింది. ''ఈ రోజు బ్రెడ్ బాగా వచ్చింది, పొంగేందుకు ఎక్కువ టైం పట్టలేదు.''

''పై పెచ్చు నాదోచ్!'' మీర్రా తొందరగా అంది.

ఆమె దాన్ని చేతికి అంకించుకుని, కోల్యా వంక విజేతలా చూసింది. కాని కోల్యా యిటువంటి బాల్యచేష్టలకు అతీతుడేమో, ఆమె వంక ఆదరణపూర్వకంగా చూశాడు. అన్నా పెత్రోవ్నా వాళ్లవంక చూసి చిరునవ్వు కూడా నవ్వింది, కాని ఆ నవ్వు ఆమె సొంత ఆలోచన దేని పట్లనో అన్నట్లుంది, మరి కోల్యాకి అది నచ్చలేదు.

నేనేదో ఆ మీర్రా వెంటపడుతున్నానన్నట్టు, అనుకున్నాడతను కలవరపాటుతో. ఈ జనానికి ఎలాంటి పిచ్చి భావాలొస్తాయి!

''రవ్వంత మార్గరీన్ వుందాండి?'' ఫెదొర్చుక్ అడిగాడు. ''ఉత్తి బ్రెడ్డులో ఏమంత సత్తువుండదు.''

''చూస్తాను. ఎక్కడైనా కొంచెం దొరకొచ్చు.''

క్రిస్తా అత్త నేలమాళిగలో చీకటిగా వున్న మూలమూలలు వెతికింది. అందరూ

తమ టీలు అలాగే వుంచి, ఆమె రాక కోసం ఎదురుచూస్తున్నారు. వాస్యా వోల్కోవ్ తన మగ్గును చేత్తో పట్టుకొని, మరో మారు ఆవులించి, ఆఖరికి మేల్కొన్నాడు.

"ఆగకండి, మీ టీలు తాగండి" క్రిస్తా అత్త మారుమూలనుంచి కేకపెట్టింది. "నాకిది కనిపించేసరికి —"

బయట ఓ నీలం మంట చల్లగా మెరిసింది.

"ఉరుములు మెరుపులతో తుపానా ఏమిటి చెప్మా?" అన్నా పెత్రోవ్నా ఆశ్చర్యం వెలిబుచ్చింది.

ఏదో భారంగా గర్జించింది. లైట్లు ఆరిపోయాయి, కాని కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులు గవాక్షీల గుండా లోనికి వచ్చాయి. గోడలు కంపించాయి, పైకప్పునుంచి గిలాబా పెచ్చులుపెచ్చులుగా రాలింది. చెవులు గళ్లుపడే రొదతో బాటు పిడుగుపాటుగా ఫిరంగులు గర్జించిన శబ్దమైంది.

వాళ్లు మౌనంగా ఉన్నారు. మౌనంగా, టేబిలు చుట్టూ కూర్చుని, పైకప్పునుంచి రాలిన దుమ్మును యాంత్రికంగా తమ తలలనుంచి దులుపుకుంటున్నారు. ఆ నేలమాళిగలోకి చొరుచుకు వచ్చిన ఆకుపచ్చ కాంతిలో వాళ్ల ముఖాలు పాలిపోయి, తీవ్రమైన ఫిరంగి దాడి మూలంగా శాశ్వతంగా మూలిగిపోయిన దేన్నో వినాలన్న ప్రయత్నంలో ఉద్రిక్తమై వున్నాయి.

"ఆయుధ గిడ్డంగి!" ఫెదొర్చుక్ అరిచి, చెంగున లేచి నిలబడ్డాడు. "ఆయుధ గిడ్డంగి పేలిపోయింది! నాకు తెలుసు అదే! నేనక్కడొక లాంపు వదిలాను! లాంపు!"

సమీపంలో పెద్ద ప్రేలుడు వినవచ్చి, బరువాటి తలుపు పళపళమని విరిగింది. టేబిలు దానంతటది జరిగింది, గిలాబా రాలిపడింది. ఉక్కిరిబిక్కిరి చేసే పసుపు పచ్చని పొగ గవాక్షీల్లోంచి లోపల ప్రవేశించింది.

"యుద్ధం!" స్తెపాన్ మత్వేయెవిచ్ అరిచాడు. "ఇది యుద్ధం కామ్రేడ్స్, యుద్ధం!"

కోల్యా చెంగున లేచి నిలబడ్డాడు, టీ మగ్గు తిరగబడింది. జాగ్రత్తగా బ్రష్‌చేసుకున్న తన పాంటుపైన టీ ఒలకడం అతను గుర్తించనేలేదు.

"ఆగు, లెఫ్టినెంట్!" సార్జెంట్ మేజరు అతని చెయ్యి దొరకబుచ్చుకున్నాడు. "ఎక్కడికి బయల్దేరావ్?"

"వదులు!" కోల్యా గట్టిగా అరిచి, విదిలించుకున్నాడు. "వదులు! వదులు! నేను నా రెజిమెంటును చేరుకోవాలి! నా రెజిమెంటు! నా పేరింకా జాబితాకెక్కలేదు! నా పేరింకా జాబితాలో చేరలేదు, నీకు అర్థం కావడం లేదూ?"

సార్జెంట్ మేజర్ని అతను పక్కకి నెట్టేశాడు, విరిగిన యిటుక పెళ్లల్లో కూరుకుపోయిన తలుపుని బలంగా గుంజాడు, ఒరగా బయటికెళ్లాడు, అస్తవ్యస్తంగా, అరిగిపోయిన మెట్లను — తన కాళ్లకింద గిలాబా పెళ్లలు బిగ్గరగా కరకరలాడుతూండగా — అధిరోహించాడు.

బాంబు ప్రేలుడుకు బయటి తలుపు తునాతునకలైంది, కోల్యాకి నారింజ రంగు మంటలు కానవచ్చాయి. ఇరుకైన నడవ దట్టమైన పొగతోను, దుమ్ముతోను, ప్రేలుడు పదార్థాల కడుపు దేవే కంపుతోనూ నిండివుంది. నేలమాళిగ కంపించింది, గాలి రొద చేసింది, మూలిగింది. అది పంథొమ్మిది వందల నలభై ఒకటవ సంవత్సరం, జూన్ యిరవై రెండవ తేదీ, మాస్కో కాలమానం ప్రకారం నాలుగు గంటల పదిహేను నిమిషాలు.

రెండో భాగం

1

భగ్గున మండుతున్న దుర్గం మధ్యకు ప్లూజ్నికొవ్ వెళ్లే సరికి ఫిరంగి కాల్పులు – అయితే యిప్పుడు కొంచెం ఎక్కువ విరామాల్తో – యింకా సాగుతున్నాయి. జర్మన్లు తమ కాల్పులను వెలుపలి రక్షణవలయం దిశగా మళ్లించనారంభించారు. ఫిరంగికాల్పులు మరింత క్రమవిరామాల్లో సాగుతున్న కారణంగా తన చుట్టూ పారజూసేందుకు ప్లూజ్నికొవ్‌కు అవకాశం చిక్కింది.

అదొక మహా నరకజ్వాలాతోరణం. వలయాకారపు బ్యారక్సు, చర్చి పక్కనున్న యిళ్లు, ముహవేత్స్ నది ఒడ్డున వున్న గ్యారేజీలు – అన్నీ మండిపోతున్నాయి. నిలిపివుంచబడిన చోటనే లారీలు, గుడిసెలు, తాత్కాలిక నిర్మాణాలు, అంగళ్లు, స్టోర్‌హౌసులు, కూరగాయల నేలమాళిగలు – అన్నింటినీ మండగలవాటన్నింటినీ, మండజాలనివాటినెన్నింటినో కూడా మంటలు ఆవరించాయి. ఈలోగా అర్ధనగ్న వ్యక్తులు – భైరయ్యిన మండుతున్న మంటల నడుమ, ఢడ్‌ఢడ్‌మనే ప్రేలుళ్ల మధ్య, బర్రున ఎగురుతున్న ఎర్రగా కాలిన లోహశకలాల మధ్య పరుగులెడుతున్నారు.

అతని వెనుకపక్క, ఎక్కడో సమీపంలోనే గుంజలకు కట్టబడిన గుర్రాలు అరుస్తున్నాయి – భయానకమైన, జంతుసహజం కాని ఆ అరుపులు, యితరత్రా సమస్తాన్నీ – మనుషులు సజీవంగా దహనంచెయ్యబడుతున్న గ్యారేజీలలోంచి – కిటికీలకు కట్టుదిట్టమైన అడ్డు గడియలున్న గ్యారేజీలలోంచి – వెలువడే అమానుష శబ్దాలను సైతం ముంచివేస్తున్నాయి.

ప్లూజ్నికొవ్‌కి ఆ దుర్గం తెలియదు. అతనక్కడికి వచ్చేసరికి చీకటిగా వుంది, యిప్పుడేమో అదంతా నరకజ్వాల లెగజిమ్మే ప్రేలుళ్లతో, పొగతో, మంటలతో నిండివుంది. ఎలాగో అతను మూడు కమాన్ల గేటును గుర్తించి, దాని దిశగా దూసుకుపోవాలని – అక్కడి సెంట్రీ తనను తప్పకుండా గుర్తుపట్టగలడనీ, తనెక్కడికి వెళ్లాలో చెప్పగలడనీ ఆశతో – నిర్ణయించుకున్నాడు. మరి తను హాజరు వేయించుకోవాలి, అది అత్యవసరం.

అందుకని ప్లూజ్నికొవ్ ఫిరంగిగుళ్ళు చేసిన గుంటల మీదుగా, మట్టి, యిటుకల గుట్టల మీదుగా దూకుతూ, తన మెడ వెనుక భాగాన్ని రెండు చేతులతో — వాడియైన, కణకణమండే నిప్పులాంటి ఫిరంగిగుళ్ల శకలాలు ఏ క్షణాన అయినా, అంటకత్తెర వెయ్య బడిన, రక్షణ రహితమైన మెడలోకి దూసుకు వెళ్తాయన్న ఆలోచన దుస్సహం కాగా — కప్పుకొని గేటువంక పరుగుతీశాడు. అలాగ అతను, అస్తవ్యస్తంగా తూలుతూ, తన చేతులను తన మెడవెనుక పెట్టుకుని పరుగెత్తాడు.

ఊళ మాదిరి శబ్దం అతనికి వినిపించలేదు — ఆ శబ్దం తర్వాత వచ్చింది — కాని నిర్దయాత్మకమైనదేదో తన పైకి వస్తున్నట్లు అతని వీపు అనుభూతి చెందింది, తన అరచేతులింకా తన మెడ మీదనే ఉండగా అతి దగ్గరలో వున్న ఫిరంగి గుండుగుంటలో బొక్క బోర్లా పడ్డాడు. ప్రేలుడుకి ముందు గల అతి స్వల్ప క్షణాలలో అతను తన చేతులతో, పాదాలతో, తన యావత్తు శరీరంతో, పీత మాదిరిగా, పొడిగా బిరుగా వున్న యిసుకలో బొరియ చేసుకున్నాడు. అప్పుడిక, అతనికి మళ్లీ ప్రేలుడు వినిపించలేదు, కాని తన వీపు మీద పెద్ద ఒత్తిడి యేదో అతనికి అనుభూతమైంది, అది అతన్ని క్రిందకు దిగదీస్తోంది, అతను ఊపిరి తీసుకోవడం కష్టసాధ్యమయ్యేటంతగా అది అతన్ని క్రుంగదీస్తోంది. అతను ఆ బరువు క్రింద, మెలికలు తిరిగాడు, గాలి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యాడు, ఆ ఆకస్మిక అంధకారంలో గాలి దొరక్క ఎగరొప్పాడు. అటుతర్వాత నిజంగానే భారమైనదేదో అతని వీపుపై వాలి, ఊపిరి తీసుకునేందుకు అతను చేస్తున్న ప్రయత్నాలనూ, అతని తుది విశీర్ణ చైతన్యావశేషాలనూ చివరకు ఆర్పివేసింది.

అతనికి త్వరలోనే తెలివివచ్చింది. అతను యువకుడు, బలిష్ఠుడు, విశేషమైన జీవితేచ్ఛగలవాడు. దారుణమైన తలనొప్పితోబాటు అతను తిరిగి స్పృహలోకి వచ్చాడు. అతని రొమ్ములోంచి చేదు రుచి ఏదో అతనికి అనుభూతమవుతోంది — చుట్టూ దాదాపుగా పూర్తి నిశ్శబ్దం ఆవరించివుంది. మొదట, దిగ్భ్రాంతిలో, ఫిరంగి కాల్పులు ఆగిపోయాయ నుకున్నాడు, కాని తర్వాత తన చెవులు గళ్ళుపడినట్లు గ్రహించాడు. అది అతనికి భయో త్పాతం కలిగించలేదు. తనను కప్పివేసిన మట్టిలోంచి పాకి పైకొచ్చి, రక్తం, యిసుకా ఉమ్మేస్తూ, కొంత సేపు కూర్చున్నాడు.

అతను తన మానసిక శక్తులన్నింటినీ కూడదీసుకొని ఆలోచనకు ఉపక్రమించాడు. ఫిరంగి కాల్పులు అన్న మాట కోసం తడువులాడి, కష్టంమీద జ్ఞాపకం చేసుకున్నాడు. ఫిరంగిగుండు ఆ స్టోరుకి తగిలివుంటుంది. మరి ఆ సార్జెంట్ మేజరూ, ఆ అవిటి అమ్మాయీ లోపలే....

ప్రత్యేకమైన ప్రభావమేమీ కల్పించకుండా, అదేదో స్థలకాలాలకు అతీతమైనదన్నట్లుగా ఆ ఆలోచన అతని మనస్సులో మందంగా తిరుగులాడింది; అటుతర్వాత అతను, తను ఎక్కడ,

ఎందుకు పరిగెత్తుతూ ఉండినదీ గుర్తుతెచ్చుకునేందుకు ప్రయత్నించాడు, కానీ అతనీ మెదడు పనిచెయ్యలేదు. అందుకని అతను రక్తం, యిసుకా ఉమ్మివేస్తూ, తను అక్కడ ఎందుకు కూర్చున్నాడన్న విషయంలో అస్పష్టమైన అభిప్రాయం కూడా లేకుండా ఫిరంగి గుండు చేసిన గుంట అంచుపైన, అదే పనిగా ఊగుతూ కూర్చున్నాడు.

ఆ గుంట విషపు పొగలతో నిండివుంది. పైన గాలి పరిశుభ్రంగా ఉంటుందనీ, అక్కడ తను మరింత తొందరగా తేరుకుంటాననీ, తను పైకి ఎక్కాలనీ బడలికగా అతను అనుకున్నాడు, కాని అలాంటి ప్రయత్నానికి సంబంధించిన ఆలోచనే అతనికి చిత్రహింస ప్రాయంగా ఉంది. అందుకని అతను డోకు పుట్టించే ఆ గ్యాసునే — ప్రతి ఒక ఎగపీల్పుతోనూ రొమ్ము మండుతూండగా — బుర్రుబుర్రుమంటూ ఎగపీల్చసాగాడు. తన వెనుక ఎవరో జారుతూ రావడాన్ని అతను మళ్లీ వినడంకన్న అనుభూతిచెందాడు. కదల్చడానికి మెడ బాగా బిర్రబిగిసిపోయిదేమో అతను తన శరీరమంతా పక్కకి తిప్పాల్సివచ్చింది.

ముదురు నీలపు బనీనూ, నల్లని డ్రాయరూ, సైనిక టోపీ ధరించిన ఒక యువకుడు ఆ గోతి అంచుపైన కూర్చుని వున్నాడు. అతని బుగ్గపైన రక్తం కారుతోంది, అతను దాన్ని చేత్తో తుడుస్తూ, ఆ చేతిని ఆశ్చర్యంగా చూస్తూ, దాన్ని మళ్లీమళ్లీ తుడుస్తున్నాడు.

"జర్మన్లు క్లబ్బులో వున్నారు" అతను చెప్పాడు.

ఫ్యూల్జిన్కొవ్ ఆ మాటలను సగం విన్నాడు, అతని పెదవుల కదలికను బట్టి సగం ఊహించుకున్నాడు.

"జర్మన్లా?"

"నిస్సందేహంగా." అతను ప్రశాంతంగా మాట్లాడాడు, తన బుగ్గలనుంచి కారుతున్న రక్తం ఒక్కటే అతనికి ఆసక్తి కొలిపే విషయమన్నట్లు కనిపిస్తోంది. "వాళ్లు నన్ను సబ్ మెషీన్ గన్నుతో చావనూకారు."

"చాలామంది వున్నారా?"

"నేను లెక్కపెట్టలేదు. నన్ను చావనూకింది ఒక్కడే, అది చాలు, దానితో నా బుగ్గ చీలింది."

"బులెట్టా?"

"అబ్బే కాదు. నేను పడ్డాను."

అదంతా ఒక ఆట అన్నట్టూ, పక్క ఆవరణలో కుర్రాళ్లు తమ ఒడిసెలలతో లక్ష్యాన్ని కొట్టారన్నట్టూ, అంత ప్రశాంతంగా వాళ్లు మాట్లాడుకున్నారు. ఫ్యూల్జిన్కొవ్ తనను తను కూడదీసుకునేందుకూ, తన కాలుసేతుల అస్తిత్వాన్ని అనుభూతం చేసుకునేందుకూ ప్రయత్నించాడు. చెదురుతున్న మనస్సుతో అతను ప్రశ్నలు వేశాడు, బుగ్గ వెంట

రక్తం ఓడుతున్న ఆ కుర్రాడు ఏమి చెప్తున్నదీ తను నిజంగానే విన్నాడో, లేక ఊహించు కున్నాడో అతను నిర్ధారణచేసుకోలేకపోయిన కారణంగా — అతను జవాబులను విశేష ప్రయత్నంమీద విన్నాడు.

"వాళ్లు కొందకోవ్‌ను చంపేశారు. అతను నా ఎడమ పక్క పరిగెడుతున్నవాడల్లా తటాలున నేలకూలాడు. అతను మూర్ఛరోగి లాగా ఊగి, కాళ్లూ చేతులూ కొట్టుకున్నాడు. పోతే ఆ కిర్పిజ్, నిన్నటి ఆర్డర్లీ లేడూ, అతన్ని కూడా వాళ్లు చంపేశారు. వాళ్లు మొదట కాల్చినది అతన్నే."

ఆ కుర్రాడు నిరంతరాయంగా మాట్లాడుతూనే వున్నాడు, కాని అకస్మాత్తుగా ఫ్యూజ్నికోవ్ వినడం మానేశాడు. ఇప్పుడతనికి దాదాపు అన్నీ వినిపిస్తున్నాయి — గుర్రాల శాలలో గుంజలకు కట్టివున్న గుర్రాలు గాయపడి అరిచిన అరుపులూ, ప్రేలుళ్లూ, మంటల హోరూ, దూరాన్నుండి వినవచ్చే కాల్పులూ — ఔను, యివన్నీ యిప్పుడతను వినగలుగుతున్నాడు, అందుకని అతను దాన్ని గురించి ఆదుర్దాచెందడం మానేశాడు, వినడం మానేశాడు. తను విన్నదంతా అతను గ్రహించి ప్రధానాంశాన్ని అర్థంచేసుకున్నాడు: జర్మన్లు దుర్గంలో ప్రవేశించారు, అంటే యుద్ధం నిజంగానే ఆరంభమైందన్నమాట.

"— అతని పేగులన్నీ బయటకొచ్చి వ్రేలాడుతున్నాయి. అవింకా — తమంతట తాముగా — ఊపిరి పీల్చుకుంటున్నాయేమో అన్నట్లు కనిపించాయి!"

ఆ అతివాగుడు యువకుని స్వరం ఫ్యూజ్నికోవ్ మనస్సులో క్షణకాలం ప్రవేశించింది, కాని — యిప్పుడతని మనసు పూర్తిగా అతని అధీనంలో వున్న కారణంగా, అతను తన మనస్సు లోంచి దాన్ని వెంటనే తోసివేశాడు. అతను తన పేరునూ, తను చేరాల్సిన రెజిమెంటు పేరునూ చెప్పి, దాన్ని కనుక్కోవడమెలాగో అడిగాడు.

"వాళ్లు నీ శరీరాన్ని త్ — త్ — తూట్లు పొడుస్తారు" అన్నాడా కుర్రాడు. "వాళ్లు క్లబ్బులో — పూర్వం చర్చిగా ఉంటూండేదది — ఉన్నారు. అక్కణ్ణుంచి వాళ్లు సబ్‌మెషీన్ గన్నులతో, నీ ఒంటిని తు — తు — తూట్లు పొడుస్తారు. అక్కణ్ణుంచి వాళ్లకి నాలుగు పక్కలా తుపాకి బారుకి వాటంగా ఉంది."

"మీరెక్కడికెళ్తున్నారు?"

"మందుగుండు కోసం. ఆయుధాగారానికి వాళ్లు కొందకోవునీ, నన్నూ పంపారు, కాని జర్మన్లు అతన్ని తూట్లుపొడిచారు."

"మిమ్మల్ని ఎవరు పంపారు?"

"ఎవరో ఓ కమాండరు. ఇప్పుడంతా కలగాపులగమైపోయింది. నీ స్వంత కమాండ రెక్కడున్నాడో, నువ్వెవరితో వున్నావో నీకే తెలియదు. మొదట్లో మేమంతా చెల్లాచెదురుగా పరిగెత్తామంతే."

"ఇంతకీ నువ్వు మందుగుండు సామగ్రిని ఎక్కడికి తీసుకెళ్లాలి?"

"కాని జర్మన్లు అక్కడ ఆ క్లబ్బులో వున్నారు." అతను తాపీగా, ఎవడో కుర్రాడికి ఏదో విడమరచి చెప్తున్నట్లు జాలిగా చెప్పాడు. "ఆజ్ఞలూ గీజ్ఞలూ ఏమైనా గానీ నువ్వెక్కడికీ వెళ్లలేవు. వాళ్లు నిన్ను తు — తు — తూట్లు పొడిచేస్తారంతే!"

అతనికా మాట బాగా నచ్చినట్టుందేమో, ఆ "తు" అన్న పదాన్ని ఒత్తి సాగదీస్తున్నాడు. కాని ఫ్లాజ్నికొవ్ ఆ ఆయుధాగారాన్ని గురించే ఆలోచిస్తున్నాడు — అక్కడ తనకొక సబ్‌మెషీన్ గన్నో, లేకపోతే ఒక ఆటోమాటిక్ గన్నో, లేక కొల్లలుగా తూటాలతోబాటు సాదా రైఫిలో దొరుకుతుందేమోనని ఆశిస్తున్నాడు. దుర్గపు నడిబొడ్డులో తిష్ఠవేసిన శత్రువుపై కాల్పులు జరపడానికి ఆయుధాలు తనకో అవకాశాన్ని కల్పించడమే కాకుండా, అవి తనకు ఏదైనా చేసేందుకు స్వేచ్ఛను కూడా సమకూరుస్తాయి, అందుకనే అతను సాధ్యమైనంత త్వరగా వాటిని సమకూర్చుకోవాలని కాంక్షిస్తున్నాడు.

"ఆయుధాగారం ఎక్కడ?"

"కొందకోవ్‌కి తెలుసు" ఆ సైనికుడు అయిష్టంగా చెప్పాడు.

అతని బుగ్గపై రక్తస్రావం కట్టేసింది, కాని లోతుగా గీరుకుపోయిన ఆ గాయాన్ని తన మురికి వేళ్లతో అతను తడుముతూనే వున్నాడు.

"ఓ, దీని సిగదరగ!" ఫ్లాజ్నికొవ్ గుర్రుమన్నాడు. "పోనీ, అదెక్కడ? ఎడమ పక్కా, కుడి పక్కా? ఎక్కడ? జర్మన్లు దుర్గంలో ఉన్నారంటే, ఏ క్షణాన అయినా మనం వాళ్ల కంటపడచ్చు తెలుసా? పిస్తోలుతో మనం ఎక్కువ సేపు నిలబడలేం."

ఈ నగ్నసత్యం అవగతం కావడంతో ఆ యువకుడు దిగ్భ్రాంతిచెందాడు. అతను తన గాయాన్ని తడుముకోవడం మానేశాడు. లెఫ్టినెంటు వైపు కలవరపాటుతో కూడిన చురుకైన చూపు బరపాడు.

"ఎడమ ప్రక్కేమో ననిపిస్తోంది. మేం పరిగెత్తుతున్నప్పుడు అది నాకు ఎడమ ప్రక్క వుంది. లేక, అబ్బే, కొందకోవే నాకు ఎడమ ప్రక్క వున్నాడు. ఒక్క క్షణం ఆగండి, అతనెక్కడ పడివున్నాడో చూస్తాను."

అతను తన పొట్టమీద ఆని తొందరగా పైకి పాకాడు. ఆ బొరియ అంచుపై నుంచి చుట్టూ కలియజూశాడు, ధైర్యం కూడదీసుకున్నాడు, తన సైనిక టోపీ తీసేశాడు, అంటకత్తెర వేసిన తన తలను జాగ్రత్తగా పైకెత్తాడు.

"కొందకోవ్ అదుగో అక్కడున్నాడు" అతను వెనక్కి తిరక్కుండా లోగొంతులో అన్నాడు. "అతను కొట్టుకోడం మానేశాడు. అంతా ముగిసిపోయింది. మేం దాదాపు ఆయుధాగారం దగ్గరకు వెళ్లిపోయాం కూడా. నాకు అది కనిపిస్తోంది. దానిపైన బాంబులు పడ్డట్టులేదు."

ఆ యువ సైనికుని సమక్షంలో పాకడం యిష్టం లేక – ఫ్లాజ్నికొవ్ తడబడుతూ ఏటవాలుగా వున్న గోతిపైకి తంటాలుపడి ఎక్కాడు, ఆ యువకుని పక్కనే పడుకొని పైకి చూశాడు. ఔను, దగ్గర్లోనే సైనిక కోటూ, పాంటూ ధరించిన, – కాని బూట్సూ, టోపీలేని – ఓ మృతవ్యక్తి పడివున్నాడు. నల్లని అతని తల గోధుమరంగు యిసుకపైన కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. చంపబడిన వ్యక్తిని చూడటం ఫ్లాజ్నికొవ్‌కి యిదే మొదటి సారి, దారుణమైన ఆసక్తి అతని కళ్లను అటు పక్కకి ఆకర్షించింది. అతను కొంత సేపు మౌనంగా ఉండిపోయాడు.

''కొందకొవ్ జీవితం అలా ముగిసింది'' ఆ సైనికుడు నిట్టూర్చాడు. ''అతనికి స్వీట్సూ, టాఫీలూ అంటే ప్రాణం. అతను మహా పిసినారి, ఎంత ప్రాధేయపడి అడిగినా గానీ అతవి చేతిలోంచి రొట్టెతుంపు కూడా ఊడిపడేది కాదు.''

''సరే సరే. ఇంతకీ ఆయుధాగారం ఎక్కడ?'' ఒకానొకప్పుడు పిసినారీ, టాఫీలంటే ప్రాణమిచ్చేవాడూ అయిన కొందకొవ్ కళేబరం పైనుంచి కష్టంమీద తన కళ్లను మరల్చుకుంటూ ఫ్లాజ్నికొవ్ అడిగాడు.

''అదిగో ఆ దిబ్బ వుంది చూడండి, అదే ననుకుంటాను. మీక్కనిపిస్తోందా? అయితే అందులోకి ఎలా ప్రవేశించడమో నాకు తెలియదు.''

ఆయుధాగారానికి అనతిదూరంలో, బాంబు పెంకుల తాకిడికి విరిగి, ఛిన్నాభిన్నమైన చెట్లకూ, పొదలకూ వెనుక ఓ బ్రహ్మాండమైన భవనం వుంది. జర్మన్లున్న క్లబ్బు యిదేనని అతను గ్రహించాడు. అక్కడినుంచి సబ్‌మెషీన్ గన్నులనుండి క్లుప్తసరి కాల్పులు వెలువడటం అతను గమనించాడు. కాని వాళ్లు దేనిపైన ఆ కాల్పులు సాగిస్తున్నదీ అతను గ్రహించలేకపోయాడు.

''వాళ్లు తెల్ల భవనపు దుమ్ము దులిపేస్తున్నారు'' ఆ యువ సైనికుడు అన్నాడు. ''అదిగో చూడండి, ఎడమ పక్క, అవి ఇంజనీర్ల కార్యాలయాలు.''

ఫ్లాజ్నికొవ్ అటు చూశాడు. సబ్‌మెషీన్ గన్నుల కాల్పులకు గురైన రెండు అంతస్తుల భవనపు పొట్సి దడి మాటున సైనికులు పడుకుని ఉండటం, తరచుగా వాళ్ల ఆయుధాలనుంచి గురికి బారెడు దూరంగా వెలువడుతున్న కాల్పుల మెరుపులూ అతను స్పష్టంగా చూడగలిగాడు.

''నేను ఆజ్ఞ యివ్వగానే మనం పరుగెత్తాలి –'' అంటూ అతను గుటకలు మింగాడు – ''కొందకొవ్ దగ్గరకి. జర్మన్లు కాల్పులు సాగించకపోయినా మనం అక్కడ పడుకోవాలి. బోధపడిందా? అటెన్షన్, రెడీ – ముందుకి సాగు!''

అతను వంగకుండా, నిటారుగా పరుగెత్తాడు. అతనింకా దిగ్భ్రాంతుడై వుండటం ఒక్కటే కాదు అందుక్కారణం, నీలం బనీను తొడుక్కుని వున్న యీ భయభీత యువ

కుని ముందు తను భీరువుగా కనిపించరాదన్నది కూడా అందుకు కారణం. అతను ఒక్క అంగలో ఆ మృతవ్యక్తిని చేరుకున్నాడు, కాని తన ఆజ్ఞను తానే పాటించకుండా ఆయుధాగారానికి దూసుకెళ్లాడు.

అతను ఆయుధాగారాన్ని చేరుకున్నప్పుడే అకస్మాత్తుగా, యిప్పుడిక తనను చంపేస్తారన్న ఆకస్మికమైన భయోత్పాతం అతన్ని ఆవహించింది. కాని అంతలో ఆ సైనికుడు రొప్పుకుంటూ తనను చేరుకోవడంతో ప్ల్యాజ్నికొవ్ హడావిడిగా తన భయాన్ని దిగద్రొక్కడమే కాకుండా, అతనివంక యికిలించాడు కూడా.

"ఎందుకలా రొప్పుతున్నావ్?"

సైనికుడు జవాబిచ్చేందుకు బదులు యికిలించాడు, మరి ఆ రెండు యికిలింతలూ కూడా రెండు నీటి బిందువుల్లా ఒకే మాదిరిగా ఉన్నాయి.

మూడు సార్లు వాళ్లిద్దరూ ఆ దిబ్బచుట్టూ ప్రదక్షిణాలు చేశారు, కాని వాళ్లకి ప్రవేశ ద్వారాన్ని పోలినదేదీ బొత్తిగా కనిపించనే లేదు. నేలంతా అన్ని చోట్లా ఛిన్నాభిన్నమై వుంది. బహుశా ప్రవేశ ద్వారం కప్పడిపోయిందేమో; లేక యీ సైనికుడు తన గాభరాలో ఒకదానికి మరొకటని చెప్పాడేమో; లేకపోతే కొందకోవ్ తప్పుదోవన పోతున్నాడేమో. ఇప్పుడిక ప్ల్యాజ్నికొవ్ మనస్సును దొలుస్తున్న విషయం ఒక్కటే, యిప్పటికీ యింకా తన దగ్గరున్నది ఒక పిస్తోలు మాత్రమే. దూరంగా, వీలుగా వున్న బాంబు గుంటని వదిలి తనిప్పుడు క్లబ్బు పక్కన వున్న – యిప్పుడు జర్మన్ల ఆక్రమణలో వున్న ఒకనాటి చర్చి – ఎట్ట ఎదుట పూర్తి ఖాళీ స్థలంలో వున్నాడు. తెల్ల భవనానికి చుట్టూ వున్న పొట్టి దడి వంకా, దాని వెనుకనుంచి వెలువడుతున్న కాల్పుల వంకా అతను ప్రగాఢమైన ఆకాంక్షతో చూశాడు. తన సొంత మనుషులు అక్కడున్నారు, మరి అతను వాళ్లను కలుసుకోవాలని గాఢంగా వాంఛించాడు.

"సరే. మనం మన సొంత పక్షాన్ని చేరుకునేందుకు ప్రయత్నించబోతున్నాం," వెనక్కి చూడకుండా అతను చెప్పాడు. "నేను ఒకటి, రెండు, మూడు అనే సరికల్లా పరిగెత్తాలి. సిద్ధమేనా?"

"సిద్ధమే" సైనికుడు నిట్టూర్చాడు. "వాళ్లు మన్ని తూట్లు పొడుస్తారంతే. వాళ్లు కాలుస్తున్నది ఇటువైపే."

"వాళ్లు మనపైన కాల్చరు" కొంచెం సంకోచంగానే ప్ల్యాజ్నికొవ్ జవాబిచ్చాడు. "మనం వాళ్ల మనుషులమే, రెడార్మీ సైనికులం."

అతనీ చివరి మాటలను తన బాల్యంలో మాదిరిగా – ఆవరణలో "చపాయెవ్" నాటకం వేసినప్పుడు అన్న మాదిరిగా అన్నాడు. కాని మిగిలిన కుర్రాళ్లు తనను ఒక్కసారి కూడా

చపాయెవ్ వేషం వెయ్యనిచ్చేవారు కాదు, స్క్వాడ్రను కమాండరు జిఖారెవ్ వేషంతోనే తను సరిపెట్టుకోవలసి వచ్చేది.

అతని ఆజ్ఞమేరకు – ఫిరంగి గుళ్ల గుంటలపైగా, మృత సైనికులపైగా లంఘిస్తూ, పడిపోకుండా, ఎక్కడా ఆగకుండా వాళ్లు మళ్లీ దౌడు తీశారు. "మేం మీ వాళ్లమే!" అని ఫ్లాజ్నికొవ్ అరుస్తూండగా వాళ్ళ నేరుగా కాల్పులకు ఎదురుగా పరుగెత్తారు, అయినా కూడా కాల్పులు ఆగలేదు, అనేక సార్లు బులెట్లు చేసే రివ్వుమన్న శబ్దం విన్నాడతను. కానైతే వాళ్ల అదృష్టం మరోసారి పండింది, వాళ్లు దడిని చేరుకున్నారు, దాని మీదుగా లంఘించారు, రొప్పుతో లోపలిపక్క, తమ సొంత మనుషుల మధ్య కూలబడ్డారు. బాగా మాసిపోయిన సైనిక కోటు తొడుక్కున్నా చాల జాగ్రత్తగా గుండీలు పెట్టుకున్న ఒక సీనియర్ లెఫ్టినెంటు కోపంగా వాళ్లని కూకలేశాడు, "ఎప్పుడూ అలా ఏకబిగిన పరిగెత్త కూడదు తెలుసా? కొద్ది దూరాలు మాత్రమే పరిగెత్తాలి!"

రొప్పు తగ్గిన వెంటనే ఫ్లాజ్నికొవ్ తన రాకని గురించి రిపోర్టుచెయ్యాలనుకున్నాడు, కాని సీనియర్ లెఫ్టినెంటు అతనికి మధ్యలోనే అడ్డొచ్చి, పల్చగా వున్న రక్షణ వలయంలో ఎడమ పార్శ్వాన్ని చూసుకొమ్మనీ, తెరెస్పోల్ గేటును వెయ్యికళ్లతో చూడమనీ ఆజ్ఞాపించాడు. జర్మన్లు అక్కడినుంచే దుర్గప్రవేశం చేశారని అతని నమ్మకం. అత్యంత స్పష్టమైన యీ ఆజ్ఞ జారీచేసి, ఫ్లాజ్నికొవ్ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ జవాబివ్వకుండా, అతను బిరబిరలాడుతూ జోడించాడు: "ఆ సార్జెంటు దగ్గర్నుంచి ఓ రైఫిలు తీసుకో. ఆ గేటుకేసి వెయ్యికళ్లతో చూడు. సహాయ సేనలువచ్చేదాకా మనం తట్టుకు నిలబడాలి."

ఏం సహాయ సేనలు వస్తాయని సీనియర్ లెఫ్టినెంటు ఆశిస్తున్నాడో, అవెక్కడినుంచి వస్తాయో, ఫ్లాజ్నికొవ్ ప్రశ్నించలేదు. అవి ఏక్షణాన అయినా రావచ్చుననీ, అప్పుడు పరిస్థితి కుదుటపడుతుందనీ అతని మటుకు అతను కూడా దృఢంగా విశ్వసించాడు. ఇప్పుడు సమస్య అల్లా తాము తట్టుకొని నిలబడటమే. శత్రువు కాల్పులకు ఎదురు కాల్పులతో జవాబు చెప్పడమే.

ఎడమ ప్రక్క ఏ సార్జెంటూ లేడు. ఆ భవనంలో ఒక మూల నెమ్మదిగా మండుతోంది, పొగమధ్యలోంచి అయిష్టంగా అన్నట్లు మంటలను ఎగజిమ్ముతోంది, మరి గోడ వెనుక కొందరు అర్ధనగ్న సైనికులూ, ఒక తేలికమెషీన్ గన్నుతో యిద్దరు సరిహద్దు గస్తీ సైనికులూ పడుకొని వున్నారు.

"మీరు ఆ మంటని ఎందుకు ఆర్పరు?" ఫ్లాజ్నికొవ్ కోపంగా అడిగాడు.

ఎవరూ జవాబు చెప్పలేదు. ఓ పొడవాటి నీళ్ల టాంకు వున్న గేటును తదేకంగా చూడటంలో వాళ్లందరూ నిమగ్నులై వున్నారు. ఫ్లాజ్నికొవ్ తన మాటలోని అనౌచిత్యాన్ని గమనించి, ఆ మెషీన్ గన్నర్లని సార్జెంట్ ఎక్కడున్నాడని ప్రశ్నించాడు.

"అదిగో అక్కడ" వాళ్లిద్దరిలోనూ పెద్దవాడు తన తలూపి జవాబిచ్చాడు.

ఒక పొట్టి వ్యక్తి కాళ్లు పారజాపి, నేలపై బొక్క బోర్లా పడుకుని వున్నాడు, అతని తల అతని రైఫిలుపైన వుంది; ఫ్లాబ్నికొవ్ అతని భుజాన్ని ముట్టుకున్నప్పుడు అది కొంచెం పక్కకి వాలింది.

"క్రామేడ్ సార్జెంట్ —"

"ఆయన చనిపోయాడు" ఒక సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు.

ఫ్లాబ్నికొవ్ చటుక్కున తన చేతిని వెనక్కి తీసేసుకుని, చుట్టూ నిస్సహాయంగా చూశాడు, కాని ఎవరూ అతన్ని గురించి పట్టించుకోవడం లేదు. చనిపోయిన ఆ వ్యక్తిని తిరిగి ముట్టుకోవడం యిష్టంలేక, అతను రైఫిలు గొట్టాన్ని లాగాడు, కాని నిర్జీవమైన ఆ వ్రేళ్లు దాన్ని గట్టిగా పట్టుకుని వున్నాయి. ఫ్లాబ్నికొవ్ దాన్ని మళ్లీ గుంజాడు, ఆ గుంఁడని నల్లని తల బిర్రుగా కదిలింది, నుదురు రైఫిలుయొక్క గురిచూసే భాగానికి కొట్టుకుంది.

"ఎవళ్లో మళ్లీ పరిగెడుతున్నారు" ఎవరో అన్నారు. "84వ రెజిమెంటుకి చెందిన వాళ్లు."

"బ్యాండు వాద్యగాళ్లు" మరొకరు అన్నారు. "ఆ గేటు పక్క లేవూ, అవి వాళ్ల బ్యారక్కు."

క్లబ్బునుంచి క్లుప్తసరి కాల్పులు కొన్ని వినిపించాయి. వాటి లక్ష్యమేమిటో ఫ్లాబ్నికొవ్‌కి తెలియలేదు, కాని మృత సార్జెంటు శరీరం పక్క బోర్లాపడుకున్నాడు. అతనింకా బిగిసిన ఆ వ్రేళ్ల మధ్యనుంచి రైఫిల్ని ఊడలాగేందుకు మొండిగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కొంచెం సేపు ఆ మృత వ్యక్తి దాని వెంట యీడ్చబడ్డాడు, కాని అటుతర్వాత ఆ వ్రేళ్లు అకస్మాత్తుగా పట్టుసడలాయి; ఫ్లాబ్నికొవ్ రైఫిల్ని దొరకబుచ్చుకొని మళ్లీ వెనక్కి తిరిగి చూడడానికి సాహసించక ఆ గోడ చివరకు పాక్కుంటూ వెళ్లాడు.

తెరెస్పోల్ గేటు దగ్గర కొద్ది మంది పరిగెత్తుకుంటూ వెళ్తున్నారు; వాళ్లలో ఒకని చేతిలో నున్నగా పాలిష్ చేసిన బాకా వుంది. అది జాజ్వల్యమైన సూర్య కాంతిని తళుక్ తళుక్కున ప్రతిఫలిస్తోంది. జర్మన్లు మితంగా కాల్చారు, బ్యాండు వాద్య గాళ్లు పడుతూ లేస్తూ మళ్లీ పరుగెడుతున్నారు. గుంజలకు బంధింపబడి వున్న గుర్రాలు నేలను తన్నుతూ బుసలు కొడుతున్నాయి. ఫ్లాబ్నికొవ్ కళ్లు ఎక్కువగా అటపక్కకే తిరుగుతున్నాయి. అతను తిరిగి గేటువంకకు చూసే సరికి బ్యాండు వాద్యగాళ్లు మాయ మయ్యారు. సూర్య కాంతి ప్రతిఫలనాలు వాళ్లతో బాటే వెళ్లిపోయాయి.

"ఇరుగో, 84వ రెజిమెంటుకి చెందిన మరికొందరు వస్తున్నారు." మెషీన్ గన్ను దగ్గర మొదటివాడైన సరిహద్దు గస్తీ సైనికుడు అరిచాడు. "వాళ్లు మన వేపే వస్తున్న ట్లుందే?"

మనుషులు వలయాకారపు బ్యారక్సునుంచి, క్రమబద్ధమైన నాతిదీర్ఘమైన పరుగులతో వస్తున్నారు. వీళ్ళు గాభరా చెందిన బ్యాండువాద్యగాళ్లు కారు, సాయుధ సైనికులు. జర్మన్లు వెంటనే తమ కాల్పులను ముమ్మరంచేశారు.

సరిహద్దు గస్తీ సైనికులు తమ క్వార్టర్సుకు రక్షణ కల్పిస్తూ క్లబ్‌వైపు కాల్చే క్లుప్తసరి కాల్పులతో మెషీన్ గన్ను గర్జిస్తోంది.

"కాల్చండి!" ఫ్లూజ్నికోవ్ అరిచాడు.

ఆ ఆజ్ఞ తన కోసమే ఉద్దేశింపబడింది, ఎందుకంటే తనకి ఆజ్ఞ అవసరం. కాని ఆ ఆజ్ఞ యిచ్చిన తర్వాత కూడా అతను కాల్చలేకపోయాడు; సార్జెంట్ రైఫిల్లో తూటాలు లేవు, అతను ఉద్రిక్తంగా చేసిన ప్రయత్నమంతా వృథాయే అయింది.

"ఎవర్నైనా వచ్చి మెషీన్ గన్ డిస్కులు నింపమని చెప్పు లెఫ్టినెంట్!" రెండో మెషీన్ గన్నరు – తన కోటుపైన మేలి గురికాని బ్యాడ్జి తగిలించుకున్న పొడవాటి నల్ల రంగు జుట్టుగల వ్యక్తి – కేకేశాడు. "నా డిస్కులు అయిపోతున్నాయి."

ఫ్లూజ్నికోవ్ సైనికుల సన్నని బారును దాటి భవనం వేపు పరుగుతీశాడు. సీనియర్ లెఫ్టినెంటు కనుచూపుమేరలో ఎక్కడా లేదు. మండిపోతున్న భవనం దగ్గర – యింకా తన రైఫిల్ని చేతపట్టుకునే – సంకోచిస్తూ నిలబడ్డాడు.

"తూటాలు! తూటాలు ఎక్కడున్నాయి?"

"నేలమాళిగలో అడుగు" తలకు కట్టుతో అర్ధనగ్నంగా వున్న ఒక సార్జెంట్ చెప్పాడు. "కొంచెం సేపటి క్రితం కుర్రాళ్లు అక్కడ్నుంచే మందుగుండు సామాను పెట్టెలు పైకి తెచ్చారు."

కంపు కొడుతున్న పొగ నేలమాళిగలోకి మెల్లగా చొరుచుకు వెళ్తోంది. దగ్గుతూ, కళ్లు నులుముకుంటూ, ఫ్లూజ్నికోవ్ ఏటవాలుగా, అరిగిపోయివున్న మెట్లవెంట, తనకి కనిపించని క్షతగాత్రులను దాటుకుంటూ క్రిందకి దిగాడు.

"తూటా లెక్కడున్నాయ్?" అతను అడిగాడు.

"అయిపోయాయి, యింకేం లేవు" అనుకోకుండా ఒక స్త్రీ కంఠస్వరం చీకట్లోంచి వినవచ్చింది. "పైన పరిస్థితి ఎలా వుంది?"

ఫ్లూజ్నికోవ్ ఆ గాత్రధారిని చూడటానికి యిష్టపడేవాడే, కాని లోపల చాలా చీకటిగా వుంది.

"బ్యారక్సునుంచి కొందరు చొచ్చుకొని మన దగ్గర కొచ్చారు" అతను చెప్పాడు. "ఎనభై నాలుగో రెజిమెంటు. సీనియర్ లెఫ్టినెంటెక్కడున్నారో మీరు చూశారా?"

"ఇదుగో యీ పక్కకి రండి. జాగ్రత్త, నేలమీద మనుషులున్నారు."

సీనియర్ లెఫ్టినెంటు గోడవార పడివున్నాడు. అతని మురికి కోటు రొమ్ముదాకా

చీలివుంది. మోటుగా కట్టు కట్టబడిన అతని రొమ్ము అతి నీరసంగా ఊగుతోంది. ప్రతి ఒక నిశ్వాసమూ బిగింపబడిన, పాలిపోయిన అతని పెదవుల పైకి ఎర్రని నురగను తెస్తోంది. ప్ల్యాజ్నికొవ్ అతని పక్క మోకరిల్లాడు.

"కామ్రేడ్ సీనియర్ లెఫ్టినెంట్. కామ్రేడ్ –"

"ఆయనకి మీ మాట వినిపించదు" అదే స్వరం చెప్పింది. "పట్నంనుంచి మనకి త్వరలో సాయం వస్తుందా?"

"వాళ్ళు తప్పకుండా యిక్కడికొస్తారు" లేచి నిలబడుతూ ప్ల్యాజ్నికొవ్ అన్నాడు. "వాళ్ళు వచ్చితీరాలి." అతను మళ్ళీ చుట్టూచూశాడు, కనిపించీ కనిపించనట్లున్న ఒక ఆకృతిని చూశాడు, ఇలా జోడించాడు: "పైన తగులబడిపోతోంది. మీరిక్కణ్ణుంచి వెళ్లిపోవడం మంచిది."

"నేనెలా వెళ్ళగలను? గాయపడిన వీళ్ళ సంగతేమిటి?"

"ఇక్కడుండటం ప్రమాదకరం."

ఆ స్త్రీ బదులు పలకలేదు. ప్ల్యాజ్నికొవ్ – తూటాల కొరతతో కన్న కమాండరు మృతిచేత కృంగిపోయి – పొగనిండిన ఆ నేలమాళిగలోంచి తడుముకొంటూ బయటికొచ్చాడు. ద్వారం దగ్గర – పైకప్పు మండుతున్నందున – అప్పటికే నిటారుగా నిలబడటం దుస్సాధ్యంగా తయారైంది. సార్జెంటు అప్పటికీ మెట్లమీదనే కూర్చొని, తను యింటి దగ్గరే వున్నంత ప్రశాంతంగా, సిగరెట్టు చుట్టుకుంటున్నాడు.

"క్షతగాత్రుల్ని బయటకు తీసుకురావాలి" ప్ల్యాజ్నికొవ్ అన్నాడు. "మంట వాళ్లని వేరుచేస్తోంది. ఆ కింద ఓ స్త్రీ కూడా వుంది."

"అది నిజమే" సార్జెంటు తాపీగా ఆమోదం తెలిపాడు. "కాని పైకొచ్చినా వాళ్లెక్కడికెళ్తారు? చుట్టూ అంతా తగలబడుతోంది."

"ఏమో, నాకు తెలియదు. ఎక్కడికో అక్కడికి...."

"అక్కడ నిలబడకు" అకస్మాత్తుగా సార్జెంటు అడ్డుతగిలాడు. "సీనియర్ లెఫ్టినెంటుకి గుండు దెబ్బ తగిలింది అక్కడే."

ప్ల్యాజ్నికొవ్ హడావిడిగా ద్వారాన్ని వదిలి పక్కకి తప్పుకున్నాడు. కాల్పులు క్రమంగా నిలిచిపోయాయి. అతనికి లోగొంతులో మాటలు వినవస్తున్నాయి. అతనికి తూటాల సంగతి జ్ఞాపకం వచ్చింది. వెనక్కెళ్లి సార్జెంటుని అడుగుదామనుకున్నాడు, కాని మనసు మార్చుకుని తన ఖాళీ రైఫిల్ని పట్టుకొని, సైనికుల దగ్గరకు వెళ్లిపోయాడు.

వాళ్లంతా ఓ నల్లజుట్టు అసిస్టెంటు కమిస్సారు చుట్టూ గుమికూడి వున్నారు. అతను కోపంతో కూడిన దృఢస్వరంతో మాట్లాడుతున్నాడు. ఖంగున మ్రోగే అతని స్వరాన్ని వాళ్లంతా ఎంతో తేలికపడిన మనస్సులతో వింటున్నారు.

"....నేను ఆజ్ఞాపిస్తున్నాను. ఎక్కడా ఆగకండి, ఏమీ పట్టించుకోకండి, నేరుగా ముందుకెళ్లండి, క్లబ్బులోకి వెళ్లి అక్కడున్న ఆ సబ్‌మెషీన్ గన్నర్లని హతమార్చండి. ఏం బోధపడిందా?"

"ఆఁ!" సైనికులు తమ మామూలు చురుకుదనంతో అన్నారు.

"కాని దేనితో చెయ్యాలి దాడి?" ముదురు నీలం రంగు బనీను ధరించిన అధిక వయస్కుడొకడు — రిజర్వుకి చెందిన వాడనడం స్పష్టం — చిరాకుగా అడిగాడు. "రైఫిళ్లకు బయనెట్లు లేవు, నాకైతే రైఫిలే లేదు."

"మీ పళ్లు ఉపయోగించండి!" అసిస్టెంటు కమిస్సారు అడ్డుతగిలి చెప్పాడు. "ఏమీ లేకపోతే ఇటుకలు తీసుకోండి, అర్థం పర్థం లేని ప్రశ్నలెయ్యక, అందరూ ఒక్కుమ్మడిగా, బిగ్గరగా 'హుర్రా!' అని అరుస్తూ ముందుకెళ్లండి. ఎక్కడా పడుకోకండి, అక్కడికెళ్లేదాకా పరుగు ఆపకండి!"

"సినిమాల్లో లాగ" గుండ్రటి తల కలిగిన ఓ కుర్రతనపు సైనికుడన్నాడు.

అందరూ నవ్వారు, ఫ్లాజ్నికొవ్ కూడా నవ్వాడు — ఆ కుర్రాడేదో తమాషా విషయం చెప్పడం కన్న, వాళ్లందరూ ఉద్రిక్తులై ఉండటమూ, ముందుకెళ్లేందుకు సంసిద్ధులై ఉండటమే అందుకు కారణం. తాము ఏం చెయ్యాలో వాళ్లందరికీ తెలుసు. మరి యిప్పుడు ఆ నిర్ణయం తీసుకునే దమ్మున్న ఒక వ్యక్తి వాళ్లకి తటస్థపడ్డాడు.

"రైఫిళ్లు లేనివాళ్లు పారలు తీసుకోండి, రాళ్లు, కర్రలు — ఫాసిస్టుల బుర్రలు బద్దలు కొట్టడానికి ఏది దొరికితే అది తీసుకోండి."

"వాళ్లకి ఉక్కు శిరస్త్రాణాలున్నాయి!" గుండ్రతల కుర్రాడు యింకో సారి హుషారుగా అరిచాడు. అతను కంపెనీ విమూషకుడుగా పరిగణింపబడ్డాడు.

"అప్పుడు మరింత గట్టిగా బాదు" అసిస్టెంటు కమిస్సారు మందహాసం చేశాడు. "మంచి గృహస్థుడు దొంగను చావ బాదినట్లు బాదు. ఆయుధాలు వెతుక్కోడానికి అయిదు నిమిషాలు వ్యవధి యిస్తున్నాను. తర్వాత అందరూ దాడిచెయ్యాలి. వెనక ఎవడైనా దిగబడిపోతే వాడు పారుబోతన్నమాటే." అతను ఫ్లాజ్నికొవ్‌ను గమనించి ఆగాడు. "కామ్రేడ్ లెఫ్టినెంట్, మీదే రెజిమెంటు?"

"నా పేరింకా జాబితాకెక్కలేదు. నా నియామక పత్రాలివిగో."

"నియామక పత్రాల సంగతి తర్వాత చూద్దాంలెండి. ఈ దాడికి నన్నే నాయకత్వం వహించి నడపమని రెజిమెంటల్ కమిస్సారు ఆజ్ఞాపించాడు."

"సరే అలాగే" ఫ్లాజ్నికొవ్ వెంటనే ఆమోదించాడు. "నేను మీ ఆజ్ఞలు పాటిస్తాను."

"కిటికీలు ఆక్రమించండి" ఒక క్షణం ఆలోచించిన మీదట అసిస్టెంట్ కమిస్సార్ అన్నాడు. "పదిమంది లెఫ్టినెంట్ నాయకత్వాన వెళ్లండి!"

గుంపులోంచి చెదురుగా ఓ పదిమంది ముందుకొచ్చారు — యిద్దరు సరిహద్దు గస్తీ సైనికులు, చిరాకుగా వుండే రిజర్వు సైనికుడూ, కంపెనీ విదూషకుడూ, తలకి కట్టు కట్టుకున్న సార్జెంటు, బనీనూ, డ్రాయరూ ధరించిన, బుగ్గ గీరుకుపోయిన కుర్రాడూ, యింకెవరో వచ్చారు, కాని వాళ్లను గమనించేందుకు ప్ల్యాజ్నికొవ్‌కు వ్యవధి చిక్కలేదు. వాళ్లు మౌనంగా అతని ఆజ్ఞ కోసం నిరీక్షిస్తూ అతని ముందు బారుతీరారు, కాని ఏమి ఆజ్ఞ యిచ్చేందుకూ అతనికేమీ తోచలేదు. సీనియర్ సరిహద్దు గస్తీ సైనికుడు తేలిక సబ్‌మెషీన్ గన్నుని దుడ్డుకర్ర మాదిరిగా భుజం పైన పట్టుకున్నాడు. దాని గొట్టమింకా వేడిగా వుంది, సన్నాయి వాయిస్తున్నట్లు దాని పైన తన వేళ్లను అటూయిటూ కదుపుతున్నాడు. సార్జెంట్ సిగరెట్టు కాల్చుకుంటున్నాడు, రిజర్వు సైనికుడు ఆబగా దాని వంక చూస్తున్నాడు.

“పీక కొంచెం నాకు మిగుల్చు మిత్రమా. ఒక్క దమ్ము — ఏం?”

“అయితే మనం కిటికీలు పట్టుకుంటామన్నమాట” ప్ల్యాజ్నికొవ్ అన్నాడు. “వాటికి అద్దాలున్నాయా?”

“అద్దాలన్నీ నుగ్గునుగ్గై పోయాయి.” అని సార్జెంటు రిజర్వు సైనికునికి సిగ రెట్టు పీక యిచ్చాడు. “నీ పేరేమిటి?”

“ప్రిజ్న్యాక్.” అతను ఆబగా పొగపీల్చుకున్నాడు.

“నాసామిరంగ, ఇప్పుడే కనుక నా దగ్గరొక హాండ్ గ్రెనేడుంటేనా!” చామనచాయ సరిహద్దు గస్తీ సైనికుడు నిట్టూర్చాడు.

“ఏది దొరికితే దాన్ని తీసుకోండి” ప్ల్యాజ్నికొవ్ గుర్తుచేశాడు. “ఏం కనిపిస్తే అది. చెయ్యాల్సిందల్లా దాన్ని చలాకీగా ప్రయోగించడం, అంతే.”

వాళ్లందరూ చెదిరిపోయారు; సరిహద్దు గస్తీ సైనికులు మాత్రమే ఉండిపోయారు. వాళ్లలో సీనియరుకి తేలిక మెషీన్ గన్నుంది, జూనియర్ దగ్గర — ఎక్కణ్ణుంచి సంపా దించాడో ఏమో — ఆశ్విక సైనికులు వాడే ఓ పాత పట్టాకత్తి వుంది.

“ఇలా జరుగుతుందని ఎవళ్లూహించారు?” వక్రంగా నవ్వుతూ సీనియర్ అన్నాడు. “లేనా యీ రోజున నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఈ సాయంత్రం సరిగా ఏడు గంటలకి. విన్నావా?”

“లేనా ఎక్కడికీ ఎగిరిపోదులే” రెండో అతను అన్నాడు. “నీక్కావలసిన ముద్దులన్నీ కురిపిస్తుంది.”

“ఔననుకో — కాని ఎప్పుడంట?”

సైనికులు క్రమంగా పట్టాకత్తులు, షవల్‌లు లేక దడినుంచి ఊడదీసిన యినుప రాడ్లూ తీసుకుని వచ్చారు. మృత సార్జెంటునుంచి ప్ల్యాజ్నికొవ్ తీసుకున్న రైఫిలుకి బయ

నెట్ లేదు. కాని అతనికి తన పిస్తోలు సంగతి జ్ఞాపకం వచ్చి ఆ రైఫిల్ని బుగ్గ గీరుకు పోయిన యువకునికి యివ్వజూపాడు.

"నాకక్కర్లేదు" అని ఆ కుర్రాడు తన షవల్ను చూపించాడు. "నేను దీన్ని రాతిమీద బాగా వాడిగా నూరాను. బహుశా నాకో సబ్ మెషీన్ గన్ దొరకొచ్చు."

"సొంటు లేదు గాని సబ్ మెషీన్ గన్ కావాలిట పిల్లగానికి" సీనియర్ సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు. "బతికివుంటే అన్నీ తరవాత చూసుకోవచ్చు."

ప్రిజ్న్యాక్ రైఫిల్ని దుడ్డుకర్రలాగ భుజానికెత్తుకుని సామోదంగా అన్నాడు: "ఆఁ యిది పనికొస్తుంది."

"కిటికీలను మనం ఏ వరసలో ఆక్రమించుకుందాం?" తేలిక మెషీన్ గన్ వున్న సరిహద్దు గస్తీ సైనికుడు అడిగాడు. "మొదటి కిటికీ నాదా, మీదా?"

"మొదటిది నాది" ఒకటి అంటే అదృష్టవంతమైన సంఖ్య అన్న మూఢ నమ్మకంతో ఫ్లూజ్నికొవ్ తొందరగా అన్నాడు. "ఒకటోది నేనే తీసుకుంటాను."

"అందరూ సిద్ధమేనా?" అసిస్టెంట్ కమిస్సార్ కేకేశాడు. "మనవాళ్ల కాల్పులు సాగించినప్పుడు నేను ఆజ్ఞ యిస్తాను."

భారమైన నిరీక్షణ క్షణాలు గంటల్లా తోచాయి. ఫ్లూజ్నికొవ్ పొగమూలంగా దగ్గుతూ, మండుతున్న భవనం మూల నిలబడ్డాడు. అతని అరచేతులు చెమటగా వున్నాయేమో పిస్తోలును ఒక చేతిలోంచి మరో చేతికి మార్చుకుని చేతుల్ని కోటుకి తుడుచుకున్నాడు. మెషీన్‌గన్ చేతిలో వున్న సరిహద్దు గస్తీ సైనికుడు అతని భుజం వెనుక తొందరతొందరగా వెచ్చని ఊర్పులు విడుస్తూ ఉన్నాడు.

"మనం యింకెందుకు వేచిచూస్తున్నట్లు?"

"ఊరుకో" ఫ్లూజ్నికొవ్ అన్నాడు. "మామూలు దాడే."

కాని యిది నిజమైన దాడే, మరి అతను కలతచెందాడు. కుర్రాడిలా బింకాలు ప్రదర్శిస్తున్నాడు! అయితే, ఈ అజ్ఞాత లెఫ్టినెంటుని గాని, అతని మాటల్ని గాని పట్టించుకునేందుకు ఎవరికీ శ్రద్ధ లేకపోయింది. వినవస్తున్న శబ్దమల్లా తొందర తొందరగా పీల్చుకుంటున్న ఊర్పులూ, మధ్యమధ్య లోహాల రాపిడి శబ్దం, ఇటుక గోడ వెనుక మంటల హోరూ, వలయాకారపు బ్యారక్సు కైవారం పొడవునా వినవస్తున్న కాల్పులు. వెనుక భాగంలో బ్రెస్ట్‌నుంచి యుద్ధఘోష సన్నగా వినవస్తోంది, ఈ ఘోష ఫ్లూజ్నికొవ్‌ను పులకితుణ్ణి చేసింది. అరుగో మనవాళ్ళు, జర్మన్లను చావచితక కొడుతున్నారు, వాళ్ల త్వరలోనే తమకు సాయంగా యిక్కడికి వస్తారు.

ఫ్లూజ్నికొవ్ కాల్పుల శబ్దం కోసం ఎంత తీక్ష్ణంగా వింటున్నా కూడా, తీరా అవి వినవచ్చే సరికి అతను ఉలిక్కిపడి, అసంకల్పితంగానే మూలనుంచి పక్కకి గంతేశాడు, కాని

సరిహద్దు గస్తీ సైనికుడు అతని భుజం దొరకపుచ్చుకున్నాడు — ఇంకా ఆజ్ఞ జారీ కాలేదు. ఫ్లాజ్నికొవ్ చుట్టూ కలియజూశాడు, బారక్ కిటికీలనుంచి వేగంగా మెరుస్తున్న కాల్పులనూ, వాటికి జవాబుగా చర్చినుంచి అర్ధచంద్రాకారంగా వస్తున్న కాల్పులనూ చూశాడు. సరిగా ఆ క్షణాన అసిస్టెంట్ కమిస్సార్ ఆజ్ఞాస్వరం ఖంగున మ్రోగింది: "మాతృదేశం కోసం ముందుకి సాగండి!"

"ముందుకి!" అని అరిచి ఫ్లాజ్నికొవ్ దడివైపు దూసుకుపోయాడు.

తన కాళ్ల కింద నేల చూసుకోకుండా, దమ్మున్నంత వరకు "హుర్రా!" అని అరిచాడు — అయితే అది చాలా సేపు నిలవలేదు; కాని అతను మరో గుటకలో గాలి పీల్చుకొని, సుదీర్ఘమైన అరుపుగా వదిలాడు. తుపాకి గుళ్లు అతని తలపైగా జుంయ్‌మంటూ దూసుకుపోయాయి, అతని పాదాల చుట్టూ దుమ్మును రేగ్గొట్టాయి, పొదల్లో మిగిలివున్న భాగాలను చిద్రుపలు చేశాయి, కాని చర్చిగోడ దగ్గరకు చేరుకున్న మొట్టమొదటి వాళ్లలో అతనూ వున్నాడు, అక్కడికి చేరీచేరుకోగానే — కిటికీలింకా నిప్పులు కక్కుతున్న కారణంగా — గోడకి కరుచుకున్నాడు. పక్కనే ఎక్కడో అతనికి బొంగురు అరుపులు వినవచ్చాయి, ఏదో మోగుతోంది, సబ్‌మెషీన్ గన్ కాల్పులు గాలిని చీలుస్తున్నాయి.

"కిటికీ!" సరిహద్దు గస్తీ సైనికుడు బొబ్బపెట్టాడు. "ఏయ్ బడ్డా, కిటికీలోంచి లోపలికి దూకు!"

అతను ఫ్లాజ్నికొవ్‌ను పక్కకు నెట్టేసి బార్లా తీసివున్న కిటికీలోకి దూకాడు, కుర్రాడి మాదిరిగా కీచుమంటూ గావుకేక పెట్టి కిటికీ గడపమీద దబ్బున భారంగా పడ్డాడు. ఫ్లాజ్నికొవ్ మెరుస్తున్న చర్చి అంధకారంలోకి రెండుమార్లు కాల్చి, సరిహద్దు గస్తీ సైనికుని కంపిస్తున్న వెచ్చని శరీరంపైకి ఎగబాకి దాని పైగా దొర్లి లోపలి యిటుక నేలపైకి పడ్డాడు. ఒక రవ్వ అతని జుట్టును మాడ్చింది, అతను తిరిగి కాల్చి, గోడ దగ్గరకు పాకాడు. మృత సరిహద్దు గస్తీ సైనికుని మీదుగా తనని అనుసరించి వచ్చిన సైనికుల్లో ఒకడు అతని పక్కనే పడ్డాడు. ఎవరోగాని ఫ్లాజ్నికొవ్ తలను బాధాకరంగా తన్నాడు, కానైతే అతను లేచినిలబడి, గోడకి తన వీపును ఆన్చగలిగాడు.

బయటి వెల్తురులో ఉండి వచ్చిన మీదట చర్చిలో కటికచీకటిగా వుంది. చీకట్లోనూ, రేగుతున్న యిటుక ధూళిలోనూ సైనికులు గాండ్రిస్తూ, బూతులు తిడుతూ, ఎదుటివారి నడుములు విరగ్గొడుతూ, గొంతులు నులుముతూ, పళ్లతో పీకుతూ, గుడ్లు పెరుకుతూ, నోళ్లు చీలుస్తూ, కత్తులతో పొడుస్తూ, పారలతో తెగవేస్తూ, ఇటుకలతోను, రైఫిలు మడమలతోను మోదుతూ బాహాబాహీ పోరాడసాగారు. ఎవరో రోదించారు, ఎవరో అరిచారు, ఎవరో మూలిగారు, ఎవరో శాపనార్థాలు పెట్టారు, అదంతా పిచ్చాసుపత్రి గోలలా

వుంది. ప్లాజ్నికొవ్‌కి బార్లా తెరిచిన నోళ్లూ, తెల్లని పళ్లూ మాత్రమే కనిపించాయి, సుదీర్ఘమైన పాశవికమైన కేక మాత్రమే విన్నాడు.

ఫ్లాష్ ఫొటోగ్రాఫు మాదిరిగా ఒక్క క్షణంలో ఇదంతా అతని కళ్ల ముందు జరిగి పోయింది. ఆ మరు క్షణమే అతను గోడ దగ్గర్నుంచి విడివడి, వలయాకారంగా మెరుపులు ప్రసరిస్తున్న చోటుకి, చీకట్లోకి తోసుకెళ్లాడు. తన వాళ్లకే ఎక్కడ తగులుతుందో నన్న భయంతో దూరంనుంచి కాల్చడానికి అతను సాహసించలేదు. మెరుపు కాంతుల ముందు ఆకారాలు కనిపించి మాయమవుతున్నాయి. అతను ఎవరినో — బహుశా తన వాడే కావచ్చు — పక్కకి గెంటేశాడు. పళ్లు బయటపెట్టి గుర్రుమనే ఒక శత్రువు ముఖంపైన సూటిగా కాల్చాడు, తూలి, నేలపై దొర్లుతూన్న శరీరాల గుట్టమీద పడి, మెల్లగా కదులుతున్న అంటకత్తెర వెయ్యబడిన తలపైన తన బరువైన పిస్తోలుతో మోదాడు, దాని కదలిక క్రమంగా తగ్గి, నిలిచిపోయింది. అటుతర్వాత ప్లాజ్నికొవ్‌కే తలపైన రిమ్మతిరిగే దెబ్బ తగిలింది. అంతకు ముందు తనే చితక్కొట్టిన అంటకత్తెర వెయ్యబడిన తలపైన బోర్లా పడ్డాడు.

కొంత సేపటికి అతను స్పృహ తెచ్చుకున్నాడు, పిస్తోలు కోసం తడుములాడాడు కాని అది దొరకలేదు, లేచి నిలబడలేక, మోకాళ్లపై దేక్కుంటూ — దోవలో ఎవరి రక్తాన్నో తన ముఖానికి పులుముకుంటూ — గోడ దగ్గరకు వెళ్లాడు. అతను తన తలను నిటారుగా నిలపలేకపోయాడు, అది పక్కకి వాలిపోతూ వచ్చింది, తను తొక్కివెయ్యబడవచ్చునన్న అస్పష్టమైన ఎరుకతో స్పృహ కోల్పోరాదని తనను తను అతను హెచ్చరించుకున్నాడు. అతను దాదాపుగా గోడ దగ్గరకు చేరుకున్నాడు, కాని యింతలో ఎవరో అతని బూటు పట్టుకొని — బాధతో మూల్గుతున్న సైనికుల కాళ్ల క్రిందుగా — వెనక్కి లాగడం మొదలు పెట్టాడు. అతను వెనక్కి తిరిగి చూసేసరికి విశాలమైన రక్తమోడుతున్న ముఖం, నలిగిపోయిన దౌడ మధ్య ఊడిపోగా మిగిలిన పళ్లు, రక్తంతో నిండిన ఉమ్మి, ఉబ్బి పైకి వెళ్లుకొచ్చిన నాలుకా కానవచ్చి అతను కెవ్వున — సన్నగా — కేకవేశాడు. చావుకళ పడిన ఆ జర్మన్ వికృతంగా యికిలిస్తూ అతన్ని యింకా యింకా తన దగ్గరకు గుంజసాగాడు. ఇక యిది తన పాలిట మృత్యువేనన్న సంగతి అత్యంత విస్పష్టంగా అవగతమైంది, అతని ఒళ్లంతటా ముచ్చెమటలు పోశాయి, జర్మన్ తనను నెమ్మదిగా, పట్టు విడువకుండా, పీడకలలో మాదిరిగా తన దగ్గరకు లాక్కొంటూండగా అతనింకా అరుస్తూనే వున్నాడు. అటువంటి పీడకల మాదిరి పరిస్థితిలో ప్లాజ్నికొవ్‌కి కాటుకవంటి చీకటిలా, పట్టుకొని విడువని ఆత్మవినాశకమైన భయోత్పాతమే తప్ప శక్తి లేకపోయింది.

ఎవరో అతనిపైన పడి, అతని మీదుగా పాకాడు, అతని దినపాదం ప్లాజ్నికొవ్ గడ్డానికి రాసుకుంది. అది అర్ధనగ్న సైనికుడు. జర్మన్ తన పాదాన్ని విడవడం ప్లాజ్నికొవ్‌కి

అనుభూతమైంది. ఆ యువ సైనికుడు తన పొట్టపై అస్తవ్యస్తంగా ఎగురుతున్నట్లనిపించింది. అది అతనికి బాధగా వున్నా భయంకరంగా లేదు. ఫ్లాజ్నికొవ్ ఎలాగో ప్రయాసపడి అతని క్రిందనుంచి పక్కకి పాకగలిగాడు, బుగ్గ గీరుకుపోయిన ఆ యువ సైనికుడు మోకాళ్లపై వంగి, తన షవల్‌తో ఆ జర్మన్ మెడపై మళ్లీ మళ్లీ పొడవడం చూశాడు. దెబ్బ దెబ్బకీ ఆ షవల్ మరింత లోతుకి దిగడం, ఆ జర్మను యిటుకనేలపై మెలికలు తిరిగిపోవడమూ చూశాడు.

పోరాటం దాదాపు ముగిసింది; చివరి మూల్గులూ, కేకలూ, అరుపులూ, ఏడ్పులూ సన్నగిలుతున్నాయి. జర్మన్లు చర్చినుంచి పలాయనం చేస్తున్నారు, పారిపోలేనివారు యిప్పుడు రక్తపంకిలమైన ఆ యిటుకనేలపై చనిపోతున్నారు.

"మీరు బ్రతికివున్నారా కామ్రేడ్ లెఫ్టినెంట్? నేను నా షవలుతో వాణ్ణి హతమార్చాను. సరిగా మా అమ్మ కోసం లేగ దూడని జఫా చేసినట్లుందనుకోండి!"

ఫ్లాజ్నికొవ్ గోడకి తన వీపును ఆన్చి, తన శక్తిని కూడదీసుకునేందుకు ప్రయత్నిస్తూ, కూర్చున్నాడు. అతని తల నొచ్చుతోంది, తెరలుతెరలుగా వాంతి ముంచుకొచ్చి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అతను దిగమింగేందుకు ప్రయత్నించాడు, కాని మింగేందుకు ఏమీ లేకపోయింది. అతని గొంతును కఫం చుట్టబెట్టింది. పోరాటం ముగిసిపోయిందనీ, తను బ్రతికేవున్నాననీ, కనీసం తనకు గాయం కూడా తగల్లేదనీ అతను గ్రహించాడు, కాని అతనికి వెలపరమూ, విపరీతమైన నిస్సత్తువా తప్ప మరేమీ అనుభూతం కావడం లేదు. ఆ యువ సైనికుడు మాత్రం ఎక్కడా అడ్డూ ఆపూ లేకుండా — మాట తర్వాత మాట జలపాతం మాదిరి దొర్లుకొంటూ రాగా — మాట్లాడుతూనే వున్నాడు.

"నేను వాడి మెడనరాన్ని — లేగదూడ మెడనరం మాదిరిగా — తెగ్గొట్టాను. అదిగో వాడి మెడమీద, అక్కడ—"

"నా పిస్తోలు" ఫ్లాజ్నికొవ్ కష్టంమీద అన్నాడు కాని ఆనందంతో కూడిన యీ ఆవేశం అతనికి వెగటనిపించింది. "నా పిస్తోలెక్కడుంది?"

"చూద్దాంలెండి! నన్నెవరూ దెబ్బతియ్యలేకపోయారు. నేను లేడిలా గంతులేశాను. మీకు తెలుసా, నేను —"

"నా పిస్తోలు" ఫ్లాజ్నికొవ్ దృఢంగా రెట్టించాడు. "అది నా పేర నమోదు చెయ్యబడింది. అది నా వ్యక్తిగత ఆయుధం."

"నాకు సబ్‌మెషీన్ గన్ను దొరికింది! మరి ఆ సరిహద్దు గస్తీ సైనికుడు నేను పొంటులేనిదే యుద్ధం చెయ్యలేనన్నాడు. చూసుకోండి ఆయనేమో చచ్చిపోయాడు, మరి నేను — నేను నా సబ్‌మెషీన్ గన్ సంపాదించుకున్నాను."

“లెఫ్టినెంట్ ఎక్కడ?” దుమ్ముతో నిండిన చర్చివెనక భాగంనుంచి ఎవరో అరిచారు. “ఆయన బతికున్నాడా? ఎవరైనా చూశారా ఆయన్ని?”

“నేను బతికే వున్నాను.” ఫ్లూజ్నికొవ్ లేచి నిలబడి, ఓ అడుగేసి అంతలోనే అకస్మాత్తుగా చదికిలబడ్డాడు. “ఏం లేదు నా తల తిరుగుతోందంతే, కాసేపట్లో అదే పోతుంది.”

ఆసరాగా పనికొచ్చేది ఏదైనా దొరుకుతుందేమోనని అతను చుట్టూ తడిమాడు, అతనికి ఒక జర్మన్ సబ్‌మెషీన్ గన్ కనిపించింది. అతను దాన్ని పైకి లాగి, కష్టంమీద బ్రీచ్‌ని తెరిచాడు. క్షీణంగా మెరిసే తూటా బయటపడింది. అతను సేఫ్టీ కాచ్ పెట్టేసి ఆ గన్ను ఆసరాతో ఎలాగో లేచి నిలబడ్డాడు.

నల్లజుట్టు అసిస్టెంటు కమిస్సారు అతని దగ్గరకి వచ్చాడు. అతని సైనిక కోటు పోయింది, రక్తపు మరకలతో నిండిన అతని తెల్ల చొక్కా కొత్తగా కట్టిన కట్టు మీదికి లాగబడివుంది.

“మీరు బాగా గాయపడ్డారా?” ఫ్లూజ్నికొవ్ అడిగాడు.

“ఓ జర్మన్ నా వీపుమీద బాకుతో పొడిచాడు. మీక్కూడా దెబ్బ తగిలిందా?”

“బహుశా నెత్తిమీద రైఫిలు మడమతో బాదివున్నాడు, లేక నా గొంతు నులమాలని ప్రయత్నించాడో, నాకు గుర్తు లేదు.”

“ఇది ఓ గుటక తీసుకోండి” అతను ఓ ఫ్లాస్కు అందించాడు. “మన కుర్రాళ్ళ కొందరు యీ ఫ్లాస్కుని చచ్చిపోయిన ఓ జర్మన్ దగ్గర్నుంచి ఊడలాగారు.”

తడబడుతున్న వేళ్ళతో ఫ్లూజ్నికొవ్ ఆ ఫ్లాస్కు మూత తీసి, గటగట తాగాడు. వెచ్చగా ఘాటుగా ఉన్న ఆ సారా అతనికి డిక్కపెట్టడంతో అతను దాన్ని తొందరగా తిరిగి యిచ్చేశాడు.

“అది వోడ్కా.”

“మంచి యోధులు, ఔనా?” ఆ ఫ్లాస్కును తన బెల్టుకి తగిలించుకొంటూ అసిస్టెంట్ కమిస్సారు అడిగాడు. “నేను దీన్ని రెజిమెంటల్ కమిస్సారుకి చూపిస్తాను. ఆఁ అన్నట్లు, మిమ్మల్ని గురించి ఏం చెప్పమంటారు?”

ఫ్లూజ్నికొవ్ తన పత్రాలు పైకి తీశాడు. అసిస్టెంట్ కమిస్సారు వాటిని పరీక్షించి తిరిగి యిచ్చేశాడు.

“మీరిక్కడే వుండాలి. దుర్గరక్షణకు ఈ చర్చియే కీలక స్థానమని కమిస్సార్ చెప్పాడు. నేను మీకో భారీ మెషీన్ గన్ను పంపిస్తా.”

“మరి కొంచెం నీళ్లూను. దయచేసి కొంచెం నీళ్ల కూడా పంపండి.”

“నీళ్ల విషయంలో నేను మాట యివ్వలేను. నీళ్లేమో మెషీన్ గన్నులకి అవసరం,

మనమేమో నది ఒడ్డు కెళ్లడం సాధ్యం కాదు.'' అతను పక్కకు తిరిగి, బుగ్గ గీరుకుపోయిన యువకుని చూశాడు. ''ఫ్లాస్కులన్నీ పోగుచేసి లెఫ్టినెంటుకే అప్పగించు.''

''సరే!''

''ఒక్క నిమిషం ఆగు. ఏవైనా దుస్తులు చూసి వేసుకో. యుద్ధంలో అండర్‌వేర్ ధరించడం సరిగా ఉండదు.''

ఆజ్ఞను నిర్వర్తించడం కోసం ఆ కుర్రాడు మెరుపులా పరిగెత్తాడు. అతను జీవ శక్తితో తొణికిసలాడుతున్నాడు. అసిస్టెంట్ కమిస్సారు ప్లూజ్నికోవ్ కేసి వెనక్కితిరిగాడు.

''నీళ్లు పొదుపు చెయ్యండి. అందర్నీ శిరస్త్రాణాలు — మనవి గాని, జర్మన్లవి గాని — ఏవి దొరికితే వాటిని ధరించమని ఆదేశించండి.''

''సరే. ఔను అవసరం — ఎగిరే లోహపు తునకలు.''

''కింద పడే యిటుకలు అంతకంటె అధ్వాన్నం.'' అసిస్టెంట్ కమిస్సారు మంద హాసం చేశాడు. ''సరే, అదృష్టం కలిసివచ్చుగాక కామ్రేడ్ లెఫ్టినెంట్ క్షతగాత్రుల కోసం మేం మనుషుల్ని పంపిస్తాం.''

అతను కరచాలనం చేసి వెళ్లిపోయాడు, కాని ప్లూజ్నికోవ్ మళ్లీ నేలపై చది కిలబడ్డాడు. అతని కళ్లముందు — చర్చి, వీపుపై గాయంతో అసిస్టెంట్ కమిస్సారు, నేలపై చచ్చిపడివున్న సైనికులు — సమస్తం గిర్రున తిరుగుతూవున్నాయి. అతను ఊగాడు, కళ్లు మూసుకున్నాడు, ఓ పక్కకి ఒరగా వాలిపోయాడు. అకస్మాత్తుగా అతనికి గండు ముఖం, విరిగిన పళ్లతో యికిలింపు, చితికిన దౌడనుంచి వెలికి వస్తున్న రక్తపు నురగతో కూడిన ఉమ్మి ఎట్టఎదుట కానవచ్చాయి.

''నరకం!''

విశ్వ ప్రయత్నంమీద అతను కూర్చుని కళ్లు విప్పగలిగాడు. అతని కళ్లముందింకా అన్నీ తేలిపోతూ, గిరగిర తిరుగుతూనే ఉన్నాయి, కాని అస్పష్టమైన ఆ కంపనలో, ఫ్లాస్కులు టంగుటంగున మోగుతూండగా తన వంక వస్తున్న సైనికుని పరిచితాకృతిని అతను గుర్తించగలిగాడు.

ఏదేమైతేనేం, నేను ధైర్యశాలినే, అనుకున్నాడతను అకస్మాత్తుగా. నిజమైన దాడిలో పాల్గొవడమే కాకుండా నేనొక శత్రువును కూడా చంపాననుకుంటాను.

''ఇద్దరి దగ్గర నీళ్లున్నట్లుంది...'' ఆ యువకుడు ఫ్లాస్కుల్ని ముందుకు చాపాడు.

ప్లూజ్నికోవ్ తాపీగా చాలసేపు — ప్రతి గుక్కనీ తృప్తిగా అనుభవిస్తూ — ఆ మంచి నీళ్లు తాగాడు. నీళ్లు పొదుపుచెయ్యమన్న అసిస్టెంట్ కమిస్సారు సలహా గుర్తొచ్చినా కూడా అతనా ఫ్లాస్కును నోటినుంచి దూరంచెయ్యలేకపోయాడు, దాదాపు దాన్ని ఖాళీచేసి గాని వెనక్కి తిరిగి యివ్వలేదు.

"ఇదుగో, నువ్వు నా ప్రాణాన్ని కాపాడటం ఇది రెండో సారి. నీ పేరేమిటన్నావ్?"

"సాల్నికొవ్" ఆ యువకుడు తబ్బిబ్బు పడ్డట్టు కనిపించాడు. "ప్యోత్ర్ సాల్నికొవ్. మా ఊళ్లో అందరం సాల్నికొవ్‌లమే."

"నేను నిన్ను గురించి మన అధికారులకి రిపోర్టు పంపుతాను కామ్రేడ్ సాల్నికొవ్."

సాల్నికొవ్ యిప్పుడు సైనిక కోటూ, లుదుంగులుదుంగు మంటున్న పాంటూ, పొట్టి జర్మన్ టాప్ బూట్లూ ధరించాడు. అవన్నీ కూడా అతనికి చాలా పెద్దవి, సంచుల్లా వేలాడుతున్నాయి, అయినా అతనికేమీ బాధ అనిపించడంలేదు.

"ఇవి స్టోర్సులోవి కాదు!"

"చచ్చిపోయిన వాళ్లవా?"

"వాళ్లేమీ అనుకోరు కదా."

ఫ్లాజ్నికొవ్ తల అప్పటికి దాదాపు నిలబడింది, ఇప్పుడిక వెలపరం దారుణమైన ఆ నిస్సత్తువా తప్ప మరేమీ లేదు. అతను లేచి నిలబడ్డాడు. తన కోటు రక్తంలో నానిపోవడం, తన కాలరు చిరిగిపోవడం అతనికి చిరాకు కలిగించింది. అతను దాన్ని ఏదో విధంగా సరిచేసుకున్నాడు, తన షోల్డరు బెల్టును సద్దుకున్నాడు, జర్మన్లనుంచి పట్టుకున్న సబ్‌మెషీన్ గన్నును రొమ్ముమైన వ్రేలాడదీసుకుని, ద్వారం దగ్గరకెళ్లాడు.

సైనికుల గుంపొకటి అక్కడ జరిగిన పోరాటాన్ని గురించి చర్చించుకుంటున్నారు. చిరాకుగా వుండే రిజర్వు సైనికుడూ, గుండ్రటి తల విదూషకుడూ స్వల్పంగా గాయపడ్డారు; సార్జెంటు – అతని చొక్కా ఎండిన రక్తంతో తుప్పురంగు తిరిగింది – ఓ చెత్తగుట్టమీద కూర్చొని సిగరెట్టు కాల్చుకుంటూ, పొడిగా పళ్లసందున నవ్వుకున్నాడు. అతను చర్చలో పాల్గొడం లేదు.

"గట్టి దెబ్బ తగిలిందా, కామ్రేడ్ లెఫ్టినెంట్?"

"పోరాటమంటే అంతే కదా?" ఫ్లాజ్నికొవ్ నిశ్చలంగా చెప్పాడు.

"పోరాటమంటే గెలవడం" సార్జెంటు పళ్లసందున నవ్వుకున్నాడు. "నిర్దిష్టమైన లక్ష్యం లేకుండా పరిగెత్తే వాళ్లే దెబ్బ తింటారు. నేను ఫిన్నిష్ యుద్ధంలో పాల్గొన్నాను, చెప్పేదేమిటో నేను తెలిసే చెప్తున్నాను. దగ్గర్లో వున్నప్పుడు ఊరికే అడ్డదిడ్డంగా బండదెబ్బలు కొట్టి లాభం లేదు. మీరు శత్రువుకి దగ్గర పడుతున్నప్పుడు మీ లక్ష్యాన్ని – ఎవర్ని మీరు కొట్టదలచుకున్నారో వాడిని – ఎంచుకోవాలి. మీరు కొట్టగలిగిన వాడిని ఎన్నుకోండి. ఆ తర్వాత, మిగిలినవాళ్లనెవర్నీ పట్టించుకోకుండా, వాడిని చచ్చేట్టు మోదండి. ఆ విధంగా చేస్తే మీకు తక్కువ దెబ్బలు తగుల్తాయి."

"సొల్లు మాటలు" ఫ్లాజ్నికొవ్ కోపంగా అన్నాడు. ఆ క్షణంలో ఆ సార్జెంటు

మాటలు వింటూంటే అతనికి మిలిటరీ స్కూల్లోని సార్జెంట్ మేజరు మాటలు జ్ఞాపక మొచ్చి, చిరాకు కలిగింది. "ఆయుధాలు పోగుచెయ్యండి."

"వాటిని పోగుచెయ్యడం ఎప్పుడో పూర్తయింది" ఆ సార్జెంటు అనుగ్రహ పూర్వ కంగా అన్నట్లు మందహాసం చేశాడు. "మీరు చాలా సేపే విశ్రాంతి తీసుకున్నారు."

"విమాన దాడి!" గుండ్రతల యువకుడు అరిచాడు. "ఇరవై బాంబరు విమానాలు!"

"మాటు వెతుక్కోండి అబ్బాయిలూ" సార్జెంటు, తన సిగరెట్టు పీకను జాగ్రత్తగా నేలరాసి ఆర్పుతూ అన్నాడు. "ఈ దొంగ నాకొడుకులు గట్టిపట్టే పట్టేలా వుంది!"

"జాగ్రత్తగా కనిపెట్టి చూడండి!" మాటుకోసం చుట్టూ కలియజూస్తూ ప్లూజ్నికొవ్ కేకేశాడు. "వాళ్లు మళ్లీ మొదలుపెట్టచ్చు—"

"వాళ్లు మెషీన్ గన్ను లాక్కొస్తున్నారు!" ఆ సార్జెంటే అరిచాడు. "ఇదుగో యిటు!"

"శిరస్త్రాణాలు!" ప్లూజ్నికొవ్ అకస్మాత్తుగా గుర్తుచేసుకున్నాడు. "మీ శిరస్త్రాణాలు తగిలించుకోండి!"

తొలి విడత బాంబుల రొద అతని చివరి మాటలను ముంచెత్తేసింది. దగ్గర్లో పడిన బాంబు ప్రేలుడుకు పైకప్పుకి వున్న గిలాబా పెళ్లపెళ్లలుగా ఊడిపడింది. వెచ్చని గాలిపెట్టు నేలమీదనుంచి యిటుక పొడిని రేపింది. ప్లూజ్నికొవ్ మొట్టమొదట తన కంట పడిన శిరస్త్రాణం దొరకపుచ్చుకొని గోడదగ్గరకు పరుగెత్తి అక్కడ చదికిలబడ్డాడు. ఒక్క సాల్నికొవ్ తప్ప మిగిలిన సైనికులందరూ చర్చి వెనక భాగానికి పరిగెత్తారు. సాల్నికొవ్ రెండు సార్లు అలంగం తిరిగి, బిర్రుగా వున్న ఓ జర్మన్ శిరస్త్రాణాన్ని ఆదరాబాదరా నెత్తి పైకి లాక్కుంటూ, ప్లూజ్నికొవ్ పక్కనున్న పొట్టిగూడులో దూరాడు. అంతా మూలిగింది, గర్జించింది.

"దాక్కో!" యింకా ద్వారంలోనే పడుకునివున్న సార్జెంటు వంక తిరిగి ప్లూజ్నికొవ్ కేకేశాడు. "మాటు వెతుక్కో—వినిపిస్తోందా నీకు?"

ఉంగిడెత్తించే వేడిగాలి తరగ ఒకటి తెరిచిన అతని నోట్లోకి వెళ్లింది, అతను పేగులు తెగేలా దగ్గి, దుమ్ము నిండిన కళ్లు తుడుచుకున్నాడు. నేల దద్దరిల్లిపోయింది, మందమైన చర్చిగోడలు మెలితిరిగినట్లు కనిపించాయి.

"సార్జెంట్! సార్జెంట్, మాటుకి వెళ్లు!"

"మెషీన్ గన్!" సార్జెంట్ మహోత్సాహంగా అరిచాడు. "మెషీన్ గన్ అక్కడొది లేశారు! మూర్ఖులు!"

అతను వంగి, బాంబుల అల్లకల్లోలంలోకి దూసుకెళ్లాడు. ప్లూజ్నికొవ్ అరవాలను

కున్నాడు, కాని దట్టమైన మరో పేడిగాలి తరగ అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉక్కిరి బిక్కిరవుతూ అతను జాగ్రత్తగా బయటకు తొంగి చూశాడు.

సార్జెంటు వంగుని, దుమ్ము మధ్యలోంచి, కాల్పుల మధ్యలోంచి పరుగెడుతున్నాడు. బాంబు గుంటలో అతను బోర్లా పడి, ఓ క్షణం అదృశ్యమై, పైకి లేచి, మళ్లీ పరుగెత్తాడు. సార్జెంటు తిరగబడిన భారీ మెషీన్ గన్నును చేరుకోవడం, దాన్ని బాంబు గుంటలోకి లాక్కు రావడం ఫ్లాజ్నికొవ్ చూశాడు. కాని అప్పుడు మళ్లీ దాని పక్కనే బాంబు పడింది. ఫ్లాజ్నికొవ్ చదికిలబడ్డాడు, బాంబు తునకలు కటకటలాడుతూ ఎగరడం ఆగిపోగానే, అతను మళ్లీ బయటకు తొంగి చూసినప్పుడు, దట్టమైన పొగమధ్యా, ధూళిమధ్యా అతనికేమీ కనిపించలేదు.

"వాళ్లు అతన్ని గురిచూసి దెబ్బతీశారు!" సాల్నికొవ్ అరిచాడు, ఫ్లాజ్నికొవ్‌కి ఆ మాటలు వినబడకపోయినా అతను వాటిని ఊహించుకోగలిగాడు. "వాళ్లు సూటిగా అతని నెత్తిమీదే వేశారు! అతని గుండీలు తప్ప మరేం మిగల్లేదు!"

మరో బాంబుల గుత్తి ఫెళఫెళామంటూ కిందరాలింది. బలంగా వున్న చర్చిగోడ మళ్లీ ఊగింది. ఫ్లాజ్నికొవ్ తన చెవులు మూసుకొని, నేలను కరుచుకొని ముడుచుకున్నాడు. అరుపులూ, ప్రేలుళ్లూ భౌతికమైన బరువు మాదిరిగా అతని భుజాలను నొక్కిపట్టాయి; అతని పక్కనే వున్న సాల్నికొవ్ కంపించాడు.

అటుతర్వాత – నిశ్శబ్దం ఆవరించింది, గింగురుమనే శబ్దం మాత్రం క్రమక్రమంగా తగ్గిపోయింది. క్రిందుగా చక్కర్లుకొట్టే బాంబరు వినూనపుటింజన్ల హోరు జోరుగానే వినిపిస్తున్నా మళ్లీ బాంబు ప్రేలుళ్లుగాని, బాంబులు పడేటప్పుడయ్యే హృదయవిదారకమైన మొయ్యోమనే శబ్దంగాని యిప్పుడిక వినరావడం లేదు. ఫ్లాజ్నికొవ్ తన కళ్లపైకి జారిన ఉక్కు శిరస్త్రాణాన్ని సరిచేసుకుని, జాగ్రత్తగా బయటకు చూశాడు.

ధూళిధూమాలగుండా రక్తవర్ణపు సూర్యుడు తీక్ష్ణంగా క్రిందికి చూస్తున్నట్లున్నాడు. ఫ్లాజ్నికొవ్‌కి మరేదీ – అతి దగ్గరగా వున్న భవనాల స్థూలాకార రేఖలు సైతం – కానరావడంలేదు. అతని పక్కన ఉండేందుకని సాల్నికొవ్ ప్రాకుకొచ్చాడు.

"అంతా నాశనమైపోయినట్లేనా?"

"అన్నీ పేల్చడం వాళ్ల వశం కాలేదు." తన చెవుల్లో గింగురుమనే హోరును వదిలించుకునే ప్రయత్నంలో ఫ్లాజ్నికొవ్ తన తలను విదిపాడు. "వాళ్ల బాంబుదాడి చాల సేపే సాగిందంటావా?"

"చాల సేపే జరిగింది" సాల్నికొవ్ అన్నాడు. "వాళ్లెప్పుడు దాడిచేసినా ఎక్కువ సేపే చేస్తున్నారు. అటు చూడండి – అదుగో సార్జెంటు!"

మెషీన్ గన్నును దొర్లించుకుంటూ వస్తున్న సార్జెంటు ధూళిధూమాల మధ్య

నుంచి కానవచ్చాడు. తూటాల బెల్టుల పెట్టెలు మోస్తూ అతని వెనకే ఒక సైనికుడు వస్తున్నాడు.

బాగా రొప్పుతూ సార్జెంటు దాన్ని చర్చి దగ్గరకు తీసుకురాగానే "నువ్వు బాగున్నావా?" అని ప్లూజ్నికొవ్ ప్రశ్నించాడు.

"మేం బాగానే వున్నాం. కాని ఓ శుంఠ చంపబడ్డాడు. అది అతని తప్పే — లేకపోతే బాంబుల మధ్యకి..."

"కాని, అతను బలే మెషీన్ గన్నరు" బెల్టులు తెస్తున్న సైనికుడు నిట్టూర్చాడు.

"కామ్రేడ్ లెఫ్టినెంట్" వెనకనుంచి ఎవరో మెల్లగా పిలిచారు. "ఇక్కడ కొందరు సివిలియన్లున్నారు!"

కొందరు సైనికుల మధ్య ముగ్గురు ఆడాళ్లు అతని వేపు వస్తున్నారు. ఓ యువతి యిటుక ధూళి కొట్టుకొని బాగా మాసిన తెల్లని బ్రాసియర్‌తో వుంది. ప్లూజ్నికొవ్ కను బొమలు చిట్లించి ముఖం తిప్పేసుకున్నాడు.

"ఎవరు వీళ్ళు? ఎక్కణ్ణుంచి వస్తున్నారు?"

"మేం యిక్కడి వాళ్లమే" అంది వాళ్లల్లో పెద్దామె. "వాళ్ళు కాల్పులు ప్రారంభించినప్పుడు మేం దాక్కున్నాం."

"నేలమాళిగల్లో జర్మన్లున్నారంటున్నారు వీళ్లు" తేలిక మెషీన్ గన్ను దగ్గర సహాయకుడైన చామనచాయ సరిహద్దు గస్తీ సైనికుడన్నాడు. "వాళ్లు పారిపోతూండగా చూశారట. మనం చూస్తే బాగుంటుందేమో?"

"తప్పకుండాను" అని, తను లాక్కొచ్చిన భారీ మెషీన్ గన్ ప్రక్కన పడుకుని వున్న సార్జెంటు వంక చూశాడు ప్లూజ్నికొవ్.

"మీరే వెళ్లాలి" సార్జెంటు పక్కకి తిరక్కుండా చెప్పాడు. "నేను దీన్ని శుభ్రం చెయ్యాలి."

"ఉహ్హూఁ." ప్లూజ్నికొవ్ సంకోచించి, సందిగ్ధంగా జోడించాడు. "నువ్వు నాయకత్వం తీసుకో."

"చీకటిగా వున్న చోట చొరుచుకెళ్లడం అంత మంచిది కాదు" సార్జెంట్ సలహా యిచ్చాడు. "కొన్ని గ్రెనేడ్లు విసరండి."

"నాతో ఆర్గురు రండి. గ్రెనేడ్లు తీసుకోండి!" ప్లూజ్నికొవ్ ఆజ్ఞాపించి పొడుగుపాటి హేండిలు వున్న అపరిచితమైన గ్రెనేడ్‌ను తనొకటి తీసుకున్నాడు.

సైనికులు మౌనంగా గోడవారనున్న గుట్టలోంచి గ్రెనేడ్లు తీసుకున్నారు. ప్లూజ్నికొవ్ మురికి బ్రా వేసుకున్న స్త్రీ వంక చూసి, తటాలున మళ్లీ ముఖం తిప్పేసుకున్నాడు.

"ఏదో చూసి కప్పుకోండి. ఇక్కడ గాలులు కొడుతున్నాయి."

స్త్రీలు భయపడినట్టు కనిపించారు, కాని ఏమీ అనలేదు. గుంద్రటతల విదూషకుడు ఒక సూచన చేశాడు.

"టేబిలుమీద ఎర్ర గుడ్డ వుంది. బహుశా అది యిస్తే సరిపోతుందేమో?" ఆజ్ఞ కోసం వేచిచూడకుండా దాన్ని తెచ్చేందుకు అతను పరుగెత్తాడు.

"నేలమాళిగల్లోకి దోవ చూపించు" ఫ్లాబ్నికొవ్ సరిహద్దు గస్తీ సైనికుడ్ని అడిగాడు.

మెట్లు చీకటిగా, యిరుగ్గా, చాలా నిటారుగా ఉన్నాయేమో ఫ్లాబ్నికొవ్ కొన్ని సార్లు ఊతం తప్పి పడబోయి తన ముందున్న సరిహద్దు గస్తీ సైనికుని భుజం పట్టుకుని పడిపోకుండా నిలబడ్డాడు. ఆ సైనికుడు విసుగ్గా ఊగేవాడు గాని, ఏమీ అనేవాడు కాదు.

వాళ్లు క్రిందకు దిగే కొద్దీ విమానాల రొదా, తెరెస్పోల్ గేటు దగ్గర పడిన బాంబు దాడి తర్వాత వెంటనే ప్రారంభించిన కాల్పుల శబ్దమూ మరింత మందంగా వినిపించ సాగాయి. క్రిందికెళ్లిన కొద్దీ మరింత గాఢంగా ఉన్న నిశ్శబ్దంలో వాళ్ల పాదధ్వని మరింత బిగ్గరగా మ్రోగసాగింది.

"మనం పెద్ద సద్దు చేస్తున్నాం" సాల్నికొవ్ మెల్లగా అన్నాడు. "వాళ్లు శబ్దం వంక కాల్పులు జరపచ్చు."

"ఇదిగో ఆ ఆడాళ్లున్న చోటు యిదీ" సరిహద్దు గస్తీ సైనికుడు ఆగి, అన్నాడు. "ఇక్కడనుంచి నేనింక ముందుకెళ్లలేదు!"

"నిశ్శబ్దం" ఫ్లాబ్నికొవ్ అన్నాడు. "వినండి."

వాళ్లు ఊపిరి బిగబట్టారు. ఎక్కడో దూరాన కాల్పులు ఢాంఢాం అంటూ మ్రోగు తున్నాయి — కాని యిక్కడ అవి నిరుపద్రవకరంగా — సినిమాలో కాల్పుల మాదిరిగా — వినవస్తు న్నాయి. క్రమంగా చీకటికి వాళ్ల కళ్లు అలవాటుపడిన కొద్దీ, కమాన్ల ఆకారాలు, నల్లగా తెరుచుకున్న ద్వారాల నోళ్లూ, మరికొంచెం తెల్లని మచ్చల్లా వున్న ఫిరంగి కంతలూ కళ్లముందు ఆకృతిదాల్చసాగాయి.

"ఎన్ని దోవలున్నాయి?" ఫ్లాబ్నికొవ్ గుసగుసగా అడిగాడు.

"మూడనుకుంటాను."

"నువ్వు నేరుగా ముందుకెళ్లు. ఇద్దరు ఎడమపక్కకెళ్లండి, నేను కుడిపక్కకి వెళ్తాను. ఒకళ్లిక్కడ యీ ప్రవేశం దగ్గర నిలబడతారు. సాల్నికొవ్, నువ్వు నావెంటరా."

అంతులేనట్టుగా వున్న విలువంపు పైకప్పు నేలమాళిగలో వాళ్లిద్దరూ చాల సేపు అటూ ఇటూ తిరిగారు. మధ్యమధ్య శబ్దమేమైనా వినవస్తుందేమోనని ఆగి వింటూవచ్చారు, కాని తొందరతొందరగా తాము పీల్చుకొనే ఊపిరిశబ్దం తప్ప వాళ్లకి మరేమీ వినరాలేదు.

"ఇక్కడేమన్నా ఎలకలుండి వుంటాయా అని?" వాటి పట్ల తన భయాన్ని రెండో

వాడు గ్రహించకుండా ఉండేందుకుగాను, తన ప్రశ్న సాధ్యమైనంత యథాలాపంగా కనిపించేలా తంటాలుపడి ప్ల్యాజ్నికొవ్ అడిగాడు.

"తప్పకుండా" సాల్నికొవ్ గుసగుసగా బదులు చెప్పాడు. "నాకీ చీకటిలో బెంబేలెత్తిపోతోంది కామ్రేడ్ లెఫ్టినెంట్."

ప్ల్యాజ్నికొవ్‌కి కూడా చీకటి అంటే భయమే, కాని ఆ విషయాన్ని తన మనస్సులో తను ఒప్పుకునేందుకు సైతం అతను సిద్ధపడలేదు. అది పరమ అహేతుకమైన భయం — బాగా దాక్కున్న శత్రువుతో ఆకస్మిక సమాగమానికి సంబంధించిన భయంగాని, అంధకారంలోంచి ఆకస్మికంగా జరిగే కాల్పులకు సంబంధించిన భయంగాని కాదది. ఎలకలకూ, రాకాసి సాలీళ్లకూ, లేక కాళ్లకింద కరకర నలిగే కంకాళాలకూ సంబంధించిన బూచి అది: అతనా అంధకారంలో బిగించిన వింటినారి అంతగా బిగిసిపోయి తడువుకొంటూ ముందుకు సాగాడు, మరికొంచెం ముందుకెళ్లిన తర్వాత "ఆడాళ్లు భ్రమపడివుంటారు, మనమింక వెనక్కి పోదాం" అన్నప్పుడు అతని మనస్సు ఎంతగానో తేలికపడింది.

మెట్ల దగ్గర గుండ్రటితల యువకుడు, ఒక గ్రూపు అప్పటికే ఏమీ కనిపించక పైకి వెళ్లిపోయారనీ, కాని సరిహద్దు గస్తీ సైనికుడింకా వెనక్కి తిరిగిరాలేదనీ చెప్పాడు.

ప్ల్యాజ్నికొవ్ పైకెక్కినకొద్దీ, అతనికి ప్రేలుళ్లు మరింత స్పష్టంగా వినవచ్చాయి. ఆడాళ్లు నేలమాళిగ మార్గం దగ్గర నిలబడివున్నారు. విమానాలు మళ్లీ బాంబులు కురిపిస్తున్నాయి. ప్ల్యాజ్నికొవ్ ఆ దాడి నిలిచిపోయేదాకా అక్కడే నిలబడ్డాడు. నిశ్శబ్దం ఆవరించాక సైనికులు నేలమాళిగలనుంచి బైటకు వచ్చారు.

"కింద ఓ దోవ వుంది" సరిహద్దు గస్తీ సైనికుడు చెప్పాడు. "కారు చీకటిగా, భయానకంగా ఉందది."

"ఎవళ్లేనా జర్మన్లు కనిపించారా?"

"నే చెప్పాను కదా అక్కడ కటిక చీకటిగా ఉంది. నేనో గ్రెనేడ్ విసిరేశాను, కాని ఎవరి అరుపులూ వినిపించలేదు.

"ఆడాళ్లు ఊరికే భయపడి బెదిరిపోయి ఏదేదో ఊహించుకుని ఉంటారు" గుండ్రటితల యువకుడు అన్నాడు.

ద్వారందగ్గరున్న భారీ మెషీన్ గన్ను అకస్మాత్తుగా గర్జించనారంభించింది, ప్ల్యాజ్నికొవ్ దాని దగ్గరకు పరుగెత్తాడు.

అర్ధ నగ్నంగా వున్న సార్జెంటు కాలుస్తున్నాడు, మరో సైనికుడు అతనికి తూటాల బెల్టులు అందిస్తున్నాడు. బులెట్లు యిటుక పెచ్చులను రేగగొట్టి, గొట్టం ముందు ధూళిని రేపుతున్నాయి, షీల్డుమీద ఖంగున మోగుతున్నాయి. ప్ల్యాజ్నికొవ్ కిందవదుకుని మెషీన్ గన్ దగ్గరకి పాక్కుంటూ వెళ్లాడు.

"జర్మన్లా?"

"కిటికీలు!" సార్జెంటు కోపంగా అరిచాడు. "కిటికీలు కాపాడండి!"

ఫ్లాజ్నికొవ్ వెనక్కు పరుగెత్తాడు. మిగిలిన సైనికులు అప్పటికే కిటికీల దగ్గర స్థావరాలు తీసుకున్నారు. అతను తను మొదట్లో ప్రవేశించిన కిటికీ దగ్గరకు వెళ్ళాడు. మృత సరిహద్దు గస్తీ సైనికుడు యింకా కిటికీ గడపపైన వ్రేలాడుతూనే వున్నాడు; ఫ్లాజ్నికొవ్ బయటకు చూస్తున్నప్పుడు మృతుని తల అతని డొక్కల్లో గుచ్చుకుంటోంది.

గచ్చకాయ ఆకుపచ్చ రంగు యూనిఫారాలు ధరించిన ఆకారాలు పరుగెత్తుతూ, సబ్‌మెషీన్ గన్నులు పట్టుకొని పరుగెడుతూనే కాల్పులు సాగిస్తూ, చర్చి వైపు వస్తున్నాయి. ఫ్లాజ్నికొవ్ తటాలున సేఫ్టీ కాచ్‌ని లాగేసి చాలా సేపు కాల్చాడు. సబ్‌మెషీన్ గన్ను అతని చేతిలో సజీవ వస్తువు మాదిరిగా ఎగిరెగిరిపడుతోంది.

అతను కాలుస్తూనే వున్నాడు, ఆ ఆకృతులు పరుగెత్తుతూనే వున్నాయి, అతని ఉద్రిక్తనయనాలకు వాళ్ళు తిన్నగా తన మీదకే వస్తున్నట్లు కనిపించాయి. బుల్లెట్లు యిటుక కట్టడాన్నీ, మృత సరిహద్దు గస్తీ సైనికునీ తాకుతున్నాయి, గస్తీ సైనికుని చిక్కని రక్తం ఫ్లాజ్నికొవ్ ముఖమంతటా చిమ్మింది, కాని దాన్ని తుడుచుకునేందుకు అతనికి వ్యవధి చిక్కలేదు, తూటాల బెల్టు మార్చుకునేందుకు గోడవార వంగినప్పుడు మాత్రమే అతను ముఖాన్ని కొంచెం రుద్దుకోగలిగాడు.

అటు తర్వాత — నిశ్శబ్దం, అక్కడిక జర్మన్లెవరూ లేరు. కాని అతను చుట్టూ కలియజూసే లోగా, ద్వారం దగ్గర పరిస్థితి ఎలా వుందనీ, తూటాలేమైనా మిగిలాయా అనీ అడగగలిగేలోగా ఆకాశం మళ్లీ గర్జించింది, బాంబుల మొయ్యోమన్న కూతలు ధూళి ధూమాలతో నిండిన గాలిని చీలుస్తున్నాయి.

అసలా రోజంతా తంతు అలాగే సాగింది. బాంబు దాడి సాగుతున్నంత సేపూ ఫ్లాజ్నికొవ్ తను ఉన్న చోటనే ఉండిపోయాడు, అతనా కమాను కిటికీ దగ్గరే కింద నేలమీద పడుకు న్నాడు, బాంబులు పేలినప్పుడల్లా సరిహద్దు గస్తీ సైనికుని మృత శిరస్సు అతనిపైన ఊగి సలాడుతూవచ్చింది. అటుతర్వాత విమానాలు తిరిగి వెళ్లిపోయినప్పుడు లేచి, పరుగునవస్తున్న ఆకారాలపై అతను కాల్పులు సాగించాడు. అతనిలో భయానుభూతి పూర్తిగా నశించిపోయింది, కాలజ్ఞానం బొత్తిగా లుప్తమైపోయింది. గళ్ళుపడిన అతని చెవులు గింగురుమంటూ హోరెత్తుతున్నాయి. పొడారిపోయిన అతని గొంతు వెలపరం మూలంగా గుర్రుమంటోంది. అల వాటులేని అతని చేతులు బిర్రుగా వున్న జర్మన్ సబ్‌మెషీన్ గన్ పట్టు మూలంగా తిమ్మి రెక్కాయి.

చీకటి పడ్డాకనే ప్రశాంతి ఏర్పడింది. జర్మన్లు తమ తుది బాంబుదాడి చేశారు, "యుంకర్" విమానాలు పొగలూ, మంటలూ ఎగజిమ్ముతున్న శిథిలాల పైన బర్రుమంటూ

వీడ్కోలు ప్రదక్షిణాలు చేశాయి. అటు తర్వాత చర్చి వంక ఎవరూ పరుగెత్తలేదు. గచ్చకాయ ఆకుపచ్చరంగుల యూనిఫారాలు ధరించిన ఆకారాలు ఛిన్నాభిన్నమైన నేలపై పడివున్నాయి. ఇద్దరింకా కదులుతున్నారు, దుమ్ములో పాకుతూ కనిపించారు, కాని ఫ్లూజ్నికోవ్ వాళ్ళని కాల్చలేదు. వీళ్ళు క్షతగాత్రులు, క్షతగాత్రులను కాల్చడం సైనికధర్మానికి విరుద్ధం. తమ చేతులు నేలకు ఆన్చి వాళ్ళు పాకుతూండటం అతను చూశాడు, అయినా తనకు వాళ్ళపట్ల జాలిగాని, కనీసం జిజ్ఞాసతో కూడిన ఆసక్తి గాని కలుగకపోవడం — పరమ అనాసక్తితో కూడిన, అలసటతో కూడిన నిదురమత్తు తప్ప మరేదీ కలగకపోవడం అతనికి ఉద్రేకరహితమైన ఆశ్చర్యాన్నే కలిగించింది.

అతను కోరుకున్నదల్లా, ఆ క్షణాన అక్కడే, పడుకోవడం, కళ్ళు మూసుకోవడం. ఒక్క క్షణ కాలం. కాని ఆ ఒక్క క్షణం కూడా అతను తన విశ్రాంతి కోసం వినియోగించుకోలేకపోయాడు. ప్రాణాలతో ఇంకెంతమంది మిగిలారో, తూటాలను ఎక్కడనుంచి తెచ్చుకోవాలో అతనింకా తెలుసుకోవలసివుంది. అతను సేఫ్టీ కాచ్‌ని తగిలించి ద్వారం దగ్గరకు ఊగుతూ వెళ్ళాడు.

"ఇంకా బతికే వున్నారా?" సార్జెంటు అడిగాడు. అతను గోడవార కాళ్ళు పారజాపుకుని కూర్చున్నాడు. "బాగుంది. కాని తూటాలు అయిపోయాయి."

"మనకిప్పుడు. ఎంతమంది వున్నారు?" అంటూ ఫ్లూజ్నికోవ్ అతని పక్కన దభాలున చదికిలబడ్డాడు.

"గాయపడనివాళ్ళు అయిదుగురు, గాయపడినవాళ్ళు ఇద్దరు. చూస్తే ఒకడికి రొమ్ములో బులెట్ దూరినట్టుంది."

"మరి సరిహద్దు గస్తీ సైనికుడో?"

"తన స్నేహితుడ్ని పూడ్చి వస్తానన్నాడు."

ఆ సైనికులు మౌనంగా, మసి ముఖాలతో, గుంట కళ్ళతో నెమ్మదిగా గుమి కూడారు. సాల్నికొవ్ ఫ్లాస్కుకేసి చెయ్యిచాపాడు.

"నాకు లోపలంతా భగభగ మండిపోతోంది."

"దాన్ని అక్కడ వదిలెయ్యి" సార్జెంట్ అన్నాడు. "నీళ్ళు మెషీన్ గన్నుకి కావాలి."

"తూటాలు లేవుకదా."

"సంపాదిస్తాం."

సాల్నికొవ్ ఫ్లూజ్నికొవ్ పక్కన చదికిలబడి పొడారి బీటలు దీసిన తన పెదవులను నాలుకతో తడుపుకున్నాడు.

"బుగ్ నది దగ్గరకెళ్ళేందుకు నేను ప్రయత్నిస్తే ఎలా వుంటుంది?"

"లాభం లేదు, నువ్వక్కడికి చేరుకోలేవు" సార్జెంట్ అన్నాడు. "తెరెస్పోల్ గేటు పక్కనున్న బురుజును జర్మన్లు ఆక్రమించుకున్నారు."

సరిహద్దు గస్తీ సైనికుడు వచ్చాడు, మౌనంగా గోడవార కూర్చున్నాడు, మౌనంగానే సార్జెంటు అందిచ్చిన సిగరెట్టు పీక అందుకున్నాడు.

"అతన్ని పూడ్చేశావా?"

"ఆఁ." అతను నిట్టూర్చాడు. "'ఏడ నా సమాధుందో ఎవరు చెప్పగలరు' – అన్న పాట నాదిరిగా వుంది."

నిశ్శబ్దం, కృంగదీసే నిశ్శబ్దం. తూటాలు, మంచినీళ్లు, దుర్గ సేనాధిపతితో సంబంధం పెట్టుకోవడం – యీ అవసరాలను గూర్చిన ఆలోచనలు ప్లూజ్నికొవ్ మనస్సులో మెదిలాయి, కాని మొత్తంమీద అవి అనిర్దిష్టంగానే ఉండిపోయాయి, అతనీ అవసరాలను మనస్సులో గుర్తుంచుకున్నాడంతే. అతను వీటికి బొత్తిగా సంబంధం లేనిదేదో మాట్లాడాడు.

"మనవాళ్లు రావడానికి చాలా ఆలస్యంచేశారే."

"ఎవరు?" సరిహద్దు గస్తీ సైనికుడు అడిగాడు.

"అదే, మన సైన్యం. మనకిక్కడొక సైన్యం ఉంది కదా?"

ఎవరూ జవాబివ్వలేదు. చిట్టచివరకు సార్జెంట్ అన్నాడు:

"బహుశా వాళ్లు రాత్రిపూట చొరుచుకుని వస్తారేమో. లేకపోతే, నూటికి తొంభై వంతులు తెల్లవారుజామున రావచ్చు."

అందరూ దీన్ని మౌనంగా ఆమోదించారు. ఔను, సైనిక దళాలు తెల్లవారుజామున చొరుచుకుని వచ్చి తమను చేరుకుంటాయి. ఇంతకీ యిది కాలానికి సంబంధించిన విషయం, రాత్రిందివాలమధ్య సరిహద్దు రేఖ, దీన్ని గురించి గాఢంగా విశ్వసించడానికీ, అంతదాకా నిలిచివుండేందుకూ అస్కారం కలిగించే నిర్దిష్టాంశమిది. ప్రత్యూషం దాకా.

"తూటాలు – " ప్లూజ్నికొవ్ కష్టంమీద అనగలిగాడు. "మనకి తూటాలు ఎక్కడ దొరుకుతాయి? స్టోర్సు ఎక్కడో ఎవరికి తెలును?"

"బ్యారక్సులో వాళ్లకి తెలుస్తుంది" సార్జెంటు అన్నాడు. "మనమెలాగైనా అక్కడికెళ్లాలి. అక్కడ 84వ రెజిమెంటుతో ఓ కమిస్సారున్నాడన్నారు."

"ఆయన్ని ఆజ్ఞలిమ్మని అడగొచ్చు" చిగురించిన ఆశతో ప్లూజ్నికొవ్ అన్నాడు. "తూటాల సంగతి కూడా అడగొచ్చుననుకోండి."

"అదెలాగూ అడుగుతాం" భారంగా లేస్తూ సార్జెంటు అన్నాడు. "నాతో రా, ప్రిజ్న్యాక్."

ఎక్కడోగాని ధన్‌మంటూ ప్రేలింది, ఆ వెంటనే సబ్‌మెషీన్ గన్నుల కాల్పులు వరుసగా కొంతసేపు వినవచ్చాయి. సార్జెంటూ, రిజర్వు సైనికుడూ ధూళిమేఘంలో అదృశ్యమయ్యారు.

''మనం నీళ్లు సంపాదించుకోవాలి'' బాధాజనితమైన తెగువతో తన పెదవులు తడుపుకుంటూ సాల్నికొవ్ అన్నాడు. ''బుగ్ నది దగ్గరకో, లేకుంటే ముహవేత్స్ నది దగ్గరకో నన్ను వెళ్లనివ్వండి కామ్రేడ్ లెఫ్టినెంట్.''

''అది దూరమా?''

''నేరుగా వెళ్తే అది దగ్గరే'' సరిహద్దు గస్తీ సైనికుడు చిరునవ్వు నవ్వాడు. ''కాని నేరుగా వెళ్లడమన్నదే, సరిగా యిప్పుడు, మనం చెయ్యలేం. అయినాకూడా మనకి నీళ్ళు కావాలి.''

''సరే, అయితే ప్రయత్నించు.'' అకస్మాత్తుగా ప్లూజ్నికొవ్‌కి తట్టింది — అయినా తనెలాంటి కమాండరు? అన్ని సమస్యలూ సార్జెంటు చేతనైనా పరిష్కరింపబడుతున్నాయి, లేకపోతే ఆ చామనచాయ సరిహద్దు గస్తీ సైనికుని చేతనైనా పరిష్కరింపబడుతున్నాయి; కాని దాన్ని గురించి అతను ప్రశాంతంగా ఆలోచించాడు, ఎందుకంటే దాన్ని గురించి సంకటపడినా, కలత చెందినా ఎక్కువ శక్తిని వ్యయంచెయ్యాల్సి వుంటుంది — సరిగా తనకి యిప్పుడు అదే లేదు. ''అయితే, భద్రం సుమా.''

''అలాగే!'' సాల్నికొవ్ హుషారుగా అన్నాడు. ''ఆ జర్మన్ నీళ్లు నేను తాగేసి, ఆ ఫ్లాస్కుల్లో నీళ్లు ముంచితే మంచిదేమో కదూ?''

''నీకు నీళ్లు దొరక్కపోతే?'' చేతికి చిన్న గాయమైన గుండ్రతల విదూషకుడు అడిగాడు.

''ఖాళీ ఫ్లాస్కులు తీసుకెళ్లు. వోడ్కా పారపోసెయ్యి.''

''అన్నీ పారపొయ్యకు'' సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు. ''గాయాలు శుభ్రంచేసేందుకు ఒకటి ఉండనియ్యి. ఫ్లాస్కులు ఒకదానికొకటి కొట్టుకుని చప్పుడు కాకుండా చూడు.''

''చప్పుడు కాకుండా నేను చూస్తా కదా.'' సాల్నికొవ్ ఫ్లాస్కులను తన బెల్టుకి బిగించుకొంటూ అన్నాడు. ''సరే, నే పోతున్నాను. నదిలో నీళ్లన్నీ ఆపోశన పట్టేస్తాను.''

ఫిరంగి గుళ్ల గుంటల మధ్య కినుమరుగవుతూ అతను కూడా మాయమయ్యాడు. జర్మన్లు మధ్యమధ్య కాల్పులు సాగిస్తూ వుండటంతో అడపాదడపా కాల్పులింకా వినిపిస్తున్నాయి.

''జర్మీగాళ్లు టీ తాగుతూ వుండివుంటారు'' గుండ్రతల సైనికుడు అన్నాడు. ''నిన్నటి రోజున మనం యిక్కడ సినిమా చూశాం, తమాషాగా లేదూ.''

ఇదే చర్చిలో తను చూసిన సినిమాను గురించే అతను ఉద్దేశించాడో, లేక జర్మన్లు టీ తాగడాన్ని గురించే ఉద్దేశించాడో తెలియదు. కాని నిన్నటి రోజు శాశ్వతంగా వెళ్లిపోయిందన్న భావం, రేపు తిరిగి యుద్ధం ప్రారంభమవుతుందన్న భావం మనస్సులో కలుక్కుమంది. ప్లూజ్నికొవ్‌కి కూడా యీ భావం కలుక్కుమనక పోలేదు, కాని అతను ఆ స్మృతులన్నింటినీ మనస్సునుంచి తరిమేసి, తనను తను కూడదీసుకొని నిలబడ్డాడు.

''మనం శవాలను – బహుశా ఆ మూలకి – తరలించాలి.''

''మనం జర్మన్లని సోదా చెయ్యాలి'' సరిహద్దు గస్తీ సైనికుడన్నాడు. ''ఏమంటారు కామ్రేడ్ లెఫ్టినెంట్?''

కమాండరుగా తను చర్చిని విడిచివెళ్ళకూడదని ప్ఫ్లాజ్నికొవ్‌కి తెలుసు, కాని బాల్య చాపల్యంతో కూడిన ఒక రకమైన జిజ్ఞాస తిరిగి అతనిలో తలెత్తింది. తన కాల్పులకు గురై, యిప్పుడక్కడ మట్టిలో పొర్లుతున్నవాళ్ళని దగ్గర్నుంచి చూడాలన్న వాంఛ, ఆ దృశ్యాన్ని తన మనోఫలకంపై ముద్రించుకొని, తర్వాత దాన్ని తన తల్లికీ, చెల్లెలికీ, వాల్యాకీ చెప్పాలన్న వాంఛ అతనిలో ప్రకోపించింది.

''కలిసి వెడదాంపద.''

అతను తన సబ్‌మెషీన్ గన్నుని మళ్ళీ లోడ్‌చేశాడు, తన గుండె ధన్‌ధన్మున కొట్టుకొంటూండగా, ఛిన్నాభిన్నమైయున్న ఆవరణలోకి, సరిహద్దు గస్తీ సైనికుని అనుసరించి వెళ్ళాడు.

దుమ్ము యింకా అణగలేదు, బూడిదలా మెత్తగా వున్న దుమ్ము అతని ముక్కులోకీ, కళ్ళలోకీ వెళ్ళి, అవి దురద పెట్టడం, నీళ్ళు కారడం మొదలుపెట్టి, అతని చూపుకి అవరోధం కలిగించాయి. అతను అస్తమానం కళ్ళు చికిలించి, మధ్యమధ్య కంటితడి ఒత్తుకోవలసి వచ్చింది.

''సబ్‌మెషీన్ గన్నులు తీసుకోకండి'' సరిహద్దు గస్తీ సైనికుడు గుసగుసగా చెప్పాడు. సబ్‌మెషీన్ గన్ తూటాలూ, గ్రెనేడ్లూ మాత్రమే తీసుకోండి.''

అక్కడ చాలమందే చచ్చి పడివున్నారు. వాళ్ళని ముట్టుకోడానికి మొదట్లో అతనికి వెలపరం పుట్టింది, అందుకని వాళ్ళ బెల్టులు పట్టుకొని కదిపేందుకు ప్రయత్నించాడు, కాని త్వరలోనే ఆ వెలపరానికి అలవాటు పడ్డాడు. అతను తన సైనిక కోటు జేబుల్లో గ్రెనేడ్లూ, ముందు అంచుల్లో సబ్‌మెషీన్ గన్ తూటాలూ నింపుకున్నాడు. ఇక వెనక్కి వెళ్ళిపోవలసిన తరుణం ఆసన్నమైంది, కాని ఒక రకమైన తప్పించుకోలేని ఆకర్షణ – యిక్కడ, యిక్కడే తనకు బాగా అవసరమైనది, పరమావశ్యకమైనది దొరుకుతుందన్న ఆకర్షణ – అతన్ని తదుపరి కళేబరం దగ్గరకి పట్టి లాగింది. వెలపరం పుట్టించే మందుగుండు కంపుకి అతను అలవాటుపడ్డాడు, ఆరోజున, ధూళితో నిండిన, ఛిద్రమైన ఆ నేలపై కాల్వలుగా పారిన విదేశీయ రక్తం అతని ఒళ్ళంతటా అంటింది.

''ఇతనెవరో ఆఫీసరు'' సరిహద్దు గస్తీ సైనికుడు వినిపించీ వినిపించనట్లు అన్నాడు. ''నేనితని పత్రాలు తియ్యనా?''

''తియ్యి.''

అతి దగ్గర్లో వున్న ఫిరంగి గుండు గుంటలో ఒక మూలుగు – సుదీర్ఘమైన, వేదనా

భరితమైన మూలుగు — వినవచ్చింది. ప్లూజ్నికోవ్ మాట్లాడటం మానేసి, నేలమీదకి వంగి, చుట్టూ కలియజూసి, తర్వాత మళ్లీ ముందుకు బయల్దేరాడు; ఆ మరుసటి క్షణమే కళ్లు చీకట్లు కమ్మే వెలుతురు కనిపించింది, ఒక బులెట్ అతని ఉక్కు శిరస్త్రాణానికి ఠంగున తగిలింది. అతను తన కళ్లను అదే పనిగా నులుముకుంటూ నేలకి కరుచుకున్నాడు — తన కేమీ కనిపించకపోవడాన్ని బట్టి తన కళ్లు దెబ్బతిన్నాయేమోనని అతనికి అనిపించింది.

"ఒరి, దొంగ లంజాకొడకా!"

అది సరిహద్దు గస్తీ సైనికుని స్వరం. ప్లూజ్నికోవ్‌ను పక్కకు నెడుతూ అతను బాంబు గుంటలోకి జారాడు. తర్వాత దెబ్బల శబ్దం — దభీదభీమన్న శబ్దం, మనిషి కండల తాకిడికి మందగించిన ఏహ్యమైన శబ్దం, అమానుష్యమైన కేక — క్రమంగా గురగురగా దిగనాసిల్లిపోయిన శబ్దం — వినవచ్చింది.

"ఏయ్ అలాంటి పిచ్చిపని చెయ్యకు!" బలవంతాన నీరుకారుతున్న కళ్లు తెరిచి, ప్లూజ్నికోవ్ అరిచాడు.

చెమటలు కారుతూ, మెలిదిరిగిన ఒక ముఖం అతనికి లీలగా కనిపించింది.

"పిచ్చిపనా? నా సహచరుణ్ణి చంపాడు — నేను వాడి ఒంటిమీద చెయ్యి వెయ్య కూడదా? నిన్ను చంపేందుకు ప్రయత్నించాడు — నేను మాత్రం వాడిని ముట్టుకోకూడదా? ఏయ్ కుర్ర సన్నాసీ, ఆ ఫాసిస్టు పందులు రోజంతా మనల్ని చిత్రవధ చేశారు, అయినా నేను మాత్రం వాళ్లని ముద్దుపెట్టుకోవాలంటావు, అంతేనా?" అతను ప్లూజ్నికోవ్ దగ్గరకు భారంగా అడ్డదిడ్డంగా చేరి, రొప్పుతూ కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు.

"నేను వాణ్ణి చంపేశాను. నిన్ను వాడు గాయపరిచాడా?"

"ఉండేలు దెబ్బలా తగిలింది గుండు — శిరస్త్రాణంమీద. నా చెవులు గింగురు మంటున్నాయి."

"నడవగలవా?"

"తల యింకా తిరిగిపోతోంది."

దగ్గర్లో ప్రేలుడు వినిపించింది, వాళ్లిద్దరూ నేలకి కరుచుకున్నారు, పెద్దపెద్ద మట్టిపెళ్లలు వాళ్ల భుజాలకు తాకాయి.

"శబ్దం వస్తున్నవైపు గురిచూస్తున్నట్టున్నారు, ఔనా?"

మరో గుండు పేలింది, వాళ్లు మళ్లీ నేలకి కరుచుకున్నారు, అప్పుడు చెంగున లేచి చర్చి దిశగా పరుగుతీశారు — ముందు పరిగెడుతున్న సరిహద్దు గస్తీ సైనికుడు, కళ్లు కన్నీరు కారుతూ మండుతున్న కారణంగా ప్లూజ్నికోవ్‌కి అస్పష్టంగా మాత్రమే కనిపిస్తున్నాడు.

సార్జెంటు అప్పటికే వెనక్కి తిరిగివచ్చాడు. మొత్తంమీద వాళ్లకి నాలుగు పెట్టెల

తూటాలు దొరికాయి, వాళ్లిప్పుడు వాటిని బెల్టుల్లోకి నింపేందుకు పూనుకున్నారు. ఆయుధాలు పోగుచెయ్యమనీ, సిగ్నల్ సర్వీసును ఏర్పాటుచెయ్యమనీ, ఆడాళ్లనూ, పిల్లలనూ బాగా లోతుగా వున్న నేలమాళిగల్లోకి చేర్చమనీ ఆజ్ఞలు జారీ అయ్యాయి.

"మన ఆడాళ్లు 333వ రెజిమెంటు బ్యారక్సుకి పరుగెత్తుకొని వెళ్లిపోయారు" సార్జెంటు చెప్పాడు.

"మరి మన ఆజ్ఞలేమిటి?"

"మన కర్తవ్యం స్పష్టమే: చర్చి. కొందరు సైనికుల్ని మనకి సాయంగా పంపుతామని వాగ్దానం చేశారు. హాజరు తీసుకున్నాక."

"పట్నంనుంచి ఏమన్నా వార్తలొచ్చాయా?" గుండ్రటితల సైనికుడు అడిగాడు. "ఏమైనా సహాయం వస్తోందటనా?"

"ఎదురుచూస్తున్నారట" సార్జెంటు ముక్తసరిగా చెప్పాడు.

అతని స్వరాన్ని బట్టి, 84వ రెజిమెంట్ కమిస్సారుకి సహాయం వస్తుందన్న ఆశ ఏమీ లేదని ప్లూజ్నికొవ్ గ్రహించాడు. అతని మోకాళ్ల పట్టు సడలుతున్నట్లనిపించాయి, కడుపు నొచ్చింది, మరి అతను ఉన్న చోట ఉన్నట్టు — సార్జెంటు పక్కన నేలపైన చదికిలబడిపోయాడు.

"కొద్దిగా బ్రెడ్డు నములు." సార్జెంటు ఓ ముక్క పీకి యిచ్చాడు. "ఇది తీసుకుంటే నీకు కొంచెం తేలిగ్గా వుంటుంది, కామ్రేడ్ లెఫ్టినెంట్."

ప్లూజ్నికొవ్‌కి తిండి తినాలని లేదు, కాని అతను యాంత్రికంగా ఆ బ్రెడ్డు ముక్క తీసుకుని, యాంత్రికంగానే దాన్ని నమిలాడు. అంతకుముందు చివరిసారి అతను తిండి తిన్నది రెస్టారెంటులో, అబ్బే కాదు, యిదంతా ప్రారంభమయ్యేందుకు సరిగా ముందు ఏదో ఒక స్టోరు గదిలో, ఆ కుంటి అమ్మాయితో కలిసి తను టీ తాగుతున్నాడు. ఆ స్టోరు గది, ఆ యిద్దరు స్త్రీలు, ఆ కుంటి అమ్మాయి, ఆ మగాళ్లు అంతా మొట్టమొదటి ఫిరంగి దెబ్బలకే కప్పడిపోయారు. అది యిక్కడే ఎక్కడో చాలా దగ్గర్లోనే ఉండాలి. చర్చికి అదెంతో దూరంలో లేదు. కాని తన అదృష్టవంతుడు, తను బయటకు పరుగెత్తి వెళ్లిపోయాడు. తను అదృష్టవంతుడు....

బాగా అలంకరింపబడిన నూత్న సంవత్సర వృక్షం మాదిరిగా, తన ఒంటికి చుట్టూ ఫ్లాస్కులు వేలాడదీసుకుని సాల్నికొవ్ వచ్చాడు.

"నేను కడుపార తాగేశాను!" అతను బడాయిగా చెప్పాడు. "రండి కుర్రాళ్లూ, మీరు కూడా కడుపార తాగండి!"

"మొట్టమొదట మెషీన్ గన్నుకి" సార్జెంట్ అన్నాడు.

ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా, అతి జాగ్రత్తగా, మెషీన్ గన్ జాకెట్టును భర్తీగా నింపాడు, కడుపారా తాగకుండా ఆంక్ష పెట్టమని ప్లూజ్నికొవ్‌కి చెప్పాడు. ప్లూజ్నికొవ్

నిరుత్సాహంగా ఆమోదించడంతో సార్జెంటే స్వయంగా ఒక్కొక్కరికి మూడేసి గుక్కల చొప్పున తనే మంచినీళ్లిచ్చి, ఫ్లాస్కులను జాగ్రత్తగా పక్కకి పెట్టేశాడు.

"వాళ్లక్కడ వాళ్లని ఊచకోత కోసేస్తున్నారు — భయంకరంగా ఉందనుకోండి" సాల్నికొవ్ నిస్సంకోచమైన సంతృప్తితో చెప్పాడు. "వాళ్లొక రాకెట్టును పైకి పంపడం, ధన్‌ధన్‌మని కాల్చడం! అంతే, దానితో బోలెడుమంది గుంపుగా చచ్చి ఊరుకోవడం."

బాహాబాహీ పోరాటం, నీళ్లకోసం తన యాత్ర నిరపాయంగా విజయవంతంగా సాగడంతో అతనిలో భయం మటుమాయమైంది. అతను ఉత్సాహంగానే కాకుండా ఉల్లాసంగా కూడా ఉన్నాడు. అతని ఉల్లాసం చూస్తుంటే ఫ్యాల్జ్నికొవ్‌కి ఒళ్లుమండింది.

"పోయి, మనమిక్కడ చర్చి రక్షణలో నిమగ్నులమై వున్నామని మనవాళ్లకి చెప్పు. బహుశా వాళ్లు మనకి తూటాలేమైనా యివ్వగలరేమో."

"గ్రెనేడ్లు" సరిహద్దు గస్తీ సైనికుడు జోడించాడు. "జర్మన్ గ్రెనేడ్లు పట్టి పనికిమాలిన చెత్త."

"ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు, గ్రెనేడ్లు కూడాను."

ఓ గంట పోయాక ఓ పది మంది సైనికులొచ్చారు. ఫ్యాల్జ్నికొవ్ వాళ్లకి ఆదేశాలివ్వాలనీ, వాళ్లకి కిటికీల దగ్గర స్థావరాలు చూపాలనీ, సిగ్నల్సు ఏర్పాటుచెయ్యాలనీ అనుకున్నాడుగాని, అతని కళ్లింకా బాగా నీళ్లు కారుతూ, నీరసంగా ఉన్న కారణంగా అతను ఆ పనిని సరిహద్దు గస్తీ సైనికునికి అప్పగించాడు. తర్వాత ఓ నిమిషం అతను శరీరం వాల్చాడు, మరి నిద్ర వచ్చినప్పుడు ఎక్కడో పాతాళంలోకి కూరుకుపోయినట్లే అనిపించింది అతనికి.

అతనికి యుద్ధపు మొదటి రోజు ముగిసింది. దుమ్ముకొట్టుకొని వున్న చర్చి నేలపైన మూడంకెవేసి పడుకున్న అతనికి, తనకు ముందింకెన్ని రోజులున్నాయో తెలియనూ లేదు, తెలుసుకోనూ లేకపోయాడు. అతని పక్కనే పడుకుని, లేక ద్వారం దగ్గర పరిశీలిస్తూవుండిన మిగిలిన సైనికులకు సైతం, తమకింకెన్ని రోజులు భూమిమీద నూకలుండేదీ తెలుసుకోనూ లేదు, తెలుసుకోనూ లేకపోయారు. వాళ్లందరూ ఒకే రకమైన జీవితం గడిపారు, కాని ఎవడి చావు వాడిదే అవుతుంది.

2

ఎవడి చావు వాడిదే, కాగా మరుసటి రోజు చావును ఎదుర్కొనే మొట్టమొదటివాడు — చేతికి చిన్న గాయం తగిలిన — గుండ్రడతల కంపెనీ విదూషకుడయ్యాడు. అతను చాలా రక్తం కోల్పోయాడు, నిరంతరం నిద్రమత్తులో వున్నాడు, అందుకని యితరులు తనకు నిద్రాభంగం చెయ్యకుండా దూరంగా నేలమాళిగ ద్వారం దగ్గరకు పోయి పడుకున్నాడు.

ప్రత్యూషం ఫిరంగి కాల్పులతో ప్రారంభమైంది. భూమి మరోమారు మూల్గింది, చర్చి గోడలు ఊగిసలాడి, గిలాబా పెచ్చులూ, యిటుకలూ రాలాయి. సార్జెంటు మెషీన్ గన్నును విలువంపు పైకప్పుల క్రిందకి లాక్కొచ్చాడు, అందరూ మూలల్లో నక్కారు.

ఫిరంగులింకా గర్జిస్తూనే వుండగా మరోవంక బాంబరు విమానాలు ఆకాశాన్ని కమ్మాయి. చర్చి వూగిపోయింది. ఫ్లాజ్నికొవ్ తన అరచేతులతో చెవులు మూసుకొని ఒక కిటికీ గూడులో పడుకున్నాడు. తెరుచుకొని వున్న అతని నోట్లో వెచ్చని దుమ్ము నిండింది. ఒక కేక అతనికి వినిపించింది, కాదు, అనుభూతమైంది. నిరాశాపూరితమూ, అమానుషమూ అయిన కేక బాంబుల కూతలను, ఈలలను గర్జలను చీల్చుకొని వినవచ్చింది. అతను చుట్టూ చూశాడు. గుండ్రడతల సైనికుడు ధూళిధూమాల మధ్యనుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"జ – ర్మ – న్ల – ద్రో – హ్!"

ఈ కీచు అరుపు కొద్ది సేపు మ్రోగిన సబ్‌మెషీన్ గన్ కాల్పుల మూలంగా మధ్య లోనే నిలిచిపోయింది, ఆ కాల్పులు చర్చి కమాన్లకింద మ్రార్మోగాయి. పరిగెడుతున్న ఆ వ్యక్తి బండలు పరిచిన నేలమీద బొక్కబోర్లాపడటాన్ని ఫ్లాజ్నికొవ్ చూశాడు.

క్షణకాలం అతను స్తంభించిపోయాడు, తర్వాత అతను కూడా అరిచాడు: "జ – ర్మ – న్ల – ద్రో – హ్!"

ధూళిలో దాదాపు అదృశ్యంగా వున్న సబ్‌మెషీన్ గన్నర్లు బోర్ల పడుకొని వున్న సైనికుల్ని నేరుగా గురిచూసి కాలుస్తున్నారు. ఎవరో అరిచాడు. మరొకడు ద్వారంగుండా బయట బాంబులమధ్యకి ఉరికాడు, సమయస్ఫూర్తి కలిగిన యింకొకడు చర్చి వెనుక పక్క చౌరనశక్యంగా వున్న ధూళిధూమాల్లోకి అప్పుడే కాలుస్తున్నాడు. బులెట్లు నేలకి తగిలి కప్పగంతులేస్తున్నాయి, నెత్తిపైగా సంయ్‌సంయ్‌మంటూ ఎగురుతున్నాయి. కాని ఫ్లాజ్నికొవ్, చెవులకు చేతులాన్చుకొని, యింకా గోడవార పడుకొనే వున్నాడు, అతని సబ్‌మెషీన్ గన్ను యింకా అతని క్రిందనే వుంది.

"పరిగెత్తు!"

ఎవరో – సాల్నికొవ్ లాగున్నాడు – అతని భుజాన్ని కుదిపాడు.

"పరిగెత్తు, కామ్రేడ్ లెఫ్టినెంట్!"

ఫ్లాజ్నికొవ్ సాల్నికొవ్ వెంట కిటికీ గుండా దూకాడు, కింద పడ్డాడు, మోకాళ్లపై దేకుతూ, రొప్పుతూ, దుమ్ము మింగుతూ ఫిరంగిగుండు గుంటను చేరుకున్నాడు. విమానాలు క్రిందుగా దుర్గం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, కదులుతున్న ప్రతిదాన్నీ మెషీన్ గన్లతో హతమారుస్తున్నాయి. చర్చినుంచి సబ్‌మెషీన్ గన్ కాల్పులూ, అరుపులూ, గ్రెనేడ్ ప్రేలుళ్లూ వినవస్తున్నాయి.

"నేలమాళిగలు!" సాల్నికొవ్ అరిచాడు. "నేలమాళిగలకు పరుగెత్తు!"

కాల్పులు జరుగుతూండగా పరుగెత్తకూడదని ఫ్లూజ్నికొవ్ మనస్సులో చర్చించు కున్నాడు, కాని పొగతో నిండిన చర్చిలో తన సైనికులను కడతేరుస్తున్న సబ్ మెషీన్ గన్నర్ల పట్ల భయం ఎంత అధికంగా ఉన్నదంటే, అతను తటాలున లేచి చలాకీ అయిన సాల్నికొవ్ వెనక దూసుకుపోయాడు. అతను బోర్లా పడ్డాడు, యిసుకలో పాకుతూ, బాంబుగుంటల్లోంచి యింకా పైకి లేస్తున్న దుమ్మునూ, ఘాటైన పొగనూ మింగాడు, మళ్లీ లేచాడు, మళ్లీ పరుగెత్తాడు.

తను ఎలా ఓ చీకటి నేలమాళిగను చేరుకున్నదీ, దానిలోకి ఎలా పడినదీ తర్వాత అతను గుర్తుచేసుకోలేకపోయాడు. తను నేలమీద పడుకొని వుండగా, చీలికలూవాలికలైన సైనిక కోట్లు తొడుక్కున్న యిద్దరు సైనికులు తన భుజం పట్టుకొని కుదుపుతూండగా అతనికి స్పృహ వచ్చింది.

"కమాండరిక్కడున్నాడు! కమాండరు!"

అతని ముందు ఏనుగు గున్నలా వున్న, నల్లజుట్టు సీనియర్ లెఫ్టినెంటు నిలబడివున్నాడు. దుమ్ముకొట్టుకొని, చెమట చారికలతో వున్న అతని సైనిక కోటుపై సైనిక పతకం వుంది. ఫ్లూజ్నికొవ్ బలవంతాన లేచి నిలబడి, తనెవరో, యిక్కడికి తను రావడం ఎలా సంభ వించిందో చెప్పాడు.

"అంటే జర్మన్లు క్లబ్బును ఆక్రమించుకున్నారన్నమాట, అంతేనా?"

"క్రామేడ్ సీనియర్ లెఫ్టినెంట్, వాళ్లు వెనకపక్కనుంచి వచ్చారు. వాళ్లు నేలమాళిగలలో దాక్కొని వుండివుంటారు. మరి బాంబింగు జరుగుతున్న సమయంలో...."

"నిన్న మీరు నేలమాళిగలను పూరాగా ఎందుకు తనిఖీ చెయ్యలేదు? మీ వార్తాహరుడు మీరు చర్చిలోనే గట్టి స్థావరం తీసుకున్నారని చెప్పాడు." సీనియర్ లెఫ్టినెంటు గోడవారనున్న సాల్నికొవ్ వంక తలూపి సూచించాడు.

ఫ్లూజ్నికొవ్ బదులు చెప్పలేదు. దారుణమైన, అర్థరహితమైన ఆ భయం యిప్పుడు అతనిలో తొలగిపోయింది. తన విధినిర్వహణలో తను ఘోరంగా విఫలుడయ్యాడనీ, తను బెం బేలెత్తిపోయాడనీ, తన సైనికులను వాళ్ల కర్మకు వాళ్లను విడిచిపెట్టి, ఆరు నూరైనా, నూరైనా సరే కాపాడాల్సిందిగా తనకు అప్పగించబడిన స్థావరంనుంచి తను పిరికిపంద మాదిరిగా పారిపోయాడనీ యిప్పుడతను స్పష్టంగా గ్రహించాడు. సీనియర్ లెఫ్టినెంట్ స్వరం వెచ్చని సిగ్గు తరగలో కలిసిపోయింది.

"అదంతా నా తప్పే—"

"తప్పు అన్నది సరైన పదం కాదు, అదొక నేరం" సీనియర్ లెఫ్టినెంట్ కటువుగా అన్నాడు. "మిమ్మల్ని కాల్చెయ్యడం నా డ్యూటీ, కాని యిప్పుడు నాదగ్గర మందుగుండు కొరతగా వుంది."

“నేనీ పొరపాటు సరిదిద్దుకుంటాను.” ఫ్లాజ్నికొవ్ ఈ మాట బిగ్గరగా అనాలను కున్నాడు, కాని అతనికి డగ్గుత్తిక పడింది, దానితో ఆ మాటలు కేవలం గుసగుసగా వెలువ డ్డాయి. “నేనీ పొరపాటు సరిదిద్దుకుంటాను.”

అకస్మాత్తుగా అన్నీ ఆగిపోయాయి — ప్రేలుళ్ల గర్జులు, గుళ్ల మొయ్యోశబ్దం, మెషీన్ గన్నుల కటకట శబ్దం. అడపాదడపా యింకా రైఫిల్ కాల్పులు వినిపిస్తున్నాయి, భవనాల పై అంతస్తుల్లో మంటలు పెఠేలుపెఠేలుమంటున్నాయి. కాని పోరాటం చల్లబడింది. కారణం వివరించజాలని యీ ప్రశాంతి భయంకరంగా వుంది.

“బహుశా మనవాళ్లు వస్తున్నారేమో?” సైనికుల్లో ఒకడు సందిగ్ధంగా అడిగాడు. “బహుశా యిది ముగిసిపోయిందేమో?”

“ఇదో ఎత్తుగడ, దొంగ లంజకొడుకులు” సీనియర్ లెఫ్టినెంట్ అన్నాడు. “వెయ్యి కళ్లతో పరీక్షగా చూడాలి.”

ఆ సైనికుడు ఆజ్ఞ నిర్వర్తించేందుకు చలాకీగా పరుగెత్తాడు. అందరూ మౌనంగా ఉన్నారు, యీ నిశ్శబ్దంలో ఫ్లాజ్నికొవ్‌కి సన్నగా ఒక బిడ్డ ఏడ్పూ, స్త్రీల మృదుస్వరాలూ, ఎక్కడో నేలమాళిగల లోపలనుంచి వినవచ్చాయి.

“నేను సరిదిద్దుకుంటాను, కామ్రేడ్ సీనియర్ లెఫ్టినెంట్” అతను తొందరగా రెట్టించాడు. “ఇప్పుడే నేనా పని చేస్తాను —”

లౌడ్‌స్పీకర్లద్వారా విస్తరింపబడిన పెద్ద కంఠం అతని మాటలకు అడ్డంవచ్చింది. ఆ స్వరం — రష్యన్ స్వరం కాదు, మాటలు మహా జాగ్రత్తగా పట్టిపట్టి ఉచ్చరింపబడు తున్నాయి — పైన ఎక్కడో పొగలెగజిమ్ముతున్న శిధిలాలపైనుంచి వినవస్తోంది. కాని భారమైన గాలిలో ఆ శబ్దం చక్కగా తేలివచ్చి, అన్ని నేలమాళిగల్లోనూ, బురుజుల్లోనూ సుస్పష్టంగా వినిపిస్తోంది.

“అర్థరహితమైన మీ వ్యర్థ ప్రతిఘటనను విరమించుకోవలసిందిగా జర్మన్ సేనా ధ్యక్ష వర్గం మీకు విజ్ఞప్తిచేస్తోంది. దుర్గం చుట్టుముట్టడింపబడింది, రెడార్మీ నిర్మూ లింపబడింది, బెలోరష్యా రాజధాని మీన్స్క్ మహత్తరమైన జర్మన్ సేనల తీవ్ర ముట్టడిలో వుంది. మీ ప్రతిఘటన యావత్తు వ్యూహాత్మక ప్రాముఖ్యాన్నీ కోల్పోయింది. మీరు ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చేందుకుగాను మీకొక్క గంట వ్యవధినిస్తున్నాం. మీరు లొంగిపోయేందుకు నిరాకరిస్తే మిమ్మల్ని నాశనంచేస్తాం, మీ దుర్గాన్ని యీ భూమిపైనుంచి సమూలంగా తుడిచిపెట్టేస్తాం.”

భంభమ్మనే ఆ స్వరం ఆ సందేశాన్ని రెండు సార్లు రెట్టించింది. రెండు సార్లు, అది, ప్రతి ఒక్క మాటనూ స్పష్టంగా, పట్టిపట్టి ఉచ్చరించింది. నేలమాళిగల్లోని ప్రతి ఒక్కరూ దాన్ని విన్నారు, అది ఆగిపోయినప్పుడూ, దాని స్థానంలో ఒక

మెట్రొనోమ్ టిక్‌టిక్‌మంటూ శబ్దం చెయ్యనారంభించినప్పుడూ అందరూ ఒక్కుమ్మడిగా నిట్టూర్చారు.

"పోయి నీళ్లు తీసుకురా" తన పక్కనే నిశ్శబ్దంగా నిలబడియున్న బాల్యావస్థ దాటీదాటనట్లున్న ఒక యువ సైనికుడ్ని సీనియర్ లెఫ్టినెంట్ ఆదేశించి, ప్నాజ్నికొవ్ వంక కటువుగా చూశాడు. "పేత్యా, జాగ్రత్తగా వుండు సుమా."

"అలాగే."

"నన్ను వెళ్లనివ్వండి" ప్నాజ్నికొవ్ అర్థించాడు. "నన్ను వెళ్లనివ్వండి కామ్రేడ్ సీనియర్ లెఫ్టినెంట్. నేను మీకు కావలసినన్ని నీళ్లు తీసుకొస్తాను."

"మీ పని క్లబ్బును తిరిగి ఆక్రమించుకోవడం" సీనియర్ లెఫ్టినెంటు కటువుగా అన్నాడు. "జర్మన్లు బహుశా ఓ గంటలో మళ్లీ దాడి ప్రారంభిస్తారు. కాల్పులు జరుగుతున్న సమయంలో క్లబ్బులోకి చొరుచుకెళ్లి ఏదేమైనా సరే జర్మన్లని అక్కణ్ణించి తరిమెయ్యాలి. బోధపడిందా, ఏదేమైనా సరే!"

ఆ చివరి మాటలను స్ఫుటంగా చెప్పి, నత్తినత్తిగా ప్నాజ్నికొవ్ చెప్పబోయే హామీల కోసం వేచియుండకుండా, సీనియర్ లెఫ్టినెంట్ పక్కకి తిరిగి చకచక వెళ్లిపోయాడు. ప్నాజ్నికొవ్ నేరం చేసినవాని మాదిరిగా నిట్టూర్చి, తన చుట్టూ కలియజూశాడు. సాల్నికొవూ, పొడుగాటి — కొద్దిగా గాయపడిన — రిజర్వు సైనికుడూ ఒక మందపు కిటికీ క్రింద విలువంపు పైకప్పుతో వున్న ఒక విభాగంలో కూర్చునివున్నారు. కొంత కష్టంమీద ప్నాజ్నికొవ్ రిజర్వు సైనికుని పేరును గుర్తు తెచ్చుకున్నాడు: ప్రిజ్న్యూక్.

"మన సైనికుల్ని పోగుచెయ్యండి" అతను చెప్పి, తన మోకాళ్లలో అసహ్యకరమైన చచ్చుదనాన్ని కనిపెట్టి, కూర్చున్నాడు.

సాల్నికొవ్, ప్రిజ్న్యూక్‌లు నేలమాళిగలో మరో నలుగురు సైనికులను కనుగొన్నారు. వాళ్లొక విభాగంలో చేరి గుసగుసగా మాట్లాడుకొంటున్నారు. వెనక ఎక్కడో నేలమాళిగలో చాలా దూరాన చిన్నపిల్లాడు యింకా మెల్లగా రోదిస్తూనే వున్నాడు, ప్నాజ్నికొవ్‌కి యీ నీరసరోదన మరే యితర చిత్రహింసకన్న దుర్భరంగా వుంది.

తను మిక్కిలి క్షుద్రమైన పని చేశాననీ, తన కామ్రేడ్లకు ద్రోహం చేశాననీ సంకట పడుతూ ప్నాజ్నికొవ్ నిశ్చలంగా కూర్చున్నాడు. అతనందుకు సాకులూ వెతకడం లేదు, తనపట్ల తను జాలీ పడటం లేదు, అది ఎలా సంభవించిందో అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

సరిగా యిప్పుడే కాదు నేను పిరికిపందగా మారినది, అనుకున్నాడతను. నిన్నటి దాడిక్రమంలో జరిగిందిది. దాని తర్వాత నా పట్టు కోల్పోయాను, నాయకత్వాన్ని నా

చేతుల్లోంచి జారిపోనిచ్చాను: యుద్ధానంతరం దీన్ని గురించి నేనెలా వర్ణించి చెప్తానంటూ ఆలోచిస్తూ వుండిపోయాను. నేనెలా చెప్తానవేగాని, నేనెలా పోరాడుతానని కాదు.

ఒక తేలిక మెషీన్ గన్నుతో యిద్దరు సరిహద్దు గస్తీ సైనికులొచ్చారు.

''మీకు రక్షణగా కాల్పులు జరపాలని మాకు ఆజ్ఞ యిచ్చారు.''

ఫ్లాజ్నికొవ్ తలూపాడు. ఆ సైనికులిద్దరూ మెషీన్ గన్ను సంగతి చూసుకోడం మొదలుపెట్టారు. వాళ్ళ డిస్కులు పరీక్షిస్తూండగా, తన ఆరుగురు సైనికులతో జర్మన్లను చర్చినుండి తరిమెయ్యడం తనకెన్నడూ సాధ్యం కాదని విచారంగా అనుకున్నాడు. కాని అతను సహాయం కోసం అడగడానికి సాహసించలేకపోయాడు.

''ముమ్మందు నేను చచ్చిపోతాను,'' అతను తనకి తాను మళ్ళీమళ్ళీ చెప్పుకున్నాడు. ''ముమ్మందు నేను చచ్చిపోతాను.''

ఏ కారణంగానో అతని మనస్సు ''చంపబడుతాను'' అన్న పదం పట్ల విముఖత ప్రదర్శించి, ''చనిపోతాను'' అన్న పదాన్నే పట్టుకుని వేలాడింది; ఏ చలిదెబ్బకో చచ్చిపోవాలని అతను ఆశించినట్లుగా.

''మనకి రెండే రెండు గ్రెనేడ్లున్నాయి'' ప్రత్యేకించి ఎవరినీ ఉద్దేశించకుండా ప్రిజ్న్యాక్ అన్నాడు.

''వాళ్ళు కొన్ని పట్టుకొస్తారు'' ఒక గస్తీ సైనికుడు అన్నాడు. ''మనల్ని ఈ పరిస్థితిలో ఒంటరిగా వదలరు. వాళ్ళూ మన సొంత కుర్రాళ్ళే.''

మరికొంత సేపటికి పదిహేనుమంది సైనికులొచ్చారు. శతఘ్నిదళ బ్యాడ్జీలు ధరించిన ఒక ఎర్రజుట్టు సీనియర్ సార్జెంటు తాము సహాయార్థం వచ్చినట్లు రిపోర్టు చేశాడు. అతనితోబాటు తన సైనికులను ఫ్లాజ్నికొవ్ వేర్వేరు నేలమాళిగ విభాగాలకు కేటాయించి, కిటికీల వెనక నిలబెట్టాడు.

అన్నీ సిద్ధమయ్యాయి, కాని జర్మన్ మెట్రొనోమ్ యింకా సెకండ్ల శబ్దం చేస్తూనే వుంది. ఆ శబ్దాన్ని ఫ్లాజ్నికొవ్ ఆద్యంతం వింటూనే వచ్చాడు, దాన్ని వినకుండా తన మనస్సును దిగ్బంధం చెయ్యాలని అతను ప్రయత్నించాడు, రాబోయే దాడిమీద తన మనస్సును కేంద్రీకరించాలని శతవిధాల ప్రయత్నించాడు, కాని బిగ్గరగా వినిపించే ఆ టిక్‌టిక్ శబ్దం అతని చెవుల్లో మార్మోగుతూ వచ్చింది. త్వరలోనే సీనియర్ లెఫ్టినెంట్ తిరిగివచ్చాడు. అతను వాళ్ళ సంసిద్ధతను తనిఖీ చేశాడు, వాళ్ళను సరైన స్థానాల్లో అమర్చాడు. ఫ్లాజ్నికొవ్ అతని చుట్టూ అలంగం తిరుగుతున్నా కూడా, ఫ్లాజ్నికొవ్‌ను అతను పట్టించుకోలేదు. కాని సీనియర్ లెఫ్టినెంట్ అకస్మాత్తుగా అతన్ని ఉద్దేశించి అన్నాడు:

''పగటిపూట దాడి అసంభవం. మీరా సంగతి ఒప్పుకుంటారా, లెఫ్టినెంట్?'' ఫ్లాజ్నికొవ్‌కి మతిపోయింది, ఏం జవాబు చెప్పడానికీ మాటలు కొరవడి, మౌనంగా తలాడించాడు.

''కాని జర్మన్లు కూడా పగటి దాడి అసంభవమనే అనుకుంటూరు, ఆ నమ్మకంతో రాత్రిపూటే దాడి జరుగుతుందని అంచనా వేస్తారు. అందుకనే మనం పగలు దాడి చెయ్య బోతున్నాం. ఎదర కాల్పులు ఎంత తీవ్రంగా ఉన్నా సరే, మాటుకోసం వెతుక్కోకపోవడం – అదీ ముఖ్యమైన విషయం. సబ్ మెషీన్ గన్నులు నిప్పులు చెరుగుతాయి, మీకు అంగీకార మేనా?''

''ఆ.''

''మీరు యింతకుముందు చేసిన పొరపాటును యిప్పుడు సరిచేసుకోడానికి మీకీ అవకాశమిస్తున్నాను.''

డస్సివున్న సీనియర్ లెఫ్టినెంటుకు, ముందు తను ప్రాణాలైనా విడుస్తాను గాని యీ పనిచెయ్యడంలో విఫలం కానని హామీ యివ్వాలని మనస్సులో ఎంతో సతమతమయ్యాడు. కాని, ఫ్లాజ్నికొవ్‌కి మాటలు కరువై, మౌనంగా తలూపాడు.

''మీరు చెప్పదలుచుకున్నదేమిటో నాకు తెలుసు, నేను మిమ్మల్ని విశ్వసిస్తున్నాను.'' మొట్టమొదటిసారి సీనియర్ లెఫ్టినెంటు ముఖంలో నవ్వువంటి దేదో మెదిలింది. ''నాతో రండి, సైనికుల దగ్గరకి.''

ఏయే విభాగాలనుంచి దాడి సాగాల్సి వుందో వాటన్నింటికీ సీనియర్ లెఫ్టినెంట్ వెళ్ళాడు. ఫ్లాజ్నికొవ్‌కిచ్చిన ఆదేశాలనే వాళ్ళందరికీ రెట్టించాడు: సబ్ మెషీన్ గన్నులు నిప్పులు చెరుగుతాయి, జర్మన్లు దాడి జరుగుతుందని ఎదురుచూడటంలేదు, అన్నిటికన్న ముఖ్యమైన విషయం – మాటు వెతుక్కోకపోవడం, పరుగెత్తడం, చర్చి దాకా ఏకబిగిన పరుగెత్తి చర్చి గోడల క్రిందికి చేరుకోవడం.

''మీరు ఏ సంగతీ తేల్చుకోడానికి మీకింక అయిదే అయిదు నిమిషాల వ్యవధి వుంది!'' లౌడ్‌స్పీకర్లలోంచి బొంగురు స్వరం హెచ్చరించింది.

''అంటే మీరు నాలుగు నిమిషాల్లోనే బయల్దేరుతారన్నమాట'' తన జేబులోంచి గడియారం తీసిపట్టుకొని, సీనియర్ లెఫ్టినెంట్ అన్నాడు. ''నేను ఆజ్ఞ ఇవ్వగానే దాడి చెయ్యండి, కాల్చకూడదు, వాళ్ళకి పూర్తి దిగ్భ్రాంతికరంగా జరగాలి యీ దాడి. అదే మన ఆయుధం.''

అతను ఫ్లాజ్నికొవ్ వంక చూశాడు, అతనా చూపును అర్థంచేసుకుని నేలమాళిగ కిటికీ దగ్గరకెళ్ళాడు. ఎత్తుగా ఉన్న ఆ కిటికీ గడప విరిగివుంది. దానిలోంచి బయటకు దూకడం కష్టమే. కాని సైనికులు అప్పటికే చేతులమీద యిటుకలు అందుకొని, దానికి మెట్లు అమరుస్తున్నారు. ఫ్లాజ్నికొవ్ వాటిమీద ఎక్కాడు, తన సబ్ మెషీన్ గన్నుని వెనక్కి లాక్కున్నాడు, ఉరికేందుకు ఊతం చూసుకున్నాడు. ఎవరో అతనికి రెండు గ్రెనేడ్లు అందించారు; వాటినతను తన బెల్టుకి తగిలించుకున్నాడు.

''ముందుకి పదండి!'' సీనియర్ లెఫ్టినెంట్ బొబ్బరించాడు.

ఫ్లాజ్నికొవ్ దూకాడు, అతని కాళ్ల క్రింది యిటుకలు దొర్లిపోయాయి, కాని అతను ఉంకించి కిటికీలోంచి ఉరకగలిగాడు, మరివెనక్కి చూడకుండా – యిప్పుడు చాలా దూరమున్న – చర్చివంకకు దౌడుతీశాడు.

అతను నిశ్శబ్దంగా పరుగెత్తాడు – మరి అతనికి తనొక్కడే పరుగెత్తుతున్నట్లు అనిపించింది. అతని గుండె ఎంత గట్టిగా కొట్టుకుంటున్నదంటే, ఆ ధనధన శబ్దంలో తన వెనక పాదాల ధ్వని అతనికి వినరావడంలేదు, మరి వెనక్కి తిరిగి చూసేందుకూ అతనికి వ్యవధి లేకపోయింది.

''కాల్చకండి, కాల్చకండి, కాల్చకండి!'' అంతర్వాణి అరుస్తోంది.

ఆ మెట్రొనోమ్ యింకా టిక్కుటిక్కుమంటూనే వుందో, లేక జర్మన్లు హడావిడిగా ఫిరంగుల్లో గుళ్లు అమరుస్తున్నారో అతనికేమీ తెలియదు, కానైతే ప్రస్తుతానికి మాత్రం, దున్నేసినట్లున్న ఆవరణలో తను పరుగెత్తుతూంటే, ఎవరూ తనపైన కాల్చలేదు, అంత వరకు అతనికి తెలుస్తోంది. పొగ, మందుగుండు, రక్తం – యీ మూడింటి గబ్బులో కూడిన వేడిగాలి మాత్రం అతని ముఖానికి ఛెళ్లున తగులుతోంది.

అతని ముందు ఒక గుంటలోంచి ఒక ఆకారం పైకొచ్చింది, ఫ్లాజ్నికొవ్ దాదాపుగా పడిపోబోయాడు, కాని అతను అంతలోనే సరిహద్దు గస్తీ సైనికుని – ఆ రాత్రి క్షత గాత్రుడైన జర్మన్ సబ్‌మెషీన్ గన్నర్‌ని ఖతం చెయ్యడంద్వారా తనని కాపాడిన సరిహద్దు గస్తీ సైనికుని – గుర్తించాడు. ఇతను కూడా చర్చినుంచి పారిపోయినమాట తేటతెల్లమే, కానైతే నేలనూతిగదాకా పారిపోలేదు; అతనా ఫిరంగి గుండు గుంటలో రక్షణ తీసుకుని ఉండి పోయాడు; ఇప్పుడతను తిరిగి దాడిలో చేరాడు. సరిహద్దు గస్తీ సైనికుడు బ్రతికివున్నందుకు సంతోషించడానికి ఫ్లాజ్నికొవ్‌కి ఒక్క క్షణకాలం వ్యవధి చిక్కిందో లేదో, అంతలోనే ఓ డజను ఫిరంగి గర్జలతో నిశ్శబ్దం భగ్నమైంది, బులెట్లు అతని నెత్తిమీదుగా సంయ్ మంటూ దూసుకుపోసాగాయి. జర్మన్లు కాల్పులు ఆరంభించారు.

వెనక ఎవరో అరిచారు. ఫ్లాజ్నికొవ్ బోర్లపడుకోవాలని తలపోశాడు, అలా పడు కునేవాడే కూడా, కాని సరిహద్దు గస్తీ సైనికుడు తన ముందు యింకా పెద్దపెద్ద అంగలతో పరుగెత్తుతూనే వున్నాడు, యింకా గాయపడనూ లేదు. ఈ బులెట్లతో తనకి చావు రాసిపెట్టిలేదని తనకి తను చెప్పుకొని, ఫ్లాజ్నికొవ్ తన తలను భుజాలమధ్యకు వంచి, ''హుర్రా – ఆ – ఆ!'' అంటూ బిగ్గరగా అరిచాడు. ''ఆ – ఆ'' అంటూనే అదే దమ్ములో అతను చర్చిని చేరుకొని, అండగోడ మాటు చూసుకొని, చుట్టూ కలియజూశాడు.

కేవలం ముగ్గురు మాత్రమే నేలకొరిగారు. ఆ ముగ్గురిలో ఒకడు కదలడం లేదు, మిగిలిన యిద్దరూ మట్టిలో మెలికలు తిరుగుతున్నారు. మిగిలినవాళ్లందరూ కాల్పులకు

అందుబాటులో లేని తావుకి చేరుకున్నారు. సరిహద్దు గస్తీ సైనికుడు తర్వాతి అండగోడ దగ్గర నిలబడి ''గ్రెనేడ్లు! గ్రెనేడ్లు విసురు!'' అంటూ అరుస్తున్నాడు.

ఫ్లాజ్నికొవ్ తన బెల్టు కిందనుంచి ఒక గ్రెనేడ్ని లాగి, కిటికీ గుండా నిప్పులు కక్కుతున్న సబ్‌మెషీన్ గన్నుకి తిన్నగా విసిరేశాడు. భోరున పెద్ద శబ్దమైంది, అతను గబ్బు కొడుతున్న ఆ ప్రేలుడు పొగలోకి దూకాడు. కిటికీ గడపతుంటకి కాలి చీలమండ తగులుకొని అతను పడ్డాడు, కాని తొందరగా దొర్లాడు, సరిహద్దు గస్తీ సైనికుడు అతని పక్కనే బరువుగా దభేలున పడ్డాడు. చుట్టూ ప్రేలుళ్ళు వినవస్తున్నాయి, ధూళిధూమాలమధ్య నుంచి కాల్పులు చమక్కుచమక్కున మెరుస్తున్నాయి, బులెట్లు గోడకి తగిలి ధన్‌ధన్ మంటున్నాయి. ఫ్లాజ్నికొవ్ నేలపైనే కూర్చొని, మెరుపుల వంక తన సబ్‌మెషీన్ గన్నుతో కొద్ది కొద్ది క్షణాలపాటు కాలుస్తున్నాడు.

''వాళ్ళు చర్చి పై అంతస్తులోకి వెళ్ళిపోతున్నారు! పై అంతస్తు! పైకి గురిచూడు!'' సరిహద్దు గస్తీ సైనికుడు కేకేశాడు.

అతను చెప్పినది రైటే, జర్మన్ల కాల్పులు యిప్పుడు అక్కడినుంచే వస్తున్నాయి. ఫ్లాజ్నికొవ్ తన గన్నును పైకెత్తి వరుసగా చాల క్షణాలు కాల్చాడు, కాల్పుల మెరుపు లొస్తున్న కేంద్రాల్లో ఒకటి ఆరిపోయింది, కానీ సరిగా ఆ క్షణంలోనే ఫ్లాజ్నికొవ్ గన్ను మూగ పోయింది.

''నీదగ్గర ఏవి వుంటే వాటన్నింటితోనూ వాళ్ళని కొట్టు లెఫ్టినెంట్!''

ఫ్లాజ్నికొవ్ కంగారుకంగారుగా తన జేబులు వెతికాడు. సబ్‌మెషీన్ గన్ తూటాలు లేవు. అతను తన చిట్టచివరి గ్రెనేడ్‌ను బెల్టుకిందనుంచి లాగి, నేరుగా బులెట్లచేత చీల్చబడుతున్న అంధకారంలోకి వెళ్ళాడు. బులెట్లు అతని పాదాలముందున్న నేలను పెచ్చులుగా లేపుతున్నాయి, యిటుక తుంటలు అతని బూట్లకు బాధాకరంగా తగులుతున్నాయి. మిలిటరీ స్కూల్లో మాదిరిగా గ్రెనేడ్‌ను ఊతంగా ఊపి విసిరేసి, నేలపై పడుకున్నాడు. పెద్ద మోత మోగింది.

''శభాష్ లెఫ్టినెంట్'' అతను లేవడానికి చేయూతనిస్తూ సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు. ''మన కుర్రాళ్ళు చర్చి పై అంతస్తులోకి దూసుకెళ్ళారు, వాళ్ళు మనం లేకపోయినా జర్మన్లను ఖతం చేసేస్తారు, జర్మన్లకింక ఎటు తప్పకునేందుకూ చోటులేదు.''

పైనుంచి కేకలూ, బొంగురు కంఠంలో తిట్లూ, లోహాల ఖణేల్‌ఖణేల్ శబ్దాలూ, దబ్బుదబ్బుమన్న శబ్దాలూ వినవచ్చాయి. బాహాబాహీ పోరాటంలో జర్మన్లు హతమార్చబడుతున్నారు. ఫ్లాజ్నికొవ్ చుట్టూ కలియజూశాడు. పొగతో కూడిన చీకటిలో ఎర్ర సైనికులు దాడిచెయ్యడం, నేలపై కళేబరాలూ, కింద పడిన ఆయుధాలూ ఫ్లాజ్నికొవ్‌కి సరిగా కానరాకపోయినా అనుభూతమైంది.

''నేలమాళిగలు సోదాచెయ్యి, ద్వారందగ్గర సెంట్రీని కాపలా పెట్టు'' ఫ్లాజ్నికొవ్ అన్నాడు, తన ఆజ్ఞ ఎంత యథాలాపస్వరంలో ఉందో విని అబ్బురపడ్డాడు. అతని ఆజ్ఞలు నిన్నటి రోజున యీ మాదిరిగా వినపడలేదు.

సరిహద్దు గస్తీ సైనికుడు అదృశ్యమయ్యాడు. ఫ్లాజ్నికొవ్ తన సబ్‌మెషీన్ గన్నును చేతిలోకి తీసుకున్నాడు, అతి దగ్గర్లో వున్న జర్మన్ కళేబరాన్ని తిరగతిప్పాడు, వాడి బెల్టుకి తగిలించివున్న మగజీన్ల* సంచిని ఊడలాగాడు, తర్వాత చర్చి సింహద్వారం దగ్గరకు బయల్దేరాడు.

కాని కొద్ది అడుగులేసి, అతనక్కడ నిలబడిపోయాడు. తమ మెషీన్ గన్ను యింకా ద్వారం దగ్గరే వుంది, దానిపైన, షీల్డును కౌగిలించుకొని, సార్జెంటు పడివున్నాడు. అతని వీపుమీద మృత్యు దంష్ట్రల అర్ధ వలయం మాదిరిగా గడ్డకట్టిన రక్తంతో ఆరు నల్లని రంధ్రాలు కానవస్తున్నాయి.

''ఇతను వెళ్ళిపోలేదు'' సాల్నికొవ్ అక్కడికి వస్తూ అన్నాడు.

''ఇతను లొంగలేదు'' ఫ్లాజ్నికొవ్ నిట్టూర్చాడు. ''మన మాదిరిగా కాదు.''

''మీకు తెలుసా, నేను చటుక్కున భయపడిపోయాననుకోండి, అంతటితో నా పని సరి, అలా కాకుండా అది ఆకస్మికంగా జరగదనుకోండి, అప్పుడిక నాకు ధోకావుండదు. అదే తొలగిపోతుంది.''

''సాల్నికొవ్, మనం యితన్ని సమాధిచెయ్యాలి.''

''ఎక్కడ? ఇక్కడ మూడు మీటర్ల లోతు తవ్వితేగాని నేల తగలదు.''

''బయట ఆవరణలో, ఫిరంగి గుళ్ల గుంటలో.''

అంతకంతకి పెరుగుతున్న హోరు మిగిలిన అన్ని శబ్దాలనూ ముంచెత్తింది. అనుచ్చరిత అవగాహనలో వాళ్ళిద్దరూ ఒక కిటికీ గూడులో చేరుకొని నేలకి కరుచుకొని పడుకున్నారు. సరిగా అదే క్షణంలో ఒక ప్రేలుడు సంభవించి దుమ్ము రేపింది, గోడలు దద్దరిల్లాయి. దుర్గపు ఆవరణలో బరువైన బాంబులు గర్జించాయి.

''విమానదాడి తర్వాత వాళ్లు దాడిచేస్తారు!'' ఫ్లాజ్నికొవ్ గట్టిగా అరిచాడు, కాని తన అరుపు తనకే వినపడలేదు. ''నేను ద్వారాన్ని కాస్తాను! నువ్వు కిటికీలు చూసుకో! కిటికీలు, సాల్నికొవ్, కి – టి – కీ – లు!''

దగ్గర్లో చెవులు గళ్లుపడే ప్రేలుడు సంభవించింది, ఆ వెంటనే యిటుకలు జల్లులా రాలాయి. ఆ ప్రేలుడుకు మెషీన్ గన్ను తిరుగబడింది, మృత సార్జెంటు పక్కకి విసిరేయబడ్డాడు. పొగా, గ్యాసులూ వాళ్లని చుట్టబెట్టాయి, వాళ్లకి ఊపిరాడకుండా చేశాయి. దగ్గుతూ,

---

*సబ్‌మెషీన్ గన్ తూటాల బెల్టు. – సం.

ఉక్కిరిబిక్కిరవుతూ, ఫ్లూజ్నికొవ్ మెషీన్ గన్ దగ్గరకి ఉరికి, వంగుని, దాన్ని గోడ దగ్గరకు యీడ్చాడు.

"కిటికీలు, సాల్నికొవ్!"

సాల్నికొవ్ చెవులదగ్గర చేతులు పెట్టుకొని బోర్లా పడుకుని వున్నాడు. ఫ్లూజ్నికొవ్ అతన్ని కుదిపాడు, గుంజాడు, చివరకు తన్నాడు, కాని అతను నేలకు మరింత సన్నిహితంగా కరుచుకుని ముడుచుకు పడుకున్నాడు.

"కి — టి — కీ — లు!"

మరో ప్రేలుడు — అది కూడా దగ్గర్లోనే — కమాను ద్వారంనుంచి యిటుకలను రాల్చింది. మరో ప్రేలుడు, యింకొకటి, వేరొకటి — యిటుకతుంటల ప్రహారాలకు గురైన ఫ్లూజ్నికొవ్ లెక్క తప్పాడు, అదొక ఎడతెరిపిలేని, చెవులు గళ్ళు పడజేసే ఉరుము.

ఫిరంగి కాల్పులు ఎన్ని గంటలు సాగాయో ఎవరికీ తెలియదు. చివరకు అవి ఆగి, వాళ్ళు యిటుకతుంటల మధ్యనుంచి బయటకు దేక్కుంటూ వచ్చేసరికి గంభీరమైన హోరుతో క్రిందికి వాలుతూ ఎగురుతున్న బాంబరు విమానాలు కీచుమంటూ దుర్గంమీదకు వచ్చాయి. సైనికులు మళ్ళీ గోడలకు కరుచుకున్నారు, మళ్ళీ భూమి మూలిగింది, మళ్ళీ యిటుక తుంటలు జల్లులా రాలాయి, మూడువందల ఏళ్ళక్రితం స్థాపింపబడిన చర్చి ఊగిసలాడి, కూలి పోతుందేమోననిపించింది. గాలి లేదు, ఉన్నదల్లా దుమ్ము, పొగ, గబ్బుకొట్టే గ్యాసులు మాత్రమే. శక్తి అంతా ఎన్నడో హరించుకుపోయింది. స్పృహ సన్నగిలింది, శరీరం మాత్రమే యింకా మందంగా, తిమ్మిరిగా దెబ్బలకూ, ప్రేలుళ్ళకూ ప్రతిస్పందిస్తోంది.

గళ్ళుపడిన తన చెవుల నిశ్శబ్దంలో, దిగ్భ్రాంతిలో ఫ్లూజ్నికొవ్ నేనింకా బతికే వున్నాను, అనుకున్నాడు.

తన వీపుపై పడిన ఇటుకల బరువు తెలుస్తూవున్నా కూడా కదిలేందుకు అతను విముఖంగా వున్నాడు. అతని తల బద్దలైపోతోంది, అతని యావత్తు శరీరమూ నలగకొట్టి నట్లుంది, ప్రతిఒక శల్యమూ తన బాధను చాటిచెప్తోంది. అతని నాలుక పొడారిపోయి ఉబ్బింది, అది నోటికి నిండుగా ఉండి, అతని అంగిలి మంటపుడుతోంది.

"జ — ర్మ — న్స!"

ఆ శబ్దం ఎక్కడో దూరంనుంచి — అతని నిశ్శబ్దావరణానికి వెలుపలినుంచి — విని పించినట్లయింది. కాని, దాని అర్థం అతనికి అనుభూతమైంది, బలవంతాన లేచి నిల బడటానికి ప్రయత్నించాడు. అతను తంటాలుపడి యిటుకతుంటల క్రిందనుంచి బయటపడి దుమ్ము అట్టకట్టిన తన కళ్లను బలవంతాన తెరిచాడు.

సరిహద్దు గస్తీ సైనికుడు మెషీన్ గన్నును అమర్చడానికి హడావిడిగా ప్రయత్ని స్తున్నాడు. గురిరంధ్రం వంగిపోయి, పైతొడుగుకి గాడి పడింది. అతనికి అపరిచితుడైన

సైనికుడొకడు అతని పక్కన వున్నాడు. అతను క్రిందవున్న యిటుకల మధ్య తవ్వి తూటాల బెల్టులను పైకి లాగుతున్నాడు. ప్ల్యాజ్నికొవ్ లేచి నిలబడ్డాడు, ఊగిసలాడాడు, కాని మెషీన్ గన్ పక్కన మోకాళ్లపై కూలబడేలోగా కొద్ది అడుగులు వెయ్యగలిగాడు.

"ఉండు. నేను చూస్తాను."

"జర్మన్లు!"

సరిహద్దు గస్తీ సైనికుని వికృతమైన ముఖంనుంచి రక్తం ధారగా జారింది. ప్ల్యాజ్నికొవ్ నీరసంగా అతన్ని పక్కకు నెట్టేశాడు.

"నేనిది చూస్తాను. నువ్వు కిటికీలు కాసుకో."

అతను మెషీన్ గన్ వెనుక పడుకున్నాడు. బలహీనంగా వున్న అతని వ్రేళ్లు ట్రిగ్గర్ను బిగువుగా పట్టుకొని వున్నాయి. సరిహద్దు గస్తీ సైనికుడు వెళ్లిపోయాడు, అతని స్థానంలో ఒక సైనికుడు తూటాల బెల్టును ముందుకు నెడుతున్నాడు. ప్ల్యాజ్నికొవ్ ఫీడ్ బ్లాక్ మూతని తెరిచి, బెల్టుని సరైన స్థానంలో అమర్చాడు, ధూళిధూమాల దట్టమైన తెరగుండా జర్మన్లు నేరుగా తన వంకకే పరుగునరావడం చూశాడు.

"కాల్చు!" ఆ సైనికుడు బిగ్గరగా అరిచాడు. "కాల్చు!"

"ఒక్క నిమిషం," ప్ల్యాజ్నికొవ్ షీల్డులోని రంధ్రం గుండా పరుగెడుతున్న శత్రువును చూస్తూ అన్నాడు. "ఒక్క క్షణం. నేను యిది లాగలేకపో...."

తను ట్రిగ్గర్ని నొక్కలేకపోతానేమోనని అతను భయపడ్డాడు. అతని వ్రేళ్లు పోటుపెట్టాయి, కంపించాయి. కాని ట్రిగ్గరు లొంగివచ్చింది, మెషీన్ గన్ను అతని చేతిక్రింద అదరసాగింది, విస్తృత అర్ధవలయాకారంలో దుమ్మురేపింది. అతను గొట్టాన్ని పైకి లేపి, పరుగెత్తి వస్తున్న నల్లని ఆకారాలపై కొన్ని నిమిషాలపాటు వరుసగా కాల్పులు జరిపాడు.

కాలం స్తంభించిపోయింది. ధూళితెరలోంచి అస్పష్టాకారాలు పైకొచ్చాయి, అవి అదృశ్యమయ్యేదాకా ప్ల్యాజ్నికొవ్ ట్రిగ్గరు నొక్కాడు. విరామసమయాల్లో అతను చెత్త కెలికి, నలిగిపోయిన తూటాలను గాలించి, రక్తమోదుతున్న వ్రేళ్లతో కంగారుగా బెల్టులకు అమరుస్తున్నాడు. మళ్లీ అలలు అలలుగా వస్తున్న సబ్‌మెషీన్ గన్నర్లపై కాలుస్తున్నాడు.

జర్మన్లు తమ యీ దాడిని దాదాపు విరామంలేకుండా, ఆ రోజంతా సాగిస్తూనే వున్నారు. దాడుల తర్వాత ఫిరంగి కాల్పులు, ఫిరంగి కాల్పుల తర్వాత బాంబరు విమానాల దాడులు, ఆటుతర్వాత మరో దాడి. ప్ల్యాజ్నికొవ్ మెషీన్ గన్నుని దొరకపుచ్చుకొని గోడ దగ్గరకు లాక్కెళ్లాడు, బాంబరు విమానాలు వెనక్కి వెళ్లగానే అతను దాన్ని వెనక్కు లాక్కొచ్చి, — చెవులు గళ్లుపడగా, సగం చూపు మందగించగా, ఆలోచనారహితంగా — కాల్పులు సాగించాడు. అతని సహాయకుడు పైకప్పునుంచి ఒక రాతిబండ నెత్తిన కూలడంతో అణ

గారిపోయి మృతిచెందాడు. అతను దీర్ఘంగా భయంకరంగా అరిచాడు, కాని జర్మన్లు దాడి చేస్తున్న కారణంగా ఫ్లాజ్నికొవ్ మెషీన్ గన్నును విడిచివెళ్లలేకపోయాడు. పైతొడుగు ఊడివచ్చేసింది, లేక ఏ లోహ శకలమో తగిలినా తగిలియుండవచ్చు. ఆ మెషీన్ గన్ బాయిలరు మాదిరిగా ఆవిర్లు కక్కుతోంది. ఒళ్లు బొబ్బలెక్కిన ఫ్లాజ్నికొవ్, దాన్ని గోడదగ్గరకు లాగుతూ, మళ్లీ వెనక్కిలాగుతూ, తూటాలెక్కడ అయిపోతాయోనని మాత్రమే భయపడుతూ – కాలుస్తున్నాడు. చర్చిలో ఎంతమంది సైనికులు మిగిలారో అతనికి తెలీదు, కాని వేడికి ఒక తూటా కరిగి బిగుసుకుపోయినప్పుడు మాత్రమే అతను కాల్చడం మానేశాడు. అప్పుడతనికి తన సబ్‌మెషీన్ గన్ సంగతి గుర్తుకొచ్చింది, అతను దానితో జర్మన్లవంక కాల్పులు జరిపి, బండలపైనా, కళేబరాలపైనా కాలు మోపి తూలుతూ, చర్చివెనుక భాగంలోని చీకటి ప్రాంతంలోకి పరుగెత్తాడు.

అతను నేలమాళిగని చేరుకునేలోగా ఎక్కడో బయటనుంచి, చెదురుబదురు కాల్పుల శబ్దమూ, "హుర్రా!" అన్న కేకలూ వినవచ్చాయి. తమ సహాయబలగాలని అతను గ్రహించాడు, తన వెనక తన సబ్‌మెషీన్ గన్నుని యీడ్చుకుంటూ, ప్రవేశ ద్వారం దగ్గరకు తూలుకుంటూ వెళ్లాడు. ఎవరో అతన్ని ఢీకొన్నారు, ఏదో చెప్పారు, కాని అతను అతి ప్రయత్నంమీద ఒకేఒక్క మాట – "మంచినీళ్లు!" – అని పడిపోయాడు, మరి అతనికి ఏమీ కనిపించ లేదు, వినిపించలేదు.

నీళ్లకు సంబంధించినదే అతని తొలి ఇంద్రియానుభూతి. అతను తన కళ్లు తెరిచాడు, ఒక ఫ్లాస్కును చూశాడు, దాని కోసం చెయ్యి చాచాడు, అదే పనిగా గటగటా తాగాడు, అప్పుడు తనకు మంచినీళ్లు ఇస్తున్నవాడు సాల్నికొవ్ అని తట్టింది, అతని తలపైనగల తెల్లని కట్టు చీకట్లో మెరిసింది.

"నువ్వు బతికే వున్నావా సాల్నికొవ్?"

"బతికే వున్నాను" అతను గంభీరంగా జవాబిచ్చాడు. "ఆ రెండోవాడు బండకింద పచ్చడైపోయాక మీకు నేను బెల్టులు అందించాను. మీరు నన్ను కిటికీల దగ్గరకి పంపేశారు!"

దట్టమైన ధూళిలో నల్లని జర్మన్ ఆకారాలను ఫ్లాజ్నికొవ్ గుర్తుచేసుకున్నాడు, ప్రేలుళ్ల హోరునూ, బండక్రింద పడి నలిగిపోయిన తన సహాయకుని భయంకరమైన అరుపులనూ గుర్తుచేసుకున్నాడు. తన చేతులను బొబ్బలెక్కించిన, చుర్రుమనేలాగ వేడెక్కిపోయిన మెషీన్ గన్నును అతను గుర్తుచేసుకున్నాడు. కాని అంతకుమించి అతనికింకేమీ గుర్తులేదు, అందుకనే అతను అడిగాడు: "చర్చిని మనం నిలుపుకున్నామా?"

"మన కుర్రాళ్లు సాయంచేశారు, వాళ్లు జర్మన్ల పార్శ్వంపై దాడిచేశారు."

"మరి నీళ్లో? అవెక్కణ్ణుంచి వచ్చాయ్?"

"మీరు అదే పనిగా మంచినీళ్లకోసం అడుగుతూ వచ్చారు. సరే, అందుకని నేను వెళ్లి తీసుకొచ్చాను. అక్కడి పరిస్థితి భయానకంగా — పట్టపగల్లా — వుంది. నాకో రవ్వ గీసుకు పోయింది, కాని నేను ఏడు ఫ్లాస్కులతో నీళ్ల తెచ్చా."

"ఇంక ఒక్క చుక్క కూడా తాగకూడదు" ప్ల్యాజ్నికొవ్ తనని తను ఆజ్ఞాపించు కొని, ఫ్లాస్కుమీద మరమూత బిగించాడు. "మన వాళ్లెంతమంది వున్నారు?"

"ప్రిజ్న్యాక్ నేలమాళిగ పక్కన వున్నాడు, సరే మనమిద్దరం, యికపోతే సరిహద్దు గస్తీ సైనికుడు."

"సరిహద్దు గస్తీ సైనికుడు బాగున్నాడా?" ప్ల్యాజ్నికొవ్ అతిప్రయత్నంమీద బొంగు రుగా నవ్వాడు. "బాగున్నాడేం?"

"ఓ యిటుక అతని కనుబొమపై పడి, దాన్ని చీల్చింది, కాని నిజానికి అతను అంతకు మించి గాయపడలేదు. అదృష్టవంతుల్లో అతనొకడు. ఇప్పుడతను యింకా వెచ్చగా వున్న తాజా జర్మన్ కళేబరాల జేబులు తడుముతున్నాడు. ఇక్కడా బయటా కూడా జర్మన్లు కుప్పలుగా పడివున్నారు.

ప్ల్యాజ్నికొవ్, చెడిపోయిన తన మెషీన్ గన్ వున్న సింహద్వారం దగ్గరకి, తూలుకుంటూ వెళ్లాడు. రాత్రి అయింది, కాని మండుతున్న భవనాలనుంచీ, నిస్తబ్దమొనర్చబడిన దుర్గంపైన తమ నిస్తేజకాంతిని బరపుతున్న అగణితమైన రాకెట్లనుంచీ వెలుతురు ప్రసరిస్తోంది. మధ్యమధ్య జర్మన్లు ఫిరంగి గుళ్లను ప్రయోగిస్తున్నారు. అవి నేలమీదపడి చటుక్కున పెద్దగా పేలుతున్నాయి.

"సార్జెంటు పూడిపోయాడా?"

"పడిపోయి, పూడిపోయాడు. బూటు మడమ మాత్రమే పైకి కనిపిస్తోంది."

అరిగిపోయిన సైనిక బూటొకటి యిటుకల గుట్టక్రిందనుంచి పైకి పొడుచుకొచ్చింది. సార్జెంటు టాప్‌బూట్లు వేసుకునేవాడన్న సంగతి ప్ల్యాజ్నికొవ్‌కి అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది; అయితే యిది కూలిన పైకప్పు బండకింద అణగారిపోయిన సైనికుడై వుండాలి, కాని అతను పైకేమీ అనలేదు. అతను పగిలిన ఓ బండపైన కూర్చున్నాడు, తను రెండు రోజులుగా తిండి యేమీ తినలేదన్న సంగతి గుర్తుచేసుకున్నాడు, దాన్ని గురించి ఏదో అన్నాడు. సాల్నికొవ్ జర్మన్ బిస్కట్లు తెచ్చాడు, వెల్తురుగా వున్న దుర్గపు ఆవరణవంక చూస్తూ, వాళ్లిద్దరూ మెల్లగా వాటిని నమలసాగారు.

"ఏమైతేనేం, మనం యీ రోజున కూడా తట్టుకు నిలబడ్డాం" ప్ల్యాజ్నికొవ్ అన్నాడు. "అంటే, మనం కూడా నిలబడగలమనే కదా, ఏం, సాల్నికొవ్?"

"తప్పకుండాను."

సరిహద్దు గస్తీ సైనికుడు సైనిక కోటునిండా సబ్‌మెషీన్ గన్ తూటాలు నింపు కొని తీసుకొచ్చాడు.

''నా అడ్రెస్ నోట్‌చేసుకో లెఫ్టినెంట్'' అతను ఆకస్మాత్తుగా అన్నాడు. ''గోమెల్, కార్ల్ మార్క్స్ వీధి, 112, ఫ్లాట్ 9. వ్లదీమిర్ దెనీస్చిక్.''

''నాది స్మొలేన్స్క్‌వే, దుహోవ్‌ష్చిన'' సాల్నికొవ్ చెప్పాడు.

''మనం యిక్కణ్ణుంచి బయటపడాలి'' వాళ్లు పరస్పరం తమ చిరునామాలు తెలియజేసుకున్న తర్వాత సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు. ''మనం ఉద్దానలుగురం వాళ్లని నిలవరించలేం.''

''నేనెక్కడికీ రాను'' ప్లూజ్నికొవ్ అన్నాడు.

''అది మూర్ఖత్వం తప్ప మరేం కాదు, లెఫ్టినెంట్.''

''నేను రావడం లేదు, అంతే'' అని, ప్లూజ్నికొవ్ నిట్టూర్చాడు. ''ఆజ్ఞలు వచ్చేదాకా నేను కదలను.''

ఆ ఉదయం విధినిర్వహణలో తన వైఫల్యాన్ని గురించీ, మెషీన్ గన్నుని చచ్చినా విడిచిపెట్టని సార్జెంటుని గురించీ, తమ మాతృదేశాన్ని గురించీ – ఔను! – యిప్పుడే తమ రక్షణకుగాను చర్యలు తీసుకుంటున్న తమ మాతృదేశం గురించీ ఏదేదో చెప్పాలనుకున్నాడు. అతను యివన్నీ చెప్పాలనుకున్నాడు, కాని ఏమీ చెప్పలేదు. యుద్ధపు యీ రెండో రోజు రాత్రి అన్ని మాటలూ అతి స్వల్పమైనవిగా, అప్రముఖమైనవిగా కనిపించడమే అందుకు కారణం.

''మీన్స్క్‌ని గురించి జర్మన్లు చెప్పారే, అది నిజమైయుంటుందంటారా?'' సాల్నికొవ్ అడిగాడు. ''వాళ్లని మనవాళ్లు అంత దూరం రానిచ్చియుండటం సంభవం కాదు. మనవాళ్లు వీళ్లని యీపాటికి చితక్కొడుతూ వుండివుండాలి.''

''నిస్సందేహంగానూ'' సరిహద్దు గస్తీ సైనికుడు అంగీకరించాడు. ''చిత్రమేమిటంటే మనకెక్కడా యుద్ధపు సందడి వినిపించడం లేదు.''

వాళ్లు చెవులు దోరబెట్టి విన్నారు, కాని అడపాదడపా వినవచ్చే ఫిరంగి కాల్పులూ, మెషీన్ గన్ కాల్పులూ తప్ప వాళ్లకి మరేమీ వినరావడంలేదు. యుద్ధరంగపు వేడి గాడ్పు బాగా తూర్పు దిశకు తరలింది.

''అంటే మనం ఒంటరిగా ఉన్నామన్నమాట'' సరిహద్దు గస్తీ సైనికుడు మెల్లగా అన్నాడు. ''అయినాగానీ నువ్వు యిక్కణ్ణుంచి కదలనంటున్నావు. ఈ స్థావరాన్ని నిలుపుకోవాలంటే మనకి మెషీన్ గన్ అవసరం.''

మెషీన్ గన్ లేనిదే తదుపరి దాడిని తిప్పికొట్టడమన్నది అసాధ్యమన్న సంగతి ప్లూజ్నికొవ్‌కీ తెలుసు. కాని తనకు మెషీన్ గన్ లేదు, అయినా యీ స్థానాన్ని విడిచివెళ్లిపోయే విషయం

ఆలోంచిచడానికి సైతం ఫ్లాజ్నికొవ్ నిరాకరించాడు. తన రొమ్ముపై పతకం వున్న, సుతీక్ష్ణమైన చూపులు కలిగిన నల్లజుట్టు సీనియర్ లెఫ్టినెంటును, దయనీయమూ, భయభీతమూ అయిన శిశు రోదనాన్ని, నేలమాళిగల్లోని స్త్రీలను — అతను గుర్తుచేసుకొన్నాడు. తను అక్కడికి వెళ్లలేదు, అజ్ఞల్లేనిదే అక్కడికి వెళ్లజాలడు. మరెవ్వరినీ వెళ్లనియ్యనూ లేదు, అందుకని అతను అన్నాడు: "అందరూ నిద్రపొండి. నేను కాపలా కాస్తాను."

సాల్నికొవ్ వెన్వెంటనే ఉండలా చుట్టుకొని నిద్రపోయాడు. కాని సరిహద్దు గస్తీ సైనికుడు — తను ఫిరంగి గుండు గుంటలో నిద్రపోయానని చెప్పి — నిద్రపోయేందుకు నిరాకరించాడు. అతను చర్చి వెనుక భాగానికి వెళ్లాడు, చాలసేపటివరకు తిరిగిరాలేదు (ఫ్లాజ్నికొవ్ ఆదుర్దా చెందనారంభించాడు), ప్రిజ్న్యాక్‌నూ, మరో ముగ్గుర్నీ తన వెంటబెట్టుకొని అప్పుడు తిరిగివచ్చాడు. ఫిరంగి దళానికి చెందిన ఎర్రజుట్టు సీనియర్ సార్జెంటు ఒకతనికి తలపై గాయమైంది. అతను తన తల వూపుతూ వింటున్నాడు.

"చెవుల్లో నీరుంటే ఎలా వుంటుంది, అలా వుంది నాకిప్పుడు."

"మన పక్కవాళ్లు గబ్బుకొడుతున్నారు" సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు.

చర్చిలో యింకా మిగిలివున్న కళేబరాలను ఉద్దేశించే అతనీ మాట అన్నాడన్న సంగతిని ఫ్లాజ్నికొవ్ గ్రహించాడు. అతను వాటిని తొలగించాల్సిందిగా ఆజ్ఞాపించాడు, వాళ్లు ఆ పనిమీద వెళ్లారు. ఫిరంగి సైనికుడు మాత్రమే అక్కడ మిగిలాడు, అతను గోడవార, కముకుదెబ్బ తగిలిన తన తలను ఊపుతూ, నిశ్చలంగా ఎదుటికి చూస్తూ, అక్కడ కూర్చున్నాడు. తర్వాత అతను అన్నాడు:

"నాకు భార్య వుంది. లెక్క ప్రకారం ఆమె ఈ ఆగస్టులో ప్రసవించాలి."

"ఆమె ఇక్కడే వుందా?" ఫ్లాజ్నికొవ్‌కి నేలమాళిగల్లోని స్త్రీలు జ్ఞాపకం వచ్చారు.

"అబ్బే యిక్కడ లేదు, వాళ్ల అమ్మదగ్గరుంది. వోల్గానదీ తీరంలో" అతను కొంచెంసేపు ఆగి అన్నాడు. "మన వాళ్లొస్తారంటావా — ఆఁ?"

"వాళ్లు తప్పక వస్తారు. వచ్చితీరాలి. వాళ్లు మనల్ని మరచిపోలేదు, నువ్వా విషయంలో దిగులుపడకు."

"శత్రువు బలవంతుడు" ఫిరంగి సైనికుడు నిట్టూర్చాడు. "ఈరోజు వాడు మనమీఁది కొచ్చిన తీరు — దారుణం."

"మనకీ వుంది బలం."

సీనియర్ సార్జెంటు జవాబివ్వలేదు, వట్టినే నిట్టూర్చి, తలూపాడు.

"నేలమాళిగల్లో పరిస్థితేమిటో నేను పోయి చూసివస్తే మంచిదేమో, ఏమంటావ్?"

"మాకిప్పుడు మెషీన్ గన్ లేదని మీరు వాళ్లకి చెప్పండి. బహుశా వాళ్లు మన కేమన్నా ఒకటిస్తారేమో."

"వాళ్లకీ అంత మరీ ఎక్కువగా ఉన్నట్టు లేదు" అని అతను వెళ్లిపోయాడు.

జర్మన్లింకా వెలుగులు వెదజల్లే రాకెట్లను పైకి ఎగరేస్తూనే వున్నారు, అవి పేరా షూట్లతో నెమ్మదిగా కిందికి దిగి కాంతి బరపి, నిశ్శబ్ద దుర్గాన్ని వెలుగులో ముంచెత్తుతూనే వున్నాయి. మధ్యమధ్య ఫిరంగి గుళ్ళు పడుతున్నాయి, నది ఒడ్డునుండి మెషీన్ గన్నులు గర్జిస్తూనే వున్నాయి. దారుణంగా అలసిపోయి, ముంచుకొస్తున్న నిద్రను ఆపుకొంటూ, ప్లూజ్నికొవ్ గోడబీట దగ్గర కూర్చున్నాడు. అతని పక్కన సాల్నికొవ్ ఆదమరచి గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

"ఏదేమైతేనేం నేను అదృష్టవంతుణ్నే" ఆకస్మికంగా అనుకున్నాడు ప్లూజ్నికొవ్. "ఇప్పటిదాకా ఒళ్లు కాస్త గీరుకోనైనా లేదు."

అటువంటి ఆలోచన సైతం తనకు దురదృష్టాన్ని తెచ్చిపెట్టవచ్చునన్న భయాతిరేకంతో, తనకి తను, అబ్బే నేను బొత్తిగా అదృష్టవంతుణ్ని కాను అనుకున్నాడతను; కాని, లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్ అనబడే తను, వర్ధినే చంపబడజాలనన్న మనోంతర్గతమైన సుస్థిర విశ్వాసమేదో మంత్రోచ్చాటనలన్నింటి కన్న అతనిలో ఎక్కువ బలంగా నాటుకొనివుంది. అతని వయస్సు కేవలం పంథొమ్మిదేళ్ల రెండు మాసాలు, మరి అతనిలో స్వీయ అమరత్వాన్ని గురించిన స్థిరవిశ్వాసం సుదృఢంగా నెలకొనివుంది.

సరిహద్దు గస్తీ సైనికుడు సైనికులతోబాటు తిరిగివచ్చాడు, మృత సైనికుల కళేబరాలన్నీ చర్చినుంచి తొలగించబడ్డాయని రిపోర్టు చేశాడు. ప్లూజ్నికొవ్ మౌనంగా తలూపాడు, అతనికి మాట్లాడే ఓపిక లేదు.

"ఓ కునుకు తియ్యి లెఫ్టినెంట్."

ప్లూజ్నికొవ్ తిరస్కరించాలనుకున్నాడు, తన తల ఊపాడు, గోడని ఆనుకునే క్రింది యిటుకముక్కల మీదకు జారాడు, బాల్యస్నిగ్ధమైన తన తలను తన అరచేతిపై ఆన్చుకొని మరు క్షణమే నిద్రలో కూరుకుపోయాడు.

...అతనెక్కడో ఓ నావలో తేలిపోతున్నాడు. అలలు నావ అంచుకి కొట్టుకుంటున్నాయి, అతను అద్భుతమైన శీతల జలాన్ని — తనివిదీర — తాగాడు. తెల్లని ఫ్రాక్ ధరించిన వాల్యా, నావచుక్కాని దగ్గర కూర్చొని, నవ్వుతోంది. మరి తన నిద్రలో అతనూ నవ్వుతున్నాడు....

"లెఫ్టినెంట్!"

ప్లూజ్నికొవ్ కళ్లు తెరిచేసరికి ఎట్టఎదుట సరిహద్దు గస్తీ సైనికుడు దెనీష్చిక్, ప్రిజ్న్యాక్, సాల్నికొవ్, తదితర సైనికులూ కనిపించగా, లేచికూర్చున్నాడు.

"మనల్ని నేలమాళిగలకు వెళ్లమని ఆజ్ఞ లొచ్చాయి."

"ఏం, ఎందుకు?"

"మన స్థానంలో వేరే వాళ్లని పంపుతున్నారు. అదేమంత గొప్ప మార్పిడి కాదనుకో."

ద్వారందగ్గర ఓ అపరిచిత యువ లెఫ్టినెంటు ఏర్పాట్లు చేసుకొంటున్నాడు. సైనికులు బరువైన ఓ మెషీన్ గన్నుని అమర్చి, రొమ్ము ఎత్తుదాకా ఇటుకలు పేరుస్తున్నారు. లెఫ్టినెంటు తనని తాను పరిచయం చేసుకొని, ఆజ్ఞలను అందజేశాడు.

"మీరు పొతాపొవ్‌నుండి ఆజ్ఞలు తీసుకోవాలి. నేలమాళిగలను తనిఖీచేశావా?"

"వేటిని తనిఖీచేసేందుకూ వ్యవధి లేదు. గ్రెనేడ్లతో ఓ సెంట్రీని ప్రవేశద్వారం దగ్గర పెట్టడం క్షేమం. మెట్లు యిరుగ్గా వున్నాయి. కిటికీలపైన ఓ కన్నేసి వుంచు."

"ఆహాఁ, సరే, నీ అదృష్టం బాగుండాలని కాంక్షిస్తున్నాను."

"మీకూను. నేను నా సైనికుల్ని తీసుకెళ్తాను, ఉన్నదల్లా ముగ్గురే. మేం స్నేహితులమయ్యాం."

"అక్కడ యింతకన్న తేలిగ్గా ఉంటుందనుకుంటున్నావా నువ్వు? వాళ్లో ప్రత్యేకమైన పన్నాగం అనుసరిస్తున్నారు. వాళ్లు ఓ కిటికీ దగ్గరకు మెల్లగా పాకివచ్చి, లోపలికి గ్రెనేడ్లు విసిరేస్తున్నారు. అః అన్నట్టు, యీ విషయం గుర్తుపెట్టుకో: వాళ్ల గ్రెనేడ్లు పేలడానికి మూడు సెకండ్ల వ్యవధి వుంటుంది. ఒకటేదైనా దగ్గర్లో పడితే, దాన్ని వెనక్కి తిప్పి విసిరేసేందుకు నీకు టైముంటుంది. మేమింతసేపూ అదే చేస్తున్నాం."

"నేను గుర్తుంచుకుంటాను. థాంక్స్."

"మీ దగ్గర యిక్కడ నీళ్లున్నాయా?"

"సాల్నికొవ్, మనదగ్గర నీళ్లున్నాయా?"

"అయిదు ఫ్లాస్కుల నీళ్లున్నాయి" సాల్నికొవ్ కొంత అసంతోషంగానే చెప్పాడు. "మీకిక్కడ మంచినీళ్లు తాగేటంత విరామం వుండదు."

"తాగేందుక్కాదు — మెషీన్ గన్నుకి."

"తీసుకోండి" ఫ్లాజ్నికొవ్ అన్నాడు. "వాళ్లకి ఫ్లాస్కులిచ్చెయ్యి సాల్నికొవ్, మనమింక పోదాం."

ఆ నలుగురూ జాగ్రత్తగా — దెనీస్చిక్ మార్గదర్శకత్వంలో — చర్చినుంచి తప్పించుకు వెళ్లారు. తెలతెలవారుతోంది, అడపాదడపా ఫిరంగి గుళ్లింకా పడుతూనేవున్నాయి.

"ఓ గంటాగంటన్నరలో సంగీతం మళ్లీ ప్రారంభమవుతుంది" సాల్నికొవ్ పెద్దగా ఆవులిస్తూ అన్నాడు. "మధ్యమధ్య ఎప్పుడైనా ఓసారి, మనకి జర్మన్లు విశ్రాంతి యిస్తున్నారు మంచిదే."

"వాళ్లు చీకటికి భయపడ్డారు." ఫ్లాజ్నికొవ్ మందహాసం చేస్తూ అన్నాడు.

"వాళ్లు దేనికీ భయపడలేదు" సరిహద్దు గస్తీ సైనికుడు కోపంగా అన్నాడు. "దొంగ నాకొడుకులు, సౌకర్యంగా యుద్ధం చేస్తున్నారు, వాళ్లు ఎనిమిది గంటల పనిదినాన్ని అనుసరిస్తున్నారు."

"జర్మన్ల పనిదినం కూడా ఎనిమిది గంటలేనా?" ప్లూజ్నికొవ్ అపనమ్మకంతో అడిగాడు. "వాళ్లకి ఫాసిజం ఉంది కదా."

"నిస్సందేహంగా ఉంది."

"అయినా నేనీ సైనికకొలువుకి సరిగా యిప్పుడే ఎందుకు రావాలి?" ప్రిజ్న్యూక్ అకస్మాత్తుగా అన్నాడు. "నాకు కావాలంటే యిప్పుడైనా వెళ్లొచ్చు, లేకపోతే ఆకురాలు కాలంలోనైనా వెళ్లొచ్చునని చెప్పాడు కమాండరు. నేనిప్పుడే వెళ్తానని చెప్పాను."

కొద్ది క్షణాలపాటు సాగిన కాల్పులు ప్రత్యూష ప్రశాంతిని భంగపరచాయి. వాళ్లొక ఫిరంగి గుండు గుంట దగ్గరకి దూకారు. ఇక అటుతర్వాత కాల్పుల్లేవు.

"ఒక వేళ యీ కాల్పులు మనవాళ్లవేమో?" ప్రిజ్న్యూక్ గుసగుసలాడాడు. "బహుశా మనవాళ్లు ముందుకొస్తున్నారేమో, ఏం?"

"వాళ్ల స్వరాలు వినవస్తున్నవైపు కాల్చారు" జవాబుగా దెనీష్చిక్ దాదాపు శబ్దరహితంగా గుసగుసలాడాడు. "దుంపతెగ మనవాళ్లే!"

అతను ఆగాడు, మళ్లీ వాళ్లు చెవులురిక్కించి విన్నారు. ఎక్కడో అతి సమీపంలో అత్యంత అస్పష్టంగా లోహసంబంధమైన శబ్దం అయినట్లు ప్లూజ్నికొవ్‌కి అనిపించింది. అతను సరిహద్దు గస్తీ సైనికుని భుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

"నీకు వినిపిస్తోందా?"

దెనీష్చిక్ తన ఉక్కు శిరస్త్రాణాన్ని తన సబ్‌మెషీన్ గన్నుకి తగిలించి దాన్ని పైకెత్తాడు. కాల్పేమీ రాలేదు, దానితో అతను దాన్ని క్రిందకి దించాడు.

"నేను చుట్టూ చూస్తాను. మీరు వంగి ఉండండి."

నిశ్శబ్దంగా అతను ఆ గుంటలోంచి పైకి పాకి, అంచు మీదుగా అదృశ్యమయ్యాడు. సాల్నికొవ్ దగ్గరగా జరిగి, ప్లూజ్నికొవ్ చెవిలో గుసగుసలాడాడు.

"ఇదుగో మీ ఎనిమిది గంటలు గాళ్లు. మనం ఆ నీళ్లని అక్కడ వదిలి ఉండాల్సింది కాదు, కామ్రేడ్ లెఫ్టినెంట్. వాళ్లకి కావలసిన నీళ్లు వాళ్లే తెచ్చుకుందురు."

"కాని అక్కడున్నదైనా మనవాళ్లే కదా" ప్రిజ్న్యూక్ మొండిగా రెట్టించాడు. "వాళ్లు ఆయుధాలు పోగుచేస్తారు."

ఆ గోతి అంచుమీద ఏదో పడింది, అది క్రిందకి దొర్లి ఒకని శిరస్త్రాణానికి తగిలింది. ప్లూజ్నికొవ్ తల తిప్పి చూశాడు. అది పొడుగాటి హేండిలు వున్న ఒక హేండ్ గ్రెనేడు. ఒక్క క్షణంపాటు అతనికి అది బుస్సుమంటున్నదనిపించింది. ఇంకేముంది, దీనితో సరి అనుకోడానికీ, గుండెలో కలుక్కుమనే బాధను అనుభూతి చెందడానికీ, తనకు అత్యంత ప్రీతి పాత్రమైన దేన్నో – తన తల్లినో, వేరానో – జ్ఞాపకం చేసుకోడానికీ అతనికి ఒక్క క్షణం వ్యవధి చిక్కింది, కానైతే దీనంతటికీ అతనికి ఒక సెకనుకు లోపే పట్టింది. ఆ సెకండు

దాటేలోగా అతనా గ్రెనేడును దొరకపుచ్చుకొని, చేతితో దాని వేడిని అనుభూతిచెంది, దాన్ని చీకట్లోకి విసిరేశాడు. అది భళ్లున పేలింది, ఇసుక వర్షంలా కురిసింది, దానితో బాటే దెనీష్చిక్ కేక వినిపించింది.

"జర్మన్లు! పరుగెత్తండబ్బాయిలూ పరుగెత్తండి!"

అన్ని వేపుల్నించీ వస్తున్న ఫిరంగి గుళ్ల మ్రోతతో ప్రత్యూష ప్రశాంతి భగ్నమైంది. చర్చికీ, 333వ రెజిమెంటున్న నేలమాళిగలకూ దోవలు బందైపోయాయి.

"ఇటు!" సరిహద్దు గస్తీ సైనికుడు కేకేశాడు.

కేక వినవచ్చిన దిశను ప్త్లాజ్నికొవ్ గుర్తించగలిగాడు, వంగుని అటు దూసుకెళ్లాడు. వాళ్ల చుట్టూ కాల్పులు సమీపిస్తున్నాయి. ఏ ఫిరంగి గుండు గుంటలో నుంచైతే తన కాల్పుల ద్వారా దెనీష్చిక్ వాళ్లకి రక్షణ కల్పిస్తున్నాడో ప్లూజ్నికొవ్ ఆ గుంటలోకి దొర్లాడు. అతని వెనకాలే సాల్నికొవ్ కూడా ఆ గుంటలోకి జారాడు.

"ప్రిజ్న్యాక్ ఏడి?"

"చచ్చిపోయాడు" కాలుస్తూ సాల్నికొవ్ అరిచాడు.

జర్మన్ బులెట్లు వాళ్ల చుట్టూ కురుస్తూ వాళ్లని క్రిందకు వంగేలా చేస్తున్నాయి.

"తర్వాతి గుంటదగ్గరకి పరుగెత్తండి" దెనీష్చిక్ అరిచాడు. "తర్వాత నాకు రక్షణగా కాల్చండి. తొందరగా, లెఫ్టినెంట్, తొందరగా!"

కాల్పులు మరింత రౌద్రంగా తయారయ్యాయి. చర్చిలోని మెషీన్ గన్ కాల్పుల మెరుపులపైకి గురిపెట్టబడింది, 333వ రెజిమెంటున్న నేలమాళిగలనుంచీ, దానికింకా ఎడమపక్కగా వున్న శిధిలాలనుంచీ గుళ్లవర్షాలు కురిశాయి. ప్లూజ్నికొవ్ తదుపరి ఫిరంగి గుండు గుంట దగ్గరకి పరిగెత్తి, అందులోకి దూకి — తమను కలుసుకునేందుకు పరుగున వస్తున్న దెనీష్చిక్‌కి తగలకుండా జాగ్రత్తపడుతూ — తొందరగా కాల్చడం మొదలుపెట్టాడు. సాల్నికొవ్ సబ్‌మెషీన్ గన్ను పనిచేయకుండా బిగుసుకుపోయింది.

కాల్పులద్వారా ఒకరికి మరొకరు రక్షణ కల్పించుకుంటూ, కొద్దికొద్ది దూరాలు పరుగెత్తుతూ చివరకు వారు నిర్మానుష్యంగా వున్న కొన్ని శిధిలాలను చేరుకున్నారు. ఆదరా బాదరా మరికొన్ని కాల్పులు కాల్చిన తర్వాత జర్మన్లు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కాల్పులు తొలి వేకువ నిస్తేజకాంతిలో క్రమంగా అంతరించిపోయాయి. ఇప్పుడిక వారు కొద్ది విశ్రాంతి తీసుకొని, కొంచెం ఊపిరి తీసుకోవచ్చు.

"ఓ, ఏం పరుగు, ఏం పరుగు!" శిధిల ఖండాలపై కూర్చొంటూ ఎగరొప్పుతూ దెనీష్చిక్ అన్నాడు. "ఇప్పుడు పరుగెత్తిన పరుగుకి, నూరు మీటర్ల పందెంలో, నేను ప్రపంచ చాంపియన్‌ని అయ్యుందును."

‘‘మళ్లీ అదృష్టం కలిసొచ్చింది!’’ సాల్నికొవ్ అకస్మాత్తుగా నవ్వాడు. ‘‘మనకెలాగైనా అదృష్టం కలిసేవస్తోంది.’’

‘‘ఇంక చాలించు!’’ ఫ్లూజ్నికొవ్ అతని మాటలను త్రుంచేశాడు. ‘‘మళ్లీ ఇంకోసారి నీ గన్ను బిగుసుకుపోకుండా దాన్ని జాగ్రత్తగా సరిచూసుకుంటే మంచిది.’’

సాల్నికొవ్ చిన్నబుచ్చుకొని, నిశ్శబ్దంగా తన సబ్‌మెషీన్ గన్నుని విప్పదీశాడు. ఫ్లూజ్నికొవ్‌కి మనస్సులో కొంత యిబ్బందిగా అనిపించినా, సంతోషంగా సాల్నికొవ్ కొట్టే గప్పాలు తమ అందరి నెత్తిమీదకీ ఆపత్తును తేవచ్చునన్న మూఢనమ్మకాన్ని అతను వదలించుకోలేకపోయాడు. పైగా అతను చాలా ఆదుర్దా చెందుతున్నాడు — యిప్పుడు తాము యితరుల నుంచి పూర్తిగా వేరుపడిపోయారు.

‘‘పరిసరాలు పరిశీలించండి’’ అతను చెప్పాడు. ‘‘నేను కాపలా వుంటాను.’’

నది ఒడ్డునుంచి మధ్యమధ్య వినవస్తున్న ఒకటీ అరా కాల్పులు తప్ప కాల్పులు ఆగిపోయాయి. ఆ అపరిచిత శిథిలాలనుంచి పొగ, పెట్రోలు వాసనలతోబాటు, ఫ్లూజ్నికొవ్ గుర్తుపట్టజాలని వెలపరం కలిగించే కంపేదో వెలువడుతోంది. ప్రత్యూష పవనాంకురాలు కుళ్లుతున్న శవాల దుర్గంధాన్ని మోసుకొస్తున్నాయి, దానితో అతని కడుపు దేవుతోంది.

ఇక్కడినుంచి బయటపడాలి, అనుకున్నాడతను. కాని ఎక్కడికి?

‘‘ఇవి గ్యారేజీలు’’ తిరిగివస్తూ దెనీష్చిక్ అన్నాడు. ‘‘పక్క బ్లాకులో కొందరు సజీవదహనమైపోయారు. బీభత్సం. ఇక్కడ నేలమాళిగలేమీ లేవు.’’

‘‘నేలమాళిగలూ లేవు, మంచినీళ్లూ లేవు’’ సాల్నికొవ్ నిట్టూర్చాడు. ‘‘నువ్వేమో వాళ్లు రోజుకి ఎనిమిది గంటలు పనిచేస్తారన్నావు. ఓహ్, మాతృదేశ పరిరక్షకులు.’’

‘‘జర్మన్లు దగ్గర్లో వున్నారా?’’

‘‘వాళ్లు ముహవేత్స్ నది అవతలి ఒడ్డున ఉన్నట్టున్నారు. మన కుడిపక్కన బ్యారక్సు లాంటివేవో ఉన్నాయి. ప్రశాంతంగా ఉన్న అదునులోనే మనం అక్కడకి జారుకోగలిగితే బాగుంటుందేమో?’’

వాళ్లు శిథిలాల అవతలి పక్కకి చేరుకునేసరికి వెలుగు వస్తోంది. ఇక్కడ ఫిరంగి గుళ్ల దెబ్బలు సూటిగా తగిలాయేమో, యిటుకలు పెద్దపెద్ద గుట్టలు పడివున్నాయి. వీటి వెనుక నది వుందని వాళ్లు ఊహించుకోగలిగారు, అవతలి గట్టున దూరాన వున్న పొదలను అస్పష్టంగా చూడగలిగారు.

‘‘జర్మన్లున్నది అదుగో అక్కడే’’ దెనీష్చిక్ అన్నాడు. ‘‘మనం మంచి యిరుకులో చిక్కుకున్నాం, లెఫ్టినెంట్. బహుశా యీ రాత్రి చల్లగా దాటుకోవచ్చేమో?’’

‘‘ఆజ్ఞల సంగతేమిటి? దుర్గం విడిచి వెళ్లేందుకు మనకేమైనా ఆజ్ఞలున్నాయా?’’

‘‘ఇది దుర్గమూ కాదు పాడూ కాదు, యిదొక పెద్ద సంచి. దీన్ని మరికాస్త బిగిస్తే యింక బయటపడటమంటూ వుండదు.’’

‘‘నాకిక్కడ ఉండమనే ఆజ్ఞలున్నాయి గాని, పారిపొమ్మని ఆజ్ఞలేం లేవు. నీకు కూడాను.’’

‘‘నీ నెత్తిమీద రిమ్మతిరిగే ఆ దెబ్బ తర్వాత, స్వయంగా ఆలోచించే శక్తి పోయిందా?’’

‘‘సైన్యంలో మనం ఆజ్ఞలు పాలిస్తాం. అంతేగాని మనకి మనం, ఎంతదూరం పారి పోగలమో ఆలోచించం.’’

‘‘అయితే ఆ ఆజ్ఞలేమిటో కాస్త వివరించి చెప్పు! నేనేమీ చదరంగంలో పావుని కాను. ఇక్కడీ యిటుకల గుట్టలపైన అటూయిటూ పాకడంద్వారా నేనే వ్యూహానికి తోడ్పడుతున్నానో తెలుసుకోగోరుతున్నాను. ఇవి ఎవరిక్కావాలి? యుద్ధరంగపు అలికిడి విని యిప్పటికి యిరవై నాలుగు గంటలైంది. మన సైన్యం ఎక్కడుంది? నీకేమైనా తెలుసా?’’

‘‘ఆఁ, నాకు తెలుసు, అదెక్కడుండాలో అక్కడే వుంది.’’

‘‘ఎక్కడుండాలో అక్కడేట.... అందుకనే వాళ్ళు మనల్ని చితక్కొడుతున్నారు, లెఫ్టినెంట్. అంతేకాదు, వాళ్ళు యింకా అలా బాదుతూనే వుంటారు....’’

‘‘మనమే వాళ్ళని చితక్కొడుతున్నాం!’’ ప్ల్యాజ్నికొవ్ ఆకస్మికంగా బిగ్గరగా అరిచాడు. ‘‘ఆ మాటకొస్తే మనమే వాళ్ళని చితక్కొడుతున్నాం, బోధపడిందా? మన యిటుకల గుట్టలపైన దేకుతున్నది వాళ్ళే! మనమా — మనం — యివిగో ఈ యిటుకలు మనవి! ఈ యిటుకలకింద సోవియట్ జనం వున్నారు. మన కామ్రేడ్స్. మరి నువ్వో — నువ్వొక పిరికిపందవి!’’

‘‘ఏయ్ జాగ్రత్త లెఫ్టినెంట్! మళ్ళీ ఆ మాటన్నావో, చూసుకో, నీ పదవినీ గిదవినీ నేనేం లెక్కజెయ్యను. నీ బుర్ర రామకీర్తన పాడిస్తాను!’’

‘‘ఇరుగో, మనవాళ్ళే కొందరొస్తున్నారు!’’ సాల్నికొవ్ సంతోషంగా అరిచాడు. ‘‘చూడండి, మన శాపర్లే* కదూ!’’

బ్యారక్స్ గోడపక్క ఎనమండుగురు ఆదరాబాదరా ఏదో చేస్తున్నారు. ప్ల్యాజ్నికొవ్ బయటకు పరిగెత్తాలనుకున్నాడు, కాని సరిహద్దు గస్తీ సైనికుడు అతన్ని ఆపాడు.

‘‘వాళ్ళు టాప్‌బూట్లలో వున్నారు.’’

‘‘అయితే?’’

‘‘జర్మన్ బూట్లలో. చూడు అవి కొంచెం ఎత్తు తక్కువగా ఉన్నాయి.’’

---

* శాపర్లు — యుద్ధ రంగంలో కందకాలు తవ్వడం, గుంటలు తవ్వి మందు పాత రలు పెట్టడం, యుద్ధ నిర్మాణాలు వగైరా పనులు చేసేవాళ్ళు. — సం.

''అయితే ఏమంటావ్, నేనూ జర్మన్ టాప్‌బూట్లలోనే ఉన్నాను'' సాల్నికొవ్ అన్నాడు. ''వాళ్ల బూట్ల మడమలు గొగ్గిగొగ్గిగా వున్నాయి.''

''మన శాపర్లు పట్టీలు ధరిస్తారు'' దెనీష్చిక్ అన్నాడు. ''వీళ్లందరూ టాప్‌బూట్లలో వున్నారు.''

''నాకు తెలియకడుగుతా, యింతకీ నీ భయమేమిటి?'' సాల్నికొవ్ కోపంగా అన్నాడు. ''యూనిఫారాలు మనవే.''

''యూనిఫారానికేముంది, అది వేసుకోడానికి మూడు నిమిషాలు పడుతుంది. ఇక్కడే వుండండి.'' కిందకి వంగి, దెనీష్చిక్ యింకా నిలబడివున్న గోడభాగం దగ్గరకి వెళ్లి, లాఘవంగా కిటికీ కంతదగ్గరకు ఎక్కాడు.

''వాళ్లు మన కుర్రాళ్లే అనడం స్పష్టం'' సాల్నికొవ్ గొణిగాడు. ''ముహవేత్స్ నది చాలా దగ్గరే వుంది కదా, వాళ్లదగ్గర నీళ్లుండి వుంటాయి.''

సరిహద్దు గస్తీ సైనికుడు సన్నగా యీలవేశాడు. తొందర పడుతున్న సాల్నికొవ్‌ని పడుకోమని ఆజ్ఞాపించి, ప్లూజ్నికొవ్ సరిహద్దు గస్తీ సైనికుని పక్కకి ఎక్కాడు.

''అటు చూడు'' ఎదర స్పష్టంగా కనిపించే విధంగా ఒక పక్కకి కొద్దిగా జరిగి దెనీష్చిక్ ప్లూజ్నికొవ్‌కి చోటుచేశాడు.

ఎత్తైన ఆ చోటునుంచి ముహవేత్స్ నది ఒడ్డునూ, గట్టు పొడుగునా వున్న జర్మన్ స్థావరాలనూ, నీటికి సమీపాన పొదల్లో వున్న జర్మన్ సైనికులనూ వాళ్లు చూడగలిగారు.

''ఆ శాపర్ల మీదకి వాళ్లు కాల్చడంలేదు'' సరిహద్దు గస్తీ సైనికుడు మెల్లగా అన్నాడు. ''కారణం ఏమైయుంటుంది?''

''ఔను'' ప్లూజ్నికొవ్ నిట్టూర్చాడు. ''కిందకి దిగిరా, మనం వాళ్ల కంటబడొచ్చు.''

ఆజ్ఞ మేరకు నేలపైన పడుకొని వున్న — అప్పటికీ కుతూహలం ఆపుకోలేక తల పైకెత్తి చూస్తున్న — సాల్నికొవ్ దగ్గరకి వాళ్లు తిరిగివచ్చారు.

''ఏం? ఏం కనిపించింది?''

''వాళ్లు జర్మన్లు.''

''కథలు చెప్పకు! మరి ఆ యూనిఫారాల సంగతేమిటి?''

''పైతొడుగు చూసి మోసపోకు, లోపల ఏముందో చూడమన్నారందుకనే'' సరిహద్దు గస్తీ సైనికుడు గంభీరంగా నవ్వాడు. ''వాళ్లు గోడలకింద మందుపాతరలు పెడుతున్నారు. వాళ్లని ఓ మొత్తు మొత్తేద్దామేమిటి, లెఫ్టినెంట్? అవతల పక్క మన కుర్రాళ్లున్నారు.''

''అలా చేస్తే భేషుగ్గానే వుంటుంది'' ప్లూజ్నికొవ్ సాలోచనగా అన్నాడు. ''ఒక్కటే చిక్కు, తర్వాత ఎక్కడికి తగ్గడం అని?''

''మరి యిప్పుడెవళ్లు ఆలోచిస్తున్నారు పారిపోయే విషయం — మీరా, నేనా?''

"మూర్ఖంగా మాట్లాడకు!" ఫ్లాజ్నికొవ్ తుంచేశాడు. "వాళ్ళ కాసిని ఫిరంగి గుళ్ళు యిక్కడికి కొడితే అంతతో మన పని సరి: యిక్కడ పైకప్పులేదు."

"నువ్విప్పుడన్న దాంట్లో కొంచెం విజ్ఞత వుంది" సరిహద్దు గస్తీ సైనికుడు ఆమోద పూర్వకంగా అన్నాడు.

ఫ్లాజ్నికొవ్ చుట్టూ కలియజూశాడు. యిటుకల గుట్టలమధ్య ఫిరంగి గుళ్ళనుంచి రక్షణ లేదు. గోడలంటూ యింకేమైనా నిలబడివుంటే అవి మొదటి అదురుకే కూలిపో వచ్చు. వెనక్కి తగ్గేందుకు మార్గమేమీ లేకుండా పోరాటం జరపడమంటే ఆత్మహత్య చేసుకోడంతో సమానమే తప్ప మరేమీ కాదు. ప్రతి ఒక్క ప్రతిఘటనాకేంద్రం వంకా జర్మన్లు కాల్పుల జడివాన కురిపిస్తున్నారు — అనుభవరీత్యా ఫ్లాజ్నికొవ్‌కి యీ విషయం తెలుసు.

"ముందుకి పోతేనో?" సాల్నికొవ్ సూచించాడు. "మన బ్యారక్సుకి. నేరుగా అటే — హాఁ?"

"ముందుకా!" సరిహద్దు గస్తీ సైనికుడు వెక్కిరింతగా అన్నాడు. "బలే గొప్ప వ్యూహ కర్త!"

"కాని ఏమో, అతను చెప్పింది సరైనదేనేమో" ఫ్లాజ్నికొవ్ అన్నాడు. "పాకి వెళ్ళడం, గ్రెనేడ్లు విసరడం, అప్పుడిహ నేరుగా బ్యారక్సుకి పరిగెత్తడం. వాటికి నేలమాళి గలున్నాయి."

సరిహద్దు గస్తీ సైనికుడు అయిష్టంగానే ఆమోదించాడు. శత్రువు కళ్ళ ఎదుట దాడిచెయ్యడమన్న ఆలోచన అతనికి నచ్చలేదు. ప్రత్యేకమైన జాగ్రత్త అవసరం, అందుకని వాళ్ళు చాలసేపు — తడవకి ఒకరు చొప్పున కదుల్తూ — పాకారు. మిగిలిన యిద్దరూ వెనక ఆగి, మూడోవానికి రక్షణ కల్పించేందుకు సిద్ధంగా ఉంటూ జర్మన్లని కనిపెట్టి చూస్తూ ఉండగా, మూడోవాడు తవుటిపాములాగ ముందుకి పాకేవాడు.

బ్యారక్సు గోడలక్రింద ప్రేలుడు పదార్థాలు పెడుతున్న జర్మన్ శాపర్లు కుడితట్టుకి గాని, ఎడమతట్టుకి గాని చూడనే లేదు. చుట్టూ ఎవరూ లేరన్న ధీమాతోనైనా ఉండి ఉండాలి, లేక ముహవేత్స్ నది ఒడ్డున వున్న తమ సైనికులు తకిమ రక్షణ కల్పించేందుకు సిద్ధంగా వున్నారన్న దిలాసాతోనైనా ఉండి ఉండాలి. వాళ్ళు మందుపాతరలు పెట్టి, నీటుగా తీగలు అమరుస్తూండగా దగ్గరున్న గుంటలోంచి మూడు గ్రెనేడ్లు ఎగిరివచ్చాయి.

వాటి దెబ్బకు గురికాకుండా బ్రతికి బయటపడ్డవారు సబ్‌మెషీన్ గన్నులతో ఖతం చెయ్యబడ్డారు. ఇదంతా ఆకస్మికంగా, చకాపికీగా జరిగిపోయిందేమో, ముహవేత్స్ నది అవ తలనుండి ఒక్క కాల్పు కూడా రాలేదు.

"మందు పాతరలు!" ఉన్మత్తావేశంతో తీగలను తెంపేస్తూ ఫ్లాజ్నికొవ్ అరిచాడు. "ప్రేలుడు మందు పాతరలు తీసుకోండి!"

జర్మన్లు మేల్కొని గుళ్ల వర్షం కురిపించేలోగా ప్రేలుడు మందు పాతరలను లాగే సేందుకు దెనీస్చిక్, సాల్నికొవ్‌లకు కటాకటీగా వ్యవధి చిక్కింది. బులెట్లు యిటుకలకు టపటప కొట్టుకున్నాయి. ఆ ముగ్గురూ గోడమూలకు పరుగెత్తారు, కాని అప్పడిక ఫిరంగి గుళ్లు వర్షించసాగాయి. చెవులు గళ్లుపడి, కళ్లు సగం కనిపించని స్థితిలో వాళ్లొక కన్నంలోకి, నేలమాళిగల అంధకార ఉదరంలోకి దూరారు.

"ఇంకా బతికే వున్నాం!" సాల్నికొవ్ ఉన్మత్తానందంతో నవ్వాడు. "నేను ముందే చెప్పాను! నేను మీకు ముందే చెప్పాను!"

"నా కాలు." చీలిన తన బూటు పై భాగాన్ని తడుముతూ ప్లూజ్నికొవ్ అన్నాడు. అతని చేతికి రక్తం అంటింది. "బ్యాండేజీలేమైనా వున్నాయా?"

"లోతుగా తగిలిందా?" దెనీస్చిక్ ఆదుర్దాగా అడిగాడు.

"లేదనుకుంటాను. చిన్న ఇనుప తునకై యుంటుంది."

సరిహద్దు గస్తీ సైనికుడు చెమటతో నానిన తన బనీనునుంచి ఓ పీలిక చింపాడు. "గట్టిగా కట్టు."

ప్లూజ్నికొవ్ తన బూట్లు ఊడదీశాడు. తన పాంటు కాలు మడిచాడు. రంపపు పళ్ల మాదిరిగా ఉన్న గాయంనుంచి రక్తం ధారగా కారుతోంది. అతను మురికిగా వున్న ఒక జేబురుమాలును మెత్త మాదిరిగా మడతబెట్టి, దాన్ని గాయంపై పెట్టి, దానిపైన గుడ్డ పీలికతో గట్టిగా కట్టాడు. కట్టు రక్తంతో ఉబ్బింది కాని రక్త స్రావం కట్టుబడింది.

"నువ్వు లక్షణంగా తేరుకుంటావు" అన్నాడు దెనీస్చిక్.

సాల్నికొవ్ దిగ్భ్రాంతుడై తిరిగివచ్చాడు.

"ఈ కన్నం తప్ప, బయటి కెళ్లేందుకు యింకే మార్గమూ లేదు."

"అబ్బే, అలా ఎలా వుంటుంది, అది అసంభవం."

"కాని అలాగే వుంది. నేను అన్ని గోడలూ తనిఖీ చేశాను."

"ఈ సారి ఫిరంగి కాల్పులు మొదలైనప్పుడు మన పని బోనులో చిక్కుకున్న ఎలుకల మాదిరి అవుతుంది" దెనీస్చిక్ చిరాకుగా మేలమాడాడు. "ముగ్గురికీ ఉమ్మడి సమాధి."

వాళ్లా నేలమాళిగ చుట్టూ – ప్రతి మీటరు జాగానీ జాగ్రత్తగా పరిశీలిస్తూ – ప్రదక్షిణం చేశారు. వెనక గోడని అనుకొని యిటుకలు గుట్టగా పడివున్నాయి – అవి పైకప్పు నుంచి రాలి వుంటాయనడం స్పష్టం – వాళ్లు వాటిని తొలగించనారంభించారు. పైనుంచి వాళ్లకి డైవ్‌బాంబర్ల* కూతలూ, ప్రేలుళ్లూ వినవస్తున్నాయి – జర్మన్లు తమ ఉదయపు బాంబింగు ప్రదక్షిణాలు ప్రారంభించారన్నమాట. ఆ హోరు నేరుగా నెత్తిమీదనుంచే విన

---

* కిందికి వేగంగా దిగివచ్చి బాంబులువేసిపోయే యుద్ధవిమానాలు. – సం.

వస్తోంది, గోడలు అదిరాయి, అయినా వాళ్ళు యిటుకలు తొలగిస్తూనే వున్నారు. వాళ్ళ ఆ రాతి భోషాణంలో చెయ్యడానికి మరేమీ లేనూ లేదు. ఉన్న అవకాశమైనా అత్యల్పమైనదే, కాని యీసారి వాళ్లకి అదృష్టం కలిసిరాలేదు. చిట్టచివరి యిటుకముక్క తొలగించిన తర్వాత సైతం వాళ్లకి యిటుక గోడ మాత్రమే కనిపించింది — నేలమాళిగల్లోని యీ భాగానికి రెండో ద్వారం లేదు. అక్కడ ఉండటం అసంభవం, జర్మన్లు చాల దగ్గర్లో వున్నారు, వాళ్ళు తమను కనిపెట్టి ఓ రెండు గ్రెనేడ్లను కన్నంలోకి విసిరేశారో, యిహ అంతటితో తమ పని సరి. తామిక్కడినుంచి వెళ్లిపోవాలి, అది కూడా చాలా తొందరగా.

''వాళ్లు బాంబులేసేటప్పుడు పోదాం!'' సరిహద్దు గస్తీ సైనికుడు కేకేశాడు. ''అప్పుడు సబ్‌మెషీన్ గన్నర్లుండరు!''

కాని ఆ కలకలంలో అతని మాటలు మునిగిపోయాయి. ప్రేలుళ్ల దుమ్మునీ, వేడి గాలుల్నీ, మందుగుండుకీ, కుళ్లుతున్న శవాలకీ సంబంధించిన పొడుగబ్బునీ, కిటికీగుండా లోనికి తరిమాయి. కారుతున్న చెమటకు వాళ్ల కళ్ళు మండుతున్నాయి. అది శరీరాలమీదుగా కాల్వల్లా కారుతోంది. దాహం దుర్భరక్లేశంగా తయారైంది.

బాంబింగు ఆగిపోయింది, విమానాల మోతా, త్వరితంగా కాల్చే కాల్పులూ విన వస్తున్నాయి. విమానాలింకా దుర్గంపై ప్రదక్షిణాలు చేస్తూనేవున్నాయి, ఫిరంగులూ, మెషీన్ గన్నులూ గుళ్ళు గుప్పిస్తూ చీకాకుపరుస్తూనే వున్నాయి.

''పదండి పోదాం!'' ద్వారం దగ్గర నిలబడ్డ దెనీష్చిక్ గట్టిగా అరిచాడు. ''వాళ్ళు ఓ పక్కకి వెళ్లారు. మళ్లీ మనం వేరుచెయ్యబడేలోగా పోదాం పదండి!'' అతను బయట అడుగు పెట్టి, చుట్టూ కలియజూసి, వెనక్కి గంతేశాడు — ఆ ఊపుకి ఫ్లూజ్నికోవ్‌కి దాదాపు పడినంత పనైంది. ''జర్మన్లు!''

వాళ్ళు వెనక్కి గోడకి కరుచుకున్నారు. విమానాల మోత స్థానంలో రైఫిలు కాల్పుల మోతలు వినవచ్చాయి. కాని వాటి సందున వాళ్లకు అడుగుల చప్పుడూ, విదేశీ భాషలో మాటలూ వినవచ్చాయి. చెవులు గళ్లుపడచేసే రొదలో తమ బ్రతుకును ప్రభావితం చేసే శబ్దాలను వేరుచేసి చూడటం వాళ్ళు నేర్చుకున్నారు.

క్షణకాలం నల్లని స్వరూపం ఒకటి ద్వారాన్ని కప్పింది. ఎవరో గాని ఆ రాతి భోషాణంలోకి జాగ్రత్తగా తొంగిచూసి అదృశ్యమయ్యారు. ఫ్లూజ్నికోవ్ నిశ్శబ్దంగా తన సబ్‌మెషీన్ గన్ సేఫ్టీకాచ్‌ని లాగాడు. అతని గుండె ఎంత గట్టిగా కొట్టుకుంటోందంటే అది జర్మన్లకు వినబడుతుందేమోనని అతడు భయపడ్డాడు.

సమీపంలో మళ్లీ మానవ స్వరాలు వినిపించాయి. ఓ గ్రెనేడ్ ఎగిరివచ్చి వెనక గోడకి తాకింది. కాని అది పేలేలోగా వాళ్లకు నేలపై బోర్లా పడుకునేందుకు అవకాశం దొరికింది.

ఇక్కడ, ఈ యిరుకు నేలమాళిగలో, ఆ మోత బాధాకరమైనంత బిగ్గరగా వుంది. గ్రెనేడ్ తునకలు గోడలకు కొట్టుకున్నాయి, గబ్బుకొట్టే పొగ వాళ్ల ముఖాలను మాడ్చింది.

ఫ్లాజ్నికొవ్‌కి భయభీతుడయ్యేందుకుగాని, లోహపు తునకలు పైకి ఎగిరి పోయాయిలే, అమ్మయ్య, అనుకునేందుకుగాని వ్యవధి చిక్కలేదు. రెండు అంగల అవతల జర్మన్లున్నారు, ఎవరైనా గాయపడ్డారా అని అడిగేందుకు సైతం అతను సాహసించలేకపోయాడు. అతనక్కడ, నిశ్చలంగా రాబోయే రెండో గ్రెనేడ్ కోసం ఎదురుచూస్తూ వేచియుండాల్సివచ్చింది.

కాని, యింకేమీ రాలేదు. కబుర్లు చెప్పుకుంటూ జర్మన్లు అక్కడినుంచి వెళ్లిపోయారు. అడుగుల చప్పుడు దూరమైంది, జర్మన్లు తదుపరి విభాగాన్ని తనిఖీచేసిన సందర్భంగా అయిన ప్రేలుడు శబ్దం మందంగా వినవచ్చింది.

"అందరూ బాగున్నారా?" ఫ్లాజ్నికొవ్ మెల్లగా అడిగాడు.

"బాగానే వున్నాం" దెనీష్చిక్ అన్నాడు. "నిశ్శబ్దం, లెఫ్టినెంట్."

వాళ్లు ఆ రోజంతా, చీకటి పడేదాకా, ఆ నేలమాళిగలోనే వుండిపోయారు. చెవులు రిక్కించి వింటున్న వాళ్లకు విదేశీ మాటలు వినవస్తున్న కారణంగా వాళ్లు కదిలేందుకూ మెదిలేందుకూ కూడా భయపడ్డారు. చుట్టూ జర్మన్లున్నారు. ఉద్రిక్తతతో వాళ్ల కండరాలు తిమ్మిర్లెక్కి బాధపెట్టసాగాయి.

పైన ఏం జరుగుతున్నదీ వాళ్లు తెలుసుకోలేకపోయారు. వాళ్లకి కాల్పులు విన వస్తున్నాయి, రెండు సార్లు మాత్రం ఆయుధాలు విసర్జించి లొంగిపొమ్మంటూ, అందుకు ఒక గంట వ్యవధినిస్తున్నామంటూ జర్మన్లు లౌడ్‌స్పీకర్లద్వారా చేసిన హెచ్చరిక విజ్ఞప్తులు వినవచ్చాయి. కాని, జర్మన్లు బ్యారక్కులోని ఆ భాగాన్ని ఆక్రమించుకొన్న కారణంగా, వాళ్లు ఆ వ్యవధిని వినియోగించుకోలేకపోయారు.

రాత్రి పడినప్పుడు, యీ రాత్రి అంతకు పూర్వపు రాత్రులకన్న కలకలంగా వున్నప్ప టికీ, వాళ్లు సాహసించి బయటకు వెళ్లారు. నది ఒడ్డును జర్మన్లు సైన్యంతో గట్టిగా బందోబస్తుచేశారు, దుర్గాన్ని వాళ్లు వెలుగులు వెదజల్లే రాకెట్లద్వారా కాంతివంతంగా ఉంచారు, ఫిరంగి కాల్పులు నిరంతరాయంగా సాగుతూనే వున్నాయి. జర్మన్ శాపర్లు క్రమ బద్ధంగా గోడలను, లోకప్పులను, పైకప్పులను కూల్చి, తమ ఆకస్మిక దాడిదళాలకు మార్గాన్ని సుగమంచేసే క్రమంలో మధ్యమధ్య పెద్ద ప్రేలుళ్లు సంభవిస్తున్నాయి.

రికన్నాయిటర్‌చేసి స్థలపరిశీలన జరిపేందుకు దెనీష్చిక్ బయల్దేరాడు. అతను వెళ్లి చాల సేపైంది. తాము అక్కడినుంచి వెళ్లిపోవలసిన తరుణం ఆసన్నమైందని సాల్నికొవ్ గుసగుసగా చెప్పాడు. కాని దగ్గర్లో కాల్పులు జరిగిన సవ్వడిలేదు, మరి పోరాటం జరపకుండా సరిహద్దు గస్తీ సైనికుడు లొంగిపోతాడని ఫ్లాజ్నికొవ్ నమ్మలేకపోయాడు. అందుకని అతను వేచియున్నాడు.

చివరకు సరసర శబ్దమైంది, ద్వారందగ్గర ఒక శిరస్సు కనిపించింది.

"పాకిరండి. నిశ్శబ్దం. జర్మన్లు దగ్గర్లోనే వున్నారు."

బయటి గాలి క్రుళ్లిన కళేబరాల దారుణమైన కంపుతో భారంగా ఉంది, ఆ కంపు పొడారిపోయిన గొంతులను రాసుకొని వికారం కలిగించి కడుపులో దేవుతోంది. ప్లూజ్నికొవ్ తన నోటితో ఊపిరి పీల్చుకొనేందుకు ప్రయత్నించాడు.

పికాక్సులు, గునపాల థడ్‌థడ్ శబ్దాలతో కలిసి చుట్టూ సర్వత్రా జర్మన్ స్వరాలు వినవస్తున్నాయి. శాపర్లు గోడల్లో కన్నాలుచేసి మందుపాతరలు పెడుతున్నారు. ఇటుక తుంటల గుట్టలపైగా వాళ్లు ముగ్గురూ చాలసేపు — వెలుగులు వెదజల్లే రాకెట్లు పైకి ఎగిరినప్పుడల్లా కదలకుండా పిడచకట్టుకుపోతూ — పాకారు.

చివరకు వాళ్ళు దిగిన లోతు గొయ్యి, ఘోరంగా కంపుకొట్టేస్తోంది. ఆ గోతి అడుగున అనేక కళేబరాలున్నాయి. అవన్నీ ఫిరంగి గుళ్ల తాకిడికి ఛిన్నాభిన్నమై, మూడు రోజులుగా ఎండ వేడికి కాగి బాగా ఉబ్బి వున్నాయి. కాని యిక్కడ కనీసం వాళ్లు కొంచెం విశ్రాంతి తీసుకొని, తామెక్కడ వున్నామో తెలుసుకొని తరువాత ఏం చెయ్యాలో నిర్ణయించుకొనే పరిస్థితిలో వున్నారు.

"మనం తిరిగి చర్చికి చేరుకోవాలి" సాల్నికొవ్ ఉద్రేకంగా వాదించాడు. "ఆ గోడ లున్నాయే, అవి మందమైనవి! నేనెలాగో ఒకలాగ నీళ్లు సంపాదిస్తాను. వాళ్ళ కళ్లముందే పాక్కుంటూ వెళ్లి నేను నీళ్లు తెస్తాను!"

"ఆ చర్చి ఒక ఎలుకలబోను" సరిహద్దు గస్తీ సైనికుడు మొండిగా అన్నాడు. "జర్మన్లు రాత్రిపూట గోడలదగ్గరకి పాకివచ్చి, మనల్ని చుట్టుముడతారు, అంతే, దానితో మన పని సఫా. నేలమాళిగలున్నాయే, అదే తగిన చోటు, అక్కడ మనవాళ్లు ఎక్కువమంది వున్నారు."

"ఎక్కువ జనమేగాని, తక్కువ నీళ్ళు! నువ్వైతే రోజంతా ఫిరంగి గుండు గుంటలో నిద్రపోయావు, కాని నేను నేలమాళిగల్లో వున్నాను. వాళ్లు గాయపడినవాళ్లకు, మందు మాదిరిగా చెమ్చాల కొలతతో మంచినీళ్లు యిస్తున్నారు. మిగిలిన వాళ్లు నోట్లో వేళ్లేసుకుని చీక్కుంటున్నారు. నేను మాత్రం నీళ్లు లేనిదే గడపలేను."

ప్లూజ్నికొవ్ యీ వాదాన్ని వింటున్నాడేగాని అతని మనస్సెక్కడో వుంది. జర్మన్లకు కేవలం రెండంగల దూరంలో వాళ్ళు పడుకుని రోజంతా గడిపారు, శత్రువు నిజంగానే తన ఎత్తుగడలను మార్చినట్లు అతను గ్రహించాడు. శాపర్లు పట్టుదలగా గోడలను పగుల గొట్టి, ప్రేలుడు మందుపాతరలు అమర్చి, కట్టడాలు కూల్చివేస్తున్నారు. వాళ్లు ఎలుకల మాదిరిగా రక్షణలను దొలిచేస్తున్నారు. ఈ విషయాన్ని త్వరితంగా రిపోర్టుచెయ్యాలి. అతనీ విషయాన్నే తన సైనికులకు చెప్పాడు. సాల్నికొవ్ ముఖం వాడిపోయింది.

"అది నిర్ణయించాల్సింది నేను కాదు."

“మనవాళ్లే మనల్ని కాల్చకుండా చూసుకోవడం అవసరం” దెనీష్చిక్ కలవరపాటుతో అన్నాడు. “మనం చీకట్లో తారసిల్లుతాం. మనం అరిచామో, జర్మన్లు మనల్ని ఫిరంగి గుళ్లతో నుగ్గునూచచేస్తారు.”

“మనం బ్యారక్సుగుండా వెళ్లాలి” ఫ్లాజ్నికొవ్ అన్నాడు. “అన్ని నేలమాళిగలూ వేరుచెయ్యబడటం సాధ్యం కాదు.”

“ఇక్కడికింకా వచ్చామో లేదో, అప్పుడే వెనక్కి వెళ్లాలిట” సాల్నికొవ్ గొణిగాడు. “చర్చి నయం, కామ్రేడ్ లెఫ్టినెంట్.”

“చర్చి సంగతి రేపు చూద్దాం” ఫ్లాజ్నికొవ్ అన్నాడు. “మొట్టమొదట మనం ఆ శాపర్లను బెదరగొట్టాలి.”

“అద్దదీ, ఆలోచనంటే అలా వుండాలి, లెఫ్టినెంట్” సరిహద్దు గస్తీ సైనికుడు అన్నాడు. “జర్మన్లని ఓ బాదుబాదడం, ఆ తర్వాత మన వాళ్లని కలుసుకోడం.”

కాని, తీరా ఆచరణలో అది అలా జరగలేదు.

ఫ్లాజ్నికొవ్ పైకి పాకుతూండగా, గాయపడిన అతని కాలు తగిలి, యిటుకలు క్రిందకు జారాయి. అతను వెనక్కి పడటంతో, ఆ శబ్దం దిశగా సబ్‌మెషీన్ గన్ను కాల్పులు సాగాయి.

వాళ్లు రెజిమెంటును చేరుకోలేకపోయారు, అందుకు బదులుగా వాళ్లు ముహవేట్స్ నదియొడ్డున గల వలయాకారపు బ్యారక్సును చేరుకున్నారు. ఈ రంగంలో శ్మశాన నిశ్శబ్దం ఆవరించియుంది, కిటికీలలో యిటు మిత్రుల జాడగాని, అటు శత్రుల జాడగాని అక్కడ కానరాలేదు. కాని ఆలోచనకు వ్యవధి లేదు. అత్యంత సమీపంలో వున్న – నేలమాళిగలకు దారితీసే – అంధకార గహ్వరంలో దూరి వాళ్లు గోడలకు కరుచుకోగానే, టకటకమంటూ జర్మన్ బూట్ల శబ్దాలు వాళ్ల నెత్తిపైగా వినిపించాయి.

“అదే పనిగా మీనమేషాలు లెక్కబెడుతూ కూర్చున్నాం” అంతా మాటుమణిగాక దెనీష్చిక్ అన్నాడు.

జవాబిచ్చేందుకు ఎవరికీ వ్యవధి లేకపోయింది, ఈలోగా చీకట్లో ఒక బోల్టు క్లిక్‌మంది.

“ఎవరది? కాల్చేస్తాను!” చీకట్లోంచి ఒక బొంగురు స్వరం గర్జించింది.

“మిత్రులే” ఫ్లాజ్నికొవ్ బిగ్గరగా చెప్పాడు. “ఎవరది?”

“మనవాళ్లేనా?” ఆ స్వరంనుంచి కష్టంమీద, ఆగిఆగి, మాటలు వెలువడుతున్నట్లున్నాయి. “మీరెక్కడినుంచి?”

“బయటనుంచి” దెనీష్చిక్ చిరాకుగా అన్నాడు. “జర్మన్లు పైన ఉన్నారు. ఈ యక్ష ప్రశ్నలకు యిప్పుడే మంచి ముహూర్తం. నువ్వెక్కడున్నావ్?”

“దగ్గరకి రాకు, వచ్చావో కాల్చేస్తాను. మీరెంతమంది?”

"మతిమాలిన మూర్ఖుడు!" సాల్నికొవ్ కోపంగా అన్నాడు. "మేం ముగ్గురం. మీరెంత మందేమిటి?"

"మీలో ఒక్కళ్లు యిలా రండి, మిగతావాళ్లు ఉన్న చోటనే ఉండండి."

"నేను ఒంటిగా వస్తున్నాను" ఫ్లాజ్నికొవ్ అన్నాడు. "కాల్చకండి."

తన చేతులు ముందుకు చాపి, అతను ఆ నేలమాళిగ అంధకారపు లోతుల్లోకి వెళ్లాడు.

"నా డొక్కలు వెన్నుకి అంటుకుపోయాయి" సాల్నికొవ్ గుసగుసగా అన్నాడు. "ఈ క్షణంలో ఓ గంగాళం సూపుంటే ఉప్పున ఊదేద్దును!"

దెనీష్చిక్ చాక్లెట్ అచ్చొకటి తీసి దానిలో నాల్గవ భాగం అతనికిచ్చాడు. "ఇదుగో తీసుకో."

"నీకిది ఎక్కడ దొరికింది?"

"అరువు తీసుకున్నాను" సరిహద్దు గస్తీ సైనికుడు గంభీరంగా అన్నాడు.

"అందుకనే యిది చేదుగా వుంది."

ఫ్లాజ్నికొవ్ తిరిగివచ్చాడు.

"455వ రెజిమెంటు కమిస్సారు ఆయన కాళ్లు నలిగిపోయాయి, ఆయన యిప్పటికప్పుడే యిరవై నాలుగు గంటలకు పైగా ఇక్కడ వున్నాడు."

"ఒక్కడే?"

"ఆయనతో యింకొకడు కూడా వున్నాడు. కాని అతను నిన్న కాల్చివెయ్యబడ్డాడు. సరిగా తనున్న చోటుకు పైన మొదటి అంతస్తుకి ఒక కంత వుందని, ఆయన చెప్తున్నాడు. అక్కడనుంచి మనం మనవాళ్లను చేరుకోవచ్చు. కాని మనం వెలుగొచ్చేదాకా ఆగాలి, అక్కడ కన్నుపొడుచుకున్నా కనిపించనంత గాఢాంధకారంగా వుంది."

"అలాగే వేచియుందాం. ఇది తిను లెఫ్టినెంట్."

"చాక్లెట్ కదూ? మరి లోపలున్నాయన సంగతేమిటి?"

"ఆయనకీ వుంది కొంచెం."

"నువ్విటు రా. సాల్నికొవ్, నువ్విక్కడ కాపలా వుండు."

ఎదుటి గోడవార ఒక మనిషి పడుకొని వున్నాడు; వేగంగా వస్తున్న అతని ఊపిరిని బట్టీ, దట్టమైన రక్తపు వాసనని బట్టీ వాళ్ళు తమ దోవ కనుక్కున్నారు. వాళ్లిద్దరూ అతని పక్కన కూర్చున్నారు, తాము చర్చిలో ఎలా పోరాడారో, దాన్ని ఎలా వదిలి వెళ్లారో, త్రోవలో తమకు జర్మన్లు ఎలా తటస్థపడ్డారో, తర్వాత ఎలా దాక్కున్నారో ఫ్లాజ్నికొవ్ వర్ణించి చెప్పాడు.

"దాక్కున్నారా? భేష్! కొందరు పోరాడుతూంటే మరికొందరు దాక్కుంటారు, గొప్పగా వుంది."

ఆయన తన ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకోడానికే శక్తి లేదన్నట్లు, కష్టంపైన కొద్దికొద్దిగా ఎగవూపిరి తీస్తూ మాట్లాడుతున్నాడు.

''మనమంతా మూకుమ్మడిగా మృత్యువాతపడినందువల్ల పెద్ద ప్రయోజనమేమీ వుండదు.''

''భయపడిపోయారు, అంతేనా?''

''అర్థరహితంగా చచ్చిపోవడానికి భయపడ్డాం.''

''అర్థరహితంగానా? ఆ దొంగనాకొడుకుల్లో ఒక్కణ్ణి చంపినా నీ చావుకి అర్థమున్నట్లే: దానికి మూల్యం ముట్టినట్లే. మనం యిరవై కోట్లమందిమి వున్నాం. ఇరవై కోట్లు! నువ్వు ఒక్కడినైనా చంపకపోతే అదీ అర్థంలేని పని.''

''పరిస్థితి అంత బాగా లేదు.''

''మనకి వున్నదల్లా ఒక్కటే పరిస్థితి: వాళ్ళకు విశ్రాంతి ఇవ్వకపోవడం. ప్రతి బండ వెనకనుంచీ బులెట్లు వర్షించాలి. మైకులోంచి వాళ్లేం అరుస్తున్నారో నువ్వు విన్నావా?''

''ఆఁ, విన్నాను.''

''విన్నావు, అంతే గాని విశ్లేషించలేదన్నమాట. మొట్టమొదట వాళ్ళు కేవలం మనల్ని లొంగిపొమ్మన్నారు. మనల్ని తుడిచిపెట్టేస్తామని బెదిరించేందుకు ప్రయత్నించారు. కాని ఆ తర్వాత ఏమన్నారు? 'మీ కమిస్సార్లనీ, కమ్యూనిస్టుల్నీ కాల్చిపారేసి, మా పక్షాన చేరిపొండి' అన్నారు. కాని నిన్న సాయంత్రం వాళ్ళు మరో కొత్త పాట అందుకున్నారు: 'వీరోచిత దుర్గరక్షకులారా' అంటూ — కమిస్సార్లు, కమ్యూనిస్టులు అయినా కూడా ఏ ఒక్కడు లొంగిపోయినా సరే, వాడికి భూలోక స్వర్గాన్ని ఆశజూపారు. వాళ్లెందుకని యిలా పిల్లిమొగ్గ వేశారు? ఎందుకో తెలుసా, మనం కాలుస్తున్నాం కనుక. కేవలం రక్షణకోసం ఆదరాబాదరా పరుగెత్తకుండా కాలుస్తున్నాం కనక.''

''అది సరే, మేమేమీ లొంగం'' దెనీష్చిక్ అన్నాడు.

''నాకు మీమీద నమ్మకముంది. అందుకనే మీతో నేను మాటాడుతున్నాను. మనకి ఒకేఒక్క కర్తవ్యముంది: అది వాళ్లని కాల్చడం. అంత సరళమైన కర్తవ్యమది.''

అతను అలా మాట్లాడుతూనే వున్నాడు, కాని ఫ్లాబ్నికొవ్ మళ్లీ నావలో తేలిపోతున్నాడు, నీళ్ళు నావ పక్కలకి కొట్టుకుంటున్నాయి, మళ్లీ అతను మంచినీళ్ళు తాగాడు, కాని సరిపడినన్ని తాగలేకపోయాడు. మళ్లీ వాల్యా, తెల్లని ఫ్రాక్ ధరించి, చుక్కానిదగ్గర కూర్చుంది. ఆ ఫ్రాక్ తెలుపు ఎంత ఉజ్వలంగా ఉందంటే, ఆ కాంతికి అతని కళ్ళు నీళ్ళు కమ్మాయి. లేకుంటే నిద్రలో అతను చిరునవ్వు చిందించేవాడే కాదు.

వెలుతురు రాగానే వాళ్ళు అతన్ని లేపారు, ఆ వెల్తురులో అతను, నమ్మశక్యం కానంత బక్కగా, దుబ్బులా పెరిగిన గడ్డంతో, రక్తం వచ్చేలా కొరకబడి, నిరంతరం అదురుతున్న

పెదవులతో వున్న ఆ కమిస్సారును చూశాడు. పీక్కుపోయి, దుమ్ముతో, మసితో నల్ల బారిన ఆయన ముఖంలో, కేవలం — నిశితంగా, రెప్ప వాల్చకుండా తన మనోంతరాళంలోకి గుచ్చుకుంటున్న — ఆయన కళ్ళు మాత్రమే యింకా సజీవంగా ఉన్న సంగతిని గమనించాడు.

"బాగా నిద్రపోయావా?"

ఈయన కాలాతీత వ్యక్తి.

వాళ్ళు ముగ్గురూ కలిసి ఆయన్ని ఓ కంతగుండా నిర్జనంగా వున్న బ్యారక్సు మొదటి అంతస్తులోకి సాయం పట్టి తీసుకెళ్ళారు. రెండు అంచెలుగా వున్న పడకబల్లలు ఖాళీగా వున్నాయి. వాటిపైన వున్న గడ్డిపరుపులనూ, వాటితోబాటు దుప్పట్లనూ దుర్గరక్షకులు తమతో తీసుకెళ్ళిపోయారు. నేలపైన నాలుగు మూలలా ఖాళీ తూటాల పెట్టెలూ, చితికిపోయిన యిటుకలూ, మెలితిరిగి, ఎండిపోయిన రక్తంతో అట్టకట్టిన — యూనిఫారాల పేలికలూ చిమ్మబడివున్నాయి. సూటిగా తగిలిన గుళ్ళతో ఛిద్రమైన లోపలి గోడలు బీటలు వారి నోళ్ళు తెరిచి చూస్తున్నట్టున్నాయి.

కమిస్సారును వాళ్ళు ఒక పడక బల్లపై పడుకోబెట్టారు, అతని బ్యాండేజీలను మార్చాలనుకున్నారు, కాని, ఆరి బిగిసివున్న ఆ కట్టుగుడ్డలను చింపేందుకు భయపడ్డారు. గాయాలు కంపుగొడుతున్నాయి.

"మీరు వెళ్ళండి" కమిస్సార్ అన్నాడు. "నాకో గ్రెనేడిచ్చి వెళ్ళిపొండి."

"మరి మీరు — ?" అని ప్రశ్నించాడు సరిహద్దు గస్తీ సైనికుడు.

"నేను జర్మన్లకోసం నిరీక్షిస్తాను. ఓ గ్రెనేడూ, నా పిస్తోలులో ఆరు గుళ్ళూ వున్నాయి. వీటితో నేను వాళ్ళకి స్వాగతం చెప్తాను."

ఫిరంగి మోతలు అకస్మాత్తుగా కత్తితో ఖండింపబడినట్లు ఆగిపోయాయి. ఆటు తర్వాత పరిచితస్వరం లౌడ్‌స్పీకరులో ప్రవృద్ధమై విస్పష్టంగా వినవస్తోంది.

"వీరోచిత దుర్గరక్షకులారా! మీ అర్థరహితమైన ప్రతిఘటనను విరమించుకో వలసిందిగా జర్మన్ కమాండు మీకు విజ్ఞప్తి చేస్తోంది. రెడార్మీ పరాజితమైంది — "

"నువ్వు పరమ లుచ్ఛా అబద్ధాలకోరువి!" దెనీష్చిక్ బిగ్గరగా కేకేశాడు. "నోరు ముయ్యరా ఫాసిస్టు నీచపు ముండాకొడకా!"

"యుద్ధాన్ని నువ్వు కాల్పులు, దెబ్బలతోనేగాని అరుపులు బొబ్బలతో అంతం చెయ్యలేవు." కమిస్సారు మెల్లగా నవ్వాడు. "దానికి కావలసింది కాల్పులేగాని అరుపులు కాదు. ఉద్రేకపడకు!"

ఎండవేడిమి దుర్గాన్ని ఆవరించింది, ఆ వేడిలో కళేబరాలు ఉబ్బి, కొంచెం కదిలిన ట్టున్నాయి. దట్టమైన ధూళితో, కుళ్ళుతున్న కళేబరాలనుండి వెల్వడే దుర్వాసనతో కలిసిన పొగ నేలమాళిగల్లోకి పాకింది. కాని యిప్పుడిక పిల్లలు రోదించడంలేదు, పాడియారిపోయిన వాళ్ళ కళ్ళలో యిప్పుడిక కన్నీళ్ళు మిగిలిలేవు.

"ఒక అర్ధగంటలోగా నేలమాళిగలనుంచి నిరాయుధులై బయటకు వచ్చేవాళ్లందరికీ జర్మన్ కమాండు ప్రాణాలనూ, యుద్ధానంతరం స్వేచ్ఛనూ హామీ యిస్తోంది. మీ కుటుంబాలను గురించీ, మీ ప్రియురాళ్లను గురించీ, మీ భార్యలను గురించీ, మీ తల్లులను గురించీ ఆలోచించుకోండి. రష్యన్ సైనికులారా, వాళ్లు మీ కోసం నిరీక్షిస్తున్నారు!"

ఆ కంఠ స్వరం మౌనం దాల్చింది. రాత్రింబగళ్లు పోరాటంతో, దాహంతో, బాంబింగుతో, ఆకలితో అలసిపోయిన దుర్గం కూడ నిశ్శబ్దం వహించింది. ఇది భారమైన, ప్రమాద సూచకమైన నిశ్శబ్దం. శత్రువు తుది హెచ్చరికకు ఆ నిశ్శబ్దమే ఏకైక సమాధానమైంది.

"వాళ్లు తల్లులను గురించి మాట్లాడుతున్నారు" కమిస్సారు అన్నాడు. "దీని అర్థం, యిది యిలా పరిణమిస్తుందని జర్మన్లు అనుకోలేదన్నమాట."

"ఎటు చూసినా స్తెప్ మైదానం
దూరాన, సుదూరాన ఎక్కడో మార్గం...."

సుస్పష్ట విశుద్ధ రాగలహరులు నిప్పులు చెరుగుతున్న గాలిలోకి తేలివచ్చాయి. మాతృదేశ విశాల ప్రదేశాలను గురించీ, అధికమైన ఇంటిబెంగను గురించీ వర్ణించే తమ సొంత రష్యన్ పాట అది. దాని ఆకస్మికత ప్లూజ్నికొవ్‌ను గతుక్కుమనేలా చేసింది. పెల్లుబికి వస్తున్న కన్నీళ్లను అరికట్టేందుకు అతను తన పళ్లు బిగపట్టాడు. శక్తివంతమైన ఒక స్వరం ఆ పాటను అవలీలగా గాలిలో తేలుస్తోంది, దుర్గంలోని యావన్మంది రష్యన్లూ, పొగతో నిండిన గూళ్లలో నిలబడి మౌనంగా వెక్కివెక్కి ఏడుస్తూ ఆ పాటను వింటున్నారు.

"నేను తట్టు — కో — లేను..." సాల్నికొవ్ కంపించిపోతూ, నేలపై దొర్లుతూ, తన పిడికిళ్లతో ఇటుకలను బాదాడు. "నేనిది సహించలేను! అమ్మ — అమ్మ పాట యిది!"

"చాలించు!" కమిస్సార్ కేకలేశాడు. "ఆ పందులు సరిగ్గా కోరుకుంటున్నది వాటినే! అవే — మన కన్నీళ్లనే!.."

సాల్నికొవ్ మౌనం దాల్చాడు. సంగీతం కొనసాగింది, కాని దాని మధ్య ప్లూజ్నికొవ్ ఆకస్మాత్తుగా ఒక విచిత్రమైన వరసను గుర్తించాడు. అతను చెవులొగ్గి విన్నాడు, అతను పదాలను గుర్తించలేకపోయాడు, కాని ఎక్కడో ఏ మూలనో నేలమాళిగల్లో పొడారిపోయి బొంగురుపోయిన స్వరాలు — ఉన్మత్తావేశంతో, భయానకంగా — "అంతర్జాతీయ గీతాన్ని" పాడుతున్నట్లు అతను గ్రహించాడు. అతను లేచి నిలబడ్డాడు.

"...అటో యిటో తేలే
యీ అంతిమ పోరాటానికి
సంసిద్ధులు కండోయ్..."

కమిస్సారు తనలో మిగిలిన శక్తినంతనీ కూడదీసుకొని పాడాడు.

"అంతర్జాతీయ గీత" పాదాలను బొంగురుగా పాడుతున్న కమిస్సారుయొక్క పీక్కు పోయిన, మసిబారిన ముఖంపై కన్నీళ్లు ధారలుగా కారుతున్నాయి. తర్వాత ఫ్లాజ్నికోవూ, అటుతర్వాత సరిహద్దు గస్తీ సైనికుడూ కూడా పాడారు. సాల్నికొవ్ కూడా "అంతర్జాతీయ గీతం" పాడుతూ భుజంభుజం కలిపి వారి సరసన నిలబడ్డాడు.

"భూలోక నాకములందు,
కరుణించెడు దేవర లేడు...."

వాళ్లు బిగ్గరగా పాడారు, తమ జీవితాల్లో యింతకుముందెన్నటికన్న బిగ్గరగా పాడారు. వాళ్లు తమ గీతాన్ని బిగ్గరగా గొంతెత్తి పాడారు, జర్మన్లు చేసిన సూచనకు అదే వాళ్ల జవాబు. దుమ్ముకొట్టుకున్న ముఖాలపై కన్నీటి కాల్వలు ప్రవహించాయి, అందుకు వాళ్లేమీ సిగ్గుపడ లేదు, అవి జర్మన్ కమాండు వాళ్లలో ఆశించిన కన్నీళ్లు కాకపోవడమే అందుకు కారణం.

3

చీకట్లోకి తొంగి చూసేందుకు తరచుగా ఆగుతూ, బెరడుకట్టి బీటలువారిన తన పెదవులను పొడారిన తన నాలుకతో నిరంతరం తడుపుకొంటూ, మెల్లగా, తడబడి పడ బోయి నిలదొక్కుకొంటూ ఫ్లాజ్నికొవ్ అనంతంగా కనిపించే యిటుక తుంటలతో నిండిన నేలమాళిగలగుండా ముందుకెళ్లాడు. మూడో మలుపు దాటాక ఓ చిన్న లైటుండాలి. కాంటీను శిధిలాల్లో దొరికిన ఓ డజను కొవ్వొత్తులను మాసిన గడ్డంతో వికారంగా ఉన్న అసిస్టెంటు డాక్టరుకి తనే స్వయంగా తీసుకొచ్చాడు. ఒక్కొక్క సారి అతను పడుతున్నాడు. కాని మిక్కిలి విలువైన వస్తువు — ఒక్క అరగ్లాసుడు నీచువాసన కొట్టే బురదనీరు — వున్న ఫ్లాస్కును మాత్రం అతను సదా ప్రాణప్రదంగా ఆదుర్దాగా పట్టుకుని కాపాడుతూ వచ్చాడు. అతను అడుగు వేసినప్పుడల్లా అది బొళుక్కుబొళుక్కుమంటూ వుంది. అది బొళుక్కుబొళుక్కు మనడాన్నీ, చిందడాన్నీ అతని యావత్తు శరీరమూ అనుభూతి చెందుతోంది. దాహం అతన్ని మహా వేధిస్తోంది, ఈ నీరు తాగే హక్కు తనకు లేదన్న తెలివిడి కూడా అంత బలవత్తరంగానూ వుంది. తన మనస్సునుండి నీటిని గురించిన ఆలోచనలను తరిమేసి, దాన్ని మరో విషయంపైకి మళ్లించేందుకుగాను అతను రోజులు లెక్కపెట్ట నారంభించాడు. ఆ ప్రయత్నక్రమంలో దుర్గరక్షణకు సంబంధించిన తొలి మూడు రోజులు మాత్రమే తనకు స్పష్టంగా గుర్తున్నట్లు ఫ్లాజ్నికొవ్ గమనించాడు, అటు తర్వాత ముట్టడిదారులపై

ఆకస్మికంగా దాడుల పరంపరలు జరిపిన రాత్రింబగళ్లు, బాంబుదాడులు, సైనికదాడులు, ఫిరంగుల బొంబార్డుమెంట్లు, నేలమాళిగల గుండా పరిభ్రమణలు, శత్రువుతో జరిపిన నాతిదీర్ఘమైన పోరాటాలు, మరి నిద్రలో అనేదాని కన్న విస్మృతి సుడిగుండాలలో పడిపోయిన కొద్ది క్షణాల స్వల్ప వ్యవధులు — తన స్మృతిలో కలగాపులగమై పోయినట్లు అతను గమనించాడు. నీళ్లు తాగాలన్న నిరంతరాయమైన, నిస్త్రాణ కలిగించే వాంఛ నిద్రలో సైతం అతన్ని వెంటాడుతూ వచ్చింది.

కమిస్సారుకు సాధ్యమైనంత సౌకర్యం సమకూర్చేందుకు వాళ్లింకా తంటాలు పడుతూండగానే జర్మన్లు కంటబడ్డారు. కమిస్సారు వాళ్లని పరుగెత్తమని అరిచి హెచ్చరించాడు, వాళ్లు నిజంగానే ఛిన్నాభిన్నం చెయ్యబడిన గదులగుండా — ఫిరంగిగుళ్ల దెబ్బలకు పడిన కంతలు కిటికీల స్థానాన్ని ఆక్రమించిన గదులగుండా — పరుగెత్తారు. తమ వెనుక అనేక కాల్పులనూ, గ్రెనేడ్ ప్రేలుడునూ వాళ్లు విన్నారు. అది కమిస్సార్ జరిపిన అంతిమ పోరాటం, అది వాళ్లు పారిపోయేందుకు అవసరమైన అనేక విలువైన క్షణాలను వాళ్లకు సమకూర్చింది. ఆవిధంగా వాళ్లు తప్పించుకు పోయి, అటకలగుండా త్రోవ చేసుకొని సోవియట్ బలగాలను అదే రోజున చేరుకోగలిగారు. సాల్నికొవ్ మరోమారు తమ అదృష్టానికి సంబరపడ్డాడు.

వాళ్లు తమ సొంత మనుషులనైతే చేరుకున్నారుగాని, అక్కడ మంచినీళ్లూ లేవు, తూటాలూ లేవు. ఉన్నవల్లా ఫ్యూజుల్లేని అయిదు పెట్టెల గ్రెనేడ్లు మాత్రమే. అందుకని వాళ్లు రాత్రిపూట జర్మన్లను వేటాడేందుకు బయటకు వెళ్లేవారు. గోడల్లోని యిరుకు గూళ్లలోను, కిటికీలక్రింది ఫిరంగి సూళ్లలోనూ వున్న ఆ జర్మన్లను గుర్రుమంటూ, బూతులు తిడుతూ రైఫిలు మడమలతోనూ, ఫ్యూజుల్లేని గ్రెనేడ్లతోనూ మొత్తి చంపీ, బయనెట్లతోనూ, బాకులతోనూ పొడిచి చంపీ చేతికి అంకిన ఆయుధాలన్నింటినీ ప్రోగు చేసేవారు. అలా చేతికి చిక్కించుకోగలిగిన ఆయుధాలతో పగటిపూట దాడులను తిప్పికొట్టేవారు. వెలుగులు వెదజల్లే రాకెట్ల ఊదా కాంతిలో, బంకగా వున్న కళేబరాలను తమ త్రోవ లోంచి తొలగించుకొంటూ మంచినీటి కోసం నదికి ప్రాకుకొంటూ వెళ్లేవారు. శత్రువు కన్నుగప్పి తిరిగి రాగలిగినవాళ్ళు, సైనికుల టిఫిన్ కారియర్ పైకాడను తమ పళ్లమధ్య బిగించి, తమ తలలు పైకెత్తి పట్టుకొని, వెనక్కి పాక్కొని వచ్చేవారు. అదృష్టం కలిసి రానివాళ్లు, టిఫిన్ కారియరుపై బొక్కబోర్లా పడేవారు, బహుశా చావు తమను కబళించేలోగా కడుపారా నీళ్లు తాగగలిగే వారేమో. కాని అదృష్టవంతులకు మాత్రం ఆ నీళ్లు తాగేందుకు హక్కుండేది కాదు.

రోజంతా, సూర్యోదయంనుంచి సూర్యాస్తమయందాకా విమానాల బాంబింగు తర్వాత ఫిరంగి కాల్పులూ, ఫిరంగి కాల్పుల తర్వాత బాంబింగూ జరుగుతూనేవుండేవి. ఎప్పుడైనా

యీ దాడుల మధ్య కొంచెం విరామం వుంటే, ఆ యాంత్రికమైన విదేశీ స్వరం వాళ్ల ప్రతిఘటనను విరమించమని మళ్లీ విజ్ఞప్తిపూర్వకమైన హెచ్చరిక చేస్తూండేది, ఈ ప్రతిపాదన విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకొనేందుకుగాను ఓ గంటో, అర్ధగంటో వ్యవధి యివ్వబడేది, ఆ విరామంలో పరిచితమైన పాటలు వాళ్ల ఆత్మలను చిత్రవధ చేస్తూండేవి. ఆ పాటలనూ, దాహంతో పిడచకట్టుకు పోతూండే పిల్లల నిశ్శబ్దరోదననూ వాళ్లు మౌనంగా వింటూండేవారు.

అటు తర్వాత శత్రు సైనిక శ్రేణిగుండా చొరుచుకు వెళ్లాలని ఆజ్ఞలు వచ్చాయి, వారికి తూటాలూ, గ్రెనేడ్లకు ఫ్యూజులు కూడా యివ్వబడ్డాయి. ఆ ముగ్గురూ వంతెనపై దాడిచేశారు, వాళ్లు వంతెన మధ్యలో వుండగా, యిరవై అంగల దూరంనుంచి జర్మన్లు ఆరు మెషీన్ గన్నులతో వాళ్లపై గుళ్ల వర్షం కురిపించసాగారు. ఫ్లాజ్నికొవ్ అదృష్టం మరోసారి కలిసివచ్చింది, వంతెన అడ్డకమ్మీ మీదనుంచి అతను ముహవేత్స్ నదిలోకి దూకగలిగాడు, కరువుదీర నీళ్లు తాగగలిగాడు, వెనక్కు వచ్చి తన స్వపక్షాన్ని చేరుకోగలిగాడు. తర్వాత — గోమెల్ (వాటా 9, 112 కార్ల్ మార్క్స్ వీధి)నుండి వచ్చిన సరిహద్దు గస్తీ సైనికుడు వాలోద్యా దెనీష్చిక్ పడిపోయిన కారణంగా — మళ్లీ ఒంటరిగా వంతెన దగ్గరకు తిరిగి వెళ్లాడు. కాని సాల్నికొవ్ దాటిపోయాడు, తర్వాత అతను కేస్మేటు*లో "మళ్లీ అదృష్టం కలిసొచ్చింది నేస్తాలూ! ఎవరో నాకోసం గట్టిగా ప్రార్థిస్తూ వుండాలి. బహుశా మా బామ్మే అయివుంటుంది, ఆమె నిత్యం చర్చికి వెళ్తూ వుంటుంది!"

కాని యిదంతా ఎప్పుడు జరిగిందబ్బా? ఆడాళ్లూ, పిల్లలూ లొంగిపోవాలన్న నిర్ణయం జరిగాకనా, అంతకుముందా? వాళ్లు కంతలగుండా ఎండవెలుగుతో నిండివున్న ఆవరణలోకి పాక్కుంటూ వెళ్లారు. వాళ్లు బక్కచిక్కి, మురికి ఓడుతూ, అర్ధనగ్నంగా వున్నారు. వాళ్ల ఫ్రాకులు బ్యాండేజీల కోసం ఎన్నడో చింపివెయ్యబడ్డాయి. పిల్లలు నడిచే స్థితిలో లేనందున ఆడాళ్లు వాళ్లని ఎత్తుకు తీసుకెళ్లారు — కళేబరాలను జాగ్రత్తగా చుట్టి వెళ్తూ, ప్రతి ఒకదాని వంకా పరిశీలనగా చూస్తూ — ఎందుకంటే, యిది, యిదే, మరణానంతరం లోహశకలాలచేత ఛిన్నాభిన్నం చెయ్యబడి, ఉబ్బి, గుర్తుపట్టరాకుండా మారిన — యీ కళేబరమే భర్త, తండ్రి, లేక సోదరుడు కావచ్చు — వెళ్లారు. దుర్గ రక్షకులు గాలి కంతల దగ్గర నిశ్చలంగా, గుడ్లనీళ్లు కుక్కుకొంటూ, అందుకు ఏమాత్రం సిగ్గుపడకుండా నిలబడ్డారు, జర్మన్లు మొట్టమొదటి సారిగా, నదిగట్లపైన బహిరంగంగా, నిశ్చింతగా నిలబడ్డారు.

ఇది జరిగిందెప్పుడు — వలయాకారపు జర్మన్ శ్రేణిని భేదించుకు వెళ్లేందుకు తాము చేసిన

---

* వెడల్పుగా ఫిరంగి గుళ్లకు అభేద్యంగా వుండే కోటగోడలోని గది. — సం.

విఫలయత్నానికి ముందా, తర్వాతనా? ముందా, తర్వాతా? ఈ విషయాన్ని గుర్తుచేసుకోవాలని ఫ్లాజ్నికొవ్ బుర్ర బద్దలుకొట్టుకున్నాడు గాని సాధ్యం కాలేదు. సాధ్యం కాలేదంతే.

అస్పష్టంగా మినుకుమినుకుమనే కొవ్వొత్తికాంతి కోసం ఫ్లాజ్నికొవ్ పరిశీలిస్తున్నాడు, కాని మలుపు తిరిగేందుకు ముందే అతనికి మూలుగు వినవచ్చింది. చెవులు గళ్లు పడేలా బాంబింగు జరుగుతున్నా, అతని చెవులు నిరంతరాయంగా గింగురుమంటున్నా కూడా, అతని శ్రవణ శక్తి యింకా బాగానే వుంది, అతనికి వినవచ్చిన మూలుగు — బొంగురుగా, సుదీర్ఘంగా, మూలుగు మాదిరిగా కన్న ఏడుపు మాదిరిగా వున్న మూలుగు — పెద్దగా, స్పష్టంగా వుంది. అది ఒళ్లు బాగా కాలిన వ్యక్తినుంచి వినవస్తోంది. అంతక్రితం రోజు జర్మన్లు విమానాల పైనుంచి పీపాలకొద్దీ పెట్రోలు కిందకు దిమ్మరించారు, భయంకరమైన జ్వాలలు యీ వ్యక్తిని ఆవరించాయి. ఫ్లాజ్నికొవ్ అతన్ని నేలమాళిగలోకి చేర్చాడు, ఆ క్రమంలో అతనికి కూడా — అంత మరీ దారుణంగా కాకపోయినా — ఒళ్లు కొన్ని చోట్ల కాలింది. కాని ఆ వ్యక్తి అప్పుడు మొదలెట్టిన అరుపులు మరి మానలేదు.

మరి అక్కడ వినవస్తున్న అరుపులు యివి మాత్రమే కాదు. దూరంగా, మరుగుగా వున్న — ఆశ వదులుకున్న రోగులున్న — నేలమాళిగను సమీపించిన కొద్దీ మూలుగులు మరింత బిగ్గరగా వినవస్తున్నాయి. వీళ్లందరూ — చీలిన పొట్టలతో, విశీర్ణ అంగాలతో, నజ్జునజ్జైన పుర్రెలతో — మరణోన్ముఖులై వున్నవారు. వీళ్లకి అందుతున్న మందల్లా జర్మన్ వోడ్కా, మితభాషి అయిన అసిస్టెంటు డాక్టరు చల్లని చేతుల స్పర్శా మాత్రమే. ఆకలి దప్పికల మూలంగా అతని చర్మం ఏనుగు చర్మం మాదిరిగా పెద్దపెద్ద ముడతలు పడివుంది. ఇక్కడినుంచి ఎవ్వరూ నడిచి బయటకు వెళ్లరు; నిశ్శబ్దంగా వుండేవాళ్లు యితరులచేత మోసుకు వెళ్లబడతారు. ఇప్పుడు అది కూడా జరగడం లేదు, మృతులను తీసుకువెళ్లేందుకు మనుషులుగాని, శక్తిగాని, సమయంగాని లేకపోవడమే అందుకు కారణం.

"నీళ్లేమైనా తెచ్చావా?"

ఆయన అడిగింది తన కోసం కాదు; మరణోన్ముఖులూ, మృతులూ కలగాపులగంగా పడివున్న యిక్కడ, యీ నేలమాళిగలో, ఓ గుక్కెడు మంచినీళ్లు తాగడం నేరమే అవుతుంది. మరి, క్రమేపీ నెమ్మదిగా దాహబాధతో మృత్యుముఖాన్ని చేరుకుంటున్న ఆ అసిస్టెంటు డాక్టరు, ఎన్నడూ నీళ్లు తాగలేదు.

"లేదు" ఫ్లాజ్నికొవ్ బొంకాడు. "ఇది వోడ్కా."

ఉదయంపూట బాంబింగు జరిగిన సమయంలో అతను స్వయంగా ఆ నీటిని తోడాడు. ప్రేలుళ్లతో చెవులు గళ్లుపడుతూండగా, లోహశకలాలు తన ఉక్కు శిరస్త్రాణంపై ఖణేల్‌ఖణేల్‌మంటూండగా అతను నది ఒడ్డుకి పాకి వెళ్లాడు. అతనేమీ చూడకుండా ఫ్లాస్కుతో తోడగలిగినన్ని నీళ్లు తోడాడు, ఆ ఫ్లాస్కులోంచి స్వంతానికి ఒక్క చుక్క నీళ్ళు

కూడా తీసుకోలేదు. అతనా విలువైన ద్రవాన్ని దెనీష్చిక్ కోసం తెస్తున్నాడు, అందుకనే అతను అలా అబద్ధమాడాడు.

''అతను బతికే వున్నాడు'' అసిస్టెంటు డాక్టరు చెప్పాడు.

అతను ప్రవేశ ద్వారం దగ్గర ఓ పెట్టె పక్కన కూర్చొని – దానిపైన ఓ కొవ్వొత్తి పొగ ఎగజిమ్ముతూ మండుతోంది – ముడతలుపడి మురికిగా వున్న యూనిఫారాలను తాపీగా పేలికలుగా చింపుతున్నాడు. ఇంకా బ్రతికివున్నవాళ్లకు బ్యాండేజీలు అవసరం.

ఫ్లాజ్నికొవ్ అసిస్టెంటు డాక్టరుకి మూడు జర్మన్ సిగరెట్లిచ్చాడు. ఆయన వాటిని ఆతృతగా దొరకపుచ్చుకున్నాడు, కాని సిగరెట్టు ముట్టించలేకపోయాడు, ఆయన చేతులు వణుకుతున్నాయి. ఆయన శరీరం ఊగుతోంది, ఆయన ఆ సిగరెట్టును మంట దగ్గర చేర్చ లేకపోయాడు.

దుర్గంధంతో నిండివున్న గాలిలో కొవ్వొత్తి బాగా మండటం లేదు. దాని వత్తి కొడిగట్టి మంట నాసిగా వస్తూ, మధ్యమధ్య ప్రజ్వలిస్తూ, మళ్లీ తగ్గుతూ వున్నా, మొత్తం మలిగిపోకుండా నిలిచే వుంది. ఫ్లాజ్నికొవ్ కన్నార్పకుండా దాని వంకకే చూసి, దుర్గాన్ని గురించి ఆలోచించాడు.

''వెళ్లిపోయేందుకు ఆజ్ఞలొచ్చాయి. ఎవరంతట వాళ్ళు, ఎవరికి చేతనైన పద్ధతిలో వాళ్ళు.''

''అయితే గుడ్‌బై చెప్పేందుకే వచ్చావా?'' ప్రతి కదలికా బాధాకరంగా ఉన్నట్టు, అసిస్టెంటు డాక్టరు భావశూన్యమైన, జీవరహితమైన కళ్లతో అతని వంకకు తిరిగాడు. ''దయచేసి వాళ్లకెవరికీ చెప్పకు. మంచిది కాదు.''

''నాకు తెలుసు.''

''నీకు తెలుసా?'' అసిస్టెంటు డాక్టరు తన తల ఊపాడు. ''నీకేమీ తెలియదు. బొత్తిగా ఏమీ తెలియదు. నీకు తెలిసే వుంటే నువ్వీ విషయం నాకు చెప్పివుండేవాడివి కావు.''

''ఈ ఆజ్ఞ నీక్కూడా వర్తిస్తుంది.''

''మరి వీళ్లందరి సంగతి ఏమిటి?'' ఆయన మూలిగే నేలమాళిగ అంధకారం వంక తలూపి అన్నాడు. ''వీళ్లని మనం ఏం చేస్తాం? సజీవంగా పూడ్చిపెట్టాలా? కనీసం వీళ్లని దేంతోనైనా కాల్చేసేందుకైనా ఏమీ లేదాయె. కాల్చేసేందుకైనా ఏమీలేదు, నువ్వు అర్థం చేసుకోగలవా ఆ విషయం? వీళ్ల బాధ్యత నాది, కాని ఆజ్ఞలు – ఇందులో ఆజ్ఞల ప్రసక్తి లేదు. నాకు నేను యింతకన్న కఠినమైన ఆజ్ఞ జారీచేసుకున్నాను.'' అతను ఆగాడు, ఒక క్షణం, క్షణంలో సగంసేపు అతని కళ్లు జ్వలించాయి. ''మరి, మనలో ప్రతి ఒకడూ, బోధపడిందా ప్రతి ఒక్కడూ, తనకు తాను ఒక ఆజ్ఞను జారీచేసుకొని, దాన్ని ఆచరణలో పెట్టినట్లయితే, నాజీలు నిశ్శేషమైపోతారు. నిశ్శేషమైపోతారు! అప్పుడు యుద్ధం ముగిసి పోతుంది. అదే దాని సమాప్తి. అప్పుడే అది ముగుస్తుంది.''

అతను ఆగాడు, పొడారి పీక్కుపోయిన తన నోట్లోకి సిగరెట్టుపొగ పీల్చుకున్నప్పుడు అతని ముఖం వంకర్లు తిరిగింది. ప్లూజ్నికొవ్ క్షణకాలం మౌనంగా నిలబడ్డాడు, తర్వాత జేబులోంచి సగం తినగా మిగిలిన రస్కొకటి తీశాడు, కొవ్వొత్తి పక్కన పెట్టాడు, తర్వాత నెమ్మదిగా నేలమాళిగ అంధకారంలోకి — మూలుగుతున్నవారినీ, శాశ్వతంగా నిశ్శబ్దంగా ఉన్న వారినీ దాటుకుంటూ — వెళ్లాడు.

దెనీష్చిక్ కళ్లు మూసుకొని పడుకొనివున్నాడు; మురికిగా, రక్తంతో అట్టకట్టివున్న గుడ్డపేలికలతో బ్యాండేజి కట్టబడిన అతని రొమ్ము ఊపిరి తీసుకున్నప్పుడల్లా కంపిస్తూ పైకి లేస్తోంది. ప్లూజ్నికొవ్ అతని పక్కనే కూర్చోవాలనుకున్నాడు, కాని అతని భుజాలకు ఆనుకొని యితర క్షతగాత్రులున్నందున, అతనికి గొంతుక్కూర్చోవడం తప్ప గత్యంతరం లేకపోయింది. ఇటుక దెబ్బ తగిలి కొంతకాలంగా అతని వెన్ను పోటుపెడుతున్న కారణంగా, అలా కూర్చోవడం అతనికి కష్టమే అయింది.

దెనీష్చిక్ కళ్లు తెరవకుండానే "నువ్వు పక్క అతన్ని లాగెయ్యొచ్చు, అతను నిన్ననే చచ్చిపోయాడు" అన్నాడు.

ప్లూజ్నికొవ్ కష్టంపైన చల్లబడిపోయిన ఆ శరీరాన్ని బిగిసిపోయి చాచివున్న చెయ్యి రాతి నేలను కొట్టే మాదిరిగా తాకుతూండగా పక్కకు లాగి దెనీష్చిక్ పక్కన కూర్చున్నాడు. జాగ్రత్తగా, ఇతరుల దృష్టిని ఆకర్షించకుండా వుండేందుకు ప్రయత్నిస్తూ, అతను తన బెల్టునుంచి ఫ్లాస్కును ఊడదీశాడు. దెనీష్చిక్ దాన్ని అందుకున్నాడు, తర్వాత దాన్ని తోసేశాడు.

"మరి నువ్వో?.."

"నేను గాయపడలేదు."

ఆ ఫ్లాస్కు, బొళుక్కుబొళుక్కుమంది, నేలమాళిగ అంధకారంలో ఒక రకమైన సద్దూ, కదలికా ప్రారంభమయ్యాయి. ఎవరో గాని బ్రతికివున్నవాళ్లమీదుగా, చనిపోయిన వాళ్లమీదుగా పాకి వస్తున్నాడు, ఎవరో గాని ప్లూజ్నికొవ్ భుజాన్ని దొరకపుచ్చుకున్నాడు, దాన్ని లాగాడు, గుంజాడు, కొట్టాడు. సరిహద్దు గస్తీ సైనికునికి రక్షణగా వంగి, ప్లూజ్నికొవ్ తొందరగా గుసగుసగా చెప్పాడు: "తాగు, తాగెయ్యి వాలోద్యా, తాగు."

నేలమాళిగ యావత్తూ కలతచెందింది, మూల్గింది, రోదించింది, నీటి వంక పాకింది, చీకట్లోంచి డజన్లకొలది పుల్లల్లా వున్న చేతులు — భయంకరమైన తమ పిడికిళ్లను ముందుకు చాచాయి. భయంకరమైన బొంగురు స్వరాలు "నీ — ళ్ళు!" అంటూ రొదపెట్టాయి.

"నీళ్లూ లేవు, ఏమీ లేవు" ప్లూజ్నికొవ్ కేకేశాడు. "నీళ్లు లేవు సోదరులారా, కామ్రేడ్స్, బొత్తిగా ఏం లేవు!"

"నీ — ళ్లు!" పొడారిన గొంతులు రెట్టించాయి. ఎవడో రోదిస్తున్నాడు, ఎవడో

తిడుతున్నాడు, ఎవరి చేతులోగాని ప్ల్యాజ్నికొవ్ భుజాన్ని, అతని భుజం పట్టీని, చెమటతో తడిసిన అతని సైనిక కోటును యింకా గుంజుతూనే వున్నాయి.

‘‘నేను రాత్రి పడ్డాక తీసుకొస్తాను, కామ్రేడ్స్!’’ అతను కేకేశాడు. ‘‘రాత్రి తెస్తాను. యిప్పుడు బయట తలెత్తడం కూడా సాధ్యం కాదు!... తాగు, వొలోద్యా, తాగెయ్యి!’’

క్షణకాలం నేలమాళిగంతా స్తబ్దమైపోయింది, ఆ ప్రశాంతిలో, సరిహద్దు గస్తీ సైనికుడు కష్టంమీద గుటకెయ్యడాన్ని ప్రతి ఒక్కడూ వినగలిగాడు.

తర్వాత ఖాళీ ఫ్లాస్కు నేలపైన పడిపోయింది, మరోసారి ఎవరోగాని ఏడ్చాడు, క్రింద పడి దొర్లాడు, అరిచాడు.

‘‘సరే, నేను రేపు చచ్చిపోతానన్నమాట’’ దెనీస్చిక్ అకస్మాత్తుగా అన్నాడు, నీరస హాసంలో అతని పళ్ళు అస్పష్టంగా మెరిశాయి. ‘‘నే నది యీరోజేననుకున్నాను, కాని యిప్పుడిక అది రేపటికి వాయిదాపడింది. యుద్ధానికిముందు నేను మునిగిపోయేవారి రక్షకుడిగా పనిచేశాను. రోజుల తరబడిగా నీళ్లలో ఉండేవాణ్ణి. మా నది మహా వేగంగా ప్రవహిస్తుంది, యిక్కడ దిగితే మనిషిని అల్లంత దూరం తోసుకుపోయేది. కొన్నికొన్ని సార్లు బోలెడు నీళ్లు మింగాల్సివచ్చేది....’’ అతను ఆగాడు. ‘‘సరే, రేపన్నమాట. ఇంతకీ యిప్పుడేమిటి, రాత్రా, పగలా?’’

‘‘పగలు. జర్మన్లు మనకి నచ్చచెప్పి లొంగదీసుకోవాలని చూస్తున్నారు.’’

‘‘నచ్చచెప్తున్నారేం?’’ దెనీస్చిక్ బొంగురుగా నవ్వాడు. ‘‘నచ్చచెప్తున్నారా? నూరు సార్లు చంపారు, యింకా మాట్లాడుతూనే వున్నారు! చచ్చిపోయినవాళ్లతో మాట్లాడుతున్నారు! అయితే మన ప్రతిఘటన వృథాకాలేదన్నమాట, ఔనా?’’ అకస్మాత్తుగా అతను తన మోచేతులపై ఆని పైకి లేచి, చీకట్లోకి అరిచాడు: ‘‘ఓ చుక్కనీళ్లు తాగినందుకు నన్ను తిట్టుకోకండి నేస్తాలూ! అదంతా కలిపి ఓ చుక్క, అందులో పంచుకునేందుకేమీ లేదు. కాని వాళ్లు మనకి నచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్నారట, విన్నారా మీరు? వాళ్లు మళ్లీ ప్రయత్నిస్తున్నారు!’’

అతను దగ్గాడు, ఖంగుఖంగున కష్టంతో దగ్గిన ఆ దగ్గుతో అతని నోట్లోంచి బుడగలుబుడగలుగా రక్తం వచ్చింది. ఒళ్లు కాలిన సైనికుని వ్యథాకులితమైన రోదన మినహాయిస్తే నేలమాళిగ ప్రశాంతంగా వుంది. చీకట్లోంచి ఎవరో అన్నారు:

‘‘మమ్మల్ని క్షమించు సోదరా. మమ్మల్ని క్షమించు. పైన పరిస్థితి ఎలా వుంది?’’

‘‘పైనా?’’ జవాబు ఎలా చెప్పాలా అని ఆవేశంగా సాలోచనగా ప్ల్యాజ్నికొవ్ రెట్టించాడు. ‘‘మనం ప్రతిఘటన సాగిస్తున్నాం. కొన్ని తూటాలు పట్టుకున్నాం. ఆఁ అన్నట్టు, యీ ఉదయం మన ఫాల్కన్ విమానాలొచ్చాయి, తొమ్మిది! మన దుర్గంపైన మూడుసార్లు ప్రదక్షిణాలు చేశాయి. అంటే, మన్నిగురించి వాళ్లకి తెలుసు, వాళ్లకి తెలుసు! బహుశా వాళ్లు చొరుచుకు వచ్చేందుకు రికన్నాయిటర్ చేస్తూ వుండివుంటారు.’’

విమానాలూ లేవు, చొరుచుకొచ్చేందుకు ఎవరూ సన్నాహాలు చెయ్యడమూ లేదు, దేశపు పశ్చిమ సరిహద్దుల్లో, ఎక్కడో జర్మన్ వెనుకతట్టు ప్రాంతంలో, పురాతన బ్రెస్ట్ దుర్గం రక్తాన్ని — వెచ్చని మానవ రక్తాన్ని — ఓడుస్తున్నదని ఎవరికీ తెలియనైనా తెలియదు. కాని ప్లూజ్నికొవ్ — వాళ్లకి తెలుసుననీ, వాళ్లకి జ్ఞాపకమున్నదనీ, ఎప్పుడో ఒకప్పుడు వస్తారనీ చిత్తశుద్ధితో నమ్మి అబద్ధమాడాడు.

''మనవాళ్లు వచ్చితీరుతారు'' అతను — కన్నీళ్లు పెల్లుబికి వస్తూండగా, వేదనతో తన స్వరం రుద్ధంకాబోతూండగా, సైనికులు వినవచ్చుననీ, గ్రహించవచ్చుననీ భయ పడుతూ — చెప్పాడు. ''వాళ్లు తప్పక వస్తారు, అంతే కాదు, యింకా ముందుకెళ్తారు. వాళ్లు బెర్లిన్‌కి వెళ్తారు, అక్కడ హిట్లర్ని పొడవాటి స్తంభానికి నిట్టనిలువునా ఉరితీస్తారు!''

''ఉరితీస్తే సరిపోదు'' ఎవరో మెల్లగా అన్నారు. ''రెండు వారాలపాటు వాడిని మంచినీళ్లు లేకుండా అట్టేపెట్టాలి.''

''వాడిమీద సలసలకాగే నీళ్లు పొయ్యాలి.''

''ఆ విషయం జ్ఞాపకం చెయ్యబోకు'' అంతకుముందు క్షమాపణ అడిగిన సైనికుడు అన్నాడు. ''మనవాళ్లు వచ్చేదాకా తట్టుకు నిలబడు నేస్తం. నిలబడు. ప్రాణం నిలుపుకో. తర్వాత మనవాళ్లతో చెప్పు: యిక్కడ మన కుర్రాళ్లు —'' ఆ ఒక్క మాట కోసం — మర ణించినవాళ్లు జీవించివున్నవాళ్లకు ఉజ్వల వారసత్వంగా విడిచిపెట్టే ఒకేఒక్క మాట కోసం — తడుముకొంటూ, అతను బొరుమన్నాడు.

''తలవంచకుండా ప్రాణాలు వదిలారు'' ఒక యువ స్వరం సుతిమెత్తగానే అయినా సుస్పష్టంగా అంది.

అందరూ నిశ్శబ్దం వహించారు. ఆ నిశ్శబ్దం, బ్రతికివున్నవారికీ మరణించినవారికీ మధ్యగల రేఖను దాటిన తర్వాత సైతం తల వంచని సైనికుల నిబ్బరమైన ఆత్మగౌరవంతో నిర్భరమై వుంది. ప్లూజ్నికొవ్ కూడా మౌనం వహించాడు, నూనూగు మీసాలతో గడ్డంతో మురికిగా వున్న తన ముఖంపైన ధారలుగా కన్నీళ్లు కారుతున్నట్లు సైతం అతనికి అను భూతం కాలేదు.

''కోల్యా!'' దెనిష్చిక్ అతని కోటు అంచు పట్టుకులాగాడు. ''నేనేమీ కోరడం లేదు, తూటాలు విలువైనవన్న సంగతి నాకు తెలుసు. నేనిక్కడినుంచి బయటికొచ్చేందుకు సాయం చెయ్యి కోల్యా. నేను నడవలేనని అనుకోకు, నేను నడుస్తాను, నేనక్కడికి రాగలనని నాకు తెలుసు. నేను చచ్చిపోయేది రేపు, నాలో యింకా తగినంత శక్తి వుంది. ఊరికే నాక్కొంచెం సాయం చెయ్యి, అంతే, ఏం, చేస్తావా? నాకు సూర్యకాంతి చూడాలని కోరికగా వుంది.''

''ఊఁహూఁ. ఎడతెరిపి లేకుండా వాళ్లు బాంబులేస్తున్నారు. నువ్వక్కడికి వెళ్ల లేవు.''

''నేనెలాగో తంటాలుపడతాను కదా'' సరిహద్దు గస్తీ సైనికుడు లోగొంతులో అన్నాడు. ''నువ్వు నాకిది రుణపడివున్నావు, కోల్యా. నేనా విషయం నీకు చెప్దామనుకోలేదు – కాని యిప్పుడు చెప్తాను. నాకు తగిలిన ఆ గుళ్లు నిన్ను ఉద్దేశించి కాల్చబడ్డాయి, లెఫ్టినెంట్, నిన్ను ఉద్దేశించే కాల్చబడ్డాయి కోల్యా, వాటితో యీ లోకంలో నీకు నూకలు నిండుకొనేవే. తెలిసిందా, అందుకని నన్నిప్పుడు బయటకు వెలుగులోకి తీసుకెళ్లు. అంతమాత్రమే. నేను నిన్ను మంచినీళ్లు సైతం అడగను. నాకు అక్కడికొచ్చేందుకు అవసరమైన శక్తి వుంది. నువ్వు ఆదుర్దా పడకు నాకు శక్తి వుంది. నేనక్కడకు వస్తాను. నాకు వెలుతురు చూడాలని కోరికగా వుంది, నీకు అర్థమైందా? నా చివరి రోజు చూడాలి.''

ప్లూజ్నికొవ్ కష్టంపైన సరిహద్దు గస్తీ సైనికుడ్ని లేవదీశాడు. మూల్గులను దిగమింగుతూ దెనీష్చిక్ అతన్ని గట్టిగా పట్టుకొని, అతనిపైకి ఒరిగాడు. బిగపట్టిన పళ్ల సందులగుండా ఎగ ఊపిర్లు యీలలు వేస్తున్నట్లు శబ్దం చేస్తున్నాయి. కానైతే తన కాళ్లమీద ఒక సారి ఎప్పుడైతే నిలబడ్డాడో అప్పుడిక ద్వారందాకా అతను స్వయంగా నడవగలిగాడు. నేలపై పడుకొనివున్న సైనికులపైగా దాటాల్సివచ్చినప్పుడు మాత్రమే ప్లూజ్నికొవ్ అతనికి ఆసరా యివ్వాల్సివచ్చింది.

అసిస్టెంటు డాక్టరు – చనిపోయినవాళ్ల దుస్తులను తిన్నని పేలికలుగా చింపుతూ – యింతకు ముందు ఎక్కడున్నాడో సరిగా అక్కడే కూర్చుని వున్నాడు. కొవ్వొత్తి – మృత్యు శైథిల్యాలతో భారంగా వున్న గాలిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నదేమోనన్నట్లు – క్షీణంగా యింకా ప్రకాశిస్తూనే వుంది. సైనిక రస్కు ముక్క స్పృశింపబడకుండా – యింకా దాని పక్కనే వుంది.

తరుచుగా ఆగుతూ, వాళ్లు నెమ్మదిగా ముందుకెళ్లారు. దెనీష్చిక్ వేగంగా, పిల్లి కూతలతో రొప్పుతున్నాడు. గాయపడిన అతని ఊపిరితిత్తిలో ఏదో గుర్రుమంది. మధ్యమధ్య అతను వణుకుతున్న చేత్తో నోటలోంచి వెలువడే రక్తపు నురగను తుడుచుకుంటున్నాడు. మధ్యమధ్య ప్లూజ్నికొవ్ అతన్ని కూర్చోపెడుతున్నాడు. దెనీష్చిక్ గోడకు ఆనుకొని, కళ్లు మూసుకొని, నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అతను తన శక్తిని పొదుపుచేసుకుంటున్నాడు. ఒక్కసారి మాత్రమే అతను మాట్లాడాడు.

''సాల్నికొవ్ బతికివున్నాడా?''

''ఆ.''

''అదృష్టవంతుడు.'' అతను యీర్ష్యాలేశం కూడా లేకుండా, కేవలం ఉన్న విషయం పేర్కొన్నట్లు చెప్పాడు. ''అతనింకా నీళ్లు తెస్తూనే వున్నాడా?''

''ఆ.'' తను చెప్పాలా చెప్పకూడదా అన్న సదసత్సంశయంలో పడి, ప్లూజ్నికొవ్ ఆగాడు. ''వింటున్నావా వొలోద్యా, మనందరికీ ఒక ఆజ్ఞ జారీ అయింది: దుర్గం బయటకి వెళ్లమని.

మనలో ప్రతి ఒక్కడూ ఎలా వీలైతే అలాగా, ఎక్కడికి వెళ్లగలిగితే అక్కడికి వెళ్లమని.''

''ఎలాగెలాగ?''

''చిన్నచిన్న బృందాలుగా దుర్గంలోంచి బయటపడి, అడవిలోకి చేరుకోవాలి.''

''ఓహో.'' దెనీస్చిక్ మెల్లగా నిట్టూర్చాడు. ''అంటే దాని అర్థం — దుర్గానికి సలాం అన్నమాట. ఔను, అది సరైనదే. ఇక్కడ మనం ఒక వేటగాడి సంచిలో ఉన్నట్లున్నాం.''

''నువ్వీ ఆజ్ఞ సరైనదే ననుకుంటున్నావా?''

కొంత సేపు దెనీస్చిక్ మౌనంగా ఉండిపోయాడు. ఓ చిన్న కన్నీటి బొట్టు అతని కనుకొలుకులోంచి జారి దట్టంగా పెరిగిన అతని గడ్డం మధ్య బుగ్గ గుంటలో ఎక్కడో అదృశ్యమైంది.

''నువ్వు సాల్నికొవ్‌తో కలిసి వెళ్లు, కోల్యా.''

ప్లూజ్నికొవ్ నిశ్శబ్దంగా తలూపాడు. వంతెనమీద ఆ మెషీన్ గన్ను మూలంగా కాకపోతే నేను నీతో వెళ్లివుండేవాడినే వాలోద్యా, అందామని అనుకున్నాడు — కాని అతనా మాట పైకి అనలేదు.

దెనీస్చిక్‌ను అతనొక ఖాళీ కేస్‌మేటులో వదిలాడు. ప్లూజ్నికొవ్ అతన్ని యిటుక పరుపు నేలపైన — పైకప్పులోని కంతలోంచి పొగకప్పిన బూడిదవన్నె ఆకాశాన్ని చూసేందుకు అనువుగా — పడుకోబెట్టాడు.

''మనం ఓవర్‌కోటు తీసుకురాలేదు. అసిస్టెంటు డాక్టర్ దగ్గర ఒకటుంది, నేను చూశాను.''

''అవసరం లేదు.''

''నేను పైకెళ్లి తీసుకొస్తాను. ఇప్పుడు ప్రశాంతంగానే వుంది.''

''సరే, అయితే.''

ప్లూజ్నికొవ్ అప్పటికే విలక్షణంగా వున్న కళ్లను, అప్పటికే జీవ చైతన్యం కోల్పోతున్న కళ్లను చిట్టచివరి సారిగా చూశాడు. క్రింది అంతస్తును చేరుకోడానికి అతను మలుపు తిరిగి, ఛిన్నాభిన్నమై, యిటుక ముక్కలతో, మట్టితో నిండివున్న మెట్లెక్కి వెళ్లాల్సివుంది. ఇంకా కాల్పులు సాగించే శక్తి వున్నవాళ్లు అక్కడ పోరాడుతున్నారు. ఒక రాత్రి దాడి అనంతరం, ప్లూజ్నికొవ్‌కు పరిచితుడు కాని ఒక ఫిరంగి దళపు కెప్టెనుచేత వాళ్లక్కడ సమీకరింపబడ్డారు.

అతనా మలుపు చేరుకునేందుకు సరిగా ముందు సరిగా నడినెత్తిన ఒక ప్రేలుడు సంభవించింది. ఆ ప్రేలుడు మూలంగా అతను దుమ్ముతోను, అధిక ప్రేలుడు శక్తి కలిగిన జర్మన్ మందుగుండునుండి వెలువడే గంధక ధూమంతోనూ ఉక్కిరిబిక్కిరయ్యాడు.

ఇటుకలింకా రాలుతూనే వున్నాయి, పైకప్పు పళపళా మంటూ కూలింది. కాని

ఫ్లాజ్నికొవ్ అప్పటికే గబ్బుకొట్టే గంధక ధూమంలోకీ, ధూళిలోకీ దూసుకెళ్ళి, యిటుక తుంటల గుట్టలపై జారుతూ పాకుతున్నాడు. ఎక్కడోగాని సబ్‌మెషీన్ గన్నులు మోగుతున్నాయి, కళ్ళు మిరుమిట్లుగొలిపే వాటి మెరుపులు సుడులుసుడులుగా పైకెగస్తున్న ప్రేలుడు ధూమాన్ని చీలుస్తున్నాయి. ఎవరి చెయ్యోగాని చీకట్లోంచి ముందుకొచ్చి, అతని భుజంపటకాను దొరకపుచ్చుకొని, అతన్నొక కిటికీ గూటిలోకి లాగింది. అప్పుడతను అకస్మాత్తుగా, తన ముఖానికి సమీపంలో, మురికిగా వున్న, క్రోధవికలితమైన సాల్నికొవ్ ముఖాన్ని చూశాడు.

"దొంగలంజ కొడుకులు పేల్చేశారు! గోడని పేల్చేశారు."

"కెప్టెన్ ఎక్కడ?" ఫ్లాజ్నికొవ్ విదిలించుకున్నాడు.

సాల్నికొవ్ ఉన్మత్తంగా అరుస్తూ, దట్టమైన పొగగుండా మధ్యమధ్య చీల్చుకువస్తున్న మెరుపుల్లో అస్పష్టంగా కానవస్తున్న గచ్చకాయ రంగు ఆకారాలపైన, ఛిన్నాభిన్నమైన కిటికీ గుండా క్లుప్తసరిగా కాలుస్తున్నాడు. ఫ్లాజ్నికొవ్ పొగతో నిండిన మొదటి అంతస్తుకు పరుగున వెళ్ళాడు, యింకా ఊపిరి పీలుస్తున్న, యింకా పాకుతున్న, నజ్జునజ్జైన కాళ్ళను నేలపై యీడుస్తూ, రక్తప్లావితమై గుడ్డ పేలికల చారికలను నేలపై విడుస్తూ వున్న ఒక శరీరంపైన అడుగేసి బోర్లపడ్డాడు. గుడ్డ పేలికలు కాలికి చుట్టుకొని కిందపడ్డ ఫ్లాజ్నికొవ్ లేచి నిలబడినప్పుడు అతనికి ఎదురుగా కెప్టెన్ కనిపించాడు. కెప్టెన్ గోడవార కూర్చున్నాడు, అతని కనుగ్రుడ్లు కదలకుండా బిగిసిపోయి వున్నాయి, కాలి, రక్తమెగదట్టి ఎర్రగా వున్న అతని ముఖంపై కన్నీళ్ళు సంతతధారగా ప్రవహిస్తున్నాయి.

"నాకు కళ్ళు కనిపించడం లేదు!" అతను మహా కోపంలో అరిచాడు. "నాకెందుకు కనిపించడం లేదు? ఎందుకు? లెఫ్టినెంట్ ఎక్కడ?"

"నేనిక్కడే వున్నాను." ఫ్లాజ్నికొవ్ గ్రుడ్డి కమాండరు ముందు మోకాళ్ళపై ఆని కూర్చున్నాడు. కమాండరు ముఖం కాలి దారుణంగా ఉబ్బి వుంది, కాలిన అతని గడ్డం బూడిద వన్నె ఉంగరాలుగా చుట్టుకొంది. "ఇదుగో యిక్కడే కామ్రేడ్, మీ ఎదురుగానే వున్నాను."

"తూటాలు కావాలి లెఫ్టినెంట్! ఏదో విధంగా, ఎక్కడో అక్కడ తూటాలు సంపాదించు! నాకు కనిపించడం లేదు, కనిపించడం లేదు, బొత్తిగా ఏమీ కనిపించడం లేదు!"

"నేను తూటాలు సంపాదిస్తాను" ఫ్లాజ్నికొవ్ అన్నాడు.

"ఆగు! నన్ను మెషీన్ గన్ వెనక కూర్చోబెట్టు! మెషీన్ గన్ వెనుక!"

అతను ఫ్లాజ్నికొవ్ కోసం తన చేత్తో చుట్టూ తడిమాడు. ఫ్లాజ్నికొవ్ కంపిస్తూ యిటూఅటూ ఊగుతున్న ఆ చేతులను తన చేతుల్లోకి తీసుకొని, వాటిని ఒత్తి, ఏ కారణంగానో వాటిని తన గుండెకు అదుముకున్నాడు.

"ఇదిగో యిక్కడ, యిక్కడే వున్నాను."

కెప్టెన్ అతన్ని తడుముతూ, ఆకస్మిక ప్రశాంతితో "ముగిసిపోయింది" అన్నాడు. "నా కళ్ళు పోయాయి. పూర్తిగా పోయాయి. తూటాలు, ఎక్కడినుంచి తెస్తావో తే, కాని తే. ఇది నీకు నా ఆజ్ఞ."

అతను తన చేతులు విడిపించుకున్నాడు, తన చెయ్యి పైకెత్తి తలనూ, కన్నీళ్లతో నానిన ముఖాన్నీ తడుముకున్నాడు. తర్వాత అలవాటైన కదలికతో అతని చెయ్యి పిస్తోలు సంచిలోకి జారింది.

"నువ్వింకా యిక్కడే వున్నావా, లెఫ్టినెంట్? నా కాగితాలు పూడ్చిపెట్టు." కెప్టెను తన రివాల్వరు తీసుకున్నాడు, కాచ్‌ని తడిమి, వెనక్కి లాగాడు, ఇప్పుడతని చెయ్యి ఏంతమాత్రం కంపించడం లేదు. "రివాల్వరు తీసుకో. దీంట్లో యింకా ఏడు తూటాలుంటాయి."

అతను రివాల్వరు పైకెత్తి కొద్దిసార్లు గుడ్డిగా తన తలకు ఒక కోణంలోకి తెచ్చాడు.

"కామ్రేడ్ కెప్టెన్!" ఫ్లాజ్నికొవ్ అరిచాడు.

"దగ్గర కొచ్చావంటే జాగ్రత్త!.."

అతను రివాల్వరు గొట్టాన్ని నోట్లో పెట్టుకొని ట్రిగ్గరు నొక్కాడు. కాల్పు చెవులు గళ్లుపడేలా ధన్మున వినిపించింది. ఛిన్నాభిన్నమైన తల సన్నగా గోడకి కొట్టుకుంది, కెప్టెను బాధగా నిగడదన్ని నేలమీదకి జారిపోయాడు.

"ముగిసిపోయింది."

ఫ్లాజ్నికొవ్ వెనక్కి తిరిగిచూశాడు, సార్జెంట్ కనిపించాడు.

"వాళ్లని తరిమేశాం, కాని కెప్టెనుకు రిపోర్టు చెయ్యడానికి సమయం మించి పోయింది. దురదృష్టం."

కాల్పులు నిలిచిపోయినట్లు ఫ్లాజ్నికొవ్ యిప్పుడే గమనించాడు. ధూళి నెమ్మదిగా సర్దుకుంది, ఛిన్నాభిన్నమైన కిటికీలనూ, గోడలోని కంతనూ, దాని ముందున్న సైనికులనూ అతనిప్పుడు చూడగలుగుతున్నాడు.

"ఇక మూడే డిస్కులు మిగిలాయి" సార్జెంటు అన్నాడు. "ఈ సారి వాళ్లొచ్చినప్పుడిక మనల్ని జల్లెడలా తూట్లు పొడుస్తారు."

"ఎందుకు, నేను తూటాలు తెస్తాగా." ఇంకా వెచ్చగా వున్న కెప్టెన్ చేతినుంచి ఫ్లాజ్నికొవ్ బరువు రివాల్వరు తీసుకొని, తన జేబులోకి జార్చాడు. లేస్తూ అతను అన్నాడు: "ఆయన కాగితాలు పూడ్చిపెట్టు, ఆయన ఆదేశమది. నేను తూటాలు తీసుకొస్తాను. ఈ రోజే."

అదృష్టవంతుడైన సాల్నికొవ్‌ను తను వదిలివచ్చిన కిటికీ గూడు దగ్గరకి వెళ్లాడతను.

అక్కడెవరూ లేరు, దానితో బడలికగా అతనక్కడ చదికిలబడ్డాడు. అతను ప్రేలుడు లోనూ చిక్కుకోలేదు, శత్రుదాడినీ తిప్పికొట్ట లేదు, అయినాకూడా అతను నిస్త్రాణ

చెందాడు. ప్రేలుళ్లతో అతనికి చాలసార్లే చెవులు గళ్లుపడ్డాయి, అతను చాలసార్లే సగం పూడ్చుబడ్డాడు, చాలసార్లే పొగతోనూ, కార్డైటు ప్రేలుడు పదార్థంతోనూ విషాక్తు డయ్యాడు, చివరకు అతని కాలికి తగిలిన ఆ స్వల్ప గాయం సైతం — యౌవనంతో తొణికిసలాడే శరీరం దానికదే ఆ గాయాన్ని నయం చేసుకుంది — తరచుగా అతన్ని బాధిస్తోంది, గున పపుపోటు మాదిరిగా వచ్చే ఆ నొప్పి అతని మోకాలిదాకా పాకులోంది. ఇటుకదెబ్బలు తిన్న అతని మూత్రపిండాలు సలుపుతున్నాయి. ఎడతెగని ఆకలి, దాహం, నిద్రలేమి, అతని దుస్తుల్లోని ప్రతి మడతలోకీ యింకిన వెలపరం కలిగించే కంపు — వీటన్నింటితో అతనికి వాంతి అయ్యేట్టుంది. అతను చాలకాలంగా ప్రమాదాన్ని గురించీ, దాడిని తిప్పికొట్టడమెలా అనీ, నీళ్లు, తూటాలు ఆహారం తేవడమెలా అనీ ఆలోచించడానికి మాత్రమే అల వాటుపడ్డాడు. మరి దేన్ని గురించైనా గుర్తుచేసుకోవడమే అతను మరచిపోయాడు. ఇప్పుడు — క్లుప్తసరియైన యీ ప్రశాంతి విష్కంభంలో సైతం తూటాలనెలా సంపాదించాలనే ఆలోచిస్తున్నాడు తప్ప, తనను గురించిగాని, తనను తాను కాల్చివేసుకున్న కెప్టెన్‌ను గురించిగాని, కేస్‌మేటులోని బోడినేలపై మరణోన్ముఖుడై పడివున్న దెనీష్చిక్‌ని గురించిగాని అతను ఆలోచించడం లేదు. తూటాలూ, గ్రెనేడ్లను గురించే ఆలోచిస్తున్నాడు, ఎందుకంటే, అవి లేనిదే ముట్టడిలో వున్న దుర్గంనుంచి చొచ్చుకువెళ్లి బయటపడటం సాధ్యం కాదు.

సాల్నికొవ్ — జర్మన్ల దగ్గర్నుంచి — కిటికీగుండా తిరిగివచ్చాడు. అతను మూడు సబ్‌మెషీన్ గన్ మగజీన్లను నేలమీద పడేశాడు.

"ఆ జర్మన్ దొంగ నాకొడుకులు. దాడి చేసేటప్పుడు తమ వెంట నీళ్లఫ్లాస్కులు తెచ్చుకోరు!"

"ఇదుగో సాల్నికొవ్, నీకా మొదటి రోజు జ్ఞాపకముందా? ఆ రోజన నువ్వు తూటాలకోసం వెళ్తున్నావు, ఔనా? ఏదో స్టోరుకి?.."

"దాని సంగతి కొందకొవ్‌కి తెలుసు. దానికోసం మనం చూశాం గాని, అది మనకి దొరకలేదు."

"మనం అప్పుడు వట్టి మూర్ఖులం."

"ఇప్పుడు మన తెలివితేటలు పెరిగిపోయాయంటావా?" అతను నిట్టూర్చాడు. "పోయి దానికోసం వెతుకుదామా?"

"ఆఁ. సార్జెంట్ దగ్గర మెషీన్ గన్‌కి మూడు డిస్కులున్నాయి."

"ఎండ వెలుగులోనే?"

"రాత్రి అయితే మనకది కనిపించదు."

"ఉత్తరం రాయి, అభినందనలతో" — సాల్నికొవ్ గంభీరంగా నవ్వాడు.

ప్లూజ్నికొవ్ ఏమీ అనకుండా ఉండిపోయాడు. సాల్నికొవ్ తన జేబులు తడిమి,

గుప్పెట నిండా మకిలిగా వున్న బిస్కట్ ముక్కలు తీశాడు. ఆ ముక్కల్ని వాళ్ళు — బోసినోళ్ళ తాతల మాదిరిగా — చాల సేపు నెమరేశారు. గరుకుగా వున్న వాళ్ల నాలుకలు పొడారిపోయిన వాళ్ల నోళ్లలో కష్టంపైన కదలాడాయి.

''ఓహ్, కాసిని మంచినీళ్ళంటే ఎంత బాగుండును —'' సాల్నికొవ్ అలవాటు ప్రకారం నిట్టూర్చాడు.

''పోయి ఒక ఓవర్‌కోటు తీసుకురా'' వ్లాజ్నికొవ్ అన్నాడు. ''వాలోద్యా కటిక నేలపైన పడివున్నాడు. మనం ఓసారి అతని దగ్గరకి వెళ్దాం, తర్వాత మనం బయల్దేరుదాం. సూర్యకాంతిలోకి.''

''తోడేలు కోరల సందుకి, సైతాను పళ్ల సందుకి'' వెళ్తూ సాల్నికొవ్ గుర్రుమన్నాడు.

త్వరలోనే అతను — కాలిన చిరుగులతో, వీపు పక్క ఎండిన రక్తపు మరకతో వున్న — ఒక ఓవర్‌కోటు పట్టుకొచ్చాడు. మౌనంగా వాళ్లిద్దరూ సబ్‌మెషీన్ గన్ మగజీన్లు పంచుకున్నారు. తర్వాత చెల్లాచెదరుగా పడివున్న యిటుకలగుండా పాక్కుంటూ వెళ్లి క్రింద చీకటిగా వున్న కంతలోకి దిగారు.

దెనీష్చిక్ యింకా బ్రతికే వున్నాడు. అతను నిశ్చలంగా పడివున్నాడు, నిస్తేజమైన అతని కళ్లు ఆకాశఖండం వైపే లగ్నమై వున్నాయి. అతని నల్లని జిప్సీ గడ్డంపై రక్తం గడ్డకట్టింది. వారివంక అతను మరణాసన్నమైన చూపులతో చూసి, తర్వాత కిటికీ కంత వంకకు మరల్చుకున్నాడు.

''ఇతను నన్ను గుర్తుపట్టలేదు'' సాల్నికొవ్ అన్నాడు.

''అదృష్టవంతుడు'' సరిహద్దు గస్తీ సైనికుడు కష్టంమీద అన్నాడు. ''నువ్వు అదృష్టవంతుడివి. శుభం.''

''సరిగా యిప్పుడు స్నానాలగదిలో బాగుంటుంది'' సాల్నికొవ్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. ''వెచ్చగా, బోలెడన్ని నీళ్లుంటాయి.''

''ఏమీ తీసుకురాకు. ఏ నీళ్ళూ వద్దు. ఏం ప్రయోజనం లేదు. నేను ఉదయం చచ్చిపోతాను.''

అతనా మాట ఎంత సరళంగా ప్రశాంతంగా చెప్పాడంటే, వాళ్లు దాన్ని ఖండించలేదు. తను చనిపోతున్నానన్న సంగతి అతనికి తెలుసు, మరి అతను నిరాశా నిస్పృహలేమీ ప్రదర్శించలేదు, కేవలం ఆకాశం వంక చూడాలని మాత్రమే కోరుకున్నాడు. దెనీష్చిక్‌కి తాము చెయ్యగలిగిన గొప్ప మేలు అల్లా అతని మానాన అతన్ని ఆకాశం కింద వదిలెయ్యడమేనన్న సంగతి మరి వాళ్లు కూడా గ్రహించారు. వాళ్లు అతని నడుంక్రింద ఓవర్‌కోటు పరిచారు, కొరడువారిన అతని చల్లని చేతిని తమ చేతులతో ఒత్తి — బ్రతికున్న వాళ్లకోసం తూటాలను కనుగొనేందుకోసం — వాళ్లు వెళ్లిపోయారు.

జర్మన్లు దుర్గంలోకి చొరుచుకువచ్చి, రక్షణకృషిని కేవలం చెదురుబదురు ప్రతిఘటనా కేంద్రాలుగా విడదీశారు. పగటిపూట వాళ్లు, కేవలం శిథిలాలను మాత్రమే వెనక దిగవిడిచేందుకు ప్రయత్నిస్తూ, వలయాకారపు బ్యారక్సుకి సంబంధించిన చిక్కురొక్కురు పద్మవ్యూహంగుండా నిబ్బరంగా చొరుచుకు వెళ్తున్నారు. కాని రాత్రిపూట ఆ శిథిలాలు — శాపర్లచేత ప్రేల్చివెయ్యబడిన, డైవ్ బాంబరు విమానాలచేత పిండిగుండ చెయ్యబడిన, మంట బాంబులు విసరివేసే వారిచేత మసినుసి చెయ్యబడిన ఆ శిథిలాలు — మళ్లీ ప్రాణం పోసుకుంటున్నాయి. కమిలి, శుష్కించిన, దప్పికతో, పోరాటక్లేశంతో బడలిన చింకిపాతల కంకాళాలు యిటుకల గుట్టల క్రిందనుంచి పైకెక్కి, నేలమాళిగల్లోంచి ప్రాకివచ్చి రాత్రిపూట అక్కడ ఉండటానికి సాహసించిన శత్రువులను బయనెట్లతో పొడిచి హతమారుస్తున్నాయి. అందుకనే జర్మన్లు రాత్రిపూటలంటే బేజారెత్తిపోతున్నారు.

కాని ఫ్లాజ్నికొవ్ సాల్నికొవ్‌లు తూటాలకోసం పగటిపూట బయల్దేరారు. తమ ముఖాలు యిటుకలకు రాసుకొని గీరుకుపోతూండగా, దుమ్ము మింగుతూ, క్రుళ్లుతున్న శవాల గాఢమైన గబ్బుకు ఉక్కిరిబిక్కిరవుతూ, తమ వీపులకు ఏక్షణాన అయినా గుళ్ల దెబ్బ తగలవచ్చునని అనుక్షణం భయపడుతూ వాళ్లు పాక్కుంటూ వెళ్లారు. ఏ క్షణమైనా తుది క్షణం కావచ్చు, అజాగ్రత్తతో కూడిన ఏ ఒక్క కదలిక అయినా ఆ క్షణాన్ని ఆసన్నం చెయ్యవచ్చు. అందుకని వాళ్లు తడవకి కొద్దిదూరం మాత్రమే వెళ్తున్నారు, కొద్ది కదలికలు మాత్రమే, అది కూడా ఒకరి తర్వాత మరొకరు వంతులవారీగా కదులుతూ, కదిలేముందు మళ్లీ చాల సేపు, శ్రద్ధగా పరీక్షించి చూస్తున్నారు. దుర్గం ప్రేలుళ్లతో దద్దరిల్లుతోంది, సబ్‌మెషీన్ గన్ను కాల్పులు చిటపటలాడుతూనే వున్నాయి, సదా, ఎక్కడో అక్కడ మంటల రొద వినవస్తూనే వుంది, కాని సరిగా యిక్కడ మాత్రం — ప్రస్తుతానికి యింకా ప్రశాంతంగానే వుంది.

ఫిరంగి గుళ్లు చేసిన గుంటలు మాత్రమే వాళ్లకి రక్షణ. గుంట అడుగున ఆయాసం తీర్చుకొని, కొద్ది క్షణాలు విశ్రాంతి తీసుకొని, తర్వాత వెయ్యబోయే ముందడుగుకి అవసరమైన శక్తిని కూడగట్టుకోగలిగేవారు. ప్రతి ఒక్క మిల్లీమీటరునూ పరీక్షించుకొంటూ వాళ్లు వెయ్యాల్సిన ముందడుగది.

సాల్నికొవ్ ఆ గుంటలోకి చేరుకునేసరికి గుంట అడుగున యింకా ప్రేలుడు మందు తాలూకు పొగలూ, గ్యాసులూ లేస్తూనే వున్నాయి. ఎండకి కాగిన తన ఉక్కు శిరస్త్రాణాన్ని తన మోకాళ్లపై పెట్టుకొని, ఫ్లాజ్నికొవ్ అప్పటికే అక్కడున్నాడు.

సాల్నికొవ్ దభాలున క్రిందకు దూకుతూ "నేను పెళ్లి చేసుకుంటాను" అని బొంగురుగా చెప్పాడు. "నేను బ్రతికి బయట పడితే పెళ్లి చేసుకుంటాను. ఈ పని

యింతకు ముందే చేసుకోకిపోవడానికి నేనో మూర్ఖుణ్ణి కావడమే కారణం. నాకొక అవకాశం వచ్చింది కూడాను —''

అతని ముఖంపై ఒక శీతల ఛాయ పడింది, అదెక్కడినుంచి వచ్చిందో ఫ్లూజ్నికొవ్ గ్రహించలేకపోయాడు, అయితే యిదెక్కడినుంచి వచ్చిందబ్బా అని అబ్బురపాటు చెందే వ్యవధి మాత్రమే అతనికి చిక్కింది.

''నిలబడు!''

వాళ్ల శిరస్సులపైగా బులెట్లు దూసుకెళ్లాయి. ఒక జర్మన్, గుంట అంచున నిలబడ్డాడు. వాడు సరిగా రెండే అంగల దూరంలో వున్నాడు, ఫ్లూజ్నికొవ్ నెమ్మదిగా లేస్తూ, పైకి మడతపెట్టబడిన కోటు చేతులనూ, యిటుక పొడితో ఎర్రపడిన గచ్చకాయ — ఆకుపచ్చ రంగు యూనిఫారాన్నీ, రెండు బొత్తాములు పెట్టుకోకుండా వదిలేసిన కాలరునూ, తన గుండెకి గురిపెట్టబడిన సబ్‌మెషీన్ గన్‌యొక్క నల్లని గొట్టాన్నీ చిత్రంలో మాదిరిగా అతిస్పష్టంగా చూడగలిగాడు. వాళ్లిద్దరూ నెమ్మదిగా లేచి — తమ సబ్‌మెషీన్ గన్నులు గుంట అడుగున తమ కాళ్లవద్ద పడివుండగా — నిలబడ్డారు. సరిగా అంత నెమ్మదిగానూ, కలలో మాదిరిగా, వారు తమ చేతులను కూడా పైకెత్తారు.

ఆ జర్మన్, తన సబ్‌మెషీన్ గన్నును వాళ్లపైకి గురిపెట్టి, గుంట అంచుపైన నిలబడ్డాడు. తెగ బలిసి, నున్నగా గడ్డం గీసుకొనివున్న ఆ జర్మన్ యువకుడు చిరునవ్వులు చిందించాడు. ఇప్పుడిక వాడు ట్రిగ్గరుపై మెల్లగా ఒత్తుతాడు, అంతే అగ్నిధార ఒకటి తమ రొమ్ములను చీలుస్తుంది, అప్పుడిక తాము శాశ్వతంగా యిక్కడే, యీ గుంటలోనే ఉండి పోతారు. ఫ్లూజ్నికొవ్ అప్పుడే ఆ బులెట్లు తాకిడిని, అవి తన శరీరంలోకి ఎముకలను నజ్జునజ్జు చేస్తూ, రక్తాన్ని చిమ్ముతూ చొరుచుకు వెళ్లడాన్ని అనుభూతి చెందుతున్నాడు. అతని గుండె అతితీవ్రంగా కొట్టుకుంటోంది, అతని గొంతు పొడారిపోయి డిక్కపట్టినట్లుంది, అతనికి బిగ్గరగా, యీడ్పుల మాదిరిగా ఎక్కిళ్లొస్తున్నాయి. అతని తల వికృతంగా కంపిస్తోంది.

ఆ జర్మన్ ఘల్లున — బిగ్గరగా, విజయసూచకంగా ఆత్మవిశ్వాసంతో — నవ్వాడు. అతను తన ఎడమ చేతిని గన్నునుంచి పైకి లేపి, ఒంటి వేలితో పైకి రమ్మని సంజ్ఞ చేశాడు. సబ్‌మెషీన్ గన్‌యొక్క నల్లని గొట్టంనుంచి తమ కళ్లను మరల్చుకోలేక, తడబడుతూ, ఒకరికి మరొకరు అడ్డువస్తూ, వాళ్లు వినయంగా పైకి పాకారు. అప్పటికీ ఆ జర్మన్ గవ్వాలు కొడుతూ, ఒంటి వేలుతో వాళ్లని రమ్మని సంజ్ఞ చేస్తూనే వున్నాడు.

''వస్తున్నా'' ఊపిరి లేనట్టు సాల్నికొవ్ గొణిగాడు, ''వస్తున్నా, వచ్చేస్తున్నా —''

అతను ఫ్లూజ్నికొవ్‌ను దాటి — ఏటవాలుగా వున్న స్థలాన్ని దాటి, తన రొమ్ము గుంటపైగా వచ్చేలా — ముందుకొచ్చాడు. అకస్మాత్తుగా గుంట అంచుపైగా ముందుకి

పడి ఆ జర్మన్ కాళ్ళు పట్టుకొని చటుక్కున తనవేపుకి లాగాడు. సబ్‌మెషీన్ గన్ కాల్పులు చాల సేపు ఆకాశంలోకి వెళ్ళాయి. ఆ జర్మనూ, సాల్నికొవూ గుంటలోకి దొర్లారు. ఫ్లాజ్నికొవ్‌కి ఓ పెద్ద కేక వినవచ్చింది:

''పారిపో, లెఫ్టినెంట్! పారిపో! పారిపో! పారిపో!''

పద ఘట్టనలు వినవచ్చాయి. ఫ్లాజ్నికొవ్ గుంట అంచుపైకి ఎగిరి ఎక్కాడు, అరుపు దిశగా జర్మన్లు పరుగున రావడం చూసి, పరుగెత్తాడు. కాల్పుల కారణంగా అతను వంగి పరుగెత్తాల్సి వస్తోంది, అతని పాదాల దగ్గరి యిటుకలు తునాతునకలవుతున్నాయి. అయినా అతను, కళేబరాలపైగా లంఘిస్తూ, కుడికీ ఎడమకూ పాముమెలికలు తిరుగుతూ, పరుగెత్తాడు. కంపిస్తూ వంగివున్న అతని వెన్నెముక దారుణంగా పెద్దదై పోయినట్లూ, వాచిపోయినట్లూ అతను అనుభూతి చెందుతున్నాడు.

గుళ్ళు కుడి పక్కా, ఎడమ పక్కా, ముందువైపూ వర్షపు జల్లులా కురుస్తున్నాయి. ఫ్లాజ్నికొవ్ వేడిగాలి గుటుక్కు గుటుక్కున మింగుతూ, చిచ్చుబుడ్ల మాదిరిగా ఆ గుళ్ళు రేపుతున్న మట్టి జల్లులను తప్ప మరిదేన్నీ చూడకుండా, ఆ గుళ్ల మాదిరిగానే మెలికలు తిరుగుతున్నాడు. కాని జర్మన్లకు అతని వెంట పరుగెత్తే సంకల్పం లేదు. పెద్దపెట్టున పగలబడి నవ్వుతూ, తమ కాల్పులతో వాళ్ళు అతన్ని వలయాలాకారంలో తిరిగేలా చేస్తున్నారు. చింకి గుడ్డలతో, మురికిగా వున్న, రొప్పుతున్న ఆ మనిషి పరుగెత్తుతున్నాడు, పడుతున్నాడు, పాకుతున్నాడు, ఏడుస్తున్నాడు, – గుళ్ళ వర్షమనే అదృశ్య కుడ్యంచేత తరమబడి, బంధితుడై – మళ్ళీ లేచి పరుగెత్తుతున్నాడు. వాళ్ళతన్ని తుదముట్టించాలని తొందరపడ లేదు, అంతేకాకుండా తమ లక్ష్యాన్ని కొట్టకుండా ఉండేందుకు సైతం ప్రయత్నించారు, ఆ విధంగా యీ వేటను కొనసాగించి, యీ వినోద క్రీడను చూడని వాళ్లకు సరదాగా వర్ణించి చెప్పేందుకు కొంత సమాచారాన్ని సృష్టించుకున్నారు.

కానైతే, మరో యిద్దరు జర్మన్ సైనికులు ఫిరంగి గుండు గుంటలో సాల్నికొవ్‌ను క్రమబద్ధంగా చావబాదుతున్నారు. వాళ్ళు తమ సబ్‌మెషీన్ గన్ మడమలతో, రోకళ్ళతో ధాన్యం దంపినట్లు, అతన్ని గట్టిగా కుమ్ముతూంటే, అరవడం ఎన్నడో మానివేసిన సాల్నికొవ్ యిప్పుడు కేవలం ఖంగుఖంగున దగ్గుతున్నాడంతే. అతని నోటినుండీ, చెవులనుండీ రక్తం కారుతోంది, అతను మెలికలు తిరుగుతూ, శక్తిలేని తన చేతులతో తన తలను కాపాడు కోవాలని ప్రయత్నించాడు.

గుళ్ళ వలయం నెమ్మదిగా కుంచించుకుంది, కాని ఫ్లాజ్నికొవ్ – అప్పటికీ తనొక వలయంలో పరుగెత్తుతున్నానని నమ్మకుండా, యింకా ఏదో అద్భుతం సంభవించవచ్చుననే విశ్వసిస్తూ – పరుగెత్తుతూనే వున్నాడు. అతను తన జేబులో జొనుపుకున్న పిస్తోలు అతని కాలికి ఠకీఠకీమని కొట్టుకుంటోంది, దాని ఉనికి అతనికి అనుక్షణం అనుభూతమవుతూనే

వుంది, కాని దాన్ని పైకి తీసుకోగల క్షణం అతనికెన్నడూ చిక్కనేలేదు. ఆ క్షణమూ లేదు, గాలీ లేదు, మరి శక్తీ లేదు, బయటపడే మార్గమూ లేదు. అంతం. సైనిక కొలువుకి సమాప్తి, లెఫ్టినెంట్ నికొలాయ్ ప్లూజ్నికొవ్ జీవితానికి సమాప్తి.

ఛిన్నాభిన్నం చెయ్యబడి, నేలపై ఒంటరిగా నిలిచిన మొండి యిటుక గోడ దగ్గరకి వాళ్లు అతన్ని తరిమారు. ప్లూజ్నికొవ్ దాని వెనక కూలబడ్డాడు, తన బూట్లకు కొద్ది సెంటిమీటర్ల దూరానవున్న యిటుకలకు తాకుతున్న గుళ్లనుంచి ఆ క్షణానికి అతనికి రక్షణ దొరికింది. అతను మరుగున పడ్డాడేమో, క్షణకాలం కాల్పులు ఆగాయి, ఆ ఒక్క క్షణంలో అతనికి ఒక కన్నాన్ని చూసే వ్యవధి చిక్కింది. అది, క్రింది అజ్ఞాతాంధకారంలోకి దారి తీస్తోంది, మారు ఆలోచన లేకుండా — తన శక్తికొలదీ వేగంగా, తన వ్రేళ్లూ, మోకాళ్లూ, మోచేతులూ కొట్టుకుపోయి, రక్తం చిమ్ముతూండగా — అతను అందులోకి పాకాడు. ఆ కంత ఒడ్డారకంగా కుడిపక్కకి తిరిగింది, అతను పక్కకి తిరగగలిగాడు, కాళ్లకు పట్టు తప్పగా, చేతులు పారజాపి, అజ్ఞాత బిలంలోకి కూలిపోయాడు. పడిపోతూ అతను తన తలపైన ప్రేలుడు విన్నాడు. జర్మన్లు అతని వెనక ఆ కంతలోకి ఒక గ్రెనేడ్ విసిరారు, అది గోడను తాకి, ఆ బిలంలోని ప్రశాంతిని భంగపరుస్తూ, మలుపు దగ్గర పేలింది.

ఇసుకతోనూ, సున్నంతోనూ నిండివున్న యిటుక పరుపు నేలపై అతను పడ్డాడు, కాని అదృష్టవశాత్తూ అతను చేతులపై ఆనుకోగలిగిన కారణంగా ప్రమాదంనుంచి తప్పించుకోగలిగాడు. అదురుకి ముక్కువెంబడి రక్తం కారడంతప్ప, అతనికి మరే దెబ్బా తగల్లేదు. తన చేతిని మధ్యమధ్య కదిపి రక్తాన్ని ముఖానికీ, తన సైనిక కోటుకీ పులుముకోవడంతప్ప మరే కదలికా లేకుండా — ప్రమాద సూచన కోసం చెవులు దోరపెట్టుకొని శ్రద్ధగా వింటూ — అతనక్కడ నిశ్శబ్దంగా పడుకున్నాడు. ఇప్పుడతనికి అదొక అలవాటుగా పరిణమించింది. అతను తన ఊపిరిని బిగపట్టేందుకు ప్రయత్నించాడు, కాని అప్పటికీ అతని గుండె తీవ్రంగా కొట్టుకుంటోంది, దానితో తన సకల ప్రయత్నాలూ విఫలం కాగా అతను ఎగరొప్ప నారంభించాడు. అందుకని అతను తన పిస్తోలును బయటకు తీసి సిద్ధంగా పట్టుకొని, చల్లని నేలపై మరింత అనువుగా సర్దుకున్నాడు.

దాదాపు ఆ వెంటనే అతనికి అడుగుల చప్పుడు వినవచ్చింది. ఎవరో జాగ్రత్తగా అడుగులు వేసుకొంటూ — కేవలం అతిస్వల్పంగా యిసుక కరకరమన్న శబ్దం మాత్రమే అవుతూండగా — వస్తున్నారు. చీకట్లోకి తీక్ష్ణంగా చూస్తూ, ప్లూజ్నికొవ్ తన పిస్తోలును పైకెత్తాడు; అతని శరీరం యావత్తూ కంపించింది, అతను తన రెండు చేతులూ ఉపయోగించాల్సి వచ్చింది. అతని కళ్లు చీకటికి అలవాటు పడిన కారణంగా, యింకా అంతదూరంలో వుండగానే, అస్పష్ట రూపాలు రెండింటిని అతను చూడగలిగాడు.

''ఆగు!'' వాళ్లు దగ్గరకి రాగానే అతను ప్రశాంతంగా ఆజ్ఞాపించాడు. ''ఎవరది?''

ఆ ఆకారాలు ఆగాయి, తర్వాత వాటిలో ఒకటి కదిలి, నేరుగా కంపిస్తున్న అతని పిస్తోలుగొట్టానికి ఎదురుగా ముందుకొచ్చింది.

''కాల్చేస్తాను!''

''కాని కామ్రేడ్, మేం మిత్రులం, మిత్రులం.'' ముందుకొస్తున్న వ్యక్తి తొందరగా, సంతోషంగా అరిచి చెప్పాడు. ''ఫెదొర్చుక్, మాకు కొంచెం వెలుగు చూపించు.''

అగ్గిపుల్ల వెలిగింది. పొగతో కూడిన కాగడామంటలో గడ్డపు ముఖమూ, సైనిక కోటూ, ఆ కోటు ఓపెన్ కాలరు పైన ఫిరంగి సైనిక దళానికి చెందిన నల్లని పట్టీపైన మూడు ఎర్రని త్రికోణాలూ అతనికి కానవచ్చాయి.

''మనం మిత్రులం, మిత్రులం!'' ముందున్న అతను అరిచి చెప్పాడు. ''మొదటి ప్రేలుడు మమ్మల్ని యిందులో పూడ్చేసింది. మమ్మల్ని మేము బయటకి తవ్వి తీసుకొని పైకి ఒక సొరంగం తవ్వాం. మేం ఏమనుకున్నామంటే –''

కాగడా మంట టపటపలాడి అకస్మాత్తుగా రెండుగా విడివడి, అటూయిటూ వాలి, వలయం చుట్టి, తటాలున భగ్గున మండింది. పట్టులేని అతని చేతుల్లోంచి పిస్తోలు దబ్బున కిందపడింది, ప్లూజ్నికొవ్ స్పృహ కోల్పోయాడు.

అతను స్పృహలోకి వచ్చేసరికి అతని చుట్టూ పూర్తి నిశ్శబ్దం ఆవరించివుంది, అలవాటులేని యీ శాంతియుత నిశ్శబ్దం అతన్ని భయభీతుని చేసింది. మళ్లీ అతని గుండె ధన్‌ధన్మున కొట్టుకోసాగింది. అతను బెంబేలెత్తిపోయి, కళ్లింకా మూసుకొనే, తనకి చెవుడు వచ్చిందనీ, అందునా శాశ్వతంగా బ్రహ్మచెవుడు వచ్చిందనీ అనుకున్నాడు. బాధాకరమైన ఉద్రిక్తతతో, అతను పరిచిత శబ్దాలను: ప్రేలుళ్ల గర్జలు, మెషీన్ గన్ కాల్పుల కటకట శబ్దాలు, సబ్‌మెషీన్‌ల గన్నుల కాల్పుల కఠోర శబ్దాలు వినేందుకు ప్రయత్నించాడు, నిరీక్షించాడు. కాని అందుకు బదులుగా అతనికి ఒక స్త్రీ సుతిమెత్తని స్వరం, దాదాపు గుసగుస వినవచ్చింది.

''ఈయన స్పృహలో కొస్తున్నాడు, క్రిస్తా అత్తా.''

అతను తన కళ్లు తెరిచాడు, మసక వెల్తురులో అతను దీపాలు చూశాడు, పైకి లేస్తున్న కమాన్ను చూశాడు, ఓ అమ్మాయి గుండ్రని ముఖం చూశాడు; అతి తెల్లని, ఊహకి అందనంత పరిశుభ్రంగా వున్న ఒక రుమాలు కిందనుంచి ఒక నల్లని జుట్టుపాయ ముందుకి పడింది. తన చేతుల్ని జాగ్రత్తగా కదుపుతూ – అవి బంధింపబడిలేవు, స్వేచ్ఛగానే వున్నాయి – తను పడుకొని వున్న బెంచి అంచులను తడిమి, లేచి కూర్చున్నాడు.

''నేనెక్కడున్నాను?''

ఆ ఆకస్మిక కదలిక అతని కళ్ల ముందు సమస్తాన్నీ – అస్పష్ట కాంతితో వున్న నేలమాళిగా, గడ్డాలు పెరిగిన పురుషుల ముఖాలూ, యిద్దరు ఆడాళ్ల ముఖాలూ – అలలు

అలల్లా తేలిపోయేలా చేసింది. ఒక యువతి ముఖం తనకి సమీపంలోనూ, మరింత వయస్సు కలిగిన, మరింత బిగువుసడలిన మరో ముఖం వెనక, టేబిలు దగ్గరా ఉండటం అతను చూశాడు. ముఖాలు వెనక్కి వెనక్కి తగ్గి అదృశ్యమయ్యాయి. అతను తటాలున బెంచి వార, తన జేబుల్లోను, రక్తంతో యింకా బంకబంకగా వున్న తన పైనిక కోటుపైనా తడిమాడు. కాని అతనికి పిస్తోలు కనిపించలేదు.

''ఇదిగో కాసిని మంచినీళ్లు.''

ఆ యువతి ఓ రేకు మగ్గుని ముందుకి చాచింది. దాన్ని అతను అపనమ్మకంగా అందుకున్నాడు, అపనమ్మకంగానే మింగాడు. ఆ నీళ్లు బురదగా వున్నాయి, అతని పళ్లకు గరుకుగా తగిలాయి, కాని, యిరవై నాలుగు గంటల్లో అతనికి లభ్యమైన నీళ్లు యివేనేమో, ఆ మగ్గులో ఒక్క బొట్టును కూడా మిగల్చకుండా అతను ఏకబిగిన ఖాళీచేశాడు. నేలమాళిగ, దీపాలు, ముఖాలూ — తమ ఉన్మత్తనృత్యాన్ని వెంటనే కట్టిపెట్టేశాయి. ఓ పెద్ద టేబిలూ, నూనె పోసిన మూడు పళ్లాలూ, వాటిలో వెలుగుతున్న వత్తులూ, ఓ టీ కెటిలూ, శుభ్రమైన గుడ్డతో కప్పబడిన ఓ గిన్నె, అయిదుగురు మనుషులూ — ముగ్గురు మగాళ్లూ, యిద్దరు ఆడాళ్లూ — అతనికి కానవచ్చారు. ఆ అయిదుగురూ అతనివంక చిరునవ్వులు చిందిస్తున్నారు. పెద్దామె బుగ్గలవెంట కన్నీళ్లు జాలువారుతున్నాయి, వాటినామె తుడిచేసుకొంది, వెక్కివెక్కి ఏడ్చింది, పకపక నవ్వింది. సుదూరమైనదే అయినా సుపరిచితమైనదేదో, కల మాదిరిగా, మనో కల్పితమైన ఛాయమాదిరిగా అతని ముందు రూపుదాల్చింది, కాని దాన్ని గుర్తుచేసుకొనేందుకు అతను ప్రయత్నించలేదు, సరికదా కటువుగా అన్నాడు:

''నా పిస్తోలు. నా పిస్తోలెక్కడ?''

''ఇదిగో.'' యువతి టేబిలుపైనుంచి దాన్ని చటుక్కున తీసి ముందుకు చాచిపట్టుకుంది. ''మీరు నన్ను గుర్తుపట్టలేదా, కామ్రేడ్ లెఫ్టినెంట్?''

మౌనంగా అతను దాన్ని అందుకున్నాడు, తూటాల క్లిప్పుని తనిఖీచేశాడు — ఆఁ, నిండుగానే వుంది. చటుక్కున ఆ క్లిప్పుని లోపలకు నెట్టి, శాంతించాడు.

''నేను మీకు గుర్తున్నానా? మీకు జ్ఞాపకముందా — ఆ శనివారం — యుద్ధం మొదలయ్యేందుకు సరిగా ముందు, మనం దుర్గాని కొచ్చాం. మీరు పడిపోయారు, చెక్‌పోస్టు దగ్గర. నేను మీర్రాని — ఇప్పుడు జ్ఞాపకమొచ్చిందా?''

''ఆఁ, ఆఁ.''

అతనికి అన్నీ జ్ఞాపకమొచ్చాయి. కుంటి పిల్ల, భగ్గంపాడుచెయ్యబడిన దుర్గంగుండా జర్మన్ జైలుకి పిల్లల్ని ఎత్తుకొని నడిచివెళ్తున్న స్త్రీలు, మొదటి ఫిరంగి కాల్పులు, సాల్నికొవ్‌తో మొదటి సమాగమం, ''పారిపో లెఫ్టినెంట్, పారిపో!'' అన్న సాల్నికొవ్ చివరి అరుపు — అతనికి జ్ఞాపకమొచ్చాయి. కళ్లుపోయిన కెప్టెనూ, ఖాళీ కేస్‌మేట్‌లోని దెనీష్కికూ అతనికి

జ్ఞాపకం వచ్చారు. ఒక్కగానొక్క గుక్కెడు నీళ్ల విలువా, మరణోన్ముఖులైన వాళ్లతో నిండిన భయంకరమైన ఆ నేలమాళిగా అతనికి గుర్తొచ్చాయి. ఆ అయిదుగురూ, ఒకరికి మరొకరు అడ్డుపడుతూ, అతనికి ఏమేమో చెప్తున్నారు — వాళ్ల స్వరాలు ఉద్రిక్తంగానే కాకుండా, సంతోషంగా కూడా ఉన్నాయి, కాని ఆ క్షణంలో వాళ్లు చెప్తున్నది అతని చెవులకెక్కలేదు.

''మీకు తినడానికి తిండి కూడా వుందా?'' అతను గుసగుస స్వరంలో అడిగాడు. అతని స్వరంలోని తీక్ష్ణతకు అందరూ ఒక్కసారిగా మౌనందాల్చారు. ''సుష్టుగా తిండి తిని, శుభ్రంగా, ఏ దెబ్బా గిబ్బా లేకుండా హాయిగా ఉన్నారన్నమాట? కాని అక్కడ పైన మీ సోదరులూ, కామ్రేడ్సూ అంత్యక్రియల్లేకుండా చచ్చిపడివున్నారు — అదుగో, మీ తలలపైన మేం చచ్చిపోయాం. చచ్చిపోయినవాళ్లు, నూరు సార్లు చంపబడినవాళ్లు, తమ ఖాళీ చేతులతో జర్మన్లను పీకలు నొక్కి చంపుతున్నారు. నీళ్లు — మేం నీళ్లను పిల్లలకి కూడా యివ్వలేదు — నీళ్లన్నీ మెషీన్ గన్నులకే కేటాయించాం. దాహంతో పిల్లలు పిచ్చెత్తిపోయారు, అయినా మేం నీళ్లు గన్నులకే యిచ్చాం! గన్నులకి మాత్రమే! అవి కాల్పగలిగేందుకు వీలుగా! జర్మన్లు లోపలికి రాకుండా ఆపేందుకని! మరి మీరు — మీరిక్కడ తీరుబడిగా కాలక్షేపం చేస్తున్నారా?'' అతను అకస్మాత్తుగా లేచి నిలబడ్డాడు. ''మురికి పీనుగుల్లారా! పిరికితనం ప్రదర్శించి, దేశద్రోహం చేసినందుకు మిమ్మల్ని నిలువునా కాల్చిపారేస్తాను! నాకిప్పుడా హక్కుంది! పైన చచ్చిపడివున్నవాళ్ల పేర — హక్కు! వాళ్ల పేర!''

అతను తన శక్తికొద్దీ అరిచాడు, ఉద్రేకంతో ఊగిపోయాడు, అయినా వాళ్లేమీ బదులు చెప్పలేదు. అతని చివరి మాటలు విన్నమీదట, సీనియర్ సార్జెంటు ఫెదొర్చుక్ మాత్రమే, వెనక్కి చీకట్లోకి వెళ్లాడు. అక్కడ ఆ చీకట్లో, అతని సబ్ మెషీన్ గన్ బోల్టు క్లుప్తసరిగా క్లిక్ మంది.

''మిమ్మల్ని మురికి పీనుగులనకు.''

సాధు స్త్రీ అతని దిశగా ముందుకొచ్చింది. లావుగావున్న ఆమె బాహువులు అతన్ని సున్నితంగా, గట్టిగా కౌగలించుకున్నాయి. ప్లూజ్నికొవ్ గింజుకొని విడిపించుకోవాలనుకున్నాడు. కాని మాతృభావం తొణికిసలాడే స్త్రీ మెత్తని రొమ్ముకొటి అతని భుజానికి తాకింది. అతను దుబ్బులా పెరిగిన గడ్డంతో, రక్తపు మరకలతో వున్న తన చెంపను ఆ రొమ్ముకి ఒత్తి గుడ్లనీళ్లు కుక్కుకున్నాడు. అతను బిగ్గరగా వెక్కివెక్కి ఏడ్చాడు. ఆమె మృదుహస్తాలు అతని భుజంపై మెల్లిగా నిమిరాయి. ఉపశమనాత్మకమైన — మాతృ స్వరం వంటి — ప్రశాంత స్వరం అతనికి గుసగుసగా చెప్పింది:

''శాంతించు బాబూ, శాంతించు. నువ్వు వెనక్కి తిరిగి వచ్చావు. వెనక్కి, యింటికి, గాయపడకుండా తిరిగొచ్చావు. ముందు విశ్రాంతి తీసుకో, తర్వాత అన్నీ తేల్చుకుందాం. విశ్రాంతి తీసుకో, బాబూ.''

''ఔను, నేను వెనక్కి తిరిగొచ్చాను'' దారుణమైన నిస్త్రాణలో ఫ్లాజ్నికొవ్ అనుకున్నాడు. ''నేను తిరిగొచ్చాను....''

మూడో భాగం

1

జూన్ యిరవై రెండవ తేదీ ప్రత్యూష వేళ ఏ స్టోరులోనైతే సార్జెంట్ మేజరు స్తెపాన్ మత్వేయెవిచ్, సీనియర్ సార్జెంటు ఫెదొర్చుక్, రెడార్మీ సైనికుడు వాస్యా వోల్కొవ్, మరి ముగ్గురు స్త్రీలూ టీ తాగుతూ ఉండినారో, ఆ స్టోరు, ఫిరంగిదాడి తొలి క్షణాల్లోనే భారీ ఫిరంగి గుండు దెబ్బకి గురైంది. ఆ గుండు సరిగా స్టోరుద్వారం దగ్గర పేలింది. పైకప్పు తట్టుకుందిగాని, మెట్లు మాత్రం పూడిపోయాయి. దానితో పైకి వెళ్లేందుకు గల మార్గం ఒక్కటీ — అప్పట్లో వాళ్లు తమ ముక్తిమార్గంగా పరిగణించినదొక్కటీ మూసుకు పోయింది. ఫ్లూజ్నికొవ్‌కి ఆ గుండు బాగా గుర్తుంది: దాని ప్రేలుడు అతన్ని ఓ కొత్త గుంటలోకి విసిరేసింది, తనకి స్పృహ వచ్చినతర్వాత, సాల్నికొవ్ కూడా అక్కడికొచ్చి పడ్డాడు. ఆ గుండు తనకైతే వెనక పక్కన పడింది గాని, వాళ్లకి ముందు పడింది. తర్వాత చాల కాలం తమ బాటలు చీలిపోయాయి.

సజీవంగా కేస్‌మేటులో పూడ్చబడిన వాళ్లకు, యుద్ధం ఎక్కడో పైన జరుగుతోంది. ఆ యుద్ధం మూలంగా మీటరు మందమున్న గోడలు అల్లల్లాడుతున్నాయి, యిసుకా, పప్పపప్పైన యిటుకలూ క్రిందకు పడి, గాలికంతలను మూసేస్తున్నాయి. వాళ్లు తమ సొంత మనుషులనుండీ, ప్రపంచంనుండీ వేరుచేసివెయ్యబడ్డారు, కాని వాళ్లకి తిండి వుంది, ఆ మరుసటి రోజే వాళ్లొక నూతినుంచి త్రాగేందుకు నీళ్లు సంపాదించుకోగలిగారు. వాళ్లా నూతిని నేలను బద్దలుకొట్టి తవ్వారు. ఇరవై నాలుగు గంటల్లో సుమారు ఓ రెండు టిఫిన్ కారియర్ల చొప్పున నీళ్లు ఊరాయి. వాళ్లకి తిండీ, నీళ్లూ ఉన్నాయి. అయితే వాళ్లింకా చాలానే చెయ్యాల్సివచ్చింది. అన్ని పక్కలా గోడను బద్దలుకొట్టి — ఎక్కడంటే అక్కడ కంత చెయ్యాలని ప్రయత్నించారు. ఆ కంతద్వారా నేల ఉపరితలానికో, లేకుంటే కనీసం ప్రక్క నేలమాళిగల్లోకో త్రోవ ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. కాని తదుపరి బాంబింగుల మూలంగా త్రోవలన్నీ పూడ్చివెయ్యబడ్డాయి, అందుకని వాళ్లు మళ్లీ తవ్వారు. ఆ ప్రయత్న క్రమంలో వాళ్లొక రోజున పద్మవ్యూహంలా వున్న భూగర్భ వసారాలను, ద్వారంలా కనిపించి ద్వారంకాని త్రోవలను, కేస్‌మేటులను చూశారు. అక్కడినుంచి వాళ్లు ఆయుధాగారాన్ని

చేరుకున్నారు. దాన్నుంచి బయటపడే మార్గం కూడా సూటిగా తగిలిన గుండు దెబ్బకు పూడుకుపోయింది. కాని దాని చివర పైకి దోవతీసే ఒక యిరుకైన సొరంగం వాళ్లకి కానవచ్చింది.

చాలా రోజుల తర్వాత వాళ్లు మొట్టమొదటిసారి నేల ఉపరితలానికి వచ్చారు. సజీవంగా పూడ్చివెయ్యబడిన యీ ఆరుగురూ స్వేచ్ఛకోసం, గాలికోసం, తమ సొంత జనం కోసం విపరీతంగా తహతహలాడారు. ఒకరి తర్వాత మరొకరుగా వాళ్లు ఆరుగురూ పాకి నేల పైకి ఎక్కారు, కానైతే, ఏ కంత అయితే తమను జీవితం కేసీ, విముక్తి కేసీ తీసుకెళ్తుందని ఆశించారో ఆ కంతినుంచి ఒక్క అడుగు కూడా ముందుకెయ్యడానికి సాహసించలేక, స్థాణువుల్లా నిలబడిపోయారు.

దుర్గం యింకా సజీవంగానే ఉంది. వలయకారపు బ్యారక్సునుంచీ, ముహవేత్స్ నది అవతల గట్టునుంచీ, చర్చినుంచీ మధ్యమధ్య యింకా కాల్పులు వినవస్తూనే వున్నాయి. వాళ్లకి మంటలూ, కూలుతున్న గోడలూ కనిపించాయి. కాని, ఆ మధ్య ప్రాంతంలో, యీ రాత్రి, ప్రశాంతంగా వుంది. గుర్తుపట్టేందుకు వీల్లేకుండా వుంది. చుట్టుపక్కల ఎక్కడా తమ సొంత మనుషుల్లేరు, గాలి లేదు, స్వేచ్ఛ లేదు.

''మన పని అయిపోయింది'' ఫెదొర్చుక్ బొంగురుగా అన్నాడు.

''మనం రికన్నాయిటర్ చేసి పరిస్థితులను తెలుసుకోవాలి'' సార్జెంట్ మేజరు అన్నాడు. ''మనం యిప్పుడెక్కడికెళ్లగలం? మన వాళ్లెక్కడున్నారు?''

క్రిస్తా అత్త, మోటు రైతుల మాదిరిగా జేబు రుమాలు మూలతో తన కళ్లు తుడుచుకుంటూ, ఏడ్చింది. మీరా ఆమెను ఒత్తుకుంది. చుట్టూ కొట్టే కంపు మూలంగా ఆమెకు వాంతి వచ్చేట్లయింది. ఒక్క అన్నా పెత్రోవ్నా మాత్రమే చీకట్లో సైతం ప్రజ్వలిస్తున్న పొడికళ్లతో చూస్తోంది. ఆమె నిశ్శబ్దంగా ఆవరణగుండా నడిచిపోనారంభించింది.

''అన్యా!'' స్తెపాన్ మత్వేయెవిచ్ పిలిచాడు. ''ఎక్కడికెళ్తున్నావ్, అన్యా?''

''పిల్లల కోసం.'' ఆమె క్షణకాలం వెనక్కి తిరిగింది. ''పిల్లలు అక్కడున్నారు. నా పిల్లలు.''

అలా వెళ్లిపోయిందామె, వాళ్లు, నిరాశా నిస్పృహల్లో మునిగిపోయి, నేలమాళిగకు తిరిగివెళ్లారు.

కాని ఆ తల్లి కళేబరాలకు కాలుతగిలి తూలుతూ లేస్తూ ఉన్మత్తావేశ భరితమైన పొడి కళ్లతో వెలుగులు వెదజల్లే రాకెట్ల ఉదారంగు వెల్తురులోకి గుడ్లప్పగించి చూస్తూ — మున్ముందుకెళ్లింది. సోవియట్ సేనలు విడిచివెళ్లిపోయిన ప్రాంతంలో ఉన్న కారణంగా, ఆమెనెవ్వరూ పిలవనూ లేదు, అడ్డనూ లేదు. జర్మన్ శాపర్లచేత పేల్చివెయ్యబడిన ప్రాంతం, అనేక రోజుల తరబడి జరిగిన బాంబింగులో నాశనం చెయ్యబడిన ప్రాంతం అది.

ఆమె మూడు కమాన్ల గేటు దాటి, వంతెన దగ్గరకొచ్చింది — నేల యింకా రక్తపంకంతో జర్రున జారుతూనే వుంది, కళేబరాలు యింకా చెల్లాచెదరుగా పడివున్నాయి. అదుగో ఆమె అక్కడ — యాదృచ్ఛికంగా అటువచ్చిన కాల్పులచేత మూడు చోట్ల గాయపడి, అక్కడ, తన స్వజనం మధ్య పడిపోయింది. ఆమె నడుస్తూ నడుస్తూ — నిటారుగా బిగిసిపోయి, చనిపోయిన బిడ్డలవంక చేతులు పారజాపి పడిపోయింది.

కాని నేలమాళిగలోని ఏ ఒక్కరికీ యీ సంగతి తెలియదు, లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్‌కి అంతకన్న తెలియదు.

పూర్తిగా స్పృహ కోలుకోగానే అతను తూటాల కోసం డిమాండుచేశాడు. గోడ కంతలోంచి, సొరంగ మార్గంనుంచి ఆయుధాగారానికి — యుద్ధపు తొలి గంటల్లో సాల్నికొవ్ పరుగెడుతూ వుండిన ఆయుధాల గిడ్డంగికి — వాళ్ళు తనని తీసుకెళ్ళినప్పుడు, గ్రీజుతో మడ్డిగా వున్న కొత్త సబ్‌మెషీన్ గన్నులను, నిండు డిస్కులనూ, యింతవరకింకా తాకని తూటాల పెట్టెలనూ చూసినప్పుడు, అతను కష్టంమీద కన్నీళ్లను ఆపుకున్నాడు. ఏ ఆయుధాల కోసమైతే వాళ్ళ యిప్పటికి యిన్ని రాత్రులుగా ఎన్నో ప్రాణాలను బలిచేశారో, యితర వస్తువులన్నింటి కన్న అతను వేటికోసం ప్రగాఢంగా ఆకాంక్షించాడో, ఆశించాడో — అవి యిప్పుడు అతని కళ్ళెదుట వున్నాయి. అతను వాళ్ళందర్నీ ఆ సబ్‌మెషీన్ గన్నులను గ్రీజు తుడిచి శుభ్రంచేసి పోరాటానికి సన్నద్ధంచెయ్యమని పురమాయించాడు. మరి వాళ్ళు, ప్రచండమైన అతని శక్తితో ఉత్తేజితులై, వంచిన నడుములెత్తకుండా పని చేశారు.

సాయంత్రానికల్లా అన్నీ: సబ్‌మెషీన్ గన్నులు, అదనపు డిస్కులు, తూటాల పెట్టెలు అన్నీ సిద్ధమయ్యాయి. అతనా రోజున లోపలకి ప్రవేశించిన కంత దగ్గరి మొండి నడవ దగ్గరకి, ఊపిరి బిగపట్టి, తను క్షేమంగా ఉన్నానన్న నమ్మకం ఎంతమాత్రం లేక, అడుగుల చప్పుడు కోసం నిరీక్షించిన నడవ దగ్గరకి అన్నీ చేరవెయ్యబడ్డాయి. అతను మగవాళ్లను తనతో తీసుకెళ్ళాడు. వారిలో ప్రతి ఒక్కడూ, ఆయుధాలూ, తూటాలతోబాటు, నీళ్ల ఫ్లాస్కు కూడా ఒకటి తీసుకెళ్లాడు. ఆడాళ్ల క్రిందనే ఉండిపోయారు.

"మేం మళ్లీ వస్తాం" ప్లూజ్నికొవ్ అన్నాడు.

అతనా మాట ముక్తసరిగా చెప్పాడు, వాళ్ళు — ఒకడు సగౌరవంగా యిష్టంతో, ఒకడు భయంతో, మూడో వాడు పూర్తిగా మరుగుపరచుకోని అసంతృప్తితో — ఔదల దాల్చారు; కాని ఏ ఒక్కడూ అభ్యంతరాలు లేవదియ్యలేదు. అతను — ఆకలితో, నిద్రలేమితో, దుబ్బులా పెరిగిన గడ్డంతో నల్లగా మాడిన ముఖంతో చీలికలు వాలికలై రక్తపు మరకలతో వున్న సైనిక కోటులో వున్న యీ లెఫ్టినెంటు — చూడటానికి భయంకరంగా వున్నాడు.

ఒక్కసారి మాత్రమే సార్జెంట్ మేజరు నెమ్మదిగా అడ్డుతగిలాడు.

''ఆ తిండి పదార్థాలన్నీ పక్కకి పెట్టెయ్యి. ఆయనకి ఒక రస్కూ, ఓ గ్లాసుడు వేడి మంచినీళ్లూ ఇయ్యి.''

అత్యవసర పరిస్థితుల కోసం దాచివుంచిన తిండిపదార్థాలన్నింటినీ జాలిగుండె క్రిస్తో అత్త టేబిలుమీద పెడుతున్నప్పుడు, అతనీ మాట అన్నాడు. ఆకలి పెను తరంగ మొకటి ఫ్లాజ్నికొవ్ గొంతును ఆవేశించగా, అన్నింటినీ, తను చూసిన సమస్తాన్నీ ఆబగా తినెయ్యాలనీ, తన కడుపు నింపేసుకోవాలనీ, తరుచుగా తనను నేలపై దొర్లేలాగా, ఏడవకుండా ఉండేందుకుగాను కోటు అంచులను నోట కుక్కుకునేలాగా చేసిన ఆకలి పొల్సును తీర్చుకోవాలనీ అతను చేతులు చాచి టేబిలుముందు కొస్తున్నప్పుడు సార్జెంట్ మేజరు అన్నమాటలవి. సార్జెంట్ మేజరు అతని చేతులను గట్టిగా పట్టుకొని, అతన్ని టేబిలు దగ్గరకు వెళ్లకుండా అడ్డుకున్నాడు.

''దాన్ని పక్కకి పెట్టెయ్యి క్రిస్తో అత్తయ్యా. మీరు అతిగా తినకూడదు, కామ్రేడ్ లెఫ్టినెంట్. అది మీకు ప్రాణాంతక మవుతుంది. ఇప్పుడు కొంచెం మాత్రమే తినండి. మీ పొట్ట తిండికి క్రమంగా మళ్లీ అలవాటు పడాలి.''

ఫ్లాజ్నికొవ్ తనని తాను సంబాళించుకున్నాడు. అతనా ఆకలి పొల్సును దిగమింగాడు. మీత్రా కంట్లో పెద్దపెద్ద కన్నీటి బొట్లను చూశాడు, చిరునవ్వు నవ్వేందుకు ప్రయత్నించాడు, నవ్వడమెలాగో తను మరచిపోయినట్లు గమనించి పక్కకు తిరిగాడు.

చీకటి పడగానే అతను జాగ్రత్తగా — భయంకర మౌనానికి అలవాటుపడ్డ యువ వాస్యా వోల్కొవ్ తన వెంట రాగా — కంతగుండా బయటికి వెళ్లాడు. అతనక్కడ చాల సేపు — దూరాన్నుంచి వినవస్తున్న కాల్పులను వింటూ, అడుగుల చప్పుడు కోసం, మాటల కోసం, ఆయుధాల కణకణ శబ్దం కోసం చెవులురిక్కించి వింటూ — వేచి వున్నాడు. కాని అంతా ప్రశాంతంగా వుంది.

''నా వెనక రా. తొందర పడకు, నువ్వు కదలబోయేముందు జాగ్రత్తగా విను.''

వాళ్లు ప్రతి ఫిరంగి గుండు గుంటలోకీ జారారు. కాలికి అడ్డొచ్చిన ప్రతిదాన్నీ పరీక్షించారు. ప్రతి శరీరాన్నీ ముట్టుకుచూశారు. సాల్నికొవ్ అక్కడ లేదు.

''అమ్మయ్య, అతను బ్రతికున్నాడు'' వాళ్లు తిరిగివచ్చేటప్పుడు ప్రాణం తేలికపడిన వాని మాదిరిగా ఫ్లాజ్నికొవ్ అన్నాడు. ''ఖైదీగా పట్టుకున్నారు. వాళ్లు మన మృతులను పూడ్చిపెట్టరు.''

అతను మానసికంగా కాకపోయినా మానసికోద్వేగపరంగా నేరంచేసిన వాని మాదిరిగా అనుభూతి చెందాడు. ఇది అతనికి యుద్ధపు మొదటి రోజు కాదు. యుద్ధానికి దాని స్వంత నియమాలూ, నీతులూ కొన్ని ఉన్నాయన్న సంగతీ, శాంతికాలంలో ఆమోదయోగ్యంకాని కొన్ని అంశాలు యుద్ధకాలంలో కచ్చితమైన ఆవశ్యకతలుగా మారుతాయన్న సంగతీ అతనికి

తెలుసు. తను ఆగిపోయినా సాల్నికొవ్‌ను తను కాపాడగలిగివుండేవాడిని కానన్న సంగతి అతనికి తెలుసు. తను అక్కడినుంచి తప్పించుకుపోయేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. అలా చెయ్యడం ఖచ్చితమైన తన విధి. ఈ విధి తనకోసం కాదు, అట్లే తన స్వంతానికి ఎంత మాత్రం కాదు, తనని యీ ఆయుధాల గాలింపు కోసం పంపిన వాళ్లకోసం — అన్న సంగతి అతనికి తెలుసు. అయినా కూడా సాల్నికొవ్‌ను మృతునిగా తనెక్కడ చూడాల్సి వస్తుందోనని అతను కంపించిపోయాడు. కాని జర్మన్లు అతన్ని ఖైదీగా పట్టుకుపోయారు; అందుచేత అదృష్టవంతుడూ, తలవంచని నిర్భయుడూ అయిన సాల్నికొవ్ హింసలు తట్టుకొని బ్రతికే ఉంటాడనీ, ఏవో మార్గాలు వెతక్కపోడనీ, బహుశా తప్పించుకు పారిపోయినా పారిపోయే అవకాశం లేకపోలేదనీ అతను ఆశించాడు. రాత్రింబగళ్లు నిరంతరాయంగా సాగిన పోరాటక్రమంలో బుగ్గ చీరుకుపోయిన ఆ భయభీత యువకుడు సాహసికుడైన, తెలివైన, బుద్ధిసూక్ష్మత గలిగిన యోధునిగా పరిణతి చెందాడు. అందుకనే ప్ల్యాజ్నికొవ్ మనస్సు తేలికపడగా నిట్టూర్చాడు: ''బ్రతికేవున్నాడు!''

మరిన్ని ఆయుధాలనూ, మరింత మందుగుండు సామగ్రినీ వాళ్లు కంత క్రింద వున్న స్థలానికి చేర్చారు. చొరుచుకుపోయేటప్పుడు వెనుకదన్నుగా శత్రువును ఆశ్చర్యచకితుని చేసే ఆయుధ శక్తి ప్రదర్శితం కావాలి. ఉన్న ఆయుధాలన్నింటినీ ఏకొదమ్మైన ప్రధానబలగానికి చేర్చడమన్నది తమ శక్తికి అతీతమైన విషయం, అందుకని అతనా రాత్రే తిరిగిరావాలని అంచనా వేసుకున్నాడు. ఆడవాళ్లతో తను తిరిగివస్తానని చెప్పడమైతే చెప్పాడు, కాని తనలో పెరుగుతున్న ఆవేగాన్ని అతను అనుభూతి చెందుతున్నాడు. తను నిర్ణయించాల్సిన, అందులోనూ తక్షణమే నిర్ణయించాల్సిన సమస్య ఒకటి యింకా మిగిలిపోయే వుంది, కాని దానినెలా తేల్చాలో అతనికి అంతుపట్టలేదు.

ఆ స్త్రీలను తాము తమతో తీసుకెళ్లలేరు. అది పోరాటాల్లో కాకలు దీరిన యోధులకు చాలా ప్రమాదకరమే కాకుండా, కష్టసాధ్యం. అయినా కూడా వాళ్ల కర్మానికిక్కడ వాళ్లను వదిలేసి తనెలా వెళ్లిపోగలడు? మార్గాంతరం కోసం అతను తన బుర్ర బద్దలుకొట్టుకున్నాడు. కాని అతనికి ఒకేఒక్క గత్యంతరం తోస్తోంది.

''మీరిక్కడే ఉండిపొండి'' ఆ యువతి చూపులను తప్పించుకొంటూ అతను చెప్పాడు. ''రేపు మధ్యాహ్నం — జర్మన్లు మధ్యాన్నం రెండూ — నాలుగు గంటలమధ్య భోజనం చేస్తారు, అదే మిక్కిలి ప్రశాంతంగా ఉండే సమయం — అప్పుడు మీరు తెల్ల గుడ్డలు పట్టుకొని బయటికి వెళ్లండి. వెళ్లి లొంగిపొండి.''

''లొంగిపోవడమా?!'' బొత్తిగా నమ్మలేనట్లుగా మీర్రా ప్రశ్నించింది.

''గొప్ప ఆలోచనే!'' ఏమి అనడానికీ అతనికింకా సమయం చిక్కకముందే క్రిస్తా అత్త కోపంగా అంది. ''లొంగిపోవాలట — దరిద్రపు ఆలోచన! నాలాంటి ముసిలిదాన్ని

ఖైదీగా తీసుకెళ్లాలని ఎవరు కోరుకుంటారు? పోతే యీ పిల్ల?'' ఆమె మీర్రా చుట్టూ చేతులేసి, ఆమెను తన దగ్గరకు పొదువుకుంది. ''అవిటికాలూ, కాలికి బ్రేసూ* వున్న యీ పిల్లని ఎవరు తీసుకెళ్తారు? అర్థంపర్థంలేని చెత్త మాటలు మాట్లాడకు కామ్రేడ్ లెఫ్టినెంట్!''

''నేను మాత్రం అంత దూరం నడవలేను బాబూ'' మీర్రా లోగొంతులో అంది.

జర్మన్లు ఖైదీగా తనను నడిపించబోయే దీర్ఘమైన రోడ్లను గురించే ఆమె ప్రస్తావిస్తున్నట్లు అతను గ్రహించాడు. ఏం బదులు చెప్పేందుకూ అతనికేమీ తోచలేదు, అందుకని అతను దిగులుగా — అంగీకారానంగీకారాల మధ్య ఊగిసలాడుతూ — కూర్చుండిపోయాడు.

''అసలా ఆలోచన వచ్చినందుకు చెప్పాలి!'' క్రిస్తా అత్త విభ్రాంతి చెందినట్లు యీసారి వేరే స్వరంలో అంది. ''నువ్వు కమాండరువైనా గానీ, నీ ఆలోచన బాగా లేదయ్యా.''

''కాని మీరిక్కడ ఉండిపోవడం సాధ్యం కాదు'' అతను అనిశ్చితంగా అన్నాడు. ''స్త్రీలు దుర్గంనుంచి వెళ్లిపోవాలని పైనుంచి ఆజ్ఞలొచ్చాయి.''

''వాళ్లు ఆటంకం కనుక, అందుకని వాళ్లు వెళ్లిపోయారు! నేను భారంగా ఉంటానని అనిపించినప్పుడు, నేనూ వెళ్లిపోతాను. కాని యిప్పుడు, యిప్పుడు, యిక్కడీ మూల నా బెడదా, మీర్రా బెడదా ఎవరికుంది? మీరు మీ యిష్టమొచ్చినంత పోరాటం చెయ్యండి! మాకిక్కడ కూడూ, గూడూ వున్నాయి, మేం ఎవళ్లనీ విసిగించం, మన వాళ్లొచ్చే దాకా మేమిక్కడే ఉండిపోతాం.''

ప్లూజ్నికొవ్ బదులు చెప్పలేదు. కొత్తకొత్త పట్టణాలు ఆక్రమించినట్లూ, మాస్కో, లెనిన్గ్రాడ్లవద్ద పోరాటం సాగుతున్నట్లూ, రెడార్మీ ఓడింపబడినట్లూ జర్మన్లు ప్రతి రోజూ వార్తా ప్రసారంలో చెప్తున్న సంగతి వాళ్లకి చెప్పడం అతనికి యిష్టం లేకపోయింది. జర్మన్లు చెప్పినది అతను నమ్మలేదు, కాని — మన ఫిరంగుల మ్రోత అతనికి వినిపించి చాలా కాలమైపోయింది.

''ఈ అమ్మాయి యూదు'' అకస్మాత్తుగా ఫెదొర్చుక్ అన్నాడు. ''యూదు, పైగా అవిటిది. వాళ్లు మారు ఆలోచన లేకుండా యీమెను కాల్చిపారేస్తారు.''

''కబడ్దార్, ఆమెను ఆ పేరున పిలవకండి!'' ప్లూజ్నికొవ్ అరిచాడు. ''అది వాళ్లు వాడే మాట! ఫాసిస్టు మాట!''

''మాట ఏదైతే ఏం మునుచుకుపోతుంది లెండి'' సార్జెంట్ మేజరు నిట్టూర్చాడు. ''ఫెదొర్చుక్ చెప్పింది రైటే. వాళ్లకి యూదులంటే గిట్టదు.''

''నాకు తెలుసు'' ప్లూజ్నికొవ్ అతని మాటను తుంచేశాడు. ''ఆహా, సరే అదన్న

---

*బ్రేస్ — అవిటి కాలికి బూటును పట్టివుంచే తోలుదట్టీ. — సం.

మాట సంగతి. అయితే, మీరిక్కడ ఉంటారు. బహుశా వాళ్ళు వెనక్కి వెళ్ళిపోవచ్చు, అప్పుడు మీరు వెళ్ళిపోగలుగుతారు. ఏదో విధంగా.''

అతను నిర్ణయించుకున్నాడు, కాని అది అతనికి నచ్చలేదు. అతను దాన్ని గురించి ఆలోచించిన కొద్దీ దాని పట్ల అతనికి అయిష్టం పెరుగుతోంది. కాని అతనికి అంతకన్న మార్గాంతరం కనిపించలేదు. అందుకని చిరాకుగానే అతను ఆ ఆజ్ఞనిచ్చాడు. చిరాకుగానే మరిన్ని ఆయుధాల కోసం తను తిరిగి వస్తానని వాగ్దానం చేశాడు. రికన్నాయిటర్ చేయడానికి పంపబడిన వాస్యా వోల్కొవ్ అడుగుజాడలవెంట చిరాకుగానే కంతపైకి ఎక్కాడు.

వోల్కొవ్ ఆజ్ఞలను తు. చ తప్పకుండా పాటిస్తాడు, అయితే అతనిలో చొరవ పూజ్యం. జీవితానందాలన్నింట్లోనూ నిద్రను అతను అత్యధికంగా ప్రేమిస్తాడు, నిద్రించేందుకు దొరికే ఏ ఒక అవకాశాన్నీ అతను చేజారవిడుచుకోడు. యుద్ధపు తొలి క్షణాలు అతనిలో భయోత్పాతాన్ని — సజీవంగా సమాధి అయిపోతానన్న భయాన్ని రెచ్చగొట్టాయి; అతనెలాగైతేనేం దాన్ని అధిగమించాడు. కాని దరిమిలా మరింత స్తబ్ధుడుగా, ముందుకన్న మరింత నిరుత్సాహపరుడుగా తయారయ్యాడు. అతను తన పైవారిపై ఆధారపడాలని కోరుకున్నాడు, కాగా లెఫ్టినెంట్ రాక అతన్ని తేలిగ్గా ఊపిరిపీల్చుకొనేలా చేసింది. అతనికి పెద్ద బరువు దించుకున్నట్లయింది. మురికోడుతూ, చీలికలు వాలికల్లో వున్న యీ బక్క కమాండరు కోపాన్ని అర్థం చేసుకోవడం అతనికి కష్టమే అయింది. కాని, యీ క్షణంనుంచి, వోల్కొవ్ అనబడే తన ప్రాణానికి యీ కమాండరుదే బాధ్యత అన్న విషయంలో అతనికి దృఢ విశ్వాసం ఏర్పడింది. తనకు చెప్పినవన్నీ అతను అక్షరాలా అమలుచేసేవాడు. అతను నేలపైకి ఎక్కాడు, చుట్టూ చూశాడు, విన్నాడు, ఎవరూ కనిపించకపోయే సరికి, ఆయుధాలనూ, మందుగుండు సామగ్రినీ కంతదగ్గరకి చేర్చనారంభించాడు.

ఈలోగా కొందరు జర్మన్ సబ్‌మెషీన్ గన్నర్లు చాలా దగ్గర్నుంచి వెళ్ళారు. వాళ్ళు వోల్కొవ్‌ని చూడలేదు, వాళ్ళు ఏ వేపు కెళ్తున్నారో అతనూ గమనించలేదు, వాళ్ళు ఆ పరిసరాల్లో ఉన్నట్లయినా కనీసం అతను — అది తన ఆజ్ఞల్లో యిమిడి లేదు కనుక — రిపోర్టు చెయ్యలేదు. జర్మన్లు — వాళ్ళ రక్షణ స్థావరాన్ని చూడకుండా — తమ పనులపైన తాము పోయారు, రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. తూటాల పెట్టెలనూ, సబ్‌మెషీన్ గన్నులనూ యిరుకు కంతగుండా అతను లాక్కువచ్చి, యితరులు బైటకి వచ్చేసరికి జర్మన్లు కనుమరుగయ్యారు, ప్లూజ్నికొవ్‌కి అనుమానాస్పదమైనదేమీ కానరాలేదు. ఎక్కడో కాల్పులు జరుగుతున్నాయి, మరెక్కడో ఫిరంగి గుళ్ళు పడుతున్నాయి, వేరెక్కడో రాకెట్లు వెలుగుతున్నాయి, కాని ఛిన్నాభిన్నమైన దుర్గపు కేంద్రం మాత్రం ఖాళీగా వుంది.

''వోల్కొవ్, నువ్వు నాతో రా, మిగిలిన యిద్దరూ వెనక రండి. ముందుకి పదండి! త్వరగా!''

వంగుని, వాళ్ళు దూరానగల శిధిలాల వద్దకు — సోవియట్ సైనికులు యింకా తట్టుకొని పోరాడుతున్న చోటుకి, దెనీష్చిక్ చనిపోతున్న చోటుకి, సార్జెంట్ తన తేలిక మెషీన్ గన్నుకి కేవలం మూడే డిస్కులు కలిగియున్న చోటుకి — బయల్దేరారు. అకస్మాత్తుగా ఒక తెల్లని మంట చీకటిగా వున్న శిధిలాల్లోంచి పైకి లేచింది, దాని వెంటనే పెద్ద హోరు సాగింది, ఆ వెంటనే క్లుప్తసరిగా సబ్‌మెషీన్ గన్ కాల్పులు వినవచ్చాయి.

''వాళ్ళు దాన్ని పేల్చేశారు!'' ప్లూజ్నికొవ్ అరిచాడు. ''జర్మన్లు కోట గోడను పేల్చేశారు!''

ఒక మెషీన్ గన్ను అతని స్వరం దిశగా కాల్పులు సాగించింది, ట్రేసర్ బులెట్లు చీకటిని చీల్చాయి. వోల్కొవ్ పెట్టెలను జారవిడిచి పడిపోయాడు. ప్లూజ్నికొవ్ అరుస్తూ, నేరుగా జాజ్వల్యమైన మెషీన్ గన్ను కాల్పుల్లోకి దూసుకెళ్ళాడు. సార్జెంట్ మేజర్ అతన్ని సమీపించి అతన్ని నేలపైకి పడగొట్టాడు.

''ఆగు, కామ్రేడ్ లెఫ్టినెంట్, ఆగు, మూర్ఖంగా ప్రవర్తించకు.''

''నన్ను వెళ్ళనియ్యి! మన కుర్రాళ్ళు తూటాల్లేకుండా, గాయపడినవాళ్ళతో, అక్కడున్నారు.''

''నువ్వెక్కడి కెడుతున్నా ననుకుంటున్నావ్?''

''నన్నొదిలిపెట్టు!''

సార్జెంట్ పటిష్ఠమూ బరువైన శరీరపు భారంనుంచి తనను తాను విడిపించుకొనే ప్రయత్నంలో ప్లూజ్నికొవ్ గింజుకున్నాడు. కాని స్తెపాన్ మత్వేయెవిచ్ అతన్ని గట్టిగా ఒడిసిపట్టుకొని, అతను గింజుకోవడం మానిన తర్వాత మాత్రమే వదిలిపెట్టాడు.

''సమయం మించిపోయింది, కామ్రేడ్ లెఫ్టినెంట్, సమయం మించిపోయింది. విను.''

శిధిలాల్లో పోరాటం నిలిచిపోయింది. ఇక్కడా అక్కడా చెదురుబదురుగా జర్మన్ సబ్‌మెషీన్ గన్నులు క్లుప్తసరిగా మ్రోగుతున్నాయి. వాళ్ళు చీకటి మూలలను కాల్చి, చిట్టచివరి దుర్గరక్షకులను తుదముట్టిస్తున్నారు — కాని ఎక్కడైనా బదులు కాల్పులు వినవస్తాయేమోనని ప్లూజ్నికొవ్ చెవులు రిక్కించి విన్నాడు, కాని అతని ప్రయత్నం నిష్ఫలమే అయింది. చీకట్లోంచి అతని స్వరం వంక కాల్చిన మెషీన్ గన్ సైతం నిశ్శబ్దం వహించింది. చాలా ఆలస్యమైపోయిందన్న సంగతినీ, సమయం నిజంగానే మించిపోయిందన్న సంగతినీ, చిట్టచివరి ఆజ్ఞను తను పాలించలేదన్న సంగతినీ అతను గ్రహించాడు.

ఇంకా ఏదో ఆశిస్తూ, అప్పుడప్పుడు వినవచ్చే చెదురుబదురు కాల్పులు వింటూ అతను అక్కడ పడుకునే ఉండిపోయాడు. ఏమి చెయ్యడమో, ఎక్కడి కెళ్ళడమో, సోవియట్ సైనికుల కోసం యిప్పుడిక ఎక్కడ వెతకడమో అతనికి తెలియలేదు. అతని పక్కనున్న

సార్జెంట్ మేజరు కూడా నిశ్శబ్దంగానే వున్నాడు. ఎక్కడికి వెళ్లాలో, ఏం చెయ్యాలో అతనికీ బోధపడలేదు.

‘‘వాళ్లు మనల్ని ఖతం చేస్తారు.’’ ఫెదొర్చుక్ సార్జెంటును మోచేత్తో తట్టాడు. ‘‘ఆ కుర్రాణ్ణి వాళ్లు చంపేసినట్లేనా?’’

‘‘నాకు సాయం చెయ్యి.’’

ఫ్లాజ్నికొవ్ అభ్యంతరం చెప్పలేదు. అతను మౌనంగా నేలమాళిగకి తిరిగివచ్చి, పడుకున్నాడు. వాళ్లు అతనితో మాట్లాడారు, అతన్ని ఉత్సాహపరచాలని ప్రయత్నించారు, అతన్ని మరింత సౌకర్యంగా పడుకోబెట్టారు, అతనికి టీ యిచ్చారు. అతను పక్కకు తిరిగాడు, లేచాడు, పడుకున్నాడు, వాళ్లు తనకిచ్చిందేదో తాగాడు – కాని మౌనం వహించాడు. చివరకు ఆ యువతి ఓవర్‌కోటు తెచ్చి – ‘‘ఇది మీ సొంత కోటే క్రామేడ్ లెఫ్టినెంట్ – మీకు గుర్తుందా?’’ అంటూ కప్పినప్పుడు సైతం అతను తన మూగనోము విడువలేదు.

ఔను, అది తన కోటే – సరికొత్త, చక్కగా నప్పిన, మిలమిల మెరిసే కమాండరు బొత్తాములుగల కోటు, దాన్ని తను సగర్వంగా చూసుకుంటూ ఎన్నడూ ధరించని కోటే. అతను దాన్ని వెన్వెంటనే గుర్తించాడు, కాని ఏమీ అనలేదు. అతను పూర్తి అనాసక్తి చూపాడు. అలా తను ఎన్ని రోజులు అక్కడ – మాటా మంతీ లేకుండా, నిశ్చలంగా, తన మనస్సు మొద్దుబారిపోగా – పడుకొని వున్నాడో అతనికి తెలియనూ తెలియదు, అతను తెలుసుకోనూ లేదు. రాత్రింబగళ్లు ఆ నేలమాళిగ శ్మశాన నిశ్శబ్దంలో మునిగివుంది, రాత్రింబగళ్లు అటూ యిటూ ఊగే నూనె దీపపు జ్యోతులు అటూ యిటూ ఊగిసలాడుతూ తమ అస్పష్ట కాంతులు ప్రసరిస్తూ వచ్చాయి, రాత్రింబగళ్లు ఆ పసుపుపచ్చని ధూమ సహిత కాంతి వెనుక చీకటి – మృత్యువు మాదిరిగా అభేద్యమైన చీకటి – ఆవరించి వుంది. మరి ఫ్లాజ్నికొవ్ దానిలోకి – ఏ మృత్యువుకైతే బాధ్యత తనదేనో ఆ మృత్యువు వంక – తేరిపార జూస్తూ ఉండిపోయాడు.

మనోఫలకంపై చెక్కినట్లుగా అతను అందర్నీ – తనకు రక్షణ కల్పించిన వాళ్లందర్నీ, ఎటువంటి సంకోచమూ లేకుండా, మారు ఆలోచన లేకుండా, తనింకా అర్థంచేసుకో లేకపోతున్న దేనిచేతనో ఉత్తేజితులై దెబ్బను స్వీకరించినవాళ్లందర్నీ – చూస్తున్నాడు. వాళ్లందరూ – తన కోసం ప్రాణాలు అర్పించిన వాళ్లందరూ, ఆ విధంగా ఎందుకు ప్రవర్తించారో అర్థంచేసుకొనే ప్రయత్నాన్ని అతను విరమించుకున్నాడు. అతను కేవలం వాళ్లందర్నీ తన మనోఫలకంపై చిత్రాల మాదిరిగా కదిలిపోనిచ్చి, వారివంక చూశాడు. అతను వాళ్లవంక ఎటువంటి తొందరాలేకుండా, స్పష్టమైన, నిర్దాక్షిణ్యమైన దృష్టితో చూశాడు.

చర్చి – విలువంపు పైకప్పు కిటికీ దగ్గర – కళ్లు జిగేల్మనే జాజ్వల్యమైన సబ్‌మెషీన్ గన్ను కాల్పులను కక్కుతున్న కిటికీ దగ్గర తను తటపటాయించాడు. తను ధైర్యం కోల్పోవడం గాని, తను శక్తిని కూడదీసుకొంటూ వుండటం గాని అందుకు కారణం కాదు. అది

తన కిటికీ, అంతే. అది తన కిటికీ, దాడికి ముందు ఆ కిటికీని స్వయంగా తనే ఎంచుకున్నాడు, కానైతే తన ఆ కిటికీలోకి — దాని మృత్యువులోకి — దూకినది మాత్రం తను కాదు, ఇంకా వెచ్చగా వున్న మెషీన్ గన్ చేతిలో వున్న సరిహద్దు గస్తీ సైనికుడు అందులోకి దూకాడు. మరి ఆటుతర్వాత, అతను చనిపోయాక సైతం అతను ప్లూజ్నికొవ్‌ను బులెట్లనుండి కాపాడుతూనే వున్నాడు. అతని చిక్కని రక్తం జ్ఞాపకచిహ్నంగా అన్నట్లు ప్లూజ్నికొవ్ ముఖంలోకి చిమ్మింది.

తర్వాత ఉదయం తను చర్చినుండి పారిపోయాడు. తలకు బ్యాండేజితో వున్న సార్జెంటును వదిలేసి తను పారిపోయాడు. తను నేరుగా ద్వారానికి ఎట్టఎదుటనే ఉన్నా కూడా, సార్జెంటు అక్కడే ఉండిపోయాడు. తను వెళ్ళిపోగలిగి కూడా అతను ఉండిపోయాడు, అతను లొంగలేదు, దాక్కోలేదు, మరి సార్జెంటు చర్చిలో మిగిలిపోయిన మూలంగానే ప్లూజ్నికొవ్ నేలమాళిగకు పారిపోగలిగాడు. వంతెనపైన రాత్రిపూట జరిగిన దాడిలో వొలోద్యా దెనీష్చిక్ అతని శరీరంతో తనకు అడ్డుగా నిలబడి తనను కాపాడాడు. మరి ప్లూజ్నికొవ్ అనే తను, ప్రతిఘటన సంగతి సైతం ఆలోచించకుండా, భయంతో వెక్కుతూ, లొంగుబాటుగా చేతులెత్తినప్పుడు, సాల్నికొవ్ ఆ జర్మన్ కాళ్ళు పట్టుకులాగి గుంటలోకి పడగొట్టాడు. నేలమాళిగల్లోని సైనికులకు తూటాలు తెస్తానని తను హామీ యిచ్చాడు. కాని ఆ తూటాలు తీసుకెళ్ళడంలో తను విఫలుడయ్యాడు.

ఇప్పుడతను, ఒక బెంచిపైన తన సొంత ఓవర్‌కోటు కప్పుకొని, ఆహారం తనకి యివ్వబడుతోంది కనుక తింటూ, మగ్గు తన పెదవులకు అందించబడినప్పుడు తాగుతూ నిశ్చలంగా పడుకొని వున్నాడు. అతనేమీ చెప్పలేదు, ఏ ప్రశ్నలకూ జవాబు చెప్పలేదు, కనీసం ఆలోచించడం లేదు — వట్టినే తను ఏమి రుణపడినదీ గుణించుకుంటున్నాడు.

తన స్థానంలో యితరులు చనిపోయారు కనుకనే తను బ్రతికివున్నాడు. అతనీ విషయాన్ని కనుగొనడమైతే కనుగొన్నాడు గాని, ఇది యుద్ధకాండ నియమమనీ, సరళమైన, మృత్యువంత తప్పనిసరైన నియమమనీ — నువ్వు బ్రతికి వున్నావంటే నీకోసం మరొకడు చనిపోయాడన్న సంగతిని — మాత్రం గ్రహించలేదు. కాని అతనికి యిదొక ఊహామాత్రపు అంశం కాదు, అతని స్వానుభవం. అతనికి సంబంధించినంతవరకు యిది కేవలం మనస్సాక్షికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, యిదొక జీవన్మరణ సమస్య కూడా.

''ఇతనికి — మన యీ పసి లెఫ్టినెంటుకి — మతిభ్రమించింది'' ప్లూజ్నికొవ్ తన మాటలు వింటున్నాడా లేదా అన్న సంగతి పట్టించుకోకుండా ఫెదొర్చుక్ అన్నాడు. ''సరే, ఇప్పుడిక మనమేం చెయ్యాలి? మనకి మనమే ఆలోచించి ఏదో ఒక నిర్ణయానికి రావాలి సార్జెంట్ మేజర్.''

సార్జెంట్ మేజర్ బదులు చెప్పలేదు, కాని ఫెదొర్చుక్ తనకు తట్టినదాన్ని వెంటనే ఆచరణలో పెట్టేందుకు పూనుకొన్నాడు. మొట్టమొదట, నేలపైకి వెళ్ళేందుకు గల ఒకేఒక కంతను అతను జాగ్రత్తగా యిటుకలు పేర్చి పూడ్చేశాడు. అతను కోరుకున్నది పోరాడటం కాదు, బ్రతకడం. కేవలం బ్రతికివుండటం. జర్మన్లకు తెలియని ఆ నేలమాళిగలో దాక్కొని, తినడానికి తిండివున్నంతకాలం బ్రతికివుండటం.

''ఇతను నీరసంగా ఉన్నాడు'' సార్జెంట్ మేజరు నిట్టూర్చాడు. ''మన లెఫ్టినెంట్ నిస్త్రాణచెందాడు. ఇతనికి కొంచెం మంచి తిండి లోపలి కెళ్ళేలా చూడు, క్రిస్తా.''

క్రిస్తా అత్త అతన్ని — జాలిగా కంట తడిపెడుతూ — తినిపించింది. కాని సార్జెంట్ మేజర్ స్తెపాన్ మత్వేయెవిచ్ సలహా అయితే యిచ్చాడుగాని దానిలో అతనికే నమ్మకం లేదు. లెఫ్టినెంటు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా కృంగిపోయాడన్న సంగతి అతనికి తెలుసు.

ఒక్క మీర్రాకు మాత్రమే తనేం చెయ్యాలో తెలిసినట్టుంది. ఈయన్ని పునరుజ్జీవితుని చెయ్యాలి, ఈయనచేత మాట్లాడించాలి, పనిచేయించాలి, చిరునవ్వు నవ్వించాలి. అందుకనే ఆమె, అందరూ మరచిపోయిన ఆ కోటును తీసుకొచ్చింది. ప్రవేశద్వారపు కమాను నుండి పడిన యిటుకలను ఆమె ఓపికగా — ఒంటరిగా, ఎవరికీ ఏమీ వివరణలు చెప్పకుండా — తొలగించనారంభించింది.

''ఎందుకు నువ్వవన్నీ పీకుతున్నావ్?'' ఫెదొర్చుక్ గొణిగాడు. ''కొంపదీసి ఏమన్నా కూలుస్తావా ఏమిటి? మనం యిక్కడ నిశ్శబ్దంగా ఉండాలి.''

మౌనంగా ఆమె తన ప్రయత్నాన్ని కొనసాగించింది. మూడో రోజున తను వెతుకుతున్న — మట్టికొట్టుకొని దెబ్బతిన్న సూట్‌కేసును విజయోత్సాహంతో బయటికి లాగింది.

''చూశారా, ఇదిగో!'' దాన్ని టేబిలు దగ్గరకు మోసుకొస్తూ, ఆమె విజయోత్సాహంతో అంది. ''నాకు గుర్తుంది, అది ద్వారం దగ్గరుందని!''

''అయితే దీనికోసమన్న మాట నువ్వు గాలిస్తున్నది'' క్రిస్తా అత్త నిట్టూర్చింది. ''ఏయ్ పిచ్చిపిల్లా, మనస్సు అర్పించుకునేందుకు నువ్వు తప్పు సమయం ఎంచుకున్నావు.''

''అందుకే మనస్సుకి నియమాలంటూ వుండవంటారు. అయితే ముహూర్తం మటుకు తప్పనిసరిగా తప్పైనదే. ఇప్పుడతను సర్వం మరచిపోవాలి, యిప్పటికే అతని మనస్సు అనేక విషయాలతో అతలాకుతలమవుతోంది'' స్తెపాన్ మత్వేయెవిచ్ అన్నాడు.

''శుభ్రంగా వున్న షర్టు వల్ల చెరుపేమీ కలగదు'' ఫెదొర్చుక్ కార్యసాధక దృష్టితో అన్నాడు. ''సరే, దీన్ని అతనికియ్యి! ఎందుకు అక్కడ నిలబడతావ్? బహుశా అతను నవ్వుతాడేమో — నాకైతే నమ్మకం లేదనుకో.''

ప్లూజ్నికొవ్ నవ్వలేదు. ఏమాత్రం తొందరలేకుండా తను వెళ్ళేందుకు ముందు

అతని తల్లి సర్దిన వస్తువులను — అండర్‌వేరు, వేసవి యూనిఫారం, ఫొటోలు — తాపీగా చూశాడు. అటు తర్వాత అతను నలిగి, వంగిన సూట్‌కేసు మూతను వేసేశాడు.

"ఈ వస్తువులు మీవి, మీవే" మీరా మృదువుగా అంది.

"నాకు గుర్తుంది" అని అతను గోడవేపు ఒత్తిగిలాడు.

"అయ్యో, అదీ సంగతి" ఫెదొర్చుక్ నిట్టూర్చాడు. "ఈ కుర్రాడి పని అయిపోయినట్లే. ముగిసిపోయింది." అతను అదే పనిగా బూతులు తిట్టాడు, ఎవరూ అతన్ని ఆపలేదు.

"అది సరే, సార్జెంట్ మేజర్, యిప్పుడిక మనం ఏం చెయ్యబోతున్నాం? మనం ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి — దీనిలో సమాధికావడమా మరోదానిలోనా."

"ఏం నిర్ణయించుకోవాలి?" క్రిస్తో అత్త అనిశ్చితంగా అడిగింది. "అది యింతకు ముందే నిర్ణయింపబడింది: మనం యిక్కడే వేచియుంటాం."

"ఎందుకుట?" ఫెదొర్చుక్ అరిచాడు. "దేని కోసం మనం ఎదురుచూడాలి? చావు కోసమా? శీతాకాలం కోసమా? జర్మన్ల కోసమా? దేని కోసం?!"

"మనం రెడార్మీ కోసం ఎదురుచూస్తాం" మీరా అంది.

"రెడార్మీయా?" ఫెదొర్చుక్ ఎద్దేవా చేశాడు. "ఏయ్ మూర్ఖురాలా నువ్వు మాట్లాడుతున్నదేమిటో నీకు తెలుసా? అదిగో నీ రెడార్మీ, అక్కడ ప్రాణాచారం పడి పడుకునివుంది. నిస్సహాయంగా! ప్రాణం కడట్టి! చావు దెబ్బలు తిని! చావు దెబ్బలు తిని, బోధపడిందా?"

అందరూ వినాలనే అతను బిగ్గరగా అరిచాడు, వాళ్లు విన్నారు, కాని మౌనంగా ఉండిపోయారు. ప్ల్యూజ్నికొవ్ కూడా విన్నాడు, కాని మౌనంగా ఉండిపోయాడు. అతను తన నిర్ణయం చేసుకున్నాడు. అన్నీ సవివరంగా ఆలోచించుకున్నాడు, ఇప్పుడిక, వాళ్లందరూ నిద్రపోయే తరుణం కోసం ఓర్పుగా వేచియున్నాడు. అలా వేచియుండటమన్నది అతను నేర్చుకున్న విషయాల్లో ఒకటి.

అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు, సార్జెంట్ మేజరు గుర్రుపెట్ట నారంభించాక, రాత్రివేళ రెండు దీపాలు మలిపివెయ్యబడ్డాక, ప్ల్యూజ్నికొవ్ లేచి కూర్చున్నాడు. అతనలాగే కొంత సేపు — నిద్రితుల నిశ్వాసాలు వింటూ, తన తల తిరగడం తగ్గేదాకా — కూర్చున్నాడు. తర్వాత అతను తన పిస్తోలును జేబులో పెట్టుకున్నాడు, సార్జెంటు మేజరు తయారుచేసిన కాగడాలున్న షెల్ఫు దగ్గరకి నిశ్శబ్దంగా వెళ్లాడు, వాటిలోంచి ఒకటి తీసుకున్నాడు, దాన్ని అంటించకుండా, సొరంగ మార్గాలకు పోయే బిలం దగ్గరకి తడుముకొంటూ బయల్దేరాడు. ఈ మార్గాలు అతనికి అంత సుపరిచితాలు కానందున, దీపం లేనిదే తను వాటిని చేరుకోగలనన్న ఆశ అతనికి లేకపోయింది.

అతను దేనికీ తగిలి చప్పుడు కాకుండా, ఏదీ కిర్రుకిర్రుమనకుండా జాగ్రత్త వహించాడు.

నిశ్శబ్దంగా కదలడమెలాగో అతను నేర్చుకున్నాడు. కాగా ఎవరూ నిద్ర మేలుకోరనీ, తనని ఆపరనీ అతను ధీమాగా వున్నాడు. అతను అన్నింటిని గురించీ ఆలోచించాడు, అన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నాడు, ఒక హద్దును నిర్ధరించుకున్నాడు. ఫలితం ఆ హద్దుకి తగ్గితే తన విధి నిర్వహణలో తను విఫలం చెందినట్టే ననుకున్నాడు. అయితే అతను ఒకేఒక్క అంశాన్ని — అనేక రాత్రులుగా కేవలం కోడికునుకు మాత్రమే తీస్తూ, తను యిప్పుడు యితరుల నిశ్వాసాలు వింటున్నట్లే తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వింటూ గడిపిన ఒక వ్యక్తి విషయం — అతను పరిగణనలోకి తీసుకోలేకపోయాడు.

ఫ్లాజ్నికోవ్ యిరుకు సందును పక్కవాటుగా దాటి, నడవలో కాగడా వెలిగించాడు. అక్కడినుంచి కేస్‌మేటులో యితరులు నిద్రిస్తున్న చోటుకి యీ కాంతి ప్రసరించదు. కాగడాను తల పైకెత్తి పట్టుకొని అతను నడవగుండా — ఎలకలను చెదరగొడుతూ — ముందు కెళ్ళాడు. విద్యుద్ద్వారం — ఎలకలంటే అతనికింకా భయం పోలేదు, అందుకనే అతను — తన పరిసరాలను అవగాహన చేసుకొని, ఎక్కడికి వెళ్ళాలో తెలుసుకున్న తర్వాత కూడా — కాగడాను ఆర్పెయ్యలేదు.

జర్మన్లనుంచి తప్పించుకొచ్చి తను పడిపోయిన ఎదర అడ్డగోడ వున్న బిలం దగ్గరకి అతను చేరుకున్నాడు. తూటాల పెట్టెలింకా అక్కడే వున్నాయి. అతను కాగడా పైకెత్తి బిలమార్గం యిటుకలతో గట్టిగా మూసివెయ్యబడివుండటం చూశాడు. అతనా యిటుకలను ఊపిచూశాడు, కాని అవెక్కడా జంక లేదు. అప్పుడతను తన చేతిలోని కాగడాను యిటుక తుంటల సందున అమర్చి, రెండు చేతులతోనూ పట్టి యిటుకలు లాగనారంభించాడు. అతను కొద్ది యిటుకలను లాగగలిగినా, మిగిలినవి గట్టిగా వున్నాయి. ఫెదొర్చుక్ వాటిని బందోబస్తుగా బిగించాడు.

బయటికెళ్ళే మార్గం తెరిచేందుకు అలవికాకుండా బిగించబడినట్లు గ్రహించి తన ప్రయోజనరహితమైన ప్రయత్నాలను అతను వదులుకున్నాడు. అతనా పనిని యిక్కడ, యీ భూగర్భంలో చెయ్యాలని — యితరుల మూలంగా — అనుకోలేదు. వాళ్ళు తనని తప్పుగా అర్థంచేసుకోవచ్చు, వాళ్ళు తన నిర్ణయానికి బలహీనతనో, ఉన్మాదాన్నో కారణంగా పరిగణించవచ్చు, మరి ఆ ఆలోచనే అతనికి అప్రియంగా తోచింది. కారణాలూ, వివరణలూ ఏమీ చెప్పనక్కర్లేకుండా వట్టినే అదృశ్యమవడాన్ని, తెలియని ఎక్కడికో మాయమైపోవడాన్ని అతను ఎంచుకొని వుండును, కాని యిప్పుడిక అది అసంభవం. సరే, కానియ్, వాళ్ళు తన శరీరాన్ని ఎత్తి పారెయ్యాలి, తన మరణం గురించి చర్చించాలి. వాళ్ళు విధిగా ఆ పని చెయ్యాలి, ఎందుకంటే, ఇటుకలతో దృఢంగా బంధింపబడిన మార్గం, తనపై తను విధించుకున్న శిక్షయొక్క ధార్మికతలో తన విశ్వాసాన్ని సడలింపచెయ్యలేదు.

అలా ఆలోచించిన మీదట, అతను తన పిస్తోలును పైకి తీశాడు, కాచ్ వెనక్కి లాగాడు,

ఎక్కడ కాల్చుకోవాలా అని అతను సంకోచించాడు, చివరకు దాన్ని రొమ్ముపైకి తెచ్చుకున్నాడు. ఛిన్నాభిన్నమైన పుర్రెతో అక్కడ తను పడివుండటం అతనికి యిష్టంలేకపోయింది. తన ఎడమ చేత్తో అతను తన గుండెను తడుముకున్నాడు. అది వేగంగానే కొట్టుకుంటోన్నా, లయబద్ధంగానూ, దాదాపు ప్రశాంతంగా కొట్టుకుంటోంది. అతను తన చేతిని క్రిందకి దింపాడు, తర్వాత తన పిస్తోలును — గొట్టం సరిగా తన గుండెపైనే ఉన్నట్లు స్థిరపరచుకొనేందుకుగాను — పైకెత్తాడు.

''కోల్యా!''

ఆమె ''కోల్యా'' అని కాక — ఆ భయకంపిత స్వరంలో సైతం — మరేలా పిలిచినా, మరే మాట వాడినా, అతను ట్రిగ్గరు నొక్కేసుకునేవాడు. కాని, ఆ పేరు గత ప్రపంచంనుంచి, శాంతియుత ప్రపంచంనుంచి వచ్చినది. అంతటి భయంతో, అంత విజ్ఞప్తిపూర్వకంగా యిక్కడ ఏ ఆడది తనను పిలవగలదబ్బా? అప్రయత్నపూర్వకంగా అతను తన చేతిని క్రిందకు వాల్చాడు, తనను పిలిచిందెవరో చూసేందుకుగాను ఆ శబ్దం వంక చూశాడు. ఒక్క క్షణకాలమే తన చేతిని అలా దించాడు, కాని ఆమె తన కాళ్లీడ్చుకొంటూ ఆ ఒక్క క్షణంలోనే అతన్ని సమీపించింది.

''కోల్యా! వద్దు కోల్యా! కోల్యా, నా ప్రియతమా!''

ఆమె కాళ్లు తడబడ్డాయి, పిస్టోల్ని పట్టుకున్న అతని చేతిని తన శక్తికొద్దీ ఒడిసిపట్టుకొని ఆమె కింద పడింది. కన్నీటితో నానిన తన ముఖాన్ని ఆమె అతని చేతికి ఒత్తింది, కార్డైటు, చావు వాసనలు కొడుతూ మురికిగా వున్న అతని సైనిక కోటు అంచును ఆమె ముద్దుపెట్టుకుంది. ఆమె అతని చేతిని తన రొమ్ములకు — సిగ్గు విస్మరించి, అక్కడ తన కన్నె ప్రాయపు వెచ్చదనంలో అతను తన ట్రిగ్గరును నొక్క జాలడన్న సహజ జ్ఞానానుభూతితో — ఒత్తుకుంది.

''ఒద్దు. ఒద్దు. నేను నిన్ను కాల్చుకోనివ్వను. దానికి ముందు నన్ను కాల్చి ఆ తర్వాత నువ్వు కాల్చుకో. నన్ను కాల్చు!''

కొవ్వులో బాగా నానిన వత్తి బరపుతున్న గాఢమైన పసుపుపచ్చని కాంతిలో వాళ్లు నిలబడివున్నారు. ఆ కాంతిలో విలువంపు పైకప్పుపై పడిన వాళ్ల మరుగుజ్జు ఛాయలు అటూయిటూ గెంతుతూ చీకట్లోకి లేస్తున్నాయి. ప్లూజ్నికొవ్‌కి ఆమె హృదయస్పందన అనుభూతమవుతోంది.

''నువ్వెందుకొచ్చావ్?'' అతను కటువుగా అన్నాడు.

అప్పుడు మీర్రా తన ముఖం పైకెత్తింది, ఆమె కళ్లలో నీళ్లు కంపించాయి.

''నువ్వే రెడార్మీ'' ఆమె అంది. ''నా రెడార్మీ. నువ్వీ పని ఎలా చెయ్యగలిగావు? నువ్వు నన్ను వదిలేసి ఎలా వెళ్లగలవు? అయినా ఎందుకు?''

అతన్ని కలవరపెట్టినది ఆమె వాగ్దార కాదు, అది మరేదో. తన అవసరమున్న వాళ్లింకా ఎవరో ఉన్నారు. రక్షకుడుగా, స్నేహితుడుగా, కామ్రేడుగా తన అవసరం యింకా వుంది.

"నా చెయ్యి వదులు."

"ముందు ఆ పిస్తోలు పడెయ్యి."

"అది కాక్ చెయ్యబడి వుంది, అది పేలవచ్చు."

ఫ్లాజ్నికొవ్ మీరాను పైకి లేపాడు. ఆమె నిలబడింది, కాని అతనికి చాల దగ్గరగా — అతని చేతిని పట్టుకోడానికి సిద్ధంగా — నిలబడింది. అతను వక్రంగా నవ్వి, పిస్తోలును ప్రమాదం లేకుండా సర్ది, తన జేబులోకి జార్చి, కాగడా పట్టుకున్నాడు.

"వెళ్దామా?"

ఆమె అతని చెయ్యి పట్టుకొని, అతని వెనకనే వెళ్లింది. సందు దగ్గర ఆమె ఆగింది.

"ఈ సంగతి నేనెవరికీ చెప్పను, చివరకి క్రిస్తా అత్తకి కూడా."

మౌనంగా అతను ఆమె తలను — చిన్నబిడ్డ తలను నిమిరినట్లు — నిమిరాడు. తర్వాత అతను కాగడాను యిసుకలో మలిపి ఆర్పేశాడు.

"గుడ్‌నైట్" మీరా గుసగుసగా అని, మెల్లగా లోపలికెళ్లిపోయింది.

ఫ్లాజ్నికొవ్ ఆమెవెంట కేస్‌మేటులోకి వెళ్లాడు. అక్కడ సార్జెంట్ మేజరింకా గుర్రు పెడుతూనే వున్నాడు, దీపం యింకా పొగలుచిమ్ముతూనే వుంది. అతను తన బెంచి దగ్గరకు వెళ్లాడు, తన ఓవర్‌కోటును కప్పుకున్నాడు, యిప్పుడిక తనేం చెయ్యాలో ఆలోచించాలనుకున్నాడు, అంతే, నిద్రపోయాడు — ప్రగాఢమైన, ప్రశాంతమైన నిద్ర.

ఉదయం ఫ్లాజ్నికొవ్ యితరులతోబాటు లేచాడు. ఏ బెంచి మీదనైతే తను యింతకాలం ఒకే బిందువు వంక తేరిపారజూస్తూ గడిపాడో, ఆ బెంచిపైన వున్న వాటన్నిటినీ తీసి సర్దేశాడు.

"ఒంట్లో కొంచెం బాగున్నట్లుందేం, కామ్రేడ్ లెఫ్టినెంట్?" సార్జెంట్ మేజర్ సంకోచంగా చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

"కొంచెం నీళ్లున్నాయా యిక్కడ? మూడు మగ్గుల నీళ్లుంటే చాలు."

"నీళ్ల లేకేం, వున్నాయి!" సార్జెంట్ మేజర్ వెంటనే జవాబిచ్చాడు.

"అయితే నాకు యిలా పొయ్యి వోల్కొవ్!" అనేక రోజులుగా తన దిస ఒంటికి అంటుకుపోయి వున్న సైనిక కోటును ఫ్లాజ్నికొవ్ ఆ రోజున మొట్టమొదటి సారి ఊడదీశాడు — అతని లోపలి దుస్తులు బ్యాండేజీలకోసం ఎన్నడో చింపెయ్యబడ్డాయి. సొట్టలు పడ్డ సూట్‌కేసునుంచి అతను కొత్త అండర్‌వేరునూ, సబ్బునూ, తువ్వాలునూ తీసుకున్నాడు. "మీరా, దయచేసి యీ వేసవి సైనిక కోటుకి కొంచెం లైనింగు గుడ్డ కుట్టిపెట్టు" అన్నాడు.

అతను నడవలోకి వెళ్లి, ఒళ్లు శుభ్రంగా కడుక్కున్నాడు. తను నీళ్ల వాడేస్తు

న్నానని అతను అనుకోకపోలేదు, కాని యిన్నాళ్ళకిప్పుడు మొట్టమొదటిసారిగా, బుద్ధి పూర్వకంగానే, తను అలా వాడుతున్నందుకు అతను బాధపడలేదు. అతను తిరిగి వచ్చాడు, అదే మౌనాన్ని కొనసాగిస్తూ, తను మిలిటరీ స్కూల్లో ఉన్నప్పుడు కొన్న – అప్పట్లో అది అవస రమని కాక, కేవలం అవసరానికి ఉపయోగపడుతుందని మాత్రమే కొన్నాడు – కొత్త రేజ రుతో జాగ్రత్తగానే అయినా అనిపుణంగా గడ్డం గీసుకున్నాడు. అతను గాట్లకి ఉడికొలోన్ రుద్దాడు, మీరా అందించిన సైనికకోటు తొడుక్కున్నాడు, దాన్ని బెల్టుతో గట్టిగా బిగించు కున్నాడు. అప్పుడు అతను టేబిలు దగ్గర కూర్చున్నాడు, కుర్రతనం ఉట్టిపడే అతని మెడకు కాలరు బిగువుగా అంటిపెట్టుకొని లేదు, అది బాగా పెద్దదిగా వుంది.

"మీ మీ రిపోర్టులు చెప్పండి."

వాళ్ళు ఒకరి వంక మరొకరు చూపులు బరుపుకున్నారు. "ఏం రిపోర్టు చెయ్యాలి?" సార్జెంట్ మేజరు అనిశ్చితంగా అన్నాడు.

"అన్నీను." ప్లూజ్నికొవ్ ఆ మాటలను ఒత్తిఒత్తి పలికాడు. "మన సైనికులెక్క డున్నారు, శత్రువు ఎక్కడున్నాడు."

"ఓ, అదా..." సార్జెంట్ మేజరు గజిబిజిపడ్డాడు. "శత్రువు – ఎక్కడున్నాడో మనకి తెలుసు. పైన వున్నాడు. మరి మనవాళ్ళు – ఆ సంగతి మనకి తెలియదు."

"ఎందుకు తెలియదు?"

"మనవాళ్ళెక్కడున్నారో మనకి తెలుసు" ఫెదొర్చుక్ దిగాలుగా అన్నాడు. "క్రింద, పాతాళంలో! జర్మన్లు పైనా, మనవాళ్ళు కిందా వున్నారు."

ప్లూజ్నికొవ్ అతన్ని పట్టించుకోలేదు. తన డిప్యూటీగా అతను సార్జెంట్ మేజర్ని ఉద్దేశించే మాట్లాడుతున్నాడు, ఈ అంశాన్ని నొక్కి చెప్పడం ద్వారా అతను స్పష్టం చెయ్యాలనుకున్నాడు.

"మనవాళ్ళెక్కడున్నదీ మీకెందుకు తెలియదు?"

స్తెపాన్ మత్వేయెవిచ్ నేరం చేసినవాని మాదిరిగా నిట్టూర్చాడు.

"రికన్నాయిటర్ చెయ్యలేదు."

"ఆ విషయం వేరే చెప్పనక్కర్లేదు. ఎందుకు చెయ్యలేదనే నేనడుగుతున్నది."

"అదే, ఎలా చెప్పాలబ్బా? మీరేమో జబ్బుపడ్డారు. మేము బయటికెళ్ళే మార్గం మూసేశాం."

"ఇటుకలు బిగించిందెవరు?"

సార్జెంట్ మేజరు మౌనం వహించాడు. క్రిస్తా అత్త ఏదో వివరిద్దామని నోరు విప్పింది, కాని అంతలోనే మీరా ఆమెను వారించింది.

"నేను అడుగుతున్నాను, ఎవరు మూశారా మార్గం?"

''సరే – నేను!'' ఫెదొర్చుక్ బిగ్గరగా అన్నాడు.

''నాకు అర్థం కాలేదు.''

''నేను!''

''ఇప్పటికీ నాకు అర్థం కాలేదు'' సీనియర్ సార్జెంటుకేసి చూడకుండా, ప్ల్యాజ్నికొవ్ అదే స్వరంలో రెట్టించాడు.

''సీనియర్ సార్జెంట్ ఫెదొర్చుక్.''

''అయితే, కామ్రేడ్ సీనియర్ సార్జెంట్, మీరొక్క గంట సేపట్లో బయటికెళ్లే మార్గం నిరవరోధంగా ఉన్నట్లు రిపోర్టు చెయ్యాలి.''

''నేను పగటివెల్తురులో పనిచెయ్యను.''

''ఒక్క గంటలో యిచ్చిన ఆజ్ఞను నిర్వర్తించినట్టు రిపోర్టు చెయ్యండి'' ప్ల్యాజ్నికొవ్ రెట్టించాడు. ''పోతే 'నేను చెయ్యను,' 'నేను చెయ్యలేను,' 'నాకు చెయ్యాలని లేదు' వంటి మాటలు మీరు మరచిపోవాలి. ఇది ఆజ్ఞ. మీరా మాటలు యుద్ధాంతం దాకా మరచిపోండి. మనం ఒక రెడార్మీ యూనిట్. సాధారణ యూనిట్, తెలిసిందా, అంతే.''

ఒక గంట క్రితం అతను నిద్రలేచినప్పటికి, తను మాట్లాడాలనైతే తెలుసునుగాని, తనేం చెప్పబోతున్నదీ అతనికి తెలియదు. అందుకనే అతను ఆ క్షణాన్ని – సమస్తాన్నీ సక్రమ స్థానంలో పెట్టేక్షణాన్ని, లేక తనను కమాండ్ చేసే హక్కునుంచి శాశ్వతంగా వంచితుని చేసే క్షణాన్ని – బుద్ధిపూర్వకంగా వాయిదా వేశాడు. ఒళ్లు కడుక్కుంటూ, బట్టలు మార్చుకుంటూ, గడ్డం గీసుకొంటూ అతను తాత్సారం చేసినది సరిగా అందుకనే. అతనీ సంభాషణ కోసం సన్నద్ధమవుతున్నాడు, యుద్ధాన్ని కొనసాగించేందుకు సంసిద్ధమవుతున్నాడు. ఇప్పుడతని మనస్సులో ఏ సందేహమూ లేదు, ఏ ఊగిసలాటా లేదు.

అదంతా, వెనక, అతను గడపాల్సివచ్చిన నిన్నటి రోజు వెనక వదిలెయ్యబడింది.

2

ఫెదొర్చుక్ ప్ల్యాజ్నికొవ్ ఆజ్ఞలను అదే రోజున అమలు జరిపాడు: పైకి వెళ్లే దోవకి అవరోధం తొలగింపబడింది. రాత్రి పూట రెండు జంటలుగా విడివడి – ప్ల్యాజ్నికొవ్ వోల్కొవ్‌తోనూ, ఫెదొర్చుక్ సార్జెంట్ మేజరుతోనూ కలిసి – వాళ్ళు జాగ్రత్తగా రికన్నాయిటర్ చేశారు. దుర్గం యింకా సజీవంగానే వుంది. అది మధ్యమధ్య మెరుపు కాల్పులతో బదులు చెప్తోంది, కాని ఆ మెరుపులు – ముహవేత్స్ నది అవతలిగట్టున ఎక్కడో దూరాన కనిపిస్తున్నాయి. వాళ్ళు తమ వాళ్లతో సంబంధాలు పెట్టుకోలేకపోయారు. రెండు బృందాలూ మిత్రులనుగాని, శత్రువులనుగాని కలుసుకోకుండానే వెనక్కు తిరిగివచ్చాయి.

''చచ్చిపోయినవాళ్లు మాత్రమే తగిలారు'' స్తెపాన్ మత్వేయెవిచ్ నిట్టూర్చాడు. ''మనవాళ్ల కళేబరాలు దండిగా కనిపించాయి. అబ్బ, ఎంత పెద్ద గుట్టో!''

ఫ్లాజ్నికొవ్ తన గాలింపును పగటిపూట కొనసాగించాడు. తనవాళ్లతో సంబంధాలు పెట్టుకోగలనన్న ఆశ అతనికేమంతగా లేదు. చెల్లాచెదరై వున్న దుర్గ రక్షకబృందాలు లోతైన నేలమాళిగల్లో ఉంటాయని అతను గ్రహించాడు. కాని జర్మన్లను కనుక్కోవడం, ఛిన్నాభిన్నం చెయ్యబడిన దుర్గంలో వాళ్ల స్థావరాలను, రవాణా సౌకర్యాలను, మార్గాలను కనుక్కోవడమే తనిప్పుడు చెయ్యాల్సిన పని. తనీ పని చేసితీరాలి, లేకపోతే తన యీ అద్భుతమైన, సురక్షితమైన స్థావరానికి గల అర్థ ప్రయోజనాలు పూర్తి వృథాయే అవుతాయి.

అతను తన స్కౌటింగు యాత్రకు ఒంటరిగానే వెళ్లాడు. అతను తెరెస్పోల్ గేటు దగ్గర కెళ్లాడు, దాని పరిసర శిథిలాల్లో దాక్కొని యిరవై నాలుగు గంటలు గడిపాడు. జర్మన్లు వాడుతున్న గేటు యిదే. వాళ్లు ప్రతి ఉదయం ఒకే టైముకి అక్కడికొస్తున్నారు, అలాగే సాయంత్రం తిరిగి వెళ్లేటప్పుడు కూడా అంత కచ్చితంగానూ ఒకే టైముకి – బలమైన కాపలాదళాన్ని వదిలిపెట్టి – తిరిగి వెళ్తున్నారు. తను చూసిన వాటన్నింటినీ బట్టి, వాళ్లు తమ ఎత్తుగడలను మార్చుకున్నారు. వాళ్లిప్పుడిక దాడిచెయ్యడానికి ఎంత మాత్రం ప్రయత్నించడం లేదు. తమకెక్కడైనా ప్రతిఘటన తటస్థపడితే వాళ్లిప్పుడు ఆ గూడును మూసేసి, అగ్గి బరాటాలు విసిరేవాళ్లను పిలవనంపుతున్నారు. మరో విశేషం – ఈ జర్మన్లు ఫ్లాజ్నికొవ్ యింతదాకా చూసిన వాళ్లకన్న పొట్టిగా వున్నట్టున్నారు, వీళ్లకి సబ్‌మెషీన్ గన్నులు సైతం తక్కువగా ఉన్నట్టున్నాయి; సామాన్యంగా ఎక్కువమంది చేతుల్లో తేలిక రైఫిళ్లు మాత్రమే వున్నాయి.

''నేనే పొడుగు ఎదిగానో, లేక జర్మన్లే కుదించుకుపోయారో'' అంటూ ఫ్లాజ్నికొవ్ ఆ సాయంత్రం గంభీరంగా పరియాచకమాడాడు. ''మొత్తంమీద వాళ్లలో ఏదో మార్పు వుంది, అయితే సరిగా అదేమిటో నాకింకా బోధపడలేదు. స్తెపాన్ మత్వేయెవిచ్, రేపు మనమిద్దరం కలిసి వెళ్దాం. మీరు కూడా వాళ్లనొకసారి చూడటం మంచిదనిపిస్తోంది నాకు.''

చీకట్లో వాళ్లిద్దరూ ఛిన్నాభిన్నం చెయ్యబడి తగులబెట్టబడిన 84వ రెజిమెంటు బ్యారక్సు దగ్గరకు వెళ్లారు. స్తెపాన్ మత్వేయెవిచ్‌కి ఆ ప్రాంతం బాగా తెలుసు. వాళ్లు త్వరలో దాదాపు సౌకర్యంగా సర్దుకున్నారు. సార్జెంట్ మేజరు ఖోమ్‌స్కి గేటు దగ్గరి దుర్గాంతర్భాగాన్నీ, ఫ్లాజ్నికొవ్ బుగ్ ఒడ్డులనూ పరిశీలించేందుకు అనువైన స్థావరాలు తీసుకున్నారు.

ఆ ఉదయం నిర్మలంగా, ప్రశాంతంగా ఉంది. మధ్యమధ్య జహూ సకృత్తుగా, బహిః ప్రాకారానికి సమీపాన ఎక్కడో కోబ్రిన్‌స్కి రక్షణ నిర్మాణాల పొడుగునా కాల్పులు ప్రారంభమయ్యాయి. అవి ఎంత ఆకస్మికంగా ఆరంభమయ్యాయో అంత ఆకస్మికంగా ఆగిపోయాయి.

జర్మన్లే కేన్‌మేట్లలోకి ముందు జాగ్రత్తకోసం కాలుస్తున్నారో, లేక, తుది దుర్గరక్షక బృందాలు యింకా ప్రతిఘటిస్తున్నాయో ఫ్లూజ్నికొవ్ తేల్చుకోలేకపోయాడు.

"కామ్రేడ్ లెఫ్టినెంట్!" సార్జెంట్ మేజరునుంచి ఉద్రిక్తమైన గుసగుస స్వరం వినవచ్చింది.

ఫ్లూజ్నికొవ్ అతని దగ్గరకెళ్ళి బయటకి తొంగిచూశాడు. జర్మన్ సబ్‌మెషీన్ గన్నర్లు చాల దగ్గర్లో బారుతీరుతున్నారు. వాళ్ళ ఆకారాలు, వాళ్ల ఆయుధాలు, వాళ్ల ప్రవర్తన — అనుభవశాలులైన, అనేక సౌకర్యాలు పొందే సైనికుల మాదిరి — అన్నీ కూడా పరిచితమైనవే. జర్మన్లు కుంచించుకుపోలేదు, వాళ్లు పూర్వం కన్న గుజ్జులుగా లేరు, లెఫ్టినెంట్ ఫ్లూజ్నికొవ్ వాళ్లను మొదట్లో చూసినప్పుడు ఏ ప్రమాణంలో వున్నారో వాళ్ళు యిప్పుడూ అదే ప్రమాణంలో వున్నారు.

ముగ్గురు ఆఫీసర్లు — వాళ్ళలో ఒకడు కొంచెం ముందు — సైనికుల బారును సమీపించారు. చురుకైన ఆజ్ఞ వినిపించడంతో సైనికులు అటెన్షనులో నిలబడ్డారు. కమాండులో వున్న ఆఫీసరు, ముందు నడిచివెళ్ళిన, వయస్సురీత్యా, పదవిరీత్యా పెద్దవాడుగా కనిపించే పొడుగాటి ఆఫీసరుకు రిపోర్టుచేశాడు. అతను ఆ రిపోర్టు విని, తర్వాత నిశ్చలంగా వున్న శ్రేణిముందు నెమ్మదిగా నడిచాడు. మిగిలిన యిద్దరు ఆఫీసర్లూ — వారిలో ఒకడు చిన్న చిన్న పెట్టెలు అందిస్తూ — అతన్ని అనుసరించారు. సీనియర్ ఆఫీసరు ఒకొక్క సైనికునికే ఆ పెట్టెలను అందిస్తూంటే, ఒక్కొక్క సైనికుడే ముందుకొచ్చి ఆ పెట్టెలను తీసుకొంటున్నాడు.

అవి సైనిక పతకాలు అన్న సంగతిని ఫ్లూజ్నికొవ్ గ్రహించాడు. యుద్ధరంగంలో బహూకరింపబడుతున్న పతకాలు. హెయ్, ఫాసిస్టు నా కొడుకుల్లారా, మీకు నేనిస్తానురా పతకాలు అనుకున్నాడు.

తను ఒంటరిగా లేనన్న సంగతినీ, తనిక్కడికిప్పుడు పోరాడేందుకు రాలేదన్న సంగతినీ, తన వెనుకగల ఛిన్నాభిన్నమైన బ్యారక్కు సురక్షితమైన స్థావరం కాదన్న సంగతినీ అతను మరచిపోయాడు. కేవలం ఎవరిని చంపినందుకు యీ పొడుగాటి చురుకైన జర్మన్ సైనికులకు సిలువ పతకాలు బహూకరింపబడుతున్నాయో వాళ్లని అతను గుర్తుచేసుకున్నాడు. అసువులు కోల్పోయిన వాళ్లను, గాయాల మూలంగా ప్రాణాలు కోల్పోయినవాళ్లను, మతిభ్రమించిన వాళ్లనూ అతను స్మరించుకున్నాడు. అలా సంస్మరించుకొని అతను తన సబ్‌మెషీన్ గన్నును పైకెత్తాడు.

కొద్ది సేపు జరిగిన ఆ కాల్పులు, కేవలం ఒక్క డజను అంగల దూరంనుంచి నేరుగా దూసుకెళ్లాయి. పతకాలను అందజేస్తున్న సీనియర్ ఆఫీసరు నేలకొరిగాడు, అదే విధంగా మిగిలిన యిద్దరు ఆఫీసర్లూ, అప్పుడే పతకం అందుకున్న సైనికుడొకడూ నేలకూలారు.

కానైతే ఆ పతకాలు వాళ్లకి పట్టినే లభించలేదు, క్షణంలో గందరగోళం సర్దుకుంది, ప్ల్యాజ్ని కొవ్ కాల్పుల ప్రతిధ్వని యింకా అణిగిపోకపూర్వమే వాళ్ళు చెదిరిపోయి, మాటులు చూసుకొని శిథిలాలవంక తమ గన్నులన్నింటినీ ఎక్కుపెట్టి కాల్చసాగారు.

సార్జెంట్ మేజరు ధర్మమా అని కాకపోతే వీళ్లిద్దరూ ప్రాణాలతో ఎన్నటికీ తప్పించుకు పోగలిగి వుండేవాళ్లు కారు. క్రోధోన్మత్తులైన జర్మన్లు యిప్పుడిక దేనికీ భయపడటంలేదు, వాళ్లు తను వలయాన్ని బిగించసాగారు. కాని స్తెపాన్ మత్వేయెవిచ్‌కి శాంతికాలపు రోజుల నుంచి ఆ ప్రాంతం కొట్టిన పిండే కనుక, అతను ప్ల్యాజ్నికొవ్‌ను అక్కడినుంచి సురక్షితంగా వెనక్కి తీసుకెళ్లగలిగాడు. కాల్పులనూ, పరుగులనూ వీలుగా తీసుకొని, జర్మన్లింకా బ్యారక్సులో ప్రతి మూలనూ గుళ్లతో తూట్లుపొడుస్తూండగా — వాళ్లు ఆవరణను దాటి, తమ నేలమాళిగ కంతలోకి దూరగలిగారు.

''జర్మన్లు మారలేదు'' ప్ల్యాజ్నికొవ్ నవ్వేందుకు ప్రయత్నించాడు, కాని పొడారిన అతని గొంతులోంచి బొంగురుశబ్దం మాత్రమే వెలువడింది, దానితో అతను నవ్వడం మానుకున్నాడు. ''సార్జెంటు మేజర్, మీరు లేకపోతే నేనీ రోజున ప్రమాదంలో యిరుక్కునే వాడినే.''

''ఆ మార్గం సార్జెంట్ మేజర్లకు మాత్రమే తెలుసు'' స్తెపాన్ మత్వేయెవిచ్ నిట్టూర్చాడు. ''సరే, అది యీ రోజున ఉపయోగపడింది.''

అతను తన బూటునొకదాన్ని కష్టంమీద ఊడదీశాడు. కాలిపట్టీ రక్తంతో నాని పోయింది. క్రిస్తా అత్త రొమ్ములు బాదుకొని ఏడ్చింది.

''అదేం లేదు'' సార్జెంట్ మేజరు అన్నాడు. ''గీరుకుందంతే, కండకి మాత్రమే తగిలింది. ఎముకకి తాకలేదు. అది ముఖ్య విషయం, కన్నానిదేముంది, అది తొందరలోనే మానిపోతుంది.''

''అయినా నువ్వేం సాధించాననుకుంటున్నావ్?'' ఫెదొర్చుక్ రుసరుసలాడుతూ అన్నాడు. ''కాల్చడం, పారిపోయిరావడం — ఎందుకుట? దీని మూలంగా యుద్ధం మరింత తొందరగా ముగిసిపోతుందనుకుంటున్నావా? దీని మూలంగా యుద్ధం కాదు ముగిసేది, మన పని ముగిసిపోతుంది. దాని పైమొచ్చినప్పుడు అదెలాగూ ముగిసిపోతుంది, కాని మనం — ''

అతను ఆగాడు, అందరూ మౌనం దాల్చారు. వాళ్లందరూ విజయోత్సాహంలో వున్నారు, అందుకనే వాళ్ళు మౌనంగా ఉండిపోయారు. వాళ్ళ పోరాటపటిమ చెక్కుచెదరకుండా ఉన్నత స్థాయిలో వుంది, ఉసూరుమియాలా వున్న సీనియర్ సార్జెంటుతో వాదించాలని వాళ్లకెవళ్ళకీ అనిపించలేదు.

నాలుగో రోజున ఫెదొర్చుక్ అదృశ్యమయ్యాడు. అతను తన గస్తీ కెళ్ళడానికి అయిష్టత ప్రదర్శించి, వెనక తచ్చాడుతూ ఉండిపోయాడు, చివరకి ప్ల్యాజ్నికొవ్ అతన్ని చివాట్లు పెట్టాల్సివచ్చింది.

‘‘సరే అయితే, నేను వెళ్తున్నాను, నేను వెళ్తున్నాను’’ అతను గొణిగాడు. ‘‘మనకీ గస్తీలొక్కటే కదా తక్కువ—!’’

వాళ్లా రోజున ఉదయంనుంచి సాయంత్రందాకా గస్తీ కేంద్రాల మధ్యనే తిరిగారు. తను ఏ చర్యకైనా పూనుకొనేందుకు ముందు శత్రువును గురించి తను తెలుసుకోగలిగినదంతా తెలుసుకోవాలని ప్లూజ్నికొవ్ అనుకున్నాడు. ఫెదొర్చుక్ తెల్లవారకట్ల వెళ్లినవాడు సాయంత్రం గాని, రాత్రి గాని తిరిగిరాలేదు. ప్లూజ్నికొవ్ ఆదుర్దాపడ్డాడు, పోయి అతనికోసం వెతకాలని తీర్మానించుకున్నాడు.

‘‘నీ సబ్‌మెషీన్ గన్నును యిక్కడ వదిలెయ్యి’’ అతను వోల్కొవ్‌కి చెప్పాడు. తేలిక రైఫిల్ని తీసుకో.’’

తన మటుకు తను సబ్‌మెషీన్ గన్నే తీసుకున్నాడు. అయితే, తన సహచరుణ్ణి రైఫిల్ని తీసుకోమని చెప్పడం అతనికిదే మొదటి సారి. అంతర్వాణి పట్ల అతనికి విశ్వాసం లేదు, అయినా అతనా ఆజ్ఞ యిచ్చాడు, రైఫిలుతో పాకడం మరింత కష్టమైన మాటా, అది టకటక కొట్టుకోకుండా చూడమని అతను వోల్కొవ్‌ను ఎడతెగకుండా కసురుకున్న మాటా నిజమే. అయినా—అటువంటి ఆజ్ఞ యిచ్చినందుకు అతను తర్వాత చింతించలేదు. కానైతే అతని కోపకారణం రైఫిలు కాదు, సీనియర్ సార్జెంట్ ఫెదొర్చుక్ జాడ కానరాకపోవడమే.

తెరెస్పోల్ గేటు పైనగల సగం విధ్వంసం చెయ్యబడిన బురుజు దగ్గరకు వాళ్లు చేరుకునే సరికి వెలుగు వస్తోంది. అంతకు ముందు వాళ్ల పరిశీలనలను బట్టి జర్మన్లు దాని పైకి ఎక్కడానికి సంకోచిస్తున్న సంగతి వాళ్లకి తెలుసు. బురుజుపైనుంచి చుట్టూ బాగా చూడవచ్చుననీ, బహుశా సీనియర్ సార్జెంటు జాడ—బతికి వున్నాడో, గాయపడ్డాడో, లేక చనిపోయాడో—తెలుసుకోవచ్చుననీ ప్లూజ్నికొవ్ అనుకున్నాడు. అనిశ్చిత పరిస్థితి అన్నింట్లోకీ అధ్వాన్నం కదా.

ఎదుటిగట్టునీ, బుగ్ మీదుగా వంతెననీ కనిపెట్టి చూడాల్సిందిగా వోల్కొవ్‌ని ఆజ్ఞాపించి, ఫిరంగిగుళ్ల దెబ్బలకు దున్నినట్లున్న ఆవరణను ప్లూజ్నికొవ్ జాగ్రత్తగా పరీక్షించాడు. చుట్టూ యింకా చాలా కళేబరాలు పడివున్నాయి, వాటిలో ప్రతి ఒక్కదాన్నీ ప్లూజ్నికొవ్ దూరంనుంచి జాగ్రత్తగా పరిశీలించాడు. కాని ఫెదొర్చుక్ ఎక్కడా కానరాలేదు, మరి ఆ కళేబరాలన్నీ పాతవి, అప్పటికే కుళ్లిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

‘‘జర్మన్లు....’’

వోల్కొవ్ ఆ మాటను అతి నెమ్మదిగా అన్నాడు, ఏ క్షణాన అయినా ఆ మాట కోసం ఎదురుచూస్తున్నందుననే ప్లూజ్నికొవ్ అర్థంచేసుకున్నాడు. అతను జాగ్రత్తగా అవతలి పక్కకు వెళ్లి బయటకి చూశాడు.

జర్మన్లు, ఓ పదిమంది, ఎదర గట్టున, వంతెన పక్కన నిలబడి వున్నారు. వాళ్లు

సాయిలాపాయిలాగా కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ, చేతులు తిప్పుకొంటూ నదిమీదుగా ఎక్కడికో చూస్తున్నారు. ప్ల్నాజ్నికొవ్ మెడ ముందుకు చాపి, క్రిందకు ఒరగా చూశాడు. అదుగో అక్కడ, దాదాపు బురుజు అడుగుభాగంలో, తనేదైతే ఊహించాడో, ఏమి చూస్తానని భయపడ్డాడో, సరిగా అదే ప్ల్నాజ్నికొవ్ కళ్లపడింది.

ఫెదొర్చుక్ బురుజు దగ్గర్నుంచి, వంతెన మీదుగా, చేతులెత్తి, గుప్పెట్లో తెల్ల గుడ్డ పట్టుకొని, జర్మన్లకేసి వెళ్తున్నాడు. బరువుగా, ధీమాగా పడుతున్న అతని అడుగులకు అనుగుణంగా ఆ తెల్ల గుడ్డ రెపరెపలాడుతోంది. నిరుత్సాహంగా రోజంతా పనిచేశాక అతను యింటికి తిరిగి వస్తున్నాడన్నంత నెమ్మదిగా, కృతనిశ్చయంతో, తాపీగా జర్మన్లకు లొంగి పోయేందుకు వెళ్తున్నాడతను. అతని యావత్తు వైఖరిలోనూ ఎంతటి దాస్యభావం యిమిడి వుందంటే ఏ మాటామంతీ లేకుండానే జర్మన్లు అతన్ని అర్థంచేసుకొని, అతని రాక కోసం, జోక్సు విసురుకుంటూ, నవ్వుకుంటూ, తమ రైఫిళ్లను ప్రశాంతంగా భుజాలకు వ్రేలాడేసు కొని, ఎదురుచూస్తున్నారు.

‘‘ఆఁ అది కామ్రేడ్ ఫెదొర్చుకే’’ వోల్కొవ్ విభ్రమంగా అన్నాడు. ‘‘కామ్రేడ్ సీనియర్ సార్జెంటే!’’

‘‘కామ్రేడా?’’ తన తల తిప్పకుండా ప్ల్నాజ్నికొవ్ చెయ్యి చాపాడు. ‘‘రైఫిలేది!’’

అలవాటు ప్రకారం వోల్కొవ్ ఆజ్ఞాపాలనానికి హడావిడిగా పూనుకున్నాడు, కాని అకస్మాత్తుగా ఆగి, గతుక్కుమని బిగ్గరగా అన్నాడు.

‘‘ఎందుకు?’’

‘‘నీ రైఫిల్ని యిలాగియ్యి! తొందరగా!’’

ఫెదొర్చుక్ జర్మన్లను సమీపిస్తున్నాడేమో, ప్ల్నాజ్నికొవ్ తొందరపడ్డాడు. తుపాకి గురిలో అతనిది అందెవేసిన చెయ్యే, కాని యిప్పుడు, తను గురి తప్పకూడని యిప్పుడు, అతను తన ట్రిగ్గరును మరీ తొందరగా నొక్కాడు. ఫెదొర్చుక్ అప్పటికే వంతెన దాటి, జర్మన్లకు కేవలం నాలుగే నాలుగు అంగల దూరంలో ఉండటమే అతనంత తొందరగా ట్రిగ్గరు నొక్క డానికి కారణం.

ఆ బులెట్ సరిగా ఫెదొర్చుక్ వెనక నేలను తాకింది. జర్మన్లకు ఆ కాల్పు వినరా లేదో, లేక దాన్ని పట్టించుకోలేదో గాని, వాళ్ల ధోరణిలో మార్పు రాలేదు. కాని ఫెదొర్చుక్‌కి మాత్రం వెనకనుంచి వచ్చిన ఆ బులెట్ తన స్వంత బులెట్టే, బిగుతుగా వున్న తన సైనిక కోటు లోపల ఆకస్మికంగా చెమటతో తడిసిపోయిన అతని వీపు ఎదురుచూస్తున్న బులెట్టే అది. అతనో పక్కకు గెంతి, క్రింద పడి, జర్మన్లకేసి మోకాళ్లపై పాకనారంభించాడు. జర్మన్లు గప్పాలు కొడుతూ, అతనికింకా దూరం దూరంగా జరుగుతూండగా అతను పాకి,

దేకి, పరుగెత్తుతూ, పడుతూ లేస్తూ, తెల్ల గుడ్డ ఊపుతూ జర్మన్ల దిశగా ముందుకెళ్తూనే వున్నాడు.

రెండో బులెట్ తాకడంతో అతను తన మోకాళ్లపై కింద కూలాడు, మెలికలు తిరుగుతూ, పిచ్చిగా ఏదో అరుస్తూ, ముందుకి పాకేందుకు ప్రయత్నించాడు. కాని జర్మన్లకి విషయమేమిటో అప్పటికీ అర్థం కాలేదు. ఎలాగైనా ప్రాణాలు దక్కించుకోవాలని తాపత్రయ పడుతున్న యీ స్థూలకాయునివంక చూసి జర్మన్లింకా నవ్వుతూనే ఉన్నారు, ఎకసక్కెం చేస్తూనేవున్నారు. ఫ్లాజ్నికొవ్ చివరి మూడు కాల్పులనూ మిలిటరీ స్కూల్లో త్వరితంగా కాల్చే పోటీలో కాల్చినట్లు కాల్చిన మూలంగా ఎవరికీ ఏం గ్రహించేందుకూ వ్యవధి చిక్కిందికాదు.

జర్మన్లు చెదురుబదురుగా బదులు కాల్పులు కాల్చేసరికి అప్పుడే ఫ్లాజ్నికొవ్, గందర గోళ మనస్థితిలో వున్న వోల్కొవూ క్రిందనున్న దెబ్బతిన్న ఖాళీ కేస్‌మేట్లలోకి చేరుకున్నారు. ఫిరంగి గుళ్లు తలపైగా పేలనారంభించడంతో వోల్కొవ్ ఓ కంతలో ఒరగా దూరేందుకు ప్రయత్నించాడు. కాని ఫ్లాజ్నికొవ్ అతన్ని బయటకి లాగాడు, వాళ్లు మళ్లీ పరుగెత్తారు, పడి, పాకి, ఆవరణను దాటి, చితికిపోయిన ఒక కవచశకటం వెనకనున్న ఒక ఫిరంగి గుండు గుంటలోకి ఉరకగలిగారు.

"ఆ పని పూర్తయింది" ఫ్లాజ్నికొవ్ రొప్పుతూ అన్నాడు. "విషసర్పం. దేశద్రోహి."

వోల్కొవ్ భయభీతమైన గుండ్రని తన కళ్లను అతని వంక తిప్పి, ఏమీ అర్థంచేసుకో కుండానే, త్వరత్వరగా తలూపాడు. ఫ్లాజ్నికొవ్ అనే మాటలు పదేపదే రెట్టించనారంభిం చాడు. "దేశద్రోహి, విషసర్పం. తెల్ల గుడ్డతో అక్కడికెళ్లాడు, నువ్వు చూశావు కదూ? శుభ్రమైన తెల్ల గుడ్డ కూడా సంపాదించాడు, క్రిస్తో అత్త దగ్గర్నుంచి కాజేసివుంటాడు. తన క్షుద్ర ప్రాణం కోసం సమస్తం అమ్మెయ్యడానికి సిద్ధపడ్డాడు, సమస్తం. వాడు మనల్ని కూడా అమ్మేసి వుండును. విషసర్పం. తెల్లగుడ్డ తీసుకు బయల్దేరాడు, ఔనా? నువ్వు చూశావు కదూ, వోల్కొవ్? వాడు అతినిశ్చింతగా పనిగట్టుకొని వెళ్లాడు."

మాట్లాడాలనీ, కేవలం ఏవో మాటలు పలకాలనీ అతనికి తపన కలిగింది. తను శత్రు వులను చంపినప్పుడు అతనికిలా వివరించాల్సిన అవసరం కనిపించలేదు. కాని యిప్పుడు అతను మౌనంగా ఉండలేకపోయాడు. తను టేబిలు దగ్గర తరచు కలిసి కూర్చుని భోజనం చేసిన ఒక మనిషిని తను కాల్చి చంపాడు. ఈ విషయంలో అతని అంతరాత్మ ఏమాత్రం బాధ చెందడంలేదు, సరికదా అందుకు భిన్నంగా సంతోష కోప సమ్మిశ్రితమైన ఆవేగం అతన్ని ముంచెత్తుతోంది. అందుకనే అతను అదే పనిగా మాట్లాడాడు.

కాని సైన్యంలోకి కొత్తగా రిక్రూట్ అయిన — 1941 మేలో మాత్రమే అతను సైన్యంలో భర్తీచేసుకోబడ్డాడు — వాస్యా వోల్కొవ్ నమ్రంగా తలైతే ఊపుతున్నాడుగాని, వాటిలో ఒక్క మాటను కూడా అతను గ్రహించలేదు. అతను యింతకు ముందెన్నడూ ఏ

యుద్ధంలోనూ పాల్గోలేదు. అతని దృష్టిలో జర్మన్ సైనికులు సైతం యింకా మనుషులే. ఎవరూ వాళ్ళని — కనీసం, ఆజ్ఞలు లేనిదే — చంపకూడదు. అతను మొట్టమొదట చూసిన చావు — తను సన్నిహిత సాంగత్యంలో అనేక రోజులు — తన స్వల్ప, ప్రశాంత, శాంతియుత జీవితంలో అత్యంత భయంకరమైన రోజులు — గడిపిన వ్యక్తి చావు. యుద్ధానికి ముందు వాళ్ళిద్దరూ ఒకే రెజిమెంటులో ఉన్న కారణంగా, ఒకే బ్యారక్సులో నిద్రిస్తూ ఉండిన కారణంగా ఈ మనిషితో అతనికి మిక్కిలి అధిక పరిచయముంది. ఈ మనిషే అర్ధ మనస్కంగా తనకు ఫిరంగులు కాల్చడం నేర్పాడు. పంచదార కలిపిన టీ తెచ్చిపెట్టాడు, విసుగెత్తించే డ్యూటీ పడినప్పుడు కొంచెం కన్ను మూసేందుకు అవకాశం కల్పించాడు.

ఇప్పుడు ఆ మనిషి అవతలి ఒడ్డున, తెల్ల గుడ్డముక్క వున్న చేతులను ముందుకు చాపి, బొక్కబోర్లా పడివున్నాడు. ఈ సీనియర్ సార్జెంటు జర్మన్ల దగ్గరకి ఎందుకెళ్తున్నాడో తను అర్థంచేసుకోలేకపోయినా, ఫెదొర్చుక్‌ను గురించి చెడ్డగా ఆలోచించడం వోల్కొవ్‌కి సుతరామూ గిట్టలేదు. బహుశా, అతనికి అలా వెళ్ళేందుకేమైనా కారణముందేమో, అతన్ని వెనుకనుంచి కాల్చేందుకు ముందు ఆ కారణమేమిటో విచారించియుండాల్సింది — అనుకున్నాడు వోల్కొవ్. కాని ఆ లెఫ్టినెంటు — బక్కగా, భయంకరంగా వుండే యీ అంతుచిక్కని అపరిచితుడు — అసలు సంగతేమిటో తెలుసుకోవాలన్న ప్రయత్నం కూడా చేసిన పాపాన పోలేదు. ఈయనగారు తమను కలిసిన మొట్టమొదటి రోజునుంచీ తమను బెదిరించడం, కాల్చి పారేస్తాననడం, ఆయుధాలు ఝుళిపించడం మొదలుపెట్టాడు.

తనకిప్పుడు అనుభూతమవుతున్న ఒంటరితనం మాత్రం — అది అసామాన్యమైనదే కాకుండా అసహజమైనది కూడా. తనను తానొక మనిషిగా, సైనికునిగా పరిగణించుకోవడానికి అతనికి అది ఆటంకంగా తయారైంది, ప్లూజ్నికొవ్‌కీ తనకీ మధ్య అదొక పెద్ద అధిగమింపరాని అడ్డుగోడను లేపింది. వోల్కొవ్‌కి తన కమాండరంటే భయంపట్టుకుంది, అతన్ని తను అర్థంచేసుకోలేకపోతున్నాడు, పర్యవసానంగా ప్లూజ్నికొవ్‌లో అతనికి నమ్మకం నశించిపోయింది.

జర్మన్లు బారులుగా — ఓ ప్లెటూను మొత్తం — తెరెస్పోల్ గేటు గుండా దుర్గంలోకి ప్రవేశించారు. తర్వాత విడివడి వలయాకారపు బ్యారక్సులోని పరిసర విభాగాలను గాలించారు. త్వరలోనే ప్రేలుళ్ళ, అగ్నిబరాటాల ప్రయోగ క్రమంలో అయ్యే గుయ్యోంమనే శబ్దాలూ మొదలయ్యాయి. కాని జర్మన్లు తనకోసం తప్ప చోట వెతుకుతున్నారన్న సంతోషం — అదే గేటు వెంబడి మరో జర్మన్ సైనిక దళం లోపలకి వచ్చిన కారణంగా — ప్లూజ్నికొవ్‌కి ఎక్కువ సేపు మిగల్లేదు. ఈ దళం చుట్టూ గాలిస్తూ, 333వ రెజిమెంటుకి చెందిన విధ్వంసిత బ్యారక్సుకు తిన్నగా రాసాగింది. మరిన్ని ప్రేలుళ్ళూ, మరింతగా అగ్నిబరాటాల ప్రయోగం సాగుతున్నాయి.

కొంచెం ముందువెనకల్లో యీ దళం తమను సమీపించడం తథ్యం. తామిక యిక్కడి నుంచి శీఘ్రంగా వెళ్లిపోవాలి, కానైతే వెనక్కి తమ భూగర్భ ఆశ్రయ స్థావరానికి చేర్చే బిలం దగ్గరకి — అది నేరుగా శత్రు దృష్టి పరిధిలో వున్న కారణంగా — వెళ్లేందుకు వీల్లేదు. తామిప్పుడు బాగా వెనక్కి — చర్చి వెనకనున్న బ్యారక్సు శిధిలాల్లోకి వెళ్లిపోవాలి.

తాము ఎక్కడికి వెళ్లాలో, ఎలా వెళ్లాలో ఫ్లాజ్నికోవ్ సవివరంగా వోల్కొవ్‌కి విశదీకరించాడు. వోల్కొవ్ నమ్రంగా, మౌనంగా విన్నాడేగాని ప్రశ్నలేమీ అడగలేదు, కనీసం తలైనా ఊపలేదు. అది ఫ్లాజ్నికోవ్‌ను హెచ్చరిక గలిగి ఉండేలా చేసింది, కాని అతను ప్రశ్నలతో కాలం వ్యర్థంచెయ్యలేదు. వోల్కొవ్ నిరాయుధంగా వున్నాడు (ఆ రైఫిల్ని ఫ్లాజ్నికోవ్ బురుజుపైన వదిలేశాడు), అతను అసౌకర్యంగాను, బహుశా భయంభయంగా కూడా వున్నాడు. అతన్ని ఉత్సాహపరచేందుకు గాను ఫ్లాజ్నికోవ్ కన్నుగిలిపాడు, చిరునవ్వు కూడా నవ్వాడు. కానైతే ఆ కనుగిలుపూ, ఆ చిరునవ్వూ ఎంతగా తెచ్చిపెట్టుకున్నట్లున్నాయంటే, అవి వోల్కొవ్‌కన్న సాహసికుని సైతం భయభీతుని చేసివుండేవి.

''ఫరవాలేదులే, నీకేదో ఒక ఆయుధం సంపాదిద్దాం'' ఫ్లాజ్నికోవ్ నిస్తేజంగా గొణిగాడు. ''ఇప్పుడిక ముందుకి పరుగెత్తు. తర్వాతి గుంటలోకి.''

వాళ్లు బహిరంగ ప్రదేశంగుండా దూసుకెళ్లి శిధిలాల్లో దాక్కున్నారు. ఇక్కడ వాళ్లు దాదాపు సురక్షితంగా వున్నారు, కాస్త ఊపిరి పీల్చుకొని, చుట్టూ పరకాయించి చూసేందుకు వాళ్లకి అవకాశం దొరికింది.

''వాళ్లు మననిక్కడ కనుక్కోలేరు, గాభరాపడకు.''

ఫ్లాజ్నికోవ్ మందహాసం చెయ్యాలని మరోమారు ప్రయత్నం చేశాడు, కాని అప్పటికీ వోల్కొవ్ ఏమీ మాట్లాడలేదు. అతనెప్పుడూ మితభాషే అయినందున ఫ్లాజ్నికోవ్‌కి ఆశ్చర్యమేమీ కలగలేదు. కాని ఏ కారణంగానో అతనికి ఆకస్మికంగా సాల్నికోవ్ గుర్తుకొచ్చి నిట్టూర్చాడు.

ఎక్కడో శిధిలాల వెనుక — జర్మన్ సోదా బృందాలున్నదానికి వెనుకగాక, ముందు — నిజానికి వాళ్లెవళ్లూ ఉండకూడని చోట — అతనికి శబ్దాలు, గందరగోళంగా మానవ స్వరాలు, అడుగుల చప్పుళ్లు వినవచ్చాయి. ఆ శబ్దాలు చాలమందినుండి — తమను తాము మరుగు పరచుకోవాలని ప్రయత్నించని వారినుండి వస్తున్నట్లున్నాయి, అందుకని అవి మిత్రుల శబ్దాలు అయ్యే అవకాశం లేదు. నూటికి తొంభై వంతులు మరో జర్మన్ దళం వస్తూ వుండి వుంటుంది. ఫ్లాజ్నికోవ్, ఆ శబ్దాలు ఎటు వెళ్తున్నాయో గమనించేందుకు వీలుగా, మహా శ్రద్ధగా వింటున్నాడు. ఎవరూ దృష్టి పథంలోకి రాలేదు, కాని ఆ గజిబిజి శబ్దం, స్వరాలు, బూట్ల అడుగుల రాపిడి — దగ్గరకీ రాకుండా దూరానికీ పోకుండా — కొనసాగాయి.

''నువ్విక్కడే వుండు'' ప్ల్లాజ్నికొవ్ అన్నాడు. ''నేను తిరిగివచ్చే దాకా దాక్కునే వుండు.''

ఇప్పుడూ వోల్కొవ్ బదులేమీ చెప్పలేదు. ఇప్పుడూ అతని కళ్లు చిత్రంగా నిశ్చలంగా వుండిపోయాయి.

''ఇక్కడే వుండు'' ఆ చూపును ఎదుర్కొంటూ ప్ల్లాజ్నికొవ్ రెట్టించాడు.

అతను శిథిలాలగుండా జాగ్రత్తగా ముందుకువెళ్లాడు. ఒక్క చిన్న ముక్కను కూడా కదపకుండా అతను ఛిన్నాభిన్నమైన యిటుకపెళ్లల గుట్టల మీదుగా నడుస్తూ, బహిరంగ ప్రాంతాల్లో పరుగెత్తుతూ, తరచు వినేందుకు నిశ్చలంగా ఆగుతూ, అతనా అపరిచిత స్వరాల దిశగా వెళ్తున్నాడు. ఇప్పుడవి మరింత స్పష్టంగా వినవస్తున్నాయి. శిథిలాలకు దూరంగా అటు ప్రక్కనున్నవాళ్లు ఎవరో అతనప్పుడే ఊహించుకోగలిగాడు. ఊహించుకున్నాడు, కాని తన ఊహను విశ్వసించ నిరాకరించాడు.

చివరి కొద్ది మీటర్లూ అతను — యిటుకల వాడి అంచులకూ, కాలిన గిలాబా పెళ్లలకూ తన మోచేతులు రాసుకొని మంట పుడుతూండగా పాకివెళ్లాడు. మరుగు చూసుకొని, అతను తన సబ్‌మెషీన్ గన్నును కాల్చేందుకు సిద్ధంచేసి, పైకి తొంగిచూశాడు.

మనుషులు ఆవరణలో పనిచేస్తున్నారు. కుళ్లుతున్న కళేబరాలను యీడ్చుకెళ్లి వాళ్లు లోతైన గుంటల్లో పడేసి, పైన పెంకుముక్కలూ, యిసుకా వేసి పూడుస్తున్నారు. ఆ శవాలను పరీక్షించేందుకుగాని, వాళ్ల పత్రాలను జాగ్రత్త చేసేందుకుగాని, గుర్తింపు బిళ్లలు తొలగించేందుకుగాని వాళ్లు ఆగడం లేదు. వాళ్లు అలసటతో కూడిన అనాసక్తితో నెమ్మదిగా కదులుతున్నారు. కాపలా సైనికులను చూడకముందే, వాళ్లు ఖైదీలన్న సంగతిని ప్ల్లాజ్నికొవ్ గ్రహించాడు. అతనిక్కడికి వస్తూండగా యింతకుముందే యీ విషయాన్ని గ్రహించాడు, అయితే ఎందుకోగాని అతనికీ విషయాన్ని నమ్మబుద్ధి కాలేదు. తనముందు, కేవలం మూడు అంగల దూరంలో, తన సొంత సోవియట్ మనుషులను, పరిచితమైన యూనిఫారాలలో చూడవలసి రావడం అతనికి మనస్కరించలేదు. ఔను, సోవియట్ వాళ్లే — అయినా యికనెంతమాత్రం తనవాళ్లు కాని వాళ్లు — రెడార్మీలో రెగ్యులర్ లెఫ్టినెంట్ అయిన తననుంచి, ''ఖైదీ'' అన్న అమంగళకరమైన పదంచేత వేరైపోయిన వాళ్లు.

వాళ్లనతను చాలా సేపు పరీక్షగా చూశాడు. వాళ్లెలా — క్రమబద్ధంగా, అనాసక్తంగా మరమనుషుల మాదిరిగా — పని చేస్తున్నారో అతను పరికించాడు. వాళ్లెలా వంగి, తమకున్న వయస్సు కన్న మూడు రెట్లు ముసలాళ్లు అయినట్లు తమ కాళ్లు యీడ్చుకొంటూ — నడుస్తున్నారో అతను గమనించాడు. అతను వాళ్ల నిస్తేజ నయనాలను — తామెక్కడ వున్నామో, ఏం జరుగుతోందో తెలుసుకోవాలని సైతం ఆసక్తి లేకుండా వున్న వాళ్ల కళ్లను చూశాడు. ఉన్న ఆ కొద్దిమంది జర్మన్ కాపలా సైనికులూ వాళ్ల వంక ఎంత నిర్వ్యాపారంగా

చూస్తున్నారో అతను గమనించాడు — వాళ్లు పరుగెత్తుకుపోయి, దాక్కుని, తిరిగి స్వతం త్రులయ్యేందుకు ఎందుకని ప్రయత్నించడం లేదో అతను అర్థంచేసుకోలేకపోయాడు. ఇందుకు ఏ కారణమూ అతనికి స్ఫురించలేదు. జర్మన్లు యీ ఖైదీలకేమన్నా యింజెక్షన్లు చేశారేమో, వాటి మూలంగానే నిన్నటి ఉత్సాహపరులైన ఈ యోధులు యిప్పుడిలా బురదగొడ్ల మాదిరిగా మందకొడిగా తయారయ్యారేమో, అందుకే వీళ్లకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను గురించీ, ఆయుధా లను గురించీ ఆలోచనలు సైతం రావడం లేదేమోనన్న చిత్రమైన ఆలోచన సైతం అతనికి తట్టింది. అతను తను ఎదురుగా చూస్తున్న దృశ్యాన్ని గురించి — తన స్వదేశీయుల సహజ మైన ఆత్మగౌరవభావానికి సంబంధించిన తన అంచనాకు పూర్తిగా భిన్నమైన దృశ్యాన్ని గురించి — సరిపెట్టుకొనేందుకు అతనికి ఈ భావం కొంతమేరకు తోడ్పడింది.

ఖైదీల విలక్షణమైన విధేయతతో కూడిన ఆ మందకొడితనాన్ని గురించి ఆవిధంగా సర్దిచెప్పుకున్న తర్వాత, వాళ్లను ఫ్లూజ్నికొవ్ భిన్న దృష్టితో చూడనారంభించాడు. ఇప్పుడ తనికి వాళ్లపట్ల — బాగా జబ్బుపడిన వాళ్లపట్ల ఎవరికైనా ఎటువంటి జాలీ, సానుభూతీ కలుగుతాయో — అటువంటి జాలీ, సానుభూతీ కలిగాయి. అతనికి సాల్నికొవ్ జ్ఞాపకం వచ్చి, కార్మిక ఖైదీ బృందం మధ్య అతనికోసం వెతికాడు, కాని అతను కనిపించకపోయే సరికి సంతో షించాడు. సాల్నికొవ్ బ్రతికివున్నాడో, చనిపోయాడో అతనికి తెలియదు, కాని అతనిక్కడ లేడు, అతను జీవన్మృతునిగా, బురదగొడ్డుగా మార్చబడలేదు. ఆ గుంపులో అతనికొక పరిచిత మూర్తి — పొడవుగా, మందంగా, కష్టించి పనిచేసే మూర్తి — కానవచ్చింది. అతనా వ్యక్తిని గుర్తుచేసుకొనేందుకుగాను తన బుర్ర బద్దలుకొట్టుకున్నాడు.

అతని మనస్సును వేధించడానికే అన్నట్లు పొడవాటి ఆ ఖైదీ అతని దగ్గరే, కేవలం రెండే రెండు అంగల దూరంలో, యిటుక తుంటలను తన పెద్ద షవలుతో దోకుతూ కని పించాడు. ఆ షవలు ఫ్లూజ్నికొవ్ చెవులకు చాలా దగ్గరగా దోకుతున్నా కూడా అతను తన తలను అటు తిప్పలేదు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఫ్లూజ్నికొవ్‌కి. అతనికి అకస్మాత్తుగా చర్చిలో జరిగిన పోరాటం, దాన్నుంచి రాత్రిపూట తమ తిరోగమనం, ఆ వ్యక్తి పేరూ గుర్తొచ్చాయి. అతను స్థానికుడు, రిజర్వు సైనికుడు, అక్టోబరులో కాక మేలో తను కొలువు చెయ్యడానికి ఒప్పు కున్నందుకు బాధపడిన వ్యక్తి. ఇతనా రోజు రాత్రి పరస్పరం జరిగిన కాల్పులలో చచ్చిపోయా డని సాల్నికొవ్ చెప్పాడు. అతనా విషయాలన్నింటినీ స్పష్టంగా గుర్తుచేసుకున్నాడు, అతను మళ్లీ తన గోతిదగ్గరకొచ్చేదాకా వేచియుండి, అతన్ని పిలిచాడు.

''ప్రిజ్న్యాక్!''

ఆ వ్యక్తి ఉలిక్కిపడ్డాడు, విశాలమైన అతని వీపు మరింతగా వంగిపోయింది. విధే యతాపూర్వకమైన భయాతిరేకంతో అతను కొరడుబారిపోయాడు.

''ప్రిజ్న్యాక్, నేను లెఫ్టినెంట్ ఫ్లూజ్నికొవ్‌ని. గుర్తుందా — చర్చి...''

ఆ వ్యక్తి పక్కకి తిరగలేదు, తన పూర్వపు కమాండరు స్వరాన్ని విన్న జాడే అతనిలో కనిపించలేదు. అతను కేవలం తన షవలుపై వంగి, చీలికలు వాలికలై బిగుతుగా ఉన్న సైనిక కోటులోని తన వెడల్పాటి వీపును ఫ్లూజ్నికొవ్ కేసి తిప్పి నిలబడ్డాడు. ఉద్రిక్తంగా, వంగి వున్న అతని వీపును చూస్తే, వెనుకనుంచి వచ్చే దేనికోసమో అతను నిరీక్షిస్తున్నాడనిపించింది. ప్రిజ్న్యాక్ భయాతిరేకంతో వెనుకనుండి బులెట్‌కోసం ఎదురుచూస్తున్నాడని ఫ్లూజ్నికొవ్‌కి తటాలున తట్టింది. అతని ఆ వీపు, ఆ విశాలమైన, రక్షణలేని ఆ వీపు దీర్ఘకాలంగా, ఏ క్షణాన అయినా రాబోయే బులెట్‌కోసం నిరీక్షించడానికి అలవాటుపడిపోయి, విధేయంగా వంగిపోయిందని ఫ్లూజ్నికొవ్ గ్రహించాడు.

''సాల్నికొవ్ కనిపించాడా నీకు? సాల్నికొవ్ — ఖైదీల్లో వున్నాడా? జవాబు చెప్పు, యిక్కడెవరూ లేరులే.''

''అతను ఆస్పత్రిలో ఉన్నాడు.''

''ఎక్కడ?''

''క్యాంపు ఆస్పత్రిలో.''

''జబ్బుగా ఉన్నాడా, లేకపోతే?...''

ప్రిజ్న్యాక్ బదులు చెప్పలేదు.

''ఏం జరిగిందతనికి? అతను ఆస్పత్రిలో ఎందుకున్నాడు?''

''కామ్రేడ్ కమాండర్, కామ్రేడ్ కమాండర్'' ప్రిజ్న్యాక్ చాటుగా తన భుజంపైగా చూస్తూ, అకస్మాత్తుగా గుసగుసగా చెప్పనారంభించాడు. ''నామీద దయ చూపించండి కామ్రేడ్ కమాండర్, మీకు పుణ్యముంటుంది, నామీద దయ చూపించండి. మేం బాగా పనిచేస్తే, మమ్మల్ని కాస్త బాగా చూస్తారు, స్థానికులను యింటికి పంపేస్తారు, మాకు వాగ్దానం చేశారు — వాళ్లు మమ్మల్ని వదిలిపెట్టేస్తారు.''

''సరే, ఏడుపు చాలించు'' ఫ్లూజ్నికొవ్ కోపంగా తుంచేశాడు. ''వాళ్లకి ఊడిగం చెయ్యి, నీ స్వేచ్ఛ సంపాదించుకో, యింటికి ఎగేసుకుపో — నువ్వు మగాడివైతే కదా బాధ. కానైతే, ప్రిజ్న్యాక్, నువ్వో పని చేసితీరాలి, నువ్వా పని చేశావో సరేసరి, లేకపోతే నిన్ను యిక్కడే, యిప్పుడే కాల్చేస్తాను, నీ పీడ విరగడజేసేస్తాను.''

''నన్ను కనికరించండి'' అతని స్వరం శోకపూరితమైంది. కాని ఫ్లూజ్నికొవ్ జాలిని పూర్తిగా అణిచేశాడు.

''నువ్వు చేస్తావా? చెప్పు! చేస్తానంటే చేస్తానను — లేకపోతే చెయ్యనను, ఒక్కటే మాట. ఇదేం పరాచికం కాదు.''

''కాని నేనేం చెయ్యగలను? నేను ఖైదీని కదా.''

‘‘ఈ పిస్తోలును సాల్నికొవ్‌కియ్యి. దీన్ని అతనికిచ్చి, దుర్గంలోకి తనని పనికి పంపించమని అడగమని చెప్పు. బోధపడిందా?’’

ప్రిజ్న్యాక్ బదులుచెప్పకుండా ఊరుకున్నాడు.

‘‘దాన్ని అతనికివ్వకపోయావో — చూసుకో. నువ్వెక్కడ దాక్కున్నా సరే, నిన్ను వెతికి పట్టుకుంటా. ఇదుగో, తీసుకో.’’

చెయ్యూపి ఫ్లాజ్నికొవ్ తన పిస్తోలును నేరుగా ప్రిజ్న్యాక్ షవలు మీదకి విసిరాడు. అది ఆ రేకుకి తగిలి చప్పుడు కాగానే ప్రిజ్న్యాక్ అరుస్తూ ఓ పక్కగా పరుగు లంకించుకున్నాడు:

‘‘ఇదుగో! ఇదుగో! ఇక్కడో మనిషున్నాడు! హెర్ జర్మన్, యిదిగో యిక్కడ! ఓ లెఫ్టినెంటు, సోవియట్ లెఫ్టినెంటు!’’

అదెంత ఆకస్మికంగా జరిగిందంటే, దానికి ఫ్లాజ్నికొవ్ ప్రతిస్పందన ఒక్క క్షణం ఆలస్యమైంది. ఆ ఒక్క క్షణంలో ప్రిజ్న్యాక్ అతని కాల్పుల పరిధి దాటి తప్పుకు పోయాడు. క్యాంపు కావలిసైనికులు అతని గోతి దగ్గరకు — తమ యినుప నాడాల బూట్లు ధన్‌ధన్ మంటూండగా — పరుగెత్తుకు రాసాగారు. మొదటి హెచ్చరిక కాల్పు అప్పుడే పేలింది.

భయభీతుడూ, నిరాయుధుడూ అయిన వోల్కొవ్ దాక్కొని వున్న చోటుకి వెళ్లడం యిప్పుడిక అసంభవం, కాగా ఫ్లాజ్నికొవ్ దానికి సరిగా ఎదురు దిశగా పరుగుదీశాడు. పోరాటం జరుపుతూ తిరోగమించ ప్రయత్నించినందువల్ల ప్రయోజనమేం లేదు, ఎందుకంటే జర్మన్లు చాలామంది వున్నారు. అందుకని అతను, తనను తరుముకొస్తున్నవాళ్ల బారినుంచి తప్పించుకొని ఏ నేలమాళిగలోనో దూరి, చీకటి పడేదాకా వేచియుండాలని తీర్మానించుకున్నాడు. రాత్రిపూట వోల్కొవ్‌ని వెతికి పట్టుకొని, తమ ఆశ్రయానికి తిరిగి వెళ్లవచ్చుననుకున్నాడు.

అదంతా సులభంగానే సాగింది. జర్మన్లు చీకటిగుయ్యారాల్లా వున్న నేలమాళిగల్లోకి ఏమంత ఎక్కువగా కాల్పులు సాగించలేదు. మొత్తంగా శిథిలాలను గాలించేందుకు వాళ్లకు యిచ్ఛకత లేకపోయింది. వాళ్లు ఫ్లాజ్నికొవ్ వెనక కేవలం కొద్ది కాల్పులు కాల్చారు, అరిచారు, వెలుగులు వెదజల్లే రాకెట్టొకటి పేల్చారు — కాని దీన్ని అతను సురక్షితమైన తన మాటు ప్రదేశంనుంచి చూశాడు.

ఇప్పుడిక ఆలోచించేందుకు సమయముంది. అయితే యిక్కడ, యీ నేలమాళిగ అంధకారంలో సైతం, తను చేతులారా కాల్చివేసిన ఫెదొర్చుక్‌ని గురించిగాని, బిత్తరపోయిన వోల్కొవ్‌ని గురించిగాని, దాస్యభావంతో దేవురించే ప్రిజ్న్యాక్‌ని గురించిగాని అతను ఆలోచించలేకపోయాడు. దీని అర్థం వాళ్లని గురించి ఆలోచించడానికి అతనికి అయిష్టమని కాదు. అతని మనస్సు యింతకంటె ఎంతో ముఖ్యమైన విషయంతో — జర్మన్లను గురించిన ఆలోచనతో — నిండివుంది.

ఈ రోజున మళ్ళీ వాళ్ళలో అతనికేదో మార్పు కనిపించింది. తానింతకు ముందు చూసిన బలవంతులూ, ఆత్మవిశ్వాసపరులూ — పొగరుబోతుతనం అనిపించేటంతటి సాహస వంతులూ, దాడి సమయంలో ఉగ్రులూ, వెంటాడి వెతికేటప్పుడు పట్టుసడలించని వాళ్ళూ, బాహాబాహీ పోరాటంలో భల్లూక ప్రాయులూ అయిన యువకులకూ, యీ కొత్తకుర్రాళ్లకూ మధ్య అతనికి చాలా తేడా కనిపిస్తోంది. అబ్బే, యింతవరకూ తను పోరాడుతూ వచ్చిన ఆ జర్మన్ సైనికులు, ప్రిజ్వాల్క్ వేసిన పొలికేక అనంతరం తనను చస్తే దాటిపోనిచ్చే వాళ్ళు కారు. ఒక రెడార్మీ సైనికుడు చేతులు పైకెత్తి తమ దగ్గరకు వచ్చేదాకా, నది ఒడ్డున, మాటు లేకుండా నిలబడివుండేవాళ్ళు కారు. తన మొదటి కాల్పు అనంతరం వాళ్ళు తమ నవ్వులు కొనసాగించి యుండేవాళ్ళు కారు. ఫెదొర్చుక్‌ను తను కాల్చేశాక, వాళ్ళు వోల్కొవ్‌నూ, తననూ చస్తే దాటిపోనిచ్చేవాళ్ళు కారు.

అప్పటి ఆ జర్మన్లు, యిప్పటి యీ జర్మన్లు.... తనకు వాళ్ళను గురించిన స్పష్ట మైన పరిజ్ఞానం లేకపోయినా, దుర్గాన్ని ముట్టడించి లోనికి ప్రవేశించిన జర్మన్లకూ, యీ రోజున చూస్తున్న జర్మన్లకూ మధ్యగల భేదాన్ని అతను అస్పష్టంగా గ్రహించగలిగాడు. బహుశా గట్టియోధులను ఉపసంహరించి, వాళ్ల స్థానంలో భిన్నమైన తరహాకు చెందిన జర్మన్లను — భిన్నమైన పోరాట పద్ధతికి అలవాటుపడిన, చొరవ తీసుకోడానికీ, ప్రమా దాలను ఎదుర్కోడానికీ అంతగా యిష్టపడని, ప్రతిఘటనోన్ముఖమైన అంధకారావృతమైన నేలమాళిగల దిశగా వెళ్లడం గిట్టని జర్మన్లను — పెట్టారేమో.

ఈ తీర్మానానికొచ్చిన తర్వాత ప్లూజ్నికొవ్ హుషారు మరింతగా పెరగడమే కాకుండా, అతను మరింత నిర్భీకుడు కూడా అయ్యాడు. ఈ కొత్త ఆలోచనను అతను పరీక్షకు పెట్టాల నుకున్నాడు, అందుకని అతను, అంతకు ముందు ఎటువంటి పరిస్థితుల్లోనూ సాహసించని పనికి బుద్ధిపూర్వకంగా పూనుకున్నాడు: అతను నిర్గమన మార్గం దగ్గరకి నిటారుగా, టకటక నడుచుకొంటూ వెళ్లాడు.

అతనలా తన సబ్‌మెషీన్ గన్నును సిద్ధంగా పట్టుకొని నేలమాళిగలోంచి బయటి కొచ్చాడు. నిర్గమన మార్గం దగ్గర జర్మన్లు లేకపోవడంతో అతని ఊహకు ఊతం దొరికింది, దానితో పరిస్థితి బాగా సరళతరం అయింది. ఇప్పుడిక తను కొంత ఆలోచించుకోవాలి. సార్జెంటు మేజరుతో సంప్రదించి ప్రతిఘటనకు కొత్త ఎత్తుగడలను — నాజీ జర్మనీకి వ్యతిరేకంగా తాము వ్యక్తిగతంగా చేసే ప్రతిఘటనకు అనువైన కొత్త ఎత్తుగడలను — రూపొందించు కోవాలి.

అలా ఆలోచించుకొంటూ, ప్లూజ్నికొవ్ ఖైదీలకు కొంత దూరంలో — యీసురో మంటూ ఖైదీలు కాళ్లీడ్చుకొంటూ చేసే పని చప్పుడు శిథిలాల వెనుకనుంచి యింకా వినిపి స్తూనే వుండగా — నడుస్తూ, మరో పక్కనుంచి, వోల్కొవ్‌ను తను వదిలిన చోటును

సమీపించాడు. అతనికి ఆ స్థలం బాగా పరిచితమైనది. శిథిలాలమధ్య తేలికగా త్రోవ కను క్కోవడం కూడా అతను నేర్చుకున్నాడు. అతను నేరుగా వోల్కొవ్ దాక్కున్న ఏటవాలు యిటుక దిబ్బను చేరుకున్నాడు. ఆ దిబ్బైతే అక్కడే వుంది గాని వోల్కొవ్ మాత్రం — దాని కిందగాని, దాని దగ్గర్లో మరెక్కడా గాని — లేడు.

తన కళ్లను తానే నమ్మలేకపోయిన ప్లూజ్నికొవ్ ఆ దిబ్బ చుట్టూ తిరిగిచూశాడు, పరిసర శిథిలాలగుండా పాకాడు, ప్రతి కేస్‌మేటులోనూ వెతికాడు, విలక్షణమూ, దాదాపు నిర్నిమేషమూ అయిన కళ్లు కలిగిన ఆ యువ నవ సైనికుణ్ని పిలిచే సాహసానికి కూడా అతను పూనుకొన్నాడు, అయినా అతని జాడ లేకపోయింది. తన దుస్తులలోని చిన్న పేలికను గాని, ఒక్క రక్తపు బొట్టును గాని దిగవిడువకుండా, ఒక్క అరుపు గాని, నిట్టూర్పు గాని లేకుండా వోల్కొవ్ మాయమయ్యాడు.

3

''భేష్, బాగుంది, అయితే నువ్వు ఫెదొర్చుక్‌ని దీర్ఘ నిద్రలోకి పంపావన్న మాట'' అని స్తెపాన్ మత్వేయెవిచ్ నిట్టూర్చాడు. ''కాని ఆ కుర్రాడి విషయంలోనే బాధగా వుంది. వాడు దిక్కుతోచక మతి కోల్పోతాడు, కామ్రేడ్ లెఫ్టినెంట్. వాడు జీవితమంతా భయభీతుల తోనే గడిపిన బాపతు మనిషి.''

వాళ్లు అనుత్సాహంగా ఉదాసీనంగా వుండే వాస్యా వోల్కొవ్‌ను గురించి మరొకటి రెండు సార్లు మాట్లాడుకున్నారు, కాని ఫెదొర్చుక్‌ని గురించి — అసలలాంటి వ్యక్తి ఎన్నడూ లేనే లేడన్నట్లు, ఆ టేబిలు దగ్గర కూర్చొని భోజనమే చెయ్యలేదన్నట్లు, తమ పక్కనే ఓ మూల ఎన్నడూ పడుకోనే లేదన్నట్లు — ప్రస్తావించనే లేదు. మీర్రా మాత్రమే — తాము ఒంటరిగా వున్నప్పుడు — ''అయితే నువ్వు — ఆయన్ని కాల్చేశావన్నమాట?'' అంది.

ఆమె ఆ మాటను కష్టంమీద అనగలిగింది. అదొక అపరిచిత పదం — అది వాళ్ల కుటుంబం వాడే శబ్ద సముదాయంలో యిమిడిలేదు. వాళ్ల యింట్లో, వాళ్లు పిల్లల్ని గురించీ, రొట్టెను గురించీ, పనిని గురించీ, అలసటను గురించీ, పొయ్యిలోకి కట్టెలను గురించీ, బంగాళా దుంపలను గురించీ మాత్రమే మాట్లాడుకుంటారు. ఇకపోతే అస్వస్థతలను గురించి కూడా — వాటికెప్పుడూ లోటే వుండేది కాదు — మాట్లాడుకునేవారు.

''నువ్వాయన్ని కాల్చేశావా?''

ప్లూజ్నికొవ్ తలూపాడు. అలా అడగడంలో ఆమె ఫెదొర్చుక్ పట్ల కాక, తన పట్లనే జాలి ప్రదర్శిస్తోందని అతను గ్రహించాడు. తనకు కలిగివుంటుందని ఆమె ఊహిం చుకొన్న మానసిక క్లేశం విషయంలో మీర్రా బాధపడుతోంది. అయితే తన మటుకు తాను

ఆ విషయంలో మానసికంగా క్రుంగిపోకపోయినా — విపరీతమైన బడలిక మాత్రమే తనను వేధిస్తోంది.

"ఓరి భగవంతుడా, యీ జనానికి మతిభ్రమించినట్లుంది" మీరా నిట్టూర్చింది. లోకానుభవంతో పండిపోయిన స్త్రీ మాదిరిగా ఆమె ఉద్వేగరహితంగా, విచారంగా యీ మాట అంది. అదే కొత్త పరిణతితో ఆమె మౌనంగా అతని తలను తన చేతుల్లోకి తీసుకొని అతన్ని ముమ్మారు — అతని నుదుటిపైనా, రెండు కళ్లపైనా — ముద్దుపెట్టుకుంది.

"నీ విషాదాన్ని, మనఃక్లేశాన్ని, దుఃఖాన్ని నేను భరిస్తాను."

పిల్లలు జబ్బుపడినప్పుడు ఆమె తల్లి ఎప్పుడూ యీ మాటలే అంటూండేది. బిడ్డలు దండిగానే వున్నారు, వాళ్లలో ఎక్కువ మంది ఎప్పుడూ ఆకలితో రోదిస్తూ వుండేవారు. అమ్మకి తన దుఃఖాన్ని గురించి గాని, మనఃక్లేశాన్ని గురించి గాని ఆలోచించుకొనే వ్యవధే వుండేది కాదు, పిల్లల బాధలతోనే ఆమె తలమునకలయ్యేది. ఆవిడ తన కూతుళ్లందరికీ మొదట తమ కష్టాలను గురించి ఆలోచించుకోకూడదనీ యితరుల కష్టాలను గురించి పట్టించుకోవాలనీ నేర్పింది. ఆమె యీ లక్షణాన్నే మీరాకి కూడా — నిట్టూరుస్తూనే అయినా — నేర్పింది.

"నీ జీవితకాలమంతా యితరుల పిల్లలతోనే నువ్వు సతమతమవుతావు, నీకు సొంత బిడ్డలుండరు కదా తల్లీ" అనేది.

బాల్యంనుంచీ కూడా మరింత అదృష్టవంతురాండ్రైన అక్కచెల్లెళ్ల బిడ్డలను సాకడమే తన జీవిత భవితవ్యమన్న ఆలోచనకు మీరా అలవాటుపడింది. ఆ ఆలోచనకు ఆమె అలవాటుపడిపోయింది, యిప్పుడామె అందుకు బాధ కూడా పడటం లేదు. తన పరిస్థితి ఆమెకు తెలుసు, తను అవిటిది కనుక తనను ఎవరూ పట్టించుకోరు. కానైతే దీనివల్ల కూడా కొన్ని మేళ్లు లేకపోలేదు — వాటిలో మొట్టమొదటిది స్వేచ్ఛ.

ఈలోగా క్రిస్తో అత్త, ఎలకలు కొరికేస్తున్న తమ రస్కుల నిల్వలను మళ్లీమళ్లీ లెక్కపెడుతూ, "ఇద్దరు పోయారు. ఇద్దరు. ఇద్దరు పోయారు" అని గొణుక్కుంటూ నేలమాళిగలో అటూయిటూ కలదిరుగుతోంది. నడవడం ఆమెకు కష్టంగా కానారంభించింది. నేలమాళిగలో చలిగా వుంది. ఆమె కాళ్ళు ఉబ్బుతున్నాయి, ఎండవెలుగూ, కదలికలూ తాజా గాలీ లేక మొత్తంమీద ఆమె మరింత బలహీనపడసాగింది. ఆమెకు సరిగా నిద్రపట్టడంలేదు, ఊపిరి సలపక ఆయాసం వస్తోంది. తన ఆరోగ్యం చెడుతోందనీ, నానాటికీ అది అధ్వాన్నమవుతుందనీ, అందుకని వెళ్లిపోవాలనీ ఆమె రహస్యంగా లోలోపలే నిశ్చయించుకుంది. రాత్రిపూటల్లో ఆమె — తన కోసం వ్యధచెంది కాక, మాతృహస్త రక్షణగాని, స్త్రీ సలహాగాని లేకుండా యీ పిల్ల ఒంటరికత్తె అయిపోతుందే అని — ఏడుస్తూ వుండేది.

తన మటుకు తనూ ప్రపంచంలో ఒంటరిగత్తె. ఆమె బిడ్డలు ముగ్గురూ చనిపోయారు. ఆమె భర్త డబ్బు సంపాదన కోసమని చెప్పి వెళ్లి మరి తిరిగి రాలేదు. ఇల్లు కాస్తా అప్పుల వాళ్ల పాలైంది. పస్తులకి భయపడి, క్రిస్తా అత్త బ్రెస్ట్ పట్టణానికి వచ్చింది. శుభ్రంచేసే పని చూసుకొని, రెడార్మీ వచ్చేదాకా ఎలాగో ఒక లాగ కాలం గడిపింది. ఈ రెడార్మీ — హుషారైన, ఉదారమైన, దయాపరమైన యీ రెడార్మీ — క్రిస్తా అత్తకి ఆమె జీవితంలో మొట్ట మొదటి సారిగా బ్రతకడానికి సరిపడే జీతంతో ఏటి పొడుగునా పని కల్పించింది. ఆమెకు మిత్రులనూ, ఉండేందుకు జాగానూ సమకూర్చింది.

"ఈ సైనికులు భగవంతుని బిడ్డలు" క్రిస్తా అత్త విలక్షణంగా ప్రశాంతంగా ఉన్న బ్రెస్ట్ బజారులో గంభీరంగా చెప్పింది. "అయ్యలారా, వాళ్లకోసం ప్రార్థించండి."

ఆమె మటుకు ఆమె ప్రార్థించడం మానేసి చాలా కాలమైంది. అయితే అందుకు కారణం ఆమెకు దేవుడంటే వున్న కసేగాని, దేవుడిపైన నమ్మకం నశించిపోవడం కాదు. తనను తన బిడ్డలనుంచీ, భర్తనుంచీ వంచితురాలిని చేసిన అన్యాయంపట్ల ఆమె ఆగ్రహం చెందింది, అందుకనే ఆమె దేవుడితో యిక ఎటువంటి సంబంధమూ పెట్టుకోరాదనుకుంది. తనకు మరీ అంత బాగా లేని యిప్పుడు సైతం — రెడార్మీ కోసం, ఈ యువ లెఫ్టినెంటు కోసం, తన సొంత యూదు దేవునిచేతనే అంత క్రూరంగా చూడబడిన ఈ యువతి కోసం ప్రార్థించాలని ఎంతగా ఉన్నా కూడా — ఆమె తన శక్తినంతా కూడగట్టుకుందేగాని జావకారి పోలేదు. ఈ ఆలోచనల్లోను, ఆంతరంగిక ఘర్షణలోను, దగ్గర పడుతున్న చావు నిరీక్షణ లోను ఆమె ఎంతగా మునిగిపోయిందంటే — ఆమె తన చుట్టూ వినిపిస్తున్న మాటలేమీ పట్టించుకోకుండా, అలవాటు క్రమాల ప్రకారం అవసరమైన పనులు చేసింది.

"అయితే వీళ్లో కొత్త రకం జర్మన్లంటారు?"

చలిమూలంగా సార్జెంట్ మేజరుయొక్క గాయపడిన కాలు ఓర్చుకోరానంతగా బాధ పెడుతోంది. అది బాగా వాచి, పోటుపెడుతోంది, కాని అతను దాన్ని గురించి ఎత్తనే లేదు. తన కండకి తగిలిన గాయం మానుపడుతుందనీ, దెబ్బ ఎముకకి తగల్లేదు కనుక గాయం దానంతట అదే పూడిపోతుందనీ అతను గాఢంగా విశ్వసించాడు.

"మరి వాళ్లు నన్నెందుకు తరమలేదు?" ప్లూజ్నికొవ్ పూర్వాపరాలు తర్కించడం మొదలుపెట్టాడు. "ఇంతకు ముందల్లా నన్ను తరుముతూండిన వాళ్లు యీ మారు నన్ను వెళ్లిపోనిచ్చారంటే అందుకు కారణమేమిటి?"

కొంచెం సేపు బడలిక తీర్చుకున్నాక, ఆశ్చర్యంగా మాయమైపోయిన వోల్కొవ్‌ను వెదికేందుకోసం అతను మళ్లీ పైకెళ్లాడు. అతను — దుమ్ముతోను, దుర్వాసనతోనూ ఉక్కిరి బిక్కిరవుతూ — కేకవేస్తూ, వింటూ — చుట్టూ పాకాడు. జవాబేం రాలేదు.

అతనికి జర్మన్లు తటస్థపడటమన్నది చాల ఆకస్మికంగా జరిగింది. వాళ్లు ప్రశాం

తంగా కబుర్లు చెప్పుకొంటూ మలుపు తిరిగివచ్చారు. వాళ్ల రైఫిళ్లు భుజాలకు వేలాడుతున్నాయి. అయితే వాటిని వాళ్లు చేతుల్లో పట్టుకొనివున్నా కూడా, ఫ్యూజ్నికొవే ముందుగా కాల్చియుండేవాడు. అతను తనను తాను తక్షణ ప్రతిచర్యకు అనువుగా తర్ఫీదు చేసుకున్నాడు, మరి యిప్పటి దాకా అది అతన్ని కాపాడుతూ వచ్చింది.

అతని సబ్‌మెషీన్ గన్ నిప్పులు కక్కింది, ఒక జర్మన్ నేలకూలాడు. తర్వాత ఒక తూటా గొట్టంలో యిరుక్కుపోయింది. అతను ఆదరాబాదరా సబ్‌మెషీన్ గన్ను లాక్‌ను గుంజాడు. ఆ రెండో జర్మన్ తనను అవలీలగా కాల్చియుండగలిగేవాడు, లేకపోతే కనీసం పారిపోగలిగేవాడు. కాని అందుకు భిన్నంగా అతను తన మోకాళ్లపై మోకరిల్లాడు. బిగుసుకుపోయిన తూటాను ఫ్యూజ్నికొవ్ బయటకి తీసుకునేదాకా నమ్రంగా వేచియున్నాడు.

సూర్యుడు అంతకు కొంచెం సేపటి క్రితమే అస్తమించాడు, కాని యింకా వెల్తురుగానే వుంది. ఈ జర్మన్లు ఏ కారణంగానో ఫిరంగి గుళ్ల తాకిడికి గుంటలూ గోతులూ పడిన మృత ఆవరణను విడిచి వెళ్లడంలో ఆలస్యంచేశారు. ఇప్పుడు వాళ్లలో ఒకడు కదల మెదలకుండా పడివున్నాడు, రెండో వాడు తలవంచి, నిశ్శబ్దంగా ఫ్యూజ్నికొవ్ ముందు మోకరిల్లివున్నాడు.

ఫ్యూజ్నికొవ్ కూడా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మోకరిల్లిన శత్రువును తను చంపలేనన్న సంగతి అతనికి తెలుసు. కాని, వెనక్కు తిరిగి శిథిలాల్లో మాయమైపోకుండా అతన్ని ఏదో నిలిపివుంచింది. వోల్కొవ్ అంతర్ధానంతో బాటు సమానంగా అతని మనస్సును వేధిస్తున్న — యిప్పుడిలా తన ముందు మోకరిల్లిన వాడి మాదిరిగా జర్మన్లు ఎందుకు మారారు? — అన్న ప్రశ్నే అతన్ని అలా నిలిపివుంచింది. జర్మన్లపై తన సొంత యుద్ధం యింకా పూర్తి కాలేదు, అందుకని, శత్రువును గురించి తెలుసుకోగలిగినదంతా తను తెలుసుకోవాలి. మరి దానికి సమాధానం — అంచనా, ఊహ కాక స్పష్టమైన, ఖచ్చితమైన సమాధానం — చావు కోసం ఎదురుచూస్తూ తన కళ్లెదుట వుంది.

"Komm"* తన గన్నుతో ఎక్కడికి రావాలో సూచిస్తూ అతను అన్నాడు.

దోవలో జర్మన్, చుట్టూ చూస్తూ ఏదేదో చెప్తూనే వున్నాడు. కాని ఫ్యూజ్నికొవ్‌కి జర్మన్ మాటలు గుర్తుచేసుకొనే వ్యవధి చిక్కలేదు. ఏ నిమిషాన అయినా జర్మన్ సైనికులు తనని తరుముకొంటూ రావచ్చుననీ, కాల్పులు సాగించవచ్చుననీ ఎదురుచూస్తూ అతను తన ఖైదీని తన బిలందగ్గరకి అడ్డ దోవన నడిపించుకెళ్లాడు. బెదురుబెదురుగా తన తలను పొరుల భుజాల మాదిరి యిరుకు భుజాలసందున వాల్చుకొని ఆ జర్మన్ పెద్ద పెద్ద అంగలేసుకొంటూ ముందు నడిచాడు.

---

* రా! (జర్మన్). — సం.

వాళ్ళు ఆవరణ దాటి, బిలంలో ప్రవేశించారు. మసకగా ఉన్న కేన్‌మేటులో ఆ జర్మనే ముందు ప్రవేశించాడు. అతను ఆగాడు, పొడుగాటి కొయ్య టేబిలుదగ్గర కూర్చొని వున్న గడ్డం బాగా పెరిగివున్న సార్జెంట్ మేజరునూ, యిద్దరు ఆడాళ్లనూ చూసి అకస్మాత్తుగా మూగబోయాడు. వాళ్లు కూడా — వంగిపోయి, చచ్చేటంత భయపడుతూ వున్న, యౌవన దశ బాగా దాటిపోయిన ఆ వ్యక్తివంక తేరిపారజూస్తూ — నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"సమాచారం సేకరించేందుకు వీలైన ఒక సైనికుడ్ని ఖైదీగా తీసుకొచ్చాను" ప్ల్యూజ్నికొవ్ మీరావంక బాల్యసహజమైన విజయ గర్వంతో చూస్తూ అన్నాడు. "ఇప్పుడిక మన చిక్కు ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి, స్తెపాన్ మత్వేయెవిచ్."

ఆ జర్మన్ మళ్లీ ఏడుపు స్వరంలో బడబడ ఏదో చెప్పడం మొదలెట్టాడు. కంపిస్తున్న తన చేతిని సార్జెంట్ మేజరువంకా, ప్ల్యూజ్నికొవ్‌వంకా చాచాడు.

"నాకు ఒక్క అక్షరం కూడా అర్థం కావడం లేదు" బిత్తరపోయి, ప్ల్యూజ్నికొవ్ అన్నాడు. "తుపాను మెయిల్లా మాట్లాడేస్తున్నాడు."

"ఇతనో కార్మికుడు" సార్జెంట్ మేజరు తర్కించాడు. "చూడండి, యితను తన అరిచేతులు చూపిస్తున్నాడు."

"Langsam" ప్ల్యూజ్నికొవ్ అన్నాడు. "Bitte, langsam."*

జర్మన్ పదబంధాలు గుర్తుచేసుకొనేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు, కాని చెదురుబదురు మాటలు మాత్రమే అతనికి గుర్తుకొచ్చాయి. ఆ జర్మన్ తొందరగా తలూపి, మెల్లగా, జాగ్రత్తగా కొద్ది వాక్యాలు పలికాడు, అంతలోనే వెక్కివెక్కి ఏడుస్తూ మళ్లీ జోరుగా మాట్లాడనారంభించాడు.

"ఇతను భయపడిపోయాడు" క్రిస్తా అత్త అంది. "ఇతను వణికిపోతున్నాడు."

"తను సైనికుణ్ణి కాదంటున్నాడితను" మీరా అకస్మాత్తుగా అంది. "ఇతను కాపలావాడట."

"నీకు జర్మనొచ్చా?" స్తెపాన్ మత్వేయెవిచ్ అబ్బురపడ్డాడు.

"కొద్దిగా."

"సైనికుణ్ణి కాను అనడంలో యితని ఉద్దేశమేమిటట?" ప్ల్యూజ్నికొవ్ చిరాకు వ్యక్తంచేశాడు. "మరైతే, యితను మన దుర్గంలో ఏం చేస్తున్నట్టు?"

"Nicht Soldat!" ఆ జర్మన్ బిగ్గరగా చెప్పాడు. "Nicht Soldat! Nicht Wehrmacht!"**

---

* మెల్లగా చెప్పండి (జర్మన్). — సం.

** సైనికుణ్ణి కాను! నేను సైన్యానికి చెందినవాణ్ణి కాను! (జర్మన్). — సం.

''విడ్డూరంగా వుందే'' సార్జెంట్ మేజరు దిగ్భ్రాంతి చెంది, అన్నాడు. ''ఒక వేళ యితను ఖైదీలను కాపలా కాస్తున్నాడేమో?''

మీరా ఆ ప్రశ్నను జర్మన్లోకి అనువదించింది. ఆ జర్మన్ తలూపుతూ విని, ఆమె ఆగగానే మళ్లీ జోరుగా మాట్లాడనారంభించాడు.

''ఖైదీలను కాపలా కాసేందుకు యితరులున్నారు.'' ఆమె ఓ మాదిరి అనిశ్చితంగా చెప్పింది. ''వీళ్లు దుర్గంలోకి వచ్చే మార్గాలనూ, బయటకి వెళ్లే మార్గాలనూ కావలి కాయాలి. ఇతను అసలైన జర్మను. దుర్గాన్ని ముట్టడించి దాడి చేసినది 45వ డివిజన్కి చెందిన ఆస్ట్రియన్లు – ఫ్యూరర్ స్వదేశీయులు. ఇతనొక కార్మికుడు, ఏప్రిల్లో సైనిక కొలువులో చేర్చుకోబడ్డాడు.''

''నే చెప్పలేదూ యితను కార్మికుడని'' సార్జెంటు సంతృప్తిగా అన్నాడు.

''వీడొక కార్మికుడూ, శ్రామికుడూ అయితే, యితను మనకెలా వ్యతిరేకి కాగలడు –'' ప్ల్యాజ్నికొవ్ వాక్యాన్ని మధ్యలోనే ఆపుచేశాడు. ''సరే, యీ సంగతి అతన్ని అడగక్కర్లేదులే. దుర్గంలో పోరాటదళాలున్నాయో, లేక అవన్నీ ఉపసంహరింపబడ్డాయో అడుగు.''

''జర్మన్ భాషలో 'పోరాటదళాలు' అంటే ఏమిటి?''

''నాకు తెలియదు. పోన్లే, పట్టినే సైనికులున్నారా అని అడుగు.''

నెమ్మదిగా, మాటలు వెతుక్కుంటూ మీరా అనువదించింది. తలవంచి జర్మన్ శ్రద్ధగా విన్నాడు. ఒకటి రెండు సార్లు అతనేదో – అతనికి అర్థం కాని చోట – అడిగాడు, తర్వాత మళ్లీ క్రమంగా జోరుగా మాట్లాడాడు, మధ్యమధ్య తన రొమ్మువంక వేలితో చూపుతూ, మధ్యమధ్య ''టా – టా – టా!'' అంటూ అనుకరించాడు.

''దుర్గంలో యింకా నిజమైన సైనికులున్నారు – శాపర్లు, సబ్మెషీన్ గన్నర్లు, అగ్గిబరాటాలు విసిరేవాళ్లు. రష్యన్లు కనిపించినప్పుడల్లా వాళ్లని పిలుస్తూ వుంటారు – అదీ ఆజ్ఞ. కాని తను మటుకు సైనికుడు కాదు, ఇతను కాపలా డ్యూటీలో వున్నాట్ట. ఇతనెన్నడూ ఎవరిపైనా కాల్పులు జరపలేదట.''

ఆ జర్మన్ తన చేతులూపుతూ మళ్లీ యేదో బడబడా మాట్లాడాడు. తర్వాత అకస్మాత్తుగా క్రిస్తా అత్తవంక గంభీరంగా తన వ్రేలిని ఊపి, తాపీగా, హుందాగా తన సైనిక కోటులోని లోపలి పొరలోంచి నల్లని ఒక రబ్బరు డబ్బీని బయటకి తీశాడు. ఆ డబ్బీలోంచి అతను నాలుగు ఫొటోలు తీసి, వాటిని టేబిలుమీద పెట్టాడు.

''పిల్లలు'' క్రిస్తా అత్త నిట్టూర్చింది. ''మనకితను తన పిల్లల్ని చూపిస్తున్నాడ్రా.''

''Kinder!'' ఆ జర్మన్ బిగ్గరగా అన్నాడు. ''Meine Kinder! Drei!''*

---

* బిడ్డలు! నా బిడ్డలు! ముగ్గురు! (జర్మన్). – సం.

అలా అని, అతను సగర్వంగా బొటనవ్రేలిని సన్నగా, కంటికి సదరుగా లేని — తన రొమ్ముకి తాటించాడు. అతని చేతులు యిప్పుడిక ఎంత మాత్రం కంపించడం లేదు.

మీర్రా, క్రిస్తా అత్తా జాలితో కూడిన స్త్రీజన సహజమైన ఆసక్తితో ఖైదీని అవీ యివీ వివరాలడుగుతూ, ఆ ఫొటోలవంక చూశారు. పిల్లల్ని గురించీ, వాళ్ల తలకట్టులను గురించీ, ఆరోగ్యాలను గురించీ, స్కూలు మార్కులను గురించీ, జలుబులను గురించీ, మధ్యాహ్న భోజనాలను గురించీ, కోట్లను గురించీ ఏవేవో ప్రశ్నలడిగారు. ఈ యిష్టాగోష్టి ముగిశాక, తరువాయి ఏమిటా అని ఆలోచిస్తూ, మగాళ్లిద్దరూ ఓ పక్కన కూర్చున్నారు.

ఓ పక్కకి చూస్తూ సార్జెంట్ మేజరు అన్నాడు, "మీరు ఆ పని చెయ్యక తప్పదు కామ్రేడ్ లెఫ్టినెంట్, నా యీ కాలితో నాకది కష్టం. ఇతన్ని విడిచిపెట్టడం చాలా ప్రమాదకరం. ఇతనికి యిక్కడికొచ్చే దోవ తెలుసు."

ఫ్లాజ్నికొవ్ తలూపాడు. అతని హృదయం భారంగా ఉంది, బాధతో అది దారుణంగా మూలుగుతోంది. ఈ జర్మన్‌ని — తన సబ్‌మెషీన్ గన్ను బాగుపడిన వెంటనే — తను ఎందుకు కాల్చెయ్యలేదా అని, అతనిప్పుడు మొట్టమొదటిసారిగా ఎంతగానో పశ్చాత్తాపపడ్డాడు. రాబోయే ఘటనకు సంబంధించిన ఆలోచనతో అతనికి తను శారీరకంగా అస్వస్థుడైనట్లు అనిపించింది. మరణశిక్ష అమలు జరిపేవానిగా యిప్పటికీ అతనికి నేర్పు అబ్బలేదు.

"నేనే యీ పని చెయ్యలేకపోయినందుకు విచారిస్తున్నాను." సార్జెంట్ మేజరు క్షమాపణ పూర్వకంగా అన్నాడు. "నా కాలు — నీకు తెలుసు కదా."

"ఔనౌను" ఫ్లాజ్నికొవ్ చాలా హడావిడిగానే అడ్డొచ్చాడు. "నా తూటా బిగుసుకుపోయింది."

అతను మధ్యలో చటుక్కున ఆగి, లేచి నిలబడి, తన సబ్‌మెషీన్ గన్నుని చేతిలోకి తీసుకున్నాడు.

"Komm!"

ఆ అస్పష్ట కాంతిలో సైతం ఆ జర్మన్ ముఖం కళదక్కి వివర్ణమైపోవడం కనిపించింది. అతను మరింత వంగిపోయి, కంపిస్తున్న వ్రేళ్లతో ఫొటోలు పోగుచేసేందుకు ప్రయత్నించాడు, కాని అవి అతని ఆజ్ఞను అమలుజరపడంలేదు.

"Vorwärts!"* ఫ్లాజ్నికొవ్ తన సబ్‌మెషీన్ గన్నుని కాక్ చేసి, బిగ్గరగా అరిచాడు.

తన సంకల్పం ఏ క్షణాన అయినా సడలిపోవచ్చునని అతను భయపడ్డాడు. కంపిస్తూ బిగిసిపోతున్న ఆ చేతులవంక అతనింకెంత మాత్రం చూడలేకపోయాడు.

---

* ముందుకు! (జర్మన్). — సం.

"Vorwärts!"

తూలుతూ, ఆ జర్మన్ క్షణకాలం టేబిలుదగ్గర నిలబడ్డాడు, తర్వాత నెమ్మదిగా నిర్గమన మార్గం దగ్గరకు వెళ్లాడు.

"ఇదిగో నీ ఫొటోలు మర్చిపోయావు!" క్రిస్తో అత్త హడావిడి చేసింది. "ఒక్క క్షణం ఆగు!"

ఆ జర్మన్ — కళ్లు నిస్తేజంగా నిలిచిపోగా — తూలుతూ నిలబడ్డాడు. క్రిస్తో అత్త వాచిన కాళ్ల మూలంగా ఓ పక్కకి వంగి నడుస్తూ, చటుక్కున అతన్ని చేరుకుని, ఆ ఫొటోలను తనే అతని జేబులోకి నెట్టింది.

"Komm!" అంటూ ప్ల్యాజ్నికొవ్ ఖైదీని తన గన్ను గొట్టంతో ముందుకు నెట్టాడు.

తర్వాత జరగబోయే దేమిటో వాళ్లిద్దరికీ తెలుసు. ఆ జర్మన్ కాళ్లీడ్చుకొంటూ ముందుకెళ్లాడు. కంపిస్తున్న అతని వేళ్లు తన సైనిక కోటు అంచులను మెలిపెడుతున్నాయి. అతని వీపు చెమర్చనారంభించింది. ఒక నల్లని మచ్చ అతని సైనిక కోటుపైన పెద్దది కాసాగింది. ఆ మృత్యు ఘర్మజలపు దుర్వాసన అతని వెనుకనే వస్తోంది.

కాని ప్ల్యాజ్నికొవ్ అతన్ని చంపాల్సివుంది. అతన్ని బయటకి తరమడం, తర్వాత నేరుగా చెమటలు కారుతూ వంగిపోయిన, — ముగ్గురు బిడ్డలకు ఆశ్రయమిచ్చిన — అతని వీపుపైన నేరుగా దగ్గర్నుంచి కాల్చడం. ఈ జర్మన్ ఎన్నడూ యుద్ధం చెయ్యాలని కోరుకోలేదన్న విషయం స్పష్టం. తనకు యిష్టముండి యితను యీ భయంకరమైన — పొగ, మసి, కుళ్లుతున్న మానవ కళేబరాల కంపు కొట్టేస్తున్న — శిథిలాల్లోకి రాలేదు. ఎంత మాత్రం అతనలా కోరుకొని రాలేదు, ప్ల్యాజ్నికొవ్‌కి ఆ విషయం బాగా తెలుసు. తెలిసి కూడా అతను ఆ జర్మన్‌ని నిర్దాక్షిణ్యంగా ముందుకి తరుముతున్నాడు.

"Schnell! Schnell!"*

వెనక్కి తిరక్కుండానే, తన అవిటికాలును యీడ్చుకొంటూ — మీర్రా తన వెంట వస్తోందని అతను గ్రహించాడు. తను నిర్వర్తించాల్సిన విధిని తను నిర్వర్తించినప్పుడు, ఒంటరిగా మనఃక్లేశాన్ని తట్టుకోవడం తనకు కష్టసాధ్యమవుతుందన్న ఆలోచనతో ఆమె వస్తోంది. తనా పని పైన పూర్తిచేసి తర్వాత తిరిగి వస్తాడు, అప్పుడు యీ చీకట్లో తాము కలుసుకుంటారు. చీకట్లో కలుసుకోవడం మంచిదే, తను ఆమె కళ్లలోకి చూడనక్కర్లేదు. ఆమె వట్టినే తనకేదో — తన మనస్సును తేలిక పరిచేందుకేదో — చెప్తుంది.

"పద!"

---

* తొందరగా (జర్మన్).—సం.

జర్మన్ ఆ కంత గుండా బయటికెళ్లలేకపోయాడు. చచ్చుపడిన అతని చేతులు యిటుకలను పట్టుకోలేకపోయాయి. దానితో అతను రొప్పుతూ, వెక్కివెక్కి ఏడుస్తూ ఫ్లాజ్నికొవ్ మీదకి పడిపోయాడు. అతను కంపుకొట్టేస్తున్నాడు. దుర్వాసనకు యిప్పటికి బాగా అలవాటుపడిపోయిన ఫ్లాజ్నికొవ్‌కి సైతం ఆ కంపును — యింకా బ్రతికే వున్న వాడిలో మృత్యు వాసనను — భరించడం కష్టసాధ్యమైపోయింది.

''పద!''

ఫ్లాజ్నికొవ్ అతన్నెలాగో బయటకి నెట్టాడు. ఆ జర్మన్ ఒక్క అడుగేశాడు, అతని కాళ్లు మెలికబడి, మోకాళ్లపైన కూలబడ్డాడు. ఫ్లాజ్నికొవ్ తన గన్నుతో అతన్ని ముందుకి గెంటాడు. ఆ జర్మన్ మెత్తగా ఓ పక్కకి పడి మోకాళ్లు రెండూ దగ్గరకు జేర్చి పడుకొని వుండిపోయాడు.

మీర్రా ఆ కంతగుండా అస్పష్టంగా కానవస్తున్న ఆకాశం వంక చూస్తూ, భయాతిరేకంతో ఆ కాల్పుకోసం నిరీక్షిస్తూ వుండిపోయింది. కాని ఆ కాల్పు ఎంత సేపటికీ వినిపించనేలేదు.

సరసర ధ్వని అయిన మీదట ఫ్లాజ్నికొవ్ లోపలకి దూకాడు. ఆమె తన ప్రక్కనే ఉన్నట్లు అతనికి వెన్వెంటనే అనుభూతమైంది.

''నేను పనిగట్టుకొని అనుద్వేగంగా మనిషిని చంపలేను.''

చల్లని హస్తాలు అతని తలను పొదువుకొని దగ్గరకు లాక్కున్నాయి. ఆమె బుగ్గ తన బుగ్గను తాకినట్లు అతను గ్రహించాడు. అది కన్నీట నాని తడిగా వుంది.

''మనకిదంతా ఎందుకు జరిగింది? దేనికోసం? మనం ఏం చేశాం? ఏ చెడ్డ పని చేసేందుకూ మనకెన్నడూ వ్యవధి లేదే?''

తన ముఖాన్ని అతనికి ఆన్చి ఆమె విలపించింది. ఫ్లాజ్నికొవ్ సన్నని ఆమె భుజాలను అడ్డదిడ్డంగా నిమిరాడు.

''ఏడవకు, ఏడవకు చెల్లీ — ఎందుకిదంతా?''

''నేను భయపడ్డాను. నువ్వా ముసిలాడ్ని కాల్చేస్తావని నేను భయపడ్డాను.'' ఆమె తన చేతులతో అతన్ని పొదువుకొని వెంటవెంటనే అనేక సార్లు ముద్దుపెట్టుకుంది. ''థాంక్ యూ, థాంక్ యూ, థాంక్ యూ. వాళ్లకీ సంగతి చెప్పకు, ఈ రహస్యాన్ని మనిద్దరి మధ్యనే ఉండిపోనివ్వు. నాకోసమే అన్నట్టు, ఏం?''

నీకోసమే యీ పని చేశానని అతనామెకు చెప్పాలనుకున్నాడు, కాని వెనకతీశాడు, నిజానికి తనీ పని చేసినది తనకోసం కావడమే అందుకు కారణం. ఏది ఏమైనా సరే ననుకొని, తన అంతరాత్మను పరిశుద్ధంగా ఉంచుకోవాలని కోరుకున్నందుననే అతనిలా చేశాడు.

''వాళ్లు అడగరులే.''

నిజమే, వాళ్ళు అడగనే లేదు. ఈ సాయంత్రానికి ముందెలా జరిగాయో యిప్పుడూ అన్నీ అలాగే జరుగుతున్నాయి. టేబిలు చుట్టూ మరింత స్థలమున్నా కూడా, యింతకు ముందు మాదిరిగానే అందరూ ఎవరి మూలలో వారు నిద్రించారు. ఆ పిల్లతో బాటు క్రిస్తా అత్త ఒక మూల, సార్జెంట్ మేజరు బల్ల చెక్కలమీద, ప్లూజ్నికొవ్ బెంచి మీద.

క్రిస్తా అత్తకి ఆ రాత్రి కూడా నిద్ర పట్టలేదు. సార్జెంట్ మేజరు తన నిద్రలో మూలగడం ఆమె వింది, యువ లెఫ్టినెంటు నిద్రలో పళ్ళు నూరడం వింది, ఎలుకలు చీకట్లో పరుగులెత్తడం, కీచుకీచుమనడం వింది, మీర్రా ప్రశాంతంగా ఊపిరి తీసుకోవడం వింది. కన్నీళ్ళు ఆమె బుగ్గలమీదుగా సంతత ధారాపాతంగా కారుతున్నాయి. తన ఎడమ చెయ్యి విపరీతంగా బాధపెడుతూ తన ఆజ్ఞ పాలించనందునా, తన కుడిచెయ్యి నిద్రిస్తున్న బాలిక చుట్టూ వున్నందునా, ఆమె తన ఆ కన్నీటి ధారను తుడిచేసుకోలేకపోయింది. దానితో కన్నీళ్ళు ఆమె బుగ్గల వెంట కిందకి కారి, బొంతలా వున్న పాత కోటును తడిపేస్తున్నాయి.

ఆమె కాళ్ళు, ఆమె చేతులు, ఆమె వీపు, అన్నీ బాధపెడుతున్నాయి, కాని ఆమె హృదయం అన్నిటికంటె ఎక్కువ బాధపెడుతోంది. క్రిస్తా అత్త తను త్వరలోనే చనిపోవాల్సి వుంటుందని — కానైతే పైన నేలమీద సూర్యకాంతిలో చనిపోవాలని అనుకుంది. సూర్య కాంతిలోనే యీ పని కావాలి, తను వెచ్చబడాలని ఆమె ఎంతగానో తపిస్తోంది. సూర్యుణ్ణి చూడగలిగేందుకు, తన శరీరంలో యింకా శక్తి మిగిలి వుండగానే, తను యితరుల సాయంలేకుండా ఒంటరిగా పైకి వెళ్ళగలిగినప్పుడే వెళ్ళాలి. అందుకని ఆమె, తనకా శక్తి యింకా వుందా లేదా అన్న విషయాన్ని మరుసటి రోజున తప్పక పరీక్షించుకోవాలనుకుంది, సమయం మించిపోక ముందే తను బయటకు వెళ్ళేందుకు అది సముచిత సమయం అవునో కాదో చూడాలనుకుంది.

ఆ ఆలోచనతో ఆమె నిద్రపోయింది, నిద్రలో మునిగిపోయేందుకు ముందు ఆ పిల్ల తలను — ఎన్నో రాత్రులుగా తన దండపైన ఆనుకు నిద్రపోయిన తలను — ముద్దు పెట్టుకుంది. ప్రొద్దుటే ఆమె లేచింది, నాస్తా కోసం ఆగకుండా నేలమాళిగ మార్గానికి దోవతీసే కంతగుండా ముందుకెళ్ళింది. అక్కడొక కాగడా వెలుగుతోంది, లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్ ఒళ్ళు కడుక్కుంటున్నాడు — అదృష్టవశాత్తూ యిప్పుడు కావలసినంత నీరుంది. మీర్రా అతని చేతులపైన నీళ్ళు పోస్తోంది. ఆమె ఆగిఆగి కొంచెం కొంచెం నీళ్ళు పోస్తోంది, కాని అతను అడిగిన చోట పొయ్యడం లేదు. ప్లూజ్నికొవ్ చిర్రుబుర్రుమంటున్నాడు, ఆమె నవ్వుతోంది.

''ఎక్కడికెళ్తున్నారు, క్రిస్తా అత్తా?''

''కంత దగ్గరకి, కంత దగ్గరకి'' ఆమె తొందరగా అంది. ''నేను కొంచెం తాజాగాలి పీల్చుకోవాలి.''

''నేను రానా మీతో?''

''అబ్బే, అక్కర్లేదు. నీ లెఫ్టినెంట్‌కి నీళ్లు పొయ్యి.''

''చంటిపిల్లలాగ ఆటలు పట్టిస్తోందత్తా!'' ప్ల్యూజ్నికోవ్ ఉక్రోషంగా అన్నాడు.

వాళ్లిద్దరూ మళ్లీ నవ్వారు. క్రిస్తా అత్త గోడ పట్టుకుని వాచిన పాదాలను క్రింద జాగ్రత్తగా ఆనుస్తూ కంత దగ్గరకి వెళ్లింది. కాని తను ఒంటరిగా నడుస్తోంది, తనకింకా ఆ శక్తి వున్నందుకు ఆమె సంతోషించింది.

బహుశా నేనీ రోజే వెళ్లక్కర్లేదేమో, బహుశా ఇంకొకటి రెండు రోజులు ఆగవచ్చునేమో, యింకొంచెం కాలం బతకవచ్చునేమో, అనుకుందామె.

క్రిస్తా అత్త తిన్నగా కంత దగ్గరే వుంది, అయినా శబ్దాన్ని విన్నది ఆమె కాదు, ప్ల్యూజ్నికోవ్ విన్నాడు. అగ్రాహ్యమైన శబ్దాలేవో అతనికి వినిపించాయి, చెవులు రిక్కించి విన్నాడు. అవేమిటో తెలియకుండానే ఆ పిల్లను బిలం గుండా లోపలకి నెట్టాడు.

''తొందరగా!''

మీర్రా మారు మాట్లాడకుండా, కేస్‌మేటులోకి పరుగెత్తింది. అతని ఆజ్ఞను శిరసావహించడానికి ఆమె అలవాటు పడింది. ఆ అపరిచిత శబ్దాలను ఉద్వేగంతో వింటున్న ప్ల్యూజ్నికోవ్‌కి, ''వెనక్కొచ్చెయ్యండి క్రిస్తా అత్తా!'' అని పిలిచేందుకు మాత్రమే వ్యవధి చిక్కింది.

అంతలో కంతగుండా మంద్రగంభీరమైన హోరు వినవచ్చింది. దారుణమైన వేడి గాడ్పొకటి అతని రొమ్మును తాకింది. అతను ఉక్కిరిబిక్కిరయ్యాడు, కిందపడ్డాడు, బాధగా నోరు బార్లా తెరిచి గాలి పీల్చుకునేందుకు ప్రయత్నించాడు. చేతులతో తడిమి, ఓ బిలంగుండా లోపలకి పోగలిగాడు. ఆ అగ్గిబరాటా కళ్లు మిరుమిట్లు గొలిపేటంత తెల్లగా వుంది, భయంకరమైన సుడితుపాను మాదిరిగా లోనికి ప్రవేశించిన ఆ అగ్గిబరాటా క్షణకాలం యిటుక కమాన్లను, అటూయిటూ పరుగెత్తే ఎలుకలను, దుమ్ముకొట్టుకొని, యిటుకలు చెల్లాచెదరుగా పడివున్న నేలను, చేష్టలుడిగిన క్రిస్తా అత్త రూపాన్నీ జాజ్వల్యమైన కాంతిలో ముంచెత్తింది. ఆటుతర్వాత భయంకరమైన, అమానుషమైన కేక వినిపించింది, నిలువునా మండుతున్న కాగడా మాదిరిగా క్రిస్తా అత్త నడవలో పరుగెత్తింది. మనిషి మాంసం కాలుతున్న గబ్బు కొట్టింది, అయినా క్రిస్తా అత్త సాయంకోసం అరుస్తూ పరుగెత్తింది. అగ్గిబరాటానుంచి వచ్చిన వెయ్యి డిగ్రీల వేడిలో వేగిపోతూ ఆమె పరుగెత్తింది. తర్వాత ఆమె ఆ వేడికి కరిగిపోయినట్లుగా కుప్పకూలిపోయింది. పైకప్పునుంచి యిటుకలు కరిగి రక్తపు బొట్ల మాదిరిగా చిట్లం కారే చిటపట శబ్దం తప్ప నిశ్శబ్దం ఆవరించుకుంది.

ఆ కాలుడు వాసన కేస్‌మేటుదాకా వచ్చింది. స్తెపాన్ మత్వేయెవిచ్ ఆ బిలాన్ని యిటుకలతో మూసేసి, యిటుకల మధ్య సందులను బొంతలాంటి పాత కోటు పీలికలు కూరాడు. అయినా ఆ దుర్వాసన — వేగిన మనిషి మాంసపు గబ్బు — ఆగలేదు.

మీ్రా శోకన్నాలు పెట్టింది, యిక ఏడ్చేందుకు శక్తి లేనంత దాకా ఏడ్చింది, అప్పుడిక ఆమె తన మూలలో మౌనంగా ఒదిగిపోయింది. మధ్యమధ్య ఆమె ఒళ్ళు మళ్ళీ కంపించనారంభించేది. అప్పుడామె లేచి, మగవాళ్ళకి దూరంగా అటూయిటూ తిరిగేది. వాళ్ళకి ఆమె దూరమైపోయినట్లు — వారికేదో అదృశ్యావరోధం వెనుక ఎక్కడో ఉన్నట్లు — కనిపించింది. బహుశా అటువంటి అదృశ్యావరోధం యింతకు ముందు కూడా ఉండేదేమో, కాని అప్పుడు యిరు పక్షాల మధ్యా — ఆమె పక్షానికీ మగవాళ్ల పక్షానికీ మధ్య — ఒక కొలికి — క్రిస్తా అత్త — వుండేది. రాత్రిపూట ఆమెకు వెచ్చదనాన్నిచ్చినది క్రిస్తా అత్త, టేబిలు దగ్గర ఆమెచేత తిండి తినిపించినది క్రిస్తా అత్త. క్రిస్తా అత్త అసంతృప్తిగా గొణుగుతూ, దేన్ని గురించీ, చివరకు ఎలుకలను గురించి సైతం, భయపడకుండా ఉండటం ఆమెకు నేర్పింది, రాత్రిపూట ఎలుకలను ఆమెనుంచి దూరంగా తరిమింది, దానితో మీ్రా ప్రశాంతంగా నిద్రపోయేది. ప్రొద్దుట ఆమె దుస్తులు ధరించేందుకూ, బ్రేస్ బిగించుకొనేందుకూ, ఒళ్ళు కడుక్కునేందుకూ, శరీర పోషణ చూసుకొనేందుకూ క్రిస్తా అత్త ఆమెకు సాయపడేది. ఈ పనులు చెయ్యాల్సిన అవసరమున్నప్పుడు క్రిస్తా అత్త మగాళ్లని అక్కణ్ణుంచి నిర్దాక్షిణ్యంగా బయటకి తరిమేది. అలా దయాళువైన, మంచితనం మూర్తీభవించిన ఆమె సంరక్షణలో మీ్రా ఎటువంటి యిబ్బందీ లేకుండా యిన్నాళ్లూ బ్రతికింది.

ఇప్పుడా అండ కాస్తా పోయింది. ఇప్పుడు మీ్రా ఒంటరిది, మొట్టమొదటి సారిగా యిప్పుడామెకు మగాళ్లకూ తనకూ మధ్య వున్న అదృశ్యావరోధం అనుభూతమైంది. ఇప్పుడు తను నిస్సహాయురాలు, తన ఆ శారీరక నిస్సహాయతను గూర్చిన భయంకరమైన గ్రహింపు బలహీనమైన ఆమె భుజాలను క్రుంగదీసింది.

''వాళ్లు మనని కనిపెట్టేసినట్టుంది'' స్తెపాన్ మత్వేయెవిచ్ నిట్టూర్చాడు. ''మనం ఎంత జాగ్రత్తగా వున్నా కూడాను.''

''ఇంతకీ తప్పు నాది!'' ఫ్యాల్జిన్కొవ్ తటాలున లేచి కేస్‌మేటులో అటూయిటూ వేగంగా పచార్లు చెయ్యనారంభించాడు. ''నాది, నాది మాత్రమే, నిన్న నేను —''

తను దాదాపు మీ్రామీద పడబోవడంతో చటుక్కున అతను మధ్యలో ఆగిపోయాడు. ఆమె అతనివంక చూడనే లేదు. ఆమె తన ఆలోచనల్లో తాను గాఢంగా మునిగిపోయివుంది. తనకు సంబంధించినంతవరకు తన చుట్టూ అస్తిత్వంలో ఏమీ లేనట్టే వుందామె. కాని ఫ్యాల్జిన్కొవ్‌కి సంబంధించినంతవరకు ఆమె సాకారమూర్తి, నిన్నటి ఆమె కృతజ్ఞతాభావం, యీ క్షణాన క్రిస్తా అత్త చితాభస్మం పడివున్న స్థానంలోనే ఆమె ఒక రోజున ''కోల్యా!'' అని పిలుస్తూ ఆత్మహత్యా ప్రయత్నంనుంచి తనను కాపాడటం — యివన్నీ వున్నాయి. వాళ్లమధ్య యిప్పుడొక ఉమ్మడి రహస్యం, ఆమె గుసగుసలు, తన బుగ్గమీద తనకు అనుభూతమైన ఆమె సన్నని ఊర్పు — యిన్ని ఉన్నాయి. అందుకనే అతను ఆ జర్మన్‌ని — యీ ఉదయం అగ్గి

బరాటాలు ప్రయోగించేవాడిని వెంట వుండి తీసుకొచ్చిన ఆ జర్మన్‌ని — చంపకుండా విడిచిపెట్టేసిన సంగతి చెప్పలేదు. ఒకవేళ చెప్పినా కూడా పరిస్థితి ఏమీ మారేదీ లేదు.

"అయినా అది నీ తప్పెందుకైంది, లెఫ్టినెంట్?"

ఈ క్షణం దాకా స్తెపాన్ మత్వేయెవిచ్ ప్ల్యూజ్నికొవ్‌ని — యీ పరిస్థితిని బట్టీ, తన పెద్ద వయస్సుని బట్టీ అటువంటి సాయిలాపాయిలా సంబోధన సహజమైనదే అయినా కూడా "నువ్వు" అంటూ సంబోధించలేదు. అతనెన్నడూ కూడా ప్ల్యూజ్నికొవ్ కమాండరు హోదాను విస్మరించలేదు. అతనెప్పుడూ కూడా సైనిక నిబంధనల ప్రకారమే సంబోధిస్తూ వచ్చాడు. కాని యీ రోజున అటువంటి నిబంధనలు తొలగిపోయాయి. ఇప్పుడిక్కడ వున్న దల్లా యిద్దరు యువజనులూ, అలసిపోయి, కాలు కుళ్లిపోతున్న ఒక వయోజనుడూ మాత్రమే.

"నీ తప్పన్నావెందుకని?"

"ఎందుకా, నేనిక్కడికొచ్చాను, ముప్పతిప్పలు మొదలయ్యాయి. క్రిస్తా అత్త, వోల్కొవ్, చివరికి — ఆ పెంట వెధవ. వీళ్లందరూ నా మూలంగానే పోయారు. నేను రాకముందు మీరిక్కడ శాంతంగా జీవించారు."

"ఎలకలు కూడా శాంతియుతంగా బతుకుతాయి. మన యీ ప్రశాంత స్థావరంలో అవెలా దుక్కల్లా బలిశాయో చూడు. తప్పెవరిదో నిర్ధారణ చెయ్యడంలో నువ్వు ఘోరంగా పప్పులో కాలేశావు, లెఫ్టినెంట్. ఇప్పుడు నా సంగతే తీసుకో, నేను నీకు కృతజ్ఞుణ్ణి. నీ మూలంగా కాకపోతే నేను జన్మలో ఒక్కగానొక్క జర్మన్‌ని కూడా చంపివుండేవాడిని కాను. కాని, జరిగిందేమిటి, నేనొకణ్ణి చంపాను. ఔనంటావా, కాదంటావా? అదే అక్కడ, ఆ ఖోమ్‌స్క్ గేటు దగ్గర."

నిజానికి, ఖోమ్‌స్క్ గేటు దగ్గర అతనెవళ్లనీ చంపలేదు, అతను కాల్చిన ఒకే ఒక్క కాల్పు దీర్ఘంగా సాగి, గురి తప్పి, బుల్లెట్లన్నీ ఆకాశంలోకి పోయాయి. కాని తను చంపి నట్లు విశ్వసించాలని అతను గాఢంగా వాంఛించాడు, అందుకనే ప్ల్యూజ్నికొవ్ అది నిజమేనని ధృవీకరించాడు.

"మీరు యిద్దర్ని కాల్చారనుకుంటాను."

"ఇద్దరి మాటేమో నాకు తెలియదుగాని, ఒకడు పడిపోయిన సంగతి నాకు తెలుసు. అది మాత్రం నిక్కచ్చే. వాడి విషయంలో, నేను నీకు కృతజ్ఞుణ్ణి, లెఫ్టినెంట్. అంటే, నేను కూడా జర్మన్లని చంపగలనన్న మాట, నేనిక్కడ నా సమయాన్ని వృధాచెయ్యడం లేదన్నమాట."

ఆ రోజున వాళ్లు కేస్‌మేట్‌లోనే ఉండిపోయారు — జర్మన్లంటే భయంకొద్దీ కాదు — భూగర్భంలోకి వచ్చి ప్రమాదాలు ఎదుర్కొనే సాహసం జర్మన్లకి లేదు — అగ్గి

బరాటా విసిరినమూలంగా అక్కడ వదిలినదాన్ని అంత త్వరగా తాము చూడగలుగుతామని వాళ్ళు అనుకోలేదు.

''మనం రేపు వెళ్దాం'' సార్జెంట్ మేజరు అన్నాడు. ''నా ఒంట్లో యింకా శక్తి వుంది. హెయ్ క్రిస్తా, ఆ కంత దగ్గరకి వెళ్ళేముందు నువ్వింకొంచెం ఆగి వుంటేనా.... అయితే వాళ్ళు తెరెస్పోల్ గేటు గుండా వచ్చారని కదూ నువ్వు చెప్పావు?''

''ఔను, దాని గుండానే. ఏం, ఎందుకు?''

''అబ్బే ఏం లేదు, ఊరికే అడిగానంతే.''

అతను మీరా వంక చూస్తూ కొంచెం సేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అతను ఆమె దగ్గరకెళ్ళి, ఆమె చెయ్యి పుచ్చుకొని బెంచి దగ్గరకి తీసుకొచ్చాడు.

''కూర్చో.''

మీరా వినయంగా కూర్చుంది. రోజంతా ఆమె క్రిస్తా అత్తను గురించీ, తన నిస్సహాయతను గురించీ ఆలోచిస్తూ వుందేమో తన ఆలోచనలతో ఆమె అలసిపోయింది.

''నువ్వీ రోజున నాదగ్గర పడుకో.''

మీరా ఉలిక్కిపడి తటాలున లేచింది.

''ఎందుకు?''

''నువ్వు భయపడకమ్మాయ్'' అతను గంభీరంగా అన్నాడు. ''నేను ముసిలాణ్ణి. ముసిలాణ్ణీ, జబ్బుమనిషినీ. నేనెలాగూ రాత్రిపూట నిద్రపోను. అందుకని క్రిస్తా అత్త లాగ నేను ఎలకలు నీదగ్గరకు రాకుండా కాపలాకాస్తాను.''

మీరా తన తల వాల్చింది. అతనివంక తిరిగి తన తలను అతని భుజంపై ఆన్చింది. సార్జెంట్ మేజరు తన చేతిని ఆమె చుట్టూ వేసి తన స్వరాన్ని తగ్గించి అన్నాడు.

''లెఫ్టినెంట్ నిద్రపోయాక మనం కొన్ని విషయాలు చర్చించాలి. త్వరలోనే నువ్వు అతనితో ఒంటరిగా ఉండాల్సివస్తుంది. వాదించబోకు, నేను చెప్తున్నదేమిటో తెలిసే చెప్తున్నాను.''

ఆ రాత్రి, తలగడదిండులా ఉపయోగించిన బొంతలాంటి కోటుపైన క్రిస్తా అత్తవి కాక యితరుల కన్నీళ్ళు యింకాయి. సార్జెంట్ మేజరు ఎడతెగకుండా మాట్లాడుతూనే వున్నాడు. మీరా ఏడ్చి ఏడ్చి అలసిసొలసి నిద్రపోయింది. తెల్లవారబోతూండగా స్తెపాన్ మత్వేయెవిచ్ కూడా — తన చేతిని విశ్వాసంతో ఆదమరచి నిద్రిస్తున్న ఆ పిల్ల భుజాల చుట్టూ వేసి — కునుకు తీశాడు.

అతను ఎక్కువ సేపు నిద్రపోలేదు. ఓ చిన్న కునుకు తియ్యడంతో అతని బడలిక తీరింది. తనీ రోజున ఏ మార్గాన్ని అవలంబించాలో ప్రశాంతంగా కూలంకషంగా, మళ్లీ ఓ సారి ఆలోచించుకోడానికి తగినంత మానసిక స్పష్టతతో అతను లేచాడు. అతను ఒక

నిర్ణయానికి వచ్చేశాడు, మరి ఆ నిర్ణయం సుదృఢమైనది, అనుమానాలకూ, తటపటా యింపులకూ తావులేనిది. అతనిప్పుడిక చెయ్యాల్సిందల్లా వివరాలను తేల్చుకోడం మాత్రమే. అప్పుడు — జాగ్రత్తగా, మీర్రాకు నిద్రాభంగం కాకుండా అతను లేచాడు, గ్రెనేడ్లు తీసుకొని, వాటిని రెండు మూటలుగా కట్ట సాగాడు.

''మీరేం పేల్చెయ్యాలని వేసుకున్నారు పథకం?'' అతను చేస్తున్న యీ పని చూసి, ప్లూజ్నికొవ్ అడిగాడు.

''పేల్చడానికి ఏదో ఒకటి దొరుకుతుంది.'' స్తెపాన్ మత్వేయెవిచ్ నిద్రపోతున్న మీర్రా వంక చూపు విసిరి, గొంతు తగ్గించి అన్నాడు: ''నికొలాయ్, ఆమెను బాగా చూడు.''

ప్లూజ్నికొవ్ కంపించాడు. అతను ఓవర్‌కోటును తన చుట్టూ కప్పుకొని ఆవు లించాడు.

''మీరు అన్నదాని భావమేమిటో నాకు బోధ పడలేదు.''

''ఆమెను బాగా చూడు.'' సార్జెంట్ మేజరు దృఢంగా రెట్టించాడు. ''ఆమె యింకా పట్టి పసిపిల్ల, పైగా ఆస్వస్థురాలు కూడా, ఆ విషయం నువ్వు అర్థం చేసుకోవాలి. ఆమెనిక్కడ ఒంటరిగా వదిలెయ్యకు. నువ్వొకవేళ యిక్కణ్ణుంచి బయటకి వెళ్ళిపోవాలనుకుంటే, ముందు ఆమెను గురించి ఆలోచించు. ఇద్దరూ కలిసే బయటకెళ్ళండి, ఒంటరిగా వదిలేస్తే ఆమె కృంగిపోయి చచ్చిపోతుంది.

''కాని మీరు — మీ సంగతేమిటి?''

''నా కాలు కుళ్ళిపోయింది, నికొలాయ్. నా ఒంట్లో యింకా శక్తి వున్నప్పుడే, నావల్ల యింకా ప్రయోజనమేదైనా వున్నప్పుడే నేను బయటికెళ్ళిపోవడం అవసరం. నేనెలాగూ చచ్చిపోతున్నాను, అందుకని ఆ పనేదో మేళతాళాలతో సరభసంగా చేస్తాను.''

''స్తెపాన్ మత్వేయెవిచ్ —''

''ఆ విషయమిక ముగిసిపోయింది, కామ్రేడ్ లెఫ్టినెంట్ — సార్జెంట్ మేజరు యుద్ధం ముగిసిపోయింది. నీ ఆజ్ఞలు యిప్పుడిక చెల్లవు. ఇప్పుడిక చెల్లుబాటయ్యేది నా ఆజ్ఞలే. ఇదుగో యిదీ నా చివరి ఆజ్ఞ. ఈ పిల్లని భద్రంగా చూడు. నిన్ను నువ్వు భద్రంగా కాపాడుకో. బ్రతికివుండు. కేవలం వాళ్ళని వెక్కిరించేందుకు బ్రతికివుండు. మా అందరి కోసం బ్రతికివుండు.''

అతను లేచాడు, గ్రెనేడ్ల మూటలను తన సైనిక కోటు కింద దోపుకున్నాడు, వాచిన తన కాలుపైన భారంగా కుంటుతూ అతను కంత దగ్గరకు వెళ్ళాడు. ప్లూజ్నికొవ్ ఏదో చెప్పాడు, వాదించాడు, కాని సార్జెంట్ మేజరు వినలేదు. ముఖ్యమైనవన్నీ తను చెప్పే శాడు. బిలమార్గాన్ని మూసివున్న యిటుకలను లాగేశాడు.

''తెరెస్పోల్ గేటమ్మట కదూ వాళ్లొచ్చారన్నావ్? సరే, గుడ్‌బై నాయనా. చిరంజీవ!'' అతను బయటికెళ్లిపోయాడు.

ఆ బిలంలోంచి ఒళ్లు కాలిన కంపు గుప్పున కొట్టింది.

''గుడ్ మార్నింగ్.'' మీ(్రా పక్కమీద కోటులో ముడుచుకొని కూర్చుంది. ప్లూజ్నికొవ్ మౌనంగా ఆ బిలం దగ్గర నిలబడి వున్నాడు.

''ఏమిటీ వాసన?''

అప్పుడామె బిలాన్ని చూసి మాట నిలిపేసింది. ప్లూజ్నికొవ్ అకస్మాత్తుగా తన సబ్ మెషీన్ గన్నును చేతిలోకి తీసుకున్నాడు.

''నేను పైకెళ్తున్నాను. నువ్వీ బిలానికి దూరంగా వుండు!''

''కోల్యా!''

ఈమారామె రుద్ధస్వరం పూర్తి భిన్నంగా వుంది — భయభీత నిస్సహాయ స్వరం అది. ప్లూజ్నికొవ్ ఆగాడు.

''సార్జెంట్ మేజరు బయటికెళ్లిపోయాడు. ఆయన కొన్ని గ్రెనేడ్లు తీసుకుని వెళ్లాడు. నేనాయన్ని కలుసుకోవాలి.''

''ఆయన్ని మనమిద్దరం కలుసుకుందాం.'' మూల దేనికోసమో ఆమె వెతికింది. ''కాని కలిసే.''

''కాని నువ్వెలా —'' అతను మధ్యలోనే ఆగిపోయాడు.

''నేను అవిటిదాన్నన్న సంగతి నాకు తెలుసు'' మీ(్రా మృదువుగా అంది. ''పుట్టుకలోనే నేనిలా పుట్టాను, అందుకు నేనేం చెయ్యగలను? కాని యిక్కడ నేనొక్కదాన్నీ ఉండటానికి నాకు భయంవేస్తోంది. చాలా భయమేస్తోంది. నాకిక్కడ ఒంటరిగా ఉండేదానికన్న పైకొస్తేనే బాగుంటుంది.''

''సరే అయితేరా వెళ్దాం.''

అతనొక కాగడా వెలిగించాడు, వాళ్లు కేస్‌మేటులోంచి పాకి వెళ్లారు. గాఢంగా, పట్టుకుని వదలనట్లున్న ఆ దుర్వాసనలో వాళ్లకి ఊపిరి తీసుకోడం కష్టంగా వుంది. నల్లగా మాడిపోయిన ఎముకల పోగు చుట్టూ ఎలకలు హడావిడిగా తిరుగుతున్నాయి.

''నువ్వటు చూడకు'' ప్లూజ్నికొవ్ అన్నాడు. ''మనం తిరిగివచ్చాక నేనావిడను పూడుస్తాను.''

కాలి మసిబారిన కంత గుండా ప్లూజ్నికొవ్ ముందు బయటికెళ్లాడు, చుట్టూ కలియజూశాడు, తర్వాత మీ(్రా పైకొచ్చేందుకు చేయూతనిచ్చాడు. ఆమె కష్టంమీద — ఆమె కాళ్లు యిటుకలపైన జారిపోతూండగా — అడ్డదిడ్డంగా పైకెక్కింది. అతనామెను నేరుగా బయటికెళ్లే కంత దగ్గరకి లాగాడు, అప్పుడు ఎందుకైనా మంచిదని ఆమెను ఆపుచేశాడు.

''ఓ క్షణం ఆగు.''

అతను చుట్టూ కలియజూశాడు. సూర్యుడింకా పైకి రాలేదు, జర్మన్లు ఎదురుపడే అవకాశం అంతగా ఉన్నట్టు కనిపించలేదు. అయినా కూడా అతను దుస్సాహసం చెయ్య దలచుకోలేదు.

''బయటకి రా.''

ఆమె సంకోచించింది. ఆమెను తొందర చేసేందుకని ఫ్లాష్లికొవ్ ఆమె వంక తిరిగాడు, అప్పుడతనికి పలచని, బాగా పాలిపోయిన ఆమె ముఖం, దానిలో — ప్రగాఢమైన భయంతో తన వంక భీతహరిణంలా చూస్తున్న — రెండు విశాల నయనాలూ కనిపించాయి. అతను తన మాటలను నోట్లోనే మింగేశాడు. పగటి వెలుగులో అతనామెను చూడటం యిదే మొదటి సారి.

''అయితే, నువ్విలాగుంటావన్నమాట.''

మీర్రా తన కళ్లు వాల్చేసుకుంది. పైకెక్కింది, కొన్ని యిటుకలమీద — తన మోకాళ్ల పైన వున్న దుస్తుల్ని జాగ్రత్తగా క్రిందకు సర్దుకుంటూ — కూర్చుంది. ఇప్పటిదాకా ఆమె కూడా అతన్ని పొగలుచిమ్మే కాగడా వెలుతురులోనే చూసిందేమో యిప్పుడు పక్క చూపులతో, ప్రతి ఒక్క సారీ తన కంటిరెప్పలను కర్టెన్ల మాదిరి బారుగా పైకెత్తుతూ ఆమె కూడా అతనివంక ఉత్సుకంగా చూసింది.

శాంతికాలంలో, యితర అమ్మాయిల మధ్య, అతనామెను ఎన్నడూ గమనించియుండే వాడు కాదు. మొత్తంమీద ఆమె — విషాదపూరితమైన ఆ విశాల నయనాలనూ, పొడుగాటి కనురెప్ప వెంట్రుకలనూ మినహాయిస్తే — ఏమంత పెద్దగా కంటికి నదరుగా ఆనే పిల్ల కాదు; కాని యిక్కడ ఆమెకన్న అందంగా వున్న మరో వ్యక్తే లేదు.

''అయితే, నువ్విలా వుంటావన్న మాట.''

''ఏం, అయితే ఏమిటిట?'' ఆమె కోపంగా బుసకొట్టింది. ''నాకేసి అలా తేరిపార జూస్తూ అక్కడలా నిలబడకు. నువ్వు అలాగే చూస్తే నేను లోపలకెళ్లిపోతాను.''

''సరే, అలాగే'' అతను చిరునవ్వు నవ్వాడు. ''నువ్వు నేను చెప్పినట్టు చేస్తే, నేను నీకేసి చూడను, సరేనా.'' అతనో మొండిగోడ దగ్గర కెళ్లి, దాని చుట్టూ కళ్లు పొడుచుకు చూశాడు. ఫిరంగి గుళ్ల గుంటలతో నిండివున్న ఆవరణలో సార్జెంట్ మేజరు జాడగాని, జర్మన్ల పొడగాని ఎక్కడా లేదు. ''ఇలా రా.''

ఇటుకలపైన తూలుతూ ఆమె అతని దగ్గరకొచ్చింది. అతనామె భుజాల చుట్టూ చేతులేసి తన తల వంచాడు.

''దాక్కో. ఆ బురుజున్న గేటు చూశావా? అదే తెరెస్పోల్ గేటు.''

''నాకు తెలుసు.''

''ఆయన దాన్ని గురించే నన్నడిగాడు.''

మీ(రా బదులు పలకలేదు. కాని ఇప్పుడు అపరిచితంగా వున్న దుర్గంలో తనకు ఒకప్పుడు పరిచితమైన వాటిని ఎంచుకొని ఆమె చుట్టూ చూసింది. కమాండెంటు కార్యాలయాలు శిథిలమయ్యాయి, చర్చి అంధకారాన్ని ఆవులిస్తున్న ఓ పెద్ద ఖాళీ పెట్టెలా వుంది. చుట్టూ పెరిగిన చెస్ట్‌నట్ చెట్ల మొదళ్లు మాత్రమే మిగిలి వున్నాయి. ఎక్కడా ఎవ్వరూ లేరు, ప్రపంచంలో ఎక్కడా ఒక్క పిట్ట కూడా ఉన్నట్టు లేదు.

''ఇక్కడ భయంకరంగా ఉంది'' ఆమె నిట్టూర్చింది. ''ఆ కింద వుంటే యింకా ఎవరో యిక్కడ మిగిలి వున్నారనిపిస్తుంది, ఎవరో ప్రాణాలతో ఉన్నారనిపిస్తుంది.''

''ఎవరో ఉండే ఉండాలి. అదృష్టవంతులం మనం ఒక్కళ్లమే కాము. ఎవరో, ఎక్కడో వున్నారు, లేకుంటే కాల్పులుండి వుండేవి కాదుకదా, మనకి వినిపిస్తూనే వున్నాయి కదా. ఎక్కడో — ఎక్కడున్నారో నేను వెదుకుతాను.''

''తప్పకుండా వెదుకు'' ఆమె ప్రాధేయపడింది. ''దయచేసి తప్పకుండా వెదుకు.''

''జర్మన్లు. నిశ్శబ్దం. పైకి చూడకు.''

ముగ్గురితో కూడిన ఓ కాపలా దళం తెరెస్పోల్ గేటు గుండా వస్తోంది. అంధకారాన్ని ఆవులిస్తున్న ఆ గేట్లోంచి వాళ్లు బయటికొచ్చారు, ఓ క్షణం నిలబడ్డారు. తర్వాత తాపీగా ఖోమ్‌స్క్ గేటు దిశగా బ్యారక్కు వార నడిచివెళ్లారు. త్వరలోనే దూరాన్నుంచి సామూహిక గానం — బొంగురుగా ఓ ఏభై స్వరాలు పాడుతున్నట్టుకాక గావు కేకలు పెడుతున్నట్టు — వినవచ్చింది. ఆ శబ్దం క్రమంగా ఎక్కువైంది. ప్లూజ్నికోవ్‌కి పదఘట్టనలు వినవచ్చాయి. ఓ జర్మన్ సైనికదళం తెరెస్పోల్ గేటు కమాను కింద పాడుతూ మార్చిచేసుకొంటూ వస్తోందని అతను గ్రహించాడు.

''కాని స్తెపాన్ మత్వేయెవిచ్ ఎక్కడున్నాడు?'' మీ(రా ఆదుర్దాగా అడిగింది.

ప్లూజ్నికోవ్ బదులు చెప్పలేదు. జర్మన్ దళపు అగ్రభాగం సింహద్వారంలో కనిపించింది. వాళ్లు నాలుగు వరుసల్లో — తమ పాటను అరుస్తూ — నడిచివస్తున్నారు. అప్పుడొక నల్లని ఆకారం దెబ్బతిన్న బురుజుమీంచి కిందకి దూకింది. అది నేరుగా మార్చి చేస్తున్న జర్మన్లపైన పడింది. రెండు గ్రెనేడ్ మూటలు ఒక్కుమ్మడిగా పేలడంతో ఉదయకాల ప్రశాంతి భంగమైంది.

''అడుగో అక్కడున్నాడు మన స్తెపాన్ మత్వేయెవిచ్!'' ప్లూజ్నికోవ్ బిగ్గరగా అరిచిచెప్పాడు. ''అడుగో మీ(రా! అది ఆయనే!''

నాల్గో భాగం

1

వాళ్లు ఆ రోజంతా కేస్‌మేటులో మౌనంగా గడిపారు. వాళ్లు కేవలం మౌనంగా ఉండటమే కాకుండా, తమ పరిస్థితుల్లో సాధ్యమైన మేరకు ఒకళ్లని మరొకళ్లు తప్పించుకు తిరిగారు. ఒకళ్లు టేబిలుదగ్గరుంటే రెండోవాళ్లు ఓ మూలకెళ్లి పోయేవారు. లేక అతను టేబిలుదగ్గర కూర్చుంటే టేబిలుకి మరో చివర, తను కూర్చోగలిగినంత దూరంలో ఆమె కూర్చునేది. వాళ్లు ఒకళ్లనొకళ్లు చూసుకోడానికి సాహసించలేదు. అన్నింటికన్న ముఖ్యంగా చీకట్లో ఒకరి చేతులు మరొకరి చేతులకెక్కడ తగులుతాయోనని భయపడ్డారు.

సార్జెంట్ మేజరు మరణానంతరం భూగర్భంలోకి తిరిగి వచ్చేందుకు మీరా ఉన్మత్తావేశంతో నిరాకరించింది. ఆమె అరిచింది, ఏడ్చింది; మరి జర్మన్లు, ప్రేలుడు అనంతరం కందిరీగలపుట్ట మాదిరిగా కదిలి మళ్లీ శిథిలాలను గాలిస్తూ, నేలమాళిగల్లోకి గ్రెనేడ్లు విసరసారంభించారు, అగ్గిబరాటాలు విసరనారంభించారు. వాళ్లు నాలుగు దిశలకూ సర్దుకొని అంతటా వ్యాపిస్తున్నారు. వాళ్లు ఏ క్షణాన అయినా ప్లూజ్నికొవ్ పైకీ, ఆ పిల్ల పైకీ రావచ్చు. అయినా అప్పటికీ ఆమె ఏడుస్తూ యిటుక ముక్కలపైన దొర్లడం మానలేదు. ప్లూజ్నికొవ్ ఆమెను శాంతపరచలేకపోయాడు. అప్పుడే అతనికి జర్మన్ల అరుపులూ, బూట్ల టకటకలూ, ఆయుధాలు ఒకదానికొకటి తగులుతున్న చప్పుళ్లూ వినిపించినట్లయింది. చివరకు అప్పుడిక అతను మీరాను చేతుల్లోకి చంటిపిల్ల నెత్తుకున్నట్లు ఎత్తుకొని కంతదగ్గరకు మోసుకెళ్లాడు.

"నన్నొదులు!" అకస్మాత్తుగా ఆమె గింజుకోవడం మానేసింది. "తక్షణం నన్నొదిలెయ్యి!"

"ఊఁహుఁ వదలను!"

ఆమె బెండులా వుంది, కాని యీ సుతిమెత్తని, నులివెచ్చని భారం అతని హృదయాన్ని ధన్‌ధన్‌మని కొట్టుకొనేలా చేస్తోంది. ఆమె ముఖం అతని ముఖానికి సన్నిహితంగా వుంది, అతనామె బుగ్గలపైన గల కన్నీటి చారికలను చూడగలుగుతున్నాడు, ఆమె ఊపిరి అతన్ని తాకుతోంది, ఆమెను మరీ దగ్గరగా పొదివిపట్టుకోడానికి అతను భయపడ్డాడు, అందుకనే చేతులు ముందుకు చాచి వాటిపైన ఆమెను మోసుకెళ్లాడు.

"నన్ను దింపు" ఈ సారి ఆమె చాలా మెత్తగా అంది. "దయచేసి దింపు."

కంత దగ్గర మాత్రమే ప్లూజ్నికొవ్ ఆమెను కింద నిలబెట్టాడు. చివరి సారిగా

అతను చుట్టూ కలయజూశాడు — ఆ, పదధ్వనులు సమీపిస్తున్నాయి — అప్పుడతను గుసగుసగా చెప్పాడు, ''లోపలికి పద.''

మీర్రా సంకోచించింది. అతనికి ఆమె బ్రేస్ సంగతి గుర్తుకొచ్చింది, ఆమె క్రిందకి లోపలికి దూకలేదని అర్థంచేసుకున్నాడు, ఆమెను ఆపుచేశాడు.

''నేను ముందు వెళ్తాను.''

''వద్దు!'' భయభీతురాలై ఆమె అరిచింది. ''వద్దు, వద్దుగాక వద్దు!''

''భయపడకు, మనం వెళ్లిపోగలంలే.''

అతనా కంతలోంచి జారి, క్రిందకి దూకి, ఆమెను పిలిచాడు.

''తొందరగా! రా!''

జారుతున్న యిటుకలపైన మీర్రా తడబడింది, కాని ఫ్యూజ్నికొవ్ ఆమెను అందుకొని, క్షణకాలం ఆమెను దగ్గరగా పట్టుకున్నాడు. ఆమె తన ముఖాన్ని అతని భుజానికి ఆన్చి నమ్రంగా, ప్రశాంతంగా ఉండిపోయింది; కాని తర్వాత ఆమె అతన్ని తోసేసి, తన కాలు యీడ్చుకొంటూ త్వరత్వరగా నడవగుండా లోపలకెళ్లిపోయింది. అతను మరో క్షణకాలం అక్కడ ఆగి పైనుండి వచ్చే శబ్దాలు వినేందుకు ప్రయత్నించాడు, కాని అతనికి పై శబ్దాలు కాక, ధన్‌ధనామంటూ తన గుండె దడదడలు మాత్రమే వినవచ్చాయి. కేన్‌మేటులోకి తిరిగివచ్చాక మాట్లాడేందుకు అతనికి మాటలు పెకల్లేదు. అతను మాట్లాడుదామనుకున్నాడు, కాని మాటలు పెకల్లేదు. తనను చూసి తనే ఆశ్చర్యపోయాడు. అతను తన కళ్లను క్రిందకు దించేసుకున్నాడు. అయినాకూడా అంతసేపూ, అక్కడ ఆమె ఉనికి అనుభూతమవుతూనే వుంది; మొత్తం ప్రపంచంలోనే తామిద్దరూ తప్ప మరెవ్వరూ లేనట్లనిపిస్తోంది.

అతని మనస్సు పరస్పర విరుద్ధమైన ద్వంద్వభావాల కొట్టుమిట్టాడింది — క్రిస్తాఅత్త, స్తెపాన్ మత్వేయెవిచ్‌ల మృతిపట్ల విచారం, యీ దుర్బల, నిస్సహాయ బాలిక తన పక్కనున్నందుకు ప్రశాంత సంతోషం; జర్మన్లపట్ల ద్వేషం, ఒక బాలిక శరీరపు విలక్షణమూ, అపరిచితమూ అయిన వెచ్చదనం; శత్రువులను చంపిపారెయ్యాలన్న మొండి నిశ్చయం, మరో జీవిపట్ల కలవరపరచే బాధ్యతా భావం — యివన్నీ ఏకైక మొత్తంగా అతని మనస్సులో పూర్తి సమరసభావంతో యిమిడివున్నాయి. తనలో యింత బలం, యింత సాహసం ఉన్నట్లు అతను యింతకు ముందెన్నడూ అనుభూతి చెందలేదు. అయితే అతను చెయ్యలేకపోతున్న పని ఒకే ఒక్కటుంది — తన చెయ్యి చాపి ఆ యువతిని ముట్టుకోవడం. అతనలా చెయ్యాలని గాఢంగా కాంక్షించాడు, కాని అలా చెయ్యలేకపోయాడు.

''కొంచెమేదైనా తిను'' ఆ యువతి మృదువుగా అంది.

ఇప్పటికి సూర్యుడు అస్తమించియుండాలి. వాళ్లు రోజంతా మౌనంగా వున్నారు, తిండి ఏమీ తినలేదు. చివరకు మీర్రా టేబిలుమీద భోజనం వడ్డించింది, ఆమె మొదట

మాట్లాడింది. కాని వాళ్లు టేబిలుకు ఆ చివరా యీ చివరా కూర్చుని భోజనం ముగించారు.

"నువ్వు పడుకో. నేను నిద్రపోను" అతనన్నాడు.

"నేనూ పోను" ఆమె తొందరగా అంది.

"ఏం, ఎందుకు?"

"నేను పోనంతే."

"ఎలకలు కరుస్తాయని భయపడుతున్నానా? భయంలేదులే. అవి నీ దగ్గరకు రాకుండా నేను తోలేస్తాను."

"అయితే నువ్వు ప్రతి రాత్రీ మేలుకొని వుంటావా?" మీరా నిట్టూర్చింది. "నువ్వు నా సంగతి పట్టించుకోకు, నాకిది అలవాటే."

"రేపు నేనేదో ఒక ఉపాయం చూసి నిన్ను పట్నానికి జేరుస్తాను."

"మరి నువ్వో?"

"నేను మళ్లీ యిక్కడికొస్తాను. ఇక్కడ ఆయుధాలూ, మందుగుండు సామానూ వున్నాయి. పోరాడేందుకు చేతినిండా మస్తుగా వున్నాయి."

"పోరాటం." ఆమె మళ్లీ నిట్టూర్చింది. "నువ్విక్కడివి — వాళ్లందరికీ వ్యతిరేకంగా నువ్వు ఒంటరిగా ఏం చెయ్యగలవు?"

"జయిస్తాను." అతనా మాట ఆలోచించకుండా అన్నాడు, తనా మాట అనగా వినడం అతనికే ఆశ్చర్యం కలిగించింది. కాని అతను దృఢంగా రెట్టించాడు: "జయిస్తాను. మనిషికి దృఢసంకల్పం వుంటే అతన్ని జయించడం దుస్సాధ్యం. అతన్ని చంపవచ్చు, అంతేగాని అతన్ని జయించడం అసంభవం. ఆ నాజీలలో మానవత్వం లేదు, అందుకనే నేను వాళ్లను జయించితీరాలి."

"ఏమిటో నువ్వు చెప్తున్నదంతా గజిబిజిగా వుంది!" ఆమె అనిశ్చితంగా నవ్వింది, కాని అంతలోనే గాభరాపడి, ఆపేసింది. నిస్తేజంగా, పొగతో నిండివున్న యీ కేస్‌మేటులో నవ్వుపరమ అసహజంగా కనిపించింది.

"కాని, నీకు తెలుసా, మనిషి అజేయుడన్న మాట నిజం" ఫ్లాబ్నికొవ్ నెమ్మదిగా రెట్టించాడు. "స్తెపాన్ మత్వేయెవిచ్‌ని వాళ్లు జయించారా? వొలోద్యా దెనీష్చిక్‌ని జయించారా? నేలమాళిగలోని ఆ అసిస్టెంటు డాక్టర్ని — వెనక నీకు చెప్పాను గుర్తుందా? — జయించగలిగారా? లేదు, వాళ్లని ఊరికే వాళ్లు చంపగలిగారంతే. చంపగలిగారంతే, బోధపడిందా నీకు? వాళ్లు ముగ్గురి విషయంలోనూ వాళ్లు చెయ్యగలిగింది అంతే."

"అది చాలు."

"అబ్బే, అది కాదు నా ఉద్దేశం. మరి ప్రిజ్న్యాక్ సంగతే తీసుకో — అతన్నంటావా వాళ్లు నిజంగానే, శాశ్వతంగా, అతనింకా తిరుగుతూనే వున్నా, చంపేశారు. కాని, నిజమైన

మనిషిని, నువ్వు చంపినా కూడా, జయించలేవు. అందుకే నిజమైన మనిషి మృత్యువుకన్న గొప్పవాడూ, ఉన్నతుడూను.''

ఫ్లాజ్నికొవ్ ఆగాడు, మీరా కూడా మౌనం వహించింది. అతను ఆమెను ఉద్దేశించి కాక, తనకు తనవే ఉద్దేశించి మాట్లాడుతున్నాడని ఆమె గ్రహించింది. అతన్ని చూసి గర్వంతో ఉప్పొంగింది. గర్వించిందే గాని, — అతనికి ఎదర కనిపిస్తున్నది మృత్యువు మాత్రమే — అందుకే ఆమె భయపడింది కూడా. అతనా విషయంలో పూర్తి విశ్వాసంతో ఉన్నాడు, అతను సిసలైన చిత్తశుద్ధితో తనకు తాను ఆ తీర్పును విధించుకున్నాడు. తన మటుకు తాను అర్థం చేసుకోలేని ఏ తక్షణావశ్యకత కారణంగానో మీరా లేచి, అతని దగ్గరకు వెళ్ళింది, తన చేతిని అతని భుజానికి చుట్టింది. ఈ క్షణంలో ఆమె అతని సరసన ఉండాలని కోరుకుంది, అతని భవితవ్యంలో పాలుపంచుకోవాలనుకుంది, అతనితో కలిసి ఉండాలనుకుంది, మరి సహజ ప్రేరణతో, యీ సాంగత్యానికి స్పర్శ అవసరమని అనుభూతి చెందింది.

కాని ఫ్లాజ్నికొవ్ ఆకస్మికంగా ఆమెను నెట్టేసి, లేచినిలబడి, టేబిలుకి మరో చివరకి వెళ్ళాడు. మళ్ళీ అతను మాట్లాడినప్పుడు అతని స్వరం అపరిచితుని స్వరం మాదిరిగా వుంది.

''రేపు నేనేదో ఒక మార్గం వెతుకుతాను, ఎల్లుండి నువ్వు వెళ్ళిపోవచ్చు.''

మీరా అతని మాటలు వింది, కాని ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఆమె మనస్సులో — అతని ప్రవర్తన తానొక అవిటి దాన్ని అన్న విషయాన్నీ, అతనా విషయాన్ని మరువజాలడు, మరువడన్న సంగతినీ గుర్తుచేసిన కారణంగా — సమస్తం తలక్రిందు లైపోయింది. భయంకరమైన ఒంటరితనం తిరిగి ఆమెను ఆవరించింది. ఆమె ఓ బెంచిమీద చదికిలబడి, చిన్న పిల్ల మాదిరిగా చేతులతో ముఖం కప్పుకొని వెక్కివెక్కి ఏడ్చింది.

''ఎందుకు?'' ఫ్లాజ్నికొవ్ ఆశ్చర్యపడి అడిగాడు. ''ఏడుస్తున్నావెందుకు?''

''నన్నొదిలెయ్యి'' ఆమె బిగ్గరగా ఏడ్చింది. ''నన్నొదిలేసి, నీ యిష్టమొచ్చిన చోటు కెళ్ళు. నామీద జాలి మాత్రం చూపకు. వద్దు! వద్దు!''

అతను అనిశ్చితంగా ఆమె కేసి వెళ్ళాడు, ఓ క్షణం నిలబడ్డాడు, తర్వాత అడ్డదిడ్డంగా — ఆమె నిజంగానే చంటిపిల్ల అన్నట్లు — ఆమె తల నిమిరాడు.

''నన్ను తాకకు!'' ఆమె అతని చేతిని విసిరేస్తూ చటుక్కున లేచినిలబడింది. ''నేనిక్కడున్నానంటే అది నా తప్పు కాదు, నేనింకా బతికి వున్నానంటే అది నా పొరపాటు కాదు, నాకు అవిటి కాలుందంటే అది నా నేరం కాదు. ఇదేదీ నా నేరం కాదు, నామీద నువ్వేం జాలి చూపనక్కర్లేదు!''

అతన్ని ఆమె తోసేసి, తన మూలకెళ్ళి, తన పక్కమీద కూలబడింది. ఫ్లాజ్నికొవ్ కొంతసేపు ఆమె వెక్కిళ్లను వింటూ నిలబడ్డాడు, తర్వాత సార్జెంట్ మేజరు కోటును

తీసుకెళ్లి ఆమె భుజాలపై కప్పాడు. ఆమె తన చేతులు విదిలించి, దాన్ని కిందకి నెట్టేసింది. అతను ఆమెకు మళ్లీ కప్పాడు. ఆమె తిరిగి దాన్ని విదిల్చేసింది, అయినా అతను మరో సారి దాన్ని ఆమెకు కప్పాడు. ఈసారి దాన్నామె అక్కడే వుండనిచ్చింది. తర్వాత చివరి సారిగా హృదయవిదారకంగా వెక్కి, ఆ కోటుకింద ముడుచుకొని పడుకొంది, మరి కదల్లేదు. ఫ్లాజ్నికొవ్ చిరునవ్వు నవ్వాడు, టేబిలు దగ్గరకెళ్లి కూర్చున్నాడు. అతను ఒళ్లు వెచ్చ పడినకొద్దీ సమస్థాయిలో వినవస్తున్న మీర్రా ఉఛ్వాసనిశ్వాసాలను కొంత సేపు విన్నాడు, తర్వాత తను స్తెపాన్ మత్వేయెవిచ్‌ని అడిగి వేయించుకున్న దుర్గపు మ్యాప్‌ను తన శాచెల్‌నుంచి బయటకు తీసి, రేపటి రోజున రికాన్నిజాన్సుకి అత్యుత్తమ మార్గమేదా అని ఆలోచిస్తూ, దాన్ని జాగ్రత్తగా పరిశీలించనారంభించాడు. క్రమంగా తన తల టేబిలుపై వాలిపోవడం అతను గమనించనే లేదు.

''దయచేసి, నన్ను క్షమించు'' ఉదయంపూట మీర్రా అంది.

''ఎందుకు?''

''ఎందుకేమిటి – అన్నింటికీను. ఏడ్చినందుకూ, అర్థంపర్థంలేని మాటలు మాట్లాడినందుకూను. మళ్లీ నేనెప్పుడూ అలా చెయ్యను.''

''తప్పకుండా చేస్తావు'' అతను చిరునవ్వు నవ్వాడు. ''నువ్వింకా చిన్న పిల్లవి, అందుకని, ముమ్మాటికీ తప్పకుండా నువ్వు అలా ప్రవర్తించి తీరుతావు.''

అతని స్వరంలోని మార్దవం ఆమెలో ఉత్సాహాన్నీ, మార్దవాన్నీ ప్రతిస్పందింపచేసింది. ఆమె అతనికి తన చేతిని అందించేందుకూ మెల్లగా అతన్ని తాకి బుజ్జగించేందుకూ తన చేతిని పైకెత్తింది. తనను దేనికీ కట్టుబడివుండేలా చెయ్యని అటువంటి సామాన్యమైన తాత్కాలికమైన సముదాయింపుకోసం ఆమె హృదయం ఆరాటపడటమే అందుకు కారణం. కాని ఆమె తమాయించుకొని, పక్కకి తిరిగింది, అతను కూడా ముఖం చిట్లించి పక్కకి తిప్పకున్నాడు. తర్వాత అతను వెళ్లిపోయాడు, అతనికోసం, తనకోసం విచారపడుతూ, ఆ విచారంతో వ్యధచెందుతూ ఆమె మళ్లీ విలపించింది.

జర్మన్లు క్రితం రోజు ప్రేలుడు మూలంగా హెచ్చరికగా వున్నారో, లేక వాళ్లు మరి దేనికోసమైన సంసిద్ధమవుతున్నారో ఏమో గాని, వాళ్లు మామూలుకన్న బాగా చురుకుగా వున్నారు. తెరెస్పోల్ గేటు ప్రాంతం శుభ్రం చెయ్యబడుతోంది, ఎక్కడ చూసినా దిట్టమైన కాపలా దళాలు గస్తీ తిరుగుతున్నాయి. ఇటీవల తను చూడటానికి అలవాటు పడిన ఖైదీల జాడ ఫ్లాజ్నికొవ్‌కి ఎక్కడా కనిపించలేదు. మూడు కమాన్ల గేటు దగ్గర కూడా ఏదో జరుగుతోంది, ఇంజన్ల మ్రోతలు అతనికి వినిపిస్తున్నాయి. అందుకని అతను దుర్గపు వాయువ్య విభాగానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు, అక్కణ్ణుంచి తాము ముహవేత్స్ నదిని

దాటి, బహిః ప్రాకారంద్వారా బయటపడే అవకాశం ఉందేమో చూడాలని నిశ్చయించుకున్నాడు.

దుస్సాహసాలకు పూనుకొనే హక్కు తనకు లేదు. అందుకని అతను, బహిరంగ ప్రదేశాలకు వెళ్ళకుండా చూసుకొంటూ అత్యధికమైన జాగ్రత్త తీసుకున్నాడు. కొన్ని సార్లు, కాపలా సైనికులెక్కడా కంటికి కనిపించకపోయినా కూడా, అతను పాకాడు. ఈ రోజున అతను కాల్పులు గాని పరుగెత్తడంగాని లేకుండా చూసుకోవాలనుకున్నాడు, కేవలం రాత్రిపూట తాము తప్పుకు వెళ్ళిపోయేందుకు అనువైన సొరంగం దేన్నో చూసుకోవాలని మాత్రమే అతను కోరుకున్నాడు. తప్పించుకొని, దుర్గంనుంచి బయటపడి, దుర్గానికి అతిదగ్గర వున్న జనాన్ని చేరుకొని మీరాను వాళ్ళదగ్గర దిగవిడవాలని అనుకున్నాడు.

ఆరు నూరైనా నూరారైనా యీ పని చేసితీరమని సార్జెంట్ మేజరు చెప్పడం సరైనదేనన్న విషయం ఫ్లాజ్నికొవ్‌కి తెలుసు. కాని తను ఒంటరిగా, విచ్ఛిన్న దుర్గంలో కేవలం ఒంటరిగా ఉండబోయే సమయాన్ని గురించి ఆలోచించుకోడానికి అతనికి మనస్కరించలేదు. నిస్సందేహంగా తనూ మీరాతోబాటు తప్పించుకుపోవచ్చు, పౌరదుస్తులు సమకూర్చుకొని అడవిలోకి — తమతమ యూనిట్లనుండి వేరుపడిన రెడార్మీ సైనికులూ, కమాండర్లూ తప్పకుండా అక్కడ వుండే తీరుతారు — పారిపోయేందుకు ప్రయత్నించవచ్చు. అలా చేస్తే అది విధిపరిత్యాగంగాని, సైనిక ప్రమాణ భంగంగాని కాబోదు. తన పేరు ఏ జాబితాలోకీ ఎక్కలేదు, తను స్వేచ్ఛాజీవి; కానైతే సరిగా యీ స్వేచ్ఛ మూలంగానే తను వ్యక్తిగతంగా తన సొంత నిర్ణయాన్ని తీసుకోవలసివచ్చింది. సైనిక వ్యూహం రీత్యా ఆ నిర్ణయం మిక్కిలి ఫలదాయకమైన గట్టి నిర్ణయం కావలసివుంది. ఆ నిర్ణయం — ఎక్కడైతే తనకు మందుగుండు సామగ్రి, ఆహారం, తలదాచుకొనేందుకు స్థావరం ఉన్నాయో అంటే — దుర్గంలో ఉండిపోవడమే. ఎక్కడో తనకు పరిచితంకాని అడవిలో వెతుకులాడుతూ తిరగడంకన్న యిక్కడే పోరాడటం మెరుగు.

చివరకు అతను నేలమాళిగలను చేరుకొని, ముహవేత్స్ నది మలుపులో బయటికొచ్చే ప్రయత్నంలో ముందుకెళ్ళసాగాడు. అక్కడ — మూడు కమాన్ల గేటు దగ్గర తాను వేటి శబ్దమైతే విన్నాడో ఆ ట్రాక్టర్లలోని జర్మన్ల దృష్టినుంచి — తనకు మరుగు లభిస్తుంది. అక్కడ తను నీళ్ళలో దిగి అవతలి గట్టుకి చేరుకోగలనని కూడా అతను ఆశించాడు. కాని ముందు తను, అదే పనిగా సాగుతూ, కంతల్లోంచీ, బిలాల్లోంచీ తగినంత వెల్తురు పడుతున్న నేలమాళిగలను దాటాల్సివుంది.

''ఆగు!''

ఫ్లాజ్నికొవ్ ఆగాడు. ఆ కేక ఎంత ఆకస్మికంగా వినవచ్చిందంటే, ఆ ఆజ్ఞ శుద్ధ రష్యన్ భాషలో యివ్వబడిందన్న అంశాన్ని తక్షణమే అతను గ్రహించలేకపోయాడు.

తేరుకునేందుకు అతనికి వ్యవధి చిక్కేలోగానే ఒక సబ్‌మెషీన్ గన్ను అతని రొమ్ముకి తాకించ బడింది.

"నీ గన్ను కింద పడెయ్యి."

"నేస్తాలూ!" ఫ్లాజ్నికోవ్ గొంతు ఆవేగంతో రుద్ధమైంది. "ప్రియ మిత్రుల్లారా, నేనూ మీలో ఒకడ్ని."

"మేం ప్రియ మిత్రులమైతే కావచ్చుగాని, నువ్వెవరివి?"

"నేను రష్యన్ని, నేస్తాలూ! లెఫ్టినెంట్ ఫ్లాజ్నికోవ్‌ని."

వాళ్లు అతన్నొక చీకటి నేలమాళిగలో ఆపుచేశారు. అంతదాకా అతను — దీనితో పోలిస్తే — కొంచెం వెలుతురుగా వున్న నడవలోంచి వస్తున్నాడేమో, అతను తన ఎదుట ఒక అస్పష్ట మానవాకారాన్ని తప్ప మరిదేన్నీ గుర్తించలేకపోయాడు. మరొకడు, గోడ గూడులో వున్నాడు, వాడు అతనికి బొత్తిగా కనిపించడమే లేదు. తన వెనక ఎవడో ఉన్నాడని మాత్రమే అతను అనుభూతి చెందాడు.

"ఏమిటి, లెఫ్టినెంటునా నువ్వన్నావ్? సరే, అలా వెల్తురులోకి నడు."

"వస్తున్నా, వస్తున్నా" ఫ్లాజ్నికోవ్ సంతోషంగా అన్నాడు. "మీరెంత మంది వున్నా రిక్కడ నేస్తాలూ?"

"లెక్క పెడదాం."

అక్కడ వాళ్లిద్దరున్నారు, కనుబొమలదాకా గడ్డం జీబురుగా పెరిగివుంది, జిడ్డోడుతూ చీలికలువాలికలైన బొంత కోట్లు తొడుక్కొని వున్నారు. వాళ్లు తమ పేర్లు చెప్పుకున్నారు.

"సార్జెంట్ నెబొగాతొవ్."

"కార్పొరల్ క్లిమ్‌కోవ్."

"నీ కార్యపథకమేమిటి, లెఫ్టినెంట్?" నెబొగాతొవ్ అడిగాడు. "మేము బెలొవేజ్‌స్కయ పుష్చాలోకి పారిపోవాలనుకుంటున్నాం, అక్కడ అడవి దట్టంగా వుంటుంది. మేం చాలకాలం క్రితమే వెళ్లిపోయుండేవాళ్లం, కాని మా దగ్గర తూటాలు లేవు. నిన్ను నిల బెట్టినప్పుడు నేను వట్టినే బుకాయిస్తున్నానంతే."

"అయితే, నేను నీ వెనకనే ఉన్నాననుకో, నాదగ్గర జర్మన్ బాకుంది." క్లిమ్‌కోవ్ గంభీరంగా నవ్వాడు. నల్లతోలు ఒరలో పొడుగాటి జర్మన్ బాకు అతని బెల్టుకి వేలాడుతోంది.

"మనం కలిసే తప్పించుకుపోదాం." ఈ సమాగమ సంతోష సంరంభంలో, చివరిదాకా దుర్గంలోనే వుండి పోరాడాలన్న తన నిర్ణయాన్ని అతను మరచిపోయాడు. "బోలెడన్ని తూటాలున్నాయి — మీకు లోపైనవన్నీ యిక్కడ మా దగ్గరున్నాయి. అంతే కాదు, తిండి కూడా — డబ్బాలున్నాయి."

''డబ్బాలే?'' కార్పొరల్ అపనమ్మకంగా అడిగాడు. ''నువ్విక్కడ విలాసంగా గడుపు తున్నావన్నమాట, లెఫ్టినెంట్.''

''ఆ డబ్బాలేమిటో, వాటి సంగతి చూద్దాం, మమ్మల్నక్కడికి తీసుకెళ్లు'' సార్జెంట్ నెబొగాతొవ్ గంభీరంగా నవ్వాడు. ''నేను తిండి తిని ఎన్ని రోజులైందో, నాకు గుర్తులేదు. ఎలకల మాదిరిగా మేం, ఏది చేతికి చిక్కితే అది నమిలి రోజులు గడుపుతున్నాం.''

అడ్డదారివెంట ఫ్లూజ్నికొవ్ వాళ్లని తన నేలమాళిగకు తీసుకెళ్లాడు. అతను వాళ్లకి — తెలియని వాళ్లకి అంత తేలికగా కనిపించని — కంతను చూపించాడు. దానిలోంచి అగ్గి బరాటా దాడిని గురించీ, క్రిస్తా అత్త మరణం గురించీ అతను వాళ్లకి చెప్పాడు. కాని అతను, అగ్గిబరాటాను తమపై విసిరిన ఆ జర్మన్ గురించి మాత్రం ఏమీ చెప్పలేదు. చెప్పినా కూడా ఆ ఖైదీని అలా వదిలెయ్యడంలోని ఔచిత్యం — ఆకలి బడలికలతో వికృతంగా తయారైన — ఈ గంభీర వ్యక్తులకు ఎంత మాత్రం అర్థమైయుండేది కాదు.

''మీరా!'' నడవలోంచి అతను పిలిచాడు. ''మీరా, మేమే, భయపడబోకు!''

''ఏ మీరా?'' అకస్మాత్తుగా సావధానుడై, సార్జెంట్ ప్రశ్నించాడు.

కేస్‌మేటులో అతనే ముందు ప్రవేశించాడు. ఫ్లూజ్నికొవ్వూ, కార్పొరలూ లోపలకు రాగలిగేందుకు ముందే అతను ఆశ్చర్య చకితుడై అరిచాడు.

''మీరచ్కా — నువ్వా? నా కళ్లని నేను నమ్మలేకుండా వున్నాను!''

''నెబొగాతొవ్?'' ఆమె కూడా దిగ్భ్రాంతురాలైంది. ''తోల్యా నెబొగాతొవ్? బతికే వున్నావా?''

''కుడితిలో పడ్డ ఎలకలాగ వున్నాను మీరా!'' అతను నవ్వాడు. ''తంపటేసి, ఉప్పులో ఊరవేసి, ఎండబెట్టి డబ్బాలో బిగించిన చేపలాగున్నాను!''

ఆనందంతో పొంగిపోతూ, మీరా యింతకాలం తను దాచివుంచుతున్న తినుబండా రాలన్నింటినీ టేబిలుపైన పెట్టింది. వాళ్లని అతిగా తినకుండా నివారిద్దామని ఫ్లూజ్ని కొవ్ అనుకున్నాడు, కాని, తాము ఎంత తినగలమో తమకు తెలుసునని సార్జెంట్ అతనికి దిలాసా యిచ్చాడు. నెబొగాతొవ్ ఉత్తేజితుడై ఉత్సాహంగా వున్నాడు, మీరాతో పరియాచి కాలాడుతున్నాడు, కాని కార్పొరల్ మీరా వంక అపనమ్మకంతో కూడిన — ఫ్లూజ్నికొవ్ అంచనా మేరకు — అమైత్రీపూర్వకమైన చూపులు బరపుతూ, మౌనంగా కూర్చుని వుండి పోయాడు.

''నీకిక్కడ బలే గుహ దొరికింది, లెఫ్టినెంట్. బెలొవేజ్‌స్కయ పుష్చ అడవినుంచి వచ్చిన అడవిదున్నల నువ్వు యిక్కడున్నావు.''

ఫ్లూజ్నికొవ్ ఆ ప్రసంగాంశాన్ని తప్పించాడు. కార్పొరల్ ఓ క్షణం ఆగాడు. మీరా

టేబిలు దగ్గర్నుంచి దూరంగా వెళ్లినప్పుడు అతను చిరాకుగా అడిగాడు, ''ఆమె సంగతే మిటి — ఆమె కూడా వస్తుందా?''

''తప్పకుండాను!'' ఫ్యూజ్లిన్‌కోవ్ స్వరం సవాలుచేస్తున్నట్లుంది. ''ఆమె గట్టి పిండం, దేనికీ భయపడదు — ఒక్క ఎలకలంటే తప్ప.''

కాని క్లిమ్‌కోవ్ పరిహాసాలను మెచ్చుకునే మనోస్థితిలో లేడు. అతను నెబొగాతొవ్ వంక కళ్లెగరేశాడు. సార్జెంటు కళ్లు వాల్చడంతో, యిక్కడ హోదాను బట్టి నాయకత్వం చలామణీ కాబోదన్న సంగతి ఫ్యూజ్లిన్‌కోవ్‌కి అవగతమైపోయింది.

''ఆమె కుంటిది.''

''ఔను, అయితే యేమిటిట? అయినా అంత మరీ అవిటిదేం కాదు.''

అతను మధ్యలోనే ఆగిపోయాడు. మీరాకు అవిటితనం లేదని బుకాయించినందువల్ల ప్రయోజనం లేదు. అయితే ఆమెకు రెండు కాళ్లూ సలక్షణంగా ఉన్నా కూడా చిర్రుబుర్రు లాడే ఆ కార్పొరల్ ఆమెను తీసుకెళ్లడానికి నిరాకరించియుండేవాడే — యీ విషయాన్ని ఫ్యూజ్లిన్‌కోవ్ వెంటనే గ్రహించాడు.

''నా పథకం ఏమిటంటే, దగ్గర్లో వున్న మొదటి యిళ్లకు ఆమెను చేర్చాలని — ''

''మొదటి బులెట్ దగ్గరకి'' క్లిమ్‌కోవ్ కటువుగా అడ్డు తగిలాడు. ''ఇళ్లున్న చోట జర్మన్లున్నారు. మనం వాటికి సాధ్యమైనంత దూరంలో వుండాలి. అంతేగాని యూనిఫారాల్లో నేరుగా వాళ్ల గూట్లోకే వెళ్లకూడదు.''

''నువ్వు చెప్పేది చిత్రంగా వుంది! మనం ఆమెనిక్కడ వదిలెయ్యలేం కద, ఏమంటావ్?''

''ఆమెని తనంతట తనని పొమ్మను. అదైనా మనం వెళ్లిపోయాక మాత్రమే, లేకపోతే మొట్టమొదట తటస్థపడిన వాడు అడిగే ఆరాలకే మన సమాచారమంతా బయట పెట్టేస్తుంది. ఔనుగాని, నువ్వేమీ మాట్లాడవేం సార్జెంట్?''

''మనం ఈమెను తీసుకెళ్లడం సాధ్యం కాదు'' నెబొగాతొవ్ అయిష్టంగా అన్నాడు.

''కాని ఆమెనిక్కడ వదిలెయ్యడం — సాధ్యమా అని నేను నిన్నడుగుతున్నాను, సార్జెంట్. ఆమెనిక్కడ వదిలెయ్యడం సాధ్యమేనా?''

ఖాళీగా వుండి, శబ్దం ప్రతిధ్వనిస్తున్న నేలమాళిగలో — ప్రత్యేకించి, యిప్పుడిక వాళ్లు తమ స్వరాలను యింకెంతమాత్రం తగ్గు స్థాయిలో ఉంచే ప్రయత్నం మానేసినందున — మీరా ప్రతి ఒక్క మాటనూ వింది. కేవలం ఆమె భవితవ్యాన్నే తాము నిర్ణయిస్తున్నట్లు కాక, అంతకంటె తమకు చాలా ముఖ్యమైనదేదో నిర్ణయించుకుంటున్నట్లు మాట్లాడుతూ వాళ్లు ఆమెను గురించి మరచిపోయారు. మీరాకు సంబంధించినంతవరకు, వాళ్లు తనని క్కడ వదిలేసి వెళ్లిపోతారేమోనన్న భయం ఆమె హృదయాన్ని కొరడువారజేస్తున్నా, తనకేమి జరగుతుందన్నది ముఖ్యాంశం కాదు; ఫ్యూజ్లిన్‌కోవ్ ఏం చెప్తాడన్నదే ఆమెకు ముఖ్యాంశం.

నేలమాళిగలో బాగా దూరాన చీకటి మూలలో — శబ్దానికి గాని, మనుషులకు గాని భయపడటం ఎన్నడో మానుకొని ఎలకలు నెలవు చేసుకొనివున్న మూల ఒదిగి కూర్చుని, మీర్రా యిప్పుడు కేవలం అతన్నే, అతని మాటలనే చెవులొగ్గి వింటోంది — తన స్వీయ భవితవ్యంకన్న ఆమెకిప్పుడు వాళ్ళు అతన్ని తనకు చెయ్యమంటున్న ద్రోహం యింకెంతో ఎక్కువ భయంకరమైనది కావడమే అందుకు కారణం.

''నువ్వే ఆలోచించు, ఆమె మనకెంత భారమవుతుందో, మనం ఆమెను ఏం చెయ్యగలం?'' నెబొగాతొవ్ మెల్లగా అన్నాడు. ''వెలపలి ప్రాకారానికి అవతలి పక్కన అన్నీ చేలే. మనమక్కడ రెండు కిలోమీటర్ల దూరం పొట్టలమీద పాకాలి. ఇది ఆమెకు ఎలా సాధ్యమవుతుంది?''

''అందులోనూ కుంటి కాలితో!'' కార్పోరల్ జోడించాడు.

''మీరు దేన్ని గురించి ఆలోచిస్తున్నారు?'' ప్లూజ్నికొవ్ కష్టంపైన తనను తాను సంబాళించుకుంటూ, బిగ్గరగా అన్నాడు. ''ఎంతసేపూ మిమ్మల్ని గురించే, అంతే! మీ ప్రాణాలను గురించే! మరి ఆమె సంగతేమిటి? ఆమెను గురించి కూడా ఒక్క రవ్వ ఆలోచించలేరా?''

''అలా ఆలోచించడంలో అర్థమేముంది?''

''అలా కుదరదు, ఆమెను గురించి మనం ఆలోచించితీరాల్సిందే! అలా ఆలోచించడం మన విధి!''

''నువ్వు యిళ్లదగ్గర కెప్పటికీ చేరుకోలేవు'' సార్జెంటు నిట్టూర్చాడు. ''చస్తే చేరుకోలేవు, తెలిసిందా? మేము యింతకు ముందే ప్రయత్నించాం. ఎక్కడ చూసినా కాపలా వాళ్ళూ, గస్తీ సైనికులూ వున్నారు. రాత్రింబగళ్ళు, వాళ్లింకా దుర్గం చుట్టూ సైనికుల్ని కాపలా పెట్టేవుంచారు. వాళ్లింకా మన మనుషుల్ని వేటాడుతున్నారు, నువ్వేమో ఆలోచించమంటావు.''

''మనం రెడార్మీ'' ప్లూజ్నికొవ్ ప్రశాంతంగా అన్నాడు. ''రెడార్మీ — దాని అర్థమేమిటో మీకు తెలుసా?''

''రెడార్మీయా?'' కార్పోరల్ బిగ్గరగా, తిరస్కారంగా నవ్వాడు. ''ఇంకేం, యిప్పుడిక కమ్సొమోల్ సూత్రాలు వల్లించు, లెఫ్టినెంట్!''

''నేను దాన్ని మరచిపోలేదు!'' ప్లూజ్నికొవ్ బిగ్గరగా అరిచాడు. ''ఇదుగో నా కమ్సొమోల్ కార్డు, యిక్కడ, నా గుండెమీద! దాన్ని నేను నా ప్రాణాలు పోయినప్పుడే వదుల్తాను — నా ప్రాణం పోయినప్పుడే, బోధపడిందా!''

''ఇంక రెడార్మీ లేదు, గిడార్మీ లేదు!'' క్లిమ్కొవ్ బొబ్బరించాడు, టేబిలుమీద క్షీణంగా వెలుగుతున్న దీపం తపతపకొట్టుకుంది. ''రెడార్మీ లేదు, కమ్సొమోలూ లేదు, ఏమీ లేదు!''

''నోర్ముయ్!''

నేలమాళిగ అంతటా నిశ్శబ్దం ఆవరించింది. నెబొగాతొవ్ వెటకారంగా నవ్వాడు.

''ఆజ్ఞలిస్తున్నావా?''

''ఆఁహాఁ, నీకన్న నాకున్న ఉన్నతహోదా మేరకు'' ఫ్లూజ్నికొవ్, తనని తను నిగ్రహించుకుంటూ అన్నాడు. ''రికన్నాయిటర్ చేసి, పట్నంలోకి వెళ్లేందుకు మార్గం వెతికి, ఈ అమ్మాయిని అక్కడికి తీసుకెళ్లమని మిమ్మల్ని నేను ఆజ్ఞాపిస్తున్నాను. అటుతర్వాత మన సొంత ప్రాణాలను గురించి ఆలోచించుకోడానికి బోలెడంత టైముంటుంది.''

''అయితే యిదన్నమాట నువ్వు చెప్పేది, ఏం?'' యింకా నవ్వుతూనే నెబొగాతొవ్ అన్నాడు. ''మరి మేము నీ ఆజ్ఞను పాలించకపోతే నువ్వేం చేస్తావుట? మామీద రిపోర్టు చేస్తావా?''

''ఊరులో తోల్యా'' క్లిమ్‌కోవ్ మధ్యలో అడ్డొచ్చాడు. ''మనం పోట్లాడుకోవడం మూర్ఖత్వం. మనం ఒకళ్లకొకళ్లం అవసరం.''

''మనమేం పోట్లాడుకోవడం లేదు —''

''మన మొట్టమొదటి కర్తవ్యం మీర్రాను పట్నంలోకి తీసుకెళ్లడం. అన్నీ దాని తర్వాతనే.''

''నీకేం జరిగింది? నీకేమన్నా మతి భ్రమించిందా, లేకపోతే శుద్ధ మూర్ఖుడివా?''

''నువ్వు నోర్ముయ్యి, తోల్యా!'' కార్పొరల్ టేబిలు మీదుగా ముందుకి వంగాడు. ''అయినా నువ్వీ కుంటి దాన్ని ఏం చేసుకుంటావ్, లెఫ్టినెంట్? పోనీ పిల్ల ఏమైనా రంజైన రామచిలుక లాంటిదంటే నేను అర్థం చేసుకోగలను — అలాంటి దాన్నైతే వృథా చెయ్యడం బాధగానే వుంటుంది. కాని పీక్కు పోయిన కాలు — ''

అతని జీబురు గడ్డపు ముఖం దగ్గరుందేమో ఫ్లూజ్నికొవ్ పిడికిలి బిగించి దాన్ని సాచి ఒక గుద్దు గుద్దాడు. కార్పొరల్ వెనక్కి పడ్డాడు. వెంటనే అతని చెయ్యి తన బాకు పిడిమీదకి వెళ్లింది. ఫ్లూజ్నికొవ్ తన సబ్‌మెషీన్ గన్నును అందుకున్నాడు.

''చేతులు టేబిలుమీద పెట్టు!''

కార్పొరల్ నెమ్మదిగా తన బాకును విడిచిపెట్టి, కండలు తిరిగిన తన పెద్ద చేతులను ముందు పెట్టాడు. వాళ్ల సబ్‌మెషీన్ గన్నుల డిస్కులు ఖాళీగా వున్నాయన్న సంగతి ఫ్లూజ్నికొవ్‌కి తెలుసు, కాని తనకు వ్యతిరేకంగా వాళ్లిద్దరున్నారు.

''పంది నాయాల'' క్లిమ్‌కోవ్ రొప్పుతూ అన్నాడు. ''రొచ్చువెధవ. పైన యుద్ధం జరుగుతూంటే తాపీగా ఇక్కడో ముండని పెట్టుకుని హాయిగా కులుకుతున్నావా!''

''ఒకళ్ల తర్వాత ఒకళ్లు ఆ నడవలోకి నడవండి, ఊఁ!'' ఫ్లూజ్నికొవ్ కటువుగా ఆజ్ఞాపించాడు. ''ముందే హెచ్చరిస్తున్నాను, నేను బుకాయించడంలేదు, నా గన్నులో తూటా లున్నాయి.''

అతను తన గన్నుని ముయ్యబడిన నిర్గమన మార్గంవేపు తిప్పాడు, క్లుప్తసరిగా ట్రిగ్గరు నొక్కాడు. ఆ ఉట్టుట్టి కాల్పులతో కేస్‌మేటు చెవులు గళ్లుపడేలా దద్దిరిల్లింది. నెబొగాతొవ్, క్లిమ్‌కోవ్‌లు లేచారు.

''నిరాయుధంగా మేమెలా వెళ్లగలం?'' నెబొగాతొవ్ ఊపిరి లేనట్టు అన్నాడు.

''మీ సబ్‌మెషీన్ గన్నులు తీసుకోండి.''

మౌనంగా వాళిద్దరూ తను ఖాళీ గన్నులు తీసుకున్నారు.

మొదట క్లిమ్‌కోవ్ కంత దగ్గరకు వెళ్లాడు, తటపటాయించాడు, ఏదో అందామనుకున్నాడు, కాని మళ్లీ ఆలోచించిన మీదట పైకెక్కాడు.

''పైకెళ్లే దోవ కుడిపక్కన, చిట్టచివర వుంది'' ప్లూజ్నికొవ్ సార్జెంటుకి చెప్పాడు. అతను మౌనంగా తలూపాడు. అతను కంతదగ్గర నిలబడ్డాడు, కాని దాని గుండా పైకెక్కలేదు.

''ఏం, యింకా ఆగావెందుకు? మనం మాట్లాడాల్సిందింకేం లేదు.''

''నువ్వు మాకు కొన్ని తూటాలిస్తానని వాగ్దానం చేశావు, లెఫ్టినెంట్. మాకు తూటాలియ్యి మేం ఈ రాత్రిపూట దుర్గంనుంచి వెళ్లిపోతాం.''

ప్లూజ్నికొవ్ బదులు పలకలేదు.

''దయదలుచు, లెఫ్టినెంట్'' నెబొగాతొవ్ బ్రతిమాలాడు. ''తూటాల్లేనిదే మేమేం చెయ్యగలమో నువ్వే చెప్పు.''

ప్లూజ్నికొవ్ వెనక్కి చీకట్లోకి వెళ్లి, మూత బిగించబడి వున్న ఓ పెట్టెని కాలితో సార్జెంటు వేపుకు తన్నాడు. ఆ యినుపరేకు పెట్టె యిటుకిలకు గీసుకొని కర్ణకఠోరంగా చప్పుడైంది.

''థాంక్స్'' నెబొగాతొవ్ ఆ పెట్టెను చేతుల్లోకి తీసుకున్నాడు. ''మేమీ రాత్రే వెళ్లిపోతాం, నేను నీకు మాటయిస్తున్నాను. ఒక్కటి మటుకు చెప్పక తప్పదు — ఏదేమైనా నువ్వు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నావని మటుకు చెప్పక తప్పదు, లెఫ్టినెంట్.''

అతను బిలంగుండా అదృశ్యుడయ్యాడు.

ప్లూజ్నికొవ్ యాంత్రికంగా తన సబ్‌మెషీన్ గన్నుని సేఫ్టీలో పెట్టి, బిలం పక్కన దాని యథాస్థానంలో పెట్టాడు. తర్వాత టేబిలు దగ్గరకి తిరిగొచ్చి బెంచిమీద దభాలున కూలబడ్డాడు. క్లిమ్‌కోవ్, నెబొగాతొవ్‌లు తమ సబ్‌మెషీన్ గన్నులు లోడ్ చేసుకుని మళ్లీ వస్తారని అతను అనుకోలేదు. అయినాకూడా అతన్ని ఒక రకమైన అశాంతీ, దిగులూ ఆవహించాయి. అనుకోని సమావేశం కారణంగా అతనిలో జనించిన ఆనందం — యింతకు కొంచెం ముందు మాత్రమే వున్న అంత పెద్ద ఆనందం స్థానాన్ని అనుత్సాహకరమైన నిస్పృహ ఆక్రమించుకుంది. ఆకస్మికమైన ఆ మార్పు అతని శక్తిని ఓడ్చేసినట్లనిపించింది. ఆ యిద్దరూ అతని విశ్వాసంలో కొంత భాగాన్ని గుంజేసినట్లనిపించింది, మరి ఆ లోపాన్ని అతను దాదాపు

శారీరకంగా అనుభవించినట్లు అతనికి అనిపించింది. అతని క్రోధం అతన్ని వదిలిపోయింది. కేవలం అనుత్సాహకరమైన క్రుంగదీసివేసే శూన్యతాభావం, హృదయంలో సలుపూ మాత్రమే మిగిలాయి.

ఆకస్మికంగా, కంపిస్తున్న నిట్టూర్పొకటి వినిపించడంతో అతను తన తల పైకెత్తాడు. మీరా అతని పక్కన నిలబడి వుంది.

''వాళ్లు వెళ్లిపోయారు'' అతను నిట్టూర్చాడు. ''నేను వాళ్లకి తూటాలిచ్చాను. వాళ్లీ రాత్రి దుర్గంనుంచి తప్పించుకుపోవాలనుకుంటున్నారు.''

''నేను నీముందు నా మోకాళ్లపై మోకరిల్లలేను'' ఆమె అకస్మాత్తుగా ప్రయాస పూర్వకమైన స్వరంలో అంది. ''నా బ్రేస్ మూలంగా నేను మోకరిల్లలేను. కాని దాన్ని తీసేసినప్పుడు నేను తప్పక నీముందు మోకరిల్లుతాను. నేను తప్పక మోకరిల్లుతాను, నేను...''

వెక్కిళ్లతో ఆమె ఉక్కిరిబిక్కిరైంది. తన చేతులను తన రొమ్ములకు అదుముకొని, కంపిస్తున్న తన పెదవులను పళ్లతో కొరికిపట్టి, తన బుగ్గలమీదుగా కన్నీళ్లు జాలువారు తూండగా ఆమె అక్కడ నిలబడింది. ఆ కన్నీళ్లను తుడిచేందుకని అతను తన చేతిని చాపాడు. కాని దాన్ని ఆమె పట్టుకొని ఉన్మత్తావేశంతో ముద్దుపెట్టుకోసాగింది.

భయకంపితుడై అతను తన చేతిని వెనక్కి లాక్కోవాలని ప్రయత్నించాడు. కాని ఆమె దాన్ని వదలకుండా గట్టిగా పట్టుకొని, తన రెండు చేతులతో దాన్ని తన రొమ్ములకు — అప్పుడు ఆ నడవలో మాదిరిగా — అదుముకుంది. అయితే అప్పుడు అతని చేతిలో పిస్తోలు వుంది.

''ఓహ్, నేనెంత భయపడ్డాను! నేనెంత భయపడిపోయాను!''

''నేను వాళ్లతో వెళ్లిపోతాననా?''

''అబ్బే, అది కాదు అతి దారుణమైన సంగతి, నువ్విలా — యిలాగే — ఉండకపో వచ్చునని నేను భయపడిపోయాను.''

''ఎలాగ?''

''నేను ప్రేమించే వ్యక్తి లాగ — కాకుండా. నువ్వు ఉండు, ఏమీ మాట్లాడకు! నా గురించి నాకు తెలుసు, నా జన్మలో నేనిది మరచిపోగలనని నువ్వు అనుకోబోకు. నా జీవితకాలం పొడుగునా, జనం — చిన్నలూ, పెద్దలూ అందరూ కూడా — నామీద జాలి చూపారు. కాని జనం జాలి మాత్రమే చూపేటప్పుడు, వాళ్లు సగంసగం మాత్రమే అలా చేస్తారు, తెలుసా? కాని నువ్వో, నువ్వు నాకోసం యిక్కడ ఉండిపోయావు, వాళ్లని తరిమేశావు, నువ్వు నన్ను వదిలెయ్యలేదు, జర్మన్లకు ఎరవెయ్యలేదు. వాళ్లు కోరినట్లు నువ్వు నన్నిక్కడ వదిలిపెట్టెయ్యలేదు! నేను అంతా విన్నాను. ప్రతి ఒక్క మాటా విన్నాను!''

ఆమె అతని చేతిని తన రొమ్ముకు గట్టిగా అదుముకుంది, ఏడ్చింది, మాట్లాడింది,

ఆవేశంతో కంపించిపోతూ మాట్లాడింది. ఆమెలోని ప్రతీదీ — సాధారణంగా ఆమెలో ఉండే పస్తాయింపుతో కూడిన బెరుకుతనం, ఆమె సిగ్గు — సడలిపోయింది. ఆమె కృతజ్ఞతాభావపు వెచ్చదనం సమస్త శృంఖలాలనూ కరిగించి వేసినట్టుంది, ఆమె తన ప్రేమతో, మార్దవత్వంతో ఉక్కిరిబిక్కిరై పోయింది, అది ఆమె సమస్తాన్నీ మరచిపోయేలా చేసింది. అతనికి సమస్తం చెప్పెయ్యాలన్న ఆతృతలో బదులుగా దేన్నీ ఆశించకుండా కోరుకోకుండా తన హృదయంలో ఉన్నదాన్నంతనీ వెళ్ళబోసుకోవాలన్న ఆతృతలో, ఆమె నోటివెంట మాటలు ఒకదాని వెంట మరొకటి జలపాత సదృశంగా దొర్లిపోయాయి.

''నేనెన్నడూ, నా జీవితమంతట్లోనూ ఎన్నడూ నేను ప్రేమించగలనని కలలో కూడా అనుకోలేదు! నా చిన్నతనంలో, నేను చిన్న పిల్లగా ఉన్నప్పుడు అందరూ నాకు ఒకే విషయం — నేను అవిటిదాన్నని — చెప్తూండేవారు. నేను దురదృష్టవంతురాలినని, నేను మిగతా పిల్లల కన్న భిన్నమైన దాన్నని. చివరకు మా అమ్మ కూడా — నామీద జాలి కొద్దీ, నేను ఆ విధమైన ఆలోచనకు అలవాటుపడతాననీ, తద్వారా నా మనస్సుకు కష్టసహిష్ణుత అలవడుతుందనీ — అదే విధంగా చెప్పేది. నేను నిజంగానే అందుకు అలవాటుపడ్డాను, బాగా అలవాటుపడ్డాను, అందుకనే, మగపిల్లలతోనేగాని నేనెప్పుడూ ఆడపిల్లలతో స్నేహం చేసేదాన్ని కాదు. అమ్మాయిలెప్పుడూ ప్రేమని గురించే మాట్లాడుతూ వుంటారు, రకరకాల పథకాలు వేస్తూ వుంటారు, కాని నాకు ఏం పథకాలుంటాయి? ఏం స్వప్నాలుంటాయి? ఓహ్, నేను మూర్ఖంగా మాట్లాడుతున్నట్లుంది, నాకు తెలుసు, నేను మూర్ఖంగానే మాట్లాడుతున్నాను, కాని నీకు అదంతా బోధపడిందనుకుంటాను, ఔనా? నేను మాట్లాడకుండా ఉండలేకపోతున్నాను, అంతే కాదు, మాటలు ఆపేసేందుకు భయపడుతున్నాను కూడా. ఎందుకో తెలుసా, అప్పుడిక నువ్వు మాట్లాడటం మొదలుపెడతావు, నేనో మూర్ఖురాలినంటావు, ప్రేమకిది సమయం కాదంటావు. కాని రోజులు యిలా వుండటం మన తప్పా, అది మన తప్పా అని? నాకు మాటలు కట్టిపెట్టడానికి భయమేస్తోంది కోల్యా, కాని యింతకన్న ఎక్కువ మాట్లాడటానికి నాకింక శక్తి లేదు. నాకిక ఎంతమాత్రం శక్తి లేదు, నాకు భయం వేస్తోంది, మౌనమంటే భయమేస్తోంది, నువ్వేం చెప్తావోనని భయమేస్తోంది...''

ప్లూజ్నికొవ్ ఆమెను తన చేతుల్లోకి తీసుకున్నాడు, కంపిస్తున్న, వాచివున్న ఆమె పెదవులను మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు, అవి చిట్లి రక్తమోడుతున్నట్లు గ్రహించాడు.

''వాళ్ళు నిన్ను తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, ఏడవకుండా ఉండేందుకుగాను, నేను నా పెదవులను పళ్ళతో గట్టిగా బిగపట్టాను.''

''అవి బాధ పెడుతున్నాయా?''

''నన్నింతవరకు ఎవ్వరూ ముద్దుపెట్టుకోలేదు. అదుగో, ఆ పైన యుద్ధం జరుగుతోంది, కాని నేనిక్కడ సంతోషంగా, పరమ సంతోషంగా వున్నాను. ఆనందంతో నా హృదయం

పగిలిపోయేలా వుంది.'' ఆమె అతన్ని కరుచుకుపోయింది, దాదాపు శబ్దరహితంగా మాట్లా డింది. ''ఇప్పుడిక నువ్వు రాత్రంతా టేబిలు దగ్గర జాగారం చెయ్యకు, పడుకుని నిద్రపో, మరి నేనే రాత్రంతా నీ పక్కన కూర్చుని ఎలకల్ని తోలుతాను. కోల్యా, రాత్రంతా, జీవితమంతా — జీవితంలో మిగిలినన్ని రోజులూ — నీ సరసనే వుంటా.''

2

మరి వాళ్ల మాటలకి అంతే లేకపోయింది, అప్పటికీ వాళ్ళు చెప్పుకోవలసిన విషయా లన్నీ తరగనే లేదు. వాళ్ళు, ఓవర్‌కోటూ, పీ-జాకెట్టూ* కప్పుకొని, ఒకరి శరీరాన్ని మరొకరు వెచ్చబరుస్తూ ఒకరి సరసన మరొకరు పడుకున్నారు. వాళ్ల హృదయాలు — ఒకే మాదిరి ఉరుకులూ పరుగులతో, ఒకే మాదిరి బడలికతో — జమిలిగా కొట్టుకున్నాయి.

''నీ చెల్లెలు కూడా నీ పోలికేనా?''

''మాకిద్దరికీ అంత మరీ ఎక్కువ పోలికలేదు. అది మా అమ్మ పోలిక, నేను మా నాన్న పోలిక.''

''అయితే, మీ నాన్నగారు అందగాడై యుండాలి, అదే చాలా ముఖ్యం.''

''ఎందుకు?''

''అదృష్టవంతులైన మనవళ్లకెప్పుడూ తాతల పోలికలొస్తాయట.''

''మరి, అదృష్టవంతులైన మనవరాళ్లకో?''

''వాళ్లకీ అదే. సరేగాని నాకో విషయం చెప్పు — సత్యప్రమాణపూర్తిగా చెప్పాలి సుమా.''

''సత్యప్రమాణ పూర్తిగా.''

''ఒట్టేనా, నువ్వు అబద్ధం చెప్తే నన్ను చంపుకు తిన్నంత ఒట్టేనా?''

''సరే, నేను అబద్ధం చెప్తే నిన్ను చంపుకు తిన్నంత ఒట్టు.''

ఆమె ఆగింది, తర్వాత జరిగి, అతనికి ఓవర్‌కోటును మరింత బాగా కప్పింది.

''మీ అమ్మ నన్ను చూసి మరీ ఎక్కువ ఆశాభంగం చెందుతారా?''

మెల్లగా బెరుకుగా వున్న ఆ మాటలను బట్టి సమాధానం ఆమెకు ఎంత ముఖ్యమో అతను గ్రహించాడు. అతను ఆమెను మరింత దగ్గరగా పొదువుకున్నాడు.

''మా అమ్మ నిన్ను — గాఢంగా — ప్రేమిస్తుంది.''

''నువ్వు సత్యప్రమాణపూర్తిగా చెప్తానని ఒట్టేశావు గుర్తుందా?''

---

* నావికులు వాడే బొంతవంటి మందమైన కోట్లు. — సం.

''నేను నిజంగానే చెప్తున్నాను. వాళ్లిద్దరూ — అమ్మా, చెల్లాయీ కూడా — నిన్ను గాఢంగా ప్రేమిస్తారు.''

''బహుశా మాస్కోలో నాకీ వికారపు బ్రేస్ బదులు నిజమైన ఊతకాలు తయారు చేస్తారేమో కదూ? అప్పుడు నేను డాన్సు చెయ్యడం నేర్చుకుంటాను.''

''మాస్కోలో నిన్ను అందర్లోకీ మంచి డాక్టరు దగ్గరకి తీసుకువెళ్తాం. చాలా మంచి డాక్టరు దగ్గరకి. మరి నీకు —''

''అబ్బే, అదేం లాభం లేదులే. ఊతకాలు మాత్రమే.''

''సరే, అలాగైతే, ఒకటో రకమైనది చేయిద్దాం, అసలు నీ కాలికి లోపమున్నదన్న సంగతే ఎవళ్ళూ ఎప్పుడూ ఊహించలేనంత మంచిది తయారుచేయిద్దాం.''

''చూడు నువ్వెంత చిక్కిపోయావో!'' ఆమె తన మెత్తని చేత్తో గడ్డం పెరిగిన అతని బుగ్గలు తడిమింది. ''ఏమిటో తెలుసా, మనం వెంటనే మాస్కో వెళ్ళొద్దు. మనం యిక్కడ బ్రెస్ట్‌లోనే కొద్ది రోజులుందాం. మా అమ్మ నిన్ను కొంచెం బలవపెడుతుంది. నేను నీచేత కేరట్లు తినిపిస్తాను.''

''కేరట్లెందుకు, నేనేమన్నా కుందేలునా?''

''నీకు కేరట్లు మంచిది. అమ్మ వాట్లో యినుముందని చెప్తూ వుంటుంది. మరి నువ్వు కొంచెం బలిశాక, అప్పుడు మనం మాస్కో వెళ్దాం. నేనిప్పుడు రెడ్‌స్క్వేరూ, క్రెమ్లినూ, ఆఁ, అన్నట్టు, లెనిన్ మజోలీయమూ చూస్తాను.''

''మెట్రో కూడా.''

''ఔను, మెట్రో కూడా. మనం థియేటరు కెళ్దాం. నేను నిజమైన థియేటర్ని యింతవరకు చూడలేదు. మీన్‌స్క్‌నుంచి యిక్కడికో నాటకంకంపెనీ వచ్చింది. కాని వాళ్ళ తమ స్వస్థానంలో లేనందున నాటకం అంత బాగా రక్తికట్టలేదు. నా ఉద్దేశం బోధపడిందా?''

''ఆఁ. మనం మాస్కోలో అన్నీ చూద్దాం. అక్కడున్నవన్నీను. తర్వాత అక్కణ్ణుంచి వెళ్లిపోదాం.''

''బ్రెస్టుకా?''

''నన్నెక్కడికి పంపుతే అక్కడికి. నీ భర్త రెడార్మీలో కమాండరన్న సంగతి నువ్వు మరిచిపోయావేమిటి?''

''భర్త.'' ఆమె మృదువుగా, సంతోషంగా నవ్వింది. ''నేనేదో నిద్రపోతున్నట్టూ, కలగంటున్నట్టూ వుంది. నన్ను నీ కౌగిట్లోకి తీసుకో కోల్యా — గట్టిగా, యింకా గట్టిగా.''

మళ్లీ చీకటి, నేలమాళిగ, మూలల్లో కీచుకీచుమంటున్న ఎలకలు — సమస్తం లుప్తమైపోయాయి. యుద్ధం లేదు, లోకమంతట్లోనూ ఉన్నది యిద్దరే యిద్దరు — అతడు, ఆమె.

''నువ్వెప్పుడైనా గూడకొంగల్ని చూశావా?'' అతను అడిగాడు.

''గూడకొంగలా? ఏం గూడకొంగలు?''

''అవి చాలా అందంగా, తెల్లగా ఉంటాయిట కదా?''

''నాకు తెలియదు. పట్నంలో ఏమీ లేవు. మరెక్కడకీ నేను వెళ్లనూ లేదు. ఏం, ఎందుకు?''

''నాకు తెలియదు. నాకేదో జ్ఞాపకం వచ్చి అడిగానంతే.''

''నీకు చలెయ్యడం లేదు కద, ఏం?''

''అబ్బే లేదు — నీకు?''

''అబ్బెబ్బే. నేనీ మాట ఎందుకడిగానో తెలుసా? ఆ చివరి రోజు రాత్రి స్తెపాన్ మత్వేయెవిచ్ ఏం చెప్పాడో తెలుసా, నీ మనస్సు గడ్డకట్టేసిందన్నాడు.''

''గడ్డకట్టేసిందా? అదెలాగ?''

''యుద్ధం మూలంగా, విచారం మూలంగా, రక్తం చూసిన మూలంగా. మనుషులు యుద్ధంలో — లోలోపల — గడ్డకడతారని, ఆయన చెప్పాడు, నీకు అర్థమైందా? వాళ్ల రక్తం గడ్డకట్టేస్తుందనీ, ఆడది మాత్రమే దాన్ని వెచ్చచెయ్యగలదనీ ఆయన చెప్పాడు. కాని నేను ఆడదాన్ని అన్న సంగతి గాని, నేనెవరినైనా వెచ్చబరచగలననిగాని నాకు తెలియదు. నేను నిన్ను — ఏ కొంచెమైనా — వెచ్చపరిచానా?''

''వెచ్చపరచడమే కాదు, ఏకంగా కరిగించేశావు.''

''ఆఁ అదుగో, నువ్వు నన్ను చూసి నవ్వుతున్నావు.''

''అబ్బే లేదు, అది నిజం. నేను నీ పక్కన వుంటే కరిగిపోతానేమోనని భయపడుతు న్నాను. జర్మన్లు పైన — నీ, నా — మన దుర్గంపైన, కవాతుచేస్తున్నారు. నీకు తెలుసా, వాళ్లేదో పథకం వేశారు. తెరెస్పొల్ గేటు దగ్గర వాళ్లు శుభ్రంచెయ్యడం మొదలెట్టారు. నేను పైకి పోయి చూసివస్తాను.''

''నా ప్రియమైన కోల్యా, వెళ్లొద్దు. ఈ ఒక్క రోజు, ఒకే ఒక్క రోజు నీకోసం నేను భయపడనవసరం లేకుండా, ఉండిపో.''

''లేదు, నేను వెళ్లితీరాలి మీరా. లేకపోతే వాళ్లు మన దుర్గానికి నిజంగా తామే సర్వాధిపతులమనుకుంటారు.''

''అయితే, నువ్వు వెనక్కి తిరిగివస్తావో రావోనని, నేను మళ్లీ క్షణాలు లెక్కపెట్టుకొంటూ ఉండాల్సిందేనన్న మాట.''

''నేను సలక్షణంగా తిరిగివస్తాను. నేను పనికోసం వెళ్తున్నానంతే. ఇదుగో, భర్తలు ఉదయంపూట పనుల్లోకి వెళ్లిపోతారు, ఔనా? సరే, నేనూ అలాగే వెళ్తాను. నాకు దొరికిన పని యిలాంటిది కావడమే తేడా అల్లా.''

భూమి ఉపరితలానికింకా చేరకముందే ఫ్లూజ్నికొవ్‌కి ఇంజన్ల మోత వినవచ్చింది. నేల అదరడం అతనికి అనుభూతమైంది. దుర్గపు భారీ ఫిరంగులను ట్రాక్టర్లు తెరెస్పోల్ గేటు దగ్గరకు లాక్కెడుతున్నాయి. ఎక్కడ చూసినా జర్మన్లు, పెద్ద సంఖ్యలో వున్నారు. మొదట ఫ్లూజ్నికొవ్ దుస్సాహసం చెయ్యడం మంచిదికాదనీ, వెనక్కి వెళ్లిపోదామనీ అనుకున్నాడు. కాని జర్మన్లు తమ వ్యవహారాల్లో తాము నిమగ్నులైయున్న కారణంగా, మళ్లీ ఆలోచించినమీదట దూరానగల శిధిలాల దిశగా బయల్దేరాడు. అక్కడ ఒంటరిగా ఏ కాపలా సైనికుడో చేతికి చిక్కవచ్చు, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అదే అత్యుత్తమమైనదనుకున్నాడు.

అంతకు ముందుసారి తను భూమిపైకి వచ్చినప్పుడు అతను ఎడమ పక్కకు వెళ్లాడు. మలుపుకి ఆవల ముహవేత్స్ నది ఒడ్డుకి సంబంధించిన సమాచార సేకరణపట్ల అతను ఆసక్తి చూపాడు. ఇప్పుడతను మీర్రాతో వేరుపడటాన్ని గురించే ఆలోచించడంలేదు — ఆ ఆలోచనే అతన్నిప్పుడు భయంతో ఉలికిపడేలా చేస్తోంది. అందుకని అతను కుడి పక్కనగల నేలమాళిగలకు — అక్కడినుంచి మూడు కమాన్ల గేట్ల దగ్గరకి చేరుకొనేందుకు వీలుంటుందన్న ఉద్దేశంతో — వెళ్లాడు. ఇక్కడ జర్మన్లకెప్పుడూ కొదువ వుండదు, ఇక్కడ తన తడాఖా చూపించి దుర్గం ఎవరిదో వాళ్లకి గుర్తుచెయ్యవచ్చు.

అతను జాగ్రత్తగా — యింతకుముందు తను నెబొగాతొవ్ గన్నుకి ఎదురెళ్లిన మాదిరిగా కాకుండా చాలా జాగ్రత్తగా — వెళ్లాడు. నేలమాళిగల్లో జర్మన్లు తటస్థపడతారన్న భయం అతనికి లేదు, కాని వాళ్లు పైన వుండవచ్చు, తన కదలిక శబ్దాన్ని వినవచ్చు, అసంఖ్యాకంగా వున్న కంతల్లోంచి తనని వాళ్లు చూడవచ్చు. అందుకని అతను ఖాళీ జాగాల్లో పరుగున దూసుకెళ్లి, చీకటి కోణాల్లో జాగ్రత్తగా వింటూ చాలసేపు నిలబడుతున్నాడు.

అతను యిలాంటి ఒక చీకటికోణంలో వున్నప్పుడే అతనికి అడుగుల సవ్వడి వినవచ్చింది. ఎవరో అతని వంకకు నేరుగా, ముసలివాని మాదిరిగా కాళ్లీడ్చుకొంటూ, నిశ్శబ్దంగా వుండాలన్న ప్రయత్నం చెయ్యకుండా, నెమ్మదిగా వస్తున్నాడు. నిశ్శబ్దంగా ఫ్లూజ్నికొవ్ తన సబ్‌మెషీన్ గన్నును కాల్చేందుకు సిద్ధంచేసుకున్నాడు, ఉద్రిక్త సావధానతతో నిలబడ్డాడు. అనేక బిలాలతో, కంతలతో వెలుగుగా వున్న నేలమాళిగలగుండా వస్తున్నదెవరైనా, అతనికి తన గన్నుతో స్వాగతం పలికేందుకు సంసిద్ధంగా నిలబడ్డాడు. అప్పుడు, అతి సమీపంలో, ఎవరో నిట్టూర్చి, నెమ్మదిగా, బెంగగా అన్నాడు: "అబ్బ చలిగా వుంది, వణికిపోతున్నాను."

ఆ మాటలు రష్యన్ భాషలో వినవచ్చినందున — అందులో సందేహానికేమీ ఆస్కారం లేనందున — ఫ్లూజ్నికొవ్ ముందుకి వెళ్లబోయాడు. కాని అతనింకా కదలగలిగేందుకు ముందే ఆ అదృశ్య వ్యక్తి — శోకకాతర, బాల్య స్వరంలో, భావరహితంగా, స్వారస్య శూన్యంగా — పాడ నారంభించాడు.

"కపిల వన్నె గు(రం
గచ్చరంగు గు(రం
చుక్కచుక్కల గు(రం
ఎ(ర ఎ(రని గు(రం....."

ప్లూజ్నికొవ్ స్థాణువులా నిలబడిపోయాడు. ఆ శోకకాతర గీతంలో భయంకరమైన, నిరాశానిస్పృహలు వ్యక్తమయ్యాయి. మరి ఆ అజ్ఞాత గాయకుడు అదే పాటను అదే పనిగా పదేపదే రెట్టిస్తున్నాడు.

"కపిల వన్నె గు(రం
గచ్చరంగు గు(రం
చుక్కచుక్కల గు(రం
ఎ(ర ఎ(రని గు(రం...."

ప్లూజ్నికొవ్‌కి యిటుకలు పడుతున్న చప్పుడు, భారమైన ఊపిరి శబ్దం వినవచ్చాయి. ఆ అజ్ఞాత గయకుడు మలుపు వెనకనుంచి పైకంతనుంచి లోపలకు పడుతున్న కాంతి కిరణం కిందకు వచ్చాడు. ప్లూజ్నికొవ్ అతన్ని — యిటుకపొడి అంటి అతని జుట్టు ఎ(రబడినా — వెంటనే గుర్తుపట్టి, అతన్ని కలుసుకొనేందుకు ముందుకొచ్చాడు.

"వోల్కొవ్? వాస్యా వోల్కొవ్?"

వోల్కొవ్ ఆగాడు. అతను ఊగుతున్నాడు. అతని కళ్ళు నిస్తేజంగా, శూన్యంగా, భావశూన్యంగా వున్నాయి.

"వోల్కొవ్, గుర్తు తెచ్చుకో! నేను, ప్లూజ్నికొవ్‌ని! లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్‌ని."

"గచ్చరంగు గు(రం —"

"వాస్యా, నేను, నేను!"

"కపిల వన్నె గు(రం —"

"తెలివి తెచ్చుకో, వోల్కొవ్, తెలివి తెచ్చుకో!" ప్లూజ్నికొవ్ అతని చొక్కా ఎదర భాగాన్ని పట్టుకొని, గుంజాడు. "వింటున్నావా, నేను, లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్‌ని, నీ కమాండర్ని!"

వోల్కొవ్ ఉన్మత్త నయనాల్లో సగంలో క్షణకాలం స్పృహ తటాలున మెరుపులా మెరిసింది. ఇతనిక్కడికి, యీ నేలమాళిగలోకి ఎలా వచ్చాడు? ఇతనిన్నాళ్ళూ ఏం తిన్నాడు, ఎక్కడ ని(దించాడు, జర్మన్ల ఎదుట పడకుండా ఎలా తప్పించుకు తిరగగలిగాడు? ప్లూజ్ని

కొవ్ బుర్రలో యిదంతా గిర్రున తిరిగింది, కాని అతను మరో విషయం ప్రస్తావించాడు.

"అప్పుడు నువ్వెందుకు వెళ్లిపోయావ్, వోల్కొవ్?"

అతనా ప్రశ్న అడిగి ఊరుకున్నాడు — ఏ జవాబూ అవసరం లేకపోవడమే అందుకు కారణం. వోల్కొవ్ కళ్లలోని విపరీతమూ, వివరణాతీతమూ అయిన భయమే సరిపోయింది. వోల్కొవ్ భయాతిరేక కారణంగానే వెళ్లిపోయాడు, సరిగా యిప్పుడు ఆ హద్దులేని, అజేయమైన, పాశవికమైన భయాతిరేకమే లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్ రూపంలో సాక్షాత్కరించింది.

"వాస్యా, స్థిమితపడు. వాస్యా —"

వోల్కొవ్ ప్లూజ్నికొవ్‌ను మహోద్రేకంగా నెట్టి పారేశాడు, గాభరాగా రొప్పుతూ, మూలుగుతూ ఒక కంతగుండా, ముహవేత్స్ నదిపైన జాజ్వల్యంగా వున్న ఎండలోకి తుర్రుమన్నాడు. ప్లూజ్నికొవ్ వెనకనున్న గోడకి కొట్టుకుని పడ్డాడు. అతను తిరిగి లేచేసరికి అప్పుడే వోల్కొవ్ వెళ్లిపోయాడు. ఎండ కాంతీ, ఖాళీ జాగాల మూలంగా రొప్పుతూ యిప్పుడతను నేలపైన వున్నాడు. అతను ప్లూజ్నికొవ్‌ను అప్పుడే మరచిపోయి, భ్రమించిన తన బుర్రలో మిగిలిన ఏకైక పదాన్ని కూనిరాగాలు తీస్తున్నాడు.

"కపిల వన్నె గుర్రం
గచ్చరంగు గుర్రం...."

ప్లూజ్నికొవ్ కంత దగ్గరకి దూసుకెళ్లాడు; అతను వినలేదు, కాని యేదో పూర్వ సహజ జ్ఞానం కారణంగా విదేశీ బూట్ల ధడ్‌ధడ్ శబ్దం అతనికి అనుభూతమైంది. మరి ఆ బూట్ల చప్పుడు సరిగా అతని నెత్తిపైనే అవుతోంది, సకాలంలో అతను గోడకి కరుచుకొని దాక్కోగలిగాడు.

"గచ్చరంగు గుర్రం —"

"ఆగు! Zurück!"*

"చుక్కచుక్కల గుర్రం...."

ఒక కాల్పు వినవచ్చింది, కాని అంతకన్న బిగ్గరగా చెవులు గింగురుమనేలా వోల్కొవ్ — దయనీయమైన, బాల్యోచితమైన — అరుపు వినవచ్చింది. కింద కూలుతున్న యిటుకల మీదుగా ప్లూజ్నికొవ్ పరుగెత్తాడు, ఓ కంతలోంచి — యింకా బ్రతికి వున్న, మూలుగుతున్న — వోల్కొవ్ పైన మూడు ఆకారాలు వంగివుండటం చూసి, ట్రిగ్గరు నొక్కాడు.

---

* వెనక్కు (జర్మన్). — సం.

తన కాల్పు ఎవరికైనా తగిలిందో లేదో చూసేందుకు అతనికి వ్యవధి లేకపోయింది — తన కాల్పు తగిలిందని అనుకోవాలని అతను కోరుకున్నాడు, కాని అందుకూ వ్యవధి చిక్క లేదు. అతను నేలమాళిగల గుండా దౌడుతీశాడు, లోపల వున్న ఒక కిటికీ గుండా దూకాడు, పరిసరాల్లో వున్న శిధిలాల్లోకి పాక్కుంటూ వెళ్లాడు. సమీపంలో ఎక్కడో జర్మన్లు అడ్డ దిడ్డంగా పరుగెడుతున్నారు. నేలమాళిగల్లో సబ్ మెషీన్ గన్ కాల్పులు ప్రతిధ్వనించాయి; కొన్ని ప్రేలుళ్లు కూడా వినవచ్చాయి. కాని ప్లూజ్నికొవ్ యీసారి కూడా తప్పించుకు పోయాడు, శిధిలాల్లో అదృశ్యమయాడు. దూరానగల లోతైన గుంటలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత, అతను వెల్లడి ప్రాంతంలో పాకి, తన కంతలోకి దిగిపోయాడు.

వోల్కొవ్‌తో తన సమాగమం గురించి మీర్రాకు చెప్పడానికి అతను యిష్టపడలేదు — యిప్పటికే ఆమెకు బోలెడు దిగుళ్లున్నాయి. అందుకని అతను కంతదగ్గర చాలసేపు, మామూలు కన్న చాలసేపు, పైన శబ్దాల కోసం వింటూ, తన ఆయాసం తగ్గేదాకా — అందుకు అతని పరుగుకిన్న వోల్కొవ్‌తో ఆ సమాగమమే ఎక్కువ కారణం — నిలబడ్డాడు. అతను వోల్కొవ్ కళ్లలో క్షణకాలం తళుక్కున మెరిసిన స్పృహనూ, అతని కళ్లలో వ్యక్త మైన అమానుషమైన భయాతిరేకాన్నీ గుర్తుచేసుకున్నాడు. వోల్కొవ్ మొత్తంగా మనుషు లంటే గాక, తనపట్ల — లెఫ్టినెంట్ ప్లూజ్నికొవ్‌పట్ల — భీతిచెందాడని అతను గ్రహించాడు. తను నేరం చేశానన్న భావం అతనికి కలగలేదు. అలా అర్థరహితంగా మడిసిపోయిన క్రూరవానిపట్ల అతను జాలిపడ్డాడు, అంత మాత్రమే. యుద్ధం యీ పాటికి అతనికి తన తర్కాన్ని నేర్పింది.

తను మరింత తశ్శాంతి చెందాక, అతను నిశ్శబ్దంగా నడవ వెంబడి, చీకట్లో తడుము కోకుండా ముందుకెళ్లాడు. అతను బిలాన్ని తడిమి, దాని గుండా నిశ్శబ్దంగా పైకెక్కి, ఆగాడు. తన ముందు అస్పష్ట కాంతిలో మునిగివున్న కేస్‌మేటులోంచి ఒక యువతి సన్నని స్వరం వినవస్తోంది. మీర్రా పాడుతోంది.

> ''ఉజ్వల తారలబోలిన సుందర నయనాలతో
> నీ సాధుత్వంతో, జాలిగుండెతో
> నీ ప్రగాఢ కాంక్షానురక్తులతో
> నువ్వే నా హృదయగత ఏకైక వాంఛవి...''

ఇంతకు కొంచెం ముందు తను మరో నేలమాళిగలో విన్న పాటకీ — విషాదాంతంగా నులిమివెయ్యబడిన ఆ పాటకీ — యిప్పుడు తాదాత్మ్యం చెంది పాడుతున్న యీ లలితమైన పాటకీ మధ్య వున్న వైరుధ్యం అతన్నే ఉక్కిరిబిక్కిరిచేసింది. అస్పష్టమైన, నిరాశాజనక మైన బాధ అతని గుండెను పిండింది, మూలగకుండా ఉండటం అతనికి కష్టసాధ్య మైంది.

"నీ దివ్య ప్రేమను నువునాకర్పిస్తే
అగాధ జలనిధి అంతులు చూస్తా
నింగిన ఎగిరే పెనుమబ్బులు దూస్తా
విశాల జగతినె నీ పాదాక్రాంతం చేస్తా."

సంతోషంగా ఉన్న వ్యక్తినుంచి, చాలా సంతోషంగా వున్న వ్యక్తినుంచి, ఆ పాట వచ్చింది. ఆ గుర్తింపే అతని గుండెను సన్నగా నులిమినట్లయింది. యుద్ధం సమస్తాన్ని — చివరకు వారి తొలి ప్రణయాన్ని సైతం, ఉల్టాసీదా చేసింది.

అతను పిల్లిలా కేస్‌మేటులో ప్రవేశించాడు, చప్పుడైతే పాట ఆగిపోతుందన్న భయంతో, సబ్‌మెషీన్ గన్నును రొమ్ముకు ఆన్చిపట్టుకొని, గోడకి చేరబడ్డాడు. ప్రేలుళ్ల కారణంగా లేచిన ధూళిధూమాలతో ఉక్కిరిబిక్కిరై, విషాక్తమైన ఊపిరితిత్తులు బాధిస్తూండగా, అతనక్కడ నిలబడి పాట వింటున్నాడు. తను ఏదో చేసెయ్యాలని అతను ఆరాటపడుతున్నాడు, కాని అదేమిటో అతనికి అవగతం కాలేదు. తర్వాత అతనికి అర్థమైంది — తను ఏడ్వాలని కోరుకుంటున్నట్లు — అప్పుడతను చిరునవ్వు నవ్వాడు. అతనిలో కన్నీళ్లింకిపోయాయి.

అదెలా జరిగిందో గాని, అతని సబ్‌మెషీన్ గన్ను గోడకు కొట్టుకుంది. మీరా పాట నిలిపేసింది. అతను టేబిలు దగ్గరకు వెళ్లాడు. ఆమె ఆపేక్షగా, తనుమనోప్రాణాలతో, సరళంగా, ఉత్సాహంగా, అతనిపట్ల పూర్ణ విశ్వాసంతో అతని దగ్గరకు వెళ్లింది.

"నీకిప్పుడు భోజనం వడ్డిస్తాను." ఆమె చీకట్లో షెల్ఫుల దగ్గరకెళ్లింది. "చూశావా, యీ దరిద్రపు ఎలకలు దాదాపుగా బ్రెడ్ అంతా తినేశాయి. ఏదో కాస్తంత మిగిల్చాయంతే."

"నువ్వా పాట ఎక్కడ నేర్చుకున్నావ్?"

"రుబీమ్ మామయ్య నేర్పాడు, మే డే రోజున ఆయనకి గ్రామఫోనూ, రికార్డులూ బహూకరించారు. ఆయన గొప్ప ఫిడేలు వాద్యగాడు" — ఆమె నవ్వింది. "అయినా, నా మతి మండ, నేను నీకీ విషయం వేరే చెప్పడమెందుకు? నీకాయన తెలుసుకదా!"

"నేనెరుగుదునా?"

"నువ్వెరక్కపోవడమేమిటి, ఎరుగుదువు." మీరా తిండి పదార్థాలు తెచ్చి టేబిలు పైన అమరుస్తోంది. ఈ తతంగం ఆమెకు మహా యిష్టం. "ఆయన మూలంగా కాకపోతే మనం ఎన్నడూ కలుసుకొని వుండేవాళ్లంకాము, ఎన్నడూ — ఆలోచించు అది ఎంత భయంకరమైన విషయమో! ఆనందం ఒక్కొక్కసారి ఎంత చిన్న విషయంమీద ఆధారపడుతుంది! ఆ రోజు సాయంత్రం నీకు అంతగా నచ్చిన ఆ సంగీతం మూలంగా కాకపోతే —"

"నేనా రోజున భోజనం కావాలని కోరియుండకపోతే" అతను నవ్వాడు.

"లేక, నువ్వు మరో ట్రెయినుమీద వచ్చివుంటే."

''కాని నిజానికి నేను రావలసిన దానిమీద కాక వేరే (టైయినుమీదే వచ్చాను తెలుసా'' అని ఫ్లాజ్నికొవ్ చిరుచీకటిగా వున్న యీ కేస్‌మేటుకి తన ఆగమనారంభ — యుగాల వెనక అన్నట్లనిపించే — సమయాన్ని గురించి జ్ఞాపకం చేసుకొంటూ, అగాడు. ''ఇంతకీ నేను వేరే (టైయినుమీద ఎందుకొచ్చానో తెలుసా?''

''ఎందుకొచ్చావో చెప్పు, చెప్పు!'' ఆమె అతని ఎదుట కూర్చొని, తన గడ్డాన్ని తన చేతులపై ఆన్చి, వినేందుకు సన్నద్ధమైంది.

''నేను అప్పుడు (పేమలో మునిగివున్నాను. అంతా కలిసి ముప్పయ్యారు గంటలు.'' అలాగ అతను వాల్యాని గురించీ, తను అంతగా దాహంచేత పీడించబడినప్పుడు, తను కన్న అమాయకపు కలలను గురించీ చెప్పాడు. మీ(రా విని, నిట్టూర్చింది.

''వాల్యా — ఆమె అద్భుతమైన అమ్మాయి అయ్యుంటుంది.''

''నవ్వులా ఎందుకనుకొంటున్నావ్?''

''ఎందుకా, నిన్నామె (పేమించింది కనుక'' యిది తగిన కారణమే అనుకొంటు న్నట్లు, మీ(రా చెప్పింది. ''కాని, రేపు నీకేం పెట్టాలో నాకు పాలుపోకుండా వుంది. ఇంట్లో ఏ బాదం గింజలో లేకపోతే పస్తున్నట్లనిపించుకోదు, (బెడ్ లేకపోతే మా(తం పస్తు న్నట్టే లెక్క.''

''(బెడ్డు కదూ అన్నావ్?'' ఫ్లాజ్నికొవ్ పాత మ్యాపు తీశాడు. ''బేకరీ ఎక్కడుండేదో నీకు గుర్తుందా?''

''ముహవేత్స్ నది వార వుంది. ఇదిగో యిక్కడ (పధాన ఆహార పదార్థాల మెయిన్ స్టోరూ, కాంటీనూ వున్నాయి.'' నది ఒడ్డు వెంట ఏర్పాటుచెయ్యబడిన వలయాకారపు బ్యారక్సును మీ(రా వేలితో చూపింది. ''(కిస్తా అత్తతో కలిసి నేనక్కడకి వెళ్లాండేదాన్ని.''

''అయితే వాడికి అక్కడ దొరికిందన్న మాట తిండి'' ఫ్లాజ్నికొవ్ సాలోచనగా అన్నాడు.

''ఎవరికి?''

సరిగా మీ(రా స్టోరూ, కాంటీనూ ఉన్నాయని చూపించిన చోటుకి దగ్గర్లోనే తనకి తటస్థపడిన వోల్కొవ్‌ని గురించే ఫ్లాజ్నికొవ్ ఆలోచిస్తున్నాడు. కాని ఆమెకు అతను వోల్కొవ్‌ను గురించి చెప్పాలనుకోలేదు, అందుకని అతనో మార్గాంతరం వెతికాడు.

''నాకా సార్జెంటు గుర్తొచ్చాడు. నెబొగాతొవ్.''

మీ(రా మరేమీ (పశ్నలు వెయ్యలేదు.

జీవితమన్నది చిల్లరమల్లర సంతోషాల సమామ్నాయం. ఒకసారి, (కిస్తా అత్త యింకా (బతికి వున్నప్పుడు, అతనికొక సైనికటోపీ కనిపించింది. దాని మడతలో కాస్త పొడుగు నల్ల దారం ముక్కతో వున్న ఓ చిన్న సూది కనిపించింది. ఇక చూసుకోండి

నాయనా, ఆ దారపుముక్క చూసి ఆ రోజంతా ఆడాళ్లిద్దరూ ఎంత సంబరపడిపోయారో వర్ణించలేం. ఆ తర్వాత అతను, తనకి ఏది కనిపించినా — ఓ దువ్వెన, గుండీలు, కాస్త తీగ ముక్క, సొట్టలు పడిపోయిన మెస్ టిన్ను — తీసుకురావడం మొదలెట్టాడు. ఇలాంటి చిన్నచిన్న ఉపయోగకర వస్తువులను వెతికి పట్టుకురావడం అతనికి సరదాగా వుండేది. మరి యిప్పుడు బ్రెడ్డుకోసం వేటాడవలసిరావడం అతనికి సరదా అనే అనిపించింది.

కానైతే, కొన్ని రోజులవరకు, దుర్గంలో చాలమంది సైనికులున్న కారణంగా, యీ విషయంలో అతనేమీ చెయ్యలేకపోయాడు. రక్షణ బందోబస్తులు చెయ్యబడిన ప్రాంతాల్లో పట్టుకున్న భారీ ఫిరంగులను తెరెస్పోల్ గేటు దగ్గర శుభ్రంచేయబడిన వెల్లడిప్రాంతంలోకి జర్మన్లు లాక్కొచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన చీకటి కోణాల్లా వున్న కేస్‌మేట్లను వాళ్లు గాలించి వాటిలోకి గ్రెనేడ్లనూ, అగ్గిబరాటాలనూ గుప్పించారు. వాళ్లొక సారి నిరాయుధులై జీబురు గడ్డాలతో, చీలికలు వాలికలై వున్న యూనిఫారాలతో వున్న ముగ్గురు రష్యన్లను దుర్గపు తూర్పు భాగాన వున్న శిధిలాల్లోంచి నడిపించుకు రావడం ప్లూజ్నికొవ్ కంటబడింది. ఈ ప్రాంతం అతనికి తెలియనే తెలియదు, తను అక్కడికెన్నడూ వెళ్లనే లేదు. వీళ్లు తన సొంత మనుషులు, సోవియట్ సైనికులు, తను ఆ ప్రాంతాన్ని కనిపెట్టి అక్కడికి వెళ్లనందుకు విపరీతంగా — శారీరక బాధ అనిపించేటంత స్థాయిలో — అతను పశ్చాత్తాపపడ్డాడు.

కొద్ది విరామానంతరం జర్మన్లు తిరిగి శిధిలాలను గాలిస్తున్నారని తెలుసుకోగానే మీర్రా నిర్ద్వంద్వంగా చెప్పింది: "బ్రెడ్ విషయం పట్టించుకోకు. మనమెలాగో ఒక లాగ గడుపుకుందాంలే."

"నిజమే, మనం ఎలాగో ఒకలాగ గడుపుకోవలసిందే" ప్లూజ్నికొవ్ అన్నాడు. "అయినా నేనోసారి పైకెళ్లి చూసిరావాలి. వాళ్ల ఎత్తేమిటో?"

"అయితే, జాగ్రత్తగా ఉంటానని వాగ్దానం చెయ్యి."

"సరే, నేను వాగ్దానం చేస్తున్నాను."

"అలా కాదు, నా చేతిలో చెయ్యేసి ఒట్టెయ్యి. 'నిన్ను చంపుకు తిన్నంత ఒట్టు' అను."

"సరే, నేను ఒట్టేస్తున్నాను."

"అబ్బెబ్బే అలా కాదు, నువ్వా మాటలు అనాలి."

"నిన్ను చంపుకు తిన్నంత ఒట్టు" అని, అతనామెను ముద్దు పెట్టుకున్నాడు, తన సబ్‌మెషీన్ గన్ను తీసుకుని, పైకెళ్లాడు.

జర్మన్లు ఆ రోజున కదిపిన పుట్టలోని కందిరీగల మాదిరిగా వున్నారు. సైనిక శ్రేణులు రోడ్ల వెంట కవాతుచేస్తున్నాయి. ఎక్కడ చూసినా గస్తీ సైనికులున్నారు, చాల మంది తెరెస్పోల్ గేటు దగ్గర గుమిగూడి వున్నారు. ప్లూజ్నికొవ్ నిజంగానే ఎక్కడికీ

వెళ్ళలేకపోయాడు, వెనక్కి తిరిగి వెళ్లిపోదామని కూడా అతను అనుకున్నాడు, కాని చిట్టచివరి క్షణంలో గుట్టు చప్పుడుకాకుండా చర్చిలోకి జారుకోవాలనుకున్నాడు. అక్కడికి కనుక తను చేరుకోగలిగితే, అవసరమైనంత పైకెక్కి శత్రువు పథకమేమిటో తను కనిపెట్టవచ్చుననుకున్నాడు.

మధ్యమధ్య ఆగుతూ, ఒక్కొక్క గోతిలోనే చాలసేపు పడుకొంటూ అతను మెల్లగా, జాగ్రత్తగా పాకాడు. తను యిటీవల చాలా కాలంగా పాకని పద్ధతిలో, నేలబారుగా జారుతూ, తన చేతులూ, మోకాళ్ళూ యిటుక తుంటలపైన గీరుకుపోతూండగా అతను పాక్కుంటూ వెళ్లాడు. జర్మన్లు చాల దగ్గర్లో వున్నారు. అతనికి వాళ్ల స్వరాలు, వాళ్ల బూట్ల ధడ్‌ధడ్ చప్పుళ్లు, వాళ్ల ఆయుధాల రాపిడి శబ్దాలు వినవస్తున్నాయి. తనెక్కడికి వెళ్తున్నానో నిశ్చయించుకునేందుకుగాను తన తలను అతి కొంచెంగా ఎత్తేందుకు మాత్రమే అతను సాహసించాడు. చర్చిని సమీపించిన తర్వాత మాత్రం అతను లేచి దానిలోకి పరుగెత్తలేదు. అతను పాకుతూనే వెళ్లి ఒక కిటికీ గూడులో దూరి అక్కడ బిగిసిపోయి నిలబడ్డాడు.

అక్కడ సమాధిచెయ్యబడని కళేబరాల గబ్బు దారుణంగా వుంది. అతను తన చుట్టూ పరకాయించి చూశాడు. అతని కళ్లు అప్పటికే క్షీణకాంతిలో చూడటానికి అలవాటు పడ్డాయి. — నిజానికి కాంతి తక్కువగా వున్నప్పుడే అతను మరింత బాగా చూడగలుగుతున్నాడు. అతనికి ద్వారందగ్గర ఛిన్నాభిన్నమైన ఒక మెషీన్ గన్నూ, దాని చుట్టూ ఏడు కళేబరాలూ కని పించాయి. వాళ్లలో దాదాపు అందరికీ కూడా సరిహద్దు గస్తీ దళ సైనికులకుండే ఆకుపచ్చని బ్యాడ్జీలున్నాయి. వాళ్ల చుట్టూ ఖాళీ తూటాల పెట్టెలూ, బెల్టులకు పట్టుకొని వున్న మగజీన్లూ తప్ప మరేమీ లేకపోవడాన్ని బట్టి, చిట్టచివరి తూటా అయిపోయే దాకా వాళ్లు చర్చిని కాపాడారన్న విషయం అతనికి స్పష్టపడింది. ఒకప్పుడు తన మెషీన్ గన్ను వున్న చోటనే యిప్పుడీ మెషీన్ గన్ను వుంది, కానైతే యిప్పుడు గోడలోని కంత మాత్రం వెనకటికన్న పెద్దదిగా వుంది.

అతను విషయాలన్నింటినీ ఒక్క చూపులో అవగతం చేసుకున్నాడు, మరి అక్కడ ఆగకుండా మరింత లోపలి కెళ్లాడు. దుర్వాసన మూలంగా అతనికి వాంతి వచ్చేసేటట్లు వెలపరంగా వుంది. దానితో అతని గొంతులో డిక్కపెట్టినట్లయింది. తను స్పృహ కోల్పో తున్నట్లు అనిపించిందతనికి. అతను ఛిన్నాభిన్నం చెయ్యబడి, యిటుక ముక్కలూ, యిసుకా చెల్లాచెదరుగా పడివున్న మెట్ల దగ్గరకొచ్చి, మెట్లపైకి ఎక్కనారంభించాడు. మలుపులో కుళ్లుతున్న మరో రెండు కళేబరాలు అతనికి కనిపించాయి. అక్కడ ఆగకుండా వాటిని అతను దాటివెళ్లాడు. అతను పైపైకి, చిట్టచివరిదాకా ఎక్కాడు. ఇక్కడ పరిశుభ్రమైన గాలి వేస్తోంది, అతను తనివిదీర గాలి పీల్చుకొని, కొంచెం విశ్రాంతి తీసుకోగలిగాడు. తర్వాత అతను పైకప్పు అంచుకిందుగా ఓరగా నడుచుకుంటూ వెళ్లి దెబ్బతిన్న కిటికీలోకి చేరు

కోవాలి. అక్కడినుంచి అతను దుర్గపు దక్షిణ ప్రాంతాన్నీ, తెరెస్పోల్ గేటునీ విస్పష్టంగా చూడగలుగుతాడు.

అదృష్టవశాత్తూ అతనింకా అలా బయల్దేరలేదు, యీలోగా కింద చర్చియొక్క చీకటి సొరంగంలోంచి బిగ్గరగా అతనికి పదధ్వనులు వినవచ్చాయి. అతను బల్లిలా గోడకు కరుచుకుపోయాడు. ఆ భంగిమ ఎంత అవకరంగా ఉందంటే, అక్కడ అతను పడుకోనూ లేడు, దాక్కోనూ లేడు. జర్మన్లు — గస్తీ సైనికులేనని వేరే చెప్పనక్కర్లేదు — మెట్లెక్కి పైకి రావాలని వాళ్ల బుర్రల్లో ఆలోచన పుట్టి, పైకి రావడమే తటస్థిస్తే, వాళ్ళు మొదటి మలుపుకి రాగానే తను వాళ్ల కళ్లపడిపోతాడు — అందునా శారీరకంగా పోరాడలేని భంగిమలో.

కిందనుంచి స్వరాలు ప్రతిధ్వనిస్తున్నాయి, వాళ్లేమి మాట్లాడుతున్నదీ తెలుసుకోవడం అసంభవమే, ప్లూజ్నికొవ్ అందుకు ప్రయత్నించనూ లేదు. ఊపిరి పీల్చుకునేందుకు సైతం సాహసించకుండా, అతనక్కడే నిలబడ్డాడు, అడుగుల చప్పుడు విన్నాడు, అయినా వాళ్ళు తనను సమీపిస్తున్నారో, లేక యింకా ద్వారం దగ్గరే వున్నారో అతను తేల్చుకోలేకపోయాడు. స్వరాలు వినవస్తూనే వున్నాయి, ఓ సిగరెట్టు లైటరు క్లిక్కుమంది, కాలుతున్న గుడ్డపీలికల వాసన మెట్లమీదుగా పైకి తేలివచ్చింది. జర్మన్లు గుడ్డపీలికలెందుకు కాలుస్తున్నారో మొట్టమొదట అతనికి అంతపట్టలేదు, కాని జవాబు స్ఫురించడంతో బాధాకరమైన అతని ఉద్రిక్తత సడలింది: కళేబరాల దుర్వాసనను ముంచెత్తేందుకు వాళ్ళు గుడ్డపొగ పెడుతున్నారు. అంటే, చర్చి భవనంలో మరింత లోపలకి — దుర్వాసన మరింత దుర్భరంగా వున్న చోటుకి — వాళ్ళు వచ్చే అవకాశం దాదాపు లేదన్నమాట. అడుగుల చప్పుడు నిలిచిపోయింది, స్వరాలు మాత్రమే యింకా వినవస్తున్నాయి. దీన్ని బట్టి, కాపలా సైనికులు — యీ మృత, నిర్జన చర్చి భవనాన్ని ఏ కారణంగానో కాపలా కాయాలని నిర్ణయించుకొని — ద్వారం దగ్గర బైఠాయించారని స్పష్టపడుతోంది. ప్లూజ్నికొవ్ మెల్లగా ఊపిరి విడిచి, తన చుట్టూ పరకాయించి చూశాడు.

చూరుబోదె యిరుగ్గా, గిలాబా పెచ్చులతోను, యిటుక తుంటలతోనూ నిండివుంది. కాని అతనికి అంతకన్న గత్యంతరం లేదు. అక్కడ తనున్న చోట, మెట్ల పై అంచున ఉండటం సాధ్యం కాదు. జర్మన్లలో మరింత చాదస్తులూ, గట్టి పిండాలూ ఎప్పుడో అప్పుడు తనని అక్కడ కనుక్కోవచ్చు. కాని తను ఆ మందపు కిటికీలోకి చేరుకోగలిగితే అక్కడ తనకు మరుగూ వుంటుంది, పైగా తను ప్రాణాపాయాన్ని ఎదుర్కోన్నదెందుకో తను చూడనూ చూడగలుగుతాడు.

ఆ యిరుకు చూరుబోదె మీదుగా కిటికీని చేరుకోడానికి బాధకలిగించేటంతటి దీర్ఘ కాలం పట్టింది. ప్రతి బీటకూ, బొడిపెకీ అతను తన కాలివేళ్లను బిగించి పట్టుకున్నాడు,

గోడకి కరుచుకునే నడిచాడు, అటూయిటూ తూలిపడిపోకుండా చూసుకుంటూ జరిగాడు. రెండు సార్లు అతని కాలి క్రింది గిలాబా పెచ్చులు జారిపడ్డాయి, దానితో అతను కొరడు బారిపోయాడు. కాని కింది స్వరాలు యథాప్రకారం సన్నగా వినవస్తూనే వున్నాయి. చివరకు అతను కిటికీ గూటికి చేరుకొని, దానిలో సౌకర్యంగా కూర్చున్నాడు. ఆ తర్వాత మాత్రమే అతను జాగ్రత్తగా బయటకు తొంగిచూశాడు.

బాంబుల తాకిడికి ఛిన్నాభిన్నమైన వలయాకారపు బ్యారక్సు పైకప్పు అతనికి కానవచ్చింది. మెలికలు తిరిగిన బుగ్ నదీ, దానికి అవతలి పక్కన నాశనం చెయ్యబడిన యిళ్ళూ అతనికి కనిపించాయి. తెరెస్పోల్ గేటుదగ్గర వంతెన దగ్గర్నుంచి ప్రారంభమైన రోడ్డే కాకుండా, ఆ గేటూ, దానిక్రింద భారీ ఫిరంగులతో నిండివున్న పెరేడ్ మైదానం కూడా కనిపించాయి. రోడ్డు వెంటా, బారులు తీర్చబడిన భారీ ఫిరంగులను చేరివున్న పెరేడ్ మైదానంలోనూ చాలమంది జర్మన్లున్నారు. రోడ్డుమీద వున్న జర్మన్లు రోడ్డుకు యిటూ అటూ బారులు తీరి — మధ్య నడవ మాదిరి ఖాళీని కల్పించినట్లు — ఉండగా, మైదానంలో వాళ్లు నలుచదరంగా బారులు తీరి వున్నారు. వారికి మధ్య కొద్దిమంది — బహుశా ఆఫీసర్లు — వున్నారు. నీటుగా వున్న యీ పెరేడును చూస్తూంటే, వెనక తనూ, సార్జెంటు మేజరూ చెల్లాచెదరుచేసిన పతకాల బహుమతి ప్రదానోత్సవం, అతనికి జ్ఞాపకం వచ్చింది. కాని యిది దానికంటె ఎన్నో రెట్లు ఎక్కువ గంభీరంగా, లాంఛనయుక్తంగా వుంది. అయితే ప్లూజ్నికొవ్ ఎంతగా బుర్ర బద్దలుకొట్టుకున్నా, యిదంతా దేనికో తెలుసుకోలేకపోయాడు.

ఎక్కడో మిలిటరీ బ్యాండు మోగుతోంది. అటు తర్వాత రెండు ఆకారాలు — సైనిక బారుల సందున — రోడ్డు మీద నడుస్తూ రావడం కనిపించింది. అందులో ఒకడు ముదురు రంగు రెయిన్‌కోటులో వున్నాడు. మరింత పొడుగ్గా, లావుగా వున్న రెండో వాడు విడ్డూరమైన అర్ధసైనిక దుస్తుల్లో వున్నాడు. వాళ్ల వెనక కొద్దిదూరంలో మరికొందరు — జనరల్సో, లేక ఉన్నత హోదా కలిగిన యితర ఆఫీసర్లో అయ్యుంటారనడం స్పష్టం — వస్తున్నారు. మొదటి యిద్దరూ జనరల్సులాగ కనిపించడం లేదు. కాని, వాళ్ల గౌరవార్థం వాయించబడుతున్న సంగీతం, యీ పెరేడూ — యిక్కడీ దుర్గంలో, జర్మన్లు స్వాగతం చెప్తున్న ఈ యిద్దరు వ్యక్తులూ చాలా ముఖ్యమైన వ్యక్తులన్న సంగతిని చాటిచెప్తున్నాయి.

ఓహ్, యిప్పుడు నా చేతిలో ఒక రైఫిలుంటే — టెలెస్కోపిక్ సైటున్నది కూడా కాదు, శుద్ధ సాదా రైఫిలుంటే — ఎంత బాగుండును, అని అతను రెపరెపలాడాడు! అతను మంచి గురికాడు. ఇంత దూరంనుంచి తను ఆ యిద్దరు ప్రముఖుల్లో కనీసం ఒకడినైనా దెబ్బతియ్యడంలో సఫలుడు కాకపోయినా తను వాళ్లని భయభీతులను చేసి వుండును, వాళ్ల పెరేడును చెడగొట్టి వుండును, దుర్గం మీ బాబులది కాదురా ఒరేయ్, అని మరో సారి వాళ్లకి గుర్తుచేసివుండును. ఈ దుర్గం తనది, అది లొంగిపోలేదు, యింకా పోరాడు

తోంది. కాని తన దగ్గర రైఫిలు లేదు, యింత దూరంనుంచి తను సబ్‌మెషీన్ గన్నును వాడటం అర్థరహితమే అవుతుంది. అందుకనే అతను, తన దూరదృష్టిలోపానికి గాను తనను తాను తిట్టుకున్నాడు, తన పిడికిలిని యిటుకలకేసి కొట్టుకున్నాడు, తన పరిశీలనను కొనసాగించాడు.

ముందు వెళ్తున్న వ్యక్తులు తెరెస్పోల్ గేటుపైన గల బురుజు వెనుక అదృశ్యమయ్యారు, దాన్ని దాటి, తర్వాత దుర్గంలో, సైనికుల బారులతో ఏర్పరచబడిన నలుచదరం మధ్యకు వెళ్ళారు. వాయిద్యం నిలిచిపోయింది. ఆఫీసర్లలో ఒకడు చురుకుగా ముందుకొచ్చి రిపోర్టు చేశాడు. అతను చెప్పిందేమిటో ప్ల్యూజ్నికోవ్ వినలేకపోయాడు గాని, వాళ్ళిద్దరి చేతులూ నాజీ శాల్యూట్ చెయ్యడానికి పైకి లేవడం చూశాడు. ఆ కొత్త వ్యక్తులు రిపోర్టును స్వీకరించారు. పెరేడ్‌ను పర్యవేక్షించారు. తర్వాత ఫిరంగుల బార్లవెంట వాటిని సూక్ష్మంగా పరిశీలిస్తూ వెళ్ళారు. రిపోర్టు చేసిన ఆఫీసరు వాళ్లవెంట వుండి సగౌరవంగా వాళ్లకేదో వివరించి చెప్పాడు.

1941 వేసవి చివర బ్రెస్ట్ దుర్గాన్ని సందర్శించిన ఆ యిద్దరు వ్యక్తులూ ఎవరో ప్ల్యూజ్నికోవ్ ఎన్నడూ తెలుసుకోనేలేకపోయాడు. అతనికి తెలిసే వుంటే, నాజీ పెరేడ్ దిశగా తన డిస్కును ఖాళీచేసివుండేవాడే. తానిప్పుడు చూస్తున్నదెవరినో – దూరం మూలంగా నలుసులా కనిపిస్తున్న ఆ వ్యక్తి – ఎవని వ్యక్తిగత ఆజ్ఞ మూలంగానైతే 1941, జూన్ 22 తెల్లవారు ఝామున 4 గంటల 15 నిమిషాలకు, యీ దుర్గంపైన తొలి ఫిరంగికాల్పులు మ్రోగాయో – ఆ వ్యక్తి ఎవరో – అతనికి తెలియదు. తను చూస్తున్న ఆ వ్యక్తి నాజీ జర్మనీ ఫ్యూరర్ అడోల్ఫ్ హిట్లర్ అనీ, రెండో వ్యక్తి ఇటాలియన్ ఫాసిస్టుల నియంత బెనిటో ముస్సోలినీ అనీ అతనికి తెలియదు.

3

రోజుల తరబడి ప్ల్యూజ్నికోవ్ యిటుకలు తొలగించాడు. ఒక్కొక్క యిటుకనే అతను జాగ్రత్తగా ఊడదీసి, అంతకన్న జాగ్రత్తగా పక్కన పెడుతూ వచ్చాడు. కాపలా సైనికుల దృష్టిని – పెరేడ్ అనంతరం దుర్గంలోని జర్మన్ల సంఖ్య చాలా తగ్గింది – ఆకర్షిస్తానన్న భయంకంటె, తను చేసే చప్పుడు పదధ్వనులను, స్వరాలను, ఆయుధాల కణకణ శబ్దాలను తనకు వినిపించకుండా చెయ్యవచ్చునన్న భయమే అతనికి ఎక్కువగా వుంది. అతను పని చేస్తూనే చెవులు రిక్కించి వింటున్నాడు, ఒక యిటుకను పీకిన తరువాత, దాన్ని మళ్లీ క్రింద పెట్టేందుకు ముందు దాన్ని తన చేతిలో అతను కొంత సేపు పట్టుకుని వుంటున్నాడు. అతను అనేక శిథిలాల్లో దోవలను ఖాళీచేశాడు, కాని యింతవరకు మృత కళేబరాలూ, తుక్కు తుక్కైన ఆయుధాలూ తప్ప మరేమీ అతనికి కనిపించలేదు. స్టోరునుగాని, కాంటీనును

గాని పోలినది ఏమీ కనపడలేదు. మరి వాళ్ల రస్కుల నిల్వ ఎప్పుడో పూర్తిగా అయిపోయింది, అలాగే వాళ్ల డబ్బాల్లో నిల్వచేసిన ఆహార పదార్థాలు కూడా ఖాళీ అయ్యాయి. కొంచెం పంచదార మాత్రమే మిగిలింది. మీర్రా డబ్బా మాంసాన్ని దిగమింగలేకపోతోంది. అందుకని అతను రోజుల తరబడిగా నానివున్న యిటుకల గుట్టలను ఒక చోటునుంచి మరో చోటుకి భల్లూకపు పట్టుదలతో మారుస్తూనే వున్నాడు.

ఆకురాలుకాలం మొదట్లో వర్షం మొదలైంది. జల్లు హోరున కాకుండా సన్నగానే పడుతున్నా, రోజు చివరకి బొంతలాంటి అతని కోటు లోపలి దాకా నానిపోయి దాన్ని ఆరేసుకునేందుకు ఎక్కడా అవకాశమే లేకపోయింది. అతనికి మరో నాలుగు కోట్లు దొరికిన మాటా, మీర్రా అతనిచేత వాటిని మార్చిమార్చి తొడిగిస్తున్న మాటా నిజమే, కాని రోజూ అతను తనతోబాటు లోపలకి తెస్తున్న చెమ్మ కేస్‌మేటును ఆవరించే వుంటోంది, కనిపించకుండా నానాటికీ పెరుగుతూనే వుంది, యిప్పుడతను తన ఆయుధాలను రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకోవలసి వస్తోంది.

అయినాగానీ, జర్మన్లు యిప్పుడంత అధికంగా కనిపించడం లేదు. వాళ్లు పగటిపూట దుర్గంలో గస్తీ తిరుగుతూనే వున్నారు. కాని శిధిలాలకు మటుకు వాళ్లు సాధారణంగా దూరంగా ఉంటూ వస్తున్నారు. అందుకు భిన్నంగా వ్యవహరించిన యిద్దరు గస్తీ సైనికులు కిక్కురుమనకుండా ఎవరికీ చెప్పాచెయ్యకుండా యీ లోకంనుంచి సెలవు తీసుకున్నారు. ప్లూజ్నికోవ్ వాళ్లని ఒక్క వేటుతో హతమార్చాడు. దాని తర్వాత శిధిలాలను గాలించడానికి జర్మన్లందరూ పరుగెత్తుకురావడంతో అతను తన పిక్కబలం చూపాల్సివచ్చిన మాట నిజమే, కాని అతను బాగా లోతుగా వున్న నేలమాళిగలో దాక్కొని వుండి, రాత్రిపూట మీర్రా దగ్గరకు తిరిగివెళ్లాడు.

''కాల్చబోకు'' ఆమె గుసగుసగా అతన్ని అర్థించింది. అతను బాగా డస్సిపోయాడు, ఆమె అతని భుజాలను మృదువుగా నిమిరింది. ''నీకోసం నేనెంత ఆదుర్దాపడుతున్నానో, భయంతో ఎంత వణికిపోతున్నానో నువ్వు తెలుసుకుంటే ఎంత బాగుండును!''

ఈమధ్య సామాన్య పౌరులు – పెద్ద పెద్ద గుంపులుగా, చివరకు తమ గుర్రాలతో బాటు – దుర్గంలో కనిపిస్తున్నారు. వాళ్లు శిధిలాలను శుభ్రం చేస్తున్నారు, శవాలనూ, యిటుకలనూ మోసుకెళ్తున్నారు. వాళ్లు చర్చిని శుభ్రంచెయ్యడాన్నీ, ఏడుగురు సరిహద్దు గస్తీ సైనికులకు సంబంధించిన శరీరావశేషాలను ఎత్తివెయ్యడాన్నీ ప్లూజ్నికోవ్ చూశాడు. వాళ్లను కలుసుకునేందుకు అతను ప్రయత్నించియుండేవాడే, కాని జర్మన్లు వాళ్లని నిశితంగా పరిశీలిస్తూ, ఎప్పుడూ వాళ్లదగ్గరే వుంటూండేవారు. వాళ్లు చుట్టుపట్ల గ్రామాల్లోని సమష్టి వ్యవసాయ క్షేత్రాలకు చెందిన రైతుల్లా కనిపించారు. కాని తను మొట్టమొదటి రోజున ఏ తెల్ల భవనంనుంచి అయితే దాడికి వెళ్లాడో దానికి అవతల అతనికొక రోజున

ఓ పెద్ద మహిళా బృందం కనిపించింది. వాళ్లకి కూడా కాపలా వుంది. వాళ్లు విరగకుండా వున్న పెద్ద యిటుకలను ఏరి రోడ్డువార లాట్లుగా పేరుస్తున్నారు. సాయంత్రానికి లారీ లొచ్చాయి, ఆ ఆడాళ్లు యిటుకలను వాటిలో లోడ్‌చేశారు, లారీలు వెళ్లిపోయాయి. ఆడాళ్లను బారులుగా తీర్చి గేటుదగ్గరకు కాపలాలో తీసుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం వాళ్లు మళ్లీ వచ్చారు, మళ్లీ యిటుకలు ఏరారు. వాళ్లని అతను రోజంతా పరిశీలించాడు. వాళ్లకి ఒక్క అర్ధగంట భోజన విరామం ఉందని మాత్రమే అతను కనుగొనగలిగాడు. కాని అతను — రోజల్లా అవకాశం కోసం వేచియున్నా కూడా — వాళ్లలో ఎవరినీ పిలవనూలేకపోయాడు, ఏ సంజ్ఞా చెయ్యనూ లేకపోయాడు. వాళ్లను గురించి అతను చెప్పినప్పుడు మీర్రా ఎంతో ఉద్రిక్తురాలైంది.

"బహుశా వాళ్లు పట్నంనుంచి వచ్చారేమో! ఓహ్, నేను బ్రతికే వున్నానని అమ్మకి వర్తమానం పంపగలిగితే ఎంత బాగుండును!"

కాని అతను మగాళ్లకిగాని, ఆడాళ్లకిగాని ఒక్కగానొక్క మాట కూడా చెప్పలేక పోయాడు, చివరకు అతను ఆ ప్రయత్నాన్ని విరమించుకొని, తిండి పదార్థాల కోసం తన గాలింపును కొనసాగించాడు.

తనే తవ్విన లోతైన గుంటలో యిప్పుడు అతనున్నాడు. అతని చుట్టూ యిటుకలున్నాయి, యిప్పుడతను మరింత నెమ్మదిగా పనిచేస్తున్నాడు. మధ్యమధ్య శబ్దాలు వినేందు కోసం ఆగడమే కాకుండా, అవాంఛనీయమైన ఆగంతుక సందర్శనం కాకుండా అతను తరచుగా లేచి అంచుపైగా తొంగి కూడా చూస్తున్నాడు. ఇప్పుడతను తొందరగా చలికి బిగిసిపోతున్నాడు, అలసిపోతున్నాడు, ఆయాసంతో రొప్పుతున్నాడు, మధ్యమధ్య అతని గుండె గతితప్పి పక్కటెముకలకు ధడ్‌ధడ్‌మని కొట్టుకుంటోంది. అటువంటప్పుడతను పని చెయ్యడం మానేసి పడుకుంటున్నాడు, గుండె గతి యథాపూర్వ స్థితిని చేరుకునే దాకా ఓపికగా వేచియుంటున్నాడు.

ఇటుక ముక్కల సందులోంచి అతనికేదో గుండ్రంగా వున్న కొన్ని పెట్టెలు కనిపించాయి. అతను ఓపికగా వాటిదాకా తవ్వాడు. కాని దాదాపు అన్నీ నలిగిపోయాయి. తెల్లటి పౌడరు వాటిలోంచి చిందింది. అతను జాగ్రత్తగా తన చిటికెలోకి కొంచెం తీసుకొని వాసన చూశాడు. ఒక్క సారి ఉలికిపడ్డాడు — ఆ చక్కని పరిమళం ఆకస్మికంగా అతనికి తన తల్లిని గుర్తుకు తెచ్చింది.

"ఫేస్ పౌడరు" దెబ్బతినకుండా వున్న ఒకేఒక పెట్టెను అతను తీసుకొచ్చినప్పుడు, ముసిముసి నవ్వులు నవ్వుతూ మీర్రా అంది: "ఈ లోకంలో పౌడరు రాసుకుని, పెదాలకు రంగువేసుకుని, బాబ్‌చేసుకున్న జూలు ఎగరేసుకుంటూ తిరిగే ఆడాళ్లు నిజంగానే యింకా

వున్నారా అని? బహుశా నేను నా జీవితంలో మొట్టమొదటి సారిగా నా ముక్కుకి పౌడరు రాసుకోవాలేమో?''

''అక్కడ బోలెడంత వుంది. ముక్కుకే కాదు నుదుటికీ, బుగ్గలకీ కూడా రాసుకో వచ్చు.''

''ఏమన్నావ్, చాలానా?'' గుర్తుచేసుకునేందుకు ప్రయత్నిస్తూ ఆమె ముఖం చిట్లించింది. ''ఉండుండు, ఒక్క క్షణం ఆగు. కాంటీనులో ఒక కొట్టుండేది. అవును ఉంది, నాకు జ్ఞాపకమొచ్చింది. అయితే స్టోరు దానికి దగ్గర్లోనే — చాలా దగ్గర్లో — వుంటుంది.''

అతనక్కడ పూనకం వచ్చినవాడి మాదిరిగా — ఒక్కొక్క సారి ప్రమాద భయాన్ని కూడా మరచిపోయి — తవ్వాడు. రొప్పుతూ, తన గోళ్ళు విరగ్గొట్టుకొంటూ, తన వేళ్ళు రక్తపు కొల్లులయ్యేదాకా దోకుతూ అతను తవ్వాడు. కప్పు సాసర్ల ముక్కలూ, సీసా పెం కులూ, ప్యాకేజిపెట్టె పలకలూ అతను పక్కకు విసిరేశాడు. చివరకు, యిటుకల క్రింద, అతని వేళ్ళకి గురుకుగా వున్న గోనెసంచి ఉపరితలం తగిలింది.

అతనా సంచిని పైకి తీసేందుకు — స్పర్శద్వారా పనిచేస్తూ — రాత్రి బాగా పొద్దు పోయే దాకా తంటాలుపడ్డాడు. రెండు సార్లు యిటుకలు జర్రున జారిపడి అతను పడిన శ్రమనంతనీ వృథా చేశాయి. ఆ రెండు సార్లూ అతను, తన నిరాశానిస్పృహలను అణచుకొని, ఒకటొకటిగా యిటుకలను తొలగించి సంచి దగ్గరకు క్రమబద్ధంగా మళ్ళీ తవ్వాడు. చివరకు అతను — దెబ్బతినకుండా, గట్టిగా బిగించివున్న ఆ సంచిని — పైకి లాగగలిగాడు. అతనా తాడును తన చాకుతో కోసి, చేతిని సంచిలో జొనిపాడు. ముతకగా మందంగా వున్న స్టాండర్డు సైజు దీర్ఘ చదరపు సైనిక రస్కులు అతని చేతికి తగిలాయి.

క్రిందుగా వాలివున్న మేఘాలతో ఆకాశం ఆచ్ఛాదితమై వుంది. ఆ బిలంలో చీక టిగా వుంది. అతనొక రస్కును బయటకు తీసి, తన కళ్ళముందు పట్టుకున్నాడు, అది అతనికి కనిపించలేదుగాని, దాని వాసన — ఆకలిని రెచ్చగొట్టే కాల్చిన రై బ్రెడ్డు వాసన — అతని నాసికారంధ్రాలకు సోకింది. అతను దాని వాసనను — తను కంపిస్తున్నానన్న స్పృహ లేకుండా — చలినుంచి కాక ఆనందాతిరేకంతో వచ్చిన కంపన అది — ఆతృతగా మూచూశాడు. అతనా రస్కును నాకాడు, అతని నాలుకకు తడితడిగా ఉప్ప ఉప్పగా తగిలింది, అతడు గాభరాపడి దాన్ని మళ్ళీ నాకాడు. అప్పుడు గ్రహించాడు — ఆ సైనిక రస్కు పైపెచ్చు తన కన్నీటిలో నానిందని. అవి అలవాటులేని కన్నీళ్ళేమో, అవి కారిన సంగతిని కూడా అతను గ్రహించలేదు.

ఆ మరుసటి రోజంతా వాళ్ళు రస్కులు నములుతూనే వున్నారు. అది వాళ్ళ జీవితాల్లో బహుశా అత్యానందకరమైన రోజు. తను మీరాకు యీ ఆనందాన్ని సమకూర్చగలిగినందుకు ప్ల్యూజ్నికొవ్ సంతోషించాడు.

ఇటీవల ఆమె తరచుగా కన్నీళ్ళు పెట్టుకోవడం అతని కంటపడింది. అతని కళ్ళ

బడినప్పుడు ఆమె చిరునవ్వు నవ్వి, పరియాచకాలాడేందుకు ప్రయత్నించేది, మొత్తంమీద ఏదో తభావతుందని అతను గ్రహించగలిగాడు. మీరా ఎప్పుడూ దేనికోసమూ సణిగేది కాదు, ఆమె ఎప్పుడూ ప్రశాంతంగా, సరదాగా కూడా వుండేది. కాని రాత్రిపూట తను నిద్రలో కూరుకుపోయే సమయంలో కన్నీళ్లతో, ప్రేమతో, నిరాశతో ఉక్కిరిబిక్కిరవుతూ, ఆమె తనను మృదువుగా తడుముతోంది. ఒక్కొక్క సారి డోకులు ఆపుకోలేక ఆమె సతమతమవు తూండటం కూడా అతను కనిపెట్టాడు. ఎప్పుడూ ఒకే రకపు తిండి తింటూ వుండటమే అందుకు కారణమని అతను నిర్ణయించుకున్నాడు. రస్కులూ, డబ్బా మాంసమూ కాకుండా మరేదైనా ఆమెకోసం తెచ్చిపెట్టాలని అతను అనుకున్నాడు, కాని ఏం తేవాలో, ఎక్కణ్నుంచి తేవాలో అతనికి తెలియలేదు.

"ఇదిగో చూడు, నేనొక మాంత్రికుడినన్నట్టు నటిద్దాం, ఏం?"

"కాని నువ్వు నిజంగా మాంత్రికుడివే" ఆమె అంది. "నువ్వు నా జీవితంలో ఆనందాన్ని ప్రసాదించావు, మాంత్రికుడు కాక మరెవరు చెయ్యగలరా పని?"

"సరేనా, నేను మాంత్రికుడ్ని, నీకేం కావాలో కోరుకొమ్మన్నాననుకో. అప్పుడు నువ్వేం కోరుకుంటావ్? బాగా అసాధ్యమైనదేమైనా కోరుకో."

"పొట్టలో పిండి కూరిన సైక్ చేప, వినిగర్ ఉప్పులో ఊరేసిన ఓ పెద్ద దోసకాయా కావాలి, తెప్పించు చూద్దాం."

అతని బుర్రకి ఓ పిచ్చి ఆలోచన తట్టింది. అతను మీరాకేమీ చెప్పలేదు. కాని ఆ మరుసటి ఉదయం అతనో నాలుగు రస్కులు తీసుకుని, మామూలుకన్న మరింత పెందరాళే – యింకా చీకటిగా వుండగానే బయల్దేరాడు.

"ఈ రోజు బయటకి వెళ్లకు" మీరా మెల్లగా బతిమాలింది. "దయచేసి వెళ్లొద్దు."

"ఆదివారం అయిపోయింది కదా" అతను పరాచికమాడేందుకు ప్రయత్నించాడు.

"వెళ్లొద్దు బాబూ" అదేదో విలక్షణమైన బెంగతో ఆమె రెట్టించింది. "నా దగ్గరే వుండు, నువ్వీ మధ్య నాకు కనిపించడమే అరుదైపోయింది."

"నేనొకవేళ యిక్కడే ఉన్నా కూడా నా ముఖం నీకెలాగా కనిపించదు."

వాళ్లీ మధ్య కొవ్వు పొదుపుచేసేందుకుగాను ఒక్క కొవ్వొత్తే వెలిగిస్తున్నారు. దట్ట మైన చీకటి వాళ్లను అన్ని వేపులనుంచీ ఆవరించేది, చాల సేపు వాళ్ళు దోవ తడువుకుంటూ గడుపుతున్నారు.

"నీకు నేను కనిపించక పోవడమూ ఒకందుకు మంచిదే" మీరా నిట్టూర్చింది. "నేను భయంకరంగా తయారయ్యాను."

"ఛీ అదేమిటి, నువ్వు అందరికంటె అందంగా చక్కగా వున్నావు" అని, అతను ఆమెను ముద్దుపెట్టుకొని బయటకి వెళ్లాడు.

ఫ్లాజ్నికొవ్ బయటికి వెళ్లేసరికి అప్పుడప్పుడే వెలుతురు వస్తోంది. అతను నిల బడ్డాడు, చుట్టూ శబ్దాలకోసం విన్నాడు, కాని ఏమీ వినిపించలేదు — విసుగు కలిగించేలా పడుతున్న జల్లు తప్ప. దానితో అతను తెల్ల భవనం దిశగా జాగ్రత్తగా నడిచి వెళ్లాడు. అతను సురక్షితంగా రోడ్డు దాటాడు, యిటుక గుట్టలమీద తడబడుతూ, ఒక లోతు నేల మాళిగలోకి చేరుకున్నాడు.

యుద్ధారంభపు తొలిగంటల్లో క్షతగాత్రులను తాము అట్టేపెట్టిన చోటులా వుందిది. సీనియర్ లెఫ్టినెంట్ కొనవూపిరితో పడుకున్నదక్కడే — ఆయన చచ్చిపోయాడని నమ్మ డానికి తన మనస్సెలా తిరస్కరించిందో అతను జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ నేలమాళిగనుంచి కళేబరాలు తొలగించబడ్డాయి, కాని మృత్యు వాసన యింకా అక్కడే పట్టుకు వేలాడుతున్నట్టుంది, దాదాపు శరీరానికి తాకుతున్నట్టే వుంది. యుద్ధపు తొలి గంటల్లో కొన ఊపిరితో అక్కడ పడుకొనివున్న ఆ వ్యక్తిని తనెక్కడ తొక్కుతానో అని భయపడుతున్నట్లు ఫ్లాజ్నికొవ్ జాగ్రత్తగా నడిచాడు. తను యితరులకు కనిపించకుండా యితరులను తను చూసేందుకు అనువైన కిటికీ కన్నం కోసం అతను వెతకులాడాడు. ధూమ్రవర్ణపు మచ్చల్లా వున్న పగుళ్ళు, కన్నాలు, పెద్దపెద్ద ద్వారాల వంటివి అతనికి చాలానే కనిపించాయి. తనకి అనువైన ఓ కన్నం చూసుకొని, తన సబ్‌మెషీన్ గన్నును తన పక్కనే పెట్టుకొని, దీర్ఘకాల నిరీక్షణకు సంసిద్ధుడై, యిటుకలమీద కూర్చున్నాడు.

ఇది చాలా చిత్రమైన విషయం — సహజంగా తను తొందరపాటు స్వభావం గలవాడు, ఉద్వేగపరుడు, కాని యిప్పుడు నిరంతరాపాయ పరిస్థితి అతనికి వేచియుండటాన్ని నేర్పింది; అందులోనూ, నిశ్చలంగా, పొంచియున్న జంతువు మాదిరిగా నిరీక్షించడాన్ని అతనికి నేర్పింది. చాలా కాలం క్రితం జరిగిపోయిన అంశంలాగ, మిలిటరీ స్కూలు కమాండరు కోసం తను వేచియున్న సందర్భాన్ని అతను గుర్తుచేసుకున్నాడు. ఆ నాటి తన యువజన సహజమైన ఆత్రుతను, నున్నగా మిలమిలలాడేలాగ పాలిష్ చేసుకున్న తన బూట్లను, ఎంతో సౌకర్యంగా, మెత్తగా పరిశుభ్రంగా వున్న సైనిక కోటునూ అతను గుర్తుచేసుకున్నాడు. "ఒక ఏడాదిలో మిమ్మల్ని వెనక్కి మిలిటరీ స్కూలుకి రప్పిస్తాం." ఒక ఏడాదిలోట! ఇప్ప టికప్పుడే ఓ యుగం గడిచిపోయినట్టుంది. మరి ఏడాది ఎప్పుడు ముగుస్తుంది? తీరాచేసి, కేలెండరు పైముకన్న యుగం స్వల్పకాలికంగా తేలింది. యుగాన్ని అనుభూతి చెందుతాం, కాని కాలాన్ని జీవించవలసి రావడమే యిందుకు కారణం.

అతను తన తల్లినీ, వేరానీ జ్ఞాపకం చేసుకున్నాడు. జర్మన్లు రష్యాలోకి బాగా లోపలకి చొచ్చుకువెళ్లారన్న సంగతి అతనికి తెలుసు, కాని వాళ్లు మాస్కోను ఆక్రమించుకో గలరని మాత్రం అతను క్షణకాలం కూడా వూహించలేకపోయాడు. వాళ్లు మీన్‌స్క్ దాకా గెంటు కెళ్లవచ్చు, ఏ స్మొలేన్స్క్ దగ్గరో సైతం పోరాడవచ్చు, కాని వాళ్లు మాస్కోను సమీపించగలరన్న ఆలోచనే అతనికి అసందర్భమైనదిగా తోచింది. రెడార్మీ భయంకరంగా

పోరాడుతున్నట్లూ, నాజీ సైనిక డివిజన్లను నలిచిపారేస్తున్నట్లూ అతను తన మనస్సులో చిత్రించుకున్నాడు. రెడార్మీ నాజీలను నుగ్గునూచం చేస్తుందనీ, తర్వాత పురోగమిస్తుందనీ, వసంతరుతువులో ఏదో ఒకప్పుడు రెడార్మీ తిరిగి యిక్కడ యీ బ్రెస్టు దుర్గానికి తిరిగి వస్తుందన్న విషయంలో అతనికి పూర్తి విశ్వాసముంది. వసంతరుతువు రావడానికింకా చాలా వ్యవధి వుంది, కాని అతను అంత దాకా బతికివుండేందుకు దృఢసంకల్పం చేసుకున్నాడు. తన బలగాలను కలుసుకోవాలనీ, దుర్గాన్ని జర్మన్లకు లోబరచలేదని రిపోర్టు చెయ్యాలనీ, మీరాను మాస్కోకు తన తల్లిదగ్గరకు పంపాలనీ, తను రెడార్మీతో — పశ్చిమ దిక్కుకి, జర్మనీకి — వెళ్లాలనీ అతను దృఢసంకల్పం చేసుకున్నాడు.

చివరకు అతనికి అడుగుల చప్పుళ్లు — సైనికుల లయబద్ధమైన బూట్ల చప్పుడు కాక, అడ్డదిడ్డంగా, కలగాపులగంగా పౌర పాదధ్వనులు — వినవచ్చాయి. అతను పైకి తొంగిచూశాడు. మహిళలు మెల్లగా తెల్ల భవనాన్ని సమీపిస్తున్నారు. ముగ్గురు గస్తీ సైనికులు ముందూ, నలుగురు వెనకా, మహిళల బార్లకు యిటూ అటూ ముగ్గురేసి చొప్పునా నడుస్తున్నారు. ముందూ, వెనకా వున్న గస్తీ సైనికుల దగ్గర మాత్రమే సబ్‌మెషీన్ గన్నులున్నాయి. ఇరుపక్కలా ఉన్నవాళ్ల దగ్గర రైఫిళ్లున్నాయి. దూరాన్నుంచి ఆ రైఫిళ్లు విభ్రమ గొలిపేటంత పొడుగున్నట్లు కనిపించాయి, కాని ఆ బార్లు సమీపించేకొద్దీ అవి ముక్కోణపు బయనెట్లున్న సోవియట్ రైఫిళ్లని అతను గ్రహించాడు. ఆ మహిళలను కాపలాకాస్తున్నది ఒక్క జర్మన్లు మాత్రమే కారనీ, జర్మన్లతో కుమ్మక్కయిన ఫెడొర్చుక్‌లు కూడా ఉన్నారనీ అతను అర్థంచేసుకున్నాడు.

ఆజ్ఞాస్వరం వినరావడంతో ఆ బార్లు ఆగాయి. గస్తీ సైనికులు తమతమ స్థావరాలకెళ్లారు, ఆడాళ్లు శిథిలాల దగ్గరకు, నేరుగా తన వంకకు వచ్చారు. దానితో అతను చీకట్లోకి వెనక్కి తగ్గాడు. మెల్లగా కబుర్లు చెప్పుకొంటూ ఆడాళ్లు పనికి ఉపక్రమించే ముందు కొంచెం విశ్రాంతి తీసుకున్నారు, కొందరు తమ బూటుతాళ్లు బిగించుకున్నారు, మరికొందరు తమ తలరుమాళ్లు ఊడదీసి మళ్లీ బిగించి కట్టుకున్నారు. వాళ్లు బాగా దగ్గర వున్నారు, వాళ్ల బొంతకోట్ల మీదుగా, కోట్ల మీదుగా నీళ్లు కారడాన్ని ప్లూజ్నికొవ్ చూశాడు. తలరుమాళ్లను బాగా కిందికి లాక్కున్న కారణంగా వాళ్ల ముఖాలు దాదాపు మూసుకుపోయి వున్నాయి. అతనికి వాళ్ల స్వరాలు వినిపిస్తున్నాయి, కాని వాళ్ల వయస్సులెంతో, వాళ్లెవరో మాత్రం తెలియరాలేదు. వాళ్ల ముఖాలన్నీ కూడా ఒకే విధంగా పీక్కుపోయినట్లున్నాయి. ఒకే విధంగా వ్యధాభరితంగా వున్నాయి. రష్యన్ వాక్యాలకుతోడు, బెలోరష్యన్ వాక్యాలూ, తనకు అర్థం కాని వాక్యాలూ — బహుశా పోలిష్ వాక్యాలో, లేక యిద్దిష్ వాక్యాలో — అతనికి వినవచ్చాయి. అతను వాళ్లను తేలికగా తన దగ్గరకు పిలిచియుండగలిగేవాడే — గస్తీ సైనికులు దరిదాపుల్లో ఎక్కడా లేనందున — వాళ్లతో మాట్లాడను గూడా మాట్లాడగలిగే వాడే,

కాని యీరోజున అతను దుస్సాహసానికి పూనుకోదలచలేదు. అందుకని అతనా పనిని మరు సటి రోజుకి — అప్పటికి తను యీ నేలమాళిగను జాగ్రత్తగా శోధించి, భద్రంగా వెనక్కి తప్పుకొనేందుకు ఒక మార్గాన్ని వెతుక్కొని వుంటాడు కనుక — వాయిదా వేసుకున్నాడు.

అతని కిటికీ దగ్గర వెల్తురు మచ్చ అకస్మాత్తుగా నల్లబడింది. ఏం జరిగినదీ, మొదట్లో అతను గ్రహించలేకపోయాడు, అందుకని చీకట్లోకి మరింత వెనక్కి తగ్గాడు. అప్పుడా కిటికీ లోకి మళ్లీ వెల్తురొచ్చింది, కాని యీ సారి దాని ఆకారం మరోలా వుంది. అతను మరింత దగ్గర్నుంచి చూసినప్పుడు, దాంట్లో ఓ మూట పెట్టబడివుండటం అతనికి కనిపించింది. సామాన్య స్త్రీలు నాలుగు చెంగులూ ముడేసికట్టే గుడ్డమూట అది. అక్కడి ఆడాళ్లలో ఒకామె, ఆకురాలుకాలపు సన్నటి జల్లుకు తడవకుండా ఉండేందుకుగాను దాన్ని నేలమాళిగ కిటికీ అంచుమీద పెట్టింది.

ఆ స్త్రీలు యిటుకలు ఏరడం మొదలెట్టగానే అతను జాగ్రత్తగా ఆ మూటను తీసుకున్నాడు. అతను పై గుడ్డ ముడివిప్పాడు, తర్వాత లోపలి తెల్లని గుడ్డ ముడులు విప్పాడు, నెమ్మదిగా నవ్వుకున్నాడు. అతని జీవితంలో యింత అదృష్టం యింతకు ముందెన్నడూ అతనికి తటస్థపడలేదు. తొక్కతోబాటు ఉడకబెట్టబడిన ఆరు బంగాళాదుంపలు, ఒక ఉల్లిపాయ, కొంచెం ఉప్పు అతని ముందున్నాయి.

నడుములు వంచి, నిరాశగా, వర్షంలో నానుతూ నిర్బంధచాకిరీ చేస్తున్న ఆ స్త్రీ మూర్తులవంక అతను కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు. వారిలో ఒకరు, తనకు తెలియకుండానే, తనకు మిక్కిలి విలువైన బహుమతి నిచ్చింది. అతనొక క్షణం ఆలోచించి, మూడు సైనిక రస్కులను ఆ గుడ్డలో పెట్టి యధాప్రకారంగా నాలుగు మూలలూ ముడేసి వెనకటి చోట పెట్టేశాడు. బంగాళదుంపలూ, ఉల్లిపాయా వున్న తెల్లగుడ్డ మూటను తన సైనికకోటు జేబులో పెట్టుకొని, నేలమాళిగలో బాగా దూరంగా వున్న ప్రాంతానికి పోయి కూర్చున్నాడు. ఓ రస్కును కొరుకుతూ, తను యివ్వబోయే బహుమతికి మీరా ఎంతగా సంతోషిస్తుందో ఆలోచించుకొంటూ రాత్రి పడేదాకా అక్కడ కూర్చున్నాడు.

"నువ్వు నిజంగానే మాంత్రికుడివా?"

తెల్ల భవనాన్ని గురించీ, దాని నేలమాళిగలను గురించీ, స్త్రీలను గురించీ, ఆ మూటను గురించీ అతనామెకు చెప్పాడు. మీరా వింది, బంగాళాదుంపలు తింది — కాని ఆమె ఎలా తినాలని అతను కోరుకున్నాడో అలా మాత్రం ఆమె తినలేదు. వాటి స్వారస్యాన్ని నిజంగా అనుభవించడానికి — ఆమెకేదో అడ్డు పడుతున్నట్లు — ఏదో ఒక ఆలోచన ఆమె మనస్సును అంతసేపూ వేధిస్తున్నట్లు — ఆమె కనిపించింది.

"నువ్వేమంత సంతోషంగా వున్నట్లు లేదే?"

"లేనూ? ఎందుకు? థాంక్ యూ. నీ వాటా తీసుకో."

''అవన్నీ నీకే, వాదించకుండా తిను. నేనేదైనా తినగలను, కాని నువ్వు తినలేకపోతున్నా వన్న సంగతి నాకు తెలుసు.''

''అల్లరి పిల్లాడా'' ఆమె నిట్టూర్పులో ఏదో చిత్రమైన బాధ వ్యక్తమైంది. ''బాప్‌రే, నీకింకా అల్లరి వదల్లేదే!''

ఆమె అతన్ని పొదువుకుని, తన ముఖాన్ని అతని రొమ్ములో దాచుకొని, గుడ్ల నీళ్ల కుక్కుకుంది. ఆ కన్నీళ్లు యింకా తినకుండా మిగిలిన ఒక బంగాళదుంపపైన పడ్డాయి.

''ఏం జరిగింది? మీరా, నీకేం జరిగింది?''

మీరా తన తల పైకెత్తి, అతని వంక — దీర్ఘంగా చాలసేపు — చూసింది. క్షీణ కాంతి ఆమె ముఖంపై పడింది. అతనామె విషాదపూర్ణ విశాల నయనాలనూ, కొవ్వొత్తి క్షీణకాంతిలో మెరుస్తున్న కన్నీటి బొట్లనూ చూశాడు.

''మీరా —''

''మనం విడిపోవాల్సివుంటుంది'' ఆమె మృదువుగా — ఒక్కొక్క మాటనే కష్టం మీద అంటూ — చెప్పింది. ''నా ప్రియతమ భర్తా, నా ప్రేమరాశీ, మనం విడిపోవాల్సి వుంటుంది.''

''విడిపోవాలా?!'' అతను పూర్తిగా విభ్రాంతుడయ్యాడు. ''ఎలాగ? ఎందుకు? నీకు వంట్లో బాగా లేదా? చెప్పు, చెప్పు!''

''మనకి పాపాయి పుట్టబోతున్నాడు.''

''ఏమిటి? పాపాయా?''

మిన్ను విరిగి మీద పడినట్లయింది అతనికి. సరైన అవగాహనగాని, గ్రహింపుగాని లేకుండా అతను భయపడ్డాడు. ఒంటరితనానికి సంబంధించిన దారుణమైన భయం అతని హేతుజ్ఞానాన్ని లుప్తంచేసింది.

''వింటున్నావా, నేనూ సహజమైన ఆడదాన్నే.'' మీరా స్వరంలో చిత్రమైన, అసంబద్ధమైన గర్వం ధ్వనించింది. ''నేను సహజమైన ఆడదాన్ని, ఇప్పుడు సంభవించినది కూడా సహజమైనదే. బహుశా యిది సంతోషకర విషయం కూడా. ఔను, నిజంగానే యిది చాలా సంతోషకర విషయం. కాని యీ ఆనందం కోసం నువ్వు మూల్యం చెల్లించాల్సి వుంటుంది.''

''వెళ్లిపోకు మీరా'' అతను ఘోరమైన నిరాశతో అన్నాడు. ''ఏం జరిగినా సరే నువ్వు వెళ్లిపోవద్దు.''

తను చెప్తున్నదేమిటో అతను ఆలోచించలేదు, అతని నిరాశే అతనిచేత అలా మాట్లాడించింది.

మీరా నెమ్మదిగా తలాడించింది.

''నేను వెళ్లాలి.''

''ఔనులే, అంతేలే, నాకు అర్థమైంది.''

అప్పటికే ఎడబాటు అతనికి అనుభూతమైంది, ఏకాంతంలో తను మునిగిపోయినట్లు అనిపించింది. ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగింది. అతనికి తనను తాను గట్టిగా ఒత్తుకుంది. గుంటలు పట్టిన, గడ్డం దుబ్బులా పెరిగిన అతని బుగ్గల్ని నిమిరి, ముద్దులు పెట్టింది. అతను శిలా విగ్రహం మాదిరిగా నిశ్చలంగా కూర్చుండిపోయాడు.

వాళ్ళు అలా చాలసేపు కూర్చుండిపోయారు. మీర్రా అతనికి వివరించి చెప్పాలనీ, అతన్ని ఒప్పించాలనీ ప్రయత్నించలేదు — ఈ ఆలోచనకు తను యింతకు ముందే అలవాటు పడినట్లుగా — అతను కూడా యీ ఆలోచనకు అలవాటుపడాల్సివుంటుందన్న సంగతి ఆమెకు తెలుసు. కాని అతనికి తనిప్పుడు పొందుతున్న బాధ చావుకన్న ఘోరమైనదిగా కనిపించిన కారణంగా పైకప్పు ఎగిరిపోయేలా అరవాలనిపించింది, పైకి పరుగెత్తుకెళ్ళి లోడ్‌చెయ్యబడిన డిస్కులన్నీ ఖాళీ అయేదాకా కాల్చిపారేసి, చచ్చిపోవాలని అనిపించింది. కాని అతను, ఆ బాధ చల్లారేదాకా ఓపికగా నిరీక్షిస్తూ కూర్చున్నాడు. కాలక్రమంలో అన్నీ పోతాయని అతనికి తెలుసు. సాధ్యమైనదంతా ఓర్చుకోవడం అతను నేర్చుకున్నాడు, అలాగే యీ అసాధ్యమైనదాన్ని కూడా ఓర్చుకోడానికి అతను సంసిద్ధుడయ్యాడు.

చివరకు అతను నిట్టూర్పు విడిచి, కదిలాడు. ఆ నిట్టూర్పు కోసమే వేచియున్న మీర్రా అప్పుడు, శాశ్వతమైన వీడ్కోలు చెప్తున్నట్లు, ప్రశాంత విషాద స్వరంలో చెప్పింది.

''పాపాయికోసం కాకపోతే, వాడికోసం కాకపోతే, కోల్యా, నిన్ను వదిలి నేనెన్నడూ వెళ్ళి వుండేదాన్ని కాదు. నేనసలు అలా జరుగుతుందనే అనుకున్నాను, నేను నీకంటె కొంచెం ముందు, నీ చేతుల్లో సంతోషంగా చచ్చిపోతాననే అనుకున్నాను. నువ్వే నా ప్రాణం, నువ్వే నా వేడీ, వెలుగూ, నువ్వే నా ఆనందం, నా జీవిత సర్వస్వం నువ్వే. కాని మన పాపాయి పుట్టాలి కదా, కోల్యా, వాడు పుట్టితీరాలి, వాడు ఎవరిపట్లా ఏ నేరమూ చెయ్యలేదు. మరి వాడు ఆరోగ్యంగా, తప్పకుండా ఆరోగ్యంగా పుట్టాలి, మరి యిక్కడ — యిక్కడ అనుక్షణం వాడి శక్తి ఉడిగిపోతూ వుండటం నాకు అనుభూతమవుతోంది — వాడి శక్తి, కోల్యా, నాది కాదు, మరి వాడిది. దేవుడు ప్రతి ఆడదానికీ కొంచెం ఆనందమిచ్చి, ఆమెపైన గొప్ప బాధ్యత మోపుతూ వుంటాడు. మరి నేను ఆనందంగా వున్నాను. ప్రపంచంలో ఏ యితర స్త్రీ అయినా ఉండగలదానికన్న నేనెక్కువ సంతోషంగా ఉన్నాను, ఆ ఆనందాన్ని నాకు నువ్వు, నువ్వు మాత్రమే, మరి నాకొక్కదానికి మాత్రమే, యివ్వడమే అందుకు కారణం. యుద్ధాన్నీ, జర్మన్లనూ ఎదిరించి, నా కర్మను కాదని, ప్రపంచంలో అన్నింటినీ వ్యతిరేకించి నువ్వు నాకా ఆనందాన్నిచ్చావు! ఓహ్, ఈ ఎడబాటు భరించడం నాకంటె నీకు కష్టతరమన్న సంగతి నాకు తెలుసు, నువ్వు పూర్తిగా ఒంటరిగాడివైపోతావు. కాని నేను, నీ భవిష్యత్తులో కొంత భాగాన్ని నాతో తీసుకెళ్తాను. ఇది మన జీవితాల్లోకెల్ల మిక్కిలి విషాదకరమైన తరుణమని

నాకు తెలుసు, కాని మనం దాన్ని — వాడు, మన చిన్నారి చిట్టి పాపాయి బ్రతికి ఉండగలి గేందుకు — అనుభవించి తీరాలి, అది మన విధి. నువ్వు నన్ను గురించి ఆదుర్దాచెందకు, నేనీ విషయాలన్నీ ముందే ఆలోచించాను. నేనా స్త్రీల దగ్గరకు చేరుకోడానికి నువ్వారికే సాయంచేస్తే చాలు, వాళ్లు నన్ను తమతోబాటు దుర్గంలోంచి బయటికి తీసుకెళ్తారు.''

''మరి ఆ తర్వాత?''

''తర్వాతంటావా, అమ్మ వుంటుంది, నువ్వా విషయం ఆదుర్దా పడకు! అమ్మ, మా కుటుంబమంతా వుంటారు. యూదులకున్నంతమంది బంధువులు యీ లోకంలో మరెవరికీ వుండరు.''

''ఆ స్త్రీలని బారులు తీర్చి, కాపలా వుండి తీసుకెళ్తున్నారు.''

''ఇంతమందిలో అదనంగా యింకోళ్లు ఉంటేమటుకు ఎవరు చూస్తారు? ఏం ఫరవా లేదు ప్రియతమా, అంతా సలక్షణంగా జరిగిపోతుంది! అంతా సజావుగా జరిగిపోతుంది. సామాన్యుడు స్వతంత్రుడవుతాడు, విజయఘంటలు మోగుతాయి, మనమంతా పాటలు పాడుతూ నృత్యాలు చేస్తాం. మిహోస్ బాబాయ్ యెప్పుడూ యిదే చెప్తూండేవాడు — నీకు గుర్తుందా ఆయన? అప్పుడు మన్ని దుర్గానికి తీసుకొచ్చాడే, ఆయన. మనం అప్పుడు రోడ్డువారనున్న రాతి స్తంభాన్ని చూశాం. నేను నీ చేతిని అప్పుడే మొట్టమొదటి సారిగా తాకాను.''

చిరునవ్వు నవ్వేందుకు తంటాలుపడుతూ — అడ్డు అదుపుల్లేకుండా కన్నీళ్లు జాలు వారుతూండగా — ఆమె అదే పనిగా మాట్లాడింది. ఆ కన్నీళ్లు ప్సాజ్నికొవ్ చేతిపైన చిందాయి. కాని అతను కన్నీళ్లేమీ కార్చలేకపోయాడు — అతని చిట్టచివరి కన్నీళ్లు ఆ రస్కుల మీద కారిపోయాయి, యిప్పుడిక అతనిలో కన్నీళ్లే మిగల్లేదు. అందుకనే అయ్యుంటుంది, అతని హృదయం నెగడిలా భగభగమండుతోంది, అతను లోలోపల దహించుకుపోతున్నాడు.

''నువ్వు వెళ్లాలి'' అతను నిరుత్సాహంగా అన్నాడు. ''నువ్వు మీ అమ్మదగ్గరకెళ్లి మన పాపాయిని పెంచాలి. మరి నేను బతికివుంటే — ''

''కోల్యా!''

''నేను బతికివుంటే'' అతను దృఢంగా రెట్టించాడు, ''నేను మిమ్మల్ని వెతుక్కుని వస్తాను. లేకపోతే — వాడికి మమ్మల్ని గురించి — యిక్కడీ రాళ్లక్రింద ఉండిపోయిన మమ్మల్నందర్ని గురించీ చెప్పు.''

''వాడీ రాళ్లదగ్గర ప్రార్థిస్తాడు.''

''ప్రార్థనలు అవసరం లేదు. ఊరికే — జ్ఞాపకం పెట్టుకొంటే చాలు.''

వాళ్లు చీకట్లో పైకొచ్చి — మిక్రాకు కష్టమే అయినా — తెల్ల భవనపు శిథిలాల దగ్గరకు సురక్షితంగా చేరుకున్నారు. ఆమె చాలా బలహీనంగా వుంది, నడిచే అలవాటు లేదు, బ్రేస్‌తో వున్న ఆమె కాలికి ఆ దోవ చాలా ఎగుడుదిగుళ్లుగానే వుంది. ఒక్కొక్క మారు

ఫ్లాబ్నికొవ్ ఆమెను చేతుల్లోకి ఎత్తుకొని తీసుకెళ్ళాడు. అలా ఆమెను ఎత్తుకోవడం అతనికి కష్టమే అనిపించలేదు. ప్రియతమమైన ఆ వెచ్చని శరీరం అంత బక్కగా, తేలికగా వుంది. అక్కడ, ఆ నేలమాళిగలో, బయటకు వెళ్లేందుకు అతను మార్గాన్ని కనుక్కొని, తను ఆమెను చిట్టచివరి సారిగా ఎక్కడనుంచి పరిశీలిస్తాడో ఆమెకు చూపాక, అతనామెను తన మోకాళ్లపై కూర్చోపెట్టుకున్నాడు, తన కోటును ఆమెచుట్టూ కప్పాడు — చిట్టచివరి క్షణందాకా వాళ్లు అలా వుండిపోయారు. అక్కడే వాళ్లు వీడ్కోలు తీసుకున్నారు, మీరా జాగ్రత్తగా పైకి పాకివెళ్లింది.

చాలమంది స్త్రీల మాదిరిగానే ఆమె బొంతకోటు వేసుకుంది. తన తలకు తల రుమాలు చుట్టుకుంది, ఎవరూ ఆమెను గమనించలేదు. వాళ్లందరూ హడావిడిగా వున్నారు, ఆమె కూడా పనిచెయ్యడం మొదలుపెట్టింది.

''నువ్వేం చేస్తున్నావిక్కడ, మరీ అంత చేతులు విరగ్గొట్టుకుంటున్నావెందుకు?'' ఒక స్త్రీ గొణిగింది. ''నీ కాలు అవిటా?''

మరొకామె జుగుప్సగా నిట్టూర్చింది. ''ఆరి భగవంతుడా, ఆ పశువులు చివరకి అవిటి వాళ్లచేత కూడా చాకిరీ చేయిస్తున్నారు. అటూ యిటూ నడవకమ్మాయ్, నువ్వక్కడకెళ్లి యిటుకలు పేర్చు.''

ఇటుకలు రోడ్డువార పేర్చబడ్డాయి, అక్కడికెళ్తే తను ఫ్లాబ్నికొవ్‌కి చాలా దూర మవుతుంది, అందుకని అక్కడికెళ్లేందుకు మీరాకు యిష్టంలేకపోయింది. కాని ఆమె వాదించకూడదని నిశ్చయించుకుంది. ఈ స్త్రీలు తనను కూడా తమలో ఒకతెగా స్వీకరించి నందుకు సంతోషించింది. అందుకని ఆమె, తన కుంటితనం కనిపించకుండా వుండేలా ప్రయత్నిస్తూ, అక్కడికెళ్లి, దెబ్బతినకుండా బాగావున్న యిటుకలను లాటుగా పేర్చనారంభించింది.

ఆమె రోడ్డుమీద కెళ్లడం, పనిచెయ్యనారంభించడం ఫ్లాబ్నికొవ్ చూశాడు. అటు తర్వాత అతని దృష్టికి యితర స్త్రీలు అడ్డం వచ్చారు. మీరా అతని కనుమరుగైంది. అంతలో మళ్లీ కనిపించి, మళ్లీ మాయమైంది — యీ మారు చివరి సారిగా. తను మళ్లీ యిక ఆమెనెన్నడూ చూడనన్న భయంతో, ఎంత తీవ్రంగా ప్రయత్నించినా కూడా అతను ఆమెను యితరులనుండి వేరుచేసి చూడలేకపోయాడు. అత్యంత క్రూరమైన దృశ్యాన్ని చూడటంనుండి విధి తనను తప్పిస్తోందన్న ఆలోచన అతనికి లేకపోయింది.

సాయంత్రమైంది, దానితోబాటే గస్తీ సైనికులు వచ్చారు. అంత దాకా మీరా వాళ్లను దూరంనుంచి మాత్రమే — చలిమంటల దగ్గర చలికాగుతూనో, గోడలకు చేరగిలబడో ఉండగా మాత్రమే — చూసింది. ఇప్పుడు వాళ్లు — దిట్టమైన మనుషులు — రోజుల్లా సోమరిగా కూర్చున్న కారణంగా వణుకుతూ యిటూ అటూ పరుగెత్తుతున్నారు.

''బారులుగా నిలబడండి, ఊఁ, త్వరగా!''

సీనియర్ హోదాగల జర్మన్స్లు తమ చలిమంటల దగ్గర్నుంచి కదిలేందుకు తొందరచూపడం లేదు. కాగా, కర్తవ్యపరాయణులైన గచ్చకాయ ఆకుపచ్చ రంగు కోట్లు తొడుక్కొని, బయనెట్లు అమర్చబడిన రైఫిళ్లు ధరించిన గస్తీ సైనికులు ఆ స్త్రీలను బారులుతీర్చారు. నెమ్మదిగా ఒక చోటుకి చేరుతున్న స్త్రీలచుట్టూ – రష్యన్ భాషలో ఆజ్ఞలు జారీచేస్తూ – సందడిగా తిరుగుతున్నారు.

''నాలుగు వరసలుగా బారులుతీరి నిలబడండి!''

మీర్రా ఆ బారుల మధ్య దూరేందుకు ప్రయత్నించింది, కాని ఆ స్త్రీలు నలుగురేసి చొప్పున ఒక వరుసగా నిలబడిన కారణంగా, అప్రయత్నపూర్వకంగా ఆమెను వెనక్కి నెట్టేశారు, చివరికి ఆమె ఎడమ పక్క చివర ఒంటరిగా తేలింది. తెగింపుగా ఆమె తిరిగి మధ్యకు చొరు చుకు వెళ్ళింది. కాని, అలసి గొణుగుతూ వున్న స్త్రీలు ఆమె తమ నలుగురిలోది కాదంటూ మళ్లీ ఆమెను వెనక్కివెనక్కి నెట్టడంతో, చివరికామె మళ్లీ ఒంటరిగా నిలబడింది.

''ఏమిటా తోపులాట?'' ఒక గస్తీ సైనికుడు కోపంగా అరిచాడు. అతను బిగ్గరగా అరిచి, మిగిలినవాళ్లకన్న ఎక్కువ ఉత్సాహం ప్రదర్శించాడు. ''నలుగురేసి చొప్పున నిలబడి, ముందుకు నడవండి!''

''మేం నలుగురేసే వున్నాం'' ఎవరో ఒకామె గొణిగింది, ''కాని యిక్కడొకామె అదనంగా వుంది.''

''అదనంగా ఎవత్తె వచ్చింది? ఎక్కడినుంచి వచ్చింది? ఎక్కువా లేదు, గిక్కువా లేదు, నలుగురేసి చొప్పున బార్లు తీరండి!''

''అదిగో, ఆమె.''

మీర్రా గుండె ధనధనా కొట్టుకుంది. ఆ సైనికుడు స్త్రీల బారు వెంట నడుచుకొంటూ వచ్చి ఆమెను చేరుకున్నాడు. తనలోని చిట్టచివరి శక్తిని కూడగట్టుకొని అతని వంక ఆమె బలవంతాన చిరునవ్వు నవ్వింది.

''నువ్వెక్కడినుంచి వచ్చావ్?'' ఆమెముందు ఆగుతూ గస్తీ సైనికుడు సాశ్చర్యంగా ప్రశ్నించాడు.

''పట్నంనుంచి, నువ్వెరగవా నన్ను?''

''పట్నంనుంచా?''

''ఓహ్, పోదాం పద, పోదాం పద'' ఫ్లాజ్నికొవ్ యీ తంతు అంతా చూస్తున్నాడన్న గాభరాతో మీర్రా బిగ్గరగా అరిచింది. ''దోవలో సర్దుకోవచ్చు కదా?''

''ఔనౌను, పోదాం పదండి'' చాలమంది స్త్రీలు అరిచారు. ''రోజంతా యీ చలిలో చస్తున్నాం! ఆ పిల్లనొదిలెయ్యి! మనిషి తక్కువ కాలేదు కదా, ఎక్కువైతే నీకేం బాధ!''

''ఎక్కువా?'' గస్తీ సైనికుడు దిగ్భ్రమచెంది, రెట్టించాడు. ''ఒకత్తె ఎక్కు

వైందన్నమాట, అంతే కదూ? అవును గాని సత్తరకాయ పిల్లా, నువ్వెక్కణ్నుంచి ఊడిపడ్డావ్?''

అతను ఆమె కోటును దొరక పుచ్చుకొని గుంజాడు. మీరాకు దాదాపు పడిపోయినంత పనైంది.

''ఆహా అదా సంగతి, నేలమాళిగల కంపుకొడుతున్నావు కదూ, ఏం? నేలమాళిగ లేనా ఏం లంజముండా, పందికొక్కు కానా, కలుగులోంచి వెలుగులోకి పాకివచ్చావ్, ఔనా? Herr Unteroffizier!''*

''పోదాం పద'' బలిష్ఠుడైన ఆ సైనికుడు తన కోటు పట్టుకొని గుంజే గుంజులకు తన తల నిస్సహాయంగా ఊగిపోతూండగా మీరా తడబడుతూ గొణిగింది. ''పోదాం పద. ప్లీజ్. ప్లీజ్.''

''ఎక్కణ్నుంచొచ్చావే? ఎక్కణ్నుంచొచ్చావ్?''

అకస్మాత్తుగా ఆమెను వదలిపెట్టి, బారుల ముందు తాపీగా నడుస్తున్న నడి వయస్కుడైన ఒక జర్మన్ దగ్గరకు అతను పరుగెత్తుకెళ్లాడు. మీరా ఒక క్షణం ఆగినమీదట, మహిళల బారులు తనకూ ప్లాజ్నికొవ్‌కీ మధ్య అడ్డొచ్చేందుకు వీలుగా, ఆ సైనికుణ్ణి అనుసరించింది.

''అదుగో ఆమె అక్కడుంది, Herr Unteroffizier, అక్కడుంది, ఆ అదనపు పిల్ల. నేలమాళిగలనుంచి పైకి పాకి వచ్చింది.''

అతను మరేం చెప్పాడో మీరా వినలేదు. ఆమె ఆ వృద్ధ జర్మన్‌యొక్క అతి సామాన్యమైన చిన్న ముఖాన్ని మాత్రమే చూస్తోంది. డస్సిపోయిన, సామాన్యమైన ఆ ముఖం ఆమెకు భయంగొలిపేటంత పరిచితమైనది. ఆ విషయాన్ని తన మనసులో తను ఒప్పుకోడానికి ఆమె భయపడింది. అప్పటికీ ఏదో అద్భుతం జరగవచ్చునని ఆమె ఆశించింది, కాని ఏ అద్భుతమూ లేదు, ఉన్నదల్లా జర్మన్ మాత్రమే. కాని తను చూసినది మంచుకి ముక్కు కందిపోయిన యీ జర్మన్‌ని కాదు, తన పిల్లల ఫొటోలను పోగుచేసుకొనేందుకు ప్రయత్నించినప్పుడు చేతులు కంపించిపోతూ వుండిన జర్మన్ని.

''Jude!'' తన సన్నని వ్రేలును ఆమె వంక చూపుతూ ఆ జర్మన్ అన్నాడు. ''Jude! Bunker! Jude! Bunker!''**

''ఆ పిల్లని ఒదిలెయ్యకూడదూ?'' గస్తీ సైనికులు బయనెట్లు చూపి బెదరిస్తూ మహిళల బారులకు అటూ యిటూ హడావిడిగా తిరుగుతూండగా ఆ స్త్రీలు బిగ్గరగా అరి

---

* జూనియర్ ఆఫీసరుగారూ! (జర్మన్.) — సం.

** ''యూదు! నేలమాళిగ!'' (జర్మన్.) — సం.

చారు. ''ఇళ్లకెళ్లేందుకు టైమైంది! చలితో బిగుసుకుపోయాం! ఆ పిల్లని వదిలెయ్యండి, ఆమె మాలో ఒకత్తే! కాదు, మాలో ఒకత్తె కాదు! ఔను, మాలోదే! మాలోది కాదు...''

''Jude! Bunker! Jude! Bunker!'' మీ్రా — చుట్టూ ఏమీ చూడకుండా, వినిపించుకోకుండా — నేరుగా అతని వైపే నడిచి వెళ్తూండటంతో, ఆ జర్మన్ వెనక్కివెనక్కి వెళ్తూ అరుస్తున్నాడు. ఆమె ఆలోచిస్తున్నదల్లా ఫ్యూజ్నికోవ్ వున్న కిటికీకి సాధ్యమైనంత దూరంగా వెళ్లాలని మాత్రమే.

ఆ స్త్రీలను వాళ్లు తీసుకుపోయినట్లుంది, బహుశా లేదేమో, బహుశా వాళ్లని తీసుకుపోయారని తను ఊరికే ఊహించుకుందేమో. తన చెవులు గింగురుమంటున్నాయి, ఆ హోరు మధ్యలోంచి ఆమెకు ''Jude! Bunker!'' అన్న భయంకరమైన మాటలు మాత్రమే వినవస్తున్నాయి. ఆమె గుండె, రాబోయే ఏ ఘోర పరిణామ సూచనతోనో కొరడు వారి, కొట్టుకోవడం ఆగినట్లనిపించింది, తర్వాత అది సమ్మెటదెబ్బల మాదిరిగా కొట్టుకో నారంభించింది, దానితో ఆమెకు ఊపిరి సలపలేదు. ఆమె తన నోరు బార్లా తెరిచి, గాలి కోసం ఎగ ఊపిరి పీల్చింది. అలా ఆమె, వెనక్కివెనక్కి తగ్గుతున్న జర్మన్ వైపు, ముందుకుముందుకు వెళ్లసాగింది.

వాళ్లామెను — రైఫిలు మడమతో శక్తినంతా వినియోగించి పాశవికంగా — కొట్టినప్పుడు సైతం, ఆమెకు నొప్పి అనిపించలేదు. తన తలను వెనక్కు వాలిపోయేట్లు చేసి, తన నోటిలో చిక్కని ఉప్పని ద్రవాన్ని నింపిన ఒక పోటు ఆమెకు అనుభూతమైంది. ఆ దెబ్బ తర్వాత సైతం — ఏ కారణంగానో ఆ రక్తాన్ని ఉమ్మేయడానికి సాహసించక — ఆమె తన పురోగ మనాన్ని కొనసాగిస్తూనే వుంది. ఇప్పుడామెను ఆపగల శక్తి ఏదీ లేనేలేదు. కాని ఆమె భుజాల పైన దెబ్బల వర్షం కురుస్తూనే వుంది. ఆ దెబ్బల తాకిడి క్రింద ఆమె — సహజాతమైన జ్ఞానంతో తన ఉదరాన్ని కాపాడుకొంటూ — అంతకంతకు వంగుతూ, దానిలో జీవిస్తున్న జీవిని గురించికాక, వెనక శాశ్వతంగా వదిలెయ్యబడిన వాడిని గురించి ఆలోచిస్తూ, తనలో మిగిలిన చిట్టచివరి శక్తితో అతన్ని కాపాడాలని ప్రయత్నిస్తూ ముందుకు నడిచింది. మరి చివరకు వాళ్లామెను నేలకూల్చిన తర్వాత సైతం, తన తుది చైతన్యావశేషాన్ని కూడగట్టు కొని, తన ప్రేసును వికారంగా యీడుస్తూ, పట్టుదలగా ఆమె మున్ముందుకు ప్రాకుతూనే వుంది.

ఒక బయనెట్టు ఆమె శరీరాన్ని రెండు సార్లు తూట్లు పొడిచేసరికింకా ఆమె ముందుకు పాకుతూనే వుంది. నిశితమైన ఆ ద్విముఖ వేదనే ఆమె అనుభూతి చెందిన — యింకా వెచ్చ గానే వున్న తన నీరస శరీరమంతటితోనూ స్వీకరించిన — మొదటి, తుది వేదన. గట్టిగా మూతబడిన ఆమె కళ్లముందు ఉజ్వలమైన కాంతి తళుక్కుమంది. నిర్దాక్షిణ్యమైన ఆ వెలుగులో తను యిక తన పాపాయిని గాని, తన భర్తను గాని, అసలు జీవితాన్ని గాని ఎప్ప

టికీ పొందలేనని గ్రహించింది. ఆమె బిగ్గరగా అరవాలనుకుంది, అందుకామె తన తుది శారీరక శక్తినంతనీ కూడదీసుకుంది, కాని, అరుపుకి బదులు, ఆమె నోటిలోంచి చిక్కటి రక్తం బయల్వెడలింది.

స్పృహను కోల్పోతూ, బంకలా పట్టుకొనే మృత్యుశీతల భీతిలో తేలిపోతూ, తన భుజాలపైన, తలపైన, వీపుపైన కురుస్తున్న దెబ్బలనింకా ఆమె అనుభూతి చెందుతూనే వుంది. కాని వాళ్లామెనిప్పుడు కొట్టడంలేదు, వాళ్లామెను సజీవంగా — తెల్ల భవనపు దడికి వెలుపలగల, మెరకగా వున్న గుంటలో ఆమెపై యిటుకలు వేసి — పూడ్చిపెడుతున్నారు.

చాల రోజులుగా దాదాపు నేలబారుగా వేలాడుతున్న మేఘాలు యిప్పుడు విడివడ్డాయి. వాటిమధ్య ఏర్పడ్డ పాయలోంచి వెలవెలబోయే ఆకాశం తొంగిచూసింది. చాలా సేపటికి ముందే అస్తమించిన సూర్యుడు ప్రసరించే సుదూర కాంతి, అయిష్టంగా అన్నట్లు, గతుకులుగా వున్న రోడ్డుపైన, ఒక శిధిల భవనపు ఒక మూలపైన, శిధిలం కాగా మిగిలిన ఒక దడి భాగంపైన, ఆదరాబాదరా హడావిడిగా పూడ్చబడిన ఫిరంగి గుండు గుంటపైనా ప్రసరించింది. అది ప్రకాశించి, మళ్లీ అంతలోనే అదృశ్యమైంది, తిరిగి ధూసరవర్ణపు శరత్కాల మేఘాలు ఆకాశాన్ని ఆవరించాయి.

ఐదో భాగం

1

అతను రోజుల లెక్క మరోసారి మరచిపోయాడు. అతను అనస్తిత్వం మాదిరిగా వున్న గాఢాంధకారంలో పడుకొని, ఎలుకలు రస్కుల్ని పటపట కొరకడం వింటూ పడివున్నాడు. లేచి వాటిని జాగ్రత్తగా దాచడానికిగాని, అది ఏ రోజో గుర్తుచేసుకోడానికిగాని అతనికి త్రాణ లేకపోయింది. తిండితీర్థాల్లేకుండా, ఉన్న ఓవర్‌కోట్లూ, పీ-జాకెట్లూ అన్నీ కప్పుకుని, తను అలా ఎన్ని రోజులు పడివున్నదీ అతనికి తెలియదు. స్పృహ వచ్చాక నీటి దగ్గరకు దేక్కుంటూ వెళ్లి, కడుపారా తాగి, తిరిగి ఆ విచిత్రమైన మైకంలో పడిపోయి, మళ్లీ తెలివితెచ్చుకొని మళ్లీ మంచినీళ్లు తాగుతూవచ్చాడు. చివరకు అతను కాళ్లీడ్చుకొంటూ టేబిలు దగ్గరకు వెళ్లి, ఎలుకలు తినెయ్యగా మిగిలిన రస్కులనూ, పంచదారనూ వెతుక్కొని, తనకు బొత్తిగా ఆకలి లేకపోయినా గుప్పెళ్లకొద్దీ పంచదార బొక్కి, రస్కులు నమిలాడు. ఇప్పుడు తన అనారోగ్యం వెనకపడుతోంది, తను మళ్లీ పనికి పూనుకోవాలి, అందుకని అతను బలవంతాన తిండి ఎక్కించాడు.

రోజుల లెక్క పూర్తిగా మరచిపోయాడేమో మంచును చూడటం అతనికి ఆశ్చర్యాన్నే కలిగించలేదు. అది అర్ధరాత్రి. నీలాకాశంలో తారకలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి కాని దుర్గం తెల్లగా వుంది. పీ-జాకెట్టొకటి తొడుక్కొని, హిమశీతల వాయువును ఆబగా పీలుస్తూ, తను బ్రతికివున్నందుకు లోలోపల మురుస్తూ, అతను కంతదగ్గర కూర్చున్నాడు.

నీరసం మూలంగాతు ఊగిపోతున్నా అతను దాదాపు తేరుకొని లోపలకి తిరిగివచ్చాడు. టి. ఎస్. టి పెళ్లలు వాడేసి అతనొక టిఫిన్ కారియర్‌లో నీళ్లు వేచాడు, దాంట్లో ఒక డబ్బాడు మాంసం వేశాడు, చాల రోజుల తర్వాత మొదటిసారిగా మంచి ఆకలితో తిన్నాడు, తర్వాత ఉన్న మందపాటి కోట్లన్నీ మీద వేసుకొని నిద్రపోయాడు. ఇప్పుడు తిరిగి అతనికి, తన బలంమీద నమ్మకం కలిగింది. తిరిగి అతను రాత్రింబగళ్లను లెక్కించడం మొదలుపెట్టాడు, కానైతే ఎంతగా ప్రయత్నించినా కూడా తేదీ ఏమిటో మాత్రం అతను గుర్తుచేసుకోలేక పోయాడు.

అతను ఆ మరుసటి రోజు తన ఆయుధాలు తుడిచి శుభ్రంచేసుకోడంలోను, తూటాలతో డిస్కులు నింపుకోడంలోను గడిపాడు. తను బరిమీదకి వెళ్లి, గస్తీ సైనికులను వేటాడి చాలా కాలమైపోయింది, అందుకనే అతను అతృతలో, ఆనందంతో కూడిన అసక్తితో అటువంటి తరుణంకోసం ఎదురుచూశాడు. అతనింకా బ్రతికివున్నాడు. అంతేకాదు, ఆ మంచు క్రింద ప్రశాంతంగా పడుకొనివున్న బ్రెస్ట్ దుర్గపు అధినేతగానే తనను తానింకా పరిగణించుకున్నాడు.

కాని అతనికి తన ప్రధాన కర్తవ్యంతోబాటు, మరింత వైయక్తికమైన మరొక కర్తవ్యం కూడా వుంది. ఆ కర్తవ్యాన్ని తన మనస్సు — తననుంచే మరుగుపరుస్తున్నదేమోనన్నట్టు, లాంఛనప్రాయంగా తనకివ్వబడిన పవిత్రమైన ఒకానొక ఆజ్ఞను తను భంగపరుస్తున్నానేమోనన్నట్టు, ఆ ఆజ్ఞను తను ఎలా అమలుజరుపుతున్నదీ తనిఖీ చేసేందుకు ఎవరో ఉన్నారన్నట్టు — గుంభితంగా అతను మననం చేసుకున్నాడు. అసలతను యింతకాలం, అజ్ఞాత పర్యవేక్షకుడెవడో పైనుంచి తనను పరిశీలిస్తున్నట్లే గడుపుతున్నాడు. ఈ అజ్ఞాత పర్యవేక్షకునినుంచి మరుగుపరచాల్సినదేదో యిప్పుడతని మనస్సులో వుంది. అది దానంతటదే అతని మనసులో ప్రవేశించింది, తనకే తెలియకుండా గుప్తంగా చేస్తున్నాడన్నట్టు, యీ గుప్త వాంఛా పరిపూర్తికోసం అతను పూనుకొన్నాడు.

తన తొలి పోరాట స్థలానికి — తను తన సొంత పిస్తోలును కోల్పోయిన చోటుకి — వెళ్లాలన్న బలీయమైన ఆకస్మిక వాంఛ అతనికి కలిగింది. అది ఏదో ఒక ఆషామాషీ ఆయుధం కాదు, తన గుర్తింపు కార్డుపై నంబరు నమోదుచెయ్యబడిన ఆయుధమది. తను తన మిలిటరీ స్కూలు శిక్షణను పూర్తిచేసుకున్న రోజున, పెరేడులో తనకు అందజెయ్యబడిన, తొలి బాహాబాహీ పోరాటంలో తను పోగొట్టుకున్న, తన సొంత ఆయుధమది. దవుడ చిటికిన

భయంకరాకారుడైన ఆ జర్మన్ తన అపస్మారకంలో, మృత్యు దేవత నవ్వువంటి జుగుప్సా కరమైన యికిలింపుతో, తన కాలు పట్టుకొని గుంజడం అతనికి విస్పష్టంగా గుర్తుంది. కాని యిప్పుడిక సాల్నికోవ్ లేడు, కలతబారిన అతని ఊహల్లో, తనను ఆ పీడకలనుంచి కాపాడేందుకు సాల్నికోవ్ లేడన్న తెలివిడి అతన్ని కలవరపెట్టింది. ప్రాణభీతితో ఒళ్లంతా ముచ్చెమటలు పొయ్యగా నిద్రలేచి, ఆ తొలిరోజు పోరాటానికి సంబంధించిన వివరాలన్నింటితో బాటు, సాల్నికోవ్ దెనిష్చిక్‌లతో తన సమాగమాన్ని గురించి, తొలి దాడిని గురించీ, తొలి పోరాటాన్ని గురించీ అతను బాధగా గుర్తుచేసుకున్నాడు. తన సొంత వ్యక్తిగత ఆయుధాన్ని పోగొట్టుకున్న సిగ్గుచేటైన ఘటనను ప్రత్యేకించి గుర్తుచేసుకున్నాడు.

ఎలాంటి సంఘటనా లేకుండా అతను చర్చిని చేరుకున్నాడు. కాని, లోనికి ప్రవేశించే ముందు తనకు మామూలుగా అలవాటైన పద్ధతిలో చుట్టూ చూసుకున్నప్పుడు, అతనికి అనాహ్లాదకరమైన విషయమొకటి కనిపించింది. మంచు అంత ఎక్కువగా పడకపోయినప్పటికీ, తను బయల్దేరినచోటునుంచి యిక్కడకు చేరుకునేదాకా యిటుకలమీదే అడుగులేసేందుకు ప్రయత్నించినప్పటికీ, అతని అడుగుల జాడ — ఎవ్వరూ చెరిపెయ్యలేని రీతిలో — మంచుపై అంకితమైంది. కొత్తగా మంచు పడితే మాత్రమే అవి రూపుమాసిపోయే అవకాశముంది, కాని ఆకాశం పిచ్చెత్తించేటంత నిర్మలంగా వుంది. చర్చిని చేరుకున్నానన్న అతని తృప్తి హరించుకుపోయింది; కానైతే తిరిగి వెళ్లడం అంతకంటె మరింత ప్రమాదకరం, అప్పటికే వున్న అడుగుల జాడలు మరింత పెరుగుతాయి.

కొంత సేపు తటపటాయించిన మీదట రోజంతా తను చర్చిలోనే గడపాలనీ, రాత్రి చీకట్లో తన కేస్‌మేటుకు చేరుకోవాలనీ — తన అదృష్టం కలిసొచ్చి, తెల్లవారేలోగా మరింత మంచు పడి, గుట్టు రట్టుచేసే ఆ గుర్తులు కప్పబడిపోవచ్చుననీ అతను ఆశించాడు.

శీతకాలపు తాజాతనం చర్చిలో పరివ్యాపించింది. ఒకప్పుడు జర్మన్లను చర్చిద్వారం నుంచి దూరంగా వుంచి, తనను కాపాడిన దుర్వాసనావశేషాలు చర్చిలో యిప్పుడేమీ మిగల్లేదు. అప్పుడు, తను రాత్రిపడేదాకా కిటికీ గూటిలో ఉండాల్సివచ్చిన మాట నిజమేననుకోండి. పూర్తి చీకటిలో, అద్భుతమైన అదృష్టం కలిసొచ్చి, చూరుబోదె మీదుగా ఓరగా తను బయట పడే సరికి చాల సేపటికి ముందే పెరేడు పూర్తయింది, ఆ ప్రముఖ వ్యక్తులు వెళ్లిపోయారు, సైనికులచేత కవాతు చేయిస్తూ తీసుకుపోయారు. అంతా ఆ రోజున అలా సలక్షణంగా ముగిసిపోయింది. ఔను, అప్పుడలా సలక్షణంగా ముగిసిపోయిన మాట నిజమే, కాని యిప్పుడు, హుషారు కలిగించే యీ మంచు తన శత్రువులకు తోడ్పడేట్టుగా వుంది.

దీన్ని అనుక్షణం తన మనస్సులో మననంచేసుకొంటూ, శబ్దాలను స్పష్టంగా మోసుకొచ్చే ప్రభాత కాలపు నిశ్శబ్దంలోకి చెవులురిక్కించి వినసాగాడు. శీతల పవనాలమీద తేలియాడుతూ శబ్దాలు: ఇంజన్ల మోత, కొత్తగా పడిన మంచు కరకర నలిగిన పొడిశబ్దం, మూడు కమాన్ల

గేటు దగ్గర మంచు ఉండలతో ఒకళ్లనొకళ్లు కొట్టుకుంటున్న జర్మన్ సైనికుల అరుపులు — అతనికి స్పష్టంగా వినవస్తున్నాయి. మొట్టమొదట ప్రతి ఒక్క శబ్దమూ అతనిలో భయాలను రేకెత్తించింది, కాని కాలం గడిచినకొద్దీ చర్చి తనకు ఒంటరిగా ఏమి దాచిపెట్టిందో నన్న దానిపైకి అతని మనస్సు మళ్లింది.

అతను తన చుట్టూ చూసినకొద్దీ గతించిపోయినవారి — యిప్పుడిక స్మృతిలో మాత్రమే మిగిలినవారి — నీడలు అతని చుట్టూ ముసురుకోసాగాయి.

ఆ తొలి రోజున తను లోనికి దూకిన కిటికీని అతను చూసీచూడగానే గుర్తుపట్టాడు. అది యిదే, వేరే తను వెతకాల్సిన పని లేదు. తనంతట తను ఎంచుకున్న కిటికీ యిదే, తను దీని దగ్గరే జంకాడు, తన ఆ క్షణిక భీరుత్వ కారణంగా సరిహద్దు గస్తీ సైనికుడు చచ్చిపోయినది యీ కిటికీ దగ్గరే. అటువంటి విషయాలు మరపుకి రావు, వాస్తవానికి తను భీరువు కాడు, అందుకనే తను ప్రతి అంశాన్నీ గుర్తుపెట్టుకున్నాడు. తనని ఉద్దేశించి కాల్చబడిన గుళ్ళు, మృతుని శరీరానికి తాకగా తనపై చిందిన ఆ మృతుని చిక్కని రక్తాన్ని సైతం అతను మరచిపోలేదు.

కాని యిది జరిగినది తర్వాత. మొదట తను పొగతో నిండిన చర్చిలోకి దూకాడు, ఎవరినో కొట్టాడు, మరెవరిపైనో కాల్చాడు. ఇక్కడే ఎక్కడో దౌడ చితికిపోయి భయంకరంగా వున్న ఆ జర్మను తన కాలు దొరకపుచ్చుకొని గుంజాడు. కాని తను అంతకు ముందే తన పిస్తోలును పోగొట్టుకున్నాడు. ముందేనా — లేక తర్వాతా? అబ్బే కాదు, ముందే, తనని ఎవరోగాని రైఫిలు మడమతో బాదాడు, తను పక్కకెక్కడికో పడిపోయాడు, తనకు స్పృహవచ్చే సరికి తన పిస్తోలు పోయింది. అందుకని అంతా యిక్కడే — యిప్పుడు గిలాబా బెడ్డుకులతోను, యిటుక ముక్కలతోను, తుప్పుపట్టిన తూటా కేసులలోను నిండివున్న యీ కొద్ది చదరపు మీటర్ల ప్రాంతంలోనే — జరిగివుండాలి.

అతను, ఆ చెత్తను తన కాలితో కెలుకుతూ, చర్చిలో అటూ యిటూ తిరిగాడు. సబ్ మెషీన్ గన్నులనుంచి బయటికొచ్చిన ఖాళీ మగజీన్లు, మెషీన్ గన్ బెల్టుల తునకలు, నలిగి తప్పడైపోయిన ఫ్లాస్కులు, చితికిన గొట్టాలతోను, విరిగిన మడమలతోను వున్న రైఫిళ్ళు, తేలిక సబ్ మెషీన్ గన్నులనుండి బయటికొచ్చిన తుప్పుపట్టిన డిస్కులు — యుద్ధానికి సంబంధించిన చెత్త అంతా అతని కళ్లముందు పరచుకొని వుంది. ఇప్పుడు మూగపోయిన స్వరాలను, తన స్మృతిలో యింకా మార్మోగుతున్న స్వరాలను వింటూ అతనా చెత్తను కెలికాడు. తను ఆ స్వరాలను తనలోనే ఒక భాగంగా నిలుపుకున్నట్టు, తనలోనే అవి శబ్దిస్తున్నట్టు, అతనికి యింతకు ముందు తెలియదు. తనను ఒంటరివాడుగా — మౌన ఏకాంతంలో ఉన్నట్లు — అతను ఊహించుకున్నాడు. కాని ఆ మౌనం భంగమైంది. ఆ ఒంటరితనం తొలగిపోయింది, అప్పుడతనికి అకస్మాత్తుగా ఒక విషయం గుర్తుకొచ్చింది. గతం తనదని, తన

వారసత్వమని, తన గర్వకారణమని; మరి అది, యీ గతం — తన జీవితంలోకెల్లా మిక్కిలి బాధాకరమైన భాగం, అత్యంత నిర్ణయాత్మకమైన భాగం — అక్కడున్నది కనుక, ఒంటరితనం ఉండజాలదని — గుర్తుకొచ్చింది.

"మృత్యువంటూ ఏదీ లేదు" అతను పైకే అన్నాడు. "అబ్బాయిలూ, ఏదెలా జరిగినా సరే, అది మాత్రం లేదు."

అతని ప్రశాంత స్వరం నిర్జనంగా వున్న చర్చిలో విచిత్రంగా వినిపించింది. అది చల్లని గాలిలో తేలియాడింది, గోడలకు తగిలి నెమ్మదిగా ప్రతిధ్వనించింది. ఛిన్నాభిన్నమైన గోపుర శిఖరంలోకి లేచింది. తన స్వర శబ్దాన్నే అనుసరిస్తున్నట్లు, వింటూ, ప్లూజ్నికొవ్ నిశ్శబ్దంగా నిలబడ్డాడు. అంతలోనే బయటనుంచి వినవస్తున్న వేరే స్వరాలను విన్నాడు. అవేమిటో యింకా అర్థం చేసుకోకుండా, గ్రహించకుండా, అతనొక కిటికీదగ్గరకు వెళ్ళి, దాని పక్కగా గోడకు కరుచుకు నిలబడి, జాగ్రత్తగా పైకి తొంగిచూశాడు. గతం అదృశ్యమైంది. జర్మన్లు చర్చిని చుట్టుముడుతున్నారు.

వాళ్లింకా వలయాన్ని పూర్తిచెయ్యలేదు — మరి బుద్ధిపూర్వకంగానే వాళ్లలా చెయ్యలేదో, లేక తమ హడావిడిలోనే కొంత ఖాళీని వదిలేశారో తెలియదు — తెల్ల భవనం శిథిలాల దిశగా కొంత ఖాళీజాగా ఉండిపోయింది. పట్టపగలు, తెల్లని మంచుమీద ఒక నల్లని మూర్తి తప్పించుకునేందుకు ఆ ఖాళీజాగా ఎక్కువ అవకాశాన్నేమీ కల్పించలేదు. కాని, సాధ్యాసాధ్యతలను బేరీజువేసేందుకు అతను ఆగలేదు, బ్రతకాలనీ, ఒక వేళ చనిపోవలసే వస్తే, స్వేచ్ఛలో చనిపోవాలనీ అతను వాంఛించాడు. అందుకని అతను కిటికీలోంచి బయటకు దూకాడు.

చుట్టూ చూడకుండా, మెలికలు తిరగకుండా, చివరకు వంగనైనా వంగకుండా అతను పరుగెత్తాడు. ఒక్క క్షణం వృథాచేసేందుకు కూడా అతనికి వ్యవధి లేదు. అతను సుమారు సగం దూరం వెళ్లాక అతనికి అరుపులూ, కేకలూ, కాల్పులూ వినవచ్చాయి, కాని అతను నేలపైన పడుకోలేదు, బులెట్లు తన పాదాల చుట్టూ మంచును ఎగరగొడుతూండగా, అతను తన పరుగును కొనసాగించాడు. అతను శిథిలాల్లో ప్రవేశించాడు, అయినా యింకా పరుగెత్తుతూనే వున్నాడు. పట్టపగటి ఉజ్వల కాంతిలోంచి అప్పుడే లోపలికొచ్చాడేమో ముందు బొత్తిగా ఏమీ కనిపించక, గోడలకు కొట్టుకుంటూ లోలోపలికి పరుగెత్తాడు. అతనలాగ తనకు శక్తి ఉన్నంతవరకు పరుగెత్తాడు, అప్పుడిక శక్తిగాని, గాలి గాని — ఉన్మత్తంగా సమ్మెట దెబ్బల్లా కొట్టుకుంటున్న తన గుండె తప్ప మరేదీ — లేకపోవడంతో కూలబడ్డాడు.

కానైతే, యీలోగా — దూరంగానే అయినా నేలమాళిగల్లోనే, విలువంపు పైకప్పు క్రిందనే — స్వరాలు, బూట్ల దడదడ చప్పుళ్లూ వినరావడంతో, అతను ఎక్కువసేపు విశ్రాంతి తీసుకోలేకపోయాడు. అందుకని అతను ప్రయత్నంమీద లేచి, ఊగిపోతూ, ఆ చీకట్లోనే — తనెక్కడికి వెడుతున్నానన్న ఆలోచనే లేకుండా, ఆ స్వరాలనుంచీ, అడుగుల

చప్పుళ్లనుంచీ దూరంగా వెళ్లిపోవాలని మాత్రమే కోరుకొంటూ — యింకా లోపలకు పరుగెత్తాడు.

ఈ నేలమాళిగలతో అతనికి పరిచయంలేదు. వీటి ఆనుపానులు తర్వాత చూద్దాంలే అని అతను వాయిదా వేశాడు. మీర్రాను పంపేశాక అతనక్కడకి ఒక్క మారూ వెళ్లలేదు. అందుకని, మొండి సందుల్లోనూ, చెత్తా చెదారంతో పూడిపోయిన సందుల్లోనూ నిలిచిపోయి వెనక్కివస్తూ, అవిరామంగా తనను తరుముకొస్తున్న వాళ్ల అడుగుల చప్పుళ్లను వింటూ, అతను గుడ్డిగా పరుగెత్తుతున్నాడు. జర్మన్లకు అతని విషయంలో భయంలేదన్న మాట స్పష్టం అతను ఒంటరిగాడన్న సంగతి వాళ్లకి నిశ్చితంగా తెలుసు. అందుకనే వాళ్లు క్రమబద్ధంగా, ఒక నేలమాళిగ తర్వాత మరొకదాన్ని గాలిస్తూ వస్తున్నారు.

ఒక మలుపు తిరిగి, ఒక గండి కనిపించడంతో అతను అందులోకి పరుగెత్తాడు. తను యిక్కణ్నుంచి వెళ్లిపోవాలి, వలయాకారపు బ్యారక్సు శిధిలాలకు చేరుకోవాలి, వాటినైతే జర్మన్లు చుట్టుముట్టలేరు. కాని తన సొంత, పరిచిత ప్రాంతంతో అతనికి సంబంధం తెగిపోయింది. అందుకని, ఆ గండిగుండా దాటి వెళ్లి, అతను ఎదురు దిశగా పరుగెత్తి, దుర్గపు సుదూర, ఆగ్నేయ కొసకి చేరుకున్నాడు.

అతను మళ్లీ వెల్లడి ప్రాంతంలోకి వచ్చేటంత దుస్సాహసం చేస్తాడని జర్మన్లు అనుకోలేదు, అందుకనే ఆ ఆవరణలో సగం దూరం దాటాక గాని అతని వెనుక మళ్లీ కాల్పులు ప్రారంభం కాలేదు. తిరిగి అప్పుడు కూడా నేలమీద బోర్లాపడక, మెలికలూ తిరగక, అతను నేరుగా — వంగను కూడా వంగకుండా, కావాలనే మృత్యువుని వెతుక్కొంటూ వెళ్తున్నట్లు — ముందుకే పరుగెత్తాడు. మరి అప్పుడు కూడా మృత్యువు అతని జోలికి పోలేదు. అకస్మాత్తుగా జర్మన్లు కాల్చడం మానేసి, బిగ్గరగా అరిచారు. తనను ముందుకెళ్లకుండా నిరోధించేందుకని అటునుంచి బ్యారక్సు మీదుగా మరి కొందరు జర్మన్లు రావడం అతని కంటపడింది. వాళ్లు కాల్చకపోవడాన్ని బట్టి తనను సజీవంగా బందీని చెయ్యాలని వాళ్లు అనుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

కానైతే అప్పటికీ ఆ పరుగు పందెంలో అతనే గెలిచాడు, ఒక వెడల్పాటి గండిని చేరుకుని, లోపలకి పరుగెత్తాడు. అతను ప్రాణం కోసం, స్వేచ్ఛకోసం పరుగెత్తడమే ఆ పరుగు పందెంలో అతను గెలవడానికి కారణం. అలా చేసే క్రమంలో విలువైన ఒక్క క్షణం — తన చుట్టూ చూసి, యిక పరుగెత్తినందువల్ల ప్రయోజనం లేదని గ్రహించేందుకు సరిపడ్డ క్షణకాలం అతనికి లభించింది. అతను గండి దగ్గరకు దూసుకెళ్లి, తన సబ్‌మెషీన్ గన్నును పైకెత్తి, పలు సార్లు కాల్చాడు. బలహీన పడిన అతని చేతుల్లో గన్ బ్యారెల్ కంపించింది, అతను ఎవర్నీ కూల్చలేకపోయాడు, కానైతే జర్మన్లు చెల్లాచెదరై మాటులు వెతు

క్కున్నారు. బదులుగా వాళ్ళు కాల్పులు జరుపుతారని అతను ఎదురుచూశాడు, అటుతర్వాత మరి కొన్ని కాల్పులు కాల్చి, పక్కనున్న కట్టడంలోకి పరుగెత్తాడు.

అది పూర్వం గుర్రాల సాలగా వున్న చోటు. పొగగాని, చలిగాలిగాని గుర్రాల గాఢమైన వాసనను తుడిచిపెట్టెయ్యలేకపోయింది. గోడవార ఎండిన గుర్రపు లద్దెల పెద్దగుట్ట ఒకటి కనిపించింది. మారు ఆలోచన లేకుండా, బొర్రి చేసుకుంటూ అతనా గుట్టలోకి — గడ్డగట్టిన పైభాగంగుండా బిరబిరా తవ్వుకొంటూ — దూరాడు. బయటనుంచి కాల్పులింకా వినవస్తూనే వున్నాయి. కుమ్మరి పురుగులా దొలుచుకొంటూ దానిలోకి సాధ్యమైనంత లోతుకి వెళ్తూనే వున్నాడు. పక్క గదిలో అడుగుల చప్పుడూ, స్వరాలూ వినిపించినప్పుడు మాత్రమే అతను ఆగాడు.

పరిసర విభాగాలన్నింట్లోకీ వెళ్తూ వాళ్ళు చాలసేపు గాలించారు. ఆ స్వరాలు దూరంగా వెళ్ళిపోయి, మళ్ళీ దగ్గరకు వస్తున్నాయి. అతను కదలమెదలకుండా ఉండిపోయాడు, ఊపిరి బిగపట్టాడు. ఉద్రేకంగా కొట్టుకొంటున్న అతని గుండె శాంతపడకపోవడంతో అలా ఊపిరిని బంధించడం అత్యంత కష్టసాధ్యమైన పనే అయింది. యాదృచ్ఛికంగా జర్మన్లు ఆ గుట్టలోకి కాలుస్తే, అంతటితో తన పని సరి అన్న భయనీరసాల ఫలితంగా అతని ఒళ్ళంతా చెమటకాల్వలు పారుతున్నాయి. యాదృచ్ఛిక కుతూహలం సైతం తన ఉనికిని బయటపెట్టవచ్చు. కాని యింతవరకు, తనింకా అక్కడే లోపల వుండవచ్చునని వాళ్ళకు తట్టినట్లు లేదు.

తమ సోదా యావత్తూ వృథా అయిపోయిన తర్వాత, వాళ్ళకీ సంగతి తట్టినట్లే వుంది. వాళ్ళందరూ తనకు బాగా దగ్గర్లో గుమికూడినట్లు, బిగ్గరగా మాట్లాడుతున్నట్లు అతను గ్రహించాడు. అడుగులు నేరుగా తన తలమీదకే రావడం, అతనికి అనుభూతమైంది. అతను తనను తాను గుట్ట అడుగుకి అణుచుకున్నాడు. అటుతర్వాత ఎవరో బరువైన వ్యక్తి నెమ్మదిగా అతని వీపుమీదుగా నడిచివెళ్ళాడు. కసుక్కుమన్న చిత్రమైన శబ్దమవడం గమనించి యిదేమిటబ్బా అని విస్తుపోయాడు. అంతలోనే అతనికి నొప్పి అనుభూతమైంది. ఒక బయనెట్టు తన పక్కను దూసుకెళ్ళి, పక్క ఎముకమీది చర్మాన్ని చీల్చడాన్ని అతను అనుభూతి చెందాడు. చలితరగ ప్రసరించినట్లు — అతని ఒళ్ళంతా జలదరించింది — యీ జర్మన్ తన బయనెట్టును పైకి లాగుతాడు, దానిమీద రక్తం కనిపిస్తుంది, అంతే, దానితో తన పని సరి అనుకున్నాడు. కాని ఆ బయనెట్టు పైకి లేచింది, తన భుజానికి ఓ సెంటిమీటరు దూరంలో మళ్ళీ దిగబడింది, మళ్ళీ పైకి లేచి మళ్ళీ దిగబడింది. అప్పుడు అకస్మాత్తుగా తన వీపుమీది బరువు తొలగిపోయింది, బరువుగా అడుగుల చప్పుడు వినవచ్చింది, జర్మన్ మళ్ళీ నేలమీద వున్నాడని అతను అప్పుడు గ్రహించాడు.

స్వరాలూ, అడుగుల చప్పుళ్ళూ మందగించిపోయాక కూడా కదిలేందుకు అతను

సాహసించలేదు. అతని పక్కలో అయిన గాయం సలుపుతోంది, దాన్నుంచి రక్తం స్రవించడం అతనికి అనుభూతమైంది. అతని చేతులూ, కాళ్లూ క్రమంగా తిమ్మిరెక్కిపోతున్నాయి, అయినా అతను కదల్లేదు. తను ప్రమాదంనుంచి బయటపడినట్లు అతనికి అనిపించింది, కాని అతను అనుమానించాడు, మళ్లీ అతనికి విశ్వాసం కలిగింది — వెంద్రుకవాసిలో తను మళ్లీ ప్రాణాపాయంనుంచి బయటపడ్డాడు, కాని అతను ప్రమాదానికి ఎదురెళ్లరాదని నిర్ణయించుకున్నాడు. అర్ధ చేతనావస్థలో, క్రమంగా తన శరీరమంతటా పరివ్యాపిస్తున్న తిమ్మిరిని అతను ఓర్చుకున్నాడు. ఒక్కొక్క సారి కొన్ని నిమిషాల పాటు స్పృహను కోల్పోతూ, అంతలో స్పృహ తెచ్చుకుంటూ, తిరిగి స్పృహను కోల్పోతూ — అతను ఓర్చుకున్నాడు. అతని శరీరం ఇంద్రియానుభూతులకు ఎంతగా దూరమైందంటే, తన గాయమింకా రక్తం స్రవిస్తూందో, లేక ఎండిపోయిందో కూడా అతనికి తెలియడం లేదు. ఒక్కొక్క సారి తను బిగిసిపోతానేమోననీ, ఆ గుట్టలోనే శాశ్వతంగా సమాధి అయిపోతానేమోననీ, అతను భయపడ్డాడు. అయినాకూడా అతను చీకటిపడేదాకా తను ఉన్న చోటనే ఉండిపోయాడు.

అతను కష్టంమీద ఆ గుట్టలోంచి బయటపడ్డాడు, చాలసేపు వేడినీ, చలన శక్తినీ తిరిగి పొందేందుకుగాను తన చేతులు గుద్దుకున్నాడు, తన కాళ్లు రుద్దుకున్నాడు. అతని గాయం రక్తం ఓడటంలేదు, అతని చొక్కా దానికి కరుచుకుపోయింది, అయితే అతను అదెలా వుందో చూడాలని ప్రయత్నించలేదు. ఎలాగూ కట్టు కట్టేందుకు ఎవరూ లేనూ లేరు, దేనితో కట్టేందుకూ ఏమీ లేదు. అతను లేచాడు, కొద్ది అడుగులు వేశాడు, కాని మళ్లీ కూలబడిపోయాడు — అతని కాళ్లు చచ్చుబడినట్లు వంగిపోయాయి, అప్పుడు తిమ్మిరెక్కిపోయిన అతని కండల్లో ఎంతటి దారుణ వేదనాపూరితమైన బాధ పరివ్యాపించిందంటే, బావురుమని ఏడ్వకుండా వుండేందుకోసం అతను తన కోటు అంచును పళ్లసందున కరిచిపట్టాడు. కాని అతను ఎలాగో ఒకలాగ తంటాలుపడి నడిచేతీరాలి, తన కేన్‌మేటుకు చేరుకోవాలి, దానిలో దూరి, మళ్లీ మంచుపడేదాకా అక్కడే వేచియుండాలి.

తన మోకాళ్లలో యింకా సరిగా పట్టులేకపోయినా, బాధ యింతకు ముందుకన్న కొంత తగ్గినా — యింకా అలాగే వున్నా అతనెలాగో తంటాలుపడి లేచినిలబడ్డాడు. ఊగిసలాడిపోతూ అతను నిర్గమన మార్గం దగ్గరకు వెళ్లాడు.

ఆ బయనెట్టుమీద రక్తం లేకపోవడం తన అదృష్టం. ఆ జర్మన్ తన బయనెట్టును చాలా తొందరగా లాగేసైనా వుండాలి, లేక అంటిన రక్తం గుర్రపు లద్దెలకు రాసుకొని చెరిగిపోయైనా వుండాలి. ఏదేమైనా, అతని అదృష్టం అద్భుతావహమైనదే, అందుకనే — తను వేసే ప్రతి ఒక్క అడుగూ బ్రహ్మప్రళయమూ బాధాకరమే అవుతున్నా — అతను చిరునవ్వు నవ్వుకున్నాడు.

కాని యిప్పుడతను తన గూటికి వెళ్తున్నాడు, దానితో వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది. తిండి, నీరు, టి. ఎన్. టి. పెళ్లలు, వెచ్చటి కోట్లు వున్న తన గూటికి — ఎక్కడైతే ప్రతీదీ యింకా మీరాకు సంబంధించిన దేనికో ఒక దానికి అనుబంధితమై వుందో ఆ గూటికి — తను వెళ్తున్నాడు.

అతను మీరాను గురించి ఆలోచించడం ఎన్నడూ మానలేదు — చివరకు అపస్మారక దశలో సైతం మానలేదు. అతను ఆమెను రోడ్డుపైన యిటుకలు పేరుస్తూండగా చిట్టచివరి సారి చూశాడు. తర్వాత ఆమె అతని కనుమరుగైంది. కాని ఆమె అక్కడ, ఆమెను తమలో ఒకదానిగా స్వీకరించిన స్త్రీలమధ్య వున్నట్లు అతనికి తెలుసు. ఏకారణంచేతనో వాళ్ళ బారులు తీరడానికి చాలా టైము పట్టడం అతను చూశాడు. ఆ బారుల్లో మీరాను గుర్తుపట్టడానికి అతను ప్రయత్నించాడు, కాని అప్పటికే చీకటిపడుతోంది, మనుషుల ఆకృతులు అస్పష్టంగా వున్నాయి, కాగా ఆమె ఎక్కడ నిలబడిందో అతను గుర్తించలేకపోయాడు. కానైతే అతను గ్రహించాడు — మధ్యలో ఎక్కడో దూరేందుకు ఆమె ప్రయత్నించి వుంటుందని. తర్వాత ఆ బృందం ముందుకెళ్లిపోయింది, ఆవరణ ఖాళీ అయింది; అతను మరికొంచెం సేపు వేచియుండి, తర్వాత తన నేలమాళిగకు తిరిగి వెళ్లిపోయాడు. అంతసేపూ దుఃఖం, సంతోషం అతనిలో కొట్టుమిట్టాడాయి, కాని చిట్టచివరకు మీరా దుర్గంలోంచి బయటపడగలిగిందన్న సంతోషమే జయించింది.

ఇందుకు అతను సంతోషంగా ఉన్నాడు — గతం తప్ప అతనికి మరే ఆనందమూ లేకపోవడమే యిందుకు కారణం.

అతను దిగ్భ్రాంతి చెంది అకస్మాత్తుగా నిలబడిపోయాడు; అతనా స్థలాన్ని గుర్తించలేకపోయాడు. దుర్గంలో ఏ విభాగంలోనైతే ప్రతి ఒక్క రాతినీ తను ఎరుగునో, ఆ తన ప్రాంతాన్ని యిప్పుడు తను గుర్తించలేకపోతున్నాడు. కాని యివి అతనికి అపరిచితమైనవి. అతని ముందు యిటుకలు — మంచు చిన్నెలు లేని యిటుకలు — పడివున్నాయి. అవి ప్రేలుడు కారణంగా చెల్లాచెదరుగా విరజిమ్మబడివున్నాయి.

కేస్‌మేటుకు దారితీసే కంత అదృశ్యమైంది. అక్కడికి కంత లేదు, నేలమాళిగలేదు, ఆయుధాల్లేవు, తిండిలేదు, అవన్నీ కూడా గజిబిజిగా వున్న యిటుక గుట్టల క్రింద పూడిపోయాయి. సమస్తం — తన గతం యావత్తూ, భవిష్యదాశలు సర్వం — కప్పబడిపోయాయి.

మంచు తన ఉనికినే కాకుండా, తను తల దాచుకునే తావును కూడా పట్టిచ్చింది. జర్మన్లు ఆ కంతను కనుగొన్నారు. కనుక్కొని దాన్ని పేల్చేశారు. ఇప్పుడిక తనకు మిగిలినదల్లా: ఒక పూర్తి డిస్కుతో ఒక సబ్‌మెషీన్ గన్ను, తన జేబుల్లో వున్న తూటాలు, తన భుజాలపై పీ-జాకెట్టు, జేబులో రెండే రెండు రస్కులూ.

అతనక్కడ చాలసేపు, నిశ్చలంగా, తనకింకేమి వున్నాయబ్బా అని గుర్తుచేసుకునేందుకు ప్రయత్నిస్తూ, కూర్చుండిపోయాడు.

అతనికింకా ఉన్నవి: తీక్ష్ణమైన జీవితేచ్ఛ, మృతదుర్గం, శత్రువుపట్ల దారుణ ద్వేషం. అందుకని, చివరకి అతను లేచాడు, వెనక్కి తిరిగి వలయాకారపు బ్యారక్సుకు వెళ్ళాడు.

2

అతనా రాత్రి దూర విభాగంలో చల్లని కటిక నేలపై కునుకు తీశాడు. అతను చలికి కొంకర్లుపోయి, లేచి అటూయిటూ తిరిగాడు, మళ్ళీ ఓ కునుకు తీశాడు, చలికి మళ్ళీ మెలకువ వచ్చేసింది. అతను లేచి నిలబడ్డాడు. తను తల దాచుకునేందుకు ఓ గూటినీ, తిండినీ, ఆయుధాలనూ, దుస్తులనూ వెతుక్కోవాలి. ఏదో ఒకటి దొరక్కపోదని అతను ఆశించాడు. తొలి తెలికాంతి విరియగానే తనకు అపరిచితమైన ఆ నేలమాళిగలలో వెతుక్కుంటూ బయల్దేరాడు.

తను అంతకు ముందు పట్టించుకోని వస్తువులను సైతం ఇప్పుడతను ఏరుకున్నాడు: గన్ ఆయిలు కొద్ది బొట్లు మిగిలిన ఓ డబ్బా, ఓ చెయ్యి కాలిపోయిన ఓ పాత బొంత కోటు, తూటాలు. తనకు దొరికిన తూటాలన్నింటినీ — సోవియట్‌వీ, జర్మన్‌వీ కూడా — అతను పోగుచేశాడు, వాటిని జాగ్రత్తగా తుడిచి శుభ్రం చేశాడు, క్యాలిబర్ తేడానుబట్టి వేర్వేరు జేబుల్లో వేసుకుని, ఏవేవి ఎన్నెన్ని వున్నాయో గుర్తుంచుకున్నాడు. తనిప్పుడు వాటిని పొదుపుగా వాడుకోవాలి. అతనా పొదుపు కార్యక్రమాన్ని తన సబ్‌మెషీన్ గన్నును పట్టుకి ఒకే కాల్పు కాల్చేందుకు వీలైన మీటకి మార్చడంతో మొదలెట్టాడు.

అతనికి దొరికిన ఒక వస్తువు, రస్కులు దొరికినప్పుడు కలిగించినంత సంతోషాన్ని కలిగించింది — అన్నట్లు, అవి మరికొన్ని దొరికితే అతను చాలా సంతోషించేవాడే. కానైతే యీ సారి దొరికినది — పూర్తి మగజీన్‌తో కూడిన — ఆటోమేటిక్ రైఫిలు. అతను దాన్ని ఏ భాగానికి ఆ భాగం ఊడదీసి, ఆయిలు వేసి, మళ్ళీ బిగించి, బోల్టు సరిగా ఉన్నదీ లేనిదీ పరీక్షించాడు. ఫైరింగు పిన్ను కొత్తదానంత బాగా వుంది, కాని దాని మెకానిజం విషయంలో అతనికి అంత పూర్తి నమ్మకం కుదరలేదు. ఈ రైఫిళ్లను పూర్తిగా నమ్మేందుకు వీల్లేదు, ఆ విషయం అతనికి మిలిటరీ స్కూలు రోజుల్నుంచీ తెలుసు, పైగా చాల కాలంగా యిది యిటుకల క్రింద పడివుంది. అయితే దీన్ని పరీక్షించి చూడటం పోరాటంలో మాత్రమే సాధ్యం. అందుకని అతను మగజీన్‌ని మళ్ళీ నింపి, బ్యారెల్‌లోకి ఒక తూటాను నెట్టాడు. తర్వాత అతను తన చిట్టచివరి రస్కు తినడంద్వారా — మరో దాన్ని అతను అంత క్రితం రాత్రి తినేశాడు — పండగను జరుపుకున్నాడు.

అతనా రైఫిలును శుభ్రంచేసే పనిని తనకు అపరిచితమైన నేలమాళిగలో — శీత కాలపు పగటిపూట వెల్వడే క్షీణ కాంతి సన్నని బీటగుండా లోనికి ప్రసరిస్తున్న చోట — నిర్వహించాడు. సరిగా చిట్టచివరి రస్కు తుంపులు తినడం ముగించబోతూండగా అతనికి స్వరాలు — దూరంనుంచి అజ్ఞాత, అస్పష్ట స్వరాలు — వినవచ్చాయి. అతను గండి దగ్గరకు వెళ్లి పైకి తొంగి చూశాడు. కొద్ది దూరంలో అతనికి ముగ్గురు వ్యక్తులు కనిపించారు. వారిలో ఒకడు ఒడ్డూపొడుగూ దిట్టంగా వున్నాడు.

ఏ కారణంగానో తెలియదుగాని, గచ్చకాయ ఆకుపచ్చవన్నె కోటు తొడుక్కున్న ఆ వ్యక్తి తనకి తెలుసునని అతనికి అనిపించింది. అతను గ్రహించాడు — అబ్బే లేదు, అతను తనకి తెలియడం అసంభవం. నిన్నటి రోజున ఎండిపోయిన గుర్రపు లద్దెల క్రింద తను పడుకొని ఉన్నప్పుడు తనకు అనుభూతమైన బరువు యిప్పుడు అతనికి గుర్తుకొచ్చింది. మరి వీడి రైఫిలు కడ్డీబయనెట్ తగిలింపబడి చాలా పొడుగ్గా వుంది.

ఆ చల్లని గచ్చకాయరంగు బయనెట్టును చూసేసరికి అతనికి తన పక్కలో నొప్పి — గీరుకొన్న పక్కటెముక సన్నగా సలపసాగింది — మళ్లీ విజృంభించినట్లయింది. ఆఁ అదీ సంగతి, బయనెట్టుకి రక్తం అంటుకోకపోవడానికి అదన్న మాట కారణం, అది పొడిచిందేగాని, చీల్చలేదు, దానికి అంటుకొన్న కొద్దిపాటి రక్తబిందువులూ తన దుస్తులకే తుడుచుకు పోయాయి. తన అదృష్ట మేమిటంటే అది జర్మన్ కత్తి బయనెట్టు కాక, రష్యన్ కడ్డీ బయనెట్ కావడం. మరి తన సొంత రష్యన్ బయనెట్టు తన ఉనికిని జర్మన్లకు వెల్లడించ లేదు. ఆ బయనెట్టుది నేరం కాదు కదా, నేరం ఆ బయనెట్టును తన మీదకి తిప్పిన వాళ్లది.

అతను తన రైఫిల్ను పైకెత్తాడు. తనకీ రోజున యిది దొరకడం మంచిదైంది. ఇది తనకు ఆశాభంగం కలిగించకపోతే — యిది మరీ అంత విశ్వసనీయమైన రకం కాదు కనుక — తనకు బాగా అక్కరకొస్తుంది. ఒక కన్ను మూసి, తన వేపు వీపు తిప్పి వున్న పొడుగాటి వ్యక్తి కేసి, అతను గురిచూశాడు. కాని అతను తన ఎడమకంటిని ముయ్యగానే ఆ వ్యక్తి ఆకృతిని కోల్పోయి, ఓ పెద్ద మచ్చలా కనిపించాడు. అతను తన కంటిని నులుముకుని, మళ్లీ గురిచూశాడు, ఆ ఆకారం మళ్లీ కరిగిపోయింది. ఇలాంటిది యింతకు ముందెన్నడూ అతనికి సంభవించలేదు, అతని దృష్టి ఎప్పుడూ అద్భుతంగా ఉంటూవచ్చింది; కాని యిప్పుడు తను తన దృష్టిని — అందులోనూ ముఖ్యంగా కుడికంటి దృష్టిని — కోల్పోతున్నట్టు అతను గ్రహించాడు.

అందుకు అతను గాభరాపడలేదు. అతనూరికే రెండో కంటిని తెరిచి, రెండు కళ్లనూ ఉపయోగించి, గురిచూశాడు. అతనికిది అలవాటులేదు, కాని అతను తను అనుకున్న చోటుకి గురిచూశాడు, సున్నితంగా ట్రిగ్గరు నొక్కాడు. కాల్పు మోగగానే ఆ పొడుగు వ్యక్తి చేతులు చాచి ముందుకి బొక్కబోర్లా పడటాన్ని అతను చూశాడు. అతను ట్రిగ్గరు మళ్లీ నొక్కాడు.

కాని మెకానిజం పనిచెయ్యలేదు, రైఫిలు పేలలేదు. మరి మళ్లీ లోడ్ చేసేందుకు వ్యవధీ లేదు, తను యిక్కడినుంచి వెళ్లిపోవాలి. తనకు యీ నేలమాళిగలను గురించి ఏమంత తెలియదు.

అతను శీఘ్రంగా ముందుకెళ్లాడు, కాని నేలమాళిగల నడవలను చూసేందుకు తరచుగా ఆగుతూ వెళ్లాడు. వెనక ఎక్కడో అతనికి స్వరాలూ, అనేక కాల్పులూ వినవచ్చాయి. జర్మన్లు తనను వెంటాడుతున్నారు, కాని యీ నేలమాళిగల పద్మ వ్యూహంలో, ఏమొండి సందులోనో చిక్కుకోకపోతే తను ఎక్కడో అక్కడకి తప్పుకోవచ్చునని అతను ఆశించాడు. అలా చిక్కుకోవడమే తటస్థిస్తే అప్పుడిక తను పోరాడాలి, మరి అదే తన తుది పోరాటం అవుతుంది. ఒకప్పుడు తను సరిగా అలాంటి నేలమాళిగలోనే చిక్కుకున్నాడు, కాని సకాలంలో బయటపడ్డాడు. అప్పట్నుంచి అతను తొందరపడకుండా జాగ్రత్త వహిస్తూ వచ్చాడు. ప్రత్యేకించి జర్మన్లు చీకటిగా వున్న ప్రతి గూటినీ, ప్రతి బిలాన్నీ లైటువేసి చూడటానికో, కాల్చడానికో ప్రయత్నిస్తూ, మెల్లగా పురోగమిస్తున్న కారణంగా, అతను ఏమాత్రం తొందరపడలేదు.

తను పడుకోగలిగిన చోటొకటి వెతుక్కోవాలి; అవిరామంగా తను యిలా పరుగెత్తుతూ వుండలేడు. కొంచెం ముందు వెనకల్లో జర్మన్లు తనను ఎక్కడో ఇరుకులో పడేసి చేజిక్కించుకోవచ్చు. అందుకని అతను చీకటిగా వున్న నడవల్లో గోడలను జాగ్రత్తగా చేతులతో తడుముతూ, ఏ కంతనో, బీటనో వెతుక్కుని, దాని గుండా బయటపడి తన త్రోవలను వెతుక్కోవచ్చుననీ, లేక జర్మన్లు వెళ్లిపోయేదాకా చూసి, వాళ్లిదివరకే సోదాచేసి లైట్లు వేసి చూసి కాల్పులు జరిపిన చోటికి తప్పుకోవచ్చునని ఆశిస్తూ — అటువంటి జాగాకోసం వెతకనారంభించాడు.

అంత జాగ్రత్తగా చేసిన గాలింపు మూలంగానే అతనికి ఆ సొరంగం కనిపించింది. అది ఆషామాషీ దృష్టికి ఓ పట్టాన కనిపించదు. అది నేలబారు ఎత్తులో, గోడకిగల ఉబ్బుకి వెనక, రెండు మాళిగలను కలిపే కురుచ నడవలో ఉంది. అక్కడ నిర్గమన మార్గం వుంటుందని ఎవరూ అనుకోరు. ఆ సొరంగం యిరుకుగా, అడ్డంగా వుంది, కాని ప్రవేశ మార్గం దగ్గర్నుంచి ఒక మీటరు దూరంలో సమకోణంలో మలుపు తిరిగింది. సమాధి మాదిరిగా చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్న ఆ జాగాలోకి అతను ఓరగా తిరిగి మాత్రమే వెళ్లగలిగాడు. తను చేరుకున్న జాగా పరిమాణమేమిటో అతనికి తెలియదు, కాని వెంటనే అతను ప్రవేశ మార్గానికి అభిముఖంగా తిరిగి, తన సబ్‌మెషీన్ గన్నును కాల్చేందుకు సిద్ధంగా పట్టుకున్నాడు. ఆ బిలం మంచి అనువుగా సౌకర్యంగా వుంది, దానికి తెలివిగా త్రవ్వబడిన నడవను బట్టి — యింకేమీ గాలించకుండా, దాన్ని అతను విలువైనదిగా పరిగణించుకున్నాడు. ఇప్పుడతనికి జర్మన్ల స్వరాలు దాదాపు వినరావడంలేదు, తను యిప్పుడు పడుకున్న యిసుక సైతం మెత్తగా, చివరకు వెచ్చగా కూడా వుంది. ఇంతవరకు అన్నీ అద్భుతంగా వున్నాయి.

కాలిబూట్ల ధన్‌ధన్ శబ్దానికి యిసుక కంపిస్తోంది, ఆ కంపనను అతని యావత్తు శరీరమూ అనుభూతి చెందుతోంది. ఇప్పుడిక మొదటివాడు చీకటిగా వున్న నడవ దగ్గరకి వస్తాడు; గింగురుమనే కాల్పు శబ్దాన్ని మందపాటి యిసుకపొర సన్నగిలజేసింది. వాళ్లు కాల్చారు, యిప్పుడిక వాళ్ళు తదుపరి భాగానికి వెళ్లాలి. చీకటిగా వున్న నడవలో తచ్చాడకుండా వాళ్ళు అలాగే వెళ్లారు. తన చెవిలో మార్మోగిన బూట్ల ధన్‌ధన్ శబ్దం చెదిరిపోయింది, కాలి చప్పుళ్లు అంతకంతకు అస్పష్టమై, మరింత దూరమయ్యాయి. అతను అమ్మయ్య, అని నిట్టూర్చాడు, సబ్‌మెషీన్ గన్నుని సేఫ్టీలో పెట్టాడు.

"దొంగ తొత్తుకొడుకులు పోయారా?"

అతను గతుక్కుమని, చీకట్లోంచి వినవచ్చిన ఆ స్వరం వంక — రొప్పుతో బొంగురుగా వున్న స్వరం వంక — చటుక్కున తిరిగాడు. అతని గుండె ధన్‌ధన్‌మని కొట్టుకుంది.

"ఎవరది?"

"నువ్వెవరు?"

"మిత్రుణ్ణి!"

"నేనూ అస్మదీయుణ్ణే. ఆ మాటకొస్తే మరింత మిత్రుణ్ణి. మీరెంతమందేమిటి?"

"ఒక్కణ్ణే."

"చిట్టచివరివాడివన్న మాట?"

"నేను లెక్కపెట్టలేదు. ఇంతకీ నువ్వెక్కడున్నావ్?"

"ఉండు, నేను లైటు ముట్టిస్తాను. కొవ్వొత్తులు ఆట్టే మిగల్లేదు, నేను వాటిని పొదుపు చేస్తున్నాను, కాని యిలాంటి సందర్భంలో — !"

ఓ అగ్గిపుల్ల వెలిగింది, చీకట్లోంచి పుల్లలా వున్న ఓ పొడవాటి చెయ్యి, నల్లగా గిరజాలు తిరిగిన గడ్డంలో కొంత భాగం — ఓ మచ్చలాగ — అతనికి కానవచ్చాయి. ఆ చెయ్యి ఆ అగ్గిపుల్లను ఒక పెట్టెకు అతికించబడిన కొవ్వొత్తి దగ్గరకు తీసుకెళ్లింది. ఆ కొవ్వొత్తి వెలుగు కాంతివంతం కాసాగిన కొద్దీ బొంత కోటుపైన బెల్టును గట్టిగా బిగించుకొని వున్న ఓ సజీవ అస్థిపంజరం అతనికి కానవచ్చింది. భుజాలపై వ్రేలాడుతున్న నెరుస్తూ నెరుస్తూ వున్న జులపాలనూ, ఉద్రేకంతో మిలమిల మెరిసిపోతున్న కళ్లనూ, తన కేసి చాచబడిన ఒక చేతినీ అతను చూశాడు. అతను ఆ చేతి దగ్గరకు పరుగెత్తాడు.

"ఒక్క క్షణమాగు, తమ్ముడూ, ఆగు, నన్ను నలిపెయ్యకు. నా కాళ్లు నెప్పెడుతున్నాయి, పైగా ముద్దెట్టుకోడమెలాగో మనం మరిచిపోయాం. నీ చెయ్యేది, యిలాగియ్యి రష్యన్ మనిషీ, సోవియట్ సైనికుడా, నావాడా. ఆఁ అదుగదీ, అలాగ. ఉండు మాట్లాడకు, నన్నూపిరికే నీకేసి చూడనియ్యి. హాఁ, అయితే ఆ పంది వెధవలు మన్ని పట్టుకోలేకపోయారు, ఔనా? వాళ్ల సబ్‌మెషీన్ గన్నులు, డైనమైట్లు, అగ్గి బరాటాలు — యిన్ని వున్నా వాళ్ళు

మనల్ని పట్టుకోలేకపోయారు. వాళ్ళు మనల్ని పట్టుకోలేకపోయారు. వాళ్ళు మనల్ని పట్టు కోలేదు, పట్టుకోలేకపోయారు!''

అతను బలహీనంగా వున్నాడు, అతనిలో ఎముకలూ, చర్మమూ మాత్రమే మిగిలాయి, బొంగురుగా, విజయోల్లాసంతో – కన్నీళ్ళు గడ్డంమీదనుంచి జాలువారుతూండగా – అతను నవ్వాడు. అతను నవ్వాడు, అతను కంపించాడు, అతను అదే పనిగా మాట్లాడాడు.

''నన్ను క్షమించు తమ్ముడూ, నేను కన్నీళ్ళు కారుస్తున్నందుకు నన్ను క్షమించు. కాని నాకు యిలా ఏడ్చేందుకు హక్కుంది. నేను మూడు వారాలుగా ఎవళ్ళనీ చూడలేదు, ఎవరి స్వరమూ వినలేదు. నాలో నేనే మాట్లాడుకుంటున్నాను. ఔను, నేను కొంచెం బలహీన పడ్డాను, నిజమేననుకో. అందుకని నన్ను మాట్లాడనియ్యి, నీవంక చూడనియ్యి, అటు తర్వాత మనిద్దరం పరస్పరం పరిచయం చేసుకుందాం. కాని ముందు నిన్ను తనివిదీరా చూడనియ్యి. ప్రియమైన తమ్ముడూ నువ్విన్నాళ్ళూ ఎలా బ్రతికి వుండగలిగావు? ఇన్ని రోజులూ నీకేమేం కష్టాలు సంభవించాయి? వాటన్నింటినీ నువ్వెలా ఓర్చుకున్నావు?''

''ఎలాగో ప్రాణాలు నిలుపుకున్నాను.'' ఈ మనిషిలాగే తను కూడా ఆనంద బాష్పాలు కార్చగలిగితే ఎంత బాగుండును, అనుకున్నాడు ప్ల్యాజ్నికొవ్. కాని కన్నీళ్ళకు కరువే అయింది. ''అయితే, నువ్విక్కడ ఒంటరిగా వుంటున్నావన్న మాట?''

''మొదట్లో మేము చాలమందిమే ఉండేవాళ్ళం. మేమీ సొరంగం కనిపెట్టి, దీంట్లోంచి పైకి దోవ చేసుకున్నాం. తర్వాత మేం నలుగురికి తగ్గిపోయాం. మూడు వారాల క్రితం చివరివాడు తిరిగి రాలేదు. అప్పటినుంచి నేనిక్కడే పడివున్నాను. నా కాళ్ళు పట్టుతప్పాయి, తెలిసిందా? నా మోకాళ్ళమీద కొంచెం పాకగలనంతే, కాని నడవలేను. నా నడక ముగిసి పోయినట్టే.''

''నువ్వెవరు?''

''నేనూ అదే ఆలోచిస్తున్నాను. నేనిప్పుడు ఎవర్నీ అని ఆలోచిస్తున్నాను. జర్మన్లు నన్ను పట్టుకుంటే నన్ను నేను కాల్చుకునేందుకు వ్యవధి లేకపోతే, నేనెవర్నని చెప్పాలి? ఆలోచించి ఆలోచించి చివరకు యిలా నిర్ణయించుకున్నాను: నేనొక రష్యన్ సైనికుణ్ణి. రష్యన్ సైనికుడే నా వృత్తి, రష్యన్ సైనికుడే నా పేరు. ఏమంటావ్, నేను చెప్పింది రైటేనా?''

''జర్మన్లకైతే – అది సరైన సమాధానమే. కాని నేను మీలో వాడినే, లెఫ్టినెంట్ ప్ల్యాజ్నికొవ్‌ని.''

''నీది ఏ రెజిమెంటు?''

''నా పేరు జాబితాకెక్కనే లేదు.'' ప్ల్యాజ్నికొవ్ నవ్వాడు. ''సరే, యిప్పుడింక మాట్లాడటం నా వంతు అనుకుంటాను.''

''సరే, నీదే వంతు.''

ఫ్లాజ్నికొవ్ — ఎక్కువ వివరాల్లోకి పోకుండా, కాని ముఖ్యాంశమేదీ వదలకుండా — తన స్వీయకథ చెప్పాడు. క్షతగాత్రుడు — తన పేరింకా అతను బయటపెట్టలేదు — ఫ్లాజ్ని కొవ్ చేతిని పట్టుకుని వేలాడుతూనే అడ్డు ప్రశ్నలు వెయ్యకుండా విన్నాడు. కాని క్రమంగా సడలుతున్న పట్టునుబట్టి తన కొత్త కామ్రేడు ఎంత బలహీనంగా వున్నాడో ఫ్లాజ్నికొవ్‌కి అర్థమైంది.

''సరే, మనకిప్పుడు ఒకళ్లతో మరొకళ్లకి పరిచయమైంది'' ఫ్లాజ్నికొవ్ పూర్తిచేశాక క్షతగాత్రుడు అన్నాడు. ''నేను సార్జెంట్ మేజర్ సెమీష్నిని. నూది మొగిల్యోవ్ పట్టణం.''

సెమీష్ని చాలరోజుల క్రితమే గాయపడ్డాడు. ఒక బులెట్టు అతని వెన్నెముకను తాకింది, అతని కాళ్లు క్రమంగా చచ్చుపడిపోతున్నాయి. ఇప్పుడతను వాటిని చాలకొద్దిగా మాత్రమే కదపగలుగుతున్నాడు, కాని కొంచెం పాకగలుగుతున్నాడు. అతనొక వేళ మూలిగితే, నిద్రలో మాత్రమే మూలుగుతున్నాడు. మెలకువగా వున్నప్పుడు నిగ్రహంతో వుండటమే కాక, అతను చిరునవ్వు కూడా నవ్వుతున్నాడు. అతని కామ్రేడ్లు పైకి వెళ్లి మరి తిరిగి రాలేదు. కాని అతను బతికే వుండి, తీవ్రమైన పట్టుదలతో జీవితానికి అంటిపెట్టుకొని వున్నాడు. అతనికి కొంచెం తిండీ, కాసిని తూటాలూ వున్నాయి. కాని మూడు రోజుల క్రితం నీళ్లు నిండుకున్నాయి.

ఆ రాత్రి ఫ్లాజ్నికొవ్ రెండు బాల్చీల మంచు తీసుకొచ్చాడు.

''నువ్వు వ్యాయామం చెయ్యాలి, లెఫ్టినెంట్'' మరుసటి ఉదయం సెమీష్ని అన్నాడు. ''మనం ఆరోగ్యం సడలిపోనివ్వకూడదు. మనమిక్కడ, వైద్యకేంద్రం లేకుండా, పూర్తి ఒంటరిగా వున్నాం.''

అతని మటుకు అతను, రోజుకు మూడు సార్లు వ్యాయామం చేస్తున్నాడు. కూర్చుని, వంగుని నిటారుగా కూర్చుంటున్నాడు, రొప్పు వచ్చేదాకా చేతులు కదుపుతున్నాడు.

''ఔను, మిగిలింది మనమిద్దరమే లాగుంది'' ఫ్లాజ్నికొవ్ నిట్టూర్చాడు. ''నీకు తెలుసా, ప్రతి ఒకడూ తనకి తను ఆజ్ఞలు జారీ చేసుకొని, వాటిని అమలు జరిపియుంటే యుద్ధం వేసవిలోనే — ఇక్కడ, యీ సరిహద్దులోనే — ముగిసియుండేది.''

''అయితే మనమే అద్భుతమైన వ్యక్తులమని నువ్వు అనుకున్నట్లుందే?'' సార్జెంట్ మేజరు గంభీరంగా నవ్వాడు. ''తమ్ముడూ, నేనది నమ్మను. నేను నమ్మను, నమ్మలేను! ఇది మాస్కోకి ఎన్ని కిలోమీటర్ల దూరముందో నీకు తెలుసునా? ఓ వెయ్యి కిలోమీటర్లు. ప్రతి ఒక్క కిలోమీటరు దగ్గరా మనలాంటి మనుషులున్నారు. ఇంతకంటె మంచీ కాదు, చెడూ కాదు. పోతే ఆజ్ఞలంటావా — వాటి విషయంలో నువ్వు పొరపాటుపడ్డావు తమ్ముడూ. నీ ఆజ్ఞలనే కాదు నువ్వు పాటించాల్సినది, నీ ప్రమాణాన్ని — జండా పట్టుకొని నువ్వు

చేసిన ప్రమాణాన్ని — నువ్వు పాటించాలి.'' అతని ముఖం గంభీరంగా తయారైంది. అతను కటువుగా ముగించాడు, ''అర్థమైందా? సరే, అర్థమైతే పోయి అదే చెయ్యి. పోయి ఓ జర్మన్‌ని చంపి, తిరిగి రా. ఒక్కొక్క విషనాగుని చంపినప్పుడల్లా నీకు రెండేసి రోజుల సెలవు. అదీ నా నియమం.''

ఫ్లాజ్నికొవ్ పైకెళ్ళడానికి సిద్ధం కాసాగాడు. సార్జెంట్ మేజరు అతన్ని పరిశీలనగా చూశాడు. కొవ్వొత్తి క్షీణకాంతిలో అతని కళ్ళు విచిత్రంగా మిలమిల మెరిశాయి.

''ఏ అధికారంతో నేనీ ఆజ్ఞలిచ్చానో నువ్వు అడగవేం?''

''కాని నువ్వు దుర్గ రక్షణసైన్య కమాండరువి'' ఫ్లాజ్నికొవ్ నవ్వాడు.

''నాకా హక్కుంది'' సెమీష్నీ ప్రశాంతంగా, అత్యంత గంభీరంగా అన్నాడు. ''నిన్ను వెళ్ళి చచ్చిపొమ్మని బయటికి పంపేందుకు నాకు హక్కుంది. పోయిరా.'' అతను కొవ్వొత్తిని ఊదేశాడు.

ఈసారి సార్జెంట్ మేజరు ఆజ్ఞను పాలించడంలో ఫ్లాజ్నికొవ్ విఫలుడయ్యాడు. జర్మన్లు చాలా దూరంలో వున్నారు. కాల్చేముందు తనకు స్థిరమైన గురి కుదరాలని అతను వాంఛించాడు. అతని కంటి దృష్టి గణనీయంగా దెబ్బతింది. దూరాన వున్న ఆ ఆకారాలను చూసినప్పుడు, తన గురి తప్పుతుందన్న విషయాన్ని అతను స్పష్టంగా గ్రహించాడు. ఏ జర్మనో నేరుగా తన దగ్గరకు రావాలనే అతను ఆశించాడు.

కానైతే, వలయాకారపు బ్యారక్సుకి చెందిన ఆ విభాగానికి ఎవరూ రాలేదు. ఆ జర్మన్లు మరో విభాగంలో వున్నారు, వాళ్ళ వెనుక నల్లటి ఆకారాలు అస్పష్టంగా అతనికి కనిపిస్తున్నాయి. వాళ్ళొకవేళ స్త్రీలేమో — మీరా కలిసివెళ్ళిన వాళ్ళేనేమో — అన్న ఆసక్తితో వాళ్ళకు దగ్గరగా వెళ్ళాలని అతను నిర్ణయించుకున్నాడు. తను వాళ్ళలో ఎవరినైనా తన దగ్గరకు పిలవగలగవచ్చు, మాట్లాడగలగవచ్చు, మీరాను గురించి తెలుసుకోగలగవచ్చు, తనింకా బాగానే వున్నానని వర్తమానం పంపగలగవచ్చుననుకున్నాడు.

అతను శిథిలాలగుండా పరుగెత్తాడు, దూరపు పక్కనుంచి బయటికొచ్చాడు. కాని అక్కడొక వెల్లడి ప్రాంతముంది. అయితే పగటిపూట మంచుమీదుగా దాటివెళ్ళే దుస్సాహసానికి పూనుకోడానికి అతను సంసిద్ధపడలేదు. సరిగా వెనక్కి రాబోతున్న క్షణంలో అతనికి నేలమాళిగలకు దిగే మెట్లు — రద్దు పదార్థాలతో దట్టంగా నిండివున్న మెట్లు — కనిపించాయి. దిగి వెతకాలని అతను నిర్ణయించుకున్నాడు. వలయాకారపు బ్యారక్సునుంచి యీ శిథిలాలదాకా తన అడుగు జాడలు ఎలాగూ పడ్డాయి. తను మాటుగా పనికొచ్చే ఏదో ఒక చోటును వెతుక్కోవాలనుకున్నాడు.

మెట్లను దాదాపు మూసివేసిన యిటుకగుట్టల మీదుగా ఎంతో కష్టంతో అతను దోవ చేసుకుని ముందుకి వెళ్ళాడు. తనొక సొరంగంలో వున్నట్టు గమనించాడు. ఇక్కడ కూడా

నేలంతా, విలువంపు పైకప్పునుంచి కూలిన యిటుకలతో దట్టంగా నిండివుంది, అతను వంగి నడవాల్సివచ్చింది. త్వరలోనే అతని ముందొక యిటుకల గుట్ట కానవచ్చింది. అది సొరంగాన్ని పూర్తిగా మూసేసింది. జర్మన్లు తన జాడలను అనుసరించి లోపలకు వచ్చే లోగానే బయటపడాలని అతను తొందరగా వెనక్కి తిరిగాడు. అక్కడ దాదాపు చీకటిగా ఉందేమో చేతులను గోడకు ఆన్చి తడుముకొంటూ ముందుకు సాగాడు, అకస్మాత్తుగా శూన్యంలోకి వచ్చాడు. అక్కడినుంచి మరో సొరంగం కుడిపక్కకు చీలింది. అతను దాని వెంట కొన్ని అడుగులు ముందుకేశాడు, ఒక మూల మలుపు తిరిగాడు. అతనికి అక్కడొక పొడి కేస్‌మేటు కనిపించింది. పైనుంచి ఓ బీటలోంచి దానిలోకి వెలుతురు పడుతోంది. అతను చుట్టూ కలయజూశాడు. ద్వారానికి ఎదురుగా వున్న గోడవార, ఓవర్‌కోటుపైన, మాసి, చీలికలైన యూనిఫారంలో పడుకొని వున్న ఒక కళేబరం తప్ప అక్కడ మరేమీ అతనికి కనిపించలేదు.

ప్లూజ్నికొవ్ చదికిలబడి, ఆ మానవావశేషం వంక చూశాడు. దుబ్బుగా నల్లగా వున్న గడ్డం సగం చీకిపోయిన సైనికకోటుపైన ఆనివుంది. కాలరు దగ్గర వున్న ఖాళీ గుండా రొమ్ముకి చుట్టబడిన గుడ్డ పేలికలు అతనికి కనిపించాయి, దానితో, ఆ సైనికుడు యిక్కడ గాయాలతో, పైనున్న సన్నని బీటలోంచి కానవస్తున్న ఆకాశాన్ని చూస్తూ చని పోయాడని, అతను గ్రహించాడు. ఆ కళేబరాన్ని తాకకుండా జాగ్రత్త పడుతూ, ఆయుధాలు గాని, తూటాలు గాని కనిపిస్తాయేమోనని అతను చుట్టూ విఫల ప్రయత్నం చేశాడు. ఈ సైనికుడు చనిపోయే నాటికి పైన యింకా సైనికులు — అతని తూటాలు అవసరమైన వాళ్లు — ఉండి ఉంటారనడం స్పష్టం.

అతను లేచి వెళ్లిపోదామనుకున్నాడు, కాని ఆ కళేబరం — జీవించివున్న వాళ్లకింకా ఉపయోగించగలిగినంత మంచి స్థితిలో వున్న ఓవర్‌కోటుమీద ఉండటం గమనించాడు. తమ నేలమాళిగలో సార్జెంట్ మేజరు సెమీష్నీ చలితో బిగిసిపోతున్నాడు, కేవలం సైనిక కోటుతో పడుకోవడం ప్లూజ్నికొవ్‌కి సైతం కష్టసాధ్యంగా వుంది. క్షణకాలం శరీరావశేషాలను కదిపేందుకు అతను సంకోచించాడు. కాని కోటు కోటేకదా, మృతుడికి దానితో యిక అవసరమేమీ లేదుకదా.

"నన్ను క్షమించు తమ్ముడూ."

అతను కింద కోటు అంచు పట్టుకున్నాడు, కొంచెం పైకెత్తాడు, దాన్ని మృత సైనికుని క్రిందనుంచి మెల్లగా లాగాడు. అతను దాన్ని — శవపు వాసనను కొంతైనా తొలగించేందుకు విదిపాడు, తర్వాత పైకెత్తి చూశాడు, దానిపైన తుప్పు రంగులో ఎన్నడో ఎండి పోయిన రక్తపు మరక కనిపించింది. అతను దాన్ని మడత పెట్టబోతున్నాడు, కాని అలా చేసే క్రమంలో అతను ఆ తుప్పురంగు మరకవంక మళ్లీ చూశాడు. అతని చేతులు కిందకి వాలిపోయాయి, అతనా నేలమాళిగ చుట్టూ పరకాయించి చూశాడు. అకస్మాత్తుగా అతను

ఆ నేలమాళిగను, ఆ ఓవర్‌కోటును, ఆ మూలనున్న శరీరాన్ని, ఆ నల్ల గడ్డాన్ని గుర్తుపట్టాడు. కంపిస్తున్న స్వరంతో అతనన్నాడు: ''నమస్తే, వొలోద్యా.''

అతనొక క్షణం నిలబడ్డాడు, తర్వాత ఓవర్‌కోటును వొలోద్యా దెనీష్చిక్ శరీరావశేషాలపైన జాగ్రత్తగా కప్పాడు, అంచుల చివర్లపై బరువుకి యిటుకలు పెట్టి, కేస్‌మేటు నుంచి వెళ్లిపోయాడు.

''చచ్చిపోయిన వాళ్లకి చలెయ్యదు'' ప్లూజ్నికొవ్ దీన్ని గురించి చెప్పినప్పుడు సెమీష్నీ అన్నాడు. ''చచ్చిపోయిన వాళ్లకి చలెయ్యదు, లెఫ్టినెంట్.''

చాలా కోట్లూ, సైనిక కోట్లూ కప్పుకున్నా కూడా అతను చలితో వణుకుతున్నాడు. అతను ప్లూజ్నికొవ్‌ను తిట్టుకుంటున్నాడో, దీవిస్తున్నాడో చెప్పడం కష్టసాధ్యమైన పనే. అతను చావును ప్రశాంతంగా తీసుకున్నాడు. తను చచ్చిపోతున్నానేగాని గడ్డకట్టిపోలేదని అతను తనను గురించి తను అనుకున్నాడు.

''మృత్యువు నన్ను కొంచెం కొంచెమే కబళిస్తోంది, కోల్యా. అది అతి శీతలమైనది, ఓవర్‌కోటు దాన్ని వెచ్చబరచలేదు.''

ఒక్కొక్క రోజే గడుస్తున్న కొద్దీ మృత్యువు అతని కాళ్లపైకి ఎగబాకుతోంది. ఇప్పుడిక అతను దేకను కూడా దేకలేకపోతున్నాడు, కష్టంమీద మాత్రమే కూర్చోగలుగుతున్నాడు, కానైతే ఉన్మత్తావేశంతో కూడిన పట్టుదలతో తన వ్యాయామాన్ని కొనసాగిస్తున్నాడు. అతను లొంగిపోయేందుకు సుతరామూ నిరాకరించాడు, పోరాటానంతరం మాత్రమే తన శరీరంలోని ప్రతి ఒక్క మిల్లీమీటరు భాగాన్నీ మృత్యువుకి దత్తం చేశాడు.

''నేను మూలగడం మొదలుపెడితే నన్ను లేపు. నేను లేవకపోతే, అప్పుడు నన్ను కాల్చెయ్యి.''

''ఏమిటి నువ్వనేది, సార్జెంట్ మేజర్?''

''చచ్చిపోయాక కూడా జర్మన్ల చేతుల్లో పడే హక్కు నాకు లేదు. నేను వాళ్లకి ఆ సంతోషం కలిగించను.''

''వాళ్లకిప్పటికే కావలసినంత సంతోషం వుంది'' ప్లూజ్నికొవ్ నిట్టూర్చాడు.

''ఈ సంతోషం వాళ్లింతకు ముందు పొందలేదు!'' సెమీష్నీ అకస్మాత్తుగా ప్లూజ్నికొవ్‌ను తన దగ్గరకు లాక్కున్నాడు. ''పవిత్రమైనదాన్ని ఎన్నడూ వాళ్ల చేతికి చిక్కనివ్వకు. చావనైనా చచ్చిపోగాని దాన్ని శత్రువశం చెయ్యకు.''

''నాకు బోధపడలేదు. పవిత్రమైనదంటే ఏమిటది?''

''ఆ సమయమొచ్చినప్పుడు చెప్తాను. అంతదాకా నువ్వు నీ భగవంతుణ్ణి మన్నించినట్లు, నా ఆజ్ఞను పాలించు. నేనీ విషయాన్ని నా పేరనే చెప్పడం లేదని గుర్తుంచుకో. సరే, విశ్రాంతి తీసుకున్నావా? నీ గన్ను తీసుకుని బయటికి పో. పైకెళ్లు, లెఫ్టినెంట్! దుర్గమింకా

సజీవంగానే వుందని వాళ్ళు తెలుసుకోవాలి, చచ్చిపోయినవాళ్లని చూసి కూడా వాళ్ళు జడుసుకోవాలి. తమ పిల్లలకు, మనుమలకు, మునిమనుమలకు బ్రతికుంటే బలుసాకైనా తినొచ్చు, రాష్యా జోలికి పోకండ్రా బాబూ అని వాళ్ళు చెప్పకోవాలి!''

సార్జెంట్ మేజరు ఉన్మాదపుటంచున వున్నాడా అని ప్లూజ్నికొవ్ అబ్బురపడ్డాడు. అతనికి అంతకంతకు మరింత తక్కువ విరామాల్లో కోపోద్రిక్తత వచ్చేస్తోంది, అలా వచ్చినప్పుడల్లా లెఫ్టినెంట్‌ను పైకి తరుముతున్నాడు. ప్లూజ్నికొవ్ అతనితో వాదించడం లేదు. చాలకాలంగా అతనిలో గూడుకట్టుకొనివున్న ఏకైక భావావేశం శత్రువుపట్ల ద్వేషం, కానైతే అతని ద్వేషం — సెమీష్నీ ద్వేషానికి భిన్నంగా — ఆచి తూచి పరిణామాలు బేరీజువేసుకొనే ద్వేషం.

1942 సంవత్సరాది నాడు అతని అదృష్టం ప్రత్యేకించి పండిందని చెప్పాలి. జర్మన్లు నూత్న సంవత్సర పర్వదిన సందర్భంగా మరింతగా మత్తుపానీయాలు సేవించి అలసులుగానైనా ఉండి ఉండాలి, లేకపోతే మృత దుర్గపు చీకటి నేలమాళిగల విషయంలో హెచ్చరికగా ఉండటమింకా నేర్చుకోని కొత్త సైనికులైనా వచ్చివుండాలి. ఏదేమైతేనేం, అతనికి ఆ రోజున యిద్దరు జర్మన్లు — మంచి మాటునుంచి — వాటంగా దొరికారు. అటుతర్వాత అతను చాలసేపు నేలమాళిగలగుండా తరుముకొస్తున్న వాళ్లకి దొరకకుండా పరుగెత్తి, తప్పించుకున్నాడు. మంచుతుపాను మూలంగా అతని జాడలు — సుశిక్షితమైన జాతికుక్క సైతం జాడ తియ్యడం అసంభవమైన రీతిలో — మూసుకుపోయిన కారణంగానే అతనలా తప్పించుకోగలిగాడు.

తనను తరుముకొస్తున్న వాళ్లను అతను దాదాపు ఖోమ్‌స్క్ గేటుదాకా తీసుకెళ్లాడు. అక్కడ జర్మన్లకు కనిపించకుండా అతను మాయమయ్యాడు. వాళ్ళు పరుగెత్తారు, అరిచారు, కాల్చారు, చిట్టచివరకు శూన్యహస్తాలతో తిరిగిపోయారు. బాగా మరుగున వున్న ఒక ఫిరంగి గూటిలో అతను సాయంత్రం దాకా దాక్కుని, తర్వాత మరో యిద్దర్ని హతమార్చినట్లు చెప్పేందుకు సార్జెంట్ మేజరు దగ్గరకి వెళ్లాడు.

గత కొద్ది రోజుల్లో సార్జెంట్ మేజరు చాలా నీరసపడిపోయాడు, అందుకని ఆయనకు యీ శుభావార్తను తీసుకెళ్తున్నందుకు ప్లూజ్నికొవ్ సంతోషించాడు. సార్జెంట్ మేజరు తరచుగా అపస్మారకంలో పడిపోతున్నాడు, దారుణమైన వేదనలో అరుస్తున్నాడు, అంతలో స్పృహ తెచ్చుకుంటూ, నుదురంతా చెమటతో నిండిపోగా గజగజ వణికిపోతున్నాడు. మృత్యు దంష్ట్రల్లో వున్న ఆ శరీరంలో, బలీయమైన యిచ్ఛాశక్తి మాత్రమే, జీవన జ్యోతి నింకా వెలిగించి వుంచుతోంది.

అటువంటి ఒక అపస్మారక స్థితిలోంచి కోలుకొని అతను ప్రగాఢమైన విచారంతో చెప్పాడు: ''నేనిక ఎక్కువకాలం బతకను. నువ్వే చెయ్యాలిక ఆ పని.''

''ఏమిటది?''

''నేను చనిపోయేటప్పుడు నీకు చెబుతాను. ఔనుగాని – యుద్ధం ముగిసిపోయిందా?''

''అలా కనిపించడం లేదు.''

''మరైతే నువ్విక్కడ ఎందుకు కూర్చుంటున్నట్లు? తూటాలున్నాయా?''

''ఆఁ'' ఆ సంవత్సరాది రోజు ఉదయం పూట చల్లటి గాలిలోకీ మంచులోకీ వెళ్తూ ఫ్లాజ్నికొవ్ చెప్పాడు.

ఇప్పుడిది సాయంత్రం. మరణోన్ముఖుడై వున్న సార్జెంట్ మేజరుకి తానిప్పుడు శుభ వార్త చెప్పేందుకు హడావిడిగా వస్తున్నాడు.

కాని యింకా దోవలో వుండగానే, యింకా నేలమాళిగ లోపలకి రాకముందే, అతనికి అస్పష్ట శబ్దాలు వినవచ్చాయి. సెమీష్నీ గొంతెత్తి అరుస్తూ వుండి వుండాలి, మందంగా వున్న యిసుకపార సైతం అతని అరుపులను అణిచెయ్యలేకపోయింది.

ఫ్లాజ్నికొవ్ వేగంగా నేలమాళిగలోకి దిగాడు. కారుచీకట్లో తడుముకొంటూ వెళ్లి చిట్టచివరి కొవ్వొత్తి ముక్క తీశాడు, దాన్ని వెలిగించాడు. ఇవి అంతిమ క్షణాలన్న సంగతినీ, మరో సారి తనకి అత్యంత సన్నిహితంగా వున్న ఒక వ్యక్తి తనని విడిచి వెళ్లిపోతున్నాడనీ గ్రహించిన ఫ్లాజ్నికొవ్, సెమీష్నీని తట్టి పిలవలేదు. అతనో గుడ్డ పీలిక వెతికి, సార్జెంట్ మేజరు నుదుటిపైన గల చెమటను తుడిచాడు, తర్వాత కదలమెదలకుండా అతని సరసన కూర్చున్నాడు. జర్మన్లు యీ కేకలు వింటున్నారేమోనని అతనింకెంతమాత్రం ఆదుర్దా పడటంలేదు. మనుషులను పోగొట్టుకోవడం అతనికి విసుగెత్తిపోయింది, పోరాటమంటే విసుగెత్తిపోయింది, బ్రతుకంటే కూడ విసుగెత్తిపోయింది.

సెమీష్నీ అరుపులు ఆకస్మాత్తుగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి, ఇక యింతటితో ముగిసిపోయిందనుకున్నాడు ఫ్లాజ్నికొవ్. కాని సార్జెంట్ మేజరు తన కళ్లు తెరిచాడు.

''నేను అరిచానా?''

''ఔను.''

''మరైతే నన్నెందుకు లేపలేదు?'' ఫ్లాజ్నికొవ్ బదులుపలకలేదు, సెమీష్నీ నిట్టూర్చాడు. ''ఆహాఁ. నువ్వు ఒళ్లు దాచుకున్నావన్న మాట. కాని ఒళ్లు దాచుకునేందుకు నీకేమైనా హక్కుందా అని? మన తల్లి రొమ్ములపై విదేశీయుల యినుప పాదాలు ప్రళయనృత్యం చేస్తూంటే, మన ఒళ్లు దాచుకునే హక్కు మనకుందంటావా?...''

ఊపిరి పీల్చలేక పీలుస్తూ, సెమీష్నీ కష్టంమీద మాట్లాడుతున్నాడు. ఒక్కొక్క సారి అతనికి మాటలు ముద్దగా వస్తున్నాయి. మృత్యువు అతని గొంతును చేరుకుంది, అతని చేతులకు పక్షవాతం వచ్చింది. అతని కళ్లు మాత్రమే యింకా సజీవంగా ఉన్నాయి.

''మనం మన ఒళ్లు దాచుకోకుండా, మన విధిని నిర్వర్తించాం. ఇలాగే చివరిదాకా, చిట్టచివరిదాకా కొనసాగించు. తప్పనిసరి అయ్యేదాకా నిన్ను చంపే అవకాశాన్ని శత్రువుకివ్వకు.

అదొక్కటే పద్ధతి, అదొక్కటే సరైన పద్ధతి సైనికుడా. చావును చావుతోనే ఓడించు. అదొక్కటే పద్ధతి."

"నాలో యింక శక్తి ఏమీ మిగిలి లేదు, సెమీష్నీ" ప్లూజ్నికొవ్ నిరుత్సాహంగా అన్నాడు. "ఇంకే మాత్రం శక్తి లేదు."

"శక్తి లేదూ? ఉండు నీకు శక్తి వస్తుంది. నీకు నేనిస్తాను శక్తిని. నా దుస్తులు విప్పు — జాకెట్టు, కోటు, అన్నీ విప్పేసెయ్యి. ఏం విప్పావా? నీ చెయ్యి లోపల పెట్టు. ఏం? శక్తి నీ చేతికి తగిలిందా? నీకు తగిలిందా?"

ఇదంతా ఏమిటో అర్థం కాక, సందిగ్ధంగానే ప్లూజ్నికొవ్ అన్నీ విప్పాడు, తన చేతిని లోపలకు జొనిపాడు. మంచుదెబ్బకి పుళ్ళుపడి గరుకుగా వున్న అతని వ్రేళ్లకు నున్నని, దళసరి సిల్కు జండా చల్లగా తగిలింది.

"నేను దీన్ని యుద్ధపు తొలి రోజునుంచీ ధరించే వున్నాను." సార్జెంట్ మేజరు స్వరం కంపిస్తోంది, కాని పొంగిపొర్లివస్తున్న ఎక్కిళ్లను అతను అణిచిపెట్టాడు. "నా ఒంటి మీద ఉన్నది రెజిమెంటల్ జండా, లెఫ్టినెంట్. దాని పేరుమీదుగానే నేను నీకు ఆజ్ఞలు జారీ చేశాను. దాని పేరు మీదుగానే నేనిన్నాళ్లూ జీవించాను, తుదిక్షణందాకా చావును దూరంగా తరిమాను. ఇప్పుడిక ఆ పని నీ వంతు. అవసరమైతే చచ్చిపో, అంతేగాని దాన్ని జర్మన్లకు ఇవ్వకు. ఇది కేవలం నీ గౌరవమూ, నా గౌరవమూ కాదు. ఇది మన మాతృదేశపు గౌరవ చిహ్నం. దీనికెన్నడూ మచ్చ తీసుకురాకు, లెఫ్టినెంట్."

"నేనెన్నడూ తేను."

"నేనన్న మాటలు రెట్టించు: నేను శపథం చేస్తున్నాను —"

"నేను శపథం చేస్తున్నాను —" అన్నాడు ప్లూజ్నికొవ్.

"బ్రతికి వుండగాగాని, చనిపోయిగాని, ఎన్నడూ —"

"బ్రతికి వుండగాగాని, చనిపోయిగాని, ఎన్నడూ —"

"శత్రువుకి ఈ జండాను యివ్వను —"

"— జండాను —"

"— నా మాతృదేశపు, అనగా సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్ యొక్క — జండాను."

"— నా మాతృదేశం, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్‌యొక్క — జండాను." ప్లూజ్నికొవ్ యీ మాటలను రెట్టించి, మోకరిల్లాడు, సార్జెంట్ మేజరు యొక్క చల్లని రొమ్ముపైన గల సిల్కు గుడ్డను ముద్దుపెట్టుకున్నాడు.

"నేను చచ్చిపోయాక దీన్ని నీ రొమ్ముకి చుట్టుకో" సెమీష్నీ అన్నాడు. "కాని అంతదాకా దాన్ని ముట్టుకోకు. దానితోనే నేను జీవించాను, దానితోనే నేను చచ్చిపోతాను."

అటుతర్వాత వాళ్ళిద్దరూ మౌనం దాల్చారు. ఉద్వేగ విచార సమ్మిశ్రితమైన మౌనం అది. చివరకు ఫ్లాజ్నికొవ్ మాట్లాడాడు.

''నేనీ రోజున యిద్దర్ని చంపాను. మంచుతుపాను మూలంగా నా పని తేలిక అయింది.''

''దుర్గాన్ని మనం లోబరచలేదు'' సార్జెంట్ మేజరు మెల్లగా అన్నాడు. ''లొంగ లేదు.''

''లేదు, మనం యింతవరకు లోబరచలేదు, యికముందు కూడా నేను లోబరచను.''

మరో గంట తర్వాత సార్జెంట్ మేజరు సెమీష్నీ మరణించాడు. అతను మరేమీ మాట్లాడలేదు. ఫ్లాజ్నికొవ్ చాలసేపు — అతను చనిపోయాక కూడా యింకా బ్రతికి వున్నాడనే అనుకొంటూ — అతని పక్కనే కూర్చుండిపోయాడు.

అతనా జండా తీసుకున్నాడు. తన రొమ్ము చుట్టూ బిగించుకున్నాడు. చల్లని ఆ సిల్కు గుడ్డ అతన్ని వెచ్చపరచింది, అనుక్షణం దాని ప్రత్యేకమైన, ఉత్తేజకరమైన వెచ్చ దనాన్ని అతను అనుభూతి చెందాడు. అంతసేపూ — తను సెమీష్నీని పూడ్చిపెట్టినప్పుడు, అటుతర్వాత అతని పడకమీద పడుకొని, అతని పీ-జాకెట్ను కప్పుకొన్నప్పుడు — అతను ఆ వెచ్చదనాన్ని, ఆ ఉత్సాహాన్ని అనుభూతి చెందుతూనేవున్నాడు.

అతనక్కడ పడుకొని, యిప్పుడిక తనకు ఎవరన్నా, ఏదన్నా — జర్మన్లు, మృత్యువు, చలి — భయం లేదని ప్రశాంతంగా ఆలోచించుకోనారంభించాడు. అతనిలో యిప్పుడిక ''నేను'' అన్న అహంకారం తొలగిపోయింది — అతను అంతకన్న మిన్న అయినదాన్ని — తన వ్యక్తి త్వాన్ని, అనుభూతి చెందనారంభించాడు. తన మాతృదేశపు భూత భవిష్యత్కాలాలకు మధ్య ఒక లింకు అయిన వ్యక్తిత్వమది. అందులోని ఓ చిన్న తునకయే — మహోత్కృష్టమైన సిల్కు జండాయే — యిప్పుడు తనకు వెచ్చదనాన్నీ, ఉత్తేజాన్నీ ప్రసాదిస్తోంది. ఈ వ్యక్తిత్వం ఏ పేరున వ్యవహరించింది, ఎక్కడ, ఎలా జీవించింది, ఎవరిని ప్రేమించింది, ఎలా నశించి పోయింది — యిదేదీ, ఎవరికీ అంత ముఖ్యం కాదన్న విషయాన్ని అతను నెమ్మదిగా గ్రహించాడు. ఇందులో ముఖ్యాంశం ఒక్కటే — భూత భవిష్యత్తులను కాలమనే ఒకేఒక గొలుసులో బంధిం చిన యీ లింకు బలంగా ఉండివుందన్నదే అది. ఈ లింకు బలంగా ఉన్నదనీ, యిది శాశ్వత మైనదనే సంగతి అతనికి అసందిగ్ధంగా తెలుసు.

పైన మంచు దట్టంగా పడుతోంది. కందకాలూ కాలిబాటలూ మందమైన మంచు తివాచీతో కప్పబడ్డాయి. నిస్తబ్ధమొనర్చబడిన పల్లెలపైనా, లోలోపల దహించుకుపోతున్న శిథిలాలపైనా పడి, గాలికి కొట్టుకుపోయిన మంచు నిర్మానుష్యంగా వున్న పట్టణ వీధుల్లో పేరుకుంటోంది.

కాని పార్టిజాన్ల చలిమంటలు ఆ మంచులోనే మండుతున్నాయి. తన మాదిరిగానే పరాజితులయ్యేందుకు నిరాకరించిన వ్యక్తులు ఎడతెగకుండా రేగే మంచు తుపాను మాటున

ఆ చలిమంటల దిశగా వెళ్తున్నారు. మరి జర్మన్లు చీకటి అంటే, మంచుతుపాను అంటే, దుర్గ్రాహ్యమైన రష్యన్లంటే భయపడుతూ యిళ్లకూ, నలిగిన రోడ్లకూ తమను తాము పరిమితం చేసుకున్నారు.

అప్పటికింకా ఖతీన్ ఊచకోత జరగలేదు, బెలోరష్యా తన జనాభాలో నలుగురిలో ఒకర్ని పోగొట్టుకోలేదు. కానైతే, నలుగురిలో ఒకరు అప్పటికే కాలుస్తున్నారు. వాళ్ల కాల్పుల మూలంగా నాజీ సైన్యానికి ఆ ప్రాంతం నరకప్రాయంగా తయారైంది. అదిగో ఆ నరకానికి సింహద్వారమే బ్రెస్ట్ దుర్గం.

ఆ మంచుతుపాను బ్రెస్ట్‌నుంచి మాస్కో దాకా రేగుతోంది. అది జర్మన్ల శవాలను పూడ్చిపెడుతోంది, వాళ్ల ఆయుధాలను నజ్జునజ్జు చేస్తోంది. ఇతర లెఫ్టినెంటులు దాడి కోసం సైనిక కంపెనీలను సమకూర్చుకొని, శత్రువును ఛిన్నాభిన్నం చేసి, వాటిని పడమటి దిక్కుకి — అతని దగ్గరకి, అపరాజిత మాతృదేశపు అపరాజిత పుత్రుని దగ్గరకి — నడుపుకుని వస్తున్నారు.

3

ఏప్రిల్ మాసంలో ఒక రోజున, ఉదయం బాగా పెందరాళే రుబీమ్ స్వీత్‌స్కీ — ఒక నాటి ఫిడేలు వాద్యగాడు, ఒకప్పుడు మనిషి — బరువైన చక్రాలతోను, తొక్కిళ్లతోను ఛిద్రమైన బురదరోడ్డు వెంట తల వంచుకొని చకచక నడుస్తున్నాడు. జర్మన్ మోటారు వాహనాల బారులు ప్రవాహం మాదిరిగా అతని వేపు వస్తున్నాయి, వాటి ముందు అద్దాల మీద సూర్య కిరణాలు తళుకు తళుక్కున నాట్యంచేస్తున్నాయి.

స్వీత్‌స్కీ బంగరువన్నె కిరణాలు బరపుతున్న ఆ సూర్యుణ్ణి చూడటంలేదు. అతని రొమ్ముమీదా, వీపుమీదా పసుపుపచ్చ రంగులో ఆరుకోణాల పెద్దపెద్ద నక్షత్రపు గుర్తులున్నాయి. వాటిని చూసి ఎవరైనా అతన్ని తిట్టవచ్చు, కొట్టవచ్చు, చివరకు కాల్చి, శరీరాన్ని మురుగు కాల్వలో ఊరదొక్కవచ్చు. అలాంటి గుర్తులవి, అందుకనే కళ్లెత్తి పైకి చూసేందుకు అతను సాహసించడంలేదు. ఆ పసుపుపచ్చ నక్షత్రం అతన్ని ఒక శాపంలా, గుదిబండలా క్రుంగదీస్తోంది. ఆ ఫిడేలు వాద్యగాని కళ్లు కాంతిదక్కాయి, అసాధారణ ధైర్యం కలిగిన అతని చేతులు లొంగుబాటుగా వ్రేలాడుతున్నాయి. అతని గూనిమూపు — ఏ క్షణాన అయినా ఓ గెంటునో, ఓ దెబ్బనో, లేక బులెట్‌నో ఎదురుచూస్తూ — మరింతగా వంగిపోయింది.

ఇప్పుడిక అతను ఫిడేలు వాయించడమే లేదు, ఓ ఘెట్టో*లో వేలాదిమంది యితర

---

* నగరంలో యూదులు అంటరానివారి మాదిరిగా వుంచబడే పేట. — సం.

యూదులతో కలిసి వుంటున్నాడు. యుద్ధ ఖైదీల శిబిరంలో రంపాలతో దుంగలు కోస్తున్నాడు. అతని సుతిమెత్తని సన్నని వేళ్లు గరుకెక్కాయి, అతని చేతులు కంపిస్తున్నాయి, అతని హృదయంలోని సంగీతం చాలకాలం క్రితమే యిగిరిపోయింది. అతను ప్రతి ఉదయం పనిలోకి హడావిడిగా వెళ్తున్నాడు, ప్రతి సాయంత్రం హడావిడిగా వెనక్కి తిరిగివస్తున్నాడు.

ఓ కారు అర్ధాంతరంగా అతని ప్రక్కన ఆగింది. అది లారీ కాదన్న సంగతిని సునిశిత శ్రవణశక్తి కలిగిన అతని చెవులు గ్రహించాయి, కాని అతను దానివైపు చూడలేదు. అలా చూడటం నిషిద్ధం, అలాగే వినడం కూడా నిషిద్ధమే, అందుకనే అతను, అరిగినలిగిపోయిన బూట్లతో బురదను కసపిస తొక్కుతూ ముందుకు నడిచి వెళ్లాడు.

''యూదూ!''

అతను వినయంగా అటు తిరిగాడు, తన టోపీని తీశాడు, తన పాదాలు రెండూ దగ్గరకు చేర్చాడు. తెరిచిన కారు తలుపులోంచి ఒక జర్మన్ మేజరు ముందుకి వంగివున్నాడు.

''నీకు రష్యన్ మాట్లాడటం వచ్చా?''

''వచ్చు, హెర్ మేజర్!''

''అయితే, యిందులో ఎక్కు.''

స్వేత్‌స్కీ వినయంగా వెనకసీటులో అంచుమీద బట్టమోపుగా కూర్చున్నాడు. అంతకు ముందే అక్కడెవరో కూర్చుని వున్నారు. స్వేత్‌స్కీ అటు చూసేందుకు సాహసించ లేకపోయాడు. కాని తన కొనకంటితో చూసి అదొక జనరల్ అని గ్రహించి, సాధ్యమైనంత తక్కువ జాగాను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తూ మరింత ముడుచుకుపోయాడు.

కారు జోరుగా పోతోంది. స్వేత్‌స్కీ తలెత్తలేదు, కాని, కారు చెస్ట్‌నట్ రోడ్డులోకి తిరిగిందనీ, తనను దుర్గంలోకి తీసుకెళ్తున్నారనీ అతను గ్రహించాడు.

ఏ కారణంగా అయితేనేం — అది అసాధ్యమనే అతను అనుకున్నా — అది అతన్ని మరింతగా భయకంపితుని చేసింది. అతను భయంతో కంపించిపోయాడు, కారు ఆగిన తర్వాత కూడా అతను కదల్లేదు.

''బయటికి రా!''

అతను వినయంగా ఆజ్ఞను పాలించాడు.

ఆ జనరల్‌యొక్క నల్లకారు శిథిలాలమధ్య నిలిచి ఉంది.

స్వేత్‌స్కీకి అక్కడ, క్రిందకెక్కడికో దారితీసే ఓ బిలం కనిపించింది, జర్మన్లు ఆ బిలాన్ని చుట్టుముట్టడం, అల్లంత దూరంలో ముసుగులు కప్పబడిన రెండు శవాలు, వాటి క్రిందినుండి పొడుచుకొచ్చిన మోటు జర్మన్ బూట్లు అతనికి కనిపించాయి. ఇంకా కొంచెం దూరంలో, ఈ శిథిలాలకి వెనుక, సైనిక శ్రేణికీ, శవాలకూ వెనుక, స్త్రీలు యిటుకలు ఏరుతున్నారు. గస్తీ సైనికులు వాళ్ల సంగతి మరచిపోయి, నల్లకారు వంక చూస్తున్నారు.

ఒక ఆజ్ఞ వినవచ్చింది, సైనికులు అటెన్షనులో నిలబడ్డారు. ఒక యువ లెఫ్టినెంటు ముందుకొచ్చి, జనరల్‌కి రిపోర్టుచేశాడు. అతను బిగ్గరగా మాట్లాడాడు, దాన్నిబట్టి క్రింద నేలమాళిగలో ఎవరో రష్యన్ సైనికుడున్నాడని స్విత్‌స్కీకి అర్థమైంది. ఆ ఉదయం గస్తీ సైనికులిద్దర్నీ చంపినది అతనే. బయటకు వెళ్లే మరో మార్గంలేని కేస్‌మేటు లోకి అతను తరుమబడ్డాడు.

ఆ జనరల్ రిపోర్టును విన్నాడు, నెమ్మదిగా మేజరుతో ఏదో అన్నాడు.

''యూదూ!''

స్విత్‌స్కీ తన టోపీ తీశాడు. తననుంచి వాళ్లేమి కోరుతున్నదీ అతను గ్రహించాడు.

''ఆ నేలమాళిగలో ఉన్మత్తావేశపరుడైన ఒక రష్యన్ ఉన్నాడు. నువ్వు క్రిందకెళ్లి, ఇచ్చికంగా తన ఆయుధాలు మాకు అప్పగించమని నచ్చచెప్పు. అతనితోబాటు నువ్వు కూడా అక్కడ వుండిపోతే అగ్గిబరాటాలతో మిమ్మల్నిద్దర్నీ సజీవంగా దహించేస్తాం. వాడిని తీసుకు రాకుండా నువ్వొక్కడివే వస్తే నిన్ను కాల్చేస్తాం. వీడికొక ఫ్లాష్ లైటివ్వండి.''

తూలుతూ, పడుతూ స్విత్‌స్కీ నెమ్మదిగా చీకట్లోకి, యిటుకలగుట్టల మీదుగా దిగాడు. క్రమంగా వెలుతురు మందగించింది, కాని వాలు ఆఖరైంది. ఇటుకలు చెల్లాచెదరుగా పడివున్న నడవగుండా అతను ముందుకెళ్లాడు. అతను తన టార్చి స్విచ్ వేశాడు. వెంటనే ఆ చీకట్లోంచి మందంగా వున్న స్వరమొకటి వినవచ్చింది.

''ఆగు! ముందుకొస్తే కాల్చేస్తాను!''

''కాల్చకండి!'' స్విత్‌స్కీ నిలబడిపోతూ కేకేశాడు. ''నేను జర్మన్‌ని కాను. దయచేసి కాల్చకండి. నన్ను వాళ్ళు పంపించారు!''

''నీ ముఖంపై లైటు వేసుకో.''

స్విత్‌స్కీ వినయంగా టార్చిని — మిరుమిట్లు గొలిపే ఆ కాంతికి కళ్ళు మిటకరిస్తూ — తన ముఖం మీదకు తిప్పుకున్నాడు.

''టార్చి లైటు కిందికి పాదాలవైపు తిప్పి తిన్నగా ముందుకి రా.''

''కాల్చకండి!'' నడవలో నెమ్మదిగా ముందుకెళ్తూ స్విత్‌స్కీ వేడుకున్నాడు. ''మిమ్మల్ని పైకి రావలసిందిగా చెప్పమని వాళ్ళు నన్ను పంపించారు. మీరు పైకి రాకపోతే అగ్గిబరాటా విసిరి మిమ్మల్ని సజీవంగా దహిస్తారు, వాళ్లు నన్ను తుపాకితో కాల్చేస్తారు.''

తనకు చాలా దగ్గర్లో ఎవరో భారంగా ఊపిరి విడుస్తున్నట్లు గ్రహించడంతో అతను ఆగాడు.

''లైటు ఆర్పెయ్యి.''

స్విత్‌స్కీ స్విచ్చి వెనక్కి లాగాడు, లైటు ఆరిపోయింది, దట్టమైన చీకటి నాలుగు మూలల్నుంచీ అతన్ని ఆవరించుకుంది.

''ఎవరు నువ్వు?''

''నేనొక యూదుని.''

''దుబాసీవా?''

''ఏమైతేనేం?'' స్విత్‌స్కీ భారంగా నిట్టూర్చాడు. ''నేనెవరినైతే మాత్రం ఏముంది అందులో? నేను యూదునన్న సంగతి నేను మరచిపోయాను, కాని వాళ్లు నాకు ఆ విషయం గుర్తుచేశారు. నేనో యూదుని, అంతే. వాళ్లు మిమ్మల్ని సజీవంగా దహిస్తారు, నన్ను కాలుస్తారు.''

''వాళ్లు నన్నీ బోనులోకి తరిమారు'' అతని స్వరంలో తీవ్రమైన ద్వేషం ధ్వనించింది. ''నాకు వెల్తురులో సరిగా కనిపించదు, వాళ్లు నన్నీ బోనులోకి తరిమారు.''

''వాళ్లక్కడ చాలామంది వున్నారు.''

''అయినా నాదగ్గర ఎలాగూ తూటాలు లేవులే. మన వాళ్లెక్కడున్నారు? మన సేనలెక్కడున్నాయో నీకేమన్నా తెలుసా?''

''ఇదుగో మీకు తెలుసా, పుకార్లున్నాయి —'' స్విత్‌స్కీ తన స్వరాన్ని గుసగుస స్థాయికి తగ్గించాడు. ''జర్మన్లు మాస్కో దగ్గర ఓడింపబడ్డారన్న అద్భుతమైన పుకార్లున్నాయి. మన వాళ్లు వీళ్లని చావచిదకకొట్టారట.''

''అయితే మాస్కో మన చేతుల్లోనే ఉందన్నమాట? వీళ్ల చేతికి చిక్క లేదన్నమాట?''

''లేదు, లేదు. అయినా మీరేమనుకుంటున్నారు? ఈ విషయం మటుకు నాకు ఖచ్చితంగా తెలుసు. మాస్కో దగ్గర — అర్థమైందా, మాస్కో దగ్గర — వీళ్లని మనవాళ్లు చితగ్గొట్టారు, చావ చితగ్గొట్టారు.''

అకస్మాత్తుగా ఆ చీకట్లోంచి ఒక నవ్వు వెలువడింది. బొంగురుగా, విజయసూచకంగా వున్న ఆ నవ్వు విని స్విత్‌స్కీ నిలువునా కంపించాడు.

''ఇప్పుడిక నేను బయటకెళ్లగలను. ఇప్పుడిక నేను బయటకెళ్లి, చివరిసారిగా వాళ్ల ముఖాల్లోకి చూసితీరాలి. నాకు సాయంచెయ్యి, కామ్రేడ్.''

''కామ్రేడ్!'' స్విత్‌స్కీ గొంతులో ఉక్కిరిబిక్కిరైన చిత్రమైన ధ్వని వినవచ్చింది. 'ఏమన్నారు: కామ్రేడా? ఓరి భగవంతుడా, ఆ మాట నేనిక యీ జన్మలో మళ్లీ వింటాననుకోలేదు!''

''నన్ను పట్టుకో, నా కాళ్లకి ఏదో అయింది. అవి సరిగా పనిచెయ్యడం లేదు. నేను నీ భుజంమీద ఆనుకుంటాను.''

ఎముక మాదిరిగా వున్న ఒక చెయ్యి ఆ ఫిడేలు వాద్యగాని భుజాన్ని దొరకపుచ్చుకుంది. స్విత్‌స్కీకి తన బుగ్గపై హడావిడిగా అస్తవ్యస్తంగా వస్తున్న ఊపిరి అనుభూతమైంది.

''పద పోదాం. లైటెయ్యకు, నాకు చీకట్లో కనిపిస్తుంది.''

వాళ్ళు నెమ్మదిగా నడవ వెంట వెళ్లారు. అతని రొప్పును బట్టి, యీ మనిషికి ఒక్కొక్క అడుగే ఎంతటి వేదన కలిగిస్తోందో, ఎంత కష్టసాధ్యంగా వుందో స్వీత్‌స్కీకి బోధపడింది.

"నువ్వు మనవాళ్లతో చెప్పు" ఆ అజ్ఞాత వ్యక్తి మెల్లగా అన్నాడు, "వాళ్ళు తిరిగి వచ్చినప్పుడు చెప్పు, నేను దాచేశానని – " అతను అకస్మాత్తుగా మాటలు నిలిపేశాడు. "అబ్బే, అది కాదు. నేను దుర్గాన్ని జర్మన్లకు లోబరచలేదని చెప్పు. వాళ్లని వెతుక్కోనియ్యి. వాళ్లని అన్ని నేలమాళిగలూ బాగా వెతుక్కోమను. దుర్గం లొంగిపోలేదు. దుర్గం రక్తం వారబోసిందే గాని దుర్గం లొంగిపోలేదు. నేనే దాని చిట్టచివరి రక్తబిందువుని. అన్నట్టు, యీ రోజు ఏం తేదీ?"

"ఏప్రిల్ పన్నెండు."

"అంటే, యిరవై ఏళ్లు నిండాయన్నమాట." అజ్ఞాత సైనికుడు గంభీరంగా నవ్వాడు. "నేను లెక్కపెట్టాను. ఏడు రోజులు. తప్పు లెక్కపెట్టాను.... ఏప్రిల్ పన్నెండు."

"మరి ఇరవై ఏళ్లు ఏమిటి?"

అజ్ఞాత సైనికుడు జవాబివ్వలేదు, వాళ్లిద్దరూ మౌనంగా భూమ్యుపరితలానికి వెళ్లారు.

చెల్లాచెదరుగా కూలిపడివున్న యిటుకల మీదుగా వాళ్లు కష్టంపైన దాటి, సొరంగం గుండా పైకి పాకారు. తర్వాత ఆ అజ్ఞాత సైనికుడు స్వీత్‌స్కీ భుజాన్ని విడిచిపెట్టాడు, నిటారుగా నిలబడ్డాడు. తన చేతులను రొమ్ముమీద ఒకదానిపై ఒకటి అడ్డంగా వేసుకున్నాడు. ఫిడేలు వాద్యగాడు చటుక్కున పక్కకి అడుగేశాడు, చుట్టూ చూశాడు, తను పైకి తీసుకొచ్చిన వ్యక్తిని మొట్టమొదటిసారి చూశాడు.

నేలమాళిగ ప్రవేశద్వారం దగ్గర ఊహకి అందనంత సన్నంగా వున్న కాలాతీత వ్యక్తి నిలబడివున్నాడు. అతని తలపైన టోపీ లేదు. పొడుగాటి నెరిసిన జుట్టు అతని భుజాలపై పడుతోంది. బెల్టుతో గట్టిగా బిగింపబడిన అతని జాకెట్టు ఇటుకపొడి మూలంగా తినేసినట్లుంది. అతని పాంటుకి మోకాళ్ల దగ్గర పడిన కంతలగుండా ఎన్నడో గడ్డకట్టిన రక్తంతో నిండిన అతని మోకాటి చిప్పలు కనిపిస్తున్నాయి. నల్లగా కమిలిపోయి, చలికి పుళ్లుపడి, వికృతంగా వాచిన అతని కాలిబొటనవేళ్లు పికిలిన బూట్లగుండా ముందుకు పొడుచుకొచ్చాయి. అతను గంభీరంగా నిటారుగా నిలబడ్డాడు. తల పైకెత్తి, తన గుడ్డికళ్లతో రెప్పార్పకుండా, సూర్యుని వంక చూస్తూ నిలబడ్డాడు. స్థిరంగా రెప్ప ఆర్పకుండా వున్న ఆ కళ్లనుండి కన్నీళ్లు నిర్నిరోధంగా జాలువారుతున్నాయి.

అందరూ నిస్తబ్ధులయ్యారు.

సైనికులూ, ఆఫీసర్లూ మౌనం దాల్చారు, జనరల్ మౌనంగా వున్నాడు. దూరాన పని నిలివేసి నిలబడ్డ స్త్రీలు మౌనంగా నిలబడ్డారు, వాళ్ల కాపలా సైనికులు కూడా స్థాణు

పుల్లా నిలబడ్డారు. నిబ్బరంగా, శిలావిగ్రహం మాదిరి నిశ్చలంగా నిలబడ్డ ఆ మూర్తి వంకనే అందరూ కన్నార్పకుండా చూస్తున్నారు. అప్పుడు ఆ జనరల్ మెల్లగా అస్పష్టంగా ఏదో అన్నాడు.

''మీ పేరూ, హోదా చెప్పండి'' స్వీత్‌స్కీ అనువదించాడు.

''నేనొక రష్యన్ సైనికుణ్ణి.''

అతని స్వరం బొంగురుగా, బిగ్గరగా — అవసరమైనదానికన్న బిగ్గరగా — వినవచ్చింది. ఈ మనిషి దీర్ఘకాలం మౌనంగా గడిపాడు, యిప్పుడిక తన స్వరాన్ని అదుపులో పెట్టుకోలేకపోతున్నాడు.

''హెర్ జనరల్ మీ పేరూ, హోదా చెప్పమని అడుగుతున్నారు.''

స్వీత్‌స్కీ స్వరం ఎక్కిళ్లలో మునిగిపోయింది, గుంటలు పట్టిన తన బుగ్గలపై కారుతున్న కన్నీళ్లను కంపిస్తున్న చేతులతో తుడుచుకొంటూ, అతను అణచుకోలేనంతగా ఏడుస్తున్నాడు.

ఆ అజ్ఞాత సైనికుడు తన తలను నెమ్మదిగా తిప్పాడు, అతని అనిమిష నయనాలు ఆ జనరల్‌పైన నిలిచాయి. అతని గడ్డం విచిత్రమైన, విజయ సూచకమైన, వెక్కిరింపు నవ్వులో కంపించింది.

''ఏం, జనరల్, ఒక రష్యన్ వెర్‌స్తా*లో ఎన్ని అడుగులున్నాయో మీకు తెలుసా?''

అవే అతని చివరి మాటలు. జనరల్ అడిగిన మరి కొన్ని ప్రశ్నలను స్వీత్‌స్కీ అనువదించి చెప్పాడు. కాని అజ్ఞాత సైనికుడు, తను చూడజాలని సూర్యుని వంకకే యింకా చూస్తూ, మౌనంగా ఉండిపోయాడు.

ఒక ఆంబ్యులెన్సుకారు వచ్చింది, ఒక డాక్టరూ, యిద్దరు స్ట్రెచ్చర్ వాహకులూ అందులోంచి త్వరత్వరగా క్రిందకి ఉరికారు. జనరల్ తలూపాడు, డాక్టరూ, వాహకులూ ఆ అజ్ఞాత సైనికుని దగ్గరకు పరుగున వెళ్లారు. వాహకులు ఒక స్ట్రెచ్చర్ని విడదీశారు, డాక్టరు ఏదో అన్నాడు, కాని అజ్ఞాత సైనికుడు మౌనంగా వాళ్లని పక్కకు నెట్టి ఆంబ్యులెన్సు వైపు వెళ్లాడు.

అతను నిటారుగా, నిబ్బరంగా, తనకేమీ కనిపించకపోయినా, కారు యింజను శబ్దాన్ని బట్టి ముందుకెళ్లాడు. అందరూ ఎవళ్లు నిలబడిన చోట వాళ్లు స్థాణువుల్లా నిలబడిపోయారు, అతను ఒంటరిగా — వాచి, మంచుదెబ్బకు పుళ్లుపడిన తన పాదాలను కష్టంమీద యీడ్చుకుంటూ — నడిచివెళ్లాడు.

---

* వెర్‌స్తా — సుమారు 1 కిలోమీటరు, 2/3 వంతు మైలు. — సం.

అకస్మాత్తుగా ఒక జర్మన్ లెఫ్టినెంటు తన పాదాలు తక్కున ఒకచోట జేర్చి, చేతినెత్తి శాల్యూట్ చేశాడు. జర్మన్ సైనికులు అటెన్షనులో నిలబడ్డారు.

కాని ఆ రష్యన్ సైనికుడు తూలుతూ, నిశ్చలంగా వున్న శత్రు సైనికుల బారుల మధ్య నెమ్మదిగా నడచి వెళ్లాడు, అయితే అతను తనచుట్టూ జరుగుతున్నదేమిటో చూడ నేలేదు, ఒక వేళ అతను చూసినా కూడా, అతనికిదంతా ఏమీ పట్టి వుండేదే కాదు. ఆ అజ్ఞాత సైనికుడు కీర్తిప్రతిష్ఠలకు, జీవితానికి, చివరకు మరణానికి సైతం అతీతుడు.

ఆ స్త్రీలు **శో**కన్నాలు పెట్టసాగారు, చనిపోయినవానిపైన పడి ఏడ్చినట్టుగా హృదయ విదారకంగా **శో**కన్నాలు పెట్టారు. వాళ్లందరూ, ఒకరి తర్వాత ఒకరుగా, శీతల ఏప్రిల్ మాసపు బురదలో మోకరిల్లారు. రోదిస్తూ, అతని ముందు — ఎన్నడూ పరాజితం కాని దుర్గపు తుది పరిరక్షకుని ముందు — వాళ్లు తమ చేతులుచాచి, నేలకు మొక్కారు.

తూలిపోతూ, ఒక్కొక్క అడుగు తడబడుతూ, తన పాదాలు నెమ్మదిగా కదుపుతూ, అతను పనిచేస్తున్న కారు యింజను దిశగా నడిచాడు. అతని బూట్లలో ఒకదాని అడుగుతోలు ఊడి వచ్చింది, దానితో అతని దిసపాదం వెంట సన్నని రక్తపు చారిక పడసాగింది. అయినా అతను నిటారుగా, సగర్వంగా — తను జీవించిన విధంగానే సగర్వంగా — నడిచాడు, తన లక్ష్యాన్ని చేరుకున్న తర్వాతనే — అంబ్యులెన్సు పక్కన — అతను పడిపోయాడు.

వెల్లకితలా, నిటారుగా, చేతులు బారజాపి, తన అంధనయనాలతో సూర్యుని వంక నిర్నిమేషంగా చూస్తూ అతను పడిపోయాడు.

ప్రాణం పోయేసరికి యింకా స్వేచ్ఛా జీవిగా, మృతితో మృత్యువునే జయిస్తూ, అతను పడిపోయాడు.

ముగింపు మాటలు

మన దేశపు పశ్చిమ సరిహద్దులో వుంది బ్రెస్ట్ దుర్గం. అది మాస్కోకి ఏమంత ఎక్కువ దూరంలో లేదు, రైలుమీద వెళ్తే యిరవై నాలుగు గంటలకు లోపే పడుతుంది. ఒక్క పర్యాటకులే కాకుండా, విదేశాలకు వెళ్లేవాళ్లూ, దేశానికి తిరిగివచ్చేవాళ్లూ — అందరూ ఆ దుర్గాన్ని సందర్శిస్తూ వుంటారు.

అక్కడ జనం లోగొంతులో మాట్లాడుతారు. పంథొమ్మిది వందల నలభై ఒకటవ సంవత్సరపు రోజులు చెవులు గళ్లుపడవేసిన రోజులు. మరి ఆ రాళ్లకు ఎన్నెన్ని స్మృతులో! నిరాడంబరులైన గైడ్లు పర్యాటక బృందాలను యుద్ధ భూముల్లో తిప్పి విశేషాలూ, వివరాలూ చూపుతారు. 333వ రెజిమెంటుకి చెందిన నేలమాళిగలను ఎవరైనా చూడవచ్చు, అగ్గి

బరాటాల మంటలకు కాలి చిట్లంకట్టిన యిటుకలను దర్శించవచ్చు, తెరెస్పోల్, ఖోమ్‌స్కీ గేట్ల గుండా వెళ్లవచ్చు, లేక ఒకనాటి చర్చిలో మౌనంగా నిలబడవచ్చు.

హడావిడిగా వెళ్లిపోకండి, సంస్మరించుకోండి. నతశిరస్కులుకండి.

మ్యూజియంలో ఒకప్పుడు జర్మన్లపై గర్జించిన ఆయుధాలనూ, ఆ జూన్ 22 ప్రత్యూషవేళ ఆదరాబాదరా అల్లబడిన సైనిక బూట్లనూ మీరు చూస్తారు. దుర్గరక్షకుల వ్యక్తిగత వస్తువులను గైడ్లు మీకు చూపుతారు. సైనికులు ఉన్న మంచినీటి నంతనీ చిన్న పిల్లలకూ, మెషీన్ గన్నులకూ కేటాయించి విదాహంతో ఎలా ఉన్మత్తులయారో గైడ్లు మీకు చెప్తారు. ఇంతవరకు దుర్గంలో దొరికిన ఒకేఒక్క పతాకం దగ్గర మీరు నిలుస్తారు. కానైతే, దుర్గంలో పతాకాలకోసం గాలింపు యింకా సాగుతూనే వుంది — దుర్గం ఎన్నడూ పరాజితం కాకపోవడం, జర్మన్లు ఒక్క రెజిమెంటల్ పతాకాన్ని సైతం వశం చేసుకోలేకపోవడమే యిందుకు కారణం.

దుర్గం లొంగిపోలేదు. దుర్గం రక్తం వారబోసింది.

చరిత్రకారులకు జనశ్రుతిలో వున్న కథలపట్ల మక్కువ లేదు, కాని మీరు అజ్ఞాత దుర్గపరిరక్షకుని గురించి — జర్మన్లు యితన్ని 1942 ఏప్రిల్లో, యుద్ధపు పదవ నెలలో మాత్రమే పట్టుకోగలిగారు — విధిగా వినితీరుతారు. అతను సుమారు ఒక సంవత్సరం పోరాడాడు. ఎవరికీ తెలియకుండా, తనకు యిరువంకలా కామ్రేడ్లెవరూ లేకుండా, ఆజ్ఞలు లేకుండా, సప్లయ్‌స్థావరం లేకుండా, విశ్రాంతి విరామాల్లేకుండా, యింటిదగ్గరనుండి మనస్సుకు ఊరట కలిగించే వార్తల్లేకుండా — ఒక ఏడాది పాటు జరపబడిన అవిరామ పోరాటం అది. అతని పేరునుగాని, హోదానుగాని కాలం మనకు మిగల్చలేదు. కాని మనకు తెలుసు అతను రష్యన్ సైనికుడని.

బ్రెస్ట్ దుర్గపు మ్యూజియంలో ప్రదర్శిత వస్తువులు చాలా వున్నాయి, స్టాండులపై ఉంచేందుకు సరిపడే వాటికన్న ఎన్నో రెట్లు ఎక్కువ వున్నాయి. అందుకనే ప్రదర్శనయోగ్యమైన వస్తువుల్లో అధిక భాగం వేరే పదిలపరచబడ్డాయి. కానైతే, వాటిని సందర్శించేందుకు మీకు అనుమతి లభించినట్లయితే, వాటిలో ఒక కొయ్య బ్రేసు, దానితోబాటు స్త్రీలు ధరించే బూటు అవశేషం మీకు కనిపిస్తాయి. అది తెల్ల భవనపు — ఇంజనీర్ల కమాండుకి చెందిన భవనానికి దుర్గరక్షకులు పెట్టిన పేరిది — కుడ్యానికి అనతిదూరంలోని ఫిరంగిగుండు గోతిలో దొరికింది.

ఏటా, జూన్ 22న, బ్రెస్ట్ దుర్గం యుద్ధారంభాన్ని గంభీరంగా సంస్మరించుకొంటుంది. దుర్గ రక్షకుల్లో యింకా సజీవులై వున్నవారు ఆ రోజున అక్కడికి వస్తారు. అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పిస్తారు. నిశ్చలంగా గౌరవాభివందనం చేస్తారు.

ప్రతి ఏడూ, జూన్ 22న, తెల్లవారు ఝామున బ్రెస్ట్ చేరుకొనే రైలుపై ఒక వృద్ధ స్త్రీ వస్తూ వుంటుంది. కోలాహలంగా వుండే రైలు స్టేషన్‌నుంచి ఆమె హడావిడిగా

వెళ్లిపోదు. ఆమె దుర్గం లోపలకి ఒక్క సారీ వెళ్లలేదు. ఆమె చౌకులోకి వెళ్తుంది, అక్కడ ప్రవేశద్వారం దగ్గర గోడకి అతికించబడిన పాలరాతి ఫలకం వుంది.

1941 జూన్ 22 నుండి
జూలై 2 వరకు
లెఫ్టినెంట్ నికొలాయ్
(యింటిపేరు తెలియదు)
సార్జెంట్ మేజర్ పావెల్ బాస్నెవ్‌ల నాయకత్వాన
సైనికులూ, రైల్వే కార్మికులూ
రైల్వే స్టేషన్ని
వీరోచితంగా పరిరక్షించారు.

రోజంతా ఆ వృద్ధ స్త్రీ యీ శిలాఫలకంపైనగల అక్షరాలను చదువుతుంది. దాని ప్రక్కనే ఆమె సైనిక గౌరవాభివందనం చేస్తున్నట్టు నిలబడుతుంది. ఆమె వెళ్లిపోతుంది, పుష్పగుచ్ఛంతో మళ్లీ తిరిగివస్తుంది. మళ్లీ ఆమె అక్కడ నిలబడుతుంది. మళ్లీ చదువుతుంది. నాలుగే నాలుగు అక్షరాలు: ''నికొలాయ్.''

స్టేషన్ యథాప్రకారంగానే ఎప్పుడూ కోలాహలంగా ఉంటుంది. రైళ్లు వస్తూపోతూ వుంటాయి. లౌడ్‌స్పీకర్లద్వారా తమ టిక్కెట్లను మరచిపోవద్దంటూ ప్రయాణికులకు హెచ్చరికలు చేయబడుతూవుంటాయి. సంగీతం మోగుతూ వుంటుంది. జనం నవ్వుతూ వుంటారు. కాని ఆ పాలరాతి ఫలకం పక్కన ఒక వృద్ధ స్త్రీ మౌనంగా నిలబడివుంటుంది.

ఆమెకు ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు. నిజంగా ముఖ్యమైనది మన పుత్రులు ఎక్కడ సమాధి చేయబడ్డారన్నది కాదు. వాళ్లు దేనికోసం మరణించారన్నదే ముఖ్యమైనది.

రచయిత

1924లో జన్మించిన బొరిస్ వసీల్యెవ్ ఇంజనీరుగా పనిచేసి 1969లో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. తొలి నవల "ప్రశాంత ప్రత్యూషాలు" వెలువడేవడటంతోనే పాఠకుల అభిమానాన్ని విశేషంగా చూరగొంది. వసీల్యెవ్ దరిమిలా "ఇవాన్ యొక్క పడవ" (Ivan's Launch), "ఆఖరి రోజు" (*The Very Last Day*) (1970), "తెల్ల హంసలను కాల్చకండి" (*Don't Shoot White Swans*) (1973) నవలలు రచించాడు. ఆయన చిట్టచివరి నవల "అజేయ సైనికుడు" (1974). ఆయన రచనలు పలు భాషల్లోకి అనువదించబడ్డాయి. "ప్రశాంత ప్రత్యూషాలు" సినిమాగా తియ్యబడి, బహుళజనాదరణను చూరగొంది.